కీర్తనలు

# భావయామి వేంకటేశం: 1-6



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## గీతా దీక్ష వారి వెబ్ సైట్:

## http://www.geetadeeksha.com



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

శుభమస్తు          అవిఘ్నమస్తు



# భావయామి వేంకటేశమ్

## సంపుటం - 1,2,3,4,5,6

## ఎన్నుకోబడిన
## అన్నమాచార్యుల సంకీర్తనలకు
## మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.



## సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు


Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/



















శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-1

## ఎన్నుకోబడిన
## అన్నమాచార్యుల సంకీర్తనలకు
## మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-I**

మొదటి ప్రచురణ
**జులై 2010**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09





**అన్నమాచార్యులవారి**
**602వ జయంతి సందర్భంగా భక్తితో**

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

- రచయిత



**అంకితము**

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి I

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అంగనలీరే ఆరతులు | 03 |
| 2. | అంతయు నీవే హరి | 167 |
| 3. | అదె చూడరేమోహన | 147 |
| 4. | అదెలంక సాధించె | 67 |
| 5. | అనియానతిచ్చెను కృష్ణుడు | 51 |
| 6. | అమ్మమ్మ ఏమమ్మా | 191 |
| 7. | అలరులు కురియగఆడె | 149 |
| 8. | అలర చంచలమైన | 41 |
| 9. | అతిముతి హనుమంతుడు | 169 |
| 10. | అయమేవ అయమేవ | 45 |
| 11. | ఆదిమూలమేమాకు | 157 |
| 12. | ఆరగించికూచున్నాడల్ల | 127 |
| 13. | ఇంకనైనారోయరాదా | 137 |
| 14. | ఇందుకు విరహితములిన్ని | 117 |
| 15. | ఇదివో శ్రుతిమూల | 89 |
| 16. | ఇదివో సంసారమెంత | 161 |
| 17. | ఇన్నిరాశుల యునికి | 31 |
| 18. | ఇప్పడిటు కలగంటి | 85 |
| 19. | ఈతడు తారకబ్రహ్మము | 91 |
| 20. | ఉగ్గువెట్టరే ఓయమ్మా! | 59 |




భావయామి వేంకటేశం


| | | |
|---|---|---|
| 21. | ఎండగానీ నీడగానీ | 193 |
| 22. | ఎక్కడిమానుషజన్మ | 121 |
| 23. | ఎక్కువ కులజుడైన హీన | 165 |
| 24. | ఎవ్వరెవ్వరి వాడు | 81 |
| 25. | ఏడవలపేడ మచ్చిక | 97 |
| 26. | ఏమని పొగడ వచ్చు | 151 |
| 27. | ఏమని పొగడుదునే | 133 |
| 28. | ఏమొకో చిగురుటధర | 119 |
| 29. | ఏవంశ్రుతిమతమిద | 69 |
| 30. | కడలుడిపి నీరాడగా | 63 |
| 31. | కడుపెంత తాకుడుచు | 151 |
| 32. | కలియుగమెటులైనకలదు | 111 |
| 33. | కదిరినృసింహుడు | 93 |
| 34. | కానరటే పెంచరటే | 29 |
| 35. | కులుకక నడవరో | 145 |
| 36. | కొండలలో నెలకొన్న | 207 |
| 37. | కొలనిదోపరికి గొబ్బిళ్ళో | 9 |
| 38. | కొలువైవున్నాడు వీడె | 143 |
| 39. | క్షీరాబ్ధికన్యకకు | 209 |
| 40. | చందమామ రావో జాబిల్లి | 175 |
| 41. | చక్రమాహరి చక్రమా | 181 |
| 42. | చాలాదా బ్రహ్మమిది | 129 |
| 43. | చిన్నిశిశువు చిన్నిశిశువు | 115 |
| 44. | ఛీఛీనరులుదేటి | 77 |

| | | |
|---|---|---|
| 45. | చూడరమ్మసతులాల | 155 |
| 46. | చూడవయ్యనీసుదతి | 179 |
| 47. | జగడపుచనవుల | 95 |
| 48. | జయలక్ష్మీ వరలక్ష్మీ | 75 |
| 49. | జ్ఞానయజ్ఞమీగతి | 171 |
| 50. | జోవచ్చుతానంద | 37 |
| 51. | తందనానఅహి | 105 |
| 52. | తత్తాతిగుడి ధిం ధిం | 141 |
| 53. | తరుణినీయులుకకు | 55 |
| 54. | తలమేల కులమేల | 53 |
| 55. | తానెంతబ్రతుకెంత | 131 |
| 56. | త్రికరణ శుద్ధిగా | 61 |
| 57. | తొల్లింటి వలెగావు తుమ్మెదా | 187 |
| 58. | దేవదుందుభులతోడ | 201 |
| 59. | దేహినిత్యుడు | 11 |
| 60. | నమోనారాయణాయ | 139 |
| 61. | నమోనమోలక్ష్మీ నరసింహ | 159 |
| 62. | నమో నమో జగదేకనాథ | 163 |
| 63. | నానాటిబ్రతుకు నాటకము | 43 |
| 64. | నిగమ నిగమాంతవర్ణిత | 185 |
| 65. | నేనెందువోయీ తానెందు | 47 |
| 66. | నేనేపోఘనుడు | 195 |
| 67. | డోలాయాంచల | 125 |
| 68. | పదియారువన్నెల | 183 |







| | | |
|---|---|---|
| 69. | పలుకుతేనెల తల్లి | 99 |
| 70. | పిడికిట తలంబ్రాలు | 205 |
| 71. | పెరిగినాడుచూడరో | 113 |
| 72. | పుడమి నిందరిబట్టె | 5 |
| 73. | ఫాలనేత్రానల ప్రళయ | 73 |
| 74. | బండివిరిచి చిన్నపాప | 173 |
| 75. | బ్రహ్మకడిగినపాదము | 177 |
| 76. | భావయామిగోపాలబాలం | 3 |
| 77. | మంగాంబుధి హనుమంత | 71 |
| 78. | మర్ద మర్ద మమ బంధాని | 87 |
| 79. | ముద్దుగారే యశోద ముంగిట | 89 |
| 80. | రంగ రంగ రంగ పతి | 57 |
| 81. | రాజీవనేత్రాయ | 189 |
| 82. | రామునికి శరణంటె | 203 |
| 83. | రాముడురాఘవుడు | 123 |
| 84. | రావేకోడల రట్టడికోడల | 33 |
| 85. | రూకలైరువ్వలైమాడలై | 49 |
| 86. | లాలనుచు నూచరే | 197 |
| 87. | వలపులు వలపులు | 35 |
| 88. | వాడల వాడల వెంట | 07 |
| 89. | విన్నపాలు వినవలె | 23 |
| 90. | వీడుగదేశేషుడు | 79 |
| 91. | వెనకేదో ముందేదో | 15 |
| 92. | వెఱ్రులారా మీకు వేడుక | 25 |

93. వేదంబెవ్వని వెదకెడినీ 109

94. శరణు శరణు సురేంద్ర 13

95. శరణు శరణు నీకు 135

96. శిరుత నవ్వులవాడు 19

97. శ్రీ పతియీతడు 1

98. శ్రీ మన్నారాయణా 107

99. షోడశ కళానిధికి 17

100. సువ్వి సువ్వి సువ్వాలమ్మ 101

101. హరినామమే కడు 65


# ప్రార్థన

కం॥ శ్రీహరి శరణము గోరిన
శ్రీహరణము మొట్టమొదట చేయును ఆపై
శ్రీహరి 'లేదేమో' నని
'శ్రీహరి విముఖులను' జేయు చిత్తము గాల్చున్

మ॥ తరమే!! నేర్వగ వానిలీల అవనిన్ దారిద్ర్య భీభత్సముల్
కురియన్ జేయును కంటినీరమిడుచున్ కూల్చున్ గదా ఆశలన్
నరులే నాటికి నేర్వలేరు భ్రమలో నాబోంట్లు దూషింతురున్
శరణంబీవని కాళ్ళుపట్టి విలపించంగా తనే దిక్కగున్.

కం॥ శ్రీ వేంకటేశ! ఈశా!
రావే రక్షింప నన్ను లక్ష్మీరమణా!
నీవే దిక్కని నమ్మితి
లావొక్కింతయును లేదు రారా తండ్రీ!



భావయామి వేంకటేశం

సీ॥ మలమూత్ర గ్రస్తమౌ "మాయ దారి తనువు"
నిచ్చావు కంపాయె నెందుకయ్య!
ఏ రోజు కారోజు దరిజేరె 'యములాడు'
తెల్లారునో లేదో తెలియదాయె!
'ఆర్గురు శత్రువుల్' అదిరించి బెదిరించి
నన్నోడ గొట్టుచు నలిపిరయ్య!
ఆశలు దీరక పాశమై బంధించె
తెగవాయె! నేనైన తెంపనాయె!

ఆ.వె॥ ధ్యాసనిలువదాయె, ధ్యానంబు రాదాయె!
భక్తికుదరదాయె, బాధలాయె!
జాలి సుంత నీకు కలుగదాయెను ప్రభూ!
వెట్టి వాడనయ్య వేంకటేశ!

శా॥ ఏముందిందని ఎందరెందరని నన్ హేయంబుగా బల్కియున్
ఏమైనన్ వ్రతమట్లు వేంకటపతిన్ ఈరీతి కీర్తించెదన్
శ్రీ మంతుండగు శేషశైల విభునిన్ సేవించెనా యన్నమ
య్యేమాత్రంబు కుశంక లేక నిదిగో ఏ నెంతు నీదారినే.

చం॥ అనవరతంబు పాడుటకు నందిరికిచ్చెను అన్నమయ్యతా
ననుపమమైన కీర్తనలు ఆ హరినెంచుచు వేంకటాద్రి వా
సునివలె శ్రీనివాసునిగ చూడమరెవ్వడు సాటి?మ్రొక్కెదన్,
వినుడు మురారి సత్కృపను వీటికి 'మున్నుడి'నెంచి చెప్పదన్

తే॥ వేంకటాద్రికి సమమైన 'పెద్ద' నెలవు
విశ్వమందున లేదురా వెదకి చూడ
వేంకటేశ్వరు బోలిన వేల్పెవండు?
మునుపులేదురా, రాబోదు ముందుముందు.

ఉ॥ సంకట హరియే పనిచి 'చావు' నొసంగుట కుద్యమించినన్
అంకిలి సెప్పనెవ్వరికి ఔను మహీతలినా విరించియున్
శంకరుడాది దేవతలు సాయము జేతురె? కల్ల,యందుకే
వేంకటనాథునే శరణు వేడెద తప్పుల నెంచుకుండుకై.

# ముందు మాట (సంపుటి-I)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









**1-1**

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుడు సర్వాంతర్యామియైన ఆ పరమాత్ముడు. భగవంతుడైన ఆయన కరుణ అనంతమైనది. మనభక్తిలో లోటు ఉండవచ్చును గాని ఆయనకు తన భక్తులపైచూపించే వాత్సల్యానికి మాత్రం ఏనాడు కొఅత ఉండదు ఈ మాట సోదాహరణంగా వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు.

**కం॥ ఎనలేని ప్రీతి యితనికి**
**వెనుకాడదు 'చక్ర' మెత్తు విష్ణుడు తానై**
**మన భక్తి కొరత గానీ**
**అని చెప్పెను అన్నమయ్య ఆదిమ కృతిలో.**

**రాగం : లలిత**

శ్రీపతి యీతడుండగా, జిక్కిన వారి నమ్ముట
తీపని మీసాల మీది, తేనె నాకుట సుండి ॥శ్రీపతి॥

తలచినంతటిలోనె-దైవమెదుట గలదు
కొలువనేరని యట్టి-కొరతే కాని
యిల నరులగొలుచు- టెందో కోకలువేసి
బలుకొక్కెరల వెంట- బారాడుట సుండి ॥శ్రీపతి॥

శరణన్న మాత్రమున-సకల వరములిచ్చు
నిరతి మరచినట్టి- నేరమే కాని
పొరి నితరోపాయాన- బొరలుట గాజు బూస
గరిమ మాణికమంటా-గట్టు కొంట సుండీ ॥శ్రీపతి॥





చేతమొక్కితే జాలు- శ్రీవేంకటేశుడు గాచు
కాతరాన సేవించని -కడమే కాని
యీతల నిదిమానిమ- రెన్ని పుణ్యాలు సేసినా
రీతి నడవి గాసిన -రిత్త వెన్నెల సుండి. ॥శ్రీపతి॥

**భావామృతం :**

శ్రీ వల్లభుడైన ఇతడుండగా తక్కిన వారిని నమ్మటం మధురమైన తేనె కావలసినంత వుంటే మీసాలకి అంటుకొన్న తేనెని నాకి సంతోషించటం లాంటిదే సుమా!

తలచు కొన్నంత మాత్రాన ఎదుటనిలిచే దైవం ఆస్వామి. భక్తితో కొలువలేని మనదే లోపం. ఈయనకు మ్రొక్కక నరులను కీర్తించుట తెల్లని వస్త్రములను ఒక చోట ఆరబెట్టి కొంగల గుంపువెంట భ్రమతో తిరుగుటయే సుమా!

శరణుకోరినంతమాత్రాన స్వామి సకల వరములను ప్రసాదిస్తాడు. ఆశక్తి లేక ఆయనను మరచిన మనదే నేరం. ఏవేవో ఇతర సాధనలతో కోరికలు పొందాలను కోవటం మాణిక్యం అని భ్రమించి గాజుపూసను దాచుకోవటమే సుమా!

చేతులారా మ్రొక్కితే చాలు శ్రీ వేంకటేశ్వరుడు రక్షించగలడు. చాంచల్యంతో భ్రమించి ఆయనను పూజించని మనలోనే లోపం కానీ ఇంకేముంది? అది మానివేసి మరేవేవో పుణ్యకార్యాలను చేసినా అడవిగాచిన వెన్నెల వలె నిరుపయోగమై పోతుంది సుమా!

1-2

## మున్నుడి

ఏ విధంగా భావించిన ఆవిధంగా కనిపించే వాడే భగవంతుడు. రామదాసు గారికి శ్రీరామచంద్రమూర్తిగా, తుకారాంకి విఠలునిగా, రామకృష్ణ పరమహంసకి కాళీ మాతగా గోచరించినది చరిత్ర చెప్పే సత్యమే. "యద్భావం తద్భవతి" అన్నారు పెద్దలు. అన్నమాచార్యులు వేంకటేశ్వరుని గోపాలబాలునిగా భావించి అతిమధురమైన కీర్తన చెప్పారు. అమృతంజాలు వారే ఆకీర్తన నభూతో నభవిష్యతి.

**ఆ.వె॥ భావయామి వేంకటవిభో! సదా నీవు**
**శరణమీయ వయ్య కరుణ బూని**
**అన్నమయ్య వినిచె నమరమౌ కీర్తన**
**బాలకృష్ణ లీల ప్రస్తుతించి.**

**రాగం : యమన్ కళ్యాణి**

భావయామి గోపాల బాలం మమ
స్సేవితం తత్పదం చింతయేయం సదా ॥భావయమి॥

కటిఘటిత మేఖలా ఖచిత మణిఘంటికా
పటల నినదేన విభ్రాజమానం
కుటిల పదఘటిత సంకుల శింజితే నతం
చటుల నటనా సముజ్జ్వల విలాసం ॥భావయామి॥

నిరతకరకలిత నవనీతం బ్రహ్మాది
సురనికర భావనా శోభితపదం
తిరువేంకటాచల స్థితమనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలం ॥భావయామి॥





**భావామృతం :**

నా మనస్సులో గోపాల బాలుడైన చిన్ని కృష్ణునిగా (వేంకటేశుని)నేను అభిప్రాయపడుచున్నాను. అందుచేత ఆ పదములను ఎల్లవేళలా ధ్యానించుటకు కోరుచున్నాను. ఆరాధించుటకు పూనుకొనుచున్నాను.

నడుమునకు బిగించిన మొలత్రాటిలో మణులు, ఘంటలు గుచ్చబడినవి. అవి మనోహరమైన ధ్వనిని చేయు చున్నవి. ఒక పాదం నిలువుగా మరియొక పాదము వంకరగా నిలబడుట చేత కదలి పాదములకు బంధించిన గజ్జెలు ఘల్లు ఘల్లున శబ్దం చేస్తున్నవి. అందుచేత ఆ నటనా విలాసము సముజ్జ్వలమై సమ్మోహనమై విలసిల్లినది.

ఎల్లప్పుడూ చేతిలో వెన్నముద్దతో శోభిల్లే ఆ మనోజ్ఞమూర్తి, బ్రహ్మాది దేవతలు భావనాప్రపంచమున ఆరాధించు పదద్వయం కలిగియున్నాడు. సాటిలేని తిరువేంకటా- చలాధీశుడైన ఆ శ్రీహరియే పరమపురుషుడైన శ్రీకృష్ణ భగవానుడు. ఆయనే ముద్దులొలికే గోపాలబాలుడు.

**1-3**

## మున్నుడి

అచ్చతెలుగు పదాలతో అత్యద్భుతంగా భగవంతుని పది అవతారముల వాడని అన్నమయ్య వర్ణిస్తున్నారు. దైవము ప్రకృతి అయితే దయ్యము వికృతి అని తెలుగు భాష పద విన్యాసం. ఆ కోవలోనే దైవమైన మన వేంకటేశ్వరుని పెద్ద భూతమని వర్ణిస్తున్నారు తాళ్ళపాక 'స్వామి' ఆ భూతం అన్ని భూతాల వంటిది కాదు. పట్టుకొంటే (మనపై దయ కలిగి) ఇక వదలదు. అది పదిరకములైన భూతం అని చలోక్తిగా ఆ'గరుడ వాహనుని వర్ణిస్తున్నారు. ఒకటికి పది సార్లు చదివినా అర్థం కాని అచ్చతెనుగు కీర్తన ఇది.

**కం॥ అచ్చ తెనుంగున జెప్పెను**
**ముచ్చటగా అన్నమయ్య మురహరి రూపుల్**
**మెచ్చిన అవతారములుగ**
**మచ్చుకి మతికెక్కదాయె మాటొకటైనన్.**

**రాగం : వరాళి**

పుడమి నిందరి బట్టె- భూతము కదు
బొడవైన నల్లని - భూతము. ॥పుడమి॥

కినిసి వోడ మిం -గెడి భూతము
పునుక వీపు పెద్ద -భూతము
కనలి కవియు చీ-కటి భూతము
పొనుగు సోమపు-మోము భూతము ॥పుడమి॥

చేట కాళ్ళ మిం-చిన భూతము
పోటు దారల పెద్ద-భూతము
గాటపు జడల బిం-కపు భూతము
జూటరి నల్లము-సుగు భూతము ॥పుడమి॥





కెలసి బిత్తలే తిరి-గేటి భూతము
పొలుపు దాంట్ల పెద్ద-భూతము
బలుపు వేంకటగిరి-పయి భూతము
పులుగు మీది మహా-భూతము ॥పుడమి॥

**భావామృతం :**

ఇది చాల ఎత్తుగా, నల్లగా ఉండే పెద్ద భూతము ఈభూమి మీద, వారూ వీరనే తేడాలేకుండా అందరినీ పట్టుకొన్న భూతము.(సర్వులను అనుగ్రహించు దైవము నల్లగా చాల ఎత్తుగా ఉండే దైవము)

ఆగ్రహించి ఓడను సైతం మ్రింగగల భూతం ఇది, (మత్స్యావతారంలో పెద్ద తిమింగిలం అయ్యాడా శ్రీహరి). వీపున ఒక ఎముక చిప్ప (పుఱ్ఱె) గల పెద్ద భూతము ఇది, (కూర్మావతారంలో ఎముక డిప్పవున్న తాబేలైన శ్రీహరి). కోపించి వ్యాపించిన చీకటి వంటి (తామసంగల) భూతం ఇది, (నల్లని వరాహ రూపం దాల్చిన ఆగ్రహ రూపుడైన శ్రీహరి). ఇది ఎగసిపడే ప్రతాపము వెదజల్లు ముఖముకల భూతము, (గొప్ప పరాక్రమం ప్రస్ఫుటమయ్యే సింహరూపియైన నరసింహుడు).

చేటలవంటి పెద్ద కాళ్ళు ఉన్న భూతం ఇది, (పాదాలతో మూడు లోకాలను కొలిచిన వామనమూర్తి శ్రీహరి). యుద్ధనిపుణుడైన జగజ్జెట్టి యైన భూతం ఇది, (ఇరవై యొక్క మార్లు యుద్ధంలో రాజుల్ని దునిమిన పరశురాముడు). జడలు కట్టి సంచరించిన ధైర్యశాలి భూతం ఇది,

(వీరుడైన జడధారియైన శ్రీరాముని అవతారం దాల్చిన శ్రీహరి). ఈమాయదారి భూతం నల్లని ముసుగు (దుస్తులు)వేసికొన్నది, (నీలాంబరధారియైన బలరాముడు శ్రీహరియే).

పూని,దిశమొలతో సంచరించే భూతం ఇది, (కావాలని నగ్నముగా సంచరించిన బుద్ధుడైన శ్రీహరి). వడివడిగా అడుగులేయ గల భూతంఇది, (వేగంగా పరిగెత్తు అశ్వము నెక్కిన కల్కిఅవతారుడు). సమున్నతమైన శ్రీవేంకటాద్రిపై నుండే భూతం ఇది, (శ్రీవేంకటాచలపతియైన శ్రీహరి). పక్షి మీద తిరుగాడుచుండు భూతము ఇది. (గరుడవాహనుడైన శ్రీమన్నారాయణుడు ఈ మహానుభావుడు).

**1-4**

## మున్నుడి

సర్వేశ్వర్యుడైన పరమాత్మను నేతచీరలు వీధి వీధికి తిరిగి అమ్ముకొనే వ్యాపారిగా వర్ణించుచున్న అన్నమాచార్యుల వారి చమత్కారం పరిశీలించండి.

పరమాత్మను చేనేత చీరలమ్మే వ్యాపారిగాను, ఆయన భార్య లక్ష్మి బంగారు పూతపూసిన చీరెలను చూపించి లోభపెట్టి వ్యాపారం వృద్ధిచేసే 'భాగస్వామి'గాను వర్ణించుచున్నారు.

ఒకసారి ఆ వ్యాపారి బేరానికి అలవాటు పడితే ఇక జీవులు ఈ మాలసంతలలో తిరుగుతూ కర్మ అనే ధనం ఖర్చుచేస్తూ ఆయన నిర్ణయించిన ధరకే కొనుక్కొంటూ ఆ'బేహారి' వ్యాపారం నిరంతరం కొనసాగేట్లు చేస్తున్నారు.

**ఉ॥ చీరెలు మాలసంతకడ చేసెను బేరము వేంకటేశుడున్**
**మారెను శ్రీరమామణియు మాయలు చేసెడి వాని జోడుగా**
**ఔర! తలంప జాలుదురె! అన్యులు? సాధ్యము అన్నమయ్యకే**
**మీరిన తత్త్వబోధనము మీరలు జాడరెయెంచి చెప్పితిన్**

**రాగం : వరాళి**

వాడల వాడల వెంట- వాడెవో వాడెవో
నీడనుండి చీరలమ్మే-నేత బేహారి ॥వాడల॥

పంచభూతములనెడి - పలువన్నె నూలు
చంచలపు గంజితోడ - చరిసేసి,
కొంచెపు కండెల నూలి - గుణముల నేసి
మంచి మంచి చీరలమ్మే - మారు బేహారి ॥వాడల॥

మటు మాయముల దన - మగువ పసిడి నీరు
చిటిపొటియలుకల - జిలికించగా
కుటిలంపుజేతలు - కుచ్చులుగా గట్టి
పటవాళి చీరెలమ్మే - బలుబేహారి ॥వాడల॥





మచ్చిక జీవులనేటి - మైలసంతలలోన
వెచ్చపు కర్మధనము - విలువచేసి
పచ్చడాలుగా గుట్టి - బలు వేంకటపతి
ఇచ్చకొలదుల నమ్మే- ఇంటి బేహారి ॥వాడల॥

**భావామృతం**

అన్ని వాడలలోను, వీధివీధి తిరిగి చీరెలమ్ముకొనే ఆ నేత చీరెల 'బేరగాణ్ణి' చూడండ్రా!

ఆ బేరగాడికి భూమి, గాలి, కాంతి, నీరు, ఆకాశము అనే పంచభూతములే పంచవన్నెల నూలుపోగులు. అవి సదా సంచలనంగల వగుటచే ఆ నూలుపోగుల్ని చాంచల్యం అనే గంజితో గట్టి పరచి, త్రిగుణములు (సత్త్వరజస్తమో గుణములు) అనే కండెలకు చుట్టి వాటితో మంచి మంచి చీరెలు నేసి మారుబేరానికి అమ్ముకోవటం ఆయన అలవాటు.

ఆ బేరగాని ఇల్లాలు మహామాయలమారి. ఆవిడ లేనిపోని చిరుకోపం ప్రదర్శిస్తూ (చిలకరిస్తూ) అందరినీ లోభపరచి కుటిలపు నడతలు కలుగునట్లు చేసి సహకరిస్తుంటే, ఆ వ్యాపారి కుచ్చులు కుచ్చులుగా కట్టి, నిలువు అడ్డము పట్టెలుగల ఆ చీరెలను చమత్కారంగా అమ్మేస్తున్నాడు.

ఇక చూడండి. ఆ బేరగాడి మాయకు అలవాటుపడి మాలసంతలలో తిరుగుతూ జీవులందరూ చేరుతున్నారు. వారి వారి కర్మలు అనే ద్రవ్యాన్ని ఖర్చు చేయిస్తూ ఆ వేంకటేశ్వరుడు అనే ఆ ఇంటింటి బేరగాడు తన ఇచ్చ వచ్చినట్లు అమ్మేస్తున్నాడు. (సర్వ భూతములయందు స్థితుడై అందరినీ మాయలో ముంచే ఆ బేరగాడిని కాదనే శక్తి ఏ ప్రాణికీ లేకుండా పోతోంది)

## 1-5

## మున్నుడి

గొబ్బిళ్ళు పెట్టి స్త్రీలు బాలికలు నృత్యం చేస్తూ గొబ్బిపాటలు పాడే సంప్రదాయం అనాదిగా తెలుగునాడులో ఉన్నది. అందులో కూడా వేంకటరమణుని శ్రీకృష్ణునిగా భావించి, స్వామి లీలలను గొబ్బిపాటలలో చెప్పటం ఒక్క అన్నమాచార్యుల వారికే సాధ్యమైన సిద్ధి. అద్భుతమైన ఈ కీర్తన చూడండి.

**ఆ.వె॥ గొబ్బిపాటలందు కొలిచెను శ్రీపతిన్**
**అన్నమయ్య పాట అద్భుతంబు**
**కంసవైరి పొగడు కాంతల నృత్యాలు**
**కనుల దోచు సుండి!! కల్లకాదు.**

**రాగం : యదుకుల కాంభోజి**

కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికిని గొబ్బిళ్ళో ॥కొలను॥

కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండాక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యులకెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్లో ॥కొలను॥

పాప విధుల శిశుపాలుని తిట్టుల
కోపగానికిని గొబ్బిళ్ళో
యేపున కంసుని యిడుముల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో ॥కొలను॥



భావయామి వేంకటేశం

దండి వైరులను తరిమిన దనుజుల
గుండెదిగులునకు గొబ్బిళ్లో
వెండిపైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో ॥కొలను॥

**భావామృతం :**

కొలనిలోని దోపిడిదొంగ (చీరెలెత్తుకెళ్లి గోపికల మాన చోరునకు) గొబ్బిళ్ళు. యదుకుల సార్వభౌముడు కూడా అయిన స్వామికి గొబ్బిళ్ళు.

కొండ (గోవర్ధనగిరి) గొడుగుగా పట్టి పిడుగుల వర్షపు కుండపోతనుంచి గోవులను (అమాయకులను) రక్షించిన చిన్నారి బాలునికి గొబ్బిళ్ళు. దుర్మార్గులైన రాక్షసాంతకుడైన గండరగండనికి గొబ్బిళ్ళు.

మేనత్త కొడుకైన శిశుపాలుడు పాపవర్తనమున చేయు దూషణముల (సహించి నూరు తిట్ల తరువాత క్రోధియై చక్రంతో తలనరికిన) కోపగానికి గొబ్బిళ్ళు. విజృంభించి కంసుని నానా తిప్పలు బెట్టిన గోపాలబాలునికి గొబ్బిళ్ళు.

ధైర్యముతో శత్రువులను (అసహాయ శూరత్వంతో పగవారిని) వెళ్ళగొట్టిన దనుజుల గుండె గాబరాగానికి (వాళ్ళ గుండెల్లో అలజడి రేపిన వానికి) గొబ్బిళ్ళు స్వర్ణ రజితములకు నెలవైన వేంకటాద్రిపై వెలసిన కొండలరాయడు శ్రీ వేంకటేశ్వరునికి గొబ్బిళ్ళు.

**1-6**

## మున్నుడి

శ్రీకృష్ణపరమాత్మ ప్రోక్తమైన భగవద్గీత యందలి సాంఖ్యయోగమును సరసమైన తెలుగు కీర్తనలో ఇమిడ్చి మధురంగా ఆలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. పామరులకు కూడ అర్ధమయ్యే పదజాలంతో భగవద్బోధ వివరించటం తాళ్ళపాక ఆచార్యులవారికే సాధ్యం.

**కం॥ ఈ విధి భగవద్గీతను**
**ఏవారికి చేతనౌను ఇటు చెప్పంగన్**
**ఆవల వేంకటపతికిన్**
**సేవగనా అన్నమయ్య చెప్పెను వినుడీ!**

**రాగం : బౌళి**

దేహినిత్యుడు - దేహము లనిత్యాలు
ఈహల నామనసా - యిది మరువకుమీ ॥దేహి॥

గుది పాతచీర మాని-కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహి-మొగి గొత్తమేను మోచు,
అదన జంపగలేవు -ఆయుధము లీతని
గదిసి యగ్నియు నీరు-గాలియు జంపగలేవు ॥దేహి॥

ఈతడు నరకువడ-డీతడగ్ని గాలడు
ఈతడు నీటమునుగ-డీతడు గాలి బోడు,
చేతనుడై సర్వగతుండౌ-చెలియించదేమిటను
ఈతల ననాదియాత-డిరవు గదలడు ॥దేహి॥





చేరి కానరానివాడు-చింతించరాని వాడు
భారపు వికారాల-బాసిన వాడీ యాత్మ,
అరయ శ్రీవేంకటేశు-నాధీన మీతడని
సారము దెలియుటే-సత్యం జ్ఞానము ॥దేహి॥

**భావామృతం :**

ఆత్మ శాశ్వతమైనది. దాని నివాసమైన శరీరం అశాశ్వతం. కోరికల నెలవైన నామనస్సా! ఈమాట మరువ వద్దు.

మనిషి, కట్టు కొన్న పాతబట్టను వదలి క్రొత్తబట్ట దాల్చినట్టు ముసలి తనువును వదలి వేసి కొంగ్రొత్త తనువును ధరిస్తుంది ఈ ఆత్మ. ఏ ఆయుధమూ దీనిని చంపలేదు, నిప్పుకాల్చలేదు, నీరు తడపలేదు, గాలి ఎండించలేదు, పూని ఊపిరాడకుండా చేసి చంపలేరు ఈ ఆత్మను.

ఈ ఆత్మ ఖండించబడదు,అగ్నిలో దహనం కాదు, జలంలో మునిగిపోదు, గాలికి ఆరిపోదు. చైతన్యం కల ఈ ఆత్మ ప్రతి చోట వ్యాపించి ఉన్నాడు.ఏమైనా చింతించదు.వీడు అనాదియైన వాడు.సనాతనుడైన ఈ ఆత్మ తనచోటు వదలడు.ఉన్న చోటునే ఉంటాడు.

ఈఆత్మ ఇంద్రియములకు వ్యక్తము కాదు. ఇతడు మనస్సు యొక్క భావనకు అందదు.ఆరు రకముల వికారములకు వశ్యుడు కాని వాడు.పరిశీలించగా ఈఆత్మ శ్రీవేంకటేశ్వరుని ఆధీనుడై ఉంటాడనే సారాంశమును గ్రహించుటే నిజమైన జ్ఞానము.

1-7

## మున్నుడి

భగవంతుని దయ పొందాలంటే అతి సులభమైన మార్గం శరణాగతి. ఓ వేంకటనాథా! అనాధరక్షకా! శరణు అంటే నాడు గజేంద్రుని, ప్రహ్లాదుని రక్షించినట్లు పరుగు పరుగున వచ్చి రక్షిస్తాడు. ఎంత రమ్యంగా అన్నమాచార్యుల వారు శరణాగతి పాడుతున్నారో చూడండి.

**చం॥ శరణని వేంకటేశ్వరుని సన్నుతి గొల్చెను అన్నమయ్య తాన్**
**పరులకు సాధ్యమౌనె! ఇటు పాడగ వేల్పుల గంటి ముంగిటన్**
**నిరుపమ వైభవం బెసగ నిల్పెను ఈ కృతి జూడరే అహో!!**
**వరమిది జన్మధన్యమగు పాడరె యెల్లరు నాదుతోదుతన్**

**రాగం : జంఝూటి**

శరణు శరణు సురేంద్ర సన్నుత-శరణు శ్రీసతివల్లభా
శరణు రాక్షస గర్వసంహర-శరణు వేంకటనాయకా ॥శరణు॥

కమలధరుడును-కమల మిత్రుడు
కమల శత్రుడు పుత్రుడు,
క్రమముతో మీ కొలువుకిప్పుడు
కాచి నా రెచ్చరికయా ॥శరణు॥

అనిమిషేంద్రులు మునులు దిక్పతు
లమర కిన్నెర సిద్ధులు,
ఘనతతో రంభాది కాంతలు
కాచినా రెచ్చరికయా ॥శరణు॥





ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు
నిన్ను కొలువగ వచ్చిరి
విన్నపము వినవయ్య తిరుపతి
వేంకటాచల నాయకా ॥శరణు॥

**భావామృతం :**

దేవేంద్రునిచే సన్నుతింపబడెడి ఓ శ్రీనాధా! శరణు శరణు. ఓ రాక్షస గర్వనాశకా! శరణు శరణు. ఓ వేంకట నాయకా! శరణు శరణు.

విష్ణుమూర్తి, సూర్యభగవానుడు, చంద్రుడు,కుమారుడైన చతుర్ముఖుడు మీ యొక్క సన్నిధిని వరుసలో నిలిచి రక్షకులవలె హెచ్చరికగానున్నారు.

సురేంద్రుడు, మహర్షులు, దిక్పాలురు, దేవతలు,కిన్నెరులు, సిద్ధులు, ఆడంబరం ప్రదర్శించు రంభాది దేవకాంతలు, మొదలైన వారు వరుసలో హెచ్చరికగానున్నారు.

అగ్రగణ్యులైన ప్రహ్లాదుని వంటి ప్రముఖులు నిన్ను పూజించుటకు వచ్చిరి. ఓ తిరుపతి వేంకటేశ్వరా! మా మొరలను ఆలకింపుము ప్రభూ! శరణు శరణు.

## 1-8

## మున్నుడి

వైరాగ్యం జొప్పించి అన్నమాచార్యుల వారు సంకీర్తన పాడితే శ్రీ వేంకటేశ్వరుడే చలించి పోయాడేమో అనిపిస్తుంది. మన బోటి సామాన్యులకు హృదయ తంత్రులు తెగిపోతాయేమో అనిపిస్తుంది. క్షణకాలంలో సమాప్తమయ్యే జీవితాన్ని శాశ్వతమని నమ్ముకొని భోగవాంఛతో అంతులేని పాపములను పేర్చుకొంటూ, ఏనాటికీ జీవన గమ్యం తెలియని వారికి, ఇంతకన్నా చెప్పేదేముంది?ఇక ఈరోగానికి మందేముంది?

**కం॥ జరిగింది జరుగనున్నది**
**పరులెరుగరు వేంకటేశు మందొక్కటియే**
**మరులూరు మనసు నణచును**
**వరమై ఆ అన్నమయ్య వైరాగ్యమిడెన్.**

**రాగం : ముఖారి**

వెనకేదో ముందరేదో-వెఱ్ఱినేను నా
మనసు మరులుదేర-మందేదొకో! ॥వెనకేదో॥

చేరి మీదటి జన్మము-సిరులకు నోమేగాని
యే రూపై పుట్టుదునో-యెఱగ నేను,
కోరి నిద్రించ బరచు-కొన నుద్యోగింతు గాని
సారె లేతునో లేవనో-జాడ దెలియ నేను ॥వెనకేదో॥

తెల్లవారినప్పుడెల్లా-తెలిసితిననే గాని
కల్ల యేదో నిజమేదో-కాన నేను,
వల్ల చూచి కామినుల-వలపించే గాని
మొల్లమై నామేను-ముదిసిన దెఱగా ॥వెనకేదో॥





పాపాలు సేసి మఱచి-బ్రదుకుచున్నాడ గాని
వైపుగ జిత్రగుప్తుడు-వ్రాయు టెరుగ
ఏపున శ్రీవెంకటేశు-నెక్కడో వెతకే గాని
నా పాలిదైవమని-నన్ను గాచు టెఱగ ॥వెనకేదో॥

**భావామృతం :**

నా జీవనయాత్రలో వెనుక ఏమి జరిగినదో ముందు ముందు ఏమి జరుగనున్నదో మందమతినైన నేనేమి ఎరుగుదును? ఓ చిత్తమా! అనేక విషయాలపై వ్యామోహం పెట్టుకొనే నీ రోగానికి మందు ఏమున్నది?

ముందు రాబోయే జన్మలో సర్వసంపన్నుడ నవాలని ఇప్పుడే ఎన్నో నోములు నోచుచున్నాను. కాని నావెఱ్ఱితనం గురించి ఏమి చెప్పుదును? ఏరూపంతో పుట్టెదనో ఎఱుగను కదా! బాగుగా నిద్రించవలె ననియత్నింతును గాని నిద్రలేచెదనో లేదో నేను ఎరుగను కదా!

ప్రతి దినము తెల్లవారాక నిద్రనుండి లేచి ప్రపంచమును గాంచి నిద్ర పోకమునుపు అనుభవమును తలచుకొని సర్వమూ తెలిసినది అనుకొందును. కాని గాఢనిద్రలో ఈప్రపంచమేమైపోయినదో ఎరుగను. సుషుప్తిలో లోకమే శూన్యమైన ఆ స్థిది నిజమా? లేక మేల్కొన్నప్పుడు, శాశ్వతముగా కనబడుచున్న ఆస్థితి నిజమా? నేను సత్యముల నెరుంగని పిచ్చివాడను. అవకాశమును బట్టి కామాతురలైన స్త్రీలు నాపై వలపులు గొనునట్లు చేయుచున్నారు.కాని నాశరీరము ముదుసలియైనదని గ్రహించ నైతిని కదా!

ప్రతిదినము అనేక పాపముల నొనరించి వాటిని విస్మరించి బ్రతుకుచుంటిని గాని నాపాపముల చిట్టా వ్రాయు చిత్రగుప్తుడు యముని ఆజ్ఞ పైవాటిని లెక్కించుచున్నాడని ఎరుగజాలను కదా! శ్రీవేంకటేశ్వరుడు ఎక్కడో ఉన్నాడని తెలివిమాలి వెదుకుచుంటిని గాని నాపాలిదైవమై నన్ను వెన్నంటే ఉన్నాడని గ్రహించకుంటిని కదా! ఎంత మందమతిని!!

**1-9**

## మున్నుడి

షోడశోపచారములతో అతిధిని దేవునిగా భావించి పూజించాలని పెద్దలు చెబుతారా. కాని ఆ షోడశోపచారములేమిటో చాలమందికి తెలియదు.తెలిసినా సక్రమమైన క్రమంలో తెలియదు. కొంతమంది నాబోటి వాళ్ళకి షోడశ అంటే కూడా తెలీదు. వేంకటేశ్వరునికిచ్చే పదహారు ఉపచారముల వివరం చిత్తగించండి.

**ఆ.వె॥ షోడశోపచార శోభను గాంచుడీ**
**అన్నమయ్య పాట అమరమయ్యె**
**వేంకటేశుగొల్చు విధి అద్భుతము కదా!**
**అమరులైన పాడు నట్టికృతిది.**

**రాగం : లలిత**

షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చులును సమర్పయామి ॥షోడశ॥

అలరు విశ్వాత్మునకు ఆవాహనమిదే సర్వ
నిలయునకు ఆసనము నెమ్మినిదే
అల గంగా జనకునకు అర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికి నిమజ్జనమిదే ॥షోడశ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదే
సరి శ్రీమంతునకు భూషణములివే
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిరమిదే కోటి సూర్యతేజునకు దీపము ॥షోడశ॥





అమృత మథనునకు నదివో నైవేద్యము
గమిచంద్ర నేత్రునకు కప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునకు
తమితో బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడశ॥

**భావామృతం :**

పదునారు కళలతో విరాజిల్లునట్టి స్వామికి పదునారు విధములైన షోడసోపచారములను జ్ఞానపూర్వకంగా నిత్యమూ సమర్పించెదము గాక!

విశ్వమంతయు వ్యాపించియున్న ఆత్మరూపునికి ఇదే ఆవాహనము, చేయుచున్నాను. అన్నిచోట్లలో స్థితుడైయున్న స్వామికి ఆసనముప్రీతితో సమర్పించుచున్నాను. గంగకుజనకుడైన దేవరకు అర్ఘ్యపాద్యములను సమర్పించుచున్నాను. క్షీరసాగరశయనుడైన ఆ శ్రీమహావిష్ణువునకు నేనిదిగో నిమజ్జనము సేయుచున్నాను. (స్నానము చేయించుచున్నాను)

పీతాంబరుడైన విష్ణువునకు వస్త్రములతో అలంకరించెదను.లక్ష్మీకాంతునకు నగలను సమర్పింతును గాక! భూదేవీరమణునకు గంధము, పుష్పములు, సుగంధ దూపములను సమర్పింతును గాక! కోటి సూర్యులప్రకాశము గల స్వామికి నిత్యము దీపమును సమర్పించుచున్నాను.

పాలసముద్రమథనమున అమృతము నిప్పించిన స్వామికి నైవేద్యము నర్పింతును.సూర్యచంద్రులు నేత్రములుగా గల దేవునికి కర్పూరతాంబూలము నిచ్చుచున్నాను. శ్రీవేంకటాద్రిపైవెలసిన జగన్నాధునికి ప్రీతితో ప్రదక్షిణములు,దండములు ఇవిగో, ఇదే చేయుచున్నాను.

## 1-10

## మున్నుడి

అచ్చతెలుగులో పరమాత్ముని అవతారములను ఎన్నోవిధాలుగా వర్ణించారు అన్నమయ్య.ఒక జానపద యువతి తన చిన్నక్కకు 'తన భాష'లో స్వామి అవతారాలను వర్ణిస్తోంది. అబ్బే! తెలుగుపాటలో విశేషించి చెప్పాల్సినంతవుందా అనుకొనే గ్రంథసొంగులకు ఈకీర్తన ఒక కనువిప్పు.మనకు తెలిసింది తక్కువ తెలియాల్సిందెక్కువ అనుకొనే వారికి ఇది నచ్చుతుంది.

**మ॥ భళిరా! జానపదంపు కైత తనదై వర్ణించె నీరీతిగా**
**నళినీకాంతుడు వేంకటేశుడొదగన్ నానా విచిత్రంబులౌ**
**పలురూపంబుల, అన్నమయ్య తెలిపెన్ భావించి ఆ గాథలన్**
**తెలుగే గొప్ప'వెలుంగు' సాటి కలదా! దీనంత తీపెందునన్**

**రాగం : ఆహిరి**

శిఱుత నవ్వుల వాడు శిన్నెకా వీడు
వెఱపెఱుగడు సూడవే శిన్నెక్కా ॥శిఱుత॥

పొలుసుమేని వాడు, బోరవీపు వాడు
సెలసు మోరవాడు శిన్నెక్కా
గొలుసుల వంకల కోరలతో బూమి
వెలసినాడు సూడవే శిన్నెక్కా ॥శిఱుత॥

మేటికురచవాడు, మెడమీది గొడ్డలి
సీటకాలవాడు శిన్నెక్కా
ఆటదాని బాసి అడవిలో రాకాశి
వేటలాడే సూడవే శిన్నెక్కా ॥శిఱుత॥





బింకపు మోతల 'పిల్లగోవి' వాడు
సింకసూనుల వాడు శిన్నెక్కా
కొంకక కలికియై కొసరి కూడె నన్ను
వేంకటేశుడే సూడవే శిన్నెక్కా ॥శిఱుత॥

**భావామృతం :**

ఓచిన్నక్కయ్యా! ఈపిల్లవాడు మొలక నవ్వులవాడు.భయమంటే తెలియని వీనిని చూడవే చిన్నక్కా!

వీడు పొలుసులు పొలుసులన్న శరీరం కలవాడు (మత్స్యావతారం లో స్వామి ఒంటి నిండా పొలుసులే కదా!) బోరవీపువాడు అనగా పెద్ద వీపు వున్నవాడు (కూర్మావతారంలో మంధర పర్వతాన్ని మోయజాలిన పెద్ద వీపు వున్న వాడు). ఘనమైన ముట్టెపై భూమిని మోయ గలిగినవాడు, అనగా భూభారాన్ని వహించేవాడు (వరాహావతారంలో భూమండలాన్ని తన మూతిపై నిలిపిన వాడు), వంకరలు దిరిగిన సుదీర్ఘమైన కేసరములు గలిగి అవని నవతరించాడు(నరసింహా స్వరూపంతో వెలసిన స్వామి).

ఓచిన్నక్కయా! ఇతగానిని పరికించవే. అతి పొట్టివాడైనా గట్టివాడు అనిపించుకొన్న వామనుడు(త్రివిక్రమావతారంలో పాదములతో త్రిభువనాలు కొలిచి దానంగా గ్రహించిన వామనుడు), మెడమీద గొడ్డలి వాడు(పరశు రామావతారంలో గండ్ర గొడ్డలి దాల్చి శత్రుసంహారం చేసినవాడు). సీటకాలవాడు అనగా నాగటి చాలులో యమునా నదిని తెప్పించి యమునా నదిలో హస్తినాపురాన్ని ముంచేస్తానన్న బలరాముడు. అడవిలో రాక్షసుని వల్ల భార్యని పోగొట్టుకొని వానిని వేటాడి చంపినవాడు (శ్రీరాముడు) చిన్నక్కా వీనిని ఒకపరి తిలకింపుము.

గొప్పధ్వని చేయు పిల్లనగ్రోవి (మురళి) కలవాడు (శ్రీకృష్ణుని అవతారంలో వేణుగానంతో అడవిని మారుమ్రోగించిన వాడు),దయ కురిపించుచూపులు కల బుద్ధుడు (తథాగతుడై దయావృష్టి వాడు) వెనుకంజ వేయని కల్కిరూపుడు అయిన వాడు. వీడు మరీమరీ నాదగ్గర అయిన వాడు. ఇటువంటి ఈ శ్రీవేంకటేశ్వరుని చూడవే చిన్నిక్కా!

# 1-11

## మున్నుడి

సుప్రసిద్ధమైన నవరత్నాలతో శ్రీ వేంకటేశ్వరుని పోల్చి యశోదా నందనునిగా కీర్తించుట అన్నమాచార్యుల వారి కొక్కరికే సాధ్యమయ్యింది. గభాలున ఎవరన్నా నవరత్నాలేమిటంటే ఎంతమంది చెప్పగలరు? నిజంగా చాల తక్కువమంది. మరి ఈకీర్తన వచ్చిన వాళ్ళు తడుముకోకుండా చెప్పగలరు. ముద్దుగారే యశోద ముంగిట ముత్యము అంటే, ముద్దులొలికేది యశోద అనుకొనే "మహానుభావులు" కూడా ఉన్నారండీ......నిజంగా....

**కం॥ నవరత్నంబులు యేమని**
**వివరంబులు తెలియకున్న వింతగునటరా!!**
**అవలీల పొగడి రమణుని**
**కవితన్ ఆ అన్నమయ్య గణనముదెలిపెన్.**

**రాగం : కురంజి**

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
దిద్దరాని మహిమల దేవకీసుతుడు. ॥ముద్దు॥

అంత నింత గొల్లతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడపచ్చ పూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు ॥ముద్దు॥

రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచే కమలాక్షుడు ॥ముద్దు॥





కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీవేంకటాద్రి యింద్రనీలము
పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలుని వలె తిరిగీ పద్మనాభుడు ॥ముద్దు॥

**భావామృతం :**

యశోదాదేవి ముంగిట (ముందింటియందు) ముద్దు మూటగట్టే ముత్యం ఈ మనోహరుడైన శిశువు.మరి ఇతడే అనుకరించలేని మహిమలు చూపిన దేవకీ నందనుడు కూడా.

అట్లాంటిట్లాంటి వాళ్ళు కాని గోపికలకు అరచేతిలో నున్న మాణిక్యము, పగబట్టిన కంసుని పాలిటి కఠినమైన వజ్రము. ముల్లోకాలను మెరిపింప జాలిన మరకతము కూడా వీడే. ఈ చిన్నారి కృష్ణుడు మా చెంతనే మా హృదయంలోనే ఉన్నాడు.

ఇతడే శృంగార క్రీడలో రుక్మిణీదేవి అరుణాధరములకు పగడము వలె నున్నాడు. బహుదొడ్డ గోవర్ధన గిరిపై విరివిగా లభించే గోమేధికము కూడా వీడే. శంఖ చక్రముల మధ్య దీప్తించు వైఢూర్యం ఈ స్వామే. వనజనేత్రుడైన ఈ ఆదిదేవుడే గతియై మమ్మల్ని రక్షించుచున్నాడు.

ఇతగాడే కాళీయుని పడగల నాక్రమించి నర్తించిన పుష్యరాగము. ఈయనే శ్రీవేంకటాద్రిపై నున్న ఏలికయైన వేంకటేశ్వరుడను ఇంద్రనీలమణి. క్షీరాబ్ధిశయనుడైన ఎడబాయని దివ్యమైన రత్నము ఈ జగన్నాథుడే. బాలుని వలె, తిరుగుచున్న ఈ మహానుభావుడు నిజముగా పద్మనాభుడైన శ్రీహరియే.

**1-12**

## మున్నుడి

సుప్రసిద్ధమైన సుప్రభాత గీతిక నిపుడు ఆస్వాదిద్దాం. ఇంత అద్భుతంగా కనులకు గట్టినట్లు వేంకటరమణుని మేలుకొలుపు పాడటం అన్నమాచార్యులవారి కొక్కరికే సాధ్యం. జగద్విఖ్యాతమైన కీర్తన అయినా నిత్యనూతనమై సదా ముక్తిప్రదమైన స్వామిసేవ ఇది. దీనిగొప్పతనం నేను వర్ణించగలనా? మీరే గమనించండి.

**చం॥ తెలతెలవారువేళ చని, దేవతలందరు నింగి దీరుచున్**
**సలిపిరి సుప్రభాతమను చక్కటి సేవను వేంకటయ్యకున్**
**కొలిచెను అన్నమయ్య తనుగ్రొత్తదనంబులు జాలువారగా**
**'తులన' లభించునా!! హరికి 'దోమతెరేమిటి!'ఏమిచోద్యమో!**

**రాగం : భూపాళ**

విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా ॥విన్నపాలు॥

తెల్లవారె జామెక్కె దేవతలు మునులు
అల్లనల్ల నంతనింత నదివో వారే
చల్లని తమ్మిరేకుల సారసపు గనులు
మెల్లమెల్లన విచ్చి మేలుకో వేలయ్యా ॥విన్నపాలు॥

గరుడ కిన్నెర యక్ష కామినులు గములై
విరహపు గీతముల వింత తాళాల
పరిపరి విధముల బాడేరు నిన్నదివో
సిరిమొగము దెరచి చిత్తగించవేలయ్యా ॥విన్నపాలు॥





పొంకపు శేషాదులు తుంబుర నారదాదులు
పంకజభవాదులు నీ పాదాలు చేరి
అంకెలనున్నారు లేచి అలమేలుమంగను
వేంకటేశుడా రెప్పలు విచ్చి చూచిలేవయ్యా ॥విన్నపాలు॥

**భావామృతం :**

మా అందరి అభ్యర్థనల నాలకించాలి, ఎన్నో విశేషాలు వింతలూ వినాలి. ప్రభూ! ఆదిశేషుడనే ఆ దోమతెరను పైకెత్తవేమి? స్వామీ!

ఓ మహానుభావా! తెల్లవారి పోయింది, జాము పొద్దెక్కింది. దేవతలు, ఋషులు ఎక్కడెక్కడ నుంచో వస్తున్నవారు అదిగో గమనించు. చల్లని పద్మపత్రములవంటి నేత్రములను మెల్లమెల్లగా తెఱచి ఎందుకు మేలుకొనవు? వారినొకసారి చూడవేమయ్యా!

గరుత్మంతుడు, కిన్నరులు, యక్షులు, కామినులు ఆకాశవీధిలో నిలచి విరహగీతములను, విచిత్రమైన తాళములతో రకరకములుగా నీకోసం పాడుతున్నారు. మంగళకరమైన నీ వదనము జూపించి వాటిని స్వీకరించాలి. ఎందుకు జాగు ప్రభూ!

శ్రద్ధతో నిలిచిన ఆదిశేషుడు, తుంబుర, నారదులు బ్రహ్మాది ప్రముఖులు నీ చరణముల కడ జేరారు. వారంతా వినమ్రులై నీ ఆధీనంలో నిన్ను కీర్తించుచున్నారు. నీ దేవేరి అలిమేలు మంగమ్మ కూడ నీకోసం ఎదురుతెన్నులు చూస్తోంది. ఓ వేంకటరమణుడా! నీ కనురెప్పలు విప్పి అందరిని తిలకించి లేచిరా తండ్రీ!

## 1-13

## మున్నుడి

అరిషడ్వర్గాలకు లొంగి పరనిందచేస్తారు మానవ మాత్రులు. వెల్లిపాయ తిన్న నోటికంపు వెంటనే బయటపడి తిట్టు వారిపై చులకన భావం కలిగిస్తుంది. మత్సరంతో కొంతమంది కుకవులు ఆనాడు దేవుడి పేరు చెప్పి పచ్చి బూతులు వ్రాస్తున్నాడని, అన్నమాచార్యుని నిందించారు. నానా రభసా చేశారు. కానీ ఆ కీర్తనలలోని మాధుర్యం చేత ఆకర్షింపబడి రహస్యంగా వారూ అన్నమయ్యను అనుకరించారు. 'చెప్పేవి శ్రీరంగ నీతులు దూరేవి దొమ్మరి గుడిసెలు' అనే తీరున వ్యవహరించిన వారిని పదకవితాపితామహుడు ఏమని అంటున్నారో చూడండి ఈకీర్తనలో.

**శా॥ స్వంతంబైన కవిత్వధార చెలగన్ సాధించి సత్కీర్తనల్**
**ఎంతో జాను తెలుంగునందు పలికెన్ ఈఅన్నమాచార్యుడున్**
**అంతా వేంకటనాధు సత్కృపగుతన్నానాడు నిందించుచున్**
**పంతంబూని "నకళ్ళూ" చేయ కుకవుల్ వారందరిన్ దిట్టెబో.**

**రాగం : రామక్రియ**

వెళ్ళులాల మీకు-వేడుక గలితేను
అళ్ళువంచి తడు-కల్లంగ రాదా ॥వెళ్ళులాల॥

ముడిచివేసిన పువ్వు-ముడువ యోగ్యము గాదు
కుడిచి వేసిన పుల్లె-కుడువగా గాదు
బడి నొకరు చెప్పిన-బ్రతి చెప్ప బోతేను
అదరి శ్రీహరి కది-అరుహము గాదు ॥వెళ్ళులాల॥

గంపెడుముక దిన-గా నొక్క వరిగింజ
తెంపున గలసితే-తెలియనెట్టు వచ్చు
జంపుల బలవరించగ-నొక మంచిమాట
ఇంపైతే హరియందు-కిచ్చునా వరము ॥వెళ్ళులాల॥





ఉమిసిన తమ్మలో-నొక కొంత కప్రము
సమకూర్చిచవిగొని-చప్పరించనేల
అమరగ ఛాయాప-హారము సేసుక
తమమాట గూర్చితే-దైవము నగడా ॥వెళ్ళులాల॥

చిబికి వేసిన గింజ-చేత బట్టగనేల
గబుక కెంగిలి బూరె-గడుగగ మరి యేల
తొబుక కవిత్వాల-దోషాల బొరలితే
దిబుకార నవ్వడా-దేవుడైనాను ॥వెళ్ళులాల॥

మించు చద్దికూటి-మీద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి-మరి చెప్ప నేరక
కంచు బెంచు నొక్క-గతి నదికితే ముట్టు
పెంచువలెనే చూచు-పెరుమాళ్ళు వాని ॥వెఋలాల॥

పుచ్చినట్టి పండు-బూజిలోనవె వుండు
బచ్చన కవితలు-బాతిగావు యెందు
ముచ్చు గన్నతల్లి-మూల కొదిగినట్లు
ముచ్చిమి నుతులేల-మొక్కరో హరికి ॥వెళ్ళులాల॥

ఉల్లి దిన్న కోమ- టూరక వున్నట్లు
జల్లెడ నావాలు-జారిపోయినట్లు,
కల్లలు చెప్పియా-కథకుత్తరము లీక
మెల్లనే వుండితే-మెచ్చునా దైవము ॥వెళ్ళులాల॥

నేతి బీరకాయ-నేయి అందు లేదు
రాతి వీరునికి బీ-రము యించుకా లేదు
ఘూత బూరుగు బండు-కడుపులోన దూది
యేతుల నుడుగులు-యెక్కునా హరికి ॥వెళ్ళులాల॥

ఇరుగు వారెరగరు-పొరుగువా రెరగరు
గొరబైన మాటలు-గొణగుచు నుందురు
పరులగా దందురు-బాతిగారు తాము
విరసు లట్టివారి-విడుచు దేవుడు ॥వెఱ్ఱులాల॥

ఎన్నగ శ్రీవేంక-టేశు దాళ్ళపాక
అన్నమాచార్యులు-అఖిల దిక్కులు మెచ్చ
నున్నతితో బాడి-రొకడెవ్వడో తాను
సన్న నొరసునట-సమ్మతా హరికి ॥వెఱ్ఱులాల॥

**భావామృతం :**

ఓ వెఱ్ఱి కవులార! మీకంత సరదాగా వుంటే మెడవంచి (మీకుతగినట్లు) తడిక అల్లుకో రాదా? (ఇంకొకళ్ళని అనుకరించుట దేనికి?)

ఒకళ్ళు తలలో పెట్టుకొని పారవేసిన పూవునింకొకరు తలదాల్తురా? ఒకరు తిన్నవిస్తరిలో ఇంకొకరు భుజింతురా? ఒకరు ఒక పద్ధతిలో శ్రీహరిపై కవిత్వం చెప్పితే వేరొకరు అదే పదములతోనో లేక కొన్ని స్వంతకవిత్వంగా కలబోసి(అంతా తమ స్వంత రచనవలె) చెప్పిన, ఆ దేవున కట్టి కవిత నచ్చుతుందా? ఎంత మాత్రం నచ్చదు.

ఒకడు గంపెడు ఊక (పొట్టు) తింటే అందులో ఎక్కడో ఒక్క బియ్యపు గింజ ఉంటే ఉండవచ్చు గాక. నిడివిగా ఏవేవో కవితలు చెబితే అందులో ఒకా నొకటి సరియైనదుండ వచ్చును గాక! అంత మాత్రాన అన్నీ ఇంపుగా వుంటాయని ఆ దైవమను కొంటాడా?ఆయన కసలు సంగతి తెలియదా?

ఒకరు నమిలి ఊసిన తాంబూలములోని కర్పూరము మిగిలిపోయి అది రుచిగా వుండునేమో? దాని నింకొకడు పరిమళం కోసం తినుట దేనికి? ఒకని కవితా ఛాయల నింకొకరు అనుకరించి కొంత తమ మాటలు చేర్చి కవిత్వం చేబితే ఆ దైవం పరిహసించడా?





ఒకడు చప్పరించి పారవేసిన గింజను ఇంకొకడు నములుట తగునా? ఒకడు ఎంగిలి చేసిన బూరెనింకొకడు కబళించుట యుచితమా? నిస్సారమైన కవితలలోని దోషములను జూచి ఆ దైవం కూడా విరగబడి నవ్వుకొంటాడు.

చద్దికూటిని నిరసించమని శాస్త్రం చెబుతున్నది. అట్లాఏదో ఒక్క మంచిమాట చెప్పితరువాత ఏమి చెప్పలేక "కంచు, పెంకు" ఒక్కటిగా అతికినట్లు అతుకులబొంతలాంటి కవిత్వం అల్లేవానిని ఆ భగవంతుడు, ముట్టుపెంకుని అస్పృశ్యంగా చూచినట్లు చూస్తాడు.అనగా ఆ స్వామి అటువంటి కవిత్వాన్ని స్వీకరించడని భావము.

ఉల్లిపాయను తినిన 'కోమటి' తను మాట్లాడితే ఉల్లి కంపుకొడుతుందని మౌనంగా వుంటాడు. జల్లెడలో పోసిన ఆవాలు నిలవకుండా జారిపోతాయి. అట్లాగే ఏదో కల్లబొల్లి కవితలు చెప్పినవాడు.దానిపై ఎవరన్నా పండితులు ప్రశ్నిస్తే తగిన సమాధానం చెప్పలేడు. వాడు మౌనవ్రతం పట్టి తీరుతాడు. అటువంటి వానిని ఆ దైవం మెచ్చునా?

నేతి బీరకాయలో నెయ్యి ఉంటుందా ఎక్కడైనా? రాతితో చేసిన వీరుడు బొమ్మే కాని పరాక్రమించగలడా? బూరుగు పండులో దూదియేగాని ఆస్వాదించటాని కేమన్నా వుంటుందా? అట్లే నిడుపులైన పటాటోపం మాటలు సారహీనమైనవి,గాన అట్టివారి మాటలు హరికి రుచించవు.

మీరు చెప్పుమాటలు ఇరుగువారికి తెలియవు, పొరుగువారికి తెలియవు. మీరేవేవో వికృతమైన పలుకులను గొణుగుచుందురు.అంతేగాక ఇతరులను ఏహ్యాభావముతో జూచెదరు.లోకములను భ్రాంతి పరచగల శక్తి మీలో లేదు.మీవంటి విరసులను ఆ దేవుడు స్వీకరింపడు.

తాళ్ళపాక అన్నమాచార్యులు శ్రీవేంకటేశ్వరుని దిక్కులన్నియు మెచ్చువిధమున అత్యున్నతముగా కీర్తించెను. ఎవడో అనామకుడు పైపై మాటలతో ఆయనతో రీకొంటాడట! అది ఆ జగన్నాథునికి సమ్మతమగునా?

1-14

## మున్నుడి

గోపికలంతా కలిసికట్టుగా వచ్చి కృష్ణయ్య ఆగడాలను కొసరి కొసరి వినిపించారు, యశోదమ్మకు. ఒళ్ళుమండి యశోద ఎదురుదాడికి దిగింది. ఏవమ్మా మీరు పిల్లల్ని కనలేదా, పెంచలేదా? పిల్లలు అల్లరి చేయకపోతే ఎవరు చేస్తారు? చాల్చాల్లే మాలావు చెప్పొచ్చారు. ఎందుకు కళ్ళల్లో నిప్పులు పోసుకొంటారు? నాసంగతెత్తేలీదు జాగ్రత్త! అన్నట్లు మరీ దబాయించింది. ఆ వైనం అన్నమయ్య ఎంత అద్భుతంగా వర్ణిస్తున్నారో చూడండి.

**కం॥ పిల్లల్ని కనని గొడ్డులె?**
**నల్లని మా చిన్నవాణ్ణి నానా విధులన్**
**చెల్లని చాడీ చెబుదురు!**
**అల్లననా అన్నమయ్య అందించె కృతిన్**

**రాగం: శుద్ధదేశి**

కానరటే పెంచరటే కటకటా బిడ్డలను
నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డను. ॥కానరటే॥

బాయిట పారవేసిన పాలు వెన్నలను
చేయివెట్ట కుందురా చిన్నిబిడ్డలు
మీ యిండ్ల జతనాలు మీరుసేసికొనక
పాయక దూరేరు ప్రతిలేని బిడ్డను ॥కానరటే॥

మూసిన కాగుల నేయీ ముంగిటి పెరుగులూ
ఆసపడకుందురా ఆడేబిడ్డలు
వోసరించి మోసపోకవుండలేకమీరు
సేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డను ॥కానరటే॥





చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులును
చిక్కిన విడుతురా చిన్నిబిడ్డలు
మిక్కిలి పూజలు సేసి మెచ్చించ దగదా
యెక్కువైనతిరు వేంకటేశుడైన బిడ్డని ॥కానరటే॥

**భావామృతం :**

అయ్యయ్యో! మీరెవ్వరూ పిల్లల్ని కనలేదటే! బిడ్డల్ని పెంచలేదటే! నేను కూడా మీలాగానే మంచి బిడ్డనే కన్నానే! (ఏమను కొన్నారో మరి) (ఎంతనంగ నాచులే!)

మీరు పాలు, వెన్న బయట పారవేసుకొంటే చిన్నపిల్లలు ఎక్కడన్నా చేయి పెట్టకుండా వుంటారటే? మీమీ ఇళ్ళల్లో మీకు తగ్గ ప్రయత్నాలు మీరు చేసికొనక నాబిడ్డని తిడతారేమిటే? వాడు సాటిలేని బిడ్డ. (ఎంత ఓర్వలేని వారే మీరు!!)

మూసిన కాగుల్లో దాచిన నెయ్యి, ముందు కనబడే పెరుగూ వుంటే ఆడుకొనే పిల్లలు వాటి కోసం ఆశపడకుండా ఉంటారంటే? జాగ్రత్త పడి మోసపోకవుండాలి గానీ, ఇంతింత నిందలు వేస్తారటే? చెప్పరాని బిడ్డ పుట్టాడు నాకు. (ఎంత కుళ్ళుమోతులే!)

ఏ మాత్రము దోషములేని వెడల్పున పాత్రలలో జున్నులను, సులువుగా చిక్కినచో పిల్లలు విడిచిపెడతారటే? అందరి కంటే శ్రేష్ఠుడైన తిరువేంకటాచలపతియైన ఈబిడ్డని ఎన్నో గొప్ప పూజలు చేసి మెప్పించాలని తెలియదటే?

**1-15**

## మున్నుడి

వేంకటేశ్వరుని దేవేరియైన అలిమేలుమంగ సర్వసులక్షణశోభిత. వధువ జాతకచక్రం వేయునప్పుడు ఏయే గ్రహాలు ఏయేరాసుల్లో ఉచ్ఛస్థితిలో వున్నాయో చూస్తారు దైవజ్ఞులు. మేషం,వృషభం మొదలై ఆ రాశుల సంఖ్య పన్నెండు. ఈ వధువు రాశిచక్రం ఎంత సొగసుగా వివరిస్తున్నారో చూడండి అన్నమాచార్యులవారు. ఇటువంటి కీర్తనలు 'నభూతో నభవిష్యతి' అంటే ఏమాత్రం తప్పులేదు. నిఘంటువు సాయంతో కూడా అన్నమయ్యను పూర్తిగా అవగాహన చేసికొనుట అసాధ్యం.

**ఉ॥ రాసులప్రోవుగా హరికి రాణిని జెప్పెను అన్నమయ్య ఈ**
**వాసిని గొన్న కీర్తనను భక్తులకిచ్చెను, అందచందముల్**
**రాసిగగొన్న మంగను'విరాజిలజేసెను,వేంకటేశుకున్**
**చేసె నెవండు సన్నుతిని జెప్పిరె యివ్విధి విశ్వమంతటన్**

### రాగం : శుద్ధ రామక్రియ

ఇన్ని రాసుల యునికి యింతి చెలువపు రాశి
కన్నె నీరాశి కూటమి గలిగిన రాశి ॥ఇన్ని॥

కలికి బొమవిండ్లు గల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
చెలగు హరిమధ్యకును సింహరాశి ॥ఇన్ని॥

చిన్ని మకరాంకపు బయ్యెద చేడెకు మకరరాశి
కన్నెప్రాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైడి తులదూగు వనితకు తులారాశి
తిన్నని వాడి గోళ్ళసతికి వృశ్చికరాశి ॥ఇన్ని॥





ఆముకొను నొరపుల మెరయు నతివకు వృషభరాశి
గామిడి గుట్టు మాటలసతికి కర్కాటకరాశి
కోమలపు చిగురు మోవి కోమలికి మేషరాశి
ప్రేమ వేంకటపతి గలసే ప్రియ మిధునరాశి ॥ఇన్ని॥

### భావామృతం :

ఇన్నిరాసులు నెలకొనియున్న ఈభామిని సౌందర్య రాశి. ఈరాసులన్నీ గుంపుగా ఒక్క చోటు రాశిగా గల ఈమె విష్ణుప్రియయైన అలివేలు మంగ.

ఈమె కనుబొమలు ధనస్సు(విల్లు)వలెయుండి ఈమె ధనుర్ రాశికి చెందిన కన్య అని చెప్పకనే చెబుతున్నాయి. మీనముల (చేపల) వంటి నేత్రములు ఈమె మీనరాశికి చెందినదని తెలుపుతున్నాయి. కులుకులొలుకు ఈకోమలి కుచకుంభములు ఈమె కుంభరాశి చిన్నది అని చెబుతున్నాయి. ఉత్సాహము రూపుదాల్చిన ఈ మృగరాజమధ్యమ (సింహము నడుము వంటి సన్నని నడుము గల ఈమె) సింహరాశికి చెందిన వధువు.

మన్మధుని జెండాలో మకరం (మొసలి) చిత్తరువు వుంటుంది. అది రెపరెపలాడి ప్రేమికులకు మరులు కొల్పతుంది. ఆ జెండావలె రెపరెపలాడు పైటగల ఈ సుందరి తప్పక మకరరాశికి చెందినదై యుంటుంది. కన్నెప్రాయపు ఈ రమణకి కన్యారాశి లక్షణాలున్నాయి. బంగారు రంగుతో తులతూగు. ఈ దేవిది తులారాశి అనిపించుచున్నది. వంకరలు లేని గుచ్చుకొనువాడి గోళ్లుగల ఈ వయ్యారి వృశ్చికరాశికి చెందినది.

శృంగార క్రీడలో కమ్ముకొని ఆక్రమించు తాపముగల ఈమె వృషభరాశి యువతి అని తెలియుచున్నది. కోర్కెతో గోప్యంగా మాటలాడు ఈ సతిది కర్కాటకరాశి. కోమలమైన పల్లవాధరములుగల ఈ కోమలి మేషరాశి (గొర్రెపిల్ల చాలా కోమలంగా వుంటుంది). ప్రేమతో తనప్రియుడైన వేంకటేశ్వరుని పెనచిన ఈ అలిమేలు మంగమ్మది మిధునరాశి అయివుండవలెను.

**మున్నుడి** **1-16**

ఇద్దరు అత్తాకోడళ్లు తగవులేసుకొని మాటా మాటా అనుకొని పోట్లాడు కొంటున్నారు. నీవు సిగ్గులేనిదానివంటే నీవు బరితెగించినదానివనుకున్నారు. బొడ్డులోంచి పుట్టిన నా పిల్లవాడికి వ్యవసాయంలో సాయం అవుతావని నిన్ను తెచ్చుకొన్నామే అని అత్త అన్నది. (అప్పుడు మనకు కొంత అనుమానం వస్తుంది). సరేలే చేనుపైనున్న కోనేటిరాయుడైన మా మామగారిని నిరోధించు కొన్నావు కదా! అత్తయ్యా! అని ముక్తాయింపునిచ్చింది కోడలు. ఇంతకీ అత్తాకోడళ్ళెవరు? ఆ పోట్లాడ అర్థం ఏమిటి? అన్నమాచార్యులవారు అంత తేలికగా దొరుకుతారా? ఒకటికి పదిసార్లు చదవండి. ఆలోచించండి మరి.. కోనేటి రాయుడన్నా కూడా వెలగలేదా?)

**తే॥ అత్తనెదిరించె కోడలు అదుపు లేక,**
**కోడలిని దిట్టెనత్తమ్మ కోపమూని**
**అన్నమయ్య కీర్తన కదు అద్భుతంబు**
**బాగు! కోనేటిరాయుడే పరవశించు**

**రాగం : పాడి**

రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతో జాలును ॥రావే కోడల॥

రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరులేని కోడల
పంకజముఖి నీవు పలుదొడ్డవారిండ్ల
అంకెల దిరిగేవు అత్తయ్యా ॥రావే కోడల॥

ఈడాడ నలుగురూ నేగురు మొగలతో
కూడి సిగ్గులేని కోడల
వాడకు బదుగురి వలపించుకొని నీవు
ఆడాడ దిరిగేవు అత్తయ్యా ॥రావే కోడల॥

బొడ్డున బుట్టిన పూపనికే నిన్ను
గొడ్డేరు తెస్తినె కోడల
గుడ్డము పయినున్న కోనేటిరాయుని
నడ్డగించుకొంటి వత్తయ్యా ॥రావే కోడల॥





**భావామృతం :**

కోడలా! ఓ జగడాల మారికోడలా! ఇటురావే.

ఓ అత్తయ్యా! నీతో స్నేహాలు చాల్చాల్లే పోపో!

ఓసి కోడలా! ఏలుబడి చేసే ప్రతివాడి యెదుట జంకుగొంకులేక రంకెలు పెట్టి మరీ నీనైపుణ్యం ప్రదర్శిస్తావు కదటే!! (కవితా గోష్టిలో కవులు తమ కవితావాణిని అరుస్తూ చదువుతారు కదా! అందుకని అత్తగారైన లక్ష్మీదేవి తన కోడలైన సరస్వతిని ఆక్షేపిస్తున్నది)

బురదలోపుట్టిన మొగమున్నదానివి (లక్ష్మీదేవి పంకజముఖి) నీవు ఎంతోమంది పెద్దోళ్లు ఇళ్ళల్లో లెక్క ప్రకారం తిరగటం లేదా అత్తయ్యా! (ధనికుడైన ప్రతివాడింట్లో పద్దు పుస్తకాల సంఖ్యలలో లక్ష్మీదేవి తిరుగుతూనే వుంటుంది కదా!)

ఇక్కడా అక్కడా అనిగాక నలుగురైదుగురు మొగవాళ్లతో కలిసి సిగ్గుయెగ్గులేకుండా నీ తెలివితేటలు ప్రదర్శిస్తావు కదటే కోడలా? (ఇక్కడా అక్కడా అనిలేక నలుగురైదుగురు వున్న ప్రతి విద్వద్గోష్ఠిలోను పండితులు సిగ్గుపడకుండా శృంగార కావ్యాలను చదువుతారు కదా! ఆ మాట దెప్పిపొడుస్తోంది లక్ష్మీదేవి) (మహా చెప్పొచ్చావులే అత్తయ్యా! నీ సంగతెవరికి తెలియదు?) ఒక్కొక్కవాడకు పదిమంది చేతవలపింపజేసుకొని ఓ అత్తయ్యా! అక్కడా ఇక్కడా అడ్డమైన తిరుగుళ్లు తిరిగి వస్తావు. అని మాటకు మాట అంటించిండి చదువుల దేవియైన కోడలు. (ప్రతివాడలోను ప్రతి ధనికుడి ఇంట మహావ్యామోహంతో వాడి చేతుల్లో ధనలక్ష్మి నలిగిపోతోందని గర్హిస్తున్నాడు అన్నమయ్య)

ఓ వగలమారి కోడలా! నిన్ను బొడ్డులోంచి పుట్టిన మా పాపడికిచ్చి, వ్యవసాయం చేస్తావని తెచ్చుకొన్నాం. (పద్మనాభుని నాభికమలంలోంచి పుట్టిన బ్రహ్మకు భార్యగా సరస్వతీదేవి నెంపికచేసి మరీ తెచ్చుకొన్నారు లక్ష్మీనారాయణులు. మీరు సృష్టి చేసి జ్ఞానమిచ్చి జీవకోటిని పెంపొందించాలని బోధించారు). ఆ మాట అట్లుంచి ఓ అత్తయ్యా! కోనేటిరాయడైన మా మామగారిని చేనుపైనున్న వారిని నిరోధించి నీ వశం చేసికొన్నావు కదా! (ఇక నీకు అడ్డమేముంటుంది ఈ ప్రపంచంలో) అంటే వేంకటరమణుని ఇల్లాలిదే ఈ జగత్తులో పైచెయ్యి అని చెప్పకనే చెబుతోంది,. అత్తగారు శ్రీమహాలక్ష్మి కోడలు భారతి. (అన్నమయ్య అద్భుత కీర్తన నాసాధ్యమైనట్లు విపులీకరించగలగటం నా అదృష్టం)

## 1-17

## మున్నుడి

అంతా అర్థమయినట్లే వుండి ఏమీ అర్థంకాని అద్భుతమైన శృంగార కీర్తన ఇది. అన్నమయ్య వాడిన పదజాలం కొరుకుడు పడనిదయినా ఏదో అర్థమయినట్లే వుంటుంది, కాని వివరించలేము. నిఘంటువు సాయంతో మాత్రమే అర్థమవుతుంది. అన్నమయ్య వాడిన కొన్ని పదాలకు అర్థం వివరించలేని అవస్థకూడా రావటం కద్దు. ఎందుకంటే నేటి 'ఆధునిక' సమాజంలో వయ్యాళి, సమేళి, నివాళి, దువాళి, కరాళి, పిసాళి, విరాళి లాంటి పదములకి అర్థం తెలిసిన వారు ఎంతమంది?

**ఉ॥ చాలని యాశమెండగుట జాణ తమిన్ పతి గొర్కెతోటి, క**
**య్యాలు చెలంగ జేయునని ఆ రసికాగ్రణులెల్ల బుచ్చగన్**
**తేలిక కాని భాషగొని దీటుగ జెప్పెను అన్నమయ్య ఈ**
**మేలు కృతిన్, తరింపుడిక, వేంకటనాథుని పూజయౌ భళా!**

**రాగం : శంకరాభరణం**

వలపులు వలపులు వయాళి
చలమరి మరుదును సమేళి ॥వలపుల॥

నెలత మోమునకు నీ కనుచూపులు
నిలువున ముత్తెపు నివాళి
కొలదికి మీరిన గురు కుచములకును
తొలకు నీ మనసు దువాళి ॥వలపుల॥

వనిత నిండు జవ్వన గర్వమునకు
ఘనమగు నీ రతి కరాళి
వెనక ముందరల వెలది మేనికిని
పెనగు గోరికల పిసాళి ॥వలపుల॥





పదతి కోరికల భావంబునకును
కదుగడు నీ తమి గయాళి
చిడిముడి మగువకు శ్రీవేంకటపతి
విడువని కూటపు విరాళి ॥వలపుల॥

**భావామృతం :**

వలపులు పెనవైచి కొనిన "విహారం" జరుగుచున్నది. చపలయైన భామకు, మన్మధుని మారురూపుయైన సింగార రాయనికి "కలయిక" జరుగనున్నది.

భామిని వదనమునకు నీకంటి చూపులే ముత్యాలహారతివంటివి. ఘనస్తనద్వయంబు పైబడిన నీ తుంటరి మనస్సు "అమిత వేగముగల అశ్వము" (దాని నాపుట అసాధ్యము)

నిండు యౌవన గర్వంతోనున్న ఆ వనితకు "భీభత్సమైన" నీ రతివేగమే గొప్పగా తులతూగుతుంది. భామిని శరీరంపై ముందు వెనుక నెలకొని అతిశయించే కోరికతో వేసేవే నీ"దొంగ ఎత్తులు"అన్నీ.

ఆ యువతి కోరికల నిలయమైన భావనకు నీ అమితమైన వలపు "ధిక్కరింపు" తనమునకు (సమయుజ్జీగా నున్నవి) సరిపోయింది. సంభ్రమము కలిగిన మగువకు శ్రీవేంకటపతి యొక్క అవిశ్రాంతమైన కలయికే అనితర సాధ్యమైన "వలపు ఆరాధన".

**మున్నుడి** **1-18**

పిల్లలకే గాక వాళ్ల పిల్లలకి కూడ ఈ జోల పాడగలగటం నిజంగా సుకృతమే. శ్రావ్యంగా పాడితే చటుక్కున పాపలు నిద్రబోయే కీర్తన ఇది. తిరుమల రాయని కోసం నేటికీ, ఎప్పటికీ లక్షలమంది పాడు అద్భుతమైన 'జోల' ఇది. శ్రీకృష్ణుని చిలిపి లీలలు ఇతివృత్తంగా అన్నమయ్య ఎన్నుకొని చెప్పిన ఈ జోల మకరందహేల. పూర్వజన్మ జ్ఞానమున్న పాపాయి కొన్ని చరణాలు వింటూ హాయిగా నవ్వటం మనం గమనించవచ్చును. మీరూ గమనించాలంటే మీ పాపని ఈ కీర్తనతో నిద్రబుచ్చండి. ఇంతకీ ఒక చిన్న విషయం తెలుసా! కృష్ణయ్య అంత అల్లరి చేసి ఏడిపించింది. ఎవర్ని? గోపికలుగా అవతరించిన దేవ వనితలనే. అదీ.. వారి కోరిక మీదే.. మన కోరిక తీరినా మనకే తెలియదు అదే కృష్ణలీల.

**ఆ.వె.॥ పాప నిద్రబుచ్చ బహుదొడ్డ జోలరా**
**అన్నమయ్య జగతి కందజేసె**
**ఏడుకొండలయ్య ఇదివిని నిద్రించు**
**దీనిమించు జోల వినగనగునె!!!**

**రాగం : నవరోజ**

జోవచ్యుతానంద జోజో ముకుందా
రావె పరమానంద రామగోవింద ॥జోవచ్యుతా॥

నందు నింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవచేయంగ
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దురంగ ॥జోవచ్యుతా॥

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు ॥జోవచ్యుతా॥



భావయామి వేంకటేశం

అట్టుగట్టిన మీగడట్టె తిన్నాడే
వట్టి కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినెనని యత్త యడుగ విన్నాడే
గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే ॥జోవచ్యుతా॥

గొల్లవారిండ్లకు గొబ్బునకు బోయి
కొల్లలుగ త్రావి కుండలను నేయి
చెల్లునా మగనాండ్రు జెలిగి యీశాయీ
చిల్లతనములు సేయ జెల్లునట వోయీ ॥జోవచ్యుతా॥

రేపల్లె సతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీ కొడుకు మా ఇండ్లలోను
మాపుగానే వచ్చి మా మానములను
మీపాపడే చెఱిచె నేమందుమమ్మ ॥జోవచ్యుతా॥

ఒకని యాలినిదెచ్చి నొకని కడబెట్టి
జగడములు కలిపించి సతిబతుల బట్టి
పగలు నలుజాములును బాలుడైనట్టి
మగనాండ్రచేబట్టి మదనుడైనట్టి ॥జోవచ్యుతా॥

అంగజుని గన్న మాయన్న యిటు రారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగనీవని సతులు పొంగుచున్నారా
ముంగిటనాడరా మోహనాకారా ॥జోవచ్యుతా॥

గోవర్ధనంబెత్తి గొడుగుగా పట్టి
కావరమ్మున నున్న కంసుపడగొట్టి
నీవు మధురాపురమునేల చేపట్టి
ఠీవితో నేలిన దేవకీ పట్టి ॥జోవచ్యుతా॥

అంగుగా తాళ్లపాకన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాలా॥జోవచ్యుతా॥

**భావామృతం**

ఓఅచ్యుతానందా! (అంతులేని  ఆనందరూపా!)

జో జో (నిదురపో నాన్నా!) ఓముకుందా! రారా పరమానంద  స్వరూపా!  రాముని రూపం ధరించిన ఓగోవిందా! జోజో!

నీవు క్షేమంగా నందగోపుని ఇంటికి జేరి చంద్రముఖులైన గోపికలు నీకు సేవ చేయుచుండగా, గొల్లపల్లెలో దొంగవైన మా ముద్దుల రంగన్నా జోజో!

నీవు మునుముందుగా క్షీరసాగరమున శయనించియుంటివి. తరువాత బాలునిగా మారి మునులుకు అభయము నొసంగితివి. తరువాత వసుదేవునకు ద్యోతకమైతివి (దర్శన మొసగితివి) తరువాత రేపల్లెలో గోపాల బాలుడైతివి. అట్టిబాబూ జోజో!

చెక్కులు గట్టిన మీగడ తరకలు కడుపార భుజించినాడు. ఏమియు తెలియని అమాయకురాలైన కోడలి మూతిపై ఆ మీగడ రాసినాడు. అందుచేత అత్త ఆమెని నిలదీసి అడుగగా ఇదిగో నీ కోడలే దొంగతనం నేర్చిన జాణ అని అన్నాడు.అటువంటి అల్లరి పాపా జోజో!

శీఘ్రముగా గొల్లవారిండ్లకు బోయి అక్కడ కుండలలోని నెయ్యి అంతులేకుండా త్రాగాడు. ఈ పిల్లవాడు ఈ ఇల్లాళ్ళను ఈ విధంగా కుట్టచేష్టలతో ఏడిపించతగునా?





ఆగ్రహించిన కొందరు గోపికలు రేపల్లెలో ఇలా గోడు వినిపించారు. ‘‘ఓగోపెమ్మా! మీ కొడుకు రాత్రివేళ మా ఇండ్లకువచ్చి మామానముల నపహరించాడు.వాని నేమనమంటావో చెప్పవమ్మా!

ఒక ఆడదాన్ని (పెళ్ళాన్ని) తెచ్చి ఇంకొక మగవాడికి అంటగడతాడు. దాంతో ఆ స్త్రీమొగుడు వచ్చి పోట్లాట పెట్టుకొంటాడు. మీ పిల్లవాడు పగటి వేళ నాలుగు జాములూ మా స్త్రీలతో కూడి అపర మన్మధుని వలె ప్రవర్తిస్తాడు. అట్టి అల్లరి కృష్ణయ్య గూర్చి ఏమి చెప్పమంటావు?

మన్మధుని కన్న తండ్రివైన మా కన్నా!ఇటురా నాన్నా! నీకోసం బంగారు గిన్నెలో పాలు పోసియుంచాము.నీవు దొంగవని సతులు నిందించుచున్నారు.మన ఇంటి ముంగిటిలో ఆడుకోరాదా తండ్రీ! మోహనరూపా! ఎందుకురా మాటలు పడతావు. (అని యశోద అంటున్నది.) గోవర్ధనపర్వతమును గొడుగులా పట్టి రక్షించిన వాడవౌ బాలుడా! గర్వముతో విర్రవీగిన కంసుని పట్టి సంహరించిన వాడవైతివి. మధురాపురమును ఏలుట సాగించితివి. ఓదేవకీనందానా! ప్రజారంజకముగా. దానిని పరిపాలించితివి.

తాళ్ళపాక అన్నమాచార్యుల వారు ఈ శృంగార గీతిక రూపంలోని జోలపాటను సకలసంపదలను సిద్ధింపజేయు ఈ జోల మంగళముగా తిరుపతిలోని మదనగోపాలుడైన శ్రీవేంకటేశ్వరునికి వినిపించినాడు.

**మున్నుడి** **1-19**

శ్రీకృష్ణార్జునులు, నారాయణ నరులని తెలిసిన విషయమే. అయితే ఆ నరనారాయణులు పురాణాలలోనే కాదు నేటికీ ఏనాటికీ నాలోను, మీలోను, అందరిలోను జీవుడు(దేహి) గాను వాయువుగాను ఉన్నారు.మన ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో వున్నదివారే.

ఉచ్ఛ్వాసగా లోపలికి గాలితీసికొంటునది నారాయణుడు నిశ్వాసగా గాలిని వదిలిపెడుతున్నది నరుడు.కృష్ణుడుండి నడిపిస్తే పార్థుడు యుద్ధంచేశాడు. పరమాత్మ ఉచ్ఛ్వాస రూపంలో లోపలికిపోయి నడిపిస్తే జీవులమైన మనం శరీరానికి సంభంధించినవన్నీ చేసికొంటూ 'జీవిస్తున్నాం.'ఒక్కసారి ఆ నారాయణుడు లోపలికి పోకపోతే....అంతే సంగతులు. (ఉయ్యల మనిషి ఊగుతున్నాడు.వాడిని పైకి ఊపాలంటే శక్తి ఆ నారాయణుడివ్వాల్సిందే. క్రిందికి వాడంత వాడేవస్తాడు. మళ్ళీకాళ్ళతో తన్ని శక్తిని పరమాత్ముడిస్తాడు.) ఆ విధంగా మనశ్వాసలో వుండి నిత్యమూ మనని ఊయలలూపుతున్నాడు పరమాత్మ. అన్నమాచార్యుల వారి ఈ విశిష్టమైన కీర్తన విని ఏడుకొండల వాడే పరవశించి నిద్రకు ఉపక్రమిస్తాడు.'(ఉయ్యాల సేవ)లో ఈకీర్తన అన్నమయ్య ఎన్నిసార్లు పాడి వుంటారో !!

నేటికీ గాయకులు మధురంగా ఆలపిస్తుంటే ఆ'ఊంజల్ సేవ' చూచి వేలాదిమంది చరితార్థులౌతున్నారు,ముందు ముందు అవుతారు.

ఇక్కడ రెండు ఊయలల గురించి చెబుతున్నారు,అన్నమయ్య.ఒకటి ఈ జీవాత్మవూగే వూయల దీన్ని ఆచార్యుల వారు అద్భుతంగా వర్ణించారు ఈకీర్తనలో.రెండవది పరమాత్ముడైన వేంకటరమణుడు దేవేరులతో అఖిల దేవతా స్త్రీల సమక్షంలో కన్నులపండుగగా ఊగే వుయ్యాల.

**కం॥ గానము మధురం బవుటన్**
**వీనులకా అన్నమయ్య విందందించెన్**
**శ్రీ నాథుని జోకొట్టెను**
**ఐనా భావంబు తెలియదాయెను వినుడీ**

**రాగం : మధ్యమావతి**

అలర చంచలమైన ఆత్మలందుండనీ
అలవాటు సేసెనీ ఉయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండనీ
భావంబు దెలిపెనీ ఉయ్యాల ॥అలర॥





ఉదయాస్త శైలంబు లొనర కంభములైన
వుడుమండలము మోచె వుయ్యాల
అదన ఆకాశ పదము అడ్డదూలంబైన
అఖిలంబు నిండెనీ ఉయ్యాల ॥అలర॥

పదిలముగ వేదములు బంగారు చేరులై
పట్టవెరపై తోచెనుయ్యాల
వదలకిటు ధర్మదేవతపీఠమై మిగుల
వర్ణింప నరుదాయె వుయ్యాల ॥అలర॥

కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ము
గౌగిలింపగ జేసెనుయ్యాల
అమరాంగనలకు నీ హావభావ విలాస
మందందు చూపెనీ వుయ్యాల ॥అలర॥

కమలాసనాదులకు కన్నులకు పండుగై
గణుతింప నరుదాయె వుయ్యాల
కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు
కదువేడుకై వుండెనుయ్యాల ॥అలర॥

**భావామృతం**

సమస్త జీవుల్లో ఆత్మరూపియై చైతన్య శక్తి వలె ఆ పరమాత్ముడే యున్నాడు. చంచల స్వభావం గల ఈ జీవాత్మల ఉచ్ఛ్వాస నిశ్వాసలలో ఆ మహానుభావుడు ఊయలలూగుతున్నాడు. లోపలికి ఉచ్ఛ్వాస రూపంలో పోయిన భగవంతుడు నిశ్వాసగా బయటకు వస్తాడు. ఉయ్యాల ఊగిందన్నమాట.బయటకు వచ్చిన వాడు తిరిగి లోపలికి ఉచ్ఛ్వాసగా పోకపోతే...అదే మరణమంటే. ఊగే ఈ ఉయ్యాల అదే భావమును తెలుపుచున్నది.

ఆ పరమాత్మ వూయలకు తూర్పుపశ్చిమ పర్వతములు స్తంభములు. ఆకాశమార్గము గొప్ప అడ్డదూలము.దానికి నాలుగు కట్టు బంగారు గొలుసులు చతుర్వేదములు. ఆ వూయలనూపే త్రాళ్ళు.ఈ అద్భుతమైన ఊయల వర్ణనాతీతం. దానిని పట్టనెంతో భయమును కలిగించుచున్నది. ధర్మదేవత కది పీఠమువలెనున్నది.

పైకి క్రిందికి ఆ ఊయల కదలినపుడు ప్రతి కదలికలోను లక్ష్మీదేవిని భూదేవిని నీపై ఒరిగి నిన్ను కౌగిలించుకొనునట్లు చేస్తున్నదీ ఉయ్యాల. దేవతారమణులకు నీ హావభావములు అప్పుడప్పుడు ప్రస్ఫుటమౌనట్లు ఈ ఉయ్యాల చేయుచున్నది ప్రభూ!

బ్రహ్మాది దేవతలకు కన్నులపండుగై ఊహింప నసాధ్యమై ఈ వూయల శోభిల్లుచున్నది. అందాల చందమామవై మనోహర రూపుడవైన వేంకటేశ్వరా! ఈ వూయల నీకు మిక్కిలి వేడుకగానున్నది తండ్రీ! (ఆయన వూగే ఊయల,మనజీవాత్మవూయలా, రెండూ ఆయనకు వినోదమే మరి!!)

**1-20**

## మున్నుడి

అన్నమాచార్యుల వారు వేదాంతమంతా రంగరించి తేలిక పదజాలంతో మహోన్నతమైన భావనావాహినిగా చెప్పిన హృద్యమమైన కీర్తన. ఇది. దీన్ని పాడుతున్న సమయంలో ఆయన వాయిస్తున్న 'ఏకతార' చేతిలోనే తెగిపోయిందని, దానితో ఆయన మోక్షోన్ముఖుడై తిరుమల చేరుకొని స్వామి కృపతో ముక్తిని పొందాడని కొందరు చెబుతారు. "జీవితమే ఒక నాటక రంగం"...అనే నేటి ఆధునికుల ఆలోచనలకు ఆచార్యుల వారి ఇటువంటి కీర్తనలే మాతృకలంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. మనస్సు కదిలించే కీర్తన ఇది.

**ఉ॥ జీవితమంత 'నాటకము' చేరు తుదిన్ యొక నాటికైన ఈ**
**చావులు పుట్టుకల్ అవని సత్యము,తక్కిన వన్ని కల్లలే**
**లావుగ దెల్పెనన్నమయ,రాదు మరేదియు దీనిసాటి,సం**
**భావన జేసి శ్రీపతిని పాడె నెవండిటు'ఆర్తి'తో భళా!!**

**రాగము: రేవతి**

నానటి బతుకు నాటకము
కానకా కన్నది కైవల్యము ॥నానాటి॥

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము
యెట్టనెదుట గలది ప్రపంచము
కట్టకడపటిది కైవల్యము ॥నానాటి॥





కుడిచేదన్నము కోక చుట్టెడిది
నడుమంత్రపు పని నాటకము
వొడి గట్టు కొనిన వుభయ కర్మములు
గడి దాటినపుడే కైవల్యము ॥నానాటి॥

తెగదు పాపము తీరదు పుణ్యము
నగినగి కాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుడేలిక
గగనము మీదిది కైవల్యము. ॥నానాటి॥

## భావామృతం

ప్రతి దినము మనం 'అనుభవిస్తున్నాం' అనుకొంటున్న ఈ జీవితమంతా నిజానికి ఒక నాటకం వంటిది. మన పూర్వ సుకృతంతో పొందేది మాత్రమే మోక్షము.

మన పుట్టుక సత్యము. ఒకనాటికి తప్పక చచ్చిపోతామనేదీ నిజమే. కాని ఈరెండిటి మధ్యలో మనం చేసేదంతా 'నాటకమే' మనకళ్ళెదుట కనబడేది ప్రపంచము. కానీ మన తుది గమ్యంమాత్రం ఆ మోక్షమే.

మనం తినేది ఆహారం,ధరించేవి బట్టలు. కానీ ఇవన్నీ మన పుట్టుకతో వచ్చి చావుతో పోయేవే. ఈమధ్యలో వచ్చే వన్నీ మధ్యలో నాటకం నడవటానికి పరికరాలు మాత్రమే. మనం ఒడిలో కట్టుకొని తీసుకొనిపోయే ప్రారబ్ధ,సంచిత కర్మలు లెక్కలు తేలి పరిసమాప్తమయ్యాక మాత్రమే మోక్షందక్కుతుంది. అందాకా ఈనాటకంతప్పదు.

ఈనాటకం జరుగుతున్నదాకా పాపమూ తెగదు, పుణ్యమూ తీరదు. వాటి వల్ల నవ్వులతో నడిచే ఈ నాటకం రంజుగానో విషాదంగానో వుంటుంది. పైన ఆ ఏడుకొండల మీదనున్న శ్రీవేంకటేశ్వరుడే మనందరి ఏలిక. ఆయన అధీనంలో వున్న ఆ నింగినున్నదే మోక్షము.

## 1-21

### మున్నుడి

అన్నమాచార్యుల వారు సంస్కృతంలో చెప్పిన 'స్తుతికీర్తన' ఇది. దీనికి భావార్థ వివరణ అక్కరయే లేదు. అయినా ఇంకొక్కసారి స్వామి నామోచ్ఛరణ చేస్తే 'అధికస్య అధికం ఫలం'అన్నట్లు వివరించటం జరిగింది. 'ఆదిపురుషుని'శరణు జొచ్చిన విధానం కమనీయం.

**సీ॥ నీవే కదా! ప్రభూ! నిఖిలంబునకు ఆది**
**మధ్యాంతములు లేని మాధవుడవు**
**నీవే కదా! ప్రభూ!నిగమ వేద్యుండవై**
**మునిజన హృదయాల మనెడి హరివి**
**నీవే కదా! ప్రభూ! నిర్నిమిత్తుండవై**
**కర్మఫలమునీయు కాలమూర్తి**
**నీవే కదా!ప్రభూ! నిలిచి దుష్టుల గూల్చి**
**శిష్టరక్షణ జేయు శ్రీధరుడవు**

**ఆ.వె॥ నీవెదాల్చి నావు అవతారములనన్ని**
**నీవె పొందినావు నిందలన్ని**
**నీవె కావ మేదినిని వేంకటేశ్వరా!**
**నిన్నె సన్నుతించె నన్నమయ్య**

**రాగం : వసంతం**

అయమేవ అయమేవ ఆది పురుషో
జయకరం తమహం శరణం భజామి ॥అయమేవ॥

అయమేవ ఖలుపురా అవనీధరస్తు సో
ప్యయమేవ వటదళాగ్రాధి శయనః
అయమేవ దశవిధైరవతార రూపైశ్చ
నయమార్గ భువి రక్షణం కరోతి ॥అయమేవ॥





అయమేవ సతతం శ్రియః పతిర్దేవేషు
అయమేవ దుష్టదైత్యాంతక స్తు
అయమేవ సకల భూతాంత రేష్వాక్రమ్య
ప్రియభక్త షోషణం ప్రీత్యాతనోతి ॥అయమేవ॥

అయమేవ శ్రీవేంకటాద్రౌ విరాజతే
అయమేవ వరదోపి యాచకానాం
అయమేవ వేదవేదాంతైశ్చ సూచితో
ప్యయమేవ వైకుంఠాధీశ్వర స్తు. ॥అయమేవ॥

### భావామృతం

ఓప్రభూ! నీవే ఈసమాస్తానికి ఆదిపురుషుడివి. నీవే జయప్రదాతవు. నిన్నే శరణు జొచ్చుచున్నాను. నిన్నే భజించుచున్నాను.

అనాదిగా ఈ అవనీ భారమునంతా మోయుచున్నది నీవే సృష్ట్యాదిలో వటపత్రంపై శయనించిన వాడవూ నీవే. పది అవతారములనెత్తి వివిధ రూపములలో ఈ భూమిని దుర్మార్గుల నుంచి రక్షించినది నీవే.

నీ దేవేరులైన శ్రీదేవీ భూదేవికి సేమము నొసగెడి వాడవు నీవే. దుష్టులైన దైత్యులను పరిహరించెడి వాడవు నీవే. సర్వభూతముల అంతరాత్ముడవై వ్యాపించి, నీప్రియ భక్తులను షోషించుటలో అనురక్తుడవై యుండునది నీవు మాత్రమే.

శ్రీ వేంకటేశ్వరుడవై వేంకటాద్రి మీద వెలుగొంది నీ ఆశ్రితులకు సమస్త అభీష్టములను దీర్చువాడవు నీవే. వేదవేదాంతములలో సూచించబడిన భగవంతుడు నీవే. ఓతండ్రీ! వైకుంఠాధినాధుడవై మాదిక్కు నీవే, నీవే, నీవే.

## 1-22

### మున్నుడి

అచ్చతెలుగులో చెబితే అస్సలర్థం కాదు అంటే కొందరు నమ్మరు. నేటికి'రొడ్డు' పల్లెల్లో వాడే ఆ భాష జానపదం అంటున్నారు కొంతమంది. అన్నమయ్య సాహిత్యంతో పరిచయమున్న వారికి ఈమాటల్లో విడ్డూరమేమీ తోపదు. నిఘంటువుని వెదకి,పెద్ద వారి సలహాలు తీసుకొని, కొంత "ఇట్లా అయుంటుంది" అని ఊహించి చేసిన ప్రయత్నమిది. దీన్నిట్లా వ్రాయటంఅన్నమయ్యనర్థం చేసికొనటం "అంత" తేలిక కాదని చెప్పటం కోసమే సుమండీ....

**చం॥ తెలిపెను అన్నమయ్య అతి'తేలిక' జానపదంపు' తెన్గులో**
**నళినదళాక్షుడైన హరినాడు ధరించు 'దశావతారముల్'**
**చెలిమిని వేంకటేశ్వరుని జేకొని కొల్చెను సన్నుతించుచున్**
**తెలుగిది కాని, బోధపడదే!యొక మాట యిదేమి పాటరా!**

**రాగం : తెలుగు కాంభోజి**

నేనెందువోయీ తానెందువోయీ
రానీలే రానీలే రానీలే॥ ॥నేనెందు॥

మీనైన నాటితలమిదు కెల్ల దిగవలె కానీలే కానీలే కానీలే
తలచూపే నాటి తలపెల్ల దిగవలె తలచనీ తలచనీ తలచనీలే
కిటియైన నాటి కిటుకెల్ల దిగవలె తిరుగనీ తిరుగనీ తిరుగనీలే
హరియైననాటి అదటెల్ల దిగవలె జరగనీ జరగనీ జరగనీలే
వడుగైన నాటి వస విడువగావలె తడవకు తడవకు తడవకులే ॥నేనెందు॥

కలుషించే నాటి కడలెల్ల దిగవలె అలుగనీ అలుగనీ అలుగనీలే
సతిబాసే నాటి చలమెల్ల దిగవలె తతిగానీ తతిగానీ తతిగానీలే
ముసలైన నాటి ముసులెల్ల దిగవలె విసుగనీ విసుగనీ విసుగనీలే
మానైన నాటి మదమెల్ల పోవలే పోనీలే పోనీలే పోనీలే
కలికైన నాటిగజరెల్ల దిగవలె చెలగనీ చెలగనీ చెలగనీలే
వేడుకతో నాటి వేంకటపతినన్ను కూడినీ కూడనీ కూడనీలే ॥నేనెందు॥





### భావామృతం

నేనెక్కడికి పోతాను? తానెక్కడికి పోతాడు?ఆయన్నే నావద్దకు రానీలే...రానీలే...రానీలే. 'చేప'అయినప్పటి ఆ త్రుళ్ళిపాటుతనం తగ్గి తీరాలి.... కానీలే, కానీలే, కానీలే 'తాబేలు'వలె పొడచూపిన నాటి ఆలోచనంతా....(దేవతల కమృతం పంచి దైత్యులకు సొడ్డు కొట్టాలనే ఆలోచన) యోచించనీ, యోచించనీ, యోచించనీలే...వరాహమైన నాటి నీ కిటుకులన్నీ తగ్గి తీరాలి నభమంతా హిరణ్యాక్షుడికోసం తిరిగితే స్వేచ్ఛగా తిరగనీ, తిరగనీ, తిరగనీలే....సింహమైన నాటి (నరసింహం) నీగర్వమంతయునూ తగ్గితీరాలి. అట్లాగే జరుగనీ, జరుగనీ జరుగనీలే...వటువైన నాటి (వామనుడైన నాటి)నీ వాగ్ధాటి తగ్గాలి, మెల్ల మెల్లగా ఆక్రమించుకో, ఆక్రమించుకో, ఆక్రమించుకో... కలత పెట్టే నాటి (పరుశురామావతారము నాటి) నీ మిగిలిపోయిన క్రౌర్యమంతా ఆ మాట అన్నందుకు అలిగితే అలగనీ, అలగనీ, అలగనీలే...

భార్యను పోగొట్టు కొన్న నాటి (రామావతారం నాటి)నీ క్రోధమంతా తగ్గితిరాలి. అందాకా సమయం గడవనీ, గడవనీ, గడవనీలే...రోకలి ఆయుధంగా ధరించి చెండాడిన నాటి (బలరాముడైన నాటి)నీ కోపమంతా తగ్గితీరాలి. ఆకోపమంతా నిన్ను విడువనీ, విడువనీ, విడువనీలే..... మౌనియైన నాటి (బుద్ధుడుగా మారిన నాటి) హింసావాదం రూపు మాపాననే నీ మదమంతా తగ్గిపోవాలి. పోనీలే, పోనిలే,పోనిలే... కలికి అవతారం నాటి తెంపతితనం తగ్గితీరాలి. అందాకా విజృంభించనీ, విజృంభించనీ, విజృంభించనీలే. ఆనాటి శ్రీ వేంకటేశ్వరుడై నన్ను వేడుకతో కూడనీ, కూడనీ, కూడనీలే...

## 1-23

### మున్నుడి

'రూకలేనివాడు పోకకుకొరగాడు' అనే సామెత మన దేశంలో అనాదిగా ప్రసిద్ధం."సిరి గలవానికి చెల్లును, తరుణుల పదియారు వేల తగపెండ్లాడన్" అని సమర్ధించాడు శ్రీనాధుడు.ఇలా చెప్పుకొంటే అంతే వుండదు. ఈకీర్తనలో రూక (నేడు రూపాయి అంటున్నాం) మహిమను వర్ణిస్తున్నారు అన్నమాచార్యులు. ఎంత అద్భుదమో చూడండి. ఈ కనకం మన దగ్గర పలు విధములుగా నటిస్తున్నది అని కితాబు నిస్తున్నారు. ఆ కనకమహాలక్ష్మీ సోకులు ఎంత బాగా వర్ణిస్తున్నారో!

**ఆ.వె॥ రొంటి నెంత బెట్ట, రొక్కంబు చివరకు**
**పుసురు దీయు మడిసి కసిని బెంచు**
**అన్నమయ్య సుద్దులౌ సద్దిమూటలు**
**కొండలయ్య సతిని గోరదెవడు?**

(ఎంతధనం కూడబెట్టినా అది చివరికి ప్రాణం తీస్తుంది. ద్వేషాన్ని పెంచుతుంది. ఆ ఏడుకొండలవాడి భామామణి ఆశించని సన్నాసెవడు? అంటున్నారన్నమయ్య)

**రాగం : గుండక్రియ**

రూకలై మాడలై–రువ్వలై తిరిగీని
దాకొని ఉన్న చోట–దానుండదదివో ॥రూకలై॥

ఒకరి రాజు జేసు–నొకని బంటుగ జేసు
ఒకరి కన్నెకలవే–రొకరికి నమ్మించు,
ఒక చోట నున్నధాన్య–మొక చోట వేయించు
ప్రకటించి కనకమే–భ్రమయించీ జగము ॥రూకలై॥

కొందరి జాళెలు నిండు– కొందరికి సొమ్ములవు
కొందరి పుణ్యుల జేసు–కొందరి పాపులజేసు
కొందరి కొందరిలోన, కొట్లాట పెట్టించు
పందె మాడినటు వలె–బచరించు పసిడి ॥రూకలై॥





నిగనిగ మనుచుండు–నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశు–తరుణియై తానుండు
తెగని మాయై యుండు–దిక్కుదెసయై యుండు
నగుతా మా పాలనుండి–నటియించు బసిడి॥రూకలై॥

### భావామృతం

'రూక' అంటే వెండి రూపాయిలో నాల్గవభాగం. లేదా, చిన్నమెత్తు బంగారు నాణెం. 'మాడ' అంటే అర్ధ వరహా విలువ గల బంగారు నాణెం. 'రువ్వ' అంటే దమ్మిడీ.ఇట్లా అనేక విధములుగా పిలువబడుచున్న ధనము లోకమున సంచరించుచున్నది. ఆ కనకమే (లక్ష్మి) తానున్న చోట మరుగుపడియుండనోపదు.

ఈ కనకము ఒకరిని రాజుగాజేయును.అదే మరొకని బంటుగాజేయును. ఒకరి కన్యలను వేరొకరికి అమ్మించును. ఒక స్థలములోని ధాన్యము నింకొక స్థలమునకు జేర్చును. అందుకే సమాజంలో పండించేదొకరు, వండుకొని తినే దొకరుగా మారిపోయింది కేవలం ఈ కనకం వల్లనే.

ఈ కనకమే కొందరి సంచులను నింపుచున్నది. మరి కొందరికి ఆభరణములుగా మారుచున్నది. కొందరి చేత పుణ్యకార్యములను చేయించుచున్నది.మరికొందరిని పాపవర్తనులుగా మారుస్తోంది. కొందరి మధ్య కలహాలు పెడుతుంది, పందెం వేసికొనినట్లు ఆ పనులన్నీ ఈ కనకమే చేస్తూ అందరిని పరుగులు పెట్టించుచున్నది.

ఒక్కొక్క చోట ఈ కనకము బట్టబయలై నిగనిగమని మెరయుచుండెను. మరి యొక చోట పూడ్చిపెట్టబడి నిక్షిప్తమై భూమిలోనే దాగియున్నది. శ్రీ వేంకటేశ్వరునిపై వలపుచేత అది సదా ఆయన తరుణియైయున్నది. ఎంత ప్రయత్నించినను తొలగని మాయయై ఈ కనకము ఉన్నది. లౌకిక ప్రపంచములో తనను నమ్మిన వారికి రక్షయై రూపొందెను.ఈవిధముగా కనకము నవ్వుచు మాసమీపముననే యుండిపలు విధములుగా నటించుచున్నది.

## 1-24

### మున్నుడి

భగవద్గీతను పాట రూపంలో ఏకొందరో దైవాంశ సంభూతులు మాత్రమే చెప్పగలరు.నందకాంశమున బుట్టిన అన్నమాచార్యుల వారికిది ఉగ్గుతో నేర్చిన విద్య

భగవద్గీతలో తలమానికమైన పురుషోత్తమ ప్రాప్తి యోగంలోని సారాంశాన్ని ఇంత అలవోకగా పాడటం అసామాన్యం. భగవద్గీతపై ఆచార్యులవారు చాలా కీర్తనలు చెప్పి ఉంటారు. మన కొరనోముల వల్ల ఈనాడు మనకవన్నీ లభ్యమగుట లేదు.లభ్యమైన ఇటువంటి అరుదైన గీతామృతం చవిచూడకపోతే, "పుట్టురాద నరులు పులుగువోలె" అనిపిస్తుంది. భోజన సమయంలో పురుషోత్తమ ప్రాప్తియోగం పారాయణ చేస్తే 'వైశ్వానరునై' నేను ఆహారం అరగింప చేస్తానన్నాడు స్వామి. కనీసం ఈకీర్తన పాడితే అదే ఫలితం దక్కుతుంది కదా!

**తే॥ క్రీడికందించినట్టి శ్రీకృష్ణబోధ**
**నింత సులువుగ అన్నమయ్యెటుల తెలిపె?**
**వేంకటేశుడు తోడౌట వెనుక జేరి**
**ఏమి భాగ్యము? నేర్పుడీ స్వామి 'గీత'.**

**రాగం : లలిత**

అనియాన తిచ్చెగృష్ణు-డర్జునునితో
వినియాతని భజించు-వివేకమా ॥అని యానతి॥

భూమిలోను చొచ్చి సర్వ-భూతప్రాణుల నెల్ల
ధీమసాననే మోచేటి- దేవుడ నేను
కామించి సస్యమును- గలిగించి చంద్రుడనై
తేమల బండించేటి- దేవుడ నేను ॥అని యానతి॥

దీపనాగ్నినై జీవ- దేహముల యన్నములు
తీవుల నరగించేటి- దేవుడ నేను
ఏపున నిందరిలోని-హృదయములోన నుండి
దీపింతు దలపు మరుపై-దేవుడ నేను ॥అని యానతి॥





వేదములన్నిటి చేతా-వేదాంత వేత్తలచేతా
అది నేనెరగ దగిన-యా దేవుడను
శ్రీదేవితో గూడి-శ్రీవేంకటాద్రి మీద
పొదైన దేవుడను-భావించ నేను ॥అని యానతి॥

### భావామృతం

ఇక్కడ 'అని' ఆనతిచ్చెను అంటే ఆ విధంగా చెప్పెను-ఒక అర్థమైతే,యుద్ధభూమిలో పరమాత్మ ఆజ్ఞాపించాడని ఇంకొక అర్థం చెప్పుకోవచ్చు. అర్జునునితో శ్రీకృష్ణపరమాత్మ ఉపదేశించాడు. అది విని ఆ స్వామిని భక్తితో భజించుటే తగిన వివేకము సుమా!

ఓ అర్జునా! నేను భూమియందు సమస్త జీవకోటిని నా ఓజో బలముచే (ధైర్యముగా) ధరించుచుయుంటిని. అట్టి దేవుడను నేనే సుమా! నేనే చంద్రుడి వలె రసములతో నింపి ఓషధులను జేసి రకరకములైన పంటలను పండించి జీవకోటికి ఆహారము నొసగుచున్నాను. అట్టి దేవుడను నేనే సుమా!

ఓ పార్థా! జఠరాగ్ని వలె (వైశ్యానరుని వలె) నేను సమస్త జీవులు భుజించిన ఆహారములను జీర్ణింపచేయు దేవుడనైయున్నాను. వాటి హృదయములందు నేనే స్థితుడనైయున్నాను. అట్లు విజృంభించియుండి వారిలో జ్ఞాపక శక్తివలెను మరియు మతిమరుపు కూడ కలిగించు దేవుడనైయున్నాను.(మఱుపులేనిచో కలిగిన తొలినాటి దుఃఖమునే తలపోయుచు జీవులు నశించిపోతాయి)

ఓ సవ్యసాచీ! సమస్త వేదముల చేతను వేదాంత వేత్తల చేతను పూర్వం గ్రహించదగిన దేవుడను నేనే . శ్రీవేంకటాద్రి పై శ్రీదేవితో స్థిరపడినట్టి దేవుడు వేరెవరో కాదు, నేనే సుమా! (భావయామి వేంకటేశం అంటే ఈకీర్తనే......)

**1-25**

## మున్నుడి

ఏ జన్మ అయినా మనకి పరమాత్మ మన పూర్వ కర్మనను సరించి ప్రాప్తింపజేసినదే. ఆయన దృష్టిలో హీనాధికములు లేనేలేవు. వారి వారి పుణ్యముల ననుసరించి ప్రతి జీవికీ ఒక విశిష్టతనంటగడుతున్నాడు. అన్ని జన్మలలోను ఈశ్వరారాధనా భాగ్యం కలుగదు. స్వామి కృప కలిగితే కాని ఏ జన్మకీ సార్ధకత కలుగదు. మరి నాది ఉత్తమ జన్మ నీది ఛండాలపు జన్మ అనే భేద భావం ఎంత అవివేకం? వేంకటేశ్వరుడి ఇష్టాను సారం లభించిన జన్మని సార్ధకం చేసుకోవటానికి ప్రయత్నించాలే కాని, కాలయాపన తగదు అంటున్నా రన్నమాచార్యుల వారు.

**మ॥ భళిరా! గోత్రకులంబులీయ గలవే! వైశిష్ట్య మీజన్మకున్**
**నళినీకాంతుని సత్కృపన్ కలుగవా? నానా సుసంపన్నముల్**
**తెలిపెన్ చక్కగ నన్నమయ్య వినుడీ దీటైన సంకీర్తనన్**
**విలువౌ భక్తి రసాయనంబు గొనుడీ వేంకన్న దాస్యంబునన్**

**రాగం : శ్రీరాగం**

తలమేల కులమేల-తపమే కారణము
యెలమి హరిదాసులు-యేజాతియైననేమి? ॥తలమేల॥

కాకము వల్ల బుట్టదా- ఘనమైన అశ్వత్థము
దాకొని గుల్లలో బుట్ట-దాముత్తైము,
చౌకైన విషలతనె-జన్మించదా నిర్విషము
యేకడ మహానుభావు-లెందుపుట్టిరేమీ? ॥తలమేల॥

చిడిపి రాళ్ళ బుట్టవా-చెలువైన వజ్రములు
పుడమి నీగలవల్ల-బుట్టదా తేనె?
వెడగు బిల్లి మేనను- వెళ్ళదాయనా జవ్వాది
వుడివోని పుణ్యులెందు-నుదయించరేమీ? ॥తలమేల॥





పంకములో బుట్టదా-పరిమళపు దామెర
పొంకపు గీటములందు-పుట్టదా పట్టు
కొంకక శ్రీవేంకటేశు-గొలిచిన దాసులు
సంకె లేని జ్ఞానులెందు-జనియించరేమీ? ॥తలమేల॥

## భావామృతం

ఎట్లా వుంటే నేమి? ఏ కులజుడైతే నేమి?తపస్సు ఒక్కటే కారణము.(ముక్తి లభించవలెనంటే?) హరిదాసులు ఏజాతివారైతే మాత్రమేమిటి?

అంతపెద్ద రావిచెట్టు ఎట్లా పుడుతున్నది.కాకి ఆచెట్టు గింజను మ్రింగి రెట్ట వేస్తే ఆ మలంలో నుంచి పుడుతున్నది. దాన్ని అశ్వత్థ వృక్షమని అందరూ పూజిస్తున్నారు. చిప్పలో దాగికొని ముత్యంపుట్టుచున్నది. విషమునకు విరుగుడైన నిర్విషము ఆ విషలత నుండియే వెలవడుచున్నది. మహానుభావులు ఎక్కడ జన్మించకూడదు? ఎక్కడనైనా జన్మించవచ్చును?

విలువైన వజ్రములు జన్మస్థానంలో పనికిమాలిన రాళ్ళేకదా? కేవలం సానబట్టుట చేతనే అవి ప్రకాశించి అమూల్యమైనవి. మధురమైన తేనె ఎలాపుడుతోంది, ఈగల (తేనెటీగలు) వల్లనే కదా? అతి వికారంగా వుండే ఒక రకం పిల్లి నుంచేకదా సువాసనలు వెదజల్లే జవ్వాది పుడుతున్నది?విడిపోనటువంటి పుణ్యంగల ఉన్నతులు ఏజాతిలో జన్మించరు? అన్ని జాతులలోను జన్మిస్తారు.

పరిమళాలు విరజిమ్మే పద్మము కొలనులోని బురదలో పుట్టుచున్నది. మెత్తని పట్టుదారం నీచమైన పట్టుపురుగు లోంచి వస్తున్నది. నిస్సంశయులై శ్రీవేంకటేశ్వరుని కొలిచేదాసులు అసంఖ్యాకులై జ్ఞానులలో ఎక్కడ కనబడరు?ఎక్కడనైనను కనబడెదరు.

## 1-26

### మున్నుడి

శ్రీనివాసునిపై మరులు గొన్న అలిమేలుమంగమ్మ పడుతున్న అవస్థలను వర్ణిస్తున్నారు అన్నమచార్యులవారు ఈ శృంగార కీర్తనలో. స్వామిని వేడుకొంటున్నారు కాస్త మంగయాతన నర్థం చేసికొమ్మని. అన్నమయ్య చాతుర్యం చూడండి "స్వామీ! తగిన అదను చూచి ఆమెను నీవశం చేసికొన్నావు ఆమె విరహోత్కంఠిత ఒక్కసారి నీ చాతుర్యం చూశాక ఆమె నిన్ను వదలి ఎలావుండగలదు?" అంటున్నారు.

**మ॥ విరహోత్కంఠిత, మంగమాంబ మదిలో వేంకన్ననూహించుచున్**
**మురిసెన్ ఆతని ప్రేమలోన మునిగెన్ మోదంబుతోనా కథన్**
**ధరలో యెవ్వని కౌను పూనితెలుపన్ తానొక్కడా అన్నమ**
**య్యెరుగన్ జెప్పెను హృద్యమంబు వినుడీ ఈ 'లేమ'సింగారమున్**

**రాగం : శంకరాభరణం**

తరుణి నీయలుక కెంతటి దింతి నీవేళ
కరుణించగదర వేంకటశైలనాథా ॥తరుణి నీ॥

ఒక మారు సంసారమొల్ల బొమ్మని తలచు
నొకమారు విధిసేత లూహించి పొగడు
ఒకమారు తను చూచి వూరకే తలవూచు
నొకమారు హర్షమున నొంది మే మరుచు ॥తరుణి నీ॥

నిన్నుచూచి వొకమారు నిలువెల్ల పులకించు
తన్ను జూచి వొకమారు తలపోసి నగును
కన్ను దెరచి నిను జూచి కడుసిగ్గువడి నిలిచి
యిన్నియును తలపోసి యింతలో మఱచు ॥తరుణి నీ॥





వదలైన మొలనూలు గదియించు నొకమారు
చెదరిన కురులెల్ల చెరుగు నొకమారు
అదనెరిగి తిరువేంకటాధీశ పొందితివి
చదురుడవు నినుబాయ జాలదొకమారు ॥తరుణి నీ॥

### భావామృతం

ఓవేంకటగిరిరాయా! నీకోపం చూపించాలనుకొంటే ఈ భామినియే దొరికిందా? ఈవేళ ఈమెను కరుణింపరాదా? ఆమె పడుతున్న యాతన గమనించవేమయ్యా! ఆమెని చూడు...

ఒకమారు ఈ సంసారం నాకక్కరలేదంటుంది. ఒకమారు ఆహా! ఏమి ఈ విధిలీల అని పొగడుతుంది ఒకమారు తను జరుగుతున్నది గమనించినట్లు తలనూపుతుంది. ఒకమారు సంతోషంతోమైమరిచి పోతుంది.

ఓ స్వామీ! నిన్నుచూచి ఒక్కొకసారి నిలువెల్ల పులకించి పోతుంది ఆమె. తనను తాను చూచికొని ఏదో ఆలోచనతో నవ్వుతుంది. అంతలోనే ఒక్కసారి కళ్ళుతెరచి నిన్ను చూచి సిగ్గుపడుతుంది.మళ్ళీ ఇవన్నీ తలచుకొని తన్నుతానే మరిచిపోతుంది.

ఒకమారు వదులైపోయిన తన మొలనూలు (వడ్డాణంలాంటి బంధనం)చూచికొని మళ్ళీ బిగించికడుతుంది. ఒకమారు చెదరిపోయిన తన ముంగురులను సవరించుకొని తృప్తిపడుతుంది. అటువంటి ఆ 'బేల' ను ఓ ప్రభూ! నీవు సమయం చూసి నీవశం చేసుకొన్నావు. ఎంత టక్కరివాడివయ్యా! ఇక నిన్నామె ఎలా విడువగలదు?

**1-27**

## మున్నుడి

తిరుమలలో వేంకటేశ్వరుడే శ్రీరంగంలో రంగనాధుడు. ఏ రూపు అయినా పరమాత్మ ఒక్కడే. కావేటి ఒడ్డున శ్రీరంగ ద్వీపంలో వెలసిన రంగనాధస్వామిని దర్శించి ఆ మమేకంతో ఈ కీర్తనలో ఒక స్త్రీ అయ్యారు అన్నమయ్య. తన స్తనములపై చెయ్యివేసే చిలిపి పనులు ఎందుకు చేస్తావు? స్వామీ! అని రంగనాధస్వామిని ప్రశ్నిస్తున్నారు అన్నమయ్య. అంతగా అయితే, అంటే నీకు నాపై వ్యామోహం కలిగితే నేను కాదంటానా? రాత్రివేళ మా ఇంటికి రారాదా? నేను కాదంటానా? అంటున్నది ఆ జవ్వని. నేను నీ నవ్వులపై మోహంచెంది మైమరచాను నన్ను బూతులు తిట్టకు స్వామీ! అని అర్థిస్తున్నది, రంగనాధస్వామిని. రసవత్తరమైన శృంగారం గొప్పకీర్తనగా రూపుదాల్చింది.

**కం॥ శ్రీరంగనాధు నివ్విధి**
**కూరిమితో అన్నమయ్య కొలిచెను వినుడీ**
**ధారాళమైన కీర్తన**
**నీరీతిగ పాడెనెవడు? ఇంపుగ హరికిన్.**

**రాగం : సింధుభైరవి**

రంగ రంగ రంగపతి రంగనాధా-నీ
సింగారాలే తఱచాయె శ్రీరంగనాధా ॥రంగ రంగ॥

పట్టపగలేమాతో పలచగా నవ్వేవు
ఒట్టులేల పెట్టు కొనేవో రంగనాధా !
వట్టిమాకు లిగిరించు వడినీ మాటలు వింటే
అట్టడివీ మేర మీఱకు రంగనాధా ॥రంగ రంగ॥





చేతులు చాచేవు నీవు చేరి నా చన్నులమీద
రాతిరి మాయింటికిరా రంగనాధా
యీతల నీనవ్వులకే యిక్కువలు కరగితి
బూతుల తిట్టకుమీ పోపో రంగనాధా ॥రంగ రంగ॥

కావేటి రంగమున కాంతపై పాదాలు చాచి
రావు పోవు ఎక్కడి కోయీ రంగనాధా!
శ్రీ వేంకటాద్రి మీద చేరి నన్ను కూడితివి
ఏవల చూచిన నీవే ఇటు రంగనాధా ॥రంగ రంగ॥

## భావామృతం

ఓ కావేటి రంగా! రంగపతీ! రంగనాధా! నీ అలంకారములు అత్యద్భుతముగా శృంగార భరితంగా నున్నవయ్యా!

నీసేవకురాంద్రమైన మాతో పట్టపగలే పరాచికాలాడుతున్నావే? ఇదే మిటంటే ఒట్లు ఎందుకు పెట్టుకుంటావు? నీ మాటలు వింటే ఎండిన చెట్లు చిగురిస్తాయా అన్నట్లుంటుంది. రంగనాధా! నిందలాడి మర్యాదనెందుకు అతిక్రమిస్తావు?

నా స్తనములపైకి నీవు చేతులు తగిలేట్లు చాచి ఉంచుతావు. రంగనాధా స్వామీ! కావలెనంటే రాత్రికి మాఇంటికి రారాదా! నేను ఇక్కడ నీ సమ్మోహకరం అయిన నవ్వులకే కరిగిపోతాను. మరి నన్ను చెడు మాటలతో నిందించుట తగునా? రంగనాధా! ఇది న్యాయమేనా?

కావేరీ నది మధ్యలో శ్రీరంగపట్టణంలో పడతులపైకి (శ్రీదేవి భూదేవి) నీపాదాలు చాచివుంచావు కదా! నీ రాకపోకలు ఎక్కడికయ్యా రంగనాధా! శ్రీవేంకటాద్రి మీద వెలసిన నీవు నన్ను కూడినావు ఎక్కడ చూచినా నాకు నీవే కనిపిస్తావు రంగనాధా!

## 1-28

### మున్నుడి

అద్దాల పాపడు చిన్నికృష్ణయ్యకు ఉగ్గు పెడుతున్నది తల్లి యశోద. గోపికలు తన బాలునికి దిష్టి పెడుతారేమోనని ఆ గోపెమ్మ భయం. జగములన్నీ బొజ్జలో దాచుకొన్న వాడికి ఉగ్గు ఎవరు పెట్టగలరు? ఏమో ఆ తల్లి జాగ్రత్త ఆ తల్లిది. కాసేపు అన్నమాచార్యులవారే ఉగ్గుపెట్టే తల్లియై తనపాపాయిని శ్రమ పెట్టకండని గోపెమ్మలను మందలిస్తున్నారు. కొండల మీద తిమయ్య అయిన తన బాలునికి ఉగ్గు పెట్టమంటున్నారు. అంత తేలికగా అర్థమయ్యే పాట కాదిది. మీరే చూడండి.

**ఉ॥ కొండల మీద తిమ్మడిని గొల్చెను ఉగ్గును వెట్టు తల్లియై**
**దండిగ నన్నమయ్య, వినిదానిని పాడుదు అమ్మలాల!ఏ**
**పండితుడైన మోదమున పాటకు శీర్షమునూచకుందునా**
**మెండుగ పుణ్యముల్ కలుగు మీ మది గృష్ణుడు జిల్కునవ్వులన్.**

**రాగం : ఖమాస్**

ఉగ్గు వెట్టరే వోయమ్మా చె-
య్యొగ్గీనిదె శిశు వోయమ్మా ॥ఉగ్గు వెట్టరే॥

కడుపులోని లోకమ్ములు గదలీ-
నొడలూచకురే వోయమ్మా
తొడికెడి సరుగన తొలుగ దీయరే
వుడికెడి పాలివి వోయమ్మా ॥ఉగ్గు వోట్టరే॥

చప్పలు పట్టుక సన్నపు బాలుని-
నుప్పర మెత్తకురోయమ్మా
అప్పుడె సకలము నది మీనోరనె
వొప్పుదు తియ్యరె వోయమ్మా ॥ఉగ్గు వోట్టరే॥





తొయ్యలు లిటు చేతుల నలగించక
వుయ్యాల నిదరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
నొయ్యన తిట్టకురోరమ్మా ॥ఉగ్గు వెట్టరే॥

### భావామృతం

ఓ అమ్మలారా! ఈ శిశువునకు ఉగ్గు (స్త్రీలు చను బాలతో ఆముదం కొద్దిగా రంగరించి ఇచ్చేదే ఉగ్గు అంటే. ఇది పాపాయి జీర్ణవ్యవస్థను చక్కబరుస్తుంది. పాలుత్రాగే పాపాయికి తల్లులు ఉగ్గుపెట్టేవారు. ఇక్కడ అన్నమయ్య తనే యశోదయై గోపికలతో ఈ పాట రూపంలో ఉగ్గుపెట్టండని చెబుతున్నారు)పెట్టండమ్మా! కాస్త చేతులు చాచి ఈ శిశువు ఉగ్గుకు అడ్డు పెడుతున్నాడర్రా! అయినా ఉగ్గుపెట్టండమ్మా!

ఈబిడ్డ అంట్లాంటిట్లాంటి సాధారణ శిశువు అనుకున్నారా ఏమర్రా! వీడు తన కడుపులో లోకాలన్నీ దాచుకొన్నాడు. మీరు గబగబా పిల్లాడిని ఊపితే వీడి ఒళ్ళంతా ఊగి లోకాలు తల్లడిల్లి పోతాయి కాస్త జాగ్రత్త. ఉడుకుడుకు పాలు పిల్లాడి మీద పొంగిపోయేట్లు చేస్తారా ఏమే? కాస్త జాగ్రత్త.

చిన్నపిల్లవాడర్రా! వీడిని జబ్బలు పట్టుకొని ఆకాశం వైపున కెత్తకండి (కళ్ళు తిరుగుతాయి చిన్నారికి). వాడి చిన్నారి నోట్లో ఆ ఉగ్గంతా ఒక్కసారి తోసేయకండే, వాడి నోట్లో అంత ఉగ్గుపడుతుందా. చూసుకోండమ్మా!

ఓ అమ్మాయిలూ! కాస్త జాగ్రత్త! వాడి నెత్తిమీద మొత్తకండి. వాణ్ణి అలిసిపోయేట్లు చేస్తారేమిటే! ఇక చాలు ఉయ్యాలలో పెట్టండి. వీడు కొండల తిమ్మయ్య (ఏడుకొండలవాడు) ఈ పాపాయిని కటువైన మాటలతో నిందించకండి.

**1-29**

## మున్నుడి

మనస్సు చేత, వాక్కుచేత, కర్తల చేత ఏ వ్యాపారము అయినా జరుగుతుంది. వీనినే త్రికరణములంటారు. మానవుడు త్రికరణ శుద్ధిగా ఏపాటి మంచి చేసినా పరమాత్మ మెచ్చి దానికి తగిన సత్ఫలితాన్ని మనకందిస్తాడు. తిరుమల యాత్రలో వేంకన్న దర్శనానికి బారులు తీరి నిలబడతారు. వారిలో కొందరిని గమనించండి అనవసరమైన రాజకీయాలు మాట్లాడుతోనో, తిరుగు ప్రయాణం గురించి ఆలోచిస్తూనో, నవలలు చదువుతూలో కనిపిస్తారు. వారికి ఒళ్ళరగటమే కాని ఒరిగేదేమీ ఉండదు. ఇదే సూక్తిని అనేక మంది రకరకాలుగా చెప్పారు. అన్నమాచార్యులు తనదైన అద్భుత శైలిలో కీర్తనగా చెబుతున్నారు వినండి.

**చం॥ శృతులు పురాణముల్ చదివి చేసిన తీర్థపు యాత్ర లేమగున్?**
**అతులిత దర్పడాంబికములన్నియు జూపెడి దానమేటికిన్?**
**మతిగొని వేంకటేశ్వరుని మానక దిక్కని మ్రొక్క మేలగున్**
**హితవును జెప్పెనన్నమయ యింతకు మించిన జ్ఞానమున్నదా?**

**రాగం : చక్రవాకం**

త్రికరణ శుద్ధిగా చేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును
ఒకటి కోటి గుణితంబగు మార్గములుండగ ప్రయాస పడనేలా ॥త్రికరణ॥

తన మనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరీ
కనకబిందు యమునా గయాది ముఖ్య క్షేత్రంబుల సంతతమున్
దినకర సోమ గ్రహణకాలముల తీర్థాచరణలుసేసిన ఫలములు
తనుదానే సిద్ధించును వూరకే దవ్వులు తిరుగ మరియేలా ॥త్రికరణ॥





హరియను రెండుక్షరములు నుడివిన అఖిల వేదముల మంత్రములు
గరిమ ధర్మశాస్త్ర పురాణాదులు క్రమమున చదివిన పుణ్యములు
పరమ తపోయాగంబులు మొదలగు బహుసాధనముల సారంబు
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలు వెదకగనేలా ॥త్రికరణ॥

మొదల శ్రీవేంకటపతికిని చేయెత్తి మొక్కిన మాత్రము లోపలనే
పదిలపు షోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును
వదలక సాంగంబులుగా జేసిన వాడే కాడా పలుమారు
మదిమది నుండే కాయక్లేశము మాటికి మాటికి తనకేలా ॥త్రికరణ॥

## భావామృతం

త్రికరణ శుద్ధిగా (మనోవాక్కాయ కర్మలా) మనమంతా చేసే పనులకు పరమాత్ముడు ఆనందించి మనని తప్పక మెచ్చుకొంటాడు. ఆయన మెచ్చుకొనే మార్గాలు కోట్ల కొద్ది ఉన్నాయి. ప్రయాసతో కూడిన విధానముల నెంచుకొని అనవసరంగా తిప్పలు పడటం దేనికి?

మనస్సుని పరిశుద్ధముగా వుంచుకొంటే చాలు. గోదావరి, గంగ, కావేరి, స్వర్ణముఖి, యమున వంటి నదులలో తీర్థస్నానములు,గయా వంటి క్షేత్రాలలో సూర్య చంద్రగ్రహణ సమయాలలో పవిత్ర తర్పణలనొసంగుట వంటి శ్రమతో కూడిన దూర ప్రయాణాలు చేయుటం దేనికి?

“హరి” అని రెండక్షరములు భక్తితో పలికితే చాలును కదా! సకలవేదములలోని మంత్రములను, ధర్మశాస్త్రములను, పదునెనిమిది పురాణములను వరుసగా చదివినంత పుణ్యము, అకుంఠిత తపము, యజ్ఞయాగము చేసిన పరిపూర్ణ ఫలితము దక్కి తీరుతుందని తేటతెల్లమైపోతే, ఇంకా వాటన్నింటినీ వెదకాలా?

పదహారు రకములైన షోడవ దానములు, పంచమహా యజ్ఞములు, శాస్త్రోక్తంగా చేసిన సత్ఫలితం మొత్తమూ శ్రీ వేంకటేశ్వరునికి చేయెత్తి మొక్కినంత మాత్రముననే దక్కుతున్నది కదా! ఎన్నియోమార్లు రకరకములైన శరీరశ్రమలు కలిగించే పనులన్నీ తనకెందుకు? శరణము వేంకటపతీ! శరణు శరణు అనరాదా?

**1-30**

## మున్నుడి

"అరవైయ్యేళ్ళు వచ్చాక అ,ఆలు నేర్చుకొందాములే" అన్నాడట వెనకటి కొకడు. అలాగే ఇప్పుడు తొందరే మొచ్చింది కాస్త ఈ సుఖాలన్నీ అనుభవించి, పళ్ళూడాక పరమాత్మ గురించి ఆలోచిద్దాంలే అనుకొంటే పళ్ళూడకుండానే నువ్వు ఊడిపోయే ప్రమాదముంది. దైవంపై ప్రేమ భగవదేచ్ఛే ఐనా సాధన చేయందే దైవమైనా సాయం చేయదు. ఇంత చిన్నకీర్తనలో అంత తత్త్వజ్ఞానాన్ని ఇమిడ్చి మన వీనుల విందుతో పాటు సరి అయిన దారి చూపిన తాళ్ళపాక గురుపుంగవుని ఋణం ఎలా తీర్చుకోగలం? శేషాచలాధీశుని, మన చివరి క్షణందాకా ధ్యానించాలి. తప్పదు.

**ఉ॥ నీరధి ఆటుపోటుడిగి నీరములందున తానమాడగా**
**కోరిన, కూడునా? అలల కూటమి తగ్గున? అన్నమయ్యనెన్**
**తీరవు ఆశలెన్నటికి, దేవుని మ్రొక్కుట వీలుకాదురా**
**చేరుము వేంకటేశ్వరుని, సేవలు చేయుట నేర్వుమిప్పుడే.**

**రాగం : మిశ్రమోహన**

కడలుడిపి నీరాడగా తలచు వారలకు
కడలేని మనసుకు కడమ యెక్కడిది ॥కడలుడిపి॥

దాహమణగిన వెనక తత్త్వమెరిగెదనన్న
దాహమేలణగుతా తత్త్వమే మెరుగు
దేహంబు గలయన్ని దినములకును పదార్థ-
మోహమేలణగుతా ముదమేల కలుగు ॥కడలుడిపి॥

ముందరెరిగిన వెనుక మొదలు మరచెదనన్న
ముందరేమెరుగు తామొదలేల మరచు
అందరముగ తిరువేంకటాద్రీశు మన్ననల
కందువెరిగిన మేలు కలనైన లేదు ॥కడలుడిపి॥





## భావామృతం

సముద్రములోని అలల ఉధృతము నాపి తీరికగా స్నానం చేద్దాములే అనుకొనే వారికీ, తుదిలేని మనసుకూ (ఇక చాలు అనుకొనే అలవాటు లేని మనస్సునకు) తృప్తి యెక్కడ ఉన్నది? అందుకు తీరిక ఎక్కడ దొరుకుతుంది?

ఇంకా సుఖాలన్నీ అనుభవించలేదు. ఇప్పుడే తొందరే మొచ్చింది ఈ సుఖతృష్ణ తీరి తృప్తి కలిగాక నెమ్మదిగా దైవం గురించి తత్త్వం చింతన గురించి ఆలోచిద్దాంలే తొందరెందుకు అనుకోకండి. ఈ ఆశ, సుఖవాంఛా దాహం ఎట్లా నశిస్తుంది? అది నశించక తత్త్వమెట్లా తెలుస్తుంది? అసాధ్యం. ఈదేహమున్నంతకాలమూ వస్తు సముదాయములపై వ్యామోహం ఎలా పోతుంది? అలా ఆ వ్యామోహం పోనంతకాలం సంతోషమెలా దక్కుతుంది? దక్కదు. అందుకని దాని కోసం దీని కోసం వెంపర్లాడకండి.

అయ్యో! నాకేం జరుగుతుందో తెలియదాయె! ముందరేం జరుగుతుందో తెలిస్తే, ఇది వరకు జరిగిన సంగతులు మఱచి పోగలను. ముందరేం జరుగుతుందో ఎట్లా తెలుస్తుంది? తానిక జరిగిన సంగతుల నెట్లా మఱువగలదు? చక్కగా శ్రీవేంకటేశ్వరుని అభిమానం వెంటనే పొందితే మేలు కదా! కలలోనైన అంత అదృష్టం దక్కితే చాలాదా?

## 1-31

## మున్నుడి

హరినామరసాయనం తనివిదీరా గ్రోలుడని అనాదిగా హరిదాసులు చెబుతూనే వున్నారు. పూర్వకర్మా వశిష్ఠులమై మనమే అజ్ఞానంతో ఆ మాట పట్టించు కోవటం లేదు. అన్నమాచార్యులవారు అదే విషయాన్ని తేనెలూరే ఈకీర్తనగా చెప్పారు. ఎన్ని సార్లు వినినా తనివి తీరని ఈపాట చిన్న పాపాయిలను కూడ తన్మయులని చేస్తుందని నేను అనుభవపూర్వకంగా తెలుసుకొన్న సత్యం. తలచవో, పొగడవో, మరుగవో, తడవవోడ మనసా! అంటున్నారు తాళ్ళపాక కవీంద్రులు.

**కం॥ హరియని యొకపరి యనుమిక**
**తరుగును పాతకములన్ని ధన్యత కలుగున్**
**సిరిమగుడు వేంకటేశుడు**
**పరుగిడి వచ్చునిరి తాళ్ళపాక కవీంద్రుల్.**

**రాగం జోన్‌పురి**

హరినామము కడు ఆనందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా ॥హరి నామమే॥

నళినాక్షుని శ్రీనామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలచవో తలచవో తలచవో మనసా ॥హరి నామమే॥

నగధరునామము నరకహరణము
జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా ॥హరి నామమే॥





కడగి శ్రీ వేంకటపతి నామము
బడి బడినే సంపత్కరము
అడియాలంబిల నతి సుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా ॥హరి నామమే॥

## భావామృతం

హరినామస్మరణ మొక్కటే మిక్కిలి ఆనందమును కూర్చునది. కనుక ఓ మనసా! నీవు నామము కలిగించు ఆనందమును అదే యావగా పొందుము. మరల మరల పొందుము.

మంగళకరమైన ఆపద్మదళాయ తాక్షుని నామము కలిపురుషుని చేప్రాప్తించు దోషములను హరించి వేయును, మోక్షమునందించును. ఆ నామము పుణ్యఫలము యొక్క సారమైయున్నది. అనేకములైన బంధములను సడలించునది కూడ హరి నామమే. ఓమనసా ఆనామమును స్మరించుము. మరల మరల స్మరించుము.

గోవర్ధన గిరి నెత్తిన ఆ శ్రీహరినామము నరకమును నివారించునదైయున్నది. విశ్వమున కంతటికి ఈనామము మేలు కలిగించునది. సర్వులకు సమ్మతమైనదియు ఈనామమే. సుగుణ నిర్గుణ రూపుడైన పరమాత్ముని సాక్షాత్కరింప చేయునదియు ఈ నామమే. ఓమనసా! అట్టి నామమును స్తుతించుము. మరలమరల స్తుతించుము.

యత్నించి వేంకటేశ్వరుని నామము నాశ్రయిస్తే అతి శీఘ్రముగా సంపదలను వెలయ జేస్తుంది. గురుతుగా సుఖాలవాల మైన నామమును ఓమనసా వెదకరాదా మరల మరల యత్నించి వెదకరాదా!

**1-32**

## మున్నుడి

విజయనగరాధీశుడైన కోదండరామునిలో వేంకటేశ్వరుని సాక్షాత్కరింప చేసుకొని పులకించి అన్నమాచార్యులు చెప్పిన కీర్తన ఇది. రామనామ సంకీర్తన మధురంగా త్యాగరాజు వంటి మహామహులు చేయటానికి, స్ఫూర్తి తాళ్ళపాక వారే. నాంది వారే పలికారని నాకనిపిస్తుంటుంది...

**సీ॥ సుగుణాభిరాముని సొబగైన సుగుణాలు**
**మొదలెంచి పాడిన మోదకరము**
**ఆర్తరక్షకునెంచి కీర్తించి మ్రొక్కిరి**
**వామదేవాదులు వరుసదీరి**
**సర్వంబు దెలిసియు నిర్వికారునివోలె**
**కడదాక ధర్మంబు గరపె నతడు**
**ఎంత జుట్టినగాని సుంత వద్దన లేని**
**రామనామామృత లబ్ధికలుగు**

**ఆ.వె॥ రామనామ జపము ఈ మహినన్నమా**
**చార్యువోలె నెవడు చాటిచెప్పె?**
**వేంకటేశ్వరుడిని విజయరామునిలోన**
**ఎవడు చూచె తొలి? ఎవడు పాడె?**

**రాగం : కీరవాణి**

అదె లంక సాధించె నవని భారము దించె
విదితమై ప్రతాపము వెలయించె నితడు ॥అదెలంక॥

రవి వంశ తిలకుడు రాముడితడు
భువి పుట్టె దశరథ పుత్రుడితడు
భవుడెంచె తారక బ్రహ్మమీతడు
పవనజు కిచ్చినాడు బ్రహ్మపట్టు మితడు ॥అదె లంక॥



భావయామి వేంకటేశం

బలువుడు సీతాపతి యితడు
తలకొన్న వాలి మర్దనుడితడు
విలసిల్లె నేకాంగ వీరుడితడు
చలమరి కోదండ దీక్షా గురుడితడు ॥అదె లంక॥

శరణాగత వజ్ర పంజరుడితడు
సరిలేని యసుర భంజకుడితడు
వరదుడు శ్రీవేంకటేశ్వరుడితడు
అరయ విజయనగరాధీశుడితడు ॥అదె లంక॥

## భావామృతం

ఈ శ్రీరామచంద్రుడు అదిగో ఆ స్వర్ణ లంకను జయించి భూభారమునుపశమింప జేసినాడు. తన అమోఘమైన ప్రతాపమును ఈ రాఘవుడు వెలువరించినాడు.

రాముడని పిలువబడుతున్న ఇతగాడు సూర్యవంశమునకే అలంకారము వంటి వాడు. దశరథమహారాజునకు భూమిపై పుత్రునిగా ఉదయించినవాడీ రామచంద్రుడు. పరమశివుడు స్తుతించిన మోక్షదాతైన పరబ్రహ్మ స్వరూపుడితడే. ఈ శ్రీరాముడు హనుమంతునికి పంచముఖ బ్రహ్మపదవి నిచ్చి మన్నింపు నిచ్చాడు.

కాలి బొటనవ్రేలితో దుంధుభి మహాకళేబరాన్ని ఆవల తన్నిన బలాఢ్యుడైన సీతామనోహరుడీ రాఘవుడు. పూని మహాబలాఢ్యుడైన వాలిని నిర్జించినవాడీ రాముడు. భూమండలంలో అసహాయశూరుడై విరాజిల్లిన వీరుడీ కౌసల్లా సుతుడు. ఏ మాత్రం మాత్సర్యం లేని వాడై సదా కోదండ పాణియైన దీక్షాదక్షుడితగాడు.

శరణము వేడువారలకు వజ్రపంజరము వలె అభేద్యమైన రక్ష ఈ కోదండరాముడు. రాక్షస సంహారమున ఈతనికి సాటి మరొకడు ఈ వసుంధరలో లేడు. ఇన్ని లక్షణములున్న ఈ శ్రీరామచంద్రుడు మరెవరో కాదు స్వయంగా తిరుమలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుడే. ఆయనే మనందరి కన్నుల పండుగగా ఈ విజయనగరమున ఈ నగరాధీశ్వరుడై వెలసియున్నాడు.

## 1-33

### మున్నుడి

ఇహ పర సాధనమైనది, అత్యంత సులువైనది, సుఖకరమైనది, ముని జనాదరణీయమైనది,బాధకు హింసకు తావు లేనిది అయిన గొప్ప ఉపాయమును భక్త జనోద్ధరణకై భక్తాగ్ర గణ్యులైన తాళ్ళపాక అన్నమాచార్యులవారు సెలవిస్తునారు.

సంస్కృత భాషలో చెప్పిన ఈ కీర్తనలో పదకవితా పితామహులు మరణం తప్పనిసరి అయిన మానవులకు సులభంగా తరించటానికి శ్రీ వేంకటేశ్వరుని నామం కంటే మహత్తరమైనది లేదు అని అంటున్నారు.

**ఆ.వె॥ 'వెత'కు చోటులేని 'భేషై'న యోచన**
**శ్రావ్యగతిని పాడె సంస్కృతమున**
**అవధరింపుదయ్య అన్నమాచార్యుని**
**భవజలధిని దాటు మంచి మాట.**

**రాగం : సామంతం**

ఏవం శ్రుతిమత మిదమేవ త-
ద్భావయితు మతః పరం నాస్తి ॥ఏవ శ్రుతి॥

అతుల జన్మభో-గాసక్తానాం
హితవైభవ సుఖ- మిదమేవ,
సతతం శ్రీహరి-సంకీర్తనంత-
ద్వ్యతిరిక్త సుఖం-వక్తుం నాస్తి. ॥ఏవ శ్రుతి॥

బహుళ మరణ పరి-భవచిత్తానా
మిహపర సాధన- మిదమేవ,
అహిశయన మనో-హరసేవా త-
ద్విహరణం వినా-విధిరపి నాస్తి. ॥ఏవ శ్రుతి॥





సంసార దురిత-జాడ్య పరాణాం
హింసా విరహిత-మిదమేవ
కంసాంతక వేం-కటగిరి పతేః
శంసైవాప-శ్చాదిహ నాస్తి ॥ఏవ శ్రుతి॥

### భావామృతం

ప్రజలారా! ఇదిగో నేను తెలుపునదంతయు వేదమతమే. బాగుగా పరిశీలించిన ఇంతకంటే ఉత్తమమైన మతం మరొకటి లేదని గ్రహించండి.

ప్రతిసారీ మేలైన పుట్టుకలలోనూ వాటివల్ల కలిగే సుఖములయందును ఆసక్తి కలవారికి మేలుజేసే ఐశ్వర్య సుఖము ఇదొక్కటియే. నిత్యమూ శ్రీహరి గుణగానము వలన కలిగే సుఖమే సుఖము.దీనికంటేమేలైన సుఖము మరేదియైనాలేదు.

ప్రతి సారీ మరణం తప్పని సరిగా పొంది అవమానపీడిత హృదయులకు ఐహికాముష్మికముల రెండిటిలోను ఉత్తమ గతిని ఇచ్చే సాధన మిదొక్కటే. ఆదిశేషుడే పానుపుగా పవ్వళించు శ్రీ హరియొక్క రమ్యమైన సేవయే వేదవిదితమైన విధానము. మరిఇంకొకటి లేదు.

సంసారమనెడి దుస్తరమైన రోగము యొక్క వాతబడి నలిగిపోవు వారికి హింస లేని మార్గమిది యొక్కటే. కంసఘాతకుడైన శ్రీవేంకటేశ్వరుని మహిమలను బాగుగా కీర్తించుటకంటే ఇతరమైన మార్గము మరేదియును లేదు.

## 1-34

### మున్నుడి

ఆంజనేయుడు, నృసింహుడు తెలుగునాట ఇలవేల్పులు. ఆయా సందర్భాలలో అన్నమాచార్యులవారూ ఆ మహానుభావుల ఆలయాలను ఎన్నో ఊళ్ళల్లో సందర్శించి ఆశువుగా అద్భుతమైన కీర్తనలు చెప్పారు. ఏ దైవాన్ని కొలిచినా ఆయన భావనార్ణవంలో ఆంజనేయుడు కూడా తిరుమలేశుని బంటే. చేతులు ముడుచుకొని భక్తితో కొండలయ్య ముందు వినమృడై నిలుచున్న అంజనీసుతుని ఇంతకంటే మధురంగా ఎవరన్నా కీర్తించగలరా? అజరామరణమైన సంకీర్తన ఇది.

**చం॥ వెనకడుగేయకుండ వినువీధికి దూకెను లంకజేరగా**
**హనుమ, మహాద్భుతంబయిన ఆకృతి జూచిన వానరోత్తముల్**
**మనుముల శాంతినొందిరట, మారుతి గొల్చెను అన్నమయ్య తా**
**ననఘుడు వేంకటేశ్వరుడు అంజని సూనుని దైవమంచనెన్.**

**రాగం : ధర్మావతి**

మంగాంబుధి హనుమంత నీశరణ
మంగవించితిమి హనుమంతా ॥మంగాం బుధి॥

బాలార్క బింబము ఫలమని పట్టిన
ఆలరి సేతల హనుమంతా
తూలనె బ్రహ్మాదులచే వరములు
ఓలి చేకొనిన ఓ హనుమంతా ॥మంగాంబుధి॥

జలధి దాట నీ సత్వము కపులకు
అలరి తెలిపితివి హనుమంత
ఇలయు నాకసము నేకముగా నటు
బలిమి పెరిగితివి భళి హనుమంత ॥మంగాంబుధి॥





పాతాళము లోపలి మైరావణు
ఆతల చంపిన హనుమంత
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి
నీతల కొలిచే హిత హనుమంత ॥మంగంబుధి॥

### భావామృతం

ఓమంగాంబుధి హనుమంతా! మేము నీకు శరణు అని వేడుకొంటున్నాము ప్రభూ! పసి బాలునిగా నున్నప్పుడే నీవు బాల భానుని బింబమును ఏదోపండు అనుకొని పట్టి తిన బోయావు.నీవన్నీ అల్లరి చేష్టలేనాయె! అప్పుడు జరిగిన పర్యవసానంగా బ్రహ్మాది దేవతల చేత సాటిలేని వరములను కానుకగా పొందావు.

శతయోజన విస్తీర్ణమైన సముద్రమును దాటి సీతాన్వేషణ జయప్రదంగా ముగించి, రామకార్యం నెరవేర్చి , నీ'సత్తా' ఏమిటో కిష్కింధలోని వానరులందరికీ తెలుపకనే తెలిపావు. భూనభోంతరాళము విస్తరించిన నీమహాకాయమును చూపి బలవంతుడవై పెరిగిన నీగొప్పతనం భళిరా! అసామాన్యం కదా!

పాతళలోక వాసియైన మైరావణుడనే రాక్షసుడొకడు రామలక్ష్మణుల మాయోపాయంతో ఎత్తుకుపోయి బలి ఇద్దామనుకొన్నాడు.

'బుద్ధిమతాం వరిష్ఠం' అని పేరొందిన హనుమ తన తెలివితేటలతో వానిని తుదముట్టించి రామలక్ష్మణులను రక్షించాడు. అంతటి మహోన్నతుడైన ఈ మంగాంబుధి హనుమ తన చేతులన సవినయంగా ముడుచుకొని, శ్రీవేంకటేశ్వరుని (తన శ్రీరామచంద్రుని మారు రూప మన్నట్లుగా) సవినయంగా ఇక్కడ కొలుస్తున్నాడు హితములను గూర్పు ఈ హనుమంతుని అంజలి ఘటించి ఆరాధించండి.

## 1-35

### మున్నుడి

భీభత్సరస ప్రధానంగా సాగిన అద్భుతమైన సంస్కృత కీర్తన ఇది. అహోబల నారసింహుని భీభత్సరూపుని వర్ణిస్తూనే ఆయనను విశ్వరచనా నిపుణుడనీ, నవనవ ప్రియగుణా సముద్రుడనీ, లోకరక్షకుడు వేంకటేశ్వరుని ప్రత్యవతారమనీ వర్ణిస్తున్నారు తాళ్ళపాక ఆచార్యులు. భీభత్సం జరుగుతుంటే నిలకడ ఉండదన్నట్లుగా భావామృత వివరణ కూడా నేను భయంతో చెప్పినట్లే ఉన్నది. నిదానంగా లేదు. పద్యం కూడా అనుకోకుండా "శార్దూలమే" ఆవిర్భవించింది. అన్నమయ్య అమరకృతి ఇది.

**శా॥ ఫాలాక్షున్ తలపించు భీకరుడు తాన్ ప్రహ్లాదు రక్షింపగా**
**లీలామానుష సింగమాయె భళిరా! లేరీ మహిన్ సాటి, నా**
**వీలా? ఆ హరి దివ్య రూపు పొగడన్ వేదాలకున్ కానిచో**
**శీలించీ విధి అన్నమయ్య తెలిపెన్ సేవించె వేంకన్నగా.**

**రాగం : శ్రీరాగం**

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా-
కేలీ విహార లక్ష్మీనారసింహ ॥ఫాలనేత్రా॥

ప్రళయ మారుత ఘోర భస్మికా పూత్కార-
లలిత నిశ్వాస డోలా రచనయా
కులశైల కుంభీనీ కుముదహిత రవి గగన-
చలన విధి నిపుణ నిశ్చల నారసింహా ॥ఫాలనేత్రా॥

వివరఘన వదన దుర్విధిహసన నిష్ఠ్యూత-
లవదివ్య వరుష లాలా ఘటనయా
వివిధ జంతువ్రాత భువన మగ్నీకరణ
నవనవ ప్రియ గుణార్ణవ నారసింహా ॥ఫాలనేత్రా॥





దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానల వి-
కారస్ఫులింగ సంగక్రీడయా
వైరిదానవ ఘోర వంశ భస్మీకరణ
కారణ ప్రకట వేంకట నారసింహా ॥ఫాలనేత్రా॥

### భావామృతం

ఈ అహోబల నరసింహుడు నుదుట వహ్నినేత్రుడైన లక్ష్మీనరసింహుడు, బలీయమైన మెరుపుతీగెల వంటి కాంతులు ప్రస్ఫుట మవుచుండగా కేళి విహారమును సలుపుచున్నవాడు.

ప్రళయకాలము నాటి ఝంఝామారుతములు వీచుచుండగా భస్మీపటలమొనర్చు ఘోరమైన పూత్కారము సలుపుచూ అంతలోనే లలితమైన ఉచ్ఛ్వాస నిశ్వాసముల డోలలూపుచుండగా ఆవృతంబైన కులపర్వతములను, భూమ్యాకాశములను, సూర్యచంద్రులను ఉయ్యాలలూపు చున్నప్పటికీ, తను నిశ్చలంగా వుండే నైపుణ్యం కలవాడీ లక్ష్మీనరసింహుడు.

విస్తరించిన పెద్ద ముఖమున భీకరాట్టహాసము ప్రకటించుచుండగా ధారగా లాలాజలము రాశిగా కారుచుండగా అనేకములైన జీవులను కలిగిన ప్రపంచమును అగ్నికీలలలో భస్మీపటల మొనర్చుచు అరుదైన కొంగ్రొత్త గుణ సముద్రుడై ఈ లక్ష్మీనరసింహుడు ప్రకటితమైనాడు.

ధగధగమని మెరయుచున్న భీకరమైన కోరలనుండి దారుణమైన స్ఫులింగములు (నిప్పురవ్వలు) వెలువడి క్రూరులైన దానవులను, వారి వంశములను బూడిదపాలు చేయుచుండగా ఆ వినాశనమునకు కారణమై ప్రకటింపబడిన ఈ నరసింహుడు వేరెవ్వరో కాదు, ఆ వేంకటేశ్వరుని తొలిరూపమైన వేంకట నారసింహుడు.

(అందుకనే ఆంధ్రదేశంలో వేంకట నారసింహుని పేరు పెట్టుకొన్న వెంకట నరసయ్యలు లెక్కకు మిక్కుటంగా వున్నారు.)

## 1-36

### మున్నుడి

లలితంగా వేంకటరమణుని లలనను కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఎన్నిసార్లు విన్నా ఎన్నిసార్లుపాడినా తనివితీరని సుధావాహిని ఈ అమ్మవారి సంకీర్తన. సంగ్రామ లక్ష్మీ అని నుతిస్తూ సత్యభామ నీలవర్ణుని రథంపై వీరవిహారం చేసి నరకుని నరకటాన్ని గుర్తుచేస్తున్నారు. చంద్రసహోదరని, బ్రహ్మాదులకు కల్పవల్లి అనీ, గోవిందుని తోడునీడ అనీ, వేదసన్నుత అనీ, వేంకటేశ్వరుని వెలది అనీ నిధుల నిధానమనీ, దేవిని స్వామి ఉరమును ఆక్రమించిన తల్లిగా కీర్తిస్తున్నారు. ఇంకా ఏం చెప్పను?

**కం॥ జయముల నొసగే తల్లిని**
**నయముగ తానన్నమయ్య నళినిని గొలిచెన్**
**ప్రియయని వేంకటవిభునికి**
**జయలక్ష్మిని యిటునుతించె సంగ్రామ సిరిన్**

**రాగం : లలిత**

జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి బెరసితివమ్మ ॥జయలక్ష్మి॥

పాలజలనిధిలోని పసనైన మీగడ
మేలిమి తామరలోని మించు వాసన
నీలవర్ణునురముపై నిండిన నిధానమవై
ఏలేవు లోకములు మమ్మేలవమ్మ ॥జయలక్ష్మి॥

చందురుతోడ బుట్టిన సంపదల మెఱుగవో
కందువ బ్రహ్మలగాచే కల్పవల్లివో
అందిన గోవిందునికి అండనే తోడునీడై
వుందానవు మాయింటనే వుండవమ్మ ॥జయలక్ష్మి॥





పదియారు వన్నెల బంగారు పతిమ
చెదరని వేదముల చిగురుబోడి
ఎదుట శ్రీవేంకటేశు నిల్లాలవై నీవు
నిధుల నిలిచే తల్లి నీ వారమమ్మ ॥జయలక్ష్మి॥

### భావామృతం

అమ్మా! జయలక్ష్మీ! వరలక్ష్మి దేవీ! యుద్ధరంగంలో వీర విహారం చేసే సంగ్రామ లక్ష్మీ! నీవు శ్రీమన్నారాయణునకు ప్రియురాలవై అవతరించినావు (సత్యభామగా భావన)

నీవు పాలసముద్రమునుండి వెలువడిన పసందైన మీగడవు తల్లీ! శ్రేష్ఠమైన పద్మము యొక్క పరిమళము కూడ నీవే. నీలమేఘచ్ఛాయతో మెరిసిపోయే శ్రీహరి వక్షస్థలమును ఆక్రమించిన సౌభాగ్యలక్ష్మివి. లోకములనన్నింటిని పరిపాలించు దానివి. అందుచేత మమ్ముకూడా పరిపాలించుము తల్లీ!

దేవదానవులు క్షీరసాగరమును మథించినప్పుడు చంద్రునితో పాటు పుట్టి సంపదలన్నింటికీ నీవే సామ్రాజ్ఞివైనావు. బ్రహ్మాదులను రక్షించే కల్పవల్లివై గోవిందునకు తోడు నీడవు అండదండవూ అయి ఉన్నదానవు. మాగృహమున స్థిరపడు తల్లీ!

పదహారు వన్నెలు గల (నేటి కాలంలో 24 కారెట్లు) బంగారు బొమ్మవు తల్లీ! నీవు స్థిరముగా వేదములన్నింటిలోను కీర్తింపబడిన కుసుమపేశలవు. మా ఎదుట ఇలవేల్పుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుని అర్ధాంగివై నీవు నవనిధులని కీర్తింపబడే ఆ సంపదలకు ఆస్థానమై వున్నదానవు. ఓ జగజ్జననీ! మమ్ము మరువకు తల్లీ! మేము పరాయివారముకాము. నీ వారమే నమ్మా!

## 1-37

## మున్నుడి

పోతన గారి భావాలు అన్నమాచార్యులవారు కీర్తన రూపంలో వెలువరిస్తున్నారు. నరులజీవన విధానాన్ని నిరసిస్తున్నారు. కాసులకోసం రాజుల (ధనికుల) కాళ్ళకు దాసోహం అనే బ్రతుకుల్ని ఛీకొడుతున్నారు. అడవిలో పశు పక్షాదిగా వుంటే నయము కదా! అంటున్నారు. చెట్లై జీవించినా నష్టమేమి ఒకరికి బానిసయ్యేకంటే అంటున్నారు. హరిదాసులు వేంకటేశ్వరుడే దిక్కు అనాలి గాని పాపకృత్యములు చేసి హీనంగా జీవనం గడపవచ్చునా? అంటున్నారు. భళీ! భళీ!

**ఉ॥ మాయలమారి మానువుడు మాధవుగాదని'తొత్తు'రాజు కై**
**చేయుచు ఘోరకృత్యములు శీఘ్రమె'జంతువు' మించిభ్రష్టుడై**
**పోయెను,వేంకటేశ్వరుని ఊహదలంప డధోగతిన్ బడెన్**
**ఛీ! యని ఛీత్కరించిటుల చెప్పెను కీర్తన నన్నమయ్యహో!**

**రాగం : చక్రవాకం**

ఛీ ఛీ నరులదేటి జీవనము
కాచుక శ్రీహరి నీవె కరుణింతుగాక ॥ఛీ ఛీ॥

అడవిలో మృగజాతియైనా గావచ్చుగాక
వడి నితరుల గొలువగ వచ్చునా
వుడిలోని పక్షియై వుండనైనా వచ్చుగానీ
విడువకెవ్వరినైనా వేడువచ్చునా ॥ఛీ ఛీ॥

పసురమై వెతలేని పాటు పడవచ్చు గాక
కసటువో నొరుల బొగడగా వచ్చునా
వుసురు మానై పుట్టివుండనైన వచ్చుగాక
విసువక వీరివారి వేసరించవచ్చునా ॥ఛీ ఛీ॥





యెమ్మెల బుణ్యాల సేసి యిల యేలవచ్చుగాక
కమ్మి హరిదాసుడు గావచ్చునా
నెమ్మది శ్రీవేంకటేశ నీచిత్తమే కాక
దొమ్ములు కర్మములివి తోయవచ్చునా ॥ఛీ ఛీ॥

## భావామృతం

ఛీ! ఛీ! ఈమానవుల దెంత దౌర్భాగ్యమైన జీవితము!! వీరిని ఆ శ్రీహరియే రక్షించాలి కాని ఇక ఎవ్వరి వలన అయ్యేపని కాదు.

అధికారంలో వున్న మానవుల దాస్యంచేసి బ్రతుకుట కంటే అడవిలో ఏ మృగంగానైనా జీవించవచ్చును కదా! అన్యులను కొలువవచ్చునా? శాశ్వతంగా పక్షిగానైన జీవించవచ్చును కాని అదే పనిగా ఎవ్వరినైనా అర్థించ వచ్చునా?

మానవుడు పశువు వలె నిరంతరం అవిశ్రాంతంగా గడపవచ్చును కానీ, కోరికలతో సిగ్గువిడచి ఇతరులను పొగడవచ్చునా? జీవితాంతం వృక్షమై పడివుండవచ్చును. కాని విసుగుకూడ లేకుండ వారినీ వీరిని దేబిరించవచ్చునా? అది ఎంతమాత్రము మంచిదికాదు.

విశిష్టత కలిగి ఎన్నో పుణ్యములు చేసిన పుణ్యఫలంగా ఈ భూమండలాన్నేల వచ్చును గాక! వివరముతో శ్రీహరిదాసులు అవటం సాధ్యపడుతుందా? ఓ శ్రీ వేంకటేశ్వరా నీ ఇష్టప్రకారం కాక దొమ్మిగాపైనబడే కర్మలను అధిగమించటం అనేది జరుగుతుందా? ఎన్నటికీ జరుగదు.

## 1-38

### మున్నుడి

అన్నమాచార్యులవారు ఆదిశేషునిపైన జెప్పిన అద్భుతమైన కీర్తన ఇది. ఆయన ఈ కీర్తనకు ఎన్నుకొన్న రాగంకూడ"నాగగాంధారి" ఆయన సమయస్ఫూర్తి చూడండి. వేయిపడగలతోను, శిరసులపై మణులతోను, రెండువేలనాలుకలతోను, నల్లని శరీరఛాయతోను వెలిగిపోతున్నాడా ఆదిశేషుడు వేంకటరమణుడు అలిమేలు మంగలే శ్రీహరి, ఆదిలక్ష్మి రూపాలలో ఆదిశేషునిపై విడిసియున్నారని కీర్తిస్తున్నారు అన్నమయ్య.

**ఆ.వె॥ ఆదిలక్ష్మి కొలుచు నాదిశేషుని పైన**
**పవ్వళించియున్న పతిని హరిని**
**అన్నమయ్య పాడె నాదిశేషుని పైన**
**అద్భుతమగు కృతిని అవధరించి.**

**రాగం : నాగగాంధారి**

వీడుగదే శేషుడు శ్రీవేంకటాద్రి శేషుడు
వేడుక గరుడనితో బెన్నుద్దైన శేషుడు ॥వీడుగదే॥

వేయి వడిగెలతోడ వెలసిన శేషుడు
ఛాయమేని తళుకు వజ్రాల శేషుడు
మాయని శిరసులపై మాణికాల శేషుడు
యే యెడ హరికి నీడై యేగేటి శేషుడు ॥వీడుగదే॥

పట్టపు వాహనమైన బంగారు శేషుడు
చుట్టు చుట్టుకొనిన మించుల శేషుడు
నట్టుకొన్న రెండు వేల నాలుకల శేషుడు
నెట్టనహరిపొగడు నేరుపరి శేషుడు ॥వీడుగదే॥





కదిసి పనుల కెల్ల కాచుకున్న శేషుడు
మొదలి దేవత లెల్ల మొక్కే శేషుడు
అదె శ్రీ వేంకటపతి కలమేలు మంగకును
పదరక యే పొద్దు పానుపైన శేషుడు ॥వీడుగదే॥

### భావామృతం

శ్రీ వేంకటాద్రిపైన నెలకొన్న శేషుడు వీడే కదా! ఆ శేషుడు. వేడుకగా గరుత్మంతునితో పెన్నిధివలె వెలసి యున్నవాడీ ఆదిశేషుడు.

ఈ ఆదిశేషుడు సహస్రఫణి (వేయి పడగలు కలవాడై) యై వెలసియున్నాడు. వజ్రకాంతి సన్నిభుడైన ఈతని మేనిఛాయం నిగనిగలాడు నల్లని నలుపు.శుభ్రముగానున్న ఈతని శిరస్సులపై మాణిక్యములున్నవి. ఏవేళనైనా శ్రీ హరికి నీడవలె తోడై వెళ్ళే రక్షకుడే ఈ శేషుడు.

బంగారము వలె విలువైన ఈ శేషుడు నారాయణునికి పట్టపు వాహనము. చుట్టలు చుట్టుకొని అతిశయించిన ఠీవితోనున్నాడీ ఆదిశేషుడు.రెండు వేల నాలుకలు ఈ ఆదిశేషునికి కుదురుకొని యున్నవి. తప్పక శ్రీహరిని కీర్తించు నేర్పుకలవాడే ఈ ఆదిశేషుడు. ఎప్పుడూ వెంటనుండి ఏ పని చెబుతారోనని కాచుకొని ఉంటాడీ ఆదిశేషుడు. దేవతలందరూ కలసి విష్ణువుని సమీపించు వేళ ముందు మొక్కునదీ శేషునికే.

అదిగో శ్రీవేంకటేశ్వరునకు అలమేలు మంగమ్మకు శీఘ్రమే యే వేళనైనా పాన్పుగానున్న వాడే కదా! ఈ ఆదిశేషుడు.

**1-39**

## మున్నుడి

నానాటి బ్రతుకు నాటకము, మమ్మల్ని ఈ భ్రమలోంచి విముక్తుల్ని చేయమని ప్రార్థించిన అన్నమాచార్యుల వారీ కీర్తనలో ఈ జీవుడు ఇదివరకెందరికి పుట్టాడు? ఎందరిని మోహంలో పడవేశాడు? ఎందరికి చుట్టమయ్యాడు? ఎన్ని పదవులు పొందాడు? వేంకటేశ్వరుని మాయతెలుసు కొనుట సాధ్యమా? అంటున్నారీ కీర్తనలో. అభిమన్యుడి మృతికి రోదిస్తూ తననే నిందించిన అర్జునుడి ఈ'భ్రమ' తొలిగిపోవుటకు శ్రీ కృష్ణపరమాత్మ ఆతనిని దివ్యలోకానికి తీసుకొని పోయి'అభిమన్యుని' చూపించాడట. నాయనా! అని కౌగలించబోతున్న ఆ క్రీడితో 'పోపోవయ్యా నీవెవరు? నేనెవరు' అని భ్రమ తొలగించాడట ఆ కొడుకు.

**ఉ॥ ఎందరికో తనూజుడయి యెందరి తోడనొబుట్టు జీవుడా**
**నందము కంటినీరొసగు ఆవల వేఱొక జన్మమెత్తు తా**
**నెందును వేంకటేశ్వరుని 'ఇచ్ఛ' నెరుంగడు 'మాయ' నేర్వడున్**
**పొందుగ జెప్పెనన్నమయ పూరట నిచ్చెను నాదు బోంట్లకున్**

**రాగం : నాట**

ఎవ్వరెవ్వరి వాడొ యీ జీవుడు చూడ-
నెవ్వరికి నేమౌనొ యీ జీవుడు ॥ఎవ్వరెవ్వరి॥

ఎందరికి కొడుకు గాడీ జీవుడు, వెనుక
కెందరికి దోబుట్టడీ జీవుడు
ఎందరిని భ్రమయించడీ జీవుడు, దుఃఖ
మెందరికి గావింపడీ జీవుడు ॥ఎవ్వరెవ్వరి॥





ఎక్కడెక్కడ దిరుగడీ జీవుడు, వెనుక-
కెక్కడో తన జన్మమీ జీవుడు
ఎక్కడి చుట్టము తనకు నీజీవుడు ఎప్పు
డెక్కడికి నేగునో యీ జీవుడు ॥ఎవ్వరెవ్వరి॥

ఎన్నడును జేటులేనీ జీవుడు, వెనక
కెన్ని తనువులు మోవడీ జీవుడు
ఎన్నగల తిరువేంకటేశు మాయల దగిలి
యెన్ని పదవుల బొందడీ జీవుడు ॥ఎవ్వరెవ్వరి॥

## భావామృతం

జీవుడు ఎవరెవరి వాడో తెలియుట సాధ్యామా? వీడు ఎవ్వరికేమవుతాడో తెలుసుకోగలమా?

ఇదివరలో వీడు ఎంతమందికి కొడుకయ్యాడు? ఎంతమందికి వీడు తోడబుట్టువైనాడు? ఎంతమందిని ఈ జీవుడు నావాడు నాస్వంతం అనే భ్రమలో ముంచి వాడి వియోగంతో దుఃఖ సాగరంలో ముంచాడు?

పూర్వ జన్మలలో ఈ జీవుడు ఎక్కడెక్కడ తిరిగాడో కదా! వీడు ఎక్కడెక్కడ జన్మించాడో? తనకు తానే ఎన్ని విధములుగా చుట్టరికం మారాడో కదా! (తనే మళ్ళీ తనమనుమడికే కూతురైపుడితే తనకు తానేమవుతాడు? ఏమో....) ఈ విధంగా జన్మలలో తిరుగాడి ఎక్కడెక్కడికి పోతాడో? ఎవరికి తెలుసు? అది ఎవరు చెప్పగలరు?

నిజానికి ఈజీవుడికి ఎన్నడూ చేటు (నాశనము) లేదు. వీడు నిత్యుడు. ఎన్నో శరీరాలను ధరిస్తూనే వుంటాడు. సర్వశ్రేష్ఠుడైన తిరుమలనాధుడు శ్రీ వేంకటేశ్వరుని మాయలో చిక్కుకొని ఎన్ని పదవులు పొందాడు? దీనికి అంతు ఉన్నదా?

## 1-40

### మున్నుడి

అత్యంత మధురమైన మంగళగీతిక పాడుతున్న అన్నమాచార్యులను ఆలకించండి. జన్మ చరితార్థమైపోతుంది. నిత్యకళ్యాణ వేదిక తిరుమల. నిత్యపెండ్లి కుమారుడు వేంకటనాథుడు. శ్రీదేవి భూదేవి నిత్యము ఆస్వామి నూతన వధువులే. మన బోటి మానవ మాత్రులకి కనిపించకపోయినా బ్రహ్మాది దేవతలు అఖిల మునీశ్వరులు పరమానందంతో కన్నుల పండువగా వీక్షించే మహోత్సవమది. మన్మధుని తండ్రి మనువు కాబట్టి హారతులీయండి ఓ వనితామణులారా అంటున్నారు అన్నమయ్య.

**కం॥ ఆరతులెత్తుచు తానీ**
**తీరుగనా అన్నమయ్య దేవేరులతో**
**ఊరేగు వేంకటేశుని**
**కోరిక తీరంగ పాడికొలిచెను వినుడీ.**

**రాగం : సురటి**

అంగన లీరె యారతులు
అంగజ గురునకు నారతులు ॥అంగన॥

శ్రీ దేవి తోడుత చెలగుచు నవ్వే
ఆదిమ పురుషుని కారతులు
మేదినీ రమణి మేలము లాడేటి
ఆదిత్య తేజున కారతులు ॥అంగన॥

సురలకు నమృతము సొరిది నొసంగిన
హరికిది వో పసిడారతులు
తరమిది దుష్టుల దనుజుల నడచిన
అరిభయంకరున కారలులు ॥అంగన॥





నిచ్చలు కళ్యాణ నిధియై యేగేటి-
అచ్చుతునకు నివె యారతులు
చొచ్చి శ్రీ వేంకటేశుడు నలమేల్మంగ
యచ్చుగ నిలిచిరి యారతులు ॥అంగన॥

### భావామృతం

ఓ వనితల్లారా! హారతులెత్తండమ్మా! మన్మధునికే తండ్రి అయిన ఈ మహానుభావుడికి హారతులనీయండి.

శ్రీదేవితో ఏదో చలోక్తికి నవ్వుతున్న ఈ ఆదిపురుషునికి హారతుల నీయండి. భూదేవితో సరసములాడుచు దర్శనమిస్తున్న ఈ సూర్యతేజో విరాజితునికి మీరంతా హారతులనీయండి.

దేవతలకు మోహినీ అవతారమున వరుసలో నిలువ జేసి అమృతము పంచి ఇచ్చిన హరికి ఇవే బంగారు హారతులు. దుర్మార్గులైన దానవులను వరుసగా మట్టుబెట్టిన హరికి హారతులివియే.

నిత్య కళ్యాణము జరిపించుకొని ఊరేగు అచ్యుతునికి ఇవే మంగళహారతులు. ఆవిర్భవించిన శ్రీ వేంకటేశ్వరుడు అలిమేలు మంగమ్మ చక్కగా నిలిచియున్నారు. వారికివే కర్పూర నీరాజనములు.

## 1-41

## మున్నుడి

శ్రీ కృష్ణ పరమాత్మ విశ్వరూపమును దివ్య చక్షువులతో మాత్రమే పార్థుడు చూడగలిగాడంటే, మాకే అన్నీ తెలుసుననుకొనే 'ఘనులు' ఇది అభూతకల్పన అని కొట్టిపారేస్తారు. కానీ "నైట్ విజన్ గ్లాసెస్" తో ఆర్మీ వాళ్ళు చీకట్లో చూడగలరంటే 'ఓహో' అంటారు. పరిమిత దృష్టి, పరిమిత వినికిడి, పరిమిత ఘ్రాణ శక్తి గల మానవులకు అపరిమితమైన శక్తి గల సర్వేశ్వరుని చూచే సామర్థ్యం ఉన్నదా? 'రేడియో' తరంగాలు అంతకు మించిన 'ఫ్రీక్వెన్సీ' గల తరంగాలను గ్రహించాలంటే దానికి తగిన 'రిసీవర్' ఉండాలికదా! రేడియోలో దృశ్యం చూడగలమా? రేడియేషన్ కనిపించనంత మాత్రాన లేదా? పరమాత్మపై మనస్సు లగ్నం చేయుటకు భక్తి కావాలి. మనస్సు లగ్నమైతే మన మనోనేత్రానికి ఆ స్వామి మనం 'భావించిన' రూపంలో కనిపిస్తాడు. ఆ రూపం శ్రీ రాముడా, శ్రీ కృష్ణుడా, విఠలుడా, శివుడా, బ్రహ్మ అనేది ఆ భావించే భక్తునిపై ఆధారపడి వుంటుంది. పదియారు సంవత్సరాల ప్రాయంలో పరమాత్మను వేంకటేశ్వరుని రూపంలో దర్శించిన అన్నమయ్య కమలాసనుని (బ్రహ్మ) తో సేవించబడే స్వామిని కనక రత్నకిరీటధారిగా, శంఖచక్రాయుధునిగా కూడా కలలో సాక్షాత్కరింప చేసుకొన్నారు. తిరువేంగటనాథుని అట్లా దర్శించిన అన్నమయ్య తొంబది నాలుగేళ్ళ వాడై స్వామిలో లీనమయ్యేదాకా ముప్పది రెండువేలకు పైగా కీర్తనలు చెప్పారు. మూడింటరెండువంతుల కీర్తనలను మన దురదృష్టం కొలది పోగొట్టుకొన్నాం. మిగిలిన కీర్తనలనన్నా దక్కించుకోవటానికి ఎందరో మహానుభావులు కృషి చేశారు, చేస్తున్నారు, ఇకముందు చేస్తారు....

**చం॥ కలగని వేంకటేశ్వరుని గాంచెను ధన్యుడు అన్నమయ్యతాన్**
**నిలిపెను కైటభాంతకుని నేత్రపు ముంగిట నెంత భాగ్యమో!!**
**నళినిమనోవిభున్ గనుట నా సరి వారలకెట్లు సాధ్యమౌ?**
**చెలువము తోడ పాడి హరి జిత్తమునందున నిల్పుకొందికన్**

**రాగం : బౌళి**

ఇప్పుడిటు కలగంటి నెల్ల లోకములకు-
నప్పడగు తిరువేంకటాధీశు గంటి ॥ఇప్పుడిటు॥





అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుగగ గంటి
చతురాశ్యు పొడగంటి చయ్యన మేలుకొంటి ॥ఇప్పుడిటు॥

కనకరత్న కవాట కాంతు విరుగడ గంటి
ఘనమైన దీపసంఘముల గంటి
అనుపమ మణిమయ మగుకిరీటము గంటి
కనకాంబరము గంటి గ్రక్కున మేలుకొంటి ॥ఇప్పుడిటు॥

అరుదైన శంఖచక్రాదు విరుగడ గంటి
సరిలేని అభయ హస్తమును గంటి
తిరు వేంకటాచలాధిపుని జూడగ గంటి
హరిగంటి గురుగంటి నంతట మేలుకొంటి ॥ఇప్పుడిటు॥

**భావామృతం :**

(కలలో తనకు దివ్యదర్శనమొసగిన శ్రీ వేంకటేశ్వరుని ప్రత్యక్షానుభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమాచార్యుల వారు. ప్రతి పాదంలోను ఆ అనుభూతిని గమనించండి.....) ఇప్పుడు నేనొక దివ్యస్వప్నమునుగాంచితిని. ఆ స్వప్నంలో సమస్తలోకములకు తండ్రియైన పవిత్రమూర్తి శ్రీవేంకటేశ్వరుని దర్శించితిని.

ఆకలలో సర్వశ్రేష్టమైన శేషాచలమును చూచితిని. సరిసమానమనునదేలేని గోపురము యొక్క దివ్యకాంతులను చూచితిని. నూరుకోట్ల సూర్యుల అద్భుత కాంతిగలతేజస్సు నొకదానిని గాంచితిని. చతుర్ముఖుడైన బ్రహ్మను జూచితిని. అంతలోనే చటుక్కున మేలుకొంటిని.

రెండువైపులా రత్నఖచితమైన బంగారు తలుపులను చూచితిని. ఘనమైన దీపసమూహములను దర్శించితిని. సాటిలేని మణులు తాపినకిరీటములను చూచితిని. మేలిమి వస్త్రములను దర్శించితిని. వెంటనే నేను మేలుకొంటిని.

అరుదుగా కాని కనబడని దివ్య శంఖచక్రములను చూచితిని. సాటిలేని అభయహస్తమును దర్శించితిని. ఆ స్వప్నమున తిరుమలనాయకుని జూచితిని. జగద్గురువైన శ్రీహరిని దర్శించితిని. వెంటనే నేను మేలుకొంటిని.

1-42

## మున్నుడి

అన్నమాచార్యుల వారి కొన్ని సంస్కృత సంకీర్తనలు అర్థమైనట్లే కనిబించినా ప్రతి పదార్థం చెప్పమంటే 'తెల్లమొఖం' వేయాల్సిందే. నిష్ణాతులే ఏదో "టూకీగా" అయిందనిపిస్తారు. ఇది నిజం. అటువంటి కోవలోని ఈ సంకీర్తన వినండి. నానా అవస్థలుపడిన తరువాత మాత్రమే దీని భావామృతం ఒక మోస్తరుగా వ్రాయుట సాధ్యపడింది. శ్రీ హరిని కీర్తిస్తున్నారు. ఘోరదానవుల రుధిరసమారాధన జేసిన నారాయణుని శ్రీ వేంకటేశ్వరునిగా కీర్తిస్తున్నారు తాళ్ళపాక గురుదేవులు.

**మ॥ అదిగో విష్ణు సుదర్శనంబు వెడలెన్ అత్యద్భుతంబౌధృతిన్**
**బెదరెన్ గుండెలు దైత్యసంఘములకున్, వేసారుభక్తాళియున్**
**ముదమున్‌బొందిరి,అన్నమయ్యతెలిపెన్‌మోక్షప్రదంబౌకృతిన్**
**ఇదివో వేంకటనాథుడీయ శరణన్ ఏబాధరాబోదురా**

**రాగం : నాట**

మర్ద మర్ద మమ బంధాని
దుర్ధాంత మహా దురితాని ॥మర్ద మర్ద॥

చక్రాయుధ రవిశత తేజోంచిత
సుక్రోధ సహస్ర ప్రముఖా
విక్రమక్రమా విస్ఫులింగకణ
నక్రహరణ హరి నవ్యకరాంకా ॥మర్ద మర్ద॥

కవిలి సుదర్శన కఠిన విదారణ
కులిశ కోటి భవ ఘోషణా
ప్రళయానల సంభ్రమ విభ్రమకర
రళిత దైత్యగళ రక్త వికీరణా ॥మర్ద మర్ద॥





హితకర శ్రీ వేంకటేశ ప్రయుక్త
సతత పరాక్రమ జయంకర
చతురోహం తే శరణం గతోస్మి
ఇతరాన్ విభజ్య ఇహ మాం రక్ష ॥మర్ద మర్ద॥

**భావామృతం :**

ఓ వేంకటేశ్వరా! నా బంధనములను తొలగింపుము. నాఘోరపాతకములను తెగటార్చును.

వందర విబింబముల దివ్య కాంతితో, క్రోధాపూరితమైన వేలకొలది ప్రముఖమౌ అగ్నికీలలు వెలువడుచుండగా మహాపరాక్రమముతో గజేంద్రమోక్షమునుకై మకరము యొక్క తల నుత్తరించిన శ్రీ హరి హస్తమునకే గుర్తుగా నిలిచిన చక్రాయుధ ధారీ! నన్ను రక్షింపుము

జగద్విఖ్యాతమైన సుదర్శన చక్రముచే కోటి వజ్రాయుధములంత కఠినమై, ప్రకటితమైన దానవ సమూహముల నందరినీ చీల్చి ప్రళయాగ్ని వలె ఆశ్చర్యకరమైన భీభత్సము సృష్టించి వారి రక్తమును దశదిశలకు విరజిమ్మిన వాడవైన ఓ తిరుమలేశా! నన్ను రక్షింపుము

హితప్రదాతవైన శ్రీ వేంకటనాయకా! ఎల్లప్పుడు నియోగింపబడెడి నీపరాక్రమము జయప్రదమైనది. నేను నేర్పరినై నీశరణము జొచ్చితిని. నన్ను ఇతరుల వలెనెంచక, రక్షింపుము తండ్రీ!

## 1-43

### మున్నుడి

ఎంతోమంది వాగ్గేయకారులు ఎన్నో రకములైన కీర్తనలు రచించారు. అద్భుతమైన రాగాలతో పాడి మరెందరికో రసస్ఫూర్తి కలిగించి ఆ బాలగోపాలాన్ని ధన్యులనుజేశారు. ఇది అందరూ తెలిసిన విషయమే. అన్నమాచార్యుల వారు భగవద్గీత శ్లోకాలను కీర్తనలో ఉటంకించారు. ఇది ఒక అద్భుతమైన ప్రక్రియ. నభూతో న భవిష్యతి. అసలు అన్నమయ్య కాదు ఆ కీర్తనలు చెప్పేది, వేంకటేశ్వరుడే కృష్ణావతారాన్ని పునరావృతం చేస్తూ అన్నమయ్య ద్వారా మనకు అందిస్తున్నట్లు అనిపిస్తున్నది. దీనినీ విధంగా వివరించడానికి ప్రయత్నం చేయుటం మాత్రం ఆ నామాలయ్య కృపయే.

**ఉ॥ ఇత్తరి గీత బోధనలు ఇంపుగ కీర్తనలందు జెప్పగా**
**ఉత్తమ భక్తితో పొసగు ఊరకె అన్యుల కెట్లు వీలగున్**
**చిత్తమునందు అన్నమయ చిన్నయ మూర్తిని వేంకటేశ్వరున్**
**గుత్తగ నిల్పి ఈ కృతిని కూరిమితో వినిపించెగా భళా!**

**రాగం : బౌళి రామక్రియ**

ఇదివో శ్రుతిమూల-మెదుటనే వున్నది
సరముగా హరి- చాటీ నదివో ॥ఇదివో॥

ఎనసి పుణ్యముసేసి-యేలోకమెక్కిన
మనికై భూమియందు- మగుడ బొడమువే
పొనిగి " యాబ్రహ్మ-భువనాలోకాః
పునరావృత్తి"యనె-బురుషోత్తముడు ॥ఇదివో॥

తటుకున శ్రీహరి-తన్ను నేకొలిచిన
పటుగతితో మోక్ష- పదము సులభమనె
ఘటన "మాముపేత్య తు- కౌంతేయ మమిని
నటన బునర్జన్మ- న విద్యతే" ॥ఇదివో॥





ఇన్నిటా శ్రీ వేంకటేశ్వరు సేవె
పన్నిన గతి నిహ- పరసాధన మదే
మన్నించి యాతడే- "మన్మనా భవ" యని
అన్నిటా నందరి-కానతిచ్చె. గాన ॥ఇదివో॥

### భావామృతం

ఇదిగో సకలవేదముల సారము మీయెట్టయెదుటనే యున్నది. సాదరముగా శ్రీ హరి అవతారమైన శ్రీ కృష్ణుడు నాడు వచించిన గీతావాక్యమే ఇది.

సరిగానెంచి పుణ్యములనాచరించి, మరణానంతరం ఏలోకము జేరినా మరల పుట్టుట మాత్రం భూమిపైననే."యా బ్రహ్మ భువనాల్లోకాః పునరా వర్తినోऽర్జునా" (బ్రహ్మ లోకముతో సహా స్వర్గాది లోకములలో దేనిని పొందినా, మరల జన్మనెత్తుటకు భూలోకమునకు రాక తప్పదు అర్జునా!) అని పురుషోత్తముడైన శ్రీ కృష్ణభగవానుడు గీతావాక్యముగా తెలిపెను.

ఆ శ్రీహరిని నేను (అన్నమయ్య) కొలిచెనంతనే తటాలున ఆయన మోక్షమును సిద్ధింపజేయును. "మాము పేత్యతు కౌంతేయ పునర్జన్మన విద్యతే" (అర్జునా! నన్ను పొందినవానికి ఈ భూమిపై మరల పునర్జన్మ ప్రాప్తించదు) అని ఆ స్వామి పార్థునికి నొక్కివక్కాణించెను.

ఇక వీటన్నిటితో పాటు తిరుమలాధీశుడైన శ్రీ వేంకటేశ్వరుడే ద్వాపరయుగము నాటి ఆ శ్రీ కృష్ణపరమాత్మ అయినందున ఆ స్వామి పాద సేవయే ఇహము పరము రెండిటిని సాధించుటకు సులభోపాయము. ఆనాటి కృష్ణుని వలె ఈ వేంకటరమణుడె "మన్మనాభవ" ( ఓ అర్జునా! నాయందే నీమనస్సును లగ్నం చేసికొనిన వాడవైయుండు) మని క్రీడితో పాటు మనందరికి ఆనతిచ్చెను.

## 1-44

## మున్నుడి

'రామ' అని ఒక్క సారి అంటేనే చేసిన పాపములన్ని తొలగిపోతాయంటారు కదా! రోజుకొక్కసారి 'రామ' అని అనుకొంటే చాలాదా నామ సంకీర్తనలు ఎందుకు అన్నారొక మిత్రులు. రామా అన్న నోటితోనే 'చాలదా?' అని ప్రశ్నించి ఆ పరంధాముని శక్తిని చులకన చేసి ఘోరపాపం చేశాము కదా! ఇట్లా తరిగేవి తరుగుతూనే వున్నాయి, పెరిగేవి పెరుగుతూనే వున్నాయి నిరంతరం రామ నామమే దిక్కు. నాడు తన కోదండంతో దుష్టశిక్షణ చేసిన ఆ రఘుకుల సోముడే నేడు కలియుగ ఆశ్రితరక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు. అదను చిక్కినప్పుడల్లా రామాయణం కీర్తన రూపంలో గానం చేసి మనల్ని పునీతుల గావించిన అన్నమాచార్యుల వారికి మనం సదా ఋణస్థులమే కదా!

**కం॥ రఘుకుల దీపకుడై పలు**
**అఘముల బోద్రోలువాడు అద్రిజనుతుడున్**
**రఘువీరు నన్నమయ్యిటు**
**అఘములు తీర్చేటి వేంకటాధిపుడనియెన్.**

**రాగం : ఆనందభైరవి**

ఈతడు తారక బ్రహ్మమితడు మా దేవుడు
కౌతుకాన చెప్పే వినగదరే వో జనులు ॥ఈతడు॥

రాముడు ఇందీవర శ్యాముడు నానాసార్వ-
భౌముడు షోడశకళా సోముడు
దోమటి రాక్షసులను తుత్తుమురు సేసినాడు
కామిత ఫలములిచ్చి కాచినాడు సురుల ॥ఈతడు॥





పూర్ణుడు నీలముఘవర్ణుడు దానమున వి-
స్తీర్ణుడు వాహన సుపర్ణుడు
ఆర్ణవము దాటి రావణాదుల గెలిచినాడు
నిర్ణయించి చెప్పరాదు నేడీతని మహిమ ॥ఈతడు॥

వరుడు సీతకు పరాత్పరుడు కోదండ దీక్షా
గురుడు దివ్యామోఘ శరుడితడు
నిరతి శ్రీ వేంకటాద్రి నెలవైయుండేటి వాడు
సరి భరత లక్ష్మణ శత్రుఘ్న సహితుడు ॥ఈతడు॥

**భావామృతం**

ఈ శ్రీరామచంద్రుడే మోక్షప్రదాత అయిన పరబ్రహ్మ స్వరూపుడు. ఓ ప్రజలారా! రాముని గుణగణాలు కుతూహలం కలుగునట్లు చెబుతాను, మీరంతా వినండి. ఈ శ్రీ రాముడు నల్లకలువవంటి శరీరఛాయ గలవాడు. అనేక దేశములకు చక్రవర్తి. పదహారుకళలతో విరాజిల్లే చంద్రుని బోలినవాడు. దుర్మార్గులైన దానవులను చిన్నచిన్న ముక్కలుగా ఖండించిన మహావీరుడు. దేవతలు కాంక్షించిన వన్నియునొసగి రక్షించినవాడు.

ఈ దాశరధి పరిపూర్ణకాముడు. నీలమేఘవర్ణుడైన అందగాడు. విస్తారముగా దానములు చేసినవాడు. (పిన తల్లికైకకు రాజ్యదానం నుంచి కాకాసురునికి ప్రాణదానం వరకు ఆయన చేయని దానం ఏమిటుంది?) గరుత్మంతుని వాహనముగా బొందిన నారాయణుడు. శతయోజన విస్తీర్ణమైన ఆర్ణవమును (సముద్రమును) దాటి రావణాసురుని గెలిచినవాడు. ఈ రోజున మనం ఈయన ఘనత ఇంతా అని నిర్ణయించి చెప్పటం అసంభవం.

ఈ రాఘవుడు సీతకు పతిదేవుడు. మనకు మోక్షప్రదాత. దుష్టశిక్షణకు ఎప్పుడూ సిద్ధముగానుంటానని దీక్షితుడై కోదండపాణియై నిలబడినవాడు. అమోఘమైన దివ్యశస్త్రాస్త్రములు కలిగినవాడు. ఆసక్తితో శ్రీ వేంకటాద్రిని తన నెలవుగా చేసికొనిన వేంకటేశ్వరుడే మనకు సీతా భరత లక్ష్మణ శత్రుఘ్న సహితుడై కనిపించుచున్న శ్రీ రామచంద్రుడు.

## 1-45

### మున్నుడి

ప్రసిద్ధనృసింహ క్షేత్రములలో కదిరియొకటి. రాయలసీమ లోని ఈ క్షేత్రాన్ని అలనాడు అన్నమాచార్యుల వారు దర్శించి ఆ స్వామిపై పలు ప్రఖ్యాత కీర్తనలు రచించారు. ఈ జ్వాలానరసింహుడు కాలరుద్రుని వంటి రౌద్ర స్వరూపుడు. దుర్జనభంజనుడైన ఆ నృసింహస్వామి నేటి తిరుమల వేంకటనాధుడై దర్శనమిస్తున్నాడు.

**సీ॥ కదిరి నృసింహుని కమనీయమూర్తిని**
**దీటుగా వర్ణించి తెలిపినారు**
**ఆర్తరక్షకుడైన అసురాంతకుని హరిన్**
**ప్రహ్లాదు బ్రోచిన వరదు గొలిచె**
**పదకవితాపితామహుడు ఈ 'అన్నయ్య'**
**ముక్తిమార్గము జూపి ముందునిలిచె**
**ఎవ్వారిలోనైన ఎనసి వేంకట విభున్**
**దర్శించు భక్తుండు ధన్యుడతడు**

**ఆ.వె॥ అడుగనేల రుచిని గడుసుగా తినుముందె**
**అవధరింపుడిద్ది అమృతమయము**
**దీనినెంత వినిన తనివితీరుట లేదు**
**ఏమి కీర్తనంబు ఎటుల చెబుదు?**

**రాగం :అఠాణ**

కదిరి నృసింహుడు కంభమున వెడలె
విదితముగా సేవింపరో మునులు ॥కదిరి॥

ఫాలలోచనము భయదోగ్రముఖము
జ్వాలామయ కేసరములును
కాలరౌద్ర సంఘటిత దంతములు
హేలాగతి ధరియించుక నిలిచె ॥కదిరి॥





ముడివడు బొమ్మలు ముంచిన ఊర్పులు
గడగడ నదరెటి కటములును
నిడుదనాలుకయు నిక్కుకర్ణములు
అడియాలపు రూపై వెలసె ॥కదిరి॥

సకలాయుధములు సహస్ర భుజములు
వికటన ఖంబులు వెసబూని
వెకలియగుచు శ్రీ వేంకటేశ్వరుడు
ప్రకటపు దుష్టుల భంజించె నిదివో ॥కదిరి॥

**భావామృతం :**

ఈ కదిరి నరసింహస్వామి స్తంభము నుంచి వెలువడి యున్నాడు. ఓ మునులారా! ఆ స్వామిని సుస్పష్టముగా కొలువుడు.

ఈ స్వామిని గమనించండి. నుదుట నేత్రము గల ఈ నృసింహుడు భయమును గొలుపు ఉగ్రమైన ముఖమును కలిగియున్నాడు. అగ్ని జ్వాలలవంటి సింగపుజూలు కలిగియున్నాడు. కాలరుద్రుని వలె కోపముతో పళ్ళునూరు చున్నాడు. తిరస్కార భావము ప్రకటించు కవళికలుగలవాడై ఈ నరసింహుడు నిలిచియున్నాడు.

ఈ స్వామి ముడిపడిన కనుబొమ్మలను కలిగియున్నాడు. గడగడమని అదురుచున్న దవడలను కలిగియున్నాడు. పొడవైన నాలుకతోయున్నాడు. నిక్కబొడుచు కొనియున్న చెవ్వులను కలిగియున్నాడు. ఈ నరసింహుని భీకరాకృతి మరువలేనిదైయున్నది. ఆ విధముగా నృసింహస్వామి వెలసియుండెను.

ఈ నృసింహుడు సమస్తాయుధములు సహస్ర భుజములు కలిగియున్నాడు. ఆయన గోళ్ళువాడిగా వంకరగానున్నవి. దుష్టులను అతిశీఘ్రముగా అశక్తులను చేసి సంహరించు (విరుచు) చున్నాడు. ఈ స్వామియే నేడు శ్రీ వేంకటేశ్వరుడై ప్రకటితమైనాడు.

## 1-46

## మున్నుడి

శృంగార నాయకుడు వేంకటేశ్వరుడు తన దేవేరితో ఏకశయ్యాగతుడై ఉన్నాడు. స్వామి చిలిపి పనులకి శ్రీదేవి

మనస్సులో ఆనందిస్తున్నాపైకి కపట కలహం అభినయిస్తున్నది. అతిశయించిన కదలికలు. (మరి వాగ్యుద్ధంతో పాటు కాళ్ళా వేళ్ళా పడటం తప్పదు కదా!) మంచానికి అలంకారంగా ఏర్పాటుచేసిన బొమ్మ చిలుకలు వారి కీచులాటకి అనుగుణంగా అవీ “కీచు కీచు” మంటున్నాయి. గంధము, పుప్పొడి, ప్రేయసీ ప్రియులు చెమటలు కక్కే మన్మథ రణరంగం. నందకం (స్వామివారి ఖడ్గం) వాటన్నిటినీ గమనించి ఉంటుంది తీరికగా. అందుకే అది అన్నమయ్యగా జన్మించి ఆ రహస్యాలను కీర్తనగా వివరిస్తోంది. ఇతరులకు ఇది సాధ్యమగునా..

**ఆ.వె॥ “కీచుకీచు” మనెడి కేళీ విలాసంబు**
**కన్నులందు నిలిపె నన్నమయ్య**
**వేంకటగిరి విభుని ప్రియురాలి శృంగార**
**మెవరు పాడగలరు యీ విధముగ?**

(ఇక్కడ శ్లేషని గమనించండి. ప్రేయసీ ప్రియులు కీచులాడుకొంటున్నారు. ప్రణయ పరాకాష్ఠలో మంచంపై అమర్చిన చిలుక బొమ్మలు మంచం కదలినప్పుడల్లా “కీచుకీచు” మంటున్నాయి. ఔరా!!)

**రాగం : హిందోళ**

జగడపు చనవుల జాజర
సగినల మంచపు జాజర ॥జగడపు॥

మొల్లలు తురుమున ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున
జల్లన పుప్పొడి జారగ పతిపై
చల్లే రతివలు జాజర ॥జగడపు॥





భారపు కుచముల పైపై కదు సిం
గారము నెరపెటి గందవొడి
చేరువపతిపై చిందగ పడతులు
సారెకు చల్లేరు జాజర ॥జగడపు॥

బింకపు కూటమి పెనగేటి చెమటలు
పంకపు పూతల పరిమళము
వేంకటపతిపై వెలదులు నించేరు
సంకుమదంబుల జాజర ॥జగడపు॥

**భావామృతం**

శ్రీవేంకటేశ్వరుడు తన మనోహరి అలివేలుమంగతో ప్రణయ కలహం తరువాత తనకేళీ విలాపం చూపుతున్నారు. ఇక అక్కడ జగడపు చనువులే (ప్రణయ కలహములే). అదికూడా కపట కలహమే (జాజర). కీచుకీచుమనే మంచం (చిలుకబొమ్మలు కీచుకీచు మంటున్నాయట!!) మీద జాజర.

ఆమె కొప్పులో ముడిచిన మొల్లలు బరువుగా వ్రేలాడుచున్నవి. అధికమైన సరస సల్లాపముచే పుప్పొడిని శ్రీపతిపై చల్లగా అది జారి వేంకటపతి మేనిపై అలుముకొన్నది. ఇట్లు స్వామి చెంతనున్న అతివలు ఆ జాజరలో తామూ పాలుపంచుకొంటున్నారు.

శ్రీదేవి భారమైన స్తనయుగళంపైపైన గంధపు పొడిని శృంగారమందు వెదజల్లుచుండగా ఆమెపతికి చేరువయైనది. ఆ సమయంలో ఆమె చెలికత్తియలు శ్రీపతిపై కూడ మాటిమాటికీ గంధపు పొడిని జల్లుచుండిరి. జాజర జరుగుచునే యున్నది.

స్వామి బిగువైన ఆలింగనమున శ్రీరమణి పెనగులాడుచున్నది. చెమట అధికమై చిత్తడిగా మారినది. చందనం వంటి మేనిపూతులు, మృగమదము (జవ్వాది) వంటి సుగంధ భరితమై పూతల వలన శోభిల్లునట్లుగా శ్రీవేంకటపతిపై నింపుచున్నారు. ఆహా! అక్కడ రమణీయమైన జాజర జరుగుచున్నది.

1-47

## మున్నుడి

తొల్లి, శృంగార కీర్తనలో అంత రసస్ఫూర్తి చూపించిన అన్నమాచార్యులు ఈ కీర్తనలో వైరాగ్యం ప్రస్ఫుటింప జేస్తున్నారు. కాంతా, కాంచనములపై వ్యామోహం పోనిదే వైరాగ్యం సిద్ధించదు. ఆడదాని అందం బహు స్వల్పకాలపరిమితి కలది. ఇక ఆమె ఇచ్చే సుఖం ఎండమావిలాంటిది. ఆ సుఖం కోసం నరుడు వెంపర్లాడితే మృగతృష్ణలో నీరు త్రాగుదాం అనుకొనేవాడికి పట్టే గతియే పడుతుంది. తప్పదు. ఇక ధనం సంగతి ఆలోచిస్తే కలలో ఎంత సిరిలభించినా లాభమేముంది? కలలాంటిదే కదా! జీవితం. అందుకే శ్రీవేంకటేశ్వరుని శరణువేడితే సుఖం కదా!!

**చం॥ నెలతలపైన మోహముల నిత్యము దూరము సేయు జ్ఞానమున్**
**నిలువని యెండమావులవి నెమ్మదిగూల్చుమరింత దుఃఖమౌ**
**కలిమి లభించి స్వప్నమున కల్గునె లాభము? వేంకటేశ్వరున్**
**కొలువుదు అన్నమయ్యనెను గొప్ప నిజంబును ఆలపించెతాన్.**

**రాగం : రేవతి**

ఏడవలపేడ మచ్చికేడ సుద్దులు
ఆడుకొన్న మాటలెల్ల నవి నిజాలా ॥ఏడ వలపేడ॥

తొలుకారు మెఱపులు తోచి పోవుగాక
నెలకొని మింటనవి నిలిచీనా
పొలతుల వలపులు పొలసిపోవుగాక
కలకాలంబవి కడతేరీనా ॥ఏడ వలపేడ॥

యెండమావులు చూడ నేరులై పారుగాక
అండకు పోవ దాహమణగీనా
నిండినట్టి మోహము నెలతలమది చూడ
వుండినట్టే వుండుగాక వూతయ్యీనా ॥ఏడ వలపేడ॥





కలలోని సిరులెల్ల కనుకూర్కులేకాక
మెలకువ చూడనవి మెరసీనా
అలివేణుల మేలు ఆసపాటే కాక
తలపు వేంకటపతి తగిలీనా ॥ఏడ వలపేడ॥

## భావామృతం

ఈ ప్రపంచంలో 'ప్రేమ', 'మాలిమి', 'ఆత్మీయత' వంటివి ఉత్తిమాటలు. అవన్నీ నిజాలా? అలా భ్రమపడవచ్చునా?

తొలకరిలో కనిపించే మెరుపుల కాలపరిమితి ఎంత? క్షణంలో మాయమై పోతాయి కదా? ఆకాశంలో అవి ఆ మెరుపులు స్థిరంగా ఉంటాయా? స్త్రీల అనురాగం కలకాలం ఉంటుందా? అవన్నీ త్వరలో మరలిపోయే వలపులేకదా!

ఎండమావుల్ని గమనించండి. ఏరులు పారినట్లు అనిపించి భ్రమకలిగిస్తుంది. దాన్ని ఆశ్రయించి దాహం తీర్చుకొందాం అనుకొంటే జరిగే పనేనా? ఆడువారి మనస్సులలో నీపై మోహం వున్నట్లు భ్రమ కలుగుతుందేకాని వారి ప్రేమ నిజమా? నీకు తోడుగా వుంటుందా?

స్వప్నంలో కనిపించే సంపదలన్నీ నిద్రలోవేగానీ మేలుకుంటే నీవెంట ఉండి మెరుస్తాయా? వనితల వలన కలిగే మేలుపై అపేక్ష పడుటయే కాని వారి సాంగత్యంలో వేంకటేశ్వరునిపై మనస్సు నిలకడగా వుంటుందా? ఉండదు.

1-48

## మున్నుడి

తీయటి తేనె పలుకులతో పతిని, వేంకటపతిని మురిపించి స్వామి ఆలింగనంలో అలిసిపోయి ఆ తల్లి నిదురలోకి జారుకొన్నది. పరవశించి శయనించుచున్న అలమేలు మంగమ్మ కలికి తనమును వర్ణించటం, పదకవితా పితామహుడు అన్నమయ్యకు గాక ఇతరులకు సాధ్యమయ్యే పనేనా? తిరుమలేశుని సేవలో జీవితం పండించుకొన్నారు అన్నమయ్య. అలమేలు మంగమ్మకోసం పాడిన ఈ కీర్తనలో మంగమ్మను జీవాత్మగా వేంకటనాధుని పరమాత్మగా వారి కలయికే ముక్తిగా భావిస్తున్నారు, కొంతమంది భక్తులు, జ్ఞానులు.

**ఉ॥ వేంకటనాధుడున్ గవయ భీతహరేక్షణ మంగమాంబయున్**
**సంకట మెల్లదీరి యట శయ్యను జేరెను పవ్వళించనై**
**జంకు యొకింత లేక బహుశ్రావ్యముగా యిటు అన్నమయ్యయున్**
**అంకిత భావనా పటిమ అద్భుత కీర్తన నాలపించె తాన్**

**రాగం : అభేరి**

పలుకు తేనెల తల్లి పవళించెను
కలికి తనముల విభుని కలసినదిగాన ॥పలుకు॥

నిగనిగని మోముపై నెఱులు గెలకుల చెదర
పగలైనదాక చెలి పవళించెను
తెగని పరిణతులతో తెల్లవారినదాక
జగదేకపతి మనసు జట్టిగొనె గాన ॥పలుకు॥

కొంగు జాతిన మెఱుగు గుబ్బలొలయగ తరుణి
బంగారు మేడపై పవళించెను
చెంగలువ కనుగొనల సింగారములు దొలక
అంగజగురునితోడ అలసినది గాన ॥పలుకు॥





మురిపెంపు నటనతో ముత్యాల మలగుపై
పరవశంబున తరుణి పవళించెను
తిరువేంకటాచలాధిపుని కౌగిట గలసి
అరవిరై నును చెమట నంటినదిగాన ॥పలుకు॥

## భావామృతం

తేనెలూరు తీయని పలుకులు మాట్లాడే అలవేలు మంగమ్మ తల్లి నిదురించుచున్నది. స్త్రీకి పరిపూర్ణత్వమును కలిగించే పతితో రతిపై ఆసక్తి కలిగిన ఆమె తన వల్లభునితో సంగమించినది.

నిగనిగమని ప్రకాశించు ముఖముపై ముంగురులు చెదిరి ఆడుచున్నవి. పగలైపోయినా ఆమె పవళించియే ఉన్నది. అంతులేని ప్రావీణ్యముతో ఆ తల్లి, జగదీశ్వరుడైన తన పతి మనసును ఆకట్టుకొని యున్నది. కావున బడలి శయనించుచున్నది.

ఆమె పయ్యెద స్థాన భ్రంశమునందగా మెఱయు స్తనయుగ్మము విస్తరించి యున్నవి. ఆ భామామణి బంగారపు మేడపై నిదురించుచున్నది. ఎఱ్ఱ కలువల వంటి సోగ కన్నులలో శృంగారం అతిశయించి ఆమె మదనుని జనకునితో మన్మధ యుద్ధమున అలిసిపోయియున్నది. అందుచే ఆ తల్లి నిదురించుచున్నది.

మురిపెము లొలుకు అభినయం చూపిన ఆ తల్లి ముత్యాల హంసతూలికా తల్పంపై పరవశురాలై పవ్వళించి యున్నది. తిరుమలాధీశుడైన శ్రీవేంకటపతి కౌగిటిలో కరిగిపోయిన ఆ తల్లి అరవిచ్చిన మొగ్గవలె చిరుచెమటలు కమ్మి శయనించుచున్నది.

## 1-49

## మున్నుడి

"సువ్వి" అనేది ఒక ఊతపదం. నిజానికి దీనికి అర్థం లేదు. రోకలితో రోటిలో ధాన్యం దంచేటప్పుడు (పెండ్లి పనులలోనూ) స్త్రీలు ఆయాసం తీరుటకు 'సువ్వి' అని అంటూ పోటు వేస్తారు. అట్లాగే 'సువ్వాలమ్మ' అంటే 'సువ్వాల అమ్మా'! అనే పదవిశేషము. 'సువ్వాల' అంటే సువ్వి+ ఆలతికి రూపాంతరం. 'ఆలతి' అంటే ఆలాపన అని అర్థం. 'సువ్వాలమ్మ' అంటే ఓ అమ్మా! సువ్వి అని ఆలాపన చేద్దాం అని అర్థం. ధాన్యం దంచే ఆడంగుల కోసం అన్నమాచార్యులు అల్లిన అద్భుత కీర్తన ఇది. 'శుద్ధ ధన్యాసి' రాగంలో ధాన్యం దంచేవారి నోటి గుండా భగవన్నామ సంకీర్తనం చేయించటం అన్నమయ్యకు గాక ఇంకెవరికి సాధ్యం?

**ఆ.వె॥ 'సువ్వి సువ్వి' యనుచు సొక్కు దీరగ పాడి**
**వనితలెల్ల 'దంచు' వారె తొల్లి**
**హరిని గొలిచినాడు అన్నమయ్యయు 'నాడు'**
**సువ్వి పాటలెంచి చూడరయ్య!**

**రాగం : శుద్ధధన్యాసి**

సువ్వి సువ్వి సువ్వాలమ్మా
నవ్వుచు దేవకి నందనుని గనియె ॥సువ్వి సువ్వి॥

శశివొడచె అలసంబులు గడిచె
దివి దేవతల దిగుళ్ళు విడిచె ॥సువ్వి సువ్వి॥

కావిరి విరిసె కంసుడు గినిసె
వావిరి పువ్వుల వానలు గురిసె ॥సువ్వి సువ్వి॥

గతిసేసె అటుగాడిద గూసె
కుతిల కుడిచి జనకుడు నోరు మూసె ॥సువ్వి సువ్వి॥





గగురు పొడిచె లోకము విధి విడిచె
మొగులు గురియగ యమునపై నడచె ॥సువ్వి సువ్వి॥

కలిజారె వేంకటపతి మీరె
అలవేల్మంగ నాంచారమ్మ కలుకలు తీరె ॥సువ్వి సువ్వి॥

## భావామృతం

ఓ అమ్మలారా! సువ్వి..సువ్వి..సువ్వి అని రాగం ఆలపించండి. తనకి జన్మించిన అద్భుతమైన శిశువును కనిన దేవకీదేవి మురిసిపోయింది.

(అష్టమినాటి) చంద్రుడు పొడచూపుతున్నాడు. అందరి కష్టములు తీరనున్నాయి. స్వర్గంలోనున్న దేవతలంతా విచారం విడనాడారు.

చీకట్లు కమ్ముకొన్నాయి. కంసుడు ఆగ్రహంతో మండి పడుతున్నాడు. కుంభవృష్టిగా పుష్ప వర్షం కురిసింది.

ఇంతలో ఒక గాడిద (గార్ధభాసురుడు) అక్కడకు వచ్చింది. జరుగబోవు అనర్థం గ్రహించిన తండ్రి (వసుదేవుడు) బాధపడి దానినోరుమూసి అర్థించాడు.

గగురుపాటు కలిగించే సంఘటనలు జరిగిలోకంలో అన్నీ గతి తప్పినట్లయింది. పుష్పవర్షము కురిసింది. వసుదేవుడు శిశువుగానున్న కృష్ణుని తలపై నిడుకొని దారి ఇచ్చిన యమునా నదిని దాటాడు.

కలియుగం వచ్చేసింది. వేంకటేశ్వరుడు వెలిశాడు. అలమేలు మంగ నాంచారమ్మకు కోపాలు తగ్గిపోయాయి.

## 1-50

### మున్నుడి

అన్నమాచార్యులవారిని మించిన 'అభ్యుదయ వాది' కాగడాలేసుకొని వెతికినా కానరాడుగాక! కానరాడు. సృష్టిలో ఏ ప్రాణికీ లేని ఈ వివక్షత అహంకారం వల్ల వచ్చిందే కదా! చీమ నుంచి ఏనుగుదాకా ఏ జంతువునకు గాని, పిచ్చుక నుంచి గండభేరుండ పక్షిదాకా ఏ పక్షికి గాని చిన్న చేపనుంచి తిమింగలం వరకు ఏ జలచరమునకు గాని లేని వివక్షత మనిషి అని పిలువబడే ఈ జీవికుంది. ఈ మనిషి ద్విపాద పశువు. వీడికి తన కులం అంటే పిచ్చి, మతం అంటే పిచ్చి, తన జాతీయత అంటే పిచ్చి. ధనం అంటే వ్యామోహం, స్త్రీ అంటే వ్యామోహం తన స్వంతం అనుకున్న వాటన్నిటిపై మమకారం. తనవి కానివాటిపై ఆశ. తనకి కాకుండా చేసిన వారిపై కోపం. అన్నీ తనవే కావాలనే లోభం. పరాయి వాటిపై వ్యామోహం. అన్నీ తనవైతే మదం. తనవి కాకపోతే మత్సరం. తనకి దక్కంది ఏదీ ఇంకొకరికి దక్కరాదంటాడు.

వీడికి నిన్న ఏమయిందో గుర్తుండదు. రేపు ఏం జరుగుతుందో తెలియదు. వీడు 'నాది' అనుకొనేది ఏదీ వీడిది కాదు. ఎవ్వరూ వీడితో కలిసి జన్మించలేదు. రేపు వీడితో కలిసి చావరు. నిద్ర, భయం, సుఖం ఆహారం వాడివి వాడికేగాని ఎవ్వరూ వాడి బదులు అనుభవించలేరు. పోనీ ఆ అనుభవించేవైనా అపరిమితమా అంటే కాదు. పొట్టపట్టిందాక తింటాడు. తరువాత తినలేడు. వరుసగా పది రోజులు నిద్రా పోలేడు. జీవితం క్షణ భంగురం అని తెలిసినా వ్యామోహాన్ని వదులుకోలేడు.

అందరి నిద్రా ఒకటే. రాజు అదే నిద్రపోతాడు. బంటూ అదే నిద్రపోతాడు. ఎండవాన వంటి ప్రకృతికి మనుష్యులపైన కాని ఇతర ప్రాణులపైన కాని వివక్షత ఉంటుందా? అలాగే భగవంతునికి కూడా జాతి మతకులభేదాలతో పనిలేదు. ఆయనకి మన భక్తియే ప్రధానం.

సృష్టి స్థితి లయలను నిర్వహించే పరమాత్మయే బ్రహ్మము. ఆ బ్రహ్మము ఏకము, అనేకం కాదు. అదే పరబ్రహ్మము. అది పూర్ణము, స్వాతంత్ర్యము, సర్వసమర్థము. దాని గురించి ఎంత చెప్పినా చాలదు. పరబ్రహ్మ సాకార రూపమే శ్రీవేంకటేశ్వరుడు. ఇక ఈ కీర్తన నెన్నుకొనటానికి ముఖ్యకారణం అన్నమయ్య





అభ్యుదయ వాది అని మానవులలో మానవత్వమే వాంఛనీయమని ఆయన నమ్మకమని ఆయన ఆరాధకుల నమ్మకం.

అయితే ఆదృక్పథం కలిగించే అంతర్యామి వేరెవరో కాదు స్వయంగా ఆ శ్రీవేంకటేశ్వరుడే. జనబాహుళ్యాన్ని ఆ రోజుల్లో హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, పురాణ కాలక్షేపాలు అలరించేవి. బుర్రకథలు దైవకథలు కాక చారిత్రాత్మక గాథల నెన్నుకొని జనులలో దేశభక్తి సాంఘిక దృక్పథం పెంపొందింప చేశాయి. బుర్రకథ గానం చేసి చెప్పే సూత్రధారి, కథకుడు ఒకరుంటారు. వారికి సహాయకులుగా 'తాన' అంటే 'తందాన' అంటూ ఇద్దరు వంతపాటగాళ్లుంటారు. వారు కథ చెప్పరు గాని కథలో మధ్యమధ్య సందేహాలు వెలిబుచ్చుతూ, బలే, భళానంటి భాయ్ తందానా, అని ఉత్సాహ పరుస్తుంటారు. పురే! అహి! భళా! అనే మాటలు తరచు వాడుతూ కథకుని ఉత్సాహ పరుస్తుంటారు. ఈ కీర్తన అట్టడుగున ఉండి సాంఘికంగా అణగ ద్రొక్కబడుచున్న వారికోసం అన్నమయ్య గానం చేసిన కీర్తన అని మనం భావించవచ్చును.

ప్రతి ప్రాణికి అంతరాత్మ ఎవరు? ఆ శ్రీవేంకటేశ్వరుడే కదా! మరి ఒకరి గొప్ప ఒకరి తక్కువేమిటి. సూర్యుడి ఎండ ఒకరి మీద ఎక్కువగా ఒకరిమీద తక్కువగా పడుతుందా? ధనికుని నిద్ర బీదవాడినిద్ర ఒకటే వేరుకాదు. అన్ని కులాలవారూ భూమికి స్వంత దారులే. పీల్చేగాలికి త్రాగే నీటికి చూసే సూర్యకాంతికి జాతి కులమత విచక్షణ వుందా? కుక్కమీదకాచే ఎండ ఏనుగుమీద కాచే ఎండ ఒక్కటే కదా! ఆ వేంకటేశ్వరుడు పాపులను పుణ్యులను అందరినీ ఒకేలా చూస్తాడు. అంటే హత్యచేసిన వాణ్ణీ, అబద్ధం చెప్పిన వాణ్ణి ఒకేలా చూస్తాడు అనికాదు. రాజుగారి కొడుకు హత్యచేసినా బంటు కొడుకు హత్యచేసినా ఒకే శిక్ష వేస్తాడని (నేటి న్యాయాధి పతుల్లా కాక..) అన్నమాచార్యులవారి ఉద్దేశ్యం. అదే "భావయామి వేంకటేశం" సర్వం అనుకొనేవాడి ఆలోచన.

**మత్తకోకిల :**

**ఒక్కడే పర(బ్రహ్మ మానవ తొక్కటే పరమంబనెన్**
**చక్కనైన సుబోధ జేసెను సద్గురుడు తానాయెరా**
**లెక్కసేయకుడన్నమయ్యనె "రేడు" గాని మరెవ్వనిన్**
**దిక్కు వేంకటనాయకుండనె దీర్చిలోకములందునన్**

**రాగం : బౌళి**

తందనాన ఆహి తందనాన పురే తందనాన భళా తందనాన
(బ్రహ్మమొక్కటే పర(బ్రహ్మమొక్కటే పర(బ్రహ్మమొక్కటే పర(బ్రహ్మమొక్కటే ॥తందనాన॥

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకులమంతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తందనాన॥

నిండారు రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన (బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
చండాలుండేటి సరిభూమి యొకటే ॥తందనాన॥

కడగి యేనుగుమీద కాయు యెండొకటే
పుడమి శునకము మీద పొలయు యెండొకటే
కడుపుణ్యులను పాప కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే ॥తందనాన॥

**భావామృతం**

'అహి' అనే పదమే నేటి కాలంలో 'ఆహా!' అయింది. 'భళా' ఆవిధంగా నేడు 'భలే' అయింది. 'పురే' నేటికాలంలో 'ఒరే' అయింది (వార్నీ!) 'తందాన' నేటికాలంలో





'తందాన' అయింది. కానీ ఏకాలంలోనైనా అధికారం ఉన్నవాడు 'తందాన' అంటే వాడికి వంతపాడే వాళ్లు మాత్రం 'తానతందనాన' అని 'వత్తాసు' పలుకుతూనే వున్నారు. ఇక భావామృతంలోకి వద్దాం.

తందనాన అహి, తందనానపురే, తందనాన భళా, తందనాన. (బ్రహ్మమనేది ఏకము, అద్వితీయము. అదే పర(బ్రహ్మము. పర(బ్రహ్మమొక్కటే అని తెలియండి.

తెలిసికొంటే ఈ సృష్టిలో హీనమైనది, అధికమైనది అనేవే లేవు. అందరిలోను అంతరాత్మ రూపమున ఆ శ్రీహరియే ఉన్నాడు. ఇక్కడ అందరిదీ జంతువుల కులమే. (మనం మానవులు అనే ద్విపాద పశువులం కదా!) అందరికీ ఆ శ్రీమన్నారాయణుడే అంతరాత్మ.

సంపూర్ణంగా నిద్రించే రాజుగారి నిద్రయు, అక్కడనే నేలపై పడుకొని నిద్రపోయే బంటుయొక్క నిద్రయు ఒకే విధముగా నుండును. అదే విధంగా అగ్రకులస్థుడైన (బ్రాహ్మణుడు నివసించే భూమికి నిమ్నజాతివానికి నివాసయోగ్యమైన భూమికి వ్యత్యాసమేమన్నా వుంటుందా? ఉండదుగాక ఉండదు.

పనివడి ఒక ఏనుగుమీద కాయునట్టి ఎండ అయినా భూమ్మీద పడివుండే కుక్కమీద కాయునట్టి ఎండయినా ఒక్కటే కదా! అధికముగా పుణ్యము చేసినవారినైనా పాపాత్ములనైనా సమానముగా కరుణించేటందుకు సిద్ధపడే ఆ శ్రీవేంకటేశ్వరుని నామము కూడ ఒక్కటే. (ఇక్కడ పుణ్యులు అంటే పుణ్యకార్యాలు చేసిన వారు మాత్రమే. వారు వేంకటేశ్వరుని భక్తులు కానక్కరలేదు. ఆయన భక్తులు గీతలో చెప్పినట్లు ఆ స్వామి కెప్పుడూ (ప్రియులే)

## 1-51

### మున్నుడి

అజరామరమైన అన్నమయ్య అద్భుతకీర్తన ఇది. శ్రీ మన్నారాయణుని గుణగాన సంకీర్తన కన్న మోక్షసాధన మింకొకటి ఈ కలియుగంలో లేదు.ఎన్ని సార్లు పాడినా తనివితీరని అమృతవర్షిణి, ఈ పాట. శ్రమపడి రామాయణ భాగవతాది గ్రంధాలను పఠించ వలసిన పని లేదు. యమ, నియమాది యోగసాధనలు అక్కరలేదు. సన్యసించి తపస్సు చేయవలసిన పని అసలే లేదు. నిద్రపోయేముందు ఈ కీర్తన పల్లవి భక్తితో పాడుకోండి ఆ శ్రీ వేంకటేశ్వరుడు కావలి ఉండి మరీ మిమ్ము రక్షిస్తాడు. ఇది సత్యం.

**కం॥ కోరిక తీరగ శ్రీమ**
**న్నారాయణు శరణు వేడి నళినీకాంతున్**
**నీరజనాభుని వేంకట**
**శ్రీరమణున్ అన్నమయ్య సేవించె తమిన్**

**రాగం : బౌళి**

శ్రీ మన్నారాయణ శ్రీ మన్నారాయణ
శ్రీ మన్నారాయణనీ శ్రీ పాదమే శరణు ॥శ్రీ మన్నారాయణ॥

కమలా సతీముఖకమల కమలహిత
కమల ప్రియ కమలేక్షణ
కమలాసనహిత గరుడగమన శ్రీ
కమలనాభనీ పదకమలమే శరణు ॥శ్రీ మన్నారాయణ॥

పరమయోగి జన భాగధేయ శ్రీ
పరమపురుష పరాత్పరా
పరమాత్మా పరమాణురూప శ్రీ
తిరువేంకటగిరిదేవా శరణు ॥ శ్రీ మన్నారాయణ॥





**భావామృతం :**

ఓ శ్రీ మన్నారాయణా శ్రీ మన్నారాయణా శ్రీ మన్నారాయణా మాకు మంగళకరమైన నీ యొక్క పాద పద్మములే శరణు.

లక్ష్మీదేవి ముఖకమలమునకు సూర్య భగవానునివలె ఆనందమొసగు వాడవు. పద్మములను ప్రీతితో హస్తమున ధరించువాడవు. తామరలవంటి కన్నులుగలవాడవు. కమలాసనుడైన బ్రహ్మదేవునకు మేలు చేయు తండ్రివి. గరుత్మంతునధిరోహించి సంచరించువాడవు. పద్మనాభుడవు. అట్టి నీ పాదపద్మములే మాకుశరణము.

పరమయోగులైన వారికి భాగ్యప్రదాతవు. పరమపురుషుడవు. శ్రేష్ఠుల కందరికీ శ్రేష్ఠుడవు. పరమాత్మవు. ఉత్కృష్టము మరియు అణురూపము కూడ ధరించువాడవు. అట్టి తిరువేంకటాద్రి నాయకా! నీకు శరణు. నాకే శరణు, శరణు.

**1-52**

## మున్నుడి

అత్యంత సరళమైన ఈ కీర్తనకు భావం వ్రాయాల్సిన అవసరం నిజానికి లేదు. ఒకటి రెండు చోట్ల కొరుకుడు పడని మాటలు వున్నా అవి భావాన్ని అర్థం చేసుకొనుటకు అడ్డంకావు. మరి ఈ కీర్తననేల ఇక్కడ వివరించానంటే 'రేవతి' రాగంలోని ఈ కృతి కర్ణపేయంగా వుంటుంది. అందుకని దీన్ని ఎన్నుకొన్నాను. స్వామిని త్రిదశవంద్యుడు అన్నారు అన్నమయ్య. త్రిదశులు అంటే దేవతలు. ఎందుకంటే వాళ్ళకి మనలాగా నాలుగోదశ వృద్ధాప్యం, అంతిమ దశ మరణంలేవట. మూడే దశలు కలవాళ్ళు. ఆ పదం వాడటం తాళ్ళపాక వారికే చెల్లింది.

**ఉ॥ ఎవ్వని వేదముల్ వెదకు నెవ్వని గొల్తురు పితృదేకతల్**
**ఎవ్వని వేడుకొందురిల ఈడుగతించిన వృద్ధులందరున్**
**ఎవ్వని పూజలన్ సురులు ఇంద్రుడు చేగొనె? శ్రీనివాసున్**
**రవ్వల వంటి కీర్తనల లావుగ మ్రొక్కెను అన్నమయ్యయున్.**

**రాగం : రేవతి**

వేదంబెవ్వని వెదకెడిని
ఆ దేవుని కొనియాడుడీ ॥వేదం॥

అలరిన చైతనాత్మకు డెవ్వడు
కలడెవ్వడెచట కలడనిన
తలతురెవ్వనిని తను వియోగదశ
యిల నాతని భజియించుడీ ॥వేదం॥

కడగి సకలరక్షకుండిం దెవ్వడు
వడి నింతయు నెవ్వనిమయము
పిడికిట తృప్తులు పితరులెవ్వనిని
తడవిన ఘనుడాతని కనుడీ ॥వేదం॥





కదిసి సకల లోకంబుల వారలు
యిదివో కొలిచెద రెవ్వనిని
త్రిదశ వంద్యుడగు తిరువేంకటపతి
వెదకి వెదకి సేవించుడీ ॥వేదం॥

**భావామృతం :**

వేదము భారతీయ తత్వజ్ఞానమునకు ప్రమాణము. ఆవేదము ఎవరిని కనుగొనుటకుయత్నించుచున్నది? ఆ వేదములు కనుగొనుటకు యత్నించుచున్న పరమాత్మను మీరందరు కీర్తంచండి.

జీవులందరిలోను చేతన కారుకుడైన చేతనాత్మకుడుఎవ్వవు? ఆయన ఎక్కడనున్నాడు. ఏమి సమాధానమీయగలము? తాము తుదిశ్వాస విడుచునప్పుడు ఎవనిని స్మరించుటకు మానవులందరూ యత్నింతురు? ఆ పరమాత్ముని నేను భజియించెదును.

సకల లోకములకు ఏకైక రక్షకుడు ఎవ్వరు? సృష్టి అంతా ఎవ్వనిమయమై యున్నది? పితృదేవతలందరూ అనురాగముతో తాకబడి ఎవని చేత తృప్తి పరుచబడుచున్నారు? ఘనుడైన ఆ మహానుభావుని దర్శించండి.

సమీపించి ఎల్లలోకములవారు పూజించునదెవ్వరిని? త్రిదశలు మాత్మమే (బాల్యము, యౌవనము, కౌమారము అను మూడు దశలు మాత్రమే) గల దేవతలచే నుతించబడుచున్న శ్రీ వేంకటేశ్వరుని! వెదకి కనుగొని సేవించండి

ఓ ప్రజలార ఆవిధంగా అందరూ ధన్యులవండి.

## 1-53

## మున్నుడి

ఈ కలియుగం ఎట్లాపోతేనాకేం? నాకు నీ నామము, నీ శరణాగతి, నీ భక్తి, నీ దేవేరి శ్రీ లక్ష్మీ కరణ వున్నాయి. అవి చాలు నాకు అంటున్నారు అన్నమయ్య. ఔరా! అసలు ఎవరికి మాత్రం అంతకన్నా ఏం కావాలి? వెనుకటికొక గడుసరి దేవుణ్ణి ఒకే కోరిక కోరాడట నేను తలచుకొన్నప్పుడు నాకు ప్రత్యక్షమై నాక్కావాల్సిందియ్యి స్వామీ! అని. వాడిలా కాక మనం అన్నమాచార్యులవారిలాగా భక్తి, నామము, శరణము, అమ్మవారి దయ కోరుకోవాలి. అప్పుడు సర్వమూ సిద్ధిస్తాయి. వేంకటరమణుడే మన అరిషడ్వర్గాలను కర్మబంధాలను నివారిస్తాడు.

**చం॥ కలియుగ దోషముల్ మనిషి కన్నులు మూయు నధర్మవర్తనన్**
**నిలుపును, చిత్తమందు హరి నీరజనాభుని ధ్యాసమాన్పు,తా**
**నని వివరంబు నిచ్చి ఘనుడైన కవీంద్రుడు 'అన్నమార్య' దున్**
**తను మన వేంకటేశ్వరుడె'దారి' యనెన్ యిటు చెప్పెకీర్తనన్**

**రాగం : మాళవగౌళ**

కలియుగమెటులైన-గలదుగా నీకరుణ
జలజాక్ష హరిహరి-సర్వేశ్వరా ॥కలియుగ॥

పాపమెంత గలిగిన-బరిహరించే యందుకు
నాపాల గలదుగా నీ- నామము
కోపమెంత గలిగిన- కొచ్చి శాంత మిచ్చుటకు
చేపట్టి కలవుగా నా- చిత్తములో నీవు ॥కలియుగ॥





ధర నింద్రియాలెంత-తరముకాడిన నన్ను
సరిగావ గద్దుగా నీ-శరణాగతి
గరిమ కర్మబంధాలు-గట్టిన తాళ్ళు వూడించ
నిరతి గలదుగా-నీ భక్తి నాకు ॥కలియుగ॥

హితమైన యిహపరా-లిష్టమైన వెల్లా నియ్య
సతమైన కలదుగా నీ-సంకీర్తన
తతి శ్రీ వేంకటేశ నా-తపము ఫలియింపించ
గతి కలదుగానీ-కమలాదేవి ॥కలియుగ॥

**భావామృతం :**

ఓ సర్వేశ్వరా! ఈ కలియుగం ఎంతదోషభూయిష్టంగా వుంటే మాత్రం నాకేం నష్టం? నాకు నీ కరుణ వున్నది కదా! పద్మనయనా! శ్రీ హరీ నాకది చాలును.

నాపాపము లెంతవున్నా వాటిని నివారించేందుకు నావద్ద నీ నామము కలదు కదా! నాకేం కొఱత? నాకు ఎంత కోపము వున్నా దానిని నశింపజేసే శాంతము నొసంగుటకు నాచేయిబట్టి నడిపించుటకునా చిత్తములో నీవు స్థిరముగ నెలకొని యున్నావు కదా!

ఈ ప్రపంచంలో ఇంద్రియాలెంత నన్ను వెంటాడి వేధించినా నాకేం భయం? నేను నీ శరణాగతిని బొందియున్నాను ప్రభూ! గొప్ప కర్మబంధములు గట్టిగా తాళ్ళతో కట్టేసినా నాకు వాటిని తొలగించు కొనుటకు బెంగ ఎందుకు? నాకు నీభక్తి మీద అమితమైన ఆసక్తి వున్నది. అది చాలాదా?

సేమము నొసంగు ఇహపరముల రెంటినీ మరియు ఇష్టమైన వన్నీ అన్ని వేళలా ప్రసాదించు నీ సంకీర్తనములె నా తపః ఫలముగా నున్నవి. ఓ శ్రీ వేంకటేశ్వరా! వీటన్నిటికీ దిక్కయిన నీ శ్రీలక్ష్మి వాటినన్నిటినీ నీ ఆజ్ఞపై మా కొసగును. ఇకమాకేం తక్కువ?

**1-54**

## మున్నుడి

దృశ్యమానంగా అంటే కనులకు కట్టినట్లు ఒక సంఘటన వివరించడం అందరివల్లా అయ్యేపనికాదు. దానికి అద్భుతమైన భావనాపటిమవుండాలి. ఇక దాన్ని కీర్తనలా ఆలపించాలంటే దైవాంశ సంభూతులే చేయగలరా పనిని. హనుమ జానకీమాతను తన భుజములపై జలధిని దాటించి రామచంద్రుని వద్దకు చేరుస్తానన్నప్పుడు“నాయనా! ఇంత చిన్న వానరమైన నీవల్ల ఏమవుతుంది నాస్వామికి నావిషయం వివరించు, చాలు అన్నదట ఆ దేవి. ఇట్లా కాదని గగనమంతా ఆక్రమించిన తన విశ్వరూపం చూపాడట స్వామి. అన్నమయ్య ఆ హనుమను వేంకటనాధుని భక్తునిగా నుతించాడు.

**మ॥ వినరో మోహనరాగమందు యిదివో వేంకన్న సద్భక్తుడున్**
**తన భావంబున అన్నమయ్య కొలిచెన్ ధన్యున్ సుసంపన్నునిన్**
**పెనుఆకారము దాల్చు వాయుసుతునిన్ భీమానుజుండౌకపిన్**
**ఘనునీ కీర్తన పాడి నాడు భళిరా! గంధర్వగానంబిదే**

**రాగం : మోహన**

పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు
పరగి నానా విద్యల బలవంతుడు ॥పెరిగినాడు॥
రక్కసుల పాలికి రణరంగ శూరుడు
వెక్కసపు ఏకాంగ వీరుడు
దిక్కులకు సంజీవి తెచ్చిన ధీరుడు
అక్కజమైనట్టి ఆకారుడు ॥పెరిగినాడు॥
లవి మీరినయట్టి లావుల భీముడు
బలు కపికుల సార్వభౌముడు
నెలకొన్న లంకా నిర్ధూమ ధాముడు
తలపున శ్రీరాము నాత్మారాముడు ॥పెరిగినాడు॥





దేవకార్యముల దిక్కువరేణ్యుడు
భావింపగల తపః ఫల పుణ్యుడు
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు
సావధానుడు సర్వశరణ్యుడు ॥పెరిగినాడు॥

## భావామృతం

ఓ ప్రజలారా! ఈ హనుమంతుడు ఎంత పెద్దగా పెరిగియున్నాడో గమనించండి. అనేక విధములైన విద్యలందు నిష్ణాతుడైన ఈ వాయుపుత్రుడు గొప్ప బలము కలిగినవాడు.

ఈ కపిశ్రేష్ఠుడు రాక్షసులకు యుద్ధములోనసాధ్యుడు. ఈయన దుస్సహమైన అసహాయ శూరుడు. దిగంతములకు పోయి సంజీవిని గొనితెచ్చిన ధీరోదాత్తుడు. ఆశ్చర్యము గొలుపు ఆకారమును ధరించినవాడు, ఈ ఆంజనేయుడు. (అష్ట సిద్ధులు ఉన్నవాడగుటచే చిన్న పిల్లిని బోలిన కోతివలె లంకలో సీతను వెదకెను. మున్నుడిలో వివరించినట్లు జానకీ దేవి తననెలా సాగరము దాటింతు వన్నప్పుడు ఆమె తన మాటలను నమ్ముటలేదని విశ్వరూపమును చూపించిన బుద్ధిమంతుడు)

ఈ మారుతి బాగుగా అతిశయించిన ధైర్యముగల పరాక్రమవంతుడు. బలిష్టులైన కపికులంబునకే ఈతడు సార్వభౌముడు. తాకరానిదిగా ప్రసిద్ధి గాంచిన లంకానగరమును దగ్ధము చేసిన శౌర్యవంతుడు. శ్రీరామచంద్రుని తన ఆత్మారామునిగా ప్రతిష్ఠించుకొనినవాడు. శ్రీరామ లక్ష్మణులను మూర్ఛనుండి తేర్చుట వంటి పనులు చేసి దేవతలకు దిక్కుగా నిల్చిన ముఖ్యుడు. ఎంచగలిగిన తపః ఫలము గల పుణ్యాత్ముడు. ఈ హనుమంతుడు, శ్రీవేంకటేశ్వరుని సేవించు వారందరిలో అగ్రగణ్యుడు. ఎప్పుడూ సావధానుడై సిద్ధముగానున్న ఈ వాయునందనుడు అందరికీ శరణము నొసంగు మహానుభావుడు.

**1-55**

## మున్నుడి

గత జన్మలో యశోదాదేవిగా తనశిశువైన ముద్దుల కృష్ణుని మురిపాలలో మైమరచిన తల్లి అయింది కాని స్వామి కళ్యాణం కనులారా గాంచలేకపోయింది. పరితపించింది. దానికి తగిన కారణం వున్నప్పటికీ ఆమె కోరిక మేరకు కలియుగంలో ఆమె వకుళాదేవిగా అవతరిస్తే తాను వేంకటేశ్వరుడై పుడమికి దిగివచ్చి ఆమె చేతులమీద పద్మావతిని పరిణయమాడి 'అత్తగారి' పదవి నందించాడు. ఎంత ధన్యురాలు! ఆమెపేరు మీద వచ్చిన అమృతపేయమైన రాగం 'వకుళాభరణం' అన్నమాచార్యులవారు ఈ రాగంలో ఆ ముద్దుల చిన్ని శిశువుని వర్ణిస్తున్నారు. ఇంత మనోహరమైన శిశువే నేడు "ప్రత్యక్ష దైవమై" ఏడుకొండలమీద నున్నాడట. ఆహా!!

**చం॥ 'పదకవితాపితామహుని' భావన జెప్పెడి 'యజ్ఞ' మందునన్**
**విదితము సేయు యత్నమిది, విష్ణువు తాను యశోద'పట్టియై'**
**ముదమును గూర్పెనెల్లరకు ముద్దుల బాలుని వర్ణనంబహో!!**
**ఇది విని వేంకటేశ్వరుని ఎవ్వరు వేదరు యిట్టి బిడ్డకై?**

**రాగం : వకుళా భరణం**

చిన్ని శిశువు చిన్ని శిశువు
ఎన్నడు చూడమమ్మ ఇటువంటి శిశువు ॥చిన్ని॥

తోయంపు కురులతో తూగేటి శిశువు, చింత
కాయలవంటి జడల గములతోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ
పాయక యశోద వెంట పారాడు శిశువు ॥చిన్ని॥

ముద్దుల ప్రేళ్లతోడ మొరవంక యుంగరాలు





నిద్దపు చేతులపైడి బొద్దుల తోడ
అద్దపు చెక్కులతోడ అప్పలప్పలని నంత
గద్దించి యశోద మేను కౌగలించు శిశువు ॥చిన్ని॥

బలుపైన పొట్టమీది పాలచారలతోడ
నులివేడి వెన్నదిన్న నోరితోడ
చెలగి నేడిదే వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువు ॥చిన్ని॥

**భావామృతం :**

చిన్నారి పాపడైన ఈముద్దు కృష్ణుని వంటి శిశువును ఎందునా చూడలేము. ఇతడు అంత అద్భుతమైన శిశువు.

ఒక పద్ధతి ప్రకారం అలంకరించిన ముంగురులు కలిగిన శిశువు ఈ కృష్ణయ్య. చింతకాయల గుత్తుల వంటి జడలు కలిగిన శిశువితడు. చిన్నారి పాదాలపై బంగారుమువ్వలు ఘల్లు ఘల్లున మ్రోగుచున్నవి. ఆ విధంగా యశోదాదేవి వెంటబడి పారాడుచున్న ఈ మురిపాల శిశువును చూడండి.

ముద్దులొలికే ప్రేళ్ళకు మొరవంక (కోడిగుడ్డు ఆకారం) వుంగరాలు మెరుస్తున్నాయి. నునుపైన చేతులు బంగారపు బొద్దులు (కడియములు వంటి ఆభరణములు) అలంకరింపబడి యున్నవి. ఆయ్ అమ్మా! అని యశోద అంటే గట్టిగా కౌగలించుకొనే శిశువు. ఇటువంటి మురిపాల శిశువును చూడండి.

ఉబ్బుకొచ్చిన చిన్నారి బొజ్జ మీద అప్పుడే త్రాగిన పాలు చారికలుకట్టి కనిపిస్తున్నాయి. గోరువెచ్చగా వుండే (అప్పుడే తీసిన) వెన్న తిన్నట్లు ( మూతికంటిన వెన్నగల) నోరున్న ఈ చిన్నారి కృష్ణుని చూచి పులకిస్తున్నాను. ఆ మురిపాల కృష్ణుడే నేడు శ్రీ వేంకటాద్రి పై నెలకొని విరాజిల్లుతున్న శ్రీ వేంకటేశ్వరుడై లోకములన్నింటినీ ఉద్ధరించుచున్న శిశువు.

## 1-56

### మున్నుడి

అనాదిగా గీతాపారాయణ జేసేవారు, ప్రవచనలు చేసేవారు అనువాదాలు చేసినవారు కోకొల్లలుగా వున్న పుణ్యభూమి ఇది. భగవద్గీతపై అవధానం చేసే మహామహులున్నారు. కాని 600 ఏళ్ళనాడు శాస్త్రీయ సంగీతంలో గీతావాక్యాన్ని పాడినవారు లేరు. గీత 13 వ అధ్యాయమైన "క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగంలో శ్రీ కృష్ణపరమాత్మ చెప్పిన 8,9,10,11,12, శ్లోకములను "ముఖారి" రాగంలో కీర్తనగా పాడటం పదకవితా పితామహునికి గాక పరులకు సాధ్యమా? 2010 సంవత్సరంలో, డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారి వంటి పుణ్యాత్ముల వ్యాఖ్యానం చదివితేనాబోటి వారికి కొంత పట్టింది.

**కం॥ గీతావాక్యము బలుకుట**
**గీతములో అన్నమయ్యకే సాధ్యమగున్**
**నూతనముగ వేంకటపతి**
**ఈ తీరునజెప్పెననుట ఇతనికె చెల్లెన్.**

**రాగం : ముఖారి**

ఇందుకు విరహితము-లిన్నియు నజ్ఞానమని
చందమున గీతలందు-జాటీ నిదివో ॥ఇందుకు॥

మానావమానము-మాని, డంబు విడచుట
పూనిహింసకు జొరక-యోరుపు గలుగుటయు
ఆని మతి గరగుట-యాచార్యోపాసన
తానెప్పుడు శుచియౌట-తప్పని విజ్ఞానము ॥ఇందుకు॥

అంచల సుస్థిర బుద్ధి-యాత్మవినిగ్రహము
అంచిత విరతి నిర-హంకారాలు,
ముంచిన జన్మదుఃఖ-ములు దలపోయుట
కంచపు సంసారము-గడచుటే జ్ఞానము ॥ఇందుకు॥





అరిమిత్ర సమబుద్ధి-యనన్య భక్తియు
సరినేకాంతకము,న-సజ్జన సంగవిముక్తి,
ధర నధ్యాత్మజ్ఞాన- తత్త్వము దెలియుట
గరిమలందుట శ్రీవేం-కటపతి జ్ఞానము. ॥ఇందుకు॥

**భావామృతం :**

శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీతయందు (క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగం అను 13వ అధ్యాయమున), 'ఇది జ్ఞానము' అని చెప్పి , దీనికి భిన్నమైనదంతయూ 'అజ్ఞానము' అని చాటిచెప్పెను.

మాన్యతగాని అవమానముగానీ శరీరమునకే గనుక వాటిని విడనాడుట, దర్పము లేకుండుట, హింసాప్రవృత్తికి దూరముగానుండుట, ఓరిమి పొందియుండుట, కపట బుద్ధిలేకుండుట గురువులను సేవించుట, శుచిగానుండుట ఇవియన్నియు విజ్ఞానము.

అదియునుగాక బాగుగా స్థిరమైన బుద్ధి గలుగుట, మనోనిగ్రహము, విషయసుఖములయందు వైరాగ్యభావము, ఏ మాత్రము అహంకారము లేకుండాయుండుట, జన్మించినవారికి ముసలితనము, వ్యాధి, మరణము,దుఃఖము తప్పవని తెలిసికొని వాటినుండి తరించుట, పుత్రులు, మిత్రులు భార్యతో గూడినసంసారము అనిత్యమని తెలిసికొనుటయే జ్ఞానము.

శత్రువులయందు మిత్రులయందు సమబుద్ధి గలిగియుండుట (శత్రువులను కూడ మిత్రులవలె చూడాలని భావము), ఏకాంతముగానుండుటకు ప్రయత్నించుట, దుష్టులకు దూరముగా నుండుట, ఎల్లప్పుడు ఆత్మజ్ఞానముచే తత్త్వమును తెలిసికొనుట, అత్యంత శ్రేష్ఠమైన జ్ఞానప్రయోజనమును బడయుట- ఇది శ్రీ వేంకటేశ్వరుదు చెప్పిన జ్ఞానము. దీనికి విరుద్ధమైనదంతయు 'అజ్ఞానము'

**1-57**

## మున్నుడి

అన్నమయ్య, క్షేత్రయ్య, జయదేవుడు మొదలైన మహానుభావులు శృంగార కీర్తనలతో శ్రీమన్నారాయణుని కొలిచారు. పవిత్రభవనతో చ్పప్త శృంగారం చెడుకాదు. అన్నమయ్య కీర్తనలకు ఏడుకొండలవాడు పరవశించాడు అంటే కారణం ఇట్లాంటి మనోజ్ఞమైన కీర్తనలే. భావ వివరణలో సాధ్యమైనంత 'నిగూఢత' పెట్టటానికి కారణం మాత్రం 'అందరికీ' అర్థం కాకుడదనే..... నాకోరిక 'భావయామి వేంకటేశమ్' ఆశయం అన్నమాచార్యులవారి అన్ని కళలను గుర్తుచేయటమే.

**తరళము॥**

**వనజనాభుని కామకేళిని పాడనీ విధి సాధ్యమా?**
**వినుడు మంగను వేంకటేశుడు ప్రేమడోలికలూచుటన్**
**అనునయంబుగ తాళ్ళపాక మహాకవీంద్రుడు పాడుటన్**
**ఇనుమడించిన భక్తితోనిక ఏను పద్యము జెప్పితిన్.**

**రాగం : తిలంగ్**

ఏమొకో చిగురుట ధరముల యెడనెడ కస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన ప్రతిక కాదు కదా ॥ఏమొకో॥

కలికిచకోరాక్షికి కడకన్నులు కెంపైతోచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువున పెరుకగ నంటిన నెత్తురు కాదుకదా ॥ఏమొకో॥

పడతికి చనుగవ మెఱుగాలు పైపై పయ్యెద వెలుపల
కదుమించిన విధమేమో కనుగొనరే చెలులు
ఉడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడులగ వేసవికాలపు వెన్నెల కాదుకదా ॥ఏమొకో॥



భావయామి వేంకటేశం

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరే చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురుతపు చెమటల అందము కాదు కదా ॥ఏమొకో॥

## భావామృతం

(మనందరికి తల్లియైన అలమేలు మంగమ్మ స్థితిని రమణీయమైన శృంగార కీర్తనలో వివరిస్తున్నారు పదకవితా పితామహులు. ఇది అన్యులకు అసాధ్యం.)

ఈ జవ్వని పల్లవాధరములపై అక్కడక్కడా కస్తూరి నిండుగా అంటుకొనియున్నది. ఇది ఒక వేళ ఈ కోమలి తన నాధునికి వ్రాసిన ప్రేమ లేఖ కాదుకదా!!

చకోరముల వలె గుండ్రని కన్నులు గల ఈ భామామణి కన్నులకొనలు కెంపులు వలె ఎర్రబారినవి. ఓ చెలులార! ఇట్లా ఎందుకయిందో ఒక్కసారి ఆలోచించండి. ఈమె తన కొనచూపులను వాడిగా తన ప్రాణేశ్వరుడైన వేంకటరమణునిపై నాటి మరల ఆ చూపులను మరల్చినప్పుడు ఆ చూపులతూపులు పెరకబడి రక్తము కారి ఆ స్వామిని చూస్తున్న ఆమె కన్నులలో ప్రతిఫలించుటచే ఎర్రబారలేదు కదా!

చెలులారా! ఈ పడతికి వల్లెవాటు పైనుండియే స్తనయుగ్మము తళుకున మెఱయు కారణమును కనుగొన లేకున్నారేమి? ఈమె విభుడైన తిరుమల నాయకుడు మిక్కిలి వేడుకతో నఖక్షత్రములను వేయగా అవి చంద్రరేఖలవలె తోచి ఆపయ్యెద మెఱపులతో కలిసి ఇది వేసవి నాట వెన్నెల కాదు గదా! అనుభావన కలుగజేయుచున్నది.

ఓచెలులారా! ఈ ముద్దుగుమ్మ చెక్కిళ్ళపార్శ్వము లిరువైపులా ముత్యపు జల్లులతో నిండియుండునట్లు ఆకర్షణీయముగా అమరియుండు కారణమేమో వూహించ లేకున్నారా? అవి నిజమునకు ముత్యాల జల్లులు కావు. దిట్టయైన వేంకటేశ్వరుని నాయిక యొక్క ముఖకమలమున ఆయన సురతివేగమున ప్రాప్తిలిని చిరుచెమటల అందము కాదు కదా!!

**1-58**

## మున్నుడి

అద్భుతమైన తత్త్వబోధనెరుంగజెప్పు కీర్తన ఇది. మనిషి జన్మఎత్తి నిరుపయోగం కావున తాను వేంకటేశ్వరునొక్కడినే దిక్కని నమ్ముకున్నాడనీ ఇకతనని రక్షించటం స్వామి చిత్తమని తేల్చి వేశారు అన్నమయ్య. ఏవిమరువవలెనో వాటిని మరువను. వేటిని మరువరాదో వాటిని మరచెదను. ఏమి విడువ వలెనో వాటిని విడువను. వేటిని విడువరాదో వాటిని విడిచెదను. దేన్నితగులరాదో దాన్ని తగిలి, దేన్నితలవాలో దాన్ని తలవక విష్ణుమాయలో చిక్కి వేంకటేశ్వరుని శరణనుట లేదంటున్నా రన్నమయ్య.

**ఉ॥ ఎక్కడి జన్మమానవుని దెత్తిన దీనిఫలంబు యేమొకో!**
**మ్రొక్కుడు వేంకటేశ్వరుని మోక్షపథంబదె, విష్ణుమాయచే**
**నిక్కము నేర్వకుంటిమను నీతిని దెల్పెను అన్నమయ్యతాన్**
**చక్కని కీర్తనంబు గొని, సద్గురుబోధనుయెంచి చూడరో.**

**రాగం : బౌళి**

ఎక్కడి మానుషజన్మం బెత్తిన ఫలమేమున్నది
నిక్కము నిన్నెనమ్మితి నీచిత్తంబికను ॥ఎక్కడి॥

మరువను ఆహారంబును మరువను సంసారసుఖము
మరువను ఇంద్రియభోగము మాధవ నీమాయ
మరచెద సుజ్ఞానంబును మరచెద తత్త్వరహస్యము
మరచెద గురువును దైవము మాధవ నీమాయ ॥ఎక్కడి॥

విడువను పాపము పుణ్యము విడువను నాదుర్గుణములు
విడువను మిక్కిలియాసలు విష్ణుడ నీమాయ
విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును
విడిచెదనాచారంబును విష్ణుడ నీమాయ ॥ఎక్కడి॥





తగిలెద బహు లంపటముల తగిలెద బహు బంధంబుల
తగులను మోక్షపు మార్గము తలపున యెంతైనా
అగపడి శ్రీ వేంకటేశ్వరా అంతర్యామివై
నగినగి నను నీ వేలితి నాకా యీమాయ ॥ఎక్కడి॥

## భావామృతం

ఎక్కడి మనుష్య జన్మస్వామీ! ఇది? ఈ జన్మయెత్తి ఏమన్నా ఉపయోగం వుందా? లేదు. ఇక నీ ఇష్టం. నిజం చెబుతున్నాను ప్రభూ! నేను నిన్నే నమ్ముకొన్నాను.

ఓ మాధవా! నేనెంత దౌర్భాగ్యుడినంటే.... ఆహారమును విడువలేను రోజుమూడుపూటలా తినవలసిందే. సంసారసుఖం వదులుకోలేను. ఇంద్రియ భోగం మీద ఇసుమంతైనా విరక్తి లేదు. ఇక వాటిని మరువనుకానీ మంచి జ్ఞానమును తత్త్వరహస్యములను జగత్పతియైన దైవమును హితోపదేశం చేసే గురువును మాత్రం మఱచిపోతాను. దీనికి నేను కారణం కాదు ప్రభూ! నీమాయ ఆవరించడం చేత ఇట్లు జరుగుచున్నది.

ఓ విష్ణుదేవా! విడువకుండా పాపాలు పుణ్యాలు ఒకదాని వెంట ఇంకొకటి చేస్తూనే ఉన్నాను. నా చెడుగుణములను వదిలిపెట్టలేకున్నాను. ఆశాపాశముచే బంధింపబడి ఆశను విడువలేను ఇదంతా నీ మాయయే కదా! ఇదిట్లా వుంటే మానవులకు విధించబడిన ఆరు విధులను మాత్రం విడిచిపెట్టాను. వైరాగ్యం మాటనెత్తడం లేదు. ఆచారము అంటే ఏమిటో మఱచిపోయాను. విష్ణుస్వరూపా! ఇదంతా నీ మాయకాకామరేంటి?

ఓ ప్రభూ! నేను ఎన్నో చిక్కులలో తగులుకొంటాను. ఎన్నో బంధనములలో తగులుకొంటాను. ఇకపోతే నా ఆలోచనలలో కూడ మోక్షమార్గం జోలికి పోవటం లేదు. ఇవన్నీ జరిగినా నాకేం భయం? ఓ వేంకటేశ్వరా! నాకు నీ దర్శనం అయింది. నీవు అంతర్యామిగా సంతోషంతో నన్ను రక్షిస్తున్నావు కదా! అట్టి నాకు నీమాయ అంటే ఏం భయం?

## 1-59

### మున్నుడి

శ్రీ రామనామ సంకీర్తన అనగానే అన్నమయ్య పలుకులలో నుంచి తేనెలూరుతుంటాయి. ఈ కీర్తన ఈ మాటల్లో అతిశయోక్తి అవంతైనాలేదని నిరూపిస్తుంది. సురరక్షకుడు అసురదమనుడు అయిన ఈ రామచంద్రుడు నెలకొనియున్నది విజయనగరమున. ఈయన ఆదియైన దానికే అనాది అని కీర్తిస్తున్నారు. యోగీంద్రుల మానస సరోజములందు సంచరించు ఈ రాఘవుడు జానకీ మనోహరుడు. ఆర్తరక్షాదక్షుడైన ఈ దశరథనందనునిపై కీర్తన వీనులకు విందైన కానడరాగంలో వినిపించారు. ఎప్పటివలెనె ఈ శ్రీ రాముడే నేటి శ్రీ వేంకటేశ్వరుడు అంటున్నారు అన్నమయ్య

**చం॥ ఇన కుల సోముడైన ఘనునీ రఘురాముని జానకీపతిన్**
**జనులను కన్నబిడ్డలుగ చక్కగనేలిన చక్రవర్తినిన్**
**మనులకు కన్న తల్లియగు మంగకునాథుడు వేంకటేశుగా**
**మనసున నెంచి అన్నమయ పాడెను 'కానడ' రాగమందునన్.**

**రాగం : కానడ**

రాముడు రాఘవుడు రవికులుడితడు
భూమిజకు పతియైన పురుష నిధానము ॥రాముడు॥

అరయ పుత్రకామేష్టి యందు పరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురుల రక్షింపగ అసురుల శిక్షింపగ
తిరమై ఉదయించిన దివ్యతేజము ॥రాముడు॥

చింతించే యోగీంద్రుల చిత్తసరోజములలో
సంతతము నిలిచిన సాకారము
వింతలుగా మునులెల్ల వెదకినయట్టి
కాంతుల చెన్ను మీరిన కైవల్య పదము ॥రాముడు॥





వేదవేదాంతముల యందు విజ్ఞాన శాస్త్రములందు
పాదుకాన పలికేటి పరమార్థము
పోదితో శ్రీ వేంకటాద్రి బొంచి విజయనగరాన
ఆదికి అనాదియైన అర్చావతారము. ॥రాముడు॥

### భావామృతం

ఈ శ్రీ రామచంద్రమూర్తి రఘువంశమునకు చెందినవాడు. ఈయన రవికులమునకే శోభాయమైనవాడు. ధరణీనందనయైన సీతాదేవికి భర్తయైన ఈతడు పురుషులలో మూలధనము ( నిధానము) వంటివాడు.

దశరథమహారాజు పుత్రకామేష్టియాగము చేయగా ప్రీతిచెంది యజ్ఞపురుషుడిచ్చిన పరమాన్నము వలన జన్మించిన పరబ్రహ్మస్వరూపుడే ఈ శ్రీ రాముడు. ఆయన దేవతలందరికి రక్షకుడు. రాక్షసులను వధించెడివాడు. ఆయన స్థిరముగా పొడజూపిన దివ్వతేజస్సు.

ఈ దాశరథి తననే ధ్యానించు యోగీశ్వరుల మనోసరోజములందు ఎల్లప్పుడు సాకారముగా నిలిచేవాడు. మునీశ్వరులందరు వెదకులాడే కాంతివంతమైన మోక్షమార్గము ఈ శ్రీ రామచంద్రమూర్తి.

వేదములయందు, వేదాంతములందు, విజ్ఞానశాస్త్రమునందు ప్రధానముగా ఎఱుక పరచబడిన పరమార్థము ఈ శ్రీ రాముడే. ఒద్దికతో శ్రీ వేంకటేశ్వరునిగా వేంకటాద్రిపై వెలసిన ఈ స్వామియే విజయనగరమున ఆదియనుదానికే అనాదియైన అర్చావతార మూర్తిగా శ్రీ రామచంద్రమూర్తియై వెలసియున్నాడు.

## మున్నుడి

డోలలూపి, మధురమైన కీర్తనపాడి, నీలవర్ణుని నిద్దురపుచ్చుటం అన్నమాచార్యుల దినచర్యలో ఒక భాగం. ఈ క్రమంలో ఈ సంస్కృత కీర్తన ఆవిర్భవించింది. కీర్తనలో నాకు తోచిన ఒక విశేషం చెబుతాను." దారుణబుద్ధ" అనే మాటలో 'దారుణ' అంటే భయంకరమైన. బుద్ధునికి అన్వయించదీవరాలు. అది 'తారణ' అయి వుండవచ్చును. తారణ అంటే తరింపజేయు బుద్ధుడు అని అర్థం. అలాగే కీర్తనలు రాగిరేకులపై వ్రాయబోయే యత్నంలో దొర్లిన పొరపాటే ' శీరపాణే' అనే మాట. అది సీరపాణే అంటే నాగలి ధరించినవాడు. ఇది నా ఆలోచన మాత్రమే.

**ఉ॥ డోలికలూచి శ్రీ పతిని దొడ్డగ నిద్దుర బుచ్చు సేవలో**
**చాల ముదంబుగూర్పు కృతి చల్లగ పాడెను అన్నమయ్యతా**
**నేలిక వేంకటేశు పదియా అవతారములిట్టు చెప్పెగా**
**వీలగునే మరొక్కనికి? మేలగు విందును పొందుడెందముల్.**

**రాగం : ఖమాస్**

డోలాయాంచల డోలాయాం హరే డోలాయాం ॥డోలాయాంచల॥

మీన కూర్మవరాహ మృగపతి అవతార
దానవారే గుణశౌరే ధరణీ ధర మరుజనక ॥డోలాయాంచల॥

వామన రామ రామ వరకృష్ణ అవతార
శ్యామలాంగ రంగ రంగా సామజవరద మురహరణ ॥డోలాయాంచల॥

దారుణ(తారణ) బుద్ధ కలికి దశవిధ అవతార
శీ ( సీ) రపాణే గోసమాణే శ్రీ వేంకటగిరి కూట నిలయ ॥డోలాయాంచల॥





### భావామృతం

శ్రీ హరీ! నీకు ఊయలలూపెదను. బాగుగా కదలాడు ఊయలలూపెదను.

మత్స్యరూపుడవై (వేదములను రక్షించితివి), కూర్మరూపుడవై (మంధరగిరి నెత్తితివి), వరాహరూపుడవై ( భూదేవిని కాపాడితివి), మృగేంద్రుని రూపుడవై (నరసింహుని వలో ప్రహ్లాదుని బ్రోచావు), ఓ ప్రభూ! అసురారీ! శౌర్యవంతమైన గుణభూషణా! భూ రమణా! మదనజనకా! నీవు సర్వేశ్వరుడవు.

వామనరూపుడవై (బలిని నిరోధించితివి), శ్రీ రామచంద్రమూర్తివై ( రావణుని తెగటార్చితివి), బలరాముడివై (దారుణమైన బలశాలివైతివి), శ్రీ కృష్ణపరమాత్మవై (వరప్రదాతవైతివి) ఓ మహానుభావా! నల్లని శరీరకలవాడా! శ్రీ రంగమునేలెడి రంగనాథా! గజేంద్ర సంరక్షకా! మురాసురభంజనా! నీవు అసామాన్యుడవు.

ధర్మవర్తనతో తరింపజేసిన ఓ బుద్ధా! (శాంతి ప్రవర్ధకుడవు), కలికి అవతారుడవై (దుర్జనాంతకుడవు). ఓ సీలపాణే (నాగల ధరించినవాడా) గోసంరక్షకా! శ్రీ వేంకటగిరి కూటమియైన ఏడుకొండలపై నివాసమైన శ్రీ వేంకటేశ్వరా కదలాడే ఈ డోలికలలో ఊగుతూ మమ్ము ఆదుకోతండ్రీ!

**1-61**

## మున్నుడి

అహోబలంలోని లక్ష్మీనారసింహుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. వక్రబుద్ధియైన హిరణ్యకశిపుడు శ్రీ హరిద్వేషియై, హరిభక్తుడైన తన సుతుడు ప్రహ్లాదునా హరిమాటయెత్తవద్దని అహరహమూహింసించాడు. తన భక్తుని వెన్నంటి కాపాడాడు శ్రీ హరి. చివరికి నరహరియై అరిని వితిచి బాలునికాపాడి వరములిచ్చిడు శ్రీ హరి. లక్ష్మీదేవిని తన తొడపై కూర్చోబెట్టుకొని స్వర్ణాభరణ భూషితుడై నవ్వులొలికే లక్ష్మీనారసింహుడుగా అహోబలంలో వెలసి భక్తవరదుడైనాడు. ఆయనను శ్రీ వేంకటేశ్వరుని అవతారంగా కీర్తిస్తున్నారన్నమయ్య.

**ఉ॥ వంకరబుద్ధి దానవుడు వద్దని శ్రీ హరి ధ్యాసమాన్పగా**
**మంకున హింసవెట్టె సుతు, వానిని గాచెను తోడునీడయై**
**వేంకటరాయుడే, వెలసె వేల్పుఅహోబలనారసింహుడై**
**ఇంక నుంతిచె నన్నమయ యిట్టి తలంపెటు లొచ్చునోగదా**

**రాగం : ఆరభి**

ఆరగించినకూచున్నాడల్లవాడే
చేరువనే చూడరె లక్ష్మీనారసింహుడు ।ఆరగించి॥

ఇందిరను తొడమీద నిడుకొనికొలు విచ్చీ
అందపు నవ్వుల చల్లీనల్లవాడె
చెందిన మాణికముల శేషుని పడగిలమీద
చెంది మాలిన్నీ లక్ష్మీనారసింహుడు ।ఆరగించి॥

బంగారు మేడలోన పచ్చలగద్దియల మీద
అంగనల ఆటచూచీ నల్లవాడే
రంగగు సొమ్ములతోడ రాజసపు విభవాల
చెంగటనున్నాడు లక్ష్మీనారసింహుడు ।ఆరగించి॥





పెండెపు పాదము చాచిపునచి ఒకపాదము
అండనే పూజలు గొనీనల్లవాడే
కొండల శ్రీ వేంకటాద్రి కోరిఅహోబలమున
మెండుగాను మెరసీ లక్ష్మీనారసింహుడు ।ఆరగించి॥

## భావామృతం

(అహోబల లక్ష్మీనారసింహునికి భక్తులు నైవేద్యం సమర్పించారు. ఆ స్వామి దాని నారగించాడు. ఇక....) లక్ష్మీనారసింహుడు, అదిగో ఆయన ఆరగించి కూర్చున్నాడు. మన వద్దనే యున్నాడు. ఆయనను పరికించండి.

ఆ స్వామి లక్ష్మీదేవిని తన ఎడమ తొడపై కూర్చొన బెట్టుకొని, అదిగో అక్కడ అందముగా నవ్వుతూ కనిపిస్తున్నాడు. ఆదిశేషుడు పడగలపై మాణిక్యములు ధగధగా మెరుస్తుండగా ఆయనకు గొడుగువలె నీడ బట్టాడు. అట్టి లక్ష్మీనారసింహుడు అనేక వరములిచ్చి కాపాడు మహానుభావుడు.

స్వర్ణమయమైన భవంతిలో, వజ్రాలసింహసనం పై కూర్చొని నర్తకీమణుల నృత్యాన్ని తిలకిస్తున్నాడు అదిగో వాడే లక్ష్మీనారసింహుడు. అనేక రంగులు వెదజల్లే ఆభరణాలతో రాచఠీవితో విరాజిల్లుతున్న ఈ స్వామి మన యెట్టెదుటనే కనిపించుచున్నాడు.

పెండెములు (కాలికడియములు) గల పాదములు మెరుస్తుండగా ఒక పాదము చాచియుంచియు, ఇంకొకపాదము చుట్టి బిగించియు ఆసీనుడై అక్కడే పూజలందుచున్న ఆ లక్ష్మీ నారసింహుడు అదిగో ఆకనబడుతున్నవాడే. తిరుమల ఏడుకొండల పైనున్న వేంకటేశ్వరుడే కోరి, నేడు అహోబల లక్ష్మీనారసింహుడై అధికముగా మెరిసిపోతూన్నాడు.

## మున్నుడి 1-62

నేటి 'నాగరీకులు' నారదుని 'తంపులమారి కుయుక్తిపరునిగా' చిత్రీకరించి ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తున్నారు. వారు భ్రష్టులవడమే గాక మనతరువాతి తరాన్ని చెడగొడుతున్నారు. మనల్ని పాపములనుండి రక్షించిన మహామహుడు నారదుడు. మనోవాక్కర్మలచే అనుక్షణం పాపాలు చేస్తూనేవున్నాం మనం. దానికి తగ్గపాపాలు కొండలవుతున్నాయి. ఇక హరినామ సంకీర్తనే గతి.

**సీ॥ బ్రహ్మస్వరూపంబు, పరమపావనమిది**
**దురితనివారంబు అరిహరంబు**
**శరణన్న వారిని కరుణించి రక్షించు**
**యమభీతి తొలగించు అద్భుతంబు**
**హిమశైలసుత, బ్రహ్మ, ఇంద్రాది సురులెల్ల**
**అనయంబు గొలిచెడి అతిశయంబు**
**సకల సంపదలిచ్చి చపలంబు పరిమార్చి**
**సులువుగా ముక్తీయు సుఖప్రదంబు**

**తే॥ నామసంకీర్తనం బిక నళిని ధవుని**
**అన్నమయ్య చెప్పిన రీతి అనవరతము**
**జేసితిరుమలరాయని జేరుడయ్య!**
**గర్భవాసంపు గండంబు కలుగబోదు.**

**రాగం : గంభీరనాట**

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం
జాలెల్లనడగించు సంకీర్తనం ॥చాలదా॥

సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతము దలచుడీ సంకీర్తనం ॥చాలదా॥

సామజము గాచినది సంకీర్తనం
సామమునకెప్పుడీ సంకీర్తనం
సామిప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమీ విష్ణుసంకీర్తనం ॥చాలదా॥





జములూరి విడిపించు సంకీర్తనం
సమబుద్ధివొడమించు సంకీర్తనం
జమళిసౌఖ్యము లిచ్చు సంకీర్తనం
శమదమాదుల జేయు సంకీర్తనం ॥చాలదా॥

జలజాసనుని నోరి సంకీర్తనం
చలికొండ సుతదలచు సంకీర్తనం
చలువకడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలచుడీ సంకీర్తనం ॥చాలదా॥

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియపో సంకీర్తనం
సరుసవేంకటవిభుని సంకీర్తనం
సరగనను తలచుడీ సంకీర్తనం ॥చాలదా॥

**భావామృతం**

(శ్రీవేంకటేశ్వరుని నామసంకీర్తన మహిమను కీర్తిస్తున్న అన్నమాచార్యుల నవధరించండి) సాటిలేనిపరమాత్మ స్వరూపమే ఈ సంకీర్తనము అని పిలువబడే సన్నుతి. మనస్సులలో కలిగే విచారమును రూపుమాపునదే ఈ సంకీర్తనము.

ఈ సంకీర్తనము ఎంతో ఆనందమును కలిగించునది. దుఃఖమును నివారించునదియును ఇదియే. జ్ఞానములేని జంతువులను కూడ ఈ సంకీర్తనము రక్షించును. అందుచేత ఈ సంకీర్తనమునెల్లవేళలయందు జరుపుడు.

ఈ సంకీర్తనమే ఒకప్పుడు గజేంద్రుని కాపాడినది. ఎల్లరను అనుకూలురుగా చేయగలిగినదియు ఈ సంకీర్తనమే. సామీప్యము (సమీపముననే ఉండుట) అను భాగ్యమును ఈ సంకీర్తనము కలిగించును. అందుచేత విష్ణునామ సంకీర్తనము సామాన్యమైనదా? ఎన్నటికీ కాదు. యమధర్మరాజు శిక్షలనుండి తప్పించునది ఈ సంకీర్తనమే. సుఖదుఃఖాది ద్వంద్వములయందు సమానమైన బుద్ధిని కలిగించునదిదియే. ఇబ్బడిగా (రెండింతలుగ) సుఖములనిచ్చునదీ నామసంకీర్తనమే. దీనినాశ్రయించినవారికి కామక్రోధములు, పలుక్లేశములనుండి విముక్తి నీనామ సంకీర్తనము కలిగించును.

బ్రహ్మదేవుని చతుర్ముఖములనుండి వెలువడినది ఈ సంకీర్తనమే. దీనినే పార్వతీదేవి నిష్టతో జరుపుకొనును. నాలుకకు ఎంతో అద్భుతముగా చల్లగా హాయినిచ్చునదీ సంకీర్తనమే. చపలత్వమునధిగమించి స్వామి నామసంకీర్తన జరపండి. క్రమముగా సర్వసంపదలిచ్చునదీ సంకీర్తనమే. సరి అనేది లేనిదిదియేపో. సరసుడైన శ్రీవేంకటేశ్వరుని నామ సంకీర్తనము, వెంటనే తలచి జరపండి.

## 1-63

### మున్నుడి

అల్పప్రాణియైన ఈ జీవుడెంత? వీడి బ్రతుకెంత? సర్వ నియామకుడైన సర్వేశ్వరుని మాయయే సర్వమునకు కారణమని తెలుసుకోలేక సంసార లంపటంలో తగులుకొని చీమల వలె, తేటీగలవలె, గిజిగాని పక్షులవలె జీవిస్తున్నారే.! అనవరతమూ ఈ సంసార తాపత్రయంలో నలిగిపోతున్నారే! అని అన్నమాచార్యులవారు వేదన జెందుతున్నారు. శ్రీ వేంకటేశ్వరుని భక్తులు మాత్రం ఈ కూపంలో బడక వారిని చూచి నవ్వుకొని స్వామికి కృతజ్ఞతతో తమనా రొచ్చులో పడకుండా కాపాడినందుకు శరణాగతి నున్నారంటున్నారా అన్నమయ్య.

**కం॥ సతతము సంసారంబున**
**మతిపోయిన జీవులన్ని మాయలదగులున్**
**గతి వేంకటేశ్వరుండని**
**వెత వీడరు అన్నమయ్య వేదన బలికెన్.**

**రాగం : సారంగనాట**

తానెంత బ్రతుకెంత దైవమా నీమాయ యెంత
మానవుల లంపటాలు మరి చెప్పగలదా ॥తానెంత॥

చెలరేగిన బారేటి చీమసయితమును
కలసి వూరకేపారు గమ్మర నెందో మరలు
తలమోచి కాపురము ధాన్యములు గూడపెట్టు
యిల సంసారము ధనకిక నెంతగలదో ॥తానెంత॥

యేడో బాయిటు బారే యీగ సయితమును
వాడుదేర నడవుల వాలివాలి
కూడపెట్టు దేనెలు గొందుల బిల్లల బెట్టు
యేడకేడ సంసారమిక నెంత గలదో ॥తానెంత॥





హెచ్చిగిజిగాండ్లు సయితమెంతో గూడవెట్టు
తెచ్చి మిణుగురు బురువు దీపము వెట్టు
తచ్చి శ్రీవేంకటేశ నీదాసులు చూచినగుదు
రిచ్చలదాని సంసారమిక నెంతగలదో ॥తానెంత॥

### భావామృతం

మానవుడేపాటివాడు? అసలు వాడి బ్రతుకెంత? ఓ ప్రభూ! అంతా నీమాయ గాక మరేమిటి? ఈ మానవుడు తగిలించుకొన్న శ్రమల గురించి మరి ఇంకా ఏం చెప్పగలం?

ఉత్సాహముతో నేల మీద పాకే చీమలు కూడా ఎక్కడెక్కడికో పోయి ధాన్యపు గింజలను సేకరించి తలకు మించిన భారమైనా మోసుకువచ్చి తన కాపురము నిర్వహించుకొంటున్నది. దానికి కూడా ఈ సంసార తాపత్రయమెంత గలదో!!

ఎక్కడో బయట తిరిగే తేనెటీగలు సైతం, అలవాటు చొప్పున అడవులలో పూవులపై వాలి వాలి పూలమకరందాన్ని సేకరించి తేనెపట్లు ఎక్కడెక్కడో పెట్టి తన బిడ్డలకి మకరందాన్ని పంచిపెడుతోంది కదా! (చివరికి అది దుర్మార్గులైన నరుల పాలవుతోంది). అల్పప్రాణి ఆ తేనెటీగకు ఎంత సంసార వ్యామోహం!!

గిజిగాడు అనే పక్షి కూడా అద్భుతమైన పొదరిల్లులాంటి గూడు కట్టి, అందులో తన పిల్లల్ని ఉంచి, ఆ గూటిలోని చీకట్లో తన పిల్లలు భయపడతాయని మిణుగురు పురుగులను తెచ్చి దీపం వలె ఏర్పరుస్తుంది. దాని సంసార యావ చూచి ఓ వేంకటేశ్వరా! నీ దాసులైన భక్తులు "దీనికెంత భ్రమ" అని నవ్వుకొంటారు. అట్లే మమ్మల్ని చూచి నీవు మా పిచ్చికి నవ్వుకొంటావు.

**1-64**

## మున్నుడి

వసంత శోభలతో అలరారే అలమేలు మంగమ్మ సౌందర్యాన్ని ఏమని వర్ణించగలనని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులు. తనని తానే అమ్మవారికి చెలికత్తె వలె ఊహించుకొంటున్నారేమో దేవిని 'ఏమే' అనే సంభోధిస్తున్నారు. తల్లి మధురాధరములను వర్ణించటం తిరుమలనాధునికి ఆ తరువాత దేవి చెలికత్తియకు మాత్రమే సాధ్యము కదా! ఆ ప్రభువును కైవసం చేసుకొనుట ఆమె కౌగిలికి దక్కిన హక్కు. మనబోటి వాళ్లమంతా ఒక్క రెప్పపాటున ఆ జగన్నాథుడు కనిపిస్తే చాలు అనుకొంటుంటే అమ్మవారు ఆయనను తన సోయగాలతో బంధీని జేసింది. ఎంత అద్భుతం ఈ సంకీర్తన?

**చం॥ వనరుహలోచనన్, సిరుల భామను, మంగను, వేంకటేశురా**
**ణిని, సురనాధుడున్ మునులు నీరజనాభుడు గొల్చు దేవినిన్**
**తను పొగడంగ జాలనని దాపరికంబులు వీడి, కీర్తనన్**
**వినుతిని జేసె నన్నమయ విష్ణుసతిన్ నవపల్లవాధరన్**

**రాగం : అభేరి**

ఏమని పొగడుదుమే యిక నిను
ఆమని సొబగుల అలుమేల్మంగ ॥ఏమని॥

తెలికన్నుల నీ తేటలే కదవే
వెలయగ విభునికి వెన్నెలలు
పులకల మొలకల పొదులివి కదవే
పలుమరుపువ్వుల పానుపులు ॥ఏమని॥

తియ్యని నీ మోవి తేనెలే కదవే
వియ్యపు రమణుని విందులివి
ముయ్యక మూసిన మొలక నవ్వుకదె
నెయ్యపు కప్రపు నెరిబాగాలు ।ఏమని॥





కైవసమగు నీ కౌగిలే కదవే
శ్రీవేంకటేశ్వరు సిరినగరు
తావుకొన్న మీ తమకము లేకదే
కావించిన మీ కళ్యాణములు ॥ఏమని॥

## భావామృతం

ఓ అలమేలు మంగమ్మా! వసంత శోభలీను నీ సౌందర్యపు సొగసులను నేనేమని వర్ణించగలను తల్లీ!

నిర్మలమైన నీ తెల్లని కన్నుల కాంతియే కదే! తల్లీ! వేంకటనాధునికి వెన్నెల వెలుగు. మాటి మాటికీ కలిగే నీ పులకరింతల మొలకల పూతలే కదే తల్లీ! స్వామికి పూలపాన్పులు. వాటిని నేనెట్లు వర్ణించగలను?

నీ మధురాధరముల మకరందములే కదే!తల్లీ! మా వేంకట రమణుడు నీ పెండ్లి విందులుగా అందుకొనినది. కనుపించీ కనుపించనట్లున్న నీ చిరునవ్వులు కర్పూర మిళితమైన వక్కపొడి సుగంధాన్ని వెదజల్లుచున్నవి కదే! తల్లీ!

స్వాధీనముచేసికొను నీ పరిష్వంగమే కదే! తల్లీ! ఆ శ్రీవేంకటేశ్వరుని శృంగారపురము. సుస్థిరమైన నీ మోహావేశమే కదా! తల్లీ! జరిపించబడిన మీ కళ్యాణ వైభోగములు.

## 1-65

### మున్నుడి

ఒకానొక కాలంలో బ్రాహ్మణులు, సుక్షత్రియులు, వైశ్యులు విద్యావంతులు త్రికాలములలో 'సంధ్య' వార్చేవారు. ఆ సంధ్యా వందన' కార్యక్రమంలో, కేశవనామాలు కీర్తించి తద్వారా జగన్నాధుని కొలిచి తాము ఆ నాటికి చేసిన పాపములనుండి పరిహారం పొందేవారు. నేటి నవీనయుగంలో సంధ్యవార్చే సంగతి దేవుడెరుగు, నారాయణుని పేరు నాలుకతో పలుకని వారే అధికులనిపించు కొంటున్నారు. అన్నమయ్య కాలంలో ఇంత దౌర్భాగ్యం లేదుకాని, చదువురాని సామాన్యులలో కేశవ నామాలు రానివారు చాలామంది వుండేవారేమో! అందుకే ఇలాంటి కీర్తనల్లోనే నామ సంకీర్తన జరిపి నాబోటి వారిని ఉద్ధరించారు 'పదకవితా పితామహులు'.

**ఆ.వే॥ కీర్తనంబులోన కృష్ణుని నామాలు**
**పాడెనన్నమయ్య భజనవోలె**
**వేంకటేశు గొలువ 'భేషైన' దారిరా**
**చదువు ' సంధ్య' రాని 'జడుని' కైన.**

**రాగం : మౌళవగౌళ**

శరణు శరణునీకు జగదేకపతి కృష్ణ
వరమునొసగవయ్య వాసుదేవ కృష్ణ ॥శరణు శరణు॥

మద్దులు విరిచినట్టి మాధవ కృష్ణ
సుద్దుల చెప్పుమయ్య అచ్యుత కృష్ణ
వొద్దు (ద్ద) రాగదవ్వ ఉపేంద్ర కృష్ణ
ముద్దులు గురియవయ్య ముకుందకృష్ణ ॥శరణు శరణు॥





గొల్లెతల మరిగిన గోవింద కృష్ణ
చెల్లెనయ్యనీ చేతలు శ్రీధరకృష్ణ
అల్లన దొంగాడవయ్య హరికృష్ణ
మల్లుల గెలిచినట్టి మధుసూదనకృష్ణ ॥శరణు శరణు॥

గోవులగాచినయట్టి గోపాలకృష్ణ
కైవశమై మమ్మేలు శ్రీ కరకృష్ణ
నీ విన్నపమావించు నారాయణ కృష్ణ
సేవకుడ జొమ్మినీకు శ్రీ వేంకట కృష్ణ ॥శరణు శరణు॥

### భావామృతం

జగన్నాధుడవైన ఓ శ్రీ కృష్ణ! నీకు శరణు. శరణు తండ్రీ! ఓ వాసుదేవా! కృష్ణా! మాకు వరముల ననుగ్రహింపుము.

ఱోటికి నిన్ను యశోద బంధించగా ఆ రోటితోనే పాకుతూ వెళ్ళి పెరటిలోని మద్దులను గూల్చి కుబేరుని పుత్రులైన మణికంఠునకు నలకూబరునకు శాపవిముక్తి నిచ్చిన మాధవుడవైన కృష్ణా! శరణు.

గీతా బోధనవంటి సుబోధను చెప్పవయ్యా అచ్యుత కృష్ణా! నావద్దకు రావయ్యా ఉపేంద్రుడ (వామనుడు)వైన కృష్ణా! ముద్దులొలికించి మా ముచ్చట దీర్చవయ్యా ముకుందుడవైన కృష్ణా!

గోపికలతో రాసక్రీడల నలవాటు చేసికొనిన గోవిందుడవైన కృష్ణా! నీకు శరణు. నీ చేష్టలు నీకే చెల్లును కదా! శ్రీధర కృష్ణా! మెల్లిగా పిల్లిలా దొంగిలించవయ్యా (నాహృదయాన్ని) శ్రీహరివైన కృష్ణా! మధు అనే రాక్షసుని మర్దించినట్లు చాణూరుడనే మహామల్లుని మర్దించిన మధుసూదనుడవైన కృష్ణా నీకు శరణు.

బృందావనంలో గోవులను కాచిన ఓ గోపాలకృష్ణా! నీకు శరణు. లక్ష్మీ కటాక్షము నొసగే కృష్ణా! మమ్ము నీ అధీనములో ఉంచుకొని ఏలుకో ప్రభూ! ఓ నారాయణ కృష్ణా! నా విన్నపములనాలకింపుము. తిరుమలేశుడవైన ఓ వేంకట కృష్ణా! మేము సదా నీ సేవకులమే తండ్రీ! అట్టి నీకు శరణు శరణు.

**1-66**

## మున్నుడి

తత్త్వబోధ చేయుటంలో తాళ్ళపాక ఆచార్యులు అద్వితీయులు. ఈ సారి అన్నమయ్య నేరుగా సంసారమును, మాయను, ఇంద్రియములను, చంచలమైన ఆశలను, పాపముల దొంతరను ప్రశ్నిస్తున్నారు. మేమేదో గొప్పవాళ్ళమని మమ్మల్ని ఆశ్రయించకిండి అని వాటన్నింటినీ మందలిస్తున్నారు.తోలుబొంతలో ఎముకలగూట్లో, పంచభూతాల దయవల్ల గుప్పెడు మెతుకులు తిని నెత్తుటి 'కోట'లో బిక్కుబిక్కుమని బ్రతుకుతున్న మా ఏడుపేదో మమ్మల్ని ఏడవనివ్వండి. మా వేంకన్నతో చెప్తా జాగ్రత్త అన్నట్లు పాడుతున్నారు.

**ఉ॥ ఇంకను రోయరేమనుచు నివ్విధి బుచ్చిరి అన్నమయ్యతాన్**
**మంకును వీడరేమనిరి, మానువుడెంచెడి యింద్రియమ్ములన్**
**పంకిలమైన పాపముల బారిబడన్ తగదంచు బల్కుచున్**
**వేంకటనాథు వేదమని విజ్ఞత దెల్పిరి కీర్తనంబునన్.**

**రాగం : దేవగాంధారి**

ఇంకనైనా రోయరాదా-యీ పాటివారమింతే
మంకుదనమేల మా-మాట వినరాదా ॥ఇంకనైనా॥

తోలుబొంత కట్టుకొన్న-దొరనింతే నన్నునీవు
కూళసంసారమా యేల- కొసరేవు
ఈలకొన్న యెముకల-యింటలో కాపురమింతే
యేలమాయ వెంటబెట్టే-వేమిగద్దు నీకును ॥ఇంకనైనా॥

పంచభూతపు చుట్టాల-బదుకులో వాడనింతే
యెంచ కింద్రియ యాచకు-లేలవచ్చేరు
కంచపు గాలావటించే-కలిమిలో వారమింతే
చంచలపు టాసలు చేయి-చాచనేటికి ॥ఇంకనైనా॥





నెత్తురు జలదుర్గాన-నిలిచినవాడనింతే
జొత్తుబాపములు యేల-చోటడిగేరు
హత్తిన శ్రీ వేంకటేశు-డాత్మలోననున్నవాడు
మత్తుపుటజ్ఞానమా-మమ్మేమి చూచేవు ॥ఇంకనైనా॥

**భావామృతం :**

ఓ మానవుడా! ఇంకనైన వెగటు భావన కలుగుట లేదా? మీసంసార యావతో మమ్మల్నెందుకు పట్టుకొని బాధిస్తారు? మా బ్రతుకే ఘోరంగా ఉన్నది. మా వల్ల మీకేం లాభం? మీకెందుకింత మొండితనం? ఇకనైన మా మాటవినరాదా?

నేను అందరిలాగా దర్పం చూపిస్తున్నాను కాని, నిజానికి తొమ్మిది కంతలున్న తోలు బొంతను కట్టుకొనివున్నాను. ఓ కుటిలసంసారమా! నాబోటి హీనుడి నావహించి నీకేం లాభం? నేనే ఒక ఎముకల గూట్లోవున్నాను. ఓ మాయా! నీవు నావెంటబడితే నీకేం ప్రయోజనం? నా అవస్థకునన్నొదిలేయరాదా?

నేను స్వయంగా బ్రతికే దమ్ములేక నాచుట్టాలయిన పంచభూతముల పంచజేరి బ్రతుకుతున్నాను. ఓ ఇంద్రియములారా ! అడుక్కుతినే వాడి దగ్గిర గోక్కు తినే వాడిలాగా నిరుపేదనైన నన్నుయాచిస్తారేమిటి? నన్నెందుకు పీడిస్తారు? నాదగ్గరకెందుకు వస్తారు? చంచలమైన ఆశలారా! నా జీవితంలో నేను సంపాదించిందంతా నాకంచంలోని గుప్పెడు మెతుకులు మాత్రమే. అంతకంటే సంపద నాదగ్గరేమి ఉందని నా దగ్గిర చేయిజాస్తున్నారు? ఎందుకు నా గొడవమీకు?

నేనే నెత్తురుతో నిండిన ఒక 'జలదుర్గము' లో వున్నాను, (శరీరంలో వున్నాను) నాకే గతిలేదు. ఓ పాపాలగుంపుల్లారా! నన్ను చోటు అడుగుతారేమి అన్యాయమే? సర్వాంతర్యామియైన శ్రీ వేంకటేశ్వరుడు నా ఆత్మలోనున్నాడు.

మదమెక్కిన ఓ అజ్ఞానమా! మమ్మల్నేంపరీక్షిస్తావు? అది నీవలన అవుతుందా?

## 1-67

### మున్నుడి

ఈ సంస్కృత సంకీర్తనలో అన్నమయ్య భక్తితో శ్రీ మన్నారాయణుని సంస్తుతిస్తున్నారు. భూకాంతునిగా, లక్ష్మీవల్లభునిగా, మంగళగౌరీస్తుత్యునిగా, దేవతా గణమకుటమణిరంజితపాదయుగళ శోభితునిగా, కైవల్యకాంతా రమణునిగా శ్రీ వేంకటేశ్వరునిగా, మూర్తివంతుని కీర్తిస్తున్నారు. “మోహనరాగమహా! మూర్తివంతమాయే....” నన్నట్లు మోహనరాగంలోని ఈ కీర్తన అమృతధారలో చల్లగా జలకమాడినట్లుంటుంది. ఆనందించండి మరి.....

**కం॥ నారాయణునికి స్తుతియిది**
**ఆరాధించంగ హరిని అమరము నందున్**
**ఈ రీతి సన్నుతించిరి**
**ఏరీ అన్నయ్యసాటి ఈ జగమందున్**

**రాగం : మోహన**

నమో నారాయణా (నమః)
సమధికానందాయ సర్వేశ్వరాయ ॥నమో॥

ధరణీసతీ ఘనస్తన శైలపరిరంభ-
పరిమళ శ్రమజల ప్రమదాయ
సరసిజ నివాసినీ సరసప్రణామయుత
చరణాయతేనమో సకలాత్మకాయ ॥నమో॥

సత్యభామా ముఖాంచన పత్రవల్లికా-
నిత్యరచనక్రియా నిపుణాయ
కాత్యాయనీ స్తోత్రకామాయతేనమో
ప్రత్యక్షనిజ పరబ్రహ్మరూపాయ ॥నమో॥





దేవతాధిపమకుట దివ్యరత్నాంశు సం-
భావితామల పాదపంకజాయ
కైవల్యకామినీ కాంతాయ తే నమో
శ్రీ వేంకటాచల శ్రీ నివాసాయ ॥నమో॥

### భావామృతం

ఓ శ్రీ మన్నారాణా! నీకు నమస్కరించి కీర్తించుచున్నాను. నీవు మిక్కిలి అధికమైన ఆనందమును సమకూర్చు సర్వేశ్వరుడవు. నీకు వినమృడనై నమస్కరించు చున్నాను.

భూకాంతయొక్క ఘనస్తనగిరులను కౌగిలించ నెగడిన పరిమళ స్వేదజలములచే ఆనందము పొందు ధరణీధరా! నీకు వందనము. పద్మాలయయైన శ్రీ లక్ష్మి సంతోషముతో కొలుచు పాదపద్మ యుగళము గల సర్వాత్మకా! నీకు ప్రణామములు.

నిత్యమూ సత్యభామ యొక్క ముఖమనెడి అంచనపత్రము మీద లతలతో ఏవేవో రచనలు చేయుటయందు సిద్ధహస్తుడవైన శ్రీ కృష్ణా! నీకు వందనములు. కాత్యాయనీదేవి (పార్వతీ దేవి) చే స్తుతింపబడు కామితప్రదాయకా! నీవు కట్టెదుట ప్రత్యక్షమైయున్న పరబ్రహ్మ స్వరూపుడవు. నీకు నమస్కరించెదను.

ఓ ప్రభూ! అఖిలదేవగణములచే పాదాభివందనము స్వీకరించుచుండగా వారికిరీటములలోని మణుల దివ్యకాంతిచే మెఱయు పాదపద్మములు గలవానివై ప్రకాశించుచుంటివి. నీవు ముక్తికాంతా వల్లభుడవు. ఓ శ్రీ నివాసుడవైన వేంకటాచలాధిపా! నీకు భక్తి పురస్సరంగ వందనమాచరించుచున్నాను. నన్నునుగ్రహింపుము తండ్రీ!

## 1-68

### మున్నుడి

నృత్యం చేస్తున్నప్పుడు తాళబద్ధంగా పదఘట్టన గావించుటకు "ధిత్తై, ధిత్తై, ధిత్తై" అంటూ చేతులతో తాళంవేయటం గమనించే వుంటారు. అది ఒక క్రమంలో సాగుతుంది. అంతేకాని ' ధిత్తై' అనే మాటకు వేరే అర్థం ఉండదు. ఆ కోవలోకి చెందినవే "తత్తాతి గుడి ధిం ధిం ", "తకధిం", "తిత్తి తిత్తి తిత్తి", "తిరో తిరో" అనే మాటలు కూడా. ఇది సంస్కృత సంకీర్తన. నృసింహుని తాళానుగుణంగా స్తుతిస్తున్నారు అన్నమయ్య. ఈ కీర్తనకు భావామృతం చెప్పటం కష్టసాధ్యమని వేరుగా చెప్పవలసిన అవసరం లేదు కదా!

**ఆ.వె॥ తిత్తి తిత్తి తిత్తి ధిం ధిం తిరో తిరో**
**అనుచు ' తాళ' గతిని అన్నమయ్య**
**కీర్తనంబు పాడె గీర్వాణభాషలో**
**వేంకటేశు గొలిచె వినుడు దీని**

**రాగం : మోహన**

తత్తాతి గుడి ధిం ధిం తకధింధిం
తిత్తి తిత్తి తితి తితి తితి ॥తత్తాతి॥

దానవదన వితాన దాన సం-
ధానరుధిర నిజపాన మిదం
నానాభూతగణానాం గానం
దీనజనానాం తిత్తిత తితి తితి ॥తత్తాతి॥

విమత దనుజమత విభవపరిభవిత
సమధికం తవ శౌర్య మిదం
ప్రమదా భవ్యం ప్రమాదాభరణం
తిమిర నిరసనం తిత్తితి తితి తితి ॥తత్తాతి॥





తిరువేంకటగిరి దేవ నిధానం
పరమామృతరస భాగ్యమిదం
కరుణావరణం కమలా ఘటనం
తిరో తిరో తిత్తితి తితి తితి ॥తత్తాతి॥

**భావామృతం**

తత్తాతిగుడి ధిం ధిం తక ధిం ధిం

తిత్తి తిత్తి తితి తితి తితి

ధారాళముగా కారుచున్న ' చొంగ' తో కలిసిపోయిన రక్తమునంతయూ వచ్చింది వచ్చినట్లే త్రాగివేయుచున్నవాడీ నరసింహుడు. రకరకములైన జీవగణములు అన్నియూ కీర్తించి పాడుచున్నారు. దీనజనులు తిత్తి తిత్తి అని నర్తించుచున్నారు.

శత్రువులైన రాక్షసుల యొక్క వైభవమును దారుణంగా అవమానించు శౌర్యము కలవాడీ నరసింహుడు దానవులను అజ్ఞాన తిమిరములావహించగా వారికి సంతోషముతో కలిగే ఏమఱుపాటును నిరసించే ఆయన ప్రతాపమే తిత్తితి తితి.

ఇది తిరువేంకటపతి పుణ్యనిలయము.' పరము' అనే అమృతం పొందే భాగ్యం ఇక్కడ కలుగుతుంది. ఇది దయావృష్టికి నెలవు. లక్ష్మీదేవికి ప్రియమైన స్థానం ఈ మహానుభావుని హృదయమే. తిరో తిరో తిత్తితి తితి.

**1-69**

## మున్నుడి

తిరుపతిలో గోవిందరాజస్వామి తన దేవేరులతో వూరేగుతున్నాడు. కోలాహలం చేస్తున్న భక్త బృందాలతో పురవీధులుక్రిక్కిరిసిపోయాయి. విచ్చుకత్తులు ధరించిసేన జనుల భద్రత కోసం సాగి తోడుగావస్తున్నది. వింజామరలు వీచి స్వామికి సేవ చేస్తున్నారు మరికొంతమంది. కన్నులారా ఆ వూరేగింపు చూచిన వారిదే భాగ్యం. అన్నమాచార్యుల వారు ఆ నాటి ఆ ఊరేగింపుని కళ్యాణి రాగంలో కమనీయమైన కీర్తనగా ఆలపించారు. దానిని అవధరించండి.

**ఆ.వె॥కొలువు దీర్చియున్న గోవిందరాజును**
**కొలిచెనన్నమయ్య చెలువుమీర**
**పురము వీధులందు వూరేగు శోభను**
**చూడరయ్య జన్మశుద్ధమగును.**

**రాగం : కళ్యాణి**

కొలువై వున్నాడు వీడెగోవిందరాజు
కొల కొల నేగి వచ్చె గోవిందరాజు ॥కొలువై॥

గొడుగుల నీడల గోవిందరాజు
గుడిగొన్న పడగెల గోవిందరాజు
కుడియెడమ కాంతల గోవిందరాజు
కొడిసాగే పవుజుల గోవిందరాజు ॥కొలువై॥

గొప్ప గొప్ప పూదండల గోవిందరాజు
గుప్పెటి వింజామరల గోవిందరాజు
కొప్పుపై చుంగులతోటి గోవిందరాజు
కుప్పికటారములతోడి గోవిందరాజు ॥కొలువై॥





గొరబుసింగారాల గోవిందరాజు
కురులు దువ్వించికొని గోవిందరాజు
తిరుపతిలోనను తిరమై శ్రీ వేంకటాద్రి
కురిసీవరము లెల్ల గోవిందరాజు. ॥కొలువై॥

## భావామృతం

కొలువుదీర్చి కూర్చున్న ఈ మహానుభావుడే గోవిందరాజస్వామి. ప్రజలందరూ జయజయ నినాదంబులు సేయుచుండగా గొప్ప ఊరేగింపుగా తరలివచ్చుచున్నవాడే గోవిందరాజు స్వామి.

ఈ స్వామి చల్లగా గొడుగుల నీడలోవచ్చుచున్నాడు ఈ గోవిందరాజు స్వామి. క్రమ్ముకొన్న ఆదిశేషుని పడగల క్రిందనున్నాడు. ఈ స్వామి కిరువైపులా భూదేవి శ్రీ దేవి మనోహరముగానున్నారు. ఈ గోవిందరాజస్వామి ఊరేగింపులో బారులుదీరి దండుగా రక్షకభటులు సాగివచ్చుచున్నారు.

గోవిందరాజస్వామికి ఆయన దేవేరులకి గొప్పగొప్ప పూదండలు వేసి అలంకరించినారు. భక్తులువింజామరలు చేబూని భక్తితో స్వామికి వీస్తున్నారు. ఈ గోవిందరాజు స్వామి వారి కొప్పుపై 'చుందులు' ఉన్నవి. గోవిందరాజు స్వామివారు పదునైన విచ్చుకతులు ధరించిన సేనతో ఊరేగివచ్చుచున్నారు.

గోవిందరాజస్వామి గొప్పగా సింగారించుకొని తరలివచ్చుచున్నాడు. ఈ గోవిందరాజులు తన కురులను సొగసుగా దువ్వించుకొనినాడు. తిరుపతి నగరమున స్థిరముగా నెలకొని ఈ గోవిందరాజస్వామి విలసిల్లుచున్నాడు.

మహానుభావుడైన ఈ గోవిందరాజ స్వామి కోరిన వరములెల్ల కురుపించు కల్పవృక్షము వంటివాడు.

**1-70**

## మున్నుడి

అన్నమాచార్యులవారు తానుకూడ ఒక చెలికత్తె వలె భావించి తోటి చెలికత్తెలను మందలిస్తున్నారు. కులుకులు చూపించుకొంటూ నడవకండే అమ్మాయిలూ! అలానడిస్తే, మీ తలలోంచి రాలిన జాజిపూలు గుచ్చుకొని మా అలమేలు మంగ కాళ్ళునెప్పిపెట్టవూ? అని మరీ ఆక్షేపిస్తున్నారు అన్నమయ్య. ఒళ్ళంతా కదిలిపోయేలా నడవకండే మా అమ్మపైట చెంగు జారి ఆ కంగారులో చెమట పడుతుంది నుదురు మీద, అని గదమాయిస్తున్నారు. భావం అంతా ఇక్కడేచేప్పేస్తే కీర్తనలో మాధుర్యం తగ్గిపోతుందేమో. అంత,రసవత్తరమైన గీతమిది. అవధరించండి మరి....

**చం॥ కులకక వేయరే అడుగు కోమలులార! ధరిత్రి రాలెనే**
**జలజల కొప్పులోవిరులు జాజులు యంచని అన్నమయ్యతాన్**
**తెలిపిరి, కీర్తనంబు వినతేనియలూరును ఏడుకొండలన్**
**కొలువగు వేంకటేశ్వరుడు కూడెను మంగకు తోడునీడయై**

**రాగం : అఠాణా**

కులుకక నడవరో కొమ్మలాలా
జలజల రాలీని జాజులు మాయమ్మకు ॥కులకక॥

ఒయ్యనే మేను గదలీ నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీ పాద తాకు కాంతలాలా
పయ్యెద చెరగు జారి భారపు గుబ్బల మీద
అయ్యో చెమరించీ మాయమ్మకు నెన్నెదురు ॥కులకక॥

చల్లెడి గందవోడి మైజారీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దు పణతులాలా
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చులదర
గల్లనుచు కంకణాలు కదలీ మాయమ్మకు ॥కులకక॥





జమళి ముత్యాలతోడి చమ్మాళిగ లిడరో
రమణికి మణుల ఆరతులెత్తరో
అమరించి కౌగిట అలమేలు మంగ నిదె
సమకూడె వేంకటేశ్వరుడు మాయమ్మకు ॥కులకక॥

## భావామృతం

ఓ వనితల్లారా! మీరంతా కులుకుటమాని తిన్నగా నడవండి. మీ తలలోని జాజులు రాలి మా అమ్మ అలమేలు మంగకు. ఇబ్బంది కలిగిస్తున్నాయి. (పూలని తొక్కినా ఆమె లేత పాదములు కంది పోతున్నాయి.

అతిమెల్లగా మీ శరీరాలు కదిలిస్తూ మంచిగా నడవండే, గయ్యాళియైన లక్ష్మీదేవి అడుగులకి మడుగులొత్తే ఓ భామల్లారా! మా అలమేల మంగ కంగారుపడి తన ఘనస్తనములపై పమిటజారి సర్దుకొనే ఆ హడావిడిలో, అయ్యయ్యో! మా అమ్మకు ఫాలభాగమంతా చెమట పట్టింది. మీరు కాస్తమెల్లగానడవండి.

మాతల్లి పల్లకిని మోసే ముద్దుగుమ్మల్లారా! కాస్త నిలబడరమ్మా! ఆమె తనపై చల్లుకొన్న గంధపు పొడి అంతా ఆమె వంటి పై నుండి జారినేల పాలవుతుంది. శ్రేష్టమైన బంగారంలో అమర్చిన ముత్యాల కుచ్చులు అదిరిపోతున్నాయి. (ముత్యాలు రాలిపోతాయి ఆ అదురుడికి). ఆమె చేతి కంకణములు గల్లుమని కదులుతున్నాయి. (కాస్త గుర్రం కట్టేయండీ మరీ...)

ఓ చెలికత్తియలారా! మీరు రెట్టింపైన ముత్యాలతో “చమ్మాళిగలు” ఇవ్వండి. ఈ దేవికి మణులతో మంగళ హారతి ఇవ్వండి. ఎందుకంటే, ఇదిగో మా అమ్మకు జగన్నాథుడైన వేంకటరమణుడు సమకూడి తన బిగికౌగిట ఈ అలమేలు మంగమ్మను అమరించుకొనియున్నాడు. ఆ సర్వేశ్వరుని రాణిని కాస్త జాగ్రత్తగా చూసుకోండి మరీ!....

## 1-71

### మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుని మోహన రూపాన్ని నుతిస్తున్నారు అన్నమాచార్యులవారు. మధురమైన మోహనరాగంలో సాగుతుంది ఈ కీర్తన. పదికోట్ల మన్మధుల్ని కూడా తలదన్నే సుందర రూపం ఆ స్వామిది. త్రిపురాసురుల భార్యలను మోహపరిచి వారిని శీలచ్యుతులను గావించి ఆ దైత్యులను సంహరించిన రూపం అనివర్ణిస్తున్నారు అన్నమయ్య. నిగూఢమైన పరిజ్ఞానం ఉంటేగాని ఈ వాక్యానికి అర్థం తెలియదు. నూటికి ఒక్కరికో ఇద్దరికోగాని పూర్తిగా అవగతమయ్యే అవకాశమేలేని కీర్తనలు అన్నమయ్యవి.

**ఉ॥ రాగము మోహనంబు, విమలంబగు కీర్తన నాలకింపుడీ**
**ఈ గతి తాళ్ళపాక గురుడింపుగ పాడెను, వేంకటేశుడున్**
**కౌగిట జేర్చిభూసతిని గ్రక్కున, వీడక శ్రీ వధూటినిన్**
**బాగుగ నిల్పెనంట యెద, బాయని మోహన రూపుదౌటచే.**

**రాగం : మోహన**

అదె చూడరే మోహన రూపం
పది కోట్లు గల భావజ రూపం ॥అదె చూడరే॥

వెలయగ పదారువేల మగువలను
అలమిన ఘనమోహన రూపం
వలచిన నందవ్రజము గొల్లెతల
కులుకు చూపులకు గురియగు రూపం ॥అదె చూడరే॥

ఇందిరా వనితనెప్పుడు తన వుర-
మందు నివిపిన మోహనరూపం
కందువ భూసతి కౌగిట సొంపుల
విందులు మరిగిన వేడుకరూపం ॥అదె చూడరే॥





త్రిపుర సతుల బోధించి రమించిన
అపురూపపు మోహన రూపం
కపురుల శ్రీ వేంకట పతియై ఇల
ఉపమించగ రాని వున్నతరూపం ॥అదె చూడరే॥

### భావామృతం

అదిగో మోహన రూపుడైన ఆ మహానుభావుని చూడండి. పదికోట్ల మన్మధులను కూడ అతిశయించగల సుందర రూపమా స్వామిది.

ప్రసన్నుడై పదియారువేలమంది భామలను ఆక్రమించు ఘనమైన మోహన రూపం ఈయనిది. నందవ్రజంలో (గోకులంలో) తనను ప్రేమించిన గోపికల వయ్యారపు చూపులకు గురియైన అద్భుతమైన రూపం ఈ మోహనునిది.

శ్రీ కాంతను ఎల్లవేళలా తన వక్షస్థలమున నిలుపుకొని సమున్నత స్థానమందించిన జగదేకపతి రూపం ఈ స్వామిది. సామర్థ్యముకలవాడై భూదేవికౌగిలిలో అందముగ విందులారగించిన వేడుగాడైన రూపం ఈ పురాణపురుషునిది.

త్రిపురసురల అంతమునకు వారి భార్యల పాతివ్రత్యం అడ్డుగానున్నదని బోధించి లోక కళ్యాణం కోసం వారితో శృంగారం జరిపిన లోకేశ్వరుని రూపం ఈ దేవునిది. సంభ్రమము కలిగించు శ్రీ వేంకటేశ్వరుని అనుపమమైన అద్భుత రూపమిది. చూచి తరించండి.

**1-72**

## మున్నుడి

కలిమికి అధినాయిక అయినా వేంకటరమణుని అరాంగియై స్వామివారి తలపులలోమైమరచి ఆనందంతో నృత్యం చేస్తోంది అలమేలు మంగమ్మ. చెలికత్తెలు ఆమెను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. శ్రీ హరి కరిగిపోయేట్లుంది ఆమె. ఆ నృత్యానికి సరితూగే పాటలు, అందియల మ్రోతలు... కాసేపు మనని కూడ తిరుమల స్వామివారి సన్నిధికి తీసికొని పోతున్నారా 'పదకవితా పితామహులు'. త్యాగయ్య అన్నట్లు "సొగసు చూడతరమా!!" అయినా ....చూడండి.....

**చం॥ అలరులురాలగా రమణి ఆడెనటంచును సన్నుతించుచున్**
**తెలిపిరి అన్నమ్యయిటుదీటుగ, వేంకటనాథు భామయౌ**
**కలిముల రాణినిన్ గొలువ కమ్మని కీర్తన నాలకింపుడీ**
**చెలువము తోడుతన్ వినుడు శీఘ్రమెపొందుదు స్వామియెన్నికన్**

**రాగం : శంకరాభరణం**

అలరులు కురియగనాడెనదే
అలకల కులుకుల నలమేల్మంగ ॥అలరులు॥

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెర మరుగున నాడెనదే
వరుసగ పూర్వదువాళపు తిరుపుల
హరికరగింపుచు నలమేల్మంగ ॥అలరులు॥

మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిటు చిమ్ముచు నలమేల్మంగ ॥అలరులు॥





చిందుల పాటల సిరిపొలయాటల
అందెల మ్రోతల నాడె నదే
కందువ తిరువేంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేల్మంగ ॥అలరులు॥

## భావామృతం

అదిగో ఆ అలమేలు మంగమ్మ తల్లి పూలవాన కురుస్తుండగా నర్తించుచున్నది. ఆమె చిరుకోపం ప్రదర్శించే కులుకులతో మనోహరంగా ఉన్నది. ఆ వైభవం వర్ణనాతీతము

ఆమె చెలికత్తెలు అహో! అని మెచ్చుకొనుచున్నారు. అరవిచ్చిన మొగ్గవంటి ఆ దేవి సగము మూసియున్న తెరచాటున నృత్యముచేయుచున్నది క్రమబద్ధమైన అశ్వయానము వంటి నడకతో ఆ తల్లి శ్రీ హరినే కరగించి వివశుని జేసి తనకు అనుకూలుని గా జేసికొనినది.

మెల్లగా, తిన్నగా నడచుట చేత అలమేలు మంగమ్మ మట్టెలు సవ్వడి చేయుచున్నవి. ఇక (స్వామి వచ్చాడేమో నను తత్తర పాటు కాబోటు)ఆమె గబ గబా అక్కడ నుంచి దాటుకొని పోయినది. అప్పుడు ఆదేవి కాలికి ధరించిన వజ్రపు పెండెములు తళుక్కుమని మెఱయుచు తమ అద్భుతమైన కాంతులను నలుదెసలా విరజిమ్ముచున్నవి.

చిందులు వేయునట్లున్న పాటలతోను, శోభలీను ఆటలతోను ఆ ప్రదేశం ఉత్సాహభరితంగా ఉన్నది. కాలి అందియలు ఘల్లు ఘల్లుమని ధ్వనిస్తుండగా ఆ దేవి ఆడుచున్నది. సమర్థుడైన శ్రీ వేంకటేశ్వరుడు, తిరుమలాధీశుడై ఆ నృత్యాన్ని తిలకించి మెచ్చుకొంటున్నాడు. ఆ విధముగా అందమైన కదలికలతో ఈ అలమేలు మంగమ్మ నడయాడుచున్నది.

## 1-73

### మున్నుడి

సర్వేశ్వరుడెక్కడన్నా మనముందు చేతులు జాపుతాడా? ఒక వేళ జాపిన కూడ మనమాయనకేమీయగలమా? ఎంత అజ్ఞానులం!! ఈ సత్యం తెలియక మేము స్వామివారికి వజ్రాలకిరీటం చేయించామండీ, మేము రత్నాల హారం చేయించాము, అని విర్రవీగే అమాయకులకోసమే ఈ కీర్తన చెప్పారు అన్నమయ్య. ఆయన మన చేత ఏసేవ చేయించుకొన్నా అదిమనని పాప విముక్తుల్ని చేయుటానికి మాత్రమే. సుకృతం వలన మనకు సిద్ధించిన భాగ్యమదియని గ్రహిస్తే చాలు...మనం సరి అయిన దారిలో పడ్డట్లే . అలవోక పదాలతో చెప్పిన అద్భుత కీర్తనమిది.

**కం॥ అన్నిటికి నీశ్వరుండట**
**ఎన్నగ 'వేంకన్నదొర'కు ఏమిత్తుమురా?**
**చెన్నుగ వివరము లిచ్చెడి**
**అన్నయ్యను వినుడు గీతమద్భుతము భళా!!**

**రాగం : హిందోళ**

ఏమని పొగడవచ్చునీతని ప్రభావము
వేమరువో పుణ్యులాల వినరో యీకతలు ॥ఏమని॥

అనంత సూర్యతేజుడట కాంతి చెప్పనెంత
దనుజాంతకుండట ప్రతాపమెంత
మనసిజగురుడట మరిచక్కదనమెంత
వనజజు గనినయట్టి వాడట ఘనతెంత ॥ఏమని॥

గంగాజనకుడటక డు చెప్పే పుణ్యమెం
చెంగట భూకాంతుడట సింగారమెంత
రంగగు లక్ష్మీశుడట రాజసము లెంచనెంత
అంగవించు సర్వేశుడట సంపదెంత ॥ఏమని॥





మాయానాధుడట మహిమవచించుటెంత
యేయెడ దావిష్ణుడట యిరవెంత
పాయక శ్రీ వేంకటాద్రి పతియై వరము లిచ్చే
వేయిరూపుల వాడట విస్తారమెంత ॥ఏమని॥

### భావామృతం

ఈ మహానుభావుని ప్రభావమును మనం ఏమని పొగడ గలము? మాటిమాటికీ ఈయన కథలను ఆలకించండి. ఓ పుణ్యాత్ములారా! అదే పుణ్యం అంటే.

లెక్క లేనంతమంది సూర్యుల కాంతి గలవాడీ స్వామి. ఇక ఆయన కాంతి ఎంతని చెప్పగలం? అసురులను నిర్మూలించుటయే ధ్యేయముగా కలవాని ప్రతాపమెంతటిదని చెప్పగలము? ఈయన మన్మధునికే కన్నతండ్రియట, మరి ఎంత చక్కని వాడో ఎలా చెప్పగలం? సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మగారినే సృష్టించిన కన్నతండ్రి ఈ స్వామి. మరి ఈయన ఘనత ఇంతని ఎలా చెప్పగలము?

సురగంగను తన పాదములనుండి పుట్టించిన పుణ్యమూర్తి పుణ్యమింతయని చెప్పగలమా? తన సమీపముననే భార్య భూదేవిని నిలుపుకొను సింగారాలు ఎలావర్ణించగలము? వైభవోపేతుడైన శ్రీ కాంతుని ఠీవిని యెంచగలమా? ఎల్లప్పుడు ఉత్సాహముతోనుండు ఈ సర్వేశ్వరుని సంపదయెంతటిదో ఎలా తెలుస్తుంది?

ఈ స్వామి మాయాదేవికే నాధుడు. ఈయన మహిమను చెప్పగలుగుట జరిగేపనేనా? ఎక్కడబడితే అక్కడ వ్యాపించియుండేవాడు కావుననే ఈయనను విష్ణువు అన్నారు. ఇక ఇది ఈయనుండే చోటని చెప్పగలమా? విడువకుండా వేంకటపతియై అంతులేని వరములిచ్చే విశ్వరూపుడైన వేయిరూపముల జగదీశ్వరుని వైశాల్యమెంతో చెప్పే శక్తి ఎవరికుంది?

**1-74**

## మున్నుడి

పదిరోజులకి సరిపోయే తిండి ఒక్కరోజే నోట్లో కుక్కుకొని కడుపులో దాచుకొని బ్రతకాలంటే జరిగేపనేనా? ఈ కడుపెంత తింటుంది? ఇతరులకు మేలుచేయని దదేంజన్మ? పరహితము నేర్పని చదువేం చదువు? ఎప్పుడూ ఏవేవో ఆశలతో బ్రతుకు జీవితం దేనికి అని మందలిస్తున్నారు అన్నమయ్య ఈ కీర్తనలో. శ్రీ వేంకటేశ్వరుని సేవించి తరించడానికి కాకపోతే మనిషికి భోగభాగ్యముల వల్ల ప్రయోజన మేమిటంటున్నారు.

**మ॥ కుడుచున్ నీకడుపెంత దానికొరకై కోట్లెంచి ఆర్జించుచున్**
**మిడుకన్‌యేలర? పాపరాశి పెరుగన్ మేలైన శ్రీ వేంకటే**
**శుడు నీ అండగనుంచు కొమ్ముపరులన్ జొప్పించి వేధించకన్**
**ఇడె జ్ఞానంబును అన్నమయ్య భళిరా! ఈ సత్యమున్ యెంచుడీ**

**రాగం : గుండక్రియ**

కడుపెంతతాకుడుచు కుడుపెంత దీనికై
పడని పాట్ల నెల్ల పడి పొరలనేల ॥కడుపెంత॥

పరుల మనసునకు ఆపదలు కలుగగజేయు
పరితాప కరమైన బ్రతుకేల
సొరిది యితరుల మేలుచూచి సైపగలేక
తిరుగుచుండే కష్టదేహమది యేల ॥కడుపెంత॥

ఎదిరికెప్పుడు చేయు హితమెల్ల తనదనుచు
చదివి చెప్పని యట్టి చదువేల
పొదిగొన్న యాసతో బుంగుడై సతతంబు
సదమదంబైపడయు చవులు తనకేల ॥కడుపెంత॥



భావయామి వేంకటేశం

శ్రీ వేంకటేశ్వరుని సేవానిరతికి గాక
జీవనభ్రాంతిపడు సిరులేల
దేవోత్తముని యాత్మ తెలియనొల్లక పెక్కు
త్రోవలేగిన దేహి దొరతనంబేల ॥కడుపెంత॥

## భావామృతం

ఎవరన్నా ఆకలి తీరిన తరువాత మెతుకైనా తినలేరు. కావున ఈ కడుపుయెంత తింటుందని? దీనికోసం పడరాని పాట్లుపడి జీవించాలా? అంత అవసరమేమొచ్చింది?

ఇతరుల మనసుకు కష్టము కలిగించుచు జీవించే నరకప్రాయమైన బ్రతుకు గడుపుట ఎందుకు? అది నిరుపయోగము కదా! అంచెలంచలుగా ఇతరులు యెదుగుతున్నారని చూచి సహించలేని తనమనస్సు కష్టపెట్టుకొంటూ తిరిగే ఈ పాడు దేహం వలన ప్రయోజనమేమిటి?

ఎదుటివారికి చేయు ఉపకారమును తనకు తాను చేసికొనుచున్న ఉపకారముగా భావించి చేయవలెను అని నేర్పనట్టి చదువు అసలు చదువేనా? అట్టాంటి చదువు ఎవరికి మేలు చేస్తుంది? మూకమ్ముడిగా పోగై ఆశలతో ఎప్పుడూ చిన్నబుచ్చుకొని అట్టిటవుచూ పొందే రుచులు(అనుభవాలు) తనకెందుకు?

శ్రీ వేంకటేశ్వరుని సేవించి తరించవలెనను కోర్కెతీరుటకు కాకపోతే సిరులు సంపదలు ఎందుకు? వాటిని సంపాదించాలనే జీవన భ్రాంతియెందు కోసం? సర్వేశ్వరుడైన ఆ మహానుభావుని ఆత్మయందు దర్శించుటకు ప్రయత్నించకుండ ఆయా మార్గాలలో పోయేవైభవాలూ, దర్పములూ, డాంబకములా శుద్ధదండగ కదా!

## 1-75

## మున్నుడి

అరుదైన ఈ చక్కటి కీర్తనలో అన్నమాచార్యులవారు 'ఆండాళ్' అని పిలవడబే నాంచిరి దివ్యవైభవాన్ని అనేక నామములతో నుతిస్తూ చెబుతున్నారు. ఈమెను గోదా దేవిగా జగద్విఖ్యాతాం చేసినవి ఈమె స్వామి విరహంతో పాడిన 'పాశురములు'. తిరుప్పావైగా ప్రసిద్ధిచెందిన వాటిని పాడని తమిళబాలిక ఉండదు అంటే అతిశయోక్తి కాదు. రంగనాధస్వామినివలచి, వలపించుకొనిన ఈ తల్లి లక్ష్మీ దేవి అవతారమే. ఈమె తనసిగలో పూదండ పెట్టుకొని 'బాగుంది' అని తృప్తి పడ్డాక స్వామికి అర్పిస్తే మహాప్రీతితో వాటిని స్వీకరించేవాడట స్వామి, వాటి పరిమళం రెట్టింపవడం వల్ల. అందుకే ఆమె 'చూడికుడుతనాంచారి' అని ప్రసిద్ధిచెందింది. తానూ ఒక చెలికత్తెయై పాడుతున్నారు అన్నమయ్య.

**తే॥ "చూడికుడుతనాంచారి" ఈ సుందరాంగి**
**సిగను ముడిచిన విరిదండ తగుదునంచు**
**స్వామికిచ్చిన 'గోదా'యె సతిగమారె**
**తమిళు'లాండాళ్' యనెంచెడీ తల్లి 'లక్ష్మి'.**

**రాగం : మధ్యమావతి**

చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ
కూడున్నది పతి చూడికుడుత నాంచారి ॥చూడరమ్మ॥

శ్రీ మహాలక్ష్మియట సింగారాలకే మరుదు
కాముని తల్లియట చక్కదనాలకే మరుదు
సోముని తోబుట్టువట సొంపుకళలకే మరుదు
కోమలాంగి ఈ చూడికుడుత నాంచారి ॥చూడరమ్మ॥

కలశాబ్ధి కూతురట గంభీరాలకే మరుదు
తలప లోకమాతయట దయ మరి ఏమరుదు
జలధి నివాసినియట చల్లదన మేమరుదు
కొలది మీర ఈ చూడికుడుత నాంచారి ॥చూడరమ్మ॥





అమర వందిత యట అట్టేమహిమకే మరుదు
అమృతము చుట్టమట ఆనందాలకే మరుదు
తమితో శ్రీ వేంకటేశు తానెవచ్చిపెండ్లాడె
కొమెర వయస్సు ఈ చూడికుడుత నాంచారి ॥చూడరమ్మ॥

## భావామృతం

(రాజుతలచు కొంటే దెబ్బలకు కొదవా? అనే సామెత ఉన్నది. జగజ్జనని అవని నవతరిస్తే స్వామి వెతుక్కుంటూ వచ్చిమరీ పరిణయమాడుతాడు. అదే జరిగింది గోదాదేవి కళ్యాణంలో. నాంచారి అని పిలువబడే ఆ తల్లికేంతక్కువ? చూడండి......)

ఓ అమ్మాయిల్లారా! ఇటుచూడండమ్మా! సొంపుగా పాడండమ్మా! ఈ అపరలక్ష్మీదేవి తన భర్తతో కూడియున్నది. ఈమె వాడిన పూమాలల నర్పించిన నాంచారి.

ఈమె స్వయంగా శ్రీ మహాలక్ష్మియేనట. ఇక ఈమె సింగారింపులకు ఏమితక్కువ? మన్మధునివే కన్నతల్లియైన ఈమె సౌందర్యం వర్ణించగలమా? దానికేమి తక్కువ వుంటుంది. చంద్రునితోబుట్టు వయిన ఈమె కళలకు వెలితియుంటుందా? ఈ కోమలాంగినే చూడికుడుతనాంచారి (ముడిచిన విరిదండ నర్పించిన ఆండాళ్ ) అని పిలుస్తారు. ఈమె లక్ష్మీదేవి అవతారము.

ఈమె క్షీరసాగరకన్య. గంభీరంగా ఉంటుందంటే ఉండదూ? దానికేం తక్కువ? సమస్తలోకములకు జనని కావున ఈమె దయ అపరిమితం. దానికేమి తక్కువ? ఇక ఈమె ఉండేదే జలధి (సముద్రం)లో. చల్లదానాని కేంతక్కువ? ఏదీతక్కువ కాని ఈ తల్లినే అందరు చూడికుడుతనాంచారి అనిపిలుస్తొన్నారు.

దేవతలందరి చేత సన్నుతింపబడు ఈమె మహిమలకు సాటి కలదా? వాటికెంతక్కువ? అమృతం అందరికీ ఆనందమునిస్తుంది. క్షీరసాగరమధనమప్పుడు అమృతంతో పాటు బుట్టిన ఈమె ఇచ్చే ఆనందానికి కొదవవుంటుందా? కోరికతో శ్రీ వేంకటేశ్వరుడు రాయబారాలు నడిపి మరీ పెండ్లాడిన ఈ నవయవ్వన సుకుమారినే భక్తులందరు చూడికుడుత నాంచారి అని పిలుస్తున్నారు.

**1-76**

## మున్నుడి

తల్లిదండ్రులు అతిశ్రద్ధతో జాగ్రత్తతో తమ సంతానాన్ని కంటికి రెప్పలా ఎట్లు రక్షిస్తారో, జీవులందరికీ తండ్రియైన పరమాత్మ జీవులందరినీ రక్షిస్తున్నాడు. పంచభూత రూపమున రక్షిస్తున్నాడు. వాటి రూపంలోనే జీవుల్ని శిక్షిస్తాడు కూడా. ఒక్క సారి ఆలోచిస్తే భూకంపాలూ, జలప్రళయాలు, అగ్నిప్రమాదాలు, సుడిగాలులూ. ఆకాశం నుంచి రాలిపడే ఉల్కలూ మొదలైనవెలా వస్తున్నాయి? అన్నమాచార్యులవారు ఆ పరంధాముని ఎంత అద్భుతంగా కీర్తిస్తున్నారో ' ఆనంద భైరవి'లో వినండి.

**ఆ.వె॥ పంచభూతములును పరమాత్మ రూపులే**
**పెంచుగాని జనుల ద్రుంచుగాని**
**రక్ష అన్నమయ్య రమణుని వేడుట**
**వినుడు మధురగీత విభవమొప్ప.**

**రాగం : ఆనందభైరవి**

ఆదిమూలమే మాకు అంగరక్ష
శ్రీ దేవుడే మాకు జీవరక్ష ॥ఆది మూల॥

భూమిదేవి పతియైన పురుషోత్తముడే మాకు
భూమిపై నేడ నుండినా భూమిరక్ష
ఆమని జలధిశాయి అయిన దేవుడే మాకు
సామీప్యమందున్న జలరక్ష ॥ఆది మూల॥

మ్రోయుచు అగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుడే
ఆయములు దాకకుండ అగ్నిరక్ష
వాయుసుతునేలినట్టి వనజనాభుడే మాకు
వాయువందు కందకుండ వాయురక్ష ॥ఆది మూల॥





పాదమాకసమునకు పొరజాచే విష్ణువే
గాదివియై మాకు ఆకాశరక్ష
సాధించి శ్రీ వేంకటాద్రి సర్వేశ్వరుడే
సాదరము మీరినట్టి సర్వరక్ష ॥ఆది మూల॥

## భావామృతం

అన్నిటికీ ఆదిమూలమైనవాడు పరంధాముడైన సర్వేశ్వరుడు. అన్ని జీవులకు అంగరక్షకుడై పాలించువాడు ఆ జగదీశ్వరుడే. శ్రీ దేవుడైన ఈ మహానుభావుడే అందరికీ జీవనాధారము. అందుచేత ఆయనే ప్రాణులన్నిటికీ జీవరక్ష.

(అంతే సృష్టిలోని ప్రాణులన్నిటినీ ఆయన ఎలా రక్షిస్తున్నాడు. మనకి అగోచరుడు కదా! ఆయన తానే సృజించిన పంచభూతముల ద్వారా మనని కాపాడుతున్నాడు. పంచభూతముల రూపంలో అనగా భూమి, జలము తేజము(అగ్ని), వాయువు, ఆకాశము అనుపంచభూతముల రూపంలో జీవరక్ష చేయుచున్నాడు)

భూదేవతకు నాథుడైన ఆ పురుషోత్తముడే ఈ భూమి పై ఎక్కడనున్నా భూమిరూపంలో ఒక క్రమంలో అన్నీ జరుపుతూ భూరక్షకుడైయున్నాడు. సమృద్ధిగానున్న జలరాశికి స్థానమైన సముద్రమున శేషశాయియైశయనించు ఆ లోకేశ్వరుడే సమీపములోనే వున్న జలరక్షకుడు. ఆదేవుడే జలరూపమున కాపాడుచున్నాడు.

వేదమంత్రములు మారుమ్రోగుచుండగా అగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుడే జీవుల జీవస్థానములను తాకకుండా అగ్నిరక్షను కల్పించుచున్నాడు.... పవనపుత్రుడైన హనుమంతుని ఏలునట్టి పద్మనాభుడైన శ్రీ హరే (రామచంద్రుని వలె) మనకు గాలివలన అపాయము రాకుండా వాయురక్ష.

వామనావతారంలో ఒక పాదము చాచి ఏ మాత్రం సందులేకుండా ఆకాశమునంతా కప్పివేసిన విష్ణుమూర్తియే మాకు ఆకాశరక్ష. ఆకాశమువలనగాని దానిపై తిరుగు ఖగోళ పదార్థముల వేటివలనగాని ఆపద లేకుండ రక్షించుగాక! శ్రీ వేంకటాద్రిపైనున్న ఆ సర్వేరుడే సర్వమూ సాధించి కలిగినవాడు. ఆదర పూర్వకముగా ఆయనే సర్వులకు రక్షకుడుగానున్నాడు.

## 1-77

### మున్నుడి

ఇది నరసింహస్వామి భజన. అందమైన కీర్తనగా చెడుతున్నారు అన్నమాచార్యులవారు. సంస్కృతంలో స్వామిని శ్లాఘిస్తున్నారు. పలుమార్లు నరసింహుని సురనుతుడని, ప్రహ్లాదవరదుడని,భీకరాకారుడని, లక్ష్మీకాంతుడని ఎంతోమంది కీర్తించారు కాని స్వామిని 'సుగ్రీవుడు' అని చెప్పటం పదకవితామహుని ప్రావీణ్యం కాక మరొకటి కాదు. సుగ్రీవుడనగానే అందరికీ వానరరాజు భావనలో మెదలి ఏమిటీ రామాయణంలో పిటకాల (పిడకలు కాదండీ) వేట అనిపిస్తుంది. సుగ్రీవుడంటే చక్కటి మెడకలవాడని అర్ధం. అంటే నరసింహుడినలా సంబోధించారు అన్నమయ్య.

**చం॥ అనయము భక్తవత్సలుని ఆశ్రితభీతి విభంజనున్ హరిన్**
**వినయముతో నుతించెదరు వేల్పులనాథుడు, బ్రహ్మ, మౌనులున్**
**విను నరసింహవల్లభుని వేంకటనాభునిమారురూపుగా**
**తను భజియించె నన్నమయ దానిని మీకిటు తెల్పధన్యుడన్.**

**రాగం : పూర్ణ చంద్రిక**

నమో నమో లక్ష్మీ నరసింహా
నమో నమో సుగ్రీవ నరసింహా ॥నమో నమో॥

వరద సులభ భక్తవత్సల నరసింహా
నరమృగ వేష శ్రీ నరసింహా
పరమ పురుష సర్వ పరిపూర్ణనరసింహ
గిరిగుహావాస సుగ్రీవ నరసింహా ॥నమో నమో॥

భయహర ప్రహ్లాద పాలన నరసింహా
నయనత్రయారవింద నరసింహా
జయ జయ సురమునిసంస్తుత నరసింహ
క్రియా కలాప సుగ్రీవ నరసింహా ॥నమో నమో॥



భావయామి వేంకటేశం

అతి కృపానిలయ మోహనరూప నరసింహా
నత పితమహా ముఖ్య నరసింహ
సతత శ్రీ వేంకటేశ్వర దివ్య నరసింహ
కితవారి భంజన సుగ్రీవ నరసింహా ॥నమో నమో॥

### భావామృతం

ఓ లక్ష్మీనరసింహా! నీకు వందనములు. నీకు నమస్సుమాంజలులు. చక్కటి గొంతుక (మెడ) గల ప్రభూ నీకు నమస్కారములు.

బహుసులభముగా భక్తులపై వాత్సల్యముతో ఎన్నో వరములను ప్రసాదించు ఆకారము దాల్చిన అద్భుత శ్రీ నరసింహుడవు. అన్నిటిలోనూ సిద్ధహస్తుడవైన ఓ నరసింహా! నీవు పరమపురుషుడవు. చక్కటి మెడ గల నరసింహప్రభూ! నీవు పర్వత గుహలు నివాసముగా గల స్వామిమి (నరసింహ స్వామి ఎప్పుడూ పర్వత గుహలలోనే వెలసియుంటాడు).

తండ్రి హిరణ్యకశిపుని వలన పడరాని బాధలు పడుచున్న బాలప్రహ్లాదుని రక్షించి దానవుని మట్టుబెట్టిన నరసింహా! నీవు భయహరుగవు. పద్మములవంటి మూడు కన్నులు గల నీవు సురులచేతను మునివర్యుల చేతను ఎల్లప్పుడు బాగుగా స్తుతింపబడుచున్నావు. నరసింహా! నీకు జయమగుగాక! దుష్ట శిక్షణ, శిష్టరక్షణ వంటి కార్యక్రమములు నిర్వహించు నరసింహా! నీకు వందనములు.

మోహనాకారుడువైన అనంతకృపానిధీ! ఓ నరసింహా! నీవు బ్రహ్మాది ప్రముఖ వేల్పులచే సన్నుతింపబడెడి నరసింహుడవు. ఎల్లవేళలా వేంకటేశ్వరుని దివ్యావతారమైన నరసింహా! నీవు వంచకుల వంచనను రూపుమాపు నరసింహుడవు. (బహుశా అన్నమయ్య భావనలో నరసింహ స్వామి, ఎన్నోకుయుక్తులతో అనూహ్యమైన వరములతో వంచించి చావుతప్పించుకోవాలనుకొనే వారివంచనలకు విరుగుడు చేసి నిర్మూలించే వాడని అయివుంటుంది).

## మున్నుడి 1-78

కొన్ని అన్నమయ్య కీర్తనలు వేదాంతం నేర్పితే కొన్ని వైరాగ్యాన్ని రుచిచూపిస్తాయి. ఇవి అంత తేలికగా అర్థం కావు. కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం అనే (పంచేంద్రియాలనే) పాపాత్ముల స్నేహం వలన మనిషికి సంసారమనే దానితో భోగిస్తే'కామము','మోహము' అనే కొడుకులు పుట్టారట. వాళ్ళవల్ల నాశనమై, వేంకటపతి దయ వలన భక్తి అనే కూతురుపుట్టి మోక్షందారిలో పడ్డాడంటున్నారు అన్నమయ్య.

**సీ॥ సంసారమిది యెంత 'జాణ' రా మనుజుండు**
**దుఃఖాన్ని నమ్మును సుఖమనంచు**
**పంచేంద్రియములనే పాపాత్ములను గూర్చి**
**సంసార సుఖమనే స్వల్పధరకు**
**అంటగట్టగ 'కామ' మను సుతుండటు బుట్టి**
**ఆర్జించె పాపంబు అనెడి ధనము,**
**యౌవనమను పాపి అతనికి పుట్టించె**
**'మోహంబ'ను సుతుని, బుద్ధిచచ్చె**

**ఆ.వె॥ తుదుకు వేంకటపతి పదమంటగ 'విరక్తి'**
**అనెడి మంచిదైన అతివ బుట్టె**
**మోక్షమార్గ మిచ్చి ముదుమిచ్చెనట అహో!**
**అన్నమయ్య సాటినరయగలమె?**

**రాగం : శ్రీ రాగం**

ఇదివో సంసార మెంత సుఖమో కాని
తుదలేని దుఃఖమను-తొడవు గడియించె ॥ఇదివో॥

పంచేంద్రియంబులను-పాతకులు దనుదెచ్చి
కొంచెపు సుఖంబునకు -గూర్పగాను,
మించి కామంబనెడి- మేటి తనయుండు జని
యించి దురిత ధన-మెల్ల గడియించె ॥ఇదివో॥





పాయ మనియె మహా-పాతకుడు తనుదెచ్చి
మాయంపు సుఖమునకు-మరుపగాను
సోయగపు మోహమను- సుతుడేచి గుణమెల్ల
బోయి యీ నరకమను- పురము గడియించె ॥ఇదివో॥

అతిశయుండగు వేంక-టాధీశుడను మహా
హితుడు చిత్తములోన- నెనయగాను,
మతిలోపల విరక్తి- మగువ జనియించియ
ప్రతి యయి మోక్షసంపదలు గడియించె ॥ఇదివో॥

## భావామృతం

ఇదివో ప్రజలారా! సంసారమంటే ఎంత సుఖమో కాని, అది చివరికి దుః ఖములనే ఆభరణములు పెట్టుకొన్న ఆడది అని గ్రహించండి.

మనిషి అటుపైన పంచేంద్రియములు (చెవులు, కళ్ళు, నాలుక, ముక్కు, చర్మము) అను పాపాత్ముల స్నేహము వలన స్వల్ప శారీరక సుఖానికి ఆశపడితే 'కామము' అనే కొడుకు జన్మించాడు. వాడు ధనసంపాదన అనే వ్యసనం అలవాటు చేసి చివరికి పాపము అనే ధనం మూటగట్టాడు. అధోగతిబట్టాడు, మనిషి.

ఆ తరువాత ప్రాయము (యవ్వనం) అనే పాపాత్ముడి స్నేహం కలిసి మాయ అనే సుఖముతో రమించి 'మోహము' అనే కొడుకు పుట్టాడు. ఇంకా దుర్మతివీడు. ఈ మనుష్యుడి సుగుణాలనన్నిటినీ చెడగొట్టి నరకము అనే నగరాన్ని కొనివాళ్ళ నాన్నకు (అంటే మనిషికి) బహుమతిగా ఇచ్చాడు. చివరికి ఆ పట్నం లో దారి తప్పి భ్రష్టుడయ్యాడు మనుష్యుడు.

చివరికి ఆ వేంకటేశ్వరుడికి ఈ మానువుడిపై జాలి కలిగి 'విరక్తి' అనే మంచి కుమార్తెను పుట్టించి దయ చూపాడు. వాడి మనస్సులో అప్రతిహతమైన మోక్షమనే సంపదపై ధ్యాసకలిగించి వాడికి మోక్షమును ఆ విరక్తి అనే కూతురు సంపాదించి ఇచ్చింది. లేకపోతే వాడిగతి అధోగతే.

**1-79**

## మున్నుడి

రామనామ సంకీర్తన అనగానే అన్నమాచార్యులవారు పరవశించి పరవళ్ళు తొక్కియుంటారు ఆ నాడు. నందకాంశ సంభూతుని ముఖకమలం వికసించి రంజిల్లుతుంది. భ్రమరములవంటి సంగీతప్రియులు రసాస్వాదనలో మైమరచి పోతాం. దేవభాషలో మకరందం విరజిమ్మే ఈ కీర్తనలో రఘుకుల దీపకునికి నమోవాకములర్పించుచూ సర్వేశా! జగదేకనాథా! అంటూ కీర్తిస్తున్నారు. ఇట్లాంటి కీర్తన పాడుకొంటే రామాయణం పారామణ చేసినపుణ్యం తప్పక దొరుకుంది

**మ॥ జలజాతాక్షుడు రామభద్రునకు రంజైనట్టి సంకీర్తనన్**
**పలికెన్ సంస్కృత భాషలోన వినుడీ బంగారుకున్ తావినే**
**అలిమెన్ యేమొకొ అన్నమయ్య భళిరా! అత్యంత హృదంబుగా**
**కొలిచెన్ వేంకటరాయనిన్ అతడెయా కోదండ పాణంచు తాన్**

**రాగం : సారమతి**

నమో నమో జగదేకనాథ తవ సర్వేశ
విమల విశ్రుత లసద్విఖ్యాత కీర్తే ॥నమో నమో॥

రామరఘువర సితరాజీవలోచన
భూమిజారమణ త్రిభువన విజయ
కోమలాంగశ్యామ కోవిదరణరంగ
భీమ విక్రమ సత్యబిరుద ప్రవీణ ॥నమో నమో॥

దళిత దైతేయ కోదండదీక్షాదక్ష
జలజాప్తకుల విభీషణరక్షకా
కలిత దశరథతనయ కౌసల్యానంద
సులభ వానరముఖ్య సుగ్రీవ వరద ॥నమో నమో॥





చారు లక్ష్మణ భరత శత్రుఘ్న పూర్వజ
తారక బ్రహ్మ నిత్యస్వరూప
ధీర శ్రీ వేంకటాధిప భక్తవత్సల
భూరిగుణ సాకేతపురనివాసా ॥నమో నమో॥

## భావామృతం

ఓ సర్వేశా! జగదేకపతీ! నీకు వందనములు చాల ప్రసిద్ధి చెందిన అసమానమైన కీర్తిగల స్వచ్ఛమైన శ్రీ రామచంద్రా! నీకు నమస్కారములు.

ఓ రామా! రఘువంశదీపకా! తెల్లని పద్మదళముల వంటి కన్నులుకలవాడా! భూపుత్రి సీతాపతీ! ముల్లోకములను గెలిచినవాడా!(త్రిభువన విజేత రావణాసురుని నిర్జించాడు కదా!) నల్లని సుకుమార శరీరాంగములు కలవాడా! రణరంగ విశారదా! భయము గొలుపు పరాక్రామము కలవాడా! సత్యము బిరుదై నిలిచిన మహానుభావా! నీకీర్తికి ఇవే నా వందనములు.

రాక్షసులను పీడించిన శ్రీ రామా! దుష్టశిక్షణకై ఎప్పుడూ కోదండమను ధనస్సును ధరించియే వుండెదనని ప్రతిజ్ఞ చేసిన సమర్థుడా! రవి వంశజా! విభీషణుని రక్షించిన వాడా! దాశరథి అని విఖ్యాతి చెందిన కౌసల్యానందనా! వానరాధినాథుడు వాలిని తేలికగా నిర్జించి వానరముఖ్యుడయిన సుగ్రీవునకు వరముగా రాజ్యమిచ్చిన మహానుభావా! నీకు వందనములు

చక్కని లక్ష్మణ భరత శత్రుఘ్నులకు అన్నగారివైన రాఘవా! నీవు తారక బ్రహ్మవు. నిత్యస్వరూపుడవు. ధీరుడైన శ్రీ వేంకటేశ్వరుడవు నీవే. ఓ భక్త సంరక్షకా! వారిపై వాత్సల్యంతో కాపాడెదవు. గొప్పసుగుణభూషణా! సాకేతపురమున నెలకొనియుండు జగన్నాయకా! నీకు నా నమోవాకములు.

## 1-80

### మున్నుడి

ఐదు వందల ఏళ్ళక్రిందట మన దేశంలో అగ్రకులస్థులు, నిమ్నకులస్థులపై చూపిన వివక్ష, దార్ష్టికము అన్నమాచార్యుల వారిని కదలించివేసి ఉంటాయి. ఆయన ఆ హీనకులజులపై నిరాదరణను ఖండించటమే కాక తూర్పారబట్టారు. దీక్షితులు అనిపించుకొని పదిమందికి మంచి చెప్పకుండా, హరి గురించి వినిపించకుండా మడి, దడి అంటే ఆ తిరుమల నాయకుడు మెచ్చుడు. 'కాలేజీ డిగ్రీలు' కడుపునింపుతాయేమో కాని జన్మను సార్థకం చేయలేవు. వేదపఠనము, వేదాంత జ్ఞానము, తపోనిష్ఠ మనిషి అంతరంగ శుద్ధికి అవసరమే కాని మానవత్వం సత్ప్రవర్తన వాటి కంటే అత్యవసరం. అదిలేక జీవితం ఉప్పులేని పప్పు వంటిదే.

**ఉ॥ ఎక్కువదే కులంబుమరి హీనకులంబని లేదుచూడగా**
**నిక్కమెరుంగ జీవుడిక నిత్యుడు చావులు లేని వాడురా**
**చక్కని మాట అన్నమయ జానుతెనుంగున చెప్పినాడురా**
**మక్కువ దీర వేంకట రమా విభు గొల్చెనుసుద్దిజెప్పుచున్**

### రాగం : సామంతం

ఎక్కువ కులజుడైన హీనకుజుడైన
నిక్కమెరిగన మహా నిత్యుడే ఘనుడు ॥ఎక్కువ ॥

వేదములు చదివియును విముఖుడై హరిభక్తి
యాదరించని సోమయాజి కంటే
యేదియును లేని కులహీనడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు ॥ఎక్కువ ॥

పరమగు వేదాంతపఠన దొరికియు సదా
హరి భక్తిలేని సన్యాసి కంటే
సరివి మాలిన యంత్య జాతికులజుడైన
నరసి విష్ణుని వెదకు నాతడే ఘనుడు ॥ఎక్కువ ॥





వినియు జదివియును శ్రీవిభుని దాసుడుగాక
తనువు వేపుచునుండు తపసికంటే
యెనలేని శ్రీవేంకటేశు ప్రసాదాన్న
మనుభవించిన యాతడప్పుడే ఘనుడు ॥ఎక్కువ ॥

### భావామృతం

మన సంఘంలో అగ్రకులజుడెవడు? హీనకులజుడు యెవడు? ఎవడైతేనేమి? నిజము తెలుసుకొంటే తను ఆత్మనని, వాడు (జీవాత్మ) నిత్యుడు అనీ చావు పుట్టుకలు వాడికి కర్మ అనుభవించుటకు పరమాత్మ కల్పించినవే కాని వాటితో వాడికి 'నిమిత్తం' లేదని తెలుసుకొన్నవాడు మాత్రమే ఘనుడు. ఏ కులం అయితేనేం.

హరిభక్తిపై ఇష్టములేని వాడు వేదము చదివితే ఏం లాభం? అటువంటి హరివిముఖుడైన సోమయాజి (యజ్ఞయాగములు చేసినవాడు) కంటె ఏమీలేని కులహీనడని పిలువబడే విష్ణుపాదదాసుడు, విష్ణుచిత్తుడు ఎంతయో శ్రేష్టుడు. ఇది సత్యం.

మోక్షమార్గం చూపే వేదాంతం నేర్చే సద్భాగ్యం కలిగికూడా వేదాంతసారమైన హరి భక్తి లేని పరివ్రాజకుని (సన్యాసి) కంటే, క్రమములో అంత్యజుడు అనిపించుకొన్న నిమ్నకులజుడు హరిభక్తి కలిగిన వాడైతే విష్ణుని ధ్యేయంగా వెదకునట్టివాడే గొప్పవాడు. ఇదే నిజము.

శ్రీపతి గూర్చి వినుటచేతనో చదువుట చేతనో తెలిసికొని స్వామి దాసునిగా జీవించాలి. అంతేగాని శరీరాన్ని శుష్కింపజేయు తపస్సుల వల్ల ప్రయోజనమేమిటి? శ్రీ వేంకటేశ్వరుని సందర్శించి ఆయన ప్రసాదం స్వీకరించు వాడు ఆ క్షణంలోనే శ్రేష్ఠుడవుతాడు. వాడే కులంవాడైనా, వాడే యోగ్యుడు.

## 1-81

### మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన భగవన్నామ సంకీర్తన. సాధారణంగా ఇటువంటి కీర్తనలలో అన్నీ తెలిసిన మాటలే వుంటాయి. దీని భావామృతం చాలా తేలిక. అసలు అక్కరలేదు అనుకోవద్దు. "నెట్టిన గతి" అని ఒక మాట ఈ కీర్తనలో వుంది. అదేమిటో తెలుసుకోవాలంటే నిఘంటువు తెరవక తప్పలేదు నాకు. అందుకే.... దిగితే గాని లోతు తెలీదన్నారు పెద్దలు. ఇంతకీ ఈ కీర్తననెందుకు ఎన్నుకొన్నానంటే... అంతా ఆ శ్రీ హరే అని ప్రహ్లాదుడు చెప్పినదానినే ఇలా అమృతపు జల్లులా కురిపించారన్నమయ్య.

**కం॥ అంతయు నీవే నాకిక**
**చెంతను నీవుండుమంచు శ్రీనామంబుల్**
**ఎంతో సులువుగ ఆ శ్రీ**
**కాంతునకా అన్నమయ్య గానము జేసెన్.**

**రాగం : హిందోళం**

అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంతనాకు నీవే శ్రీ రఘురామా ॥అంతయు॥

కులమును నీవే గోవిందడా, నా-
కలిమియు నీవే కరుణానిధీ
తలపును నీవే ధరణీధరా, నా-
నెలవును నీవే నీరజనాభా ॥అంతయు॥

తనువును నీవే దామోదరా, నా-
మనికియు నీవే మధుసూదనా
వినికియు నీవే విఠలుడా, నా-
వెనుక ముందు నీవే విష్ణుదేవుడా ॥అంతయు॥





పుట్టుగు నీవే పురుషోత్తమా, కొన
నట్టనడుమ నీవే నారాయణా
యిట్టె శ్రీ వేంకటేశ్వరుడా నాకు
నెట్టన గతి ఇంక నీవే నీవే ॥అంతయు॥

### భావామృతం

ఓ శ్రీ హరీ! పుండరీకాక్షా (పద్మనయనా) నాకు అంతానీవే. ఇంకొకటి లేదు. రఘుకులసోమా! శ్రీ రామా! సదా నాసమీపంలో వుండేవాడవు నీవే తండ్రీ!

ఓ గోవిందా! నా కులం అంటూ వేరే ఏమీ లేదు అది నీవే. నా సంపద కూడ నీవే. భూరమణా! నా ఆలోచనకూడ నీవే. ఇక నాస్థానమంటూ ఏదన్నావుంటే ఓపద్మనాభా! అది నీవే ప్రభూ!

ఓ దామోదరా! నా శరీరం వేరెవ్వరిదీ కాదు అది నీస్వంతము. మధుసూదనా! నా జీవితం కూడ నీవే. విఠలదేవుడని కీర్తించబడే పాండురంగా నాలోని వినికిడి శక్తి వేరెవెరు? నీవే కదా! నీవు నాకు కనుపించనంత మాత్రాన నాకు నష్టమేముంది సదా నావెనుక ముందట వుండి నన్ను రక్షిస్తున్నది నీవే కదా! విష్ణుదేవా!

ఓ పురుషోత్తమా! నా పుట్టుక ఎలా సంభవించింది నాకు తెలియదా?నీ వల్లనే ప్రభూ! నారాయణుడు అని కీర్తించబడే నీవే చివరలలోను మధ్యలోను వున్నావు. (పుట్టుక నుండి చావు వరకు మాత్రమే కాక మధ్మ జీవితమంతా నీవలననే నడుచుచున్నది) ఓ శ్రీ వేంకటేశ్వరా! నాకు ఇట్టే (సులభసాధ్యుడవు) నీవే వున్నావు. తప్పనిసరియైన గతి ఇంకా నాకెవ్వరున్నారు తండ్రీ! నీవే.....నీవే.....నీవే.

**1-82**

## మున్నుడి

అన్నమాచార్యుల వారి ఘనత తెలియాలంటే ఈ చిన్న కీర్తన పరిశీలించండి. 'బంటు' అంటే సేవకుడు, భక్తుడు, శిష్యుడు అని నానార్థములున్నాయి. సేవచేసేవాడు, భక్తితో కొలిచేవాడు, యజమానిని గురువుగా భావించి చెప్పిన మాట వినేవాడు - అటువంటి వాడే బంటు. మన రామదూత హనుమంతుడు. ఈ కీర్తనలో ఆ బంటు లక్షణాలు చెబుతున్నారు.రాముడే వేంకటేశ్వరుడని, మారుతిని స్వామికి దాసునిగా కీర్తిస్తున్నారు. ఇంత చిన్న కీర్తనలో, ఆదిలోనే హంసపాదన్నట్లు మొదటిమాటకే అర్థం తెలియదు.....

**చం॥ అతిముతి బంటు యాతడని అంజనసూనుని తానుతించెరా**
**వెఅపను మాటనెంచడని వీనుల విందుగ అన్నమార్యుడున్**
**సిరిపతి వేంకటేశ్వరుని సేవతరించెడివాడనెన్, భళీ!**
**ఎఱుగము యిట్టి కీర్తనము నెవ్వడు పాడెధరాతలందునన్.**

**రాగం : శ్యామ**

అతిముతి హనుమంతుడట్టి బంటు
వెఅపులేని రఘువీరునికి బంటు ॥అతిముతి॥

యేలికను దైవముగా నెంచి కాల్చేవాడే బంటు
తాలిమి గలిగిన యాతడే బంటు
పాలుమాలకయే పొద్దుపని సేయువాడే బంటు
వేళగాచుక వుండేటి వెరవరే బంటు ॥అతి ముతి॥

చెప్పినట్టనే నడచిన యాతడే బంటు
తప్పులేక హితుడై నాతడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలగు వాడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుడే బంటు ॥అతి ముతి॥





కాని పనులకు లోనుగాని వాడే బంటు
ఆనాజ్ఞ మీరని యాతడే బంటు
నానాగతి శ్రీ వేంకటోన్నతుడైన యతనికి
తానిన్నిటా దాసుడైన ధన్యుడే బంటు ॥అతి ముతి॥

## భావామృతం

సంభ్రమము కలిగించు ఈ హనుమంతుడు అటువంటి వాడని బంటు అంటే ఈయనే అని, భయమను మాటనెరుగని రాఘవునికి నమ్మిన బంటు ఈ స్వామి, అని తెలుసుకోండి.

ఇక ఈ బంటు యొక్క లక్షణములను వినండి. ఇతడు తనయజయానిని దైవంగా భావించి కొలిచే స్వభావం కల బంటు. ఎంతో ధైర్యం కలిగిన వాడీ బంటు. ఏ మాత్రం సోమరితనం లేక ఏ వేళనైనా తన యజమానిని సేవించువాడే ఈ బంటు. అన్ని సమయాలలోను తగిన ఉపాయముతో సిద్ధముగావుండే వాడే ఈ బంటు.

తు.చ తప్పకుండా చెప్పినట్లు నడుచుకొనేవాడు ఈ బంటు. ఏవిధమైన తప్పిదముచేయక హితము చేసేవాడే ఈ బంటు. గొప్పవిశ్వాసమునకు మారు పేరన్నట్లుగా యజమానిని మెప్పించుచు మెలగువాడే బంటు. ఏనాడూ ద్రోహం చేయక మేలు చేసేవాడే బంటు అని పిలువదగ్గవాడు.

లోభానికి లొంగి ఏనాడూ తగని పనులు చేయనివాడే నమ్మిన బంటు అంటే ఆనపెట్టినట్లు ఉత్తరువులను అమలుపరచువాడే సరియైన బంటు. పలు విధములుగా (పైన చెప్పినట్లు) శ్రీ వేంకటేశ్వరుడైన స్వామికి తాను అన్నివిధములుగా దాసుడైన బంటు ఈమహానుభావుడు శ్రీ ఆంజనేయుడు.

## 1-83

### మున్నుడి

వేదములలో దేవతల ప్రీతి కోసం చేసే యజ్ఞకాండ అంతా వివరించబడినది. యాగశాలలో జంతు బలినొసగుట, సామవేదమును గానముచేయుట, సోమపానము చేయుట, ప్రసాదముగా హుతశేషము(పురోడాశము) స్వీకరించుట కుండలధారణ, ఇత్యాది కర్మలెన్ని చేసినా, తత్ఫలితంగా తనువు చాలించాక స్వర్గము జేరి ఎన్నాళ్ళు ఎన్ని సుఖాలను అనుభవించినా... ఆ పుణ్యం తరిగిపోకా తప్పదు, మళ్ళీ భూమిపై జన్మించకాతప్పదు. కాబట్టి ఆ యజ్ఞాల కంటే జ్ఞానయజ్ఞంతో తిరుమలేశుని సేవిస్తే ఆయన స్వయంగా ప్రత్యక్షమై మోక్షమే ఇస్తాడు కదా! ఈ గోల అంతా దేనికి? అంటున్నారు అన్నమాచార్యులవారు. వినండి...

**చం॥ శృతులు ఘనంబుగా క్రతువుసేసెడి వైనము లెన్నిసెప్పియున్**
**హితములు స్వల్పమే, కడకు యేమగు జన్మము తప్పదాయెరా**
**మతిచెడు కర్మకాండ ఘనమా? యనెనీకృతి నన్నమార్యుడున్**
**గతియని వేంకటేశ్వరుని కాలికి మ్రొక్కుడు“జ్ఞానయజ్ఞమౌ”**

**రాగం : ధన్యాసి**

జ్ఞానయజ్ఞ మీగతి మోక్ష సాధనము
నానార్థములు నిన్నే- నడపె మాగురుడు ॥జ్ఞానయజ్ఞ॥

అలరి దేహమనేటి-యాగశాలలోన
బలమై యజ్ఞానపు-పశువు బంధించి
కలసి వైరాగ్యపు-కత్తుల గోసికోసి
వెలయ జ్ఞానాగ్నిలో-వేలిచెమా గురుడు ॥జ్ఞానయజ్ఞ॥

మొక్కుచు వైష్ణవులనే-మునిసభ గూడ పెట్టి
చొక్కుచు శ్రీ పాదతీర్థ-సామపానము నించి
చక్కగా సంకీర్తన-సామగానము చేసి
యిక్కువతో యజ్ఞముసే-యించెబో మా గురుడు ॥జ్ఞానయజ్ఞ॥





తదీయ గురుప్రసాద-పురోడాశ మిచ్చి
కొదదీర ద్వయమను-కుండలంబులు వెట్టి
యెదలో శ్రీ వేంకటేశు-నిటు ప్రత్యక్షము చేసె
ఇదివో స్వరూప దీక్ష-యిచ్చెను మాగురుడు ॥జ్ఞానయజ్ఞ॥

### భావామృతం

జ్ఞానయజ్ఞమే బహుసులభమైన మోక్షసాధనమని నిన్ననే మా ఆచార్యులు మాకు చెప్పిమాచే నిర్వహింపజేసినారు. ఆ దీక్షావివరములన్నీ మాకు వారు సెలవిచ్చియున్నారు.

‘శరీరము’ అనే ఈ యజ్ఞశాలలో, బలమైన ‘అజ్ఞానం’ అనే పశువును తీసికొనివచ్చి బంధించి,‘ వైరాగ్యం’ అనే కత్తితో దానిని ఖండించి, జ్ఞానము అనే అగ్నిలో మా గురువు గారు దానిని వేల్చినారు.

తదుపరి నమస్కారము వంటి ఉపచారములను గావించుచు పరమభాగవతులైన వైష్ణవులు అనే మునుల సభలో నన్ను జేర్చిరి. పిదప సంతోషముతో మా అందరికీ ‘ శ్రీపాద తీర్థము’ అను ‘సోమపానము’ సంకీర్తన అనే సామవేదగానమును వినిపించిరి. ఆ విధానమున గురువులు మాచే యజ్ఞమును చేయించినారు.

అటుపిమ్మట మాగురువు గారు ఆయనకు సంబంధించిన పురోడాశము (‘హుతశేషము’) గురుప్రసాద రూపమున నొసగిరి. కొఱతలేనట్లుగా ‘ద్వయము’ అను కుండలములను మాకు పెట్టారు.

(శ్రీ మన్నారాయణ చరణౌశరణం ప్రపద్యే, శ్రీ మతే నారాయణా నమః అను ఈ రెండు మంత్రములే నిజమైన కుండలములు) ఆ విధముగా మా ఆచార్యులు మా హృదయముతో శ్రీ వేంకటేశ్వరుని ప్రత్యక్షము సేయించినారు. ఆ విధముగా ఆయన మాకు ‘స్వరూపదీక్షను’ ఇచ్చారు.

## 1-84

### మున్నుడి

చిన్నారి పాపాయి కళ్ళు మూసి 'దోబూచి' అంటూ మూసిన చేతులు తీసేస్తే పాపాయి కిలకిలా నవ్వుతుంది. అదిచూచి 'అమ్మ' పరమశించి పోతుంది. చిన్నారి బాలకృష్ణనితో దోబూచిలాడిన గోపెమ్మల భాగ్యవేమని వర్ణించగలం? అన్నమాచార్యుల వారు ఆ 'దొరదొంగ' ని 'తొల్లిటి దొంగ' అంటారు. ఏడుకొండల వాడిని 'దుండగీడు' అనే దమ్ము సాక్షాత్తు ఆ 'నందకాంశజు'నికి గాక అన్యులకు సాధ్యమా? కీర్తన అంతా నిందలాగే కనపడే పొగడ్త.

**ఆ.వె॥తులన సేయగలమె!! "దోబూచు" లాడుచు**
**హరిని గొల్చు భాగ్యమన్నమయ్య**
**కబ్బె, యేమి చెబుదు? ఆయన బోలిన**
**వేంకటేశు దాసులింక లేరు.**

**రాగం : ధన్యాసి**

బండి విరిచి పిన్న పాపలతో నాడి
దుండగీడు వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

పెరుగు వెన్నలు ప్రియమున వే-
మరుముచ్చిలించు మాయకాడు
వెరువున దన విధము దాచుకిని
దొరదొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

పడుచు గుబ్బెత పరపుపై పోక-
ముడి కొంగు నిద్ర ముంపునను
పడియుతా (?) వద్ద పవళించి నట్టి
తొడుకుదొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥





గొల్లపల్లెలో ఇల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెగాడు
యెల్లయినా వేంకటేశుడు ఇదె
తొల్లిటి దొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

### భావామృతం

(దుండ గీడు అంటే దుష్టుడు. అంటే 'కీడు' చేసే వాడు అని అర్థం. ఆదిదేవుణ్ణి అంతటి మాట ఎందుకంటున్నారు అన్నమయ్య? గోపెమ్మల్లాగా, మనబోటి సామాన్యుల్లాగా ఆలోచించే వారికి స్వామి లీల అర్థమవుతుందా? ఆయన ఎవ్వరికీ కీడు చేయడు.మన కర్మఫలమే మనకిచ్చినా, అది మన కంటికి కీడులాగే కనిపిస్తుంది. అదే మాయ. ఆ మాయగాణ్ణి దొంగ అంటున్నారు అంతా.... నిజానికి దొంగలెవరు?)

బండి విరిచి పిల్ల పాపలతో ఏవేవో దొంగాటలాడే దుండగీడు వస్తున్నాడు. జాగ్రత్త దోబూచి. (దొంగ భూతం) వస్తాడు.

అతి ఇష్టంగా పెరుగు వెన్నలను మాటిమాటికీ దొంగతనం చేసే మాయలమారివాడు ఈ కుర్రవాడు. ఉపాయంతో తన విధానమేమియో తెలియనీయని ఈ దొరదొంగ (దొంగవలె భ్రమింపచేసే సర్వేశుడు) వచ్చాడు. జాగ్రత్త దోబూచి.

చక్కటి స్తనములున్న (గుబ్బెత) పడుచుపిల్ల పరుపు మీద నిద్ర పోతుంటే చీరముడి ఊడతీసి ఆమె ప్రక్కనే పడుకొన్న దొంగవచ్చాడు, తొడుకు (ఒడిసి పట్టుకొండి). జాగ్రత్త. దోబూచి.

రేపల్లెలో ప్రతి ఇంటిలోను దూరి, ఆ ఇంట్లో వెన్నలను కన్నెలను కొల్లగొట్టిన వాడే ఈ కోడెవయసు కుర్రవాడు. వీడు అన్నీ తానే అయిన శ్రీ వేంకటేశ్వరుడే. ఇదిగో ఈయన అనాదిగా భక్తుల హృదయాలను దొంగతనం చేస్తున్న పెద్ద దొంగ. జాగ్రత్త!! దోబూచి వస్తున్నాడు. బాబోయ్. జాగ్రత్త!

**1-85**

## మున్నుడి

అన్నమాచార్యుల వారు తెలుగుతల్లులకు పెట్టిన మేటి ప్రసాదం ఈ కీర్తన. ఎంత మంది అమ్మలు ఈ పాట తమ పాపాయికి పాడారో చెప్పటం సాధ్యమా? తరచి చూస్తే చిన్నారుల కోసం పాడే పాటల్లో కూడ శ్రీ నివాసుని కీర్తించటం అద్భుతం కదా! దీని భావామృతంలో జాబిల్లి అని చందమామని ఎందుకంటారో వివరించాను. చాల మాటలను మనం అర్థం తెలియకుండానే పర్యాయపదాలుగా వాడేస్తాం, అని నాకు జాబిల్లికి వివరణ ఇస్తున్నప్పుడు తట్టింది.

పాపాయి పాటలో కూడా పరమాత్మ అవతార విశేషములను వర్ణించుట అన్నమయ్య నేర్పు.

**కం॥ జాబిల్లి బిలుతు రమ్మలు**
**"మాబాబుకు పాలు కుడుప పరుగున రావో"**
**సోబనపు వేంకటేశుడు**
**ఈ బాబుని అన్నమయ్య ఇచ్చిన "ఫలమే".**

**రాగం : చక్రవాకం**

చందమామ రావో జాబిల్లి రావో మంచి
కుందనపు పైడికోర వెన్నపాలు తేవో ॥చందమామ॥

నగుమోము చక్కనయ్యకు నలువపుట్టించిన తండ్రికి
నిగమములందుండే అప్పకు మా నీలవర్ణునికి
జగమెల్ల ఏలిన స్వామికి చక్కని ఇందిర మగనకి
ముగురికి మొదలైన ఘనునికి మాముద్దుల మురారి బాలునికి॥చందమామ॥

తెలిదమ్మి కన్నుల మేటికి మంచి తియ్యని మాటల గుమ్మకు
కలికి చేతలకోడెకు మా కతలకారి ఈ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండవొయ్యారికి నవనిధుల చూపుల చూచే సుగుణునకు ॥చందమామ॥





సురుల గాచిన దేవరకు చుంచు గరుడు నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మానీటు చేతల పట్టికి
విరుల వింటి వాని అయ్యకు వేవేల రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీ వేంకటనాథునికి ॥చందమామ॥

## భావామృతం

ఓ చందమామా! ఇటు వైపుకు ఒక్కసారిరా. చల్లటి జాబిల్లీ (జాను+బిల్లి=జాబిల్లి, అనగా అందమైన పిల్లి, అనగా కుందేలు అంటే... కుందేలు తనలో ఉన్నవాడు, అనగా చంద్రుడు) ఇటు రారాదా! పదియారు వెన్నపూర్తిగా తీయని పాలను మా బాబుకు తీసికొని రారాదా.

మా బాలుడు నవ్వుకవలొలికే ముఖమున్న చక్కనయ్య. బ్రహ్మదేవునికి జన్మనిచ్చిన తండ్రి. వేదములన్నింటిలో కీర్తించబడిన జనకుడు. నీలమేఘచ్ఛాయ గల శరీరం దాల్చిన వాడు జగన్నాథుడు. అందాల బొమ్మ లక్ష్మీదేవికి ప్రియమైన మగడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అని పిలవబడే ముగ్గురు దేవుళ్ళకు అది దేవుడు. ఇతడే ముద్దులు మూటగట్టే మా మురారి.

సర్వశ్రేష్ఠుడైన వీడు తెల్లని పద్మముల వంటి కన్నులు గలవాడు. మధురమైన మంచి మాటలు మాట్లడే అలంకార ప్రియుడు. ఒయ్యారము లొలుకు మనోజ్ఞమైన చేతలు గల శృంగారమూర్తి (మోహినీదేవి). లెక్కకు మించిన కథలు (పురాణములు) పుట్టుటకు కారణ భూతడైన. వామన మూర్తి. ఆదిత్యకులమును వుద్ధరించిన గుణవంతుడైన బిడ్డ ఈ బాలుడే (రాముడు). ఈ అబ్బాయి సుగుణాలప్రోవు. నవనిధులను ప్రసాదించు వాడు.

ఈ దేవుడే దేవతలందరినీ రక్షించిన వేలుపు. తెల్లటి గరుత్మంతుని అధిరోహించి ఠీవిగానుండే వాడితడే. యుక్తమైన బుద్ధులు గల పెద్దమనిషి కూడ ఇతగాడే. ఇతను చేసే పనులన్నీ తీర్తినట్లుంటాయి. ఈయనెవరనుకున్నారు? స్వయాన మన్మధునికి జన్మనిచ్చినవాడు. అంతేకాదు అనంతమైన (వేలకొద్దీ) రూపములు గలవాడు. ఇదిగో ఈ మా శ్రీ వేంకటేశ్వరుడు అధికముగా ఐశ్వర్యములను ప్రసాదించు జాణ (నేర్పరి).

## 1-86

### మున్నుడి

శ్రీ మన్నారాయణుని పాదము యొక్క వైభవమును వర్ణిస్తున్నారన్నమయ్య. అతిసరళంగా కనిపించే ఈ అద్భుత కీర్తనలో కూడ 'పామిడి తురగము' ఏమిటో అర్థంకాలేదు, బాగా ఆలోచించాలి. ఏదో ఒకమెలిక ఉండక తప్పదు అన్నమయ్య కీర్తనలో. మరి అందుకే భావామృతం చదవాలి. తప్పదు...

**సీ॥ ఆ పాదమును బ్రహ్మ అతి భక్తి కడిగెను**
**ఆ పాదమే 'బ్రహ్మ' మాయె తాను**
**ఆ పాదమే గొల్చెనతివయై అవనియు**
**ఆ పాదమును మొక్కి రఖిల సురులు**
**ఆ పాదము జగాలనన్నింటి గొలిచెను**
**ఆ పాదమే 'బలి' నణగ ద్రొక్కె**
**ఆ పాదమే కాచెనా అహల్యను నాడు**
**ఆ పాదముద్రలే 'అహి' తలందు**

**తే॥ ప్రేమతో రమాదేవియే పిసుకు పదము**
**పరమయోగులు గొలుతురు పలు విధముల**
**తిరుమలేశ! నీ పదమదే దివ్యపథము**
**అన్నమయ్య నుతించిన యట్టి పదము**

**రాగం : ముఖారి**

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీపాదము ॥బ్రహ్మ కడిగిన॥

చెలగి వసుధ కొలిచిన నీ పాదము
బలితల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపుగాచాన పాదము ॥బ్రహ్మ కడిగిన॥



భావయామి వేంకటేశం

కామిని పాపము కడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము ॥బ్రహ్మ కడిగిన॥

పరమయోగులకు పరిపరి విధముల
పరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము ॥బ్రహ్మ కడిగిన॥

### భావామృతం

శ్రీ వేంకటేశ్వరా! నీ పాదము యొక్క మహాత్యం ఎటువంటిదో చెబుతాను విను ప్రభూ! బ్రహ్మదేవుడు నీవు త్రివిక్రముడవై ఒక పాదంతో సమస్త అవనిని దాని అధోలోకాలతో సహా ఆక్రమించి, ఇంకొక పాదంతో భువనాల నన్నింటినీ ఆక్రమించినప్పుడు బ్రహ్మ ఆకాశగంగతో గంగాజనకుడవైన నీపాదమును కడిగాడు. అటువంటి దివ్య పాదము నీది. ఆ నీ పాదమే బ్రహ్మము.

శ్వేతవరాహమూర్తివై హిరణ్యాక్షుని బారి నుంచి రక్షించినప్పుడు భూదేవి కొలిచినది నీ పాదమునే. బలి మహాప్రభో! మూడవ 'అడుగు' నానెత్తిమీద పెట్టుఅన్నప్పుడు విజృంభించి ఆ తలమీదపెట్టిన పాదము నీ పాదమే. బలవంతుడైన శత్రువునంతమొందించక కాచి (ప్రహ్లాదుని అనుగ్రహించుటకు ) రక్షించిన పాదమునీది.

శ్రీరామావతారంలో అహల్యను పునర్జీవితురాలిని చేసినది, ఆమె పాపములను కడిగివేసినది నీపాదమే.

శ్రీకృష్ణావతారంలో కాళింగుని తలలను త్రొక్కినది కూడ నీపాదమే. ఆ పాదమునే లక్ష్మీదేవి ప్రేమ కలిగినదై పిసుకుతున్నది. అదే హయగ్రీవుడవైన నీ అద్భుత పాదము.

పరమ యోగులందరూ నిన్ను శరణని నీ అనుగ్రహం కోరితే వారు దేనికర్హులో నిర్ణయించి ఎవరికేది ఇవ్వాలో ఆ 'ముక్తి' వారి కొసగునది నీపాదమే. పవిత్రమైన వేంకటాచలమొక్కటే స్థిరమైనది అని చూపినది నీపాదమే. స్వామీ! అట్టి ఈ పాదమే మోక్షమంటే. ఇంకొకటి వేరుగా నున్నదా?

## 1-87

### మున్నుడి

అలమేలు మంగమ్మ విలాసమును, వైభవమును వర్ణించి స్వామికి చెబుతున్నారన్నమయ్య. సరస శృంగార కీర్తనలనెన్నో పాడిన అన్నమయ్య ఇందులో ఆ దేవి సౌందర్యాన్ని వర్ణిస్తున్నారు. వన్నెలకుంకుమ వసంతమాడిందట ఆ దేవి స్వామితో. మన్మధుని రధమున హంసలను నిలిపిందిట. ఆచార్యులవారి పదచాతుర్యాన్ని ఏమని పొగడను? నా అదృష్టం కొద్దీ అన్నమయ్య కవితా సొబగులను మీకు అందించే చిరు ప్రయత్నం చేస్తున్నాను. పదవవంతు ఫలితం దక్కినా అది నా భాగ్యమే.

**చం॥ ఒకపరి చూడవయ్య విరిబోడిని యీ అలమేలు మంగనో**
**సకల గుణాభిరామ! హరి! జాణవు వేంకటశైలనాయకా!**
**వికసిత పద్మనేత్ర! కనువిందుగ యీలలితాంగి వన్నెలన్**
**ఇకనెరిగింప నాకవునెయెంచగ నన్నయ? పాడి చూడరో**

**రాగం : నాటకురంజి**

చూడవయ్య నీ సుదతి విలాసము
వేడుక కాడవు విభుడవు నీవు ॥చూడవయ్య॥

పున్నమి వెన్నెల పోగులు పోసి
సన్నపు నవ్వుల జవరాలు
వన్నెల కుంకుమ వసంతమాడీ
ఇన్నిటా కళలతో ఈ మెరుగుబోడి ॥చూడవయ్య॥

పాటించి తుమ్మెద పౌజులు దీర్చీ
కాటుక కన్నుల కలికి యిదే
సూటి జక్కువల జోడలరించీ
నాటకపు గతుల నాభిసరసి ॥చూడవయ్య॥





అంగజు రధమున హంసలు నిలిపి
కంగులేని ఘన గజగమన
ఇంగితపు శ్రీవేంకటేశ నిన్నెనసె
పంగెన సురతపు పల్లవాధరి ॥చూడవయ్య॥

### భావామృతం

ఓ వేంకటేశ్వరా! నీముద్దుగుమ్మ, అలమేలు మంగమ్మ విలాసము (ప్రియ సందర్శనా పారవశ్యము), ఒక్కసారి చూడవయ్యా! నీవేమో విలాసపురుషుడవు. ఆపైన తాళికట్టిన భర్తవు. (నీకే కదా! ఆ సొగసులన్నీ).

ఆమె ఎటువంటి ప్రియురాలను కొన్నావు? పౌర్ణమినాటి వెన్నెలను కుప్పగా పోసినంత చల్లగా, చిరునవ్వులొలికించే ప్రియురాలామె. రంగురంగుల గులాలు చల్లి నీతో వసంతోత్సవంలో పాలుపంచుకొన్నదామె. మెరుస్తున్న దేహంకల ఆమె అన్నికళలతోనూ నిన్ను అలరించినది.

ఆమె ముంగురులు సరియైన పద్ధతిలో నిలిచిన తుమ్మెదల వరుసలలాగ వున్నవి. ఈమె కాటుక దిద్దిన కన్నులుగల భామిని. తిన్నని చక్రవాకములవంటి వక్షోజముల జంటగల సుందరాంగి. పద్మమువంటి నాభిగల ఈమె నాట్యగతులను తిలకించు ప్రభూ.

మన్మధుని రధముపై నుండే హంసలను ఈమె స్వయంగా నెలకొల్పినదేమో. ఏమాత్రం బెదురులేని గజరాజు యొక్క నడక కలిగియున్నది ఈదేవి. వివేకవంతుడవైన తిరుమలనాథా! లేచిగురుటధరములు గల ఆ దేవి, పంగెన (ఏనుగును మోసంతో బంధించు గడ్డి కప్పిన పెద్దగొయ్యి) వంటి సురతిని తేల్చెడి జాణ.

## 1-88

### మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని చేతిలోని సుదర్శన చక్రమును సంకీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. మన కలియుగంలో స్వామికి దానితో పెద్ద పనితగలటంలేదు. ఎందుకంటే మనం పుణ్యం అనే మాట నెరుగని పాపులం. ఆ రోజుల్లో శాపవశాన హరికి దూరమై, తిరిగి ఆయన కరుణతో పరపరా తలలు నరికించుకొని హరిని మరల చేరుకున్నారు. మనలాంటి వాళ్లకి దారిలో తిరిగే 'లారీ' చక్రాలే దారి. ఎరిగి ఎరిగి నేరాలు చేసే వారికి హరికృప నెరుగతరమే!! మరి... సుదర్శనచక్ర వైభవాన్ని అన్నమయ్య సంకీర్తనలో వినండి తరించండి. ఇవ్వాళ నేనేం 'రాసినా' 'ర' కారమే వస్తోంది.

**కం॥ వరమది హరి శరణందిన**
**అఱమఱి తిరురమణు కరపు అరిభీకరమై**
**పరపర తరుగును శిరముల**
**సరినెరుగని అన్నమయ్య చక్రము బొగిడెన్**

**రాగం : నాట**

చక్రమా హరి చక్రమా
వక్రమైన దానవుల వక్కలించవో ॥చక్రమా॥

చుట్టి చుట్టి పాతాళము చొచ్చి హిరణ్యాక్షుని
చట్టలు చీరిన ఓ చక్రమా
పట్టిన శ్రీహరిచేత పాయక ఈ జగములు
ఒట్టుకొని కావగదవో ఓ చక్రమా ॥చక్రమా॥

పానుకొని దనుజుల బలుకిరీట మణుల
సానలు తీరిన ఓ చక్రమా
నానా జీవముల ప్రాణములు గాచి ధర్మ
మూని నిలుపగదవో ఓ చక్రమా ॥చక్రమా॥





వెరచి బ్రహ్మాదులు వేదమంత్రముల నీ
వరుటుకొనియాడే రో చక్రమా
అఱిమఱి తిరువేంకటాద్రీశు వీధుల
ఒరపుల మెరయుదువో ఓ చక్రమా ॥చక్రమా॥

### భావామృతం

ఓ సుదర్శన చక్రమా! హరిహస్త భూషణమైన పరాక్ర విక్రమా! వక్రబుద్ధిగల రాక్షసులపై తిరుగుబడి సంహరించుము. చక్రమా! ఓ చక్రమా! (నిన్ను కీర్తించెదను)

గిరగిర తిరుగుచు పాతాళలోకమున చొరబడి హిరణ్యాక్షుడు అను రాక్షసుని "చుట్టలు తీరిచి" (చంపి) వేసిన చక్రమా! శ్రీహరి తన హస్తమున నిన్ను ధరించగా ప్రతిజ్ఞపూనినట్లు వదలక జగములనెల్ల రక్షించుచున్న సుదర్శనమా! (నీకు సాటిలేరు).

పూనుకొని (ఆరోజులో 'పానుకొని' అనే వారేమో) అసురుల అసంఖ్యాకమైన కిరీటములలోని మణులను సానబట్టిన (సానలు తీరిన) ఓ చక్రమా! అనేకములైన జీవులను (గజేంద్రుని నుంచి అంబరీషుని వరకు) ప్రాణములను కాపాడి ధర్మమును నిలబెట్టినావు గదా! (విష్ణుభక్తుడైన అంబరీషునిపై కోపించి దుర్వాస మహాముని ఒక భూతాన్ని పంపించాడు సంహరించమని భీతిల్లిన అంబరీషుడు శ్రీహరిని శరణు వేడాడు. తన భక్తుని రక్షించుటకు శ్రీహరి తన సుదర్శన చక్రం ప్రయోగించాడు. అది భూతాన్ని క్షణంలో సంహరించి దుర్వాసుని వెంటబడింది. దానినుంచి మునిని రక్షించటం తమవల్ల కాదన్నారు. హరుడు బ్రహ్మాది దేవతలు. శ్రీహరికూడా తనపని నెరవేరే దాకా సుదర్శనాన్ని ఆపలేనని అంబరీషునే శరణు వేడమన్నాడు. అంబరీషుడు ప్రార్థిస్తే అప్పుడు శాంతించింది సుదర్శనం. అది అంతగొప్పది)

ఆనాడు భీతిల్లిన బ్రహ్మాది దేవతలు వేదమంత్రాలతో నీ వురట్లు (గొప్పతనం) కొనియాడారు కదా! ఓ చక్రమా సంభ్రమము కలుగునట్లు తిరుమలనాధుని హస్తభూషణమై ప్రతాపముతో బహిర్గతమై మెరిసిపోతున్న సుదర్శనమా! (మమ్ము రక్షింపుము)

**1-89**

## మున్నుడి

అన్నమాచార్యులవారు కలశాపురం సందర్శించిన తరుణంలో అక్కడ వెలసిన హనుమంతుని కీర్తిస్తూ చెప్పిన మనోజ్ఞమైన కీర్తన ఇది. మనకళ్ల యెదుట ఆ వాయునందనుడు రాక్షసుల్ని సంహరించినట్లు, ఆకాశమంత ఎత్తు పెరిగి సూర్యభగవానునివద్ద వేదం నేర్చుకొంటున్నట్లు, సువర్ణ సదృశరూపంతో కవచకుండల ధారియై వేంకటేశ్వరుడే తన రాముడనే భావనతో ఆయన బంటువలె నిలిచినట్లు అనిపించే ఈ కీర్తనలో 'సుతువద్ద' స్వామి వేదాలు నేర్చినట్లున్నది. రాగిరేకుల వ్రాతల్లో తేడాయేమో?

**ఉ॥ మేను పదారు వన్నెగల మేలిమిదై కలశాపురంబులో**
**పూనివసించు యీ హనుమపూర్వగిరీశుని మేటి శిష్యునిన్**
**దానవ వైరినిన్ కడు ముదంబున అన్నయకీర్తనంబుతో**
**తానిక వేంకటేశ్వరుని దాసునిగా తలపోసి కొల్చెరా**

**రాగం : వరాళి**

పదియారు వన్నెల బంగారు కాంతుల తోడ
పొదలిన కలశాపుర హనుమంతుడు ॥పదియారు॥

ఎడమచేతబట్టె నిదివో పండ్లగొల
కుడిచేత రాకాసి గుంపుల గొట్టె
తొడిబడ నూరుపులతో తూరుపుమొగమైనాడు
పొడవైన కలశాపురి హనుమంతుడు ॥పదియారు॥

తొక్కె అక్షకుమారుని తుంచి యడగాళ్ళ సంది
నిక్కించెను తోక ఎత్తినింగిమోవను
చుక్కలు మోవపెరిగి సుతు(సూర్యు) వద్ద వేదాలు
పుక్కిట బెట్టె కలశాపురి హనుమంతుడు ॥పదియారు॥



భావయామి వేంకటేశం

గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవేంకటేశు బంటు తానాయె
అట్టెవాయువునకు అంజనిదేవికిని
పుట్టినాడు కలశాపుర హనుమంతుడు ॥పదియారు॥

## భావామృతం

ఈ ఆంజనేయుని శరీర ఛాయ పదియారు వన్నెల పుత్తడిది. కాంతులు వెదజల్లుతున్నది. ఈయన కలశాపురంలో వర్ధిల్లుతున్నాడు.

వాడియైన పండ్లున్న 'పండ్లగోల' అను ఆయుధమును తన ఎడమచేతితో పట్టుకొని, కుడిచేతితో రాక్షసుల గుంపును కొట్టి సంహరించుచున్నాడు. వేగముగా చలియించే ఉచ్ఛ్వాస నిశ్వాసములతో తూర్పువైపున తనమొఖమును జూపుచున్న ఈ కలశాపురి హనుమంతుడు ఎంతో పొడగిరియైనవాడు.

రావణాసురుని కుమారుడైన అక్షకుమారుని లంకలో తన కాళ్లతో తొక్కి, ఎడమగా జేసిన కాళ్లసందున ఇరికించి సంహరిస్తూ చూ తన తోకను బిర్రుగా జేసి ఆకాశమువైపు ఎత్తి నిలబెట్టినాడు. నక్షత్రములను తాకునంత ఎత్తు పెరిగి సూర్యుని వద్ద వేదాలు పుక్కిట బెట్టి (నోటిద్వారా విన్నది విన్నట్లుగానే గ్రహించి) వెనువెంటనే నేర్చేసుకొన్నాడీ కలశాపురి హనుమంతుడు.

దివ్య వస్త్రాలంకార భూషితుడై కవచ కుండలధారియై గొప్పగా ఈ పవనసుతుడు శ్రీవేంకటేశ్వరుని పట్టపు బంటువలె అయి యున్నాడు. అట్లే ఈ కలశాపురీశుడైన హనుమంతుడు వాయుదేవునికి, అంజనాదేవికి జన్మించిన ముద్దుల కుమారుడు.

## 1-90

### మున్నుడి

వైరాగ్యం తారాస్థాయిని చేరినప్పుడు పరమాత్మునికి 'శరణు' అన్నవారి నోటివెంట వచ్చే ఆవేదననే అన్నమయ్య అద్భుతమైన కీర్తన రూపంలో ఆలపిస్తున్నారు. రకరకములైన బంధములలో కట్టివేసి బ్రతికున్నంతకాలమూ నాది, నాది, నావాళ్లు అంటూ ఒకే యావతో ఈ సంసార సాగరంలో కొట్టుమిట్టాడుతూ మనిషి రోజుకి ఒక్క సారన్నా మనస్ఫూర్తిగా "నారాయణా! నన్ను రక్షించు" అనడు. అనలేడు. ఎన్ని చీకాకులు కలిగినా వాటికేవో తాత్కాలిక పరిష్కారాలకోసం చూస్తాడేకాని మధ్యలో వచ్చినవారు మధ్యలోనే పోతారని శాశ్వతుడు శ్రీవేంకటేశ్వరుడు మాత్రమేనని గ్రహించలేడు. అదే స్వామి మాయ...

**చం॥ వినుతిని జేసె వేదములు విష్ణుడవంచు గిరీంద్రధారి నిన్**
**వినుము మదీయ ప్రార్థనలు వేదన సల్పెడి కర్మబంధముల్**
**దునిమి విరాగి జేయుమిక తోయజనాభుడ! వేంకటేశ్వరా!**
**గొనకొని అన్నమయ్య హరిగొల్చెను అద్భుత కీర్తనంబుతో**

**రాగం : హిందోళ**

నిగమ నిగమాంతవర్ణిత మనోహర రూప
నగరాజ ధరుడా శ్రీనారాయణా ॥నిగమ॥

దీపించు వైరాగ్య దివ్యసౌఖ్యంబియ్య
నోపక కదా నన్ను నొడబరపుచు
పైపైనె సంసార బంధముల కట్టేవు
నా పలుకు చెల్లునా నారాయణా ॥నిగమ॥

చీకాకు పడిన నాచిత్తశాంతము సేయ
లేకకా నీవు బహులీల నన్ను
కాకు సేసెదవు బహు కర్మముల బడవారు
నా కొలది వారలా నారాయణా ॥నిగమ॥





వివిధ నిర్బంధముల వెడల ద్రోయక నన్ను
భవసాగరముల దడ బడ జేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాధీశ
నవనీతచోర శ్రీనారాయణా ॥నిగమ॥

### భావామృతం

వేదముల చేతను వేదాంతములచేతను వర్ణించబడిన మనోజ్ఞమైన రూపముగల ఓ శ్రీమన్నారాయణా! గోవర్ధనధారీ! శరణు.

వైరాగ్య భావన నిజమైన పరమసుఖదాయకము. కాని నీవు అది నామనస్సులో వెలుగొందనీయక నన్ను ప్రతి విషయానికి సమ్మతింపజేయుచు అనేక సంసార బంధాల్లో కట్టి పడేస్తావు. పోనీ అవైనా శాశ్వత బంధాలా అంటే కాదు. అన్నీపైపైన బంధాలు. కట్టిపడేసేవే కానీ వేరు కాదు. అలాగని నామాట చెల్లుతుందా అంటే అదీలేదు. నాకీ బంధం బాగుంది ఇట్లాగే ఉంటానంటే ఉండనిస్తావా, అది మధ్యలో పుటుక్కున తెంపేసి మేము "లబోదిబో" అని మొత్తుకొనేట్లు చేస్తావు. నారాయణా! నాకెందుకయ్యా ఈ అనవసరమైన సంసారబంధం?

ఈ బంధాల వ్యథతో నేను చీకాకు పడి మనశ్శాంతిని కోల్పోతాను. అప్పుడు నిన్ను అసలు తలవను. నీలీల నాకేమో అర్థం కాదాయె. ఏవేవో పరిష్కారాల కోసం మానవులు ఏవేవో కర్మలు చేస్తారు. అటువంటివాళ్లు నావంటి వారలా ప్రభూ! నారాయణా (నేను నీ శరణార్థిని కానా?)

నేను దిక్కులేనివాడిని. నీ శరణు జొచ్చినవాడిని. నన్ను వివిధములైన నిర్బంధాలలో పడద్రోసి, దారితెన్నూ లేని ఈ సంసార సాగరంలో తడబడిపోవునట్లు చేసి పరీక్షించుట న్యాయం కాదయ్యా! దేవేంద్రాదులచే సేవించబడి ఆరాధించబడే ఓ తిరుమలాధీశా! వేంకటేశ్వరా! వెన్నదొంగా! శ్రీమన్నారాయణా! శరణు. నామాట నమ్ము. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ"

## 1-91

### మున్నుడి

తుమ్మెద ప్రతి పూవుపై వాలి మకరందం గ్రహించి తేనెపట్టు పెడుతుంది. దాన్ని మానవులు తమ స్వార్ధం కోసం పొగబెట్టి వెళ్లగొట్టి దొంగిలిస్తారు. అది మళ్లీ ఇంకొక తేనెపట్టు పెడుతూనే ఉంటుంది. వేంకటేశ్వరుని తుమ్మెదగా భావించి జానపదుల బాణీలో పాడుతున్నారన్నమయ్య. మేము స్వార్ధపరులమే కాని అనాదిగా జీవకోటి ఆర్తత్రాణ పరాయణుడు గావున తొల్లింటి వలెనే రక్షించు తండ్రీ! అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఇంత చిన్న కీర్తనలో నర్మగర్భమైన పదములు కోకొల్లలు. ఒకసారి పరికించండి. తాళ్లపాక వారి చాతుర్యం 'సంగ్రహించండి'.

**ఆ.వె॥ అన్నమయ్య ఊహ అద్భుతంబుర చూడ**
**తుమ్మెదాయెను వరదుండు తాను,**
**జానపదుల శైలి చక్కటి కీర్తన**
**భావమెరిగి దీని పాడరయ్య!**

**రాగం : శ్రీరాగం**

తొల్లింటి వలె గావు తుమ్మెదా
వొల్లవుగా మమ్మునో తుమ్మెదా ॥తొల్లింటి॥

తోరంపు రచనల తుమ్మెదా కడు
దూరేవు గొందులే తుమ్మెదా
దురినా నెఱగవు తుమ్మెదా
వోరగా చూడకువో తుమ్మెదా ॥తొల్లింటి॥

తొలి ప్రాయపు మిండ తుమ్మెదా కడు
తొలిచేవు చేగలే తుమ్మెదా
తొలకరి మెరుగవే తుమ్మెదా
ఉలికేవు మముగని వో తుమ్మెదా ॥తొల్లింటి॥





దొరవు వేంకటగిరి తుమ్మెదా
తురుమేల చెనకేవు తుమ్మెదా
దొరకే నీ చనవులు తుమ్మెదా
ఒఱులెరింగిరి గదవో తుమ్మెదా ॥తొల్లింటి॥

### భావామృతం

అనాదిగా జీవకోటికి తగిన ఆహారాన్నిచ్చి బ్రతికే కిటుకుల్ని నేర్పి, తరువాతి తరాన్ని పుట్టించే 'సామర్థ్యం' ఇచ్చి పోషిస్తున్న దెవరు? ఆ తిరుమలేశుడే. ఓ తుమ్మెదా! (తిరుమలేశా!) మమ్మల్ని ఇదివరలో వలెనే రక్షింపుము. మమ్మల్ని విడిచిపెట్టవు గదా! తుమ్మెదా! (అంతపని చేయకు తండ్రీ!)

ఓ తుమ్మెదా! నీవన్నీ స్థూలమైన రచనలు. ఆషామాషీకాదు. ఆర్తజన రక్షణకోసం ఎన్నెన్నో మారుమూల ప్రదేశాలకు పోతావు (ఎక్కడో కొలనులో మొసలికి చిక్కిన గజేంద్రుని రక్షించటానికి వెళ్లలేదూ?). ఆక్షణంలో పాపపుణ్యాలను లెక్కసేయవు. నీపని నీవు చేస్తూనే మాబోటి దీనులింకా ఎవరన్నా ఉన్నారేమోనని వోరచూపులు చూస్తూనే ఉంటావు. తుమ్మెదా! (అందుకే నిన్ను జగన్నాధుడన్నారు)

ఓ మగ తుమ్మెదా! నీవిప్పటి వాడవా? అనాదివి. మా బలమునంతా హరించి వేస్తావు. మేము సాధించిన వన్నీ తొలకరినాటి మెరుపుల వలె క్షణ భంగురాలని మేమే గ్రహించేట్లు చేస్తావు. దిక్కుతోచక మేము ఏడుస్తుంటే నువ్వ మాకోసం చలించిపోతావు. తుమ్మెదా! (నిన్ను అర్ధం చేసికొనుట మా వలన అవుతుందా?)

ఇంతకీ నీవెవరవు? నీవు వేంకటాద్రిపై నుండే దొరగారివే తుమ్మెదా! నీవు మా తప్పుల్ని ఎందుకు యెంచుతావు? వద్దు ఆ పనిచేయకు. ఇప్పుడు మాకు నీవద్ద స్వాతంత్ర్యం లభించింది కదా! ఇక ఏం చేయాలో అందరికీ తెలిసిపోయిందే తుమ్మెదా? (ఎలుగెత్తి ప్రార్థించండి... "శరణంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా...")

## మున్నుడి

శ్రీరామచంద్రునిపై ఎన్నో అమరమైన కీర్తనలు చెప్పారన్నమయ్య. రామాయణాన్ని అట్టి కీర్తనలలో రాముని గుణగణాలు వర్ణిస్తూ పదే పదే చెప్పటం తాళ్లపాక వారి ప్రత్యేకత. ఏ ఊరు సందర్శించవలసి వస్తే ఆ వూరిలోని దైవమూర్తిని శ్రీవేంకటేశ్వరునిగానో లేక ఆయన దాసునిగానో సంకీర్తిస్తారు. చిత్తూరు జిల్లాలోని 'వావిలిపాడు' (వాయల్పాడు) లో వెలసిన వీరరామచంద్రుని దర్శించి ఆయన చెప్పిన సంస్కృత కీర్తన ఇది. 'సంయమినాథ వరదుడ'ని రామయ్య నెందుకన్నారో తెలుసునా? 'తరణి సంభవ సైన్యదక్షకు'డంటే.. భావామృతం పరిశీలించండి తప్పదు. ఇదే రాముని సేవ అంటే..

**చం॥ వరరుహలోచనుండు రఘువంశసుధాంబుధి పూర్ణచంద్రునిన్**
**సురగణ సేవితున్, దనుజ సూదను, రాముని, రావణాంతకున్,**
**వరదుని, అన్నమయ్య సురభాషనుతించెను కీర్తనంబుతో**
**పరవశులైరి మాన్యులగు పావనియున్ తిరుశైలనాథుడున్**

**రాగం : నటభైరవి**

రాజీవ నేత్రాయ రాఘవాయా నమో
సౌజన్య నిలయాయ జానకీశాయ ॥రాజీవ॥

దశరథ తనూజాయ తాటక దమనాయ
కుశిక సంభవ యజ్ఞ గోపనాయ
పశుపతి మహాధనుర్భంజనాయ నమో
విశద భార్గవ రామ విజయకరణాయ ॥రాజీవ॥

భరిత ధర్మాయ శూర్పణఖాంగ హరణాయ
ఖరదూషణాది రిపు ఖండనాయ
తరణి సంభవసైన్య దక్షకాయ
నిరుపమ మహా వారిధి బంధనాయ ॥రాజీవ॥





హతరావణాయ సంయమినాథ వరదాయ
అతులిత అయోధ్యా పురాధిపాయ
హితకర శ్రీవేంకటేశ్వరాయ నమో
వితత వావిలిపాటి వీరరామాయ ॥రాజీవ॥

## భావామృతం

రాజీవములు (పద్మములు) వంటి కన్నులుగల ఓ రఘురామా! మంచితనమునకు నిలయమైన శ్రీరామచంద్రా! సీతామనోహరా! (నీకు వందనములు)

ఓ దశరథ తనయా! తాటక అను రాక్షసిని సంహరించిన వాడా! కౌశికుడైన విశ్వామిత్రుని యాగమును రక్షించినవాడా! పరమేశ్వరుని వింటిని రెంటికి విరిచిన మహానుభావా! భార్గవరామునిపై విజయమును ప్రకటించినవాడా! (నీకు వందనములు)

ధర్మములచే సంపూర్ణుడవైన ప్రభూ! శూర్పణఖ అంగములను (ముక్కుచెవులను) హరించినవాడా! ఖరదూషణాది దానవ సంహారా! సముద్రమునుండి ఉద్భవించిన అసంఖ్యాక సైన్యమును చీల్చి చెండాడిన అసహాయశూరా! సరిపోల్చలేని గొప్పసేతుబంధన మొనరించిన శ్రీరామా! (నీకు వందనములు)

రావణాసుర భంజనా! మునిజన వరప్రదాతా! సరిపోల్చనసాధ్యమైన అయోధ్యాపురాధిపా! నీవే హితప్రదాతవైనమా శ్రీవేంకటేశ్వరుడవు. అధికుడవైన 'వావిలిపాటి' వీరరామచంద్రమూర్తివి నీవే ప్రభూ! అట్టినీకు (వందనములు తండ్రీ!)

**1-93**

## మున్నుడి

అవకాశం చిక్కినప్పుడల్లా అన్నమయ్య శ్రీహరి దశావతారవిశేషాలను వర్ణిస్తుంటారు. ఒక్కొక్కప్పుడు ఆ వర్ణన యెంత నర్మగర్భంగా వుంటాయంటే పెద్దలు వివరించి చెబితే గాని మనబోటి సామాన్యుల కర్థంకాదు. ఈ కీర్తనలో అమ్మ అలమేలుమంగని కీర్తిస్తూ ఇన్ని అవతారాలెత్తినేడు వేంకటేశ్వరుడైన ఆ మహానుభావుడు నీపై మక్కువతో అక్కున చేర్చుకోగానే ఇట్లే అలరించే నాంచారివమ్మా! అని కీర్తిస్తున్నారు. భావామృతంలో నా పరిమిత జ్ఞానంతో వివరణ ఇచ్చాను. కానీ ఇంకా లోలోపలి అర్థాలున్నాయేమో! మనమెంత..

**శా॥ కొమ్మా! శ్రీహరియెత్తెనాడు పదియౌ కొంగ్రొత్త రూపంబులన్**
**అమ్మమ్మా!! యిటు చెప్పవీలగునె ఓ అమ్మణ్ణి నాంచారి! మా**
**అమ్మా! నీ విభు ఆజ్ఞ చేత చెబితిన్ అందించితిన్ 'భావమున్'**
**సమ్మానంబంది అన్నమయ్య కృపచే సాధించితిన్ 'మున్నుడిన్'**

**రాగం : భైరవి**

అమ్మమ్మ యేమమ్మ అలమేల్పంగ నాంచారమ్మా
తమ్మియింట నలరు కొమ్మ ఓ యమ్మ ॥అమ్మమ్మ॥

నీరిలోన తల్లడించీ నీకే తలవంచీ
నీరికింద పులకించీ నీ రమణుండు
నోరికొన చెమరించీ కోపమే పచరించీ
సారెకు నీ అలుక ఇట్టే చాలించవమ్మా ॥అమ్మమ్మ॥

నీకుగానే చెయిచాచీ నిండాకోపమె రేచీ
మేకొని నీ విరహాన మేను నెంచేని
యీకడాకడి సతుల హృదయమే పెరరేచీ
ఆకు మడిచియ్యనైనా ఆనతియ్యవయ్యా ॥అమ్మమ్మ॥





చక్కదనములె పెంచీ సకలము కాదలంచీ
నిక్కపు శ్రీవేంకటేశుడు నీకే పొంచేని
మక్కువతో అలమేల్మంగ నాంచారమ్మా నీ
అక్కున నాతని నిట్టె అలరించవమ్మా ॥అమ్మమ్మ॥

## భావామృతం

ఏమమ్మా! అలమేల్మంగ నాంచారీ! అమ్మమ్మా! (అసాధ్యురాలవు గదమ్మా!) పద్మంలో నివాసమైయున్న కొమ్మవు (యువతివి) గదమ్మా నీవు.

ఓ తల్లీ! మీ శ్రీవారి వైభవాన్ని ఏం వర్ణించగలం? ఆయన నీటిలో తల్లడిల్లిపోయేట్లు చేసి (సోమకాసురుని చంపుటకు మత్స్యావతారం ఎత్తి) తరువాత నీకే తలవంచి వరమాల వేయించుకొన్నాడు. నీ రమణుడు ఆ తరువాత నీరికిందపులకించాడు. (సముద్రము అడుగున పులకించిన విధమున కూర్మమై తన వీపుమీద మంథర గిరిని మోశాడు). తననోటి మీద వహించి (భూదేవిని కరుణాంతరంగుడై రక్షించే వరాహమూర్తి అయి యున్నాడు.) విపరీతమైన కోపమును ప్రసరింపజేసినాడు. (నరసింహస్వామియై హిరణ్యకశిపుని సంహరించాడు). ఎవరెవరితోనో తగాదాలు పెట్టుకొంటూ అవస్థలు పడుతున్నాడని మాటిమాటికీ నీ అలుకలు చాలించవమ్మా!

నిజమే ననుకో.. నీవులేకుండా ఎవరెవరి దగ్గిరనో చేయిచాచి భవతీ భిక్షాందేహి అన్నాడు (వామనమూర్తి). కోపావేశంతో రెచ్చిపోయాడు. (పరశురాముడై ఇరవై ఒక్కసార్లు భూమిపై రాజు అనేవాడు లేకుండా మారణకాండ చేశాడు). సమ్మతించి నీవిరహం అనుభవించి మరీ నిత్యమూ దుఃఖించాడు. (శ్రీరామచంద్రుడు). మధురమైన వేణునాదంతో అమాయకురాళ్లైన యువతుల హృదయాలను ప్రేరేపించి (శ్రీకృష్ణుడు) యున్నాడు. ఆ స్వామికి భక్తితో తాంబూలం ఇద్దామని మా ఆశ. కాస్త అనుజ్ఞనియ్యవమ్మా!

చక్కదనములు కలిగిన మంచి (జ్ఞానమును) పెంచియున్నాడు. (బుద్ధభగవానుడు). సర్వాధిక్యత పొంది సకలము కాదలచి (కల్కి అవతారం) విరాజిల్లాడు. నిజమైన శ్రీ వేంకటేశ్వరుడు నీకోసం నిరీక్షించి ఓ అలమేలు మంగ (అలర్‌మేల్ మంగై అనగా పద్మంపై నిలిచిన యువతి) నాంచారీ! నీపై అనురాగంతో నీ కౌగిట చేరిన ఆ జగన్నాథుని క్షణంలో ఇట్టే మైమరిపిస్తావు కదమ్మా!

## 1-94

### మున్నుడి

జానపద కీర్తనలు చెప్పటంలో అన్నమాచార్యులవారు అద్వితీయులు. తేలు దగ్గరనుంచి నీలకంతుని వరకు, చీమదగ్గిరనుంచి శ్వేతాశ్వాన్ని అధిరోహించిన కల్కిభగవానుని వరకు, పిల్లి దగ్గరనుంచి బల్లిదుడు వేంకటేశ్వరుని వరకు అన్నీ ఆ శ్రీమన్నారాయణుడే సుమా! ఎండైనా, నీడైనా (బయటనైనా, ఇంట్లోనైనా) ఆ ఏడుకొండలవాడే మా ఇలవేల్పు అని గట్టిగా చెబుతున్నారన్నమయ్య. ఈ జానపదుల కీర్తనలో నాగరీకులమనుకొనే నాబోటి వారికర్థంకాని పదములు ఎక్కువగానే ఉన్నాయి. పరిశీలించండి.

**ఉ॥ ఈశ్వరుడొక్కడే పిలుపు ఏదయినన్ పలికేది ఆయనే**
**శాశ్వతుడైన శ్రీహరియు శంకరుడొక్కటె బేధమున్నదా?**
**విశ్వము నిర్వహించునది విష్ణుడు, అన్నయ కీర్తనంబులో**
**అశ్వమునెక్కు 'కల్కి'యును ఆ తిరువేంగళరాయుడే అనెన్.**

**రాగం: నీలాంబరి**

ఎండగానీ నీడగానీ ఏమైనగానీ
కొండలరాయుడే మా కులదైవము ॥ఎండగానీ॥

తేలుగానీ పాముగానీ దేవపట్టయినాగానీ
గాలిగానీ ధూళిగానీ కాని ఏమైనా
కాలకూట విషమైన గక్కున మింగిన నాటి
నీలవర్ణుడే మా నిజదైవము ॥ఎండగానీ॥

చీమగానీ దోమగానీ చెలది యేమైన గానీ
గాముగానీ నాముగానీ కానీ యేమైన
పాములనిన్నిటి మింగే బలుతేజి పైనున్న
ధూమకేతువేని మా దొరదైవము ॥ఎండగానీ॥





పిల్లిగానీ నల్లిగానీ పిన్న యెలుకైనగాని
కల్లగాని పొల్లగాని కాని ఏమైనా
బల్లిదుడై వేంకటాద్రి పైనున్న యాతడే మ
మ్మెల్లకాలమును నేలే యింటిదైవము ॥ఎండగానీ॥

### భావామృతం

ఇంటా బయటా ఎక్కడనైనా మన దిక్కెవరు? మనందరికీ ఇలవేల్పెవరు? వేరే చెప్పాలా! ఇంకా ఎవరు? ఆ ఏడుకొండలరేడు తిరుమలనాధుడే కదా!

తేలు (కుట్టి బాధించేది) గానీ, పాము (కాటువేసి చంపేది) గానీ, దేవలోకంలో జన్మించిన ఎవరైనా గానీ, గాలి అయినాగానీ ధూళియైనాగానీ ఆఖరికి కాలకూట విషాన్ని మ్రింగి లోకాలను రక్షించుటకు తెల్లటివాడు నీల వివర్ణునిగా మారిన పరమశివుడు కూడ ఈ కొండలరాయుడే సువా!

గాముగానీ (సూర్యభగవానుడ కానీ) నాముగానీ (జొన్నవంటి పైర్లు కొడవలితో కోసినపుడు కోసుదేలిన భాగం చిగురించి మొలకలొస్తాయి.వాటిని పశువులు తిని మరుణస్తాయి) అట్లా చేసే అంతకుడు కూడా ఆ నల్లనయ్యయే. దుష్ట శిక్షణాచారదురంధరుడై గొప్పవేగముగల అశ్వమునెక్కి అందరినీ తుదముట్టించిన పెను ఉత్పాతము (ధూమకేతువు) వేరేవరో కాదు, కల్కిరూపుడైన ఆ శ్రీమన్నారాయణుడే.

పిల్లిగానీ, చటుక్కున కుట్టి పారిపోయే నల్లిగానీ, చిట్టెలుకగానీ, అబద్ధం కానీ, పొరపాటు గానీ ఏదైనా వేరెవ్వరూ కాదు. అందరికంటే సర్వసమర్థుడై పవిత్రమైన వేంకటాద్రిపై నెలకొని యున్న ఆ మహానుభావుడే సర్వకాల సర్వావస్థలలో మమ్మల్ని రక్షించే మా ఇలవేల్పు.

**1-95**

## మున్నుడి

'నిందాస్తుతి' అని ఒక అద్భుతమైన ప్రక్రియను కవులు యెన్నుకున్నారు. పైపైన చూస్తే ధిక్కరించి చిన్నచూపుగా మాట్లాడినట్లున్నా తరచి చూస్తే అది కీర్తించుటయే. ఈ కీర్తనలో అన్నమయ్య నిందాస్తుతి ప్రయోగించారు. ఎంత చమత్కారమో చూడండి. నన్ను అడుగడుగునా రక్షించటానికి జగద్రక్షుడు నీవున్నావు. మరి నీకు దిక్కెవరయ్యా! నేను భక్తితో పూజించుటకు నీవు కలవు. కానీ నీకెవరున్నారు? వరాలిచ్చి నన్ను అనుగ్రహించుటకు నీవు వున్నావు. నీకెవరు వరాలిస్తారు? పోవయ్యా! నీకంటే నేనే నయం. ఔరా!!!

**చం॥ ఘనుడను నిన్ను మించితిని కాదన జాలవు వేంకటేశ్వరా!**
**పనిచి వరాలనిచ్చి యెడబాయక నాజత నీవు వుండగా,**
**కనుగొననైతి నీకెవరు కాపు పరాత్పర! అన్నమయ్యనెన్**
**వినుటకు ధిక్కరింపు, మరి విజ్ఞత నెంచిన కీర్తనంబహో!!!**

### రాగం దేసాళం

నేనే పో ఘనుడను - నీకంటెను
దానవారి నీవు నాకు - దైవమవుగాన ॥నేనేపో॥

నేరుపున నాకైతే-నీదిక్కుగలదు గాని
చేరి నీ కావలదిక్కు - చెప్పి చూపగలదా
అరయ నీవైతే నాకు - నాధారము గలవు గా
నూరకే నీ కాధారము - వున్నదా యెక్కడను ॥నేనేపో॥

నిన్నుగొల్చిన సలిగె - నేడు నాకు గద్దు గాని
సన్నుతి నీకు నొకరి - సలిగున్నదా
పెన్నిధి నిన్ను దలచే - పేరు నాకు గద్దు గాని
వున్నదా నీకు దలచ - నొకరి పేరైనను ॥నేనేపో॥





ఈవులెల్ల నాకైతే - నియ్యగలవు గాక
ఆవల నీ కీవు లియ్య - నన్యు లున్నారా
శ్రీవేంకటేశ నాకు - జీవాంతరాత్మవు నీవు
భావించనంతరాత్మ య-ప్పటి నీకు నున్నదా ॥నేనేపో॥

### భావామృతం

అసురులకు భయంకరుడవైన నీవే నాకు అండగా దైవమై యున్నావు. (మరి నీకే దైవముని లేదు కదా!) కాబట్టి నీకంటె నేనే గొప్పవాణ్ణి పోవయ్యా!

నేర్పుగా దిక్కే నీవై నాకున్నావు. మరి నీకు అక్కడ ఇదిగో నా దిక్కు అని చూపించుకోటానికి ఎవరున్నారయ్యా! నేను ఈయన నా ఆధారం అని చెప్పుకోగలను. మరి నీకెవరు ఆధారం? ఏదో ఒక ఆధారం అంటూ ఉన్నదా? లేదు. మరి నేనే నయము కదా!

నిన్ను నేను సేవిస్తాను కాబట్టి నాకు నీ ఆశ్రయం వున్నది. నాకేదిగులులేదు, నేడు. మరి నీ సంగతో? నీవేవరివి స్తుతిస్తావు? నీకు ఆశ్రయమంటూ ఏమన్నా వున్నదా? లేదు కదా! నాకు పెన్నిధివలె నీనామం వున్నది. అదీగాక అనంతమైన నామాలు. మరినీవు ఎవరి నామస్మరణ చేయగలవు? అందువల్ల నీవు ఎవర్ని తలవగలవు? కాబట్టి నేనే నయం నీకంటె.

నాకేం కావలసినా ఇచ్చుటకు సర్వసమర్థుడవైన నీవు ఉన్నావు. నీవెవరినడుగుతావు? నీకు ఈయగలవాడెవడున్నాడు. ఆ వైపున? ఓ వేంకటేశ్వరా అంతర్యామివై నాకు నీవు సదా నాలోవున్నావు. నీకు అంతరాత్మే లేదు. నీకు హితము లెవరు చెప్పగలరు? నీవు శాశ్వతుడవు, నిరంకుశుడవు, జగన్నాయకుడవు, స్వామివి అయినప్పటికీ నేనే నీకంటే గొప్పవాడిని.

## 1-96

### మున్నుడి

'లాలి' అంటే ఉయ్యాల అని అర్థం. ఉయ్యాల వూపుతూ పాడే పాటలు లాలిపాటలు. తల్లిపాపాయిని నిద్రబుచ్చటానికి లాలీ లాలీ అంటుంది. ఉయ్యాల లూగునాన్నా అని 'లాల' కి అర్థం.

ఈ కీర్తనలో గోపికలు బాలకృష్ణుని నిద్రబుచ్చుతున్నారు. గండడు అంటే పురుషుడు అని అర్థం. గండవరుడంటే పురుషోత్తముడు, పరాక్రమ విక్రముడు అని అర్థాలున్నాయి. ఈ కీర్తనలో అన్నమయ్య విధిగా వాడే వేంకటేశుని మకుటం కనిపించదు. "గండవరేశ!" అని కీర్తనని ముగిస్తారు అన్నమయ్య. ఆఖరి చరణంలో 'గండవరేశ' స్థానంలో 'వేంకటనాథ' అని పెట్టుకొంటే ఆలోటు కనిపించదని నా భావన.

ఇంత అమృత పేయమైన కీర్తనలో వివరణ ఇంత అధ్వానంగా వుందని మీరు భావిస్తే ఆలోపం నాదే. ఎందుకంటే ఏదో టూకీగా భావం చెప్పటం నా అభిమతం కాదు. ప్రతిపదానికి వివరణ ఈయాలనే నా తపన. ఆ ప్రయత్నంలో పాఠకులకి కొంత ఇబ్బంది కలిగినా తరచి తరచి చదివితే నా తిప్పలన్నీ దేనికో మీకు అర్థమవుతుంది.

ఇక మొదలుపెట్టండి 'భావయామి వేంకటేశమ్' లో ఇది ఆచార్యులవారి అద్భుత సృష్టి. రసవత్తరంగా పాడగల అందరికీ నా వందనములు.

**సీ॥ లాలిపాటలు పాడి రమణీయముగ నాడు**
**అన్నమయ్య నిదుర హరిని బుచ్చె**
**ఏనాటి పుణ్యమో ఈ రీతి వివరించి**
**జన్మ సాఫల్యంబు జరుపుకొంటి**
**దూరపు కొండలు తోపును నునుపుగా**
**దరిబోయి చూడంగ తరులు గిరులు**
**ఈ కీర్తనంబులున్ ఇదెతీరు చూడరో**
**వివరమీయ దలంచ వెత్తి బుట్టు**





**ఆ.వె॥ వేంకటేశుకరుణ వెలయంగ పాడిరి**
**నాడు అన్నమయ్య నేడు నేను**
**అట్టి సద్గురుడిని గట్టిగా ప్రార్థించి**
**అందజేయుచుంటి నా వివరము**

**రాగం : మధ్యమావతి**

లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాల గండవర గోపాలు నిను చాల ॥లాలనుచు॥

ఉదటుగుబ్బల సరము లుయ్యాల లూప
పదరి కంకణరవము బహుగతుల మ్రోగ
వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీగ
ముదురు చెమటల నళికములు తొప్పదోగ ॥లాలనుచు॥

సొలపు తెలికన్నుగవ చూపు లిరువంక
మలయ రవళులకు పలుమాఱును బెళంక
కొలది కోవిలగములు క్రోలు మదనాంక
ములగ్రేణి సేయు రవముల వడి దలంక ॥లాలనుచు॥

సరసపదములు జంగచాపు చేపాయ
గురులీల మీగాళ్ల గుచ్చెళ్లు రాయ
కలమూలముల కాంతి కడుజాయ చేయ
సరస నురు కుసుమ వాసన లెదురు డాయ ॥లాలనుచు॥

కొలది నునుమేను లతకూన లసియాడ
మెలకువతొ నొకరొకరి మెచ్చి సరిగూడ
తలలూచి చొక్కి చిత్తరు బొమ్మలాడ
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ ॥లాలనుచు॥

లలిత తాంబూలరస కలితంబులైన
తళుకు దంతములు కెంపుల గుంపులీన
మొలక వెన్నెలడాలు ముసురుకొని తోన
చెలగి సెలవుల ముద్దు చిరునవ్వు లాన॥లాలనుచు॥

మలయమారుత గతులు మాటికి చెలంగ
పలుకు కపురపుతావి పైపై మెలంగ
బలు గానలహరి యింపుల రాల్లరంగ
బలసి వినువారి చెవి బడలిక తొలంగ ॥లాలనుచు॥

లలనాజనాపాంగ లలిత సుమచాప
జలజ లోచనదేవ సద్గుణ కలాప
తలపు లోపల మెలగు తత్త్వ ప్రదీప
భళిర వేంకటనాథ పరమాత్మ రూప ॥లాలనుచు॥

**('వేంకటనాథ'** కు బదులుగా **గండవరేశ** అని మూలం)

**భావామృతం**

'లాలీ' 'లాలీ' అంటూ అతివలు ఇరువైపులా నిలిచి ఊయల నూపుదురు. ఓ బాల పరాక్రమ విక్రమా! గోపాలబాలా! నిన్ను చాల చక్కటి విధమున ఊయలమాపుచున్నారు.

అట్లా ఊయలనూపుతుంటే గర్వముగా నుప్పొంగిన ఆ భామల గబ్బిగుబ్బలు కూడ ఊయలలూగుచున్నవి. ఊరకనే ధ్వని చేయు కంకణముల పలురకములైన సవ్వడులు చేయుచున్నవి. చెంపలపై ఒరుసుకొని కొప్పులు కొద్దిగా వదులయినవి. అధికమైన చెమటతో తనువులు వారికి మిక్కిల తడిసిపోయినవి. అయినా వారు ఊయలనూపుచునే యున్నారు.

పరవశించిన తెల్లని కన్నులతో వారు ఇరు ప్రక్కలా (ఊయల ఊగుతుంటే) చూపులు తిప్పుతున్నారు. అటూ ఇటూ మరలే చూపులకనుగుణంగా కళ్ల తళుకులు





మారుతున్నాయి. గాలి సవ్వడి కూడ అలాగే మారుతున్నది. ఆలయమునకు పోవుచున్న జవ్వనులు మన్మథావస్థను పొందుటచే (గోపాల బాలుని చూచి) చలించిపోయి రకరకములైన రవములను సేయుచున్నారు. కోమలములైన పాదములపై పిక్కలను దాటిన వస్త్రపు చాపుతో మోకాళ్లపై కుచ్చెళ్ల రాసుకొంటున్నవి. కరమూలముల మెఱపు చక్కని కాంతి జిమ్ముచున్నది. అవి చక్కటి కుసుమ సువాసనలు వెదజల్లుచున్నాయి. ఆ లీల అద్భుతముగా నున్నది.

నునుపైన చిన్న శరీరములు గల లేత్రాయపు అమ్మాయిలు కొద్దిగా మేల్కొని ఆ తరువాత ఒకరినొకరు మెచ్చుకొంటూ గుంపుగా కూడి, తలలు ఊపి పరవశించి బొమ్మలవలె మోహనమైన తమ ఆకారములను చూపుచు నిలబడి పోయారు. (కృష్ణుని చూచి మోహ పరవశులై పోయారు).

లేత్రాయపు అమ్మాయిల సంగతలా ఉంటే, ఇక ప్రౌఢ యువతుల సంగతెలా యున్నదో వినండి.. మధురమైన తాంబూల రసముతో మిళితమైన వారి దంతములు కెంపుల గుంపులవలె తళుకులను ప్రసరిస్తున్నాయి. లేత వెన్నెల కాంతి ముసురు కొనినట్లున్న చిరునవ్వు, ముద్దొచ్చే పెదవుల చివర ఆడుచున్నట్లున్నది.

ఇక గోపికలు పాడే ఆ లాలిపాట ఎలా వున్నదో వినండి. మలయమారుతం హాయిగా మాటి మాటికీ వీస్తున్నట్లున్నది. కర్పూరపు పలుకుల మధుర సువాసన వెదజల్లుచున్నట్లుంది. అద్భుతమైన ఆ గానలహరికి రాళ్లు అరిగి కరిగిపోతున్నట్లున్నది. ఆ గానం విన్నవారి చెవుల బడలికంతా మటుమాయమై అణగారి పోవుచున్నది.

లలనలందరికీ తిలకము వలె శోభాయమానమైన మన్మథరూపా! పద్మనయనా! సద్గుణ భూషణా! దేవదేవా! చిత్తములలో ప్రకాశించు తత్త్వ విభావరిని ప్రసాదించు మహాత్మా! భళిరా! భళి! ఓ వేంకటనాథా! ఓ గండవరేడా! (పురుషోత్తమా!) పరమాత్మ స్వరూపా! భళి!

## 1-97

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరునికి ప్రతి శుక్రవారము అభిషేక మహోత్సవం జరుగుతుంది. తిరుమలలో కన్నులపండువగా జరిగే స్వామివారి అభిషేక వైభవాన్ని కళ్లకు గట్టినట్లు వర్ణిస్తున్నారన్నమయ్య. మనబోటి వాళ్ళు జీవితంలో ఏ ఒక్కసారో కన్నులారా స్వయంగా చూడగలిగే ఆ ఉత్సవం దేవతలు కూడా బారులు తీరి నింగి నుండి తిలకిస్తారట. అప్పుడు దేవదుందుభులు మ్రోగుతాయట. ఆ శృంగారాలొలికే దేవుని కనులారా దర్శించి సేవించండంటున్నారన్నమయ్య. ఈ కీర్తనలో తేలికగా అర్థం కాని మాటలు బాగానే ఉన్నాయి. చదివి ఆ విశేషాలు తెలుసుకోండి.

**ఆ.వె॥ స్వామి సేవయైన స్నానంపు ముచ్చట**
**తెలిపి రన్నమయ్య తేటతెలుగు**
**కీర్తనంబు లోన కేశవు గొలిచిరి**
**ఎన్ని మెలికలున్న విందులోన!!**

**రాగం : ఖరహరప్రియ**

దేవదుందుభులతోడ తేటతెల్లమైనాడు
సేవించరో యిదే వీడే సింగార దేవుడు ॥దేవ॥

బంగారుమేడలలోన పన్నీట మజ్జనమాడి
అంగము తడియొత్తగా నదె దేవుడు
ముంగిట పులుకడిగిన ముత్యమువలెనున్నాడు
కుంగని రాజసముతో కొండవంటి దేవుడు ॥దేవ॥

కాంతులు మించిన మాణికపు తోరణములకింద
అంతట కప్పురము చాతుకదే దేవుడు
పొంతల నమృతమే పోగైనట్టున్నవాడు
సంతతము సంపదల సరిలేని దేవుడు ॥దేవ॥





తట్టుపుణుగు నించుక దండిసొమ్ములెల్లాబెట్టి
అట్టె అలమేల్మంగ నరుతగట్టి
నెట్టన నమ్మినవారి నిధానమై వున్నవాడు
పట్టపు శ్రీవేంకటాద్రిపతియైన దేవుడు ॥దేవ॥

## భావామృతం

నింగిలో దేవతలంతా నిలిచి ఈ అభిషేకోత్సవాన్ని కన్నుల పండుగగా చూస్తూ దేవదుందుభులను మ్రోగిస్తున్నారు. అప్పుడీ శృంగార పురుషుడు ప్రకాశమానమవుతున్నాడు. ఇదిగో ఈయనే.. రారండి మీరంతా ఈ స్వామిని సేవించండి.

ఈ స్వామికెన్నో బంగారు మేడలున్నాయి. ఆ మేడలో ఈయనకు పన్నీటితో స్నానం చేయించారు. అవయవముల కంటిన తడిని జాగ్రత్తగా తుడిచి వేస్తున్నారు. అదిగో చూడండి. ఈయన కడిగిన ముత్యమువలె నున్నాడు. ఆ కడుగుట కూడ ఊరకనే నీటితో కాదు అవి పులుకడిగిన ముత్యములు. అంటే చింతపండు పులుసు వేసి మరీ కడిన ముత్యాలు. అందుకని మిలమిలా మెరిసిపోతున్నాయి. ఇకపోతే పర్వత సమానుడైన ఉన్నతుడు కాబట్టి ఏమాత్రం తగ్గని రాజసం వుట్టిపడుతుంటే ఈ దేవుడు మనోహరంగా ఉన్నాడు చూడండి.

ఈయన వెలుగులు వెదజల్లే మాణిక్యపు మకర తోరణముల క్రింద చక్కగా కర్పూరం అద్దుకొన్నమేని శోభతో విరాజిల్లుతున్నాడు. దేవుడు అంటే ఈయననే. అమృతమంతా యొకచోట చేర్చినట్లున్న ఈయనను అతి సమీపమునుండి తిలకించండి. అంతులేని సంపదలు కల ఈ సాటిలేని దేవుని తిలకించి తరించండి.

చేతులతో తట్టి, ఒత్తుతూ తయారుచేసిన పునుగు జవ్వాది ఈస్వామి ఒంటినిండా అద్ది యున్నారు. రంగులీను రత్నాభరణాలతో విశేషంగా అలంకరించారు. అదేవిధంగా సిద్ధంగా ఉన్న అలమేల్మంగమ్మను ఈయన “అరుతగట్టు” కొన్నాడు (అంటగట్టుకొన్నాడు) ఈయన ఒక నియమబద్ధంగా నమ్మినవారికి కొంగుబంగారమైన మహానుభావుడు. వేంకటాద్రిమీద ఈయన వేంకటపతియై పట్టాభిషిక్తుడైన మహానుభావుడు.

**1-98**

## మున్నుడి

శ్రీరామునికి శరణు జొచ్చి బ్రతకండి అని సలహా ఇస్తున్నారు అన్నమాచార్యులవారివీ. శరణంటే ఆనాడు రావణాసురుని కూడా క్షమిస్తానన్న శరణాగత రక్షకుడా మహానుభావుడు. ఓ దైత్యులారా! విచారం యెందుకు? ఆయనన శరణంటే రక్షిస్తాడు రండి అంటున్నారు. నేటి కలియుగంలో ఆయనే తిరుమల శ్రీవేంకటేశ్వరుడైనాడు. ఈయనకూడా దుర్బుద్ధి కలిగి, మంచివారిని పీడించే రాకాసి మూకను ఏదో ఒకతీరున పగసాధించి తనమేటి పొదలోవున్న బాణాలతో కొడతాడు పారిపోండి అంటున్నారు.

**ఉ॥ రాముని కోరుడీ శరణు రక్షనుగైకొని బ్రత్కుడీవెసన్**
**ఏమిటికిన్ విచారమిక ఏపున బారరొదైత్యులాల! యీ**
**భూమిని వేంకటేశ్వరుడు పుణ్యులగాచును రామబాణమున్**
**ధీమతియగీ ధరించెనని తెల్పెను కీర్తనమన్నమార్యుడున్.**

**రాగం : సామంతం**

రామునికి శరణంటె రక్షించీ బ్రదుకరొ
యేమిటికి విచారాలు యికదైత్యులాల ॥రాముని॥

చలవ దాటికి జదిపిన బాణము
లవిమారీచ సుబాహులపై బాణము
మెలగి పరశురాముమేట్లేసిన బాణము
తళతళమెరసీనితలరో యసురులు ॥రాముని

మాయా మృగముమీద మరివేసిన బాణము
చేయిచాచి వాలినేసిన బాణము
తోయధిమీద నటు తొడిగిన బాణము
బాయలుదేరుచున్నది చనరోదైతేయులు ॥రాముని॥





తగ కుంభకర్ణుని తలద్రుంచిన బాణము
జిగిరావణు బలిమార్చిన బాణము
మిగుల శ్రీవేంకటేశు మేటిపొద(ది) బాణము
పగసాధించీ నిక బారరో రాకాసులు ॥రాముని॥

## భావామృతం

ఓ దైత్యులారా! శ్రీరామచంద్రునికి మ్రొక్కి శరణు అంటే రక్షిస్తాడు. ఏమిటికి విచారాలు (ఇంకా ఆలోచనలెందుకు? అలా చేసి సన్మార్గులై హాయిగా బ్రతకండి. ఆయన దగ్గర ఏఏ బాణాలున్నాయో మీకు తెలియునా? వినండి.

చలమునన్ తాటకిన్ చంపిన బాణము (తాటకి చలించిపోయింది ఆబాణం దెబ్బకు), లలి (ఉత్సాహముతో) మారీచ సుబాహులను మట్టుబెట్టిన బాణము, మెలగి (జాగరూకతతో) పరశురాముని మెట్లేసిన (గర్వమడచిన) బాణము, తళతళ మెరసిపోతున్నాయి. ఓ అసురులారా! తలరో (ఆలోచించడ్రా!)

మాయలేడిమీద వేసిన బాణము, సారించి వాలిని వధించిన బాణము, సాగరునిపై కోపించి సంధించిన బాణము, చాయలుదేరుచున్నది (శోభించుచున్నవి). ఓ దైత్యులారా! చనరో (పోండిరా పోండి).

ఆనాడు రామరావణయుద్ధములో తగినట్లు, కుంభకర్ణుని తల తెగనరికి బాణము, జిగి (కాంతులు వెదజల్లుతూ) రావణుని పరిమార్చిన (వధించిన) బాణము, నేడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని మేటి (మేలైన) పొది (అంబులపొదిలో) వున్న ఈ బాణము పగసాధించునది. కనుక, ఇక పారరో (పారిపోండ్రా) ఓ రాకాసుల్లారా! త్వరపడండి, పారిపోండి.

## 1-99

### మున్నుడి

మన నాగరికత అంతమవనంతవరకు అజరామరంగా వుండే అద్భుతమైన పెండ్లి పాట ఇది. జగన్మాతను సిగ్గులొలికే పెండ్లికూతురుగా దర్శించగలుగుట సాధ్యమయ్యే పనేనా? ముత్తైదువులందరూ మురిపెంగా చూస్తూ ఏయ్ అమ్మాయ్. మీ ఆయన పేరు చెప్పందే లోపలికి పోనీయం అంటే.. సిగ్గుల మొగ్గయై పోయిందట ఈ అమ్మలగన్నయమ్మ. (ఈ మాటలు వ్రాస్తుంటే ఆనందంతో కళ్లువర్షిస్తున్నాయి నాకు) స్వామి సాక్షిగా సత్యం చెబుతున్నాను. వేంకటేశ్వరుని నా ఊహల్లో భావిస్తున్నాను. ఇంకా నేనేం చెప్పగలను. ఈ క్షణాన నా ఊపిరి ఆగిపోతే.. చాలదా?

**ఆ.వె॥ రమణి పిడికిటను తలంబ్రాలు బట్టుచు**
**విభుని శిరసుపైన వేసె తాను**
**పెండ్లి తంతు కనులపెట్టెను అన్నయ్య**
**వరునిపైన జూపు మరలదాయె**

**రాగం : శ్రీరాగం**

పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు, కొంత
పెదమరలి నవ్వీనె పెండ్లికూతురు ॥పిడికిట॥

పేరుగల జవరాలె పెండ్లికూతురు, పెద్ద
పేరుల ముత్యాల మెడ పెండ్లి కూతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లి కూతురు, విభు
పేరు కుచ్చ సిగ్గుపడీ పెండ్లి కూతురు ॥పిడికిట॥

బిరుదు పెండెము వెట్టె పెండ్లికూతురు, నెర-
బిరుదు మగని కంటె పెండ్లికూతురు
పిరిదూరి నప్పుడే పెండ్లికూతురు, పతి
పెరరేచీ నిదివో పెండ్లికూతురు ॥పిడికిట॥





పెట్టెనె పెద్దతురుము పెండ్లికూతురు, నేడె
పెట్టెడు చీరెలు గట్టె పెండ్లికూతురు
గట్టిగ వేంకటపతి కౌగిటను వడి-
పెట్టిన నిధానమైన పెండ్లికూతురు ॥పిడికిట॥

### భావామృతం

తనపిడికిళ్ళలో తలంబ్రాలను పట్టుకొన్న ఈ పెండ్లికూతురు కొంచెము పెడమొగము పెట్టి (తనవిభుని తలచుకొని) నవ్వినది.

ఈ జవరాలు (యువతి) చాలగొప్ప పేరుగల అమ్మాయి (సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి) తన మెడలో పెద్ద ముత్యాల పేరు గల పెండ్లి కూతురు ఈమె, చాలామంది పేరంటాండ్ల మధ్య ఈ పెండ్లికూతురు ఆమె భర్త పేరు ఏమిటి అని అడిగినంతనే చెప్పుటకు చాల సిగ్గుపడుచున్నది.

ఈ పెండ్లి కూతురు గొప్ప పెండెములను కాళ్ళకు ధరించినది. ఈమె భర్తకు ఎన్నో బిరుదులున్నాయి. ఈమె భర్త తన మెడలో మాంగల్యం కట్టగానే పెరరేచిపోయింది. (భర్తకు ప్రేరేపణ కలిగించసాగినది) అటువంటి సౌభాగ్యదాయిని అయిన పెండ్లి కూతురు ఈ అలమేలు మంగమ్మ.

ఈమె పెద్ద కొప్పును ధరించినది. ఈ పెళ్లి రోజుననే ఈమె పెట్టెడు చీరెలు కట్టుకొనినది. శ్రీ వేంకటేశ్వరుని బిగి కౌగిటిలో ఈ పెండ్లి కూతురు స్థిరపడిన ఐశ్వర్యమువలె ప్రసిద్ధి చెందినది. ఈ శ్రీమహాలక్ష్మి అయిన అలమేల్మంగను సేవించి తరించండి.

## 1-100

### మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ అద్భుత కీర్తన వినని తెలుగువాడు ఉండే అవకాశమేలేదు. జగద్విఖ్యాతమైన ప్రతిగాయకుని నోట పలికిన అమృతధార ఈ కీర్తన. ఆ స్వామికి మనమీద అనుగ్రహం కలిగితే మన వెంటబడి మరీ మనని తనవైపు తిప్పుకొంటాడు. నాకు నీ వక్కరలేదయ్యా బాబూ! అనినా వదలడు. ఎట్లాగో అట్లా మనని తనవైపు తిప్పుకొంటాడు. తన సర్వస్వం ఇచ్చి మనవెన్ను కాస్తాడు. ఆయన ఏడు కొండల కంటే పెద్దవైన కోర్కెలు తీరుస్తాడు. అడుగడుగునా ఆపదలు తీరుస్తాడు. ఇదిచక్కగా నిరూపించడానికి ఎన్నో ఉదాహరణలిస్తున్నారు అన్నమయ్య. భక్తిలేకపోతే వజ్రాల కిరీటాలు చేయించినా.. ఉత్తి... దండగ.

**ఉ॥ కొండలలోన నిల్చుకొని 'కోనలయేటికి' రాయుడీతడై**
**అండగ నాదుకోగలడు 'ఆపద' బాపును భక్తి మ్రొక్కినన్**
**కొండల వంటి కోరికలు కొల్లగ తీర్చును అన్నమయ్యనెన్**
**దండగ డాబు దర్పములు దగ్గర రాదుర 'కోట్లు' బెట్టినన్**

**రాగం : హిందోళం**

కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు ॥కొండలలో॥

కుమ్మరదాసుడైన కురువరతి నంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కుర వర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాడు ॥కొండలలో॥

అచ్చపు వేడుకతోడ అనంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక తిరుమల నంబితోడుత
నిచ్చనిచ్చుమాటలాడి నచ్చిన వాడు ॥కొండలలో॥





కంచిలోన నుండ తిరుకచ్చి నంబిమీద కరు-
ణించి తనయెడకు రప్పించినవాడు
యెంచనెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ పాలించినవాడు ॥కొండలలో॥

### భావామృతం

ఏడుకొండలపైన కోనేటిగట్టున వెలసిన కోనేటి రాయుడు శ్రీవేంకటేశ్వరుడు ఆయన ప్రత్యేకతేమిటంటే భక్తితో వేడుకొంటే ఆ మహానుభావుడు తన కొండలంత వరములను తన భక్తులపై గుమ్మరిస్తాడు.

కురువరతి నంబి అనే కుమ్మరిదాసుడు, స్వామిని తనకు ఈ వరం కావాలి ఆ వరం కావాలి అని యెన్ని వరాలు కోరుకొంటే అన్ని వరాలిచ్చాడు. మరి ఆయన పూజకి పూలులేకపోతే బంకమట్టితో పూలుచేసి స్వామీ! స్వీకరించు అని భక్తితో సమర్పించాడు. ఎంత అనుగ్రహమో కదా!! తన చిన్నమామగారైన తొండమాన్ చక్రవర్తి తనకి ఆనంద నిలయం కట్టించాడని తన శంఖచక్రాయుధాలు ఆయనకిచ్చి, తన బావమరిది వైపు తను నిలిచి యుద్ధంచేసి చివరికి రాజీ కుదిర్చి తొండమానుడు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్ళాడు. ఇంత భక్తవాక్పరి పాలకుడుంటాడా? అసాధ్యం.

అనంతాళ్వారు అనే భక్తుడు స్వామికే దొంగతనం నేరానికి మట్టిమోసే శిక్షవేస్తే వేడుకగా స్వీకరించి మట్టిమోసి ఆయనను అనుగ్రహించి ఆ తరువాత పుష్పకైంకర్యం స్వీకరించినవాడు ఈ దయామయుడు. అనునయంగా తిరుమలనంబి అనే భక్తునితో ప్రతిరోజు ప్రత్యేకంగా మాట్లాడి అనుగ్రహించిన వాడీ తిరుమలేశుడు.

నేను కంచిలోనే వుంటాను. తిరుమల రానేరానని భీష్మించుకొన్న తిరుకచ్చినంబి అనే భక్తుని అనుగ్రహించుటకు తనే స్వయంగా కంచివెళ్ళి మాయోపాయంతో తన తిరుమలకి రప్పించుకొనిన చతురుడు ఈ శ్రీనివాసుడు. స్వామి కరుణ అంచనా వేయటం అసాధ్యం. మనం ఆయన శరణాగతులం కావున తను మంచివాడై ఈ శ్రీవేంకటేశ్వరుడు దయతో మనల్ని శ్రద్ధగా పరిపాలిస్తుంటాడు.

# మంగళహారతి

'భావయామి వేంకటేశమ్' లో వంద కీర్తనలు పూర్తిచేసి ధన్యుణ్ణి జేసిన వేంకటరమణునికి నా ఆనందభాష్ప సమేత మంగళనీరాజనములు. ఆయన హృదయాధిరూఢయైన అలమేల్మంగమ్మకు అన్నమాచార్యులవారు మధురాతి మధురమైన మంగళహారతి పాడుతున్నారు. వినండి. అమ్మవారి కిసలయ చరణాలకు, రంభోరువులకు అరిది జఘనములకు నీరాజనములిచ్చి ఆ శ్రీవేంకటేశ్వరునే పులకించి మైమరచిపో జేసిన ఆచార్యులనేమని పొగడుదునో కదా!

**ఉ॥ క్షీరసముద్రరాజసుత, శ్రీహరి కన్నుల వెల్గు లక్ష్మినిన్**
**నీరజవాసినిన్ కొలిచి నీమముతో వ్రతముల్ అనేకముల్**
**పేరిమిజేతురీ జనులు మేలగు కీర్తనలిట్లు పాడుచున్**
**కూరిమి అన్నమయ్య కృతి గొల్వరె వేంకటనాథురాజ్ఞినిన్**

**రాగం : మోహన**

క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

జలజాక్షి మోమునకు జక్కువ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబునకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరాబ్ధి॥

చరణ కిసలయములకు సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ నీరాజనం ॥క్షీరాబ్ధి॥





పగటు శ్రీవేంకటేశు పట్టపు రాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

**భావామృతం**

క్షీరసాగరమున జన్మించుటజేత క్షీరసాగరకన్య అయిన శ్రీమహాలక్ష్మికి పద్మవాసిని అయిన అలమేల్మంగమ్మకు మంగళహారతులివిగో!

పద్మనేత్రియైన పద్మావతీ దేవి యొక్క వదనమునకు జక్కువపిట్టలను బోలిన స్తనయుగ్మముపై అంటిన కర్పూరముతో వెలసిన కర్పూర నీరాజనమిదియే. ఈ అలినీలకుంతల (నల్లనిముంగురులు గల రమణి) చక్కటి కొప్పునకు, కమలముల వంటి (తామరపువ్వుల వంటి) చేతులకు మాణిక్యములతో నిలిచిన నీరాజనము ఇదే.

చిగురుటాకులవంటి పాదములకు, అరటి బోదెల బోలిన ఊరువులకు ఆసక్తితో నొసంగు ముత్యాల మంగళహారతి ఇదియే. దుస్సహమైన మొలకు, హరినారి నాభికీ పలువన్నెల మంగళహారతి సమర్పింతుము.

అలంకారములచే ప్రకాశించు శ్రీవేంకటనాథుని పట్టపు రాశి ఈ అలమేల్మంగమ్మ. పదునారు కళలతో వర్ధిల్లు ఈ సతి శ్రీమహాలక్ష్మి యొక్క దివ్య రూపమే కదా! లోకమాతయైన ఈమెకు భక్తి పూర్వకమైన నీరాజనము ఇదివో. లోకాలను పరిపాలించే మా తల్లి అలమేల్మంగమ్మ సౌందర్యమునకు విస్తృతమైన మంగళ నీరాజనములను సమర్పించుచున్నాను.

**శ్లో॥ శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళ**

శ్రీపద్మావతీ సమేత శ్రీశ్రీనివాస
పరబ్రహ్మణే నమః
శ్రీశ్రీశ్రీశ్రీ

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ

భావయామి వేంకటేశం



















భావయామి వేంకటేశం

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-II

## ఎన్నుకోబడిన అన్నమాచార్యుల సంకీర్తనలకు మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-II**

మొదటి ప్రచురణ
**డిసెంబరు 2010**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

- రచయిత



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి II

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అందరికాధారమైన | 41 |
| 2. | అదివో అల్లదివో | 01 |
| 3. | అప్పులేని సంసారము | 191 |
| 4. | అయ్యో! పోయో బ్రాయము | 179 |
| 5. | అణురేణు పరిపూర్ణమైన | 3 |
| 6. | ఆంజనేయ అనిలజ | 185 |
| 7. | ఆదరమ్మ పాదరమ్మ | 157 |
| 8. | ఆదిమూర్తి యీతడు | 147 |
| 9. | ఇట్టి ముద్దులాడి | 5 |
| 10. | ఇందిరారమణుదెచ్చి | 119 |
| 11. | ఇందిర వడ్డించ | 135 |
| 12. | ఇటు గరుడని నీ వెక్కినను | 103 |
| 13. | ఇదె శిరసు మాణిక్యమిచ్చి | 67 |
| 14. | ఈడగు పెండ్లి | 66 |
| 15. | ఈతడు వో రాముడు | 189 |
| 16. | ఈ పాదమే కదా యిలయెల్ల | 23 |
| 17. | ఉదయాద్రి తెలుపాయె | 101 |







| | | |
|---|---|---|
| 18. | ఉయ్యాల బాలు నూచెదరు | 77 |
| 19. | ఊరకే దొరకునా | 43 |
| 20. | ఊరకైతే నిన్ను గానము | 127 |
| 21. | ఎంత నేరుపరి ఈ లేమ | 49 |
| 22. | ఎంతవాడవయ్య నిన్ను | 25 |
| 23. | ఎంత చదివిన నేమి | 149 |
| 24. | ఎందరితో బెనగేను | 85 |
| 25. | ఎందాక నిద్ర నీకు | 87 |
| 26. | ఎన్నడు మంచివాడ | 115 |
| 27. | ఏది తుది దీనికేది | 53 |
| 28. | ఏమని చెప్పేది ఈశ్వర మాయ | 27 |
| 29. | ఏమని వర్ణించునొకో | 19 |
| 30. | ఏ పురాణముల నెంత చదివినా | 159 |
| 31. | ఏలే ఏలే మరదలా | 95 |
| 32. | ఓ పవనాత్మజ | 93 |
| 33. | కంటి నఖిలాండ కర్త | 81 |
| 34. | కంటిమి నేడిదే | 71 |
| 35. | కట్టెదుర వైకుంఠము | 75 |
| 36. | కడునడుసు చొరనేల | 33 |
| 37. | కామయాగము చేసె | 171 |
| 38. | కొండవేల నెత్తినట్టి గోవిందా | 151 |

| | | |
|---|---|---|
| 39. | కొనరో కొనరో మీరు | 97 |
| 40. | కొమ్మలాల యెంతవాడె | 59 |
| 41. | కొలనిలోన మును గోపికలు | 63 |
| 42. | గతులన్ని ఖిలమైన | 13 |
| 43. | గరుడాద్రి వేదాద్రి | 111 |
| 44. | గురుతెరిగిన దొంగ | 47 |
| 45. | గోవింద గోవింద | 177 |
| 46. | చక్కని జాణ యిన్నిటా | 175 |
| 47. | చాలదా హరినామ సంకీర్తన | 161 |
| 48. | చూడ చిన్నదానవింతే | 131 |
| 49. | జయ మంగళము నీకు | 201 |
| 50. | తలపు లోపలి తలపు | 141 |
| 51. | తిరుమల గిరిరాయా | 137 |
| 52. | తిరువీధుల మెరసి దేవదేవుడు | 45 |
| 53. | తిరోతిరో జవరాల | 57 |
| 54. | తెప్పగా మఱ్ఱాకు మీద | 169 |
| 55. | తే శరణ మహం | 195 |
| 56. | నగుమోము తోడి | 183 |
| 57. | నమో నారాయణాయ | 143 |
| 58. | నవనీత చోర | 55 |
| 59. | నవరూప ప్రహ్లాద | 105 |




భావయామి వేంకటేశం


| | | |
|---|---|---|
| 60. | నాటికి నాడే నా చదువు | 197 |
| 61. | నారాయణా నీ నామమే | 79 |
| 62. | నారాయణాచ్యుత | 199 |
| 63. | నిత్యానంద ధరణీధర | 91 |
| 64. | నిత్యాత్ముడై యుండి నిత్యుడై | 89 |
| 65. | నీకే నే శరణు | 35 |
| 66. | నీవు తురగము మీద | 123 |
| 67. | నిండు మనసే నీపూజ | 61 |
| 68. | నేడే నాగవల్లి | 31 |
| 69. | నేడే పెండ్లి వేళ | 193 |
| 70. | నేలమిన్ను ఒక్కటైన | 17 |
| 71. | పంతగాడు మిక్కిలి | 125 |
| 72. | పరిపూర్ణ గరుడాద్రి | 15 |
| 73. | పాడరే సోబనాలు | 155 |
| 74. | పొడగంటి మయ్యా మిమ్ము | 121 |
| 75. | బ్రువంతి బౌద్ధాబుద్ధఇతి | 22 |
| 76. | భక్తి కొలదివాడే | 173 |
| 77. | భావించ నేరనైతి | 139 |
| 78. | మాధవా కేశవా | 117 |
| 79. | మాధవ భూధవ | 153 |
| 80. | మిన్నక వేసాలు మాని | 181 |

| | | |
|---|---|---|
| 81. | మూసిన ముత్యాలకేలే | 07 |
| 82. | మొత్తకురే అమ్మలాల | 107 |
| 83. | రామచంద్రుడితడు | 9 |
| 84. | రామభద్ర రఘువీర | 133 |
| 85. | రామదశరథ రామా | 99 |
| 86. | రాముడు లోకాభిరాముడు | 51 |
| 87. | లక్ష్మీ కళ్యాణము లీలతో | 83 |
| 88. | వందే వాసుదేవం శ్రీపతిం | 69 |
| 89. | వలచి వచ్చితి నేను | 163 |
| 90. | వలెనను వారిదే వైష్ణవము | 73 |
| 91. | వినరో భాగ్యము విష్ణుకథ | 129 |
| 92. | విభుడ వింతటికి | 165 |
| 93. | విశ్వప్రకాశునకు | 29 |
| 94. | వెఱపింపబోయి తానె | 167 |
| 95. | వేడుకొందామా | 39 |
| 96. | వేవేల చందాలవాడు | 37 |
| 97. | సహజవైష్ణవాచార | 113 |
| 98. | సందెకాడ పుట్టినట్టి | 145 |
| 99. | సామాన్యమా పూర్వ | 11 |
| 100. | సువ్వి సువ్వి సువ్వని | 187 |
| 101. | హరి నీప్రతాపము | 109 |




భావయామి వేంకటేశం

# ప్రార్థన

కం॥ హరినే నమ్మిన వానికి
జరుగదు యేనాడు కీడు, సంకీర్తనచే
తిరువేంకటేశు గొలిచిన
అరయవు మరుజన్మ అన్నమయ్యే తెలిపెన్

ఆ.వె॥ ఏడుకొండలయ్య నెంచుడు దిక్కని
కంటనీరు రాదు కరుణ పొంగు
అన్నమయ్య గీత మలరించు నెల్లర
భక్తి వెలుగుజూపు మనసులందు

ఆ.వె॥ కష్టమొచ్చినపుడు కాళ్లపైబడి యేడ్చు
నవ్వువేళ నరుడు నాస్తికుండె
'మాయ' చేయగలరె 'మాయాధినాథుని!!
అన్నమయ్య బాట నెన్నుకొనరె!!

కం॥ శ్రీపతి పదకమలంబుల
నీపట్టున గొలిచి మదిని, హితుడన్నయ్యన్
ఏపుగ నేధ్యానింతును
ఆపై కీర్తనల వివరమందింతు భళా!!

ఆ.వె॥ ఊరునన్నుజూచి ఉరిమింది పొమ్మని
"కాదు" రమ్మనంది కరుణబూని
అన్నమయ్యదారి అలవడలేదాయె
వేంకటయ్య నవ్వె వెనుకనుండి



# ముందు మాట (సంపుటి-II)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









## 2-1

## మున్నుడి

అన్నమాచార్యుల వారి కీర్తనలతో పరిచయం వున్న యెవరికైనా తిరుమల కొండ కనబడగానే గుర్తుకు వచ్చి, నాలుకపై ఆడే కీర్తన ఇది. ఏడు కొండలవాడు ప్రతి అణువులో వున్న కొండ ఇది. దీనికి నమస్కరించి దీనినెక్కవలెను గానీ ఏదో 'ట్రెక్కింగ్' లాగా యెక్కకూడదు. బ్రహ్మాదిదేవతలు, మునులు దీని నివాసంగా యేర్పరచుకొన్నారంటే వింత ఏమీలేదు. సప్తగిరులనెక్కుతుంటే ఏదో తెలియని ఆనందం మనస్సుని ముప్పిరిగొంటుంది. ఆ అనుభూతి స్వానుభవేక వేద్యమే కాని చెప్పేది కాదు. మరి ఆనందం అంటే అనుభవమే కదా!

**చం॥ ఎనిమిది వత్సరంబులకు యేలిక వేంకటనాదుడంచుతాన్**
**కనుగొనె నన్నమయ్య మరికాదనెనన్యము ఐహికంబులన్**
**అనుపమ కీర్తనంబులివి అమృతధారలు యెంచి చూడరో**
**వినుమిక విందురా చెలికి వెన్నుని కొండలనెక్కి కొల్వుడీ**

**రాగం : మధ్యమావతి**

అదివో అల్లదివో శ్రీహరి వాసము
పదివేలు శేషుల పడగలమయము ॥అదివో॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాసమఖిల మునులకు
అదె చూడుడదె మొక్కుడానందమయము ॥అదివో॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥అదివో॥

కైవల్యపదము వేంకట నగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపదరూపమదివో
పావనములకెల్ల పావన మయము ॥అదివో॥





**భావామృతం :**

(ఒకసారి వాయుదేవునికి ఆదిశేషునికి మధ్య తమలో అధిక బలశాలి యెవరనే వివాదంవచ్చి, తగవు తీర్చటానికి నారదుని ఆశ్రయించారట. ఆయన ఆనంద పర్వతము నాశ్రయించమంటే వారా పర్వతాన్ని అడిగారట. శేషుడు నన్ను గట్టిగా బిగించి పట్టుకొంటే నువ్వు ఆ పట్టు విడిపించు అన్నదట వాయుదేవునితో 'ఆనందగిరి'. ఆదిశేషుని పట్టుకి వాయుదేవుడు బిగిసిపోయి మానవులు ఊపిరాడక తల్లడిల్లారట. దేవతల అభ్యర్ధన మేరకు శేషుడు జాలి తలచి పట్టుకాస్త సడలిస్తే వాయుదేవుడు ప్రచండవేగంతో ఆనందగిరిని ముక్కలు చేసేశాడట. దేవతల ప్రార్ధన విని ఆదిశేషుడు ఒకదానిపై తన నివాసమేర్పరచుకొన్నాడట. అదే శేషాచలం. వృషభాద్రి, నారాయణాద్రి, అంజనాద్రి, గరుడాద్రి, వేంకటాద్రితో కలిసి ఏడుకొండలు ఆవిధంగా ఒక్కచోట వెలశాయి. వాటిని తన నివాసంగా ఏర్పరచుకొన్నాడు. వైకుంఠం నుంచి దిగివచ్చిన శ్రీమన్నారాయణుడు తనే శ్రీవేంకటేశ్వరుడై వాటిపై వెలిశాడు)

అదిగో అల్లదిగో ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అదే శ్రీహరి నివాస స్థానము. అది ఆదిశేషుని పడగలతో నిండిపోయి వున్నది. (మనబోటి అల్పులకి కనబడదనుకో..) పదివేల పడగలమయమైన దానిని భావించి నమస్కరించి తరించండి. ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అది బ్రహ్మాదిదేవతలందరికి ఆప్యాయమైనది. మహామునులందరికీ ఆ కొండ నిత్యమూ నివాసస్థానం. వారు ఉండటానికి యెంచుకొన్నచోటు అదే సుమా! దాన్ని చూడండి. మొక్కండి. ఆనందం నిండి వుండే నెలవు అదే.

దాని దగ్గరలోనే వున్న పర్వతమే శేషాచలము. స్వర్గంలో వుండే దేవతలు భూమిపైకి వచ్చినప్పుడల్లా స్వయంగా వుండే చోటు అదే. మనయెట్ట నెదుట వుండే మూలధనం అదే. బంగారు శిఖరాలు (గోల్డ్‌కాదు...) గల ఆ పర్వతం బ్రహ్మర్షులు, బ్రహ్మత్వం సిద్ధించిన మహామహులందరికీ ఆటపట్టుగా విలసిల్లుచున్నది.
ఇక ఈ వేంకటాచలం మహిమ నేమని వర్ణించను? ఇది మోక్షప్రాప్యస్థానము. శ్రీమన్నారాయణుని అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరునికి అపురూపమైన భాగ్యము ఇది. చక్కగా భావించగలిగితే సర్వసంపదలకి మారు రూపు ఇదే. పవిత్రమైన వాటన్నింటిలోకి అత్యంత పవిత్రమైనది ఈ వేంకటాచలమే.

## 2-2

## మున్నుడి

షణ్ముఖప్రియరాగం వింటుంటే సన్నటివానజల్లు పడితే దాంట్లో ఆనందం తడుస్తున్నట్లుంటుంది. వేంకటేశ్వరుని రూపం కన్నులకు దర్శింపచేస్తున్న అన్నమయ్య మన చెవులలో అమృతం ధారగా పోస్తున్నారు. పరమయోగులు తపోశక్తితో తమ మానసాకాశంలో తటిల్లతలాగా మాత్రమే గోచరింపచేసుకో గల దివ్యరూపాన్ని తాళ్లపాకవారు అవలీలగా మనవంటి అతి సామాన్యులు సులభంగా సాకారంగా ఆకళింపు చేసుకోగల వేంకన్న రూపంగా ఈ కీర్తనతో దర్శింపచేశారు. తరించండి.

**ఉ॥ చూపెను వేంకటేశ్వరుని శోభను కన్నులగట్టినట్లు ఆ**
**రూపము దివ్యమోహనము లోకము లేలెడి ఆ జగత్పతిన్**
**ఆ పరమాత్మ నన్నమయ అద్భుత కీర్తనమందు దెల్పగా**
**తోపెను నాదుబోంట్లకును తోయజనాభు డహో! తటిల్లతై**

**రాగం : షణ్ముఖప్రియ**

అణురేణు పరిపూర్ణమైన రూపము
అణిమాది సిరి అంజనాద్రి మీది రూపము ॥అణురేణు॥

వేదాంతవేత్తలెల్లా వెదకేటి రూపము
ఆదినంత్యములు లేని ఆ రూపము
పాదుగ యోగీంద్రులు భావించు రూపము
ఈ దెస నిదివో కోనేటి దరి రూపము ॥అణురేణు॥

పాలజలనిధిలోన పవళించు రూపము
కాలపు సూర్యచంద్రాగ్నిగల రూపము
మేలిమి వైకుంఠాన మెరసిన రూపము
కీలైన దిదే శేషగిరి మీద రూపము ॥అణురేణు॥





ముంచిన బ్రహ్మాదులకు మూలమైన రూపము
కొంచన మర్రాకు మీది కొనరూపము
మంచిపరబ్రహ్మమై మమ్ము నేలిన
ఎంచగ శ్రీవేంకటాద్రి నిదే రూపము ॥అణురేణు॥

**భావామృతం :**

అతి సూక్ష్మమైన అణువులోను, ఇసుకరేణువంత సూక్ష్మమైన రూపములోనూ పరిపూర్ణంగా నిండి యుండు మహత్తర రూపము ఇది. అణిమాది అష్టసిద్ధులను ప్రసాదించగలది ఈ అంజనాద్రి మీద వెలసిన రూపము.

ఈ ప్రపంచంలో వేదములను, వేదాంతమును అవపోసన పట్టినవారు ఎటువంటిదో తెలుసుకొనగోరేది ఈ రూపమునే. మొదలు, తుదిలేని అద్భుతమైన రూపము కూడ ఇదే. యోగేశ్వరులందరు భావించులకు ప్రయత్నించే రూపమిదే. ఇటువైపు వచ్చి ఈ కోనేటి దగ్గిర వెలసిన దివ్యమైన రూపము ఇదే.

క్షీరసాగరమున (ఆదిశేషునిపై) పవ్వళించిన సుందర రూపము ఇదే సుమా! కాలము, కాలగతిని తెలిపే సూర్యచంద్రులు, అగ్నికూడ ఈయన రూపమే. వేంకటాద్రి మీద బంగారమువలె మెరిసిపోతున్న రూపము ఇదిగో. శేషగిరిమీద వెలసిన మూల రూపము ఈ మహానుభావునిదే. ఈ దివ్యరూపాన్ని గ్రహించండి.

బ్రహ్మాదులను సైతము ఆక్రమించగల మూలమైన రూపం ఇదే. చిన్న మఱ్ఱి ఆకుమీద పవ్వళించి యున్న చిన్మయరూపము ఇదే. పరబ్రహ్మ స్వరూపం ఇదే. మమ్మల్నందరినీ యెంపిక చేసి రక్షించుచున్న శ్రీ వేంకటేశ్వరుని దివ్యరూపము ఏడుకొండలవాని రూపము ఇదే. దీనిని భావించి తరించండి.

**2-3**

## మున్నుడి

అన్నమాచార్యులవారు రేపల్లెలో ఒకగోపికవలె భావించుకొని తోటిగోపికలకు సలహాలిస్తున్నారు. చిలిపి పిల్లలు చెప్పే దొంగసాకులు వాళ్ళ నగలు, అలంకరణలు అమాయకత్వం అన్నీ కళ్ళకు గట్టినట్లు వర్ణించగల ఆ రచనా వైభవం వివరించటం సాధ్యమవుతుందా? కృష్ణలీలలు వర్ణిస్తూనే వేంకటేశ్వరుడే బాలకృష్ణుడని భావనజేసి ఆయనకి మీ సర్వస్వం వప్పజెప్పమని అంటున్నారన్నమయ్య. ఆనంద భైరవిలో ఈ కీర్తన వినే వారిదే భాగ్యం కదా!

**ఉ॥ ముద్దుల మూట యీ బుడత మోహనరూపుడు, పొట్టనిండుగా**
**వద్దనునట్లు పట్టుడిక పాలను మానును దొంగబుద్ధి, యే**
**సుద్దులు చెప్పగల్గుదుము సుంతవినండని అన్నమయ్యనెన్**
**అద్దరి వేంకటేశ్వరుని అల్లరి కృష్ణుని వోలెనెంచెబో!!**

**రాగం : ఆనంద భైరవి**

ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడు వాని
పట్టి తెచ్చి పొట్ట నిండ పాలువోయరే ॥ఇట్టి॥

గామిడై పారితెంచి కాగేటి వెన్నలలో
చేమపూవు కడియాల చేయిపెట్టి
చీమకుట్టెనని చెక్కిట కన్నీరు జార
వేమరు వాపోవు వానివెడ్డు వెట్టరే ॥ఇట్టి॥

ముచ్చువలె వచ్చితన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగబెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్లజొల్లుగార
వొచ్చెలి వాపోవు వాని నూరడించరే ॥ఇట్టి॥





ఎప్పుడు వచ్చెనో మా యిల్లు చొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిబెట్టి
అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే ॥ఇట్టి॥

**భావామృతం :**

ఓ అమ్మలారా! ఈ ముద్దులు మూటగట్టే పిల్లాడు యెంతటి అల్లరి పిడుగమ్మా! వీణ్ణి పట్టుకొని తెచ్చి బలవంతాన పాలు పట్టండి. (బొజ్జ నిండాక ఇంకా ఏం దొంగతనం చేస్తాడు?)

వీడి అల్లరి ఏం చెప్పనే! తానే ఒక గ్రామాధికారి అన్నంత డాంబికంగా వచ్చి కాగే వెన్నెలో చేమపూలు చెక్కివున్న బంగారు కడియాల తన చెయ్యి బెట్టాడు. చెయ్యి చుర్రున కాలి చెంపలపై జారే కన్నీళ్ళొచ్చాయేమో ఏమిటి సంగతంటే, నాకు చీమ కుట్టిందంటున్నాడు. మాటి మాటికీ వాపోతున్నాడు. వాడి మోసం మనకితెలియదా? ఎంత టక్కరి వాడు. మనం కూడా వాడిని ఏదో తెలీనట్లే వూరుకో బెడదాం.

వీడు దొంగతనంగా పెరుగు చిలికే కుండలో మురుగులున్న చేయి పెడితే వేగంగా తిరిగే కవ్వం తగిలి చేతికి దెబ్బ తగిలినట్లయింది. అమ్మో అనుకొని చొల్లు కారే తన చిన్నారి నోట్లో చటుక్కున తనవేలు పెట్టేసుకొని బాధపడుతున్న ఈ బంగారు తండ్రిని వోదార్చండే! ఓ చెలీ! పాపం వీణ్ణి చూస్తే జాలివేయటం లేదూ?

ఎప్పుడొచ్చాడో తెలీదు గాని వీడు తన చక్కటి వర్ణనాతీతమైన వుంగరాల చేతిని మా పెట్టె (ధనము దాచుకొన్న)లో పెట్టాడు. వీడెవరనుకొన్నారు? జగత్పిత వేంకటేశ్వరుడు. వీడు పోలిక చెప్పలేని మహానుభావుడు. వాడే మనదంతా దోచుకుంటే ఇంకా కావలసిందేమిటుంటుందే? ఈ పెట్టెని మీరే యెత్తివాడి నెత్తిన పెట్టేసేయండి. (నిశ్చింతగా ఉంటుండి). అంటే... వెర్రివాళ్ళల్లారా జగన్నాధుడికి మీ ధనం ఎందుకు ఏమన్నా వుంటే భక్తిధనం ఈయండి అంటున్నారు అన్నమయ్య.

## 2-4

### మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన అలమేలు మంగ సౌందర్యాన్ని వర్ణిస్తూ, ఇంత స్వాభావికమైన అందం నీ చెంతనుండగా ఇంకా నీకు కస్తూరి, చేమంతులు, మట్టెల మోతలు, వల్లెవాటు, పెడమోము పెట్టుకోవటాలు వంటివన్నీ దేనికమ్మా? హాయిగా వేంకటనాథుని బిగి కౌగిట్లో సగభాగమైపోక నీకు ఏవేవో అలంకరణ లెందుకు? అంటున్నారు. పైపై అలంకారాలు 'పలుకు తేనెల తల్లివి' నీకెందుకు? ముద్దులొలికే నీ మాటలే నీకలంకారం. కొండల రాయని అండయే నీకు దండి.

**చం॥ వినుటకు తేనెజల్లువలె వేంకటనాథుని సేదదీర్చు ఈ**
**అనుపమ కీర్తనంబు, కవి అన్నయభావము 'మూసి'యుంచెరా**
**తెనుగు నిఘంటువున్ దెరచి తిప్పలు బొందితి దిక్కుతెల్వకన్**
**కనుగొన జాలితిన్ వసుధకాంతుని కాంతకు వర్ణనంబుగా**

**రాగం : మోహన**

మూసిన ముత్యానకేలే మొరగులు
ఆసల చిత్తానకేలే అలపోకలు ॥మూసిన॥

కందులేని మోము కేలే కస్తూరి
చిందు నీ కొప్పునకేలే చేమంతులు
మందయానమునకేలే మట్టెల మోతలు
గందమేలే పైపై కమ్మని నీమేనికి ॥మూసిన॥

భారపు గుబ్బల కేలే పయ్యెద, నీ
బీరపు చూపుల కేలే పెడమోము
జీరల బుజాల కేలే చెమటలు
గోరంట గోళ్లకేలే కొనవాండ్లు ॥మూసిన॥





ముద్దుల మాటలకేలే ముదములు, నీ
అద్దపు చెక్కుల కేలే అరవిరి
ఒద్దిక కూటమికేలే ఊర్పులు, నీకు
అద్దమేలే తిరువేంకటాధీశు గూడి ॥మూసిన॥

### భావామృతం

(ఓ అలమేలు మంగమ్మ తల్లీ! నీ కెందుకమ్మా ఈ అనవసరమైన తిప్పలు?) సముద్ర గర్భంలో ఎక్కడో ముత్యపు చిప్పలో మూసికొని యుండి ఎంతో ప్రయాసపడితేకాని దొరకని ముత్యాన్ని ఇంకా మూసివుంచి దాచవలసిన అవసరమేమున్నది? ఆశ కలిగి భ్రమపడే మనస్సునకు ఇంకా చపలత్వం కూడా దేనికి తల్లీ? నీకు ఈ కృత్రిమములు అనవసరం.

ఏ మాత్రము లోపంలేని నీ చక్కని మొగమునకు కస్తూరీ తిలకంతో అందంతేవాలా? నీవు నడుస్తుంటే అటూ ఇటూ ఊగే నీ కొప్పులో పూలు నిలుస్తాయా? మరి ఆ తలలో చేమంతి పూలెందుకమ్మా? (స్వామి వారి కద్దం కాకపోతే....) పూలురాలిపోతాయని సుకుమారంగా నడుస్తున్నావు. ఇక నీ మట్టెలు సవ్వడుల నెలా చేస్తాయి చెప్పు తల్లీ? సహజ పరిమళాలు వెదజల్లు దివ్యమైన నీ తనువునకు ఇంకా గంధపుపూతలు అవీ దేనికి తల్లీ?

తల్లీ! బరువైన పయోధరములు గల నీకు ఇంకా ఆ పయ్యెద బరువు కూడా దేనికమ్మా? ధైర్యంగా స్వామివారి కళ్ళల్లో కళ్ళుకలిపి చూడక పెడమోముతో చూడటం దేనికమ్మా? చీరె అలా నిండుగా కప్పేసుకొంటే చెమటలెందుకు పట్టవు? పడితే అవస ్రకదా? మరి? ఎందుకు ? గోరింటాకు పెట్టుకొని ఎఱ్ఱగా సొగసుగా నీ గోళ్ళుంటే వాటికి ఇంకా కొనవాండ్లు (గోళ్ళు కోసుగా చేసికొను అలంకరణ) దేనికమ్మా?

ముద్దు ముద్దుగా మాట్లాడే పలుకు తేనెల తల్లివి నీవు. ఇంకా నీవు నవ్వులొలికించటం దేనికి? తళతళా మెఱసే అద్దపు చెక్కిళ్ళు నీకుంటే వాటి మీద పూలరేకులు అద్దుకొని నానా తిప్పలు పడటం దేనాకమ్మా? వేంకటపతి కౌగిలంటే మాటలా? అందులోనూ ఆయన తమకంతోపుంటే ఆయాసంతో నీకువూపిరి తీసుకోవటం ఎలా సాధ్యం? అందుకని తిరువేంకటాధీసుని గూడి అర్ధాంగివై వర్ధిల్లు తల్లీ!

**2-5**

## మున్నుడి

శ్రీ రామచంద్రమూర్తి స్వయంగా శ్రీమన్నారాయణుడు. వైకుంఠం నుండి దిగివచ్చి తన పరివారంతో సహామానవుడిగా 'పుట్టి', రావణాది దానవులను మట్టుబెట్టి, ధర్మాన్ని నిలబెట్టి, శరణార్థులను వెన్నుదట్టి, ఆశ్రితులకు ఆటపట్టయినాడు. ఆయనను కీర్తించాలంటే అన్నమయ్య కీర్తనను మించిన సులువైన దారేలేదు. ఈ కీర్తన శ్రీ రాముడు తన జీవనకాలంలో ఎవరెవర్ని ఏవిధంగా కరుణించింది అలవోకగా వర్ణిస్తున్నారు. ఆయన ఆత్మబంధువై, ఎవరెవరికి ఏమె కరుణించాడో వినండి...

**ఆవె ॥ రామచంద్రుడొకడె రమణీయ గుణరాశి**
**పలువురికిని 'ఆత్మబంధు' వాయె**
**అన్నమయ్య వివరమందించె వినుడహో!!**
**దాశరథిగ వేంకటేశు దలచె.**

**రాగం : ద్విజావంతి**

రామచంద్రుడితడు రఘువీరుడు
కామితఫలములియ్య గలిగె నిందరికి ॥రామచంద్రు॥

గౌతము భార్యపాలిట కామధేనువితడు
ఘాతల కౌశికు పాలిటి కల్పవృక్షము
సీతాదేవి పాలిట చింతామణి యితడు
ఈతడు దాసులపాలి ఇహపరదైవము ॥రామచంద్రు॥

పరగ సుగ్రీవుపాలి పరమ బంధుడితడు
సరి హనుమంతుపాలి సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి నిధానము యీతడు
గరిమ జనకు పాలి ఘనపారిజాతము ॥రామచంద్రు॥

తలప శబరిపాలి తత్తపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలదన్న వారిపాలి కన్నులెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటాద్రి విభుడీతడు ॥రామచంద్రు॥





**భావామృతం :**

ఈ శ్రీ రామచంద్రమూర్తి రఘుకులమున పుట్టిన వీరాగ్రణి. ఈ మహానుభావుడు ఇంతమందికి వారు వారు కోరిన కోర్కెలను దీర్చినాడు. ఆ వివరములు వినండి.

(దేవదానవులు పాలసముద్రమును చిలికిన సమయంలో ఉద్భవించిన శ్రీ మహాలక్ష్మిని శ్రీ హరి చేబట్టగా మిగిలినవి చాలా వరకు ఇంద్రుని పరం చేశాడు శ్రీ మన్నారాయణుడు. అవి ఆ ఇంద్రునికి మేలే చేశాయో లేక అసూయాగ్రస్థులైన దానవులచే కష్టాల్నే తెప్పించాయో చెప్పలేము గాని ఈ శ్రీ రామచంద్రుడు ఆ దివ్యమైన ఐశ్వర్యాలకన్నా అధికమైన మేళ్ళను చేశాడు.)

ఈ శ్రీ రామచంద్రుడు గౌతముని భార్యఅయిన అహల్యను శాపవిముక్తురాలను చేసి ఆమె పాలిటి కామధేనువైనాడు. ఘాతలు (బాణములు లేక అస్త్రములు) స్వీకరించి విశ్వామిత్రునికి గురువుపదవిని అందించిన కల్పవృక్షము. (ఆయన చెప్పినట్లే చేసి ఆఖరికి తన భక్తుడైన యమాతిని కూడ వధిస్తానన్నాడు). సీతాదేవి పాలిటి 'చింతామణి' అనే ఐశ్వర్యప్రదాయకమైన దివ్యమణి వంటివాడు. రామదాసులందరికి ఈయన ఇహలోకంలో కోరికలను పరలోకంలో మోక్షమును ప్రసాదించిన దైవమూర్తి.

సుగ్రీవుడు పోగొట్టుకొన్నవన్నీ తిరిగి లభింపచేసిన పరమ బంధువు. హనుమంతుడికి ఈయన సామ్రాజ్యము వంటివాడు. విభీషణునికి ఆసక్తితో దాచిబెట్టిన 'పాతర' వంటి ధనము ఈ శ్రీరాముడే. మామగారైన జనకమహారాజునకు ఘనమైన మహిమ (ఎన్నటికీవాడిపోదు) గల పారిజతవృక్షము. (జానకి చేబట్టి శాశ్వతంగా జనకుని పేరు చిరస్థాయిగా వుంచాడు)

శబరి ఎంగిలిపండ్లుతని పరమాత్మకు జాతి భేదముండదన్న తత్త్వరహస్యాని చాటిచెప్పినవాడు. నావ నడిపించుకొని, అందరి బ్రతుకుల్ని ఒడ్డున చేర్చేవాడినే (ఆదిమూలమునే) ఒడ్డున చేర్చిన ఖ్యాతినిచ్చాడు. కలదు కలందనెడి వారికి (కలదోలేదో అనే సందేహం కలిగినా) కలనని నిరూపించిన వాడు. శ్రీ వేంకటాద్రి మీద విభుడు వేంకన్న రూపంలో వున్న శ్రీ రామచంద్రమూర్తి.

**2-6**

## మున్నుడి

ఓ వేంకటేశ్వరా! కర్మఫలం తప్పించడం ఎవరికి సాధ్యం అవుతుంది? అది నీ అంత భగవంతుడినే లెక్కచేయుటలేదే? ఎవడో అనామకుడు నీకు కూడా సంసారబంధం అంటగట్టి నీవు ఆవిడ మాట మీరలేవన్నాడు. ఇంకొకడు పనిలేని పెద్దమనిషి తను భవసాగరంలో పడుకోబట్టి నీమీద ఏవేవో కతలు చెప్పాడు. ఇంకొకడు జీవనోపాధికి తను కొండలకోనల్లో తిరిగి అలసిపోయాడు. వాణ్ణి అలాచేశావు కాబట్టి నీకు కొండలరాయుడవై మమ్మల్ని అనుక్షణం కాపాడక తప్పటంలేదు. అన్నమాచార్యా! ఎంత చమత్కారం!!!

**ఉ॥ ధర్మము తప్పిజీవులిల తాపముతో భవసాగరంబునన్**
**కర్మలజేయునైజమున, కాంతలవాంఛల, కొండలకోనలన్**
**పేర్మిశ్రమంబులంది సిరిపెంచగ జేస్తివి వేంకటేశ్వరా!**
**కర్మఫలంబు తప్పనిది కట్టెను నిన్నును అన్నమయ్యనెన్.**

**రాగం : ధన్యాసి**

సామాన్యమా పూర్వ-సంగ్రహంబగు ఫలము
నేమమున బెనగొనియె-నేడునీవనక ॥సామాన్యమా॥

జగతి బ్రాణులకెల్ల-సంసారబంధంబు
తగుల బంధించు దురి-తంపుగర్మమున
మగుడ మారు కుమారు-మగువ నీయురముపై
తెగి కట్టిరెవ్వరో-దేవుండవనక ॥సామాన్యమా॥

పనిలేక జీవులను-భవసాగరంబులో
మునుగ లేవగజేయు-మోహదోషమున
పనిపూని జలధిలో-బండబెట్టిరి నిన్ను
వెనకెవ్వరో మొదలి-వేలుపనక ॥సామాన్యమా॥





ఉండనీయక జీవ-నోపాయమున మమ్ము
కొండలను గొబల తతి-గొని త్రిప్పుఫలము
కొండలను నెలకొన్న-కోనేటి పతివనగ
నుండవలెసెను నీకు-నోపలేననక ॥సామాన్యమా॥

**భావామృతం :**

స్వామీ! తొల్లింటి కర్మఫలం అంటే సామాన్యమైనదా? దాన్ని తప్పించుకోవటం సాధ్యమయ్యే పనియేనా? అది ఎంతో నియమంతా సర్వేశ్వరుడవైన నిన్ను కూడలెక్కసేయక బాధించుచున్నది.

లోకంలో వుండే జీవరాసులన్నిటికీ సంసారబంధం అనేదాన్ని పెట్టావు. దానిఫలితంగా వెరెవ్వరో నీకు కూడ సంసార కారణమైన ఒక భార్యను నీగుండెల మీదపెట్టి ఆమె మన్మధునికేతల్లియైనదని నీ హృదయ సామ్రాజ్యపట్టమహిషి అని ప్రచారం చేశారు. చూశావా? మమ్మల్ని బాధించిన దానిఫలితం.

నీకు అక్కర కొచ్చేయేపనీలేదేమో కాని, మమ్మల్ని భవసాగరంలో పడి తేలుతూ, మునుగుతూ ఉక్కిరి బిక్కిరి అయ్యేలా చేసె కార్యక్రమం ఒకటి పెట్టుకొన్నావు. ఆ మోహంతో కలిగి దోషం వలన మేము ఎన్నో అవస్థలుపడుతున్నాం. ఆ కర్మ ఫలితంగా నిన్ను వేరే ఇంకెవ్వరో పనివేళా పాలసముద్రంలో పడుకోబెట్టారు.నువ్వు ఆదిదేవుడవు అనే గౌరవం కూడలేకుండా చేశారు (అన్నపానాదులు స్నానం, సంధ్యావందనం ఏమీ లేకుండా చేశారు).

మమ్మల్ని ఒకచోట స్థిమితంగా కూర్చొన నీయక జీవనోపాధి కోసం కొండల వెంట, కోనల వెంట తిరుగుతూ, గుహలలో పడుకొంటూ, నానా ఇక్కట్లుపడేలా చేశావు. దాని ఫలితం నిన్ను వదిలి పెడుతుందా ప్రభూ! అది నీవెంటబడింది. నీవేమో కొండల కోనేటి రాయుడవై కొండలలోనే నెలకొని (తిరుమలనాధుడవై) ఉండవలసివచ్చింది.

## మున్నుడి

"ఓం నమో నారాయణాయ" అనే పరమపావనమైన అష్టాక్షరీమంత్రము నుపదేశించి, శంఖచక్రాదులను భుజకీర్తులుగా ముద్రించి తిరునామంనుదుటిపై ధరింపచేసి వైష్ణవ మతాచారప్రకారం పరమగురువులు భక్తి కలిగిన వారికి ఆ మతదీక్షనిచ్చేవారు. ఘనముని అనే 'గురువు'చే పంచసంస్కారయుతుడై విశిష్టాద్వైత మతదీక్ష స్వీకరించి, ఆ పైన 'అన్నమయ్య' అన్నమాచార్యులైనారు. ఆయన శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వం అని అంకితమైపోయాడు. ఈ కీర్తనలో రామానుజుల వారిని నన్నుతించి తిరుమలకొండనెక్కేవాకిటిలో నిలిచి మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారంటున్నారు.

**ఆ.వె॥వైష్ణవంబు బూని భక్తి 'రామానుజ**
**గురుల' నన్నమయ్య కొలిచినారు**
**వారిపేరనున్న అరుదైన కీర్తన**
**వేంకటపతి కూడ మెచ్చు దీని.**

**రాగం : మోహన**

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి ఈతడే చూపె ఘనగురుదైవము ॥గతులన్ని॥

ఈతని కంరణనేకా ఇలవైష్ణవుల మైతి
మీతని వల్లనే కంటి మీ తిరుమణి
ఈతడే ఉపదేశమిచ్చెను అష్టాక్షరి మంత్రము
ఈతడే రామానుజు లిహపరదైవము ॥గతులన్ని॥

వెలయించెనీతడేకా వేదపురహస్యములు
చలిమి నీతడే చూపె శరణాగతి
నిలిపినాడీతడేకా ఎనిజముద్రాధారణము
మలసిరామానుజులు మాటలాడే ॥గతులన్ని॥





నియమములు ఈతడేకా నిలిపె ప్రపన్నులకు
దయతో మోక్షము చూపెతగనీతడు
నయమై శ్రీ వేంకటేశు నగమెక్కే వాకిటను
దయచూచి మమ్మునిట్టే తల్లిదండ్రి దైవము ॥గతులన్ని॥

**భావామృతం :**

ఈ కలియుగంలో కలి ప్రభావముచే అరిషడ్వర్గముల పాలై దిక్కులన్నీ అంతరించిపోయి గతి ఏదిరా భగవంతుడా అని ఆవేదన చెందుతుంటే నాకు ఈ మహానుభావుడైన శ్రీ ఘనముని గురుదేవుల వారు గొప్పగురుదేవులై దారిచూపించారు.

ఈయన దయవలననే మేము వైష్ణవులమై విష్ణువునాశ్రయించాము. ఈ తిరుమలమణిని ఈయన కృప వలననే చూచితిమి. అష్టాక్షరి మంత్రమని ప్రఖ్యాతిజెందిన 'ఓం నమో నారాయణాయ' అను మంత్రమును ఈ గురువే ఉపదేశించారు. ఇహ పరములు రెంటికీ దైవమైన ఈ ఆచార్యులే శ్రీరామనుజాచార్యుల వారు.

ఈ గురుదేవులే మాకు వేదములలోని తత్త్వరహస్యములనన్నింటినీ తెలియజేసిరి. కరుణాంతరంగులై మాకు ఆదిదేవుని శరణాగతి పొందుట నేర్పారు. వైష్ణవమత సంప్రదాయబద్ధముగా శంఖచక్రాది ముద్రలను ధరింపజేశారు. ఆపై మాతో శ్రీరామానుజులు జ్ఞానబోధచేసి మాటలాడిరి.

ఈ గురుపుంగవులే శరణాగతి యొక్కనియమములన్నీ మాకు నేర్పారు. ఈ మహానుభావుడే కరుణతో మాకు మోక్షమార్గం చూపారు. అందరినీ, నన్నూ కరుణించినట్లే అనుగ్రహించుటకే శ్రీవేంకటేశ్వరుని కొండను ఎక్కునప్పుడు వాకిటలోనే నిలిచి మమ్మల్లి ఈవిధముగా దీవించు తల్లీ, తండ్రీ, దైవమూ కూడా ఈ గురుపుంగవులే అయ్యారు.

## 2-8

### మున్నుడి

'పంచాననము' అంటే బాగుగా తెఱచియుంచిన నోరుగలది అని అర్థం. సింహమును ఆ పేరుతో పిలుస్తారు. నరసింహస్వామి, నరుని దేహము సింహపుతల గలవాడు. అందుకే నరసింహం అంటున్నాం. ఆ గంభీర పంచాననమును అన్నమాచార్యులవారు గీర్వాణ భాషలో కీర్తిస్తున్నారు. అది ఎటువంటి పంచాననమో తెలియాలంటే ఈ చక్కటి కీర్తన వినాల్సిందే. నా పరిమితిలో దీని భావామృత వివరణకు ప్రయత్నించాను. పెద్దలకు చిన్నచిన్నలోటు పాట్లు కనిపిస్తే ఇది ప్రహ్లాదవరదుని స్తుతి కావున కీర్తనకే ప్రాధాన్య మిస్తారని ఆశిస్తాను....

**మ॥ గరుడాద్రీశ్వరుడైన 'సింగ' మిదివో గంభీరరూపంబుతో**
**పరమంబైన అహోబలంపు గిరిపై బాగైన సింగంబహో!!**
**వరదుండౌ మనవేంకటేశ్వరుడెబో! ప్రహ్లాదు సంప్రీతి బ్రో**
**చెర ఆసింగము నన్నమయ్యకొలిచెన్‌సేవించి భావించుచున్.**

**రాగం : నాట**

పరిపూర్ణగరుడాద్రి పంచాననం
పరమం సేవే పంచాననం ॥పరిపూర్ణ॥

క్రూరదంష్ట్రాగ్నికణ ఘోర పంచాననం
పారీణ చక్రధర పంచాననం
వీరపంచాననం విజయపంచాననం
భార భూభారహర పంచాననం ॥పరిపూర్ణ॥

దివిజపంచాననం తీవ్రనఖకాననం
భకవనాశినీ తీర పంచాననం
కువలయాకాశ సంఘోష పంచాననం
పవిశబ్ద దంతరవ పంచాననం ॥పరిపూర్ణ॥





శ్రీ వేంకటాఖ్య ఘనశిఖరి పంచాననం
పావనం పంచముఖ పంచాననం
సేవిత ప్రహ్లాద సిద్ధి పంచాననం
భావితం శ్రీయుక్త పంచాననం ॥పరిపూర్ణ॥

**భావామృతం :**

చక్కగా సర్వకళలతో నిండి పరిపూర్ణమైన గరుడాచలం మీద వెలసిన పంచాననము (సింహము) ఈ అహోబల నృసింహుడు. ఉత్కృష్టులైన భక్తులు సేవించు సింహము ఇదియే.

భయంకరమైన కోరపళ్ళుగల పంచాననము ఇదిగో చూడండి. అన్నింటిలోనూ ఉత్తీర్ణుడైన పంచాననము ఇదే సుమా! అటువంటి పంచాననము నేడు చక్రహస్తుడై వెలసిననాడు. ఇది వీరత్వముగల సింహము. విజయమును పొందిన సింహము. చాల ఘనమైన భూభారమును కలిగించుచున్న దుష్టులను రూపుమాపుటకు అవతరించిన పంచాననము ఇదే.

ఆ పన్నులైన దేవతల కోసం వెలసిప దివ్యమైన సింహము ఇదే. భవనాశినీ నదీతీరమున మెలసిన పంచాననం ఇదియే. పాపులను చూచి భయంకరముగా గర్జించు పంచాననము ఇదియే సుమా! పిడుగుపాట ధ్వనిని కటిగించునట్లు పళ్ళునూరుతున్న సింహము ఇదియే.

శ్రీ వేంకటగిరి అని ప్రసిద్ధిజెందిన శిఖరముపైనున్న వేంకటశ్వరుడని పిలువబడే పంచాననము ఇదిగో ఇదే అహోబలంలో ఉన్నది. పంచముఖములు కలిగి పావనమైన సింహము ఇదే. బాలప్రహ్లాదుడు భక్తితో ప్రార్థించగా సిద్ధించిన సింహము ఇదే కదా! భావించబడి లక్ష్మీదేవితో పాటుగా వెలసిన పంచాననము అహోబల పంచాననము.

## 2-9

### మున్నుడి

హనుమంతుడు మనందరి ఆరాధ్యదైవం. సీతాశోక వినాశకుడు. అన్నమాచార్యులవారు పవనాత్మజునిపై ఎన్నియో అద్భుతమైన కీర్తనలు పాడారు. ఈ కీర్తనప్రత్యేకతేమంటే ఏడుకొండలవాడికి నేరుగా నీబంటు ఎంత గొప్పవాడయ్యా!! ఎన్ని అద్భుతాలు చేశాడు!! బాబోయ్ నడిరేయిని పట్టపగలు చేశాడు కదయ్యా!! అనిమెచ్చుకొంటున్నారు. అందుకే బ్రహ్మ అయ్యే 'పట్టా' సంపాదించుకొన్నాడని కీర్తిస్తున్నారు. "వెట్టగా రావణు" అనే మాట "వెట్టగు రావణు" అయివుంటుందని నా భావన.

**చం॥ అనుపమ మైన కీర్తనల ఆదిమ కావ్యములోని గాధలన్**
**మననము సేయు భాగ్యమును మాకిటు గూర్చెను అన్నమయ్య ఓ**
**వనజభవాదివంద్య! హనుమంతుడు దానవ గర్వఖర్వియై**
**ఘనతనుబొందె బంటయిన కారణమే కద! వేంకటేశ్వరా!**

**రాగం : గౌళ**

నేల మిన్నునొక్కటైన నీబంటు వొక్క-
వేలనే అక్షుని తెగవేసెగా నీబంటు ॥నేలమిన్ను॥

ఉంగరమెగరవేసి యుదధిలో బడకుండ
నింగికి చేయి చాచె నీ బంటు
చంగున జలధిదాటి జంబుమాలి నిలమీద
కుంగ దొక్కి పదముల కుమ్మెగా నీబంటు ॥నేలమిన్ను॥

వెట్టగా రావణు రొమ్ము విరుగ చేతనే గుద్దె
వెట్టతాడువంటి వాడు నీ బంటు
దిట్టమై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలుగ తెచ్చె బాపురే నీ బంటు ॥నేలమిన్ను॥





అలర నన్నియు జేసి అజుని పట్టానకు
నిలుచున్నా డదివో నీ బంటు
బలువేంకటేశ ఈ పవననందనుడు
కలిగి లోకములెల్ల కాచెగా నీ బంటు ॥నేలమిన్ను॥

**భావామృతం :**

(ఓ వేంకటేశ్వరా! నీ బంటు అయిన ఈ హనుమంతుడు ఎంత ఘనుడో చెబుతాను వినుము.)

ఈయన ఆకాశమునకు తన తల తాకునంత ఎత్తు ఎదిగి ఒక్క వేలుతో రావణుని చిన్న కొడుకైన అక్షకుమారుని ఒకపోటు పొడిచి చంపేశాడు. ఆయుధము కూడా అక్కరలేదు (ఆహా! ఎంత బలశాలి!!)

సురస అనే రాక్షసి నోటిలోకి దూరి చటుక్కున బయటకు వచ్చే సమయంలో శ్రీ రామముద్రిక అయిన ఉంగరాన్ని ఆకాశంలోకి ఎగురవేసి తను పని పూర్తియ్యాక మళ్ళీ చెయ్యిజాచి ఆ ఉంగరాన్ని పడకుండా తిరిగి పట్టుకున్న సమయస్ఫూర్తి గల వాడు నీ బంటు. ఒక్క గెంతులో సముద్రాన్నిదాటి లంకలో జంబుమాలి అనే రాక్షసుణ్ణి కుళ్ళతొక్కి పాదముతో కుమ్మి చంపేసిన దిట్ట నీ బంటు.

శత్రువు అయినందు వల్ల రావాణాసురునకు తన శక్తి చూపించడానికి చేతితో పిడికిలి బిగించి ఒక్క గుద్దు ఇచ్చాడు, స్వామి, రావణుడు రొమ్ము విరిగి స్పృకోల్పోయాడు.(వాడు రాముడి చేతితో చావాలి గనుక అప్పటికి బ్రతికాడు.) ఇంకా ఎవ్వరికైనా యమపాశకం వంటివాడే నీబంటు. ఘనుడై, మందుల కొండయైన సంజీవని పర్వతాన్ని అర్ధరాత్రివేళ తేజస్సు చిమ్ముతూ పట్టపగలు అయినట్లు తీసుకువచ్చిన మహానుభావుడు నీబంటు,బాబోయ్

అన్ని అద్భుత కార్యములను నెరవేర్చి శ్రీ రామానుగ్రహం వలన పంచముఖబ్రహ్మ అవుతావనే దీవెనతో 'బ్రహ్మపట్టా' పొందిన ధీశాలి నీ బంటు.ఇదిగో చూడవయ్యా నీ బంటును. ఘనుడవైన తిరుమల నాయకా! వాయుదేవుని సుపుత్రుడైన నీ బంటు ఇట్లు కూడి లోకములనన్నింటినీ రక్షించుచున్నాడు.

## 2-10

### మున్నుడి

'రవిగానవిచో కవిగాంచునే కదా! అని చమత్కరించారు. శ్రీ కృష్ణదేవరాయులవారు. సూర్యుడు చూడలేనివికూడా 'కవి' చూడగలడు. ఎందుకండే అతను 'భావిస్తాడు'. అదే భావయామి వేంకటేశం అంటే. అన్నమాచార్యులవారు స్వామి నీలవర్ణుడే కాదు తెలుపు, నలుపు, పసుపు, బంగారు ఛాయ ఇంకా మాట్లాడితే అనేక రంగులు ఆయన శరీరకాంతిలో వున్నాయి అంటున్నారు. ఈ కీర్తన అర్థం చేసికొంటే మన పెదవులపై చిరునవ్వు వెలుగు చూస్తుంది. ఎందుకంటే ఆస్వామికి రూపమే లేదు కానీ అన్ని రూపములు ఆయనవే; ఏ రంగూలేదు, అన్ని రంగూలూ ఆయనవే....కదా!

**ఆ.వె॥ఏది స్వామిరంగు? ఎటుల తెలియనోపు?**
**గడుసు అన్నమయ్య 'కతలు' వినరె!!**
**పెక్కు వర్ణములనె వేంకటేశ్వరునకు**
**'రవి'కి కానరాదు, 'కవి' కి తోచు.**

**రాగం : ఆరభి**

ఏమని వర్ణించునొకో ఇంక పురాణములెల్ల
వేమారు కొత్తలాయె విశ్వలోకపతికి ॥ఏమని॥

పాలజలనిధిలోన పలుమారు దేలగాను
నీలవర్ణమెల్ల బోయి నిండు దెలుపైనట్టు
మేలిమి కప్పురకాపు మేను నిండ నించగాను
పోలిక వేరొక్కటాయె పురుషోత్తమునకు ॥ఏమని॥

వేడుక కాళిందిలోన వేమారు నీదగాను
ఆడనే కమ్మర నలుపైట్టు
తోడనే తట్టుపుణుగు తొప్పదోగనించగాను
జాడ వేరొక్కటాయె సర్వేశ్వరునికి ॥ఏమని॥





అలమేలు మంగ నురమందునే నిలుపగాను
అలరి బంగారు వర్ణమైనట్టు
నలుగడ సొమ్ములతో నానావర్ణములు
నిలిచె శ్రీ వేంకటనిలయ మూరితికి ॥ఏమని॥

**భావామృతం :**

పాపం! పురాణాలు ఈ స్వామి వారి రంగు ఇది, అని ఇదమిద్ధంగా చెప్పలేకపోతున్నాయి. ఈ జగత్పతికి ఎన్నియోమారులు కొత్తకొత్త రంగులు వస్తున్నాయి, మరి....

ఈయన అసలు నీలమేఘశ్యాముడు కాబట్టి నీలవర్ణదన్నాయి. కానీ తెల్లని పాలసముద్రంలో ఎన్నోసార్లు తేలియాడినందు వల్ల ఆ నీలవర్ణం కాస్త పోయి స్వచ్ఛమైన తెల్లని రంగువచ్చేసింది. అనేకమార్లు కర్పూరం కాపు వేసినందు వల్ల మంచి కర్పూరం రంగు వచ్చేసింది. ఇక ఈ పురుషోత్తముని పోలిక వేరొకటిగా మారిపోయినది.

యమునా నదిలో (కాళీయుణ్ణి వెళ్ళగొట్టి) అనేక మారుటు ఈదులాడాడు. ఇక చూడండి. ఆ కాళిందీ నది నల్లని రంగు ఈయనకు అంటి కమ్మరి వాడు (కొలిమిలో ఇనుమును కాల్చి పనిముట్లు చేసేవాడు) లాగా ఒళ్ళంతా నలుపైపోయింది. ఈ స్వామి ఒంటినిండా 'తట్టుపుణుగు' (ఒక సుగంధ ద్రవ్యం) తట్టి తట్టి మరీ అద్దినందువల్ల దాని రంగు ఆయనకి వచ్చేసింది. ఇక ఈ సర్వేశ్వరుడిది ఏ రంగు అని చెప్పగలము?

అమ్మణ్ణి అలమేలుమంగను నిత్యమూ హృదయంపై ఉంచుకొన్నాడు కదా! ఆవిడ రంగు ఈయనకి అంటి, స్వర్ణకాంతితో మెరిసిపోతున్నాడు. సరే! ఇవన్నీ ఇట్లావుంటే అనేక రత్నాభరణాలను ధరించుట చేత అంతులేని రంగులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. ఈ శ్రీ వేంకటాచలపతి కాంతులని కనులారా గాంచి తరించండి.

## 2-11

### మున్నుడి

భగవంతునికి ఒక రూపంవుండదు. అన్ని రూపములు ఆయనవే. ఒకమతం లేదు. అన్ని మతములూ ఆయన ఆరాధకులు స్థాపించినవే. పుట్టుకే లేని వాడికి చావు ఎలా వుంటుంది. అంతెందుకు భగవంతుడు అని పురుష శబ్దం వాడాము. అసలు భగవంతునికి లింగభేదమేమిటి? మనిషి తన మనుగడకి ఒక నిబద్ధత వుండటం కోసం తనకు తనే ఏర్పాటు చేసికొన్న ఒక కట్టడి రూపమే భగవంతుడు. సనాతన ధర్మంలో 'సహస్ర శీరుషః పురుషః' అని కీర్తించారు పెద్దలు. విశ్వరూపంలో ఒకదాని తర్వాత ఒకటున్నట్లు తలలున్న ఆకారాన్ని చూపిస్తారు. అది నిజమా!! కాదు చిత్రకారుని ఊహ. ఊహ అనుభవమైతేనే భావించగలం కాని అనుభవం కాకపోతే అవి 'అద్దెకు తెచ్చుకొన్న ఆలోచనలే'. రామకృష్ణ పరమహంస ఆ భగవంతుని 'కాళీమాత'గా భావించారు. బుద్ధుడు దివ్యజ్యోతిలాగ దర్శించాడు. 'తానీషా' ఒక రాజకుమారుడిలా దర్శించాడు. అన్నమయ్య ఆ భగవంతుని పెద్దపెద్ద నామాలున్న వేంకటేశ్వరునిగా దర్శించాడు. ఆదిశంకరులు ఎన్నో రూపాలలో దర్శించారు.

నేటి 21వ శతాబ్దంలో కూడ భక్తులు చాలమంది, చాలచోట్ల, చాలా విధములుగా దర్శించగలుగుతున్నారు. ఎవరు ఏవిధంగా భావిస్తే వారికి అలా కనులకు తోచినట్లు 'అనిపిస్తాడు'. 'సాయిబాబా' గా ఆ సర్వేశ్వరుని భావించే నాబోటి వారిని లెక్కించుట అసాధ్యం. తిరుమలలో జరిగిన ఒక దివ్య అనుభవంలో.. 'నకనక' ఆకలితో వున్న మాకు 'చక్కర పొంగలి' తినిపించాడు ఆ స్వామి. దురదృష్టమేమంటే రాత్రి 11.30 కి ఆయన రూములు (గదులు) ఇప్పించే దళారీగానే భావించిన నేను ఆయనను తిరిగి ఎన్నడూ చూడలేదు. తర్వాత తీసుకుంటా లెండి అని నా దగ్గర ఒక్క రూపాయి తీసుకోలేదు. కాబట్టి భగవంతుడే నిజం. మానవుడే ఒక అబద్ధం. భగవంతుడు నీవెలా భావిస్తే అలాగే వుంటాడు.

**ఉ॥ వృద్ధులు, పండితోత్తములు, వేదమునేర్చిన వేత్తలందరున్**
**శ్రద్ధగకొల్తురా'విభుని' సాధన మార్గములందు భేదమే**
**బుద్ధినిమించువారతనిబుచ్చిరిసర్వము'వాడె'యంచుఆ**
**బుద్ధుడె వేంకటేశ్వరుడు బోధన జేసెను అన్నమార్యుడున్.**





**రాగం : సామంతం**

బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి
స్రువంతి భక్తా స్సులభ ఇతి ॥బ్రువంతి॥

గదంతి కిల సాంఖ్యాస్త్వాం పురుషం
పదవాక్యజ్ఞాః పదమితి చ,
విదంతి త్వా వేందాతిన
స్సదా బ్రహ్మ లసత్పదమితి చ. ॥బ్రువంతి॥

జపంతి మీ మాంసకాస్త్వాం చ
విపుల కర్మణో విభవ ఇతి,
లపంతి నయస కలాస్సతతం.
కృపాళుకర్తా కేవల మితి చ. ॥బ్రువంతి॥

భణంతి వేంకటపతే మునయో
హ్యణిమాది ప్రదమతుల మితి.
గుణవంతం నిర్గుణం పునరితి
గృణంతి సర్వే కేవలమితి చ. ॥బ్రువంతి॥

**భావామృతం :**

బౌద్ధులందరూ నీవే బుద్ధుడు అని చెబుతున్నారు. భక్తులందరూ నీవే భక్త సులభుడవని భక్తితో పలుకుతున్నారు.

సాంఖ్యులందరూ నీవే పురుషుడవు అని పలుకుతున్నారు కదా! వైయాకరుణులు నీవే 'పదము' (శబ్దము) అంటు నీకోసం వెతుకుతున్నారు. వేదాంతులు నీవే తత్త్వస్వరూపునిగా వెలుగొతున్నావని గ్రహించారు. నిన్నే బ్రహ్మ అన్నారు.

మీ మాంసకులు కర్మలన్నిటికి నీవే 'కర్త' అని ఎరిగియున్నారు. నైయాయికులు నిన్ను కేవలం దయయే స్వరూపంగా గల సర్వకర్తగా నిన్నెల్లప్పుడు పరిగ్రహించారు.

శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించే మునులందరూ అణిమాది అష్టసిద్ధులకు నీవే ఆదికారకుడవని చెబుతున్నారు. గుణముల నెరింగిన బుద్ధిమందులు నీవే నిర్గుణతత్త్వమని తలచుచున్నారు. ఇదిట్లా వుంటే తక్కినవారంతా నీవే కేవలము (సర్వము) అని కేవల స్వరూపునిగా చెబుతున్నారు.

**2-12**

## మున్నుడి

అన్నమాచార్యులవారి హరినామ సంకీర్తన ఒక తేనుజల్లు అనటానికి ఈ కీర్తన ఒక చక్కటి ఉదాహరణ. ఒక చక్కటి ఉదాహరణ. ఒకటి రెండు మాటు తప్పించి అన్ని పదములు అరటిపండు ఒలిచి తినిపించినంత సులభంగా వుంటుంది. నామ సంకీర్తనతో విశిష్టతే అది. శరణాగతి కంటే శ్రీ హరిని కొలిచే మేటి దారి కలదా? ముమ్మాటికీ లేదు.

**సీ॥ పాదంబిదే కదా! వసుధగొల్చినయది**
**గొనకొని జగములన్ కొలిచినదియు**
**పాదంబిదే కదా! పట్టె రమాదేవి**
**సురలోకమంతయు కోరునదియు**
**పాదంబిదే కదా! వని కరీంద్రముగాచె**
**ఇహపరంబులనిచ్చి అహము జంపు**

తే॥ సీసపద్యంబు కీర్తన జేసినాను
స్ఫూర్తి తాళ్లపాక గురుల సొగసు కవిత
అన్నమయ్యకు సరిజోడు నరయగలమె!
వేంకటేశుని నుతియించు విభవమిదియె

### రాగం : రాగమాలిక

ఈ పాదమే కదా యిల యెల్ల గొలిచినది
ఈ పాదమే కదా ఇందిరా హస్తముల కితవైనది ॥ఈపాదమే॥

ఈ పాదమే కదా ఇందురును మ్రొక్కెడిది
ఈ పాదమే కదా యీ గగనగంగ పుట్టినది
ఈ పాదమే కదా యెలమి పెంపొందినది
ఈ పాదమే కదా యిన్నిటికి యెక్కుడైనది ॥ఈపాదమే॥





ఈ పాదమే కదా యిభరాజు దలచినది
ఈ పాదమే కదా యింద్రాదు లెల్ల వెదగినది
ఈ పాదమే కదా యీ బ్రహ్మ కడిగినది
ఈ పాదమే కదా యెగసి బ్రహ్మాండమంటినది ॥ఈపాదమే॥

ఈ పాదమే కదా యిహపరము లొసగెడిది
ఈ పాదమే కదా ఇల నహల్యకు కోరికైనది
ఈ పాదమే కదా యీక్షింప దుర్లభము
ఈ పాదమే కదా యీ వేంకటాద్రిపై నిరవైనది ॥ఈపాదమే॥

### భావామృతం :

ప్రపంచములోని సర్వులు సేవించెడిది ఈ పాద పద్మములనే కదా! శ్రీ మహాలక్ష్మికి చాల ప్రీతికరమైనవి ఈ పాదములే కదా!

ఇంతమంది భక్తులు మ్రొక్కుచున్నది ఈ పాదపంకజములనే కదా! ఆకాశగంగ పుట్టి ఏరులైపారి, నింగిలో దేవతలను భూమిపై మానవాళిని పాతాళమున సగరసుతులను పావన మొనర్చినది, ఈ పాదములనుండియే కదా! జగతిలో ఆనందము విస్తరింపజేయునదీ పాదములే కదా! ఇన్నిటికి శ్రేష్ఠమైనదియు ఈ పాదయుగళమే కదా!

అడవి కొలనులో గజేంద్రుని ముందరి కాళ్లను ఒడిసి నోటితో పట్టి పీడించుచున్న మొసలినుండి తనను రక్షించమని వేడుకొనినది ఈ పాదములనే కదా! హిరణ్యకశిపుని బాధ భరించలేక ఇంద్రాదిదేవతలు రక్ష కోరుటకు వెతికినది ఈ పాదములనే కదా! త్రివిక్రముడై వామనుడు తన రెండవ పాదముతో ఊర్ధ్వ లోకములనన్నిటినీ అణుమాత్రం సందులేకుండా ఆక్రమిస్తే అబ్బురపడి చతుర్ముఖ బ్రహ్మ భక్తితో సురగంగచే కడిగినది ఈ పాదములనే కదా! అప్పుడు బ్రహ్మాండమంతా నిండినది ఈ పాదమే కదా!

జీవులందరికి ఇహములో సుఖము, పరములో ఆనందమును యొసగునదీ పాదములే కదా! భూలోకంలో అహల్యాదేవిని శాపవిముక్తి కలిగించు ఈప్సిత మీ పాదమే కదా! మాబోటి సామాన్యులు చూడటం అసాధ్యమైనది ఈ పాదములనే కదా! (తిరుమలలో మనబోటి సామాన్యులకు దొరికిన అయిదు, పది సెకండ్ల సమయం స్వామి దివ్యమంగళ విగ్రహం చూడటానికే చాలదు. ఇక పాదాలనేం చూడగలం) ఈ వేంకటాద్రి నివాసమై స్థిరపడినది ఈ పాదమే కదా!

**2-13**

## మున్నుడి

'సమ్మటూరి' లో నెలకొన్న స్వామి చెన్నకేశవుడు. బృందావనంలోని గొల్లెతలను మురిపించి, వలపించి, మరిగించి, వశంచేసుకొని ఒక్కొక్క భామకు ఒక్కొక్క కృష్ణమోహనుడై శృంగార క్రీడలో వారికి చిదానందం ప్రసాదించిన పరమాత్ముడు ఆ 'చీరెల దొంగ'. అన్నమయ్య ఆ చెన్నకేశవ స్వామిపై చెప్పిన అనేక శృంగార కీర్తనలలో ఇదీ ఒకటి. అర్ధమయినట్లే వుండి ఏమీ అర్ధంకాని (వివరించలేని) కీర్తన. నానా తిప్పలు పడి వివరించిన దీని భావామృతం 'రమారమి' గా వివరించబడింది. రమారమణుడైన వేంకటేశ్వరుడే చెన్నుడంటారు ఆచార్యులవారు.

**కం॥ మిన్నగు వేంకటనాధుడె**
**'చెన్ను' డనే ధ్యాసతోటి శృంగారముగా**
**అన్నయ్య చెప్పె కీర్తన**
**లెన్నో యీ 'సమ్మటూరి' యేలిక గొలువన్.**

**రాగం : హిందోళ**

ఎంతవాడవయ్య నిన్ను నేమనేము
సంతకూటముల వాడు సంబటూరి చెన్నుడా ॥ఎంతవాడ॥

సోగకన్నులను జూచి సొలపుల మాటలాడి
వాగపు గొల్లెతలను వలపించేవు
జాగులనవ్వులు నవ్వి జాజరపాటలు పాడి
బాగుగానప్పటి గొంత భ్రమయించేవు ॥ఎంతవాడ॥

బింకపు సాములు సేసి బెట్టగా బువ్వులు వేసి
అంకెకు వచ్చిన దాక నాస రేపి
లంకెలను గూచుండి లలితోమర్మములంటి
మంకుదనముల వారి మరిగించేవు ॥ఎంతవాడ॥





చీరల కొంగులు వట్టి సిగ్గులు బయటవేసి
గారవించి కౌగిటను కరగించేవు
యీరీతి శ్రీవేంకటేశ యిందరిని మేలుకొని
మేరమీరి చనవిచ్చి మెప్పించేవు ॥ఎంతవాడ॥

**భావామృతం :**

'చెన్న' అంటే అందము అని అర్ధం. చెన్నుడు అంటే అందమైన వాడు. చెన్నకేశవునిగా శ్రీకృష్ణుని అనేకమంది ఆరాధిస్తారు. సమ్మటూరిలో వెలసిన చెన్నుడా (చెన్నకేశవా!) ఎంతవాడివయ్యా! నిన్నేమనేట్లుంది? ఈ సంబటూరి (సమ్మెటూరి) లో నెలకొన్న చెన్నకేశ్వరుడు, గోపికలు సంత కూటమికి వెళితే వెంటబడ్డ అల్లరివాడు.

ఓ మోహన కృష్ణా! సోగకళ్లతో జూచి, ఆడపిల్లలు పరవశించి పోవునట్లు మాటలాడి అభం శుభం తెలియని గోపికన్నియలను వలపింప చేసికొనినావు. వివశులను జేయు చిరునవ్వులు నవ్వి, చిలిపి శృంగార నర్మగర్భమైన పాటలు పాడి, అప్పటికప్పుడు వారందరినీ భ్రమింప జేశావు. ఎంత టక్కరి వాడవు.

తెగువ చూపే ఎన్నో ప్రయత్నాలు చేసి, విరివిగా పువ్వులను జల్లి నీ వశమయ్యే దాకా వాళ్లకి ఏవేవో ఆశలు రేపుతావు. తగులుకొని వారిపక్కనే కూర్చొని మర్మాంగములను ఎంతో ప్రేమతో స్పృశిస్తావు.

మొండి పట్టుదల కలిగిన వాడివి కనుక వారిని అట్లు వివశులను జేసి నీకు బాగా అలవాటుపడునట్లు చేసికొనినావు. ఎంతటి మాయకాడవు!! వాళ్ల చీరలన్నీ యెత్తుకెళ్లావు. వాళ్ల సిగ్గులన్నీ బుగ్గిపాలు జేశావు తరువాత అతిశయించిన అనురాగముతో వారిని నీ ఆలింగనంలో కరిగించినావు. ఓ శ్రీ వేంకటేశ్వరా! ఈ విధముగా ఇంతమందిని అతిశయించిన ఆప్యాయత నొసగి మెప్పించి వారికి మేలు కలిగించావు. ప్రభూ! వారి నట్లా ధన్యులను జేశావు తండ్రీ!

## 2-14

### మున్నుడి

అన్నమాచార్యులవారి వైరాగ్య కీర్తన వింటే మనసు ఆర్ద్రమైపోయి విచారం కారు మేఘంలా కమ్ముకొని వేంకటేశ్వరుని శరణాగతి దిక్కు అనే జ్ఞానం ఉదయించి, తల్లి ఒడి చేరిన పాపాయి ఏడుపు నాపి శాంతించినట్లు నిశ్చింత కలిగి యుంటారు. ఒకజీవి శుక్రకణం నుంచి శరీరాన్ని ఇంకొక జీవికి ఇచ్చి అది పెరిగి తిరిగి మట్టిలో కలిసేదాక గుణములు, బంధములు, సుఖదుఃఖములు కల్పించింది వేరెవ్వరు? ఆ తిరుమలేశుడే కదా! ఆయనిచ్చినవి ఆయన తిరిగి తీసేసుకుంటే మధ్యలో నీ ఏడుపెందుకు? నిజమే కదా..!

**చం॥ పనివడి కేశపాశమును బాగుగ ముండన జేయజూచినన్**
**వెనుకనె మొల్వదా మరల వింతయదేమిటి? అన్నమయ్యనెన్**
**తనువు లశాశ్వతంబులిల తాపము భోగములన్ని మిథ్యలే**
**వినుమిక దిక్కునీవనుచు వేంకటనాథుని గొల్వుడీ అనెన్**

**రాగం : రంజని**

ఏమి చెప్పేదిది ఈశ్వర మాయలు
దీము ప్రతిమకును త్రిజగము కలిగె ॥ఏమని॥

మల మూత్రంబుల మాంసపు ముద్దకు
కులగోత్రంబుల గురి కలిగె
తొలులు తొమ్మిదగు తోలు తిత్తికిని
పిలువగ పేరును పెంపును కలిగె ॥ఏమని॥

నెత్తురు నెమ్ముల నీరు బొగ్గుకును
హత్తిన కర్మములటు కలిగె
కొత్త వెంట్రుకల గుబురుల గంతికి
పొత్తుల సంసార భోగము కలిగె ॥ఏమది॥





నానా ముఖముల నరములు పిడుచకు
పూనిన సిగ్గులు భువి కలిగె
ఆనక శ్రీవేంకటాధిపు డేలగ
దీనికి ప్రాణము తిరముగ కలిగె ॥ఏమని॥

### భావామృతం

(ఈ కీర్తన భావామృతం ఎన్ని పేజీలు వ్రాసినా చాలదు. అన్నమయ్య హృదయాన్నీ ఈ కీర్తన పాడినప్పుడు ఆయనలో యెగసిన భావోద్వేగం ఏవో కొన్ని కాగితాలలో ఇమడ్చలేం. మనకంత శక్తిలేదు. అయినా.. మానవ ప్రయత్నం చేయాలి కదా..)

సర్వేశ్వరుడైన ఆ జగన్నాథుని మాయలు (లీలలు) ఏమని చెప్పగలను? దీము (యెఱ) యొక్క ఆకారానికి భూనభోంతరములనే మూడు లోకములలో నివసించు అవకాశము కలిగినది. (ఒక జంతువును పట్టుకోటానికి వేటగాడు 'దీము' అని ఇంకొక ఎఱను ఉపయోగిస్తాడు. మనందరం మాయావి అయిన ఈశ్వరుని చేతిలో 'దీము' లమే.)

మలమూత్రాదులచే కప్పబడిన మాంసం ముద్దకు అమ్మ కడుపులోంచి బయటపడగానే కులగోత్రాల మీద నమ్మకం కలిగింది. తొమ్మిది కంతలున్న తోలు తిత్తికి దాన్నేదో పేరు పెట్టి పిలువగానే 'నేను' అనే భావం, తనపై తనకు మమకారం కలిగాయి.

నెత్తురు, చీము, నీరు, బొగ్గు కలిసిన ముద్దకు అతికించినట్లు కర్మలు కర్మఫలములు కలిగాయి. తీసేస్తే మళ్లీ మొలిచే వెంట్రుకల గంత ఈ శరీరం. దీనికి బంధాలు అనుబంధాలు గల సంసారం తగులుకొన్నది. దాంట్లో భోగాలు దుః ఖాలు తగులుకొన్నాయి.

రకరకములైన నరములున్న ఈ మాంసం ముద్దకు ఈలోకంలోకి రాగానే సిగ్గు ఎగ్గులవంటి భావాలు కలిగాయి. ఆ తరువాత శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం కలిగి తిరమైన (స్థిరమైన ఆత్మ) ప్రాణం వచ్చి చేరింది.

**2-15**

## మున్నుడి

భగవంతుడు నిరాకారుడు, నిరంజనుడు, నిర్గుణుడు, జీవుల కర్మఫలప్రదాత. ఇదే సత్యం. మన కర్మలే మనందరి సుఖ దుఃఖాలకు కారణం. భగవంతుడు సాక్షీభూతుడు. మరి ఈ హరికథలన్నీ వ్యర్థమా? కావు భగవన్నామ స్మరణ చేసే మేలే హరి కథాకాలక్షేపం, పురాణ శ్రవణం కూడా చేస్తాయి. ముఖ్యోద్దేశం నామస్మరణే. ఈ విశ్వాన్నే ప్రకాశింపచేసి శాశించి నశింపచేయగల వేంకటేశ్వరుడికి, యోగీశ్వరునికి జ్ఞానేశ్వరునికి అనంత ప్రభావశాలికి ఎంత చక్కటి కీర్తన వినిపిస్తున్నారో చూడండి అన్నమయ్య. స్వామిని కొలిచి తరించటానికి ఆయన విగ్రహం కూడా అనవసరం అంటున్నారు.

**ఉ॥ పుట్టుకలేనివాడు పరిపూర్ణుడు భావవికార శూన్యుడున్**
**దిట్టతనాన దీనులను తేకొని కాచు అనాథ నాథుడున్**
**చుట్టము వేంకటేశ్వరుడె సూక్తిటు చాటెను అన్నమార్యుడున్**
**గట్టిగ వేడుడీ శరణు కానివి యోచనలేల వ్యర్థమౌ.**

**రాగం : హంసనాదం**

విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ
శాశ్వతున కూహింప జన్మ మిక నేడ ॥విశ్వ॥

సర్వపరిపూర్ణునకు సంసార మిక నేడ
నిర్వాణమూర్తికిని నిలయ మిక నేడ
వుర్వీధరునకు కాలూద నొకచోటేడ
పార్వతీసుత్యునకు భావమిక నేడ ॥విశ్వ॥

నానాప్రభావునకు నడుమేడ మొదలేడ
ఆనన సహస్రునకు నవ్వ లివ లేడ
మౌని హృదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞానస్వరూపునకు కాన విన నేడ ॥విశ్వ॥





పరమయోగీంద్రునకు పరులేడ తానేడ
దురితదూరునకు సంస్తుతి నింద లేడ
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహమేడ
హరికి నారాయణున కవుగాము లేడ ॥విశ్వ॥

## భావామృతం

ఈ విశ్వమంతా ఆయనచే ప్రకాశింపబడుచున్నది. అటువంటి స్వామికి లోపలేమిటి? బయటేమిటి? ఈయన శాశ్వతమైనవాడు. ఎప్పుడూ ఉన్నాడు. అటువంటి స్వామికి జన్మ ఉండట మేమిటి?

చరాచర జగత్తంతా ఈయనే అయినప్పుడు సంసారముతో ఈయన కేమిటి? ఈ స్వామి ముక్తిప్రదాత ఈయనకి నివాసమని ఒకటుంటుందా? ఈ భూదేవే ఆయనచే ధరింప బడింది. ఈయన కాలుపెట్టని ప్రదేశమెక్కడ వుంటుంది? భావము చేత ప్రకటితమయ్యే పార్వతీ దేవియే స్తుతించుచుండగా ఈయనని భావించుట యెట్లు?

అనేక ప్రభావములు గల ఈ స్వామికి ఆరంభమేమిటి? అంతరమేమిటి? సర్వతోముఖునకు అటువైపు ఇటువైపు ఏమిటి? ఈ స్వామి వుండేదే మౌనుల హృదయ పద్మాలలో ఈయనకి ఇక మాట పలుకులతో పనేమిటి? జ్ఞాన స్వరూపుడైన ఈయనను కళ్లతో ఎలా చూడగలం? చెవులతో ఎలా వినగలం?

ఈయన పరమయోగీశ్వరుడు. ఈయనకు నా అనుకొనేవారు, పరాయివాళ్లు అనుకొనేవారు వుంటారా? సర్వ పాప నివారకుడైన ఈయన ఎవరినీ స్తుతించి పుణ్యంకాని నిందించి పాపము తెచ్చుకోవటం అంటూ వుండదు కదా! తిరుమలనాథుడు, వేంకటేశ్వరుని భావించగానే కనులముందుంటాడు. ఇక విగ్రహంతో పనేముంది? శ్రీహరి మరియు నారాయణమూర్తి అయిన ఈ స్వామికి అంగీకారం అభ్యంతరం ఏమిటి?

**2-16**

## మున్నుడి

పెండ్లి తంతు పరిశీలించి చూస్తే 'నాగవెల్లి' అని పిలువబడే తంతు, గృహప్రవేశం అనే తంతు ఉంటాయి. పెండ్లి కుమార్తె సిగ్గులు, ఆడమగపెండ్లి వారి పరాచికాలు, విందులు, సంగీత విభావరులు, చెప్పలేని 'పెండ్లి సందడి!' పరమాత్మ మనందరి తండ్రి కాబట్టి మనందరమూ పెళ్లి పెద్దలమే.. అన్నమయ్య అద్భుత కీర్తనలో ఏడుకొండలవాని పెండ్లినాటి నాగవెల్లి కార్యక్రమం ఆలకించండి. ఇంతకీ అది అందరూ అనుకొనేట్లు 'నాగవెల్లి కాదు, 'నాకబలి'. అంటే నాకము (స్వర్గం)లోని చంద్ర, రుద్ర, వసు, ఇత్యాది దేవతలకిచ్చే 'బలి' అనగా 'పూజ'.

**ఆ.వె.॥విభుని పెండ్లి తంతు వీనుల విందుగా**
**తాళ్లపాక సుకవి తాను తెలిపె**
**స్వామివారి పెండ్లి జనులకు సందడి**
**'నాకబలికి' పేరు 'నాగవెల్లి'**

**రాగం : భైరవి**

నేడే నాగవెల్లి నేడే ఇల్లు నింపులు
పోడిమి గోవిందపతి భోగించీ నిదివో ॥నేడే నాగవెల్లి॥

అల్లదే దేవుని రథమల్లదే గరుడ ధ్వజ
మెల్ల లోకములు గెల్చి యేగీనదే
ఇల్లిదే లక్ష్మీభూము లిద్దరు దేవుళ్లు
చల్లేరు శాసలు తాము సరికి బేసికిని ॥నేడే నాగవెల్లి॥

సేనాపతి అల్లవాడే చేరి దేవతలు వారె
శ్రీనారాయణుడు చెలగీ నదే
ఆనుక అడుగడుగుకు ఆరగించీ వీధులను
వానలుగా అందరికీ వరము లొసగుచు ॥నేడే నాగవెల్లి॥





దేవదుందుభులు మ్రోసె దిక్కులెల్ల చల్లనాయె
శ్రీవేంకటేశుడితడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రతుకుదు
వేవేలు శోభనముల వేడుకకాడితడు ॥నేడే నాగవెల్లి॥

**భావామృతం**

ఈరోజే నాగవెల్లి అనే పెండ్లి తంతు జరుగుచున్నది. గృహప్రవేశమహోత్సవం కూడా నేడే. ఇదిగో అతి మనోహరముగా భోగించుచున్న ఈ వేంకటేశ్వరుడని పిలువబడే గోవిందపతిని తిలకించండి.

అల్లదిగో దేవుని ఊరేగింపు రథమును చూడండి. ఆ ప్రక్కనే గరుడధ్వజము కనులవిందుగా కనిపిస్తోంది. జగద్విజేతయైన ఆ స్వామి ఊరేగింపుగా వస్తున్నాడు. ఇదిగిదిగో ఇటు చూడండి. శ్రీదేవి, భూదేవి అనే ఇద్దరు దేవేరులు పెళ్లికుమార్తెలై స్వామివారిమీద శాసలు (సేసలు) అనగా అక్షతలు చల్లుచున్నారు. తాము ఒకరి తరువాత ఒకరు చల్లుతున్నారు కనుక ఒకరు చల్లేవి సరిసంఖ్యలోను, ఇంకొకరు చల్లేవి బేసి సంఖ్యలోనూ (ఒకదేవి మొదటిసారి చల్లితే ఇంకొక దేవి రెండవసారి చల్లుతున్నది) ఉన్నవి.

అదిగో గంభీరంగా ముందు నడుస్తున్నాడే... ఆయనే స్వామివారి సేనాధిపతి విష్వక్సేనుడు. ఆయన వెనుక దేవతలందరూ ఒక క్రమంలో వస్తున్నారు. ఇదిగో ఈ శ్రీమన్నారాయణుడు విరాజిల్లుతున్నాడు. ఆ తరువాత ప్రతిచోటా ఆగి స్వామివారు ఆ తిరు వీధులలోనే ప్రజలు తరించునట్లు ఆరగింపు చేస్తున్నారు. వర్షపు ధారలాగా (నిజమైన వర్షం కూడా పడుతుంటుంది) ఆ స్వామి ప్రజలకు కోరిన వరములు ఇచ్చేస్తూ వుంటాడు.

దేవ దుందుభులు మ్రోగుతుంటే దిక్కులన్నీ పిక్కటిల్లుతుంటాయి. ఊరేగే ఈ స్వామియే వేంకటేశ్వరుడు. మనస్సులలో నిలుపుకొని ఈయనను సేవించండి. ఓ జీవులారా! భావించండి. (ఇది భావయామి వేంకటేశమ్) ఈ వేడుకల రాయుడికి అనంతమైన మంగళములు పాడండి. అలా సేవించి బ్రతుకుటకంటే ఇంకా ఏం కావాలి?

**2-17**

## మున్నుడి

మనందరిలోను ఆత్మరూపంలో శ్రీ వేంకటేశ్వరుడే ఉన్నాడు. సంసారసాగరంలో మమకారం ఆవరించి జన్మలనే సాగరంలో కొట్టుకొని పోతున్నాం. బురదలో ఇరుక్కుపోయాం. ఒకదానికొకటి తగులుకొని మమకారం వలన మనస్సుకు పాపం అంటిదాంట్లోవున్న పరమాత్మను మఱచునట్లుచేస్తుంది. భ్రష్టులమైపోయాం. ఆత్మరూపంలో వున్న ఆయనను మనంతటమనమే గుర్తించాలి. అందాకా ఈ జన్మలూ తప్పవు ఈ మునకలూ తప్పవు. ఈ కన్నీళ్ళూతప్పవు. అన్నమాచార్యుల వంటి గురువులు మొత్తుకొని చెబుతున్నా మన తలకెక్కటం లేదు....హతవిధీ!!

**కం॥ మమకారంబొక్కటియే**
**సమకూర్చును పాపమెల్ల, జత లంపటమై**
**విముఖుండగునవె అన్నయ**
**తమితో కనలేక నరుడు తన "అత్మేశున్"**

**రాగం : ముఖారి**

కడునడుసు చొరనేల కాళ్ళు కడుగగ నేల
కడలేని జన్మ సాగరమీద నేల ॥కడనడసు॥

దురితంబులకునెల్ల దొడవు మమకారంబు
లరిది మమతలకు తొడవడి యాసలు
గురుతయిన యాసలకు కోరికలు జీవనము
పరగనిన్నిటికి లంపటమె కారణము ॥కడనడసు॥

తుదిలేని లంపటము దుఃఖహేతువు దుఃఖ
ముదుటయిన తాపమున కుండగ జోటు
పదిలమగుతా పంబు ప్రాణసంకటము లీ–
మదము పెంపునకు తన మనసు కారణము ॥కడనడసు॥





వెలయ తన మనసునకు వేంకటేశుడు కర్త
బలిసి యాతని దలచు పనికి తా కర్త
తలకొన్న తలపు లివి దైవమానుషముగా
తలచి యాత్మేశ్వరుని దలపంగ వలదా ॥కడనడసు॥

**భావామృతం :**

అధికముగా బురదవున్న చోట కాళ్ళుపెట్టడం దేనికి? ఆ తరువాత కాళ్ళు కడుగుగొనలేక అవస్థపడటం దేనికి? అదే విధంగా అంతేలేని జన్మల జలధిలో పడి ఈదలేక తిప్పలు పడటం కూడ దండుగ కదా!

పాపము చేయుటకు ముఖ్యమైన అలంకారం (కారణము) మమకారమే. మరి ఆపుకొనలేని మమకారానికి కారణం చలించు ఆశలు. గొప్ప గొప్ప ఆశలకు కోరికలే జీవనము. ఇక వీటన్నిటికి కారణము ఏమిటో తెలుసా? లంపటం (మాలిమితో కూడిన బంధము).

అంతులేని లంపటం దుఃఖ హేతువై తీరుతున్నది. దుఃఖ మేమో అధికమైన తాపమును కలిగిస్తున్నది. ఈ తాపము ప్రాణ సంకటమై అధికమైన మదమును పెంపొందింపచేస్తుంది. ఇవన్నీ జరుగుటకు కారణం వేరెవ్వరో కాదు. మనస్సు మాత్రమే కారణం.

మనస్సు పరిపరి విధముల ప్రవర్తిల్లుటకు కారణం, కర్త ఆ శ్రీవేంకటేశ్వరుడు. కాని ఆ శ్రీవేంకటేశ్వరుని తలచుటకు కర్త అయ్యే ప్రయత్నం మాత్రం ఎవరికి వారే చేసికొనువలెను. అందరి ఆత్మలోవున్న ఆత్మేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరుని ధ్యానించి ఆశ్రయిస్తేనే కదా! దైవికంగా ఇవన్నీ జరిగేది లేకపోతే జన్మలలో తిరుగుతూనే వుంటాడీ జీవుడు.

## 2-18

### మున్నుడి

ఆశలన్నీ అణగారిపోయి దిక్కువేరేదీ కనిపించని జీవుడు, పరమాత్మని ఆక్రోశిస్తూ పిలుస్తున్నాడు. "ప్రభూ! నీవే తప్ప నితః పరంబెరుగ, మన్నింపన్ తగున్ దీను నిన్, రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!"... నాటి గజేంద్రుడి నుంచి నేటి నాబోటి అసంఖ్యాకుల దాకా ఆ 'నామాలయ్యే' శరణు. గుండెల్ని పిండే ఈ కీర్తన అన్నమాచార్యుల వారాలపించినపుడు తిరుమలలో తరులు, గిరులు, సురులు కూడా హరిలా జలజలా కన్నీరు వరదయ్యేలా కురిపించి వుంటారు..

**ఆ.వె.॥శరణుజొచ్చినాను సర్వేశ! నీకింక**
**నీదు చిత్తమయ్య! నిలుప దునుప**
**అన్నమయ్య కీర్తనంబ్రశులను నింపు**
**విభుని కనుల నిందు వింతలేదు.**

**రాగం : దర్బార్ కానడ**

నీకే నే శరణు నీవు నన్ను కరుణించు
యీకడ నాకడ దిక్కు యెవరున్నారికను ॥నీకేనే॥

కన్నుల చంద్రసూర్యులు గల వేలుపవు నీవు
పన్నిన లక్ష్మీభూమి పతివి నీవు
అన్నిట బ్రహ్మకు తండ్రియైన ఆదివేలుపవు
యెన్నగ నీకంటే ఘనమెవ్వరున్నారికను ॥నీకేనే॥

దేవతలందరు నీ తిరుమేనైన మూర్తి
ఆవల పాదాన లోక మణచితివి
నీ వొక్కడవే నిలిచిన దేవుడవు
యేవేళ నీకంటే నెక్కుడెవరున్నారికను ॥నీకేనే॥





అరసి జీవులకెల్ల అంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చే శ్రీవేంకటేశ
పురుషోత్తముడవు భువన రక్షకుడవు
యిరవైన నీవేకాక ఎవరున్నారికను ॥నీకేనే॥

**భావామృతం :**

ఓ ఆదిమధ్యాంత రహితా! శరణు. శరణు. శరణు. నీవు నన్ను కరుణింపుము ప్రభూ! ఇక్కడ గానీ అక్కడగానీ నాకు వేరు దిక్కెవరున్నారు? లేరు... లేరు... ఇక నీవే నాకుగతి.

నీవు నన్ను చూడలేదా?.. సూర్యుడు చంద్రుడు కన్నులుగా కలవాడివి. అట్టి దేవుడు చూడని దేమిటి? లక్ష్మీదేవిని భూదేవిని పతివై ఏలే శ్రీపతివి. అన్నివిధములా తండ్రివై బ్రహ్మదేవుని రక్షించి, నియమించిన ఆదిదేవుడవు నాకు నీకంటే ఘనుడు వేరెవరున్నారు స్వామీ! ఎవ్వరూ లేరు.

దేవతలందరికీ తిరు(ర)ముయైన (స్థిరముగా నున్న) మూర్తివి నీవు. పాదములతో అక్కడ (బలి చక్రవర్తివద్ద) లోకములను ఆక్రమించినవాడివి. మొత్తం సృష్టి అంతా జలరాశిలో మునిగిపోయినప్పుడు నీవొక్కడవే మఱ్ఱి ఆకుపై నిలకడగా పవళించి యుంటివి. ఏ వేళలోనైనా నీకంటే అధికుడెవరున్నారిక?

విచారించ, ఈ సమస్త జీవులకు అంతరాత్ముడవైన శ్రీహరివి నీవే. ఈ భూవనములు రక్షించు పురుషోత్తముడవు నీవు. మా అందరికీ స్థానమై నీవు కాకపోతే మరి ఇంకొకరు ఎవరున్నారు తండ్రీ! లేరు... వేరెవ్వరూ లేరు.

## 2-19

### మున్నుడి

పాండురంగ విఠలునిగా తిరుమలాధీశుని భావించి అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తన ఇది. భావయామి వేంకటేశమ్‌లో ఈ కీర్తన నెన్నుకొని రుక్మిణీ సత్యభామల విభునిగా భావించి తరించే ప్రయత్నమే ఇది. ఆయన సురసేవితుడైన స్వామి. గొల్లభామల కోరికలను ఏకకాలంలో వారు కోరుకొన్న పద్ధతిలో తీర్చిన ఆ మహానుభావుణ్ణి ఎంచి వర్ణించలేని మహిమ అది. సాధారణ మానవులం మనకెట్లా అర్థమవుతుంది? యశోదకు పెంచి మురిపెం తీర్చుకోనిచ్చాడు. దేవకీ వసుదేవులకు కొడుకు పెళ్లిచేసే అదృష్టం ఇచ్చాడు. ఎవరికెంతో... అంతే...

**చం॥ కొలువయి రుక్మిణీ సతియు కోమలి సత్యయు స్వామిగూడగా**

**కొలిచెను అన్నమయ్య యిటు కూరిమితో 'విఠలున్' స్మరించుచున్**

**తలచుచు వేంకటేశ్వరుడె తానను భావన, ఇట్టి కీర్తనన్**

**తెలియను ఇన్నినాళ్ళు భళి!! దీని నెరింగితి ధన్యుడైతి బో!!**

**రాగం : అమీర్ కళ్యాణి**

వేవేల చందాలవాడు విఠలేశుడు
భావింప నలవిగాని పరమాత్ముడితడు ॥వేవేల॥

సతతము రుక్మిణీ సత్యభామ నడుమ
రతినెక్కిన సింగార రాయుడితడు
చతురత సనకాది సంయమీంద్రులమతి
నతిశయిల్లేటి పరమానంద మితడు ॥వేవేల॥

దేవతలకెల్లాను దిక్కుదెసై వెలుగొంది
తావుకొన్నయట్టి ఆధారమీతడు
మూవంక గొల్లెతలు మున్నుసేసిన తపము
కైవసమై ఫలించిన ఘన భాగ్యమితడు ॥వేవేల॥





వరముతో యశోద వసుదేవాదులకు
పరగిన కన్నుల పండుగీతడు
సిరులు మించినయట్టి శ్రీవేంకటాద్రి మీది
నిరతి దాసుల పాలి నిధాన మితడు ॥వేవేల॥

### భావామృతం

ఈ విఠలుడు పలు విధములైన వాడు. ఎందరెందరినో ఎన్నెన్నో విధములుగ ఈయన కరుణించి యున్నాడు. ఈయన భావనలకు అందని పరమాత్మ స్వరూపమే గదా!

భక్తితో కోరిన రుక్మిణికి, శృంగార భావనతో చేరిన సత్యభామకు రతి సౌభాగ్యమును వారికి తగ్గట్లుగా ఇచ్చిన శృంగార పురుషుడా స్వామి. ఇదిట్లా వుంటే సనక సనందనాది మునులకు అనంతమైన పరమానందమును కూడా ఆ యోగీశ్వరుడే ప్రదానం చేశాడు.

దేవతలకు అనేకమార్లు దిక్కు మొక్కు ఈజగద్రక్షుడే అయ్యాడు. వారేకష్టం వచ్చినా ముందు చెప్పుకొనేది ఈ సుర రక్షకునికే. వారి ననేక మార్లు అనేక విధములుగా కాపాడుటకు నెలకొనిన ఆధారభూతుడు ఈ మహానుభావుడు. ముప్పూటలా రేపల్లెలో గొల్లభామలను వారికి కైవసమై వారు వారు కాంక్షించినట్లు బాల కొక్క గోపాలుడై, నారీ నారీ నడుమ మురారియై, హరికీ హరికీ నడుమనొక 'వయ్యారి' యా అనునట్లు రాసక్రీడ జరిపి వారికి మహదానందం ప్రసాదించాడు. నిజానికి వారంతా దేవలోక కాంతలే. వారు స్వామిని ఆరాధించి నీ పొందు కావాలి స్వామీ అంటే వారికి ఘనమైన ఆ సౌభాగ్యాన్నిచ్చాడు, ఆ మహానుభావుడు.

యశోదకు చిలిపి కొడుకుగా తనను పెంచే భాగ్యం ఇచ్చి ఆనందమిచ్చాడు. ప్రసవ వేదన అనుభవించి కన్నకొడుకుని పెంచే భాగ్యం ఇవ్వలేదు కానీ, ఎనిమిది పెళ్లిళ్లు 'కొడుక్కి' చేసి, ఎనిమిది మందితో 'అత్తగారు' అనిపించుకొనే (అందులో ఒకామె స్వయంగా శ్రీమహాలక్ష్మి) అదృష్టమిచ్చాడు. ఆ విధంగా వసుదేవునికి, చతుర్ముఖ బ్రహ్మ (లోకాలకే పితామహుడైన) మనుమడయ్యే భాగ్యం ప్రసాదించాడు. ఆ తలిదండ్రులకు కన్నుల పండుగయ్యాడు. సిరులను ప్రసాదించు శ్రీవేంకటాద్రి మీద ఆ సర్వేశ్వరుడు మిక్కిలి ప్రీతితో శ్రీవేంకటేశ్వరుడే పెన్నిధివలె నిలిచియున్నాడు.

## 2-20

### మున్నుడి

రకరకాల వన్నెలతో పరిమళాలతో నిండిన పూల దొంతరమధ్య 'సంపంగి' లాంటిదీ పాట. అన్నమయ్య జానపదుల కోసం ప్రత్యేకంగా పూయించిన దీని సౌరభాన్ని ఆనందించండి. కరుణయే మూర్తీభవించిన ఈ 'అనాధరక్షకు'డు, వడ్డీకాసులవాడు ఆపద మ్రొక్కులవాడు, తోమని పళ్లాలవాడు, పుట్టుగొడ్డాండ్రకు బిడ్డలిచ్చేవాడు అని ఎందుకు కీర్తించబడుతున్నాడు? నిలువు దోపిడీ చేస్తే కూడా 'నీవే గతి తండ్రీ!' అని ఎందుకు వేడుకొంటున్నారు? పురుటి నొప్పులు అనుభవిస్తే గాని తెలియవు. ఇదీ అంతే..

**కం॥ 'వేడెదమా?' అన్నయ్యనె**
**నేడే శ్రీవేంకటేశు 'నీడై' కావన్**
**వీడని 'వడ్డీకాసుల**
**వాడట' జానపద గీతి పాడెను వినుడీ!**

**రాగం : ఝుంఝూటి**

వేడు కొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని ॥వేడు॥
ఆమటి మ్రొక్కులవాడే ఆదిదేవుడే వాడు

తోమని పళ్లాలవాడే దురిత దూరుడే ॥వేడు॥
వడ్డీకాసులవాడే వనజనాభుడే పుట్టు

గొడ్డాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే ॥వేడు॥
ఎలమి కోరిన వరాలిచ్చే దేవుడే వాడు

అలమేల్మంగా శ్రీవేంకటాద్రి నాధుడే ॥వేడు॥





### భావామృతం

శ్రీవేంకటాద్రిపై వెలసిన ఆ శ్రీవేంకటేశ్వరుని నేడే వేడుకొందామా? (రండి ఆలస్యమెందుకు) ఈ ఆదిదేవుడు 'ఆపద మ్రొక్కులవాడు'. చిన్న ఆపద రాగానే స్వామీ! మమ్మల్నీ గండంనుంచి గట్టెక్కించు నీ కొండకు వస్తాను. అని భక్తితో వేదనతో మ్రొక్కుకొంటే 'తప్పక' మిమ్మల్ని రక్షిస్తాడు. ఇది సత్యం. పునఃసత్యం. సర్వపాప నివారకుడైన ఈ సర్వేశ్వరుడు 'తోమని పళ్లాలవాడు'. ఈ స్వామికి అనేక రకములైన సేవలలో నివేదన కోసం (నైవేద్యం పెట్టుటకు) ఎల్లప్పుడు క్రొత్త పళ్లాలనే వాడుతారు. ఒకసారి ఉపయోగించిన పళ్లాలను మరొక్కసారి ఉపయోగించరు. ఆ పళ్ళాలను తోమి మళ్ళీ వాడరు. అందుకే ఆయన తోమని పళ్ళాలవాడు. (నేటికి కూడా)

ఈయన వడ్డీకాసులవాడు. కుబేరుడి దగ్గిర తన పెళ్లికోసం అప్పు తీసుకొని దానికి కలియుగమంతమై తను వైకుంఠం చేరేదాకా వడ్డీ కడతానని వాగ్దానం చేసియున్నాడు. అందుకే మన మ్రొక్కుబడికీ ఆలస్యమైతే మనమూ వడ్డీ కట్టాల్సిందే. పదివేల రూపాయిలు వేస్తానని (హుండీలో) సంవత్సరం తరువాత పదివేలు వేస్తే లాభం లేదు. పదివేలకి వడ్డీకూడా వేయాల్సిందే. ఆ మహానుభావుని పుట్టుకతోనో గొడ్రాలై నిస్సంతులైన స్త్రీలు గోవిందా మాకు బిడ్డని ప్రసాదించు తండ్రీ అని వేడుకొనే తల్లులు కోకొల్లలు.

ఈ దేవుడు భక్తులు కోరుకొన్న వరములను అతి సంతోషంతో ప్రసాదిస్తాడు. ఏడుకొండలవాడు అని పిలువబడే ఈ శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేల్మంగమ్మతో మనల్ని కరుణించుటకు వెలసియున్నాడు. జన్మధన్యమౌనట్లు భక్తితో సేవించండి.

## 2-21

### మున్నుడి

ఆదిదేవుడైన శ్రీమన్నారాయణుడు ఎవరినెట్లా అనుగ్రహించాడో వివరిస్తున్నారన్నమాచార్యులవారు. దాసీపుత్రుడైన విదురిని ఇంట్లో విడిదియై విందులు తిన్నాడు, రారాజు ఇంటివైపు చూడలేదు. గొల్లభామలకు సామీప్యమోక్షమిచ్చాడు. కుచేలుడి అటుకులు ప్రీతితో తిన్నాడు యశోద చేత రోటికి కట్టేయించుకొన్నాడు. చద్దికట్టుకొనివెళ్ళి గోపాలకులతో పాటు గోవుల్నికాశాడు. సనకసనందనాది ఋషులు నిత్యమూ కీర్తించే సర్వేశ్వరుడు ఈ వేంకటేశ్వరుడే. సృష్టిలో అందరికీ 'ఆధారమే' ఈ స్వామి....

**ఉ॥ అందరికీతడే గురువు ఆదియనెన్ మన అన్నమయ్య, మీ**
**డెందము చిందులేయ వినుడీ యిట వేంకటశైలనాథుడున్**
**ఎందరికెట్లు ఆయె, తను ఇంపుగనా వివరంబులిచ్చెరా**
**ఇందు నిఘంటువున్ వెదకనెన్నియొమారులుతిప్పలాయెబో**

**రాగం :మధ్యమావతి**

అందరికాధారమైన ఆదిపురుషుడీతడు
విందై మున్నారగించె విదురుని కడ నీతడు ॥అందరి॥

సనకాదులు కొనియాడెడి సర్వాత్మకుడీతడు
వనజభవాదులకును దైవంబైనతడీతడు
యినమండలమున చెలగేటిహితవైభవుడీతడు
మునుపుట్టిన దేవతలకు మూలభూతి యీతడు ॥అందరి॥

సిరులొసగి యశోదయింట శిశువైనతడీతడు
ధరనావుల మందలలో తగ చరించెనీతడు
సరసతలను గొల్లెతలకు జనవులొసగెనీతడు
అరసియదుకుకుచేలుని అటుకులు లారగించెనీతడు ॥అందరి॥





పంకజభవునకును బ్రహ్మపదమొసగెను యీతడు
సంకీంనలాద్యులచే జట్టిగొనియె నీతడు
తెంకిగ నే కాలము పరదేవుడయినయీతడు
వేంకటగిరి మీద ప్రభల వెలసిన ఘనుడీతడు

॥అందరి॥

### భావామృతం :

సృష్టిలో ప్రతిజీవికీ ఆధారమైన ఆదిమపురుషుడు ఈ మహానుభావుడే. ద్వాపరయుగంలో ఆయన రారాజు దుర్యోధనుని వద్దకు పాండవరాయబాగా వెళ్ళి దాసీపుత్రుడైనా యోగ్యుడైన విదురుని ఇంట్లో బసచేసి భుజించాడు. రాజభోగం తిరస్కరించాడు.

సనక సనందనాది మునివర్యులు కీర్తించెడి సర్వాత్మస్థితుడీ నారాయణుడే. బ్రహ్మదులకు ఈయన దైవస్వరూపుడు. సూర్యమండలమున గొప్పవైభవముతో వెలుగొందెడి తేజోమూర్తి ఈ స్వామియే. వామనావతరంలో దేవతలకు అనుజుడై పుట్టి ఆదుకొనిన కరుణా సముద్రుడు ఈ జగద్రక్షకుడు.

గోపెమ్మ యశోదకు వైభవ మొసగి ఆమెనట్టింట శిశువై మురిపించినదీ మహానుభావుడే. భూమిపై ( వైకుంఠనాధుడు) గోపాలుడై ఆవులమందను కాచిసంచరించినదీతడే. అక్షరమ్ముక్కరాని గోపకాంతలకు సామీప్యమోక్షమును అనుగ్రహించిన శృంగారమూర్తియూ ఈ లోకేశ్వరుడే. గుప్పెడటుకులు తినిపించిన కుచేలునకు కొల్లలుగా సిరులిచ్చి కరుణతో జూచిన కరుణామూర్తి ఈ భగవానుడు.

పద్మసంభవుడైన చతుర్ముఖబ్రహ్మకు సృష్టి బాధ్యతనొసగినదీ ఆదిదేవుడే. సంకీర్తనజేయు భక్తులచే వెలకుతీయబడిన స్వామి ఈయనే కదా! ఏ కాలమునైనా పరదేవుడయిన స్వామికి నివాసస్థానమై వెలసినది వేరెవరోకాదు వేంకటగిరి మీద వైభవముతో వెలసిన ఘనుడైన ఈ శ్రీవేంకటేశ్వరుడే.

## 2-22

### మున్నుడి

"సాధన వలననే సమకూరుఫలములు" అన్నది ఆర్యోక్తి. దానినే అన్నమాచార్యులవారు చక్కటి కీర్తనలో తెలియజేస్తున్నారు. మనస్సులో చింతలన్నీ తొలగిపోయి తిరుమలనాథుని వైపు తిప్పకుండా తిరుమలయాత్ర కోటిసార్లు చేసినా ఆయన ప్రత్యక్షమౌతాడా? అసాధ్యం. ఆత్మశాంతి పొందలేని వాడు అష్టావధానంలో దిట్టఅయినా ఫలితం శూన్యం. అన్నమయ్య బోధనలో నాన్చుడు వ్యవహారం ఉండదు. సూటిగా చెప్పటమే....

**మ॥ తరమేమోక్షపుమార్గమందు జొర, యత్నంబెంచిసేనేరకన్**
**తరమే కర్మమలంబులన్ కడుగకన్ తాగాంచ జ్ఞానంబికన్**
**తరమే శాంతినిబొంది వేంకటవిభున్ దాస్యంబుతోగొల్వకన్**
**యెరిగించెన్ మన అన్నమయ్య వినుడీ యూకీర్తనంబెంచితిన్**

**రాగం :గౌళ**

ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట ॥ఊరకే॥

తలపులోపలి చింత-దాటినప్పుడు గదా
అలరిదైవంబుప్ర-త్యక్షమౌట
కలుషంపు దుర్మదము-గడచినప్పుడు గదా
తలకొన్న మోక్షంబు-తనకు జే పడుట ॥ఊరకే॥

కర్మంబు కసటువో-కడిగినప్పుడు గదా
నిర్మలజ్ఞానంబు-నెరవేరుట
మర్మంబు శ్రీహరిని-మఱగు జొచ్చినగదా
కూర్మి తన జన్మమె-క్కుడు కెక్కుడౌట ॥ఊరకే॥





తన శాంత మాత్మలో-దగలినప్పుడు గదా
పనిగొన్న తన చదువు-ఫలియించుట
ఎనలేని శ్రీవేంక-టేశ్వరుని దాస్యంబు
తనకు నబ్బిన గదా-దరిజేరి మనుట ॥ఊరకే॥

**భావామృతం :**

అత్యుత్తమమైన మోక్షసౌఖ్యము తగిన యత్నముజేయక చేజిక్కుతుందా? ఒక పనిలో విజయం కలుగవలెనంటే ఆ పనిలోని సారమునంతా గ్రహించి తగిన సాధనజేయవలెను కదా! ఊరకే ఏకార్యమైనా నెరవేరుతుందా?

ఆలోచనలలో చింత విడనాడితేనే కదా! భగవత్సాక్షాత్కారం సాధ్యపడుతుంది. మలినములతోనున్న దుర్మదమును అతిక్రమిస్తేనే కదా! మోక్షం ప్రాప్తించేది. ఊరకే నాకు మోక్షం కావాలి, మోక్షంకావాలి అని తపనపడితే మోక్షం దొరుకుతుందా?

ఒక జన్మలో ప్రాప్తించిన మాలిన్యం ఆజన్మతో పోతుందనుకోవటానికి వీలులేదు. అది మరుజన్మలోనూ నీడలా వెంటాడవచ్చును. కాబట్టి ఏదో ఒక జన్మలో ఆ మాలిన్యాలన్నింటినీ పూర్తిగా కడిగివేసికొంటేనే కదా! నిర్మలమైన జ్ఞానం కలుగుతుంది. హృదయకమలంలో శ్రీమన్నారాయణుడు ప్రకాశిస్తేనే కదా!జన్మసాఫల్యం కలుగుతుంది. ఊరకే నాజన్మ చరితార్ధం కావాలి అని కలలు కంటే అయిపోతుందా? ఎన్నటికీ అవదు.

ఆత్మశాంతి పొందిన తరువాత గాని ఎవ్వరికైనా తను చదువుకొన్న చదువుకు సార్ధకత కలుగదు. జతలేని తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుని దాస్యము తనకు లభిస్తేనే గాని సంసారసాగరంలో ఒడ్డుజేరట మనేది జరుగదు. (దీని గురించి తెలిసీతెలియని తత్త్వబోధకులు ఏమి జెప్పినా నమ్మకండి. ఓం నమో వేంకటేశాయ అని శరణాగతినొందండి)

**2-23**

## మున్నుడి

'జన్మానికో శివరాత్రి' అన్నట్లు మనబోటి సామాన్యులకు వైకుంఠనాధుని దర్శనం లభించినంతకష్టం తిరుమలనాధుని బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవేంకటేశ్వరుని ప్రత్యక్షంగా చూచిసేవించటం. ఈ కీర్తన నాలపించి అతితేలికగా అంతపుణ్యమూ సంపాదించేదారి చూపించారు అన్నమాచార్యులవారు. ఆయన అందించిన భాగ్యమే ఇది.

**సీ॥ బ్రహ్మాండనాధుని బ్రహ్మోత్సవంబులన్**
**వర్ణించు కీర్తన పాడెదమిక,**
**పది దినంబులదాక పరమాత్మ గొలిచెడి**
**మోక్షపథంబిది ముదము 'కొసరు'**
**తిరువీధులందున ఊరేగు 'వేంకన్న'**
**వాహనంబులు మారు ప్రతిదినంబు**
**కనులార గాంచిన యెనలేని పుణ్యంబు**
**జన్మధన్యంబౌను స్వామి మెచ్చు**

**ఆ.వె॥ అన్నమయ్య నాడు ఆది శ్రీకారంబు**
**జుట్టి తాను మొదలుబెట్టినారు**
**వరముగాదె!! నాకు ఇరువదిపదిలోన**
**భావమెరుగజెప్ప బంధులార!**

**రాగం : శ్రీరాగం**

తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను ॥తిరువీధుల॥

తిరుదండెలపైనేగీ దేవుడిదే తొలినాడు
సిరుల రెండవనాడు శేషుని మీద
మురిపేన మూడోనాడు ముత్యాలపందిరి క్రింద
పొరినాలుగోనాడు పువ్వుకోవిలలోను ॥తిరువీధుల॥





గక్కన నయినదవనాడు గరుడుని మీదను
యెక్కను ఆరవనాడు యేనుగుమీద
చొక్కమై ఏడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువమెతేరును గుర్రమెనిమిదోనాడు ॥తిరువీధుల॥

కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
ఎనసి శ్రీవేంకటేశుడింతి అలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను ॥తిరువీధుల॥

**భావామృతం :**

(శ్రీవేంకటేశ్వరుని సాన్నిధ్యంలో ఆనాడు స్వయంగా చతుర్ముఖ బ్రహ్మ ఆరంభించి, నిర్వహించిన బ్రహ్మోత్సవముల వైభవాన్ని, అన్నమయ్య అద్భుత కీర్తనలో ఆస్వాదించి తరించండి).

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు తిరుమల వీధులలో కాంతులీనుతూ శోభిల్లుచున్నాడు. వైభవము అతిశయిల్లగా గొప్పఅలంకరణలతో దర్శనమిస్తొన్నాడు.

పదిరోజుల ఈ బ్రహ్మోత్సవములలో శ్రీ వేంకటేశ్వరుడు మొదటిరోజున పావనమైనపల్లకీలో ఊరేగినాడు. ఇక రెండవ రోజున ఆదిశేషునిపై వెడలుచున్నాడు. మురిపెముతో మూడవరోజున ముత్యాలపందిరి వేయించుకొని దాని క్రింది ధగద్ధగాయమానంగా ఊరేగుచున్నాడు. క్రమముగా నాలుగవనాడు స్వామి గుడివలె కట్టబడి పుష్పకోవెలలో విజయంచేస్తున్నాడు. (కనులారగాంచి తరించండి) అయిదవరోజున అతిశీఘ్రముగా గరుత్మంతుని వాహనంపై పోవుచున్నాడు. బ్రహ్మోత్సవములో ఆరవనాడు స్వామి గజవాహనముపై వెడలినాడు. ఏడవనాడు స్వామి ఏదోషమూ లేని సూర్యప్రభవాహనంపై ఊరేగుచున్నాడు. ఇక ఎనిమిదివనాడు గుఱ్ఱములకట్టినరధముపై వెడలినాడు.

తొమ్మిదవ రోజున ఈ మహానుభావుడు బంగారుపు అందలము (పార్శ్వభాగములు లేని ఊరేగింపు పల్లకీ) మీద దగ్గర తరవి పోవుచున్నాడు. ఇక చిట్టచివరి దైనపదియవనాడు సమకూడిన కళ్యాణపు వేదికపై ఊరేగుచున్నాడు. పొందికగలిగిన ఈ శ్రీవేంకటేశ్వరుడు తనదేవెరి అలమేల్మంగమ్మతో వనితాజన సమూహముతో అనేక వాహనములపై ఊరేగుచున్నాడు. నయనానందకరంగా చూచి తరించండి.

# 2-24

## మున్నుడి

జానపదుల కోసం వారిశైలికనుగుణంగా వారి భాషవాడుతూ అన్నమాచార్యులవారు అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. ఆ మాటలు నేటి మన'ఆంగ్ల తెలుగు' మాత్రమే వచ్చిన నాబోటివారికి అర్థంకావు. వాడుకలో లేని కత్తి తుప్పుపట్టినట్లు 600 ఏళ్ళులో కొన్ని మాటలు నిఘంటువుల్లో కూడా కనుమరుగయిపోయాయి. 'కూగాగు' అంటే సరియైన అర్థం ఏమిటి? భాషమీద పట్టువున్న నా మిత్రులొకరి సూచనమేరకు కన్నడంలో 'కూగాగు' తెలుగులో 'దోబూచి' గా అర్థం చెప్పవచ్చు. అన్నమయ్యవాడిన జానపద భాష ఇదమిత్థంగా తెలియడంలేదు. మన దౌర్భాగ్యం....

**కం॥ "కూగూగం" టే నేమిటి?**
**ఏగతి నేర్వంగనోపు ఇట్టి పదములన్**
**రాగదలె అన్నమయ్యకు**
**తూగే సరిజోడు కొలువ తోయజనాభున్!!!**

**రాగం : మోహన**

గుఱుతెఱిగిన దొంగ కూగూగు వీడె
గుఱిలోనె దాగిని కూగూగు ॥గుఱుతెఱిగిన॥

నెలతల దోచీని నీళ్ళాడగానే
కొలనిదరిని దొంగ కూగూగు
బలువైన వుట్ల పాలారగించీని
కొలది మీఱిన దొంగ కూగూగు ॥గుఱుతెఱిగిన॥

చల్లలమ్మంగ చనుకట్టు దొడికీని
గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిల్లు తప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగు ॥గుఱుతెఱిగిన॥





తావుకొన్న దొంగ తగిలి పట్టండిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీవేంకటగిరి చెలువుండో యేమో
కొవిదుడగు దొంగ కూగూగు. ॥గుఱుతెఱిగిన॥

**భావామృతం :**

'గుఱుతెఱిగిన దొంగ' అంటే జగత్ ప్రసిద్ధమైన చోరుడు అని అర్థం చెప్పుకోవచ్చు. వీడు జగత్ ప్రసిద్ధమైన దొంగ'దోబూచి'. అంతేకాక ఈయన భక్తుల గుఱిలోనె (లక్ష్యములోనే) దాగియుండే కూగూగు (దోబూచి).

కొలనులో స్నానం చేద్దామని స్త్రీలు నీళ్ళలో దిగగానే వాళ్ళ బట్టలను యెత్తుకొనిపోయిన దొంగ కూగూగు ఇతడే. పెద్ద 'ఉట్ల'లో ఎత్తుగా కట్టిన పాలుకూడ తెలివిగా కాజేసిన అపరిమితమైన దొంగ కూగూగు ఇతడే. (మన తెలివితేటలు ఆయన చాకచక్యం ముందు పనిచేస్తాయా? ఎంత వెర్రివాళ్ళం మనం!!)

చల్లలమ్ముకోవటానికి గొల్లభామలు నెత్తిన చల్లకుండలు పెట్టుకొని నడుస్తుంటే చనుకట్టు చలిస్తుండగా వాళ్ళవెంటబడి ఏడిపించే వాడే ఈ దొంగ కూగూగు. వీరూవారని గాక రేపల్లెలో ప్రతి గోపిక స్తనవైభవాపహరణ ఈ దొంగ కూగూగే గావించాడు. (ఎంత అదృష్టవంతులో!! సాక్షాత్తూ దేవతాస్త్రీలంతా, ఆ పురుషోత్తముని ప్రార్థించి, వరముగా పొంది, గోపికలవలె జన్మించి ఆ సౌభాగ్యాన్ని పొందారట. అదికదా! జన్మ అంటే)

ఈ మహనుభావుడు (నేడు తిరుమలలో) నెలకొనిన దొంగ. ప్రయత్నించి పట్టుకోండి (మీ తరమా?) గోవిందా అనండి. ఎందుకంటే ఈయన గోవులతో సంచరించే దొంగ కూగూగు. శ్రీ వేంకటగిరి మీద స్థిరపడిన సుందరాకారుడో ఏమో? అట్లా అయితే మాత్రం ఈ దొంగ కూగూగు జ్ఞానేశ్వరుడే. సందేహం లేదు.

**2-25**

## మున్నుడి

అలమేల్మంగమ్మను పొగుడుతూ శ్రీవేంకటేశ్వరునికి అన్నమాచార్యుల వారు విన్నవిస్తున్న వైనంతిలకించండి. సెలవలంటే 'హాలిడేస్' అనుకొనే నాలాంటి 'అమాయకులు' ఈ కీర్తన భావామృతం చదివి కొంత 'జాణతనం' నేర్చుకోవచ్చును. అలాగే "తెఱవ పెదవు"లంటే తెరిచియుంచిన పెదవులను- కానేమాదం వుంది. ఆ మాట అర్థం 'స్త్రీ పెదవులు' అని. అన్నమయ్య కీర్తనకర్థం చెప్పటం నల్లేరు మీద నడక కాదు అని తెలిసిందా? ఇక వేంకటనాధుని మురిపెం గ్రహించండి.

**చం॥ పెదవులలేత నవ్వునతల ప్రేమతలంపుల దాచియుంచగా**
**ముదితకుసంతసంబపుడుముంపున వచ్చెనుయెంత 'జాణ'యో!**
**మది తిరువేంకటేశ్వరుడు మాలిమితో తనభామగూడగా**
**పదకవితా పితామహుడు పాడెను కీర్తన నద్భుతందుగా.**

**రాగం : కళ్యాణి**

ఎంత నేరుపరి ఈ లేమ
దొంతివెట్టే సంతోసముల ॥ఎంతనేరుపరి॥

వెలది సెలవులను వెన్నెల గాసీ
చెలులునీ సుద్దులే చెప్పగను
తలపోతలనే దండలు గుచ్చీ
నెలకొని ఎదుటను నీ వుండగను ॥ఎంతనేరుపరి॥

వనిత చెక్కులను వానలు గురిసీ
తనియని విరహపు దమకమున
కనుచూపులనే కలువలు చల్లీ
నినుపుల వలపుల నీ రాకలకు ॥ఎంతనేరుపరి॥





తెఱవ పెదవులను తేనెలు చిందీ
మరి నీ వాడిన మాటలను
నెఱి శ్రీవేంకట నిలయ కూడితివి
జఱసి నీతో జాణతనముల ॥ఎంతనేరుపరి॥

**భావామృతం :**

ప్రభూ! ఈ భామిని ఎంత చాకచక్యంగలదో చూశావా? సంతోషములనన్నింటినీ ఈమె వరుసగా పేర్చి నీకు సమకూర్చింది స్వామీ!

ఈ వనిత లేత పెదవులపై మొలక నవ్వుల వెన్నెలలు కాస్తున్నాయి. ఎందుకో తెలుసునా? ఆమో చెలికత్తెలు నీ యొక్క లీలలను వివరిస్తున్నారు మరి. ఈమె నీ ఆలోచనలనన్నింటినీ సరాగమాలవలె గుచ్చుతున్నది. ఇంతలో వున్నట్లుండి నీవు ఆమె కన్నులముందు ప్రత్యక్షమయ్యావు. (ఇక ఆమె తత్తరపాటు నేమని చెప్పగలము!!)

ఈ జవరాలి చెక్కిళ్ళు కాంతులను విరజిమ్ముచున్నవి. ఈమె విరహముచే కలిగిన మైమరపునకు తృప్తి కలుగలేదేమో మరి. ఈమె తన కనుచూపులలో ఎఱ్ఱకలువపూలను పూయిస్తున్నది. ఎందుకంటే అతిశయించిన వలపులను తన కనులలో నింపుకొని క్షణమొక యుగములా ఆమె నీ రాక కోసం ఎదురుచూస్తున్నది.

ఈ తెఱవ (యువతి) యొక్క పెదవులు తేనెలూరుచున్నవి. ఎందుకంటే నీవు ఆమెతో చెప్పిన మాటలను తిరిగి ఆమె పదే పదే తన నోటితో పలుకుచున్నదికాబోటు. అందమైన శ్రీవేంకటగిరి నిలయుడవై ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఆమెను కూడగానే మా అలమేల్మంగమ్మ కూడా జాణతనముతో (నేర్పరితనంతో) నిన్ను ఎదుర్కొనినది స్వామీ!

## 2-26

### మున్నుడి

నేటి హంపీ విజయనగరము అన్నమయ్య కాలంలో ప్రసిద్ధమైన శ్రీరామచంద్రమూర్తి దివ్య క్షేత్రం. ఆ స్వామిని సందర్శించిన ఆచార్యులవారు ఎన్నో మధురమైన కీర్తనలకు జీవంపోశారు అక్కడ. ఈ కీర్తన ఆ కోవలోనిదే. శ్రీరామచంద్రుడు పరదైవం యొక్క సాకారరూపం అని తదనంతరకాలంలో త్యాగయ్యగారు, భక్తరామదాసు కీర్తించటానికి ఆద్యుడై శ్రీకారం చుట్టినది తాళ్ళపాకవారే. ముఖారి రాగంలో ఈ కీర్తన నాలపించిన వారిని వేంకటేశ్వరుడు అనుగ్రహిస్తాడు. సందేహం లేదు.

**తే॥ ఎట్టి సద్గుణ భూషితుడినకులమణి!!**
**అనుచు రామచంద్రు బొగడె నన్నమయ్య**
**ఆ 'ముఖారి' రాగంబున నవధరించి**
**తిరుమలేశుడే జానకీధరుడు యనెను.**

**రాగం :ముఖారి**

రామడు లోకాభిరాముడు త్రైలోక్య-
ధాముడు రణరంగ భీముడు వాడె ॥రాముడు॥

వరుడు సీతకు ఫలాధరుడు మహోగ్రపు
శరుడు రాక్షస సంహరుడు వాడే
స్థిరుడు సర్వగుణాకరుడు కోండద దీక్షా-
గురుడు సేవక శుభాకరుడు వాడే ॥రాముడు॥

ధీరుడు లోకైక వీరుడు సకలా-
ధారుడు భవబంధదూరుడు వాడే
శూరుడు ధర్మ విచారుడు రఘువంశ-
సారుడు బ్రహ్మ సాకారుడు వాడే ॥రాముడు।





। బలుడు ఇన్నిటా రవికులుడు భావించ ని-
ర్మలుడు నిశ్చలు డవికలుడు వాడే
వెలసి శ్రీవేంకటాద్రి విజయనగరములోన
తలకొనె పుణ్యపాదతలుడు వాడే ॥రాముడు॥

**భావామృతం :**

ఆ శ్రీరామచంద్రుడు లోకములన్నింటిలో మనోజ్ఞమూర్తి. ముల్లోకములూ ఆయన నెలవులే. ఆతడే యుద్ధరంగమున మహాపరాక్రమవంతుడు.

ఆ శ్రీరామచంద్రమూర్తి జానకీదేవికి మగడు. జీవుల ఫలప్రదాతయు నాతడే గొప్పశస్త్రాస్త్రములు కలవాడు. ఆయనే రాక్షసులనందరిని మట్టుబెట్టినవాడు. స్థిరమైన చిత్తము కలిగినవాడు.సర్వకాల సర్వావస్థలయందు కోదండచాపము ధరించి సిద్ధముగా నుంటానని దీక్షవహించిన శ్రేష్ఠుడు. ఆయనే తనను సేవించువారికి శుభములను ప్రసాదించువాడు.

ఆ శ్రీరాముచంద్రుడు ధీరత్వము మూర్తీభవించిన వాడు. లోకములన్నింటికీ ఏకైక వీరుడు. అన్నిటికీ ఆధారమైన వాడు. జీవులందరినీ భవబంధములనుంచి విముక్తులను చేయువాడు.గొప్ప శౌర్యము కలవాడు. ఏది ధర్మమో ఏదధర్మమో తెలిసిన వాడగుటచే ఎప్పుడూ ధర్మవిచారమును మాత్రమే చేయువాడు. రఘువంశమునకే చేవయైనవాడు. ఆయనే పరబ్రహ్మసాకారముగా నవతరించిన మహానుభావుడు.

ఆ శ్రీరామచంద్రమూర్తి గొప్పబలవంతుడు. ఈ చెప్పిన గుణములన్నియూ ఒకే చోట కలిగిన రవికుల తిలకుడు. భావించినచో ఆ శ్రీరాముడు నిర్మలహృదయము కలవాడు. నిశ్చలమైన బుద్ధి కలవాడు. ఏ విధమైన మనోవైకల్యమూ లేనివాడు ఆయన మాత్రమే. వేంకటాద్రి మీదనెలకొన్న శ్రీవేంకటేశ్వరుడే, నేడు విజయనగరములో తన పాదములు ప్రతిష్ఠింపబడినవాడై గొప్ప అర్చావతారముగా శ్రీరామచంద్రమూర్తిగా నున్నాడు.

## 2-27

## మున్నుడి

అత్యద్భుతమైన తత్త్వబోధ జేసే సంకీర్తన అన్నమయ్యపాడుతున్నారు. తుది, ఆదిలేని పరితాపం చెందుతున్నాననుకొంటున్నాడు మానవుడు. ఎన్నెన్నో కొలవులు చేసి యెందరెందరినో సేవిస్తున్నాడు. గర్వము, చింత, దైన్యము, ఆశ, లంపటాలు అన్నీ తనకే అనుకొంటూ ఆయా సమయాల్లో ఆ విధంగా సుఖదుఃఖాలనుభవిస్తున్నాడు. కానీ నిజానికి తను జీవాత్మననీ తాను తనకేమీ కాదనే సత్యం మాత్రం గ్రహించలేక పోతున్నాడు. అదే ఆ ఏడుకొండలవాడి మాయ. ఆయనని ధ్యానించనిదే ఇందులోంచి బయటపడటం అసాధ్యం.

**ఉ॥ ఎన్నియొ కొల్వులన్ చెలగు నెంతటి గర్వము నెత్తికెత్తురా**
**ఎన్నికుతంత్రముల్ నెఱపు నెన్నియొ ఆసలనొందు జీవుడున్**
**ఎన్నిటికేడ్చు? నెన్నిటికి నింపుగ నవ్వును అన్నమయ్యనెన్**
**ఇన్నియు నెన్నగా తిరుమలేశుని మాయని నేర్వలేడహో!!**

**రాగం : గోరక్ కళ్యాణ్**

ఏదితుది దీనికేదిమొదలు
పాదుకొను హరిమాయ పరుగు జీవునికి ॥ఏదితుది॥

ఎన్నిబాధలు తనకు నెన్నిలంపటములు
యెన్నివేదనలు మరియెన్ని దుఃఖములు
యెన్నిపరితాపంబు లెన్నితలపోతలు
యెన్నిచూచిన మరియు నెన్నైన కలవు ॥ఏదితుది॥

ఎన్నికొలువులు తనకు నెన్నియనుచరణలు
యెన్నిఆసలు మరియు నెన్నిమోహములు
మెన్నిగర్వములు తనకెన్ని దైన్యంబు లివి
ఇన్నియును తలప మరియెన్నైన గలవు ॥ఏదితుది॥





ఎన్నిటికి చింతించు నెన్నిటికి హర్షించు
నెన్నిటికి నాసించు నెన్నిటికి దిరుగు
యిన్నియును తిరువేంకటేశు లీలలు కాగ
ఎన్నిచూచినను తానెవ్వడును కాడు ॥ఏదితుది॥

**భావామృతం :**

జీవునికి శ్రీహరి యొక్క 'మాయ' ఆవరించి, ఊడలు వేసి, వ్యాపించి, బిగించివేయుచున్నది. ఈ మాయకు ఆదియేది? అంతమేది? ఇది తెలుసుకొనుట సాధ్యమా?

ఎన్నిబాధలు, ఎన్ని బంధనాలు, ఎన్ని వేదనలు, ఎన్ని సుఖములు, ఎన్ని దుఃఖములు, ఎన్నిపరితాపాలు, ఎన్ని ఆలోచనలు- ఈ మానవుడికి? లెక్కపెట్టి చూస్తే ఎన్నంటే అన్నివున్నాయి. (వీరూవారని లేదు, ప్రతివాడిదీ ఇదే గోల. ఈ గోలకు, గోడుకు అంతూలేదు)

ఎన్ని కొలువులు, ఎన్నిపదవులు, ఎన్ని వైభవాలూ, ఎంతమంది అనుసరించి అనుమతి కోసం ఎదురుచూచే వాళ్ళూ, ఎన్ని ఆసలు, ఎన్ని అడియాసలు, ఎన్ని మోహాలూ, ఎన్ని వ్యామోహాలూ, ఎన్ని గర్వించ తగ్గసంగతులు, ఎన్ని దీనత్వంతో పొందిన అవమానాలు- ఇవన్నీ ఆలోచనలే. తరచి చూస్తే ఎన్నంటే అన్నివున్నాయి.

ఈ మానవుడు ఎన్నిటికని చింతిస్తాడు? ఎన్నిటికి సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతాడు? ఎన్నిటికి ఆశపడతాడు? ఎన్నిటికోసం కాలుకాలిన పిల్లిలా తిరిగి సతమతమవుతాడు? ఇవన్నీ తిరుమలాధీశ్వరుడైన శ్రీవేంకటేశ్వరుని లీలలు అవటం చేత, పాపం ఈ జీవుడికి ఎన్ని చూచినా, ఎన్ని జరిగినా, ఎన్ని అనుభవించినా తాను ఎవ్వడూకాడని 'తను' అనేదే లేని ఆత్మననే విషయం మాత్రం గ్రహించలేడు. (శ్రీవేంకటేశ్వరునే ధ్యానించి శరణాగతి పొందితే తప్ప ఈ మాయ దాటే దారే లేదు)

## 2-28

### మున్నుడి

'భజన' రూపంలో పరదేవతగ, శ్రీరామునిగ, శ్రీకృష్ణునిగ, నరసింహునిగా భావిస్తూ శ్రీవేంకటేశ్వరునిపై అన్నమయ్య ఎన్నో కీర్తనలు రచించారు. అటువంటి భజనలన్నీ జనబాహుళ్యంలో మిక్కుటమైన ఆదరణ పొందినవే. ఈ కీర్తన కూడా ఆ కోవలోనిదే. సంస్కృతం మూలం అయినప్పటికీ ఇందులో ప్రతిపదార్థం ఎవరించవలసిన అవసరం వున్న పదములు లేవు. కొసమెరుపుయేమిటంటే శ్రీ వేంకటేశ్వరుని ' నాకజనననుత నమో నమో' అన్నారు. నాకములో (స్వర్గంలో) జన్మించినవారిచేనుతుడు అంటే దేవతలచే కీర్తించబడు తిరుమలేశుడు.

**కం॥ నవనీత చోరు గృష్ణుని**
**వివరముగా కొలిచె తాను వేంకటపతిగా**
**కవి అన్నమయ్య, వినుడీ**
**దివిజేంద్రనుతుండటంచు దీటుగతెలిపెన్.**

**రాగం : ఝంఝూటి**

నవనీతచోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో ॥నవనీత॥

హరి నారాయణ కేశవాచ్యుత కృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నర నారాయణ రూప నమో నమో ॥నవనీత॥

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక-
నగరాధినాయకా నమో నమో ॥నవనీత॥





వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీవేంకటేశ్వర
నాకజనన నుత నమో నమో ॥నవనీత॥

**భావామృతం :**

'వెన్నదొంగ' అని వేనోళ్ళ కీర్తించబడిన ఓ శ్రీకృష్ణా! నీకు నమస్కరించుచున్నాను. క్రొత్తక్రొత్త మహిమలు ఆర్ణవము (సముద్రం) పరిమాణంలో గల మహానుభావా! నీకు నమస్కరించుచున్నాను.

సర్వపాపములను హరించు శ్రీమన్నారాయణా! కేశవా! అచ్యుతా! శ్రీ కృష్ణా! నృసింహా! వామనా! నీకు నమస్కరించుచున్నాను. ముర అనుదానవుని మట్టుబెట్టిన స్వామీ! పద్మనాభా! ముకుందా! గోవిందా! నరనారాయణుడవై వంతుల ప్రకారం వేయి సంవత్సరాల యుద్ధంలో సహస్రకవచుడను రాక్షసుని (ఆఖరివంతుగా నరుడైన అర్జునుని చేతిలో నారాయణుడైన కృష్ణుని వ్యూహంతో సహస్రకవచుడే కర్ణుడై కవచంతో పుట్టికూడ మరణించాడు) వధించిన ప్రభూ! నీకు నమస్కరించుచున్నాను.

వేదములచే గోచరింపబడు విష్ణుమూర్తీ! ఓ పద్మనయనా! వాసుదేవా! గోవర్ధనధారీ! నందనందనా! నీకు నమస్కరించుచున్నాను. సత్త్వరజస్తమోగుణములకు అతీతుడా! త్రిభువన నాయకుడవైన త్రివిక్రమా! ద్వారకానగరాధినాథా! నీకు నమస్కరించుచున్నాను.

ఓ వైకుంఠవాసా! రుక్మిణీ వల్లభా! దేవేంద్ర సన్నుతా! నీకు నమస్కరించుచున్నాను. అష్టైశ్వర్యములను ప్రసాదించు ఓశ్రీవేంకటేశ్వరా! సద్గుణకలాపా! స్వర్గములో జన్మించిన దేవతలచేతనుతించబడు ఓ దేవదేవా! నీకు భక్తితో శరణాగతితో వినమ్రుడనై నమస్కరించుచున్నాను.

## 2-29

### మున్నుడి

నాట్యగతికి అనుగుణంగా, ఒక నర్తకి నృత్యం చేస్తుంటే చెప్పిన కీర్తన ఇది. కొన్నిరోజులు 'సాళ్వనరసింహరాయల' సంస్థానంలో వున్న అన్నమాచార్యులవారు 'బహుశా' ఒక నర్తకి నాట్యానికి అనుగుణంగా చెప్పిన కీర్తన అయివుంటుంది. ఇది కూడా అలమేల్మంగమ్మ తిరుమలనాథుని మురిపిస్తూ నృత్యం చేస్తున్నట్లు భావించి ఆమెనుద్దేశించి ఆచార్యులవారు పాడినట్లు తలపిస్తున్నది. తిరో తిరో, ధిమి ధిమ్మి, తిత్తి తిత్తి, మమారే.... వంటి పదాలకు వేరే అర్థంలేదు. అట్లావుంటే, మజ్జా మాజ్జా... అంటే నేటికాలంలో 'శహబాష్'.... అన్నమాట.

**ఆ.వె॥ తాళగతులపాడి తాళ్లపాకన్నయ్య**
**నృత్యగీతమిట్లు నేర్పినారు**
**మంగనృత్యగతులు మాధవున్ మురిపించు**
**తారహారమదిరి తళుకులెగయ.**

### రాగం : గంభీరనాట

తిరో తిరో జవరాల తిత్తి తిత్తి ఈ
తలలమైన నీ తారహార మదిరే ॥తిరో తిరో॥

ధిమి ధిమ్మి తోంగతోంగ దిద్ధిమిక్కి ఆరే
మమారే పాత్రారావు మజ్జా మజ్జా
కమలనాభుని తమకపుటింతి నీకు
అమరె తీరుపు ఇదె అవధరించగదో ॥తిరో తిరో॥

ఝుక జక్క జంఝుం ఝుణకిణాని
ప్రకటపు మురువొప్పెత భళా భళా
సకల పతికి సరసపు కొమ్మ నీ
మొకసిరి మెరసె చిమ్ముల మురిపెముల ॥తిరో తిరో॥





మాయిమాయి అలమేలు మంగనాచ్చారి
బాయని వేంకటపతి పట్టపురాణి
మ్రోయ చిరుగజ్జెల నీమాతలానేని
సోయగమైన నీ సొలపు చూపమరె ॥తిరో తిరో॥

### భావామృతం :

ఓ జవ్వనీ! నృత్యానికి అనుగుణంగా తిరుగు. అట్లు నీవు నర్తించుచున్నప్పుడు నీ మెడలోని తారహారములు తళుకులీనుచు అదిరిపడుచున్నవి. (కదలిపోవుచున్నవి) తిరో తిరో....తిత్తి తిత్తి ఈ.

పద్మనాభుడైన శ్రీమన్నారాయణుని మైమరపించు భామినీ! ఆ నృత్యగీతమునకు సమమగునట్లు (తీరుపు) నీ హావభావములన్నియు అమరియున్నవి. ఇదిగో నీవు ఇక సావధానురాలవై సిద్ధముగానుండుము. ధిమి ధిమ్మి, తోంగ తోంగ,దిద్ధిమిక్కి, ఆరే...మమ్మారే... పాత్రకనుగుణంగా వున్నది సెబాసూ! సెబాసూ!

సకలమునకు, సర్వమునకు అధినాథుడైన జగన్నాధుని ప్రియరాలా! నీ ముఖశోభ మెరిసిపోవుచున్నది. నీ నడకలలో కులుకులు (మురిపెములు) విరజిమ్మబడుచున్నవి. ఇక ఝుక జక్క, జంఝుం, ఝుణకిణా- అని ప్రస్ఫుటమైన నీ సౌందర్యము (మురువు) వెలయుచున్నది. భళా! భళా!

ఓ అలమేలుమంగ నాంచారీ! మఱుగు. (దాచివుంచు తల్లీ!) ఎల్లప్పుడు అనుసరించియేయుండే శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణివి. మ్రోగుచున్న నీ చిరు గజ్జెలు చేయుమంజులమైన సవ్వడులు పారవశ్యముతో కూడిన నీ చూపులతో కలసి ఇంకా మనోహరమై చూపట్టుచున్నవి.

## 2-30

## మున్నుడి

గోవిందరాజస్వామిని సేవిస్తూ అన్నమాచార్యులు వారు చెప్పిన మధుర సంకీర్తన ఇది. ఆ వర్ణన చూస్తుంటే స్వామి ఎదురుగా వున్నట్లే అనిపిస్తుంది. కీర్తనలో 'ఉలిపచ్చి నవ్వులు' అల్పమైన మొలక నవ్వు అని అర్థం. అంటే సన్నని చిరునవ్వులు. అంటే కనిపించీ కనిపించని చిరునవ్వు. ఈ పదాలు ఆచార్యులవారి కెలావస్తాయో అబ్బురమే! 'వలకేల కొప్పు' అంటే ఏమిటో ఇద మిద్ధంగా ఏ నిఘంటువులోను నాకు దొరకలేదు. మనోహరమైన వుంగరాల జుట్టు (వలలాగ కనిపిస్తుంది కదా!) వున్నకొప్పు అని భావించాను.

**కం॥ గోవిందరాజు గొల్వగ**
**ఈ విధినా అన్నమయ్య యింపుగ పాడెన్**
**సేవించి తలచె వరదుడు**
**శ్రీ వేంకటే విభుడటంచు జెప్పెను కృతులన్.**

**రాగం : సింధుభైరవి**

కొమ్మలాల యెంతవాడె గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు ॥కొమ్మలాల॥

ఉలిపచ్చి నవ్వులతో ఒత్తిగిలి పవళించి
కొలువు సేయించుకొనీ గోవిందరాజు
జలజాక్ష, లిద్దరును సరిపాదాలొత్తగాను
కొలదిమీరమెచ్చీనీ గోవిందరాజు ॥కొమ్మలాల॥

అదెనాభికమలాన అజునిపుట్టించి తాను
కొదలేకవున్నవాడు గోవిందరాజు
చెదరక తన వద్ద సేవసేసే సతులకు
గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు ॥కొమ్మలాల॥





ఒప్పుగా వామకరము ఒగిచాచి వలకేల
కొప్పు కడునెత్తినాడు గోవిందరాజు
ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిరవై శంఖుచక్రాలు
కుప్పె కటారము(లు) బట్టె గోవిందరాజు ॥కొమ్మలాల॥

**భావామృతం :**

ఓ యువతుల్లారా! (వూరేగింపులో వున్న సాటి స్త్రీలతో అన్నమయ్య తానూ ఒకర్తెగా భావించి పాడుతున్నారు) ఈ గోవిందరాజస్వామి ఎంతటివాడో చూశారా. ఈయన తన రాచఠీవినంతా కుమ్మరించి మనపై కురిపిస్తున్నాడు. ఎంత మనోహరుడు ఈ గోవిందరాజు.

ఈ స్వామి సన్నని లేతమొలక నవ్వులు చూడండి. ఎంత సొగసుగానున్నాయో! ఒత్తిగిలి పవళించిన ఈయన విరాజమానుడై కొలవుదీరియున్నాడు. పద్మములవంటి కన్నులు గల శ్రీదేవి, భూదేవి ఆయనకు చక్కగా పాదములొత్తుచున్నారు. వారిని ఈయన పరిపూర్ణమైన అనుగ్రహంతో మెచ్చుకొంటున్నాడు. (ఎంత చక్కటి భావన!!)

అదిగో చూడండి ఈ మహానుభావుడు తన నాభిలోంచి పుట్టిన పద్మములో పుట్టుకలేని బ్రహ్మదేవుని పుట్టించి ఈ జగద్రచనకు కారణభూతుడైన ఆదిమూర్తి. ఈయనకు కొదవ అనేది వుంటుందా? లేనేలేదు. తనకు సేవచేయుచున్న భార్యలిద్దరినీ (లక్ష్మీదేవి, భూదేవి) అతిశయించిన వలపులలో ముంచెత్తుతున్నాడు ఈ గోవిందరాజస్వామి.

ఈయన తన ఎడమ చేతిని ఒక విధముగా (సుకుమారంగా కనుపించే దృఢమైనచేయి) చాచియుంచాడు. ఈ గోవిందరాజస్వామి నడినెత్తి మీద వుంగరాల జుట్టు కొప్పువలె బిగించబడి ఎత్తి వుండి 'వల' తీరుగా కనిపించుచున్నది. ఇప్పుడు ఈయనే ఆ వేంకటాద్రి సంస్థానాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని వలె భాసిల్లుచున్నాడు. శంఖ, చక్రములను, విచ్చుకత్తిని ధరించిన ఈ గోవిందరాజస్వామిని చూచి, సేవించి, ధన్యులై తరించండి.

## 2-31

### మున్నుడి

'చిత్తశుద్ధిలేని శివపూజలేలరా' అని యోగివేమన అభిప్రాయం ప్రతిఫలించే అన్నమయ్య సంకీర్తన నాస్వాదించండి. 'ఇందుగలడందులేడను సందేహమే వలదన్న' పోతనగారి భావాలూ తొంగిచూస్తున్నాయి.'బంగారమూ మట్టిముద్దా సమానంగా చూడాలనే' గీతా వాక్యమూ తోయజాక్షుడు శ్రీకృష్ణభగవానుని బోధా ద్యోతకమవుతున్నది. 'అంతయు నీవే హరిపుండరీకాక్ష' అని అన్నమాచార్యుల వారూ ఎన్నోసార్లు కీర్తించారు. ఇది చదివాకనైనా పూజ అంటే ఏమిటో తెలిసి స్వామిని సేవిద్దాం.

**ముత్తకోకిల॥**

**పూజయేదియొ అన్నమాచార్యుడు పూని తావివరించెరా**
**పూజ జేసిన గాదురా మరి పూలు బుట్టెడు తెచ్చియున్**
**ఈ జగంబులనేలు నాధుడు యెవ్వడా 'మలయప్పయే'**
**ఏజంపంబులు వద్దురా మదినెంచి నిల్పుము చాలదా!!**

**రాగం : బౌళి**

నిండు మనసే-నీ పూజ
అండగోరకుండు- టదియు నీ పూజ ॥నిండు॥

ఇందు హరి గల దందు లేడనేటి
నిందకు బాయుటే- నీ పూజ
కొందరు చుట్టాలు-కొందరుపగనే
అందదుకు మాను-టదియె నీ పూజ ॥నిండు॥

తిట్లులు గొన్నని-దీవెన గొంతని
నెట్టుకోనిదే-నీ పూజ
పెట్టిన బంగారు- పెంకును నినుమును
అట్టే సరియను -టదియు నీ పూజ ॥నిండు॥





సర్వము నీ పని-స్వతంత్ర ముడిగి
నిర్వహించుటే- నీ పూజ
పర్వి శ్రీవేంకట- పతి నీ దాసు ల
పూర్వ మనియెడి- బుద్ధి నీ పూజ ॥నిండు॥

**భావామృతం :**

పరిపూర్ణమైన మనస్సును పరమాత్ముడవైన నీ కర్పించుటయే నీకు నిజమైన పూజ. మానవమాత్రులైన రాజులనో, ధనవంతులనో ఆశ్రయించి వారి అండదండలు కొరుకొనకుండుటయే నీ నిజమైన పూజ.

శ్రీ హరి ఇక్కడున్నాడు అక్కడలేడు అను చెడుమాటలకు తావివ్వకుండుటయే నీ శ్రేష్టమైన పూజ. మానవులలో కొందరు నాబంధువులు కొందరు పగవారు అనే అందదుకు (మిక్కిలి బేధ భావము) లేకుండుటయే నీ నిజమైన పూజ.

పరులమాటలలో కొన్ని నిందలని , కొన్ని దీవెనలని వాటిని బట్టి వికారముల నొందకయుండుటయే నీ పూజ. పెన్నిధియైన బంగారము, మట్టిపెంకు, ఇనుపముక్క మొదలైన వన్నియును సమానమైన విలువగలవానిగా తలంచి వాటిపై ఏ విధమైన వ్యామోహములకు లోను కాకుండుటయే నీ పూజ.

ఏ పని చేసినా సర్వమూ నీవే అనే భావనతో నీ వలననే జరుగుతున్నవనే యోచనతో, తాను స్వతంత్రించక నీ దాసునిగా సర్వమూ నిర్వహించుటయే నీ అత్యుత్తమమైన పూజ. సర్వమూ తానే అయిన ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసులు అపురూపమైనవారు అనునట్టి బుద్ధిని సదాకలిగియుండులయే నీ నిజమైన పూజ.

## మున్నుడి

అన్నమయ్య సరసశృంగార కీర్తన విని పులకించని రసికులుండరేమో!! అమలిన శృంగారం ఆచార్యుల వారి ప్రత్యేకత. కృష్ణుని లీలలు ఎంతవినినా తనివితీరని భక్తులు మెచ్చే కీర్తన ఇది. గోపికలు ఏ విధంగా శరణు అన్నారో వివరిస్తున్నారు. నవీన'తెలుగు' పిల్లలకు అర్థం కాకపోయినా 'ముఖారి' రాగం ఆ 'లోటు' తీర్చి మురిపిస్తుంది. సాధ్యమైనంత నర్మగర్భంగా వివరించడానికి నేను ప్రయత్నంచేసినట్లు తెలుస్తూనే వున్నది.

**చం॥ పిరుదులు దాటు కేశములె బేలల మానము గప్పు, నవ్వుచున్**
**మురహరి సిగ్గు దోచెనని ముద్దుల 'గున్యుచు' మ్రొక్కిరంచు తాన్**
**నిరుపమమైన కీర్తనము నీటుగ జెప్పెను అన్నమయ్యయున్**
**సరసుడు వేంకటేశ్వరుడె సారస నేత్రుడు కృష్ణుడంచనెన్.**

**రాగం : ముఖారి**

కొలనిలోన మును గోపికలు
మొలక నవ్వులతో మ్రొక్కిరి నీకు ॥కొలనిలోన॥

పిరుదులు దాటిన పించపు టలకల
తురుములు వీడగ దొయ్యలులు
అరిది నితంబము లందునె దారుక
మురిపెపు గరముల మ్రొక్కిరి నీకు ॥కొలనిలోన॥

నిద్దపు మానము నెలతలు లోగుచు
గద్దరి తొడలనె కట్టుచును
ముద్దుటుంగరంబుల కరములతో
ముద్దుల గునియుచు మ్రొక్కిరి నీకు ॥కొలనిలోన॥





పాలిండ్ల పెను భారంబుల కర-
మూలపు మెఱుగులు ముంచగను
వేలపుబ్రియముల వేంకటేశనిను
మూలకు బిలుచుచు మొక్కిరి నీకు. ॥కొలనిలోన॥

**భావామృతం :**

పూర్వం రేపల్లెలోని కొలనులో గోపికలు (వస్త్రాపహారివైన నిన్ను చూచి) చిరునవ్వులు ఒలికిస్తూ నీకు మ్రొక్కిరి. (వారికి నీ లీల ఆనందాన్నే ఇచ్చి ఉండాలి కదా!)

పిరుదులు దాటిన కేశపాశములలోని నిడుపైన వెంట్రుకలు విడిపోగా ఆ రమణులు వాటితోనే పట్ట నశక్యమైన తమ పిరుదులను ఎట్లో కప్పుకొని నీకు నమస్కరించిరి.

(ఓ శ్రీకృష్ణా! మానవుల మానాపహరణ చేసి వారి అభిమానాన్నే హరించే నీ కంటే 'ఉపకారి' జీవులకెవరుంటారు?)

నునుపాటి మానమును ఏదో విధంగా లోగుట్లుగా వుంచే విశ్వప్రయత్నంచేస్తూ ముద్దరాండ్రు దిట్టమైన తమ తొడల మరుగునందుంచే ప్రయత్నంలో ముద్దుటుంగరములు వ్రేళ్ళలపై మిలమిలలాడుచుండగా, ముద్దులొలికే తమ కులుకులు ఒలికిస్తు (కృష్ణా! మమ్మల్ని ఏడిపించకు అని) నీకు మ్రొక్కుకొన్నారు.

చేతులెత్తి నీకు నమస్కరించి నప్పుడు ఓ నల్లనయ్యా! వారి కరమూలముల కాంతులు భారమైన పయోధరములను ముంచెత్తి కొంతమరుగు ప్రసాదించినవి. వేంకటేశ్వరుని రూపమున కనువిందుజేస్తున్న నాటి మనోహరా! మిక్కుటమైన ప్రేమలు దాచలేక వారంతా నిన్ను కాస్తమూలకు రావయ్యా మహాప్రభో! అని నీకు చేతులెత్తి మ్రొక్కినారు.

## 2-33

### మున్నుడి

ఏ కోరికా, వికారము, ఏ సంగత్వము లేని సర్వస్థితుడు భగవంతుడు. ఆయనేపరమాత్మ. ఆయన లీలా వినోదం కోసం నిరాపేక్షతో సృష్టిని చేసి, రక్షించి తనే అంతం చేస్తూ వినోదిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో జీవులను సృషించుటకు తన 'అంశ' నే వినియోగిస్తున్నాడు. ఆయన నుంచి ఉద్భవించిన జీవులందరూ ఆయనే కదా! అందుకనే జీవాత్మే పరమాత్మ. అయితే తన వినోదం కోసం ఒక 'మాయ'ను సృష్టించి దాని పెత్తనంలో జీవికి కోరికను కల్పించాడు. దానిమూలంగా కలిగే వికారాలను సృషించి జీవికి అంటగట్టాడు. బంధాలు, సుఖదుఃఖాలు, రాగద్వేషాలు కల సంసారం అనే మహాసముద్రంలో పడవేసి జీవిదాన్ని ఈదలేక తిప్పలు పడుతుంటే ఇట్లాంటి స్థితిలో కూడ ఈ జీవి తనని కోరితే అనుగ్రహిస్తాడు. లేని వారికి జన్మల తిప్పలు తప్పవు. ఈ జన్మలచక్రంలో తన అనుగ్రహం ప్రకారం కొందరిని ఎంతో ఉన్నతమైన దేవతలుగా, కొందరిని మధ్యములైన మానవులుగా, కొందరిని అధములైన దానవులుగా, భూమిపై కొందరిని పశుపక్ష్యాది జంతువులుగా, కొందరిని వృక్షాలుగా చేసి వీళ్ళందరికీ వారి వారి జీవితకాలంలో కలిగే కొరికల్ని వారి అర్హతల ప్రకారం తీరుస్తున్నాడు. దేవతలంతా ఆయన స్నేహంతో బ్రతకాలని కోరుకుంటే వాళ్ళని గోపకులంలో పుట్టించి వారి కోరికలన్నీ తను కృష్ణుడై తీర్చాడు. కొందరికి తనకు పాలిచ్చే భాగ్యం, కొందరికి స్నేహం, కొందరికి యుద్ధం, కొందరికి తను శిష్యుడుయ్యే భాగ్యమిచ్చాడు. ఎనిమిది మందికి తనకి భార్యలయ్యే భాగ్యమిచ్చాడు. పదహారు వేలమంది రాచకన్నెలకు తను ' భర్త' అయ్యాడు. కుబ్జకు తన బిడ్డతల్లే కావాలంటే బిడ్డనే ఇచ్చాడు. పెళ్ళి ఆవి అడగలేదు, ఈయన ఇవ్వలేదు. గోపికలలో కొందరికి తనతో ఆడి పాడే అదృష్టమిచ్చాడు. కొందరిని బొమ్మలపెళ్ళి చేసుకున్నాడు. అలాంటి మూడు పెళ్ళిళ్ళు వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో.

**ఉ॥ ఈడుగుపెండ్లి చేసెదము ఇద్దరినంచని గోకులంబులో**
**కూడగ భామలందరును కొంటెదనంబుల కృష్ణమూర్తి ఆ**
**చేడెల లోన ముప్పురిని 'చిత్రము' గాతను పెండ్లి యాడుటన్**
**పాడెను అన్నమయ్య తన భావన 'కొండలరాయు' నెంచుచున్.**





**రాగం : మధ్యమావతి**

ఈడగుపెండ్లి ఇద్దరి జేసేము
చేడెలాల ఇది చెప్పెరుగా ॥ఈడుగా॥

పచ్చిక బయళ్ళ పడతి యాడగా
ముచ్చట కృష్ణుడు మోహించి
(వి) వెచ్చపు పూదండ వేసి వచ్చెనట
గచ్చుల నాతిని కానరుగా ॥ఈడుగా॥

ముత్తైపు ముంగిట ముదిత నడవగా
ఉత్తముడే చెలి వురమునను
చిత్తరువు వ్రాసి చెలగివచ్చె నౌళ-
జొత్తుమాని ఇటు చూపరుగా ॥ఈడుగా॥

కొత్త చవికెలో కొమ్మ నిలిచితే
పోత్తున తలబాలు వోసునట
ఇత్తల శ్రీ వేంకటేశుడు నవ్వుచు
హత్తి సతిగూడె నని పాడరుగా ॥ఈడగు॥

**భావామృతం :**

ఓ భామలారా! ఇక్కడ ఈడూజోడూ కుదిరిన పెండ్లిని చేసెదము. ఇది మీరింకెవ్వరికీ చెప్పరుకదా!

పచ్చని పచ్చిక బయళ్ళలో గోపిక ముచ్చటగా ఆడుతుంటే ఆ కొంటె కృష్ణుడు మోహించి, విరిసిన పూలదండను ఆమె మెళ్ళో వేసి వచ్చాడట. అతని మాయలమారి వేషాలు చూశారా. (ఇది ఒకరకం పెండ్లే కదా!)

ముత్యాలు పరచిన తన ముంగిటలో ఒక కన్నెపిల్ల నడచి వస్తుంటే పురుషోత్తముడైన ఆ కృష్ణయ్య ఆ అమ్మాయి గుండెల మీద తన బొమ్మ చేత్తో వ్రాసి వచ్చాడట. అవ్వ!! ఈ రహస్యం దాచుకోకుండా మీరు అందరికీ ఆ నోట ఈ నోట చెప్పి చూపించరు కదా! (ఇదీ ఒక రకం పెండ్లి కాక మరేమిటి?)

కొత్తగా వేసిన పందిరి క్రింద ఒక అమ్మాయి నిలుచుని వుంటే ఈ కొంటె కృష్ణమూర్తి చెలిమితో ఆమె తలపై తలంబ్రాలు పోశాడట. మరి అది పెండ్లి కాదా? ఈ ప్రకారం శ్రీవేంకటేశ్వరుడే ఆ కోణంగి కృష్ణుడై నవ్వుతూ ఒత్తుకొని తన భామని కూడెనని మీరంతా పాడరు కదా!

**2-34**

## మున్నుడి

అన్నమాచార్యుల వారు ఈ కీర్తనలో తనను రామదూత హనుమగా 'భావించి', శ్రీవేంకట రఘువీరునికి సీతవృత్తాంతము నెరింగించి, నీవు ఇచ్చిన 'ముద్రవుంగరము' (ముద్దుటుంగరం కాదు), స్వీకరించవయ్యా అని 'రామక్రియ' రాగంలో రఘరాముని యొక్క 'రామ' (నారి) గురించి అద్భుతంగా పాడుతున్నారు. దశరథ తనయునికి దశశిరుని (రావణుని) తలలనుత్తరించి దక్షిణదిశనున్న ధరణీనందనను కాచి దశదిశలలా కీర్తినొందమని చెబుతున్నారు.

**మ॥ ఘనుడౌపావని నావహించుక మదిన్ గానంబు తానీవిధిన్**
**వినిపించెన్ మన తాళ్ళపాక గురువా వీరాగ్రణిన్ గొల్చుచున్**
**వనజాక్షున్ తిరువేంకటేశ్వరుని శ్రీవత్సాంక సంభూషితున్**
**తన రామయ్యగ నెంచి మాత తను సందర్శించుటన్ జెప్పెరా.**

**రాగం : రామక్రియ**

ఇదె శిరసుమాణిక్యమిచ్చి పంపె నీకు నాకె
అదనెఱిగి తెచ్చితి నవధరించవయ్యా ॥ఇదె శిరసు॥

రామ నిను బాసి నీరామ నే చూడగ నా-
రామమున నిను పాడె రామరామ యనుచు
ఆ మెలుత సీతయని యపుడు నే తెలిసి
నీ ముద్ర వుంగరము నే నిచ్చితిని ॥ఇదె శిరసు॥

కమలాప్తకులుడ నీ కమలాక్షి నీ పాద
కమలములు తలపోసి కమలారి దూరె
నెమకి యాలేమను నే నీదేవి యని తెలిసి
అమరంగ నీ సేమమటు వినిపించితిని ॥ఇదె శిరసు॥





దశరథాత్మజ నీవు దశశిరుని జంపి యా-
దశనున్న చెలిగావు దశదిశలు పొగడ
రసికుడ శ్రీ వేంకట రఘువీరుడ నీవు
శశిముఖి చేకొంటివి చక్కనాయె పనులు ॥ఇదె శిరసు॥

**భావామృతం :**

ఓ శ్రీరామచంద్రా! ఇదిగో ఆ సీతమ్మతన తలలో ధరించిన మాణిక్యమును (చూడామణి) నాకు ఇచ్చి నీ కిమ్మంటే, సమయం చూచి (రాక్షస స్త్రీలు చూడకుండా) దానిని తెచ్చాను. స్వీకరింపుము ప్రభూ!

శ్రీరామా! నీకు దూరమైన నీ నారి (రామ) ని నేను చూచినప్పుడు ఆ వనములో (రామములో) రామ రామయనుచు నీ నామ సంకీర్తనమే నిరంతరము చేయుచుండినది. అప్పుడు నాకు (తరుణి) తప్పక నీ సీత అయివుంటుందని అనిపించి, తెలుసుకొని శ్రీరామముద్ర వున్న నీ వుంగరమును నీ ఆనవాలుగా ఆమెకు ఇచ్చాను ప్రభూ!

ఓ సూర్యవంశజుడా! పద్మనయన అయిన నీ సీత నీ చరణాంబుజములనే తలపోసి కమలములకు శత్రువయిన చంద్రుని నిందించుచున్నది (తన విరహ బాధను పెంచుతున్నాడని). అటువంటి ఆ దేవిని వెదకి నేను అశోకవనములోనున్న ఆమె నీ భార్యగా గుర్తించి సిద్ధమై నీక్షేమ సమాచారమును ఆమెకు విశదీకరించాను.

ఓ దశరథ కుమారా! నీవు పదితలలున్న ఆ దక్షిణదిశ వాసిని సంహరించి, నీ సీతను కాపాడుము. దశ దిశలా నీ కీర్తిని నిలుపుము. అట్లే, రసికాగ్రణివైన ఓ వేంకట రఘువీరా! నీవు ఆ తరువాత చంద్రవదనయైన సీతమ్మను స్వీకరించగా కార్యములన్నియును సిద్ధించినవి.

**2-35**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ సంస్కృత కీర్తనము అమృతసేవనమే అని నా భావన. ప్రతి కీర్తనలో వలెనే ఇందులో కూడా కొరుకుడు పడని రెండు మాటలున్నాయి. 'బృందారకాధీశు' దంటే దేవతల అధినాధుడైన ఇంద్రుడు అని అర్థం. అట్లాగే 'కరపురనాథ సంరక్షణే తత్పరం' అంటే శ్రీనివాసునిగా తన మామగారికి వాగ్దానం చేసిన ప్రకారం కరిపుర ఏలికను కాపాడతానని చినమామగారు తొండమానుని, తన బావమరిదిని సదా సంరక్షించు దీక్షగల స్వామి. అన్నమయ్య అద్భుతసృష్టి ఇది.

**కం॥ బృందారకాధినాధుడు**
**వందనములు సేసిగొల్చు వసుదేవసుతున్**
**సుందరముగ 'గీర్వాణి'ని**
**అందంబుగ అన్నమయ్య హరి గీర్తించెన్.**

**రాగం : శ్రీరాగం**

వందే వాసుదేవం శ్రీపతిం
బృందారకాధీశ వందితపదాబ్జం ॥వందే॥

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ-
చందనాంకిత లసచ్చారుదేహం
మందారమాలికా మకుట సంశోభితం
కందర్పజనక మరవిందనాభం ॥వందే॥

ధగధగిత కౌస్తుభాధరణ వక్షస్థలం
ఖగరాజవాహనం కమలనయనం
నిగమాధి సేవితం నిజరూపశేషప-
న్నగరాజ శాయినం ఘననివాసం ॥వందే॥





కరిపురనాథ సంరక్షణే తత్పరం
కరిరాజవరద సంగత కరాబ్జం
సరసీరుహాననం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచలాదేవం భజే ॥వందే॥

**భావామృతం :**

ఓ వాసుదేవా! నీకు వందనమాచరించెదను. ఓ లక్ష్మీపతీ! నిన్ను కీర్తించెదను. సురేంద్రుడైన వాసవునిచే కొలువబడు పాదపద్మములు గల ఓ దేవా నీకు భక్తితో నమస్కరించు చున్నాను.

మెరిసిపోవు నల్ల కలువ వంటి దేహచ్ఛాయ గల స్వామీ! ఇందిరాదేవి కుచగిరుల నలంకరించిన చందనముచే యేర్పడిన గుర్తులచే ప్రకాశించు సుందరమైన శరీరంగల రమణుడవు. మందారపుష్పమాలలచే చేయబడిన కిరీటముచే బాగుగా శోభిల్లు దేవదేవుడవు మన్మధుని జనకుడవు. (అతని కంటే సుందరుడవని వేరే చెప్పాలా?) చతుర్ముఖ బ్రహ్మ నివాసమైన పద్మము నాభిలోనున్న వాడవు. అట్టి నీకు నేను భక్తితో నమస్కరించుచున్నాను.

వక్షస్థలమున కౌస్తుభమణి ధగధగలాడునట్లు ధరించుస్వామిమి. పక్షీంద్రుడైన గరుత్మంతుని వాహనముగా స్వీకరించినవాడవు. పద్మదళముల వంటి కన్నులు గలవాడవు. వేదములచే బాగుగా కీర్తించబడువాడవు. నిరాకార నిరంజనుడవైననూ నీ ఆశ్రితులు నిన్ను సేవించుటకు నిజరూపము ధరించి ఆదిశేషుని తల్పముగా చేసికొని శయనించు శేషశాయివి. ఘనమైన వైకుంఠము నివాసముగా కలవాడవు.

కరిపురాధీశుని కాపాడుతానని వాగ్దానం చేసి తనశంఖచక్రాలతోనే ప్రత్యక్షంగా పోరాడిన దీక్షాదక్షుడవు. గజేంద్రుని కాపాడుట కాయత్తమైన కరకమలములు గల దేవుడవు. పద్మముఖుడవు. సుదర్శన చక్రముతో దేదీప్యమానంగా ప్రకాశించువాడవు. తిరుమలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుడవు. ఓ మహానుభావా! అట్టి నిన్ను నేను భజించెదను గాక!

## 2-36

### మున్నుడి

గరుడాచలమున (అహోబలమున) వెలసిన నరసింహస్వామి, వేంకటేశ్వరుడే అని భావించి అన్నమాచార్యులవారు ఎన్నో మధురసంకీర్తనలు పాడారు. ఇలవేలుపైన ఆ నృసింహుని కీర్తనలు జనబాహుళ్యంలో గొప్పఆదరణను కూడా పొందాయి. 'అరుదుగా' అనే పదాన్ని నేటికాలంలో మనం 'అప్పుడప్పుడు' అనే భావనతో వుపయోగిస్తాం. కానీ 'అరుదుగా' అంటే 'అత్యద్భుతంగా' అని అర్థం. నృసింహుడు అరుదుగా కాచే అనంతుడు అన్నారు ఆచార్యులవారు. అవధరించండి...

**ఆ.వె॥కంటిమితనినేడె గరుడాచలంబున**
**ఇంటివేయిపయిన ఈశ్వరుడిని**
**పనిచి అన్నమయ్య ప్రహ్లాదవరదుని**
**వేంకటేశుడనుచు వినుతిజేసె.**

**రాగం : శుద్ధధన్యాసి**

కంటిమి నేడిదె గరుడా చలమున
యింటి వేలుపగు యీశ్వరుడితడు. ॥కంటిమి॥

శ్రీనరసింహుడు చిన్మయ కాంతుడు
దానవాంతకుడు దయానిధి
నానామహిమల నమ్మిన వారిని
వూనక కాచే పోషకుడితడు ॥కంటిమి॥

దేవాదిదేవుడు దినకరతేజుడు
జీవాంతరంగుడుశ్రీవిభుడు
దైవ శిఖామణి తలచినవారికి
సేవలుగొనికాచే విభుడితడు ॥కంటిమి॥





పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుడు
కరుణానిధి బుధకల్పము
పరగు శ్రీవేంకటపతి తనదాసుల-
నరుదుగ కాచే అనంతుడితడు. ॥కంటిమి॥

**భావామృతం :**

నేడు ఈ గరుడాద్రిపై అహోబల నరసింహస్వామిని చూచుచున్నాము. ఈ నృసింహుడు మనందరికి ఇలవేలుపు. మనల్నిరక్షించే సర్వేశ్వరుడు ఈ మహానుభావుడే.

ఈ శ్రీనృసింహుడు చిన్మయమూర్తి అయిన ప్రభువు. ఈయన దానవులను మట్టుబెట్టుటకై అవతరించిన దయాసముద్రుడ.తననే నమ్ముకొని 'అన్యధాశరణంనాస్తి' అని శరణు వేడినవారిని రకరకములైన మహిమలను చూపి, పూనుకొని రక్షించే సర్వజన పోషకుడు. (ఈ స్వామిని ఆశ్రయించండి)

ఈ నృసింహుడు దేవతలందరికీ ఆరాధ్యదైవం. సూర్యకాంతితో వెలుగులు విరజిమ్మే తేజోమూర్తి. జీవులందరికీ అంతరాత్మగానున్నవాడు ఈ లక్ష్మీకాంతుడే. దేవతలందరికీ ఈయన శిరోమణివలె ప్రసిద్ధిజెందియున్నాడు. తననే ధ్యానించువారిని, సేవించువారిని కాపాడే వాడే ఈ జగన్నాధుడు. (ఈ మహానుభావుని ఆర్తితో వేడుకోండి)

ప్రహ్లాదుని రక్షించుటకే అవతరించిన ఈ దివ్యమూర్తి పరమమొసగుమూర్తి. ఈయన కరుణానిధి. జ్ఞానమూర్తులయిన పండితులకు ఈ స్వామి కల్పవృక్షము వంటివాడు. ఈయనే తిరుమల కొండపై శోభిల్లు శ్రీవేంకటేశ్వరుడు కూడా. ఈయన తనకు దాసులైన తన భక్తులను అత్యద్భుతముగా కాపాడు అనంతుడు (ఎన్నటికీ అంతము లేని వాడు) ఈయనను శరణని తరించండి.

## 2-37

### మున్నుడి

వైష్ణవుడై యుండట మంటే పెద్ద పెద్ద పంగనామాలు ధరించి శంఖుచక్రాలు భుజకీర్తులుగా ధరించి మడీదడీ అని ఆచారం పాటించి ఏవేవో మంత్రాలు చదివి పూజలు చేయటంకాదు అంటున్నారు అన్నమాచార్యులవారు. మతము మనోనిగ్రహానికి రాచబాటకావాలి కానీ ఏవేవో ఆచారాలు మాత్రమే అవసరం అని చేప్పేనిరంకుశం కాకూడదు. నాడు గీతాచార్యుడు చెప్పిన ధర్మం వదలివేసి ఏవేవో ధర్మాల వెంటబడితే ప్రయోజనం శూన్యం. ఈ చెవితో విని ఆచెవితో వదిలేయక వినండి మరి...

**చం॥ ఘనమగు వైష్ణవం బనగ కాదుర యొక్కమతంబు మాత్రమే**
**వినుమని సారమంత విడిబెట్టెను అన్నమయ తాళ్ళపాకలో**
**గొనకొని సర్వధర్మముల గ్రుంకక దిక్కని వేంకటేశునే**
**మనమున నెంచుమా శరణు మాకిక నీవని 'వైష్ణవం' బదే.**

**రాగం : మలహరి**

వలెనను వారిదె - వైష్ణవము- ఇదె
వలపు దేనె పో-వైష్ణవము ॥వలెనను॥

కోరిక లుడుగుచు-గుఱి నిన్నిటిపై
వైరాగ్యమె పో-వైష్ణవము
సారకు గోపము-జలముదనలో
వారించుట పో-వైష్ణవము ॥వలెనను॥

సుడిగోను దేహపు-సుఖదుఃఖములో
వడి జొరనిదె పో-వైష్ణవము
ముడివడి ఇంద్రియ-ముల కింకరుడై
వడబడ నిదెపో-వైష్ణవము ॥వలెనను॥





ఉదుటున దన సక-లోపాయంబులు
వదలుట పో నిజ- వైష్ణవము
ఎదుటను శ్రీవేంక-టేశ్వరు నామము
వదనము చేర్చుట పో- వైష్ణవము. ॥వలెనను॥

**భావామృతం :**

ఎవరు నాకు కావాలి అని స్వీకరించితే వారిదే వైష్ణవము. ఈ వైష్ణవతత్త్వము జాతి, దేశ పరిమితులు లేక మకరందపు సౌరభాలను యెల్లెడల విరజిమ్ముతుంది పో. దీంట్లో సందేహం లేదు.

మనస్సులో వివిధమైన కోరికలను విడనాడి, భోగములపై విముఖులై వైరాగ్యభావం అలవరచుకొనుటయే పో వైష్ణవమంటే. ప్రతిసారీ తనలో తొంగిచూచే క్రోధాన్ని నిగ్రహించి తలయెత్తకుండా అదుపులో వుంచటమే పో వైష్ణవమంటే. (డాంబికంగా నామాలు పెట్టుకోవటం కాదు).

సుడిగాలిలా చుట్టుముట్టి దేహాన్ని వ్యాకులపరుస్తుంటాయి సుఖ దుఃఖములు. నిజమైన వైష్ణవమంటే ఈ ద్వంద్వముల పీడనుంచి విముక్తుడవుటయే పో. వేరేమీ కాదు. విడిచిపెట్టకుండా తగులుకొని వేదించే ఇంద్రియములకు బానిసకాకుండ, వాటికి లొంగిపోకుండుటయే పో వైష్ణవం అంటే. (ఇంకామరేమియూకాదు).

పూనికతో సర్వధర్మములను పరిత్యజించి సర్వేశ్వరునికి శరణాగతి నొందుటయే పో వైష్ణవమంటే. వదలక ప్రత్యక్షముగా మనయెదుసున్న శ్రీవేంకటేశ్వరుని నామమును (బొట్టుకాదు) నీ వదనమున చేర్చుట అంటే నోటితో పలుకుటయే పో (ముఖంపై పెట్టుకోవటంకాదు) వైష్ణవం అంటే. ఇవేవీ చేయకుండా ఏవేవో ఆచారాలు పాటించి మడీదడీ అంటే అది వైష్ణవం కానే కాదు.

**2-38**

## మున్నుడి

శ్లో॥ వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తికించన
వేంకటేశసమోదేవో న భూతోర్న భవిష్యతి.

ఈ కీర్తనకి ఈ దివ్యశ్లోకమే స్ఫూర్తి అయివుంటుంది. ఏడుకొండల మహిమను వర్ణిస్తున్నారు అన్నమయ్య. అర్థం తెలియకపోయినా నాబోటివాళ్లంతా విరివిగా వాడే పదములెన్నో ఈకీర్తనలో వున్నాయి, 'నిట్టచరుల','కాణాచి', 'కొటారులు' ఇత్యాదివి. ఈ రూపేణా తెలుసుకొని నేను ధన్యుడనైనాను. అన్నీ చేసేది శ్రీనివాసుడే, చేయించేదీ శ్రీనివాసుడే. నా బోటివాళ్ళు కేవలం 'నిమిత్తమాత్రులు'. నిజం....

**ఉ॥ కట్టెదులన్ కనుంగొనరె గ్రక్కున,నయ్యది విష్ణులోకమే**
**తెట్టెలగట్టెనో మహిమ దీటుగ, ఈ తిరుశైల పంక్తిపై**
**చుట్టుమువోలె శ్రీవిభుడు శోభనముల్ వెలయించె, గాంచుడీ**
**దిట్టతనాన కీర్తనము తేకొని పాడెను అన్నమార్యుడున్**

**రాగం : హిందోళము**

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయె మహిమలే తిరుమల కొండ ॥కట్టెదుర॥

వేదములే శిలలై వెలసినది కొండ
యేదేస పుణ్యరాసులే యేరులైనది కొండ
గాదివి బ్రహ్మాది లోకముల కొనల కొండ
శ్రీ దేవుడుండేటి శేషాద్రి యీకొండ ॥కట్టెదుర॥

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్వితపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ ॥కట్టెదుర॥





వరములు కొటారుగ వక్కణించి పెంచే కొండ
పరుగు లక్ష్మీకాంతు సోబనపు కొండ
కురిసిన సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీవేంకటపు కొండ ॥కట్టెదుర॥

**భావామృతం :**

ఇదిగో మన యెట్టయెదుటనున్న కొండలను గమనించారా! ఇదే ఏడుకొండలని ప్రసిద్ధి చెందిన తిరుమలకొండ. శ్రీహరి చిరకాల నివాసం (కాణాచి) అయిన వైకుంఠమే ఈ కొండ అని గ్రహించండి. దీని మహిమలన్నీ రాసులుగా పోగయి (తెట్టెలై) ఒకే చోటకుప్పగావున్న మహిమాన్వితమైన కొండ ఇది.

వేదములన్నీ శిలలుగా వెలసినదే ఈ తిరుమల. ఎటుచూసినా, దీనిపై పారే ఏరులన్నీ మహానుభావులు చేసిన పుణ్యముల యొక్కరాసులే. దీని శిఖరములన్నీ ప్రేమతో బ్రహ్మాదిలోకములు రూపం దాల్చినవే. ఈ శేషాద్రి వుంది చూశారా, ఇది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు వుండే కొండ.

ఈ కొండపైనున్న మృగములు మృగజాతులు అన్నీ కూడా కిన్నెర, కింపురుష, గంధర్వాది దేవతలే. సమస్త సముద్రములు పూనుకొని ఈ కొండపై నిట్టచరులై (సెలయేళ్ళుగా) పారుతున్నాయి. మహర్షులందరు ఈ కొండపైనున్న వృక్షములే సుమా!! ఇదిగో ఎత్తయిన ఈ కొండవున్నది చూశారా, ఇదే తూర్పువైపునన్ను అంజనాద్రి.

పరమాత్ముడొసగిన వరములన్నీ గిడ్డంగులు (కొటారుల) గా వచించబడినదీ సమృద్ధినిచ్చే కొండే. (ఆయన వరములే పెద్దపెద్ద నిలువలు) చూడగా శ్రీనాథుని మంగళప్రదమైన కొండ ఈ తిరుమలయే. సర్వసంపదలు కురిసి రాసులుగా గుహలలో నిండి పోయిన కొండ ఇదే. ఓ ప్రజలార! ఇదిగో ఈ శ్రీవేంకటాద్రి గొప్ప విస్తృతమైన కొండ.

## 2-39

### మున్నుడి

విశిష్టమైన లాలిపాటను అన్నమాచార్యులవారు చిన్నారి 'వేంకట కృష్ణయ్య' కోసం పాడుతున్నారు. గోపికలు నోటితో "నొయ్యనొయ్య" అని ధ్వనులు చేస్తూబాలకృష్ణుని ఆకర్షిస్తూ ఉయ్యాలలో వూపుతున్నారు. "లాలి లాలి" అంటూ వాళ్ళుపాడే లాలి పాట వీనుల విందుగా వున్నది. కొంతమంది కొమ్మలు (యువతలు) "ధిమ్మిధిమ్మి" అంటూ నాట్యం చేస్తున్నారు. ఆనందంతో పరవశించిన 'వేంకట కృష్ణయ్య' కాలి గజ్జెలు "ఘల్లు ఘల్లు" మని ధ్వనిస్తుండగా తను కూడా నర్తించాడు. శబ్దప్రధానమైన ఈ కీర్తన నింతకన్న వివరించటం నా వలనవుతుందా?

**ఆ.వె॥"నొయ్య, నొయ్య" అన్నమయ్య పాడిన పాట**
**"లాలి, లాలి" అనుచు పలుకు పాట**
**"ధిమ్మి, ధిమ్మి" ఆడె కొమ్మలు, వేంకన్న**
**గజ్జెలపుడుమ్రోగె "ఘల్లు, ఘల్లు".**

### రాగం : మధ్యమావతి

ఉయ్యాల బాలునూచెదరు కడు-
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥ఉయ్యాల॥

బాల యవ్వనలు పసిడి ఉయ్యాల
బాలుని వద్ద పాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ
లాలి లాలి లాలనుచు ॥ఉయ్యాల॥

తమ్మిరేకు కనుదమ్ముల నవ్వుల
పమ్ముజూపుల బాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల
ధిమ్మి ధిమ్మి ధిమ్మినుచు ॥ఉయ్యాల॥





చల్లు చూపుల జవరాండ్రు రే-
పల్లెబాలుని పాడేరు
బల్లిదు వేంకటపతి జేరందెలు
ఘల్లు ఘల్లు ఘల్లనుచు. ॥ఉయ్యాల॥

### భావామృతం :

రేపల్లెలో గోపికలందరు ఉయ్యాలలో చిన్ని కృష్ణుని ఉంచి ఊపుతున్నారు. వారు నొయ్య నొయ్య నొయ్యనుచు మధురంగా పలుకుతూ ఆ స్వామిని మిక్కుటముగా నాకర్షించుచున్నారు.

ఆ గోపికలు బాలయవ్వనులు. అనగా అప్పుడే యౌవనం తొంగిచూస్తున్న కన్నెపిల్లలు. వారు బంగారు ఉయ్యాలలో బాలకృష్ణుని యుంచి ఆయన వద్దచేరి లాలిపాట పాడుతున్నారు. వారంతా బృందగానము వలె లాలి, లాలి, లాలెమ్మలాలి, లాలి, లాలి అని మధురముగా పాడుతున్నారు. (జగద్రక్షకుని ఆ విధంగా సేవించే అదృష్టవంతులు. భాగ్యమంటేవారిదే)

నల్లకలువ పూరేకుల వంటి రెండు కళ్ళు (కనుదమ్ములు) ఆ గోపికలు తమ చూపులు ఉయ్యాల కనుగుణంగా అటూఇటూ తిప్పుచూ (పమ్మిచూపులు), తీయగా లాలిపాట పాడుతున్నరు. కొంతమంది యువతులు(కొమ్మలు) తమ మట్టెల సవ్వళ్ళు చేయునట్లు గునకుచు (బ్రౌను నిఘంటువులో ఈ మాటకు 'ఆడపిల్లల పరుగువంటి నడక' అని సూచించబడిందని మహీధర సీతారామశర్మగారు భావించారు) వీనులవిందు కలిగించుచూ ధిమ్మి దిమ్మి ధిమ్మని నృత్యము చేయుచున్నారు.

జవ్వనులు తమ చూపులను నలుదిక్కులా 'చల్లే' వయస్సులో ఉండటం వలన వారు అదే పని చేస్తున్నారు. మరి అప్పుడు పరాక్రమశాలి అయిన మన వేంకటపతి, వరుసగా గుచ్చబడిన అందియలు (చేరందెలు) ఘల్లుఘల్లు మనునట్లు ఈ అన్నమయ్య కీర్తన కనుగుణంగా అందియలు మారు మ్రోగిస్తున్నాడు. (ఓ మహానుభావా! నేనెంత అదృష్టవంతుడిని నేనూ శ్రీవేంకటేశ్వరునే భావించుచున్నాను).

**2-40**

## మున్నుడి

శరణాగతి పాడవలెనంటే అన్నమాచార్యులవారు అద్వితీయులు. ఆ దారిలో శ్రీవేంకటేశ్వరుని "స్వామీ! నీవే దిక్కు. నాకింకో దారిలేదు 'శరణు' అని వేడుకొంటే తప్పక దారి చూపిస్తాడు. చీమకి, ఏనుగు బలం ఇస్తాడు. కూటికి లేక అటుకులు తినబెట్టినవానికి అష్టఐశ్వర్యములనిస్తాడు. అంతెందుకు, నాబోటి అవిటి అనామకుడితో అన్నమయ్య సేవ ఈ విధంగా చేయిస్తున్నాడు. ఈ కీర్తన 'మున్నుడి' వ్రాసేదాకా దీనికి ఏ పద్యం వ్రాస్తానో దైవసాక్షిగా నాకు తెలియదు. దీనికి శార్దూల వృత్తం వ్రాయాలని నేను అనుకో లేదు. నాకు 'శార్దూల' మంటేభయంకూడాను...

**శా॥ స్వామీ! దిక్కికనీదు నామ మొకటే సంసార సంభ్రంబు నే**
**నే మాత్రంబు సంహిపజాల దయతో ఈతాపమున్ దీర్చుమా**
**ఏమో!! యెవ్వడు చూడవచ్చె శరణైయేతెంచి వేంకన్నయే**
**నామానంబును గాచుదారి దెలుపున్ నాకన్నయే తోడవన్.**

### రాగం : హిందోళం

నారాయణా నీ నామమె గతి యిక
కోరికలు మాకు కొనసాగుటకు ॥నారాయణా॥

పైపై ముందట భవజలధి
దాపు వెనక చింతాజలధి
చాపలము నడుమ సంసారజటధి
తేపయేది ఇవి తెగ నీదులకు ॥నారాయణా॥

పండెను ఎడమ పాపపురాశి
అండను కుడిని పుణ్యపు రాశి
కొండను నడుమ త్రిగుణరాశి
నిండ కుడుచుటకు నిలకడ యేది ॥నారాయణా॥





కింది లోకములు కీడు నరకములు
అందేటి స్వర్గాలవె మీద
చెంది అంతరాత్మ శ్రీవేంకటేశ నీ
యందె పరమపద మవల మరేది ॥నారాయణా॥

### భావామృతం :

ఓ శ్రీమన్నారాయణుడా! మా కోరికలు సిద్ధించవలెనంటే మాకు నీ నామ సంకీర్తన తప్ప మరొక దారి లేదు. ఆ కోరికలకు అంతూపొంతూ లేదు. అవి కొనసాగుతూనే వుండాలంటే నీ వొక్కడివే మాకు దిక్కు.

పైనవున్నదేమో పుట్టుకలు తప్పని సరైన భవసాగరము. వెనకాలే దగ్గరగా వెంటవున్నదేమో దుఃఖసాగరము (అన్నీ దుఃఖాలే) మధ్యకాలమంతా చాపల్యంతో కూడిన సంసారసాగరం (దీంట్లో అన్నీ భ్రమలే). దీన్ని ఈదుటకు నాకు తేప (తెప్ప) యేది? (నీ నామస్మరణతప్పఇంకోదారే లేదు.)

ఎడమవైపున అనంతమైన పాపముల రాశి (కుప్ప) పడివున్నది.అక్కడేనా కుడివైపంతా నేను చేసికొనిన పుణ్యముల రాశి కూడా వున్నది. నట్టనడుమవున్నదేమో సత్త్వరజస్తమోగుణములను ఆలవాలమైన త్రిగుణాలరాశి స్థిమితంగా అనుభవించుటకు నిలకడ కూడా లేదు.

మా క్రిందవున్నవన్నీ కీడుచేసే నరకం మొదలైన అధోలోకాలు. పైనున్నవన్నీ స్వర్గం మొదలైన ఊర్ధ్వలోకాలు. ఇక అంతర్యామియై ఓ శ్రీవేంకటేశ్వరుడా! నీవున్న చోటే పరమపదం వున్నది. అదికాక అవతల మరొకటున్నదా? లేదు గాక లేదు.

## 2-41

### మున్నుడి

"ఇప్పుడిటుకలగంటి" అని ఆదిలో అన్నమాచార్యులవారు తన కలలో వేంకటేశ్వరుని, దివ్యతిరుమలక్షేత్రాన్ని కలగన్నానని అద్భుతమైన కీర్తన వినిపించారు. ఇప్పుడు ఆచార్యులవారు ప్రత్యక్షంగా కనులముందు దివ్యతిరుమల క్షేత్రాన్ని చూచి తన్మయులై ఆ భావావేశంలో ఈ అమృతసాన్నం చేయిస్తున్నారు. బృందావని రాగంలోని ఈ కీర్తన నెన్నిసార్లు వినినా తనివి తీరదు. ఈ కీర్తనకు 'మున్నుడి' వ్రాస్తున్నప్పుడు నాకు కలిగిన ఆనందం కూడా వర్ణించలేను. అన్ని పనులు అందరూ చేయలేరు. చేయాలంటే శ్రీహరినే శరణు అనవలసిందే....

**మ॥ "కనుగొంటిన్ అఖిలాండకోటులకు తాగర్తౌ మహాస్వామినిన్**
**అనఘున్ జూచితి పాపరాశి తొలగెన్ "అన్నయ్య వాక్రుచ్చెరా**
**వినిపించెన్ మహనీయ కీర్తనము శ్రీక్షేత్రంబు గీర్తించుచున్**
**గొనినే 'మున్నుడి'వ్రాసి ధన్యుడయితిన్‌కొల్తున్‌సదా శ్రీహరిన్.**

**రాగం : బృందావని**

కంటి అఖిలాండ కర్తనధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ॥కంటి॥

మహనీయ ఘనఫణామణులశైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహివహించిన గోపురంబులవె కంటి ॥కంటి॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగ గంటి
దైవికపు పుణ్యతీర్థములెల్ల పొడగంటి
కోవిదులు కొనియాడు కోనేరు గంటి ॥కంటి॥





పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపు చూడగంటి ॥కంటి॥

**భావామృతం :**

అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడైన స్వామిని, వాటి కర్త మరియు అధినాయకుడైన మహానుభావుని చూచితిని.నా పాపరాశులనెల్ల తొలగించుకొంటిని. ప్రత్యక్షముగా కనుల ముందు కనివించు మూర్తిని గాంచితిని.

మహనీయమైన గొప్ప పడగలు కలిగిన ఆదిశేషుని పర్వతము శేషాచలమును కనుగొంటిని. అక్కడున్న అనేక రకములైన వైభవములతో సహజముగా నేర్పిడిన నవరత్న శోభితమైన బంగారు వేదికలను కనులార గాంచితిని. ఎంతో ఒప్పు అయిన (రహివహించిన), గోపురములనుచూచితిని.

పవిత్రమైన 'పాపనాశనము' అను దివ్యక్షేత్రమును దర్శించితిని. ఎట్లో చేరుకొని సాధించి ఆకాశగంగను దర్శించి (సాన్నమాడి) తరించితిని. దైవికంగా అదృష్టవశమున ఎన్నో దివ్యపుణ్య క్షేత్రములను సందర్శించితిని. మహపండితుల చేత కీర్తించబడునట్టి కోనేటిని చూచితిని.

దివ్యులైన యోగీంద్రులు తమ భావనలలో మాత్రమే సందర్శించగల అద్వితీయమైన పాదపద్మములను జూచితిని. ఇదిగో ఈ తిరుమలను దర్శించండి చరితార్థులవండి అని చూపుతున్న పావనమైన 'హస్తమును' చూచితిని. ఆ విధముగా వాటన్నింటికి అధినాధుడైన శ్రీవేంకటేశ్వరుని దర్శించితిని.

**2-42**

## మున్నుడి

శ్రీనివాసుడు అలమేల్మంగల పరిణయం మహావైభవంగా జరుగుతోంది. ఆవిడా ఆయన స్వయంగా లక్ష్మీనారాయణులే అనునట్లున్నారు. (నిజం కూడా అదే కదా) పెండ్లిలో వుంటే సూనకములు, బాసికములు, హోమగుండాలు, మధుపర్కాలూ, మదనమంత్రాలు, తలంబ్రాలు, కర్పూరవసంతాలు, చవికెలు, పావకోళ్ళు మొదలైనవి ఈ పెండ్లిలోనూ వున్నాయి. అన్నమాచార్యులవారు ఆవివరాలు అద్భుతమైన కీర్తనలో అందిస్తున్నారు. విని తరించండి.

**కం॥ తిరుమలనాథుడి మంగయు**
**నరులారా! లక్ష్మి మరియు నారాయణులే,**
**పరిణయ వర్ణనమన్నయ**
**మురిపెంబుగనాపించె ముదమున వినుడీ.**

**రాగం : ఆహిరి**

లక్ష్మీకళ్యాణము లీలతోబాడే మిదే నేడు
లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥లక్ష్మీ॥

చూపులే చూపులు మీకు సూనకము బాసికము
వూపచున్న గుబ్బలివి బూజగుండలు
తీపులమోవితేనెలు తీరని మధుపర్కము
దాపుగబెండ్లియాడేరయ్య తగుదగు మీకును ॥లక్ష్మీ॥

మాటలు మీకిద్దరికి మదనమంత్రములు
మేటితలబాలు మీలో మించునవ్వులు
గాటమైన పులకలు కప్పురవసంతాలు
నీటునబెండ్లాడరయ్య నెరవేరె మీకును ॥లక్ష్మీ॥





కౌగిలి కౌగిలి మీకు కందున పెండ్లి చవికె
పాగినకోరికలే పావకోళ్ళు
ఆగిన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
వీగక పెండ్లాడుడయ్య వేడుకాయె మీకు ॥లక్ష్మీ॥

**భావామృతం :**

నేడు మంగళప్రదమైన కళ్యాణము గురించి పాడి, ఇదిగో ఆ వివరాలు లీలతో చెబుతున్నాము. ఓ మహానుభావా! నీవును ఆ తల్లి అలమేల్మంగ స్వయంగా లక్ష్మీనారాయణులే. (మామూలు పెళ్ళిలో అలా భావించమంటారు, కానీ ఇక్కడ స్వయంగా ఈ వధూమరులు లక్ష్మీనారాయణులే)

మీరు ఒండొరులను పరవశంతో చూచుకొనుచున్నారు. మీ చూపులే సూనకము (స్త్రీలుతలలో ధరించు పాపిడిబిళ్ళ) మరియు బాసికము (వధూవరులు నుదుటకట్టుకొనే పట్టీ). ఊగుచున్న ఘనస్తనద్వయమే ఐరేణికుండలు. మీ మీ మధురాధరసుధయే మధుపర్కము అనే పెరుగు తేనె కలిసిన పానీయం. (మధుపర్కము అంటే వధూవరులకిచ్చే చదివింపు వస్త్రములు అని శ్లేషకూడా ఇక్కడవున్నది) మీరు ఏకమై పరిణయమాడుతున్నారు స్వామీ! మీకు పరస్పరం ఇది తగునట్లున్నది.

స్వామీ! పురోహితులు మీచే వేరే మదన మంత్రాలు చదివించ నక్కరలేదు మీరు మాట్లాడుకొనే మాటలే అలా వున్నాయి. మీరు ఒకరిని చూచి ఒకరు సమ్మోహనంగా నవ్వుకొంటుంటే ఆ నవ్వులు ఒకరిపై ఇంకొకరు తలంబ్రాలు పోసికొంటున్నట్లుంది. ఆ చేతులు ఒండొరుల తలలకు (కావాలని) తగిలించుకొంటున్నప్పుడు కలిగే పులకింతలే కర్పూరవసంతం ఆడుకొంటున్నారా (వెంట్రుకలు నిక్కబొడుచుకొంటే అలాగే వుంటుంది) అనునట్లున్నది. మీ ఇద్దరూ వైభవంగా పరిణయమాడండి స్వామీ మీకన్నీ నెరవేరుతాయి.

మీరుఒండిరులను పరవశించి కౌగిలించుకొనగా తాపముదీర్చు ఆ ఆలింగనమే వివాహమండపమా అనిపిస్తోంది. వ్యాపించినగాఢమైన కోరికలే పావకోళ్ళు (వరుడు ధరించుకొయ్యపాదరక్షలు). నిలిచిన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవూ, నీదేవేరియైన అలమేలుమంగమ్మ వెనుదీయక నిత్యకళ్యాణం జరుపుకోండి. మీకు అదొకవేడుక. (మాకు అదే భాగ్యము.)

## 2-43

### మున్నుడి

అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరుని కృపలేకపోతే, తను అన్నివిధాలా అసమర్థుడననీ ఆయనకు మొక్కి శరణు జొచ్చితే ఆయన్ని కీర్తిస్తే తనంత బలవరి ఉండడనీ పిరికితనం పటాపంచలవుతుంది. అంటున్నారు. మానవులకు అజ్ఞానం తొల్లింటిది. అంటే జన్మజన్మకీ పెరుగుతూ ముదిరి పాకాన పడింది. ఇప్పుడు చటుక్కున పొమ్మంటే పోతుందా? సంసారసాగరం దాటగలనా? ఇంద్రియాల పోరును ఆపగలనా? మోక్షం సాధించగలనా? నా మనస్సును వంచగలనా? అంటున్నారు. ఇక మనమెంతండీ....

**ఉ॥ ఎందరితో పెనం దును యెక్కడనే బొరలేను శ్రీపతీ!**
**అందదు లోతు నాకు, ఇక నా భవసాగర మీదసాధ్యమా?**
**దెందము లోన నిల్పి నిను తీవిగ కీర్తన పాడి కొల్చెదన్**
**"పందనుగానునేనుతగు బల్లిదుడన్"యనె అన్నమార్యుడున్.**

### రాగం :సామంతం

ఎందరితో బెనగేను-యెక్కడని పొరలేను
కందర్పజనకనీవె-గతిగాక మాకు ॥ఎందరి॥

నిక్కి నాబలవంతాన-నేనే గెలిచేనంటే
నొక్క పంచేంద్రియముల-కోపగలనా
తక్కిన సంసార వార్ధి-దాటగలనో మరి
దిక్కుల కర్మ బంధము-తెంచివేయ గలనో ॥ఎందరి॥

పన్నుకొన్నపాయమున-పరముసాధించేనంటే
యెన్ననీమాయకుత్తర-మీయగలనా
వన్నెలనామనసే-వంచుకోగలనో మరి
కన్నటి యాప్రపంచమే-కడవగలనో ॥ఎందరి॥





ఉల్లములో నిన్ను ధ్యాన-మొగి నేజేసేదనంటే
తొల్లిటి యజ్ఞానము-తోయగలనా
ఇల్లిదే శ్రీవేంకటేశ-యెదుటనే నీకు మొక్కి
బల్లిదుడనౌదు గాక-పందనే గాగలనా ॥ఎందరి॥

### భావామృతం :

ఓ ప్రభూ! నేనెంతమందితో తలపడగలను? నీవు మాకు రక్షకుడివై మా దిక్కు కాకపోతే, ఓ మన్మధుని జనకుడా! నేనెక్కడికి పోగలను?

అంతులేని గర్విష్ఠినై నాకున్న బలముతో నేనే గెలిచేద్దాంలే అనుకొంటే నాకున్న కళ్ళు, ముక్కు, నాలుక, చెవులు, చర్మం అనే ఐదు ఇంద్రియాలలో ఒక్కదానినన్నా గెలువగలనా? వాటి దాడిని సహించగలనా? మాయతో గూడిన ఈ సంసార సాగరమును దాటే శక్తి నాకున్నాదా? అన్ని దిక్కులా వ్యాపించిన నా కర్మలవలన కలిగిన బంధనములు (తల్లిదండ్రులు, సతీసుతులు, బంధువులు అనే బంధనములు) తెంచుకోగలనా? తండ్రీ! నాకది సాధ్యపడుతుందా?

వయస్సున్ననాడు మోక్షం సాధించాలనే ఆలోచనే కలుగలేదు. ఎట్లాకలుగాతుంది? సాటిలేని నీ మాయకు జవాబు చెప్పగల సామర్థ్యం నాదగ్గరేదీ? రకరకములైన భ్రమలకు లొంగే నా మనస్సును వంచ గలనా? నా యెదుటనున్న ప్రపంచమును గడవ గలనా? అది నావల్లవుతుందా స్వామీ!

ఏదో క్రమక్రమముగా మనస్సు నిగ్రహించి నిన్ను ధ్యానం చేద్దాంలే అనుకొంటే, అనాదిగా వస్తున్న నా ఇదివరకటి అజ్ఞానాన్ని తోసిరాజనగలనా? శ్రీవేంకటేశ్వరా! ఇదిగో నీ ఎదుట జేరి నీకు మ్రొక్కుగానే అంతులేని బలవంతుణ్ణి అవుదును గాక! అటువంటి నేను పిఱికివాడిని కాగలనా? ఏనాటికీ గాను. నేను తప్పక విజేతనవుతాను.

**2-44**

## మున్నుడి

అన్నమాచార్యులవారు 95 సంవత్సారు జీవించి 32000 కుపైగా సంకీర్తనలు రచించి తిరుమలనాథుని నభూతో నభవిష్యతి  అనునట్లు సేవించారు. పన్నెండు సంవత్సరములు అహోబలంలోవుండి శఠగోపయతీంద్రుల ద్వారా విశిష్టాద్వైత మతమును స్వీకరించి అన్నమాచార్యులని ప్రసిద్ధిచెందారు. శ్రీవేంకటేశ్వరునిగా కీర్తించారు. కలశాపురి ఆంజనేయుని కూడా వేంకటేశుని దాసునిగానే కీర్తించారు. ఈ కీర్తన నారాయణుని మేలుకొలుపు.

**చం॥ "తెలతెలవారెనయ్యె! మరిదేనికియింతటి నిద్రమత్తు శ్రీ**
**లలనమనోహరా!"అనుచు లావుగపాడెను అన్నమయ్య"నా**
**పిలుపిది మేలుకొల్పుటకు, వేంకటనాయక! వచ్చిరయ్య నీ**
**కొలువుకు జేరుచున్ సురులుకూడుచు"నంచనె మేటికీర్తనన్.**

**రాగం : కాంభోజి**

ఎందాకనిద్ర నీకిదె తెల్లవారెగదె
ఇందిరారమణ నీవిటు మేలుకొనవే ॥ఎందాక॥

కమలనాభుడ నీకు గంగాది నదులెల్ల-
నమర మొక మజ్జనం బాయతము సేసె
తమితోడ కనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పెనదే విచ్చేయవే ॥ఎందాక॥

హారి నీకు నజుడు పంచాంగంబు వినిపించ
నిరతమగు వాకిటను నిలిచినాడు
సురలు నీ యవసరము చూచుకొని కొలువునకు
సరవి నా ఇత్తవడి సందడించేరు ॥ఎందాక॥





కామధేనువు వచ్చె కనుగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీ చేలాగు కదివో
యీ మహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె
కామించియన్నియును గైకొంటి విపుడు ॥ఎందాక॥

**భావామృతం :**

ఓ ఇందిరా రమణా! (లక్ష్మీపతీ!) నీవు ఎంత దనుక నిద్రించెదవు స్వామీ! తెల్లవారిపోయినది కదా! ఇప్పుడు నీవు మేలుకోవలెను ప్రభూ! (మేమంతా నీ కోసం తపిస్తున్నాము.)

ఓ పద్మనాభా! పవిత్రమైన గంగ మొదలైన నదులన్నీ నీ చిత్తంవచ్చిన దాంట్లో స్నానమాచరించి మమ్మల్ని తరింపజేయమని వేడుకొంటూ నిరీక్షిస్తున్నాయి. నీపై అపేక్షతో ఈ 'కనకగిరి' (అక్కడవున్న స్వామి పైన ఈ కీర్తన చెబుతున్నా రన్నమయ్య) తనంత తానేగొప్ప సింహాసనమై నీకై పవిత్రముగా శోభిల్లుచున్నది. అదిగో తిలకించు ప్రభూ! నీవు లేచివచ్చి ఇటు మమల్ని తరింపచేయుము తండ్రీ!

ఓ శ్రీహరీ! అజుడు (పుట్టుకలేని చతుర్ముఖ బ్రహ్మ) నీవు స్నానమాడి సిద్ధమవగానే నేటి పంచాగము వినిపించి తిథి వార వర్జ్య విశేషములను నిత్యమూ నీకు తెలిపినట్లే తెలుపుటకు నీ వాకిటిలో నిలిచి సిద్ధముగానున్నాడు.

దేవతలందరూ నీకేమే మవసరమవుతాయో వాటిన్నిటినీ క్రమబద్ధంగా నీ కొరకు సిద్ధముగానుంచుటకు హడావిడి చేస్తున్నారు (ఎంత అద్భుతమైన భావనో చూడండి). కంగారుపడుతున్నారు. లే ప్రభూ!  ఇకనైనా లేచి రావయ్యా!

నిన్ను దర్శించుకొని కావలసినవన్నీ ఏర్పాటు చేయుటకొరకు కామధేనువు కూడా వచ్చేసింది చూడు. నీ చెల్లెలు పార్వతీదేవి (మహాదేవి) నిన్ను భక్తితో స్తుతించుటకు విచ్చేసింది. ఇంత వైభోగం ఇంకొకరికి చెల్లునా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దేనినపేక్షిస్తే అది తక్షణమే సిద్ధమవుతుంది. ఇప్పటికిప్పుడే వీటిని స్వీకరించితివి. ఓ శ్రీపతీ! మహానుభావా! మేమంతా ధన్యతనొందాము.

**2-45**

## మున్నుడి

అన్నమాచార్యులవారు తొలినాళ్ళలో చెప్పిన అత్యద్భుత సంకీర్తన ఇది. అజరామరమైన ఈ కీర్తనను ఈనాటికీ చలనచిత్రాల్లో పాటల రచయితలు (కనీసం కృతజ్ఞతలు తెలపకుండా) తమ రచనగా పేరు బహుమతులు పొందుతున్నారంటే.... ఆచార్యా! వారి తరుపున నేను మీ ఆత్మకు క్షమార్పణలు చెబుతున్నాను.

**సీ॥ నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు**
**సత్యాత్ముడైయుండు సత్యమూర్తి**
**ప్రత్యక్షమైంయుండి బ్రహ్మమైయుండేటి**
**తిరువేంకటేశుండు పర మొసంగు**
**ఆ మూర్తి గుణముల నాలపించెను భళా!!**
**మధుర కీర్తనమున సుధలు కురియ**
**ఆ దేవుని విభూతి అన్నమాచార్యుండు**
**తెలుగు కవనమున తెలిపినారు**

**ఆ.వె॥సందియంబులేల హిందోళ రాగాన**
**పులకరించు తనువు మురియు మనసు**
**వేంకటేశు గొలువ వేవేల పుణ్యాలు**
**తరుగ జేయు నఘపు గిరులనైన**

**రాగం: హిందోళము**

నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమైయుండు సం-
స్తుత్యుడీ తిరు వేంకటాద్రి విభుడు ॥నిత్యాత్ము॥

ఏ మూర్తి లోకంబు లెల్ల నేలెడు నాత-
డే మూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడె నాత-
డే మూర్తి నిజమోక్షమియ్యజాలెడు నాత-
డే మూర్తి లోకైక హితుడు ॥





ఏ మూర్తి నిజమూర్తి యే మూర్తియునుగాడు
యే మూర్తి త్రైమూర్తు లేకమైన యాత-
డేమూర్తి సర్వాత్ముడే మూర్తి పరమత్ము-
డామూర్తి తిరువేంకటాద్రి విభుడు ॥ ॥నిత్యాత్ము॥

ఏ దేవు దేహమున నిన్నియును జన్మించె
నే దేవు దేహమున నిన్నియును నణగె మరి
యే దేవు విగ్రహంబీ సకల మింతయును
యే దేవు నేత్రంబు లిన చంద్రులు ॥

ఏ దేవుడీ జీవులన్నింటిలో నుండు
నే దేవు చైతన్య మిన్నిటికి నాధార
మే దేవుడవ్యక్తుడే దేవుడద్వంద్వు
డా దేవుడీ వేంక్రటాద్రి విభుడు ॥ ॥నిత్యాత్ము॥

**భావామృతం :**

నిత్యమూ ఆత్మస్వరూపుడై నిత్యాత్మునిగా జీవులన్నింటిలోను వెలుగొందుచున్న ఈ మహానుభావుని చూడండి. (ఆ రూపంలో మనికి కనిపించనప్పటికీ...) ఈ తిరుమల నాయకునిగా (మనం) సంస్తుతిచేయుటకు పరబ్రహ్మస్వరూపుడైన ఈ స్వామి మన ఎదుట ప్రత్యక్షమైయున్నాడు.

ఏ మూర్తి ఈ లోకములన్నింటిని యేలుచున్నాడో, ఏ మూర్తిని బ్రహ్మాది దేవతలంతా వెదకురున్నారో, ఏ మూర్తి నిజమైన మోక్షమీయగలడో, ఏ మూర్తిలోకములకు ఏకైక హితప్రదాతయో, ఏ మూర్తి నిజమైన మూర్తియో, ఏ మూర్తి ఎటువంటి 'మూర్తిరూపం' లేనివాడో, ఏ మూర్తిలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కలసి ఒకటిగానుంటారో, ఏమూర్తి సర్వాత్మునిగా, పరమాత్మగా కీర్తించబడుతున్నాడో అదిగో ఆ తిరువేంకటేశ్వరుడు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాడు చూచి తరించండి.

ఏ దేవుని దేహమునుండి ఇవన్నీ (విశ్వమంతా) జన్మించినవో ఏ దేవుని దేహములోనే ఇవన్నీ తిరిగి కలసిపోతున్నాయో, ఏ దేవుని విగ్రహమే ఈ సర్వస్వమంతా అయివుందో, ఏ దేవుని రెండె కన్నులు స్వయంగా సూర్యచంద్రులు అయినవో, ఏ దేవుని చైతన్య స్వరూపం వీటన్నింటికీ ఆధారముగానున్నదో, ఏ దేవుడు అవ్యక్తునిగాను, ద్వంద్వరహితుడై ఏకునిగానున్నాడో (ఒకే...ఒక్కడు) ఆ దేవుడే ఈ వేంకటాద్రినాధుడు. ఈ స్వామిని శరణని సేవించండి.

**2-46**

**మున్నుడి**

అన్నమాచార్యులవారి సంస్కృత సంకీర్తనలు చాలవరకు స్తుతిపరమైనవే. అందువలన చాల వరకు ఒకదానినొకటి పోలి ఇదివరకు వినినట్లేవుంటాయి. కేశవ నామాలన్నింటినీ ఒకే కీర్తనలా చెప్పిన ఘనత తాళ్ళపాకవారిది. ఈ కీర్తనలో కూడా అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని 'నిత్యానందు'డని, 'పరిపూర్ణానందు'డని 'నానావర్ణనిజదేహు'డని కీర్తిస్తున్నారు. నీలవర్ణుని అటువంటి విశేషణములతో నుతించుట ఆచార్యులవారి ప్రత్యేకత. 'కైవల్యకాంత శృంగార రమణు'డట స్వామి. ఆహా!.... మనం నిత్యము వుపయోగించే చాలామాటలకి మనకు అర్థం తెలియదు.

**కం॥ కాత్యాయని తను కొలుచును**
**నిత్యము శ్రీకాంతుడైన నీరజనాభున్**
**నిత్యానందుడు అనియెడి**
**సత్యమునా అన్నమయ్య సంకీర్తించెన్.**

**రాగం : ధన్యాసి**

నిత్యానంద ధరణధర ధరారమణ
కాత్యాయనీ స్తోత్ర కామ కమలాక్ష ॥నిత్యానంద॥

అరవిందనాభ జగదాధార భవదూర
పురుషోత్తమ నమో భువనేశ
కరుణాసమగ్ర రాక్షసలోక సంహార
కరణ కమలాధీశ కరారాజవరదా ॥నిత్యానంద॥

భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద
సాగర నిజావాస సకలాధిప
నాగారిగమన నానావర్ణనిజదేహ
భాగీరథీ జనక పరమ పరమాత్మ ॥నిత్యానంద॥





పావన పరాత్పర శుభప్రద పరాతీత
కైవల్యకాంత శృంగారరమణ
శ్రీవేంకటేశ దాక్షిణ్య గుణనిధి నమో
దేవతారాధ్య సుస్థిర కృపాభరణ ॥నిత్యానంద॥

**భావామృతం :**

ఓ భూరమణా! వేంకటనాయకా! నిన్ను ఎంత స్తోత్రించినా తనివి తీరదు. నీవు ఎప్పుడూ నిత్యానందదవు. ఆదివరాహమై భూమండలమును నీ ముట్టిపై ధరించావు. పార్వతీదేవి నిన్ను నుతించగా ఆమె అభీష్టములను ప్రసాదించు వాడవు. పద్మములవంటి (పద్మదళముల వంటి) కన్నుల గలవాడవు.

స్వామి! నీవు పద్మనాభుడవు. విశ్వమున కంతటికీ ఆధారభూతుడవు. సంసారతాపం. హరింపజేయువాడవు. పురుషోత్తముడని పేరుపొందినవాడవు. అట్టి నీకు నమస్కరించెదను. నీవు భువనములన్నింటికీ ఈశ్వరుడవు. పరిపూర్ణమైన దయగలవాడవు. దానవులను ఛేదించి సంహరించువాడవు. లక్ష్మీదేవికి నాధుడవు. గజేంద్రుని మకరము బారినుండి రక్షించిన దేవదేవుడవు.

ప్రభూ! నీవు ఆదిశేషుడే తల్పముగా శయనించువాడవు. పరిపూర్ణడవు. ఏ పని నిర్వహించినా దానిని అశేషముగా నెరవేరుస్తావు. సంపూర్ణమైన ఆనందముతో నుండువాడవు. పాలసముద్రమునకు యజమానివి. సర్పములకు శత్రువైన గరుత్మంతునిపై పయనించు విష్ణుడవు. నీలవర్ణుడడైనా, పాండురంగడివైనా, సత్యనారాయణుడివైనా అనేక వర్ణములతో నొప్పువాడవు. ఆకాశంనుండి అవతరించిన గంగాదేవికి తండ్రివి. సర్వశ్రేష్ఠుడవు. పరమాత్మవు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు పవిత్రుడవు. శ్రేష్ఠులందరికీ శ్రేష్ఠుడవు, శుభములనొసంగువాడవు, శ్రేష్ఠమైన మోక్షమునొసగువాడవు, మోక్షలక్ష్మికి శృంగారనాయకుడవ, కృప, కటాక్షము మొదలైన దాక్షిణ్యగుణములకు నిధియైనవాడవు, దేవతలందరికీ ఆరాధ్యుడవై వారిని సుస్థిరముగా నుంచు దయ ఆభరణమైనవాడవు. ఇన్ని విశిష్టగుణములున్న నీవు నన్ను అనుగ్రహింపుము, తండ్రీ!

**2-47**

## మున్నుడి

పవనపుత్రుడైన కలశాపురం హనుమంతుని కీర్తిస్తూ అన్నమాచార్యులవారు చెప్పిన కీర్తన ఇది. నేటికాలంలో మనం 'బాబోయ్'! అని ఆశ్చర్యపోతుంటే అన్నమయ్యకాలం నాటి తెలుగు వారు 'బాపురే!' అని ఆశ్చర్యపోయేవారు.'బాపు' అంటే 'బాబు'. ఇంకొక విశేషమేమంటే 'సాహసమిటువలె చాటితిగా' అనే మాటనేటి కాలంలో 'సాహసమిట్లు చాటితివిగా', అని ప్రయోగిస్తున్నాం. 'రవిగ్రహణ', 'దశముఖహర అనే మాటలు అన్నమాచార్యులవారి 'ముద్ర' వున్న అసాధారణ సంబోధనలు.

**తే॥ ఓ పవనసుతా! ఓ ఘనా! ఓ కపీశ!**
**బాపురే! నీవు తెగువతో పరగినావు**
**ఆంజనేయుని కొలువున అన్నమయ్య**
**మేటికీర్తన వినిపించె వేంకటేశ!**

**రాగం : శ్రీరాగం**

ఓ పవనాత్మజ ఓ ఘనుడా
బాపు బాపనగ పరగితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ హనుమంతుడ ఉదయాచల ని-
ర్వాహక నిజసర్వప్రబలా
దేహము మోచిన తెగువకు నిటువలె
సాహసమిటువలె చాటితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ రవి గ్రహణ ఓ దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపు వినతా తనయాదులు
గారవింపనిటు కలిగితిగా ॥ఓ పవనాత్మజ॥





ఓ దశముఖహర ఓ వేంకటపతి-
పాదసరోరుహ పాలకుడా
ఈ దేహముతో ఇన్నిలోకములు
నీ దేహమెక్క నిలిచిగా ॥ఓ పవనాత్మజ॥

**భావామృతం :**

వాయునందనుడవైన ఓ ఆంజనేయా! ఓ ఉద్దండుడా! నీ భక్తులందరు 'బాబోయ్' 'అమ్మబాబోయ్' అనునట్లు వర్ధిల్లితివి కదా!

తూర్పునవున్న 'ఉదయాచలము'ను నిర్వహించిన ఓ హనుమంతా! అన్ని విధములా వ్యాపించిన మహానుభావా! సూర్యగమనమునకు అనుగుణంగా మహాకాయమును దాల్చి ఇటువంటి సాహసము చూపించితివి (సూర్యుని ద్వారా వేదములను నేర్చుటకు స్వామి గొప్ప ఆకారముతో సూర్యుని అనుసరిస్తూ, వింటూ ఏకసంతాగ్రాహిగా వేద విద్య నేర్చాడు.) ఇటువంటి ధైర్యము (సూర్యుని దగ్గరకు ముఖం పెడితే కాలి బూడిదైపోతాం కదా!) ఇంకకరికి వుంటుందా?

(చిన్నపాపాయిగా వున్నప్పుడే సూర్యుని తినే పండు అనుకొని ఆ సూర్యుని 'గ్రహించుటకు' ఎగిరి పట్టుకోబోయాడు.) అంత అల్లరి పిల్లవాడా! ఓ రాక్షసాంతకా! లంకలో ఎదురులేక చిత్తమొచ్చినీరీతి వ్యవహంరించితివి కదా! వినతాసుతుడైన గరుత్మంతుడు తను స్వయంగా గొప్ప శక్తిమంతుడై కూడ నిన్ను తన సాటివానిగా గుర్తించి ఆదరించగా ఈ విధముగా ప్రబలినాడువు కదా

పదితలల రావణాసురుని గర్వభంగము జేసిన ఓ మారుతీ! శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మములను తలదాల్చు మహానుభావా! ఇటువంటి అసదృశమైన దేహముతో ఇన్నిలోకములను నీ దేహము అధిగమించునట్లు నిలిచితివి కదా! నీ పరాక్రమము సాటిలేనిది.

**2-48**

## మున్నుడి

అన్నమాచార్యులవారు, పరువంలో వున్న సరసమైన ఒక జానపదుల జంటను చూచి ఆ బావా మరదళ్ళ సరసానికి ముచ్చటపడి వారినే ఆ ద్వాపరం నాటి రేపల్లెలోని కృష్ణయ్య అతని మరదలుగా వూహించారు. అప్పుడప్పుడూ మరదలి పరువాలని ఏదోవంకతో తాకుతూ చలోక్తులాడుతున్నాడు ఆ బూటకాల బావ. వాడిగా, గిలిగింత చూపులతో అతనిని మురిపించింది మరదలు. అప్పుడు భావనాకాశంలో ఒక మెఱుపు మెరిసి తను దేవకన్యననీ, అతను స్వయంగా శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుడని గ్రహించి ఆ బావకు 'దగ్గరై' నీకు తగులైపోయాను బావా! అన్నది.

**చం॥ సరసము తోటి పాడెనిటు జవ్వనియౌజవరాలు బావాతో**
**మరదలి నివ్విధిన్ చెనక మాన్యతకాదుర బావ! యేలనా**
**పరువును తీతువంచు తన బావను వేడెను అన్నమయ్య ఆ**
**తిరుమలనాయకున్ గొలిచె ధీటుగ జానపదంపు కీర్తనన్.**

**రాగం : శుద్ధసావేరి**

ఏలే ఏలే మరదలా
చాలు చాలు చాలును
చాలు నీతోడి సరసాలు బావా ॥ఏలే॥

గాటపు గుబ్బలు కదలగ కులికేవు
మాటల తేటల మరదలా
చీటికి మాటికి చెనకేవు వట్టి
బూటకాలు మాని పోవే బావా ॥ఏలే॥

అందిందే నన్ను అదలించి వేసేవు
మంద మేలపు మరదలా
సందుకో తిరిగేవు సటకారి ఓబావా
పొందు కాదిక పోవే బావా ॥ఏలే॥





చొక్కపు గిలిగింత చూపుల నన్ను
మక్కువసేసిన మరదలా
గక్కున నను వేంకటపతి కూడితి
దక్కించుకొంటివి తగులైతి బావా ॥ఏలే॥

**భావామృతం :**

ఎందుకే! ఎందుకే! మరదలా! (నన్ను లెక్కసేయవు?) చాలు చాలు బావా! నీతో సరసాలు ఇంకచాలు. (నాదారిన నన్ను వదిలేయి.)

ఘనమైన స్తనభారంతో వుక్కిరి బిక్కిరి అవుతున్న నా మరదలా! అవి కదులుతుంటే నువ్వు కులుకుతున్నావు నీ మాటలు అతి సరళంగా మనోహరంగా కూడా వుంటాయి. ఇదిగో బావా! చీటికీ మాటికీ ఏదోవంక పెట్టుకొని నన్ను తాకుతున్నావు. నీవు వట్టి మాయ మాటలు చేప్పేవాడివి. నీ మాటలు కట్టి పెట్టి నీ దారిన నీవుపో నన్ను నా దారిని పోని.

ఓ మరదలా! నన్ను అందిందే (మఱీమఱీ) చిరు కోపంతో గద్దించి పారేస్తున్నావు. నీవు అసలే మంద (దె) మేలపు (ఉపేక్షించు) మరదలివి. ఓబావా! పోపోవే! నీవు అతిచనువుతో నన్ను తాకుతూ తిరుగుతావు. నీవు సటకారి (మోసకారి) వాడివని నాకు తెలుసు. నీతో పొందు (స్నేహం) కుదిరేది కాద కానీపోపోవయ్యా.

ఓ మరదలా! నీ చూపుల తూపులు వాడిగా నాకు గుచ్చుకొని గిలిగింతలు పెడుతున్నాయి నీవు నాకు అతిప్రియమైనదానివి. ఓ బావా! నీవు శ్రీవేంకటేశ్వరుడవై నన్ను సమీపించి నా భావనలలో చటుక్కున నీ వశం చేసుకొన్నావు. నన్ను దక్కించుకొన్నావు. ఇక నీ వశమైపోయాను. బావా! నేను మనోవాక్కాయకర్మలా నీ దానిని.

**2-49**

## మున్నుడి

అన్నమాచార్యులవారు సర్వరోగ నివారిణియైన ఒకమందు సేవించమని చెబుతున్నారు. "జనకుడు గెలుపుతో గొని బ్రతికినయా మందు", అనుపాదము వలన దీన్ని ఎన్నుకొన్నాను. శ్రీరామచంద్రుడు దుష్టశిక్షణ కవతరించిన శ్రీహరి అని జనకమహారాజుకు తెలుసు. ఆయన రాజర్షి, తామరాకు పై నీటిబొట్టులా నిస్సంగుడై బ్రతికాడు రాగద్వేషాతీతుడై భవబంధాలపై విజయంసాధించి కర్తవ్యపాలనయే భగవంతునికి కైంకర్యం అన్నట్లు జీవించాడు. ఆయనా ఇదేమందు ఇంకొకలాగ తీసికొన్నాడు.

**ఉ॥ మందులలోన శ్రేష్ఠమగు భాగ్యపు మందిది నారదాదులున్**
**ముందుగ నెంచినారు భళి! మోదముతో ధ్రువుడున్ మునీంద్రులున్**
**పొందుగ గ్రోలిరంచనెను పుల్కలదేరిన అన్నమయ్య ఈ**
**సుందరమైన కీర్తనపు శోభలగాంచుము వేంకటేశ్వరా!**

**రాగం : శంకరాభరణం**

కొనరో కొనరో మీరు-కూరిమి మందు
ఉనికి మనికి కెల్ల-నొక్కటే మందు ॥కొనరో॥

ధ్రువుడు గొనినమందు-తొల్లియు బ్రహ్లాదుడు
చవిగా గొనిన మందు-చల్లని మందు
భవరోగముల వీడి-పారగ బెద్దలు మున్ను
జవకట్టికొనిన ని-చ్చయమైన మందు ॥కొనిరో॥

నిలిచి నారదుడు గొ-నిన మందు జనకుడు
గెలుపుతో గొని బ్రతి-కిన యా మందు
మొలచి నాలుగుయుగ-ముల రాజులు ఘనులు
కలకాలము గొని -కడగన్న మందు ॥కొనిరో॥





అజునకు బర-మాయువై యొసగిన మందు
నిజమై లోకము లెల్ల- నిండిన మందు
త్రిజగములు నెఱుగ-తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తి గోనేటి-దరి నున్న మందు ॥కొనిరో॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! అత్యంత శ్రేష్ఠమైన ఈ మందు (ఔషధము) ఏంతో ప్రీతిపాత్రమైనది. ఈ మందు మీరు తప్పక తీసికొనవలెను. మీ అందరి నిలకడకు జీవనమునకు కూడా ఈమందే ఆధారం సుమా!

పూర్వం కృతయుగంలో ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి బాలురు కూడా సేవించి ఏ మాత్రమూ వెగటులేని తీపిమందు అని గ్రహించి ఈ చల్లని మందు సేవించి ధన్యులయ్యారు. మహానుభావులైనవారు చాలమంది అనాదిగా, జమకట్టికొని (స్వాధీనము చేసికొని)శాశ్వతమై భవరోగనాశనియైన ఈ దివ్యౌషధాన్ని సేవించారు.

ఆనాడు త్రేతాయుగంలో జనకమహారాజు రాజర్షియై భవతాపములపై గెలిచి జ్ఞానియై సేవించి తరించిన చక్కటిమందు ఇదే. నారదుడు త్రిలోక సంచారియై తనతో పాటు పలువురికి ఈ మందు త్రాపించి తరింపచేశాడు. ఆయనవలన నాలుగు యుగములలోని రాజులు పుట్టి తమ కర్తవ్యం నెరవేరుస్తూనే ఘనులై ఎల్లప్పుడూ ఈ మందు తీపికొంటూనే తమ జీవితాంతమూ ధన్యతబొందారు.

చిరాయువైన చతుర్ముఖ బ్రహ్మగారు సేవించే ఔషదం ఇదే సుమండీ! ఇదెక్కడ దొరుకుతుందో, అనే సంశయం వద్దు. సత్య స్వరూపముగా లోకములన్నింటి లోనూ నిండివున్న మందు ఇదే. నేడూ తిరువేంకటాచలముపై పవిత్రమైన ఈ కోనేటి ఒడ్డున దొరికే శ్రీవేంకటేశ్వరుడు అనే ఈ మందు సేవించండి. ధ్వజమెత్తి చాటుబడుతున్న ఈ దివ్యౌషధ రాజమును సేవించి తరించండి.

**2-50**

## మున్నుడి

హంపీ విజయనగరంలోని విజయరామచంద్రుని కీర్తిస్తూ అన్నమాచార్యులవారు చెప్పిన అనేక సంస్తుతి కీర్తనలలో ఇది కూడా ఒక ఆణిముత&యం. 'వినుతామరస్తోత్రరాము' 'తామరస్తోత్రరామా! వినవయ్యా' అనుకొనే నాబోటి అఅమాయకులకు ఇది సంస్కృత కీర్తన కాబట్టి దీన్ని 'వినుత అమరస్తోత్ర రామా!' గా అర్థం చేసికొనవలెనని వినతి. 'కలిత ప్రతాఎఎప సుప్రసిద్ధమైన ప్రతాపముకలవాడని. రోజూ పారాయణగా పాడఉకోదగిన అజరాకీర్తన ఈ రామసంకీర్తన.

**ఆ.వె॥ "రామ! దశరథసుత! రాఘవా! కాకుత్థ్స**
**సత్యకాముడీవు సద్గుణడవు.**
**సన్నుతించినారు అన్నమాచార్యులు**
**రాముడిపుడు గిరులరాయుడనుచు.**

**రాగం : విశారద**

రామ దశరథరామా నిజ సత్య-
కామా నమో నమో కాకుత్థ్సరామ ॥రామా॥

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమ పురుష సీతాపతిరామ
శరధిభంధన రామ సవనరక్షక రామ
గురుతర రవివంశవ కోదండరామ ॥రామా॥

దనుజహరణ రామ దశరథ సుత రామ
వినుతామర స్తోత్ర విజయరామ
మనుజావతారా రామ మహనీయ గుణరామ
అనిలజప్రియ రామ అయోధ్యారామా ॥రామా॥





సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుష రావణ భయంకర రామా
విలసిత రఘురామ వేదగోచర రామ
కలిత ప్రతాప శ్రీవేంకటగిరి రామ ॥రామా॥

**భావామృతం :**

శ్రీరామచంద్రుడు, దశరథరాముడు సత్యవ్రత దీక్షాదక్షుడు, కాకుత్స్థ వంశకులదీపకుడు. అట్టి ఓ మహానుభావా! నీకు నమస్కరించుచున్నాను.

శ్రీరామ! నీవు కరుణా సాగరడవైన కరుణానిధివి, కౌసల్యాసుతుడవు, పరమపురుషుడవు, సీతాపతివి, సాగరముపైన వంతెన నిర్మించినవాడవు, విశ్వామిత్రని యాగము (సవనము) ను రక్షించినవాడవు. శ్రేష్ఠమైన సూర్యవంశమున జన్మించినవాడవు. కోదండము అను ధనస్సుని ధరించియే యుందునని దీక్షవహించినవాడవు.

ఓ శ్రీరామచంద్రా! నీవు ఖరదూషణాది రాక్షసులను వేలకొలదివున్నను సునాయాసంగా తుదముట్టించినవాడవు నీవు దశరథనందనుడవు. అమరులైన దేవతల యొక్క స్తోత్రములచే నుతింపబడువాడవు. విజయనగరమున వెలసిన విజయరాముడువు. మానవుని అవతారమును ధరించిన శ్రీమన్నారాయణుడవు.

మహనీయమైన గుణములు కలవాడవు. వాయునందనుడైన హనుమకు ప్రియాతి ప్రియమైన స్వామివి. అయోధ్యా నగరాధీశుడవు.

విమలమైన మనోజ్ఞమైన యశస్సుచే విలసిల్లు మహనీయుడవు నీవు. సుగ్రీవునికి అభయమునొసగి రక్షించితివి. దుష్టుడైన రావణునికి భయంకరుడవు. విలసిల్లి రఘువంశతిలకుడవు. వేదములచేత కనుగొనబడు పురుషోత్తముడే నీవు. సుప్రసిద్ధమైన ప్రతాపము కలిగిన శ్రీవేంటగిరిరాముడు శ్రీవేంకటేశ్వరుడే.

**2-51**

## మున్నుడి

అన్నమాచార్యులవారి మధురశృంగార కీర్తన ఇది. నాయిక స్వామి రాకకై వెన్నెలవేళ ఎదురుచూస్తూ 'విరహోత్కంఠిత'యై తన చెలికత్తెతో వాపోతున్నఘట్టం. ఎంతరాత్రయిందంటే స్తనయుగ్మంపై నున్న ముత్యాలదండలోని ముత్యాలు, నునువెచ్చగా వుండటంపోయి, చల్లబడినవట. కలువకన్నెలు చాల సేపు వికసించి అలసిపోయి కను మోడ్చినవట. 'వెన్నెల వేసంగిమొగ్గ'' అయిన చంద్రుడు వికసించాడట. మాటలు తడబడి, కురులలో పువ్వులనటానికి బదులు పువ్వులలోని కురులు'బుగలు కొనగసెఅసె' (బాగా వ్యాపించివిరిసినవట). వాటిపై తుమ్మెదలు దాడిచేస్తున్నాయట. అహో....

**మ॥ ఉదయాద్రిన్ తెలుపాయె శ్రీవిభుడురాబోడేమిదేమో కదా!**
**ముదితన్ వేరొక దాని జట్టుగొనెనో! మోసంబు జేసేనొకో!!**
**యెదపై ముత్తెపు దండ చల్లబడెనే! యేజాము కానున్నదో!**
**ఇదిగో కీర్తన నన్నమయ్య తెలిపెన్ ఈ లేమతాపంబులన్.**

**రాగం : చంద్రిక**

ఉదయాద్రి తెలుపాయె ఉడురాజు కొలువిడె
అదనెరిగి రాడాయె నమ్మ నావిభుడు ॥ఉదయాద్రి॥

చన్నులపై ముత్యాల సరులెల్ల చల్లనాయె
కన్నులకు కప్పొదవె కాంతా నాకిపుడు
కన్నెకలువల జాను కనుమోడ్చినది మీద
వెన్నెల వేసంగిమొగ్గ వికసించె గదవె ॥ఉదయాద్రి॥

పువ్వుల లోపలి కురులు బుగులు కొనగ నెఅసె
దు(ద)వ్వుల తుమ్మెద గములు తరమి డాయగను
రవ్వసేయ శుక పికము రాయ(యి)డి కోర్వగ రాదు
అవ్వల నెవ్వతె పసలకు అలరున్నసవాడో ॥ఉదయాద్రి॥





పన్నీట జలకమార్చి పచ్చకప్రము మెత్తి
చెన్నుగ కొప్పున విరుల చెలువందురిమి
ఎన్నగల తిరువేంకటేశుడిదె నను గూడె
కన్నులు మనసును తనియ కరుణించె గదవె ॥ఉదయాద్రి॥

**భావామృతం :**

ఓ చెలియా! ఇదెక్కడి చోద్యమే!! రేరాజు (చంద్రుండు) కొలువుదీరి వచ్చాడు. తూర్పుకొండ తెల్లబడిపోయింది. ఇది సరియైన 'సమయం' అని తెలిసికూడా అతగాడు (స్వామి) ఇంకారాడు. ఇదేమిటమ్మా! నా నాధుడు ఎందుకు రాడు?

ఎంతరాత్రయిందంటే రాత్రిచలికి నాస్తనయుగ్మం పైనున్న ముత్యాలదండ చల్లబడిపోయింది. ఓ రమణీ! నాకిప్పుడు కళ్ళుకూడా కూరుకుపోతున్నాయి. మేలుజాతి కలువకన్యలు పాపం కళ్ళుమోడ్చినవి. ఆకాశంలోనున్న ఆ 'వెన్నెల వేసంగి మొగ్గ' (చందమామ) వికసించాడు. (బాగుగా పైకి వచ్చి కాంతులు వెదజల్లుతున్నాడు.) ఇతగాడు ఇంకారాడేమిటే?

ఇది చూశావా? పువ్వులలోని కురులు, కాదు కాదు కురులలోని పువ్వులు 'బుగులు కొనగ నెఅసి'నవి (బాగుగా వ్యాపించి విరిసినవి.) దువ్వుల (దవ్వుల అనగా చాలదూరము వరకు) తుమ్మెదలు ఆ తలలోని పూలపై వాలి మకరందం తాగేయాలని తరిమి తరిమి వెంటపడుతున్నాయి. చిలుకలు గోరింకలు రకరకాల ధ్వనులు చేస్తున్నాయి. నేను ఈ రాయడి (రాయిడి అయివుండవచ్చు ఎందుకంటే రాయిడి అంటే ఉపద్రవం అని అర్థమున్నది) ఓర్వలేకపోతున్నానే. కొంపతీపి ...అక్కడ పవళింపు సేవకు ఇంకెవ్వతైనా దొరికిందా యేమిటే... అతగానికి. దానికి అలవాటు పడలేదు కదా!

(క్షణకాలంలో అమ్మవారి లాలిత్యం అసూయను గెలిచి వెంటనే ఆమె చల్లటి పన్నీటితో స్నానం చేసి ఒళ్ళంతా పచ్చకర్పూరం పరమళభరితంగా మెత్తుకొని, అందంగా తన కొప్పులో పూలు తురిమింది. ఇంతలో ఎన్నగల (అత్యధికుడైన) కరుణాంతరరంగుడై స్వామి నన్ను కూడినాడు. దానివలన ఆమె కన్నులు మనస్సు అమితంగా తృప్తిచెందాయి.

**2-52**

## మున్నుడి

అన్నమాచార్యుల వారు శ్రీవేంకటేశ్వరుని యొక్క బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనంపై శౌర్యమూర్తియై వెలిగిపోతూ బంగారు గరుడనిపై వూరేగుతున్న సందర్భంలో పాడిన అమరసంకీర్తన ఇది. అన్నమయ్య ఎన్నుకొన్న శబ్దాలంకారాలు గమనించండి. దిక్కులు పిక్కటిల్లే ఆ రెక్కల చప్పుడు మీ మనస్సులో ఒకసారి భావించండి. గరుడోత్సవం తిరుమల బ్రహ్మోత్సవంలో దర్శించి మనస్ఫూర్తిగా శరణాగతితో మొక్కినవారికి మరుజన్మరాదని పెద్దలంటారు. ఒక పట్టాన కొరుకుడు పడని పదములెన్నో చూడండి.....

**చం॥ గరుడుని నెక్కి శ్రీపతిటుగ్రక్కున వచ్చెను దిక్కులన్నియున్**
**అరయగ"బగ్గునన్ పగిలె" అన్నయ కీర్తన అద్భుతం బహో!!**
**కొరతిది అర్థమౌట తలకున్ పెనుభారము యెంచిచూడగా**
**తిరుమల నాయకా! కొలుతు దీర్పుము కష్టము నాకునియ్యెడన్.**

**రాగం : కేదారం**

ఇటుగరుడని నీవెక్కినను
పటపట దిక్కులు బగ్గన బగిలె ॥ఇటు గరుడని॥

ఎగసిన గరుడని యేపున 'ధా' యని
జిగిదొలక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమ సంఘములు
గగనము జగములు గడగడ వడకె ॥ఇటు గరుడని॥

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు కోపించినను
సరుస నఖిలములు జరబ్రతములై
తిరుపున నలుగడ దిరదిర దిరిగె ॥ఇటు గరుడని॥





పల్లించిన నీ పసిడి గరుడనిని
కెల్లన నీవెక్కినయపుడు
ఝల్లనె రాక్షస సమితి నీ మహిమ-
వెల్లి మునుగుదురు వేంకటరమణా ॥ఇటు గరుడుని॥

**భావామృతం :**

ఓ ప్రభూ! ఈ విధముగా నీవు గరుత్మంతునిపై నెక్కిపయనించుచున్నప్పుడు, పటపట శబ్దములతో దిక్కులన్నియు భగ్గుమని పగిలిపోయినవి. (ఆతని వేగమును సహించలేక దిక్కులు పిక్కటిల్లినవని భావము.)

'ధా'యని పైకి లేచిన గరుత్మంతుని విజృంభణమునకు అనుగుణముగా, తళుక్కుమని నీవు కొరడా ఝుళిపించగా వేదాంతములు వేదములు కూడా నివ్వెరపోయినవి. ఆకాశంతో పాటు జగములన్నియు గడగడ వణికిపోయినవి.

దిట్టమైన వేగము గల ఆ గరుత్మంతుని నీవు తోలుచు ఆ వేగముచాలదని నీవు కఠినుడవై కోపించుచుందువు. (నీ కేమో నీభక్తులను ఆదుకోవాలని ఆత్రుత..) నీ కోపాగ్ని సహించలేక సమీపముననున్న సమస్తమూ శిధిలమై నలుదిక్కులా 'దిరదిర' మని తిరుగుతూ పరిభ్రమించసాగినవి. (దుస్సహమైన నీకోపాగ్నికి ఎవరు తట్టుకోగలరు ప్రభూ!)

నీవు కూర్చొనుటకు అనువుగా 'మెత్త' ఒకటి ఆ గరుడుని పై పరుచబడివున్నది. అట్లు 'పల్లించిన' నీ బంగారు గరుడనిపై "ఫెళ్ళుమని" నీవు ఎక్కినంతనే అక్కడ రాక్షసుల (గుండెలు) ఝల్లుమన్నాయి (భయంతో) ఓ వేంకటరమణా! నీ మహిమల పరంపర వలన దుర్మార్గులందరూ ఆ వెల్లువలో మునిగిపోతారు.

**2-53**

## మున్నుడి

గరుడాద్రిపైనున్న అహోబలనృసింహునిపై అన్నమయ్య అనేక కీర్తనలు చెప్పి మనందరినీ తరింపజేశారు. ఈ కీర్తనలో నరసింహుని ఆచార్యులవారు ప్రహ్లాద నరసింహా అని చాలా అద్భుతంగా మాటి మాటికీ ప్రతిచరణానికీ కీర్తించారు. ఇక్కడ ప్రహ్లాదుడంటే అంతా అనుకునేట్లే హిరణ్యకశిపుని కొడుకు కాదు, మిక్కిలి "హ్లాదము" అనగా ఆనందము కలిగించువాడని అర్థం. కీర్తనలో మనకితెలిసిన ప్రహ్లాదుని ప్రసక్తిరాంగానే సరళంగా వానిని నీ "బంటు" అన్నారు అన్నమయ్య. స్వామివారి 'ఉగ్రపుబుద్ధి' తిప్పటానికి లక్ష్మీదేవే అంకుశమట. ఏమి చమత్కారం!!

**ఆ.వె॥ప్రస్తుతించినారు 'ప్రహ్లాద నరసింహు'**
**తానహోబలమున 'తాళ్ళపాక',**
**అన్నమయ్య పాట అలరించె కాబోటు**
**కొండలయ్య ఆయె కొలువు దీరి.**

**రాగం : బేగడ**

నవరూప ప్రహ్లాద నరసింహా
అవిరళతేజ ప్రహ్లాద నరసింహ ॥నరరూప॥

పగరపై కోపము బంటుజూచి మానితి
నగుమొగము ప్రహ్లార నరసింహా
ఎగువ నీ కోపమున కితడె మాటుమందు
అగపడె మాకును ప్రహ్లాద నరసింహ ॥నరరూప॥

అంట ముట్టరాని కోపము అంగన జూచిమానితి
నంటు చెల్లు ప్రహ్లాద నరసింహ
జంట నీ బుద్ధి తిప్ప సతియే అంకుశము
అంటువాయ మికను ప్రహ్లాద నరసింహా ॥నరరూప॥





ధరమొరవెట్ట దేవతలే మొక్కితే మానితి
గరుడాద్రి ప్రహ్లాద నరసింహా
ఇరవై శ్రీవేంకటాద్రి నిందు అందు నీవె సుద్ది
అరసితి మిదివో ప్రహ్లాద నరసింహా ॥నరరూప॥

## భావామృతం

నరుని వలె కోపతాపములు, ఆశ్రిత వాత్సల్యమూ, అంగనా ప్రియత్వమూ, సన్నుతికి సంతోషించుట కలిగిన నవరూపుడవైన ఓ ప్రహ్లాద నరసింహా! నీవు అంతులేని తేజస్సుగల మహానుభావుడవు.

దుర్మార్గుడై, నియంతయై, హరి భక్తులను హింసించు హిరణ్యకశిపుడు వరగర్వియై హరిద్వేషియై హరి భక్తుడైన తనస్వంత కొడుకు 'ప్రహ్లాదు'నే హరిమాట మానమని అనేక విధములుగా హింసించసాగాడు. అతనిని సంహరించుటకు నృసింహుడైన శ్రీహరి వానిని చంపి కోపంతో ఊగిపోయాడు. తన బంటు అయిన ప్రహ్లారుని జూచి ఆయన కోపం తగ్గి నగుమోము ప్రహ్లాదనరసింహుడైనాడు. ఆయన కోపానికి ఆ చిన్నారి బాలుని సంస్తుతియే మాటుమందు (అంటే...అందరికీ తెలియని మందు). నేటికి అదే (నీ కీర్తనయే) నీకు మాపై కోపానికి సరియైన మందు అని మాకు అనిపిస్తోంది తండ్రీ!

(మళ్ళీ ఆ హిరణ్యకశిపుని పరివారం నీపై యుద్ధానికి రాంగానే వాళ్ళందరినీ తుదుముట్టించావు. ఈ సారి నీ కోపాన్ని ఆపటం అసాధ్యమై పోయింది. అప్పుడు..) తాకుటకసాధ్యమైన నీ కోపాన్ని నీ అంగన (లక్ష్మీదేవి) ని చూచి మానివేశావు. నీ కోపాలు ఆ తల్లి ముందు చెల్లవు. నీ జంటయైన ఆ దేవి నీ భార్యకాబట్టి తనే అంకుశం వలె నీపై పని చేసింది.

అప్పుడు భూదేవితో సహా దేవతలందరూ 'అమ్మయ్య' అనుకొని నీకు మొక్కివేడుకున్నారు. కరుణాంతరంగుడవైన నీవు అహోబలంలో గరుడాద్రిపై వెలసి వారిని అనుగ్రహించిన ప్రహ్లాద నరసింహుడవైతివి. శ్రీవేంకటాద్రి నివాసమైయున్న శ్రీవేంకటేశ్వరుడవు కూడా నీవే. ఇదిగో ఇక్కడా పరిశుద్ధంగా ప్రహ్లాద నరసింహుని వలెమేము నిన్ను చూస్తున్నాము ప్రభూ!

## 2-54

### మున్నుడి

అన్నమాచార్యులవారు తనని తాను గోపికగా యశోద సఖిగా భావించుకొని వేంకట రమణుని చిన్ని కృష్ణయ్యగా భావించి గోపెమ్మలతో ఈ కీర్తన రూపంలో ఈ ముద్దులపాపడని కొట్టవద్దమ్మా వాడు ముత్యంలాంటివాడు అని నచ్చచెబుతున్నారు. వాడు 'ముమ్వర' లో ఎక్కువైనవాడట. (తిమూర్తులలో విష్ణువన్నమాట) 'మూలభూతి' అట (ఆది పురుషుడు). చీకటి పడేదాకా, వెన్న తినీ తినీ ముక్కులోంచి వచ్చెస్తుందేమో పొట్టలో సందులేక అన్నంత వెన్న తిన్నాడట ఆ పిల్లాడు. ఎంత విచిత్రమైన ఊహా!!

**ఉ॥ "మొత్తకుడమ్మలాల! ఇటు ముద్దులబారుడు వీడు చూడుడీ!!**
**ముత్తైమువోలె తాన్ మెఱసిముంగిటనాడుచునున్నవాడు,మీ**
**రిత్తరి'వెన్నదొంగ'యని యీతని తిట్టకుడన్న గోపికై**
**క్రొత్తగ అన్నమయ్య తను 'కొండలరాయని'కృష్ణుడంచెనెన్**

**రాగం : కాంభబోజి**

మొత్తకురే అమ్మలాల ముద్దులాడు వీడె
ముత్తైము వలెనున్నాడు ముద్దులాడు ॥మొత్తకురే॥

చక్కని యశోదతన్ను సలిగెతో మొత్తగాను
మొక్కబోయీ కాళ్ళకు ముద్దులాడు
వెక్కసాన రేపల్లె వెన్నలెల్లా మాపుదాక
ముక్కునవయ్యగ తిన్న ముద్దులాడు ॥మొత్తకురే॥

రువ్వెడి తాళ్ళదల్లి రోలదన్ను గట్టెనంటా
మువ్వల గంటలతో ముద్దులాడు
నవ్వెడి చెక్కులనిండా నమ్మిక బాలునివలె
ముమ్వరలో నెక్కుడైన ముద్దులాడు ॥మొత్తకురే॥





వేల సంఖ్యల సతుల వెంట బెట్టుకొనిరాగా
మూలచన్ను కుడిచీనీ ముద్దులాడు
మేలిమి వేంకటగిరి మీద నున్నాడిదె వచ్చి
మూలభాతి తానైన ముద్దులాడు ॥మొత్తకురే॥

### భావామృతం :

ఓ అమ్మలారా! మీరు వీడిని కొట్టవద్దమ్మా వీడెంత ముద్దులు మూటగట్టే బాలుడో చూడండి. వీడు ముత్యం వలె మెఱిసి పోవటంలేదూ? చూడండి.

ఈతని తల్లి అందమైన యశోదమ్మ. వీడి అల్లరి భరించలేక ఆమె పీటతో కొట్టబోతే ఆమె కాళ్ళపై బడి మొక్కి ఇంకెప్పుడూ అల్లరి చేయను అని ముద్దుముద్దుగా అన్నాడు. రేపల్లెలో వీడు చాలా ఎక్కువగా చీకటిపడే దాకా వెన్నలు తింటూనేవున్నాడు. ఎంత తిన్నాడంటే వీడి పొట్ట పట్టక ముక్కుల్లోంచి వెన్న వచ్చేస్తుందేమో అన్నంతగా తిన్నాడర్రా! ఈ ముద్దులపిల్లాడి అల్లరేంచెప్పను?

ఇతని తల్లి యశోద వీడి అల్లరి భరించలేక రువ్వెడి తాళ్లతో (వాడి పారేసిన పాత తాళ్ళతో) ఒక రోటికి వీడిని కట్టేసిందట. వాడికాలి మువ్వలలోని గంటలు చప్పుడు చేశాయట. అటువంటి అందెలతో నున్న ముద్దులమూట ఈ చిన్నికృష్ణుడు.

వీడొక్కడే నమ్మదగ్గవాడిలాగ చెక్కిళ్ళనిండా ఎలా నవ్వుతున్నాడో చూడండి. ఈ ముద్దుల ముత్యం ఎవరనుకొన్నారు. త్రిమూర్తులలోనే సర్వశ్రేష్ఠుడైన శ్రీమన్నారాణుడు.

వేల సంఖ్యలో గోపికలంతా మూకుమ్మడిగా పితూరీ చేయటానికి ఇంటిపైకి వస్తే ఆ మూల తల్లి ఒడిలో నంగనాచిలా పడుకొని ఎలా రొమ్ము చీకుతున్నాడో చూడండి. ఎంత ముద్దొస్తున్నాడో!! బంగారపు వేంకటగిరి మీదనున్న ఈ ముద్దుల పాపడు (మూలభూతి) ఆదిపురుషుడు, అయిన శ్రీవేంకటేశ్వరుడే సుమా!!

## మున్నుడి 2-55

శ్రీ మన్నారాయణుని దశావతార విభవమును వర్ణించాలంటే అన్నమాచార్యులవారికి సాటి మరొకరుండరని నాభావన. ఎంత నర్మగర్భంగా చెబుతారంటే నా బోటివాళ్ళు నిఘంటువుల్ని వెదకి, పెద్దలను అడిగి, కొంత భావించి, నానా తిప్పలు పడితే ఏదోఒక కొలిక్కి వస్తుంది. అంతమాత్రాన ఆచార్యులవారి భావం ఖచితంగా (మనం అంతా ఈనాడు ఈ పదాన్ని 'ఖచ్చితం' అంటున్నాం, కానీ దీని అర్థం చెక్కినట్లు అని....) ఇదీ అని చెప్పే "దమ్ము" మన ఎవరికీలేదేమో! మన భావన పరిధి అంతేనని సరిపెట్టుకోవాలి... ప్రయత్నించటమే మన కర్తవ్యం.

**ఆ.వె॥హరి ప్రతాపములను అన్నయ్య వివరించె**
**మేటి కీర్తనమున సాటిలేక**
**మును దశావతారముల వర్ణన వలెనే**
**మనసు పులకరించు వినినయంత.**

**రాగం : హిందోళం**

హరీ నీప్రతాపమున కడ్డమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా ॥హరీనీ॥

నీవు నీళ్ళు నమిలితేనె నిండెను వేదములు
యీవల తలెత్తితేనె ఇంద్ర పదవులు మించె
మోవమూతి గి(గ)రిపితే మూడులోకలు నిలిచె
మోవిబార నవ్వితేనె ముగిసి రసురులు ॥హరీనీ॥

గోర గీరితే నీరై కొండలెల్ల తెగ బారె
మారుకొంటె బయటనే మడుగులై నిలిచే
చేరియడుగు వెట్టితే శిలకు ప్రాణము వచ్చె
కూరిమి కావలెనంటె కొండ గొడుగాయెను ॥హరీనీ॥





కొంగు జారినంతలోనై కూలెను త్రిపురములు
కంగి కమనించితేనె కలిదోషములు మానె
రంగుగ నీ శరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే ॥హరీనీ॥

**భావామృతం :**

ఓ శ్రీహరీ! నీశౌర్యమునకు అడ్డునిలవగల దేమన్నావున్నదా? లోకములన్నింటిలోను నిన్నెదిరించగలవారెవరు? ఓ సర్వేశ్వరా! నీ విభవము నేనేమని వర్ణించను.

నీవు నీళ్ళను నమలగానే (పుక్కిలించగానే) వేదములన్నీ రక్షించబడ్డాయి. (మత్స్యావతారము), ఇటువైపు తలెత్తగానే (అవతరించగానే) ఇంద్రాది దేవతలకు పదవులు నిలిచాయి(కూర్మావతారం.) ఎందుకంటే నీవు మందరిగిరి మోస్తేనే కదా దేవతలకి అమృతం దొరికింది. ప్రభూ! నీవు దీర్ఘముగా సాగిన మూతిని ధరించగానే (వరాహావతారం), ముల్లోకాలు నిలిచినవి. ముఖమంతా నవ్వుపులుముకోంగానే (నరసింహావతారం) రాక్షసుల కథ అంతా సమాప్తమైపోయింది. ఓ మహానుభావా! నీవు కాలిగోరితో గీకగానే హిమాలయాలన్నీ నిండి పోతాయేమోనన్నట్లు గంగపారి అందర్నీ పునీతుల్ని చేసింది.(వామనావతారము) నీవు ఎదుర్కోగానే బాహాటంగానే (నెత్తురు) మడుగులై పాదముతాకించినంతమాత్రాన శిలకు ప్రాణం వచ్చేసి (అహల్యయై) తరించింది పారినది (పరశురామావతారం). నీవు (శ్రీరామావతారం). నీవు ప్రేమతో వుద్యమించగానే కొండగొడుగై అందర్నీ రక్షించింది (గోవర్ధనగిరి నెత్తిన శ్రీ కృష్ణావతారం).

నీవు కొంగుల్నివూడదీయగానే త్రిపురములు కూలిపోయినవి (భార్యల శీలం చెడిపోతేనే త్రిపురాసురులు మరణిస్తారు). (బుద్ధావతారం). ప్రయత్నించి దహించివేయగానే కలిపురుషుని దోహములన్నీ నాశనము చేయబడినవి (కల్కి అవతారం). ఎదుటనే శ్రీవేంకటేశ్వరుడవైన నిన్ను మేము ఒప్పగునట్లు శరణు జొచ్చినంతనే నీ దాసులమైన మమ్మల్ని వెనువెంటనే రక్షించితివి. అందుకే పైన చెప్పిన ఆ అవతార పురుషులందరికీ మూలపురుషుడవు నీవే తండ్రీ!

## 2-56

### మున్నుడి

అన్నమాచార్యులవారు అహోబిలంలో వెలసిన నృసింహ దేవుని ఇల్లాలు లక్ష్మీదేవిపై చెప్పిన మధురమైన సంకీర్తన ఇది. ఆ తల్లే అలమేలుమంగమ్మ అని ఆచార్యులవారి భావన. ఈ నరసింహుని ఇల్లాలు శ్రీమహాలక్ష్మి భక్తులపాలిటి కల్పవృక్షం ఆ తల్లి. సర్వసంపదలనొసగి కరుణించే జగజ్జనని ఈ తల్లి. 'ఈపె' అంటే నేటి కాలంలో 'ఈమె' అని...

**సీ॥ గరుడాద్రి వేదాద్రి యిరవైన కలిమియై**
**చింతామణై ఈమె సిరులొసంగె**
**పాలసంద్రములోన పద్మాలయే తాను**
**శ్రీనరసింహుని చాన ఈమె**
**లోకమాతని పేరుజేకొన్న ఇందిర**
**చాకచక్యంబుతో లోకమేలు**
**ఘనసంపదల నిచ్చు కమలనాభుని కాంత**
**మదనుని కన్నట్టి మాత ఈమె**

**తే॥ తాను హరిప్రియ, శ్రీకాంతు తరుణి ఈమె**
**వేంకటేశుని ఇంతియై వెలసియుండె**
**ఆ అహోబలంబున గొల్చె అన్నమయ్య**
**తావుకొన్న నిధానము, తల్లిమాకు.**

**రాగం : రీతిగౌళ**

గరుడాద్రి వేదాద్రి కలిమి ఈపె
సిరులొసగీ చూడరో చింతామణి ॥గరుడాద్రి॥

పాలజలధి పుట్టిన పద్మాలయ ఈపె
లాలిత శ్రీనారసింహు లక్ష్మి ఈపె
మేలిమి లోకమాతయై మించిన మగువ ఈపె
ఈలీల లోకములేలే ఇందిర ఈపె ॥గరుడాద్రి॥





ఘనసంపద లొసగు కమలాకాంత ఈపె
మనసిజు గనిన రమాసతి ఈపె
అనిశము బాయని మహా హరిప్రియ ఈపె
ధన ధాన్య రూపపు శ్రీతరుణి ఈపె ॥గరుడాద్రి॥

రచ్చల వెలసినట్టి రమావనిత ఈపె
మచ్చిక గల అలమేల్మంగ ఈపె
ఇచ్చట వేంకటాద్రినీ అహోబలమునందు
నిచ్చలూ తావుకొనిన నిధానము ఈపె ॥గరుడాద్రి॥

### భావామృతం

శ్రీ మహాలక్ష్మి 'వేదాద్రి' అని పిలువబడే గరుడాద్రి (అహోబలం) పై నెలకొన్న ఐశ్వర్యము. ఈమె సంపదల నొసగే చింతామణి. (పాలసముద్ర మధనమున లక్ష్మీదేవి తోబుట్టిన 'మణి' కోరుకున్న భాగ్యముల నొసగే దివ్యమణి)

క్షీరసాగరమధనమున పుట్టి పద్మములో నివాసము గొనిన తల్లి ఈమె. ఉగ్రనరసింహుని లాలించి తన స్వాధీనం చేసి కొనిన శ్రీమహాలక్ష్మి ఈమె. లోకములన్నింటికి జననియై బంగారమువలె అన్నిటినీ మించిపోయినది ఈమె. ఈవిధముగా జగములనన్నింటినీ పరిపాలించుచున్న ఇందిరాదేవియే ఈమె.

ఎన్నెన్నో ఘనమైన సంపదల నొసగే కమలాదేవి ఈమెయే. అందాల మన్మధుని గన్నతల్లి ఈ రమాదేవి. శ్రీహరిని క్షణముకూడ విడిచి యుండలేని హరిప్రియ ఈమె. ఈ ప్రపంచంలోని జనులనందరినీ ధనరూపములో, ధాన్యరూపములో ఈ ఐశ్వర్యకాంత అనుగ్రహిస్తున్నది.

దేవ దానవులు రచ్చజేస్తే క్షీరసాగరమును పోటా పోటీగా మధించినప్పుడు) వెలసిన రమాదేవి ఈమె. ఆప్యాయత సాకారమైన జగజ్జనని అలమేల్మంగయే ఈమె. వేంకటాద్రిపైననేగాక ఇక్కడ అహోబలంలో కూడ నిత్యమూ నెలకొన్న నిధానము ఈ మహాలక్ష్మి. ఈమెను కీర్తించి తరించండి.

**2-57**

## మున్నుడి

నా చిన్నప్పుడు సదాచార కుటుంబాలలో తరచూ వినపడే మాట 'వీటికి చదువూ సంధ్యా లేవేమిట్రా'... అని. నేడు అన్నమాచార్యువారి కీర్తనకు మున్నుడి వ్రాస్తుంటే మా పెద్దల మాటలకర్థం 'తళుక్కున' మెఱసింది. సరస్వతీ కటాక్షం వున్న వాడికి చదువు (ఏబీసీడీలు కాదు, వేదవిద్య) వచ్చేది. ఆ దేవి కరుణలేని వాడికి 'వడుగు' చేసి సంధ్యావందనము చేస్తూ, ఏదో 'వృత్తి' తో ఏదో బ్రతకమనేవారు. ఏది ఏమైనా సంధ్య. వార్చుట మాత్రం నిత్యకృత్యమే. భక్తి మార్గంలో భగవంతుని శరణాగతిని పొందిన వానికి సంధ్యతో కూడా పనిలేదు. మరి వారికి 'సంధ్య' అంటే ఏమిటో వివరిస్తున్నారు... అన్నమయ్య.

**ఉ॥ సంధ్యన వైష్ణవుండెపుడు చక్కటి వర్తన సంచరించుటే**
**సంధ్యన శ్రీహరిన్ మదిని సన్నుతిజేయుట యెల్లవేళలన్**
**సంధ్యన సేవభాగవత సాధులజేయుట, అన్నమయ్యనెన్**
**సంధ్యన 'వేంకటేశ' యని జన్మతరించగ తృప్తి గొల్చుటే**

**రాగం : సామంత**

సహజ వైష్ణవాచార వర్తనుల
సహవాసమె మా సంధ్య ॥సహజ॥

అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మా సంధ్య
మతి రామానుజమతమే మాకును
చతురతమెరసిన సంధ్య ॥సహజ॥

పరమభాగవత పదసేవనమే
సరవినెన్న మా సంధ్య
సిరివరు మహిమలు చెలువొందగ వే
సరక వినుటే మా సంధ్య ॥సహజ॥





మంతుకెక్క తిరుమంత్ర పఠనమే
సంతతమును మా సంధ్య
కంతు గురుడు వేంకటగిరి రాయని
సంతర్పణమే మా సంధ్య ॥సహజ॥

## భావామృతం

వైష్ణవ సిద్ధాంతములను నమ్మి శ్రీమన్నారాయణుని శరణు పొందినవానికి ఆ వైష్ణవులతో 'సహవాసము' చేస్తూ జీవించుటయే సంధ్య (సంధ్య వార్చుట), అను సంధ్యావందనము.

మా వైష్ణవులకు నిరంతరమూ శ్రీహరి నామ సంకీర్తన విశిష్టముగా చేయుటయే సంధ్యావందనము. త్రికరణ శుద్ధిగా శ్రీరామానుజాచార్యులవారి మతము (విశిష్టాద్వైతము) నవలంభించుటయే, మాయొక్క నేర్పరితనం చాటునటువంటి సంధ్య.

శ్రీమన్నారాయణుడే సర్వస్వం అని సద్బుద్ధితో సన్మార్గంలో జీవించే పరమ భాగవతోత్తములను గురువులుగా గౌరవించుచూ వారి పాదసేవనము చేస్తూ ఒక పద్ధతిగా జీవించుటయే నిజమైన సంధ్య. శ్రీపతియైన శ్రీహరి యొక్క దివ్యమహిమల గురించి విసుగులేకుండా శ్రద్ధగా వినుటయే మాకు సంధ్యావందనము.

ప్రసిద్ధికెక్కిన "ఓం నమో నారాయణాయ అను పవిత్ర అష్టాక్షరీ మంత్రమును త్రికరణ శుద్ధిగా ఎప్పుడూ జపించుటయే మాకు సంధ్యావందనము. మన్మధుని జనకుడైన వేంకటాద్రి సర్వేశ్వరుడు శ్రీవేంకటేశ్వరుని సంతర్పణ (తృప్తిగా సేవించుట) యే మా విశిష్టాద్వైతులకు నిజమైన సంధ్యావందనము. అంతేగాని భక్తిలేకుండా ఏదో ముక్కునపెట్టుకొన్నది చీదినట్లు, ప్రొద్దు పొడుచుటకు ముందు అయిదు ఘడియల కాలము, సూర్యుడు నడినెత్తిన వున్నప్పుడు, ప్రొద్దుగ్రుంకిన వెనుక మూడు ఘడియలు భగవంతునికి నమస్కరించుట (ప్రార్థించుట) మాత్రమే ఎన్నటికీ సంధ్యావందనము కాదు.

## 2-58

### మున్నుడి

నాకు సహజగుణములన్నీ దుర్గణములే. నేనెప్పుడు మంచివాడనవగలను? ఎప్పుడు కృతార్థుడనై నీదయపొందుతాను? ఎట్లాగైనా నీవే నన్ను క్షమించి నన్ను ఆదుకోవాలి. ఓ దేవా! ఎందుకంటే... వేప చేట్టు చేదుపోతుందా? పాము విషం పోతుందా? పాపపుణ్యాలు తగులుకొన్న నాకు చాపల్యం ఎందుకు వుండదు? కామక్రోధములు పెనవేసుకొన్న నేను మదపుటేనుగులా కాక ఎలా ప్రవర్తిస్తాను? ఇవన్నీ ఒక్కసారిగాపోయి ఓ మహానుభావా! నాకు చటుక్కున శాంతము రమ్మంటే వస్తుందా? అంటున్నారు అన్నమాచార్యులవారు.

**చ॥ సహజము వేపమానికిని చావకయుండుట చేదు, నిక్కమౌ**
**సహజము అన్నమార్యుడనె సర్పవిషంబది పండ్లనుంటయున్**
**సహజము కామక్రోధముల సామజమట్లుగ నేను నీల్గితిన్**
**మహి తిరు వేంకటేశ్వరుని భక్తిని గొల్వక శాంతమొచ్చునా?**

**రాగం : సామంతం.**

ఎన్నడు మంచివాడనయ్యేను నేను
నన్ను నీవు మన్నించి నడపవే దైవమా ॥ఎన్నడు॥

వేపమానికిని చేదు ఎడువకయుండేది
యే పొద్దు సహజమే ఎంతైనాను
పాపపుణ్యలంపటాన బరగి వుండేటి నేను
చాపల దుర్గుణినౌట సహజమే ॥ఎన్నడు॥

పాముకు విషమెప్పుడు పండ్లబెటు కుండేది
భూమిలో సహజమే పొరినెంతైనా
కామక్రోధుడ నాకు గరుణ యించుక లేక
సామజపు దుర్మదము సహజమే ॥ఎన్నడు॥





అటుగాక శ్రీవేంకటాధిప నాకికవేరే
తటుకున నేడు శాంతము వచ్చీనా
ఘటన నీ కృపయందు గలిగిన మేలు నాపై
తటుకన ముంచి నన్ను దరిచేర్చవే ॥ఎన్నడు॥

**భావామృతం :**

ఓ దైవమా! శ్రీవేంకటేశ్వరా! పాహిమాం! నన్ను రక్షించు. నేను ఎన్నడు మంచివాడనవుతాను, ఎన్నడు నీ కృప పొందుతాను? అది అంత తేలికగా అయ్యే పనియేనా? నన్ను నీవే క్షమించి దయతో సన్మార్గంలో నడపాలి. ఎందుకంటే...

వేపచెట్టుకు 'చేదు' సహజగుణము. అది ఎన్నడైననూ దాని చేదు గుణం వదులుకొంటుందా? ఎంతైనా, ఏం చేసినా దాని సహజగుణం పోతుందా? పాప పుణ్యాలు లంపటంలో ఇరుక్కుపోయిన నేను అంతులేని పాపాలూ చేస్తున్నాను, అడపా దడపా పుణ్యాలూ చేస్తున్నాను. చిత్త చాపల్యం అనే దుర్గుణము ఒకటి నన్ను పీడించటం వలన అవన్నీ చేస్తున్నాను. మరి అదేమో నా సహజగుణం. ( ఈ పాప పుణ్యాల వల్ల నాకు జనన మరణాల పీడ తప్పటం లేదు.)

పాముకు పండ్లలో (కోరలలో) విషము వుండటం సహజం. అది పెట్టింది కూడా నీవే. అందుకని అత్యంత సహజమైన కాటువేసే గుణాన్ని అది వదులుకోదు. మానవులమైన మాకు కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములనే ఆరు దుర్గుణాలచే పీడించబడే నేను మదపుటేనుగు వలె ప్రవర్తించక ఎలా వుంటాను? అది నా సహజ గుణం.

ఓ శ్రీవేంకటేశ్వరా! అట్లాకాకుండా చటుక్కున సులభంగా ఒక్కసారి ఈ రోజున శాంతస్వభావం వచ్చేస్తుందా? మరేమిటి దారి? నిశ్చయించుకొని నీవు నాపై నీ కృపజూపి నాకు మేలు చేయాలి. నన్ను నీ దరి జేర్చుకోవాలి. ఈ లంపటాలనుంచి నన్ను విముక్తుణ్ణి చేయాలి. నన్ను రక్షించాలి. అంతే...

## 2-59

### మున్నుడి

త్రిసంధ్యలలో శ్రీ మన్నారాయణుని 'కేశవ నామాలను' కీర్తించటం మన ఆర్షసంప్రదాయం. నేటి ఉరుకుల పరుగులకాలంలో, నిలుచునేతింటున్నాం. స్నానం కూడా మొక్కుబడిగానే చేస్తున్నాం. మనబోటివారి కోసమేనేమో అన్నమాచార్యులవారు ఇటువంటి 'భజన' రూపంలోని కీర్తనలు చెప్పారు. ఇందులో కేశవనామాలే కాక స్వామి దశావతార నామాలూ వున్నాయి. 'కాపీ' రాగం భజనకు చక్కగా సరిపోయింది. సంస్కృత సంకీర్తన అవటం వల్ల ఉచ్చారణలో లోపంలేకుండా చూసుకుంటే చాలు. మూడు నిముషాల్లో ముక్తికి దగ్గరగా జరగవచ్చును.

**కం॥ హరినామ భజన నివ్విధి**
**జరుపగ అన్నయ్య కెవరు సాటిర జగతిన్**
**తిరువేంకటేశు సన్నుతి**
**శరణాగతి కంటె మేటి సాధన కలదే?**

**రాగం : కాపి**

మాధవా కేశవా మధుసూదనా విష్ణు
శ్రీధరా పదనఖం చింతయామి యూయం ॥మాధవా॥

వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామెదరానిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో ॥మాధవా॥

పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణా అధోక్షజా
నరసింహ హృషీకేశ నగధరా త్రివిక్రమా
శరణాగత రక్ష జయజయ సేవే ॥మాధవా॥





మహిత జనర్దన మత్స్య కూర్మ వరాహ
సహజ భార్గవ బుద్ధ జయ తురగ కల్కి
విహిత విజ్ఞాన శ్రీవేంకటేశశుభకరం
అహమిహ తవపదదాస్యం అనిశం భజామి ॥మాధవా॥

**భావామృతం :**

ఓ మాధవా! కేశవా! మధుసూదనా! (మధు అనే రాక్షసుని మర్దించిన వాడు), విష్ణుమూర్తి!, శ్రీధరా! నేను నీ పాదముల వ్రేలిగోళ్ళను (పదనఖం) గూర్చి ఎల్లవేళలా బాగుగా ఆలోచించెదను..(ధ్యానింతును).

ఓ వామనావతారా! గోవిందా! వాసుదేవా! శ్రీరామావతారా! బలరామా! శ్రీకృష్ణా! నారాయణా! అచ్యుతా! దామోదరా! అనిరుద్ధా! దైవపుండరీక నయనా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులను త్రిమూర్తుల యొక్క నామములూ కైవశము చేసికొనిన మహానుభావా! నమో నమః అంటూ నమస్కరించుచున్నాను.

ఓ పురుషోత్తమా! తెల్లతామరలవంటికన్నులు కలిగిన దివ్యపురుషా! శ్రీహరీ! సంకర్షణా! అధోక్షజా! నరసింహా! హృషీకేశా! నగధరా! (గోవర్ధనోద్ధరా!)! త్రివిక్రమా (మూడు పాదములతో సర్వజగతిని ఆక్రమించిన అద్భుతరూపా!) శరణన్నవారిని రక్షించుటయే దీక్షగా గల ప్రభూ! జయ జయ ధ్వానములతో నిన్ను సేవించుచున్నాను. నన్ను రక్షింపుము తండ్రీ!

దివ్య మహిమలు గల ఓ జనార్దనా! ఆద్యవతారములు అనగా మత్స్యకూర్మవరాహ అవతారములు ధరించి ఆయా సందర్భాను గుణంగా దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసిన దేవదేవా! తరువాత పరశురామునిగా భీభత్సం, బుద్ధునిగా శాంతం, హయగ్రీవునిగా తత్త్వబోధ, కల్కిరూపంలో విలయం ప్రదర్శించిన సర్వేశ్వరా! నీవే నేడు బాగుగా వేలుచేయు విజ్ఞానమును ప్రసాదించి శుభములనొసగే శ్రీవేంకటేశ్వరుడవైతివి. అట్టినిన్ను నేను ఇక ఎల్లవేళలా భక్తితో నీ పాదదాసుడనై భజించెదను.

## 2-60

## మున్నుడి

ఆర్తితో, శరణాగతితో శ్రీమన్నారాయణుని అనుయాయులను పలువురను పేరుపేరునా పిలిచి వేడుకొంటున్నారు అన్నమాచార్యులవారు. అయ్యా! దయచేసి నన్ను కరుణించి ఇందిరానాథుని తెచ్చినాకివ్వండి. చాలపొద్దయింది. నేను స్వామిని పూజించుకోవాలి. ఓ ఆంజనేయా! ఓ గరుత్మంతా! ఓ ప్రహ్లాదా! ఓ అర్జునా! ఓ ఆదిశేషా! ఓ కార్తవీర్యార్జునా! అయ్యలారా! నాకు స్వామిని చూపించండి. మిమ్మల్ని వేడుకొంటున్నాను. ఎంత అద్భుతమైన కీర్తనయో కదా! శివరంజని రాగంలోని ఈ కీర్తన రాళ్ళను, శ్రీనాధుని కూడా కరిగిస్తుంది.

**ఉ॥ ఇందిర ప్రాణవల్లభుని ఈయరొమాకనె అన్నమార్యుడున్**
**పొంది మహానుభావునిక పూజలు సేయుటకాయె జాగనెన్**
**సుందరమైన రాగమిది సొంపగు ఈ 'శివరంజనిన్' వినన్**
**ఎందుకు శంక? రాల్గరుగు ఏలిక వేంకటనాథుతోడుతన్.**

**రాగం : శివరంజని**

ఇందిరారమణు దెచ్చి యీయరో మాకిటువలె
పొంది ఇతని పూజింప పొద్దాయె నిపుడు ॥ఇందిరా॥

ధారుణిమైరావణు దండించి రాముదెచ్చి
నేరుపున మించిన అంజనీ తనయా
ఘోరనాగపాశముల కొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా ॥ఇందిరా॥

నానా దేవతలకు నరసింహు కంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుడా
మానవుడై (డౌ) కృష్ణ మహిమల విశ్వరూపు
పూని బండి నుంచుకొన్న పోటుబంట అర్జునా ॥ఇందిరా॥





శ్రీవల్లభునకు అశేష కైంకర్యముల
శ్రీవేంకటాద్రిపైన శేషమూరితీ
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుడా
దేవుని నీవేళ నిట్టే తెచ్చి మాకు నియ్యరే ॥ఇందిరా॥

**భావామృతం :**

ఇందిరాదేవియైన శ్రీమహాలక్ష్మీవల్లభుని తర్వగా తీసికొనివచ్చి మాకియ్యండి. మిమ్మల్ని వేడుకొంటున్నాను. చాల ప్రొద్దెక్కింది. మేమా శ్రీహరిని పూజించుకోవాలి. నా మొరవినండి.

పాతాళలోకంనుంచి భూలోకం వచ్చి శ్రీరామచంద్రుని అపహరించి బలినీయ బోయున మైరావణుని శిక్షించి తుదముట్టించిన ఓ అంజనీపుత్రా! హనుమా! నీవు మిక్కిలి బుద్ధిమంతుడవు. (నా మొర వినవా!) ఇంద్రజిత్తు నాగాస్త్రంతో రామలక్షణులను సర్పబద్ధులనుచేయగా ఘోరమై ఆనాగపాశములనన్నింటినీ నిర్వీర్యంచేసి ఆ స్వామి కరుణను పొందిన ఓ పక్షిరాజా! గరుత్మంతా! నీవన్నా నన్ను కరుణించి ఆ శ్రీహరిని తెచ్చి నాకీయరాదా?

ఉగ్రనరసింహుని స్తంభంలో నుంచి తెప్పించి ఆయన హిరణ్య కశిపుని వధించగా ప్రార్ధించి శాంతుని జేసి, తరువాత దేవతలందరికీ ఆయన అనుగ్రహం ప్రసాదింపజేసిన ప్రహ్లాదా! నాపై దయతో నాకు కూడా ఆయన దర్శనం ఇప్పించరాదా? మానవరూపంలోవున్న శ్రీకృష్ణపరమాత్మ విశ్వరూపం చూపించి అనుగ్రహించగా ఆయననే తన రథ సారధిగా నియమించుకొని తన రధంలోన వుంచుకొన్న వీరాధివీరా! అర్జునా! నీవైన నా స్వామిని నాకు ప్రసాదించరాదా?

శ్రీపతికి అంతులేని భగవత్సేవలు చేయుచూ శ్రీవేంకటాద్రి మీద స్వామిచెంతనే వుండే ఓ ఆదిశేషా! నన్ను కనికరించి నా స్వామిని నాకు చూపించలేవా? నా మొరాలకించవా? సహస్రబాహువులలో రెండు మాత్రం వుంచి తక్కినవన్నీ ఖండించిన పరశురాముని ప్రార్ధించి ఆయన అనుగ్రహం సంపాదించిన ఓ కార్తవీర్యార్జునా! నీవైనా ఇందిరారమణుని ఈవేళ నాకు తీసికొని వచ్చి ఈయరాదా? నన్ను ధన్యుని చేయరాదా?

**2-61**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళ విగ్రహాన్ని తిలకించి భావోద్వేగంతో అన్నమాచార్యులవారు చెప్పిన అజరామరమైన సంకీర్తన ఇది. నన్నెప్పుడూ విడిచిపెట్టకు స్వామీ! అని వేడుకొంటున్నారు. తనకులదైవమూ, నిధానము, ఏడుకొండలవాడే నన్నారు. తన పాలిటి పారిజాతము, చింతామణి, కామధేనువు శ్రీనివాసుడేనంటున్నారు. అందర్నీ రక్షించే భూమాత భర్తవయ్యానీవు అంటున్నారు. చెడిపోకుండా బ్రతికించే సిద్ధమంత్రం నీవు అంటున్నారు. 'కూడా' విడిచి పెట్టకుండా తిరిగే మాప్రాణబంధువంటున్నారు. ఇదికదా భక్తి అంటే...

**చం॥ సురజన రక్షకుండు పురుషోత్తముడీ విభుడాదిదేవుడున్**
**వరముల రాశిగా నిడును బాసట దీనజనాళి దాతయున్**
**హరిని భజించె కీర్తనము అద్భుతమైనది అన్నమయ్య తాన్**
**మురిపెము దీర వేంకటవిభున్ తనుగొల్చెను జన్మధన్యమై.**

**రాగం : మోహన**

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటి రాయడా పొడగంటి

కోరిమమ్మునేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించు దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువ చిత్తములోని శ్రీనివాసుడా ॥పొడగంటి॥

భావింప కైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోర (రి) కలిచ్చే కామధేనువా, మమ్ము
తావైరక్షించేటి ధరణీ ధరా ॥పొడగంటి॥





చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా-
లడచి రక్షించే దివ్యౌషధమా
బడి బాయక తిరిగే ప్రాణబంధువా, మమ్ము
గడయించినట్టి శ్రీవేంకటనాథుడా ॥పొడగంటి॥

**భావామృతం :**

ఓ పురుషోత్తమా! కోనేటి రాయా! నేడు మిమ్ము దర్శించి ధన్యుల మయ్యాము తండ్రీ! ఇకపై మమ్ము క్షణం కూడా విడిచిపెట్టవద్దు ప్రభూ!

నీవు మా'కులదైవానివి.' అందుకని మమ్ము అనుగ్రహంతో పరిపాలించు స్వామివై నావు. మా పెద్దలందరూ ఈ విషయం గ్రహించి నిన్ను మాకిచ్చారు. అందుచేత నీవు మాకు 'పాతర' వంటి 'నిధానము' అయినవాడవు. మమ్మల్ని ఆదరించి మా దప్పిక తీర్చునట్టి కదు నల్లటి జలంధరము (నీరు వున్న కారుమేఘము) నీవే ప్రభూ! నీవు ఎక్కడో వైకుంఠంలో లేవు. దగ్గరగా మామనస్సుల్లోనే శ్రీనివాసుడవైయున్నావు. (మా దురదృష్టం వలన మేమది గ్రహించలేకున్నాము.)

నిన్ను మనస్సులో భావించినంత మాత్రం చేతనే ఎన్నడూ వాడని పారిజాతవృక్షం వలె దివ్య సౌరభాలను వెదజల్లబడినవా అన్నట్లు ఆహ్లాదాన్నిస్తావు. 'దైవమణి'యైన 'చింతామణి వలె ధైర్యము నొసగి రక్షింతువు. కామదేనువు వలె కామించిన కామనములన్నీ (కోరికలను) తీరుస్తావు. మా అందరికీ నివాసస్థానమై రక్షించే భూమాతకే నీవు భర్తవు (నీకంటే రక్షించేవాడెవడు?)

'ఓం నమో వేంకటేశాయ' అనే సిద్ధమంత్రం సర్వులను చెడనీయక బ్రతికిస్తుంది కోనేటి రాయుడు అన్ని రోగాలను రూపుమాపే దివ్యౌషధము. గిరిగీసినట్లు, బడి బాయక (క్రమము తప్పక) మా సమీపముననే నిలిచి కాపాడే ప్రాణ బంధుడవు నీవే . ఓ శ్రీవేంకటేశ్వరా! మమ్మల్ని నీ స్వంతం చేసికొన్నావు తండ్రీ!

**2-62**

## మున్నుడి

శ్రీమన్నారాయణుని కల్కి అవతారమును వివరించే కీర్తన ఇది. క్షీరసాగరమధనంలో జన్మించిన 'ఉచ్ఛైశ్రవము' అనే తెల్లని దివ్యాశ్వము ఇంద్రుని చేరింది. వేంకటేశ్వరుడే కల్కియై తెల్లని ఆ అశ్వాన్నెక్కి శంఖ, చక్ర, గదా, ధనుః ఖడ్గధారియై దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు బయలుదేరాడు. జయలక్ష్మి రూపంలో అమ్మవారు కూడా స్వామిని కౌగలించి, గట్టిగ పట్టుకొని, వెన్నంటిందట. కొంతమంది ఈ కీర్తన వేంకటనాథుడు వేటకు వెళ్లడాన్ని వివరిస్తోంది అంతే, అంటున్నారు. కానీ శేషుని 'డాలు' గా చేసికోవటం, ధూమకేతువుని బల్లెంగా చేసికోవటం వంటి చరణాలు నాకు కల్కివర్ణనే అనిపిస్తోంది.

**ఉ॥ "వేట" కు నేగెనంట హరి వెన్నును దట్టిన భామతోడుతన్**
**దీటుగ గుఱ్ఱమెక్కెనట తేకొని ఆయుధ ప్రాణియై అహో!!**
**సాటి మరెవ్వడో తెలుపసాధ్యమె? లేరుర అన్నమయ్యకున్**
**మేటిది కీర్తనంబు తిరువేంకటనాథుని గొల్పుడీయెడన్**

**రాగం : అఠాణా**

నీవు తురగము మీద నేర్పుమెరయ
వేవేల రూపములు వెదజల్లితపుడు ॥నీవు॥

పదిలముగ నిరువంక పసిడి పింజల యంప-
పొదల తరకసములొరపులు నెరపగా
గదయు శంఖంబు చక్రము ధనుః ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైన వపుడు ॥నీవు॥

సొరిది శేషుని పెద్దచుట్టు పెనుగేవడము
సిరిదొలక నొకచేత చిత్తగించి
దురమునకు తొడవైన ధూమకేతువు చేత
నిరవైన బల్లెమై ఏచెనందపుడు ॥నీవు॥





కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌగిట నిన్ను తొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువమని
మెరుగు కుచకుంభముల మిసిమితో నపుడు ॥నీవు॥

## భావామృతం

ప్రభూ! నీవు నేర్పునంతయు ప్రదర్శించుచూ దివ్యాశ్వము మీద (ఉచ్ఛైశ్రవముపైన) వేలకొలది కాంతులను వెదజల్లుతూ అనేక రూపములతో ప్రకాశించితివి.

స్థిరముగా ఇరువైపులా బంగారపు కుచ్చులు (బాణము చివరనుండు కుచ్చు. అది బాణం సూటిగా వేగముగా దూసుకుపోవుటకుపయోగిస్తుంది). ఆయన అంబుల పొదిలో మెరుపులు మెరిపించెను. కౌమోదకి అను గద, పాంచజన్యము అను శంఖము, సుదర్శనము అను చక్రము, శారఙ్గము అను ధనస్సు, నందకము అను ఖడ్గము ఆయన ఆయుధములై పదివేల సూర్యబింబములు ఒకచోటనే కాంతినిస్తున్నాయా అన్నట్లుంది.

వరుసగా చుట్టబడిన ఆదిశేషుని యొక్కచుట్లు విచిత్రమైన పెద్ద'డాలు' (కత్తి యుద్ధం లో ప్రత్యర్థి కత్తివేటును అడ్డుకొనే గుండ్రటి పళ్ళెము) వలె ఆయన చేతులలో విరాజిల్లెను. వినాశనముకు సంకేతమైన 'తోకచుక్క' ఆస్వామి చేతిలో పొడవాటి బల్లెమువలె భూషణమై, విజృంభించినది.

(ఒక ప్రక్క స్వామివారు దుష్టశిక్షణకు ఇలా సంసిద్ధుడై అశ్వారూఢుడవంగానే...) లక్ష్మీదేవిని నేనూ సిద్ధమేనని, కరకజడతో (వేటకుపయుక్తమౌ సామాగ్రితో, చెర్నాకోలతో (అశ్వాన్ని అదలించు కొరడాతో) జయలక్ష్మీ రూపంలో ఆయనకు అశ్వం మీద తోడయింది. ఆ దేవి నీకు తగినట్లుగా నిన్ను బిగి కౌగిట పట్టుకొని నీ వెన్నుదట్టి ధైర్యమునిచ్చినది. (ఆమె ధైర్యలక్ష్మి కదా!) ఓ వేంకటస్వామీ! నిన్ను ఆమె విజయం సాధించమని ఆ విధంగా ప్రోత్సహించుచుండగా మెరయుచున్న ఆమె కుచకుంభములు మిలమిలలాడినవి. ఓ మహానుభావా! ఆమె నీకు అన్ని విధమలా సరి జోడీ తండ్రీ!

**2-63**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఆంజనేయునిపై చెప్పిన అసంఖ్యాక కీర్తనలలో ఇది ఒక మణిపూస. సముద్ర గర్భంలో పరిశోధించేవారు తాముయెంతలోతుకు పోతే అంత విశేషం కనుక్కోగలరట. ఈ కీర్తనల వైశిష్ట్యం కూడా అంతేనేమో అనిపిస్తోంది. నేను చదువుకొనే రోజుల్లో రాయలసీమకు చెందిన నా మిత్రుడొకరు 'కిట్టించి' అనే మాటని అలవాటుచేశాడు. అర్థం తెలియని ఆ పదాన్ని 'ఉజ్జాయంపుగా సరిచేసి ఏదోరకంగా సరిఅయినదిగా చూపించటం' అనే అర్థంలో వాడేవాళ్ళం. అన్నమయ్య దయవల్లనేడు ఈ కీర్తనలో కిట్టి 'అంటే ' 'సమీపించి' అని తెలిసింది. ధన్యోస్మి...

**ఆ.వె.॥ పంతగాడు అయిన పవనాత్మజున్ గొల్చె**
**నన్నమయ్య పాడి అద్భుతముగ**
**బ్రహ్మపట్టమేల వరముపొందుటయెల్ల**
**తిరుమలేశు కృపని తెలిపినారు.**

**రాగం : మలయమారుతం**

పంతగాడు మిక్కిలి నీ పవనజుడు
రంతుకెక్కె మతంగ పర్వత పవనజుడు ॥పంతగాడు॥

వాలాయమై యెంతభాగ్యవంతుడో దేవతలచే
బాలుడై వరములందె బవనజుడు
పాల జలనిధి దాటి పరగ సంజీవి దెచ్చి
యేలక ముందర బెట్టె యీ పవనజుడు ॥పంతగాడు॥

సొంటులు సోదించితెచ్చి సుగ్రీవు రాఘవునికి
బంటుగాక బొందసేసె బవనజుడు
వొంటినే రాముని ముద్రవొసగి సీత ముందర
మింటిపొడవై పెరిగె మేటి పవనజుడు ॥పంతగాడు॥





కిట్టి శ్రీవేంకటేశ్వరు కృపచే ముందరి బ్రహ్మ-
పట్ట మేలనున్నవాడు పవనజుడు
చుట్టి చుట్టి తనకు దాసులయిన వారికి
గట్టి వరములిచ్చె నీ ఘనపవనజుడు. ॥పంతగాడు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ పవనపుత్రుడు ఎంతో పట్లుదలగలవాడయ్యా! ఆ మతంగ పర్వతాన్ని రంతుకెక్కాడు (ఆటలాగా ఎక్కాడు) నీ బంటు అయన వాయునందనుడు.

ఆయ యెంతటి భాగ్యవంతుడో కదా! దేవతలచే తనబాల్యంలో, (వాలాయమై) నిరంతరముగా వరములు పొందినవాడు ఆ పవనజుడు. పాలసముద్రమును కూడా దాటి వెళ్ళి సంజీవని పర్వతం తెచ్చి తన స్వామియైన రామచంద్రుని ముందరనుంచి (లక్ష్మణుని మూర్ఛతప్పించి) ఆయన కాప్తుడయ్యాడు ఈ పవనజుడు.

నమ్మదగినవారో, కారో తెలుసుకొని (సొంటులు సోధించి) తీసికొనివచ్చి సుగ్రీవుని రాఘవునికి బంటుగా అయ్యేట్లు చేసి (మైత్రిని నిలిపినవాడు) ఈ పవనజుడు. ఒక్కడే వెళ్ళి శ్రీరామముద్రికను సీతాదేవికి ఇచ్చి ఆమె తనను చిన్న కోతివలెనే భావిస్తోందని గ్రహించి అద్భుతంగా ఆకాశమంత ఎత్తుపెరిగి తన శక్తి చూపించి ఆమె ఆశలు చిగురింపజేసిన మేటిఘనుడు ఈ పవనపుత్రుడు.

శ్రీవేంకటేశ్వరునికి 'కిట్టి' (దగ్గరవాడై) ఆయన కృపను బొంది రానున్న బ్రహ్మకల్పములో పంచముఖ బ్రహ్మ అవుతాడనే వరమును అనుగ్రహింపబడినవాడు ఈ పవన నందనుడు. బాగుగా సమీపించి (చుట్టిచుట్టి) తనకు దాసులైన భక్తులకు దిట్టమైన వరములను ప్రసాదించు ఘనుడు ఈ పవనపుత్రహనుమ.

## 2-64

### మున్నుడి

అద్భుతమైన వాదనాపటిమతో అన్నమాచార్యులవారు ఓ వేంకటేశ్వరా! ఏదో ఒకకారణం లేకపోతే నిన్ను చూచుట ఎట్లు సాధ్యమవుతుంది? మేము గడ్డితినే జీవులము నీవు పురుషోత్తముడివి. అసురులు బలవంతులైతే, అధర్మం పెచ్చుమీరితే, సంభవామి యుగే యుగే అన్నావు కదా! అప్పుడు నిన్ను కనులారా గాంచగలము. నీకంటే నీ దాసులే మాకుమేలు. నీవు ఎక్కడ వుంటావో చెప్పలేం గానీ నీ దాసులు వుండేచోట మాత్రము నీవు తప్పక వుంటావు". ఔరా!! ఏమి వాదన ఆచార్యులవారిది?

**మ॥ అరరే!! ఏమది వింతగొల్ప వినుమా అన్నయ్యవాదంబులన్**
**ధరలో దైత్యులు మేలు జేతురట నీ దాసుల్ని దండించుచున్**
**తరుగై ధర్మము మంచి కల్గునట ఓ దామోదరా! వింటివా?**
**మురవైరీ! ఇది ఏమి వింత అయినన్ మోదంబుకల్గెన్ భళా!!**

### రాగం : సామంతం

ఊరకైతే నిన్ను గాన-మొక కారణానగాని
పూరి జీవులము నీవు-పురుషోత్తముడవు. ॥ఊరకైతే॥

అసురలు భువి బుట్టు-టది వుపకారమే
అసురులు బాధింతు- రమరులను
పొసగ వారికి గాను-పూనక వచ్చి నీవు
వసుధ జనించితేను-పడి నిన్ను గందుము ॥ఊరకైతే॥

అదరి ధర్మము చెడి-యధర్మమైనా మేలు
వెడగు మునులు విన్న-వింతురు నీకు
తదరి ధర్మము నిల్ప-ధరణి బుట్టుదు వీవు
బడి నిన్ను సేవించి-బ్రదుకుదు మపుడే ॥ఊరకైతే॥





నీ కంటె మాకు జూడ-నీ దాసులే మేలు
పైకొని వారున్న చోట-బాయకుందువు
చ కొని శ్రీవేంకేశ-చెప్పగానే వారిచేత
నీ కథలు విని విని-నే మీదేరితిమి ॥ఊరకైతే॥

### భావామృతం :

ఓ ప్రభూ! మేము నిన్ను ఊరకనే చూడాలంటే సాధ్యమయ్యే పనికాదు. ఎందుకంటే నీవేమో పురుషోత్తముడవు. మేమేమో పూరి జీవులము. (గడ్డితినే పశువుల్లాంటి, అజ్ఞానులం).

రాక్షసులు భూమిపై జన్మించుట చేత వుపకారమే జరిగింది. ఎందుకంటేవాళ్ళు అట్లాపుట్టి దేవతలను బాధించ బట్టేకదా! వారిని సంహరించుటకు నీవు భూమిపై జన్మిస్తావు. అప్పుడు నిన్ను కనులారా చూచి మేము తరించగలము లేకపోతే నీవెందుకు వస్తావు, మేం నిన్ను ఎట్లా చూస్తాము?

విజృంభించి ధర్మం పూర్తిగా చెడిపోయి అధర్మం పెట్రేగిపోవడమే మంచిది స్వామీ! ఎందుకంటే అటువంటప్పుడు ధర్మసంస్థాపన కొఱకు నేను మరల మరల భూమిపై జన్మిస్తాను అని భగవద్గీతలో నీవే చెప్పావు కదా!! ధర్మం చెడగానే పాపం వెర్రి మునులంతా గగ్గోలు పెడతారు. అప్పుడు పాపులనడ్డగించి ధర్మం నిలబెట్టిటానికి నీవు భూమిపై అవతరిస్తావు. అప్పుడు నిన్ను సేవిస్తూ బ్రతుకవచ్చును. ఓ వేంకటేశ్వరా! మాకు నీకంటే నీ దాసులవల్లనే ఎక్కువ వుపకారం జరుగుతుంది. ఎందుకంటే వారున్న చోట నీవు తప్పకవుంటావు కదా! వాళ్ళ ద్వారా నీ కథలు వినీ వినీ మేము ధన్యులయ్యాము తండ్రీ!

**2-65**

## మున్నుడి

మనమంతా మానవమాత్రులం. నారదమహర్షివలె నిరంతరం 'నారాయణ' అనలేము. వేదవ్యాసుని వలె విష్ణు గాథలు రచించలేము. సంధ్యావందనం కూడా చేయంకాబట్టి విష్ణుని నామజపం కూడా చేయటంలేదు. పోనీ గోపికలవలె అనన్య ప్రేమ వున్నదా స్వామిపైన అంటే అదీ లేదు. మనకి అనవసరమైన వన్నీ కావాలి. మరి మనగతేమిటి? అన్నమాచార్యులవారు అభయమిచ్చి, వినండి.... విష్ణుకథలు వినండి... భక్తితో వినండి. వెన్నెముక శరీరానికెట్లా బలమో, మీ భాగ్యం కొలది ఈ 'వెనుబలం' అయిన గాథలు వినండి అంటున్నారు.

**కం॥ వినరో విష్ణుని గాథలు**
**అనుపమ భాగ్యంబు లన్నమయ్యటు తెలిపెన్**
**వెను బలము భక్తకోటికి**
**యెనలేనివి వేంకటేశు హితకరములవే.**

**రాగం : శుద్ధధన్యాసి**

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ ॥వినరో॥

ఆదినుండి సంధ్యాది విధులలో
వేదంబైనది విష్ణుకథ
నాదించీ నిదె నారదాదులచే
వీథి వీథులనే విష్ణుకథ ॥వినరో॥

వదలక వేదవ్యాసులు నుడివిన
విదిత పావనము విష్ణుకథ
సదనం బైనది సంకీర్తనయై
వెదకిన చోటనే విష్ణుకథ ॥వినరో॥





గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ
వెల్లవిరియాయె విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము
వెల్లిగొలిపెనీ విష్ణుకథ ॥వినరో॥

**భావామృతం :**

ఓ మానవులారా! మీభాగ్యంకొలది శ్రీమన్నారాయణుని విష్ణుగాథలను వినండి. శరీరమునకు వెన్నెముక వలె మీకు ఆ విష్ణుగాథలు మూలాధారమైన బలమునిస్తాయి. వీటిని విని తరించండి.

మన సంప్రదాయములో మొదటినుండీ సంధ్యావందన సమయంలో "ఓం కేశవాయస్వాహ"... అంటూ మొదలుపెట్టి పఠించేది విష్ణునామములే. ఇది యెన్నడోమన పెద్దలచే "వేదంబైనది" (తొలిచదువుగా తెలుపబడినది). నారదమహర్షి వంటి పుణ్యాత్ములు నిరంతరం 'నారాయణ' అంటూ గానం చేస్తూ వీథివీదికీ ఆ విష్ణుకథను ప్రచారం చేశారు. మనమెంత అదృష్టవంతులమో కదా!

విడువకుండా వేదవ్యాస మహామునిలాంటి మహానుభావుడు పదినెనిమిది పురాణములను రచించి పండితులచే అంగీకరింపజేసి పునీతములైన విష్ణుగాథలను తెలిపారు. ఆ సంకీర్తన పవిత్రమైన నెలవు వలె వెదకిన చోటనే కనబడి (ఎక్కడెక్కడో శ్రమపడి వెదకనక్కర లేదు) మనకి పుణ్యం ప్రసాదించే విష్ణుకథ.

గొల్లభామలు రేపల్లెలో చల్ల చిలుకుతూ ప్రేమతో శ్రీకృష్ణుని లీలలు గానం చేసేవారట. ఆ విధంగా కూడా విష్ణుని కథలు ప్రసిద్ధిజెందాయి (వెల్లవిరి అయినవి). ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుని నామమే వెల్లిగొలిపే (వ్యాపించిన) విష్ణుకథయై 'ఓం నమోవేంకటేశాయ' అని ప్రసిద్ధిచెంది మనని తరింపచేయుచున్నది.

**2-66**

## మున్నుడి

ఇది అన్నమాచార్యులవారు సాళ్వనృసింహరాయలి 'కొలువు'లో వున్న రోజులలో చెప్పిన కీర్తన అయివుండవచ్చును. సరసశృంగార పరిమళాల ఈ కీర్తనలో అలమేలుమంగమ్మని పొగడుతున్నారు ఆచార్యులవారు. ఓ కలికీ! యెక్కడ నేర్చుకొన్నావమ్మా ఈ 'విద్య'లన్నీ!! నీగురించి 'కబుర్లు' వినాలంటే కోట్లువున్నాయి, అని ఆవిడ జాణతనం మెచ్చుకొంటున్నారు. వేంకటేశునితో ఆమె సమాగమముని కీర్తిస్తున్నారు. ఏడుకొండలవాడిని 'భావించ' గలవారికి మాత్రమే ఈ కీర్తన 'భావామృతం' అర్ధం కావాలని విశ్వప్రయత్నంచేశాను సుమండీ.....

**తే॥ అమల శృంగార కీర్తన నన్నమయ్య**
**తిరుమలేశుని కొలువంగ తెలిపినారు**
**సాధ్యమైనంత గోప్యంబు జతయగుటయు**
**కోరిచేసినయత్నమే యెరుగరయ్య!**

**రాగం :ముఖారి**

చూడ చిన్నదాన వింటే సుద్దులు కోటానకోటి
యేడేడ నేరుచుకొంటివేవో కలికి ॥చూడ॥

కిన్నెర మీటులలోని గిలిగింతలు నీ
వన్నెల కనుచూపుల వలవంతలు
యెన్నరాని యిచ్చకపు టెలయింతలు
యెన్నడు నేరుచుకొంటివే వో కలికి ॥చూడ॥

సారెకు నెడవాయని సరసములు నీ
తారుకాణ సన్నల తమకములు
గారవించి బుజ్జగించే గమకములు
యేరీతి నేరుచుకొంటివే వోకలికి ॥చూడ॥





కందువ శ్రీవేంకటేశు కలయికలు నీ
యందమైన సమరతి యలయికలు
పొందుల మునిముంగిలి పొలయికలు
యెందెందు నేరుచుకొంటివే వో కలికి ॥చూడ॥

**భావామృతం :**

ఓ చిన్నదానా! చూడబోతే నీ సంగతులు అన్నీ వింతలే. అవి కోటాను కోట్లున్నాయి. ఓ కలికీ! (మనోజ్ఞురాల వైప భామినీ!) యెక్కడ నేర్చితివమ్మా? (విద్యలన్నీ....)

వీణమీటినట్లు చక్కిలిగింతలు పెట్లుట, సోగకను చూపులతో 'వలవంతలు' (పూవింటివాని వేదన) కలిగించుట, అసంఖ్యాకమైన ప్రీతికర కూటములు... అహో!!! యెక్కడ నేర్చితివమ్మా?

ఒక్కసారి కూడ విడిచిపెట్టని సరస సల్లాపములు, వేగిరపాట్లు చేయు సంజ్ఞలు, వెనువెంటనే అభిమానపూర్వకమైన బుజ్జగింపులతో చేయు అసంఖ్యాకమైన గమకములు (యత్నములు) .... భళీ!! యెక్కడనేర్చుకొన్నావమ్మా ఇవియన్నీ?

సమర్ధవంతుడైన శ్రీవేంకటేశ్వరుడు నీ ప్రియ వల్లభుడు. ఆ స్వామితో నీ కలయికలు అందమైన సమరతి యలయికలు (నిస్త్రాణలు). మీ పొందులలోని తొలి అలయుటలు (పొలయికలు) యెక్కడ నేర్చుకొంటివమ్మా?.... సెబాసు!! ఓ కలికీ! నీ వసాధ్యురాలివు తల్లీ!

**2-67**

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తనలలో 'రామనామా సంకీర్తనలు' కర్ణపేయములే గాక పుణ్యనిలయములు. ఈ కీర్తనలో శ్రీరామభద్రుని నామమే కామధేనువువలె అన్ని కోరికలూ తీర్చేశక్తి కలది అంటున్నారు. కాకాసురుడు జానకికి ద్రోహంచేసినా కరుణామూర్తియై దయాసాగరుడై వానిని క్షమించాడు. రాజశేఖరులందరిలోను శిరోమణి ఈ మహానుభావుడు. పాపుల పీడితయైన భూదేవి ప్రార్ధనపై అయోధ్యాపురిలో వుండి భూభారం తగ్గిస్తానని చెప్పి తన మాట నిలబెట్టుకొన్నాడట ఆ 'వేంకటాద్రి రాముడు'. ఓ ప్రభూ! నమో నమః

**కం॥ రామా! రవికులతిలకా!**
**నామంబే కామధేను, నగపుత్రినుతా!**
**నీమముగ తిరుమలేశని**
**భూమిజవర! అన్నమయ్య పొందిక గొలచెన్**

**రాగం : ఆనందభైరవి**

రామభద్ర రఘువీర రవి వంశతిలక నీ
నామమే కామధేను నమో నమో ॥రామభద్ర॥

కౌసల్యానందవర్ధన ఘనదశరథ సుత
భాసుర యజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క కోదండ రచన విద్యాగురువ
వాసితో సురులు నిను వడి మెచ్చేరయ్య ॥రామభద్ర॥

మారీచసుబాహు మర్దన తాటకాంతక
దారుణవీరశేఖర ధర్మపాలక
కారుణ్య రత్నాకర కాకాసుర వరద
సారెకు వేదవిదులు జయ వెట్టేరయ్యా ॥రామభద్ర॥





సీతారమణ రాజశేఖర శిరోమణి
భూతలపుటయోధ్యాపుర నిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయిన రాఘవా
ఘాత నీ ప్రతాపమెల్ల కడునిండె నయ్యా॥రామభద్ర॥

**భావామృతం :**

ఓ రామభద్రా! రఘుకులవీరాగ్రణీ! సూర్యవంశ తిలకా! నీ నామస్మరణయే (మాకు) కామధేనువు వలె అనుకొన్న కోరికలనెల్లా తీరుస్తుంది. అటువంటి నీకు అనేక నమస్కారములు.

నీవు తనయుడవై జన్మించుట చేత కౌస్యలాదేవి ఆనందం వర్ధిల్లింది. దశరథాత్మజుడని పేరుపొంది ఆయనకు ఘనకీర్తి నాపాదించావు. కౌశికుని యాగమును నిర్విఘ్నంగా జరిపించి కీర్తితో భాసించావు. భరతునికి అన్నగారివై నిరంతరం ఆయనచే పూజింపబడ్డావు. అధికములగు కోదండ విద్యలలోను వాటినైపుణ్యములలోను నిరుపమానమైనవాడవు. అందుచేత దేవతలు కూడ నిన్ను ప్రఖ్యాత్ముడవని శీఘ్రముగా మెచ్చుకొన్నారు.

ఓ శ్రీరామచంద్రా! నీవు తాటక అను రాక్షసిని సంహరించుటయే గాక, ఆమె కొడకులైన మారీచ సుబాహులను మర్దించి అంతమొందించావు. అరివీర భయంకరుడవు. ధర్మపరిపాలకుడవు. కరుణాసాగరుడవై దుష్టబుద్ధితో నీ భార్యను హింసించినా శరణు వేడాడని కాకాసురుని దయతో క్షమించి కాపాడిన మహానుభావుడవు.

వేదవిద్యాపారంగుతులు సదా జయ జయ నినాదములతో నిన్ను కీర్తిస్తున్నారయ్యా!

ఓ సీతామనోవల్లభా! రాజప్రముఖులందరిలోను తలమానికమా! భూదేవి ధ్యానించివేడగా పాపులను నిర్మూలించి అయోధ్యా నిలయుడవై నీమాట నిలబెట్టు కొన్నావు. ఓ రాఘవా! ఈనాడు శ్రీవేంకటాద్రి నివాసమైన నీ దారుణ ప్రతాపముతో ఈ జగతి బాగుగా పరిపుష్టి చెందినది ప్రభూ!

## 2-68

### మున్నుడి

ఆరువందలు సంవత్సరముల క్రిందట ఏడుకొండల వేంకన్నకు ఏయే వంటలు నైవేద్యంపెట్టే వారో తెలుసేకోవాలనుందా? మరి ఈ అన్నమాచార్యులవారి కీర్తన వినాల్సిందే. మనం నైవేద్యం పెట్టాక ఆయన దేవేరి అలమేల్మంగమ్మ కొసరి కొసరి వడ్డించి ఆప్యాయంగా తినిపిస్తుందట స్వామికి. అది చూచే భాగ్యం మనబోటి అల్లులకెలాగో లేదు. ఈ కీర్తన ద్వారా భావిద్దాం. మారాముచేయక తినవయ్యా స్వామీ! అంటున్నారు. కొండల పొదుగునా దివ్యాన్నం రాసిగా పోశాం స్వామీ ఆరగించి కాస్త ఆ తరువాత భేష్ అని మెచ్చుకోవయ్యా అంటున్నారు.

**ఉ॥ ఇందిర ప్రేమతో వలపు లింపుగ కూరిన పిండివంటలన్**
**'చిందక' నారగింపమని చెప్పెను పాడుచు అన్నమయ్య, ఈ**
**చందముగా భుజించుటకు స్వామిక తీరికనేటి 'రద్దిలో'**
**ఎందులభించు? ఐననిది యెంతటి అద్భుతమైన కీర్తనో!!**

**రాగం : కళ్యాణి**

ఇందిర వడ్డించ యింపుగను
చిందక యిట్టె భుజించవో స్వామి ॥ఇందిర॥

అక్కాళపాకాలు అప్పలు వడలు
పెక్కైన సయిదంపు పేణీలును
సక్కెర రాసులు సద్యోఘృతములు
కిక్కిరియ నారగించవో స్వామీ ॥ఇందిర॥

మీరిన కెళంగు మిరియపు తాళింపు
గూరలు కమ్మని కూరలును
సారంపు పచ్చళ్ళు చవులుగనిట్టే
కూరిమితో చేసికొనవో స్వామీ ॥ఇందిర॥





పిండివంటలును పెరుగులు పాలు
మెండైన పాకాలు మెచ్చి మెచ్చి
కొండల పొడవున కోరిదివ్యాన్నాలు
వెండియు మెచ్చవే వేంకటస్వామీ ॥ఇందిర॥

**భావామృతం :**

ఇందిరాదేవి చక్కగా ఆప్యాయంగా వడ్డిస్తుంటే మారాము చేయకయిట్టే (వెంటనే) ఆరగించవయ్యా తండ్రీ! ఆలస్యందేనికి?

బాగుగా అక్కళింపజేసిన (సన్నటిమంట మీద చాలాసేపు మగ్గించిన) వంటలు ఇవి. ఎన్ని వున్నాయోచూడు. అప్పలు (నేటికాలంలో అప్పాలు అంటున్నాం), వడలు, ఎన్నోరకముల గోధుమపిండి (సముదంపు) వంటకాలు, పేణీలు, సమృద్ధిగా చెక్కర, నెయ్యి పొర్లునట్లు (సద్యోఘృతము) చేసిన వంటకాలు వున్నాయి. కిక్కిరిసి (ఏ మాత్రం సందులేనట్లుగా) భుజించవయ్యా స్వామీ! (నీవు తృప్తిగా తింటే మాకింకేంకావాలి?)

ఎక్కువగా మిరియములు దట్టించిన తాళింపు పెట్టిన కూరలు ప్రభూ! ఇవి. కమ్మటి కూరలు ఆరగించవయ్యా. ఇదిగో ఇటు చూశావా శ్రేష్ఠమైన (సారంపు) పచ్చళ్ళుయెన్నివున్నాయో చూశావా? రుచిగావుంటాయి. వీటన్నిటినీ ఇట్టే చెలువముతో స్వీకరించు స్వామీ! (ఆలశ్యమై పోతోంది మరి...)

అనేకమైన పిండివంటలేకాక పెరుగుతో చేసినవి, పాలతో చేసిన పాయసములు, సమృద్ధిగా నున్న వంటలు. వీటిని ఏదో ముట్టీ ముట్టనట్టు తినకూడదు. మెచ్చుకొంటూ మెచ్చుకొంటూ సెబాస్ అంటూ తినాలి. ఈ కొండల పొడుగునా నీకు ప్రేమగా దివ్యాన్నములను రాసిగాపోశాం ఆరగించు మహానుభావా! ఓ వేంకటేశ్వరా! అటుపిమ్మట మెచ్చుకొని మమ్మల్ని తరింపజేయుము తండ్రీ!

## 2-69

### మున్నుడి

“రాయుడు” అంటే రాజు అని అర్థం. వేంకటరాయుడుఅనే పేరు ఆంధ్రదేశంలో సుప్రసిద్ధం. అన్నమాచార్యులవారు కొండల కోనేటి రాయుడని స్వామివారిని కీర్తిస్తున్నారు. సురతి విజ్ఞానంలో దిట్ట అని శ్రీనివాసుని ఆచార్యులు మాత్రమే అనగలరు. ఆయన స్వామి వారి 'నందక ఖడ్గం' కదా! కామించి నిన్ను కోరాను స్వామీ! అంటున్నారు, ఇదొక మణిపూస....

**సీ॥ తిరుమల రాయడు దేవరాహుత్తుండు**
**సురత విజ్ఞాని ఈ సుగుణరాసి**
**చెలువపు తిమ్మయ్య పలు వినోదాలయ్య**
**త్యాగాలరాయడు అమితభోగి**
**చెప్పిన ధర్మమే చెల్లుబాటౌవాడు**
**మాటలకందని మన్మథుండు**
**సామవేద ప్రియుడు సరసవైభవముల**
**విలసిల్లు వైకుంఠ నిలయుడతడు**

**ఆ.వె॥“కొండ”లన్నమయ్య “కోనేటిరాయని”**
**కొలుచు తీరుజూడ పులకలగును**
**“కరుణజూపునంట కామించి కోరిన”**
**ఇట్టి మాటజల్లులెట్లు కురియు?**

**రాగం : హంసధ్వని**

తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురతి బిన్నాణరాయ సుగుణకోనేటిరాయ ॥తిరుమల॥

సిమలసింగారరాయ చెలువపు తిమ్మరాయ
సరసవైభవరాయ సకల వినోదరాయ
వర వసంతముల రాయ వనితల విటరాయ
గురుతైన తేగరాయ కొండటకోనేటి రాయ ॥తిరుమల॥





గొల్లెతల ఉద్దండరాయ గోపాలకృష్ణరాయ
చల్లవెద జాణరాయ చల్లపరిమళరాయ
చెల్లుబడి ధర్మరాయ చెప్పరాని వలరాయ
కొల్లలైన భోగరాయ కొండలకోనేటిరాయ ॥తిరుమల॥

సామసంగీతరాయ సర్వమోహనరాయ
ధామవైకుంఠరాయ దైత్య విభాళరాయ
కామించి నిన్ను కోరితే కరుణించితివి నన్ను
శ్రీమంతుడ నీకు జయశ్రీవేంకటరాయ ॥తిరుమల॥

**భావామృతం :**

తిరుమలగిరులకు ఏలికవైన ఓ ప్రభూ! నీవు దేవరాహుత్త రాయడివి. (రాహుత్తుడు అంటే గుఱ్ఱపుస్వారీ చేయువాడు. దేవరాహుత్తుడంటే దైవాశ్వమైన ఉచ్చ్రైశవముపై నెక్కినవాడు. అంటే కల్కిరూపి అయిన రాయడు అని అర్థం.) సురతి విజ్ఞానం తెలసినరాయా! సుగుణాలకుప్పవైన కోనేటిరాయా! నీకు జయము.

సకలైశ్వర్యములు గల శృంగారరామా! నీవు చెలువపు తిమ్మరాయడి.( స్నేహభావన గల కొండలరాయడవు.) అన్ని వైభవములు దాపుననే గల రాయడవు. అన్ని వినోదములు కలిగినవాడవు .వసంతకేళిలో నిష్ణాతుడవు. ఇక అనేక భామలకు ప్రియుడవని చెప్పవలసిన అవసరమేలేదు. ('కుబ్జ') నాకు పెళ్ళిగిళ్ళీ అక్కరలేదు ఒక కొడుకు కావాలన్నది) స్వామీ! నీవు గురుతైన తేగరాయడవు. (గుర్తుంచుకోదగ్గ త్యాగములు చేసినవాడవు. తండ్రి మాటకోసం రాజ్యాన్నే త్యాగం చేసిన కొండలలో వున్న కోనేటిరాయడవు.

స్వామీ! నీవు గోపికలకు సర్వస్వము అయినరాయడివి. గోవులను కావున కృష్ణరాయడివి. జాణతనం వెదజల్లినవాడవు. చల్ల (మజ్జిగ) పరిమళంపై మరులుకొన్నవాడవు. నీవు చెప్పిన ధర్మమే చెల్లుబాట్లు చేసినవాడవు. మన్మధుని (వలరాయడు) కంటే మిక్కిలి సౌందర్యవంతుడవు. అంతులేని భోగములనుభవించు రాయడవు. ప్రభూ! నీవు కొండలలోని కోనేటి రాయడవు.

స్వామీ! నీవు సామవేదం పఠించేవారి సంగీతరవమునకు పులకరించు రాయడివి. నీవు సర్వులను మోహింపజేయువాడవు. వైకుంఠ ధామమునకు ఏలికవు. దితి సంతతిని తుదముట్టించినవాడవు. ఓ వేంకటేశ్వరా! నిన్ను ప్రేమగా ఏదికోరినా దయతో నన్ను అనుగ్రహించావు. శ్రీనివాసా! నీకు సర్వదా జయమగుగాక! శ్రీవేంకటరాయా! నీకు శుభమగు గాక!

**2-70**

## మున్నుడి

అన్నమాచార్యులవారి భావవైచిత్రిని అర్థం చేసికొనటం ఒక్కొక్కప్పుడు నల్లేరు మీదనడకకాదు. ఈ కీర్తన అదే విషయాన్ని బల్లగుద్ది చెబుతోంది.“నీ భావమేమిటో, నీవెందుకు నాకు మానవ జన్మనిచ్చావో తెలుసుకోలేని పశువునయ్యాను స్వామీ! నా అపరాధం మన్నించు” అని దీనంగా వేడుకొంటున్నారు,“నీవు మాకు మానవజన్మనిచ్చి, పంచేంద్రియాలనిచ్చి, రకరకాల బంధుత్వాలనిచ్చి, బ్రతికి సన్మార్గంలో మంచిచేయరా” అని యెక్కడో నా జీవుణ్ణి తెచ్చి భూమ్మీదకు పంపిస్తే... నేను మోక్షం, ముక్తి అంటూ నా కర్తవ్యాలను మరువదగునా? నీ ఆనతి మీర దగునా? అంటున్నారు...

**చం॥ ఎరుగను తప్పిదంబులను ఈశ్వర! నే పశుబుద్ధినైతి, నే**
**పరమును నెంచినీ వొసగు బంధములన్ విడనాడజూచితన్**
**నిరతము నీదు యాజ్ఞలను నిందలు జేసితి అన్నమయ్యనైన్**
**తిరుమలరాయ! నీవొసగు దేనినికాదన జాలుదున్ ప్రభూ!**

**రాగం : గుజ్జరి**

భావించనేరనైతి -పశుబుద్ధినైతిని
యీవల నా యపచార- మిదిగావవయ్య ॥భావించి॥

హరినీవు ప్రపంచ-మందుబుట్టించితి మమ్ము
పరమునే సాధించేది-బలు ద్రోహమవుగాదో
సిరులనేలేటివాడు-చెప్పినట్లు సేయక
విరసాలు బంట్లకు -వేరే సేయదగునా ॥భావించి॥

పంచేంద్రియములు నాపై-బంపువెట్టితివి నీవు
ఎంచి వాని దండించే-దిది నేరమౌగాదో
పెంచేటి తలిదండ్రులు-ప్రియమై వడ్డించగాను
కంచము కాలదన్న సం-గతియా బిడ్డలకు ॥భావించి॥





మిక్కిలి సంసారము-మెడగట్టితివి నాకు
అక్కర నే వేసారేది- అపరాధ మవుగాదో
దిక్కుల శ్రీవేంకటాద్రి-దేవుడనీవియ్యగాను
ఎక్కడో జీవుడ నేను-యెదురాడదగునా ॥భావించి॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నీ అభిప్రాయమును భావించ లేకపోయాను. పశుబుద్ధి కలవాడనగుటచే నేనేవేవోదారులు తొక్కాను. ఇక నా అపరాధములను నీవు గాక మరెవరు మన్నిస్తారు? నన్ను క్షమించు తండ్రీ!

ఓ శ్రీహరీ! ఈ ప్రపంచంలో నన్ను పుట్టించినవాడవు నీవు. నేనేమో స్వర్గం వంటి లోకాలకోసించి ‘పరము’ కావాలని వెంపర్లాడుతున్నాను. శ్రీపతివి నీవు చెప్పినట్లు సేయటం మా వంటి సేవకులధర్మం. అంతేగాని దానికి విరుద్ధంగా చేయదగానా? నీ ఆజ్ఞ నుల్లంఘించదగునా?

ఓ మహానుభావా! కళ్ళు, ముక్కు, నాలుక, చెవులు మరియు చర్మం అను ఐదు ఇంద్రియములను నాకు ఇచ్చావు. నీ జీవితకాలంలో వాటివల్ల మేలుపొంది జీవితం పండించుకో అని నీవు చెబితే... మేము చేస్తున్నదేమిటి? వాటిని దండించి నిగ్రహించాలని చూస్తున్నాం. ఇది నేరము కాదా? కని, కష్టపడి పెంచే తలిదండ్రుల మాట కాదని, వాళ్ళు తృప్తిగా తినమని వడ్డించిన కంచము మా ముందర బెడితే.. దాన్ని కాలదన్ని వాళ్ళను బాధించడం బిడ్డలు చేయాల్సిన పనియేనా? (మరిలోకాలకే తండ్రివైన నిన్ను ధిక్కరించటం ఇంకెంత పాపము?)

నీవు ఏదో వుద్దేశ్యంతోనే ఈ బరువైన సంసారాన్ని నా మెడకు గట్టావు. అది అక్కర లేదని నేను విసుగుకొని దానినుంచి విముక్తుడనుగావాలని ప్రయత్నించటం ధర్మమా? సర్వవ్యాప్తుడవై దిక్కులన్నింటిలో నీ వేంటే...ఓ శ్రీవేంకటేశ్వరా! దేవదేవుడవై నీవిచ్చింది తీసికొనక, యెక్కడో అలమటించే ఈ జీవుడికి మానవజన్మనిచ్చావన్న కృతజ్ఞత కూడా లేకుండా నీ మాటను యెగర్దించుట నేను చేయాల్సిన పనియేనా? కాదు ముమ్మాటికీ కాదు. నా అపరాధం మన్నించు తండ్రీ!

## 2-71

### మున్నుడి :

శ్రీవేంకటేశ్వరుడు మన 'తలపుదైవము' అంటే 'కోరుకొనేదైవం. ఆయన వుండేదెక్కడ? మన తలపులో" అంటే మన భావనలో. "పదియును పదియైన తలపు' అంటే తొమ్మిదినొక్కటి సంఖ్య కాదు, 'చక్కటి తలపు' అని అర్థం. నిఘంటువు చేతిలో వున్నా ఈ కీర్తన వివరించడం కష్టమే. ఎందుకంటే కొన్ని చోట్ల అన్నమాచార్యులవారి భావం మన భావనకందదు. దశావతారవర్ణన ఇంత నర్మగర్భంగా చెప్పడం ఎవరికి సాధ్యం? 'గొడుగువట్టిన వాని కోరి అడిగిన తలపు' అంటే..వామనుని గురించి అని తెలుసు, కాని గొడుగుపట్టినదెవరు? భావించండి మరి....అంతతేలిక కాదు.

**తరళము :** **తలపులోపలి దైవమై మన దాపునుండెడి దైవమై**
**పలు విధంబుల రూపుదాల్చిన మాధవున్ వినుతించెరా**
**తొలిది మత్స్యము, కల్కిఅంత్యము తోయజాక్షుడు లీలతో**
**అలరగా తన కీర్తనంబున అన్నమయ్యటు తెల్పెరా**

### రాగం : వసంతం

తలపులోపలి తలపుదైవ మీతడు
పలుమారు బదియును బదియైన తలపు ॥తలపు॥

సవతైన చదువులు సరుగదెచ్చిన తలపు
రవళిదరి గుబ్బలిని రంజిల్లు తలపు
కవగూడ గోరి భూకాంతముంగిట తలపు
తివిరి దూషకు గోల్లదెగటార్చు తలపు ॥తలపు॥

గొడుగు వట్టిన వాని కోరియడిగిన తలపు
తడబడక విప్రులకు దానమిడు తలపు
వొడిసి జలనిధిని గడ గూర్చి తెచ్చిన తలపు
జడియక హలాయుధము జళిపించు తలపు ॥తలపు॥





వలపించి పురసతుల వ్రతము చెరిచిన తలపు
కలికి తనములు చూప గలిగున్న తలపు
యిల వేంకటాద్రిపై నిరవుకొన్న తలపు
కలుష హరమై మోక్ష గతిచూపు తలపు ॥తలపు॥

### భావామృతం :

ఈ స్వామి తలపులోపలి (భావనలోని) 'తలపు దైవం' (కోరుకోవలసిన దైవము) ఎన్నియో విధముల 'పదియును పదియైన' (చక్కని) తలపు (భావన). ఆవిధములనన్నింటినీ వివరిస్తాను గ్రహించండి.

ఈ మహానుభావుడు సవతైన చదువులు సరగు తెచ్చిన తలపు, (సమానమైన వేదములను వర్ధిల్లునట్లు జేసిన భావన.. అనగా మత్స్యరూపుడు). ఈయన రవళిదరిగుబ్బలి రంజిల్లు తలపు (ఘూర్ణిల్లు సముద్రమున పర్వతముక్రింద విలసిల్లిన భావము.. అనగా కూర్మావతారుడు). ఈయన, కవగూడ గోరి భూకాంతముంగిట తలపు (జత అవుదామని భూదేవి తన యెదుట నిలిచిన భావన.. అనగా వరాహావతారము). ఈయన, తివిరి దూషకు గోల్లదెగటార్చు తలపు (తనను దూషించు దుర్మార్గుని ప్రయత్నించి గోళ్లతో మరే ఆయుధం లేకుండా సంహరించిన భావన.. అనగా నరసింహుడు). ఈ స్వామి, గొడుగువట్టిన వాని కోరి అడిగిన తలపు (గొడుగువట్టి గౌరవించిన బలిని అర్థించి మూడడుగులు దానము గ్రహించిన భావన... అనగా వామనుడు). ఈయన తడబడక విప్రులకు దానమిడు తలపు (సంకోచించకుండా, తను నృపతులను వధించి సంపాదించిన భూమండలాన్నంతా బ్రాహ్మణులకు దానంచేసిన భావన.. అనగా పరశురాముడు) ఈయన, వొడిసి జలనిధిని గడగూర్చి తెచ్చిన తలపు బ్రహ్మాస్త్రముతో బెదరగొట్టి సముద్రుని తనవద్దకు తెప్పించిన భావన... అనగా శ్రీరామావతారము). ఈయన, జడియక హలాయుధము జళిపించిన తలపు (వెఱపులేక నాగలిని ఝుళిపించిన భావన.. అనగా బలరాముడు).

ఈ స్వామి వలపించి పురసతుల వ్రతము చెరచిన తలపు (త్రిపురాసురుల భార్యలను మోహమున ముంచి వారి పాతివ్రత్య దీక్షను భంగపరచి ఆ త్రిపురాసురుల చావుకి కారణమైన భావన.. అనగా బుద్ధ భగవానుడు). ఈయన కలికి తనములు చూప గలిగున్న తలపు (మనోజ్ఞమైన ప్రతాపము చూపగలిగిన భావన.. అనగా కల్కిఅవతారము). శ్రీవేంకటాద్రిపై నివాసమైన తలపు. సర్వపాపములను నివారించి మోక్షము నొసగు భావనామూర్తి ఈ శ్రీ వేంకటేశ్వరుడే.

## మున్నుడి 2-72

గీర్వాణ భాషలో శ్రీమన్నారాయణునిపై స్తుతిని అద్భుతమైన శ్రీరాగంలో వినిపిస్తున్నారన్నమాచార్యులవారు. మనసు పులకరించి పోతుంది ఇది వింటే. సగుణ బ్రహ్మ, సర్వులచే పారాయణ చేయబడు ఆ తిరుమలేశుడు శోభనమూర్తి అని కీర్తిస్తున్నారు. ఇది సుదీర్ఘమైన కీర్తన. అయినా ఆద్యంతంగా, కర్ణపేయంగా సాగిపోతుంది. కరిరాజవరదుడు రవిచంద్ర నేత్రుడు, శ్రీవత్సాంకితుడు, పుండరీకాక్షుడు అయిన శ్రీవేంకటేశ్వరుడు ఈ కీర్తన విని నిస్సందేహంగా పులకరించి పోతాడు.

**కం॥ నారాయణునుని, సర్వము**
**పారాయణు సంస్కృతమున ప్రార్థించి రిటన్**
**మీరిన భక్తిని అన్నయ**
**శ్రీరాగము శిలల కరుగజేయును వినుడీ**

**రాగం : శ్రీరాగం**

నమో నారాయణాయ
నారాయణాయ సగుణ బ్రహ్మణే సర్వ
పారాయణాయ శోభనమూర్తయే ॥నమో॥
నిత్యాయ విబుధ సంస్తుత్యాయ నిత్యాధి-
పత్యాయ మునిగణప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానస సాం-
గత్యాయ జగదవన కృత్యాయ తే నమో ॥నమో॥
అక్రమోద్ధత బాహు విక్రమాతిక్రాంత
శుక్ర శిష్యోన్మూలనక మాయ
శక్రాది గీర్వాణ వక్రభయ భంగ నిర్
వక్రాయ నిహతారి చక్రాయతే నమో ॥నమో॥
అక్షరాయాతి నిరపేక్షాయ పుండరీ
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణ విజ్ఞాన దక్ష యోగీంద్ర సం
రక్షానుకంపా కటాక్షాయ తేనమో ॥నమో॥
కరిరాజవరదాయ కౌస్తుభా భరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందు కోటీర తరుణీ మనస్తోత్ర
పరితోషచిత్తాయ పరమాయతేనమో ॥నమో॥





పాత్రదానోత్సవ ప్రథిత వేంకటరాయ
ధాత్రీశకామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిర గాత్రాయ రవిచంద్ర
నేత్రాయ శేషాద్రి నిలయాయ తే నమో ॥నమో॥

**భావామృతం :**

ఓ నారాయణుడా! నీకు వందనములు. సుగుణములకు నెలవైన పరబ్రహ్మ స్వరూపుడవు నీవు. సర్వమూ నేర్చినవాడవు. నీవు సుందరమూర్తివి. అట్టి నీకు వందనము. ఓ మహానుభావా! నీవు నిత్యము వుండెడివాడవు. గొప్ప పండితులచే చక్కగా స్తుతింపబడువాడవు. మునిజనుల నమ్మకమైన వాడవు. సత్యస్వరూపుడవు. ప్రత్యక్షముగా కరుణించువాడవు. సద్బుద్ధిగల వారి సాంగత్యాభిలాషివి. జగత్తు నంతటిని తృప్తిపరచువాడవు. అటువంటి నీకు నమస్కారములు.

ఓ దేవదేవా! అన్యాయం పెట్రేగినప్పుడు నీ బాహువుల పరాక్రమముచే దాని నెదిరించువాడవు. శుక్రాచార్యుని శిష్యులైన దైత్యులను నిర్మూలించు నియమము కలవాడవు. ఇంద్రాది దేవతలకు అతిశయించిన భయమును నిర్మూలించిన వాడవు. ఏ విధమైన వక్ర స్వభావమూ లేనివాడవు. శత్రువులను తరుగు చక్రము గలవాడవు. అట్టి నీకు వందనములు.

ఓ లోకేశా! నీవు నాశనము లేనివాడవు. ఏ కోరికలూ లేనివాడవు. పద్మదళ నేత్రుడవు. శ్రీవత్సమును పుట్టుమచ్చ నీ లక్షణముగా కలవాడవు. ఎన్నడూ క్షీణించని విజ్ఞాన దక్షత కలవాడవు. విశిష్టులైన యోగులను రక్షించి మిక్కిలి కరుణతో అనుగ్రహించువాడవు. అట్టి నీకు నమస్కారములు.

ఓ స్వామీ! నీవు అలనాడు గజేంద్రుని కాపాడినవాడవు. దివ్య కౌస్తుభమణి చేత అలంకరింపబడిన వాడవు. 'ముర' అను రాక్షసుడు శత్రువుగా కలవాడవు. జగన్మోహనుడవు. లే వెన్నెల వెలుగులు విరజిమ్ము కిరీట ధారివి. లేబ్రాయపు గోపికలచే కీర్తించబడి మిక్కిలి సంతుష్టాంతరంగుడవై కైవల్యము నొసగినవాడవు. అట్టి నీకు వందనములు.

ఓ జగన్నాథా! నీవు పాత్రులకు వారికి తగినవి అనుగ్రహించుటలో ప్రసిద్ధిజెందిన శ్రీవేంకటేశ్వరుడవు. మానవుల కామితములను దీర్చువాడవు. వివిధ దివ్య రత్నములచే బొడమిన కాంతులచే ప్రకాశించు దేహము కలవాడవు. శేషాద్రి నిలయమైనవాడవు. అటువంటి ఓ పరమపురుషా! నీకు శతకోటి వందనములు.

**2-73**

## మున్నుడి

ఇది అచ్చతెలుగులో అన్నమాచార్యులవారు చెప్పిన అందాల చందమామ పాట. తెలుగే కదా! తేలికే అనుకొనే తెలివి తక్కువైన వారి తెలివి తెలతెలబోయేట్లు చేసే తెలివైన తెలుగు పాట. చంద్రుడికి తిరుమలయ్యకు చుట్టరికం తెలియని వాళ్లకి యెన్నిసార్లు చదివినా తెలియని కీర్తన "మలయుచు తమలోని మట్టిమానిపంట" అంటే.. ఏమో ఇదమిద్ధంగా తెలియదు. నేను 'బుఱ్ఱ' బద్దలు కొట్టుకొన్నా 'మట్టిమాని పంట' అంటే ఖచ్చితంగా ఏమో అర్థంకాలేదు. నా భావన నేను చెప్పాను. చిత్తగించాల్సింది శ్రీవేంకటేశ్వరుడే. ద్వైతులు, అద్వైతులు అని కొట్టుకొనేవాళ్లం, మనకేదైతే నేమి? కదా!

**చం॥**
**గొనకొని నేత్రమై హరికి గూరిమి గూర్చెడి పంట, యీతడున్**
**మును 'సిరి'తోడబుట్టెనట, మోదకరంబగు పంట జాబిలై,**
**తనువుల కామరోగమున దగ్ధము జేయును అన్నమయ్యనెన్**
**అనువుగ వేంకటేశ్వరుని కబ్బిన చల్లని యింటిపంటనెన్**

**రాగం : రామక్రియ**

సందెకాడ బుట్టినట్టి చాయల పంట యెంత-
చందమాయె చూడరమ్మ చందమామ పంట ॥సందెకాడ॥

మునుప పాలవెల్లి మొలచి పండిన పంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్ను గొన చూపుల పంట
వినువీధినెగడిన వెన్నెలల పంట ॥సందెకాడ॥

వలరాజు పంపున వలపు విత్తిన పంట
చలువై పున్నమి నాటి జాజర పంట
కలిమి కామిని తోడ కారుకమ్మిన పంట
మలయుచు తమలోని మట్టిమాని పంట ॥సందెకాడ॥





విరహుల గుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి భాగ్యము పంట
అరుదై తూరుపు కొండ నారగ బండిన పంట
యిరవై శ్రీవేంకటేశనింటిలోని పంట ॥సందెకాడ॥

**భావామృతం :**

ఇదిగో 'చందమామ' చూశారా... ఇది సంధ్య చీకట్లు ముసురుకొంటుంటే 'చాయల పంట' (కాంతులు వెదజల్లే ఫలము) గా పుడుతుంది. ఎంత చందమాయె? (ఎంత అందమైనదో చూడండమ్మా!

ఎంతో పూర్వమే, పాలసముద్రములో పుట్టి పుడుతూనే యువకుడైన (పండిన) ఫలము ఇదియే. దేవతలకు నినుపై (పూర్ణముగా) కనిపిస్తూ ఇష్టమైన ఫలము. శ్రీ మహావిష్ణువునకు ఒక కన్నుగా (ఇంకొక కన్ను సూర్యుడు) ఆయన కొనచూపులతో చూస్తాడు కాబట్టి చల్లగా ఉండే ఫలము ఇదే. ఆకాశవీధిలో వెన్నెలలు వెదజల్లే ఫలము ఈ చందమామ.

ఈ అందాల చందమామ ఘనత నింకా చెప్పాలంటే, ఈయన వలరాజు (మన్మధుడు) కు సహాయకుని వలె ప్రేమ మొలకెత్తిస్తుంటాడు. అందుకే ఈయన వలపుల ఫలము. చల్లని పున్నమి రాత్రులలో వ్యామోహపరచు ఫలము ఈ చందమామ. సిరులమ్మతోడబుట్టిన విశ్వవిఖ్యాతమైన ఫలము. ఉద్యమించి చీకట్లలో మనోజ్ఞముగా వటవృక్షములపై తళుకులీను ఫలము ఈ చందమామ.

ఇక విరహపీడితులకు ఈ చందమామ గుండెమంట. వారి గుండెలకు ఇతని దర్శనమే దుర్భరమైనది. అంత దుస్సహమైన ఫలము ఈ చందమామ. వినువీధిలోని తారా తోరణానికి ఈయన దర్శనమే మహద్భాగ్యమైన ఫలము. అరుదుగా (నెలకొక్కరోజు మాత్రమే) తూర్పుకొండ మీద పూర్ణముగా పండే పంట ఈ జాబిల్లి. (జాబిల్లి అంటే జానుపిల్లి అంటే కుందేలు తనలో వున్నవాడు అంటే చంద్రుడు). చంద్రుడు అనబడే ఈయన స్థిరమైన, శ్రీ వేంకటేశ్వరుని ఇంటిలోని ఫలము, (క్షీరసాగరమథనంలో పుట్టినవన్నీ శివుడు గరళం కంఠంలో నిలిపిన అనంతరం, దక్కినది శ్రీహరికే కదా!) వలె శోభించాడు.

**2-74**

## మున్నుడి

అహోబల నరసింహస్వామి వారిని కీర్తిస్తూ చెప్పిన చక్కటి కీర్తన ఇది. ఎటువైపునుంచి చూచినా మననే స్వామివారు చూస్తున్నట్లు అనిపిస్తుంది. అది ఆ క్షేత్రంలోని ప్రత్యేకత. మొహం నవ్వుతున్నట్లుంటుంది. నారదాదుల గానం వింటూ పరవశించే ఈ నృసింహుడే తానకమై (స్థానమై) వేంకటాద్రిమీద శ్రీ వేంకటేశ్వరుడై తనదాసులకు అభీష్టములనిస్తున్నాడట. అన్నమాచార్యులవారి భావనా ప్రపంచంలో సర్వం తిరుమల రాయుడే. శంఖచక్రాల స్వామే 'జంటకోరల' ప్రహ్లాదవరదుడు.

**ఉ॥ ఆదిమ మూర్తియై వెలసెనాతడు కావగ దైత్యనందనున్**
**ఏదెస జూచినన్ కనులకీతడె విందు అహోబలంబునన్**
**పాదుకొనెన్ నృసింగమయి పాడెను కీర్తన నన్నమయ్య ఈ**
**మాదిరి వేంకటేశ్వరుని భావన నెవ్వడు చేసెనీ భువిన్**

**రాగం : శంకరాభరణం**

ఆదిమూర్తి యీతడు ప్రహ్లాదవరదుడు
ఏదెస జూచినా తానె ఈతడిదె దేవుడు ॥ఆదిమూర్తి॥

నవ్వుల మోముతోడ నరసింహరూపు తోడ
జవ్వని తొడమీద సరసమాడ
పువ్వుల దండలు ఇరు బుజాలపై వేసుకొని
ఉవ్విళ్లూర కొలువై వున్నాడు దేవుడు ॥ఆదిమూర్తి॥

సంకు చక్రములతోడ జమళికోరల తోడ
అంకెల కటి అభయ హస్తాలెత్తి
కంకణాల హారాలతో ఘనకిరీటము వెట్టి
పొంకమైన ప్రతాపాన పొదలీని దేవుడు ॥ఆదిమూర్తి॥





నానా దేవతలతోడ నారదాదుల తోడ
గానములు వినుకొంటా గద్దెపై నుండి
ఆనుక శ్రీవేంకటాద్రి నహోబలము నందు
తానకమై వరాలిచ్చీ దాసులకు దేవుడు ॥ఆదిమూర్తి॥

**భావామృతం :**

ప్రహ్లాదవరదుడైన ఈ నరసింహస్వామి ఆదిదేవుడు. ఏవైపు నుండి ఈ స్వామిని చూచినా భక్తులకు ఆ స్వామి తమనే చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఇటువంటి ప్రత్యేకతకల దేవుడు ఈ అహోబల నరసింహస్వామి.

నరుని దేహమూ సింహము తల గలిగిన రూపంతో ఈ స్వామి మొహంలో నవ్వు ప్రతిఫలిస్తుంటుంది. ఈయన ఎడమ తొడపై కూర్చునియున్న లక్ష్మీదేవి ఈయనతో సరసమాడుచున్నది. రెండు భుజములపై పూలదండలు వేసుకొనిన ఈ స్వామి, మిక్కిలి సంతోషంతో కొలువైవున్నాడు. అట్లు విలసిల్లుతున్న ఈ దేవుని తిలకించండి.

చతుర్భుజుడైన ఈ స్వామి వారిరెండు హస్తాలలో శంఖ చక్రములు ప్రకాశించుచున్నవి. ఈయన జంటకోరలు చూడండి. ఈయన నడుము దగ్గిరగా అభయ హస్తమును ఎత్తి పట్టుకొని యున్నాడు. ఈయన ముంజేతి కంకణములు, మెడలో మణిహారములు, తలపై ఘనమైన కిరీటం శోభిల్లుచున్నవి. పొందికయైన ప్రతాపముతో ఈ దేవుడు వర్ధిల్లుచున్నాడు.

వివిధ దేవతలు (గంధర్వ, కిన్నెర, కింపురుషాది సురులు) నారదాది మునులు ఈ స్వామి వారిని కీర్తిస్తున్నారు. వాటిని వింటూ స్వామివారు సింహాసనంపై కూర్చొని యున్నారు. ప్రక్కనే వున్న తిరుమల స్థానమైయున్న శ్రీ వేంకటేశ్వరుడే అహోబలంలోని ఈ నరసింహుడు. ఈ స్వామి వరాలిచ్చి తన దాసులను అనుగ్రహించే దేవుడు.

## 2-75

### మున్నుడి

'సిరి' అంటే శ్రీమహాలక్ష్మి. ఆవిడ ఇచ్చే వైభవం కేవలం 'ధనము' మాత్రమే కాదు. సంతోషం కూడ ఒక సంపదే. ఎంత చదివినా, ఎంత వినినా నీతి బోధలు ఏ మాత్రం ఉపయోగం లేదు. మనిషి దుర్గుణములు పోకుండా, చెడుమార్గములు వదలిపెట్టక, దురుసుగా ప్రవర్తించే పొగరుపోకుండా, పరదూషణ వదలకుండా, అబద్ధాలు చెప్పే అలవాటు విడిచిపెట్టకుండా, ఆత్మలో శ్రీవేంకటేశ్వరుని నిలుపుకొనకుండా ఎవరికైనా 'చింత' అనేది పోతుందా? 'సిరి' కలుగుతుందా? ఎ..న్న..టి..కీ సాధ్యంకాదు అంటున్నారు అన్నమయ్య.

**ఆ.వె.॥ ఎంత చదివి యేమి? యెంత వినినేమి?**
**చింత పోదు, రావు సిరులు కూడి**
**ఇట్లు సేయకున్న హితవుల జెప్పెను**
**అన్నమయ్య, తిరుమలయ్య! వినుము**

**రాగం : దుర్గ**

ఎంత చదివిన నేమి వినిన తన
చింత యేలమాను సిరులేల కలుగు ॥ఎంత॥

ఇతర దూషణములు ఎడసిన గాక
అతికాముకుడు కానియప్పుడు గాక
మతి చంచలము కొంతమానిన గాక
గతియేల కలుగు దుర్గతులేల మాను ॥ఎంత॥

పరధనముల యాస పాసిన గాక
అరిది నిందలు లేని యప్పుడు గాక
విరసవర్తనము విడిచిన గాక
పరమేల కలుగు నాపదలేల మాను ॥ఎంత॥





వేంకటపతి నాత్మవెదకిన గాక
కింక మనసున తొలగిన గాక
బొంకుమాట లెడసి పోయిన గాక
శంక యేల మాను జయమేల కలుగు ॥ఎంత॥

### భావామృతం :

జీవనోపాధికి వుపయోగించే 'చదువు' కాని. భట్టీయం చేసే వేదపారాయణం కానీ, పురాణ కాలక్షేపాలు కానీ (నేటి కాలంలో దూరదర్శన భక్తి కార్యక్రమాలు కానీ) ఎంత చదివినా, ఎంత వినినా తెలియని విషయాలు తెలుస్తాయోమో కాని, మనిషికి తన విచారము పోతుందా? సుఖం అనే 'సిరి' కలుగుతుందా?

పరులను నిందించే పాడు అలవాటు విడిచిపెట్టక, అతి కామాతురుడు (స్త్రీ వ్యసనపరుడు) పొందే బలహీనతలు విడనాడక, స్థిరత్వంలేని చంచల మనస్తత్వం పోకుండా.. ఎవ్వరికైనా, ఎన్నడైనా సద్గతి కలుగుతుందా? దుర్గతులు రాకుండా వుంటాయా?

ఇంకొకడి ధనం మీద ఆశపడే నీచమనస్తత్వం వదలిపెట్టకుండా, పరదూషణ చేసే పాడు అలవాటు విడనాడక (నోరు మంచిదైతేనే వూరు మంచిది అనే నిజం తెలుసుకోకుండా) దురుసుగా పొగరుబోతుగా ప్రవర్తించే పాడు అలవాటు మానక, పుణ్యం కలుగుతుందా? పోనీ మెడకు తగులుకొనే ఆపదలు పోతాయా?

శ్రీ వేంకటేశ్వరుడే సర్వస్వం అని నమ్మి ఆ దేవదేవుడిని ఎవరి ఆత్మలో వారు ప్రతిష్టించుకొని నిత్యమూ దర్శించటం అలవాటు చేసుకోవాలి. 'కోపము' అనే దురలవాటును విడిచి పెట్టేయాలి (తనకోపమె తన శత్రువు..). అసత్యానికి ఆమడదూరంలో వుండాలి... ఇట్లా వుంటే జయం కలుగుతుంది. అంతేకాని అన్నీ అనుమానాలే. అపనమ్మకములే అయిన వానికి మంచి జరుగుతుందా? అస్సలు జరుగదు.

**2-76**

## మున్నుడి

గోవింద నామస్మరణ చేస్తూ తిరుమల కొండల నెక్కితే పునర్జన్మ వుండదని నాభావన. ఈ కీర్తనలో ప్రతిచరణమూ గోవింద స్మరణయే. సంగీతం వచ్చిన అదృష్టవంతులు ఈ అన్నమయ్య కీర్తన పాడుతూ యెక్కితే వింటున్న వారు గోవిందా అంటూ వారి చరణాల్లో తమ చరణాలు (నడక) కలుపుతూ చరణ చరణానికీ (కీర్తన చరణం) గోవిందా అంటుంటే ఆ ఏడుకొండలవాడు మీ వెంట తనుకూడా నడుస్తాడు. మీకు సందేహం వద్దు. నన్ను నమ్మండి. ఏదీ అనండి... గోవిందా... గోవిందా... గోవిందా.

**ఉ॥ కొండను వ్రేలనెత్తితిని గోకుల రక్షకు కాని, గోపికల్**
**కొండెములెంచి చెప్పి నిను కొట్టగ జూచిరిగా యశోదచే**
**మెండుగ 'వుట్లు' తెంపితివి? విప్పిన చీరెలు దోచుకొంటివా?**
**అండవు వేంకటేశ! ఇవి అన్నియు లీలలె అన్నమయ్యనెన్.**

**రాగం : కేదారగౌళ**

కొండ వేల నెత్తినట్టి గోవిందా నిన్ను
గొండించేరు యశోదకు గోవిందా ॥కొండ॥

గొల్లెతలు మొక్కేరు గోవిందా నీ
కొల్లల చీర లిమ్మని గోవిందా
గొల్లువెన్న దొంగిలగ గోవిందా నిన్ను
కొల్లున నవ్వేరు వీరె గోవిందా ॥కొండ॥

గోవుల గాచేవేళ గోవిందా పిల్ల-
గోవిని వలచిరి గోవిందా
గోవాళులై యమునలో గోవిందా నీకు
కోవరమున్నారు రా గోవిందా ॥కొండ॥





కొట్టేటి వుట్ల కింద గోవిందా నీతో
గొట్టెవాటై పెనగేరు గోవిందా
గుట్టుతో శ్రీవేంకటాద్రి గోవిందా కూడి
గొట్టాన బెట్టేరు బత్తి గోవిందా ॥కొండ॥

**భావామృతం :**

గోవర్ధన పర్వతమును చిటికిన వ్రేలిపై నెత్తిన ఓ గోవిందా! నీవు రేపల్లెలోని ఆబాలగోపాలాన్ని రక్షిస్తే ఆ గోపికలు ఏం చేశారో చూశావా? మీ అమ్మ యశోదకు నీపై కొండెములు (చాడీలు) చెప్పి నిన్ను కొట్టించాలని చూశారు. (యెంత కృతఘ్నులు!!)

ఓ గోవిందా! నీకు గోపికలంతా మొక్కి వేడుకొన్నారు. ఓ గోవిందా నీవు దొంగిలించిన మా చీరెలు మాకు తిరిగి ఇచ్చి మామానములు కాపాడు ప్రభూ! అని దీనంగా వేడుకొన్నారు. గొల్లువెన్న (అప్పుడే చిలికిన వెన్న) నీవు దొంగిలిస్తే ఓ గోవిందా! వారు గొల్లుమని నవ్వుకొన్నారు. (మరి ఆ కోపం అంతా యెక్కడికి పోయిందో!!)

నీవు గోవులను కిశోరప్రాయంలో కాస్తూ వుండగా యెంత మనోహరంగా పిల్లగోవిని (మురళిని) మ్రోగించేవాడివి!! ఓ గోవిందా! అప్పుడు గోపికలంతా నిన్ను ప్రేమించారు. యమునా నదీ తీరంలో గోవాళులై (యవ్వనముగలవారై) గోపికలు నీకోసం కోవారమున్నారు. (కాపు కాసారు లేక పొంచియున్నారు)

ఓ గోవిందా! నీవు "వుట్లు" (పాలు, వెన్న, నెయ్యి దాచుమట్టి పాత్రలుంచుటకు త్రాళ్లతో నల్లి (వ్రేలాడగట్టు బంధనము) పగులగొట్టినప్పుడు వాటిక్రింద కొట్లాడుకుంటూ గోపబాలురు మూకుమ్మడిగా పోగయ్యేవారు. గోవిందుడవైన ఓ వేంకటేశ్వరా! నిన్ను భక్తులంతా భద్రంగా నీ గుడిలో నిన్ను బెట్టి భక్తితో పూజిస్తున్నారు. గోవిందా! గో... విందా... అంటున్నారు.

2-77

## మున్నుడి

శరణాగతితో శ్రీవేంకటేశ్వరుడే దిక్కని నమ్మిన వారికి అత్యంత ప్రీతికరమైనది 'భజన' అనే నామసంకీర్తన. భావం వివరించ వలసిన అవసరం లేని అద్భుత అమృత గుళికలు అన్నమాచార్యులవారి శ్రీహరి నామ సంకీర్తనలు. నాబోటి పరిమిత బుద్ధిగలవారికి ఇందులో కూడా ఎందెందు వెదకి జూచినా అందందే కలదు పెద్ద సందేహంబు.. కాబట్టి భావామృతం అవసరమే అయింది. "నవ సావయావ సారూప్యుడట" తిరుమలేశుడు. అంటే, ఎట్లా భావిస్తే, అట్లాంటి రూపంగల క్రొత్త రూపం. దానికి అవయవాలు కూడా భావననుంచి పుట్టినవే... అహో!!

**తే॥ హరిని శరణని వేడిరి అన్నమయ్య**
**విష్ణునామాలు వీనుల విందుకాగ**
**తిరుమలేశుని నిలిపిరీ తీరుగాను**
**భావనాతీతు తనదగు భావమందు**

**రాగం : శివరంజని**

మాధవ భూధవ మదన జనక
సాధురక్షణ చతుర శరణు శరణు ॥మాధవా॥

నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ-
నారసింహా కృష్ణ నాగశయన
వారాహ వామన వాసుదేవ మురారి
శౌరి జయ జయతు శరణు శరణు ॥మాధవా॥

పుండరీకేక్షణ భువనపూర్ణగుణ
అండజగమన నిత్య హరి ముకుంద
పండరి రమణ రామ బలరామ పరమ పురుష
చండ భార్గవరామ శరణు శరణు ॥మాధవా॥





దేవదేవోత్తమ దివ్యావతార నిజ-
భావ భావనాతీత పద్మనాభ
శ్రీవేంకటాచల శృంగారమూర్తి నవ
సావయవ సారూప్య శరణు శరణు ॥మాధవా॥

**భావామృతం :**

ఓ మాధవా! భూకాంతా మనోవల్లభా! మన్మధుని కన్నతండ్రీ! సాధు వర్తనులను రక్షించుటలో విశేషమైన నైపుణ్యం గల మహానుభావా! శరణు శరణు. రక్ష రక్ష!!

ఓ నారాయణుడా! చ్యుతి (నాశనము) లేని అనంతుడా! గోవిందుడా! శ్రీనారసింహా! శ్రీకృష్ణా! శేషునిపై శయనించు స్వామీ! ఆది వరాహరూపా! వామనావతారా! వాసుదేవా! ముర అనే దైత్యునికి శత్రువుయైన శౌరీ! జయము. సర్వదా నీకు జయము. ఓ ప్రభూ! నన్ను రక్షింపుము శరణు శరణు.

పద్మదళముల వంటి కన్నులుగల దేవా! చతుర్దశ భువనాలలో (పదునాలుగు లోకాలలో) పూర్ణగుణములచే విలసిల్లు స్వామీ! అండజుడు (గ్రుడ్డునుండి పుట్టినవాడు) అయిన గరుత్మంతుని వాహనముగా పయనించు స్వామీ! నిత్యమైవున్న శ్రీహరీ! ముకుందా! పండరీపుర నివాసా! శ్రీరామచంద్రా! బలరామా! పరమ పురుషా! తీవ్రమైన పరశురామా! శరణు శరణు తండ్రీ! నన్ను రక్షింపుము.

దేవతలలో విశిష్టులైన వారి అందరిలో ఉత్తముడవైన ఓ దివ్యావతారా! సత్యమే స్వరూపముగా గలవాడవగుటచే భావనలకందని మహానుభావా! పద్మము నాభియందుగల ప్రభూ! శ్రీవేంకటాచల నిలయుడవైన శృంగార రాయా! ఎట్లా భావిస్తే అట్లాంటి కొంగ్రొత్త రూపంగల వేంకటేశ్వరా! శరణు శరణు! తండ్రీ! నన్ను కనికరించు ప్రభూ!

## 2-78

### మున్నుడి

అహోబలంలో నరసింహస్వామి వారికి ఆదిలక్ష్మికి కళ్యాణ మహోత్సవం జరుగుతున్నది. తానూ ఒక యువతి వలె తోటి వనితలతో పాడుతూ చెబుతున్నారు అన్నమాచార్యులవారు. భవనాశినీ నదికి ఇరుగడల (రెండు తీరములూ) అమ్మవారినీ అయ్యవారిని మంగళ స్నానం చేయించి మంచి పూలదండలు వేసి సుముహూర్తం మించిపోకుండా వేదాద్రి గరుడాద్రి అనే పెండ్లి పీటలపై కూర్చుండబెట్టారట. కనకావతి, భోగావతీ నదీ జలాలతో వసంతం ఆడారట. వధూవరులు గరుడాదిపైనే కాక వేంకటాద్రిపై కూడా సరసములాడుకొంటూ కూడికూడి వేడుకగానున్నారట...

**ఆ.వె.॥ వధువు ఆదిలక్ష్మి వరుడు నృసింహుడు**
**అన్నమయ్య భావమద్భుతంబు**
**పెండ్లిపీటలాయె వేదాద్రి గరుడాద్రి**
**తిరుమలాయె వేడ్క గరుడకొండ**

**రాగం : ఆనంద భైరవి**

పాడరే సోబనాలు పడతులాలా
వేడుకలిద్దరికిని వెలసె చూడరే ॥పాడరే॥

కొండలే పీటలుగా కూర్చున్నారెదురు బడి
అండనే నారసింహుడు ఆదిలక్ష్మియు
వెండిపైడి నిండుకొన్న వేదాద్రి గరుడాద్రులు
పెండిలాడే రిద్దరును ప్రియమున చూడరే ॥పాడరే॥

భవనాశి జలముల పాయక తోడనీళ్లాడిరి
ఇవలా నవలా తాము ఏటిదరుల
జవళి మంచి పూవుల సరిసేసలు వెట్టుచు
తవిలి సుముహూర్తాన తప్పక చూచేరు ॥పాడరే॥





పొందుగ కనకావతి భోగావతి నదులు
సందడి వసంతముగా చల్లులాడుచు
అందమై శ్రీవేంకటాద్రి అహోబలాన ఒక
చందమున కూడి కూడి సరసము లాడేరు ॥పాడరే॥

### భావామృతం :

ఓ వనితల్లారా! మీరు ఇప్పుడు మంగళగీతములను పాడండి. ఆదిలక్ష్మికి అహోబల నరసింహ స్వామివారికి కళ్యాణమహోత్సవం జరుగుతున్నది చూచి తరించండి.

అమ్మవారు అయ్యవారు ఆదిలక్ష్మీదేవి, అహోబలనరసింహుడు. అక్కడే రెండు కొండలు పెండ్లి పీటలు కాగా ఎదురెదురుగా కూర్చునియున్నారు. వెండితోను బంగారముతోను ఆ రెండు కొండలైన వేదాద్రి గరుడాద్రి నిండియున్నాయి. వారు ఆవిధంగా ఆసీనులై పెండ్లి చేసుకొనుచున్నారు. మీరు ఆనందంగా తిలకించండి.

ఆదిలక్ష్మి నరసింహస్వామి మంగళస్నానములు యెక్కడ చేశారో తెలుసా? భవనాశినీ నదీ జలములతో ఇటువైపూ అటువైపూ వైభవంగా నదీతీరంలో మంగళస్నానం చేశారు. జవళి (అంటే...విక్రయించగా కొన్నటువంటి నూతన వస్త్రములను ధరించి), మంచి పుష్పములే అక్షతలుగా ధరించి ఎప్పుడో ఒకసారి వచ్చే ఇటువంటి సుముహూర్తంలో జరిగే పెండ్లిని మీరు తప్పక వీక్షించండి.

చక్కగా కనకావతి, భోగావతి అను రెండు నదులు చల్లుకొంటూ మీరు వసంతములాడు కొనుటకు, మంచి సందడి జరుపుకొనుటకు సిద్ధముగా నున్నవి. అందమైన వేంకటాద్రి ఈ అహోబల గరుడాద్రి రెండూ సమానమే. ఒక్కటే.. అనే విధముగా ఈ ఆదిలక్ష్మి నరసింహులిద్దరు కలిసిపోయి ఒకరి నొకరు చిలిపిగా చూసుకొంటూ (అల్పులమైన మనకు అర్థంకాని విధంగా) సరసములాడుకొంటున్నారు. చూచి, భావించి, తరించండి.

## 2-79

### మున్నుడి

గోపికలలో తనుకూడ ఒక గోపికై అన్నమాచార్యులవారు పాడుతున్న ఈ కీర్తనలో బాలకృష్ణుని లీలలు వినిపిస్తున్నారు. దేవకి కారాగారంలోనే ప్రసవ వేదన అనుభవించి నల్లనయ్యను కన్నది. కానీ పెంచే అదృష్టం యశోద దక్కించుకొన్నది. అమరులకు కూడా దక్కని ఆయన పరిష్వంగ సుఖం, చల్ల వాసన కొట్టే గోపికలకు దక్కింది. ఆదిపురుషుడై కూడ ఆవులను కాచాడు. మనుష్య శరీరంతో అందర్నీ మాయ చేశాడు. భారతయుద్ధం నిర్వహించి భూభారం నిర్మూలించి ధర్మస్థాపన జేశాడు. ఆయన లీలల నెరుగుట సాధ్యమా?

**ఉ॥ ఆడుచు పాడరమ్మ సతులందరు మీకిదె భాగ్యమౌనులే**
**వేడుక సంతసంబులిక వెల్లివిరౌయనె అన్నమార్యుడున్**
**కూడిరి గోపభామినులు కొల్వగ; విశ్వము జూపె నోటిలో**
**తోడుగ ధర్మమున్ నిలిపె తోయజనాభుడు వేంకటేశుడై.**

**రాగం : అమృతవర్షిణి**

ఆడరమ్మా పాడరమ్మా అందరు మీరు
వేడుక సంతసములు వెల్లివిరియాయెను ॥ఆడరమ్మ॥

కమలనాభుడు పుట్టె కంసుని మదమణచ
తిమిరి దేవకీదేవి దేహమందును
అమరులకు మునుల కభయ మిచ్చె నితడు
కొమరె గొల్లెతలపై కోరికలు నిలిపె ॥ఆడరమ్మ॥

రేయి పగలుగ చేసి రేపల్లె పేరుగజొచ్చె
ఆయెడ నావుల గాచె నాదిమూలము
యీ యెడ లోకాలు చూపె నిట్టె తన కడుపులోన
మాయసేసి యిందరిలో మనుజుడై నిలిచె ॥ఆడరమ్మ॥





బాలలీలలు నటించి బహుదైవికము మించె
పాలువెన్నెలు దొంగిలె పరమమూర్తి
తాళి భూభారమణిచె ధర్మము పరిపాలించె
మేలిమి శ్రీవేంకటాద్రిమీద నిట్టె నిలిచె ॥ఆడరమ్మ॥

**భావామృతం :**

ఓ అమ్మలారా! మీరందరూ ఈ సమయము వలన ఆడండి. సొగసుగా పాడండి. సంబరములు వేడుకలు వెల్లివిరిసెను.

పద్మనాభుడు దేవకీ దేవి అష్టమగర్భమున జన్మించినాడు. ఆతడు తన మేనమామ అయిన కంసుని మదముయొక్క తిమిరి (తిమ్మిరి) ని అణచినాడు. అతడు దేవతలకు మునులకు అభయమునొసగి రక్షించెను. లేబ్రాయపు గొల్ల కన్యలపై మరులు కొనెను.

ఆ కృష్ణుడు రేపల్లెలో పెరిగి పెద్దవాడవుతున్నాడు. అక్కడి ప్రజల ఆనందానికి అవధుల్లేవు. వారికి రేయింబవళ్లు ఒక్కలాగుననే ఆనందమిస్తున్నాయి. అందరు గోపబాలకుల వలెనే అతగాడు కూడా ఆవులను మేపుటకు పచ్చని గడ్డి కోసం బృందావనంలో సుదూర ప్రాంతాలకు పోయేవాడు. ఆదిపురుషుడైన నారాయణుడే అక్కడ అట్లా చేస్తే ఇక్కడ చిన్నారి బాలకృష్ణుడు "మన్ను తింటున్నావా? ఏదీ నీ నోరుచూపించు" అని గద్దించిన యశోదకు తన చిన్నారి నోటిలో త్రిభువనాలను ఇట్టే చూపించి నివ్వెరపోవునట్లు చేశాడట. ఇంతమందిని ఇన్ని విధములుగా మాయజేసిన ఆ మధువైరి తనుమనుజునిగానే నిలిచాడు.

బాలలీలలను నటించిన ఆ కృష్ణయ్య పరమాత్ముని వలె అనేక మహిమలు చూపించాడు. ఆ పరమ పురుషుడే పాలు వెన్నా దొంగతనం చేశాడు. ఉద్యమించి ఆయన భూభారమును తగ్గించి (దుష్ట శిక్షణకు పూనుకొని) ధర్మ సురక్ష చేశాడు. బంగారపు వేంకటగిరులపై ఇట్టే నిలిచినవాడై శ్రీవేంకటేశ్వరునిగా ఆ కృష్ణయ్య అందరినీ కాపాడుతున్నాడు.

**2-80**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఘంటాపథంగా ఒక మాట చెబుతున్నారు. 'అయ్యా! మీరే పురాణం చదవండి, యెక్కడైనా యెన్నడైనా హరిదాసుడెవ్వడైనా చెడిపోయాడా? లేదు, ముమ్మాటికీ చెడిపోలేదు. వారిని నీడలా వెన్నంటి ఆ శ్రీనాథుడే రక్షించాడు. ఆయనని చేరటానికి వుపయోగపడని ఏ చదువైనా ఏ మతమైన ఏ ధర్మమైనా నిరుపయోగమే అంటున్నారు. తిరుమలేశుని సేవయే నిజమైన సేవ. ఆ నరహరిని నమ్మితే అంతులేని వరాలిస్తాడు. ఆయన సమారాధన యెన్నడూ 'వితథము' కాదట. అంటే.. చదవండి మరి...

**చం॥ కనుగొనుమే పురాణమున కావ్యమునన్ హరిదాసుడెవ్వడున్**
**వినుమిది యెన్నడున్ చెడడు విష్ణుడె కాచును తోడు నీడయై**
**మును హరి(బ్రోచెనా ధ్రువుని మోసెను భక్తుల భారమంతయున్**
**అనఘుడు అన్నమయ్య యిటు అద్భుత కీర్తన మాలపించెరా.**

**రాగం : గౌరిమనోహరి**

ఏ పురాణముల నెంత వెదకినా
శ్రీపతిదాసులు చెడ రెన్నడును ॥ఏ పురాణము॥

హరివిరహితములు అవి కొన్నాళ్లకు
విరసంబులు మరి విఫలములు
నరహరి గొలిచిటు నమ్మినవరములు
నిరతము లెన్నడు నెలవులు చెడవు ॥ఏ పురాణము॥

కమలాక్షుని మతి గానని పదవులు
కుమతంబులు బహు కుపథములు
జమళి నచ్యుతుని సమారాధనలు
విమలములేకాని వితథము గావు ॥ఏ పురాణము॥





శ్రీవల్లభుగతి జేరని పథములు
దావతులు కపట ధర్మములు
శ్రీవేంకటపతి సేవించు సేవలు
పావనములధిక భాగ్యపు సిరులు ॥ఏ పురాణము॥

## భావామృతం

ఓ భక్తులారా! మీరు ఏ పురాణాలు, యెంత చదివినా ఒక్కటే సత్యం తెలుస్తుంది. అదే.. శ్రీహరి భక్తులు ఎన్నటికీ చెడిపోరు. వారికి యెప్పుడూ మేలే జరుగుతుంది. హరిదాసులకు అనర్థమే జరుగదు.

శ్రీహరికి చెందని ఏదయినా కొన్నాళ్లకు విరసములై ఆ ప్రయత్నాలన్నీ విఫలమైపోతాయి. నరసింహుని అవతారం దాల్చిన శ్రీమన్నారాయణుని నమ్మిసేవిస్తే ఆయన ఇచ్చే వరములు నిరంతరమైనవి. అవి సుస్థిరమైనవి.

పద్మదళాయతాక్షుడైన పద్మనాభుని ఆత్మలో దర్శించుట నేర్పని చదువులు వ్యర్థం కదా! అవి చెప్పే మార్గములన్నీ చెడుమార్గములే కదా! ఆ మతములన్నీ చెడు మతములే కదా! అచ్యుతునికి చేసె సమారాధనలు (బాగుగా ఆరాధించుట) అతి నిర్మలములై అనేకములైన మేళ్లను చేస్తాయి. అవి అసత్యమైన మాటలు కావు.

శ్రీహరి మార్గంలో పోకుండిన ఏ పదవియైన ప్రయాసతో కూడిన చెడుదారియే. ఆ మార్గమే అనవసరం. అది మోసపూరిత ధర్మమే. శ్రీవేంకటేశ్వరుని సేవించే సేవమాత్రమే పుణ్యప్రదమైనసేవ. అదే అనంతమైన సిరిసంపదలను, మహాద్భాగ్యమును ప్రసాదిస్తుంది. ఇది సత్యం.

## 2-81

### మున్నుడి

అన్నమాచార్యులవారు హరినామ సంకీర్తన ఇచ్చే సౌఖ్యం గురించి వివరిస్తున్నారు ఈ కీర్తనలో. జన్మ అంటేనే బంధనం. అది ఒక చెఱ. అమ్మతో మొదలై చివరికి నోట్లో తులసితీర్థం పోసేవాడిదాకా అంతా ఏదో ఋణానుబంధం వల్ల కలిగినవారే. హరినామమనే మంత్రం ఆ జన్మల చెఱనుండి విడిపిస్తుంది. పదివేల నరక కూపాలను తప్పిస్తుంది. వేంకటేశ్వరుని నామసంకీర్తన కల్ప భూజంబు (కల్పవృక్షం) లాగ ఆశించిన కోరికలను తీరుస్తుంది. చాలా తేలికగా అర్థవంతమైన ఈ కీర్తన 'ఓం నమో వేంకటేశాయ' అంటే చాలు అని బోధిస్తున్నది.

**ఉ॥ చాలదె నామమంత్రమిదు సౌఖ్యము శ్రీహరి భక్తులార! మీ**
**నాలుక కూర్పదాహితవు నచ్చినవౌ చవులూర జేయుచున్**
**మేలుగ, కల్మషంబు విరమింపగ జేయదె అన్నమయ్యనెన్**
**నీల సరోజవర్ణు నవనీత ప్రియున్ తను సన్నుతించెరా**

**రాగం : హంసధ్వని**

చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు
చాలదా హితవైన చవులెల్ల నొసగ ॥చాలదా॥

ఇది ఒకటి హరినామ మింతైన చాలదా
చెదరీక జన్మముల చెరలు విడిపించ
మదినొకటె హరినామ మంత్రమది చాలదా
పదివేలు నరక కూపములు వెడలించ ॥చాలదా॥

కలదొకటి హరినామ కనకాద్రి చాలదా
తొలగుమని దారిద్ర్య దోషంబు చెఱుచ
తెలివొకటి, హరినామ దీపమది చాలదా
కలషంపు కఠిన చీకటి పారద్రోల ॥చాలదా॥





తగు వేంకటేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్ప భూజంబువలెనుండ
సొగిసి ఈ విభుని దాసుల కరుణ చాలదా
నగవు చూపులను ఉన్నతమెపుడు చూప ॥చాలదా॥

### భావామృతం

శ్రీహరినామ సంకీర్తన ఇచ్చే సౌఖ్యం ఎంతో మేలైనది. తమకు అదొక్కటి చాలదా? అది ఎంతో మేలు చేసే అభీష్టములను (చవులను) ప్రసాదిస్తుంది.

ఈ హరినామ సంకీర్తనం పిసరంతైనా చాలు కదా! చెదరక (కలత చెందక) మనని జన్మల యొక్క బంధనములనుండి అది విముక్తులను చేస్తుంది. మనస్సులో 'హరి' అనే మంత్రం జపిస్తే చాలు కదా! పదివేల నరక కూపములనైనా అది తప్పిస్తుంది. ఇందులో సందేహం లేదు.

ఈ శ్రీహరి నామము బంగారుకొండవంటిది. ఇదొక్కటి ఎంత గుండె నిబ్బరాన్నిస్తుందో ఒకసారి ఆలోచించండి. దరిద్రము వల్ల కలిగే దోషం మిమ్మల్ని సమీపించగలదా? మీ దరిదాపుల్లోకి రాదు, మీ దగ్గర హరినామం జపించే తెలివి (స్పృహ) ఒకటి వుంటే హరినామం అనే ఒక దీపము మీ దగ్గరవుంటే అది కలుషము (పాపము) అనే కఠోరమైన చీకట్లను తొలగిస్తుంది.

తగిన విధంగా శ్రీవేంకటేశ్వరుని కీర్తనము ఒక్కటి చేస్తే చాలదా? (చాలు, చాలు, చాలు ముమ్మాటికీ చాలు) ప్రపంచంలోని కల్పవృక్షం అది. (అసలు కల్పవృక్షం స్వర్గలోకంలో వున్నా... దానికంటే ఇదే మేలైనది) సొగిసి (ఇంపుగా) ఈ జగన్నాథుని దాసుల కరుణ వుంటేనే చాలు, అది, సంతోషకరమైన పరిస్థితులను కలుగజేసి, ఔన్నత్యము కలిగిస్తుంది. (అంతగొప్ప హరినామం దొరికింది మీకు. కనుక ఒక్కసారి మనస్సులో ఆ దివ్యమంగళ రూపాన్ని స్మరించి, అనండి... ఓం నమో వేంకటేశాయ...)

**2-82**

## మున్నుడి

అన్నమాచార్యులు తన జీవితకాలంలో 'హిరణ్యకశిపుని' సంహరించిందెవరో తెలియని ఒక యువతరం ఆంధ్రదేశంలో ఉద్భవిస్తుందని కలలో కూడా ఊహించి వుండరు. అట్లా అయితే ఇట్లాంటి గోపికల కీర్తనలో 'జమళిచేతుల' వాడు 'చెందమ్మి కనుల' వాడు, 'పచ్చపైడిదట్టి' వాడు అనే పదములు వాడే వారే కాదేమో. ఇక ఈ మున్నుడిలోని పద్యములు మరీ నిరుపయోగమేమో!! మనం ఆశాజీవులం. మళ్ళీ ఆంధ్రసాహిత్యానికి మంచిరోజులు వస్తాయి. వేంకటేశ్వరుడే రప్పిస్తాడు. అప్పటివారికోసమే ఈ నా తిప్పలు. తనని ఒక గోపికగా వూహించుకొని ఆచార్యులవారేమంటున్నారో చూడండి.

**చం॥ వలచితి వచ్చితిన్ మనసు వానికి నిచ్చితి అన్నమయ్యనెన్**
**తలచెను భావనన్ మురిసి తానును యింకొక 'చాన' యట్లుగా**
**నెలవుగ మాదు పల్లెతను నీరజనాభుడు నుంటవెల్లడై**
**నిలిచితి, వేంకటేశ్వరుడు నీమముగా ననుకూడు నమ్మరో!**

**రాగం : హంసానంది**

వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంటా ॥వలచితి॥

చెందమ్మి కనులవాడు చేతపిల్లగోవివాడు
ఇందువచ్చెకంటిరా ఏమిరే అమ్మా
మందుల పసువులవాడు మకరాంకములవాడు
ఎందునున్నాడు చెప్పరే ఏల దాచేరమ్మా ॥వలచితి॥

నెమిలిపించములవాడు నీలమేఘకాంతివాడు
రమణుడాతడు మొక్కేను రమ్మనరమ్మా
జమళి చేతులవాడు సంకు చక్రాలవాడు
అమర మీపాల చిక్కునట చూపరమ్మా ॥వలచితి॥





పచ్చపైడి దట్టివాడు పక్షివాహనపువాడు
ఇచ్చినాడు నాకుంగరము ఇదివో అమ్మా
చెచ్చెర కోనేటివాడు శ్రీవేంకటేశ్వరుడు
వచ్చినన్ను కూడినాడు వాడు ఓయమ్మ ॥వలచితి॥

## భావామృతం

ఓ గోపికల్లారా! దయచేసి నేను చెప్పేది విని నాకు సహాయం చేస్తారా? నేనూ ఆ యశోదానందనునే వలచి, వానికిగాను (వానికోసం) వచ్చాను. తానుకూడా మీ గోకులంలోనే నివసిస్తున్నాడట కదా! (కాస్త సమాచారం ఇవ్వండమ్మా!)

వాడు చెందమ్మి (ఎఱ్ఱతామరపూలు) కనులతో చేతితో మురళి పట్టుకొని వుంటాడు. ఇటువైపేమన్నా వచ్చాడా? మీరు చూశారా ఏమిటే? కాస్త చెప్పండే! వాడు పశువుల మందని మేపుతుంటాడు. (నిజమే కదా! పశువుల్లాంటి మనందరికి రోజూ తిండిపెట్టి బ్రతికిస్తున్నదెవరు? ఆ జగద్రక్షుడే కదా!) అతను మకరాంకములవాడు (మన్మధుడు) అనుకోండి. ఇంకా ఎందుకు దాచిపెడతారమ్మా వాడిని? ఎక్కడున్నాడో కాస్త చెప్పండమ్మా!

వాడు సిగలో నెమలి పించము ధరించి యుంటాడు. వాడి శరీరం నీలమేఘమువలె నిగనిగలాడుతూ ఉంటుంది. నాకు చక్కటి జతగాడు మీకు దండము పెడతాను వాణ్ణి కాస్తరమ్మనండమ్మా! (ఒక్కసారి కనులారా చూస్తాను). ఇంకా చెప్పాలంటే.. వాడు జమళిచేతులవాడు. (జమళి అంటే జంట అని అర్థం. చేతులు రెండు మనందరికి కాని ఆయనకు జమళిచేతులు అంటే రెండు రెండ్లు నాలుగుచేతులు). వాటిలో శంఖ చక్రములను ధరించియుంటాడు. మీది మధుర భక్తి కాబట్టి మీకు వశమై చిక్కాడట. కాస్తచూపించండమ్మా!

వాడు పచ్చపైడి దట్టి ధరించి యుంటాడు, (పీతాంబరధరుడు). పక్షి వాహనమువాడు (గరుడగమనుడు). ఇదిగో చూడండమ్మా! నాకు తన ఆనవాలుగా తన వుంగరం తొడిగాడు. చూడండి. ఇంకొక సంగతి. వాడు కోనేటి రాయుడు అని కూడా పిలువబడే శ్రీవేంకటేశ్వరుడు. వాడు చెచ్చెర (శీఘ్రముగా) వచ్చెనమ్మా! వచ్చి నన్ను వలపించి నాతో జత అయ్యాడు. (నాదే కదా! జన్మ అంటే..)

## 2-83

### మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుడు ఆది మూలము. నాకుమూలము (మొదట) నా తండ్రి. ఆయనకు ఆయన తండ్రి. ఆయనకు ఆయన తండ్రి.. ఇలా మొట్టమొదట ఎవరు? అతడే ఆదిమూలము. అదెవరు? జగత్పితయైన శ్రీహరియే కదా! "అంతకోపగావవే" అంటే.. (అంతకు + ఓప + గావుము... అంటే ఆ మొత్తం ఇంకచాలు నన్ను రక్షించు అని) అంటే అసలు నాకింక వద్దే వద్దని. ఇది నా భావన... అసలర్థం అన్నమాచార్యులవారికే... మరియొక విశేషమేమంటే మనవన్నీ "సంతల చుట్టరికాలు". సంత అంటే నేటికాలంలో 'మార్కెట్'. అక్కడ చుట్టరికాలన్నీ, బాగున్నారా... అని పలకరించుకోటానికే గాని, శుద్ధ... దండగ.

**ఆ.వె॥ విభుడవింతటికిని వెరవుతో గావుము**
**అభయహస్తమడిగె నన్నమయ్య**
**అంతరాత్ముడైన ఆదిమూలంబని**
**వేంకటేశు గొలిచె వేడె శరణు**

**రాగం : శహన**

విభుడ వింతటికి వెరవుతో ననుగావు
అభయ హస్తముతోడి అదిమూలమా ॥విభుడవు॥

పలు లంపటాల చేత పాటువడి పాటువడి
అలసితి గానవే వో ఆదిమూలమా
చలమరి యితర సంసార భ్రాంతి చిక్కితి న-
న్నలరించి కావవే వో ఆదిమూలమా ॥విభుడవు॥

యెంతకైనా ఆసలచే యేగేగి వేసరితి
అంతకోప గావవే వో ఆదిమూలమా
సంతల చుట్టరికాల జడిసితినిక గావు
అంతరాత్మ నా పాలి ఆదిమూలమా ॥విభుడవు॥





రంట దిప్పు నింద్రియాల రవ్వైతి గావవే
అంటిన శ్రీవేంకటాద్రి ఆదిమూలమా
గెంటక ముమ్మాటికిని నీకే శర-
ణంటి కావవే వో ఆదిమూలమా ॥విభుడవు॥

### భావామృతం

ఓ జగన్నాథా! ఈ సర్వస్వానికి నీవే భర్తవు. నన్ను వెరపుతో (ఏదైనా చక్కటి ఉపాయముతో) రక్షింపుము. ఆది మూలములైన ఓ శ్రీహరీ! నీ అభయహస్తము నాకు చూపి నన్ను అనుగ్రహింపుము.

నేను అనేక బంధనాలలో తగులుకొని ఇబ్బందులు పడి.. పడి... అలసిపోయాను. నన్ను నీవే కాపాడవలెను. మచ్చరముతో (చలమరినై) అన్నీ నేనే చేయగలను, నేనే గొప్పవాడిని అనుకొని సంసార భ్రాంతికి లోనయ్యాను. ఓ ఆదిమూర్తీ! నన్ను రక్షించి ఉపశమనం కలిగించు తండ్రీ!

ఓ ప్రభూ! నేను ఆశల మాయలో పడి యెంతకైనా తెగించి, యెక్కడెక్కడికో వెళ్ళి విసిగిపోయి వున్నాను. ఆ మొత్తం యాతనలు ఇంకచాలు. ఓ ఆదిపురుషా! నన్ను రక్షింపవయ్యా! అదీగాక... నాకున్న చుట్టరికాలన్నీ సంతలో చుట్టరికాలు. ఈ మాయదారి చుట్టరికాలు శుద్ధ దండగమారి చుట్టరికాలు. ఇవంటే నాకు భయంపట్టుకొన్నది. నాకు వద్దే వద్దు. నాలో అంతరాత్మునిగానున్న ఓ ఆదిమూలమా! నాకు నువ్వొక్కడివే చాలు.

స్వామీ! నా ఇంద్రియాలు ఎప్పుడూ నాకు అతుక్కుపోయి వుండి నన్ను క్షణం కూడా వదలక క్షీణింపజేశాయి. ఆది మూలములైన ఓ వేంకటేశా! నేను ముమ్మాటికీ (మనో,వాక్, కాయము) నిన్నే అంటిపెట్టుకొని శరణు శరణు అంటున్నాను. నన్ను మాత్రం గెంటివేయవద్దు. నాకు నీవే దిక్కు. నన్ను రక్షించు తండ్రీ!

2-84

## మున్నుడి

శ్రీమత్‌భాగవతంలో కాక అన్నమయ్య భావనాకాశంలో మెఱసిన కృష్ణలీలలు ఈ కీర్తనలో వున్నాయి. 'రవి' గాననిచో కవి గాంచునే కదా!' అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారట. ప్రపంచంలో లేనివి కూడా కవి ఊహించగలడు. మన్ను తిన్నావా నోరు చూపించు అని యశోద అడిగితే కృష్ణయ్య తననోటిలో బ్రహ్మాండం చూపాడని భాగవతం చెప్పింది, కానీ ఈ లీలలు మాత్రం అన్నమయ్య రచనా చాతుర్యమే. ఆ రోజుల్లోని కొన్ని తెలుగు నుడికారాలు నేడులేవు. పాలార్చి, ఓలి, పెంటలు, ఇత్యాది కొన్ని పదాలు అర్థం కావాలంటే... తేలికకాదు.

**మ॥ భళిరా!! యెంతటి మాయకాడు 'హరి' ఈ భామన్ యశోదాసతిన్**
**నిలువెల్లన్ భ్రమలోన ముంచెగద! ఆ నింగిన్ సుధాంశుండుతా**
**నలరన్ జేయగ వచ్చె బాలుదరికిన్ అన్నయ్య భావించెరా**
**సులువా!! వేంకటరాయునిట్లు గొలువన్ సొంపైన భావంబులన్**

**రాగం : వళపంజరం**

వెఱపింపబోయి తానె-వెఱచె దల్లి యశోద
మఱచి యీ బాలునెట్టు-మానిసెంటా నుండెనో ॥వెఱపింప॥

వెంట రాకు మని కృష్ణు - వెరపించి యశోద
వొంటి మందలో గొంగ - వున్నాడనె
అంటి గొంగ యెందునున్నా-డని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు - పెక్కు గానవచ్చెను ॥వెఱపింప॥

చందమామ బాడి తల్లి-సరి బొత్తుకు రమ్మంటే
చందురు జూచి కృష్ణుడు-సన్న సేసెను
ముందర జంద్రుడు వచ్చి-మొక్కితే యశోదచూచి
ముందేలా యంటినో యని-ముంచి వెరుగందెను ॥వెఱపింప॥





పాలార్చి తొట్టెలలో -బండబెట్టి యశోద
నీలవర్ణు దొంగిచూచె - నిద్దురో యని
ఓలి శంఖ చక్రాలతో - నురము శ్రీసతితోడ
యీ లీల శ్రీవేంక-టేశుడై యున్నాడు ॥వెఱపింప॥

## భావామృతం

శ్రీకృష్ణ పరమాత్మ చిన్నారి బాలునిగా తల్లి యశోదమ్మ దగ్గర మారాము చేస్తున్నాడు. వీడికి కాస్త భయం నేర్పాలనుకొంది ఆవిడ. అయితే ఆవిడ కృష్ణయ్యను భయపెట్టబోయి తానే భయపడింది. అట్లా భయపడి కూడా ఆయన లీలవల్ల జరిగింది. మఱచి (ఆయన సర్వేశ్వరుడన్న సంగతి మఱచి) మానవ శిశువుగానే భావించి ఎట్లు భ్రమలోపడి పోయిందో కదా!

కృష్ణుడు తను వద్దన్నా మారాము చేసి వెంట పడుతున్నాడని "నాతో సంతకు రావద్దు నాన్నా! అక్కడ గొంగ (శత్రువు) వున్నాడు. వాడే బూచి. నిన్ను పట్టుకుంటాడు" అని బెదిరించింది. కృష్ణయ్య "అమ్మా! ఏడే? యెక్కడున్నాడే" అని అమాయకంగా నోరు తెరిచాడట. ఆ నోట్లో ఆ యశోదాదేవికి చతుర్దశ భువనాలే కాక తనకు తనే కనపడి నివ్వెరపోయిందట. బ్రహ్మాండమంతా పెంటలై (దిబ్బలై) కనిపించిందేమిటో అని, తనే ఎంతో భయపడిందట.

ఇంకొకసారి యశోద "చందమామ రావే మా కన్నయ్యతో ఆడుకోవే" అని పాడింది. కృష్ణుడు చంద్రుణ్ణి చూచి మెల్లగా ఏదో సైగ చేశాడు. ఇంకేముందీ, అమాంతం చంద్రుడు కృష్ణయ్య ముందు నిలబడి యశోదకు నమస్కరించినాడు. ఆమె దిగ్భ్రమ చెందటమే, కాక ముందు నేనాచంద్రుణ్ణెందుకు రమ్మన్నానా అని వెరగుపొందిందట.

ఇంకొకసారి యశోద నీలమేఘ శ్యాముడైన కృష్ణుని ఆడించి (పాలార్చి) ఊయలలో పడుకోబెట్టి నిద్రించాడో లేదో చూద్దాం అనుకొని తొంగి చూచిందట. ఆమెకు వూయలలో చిన్నికృష్ణుని బదులు వరుసగా (ఓలిన్) శంకచక్రధారియైన చతుర్భుజుడు శ్రీవేంకటేశ్వరుడు వక్షస్థలంపై లక్ష్మీదేవితో కనిపించాడట. ఇంకేముంది ఆ యశోద భయంతో నివ్వెరపోయిందట.

## 2-85

### మున్నుడి

ఇరవై ఏళ్ల క్రిందట ఈ కీర్తన విన్న నేను 'లలిత' మైన ఈ రాగానికి ముగ్ధుడనయ్యాను. ఆనాడు ఈ కీర్తన అన్నమాచార్యువారిదనిగాని, ఇది నారాయణుని దశావతారములను 'నిందాస్తుతిగా' సన్నుతించే కీర్తన అనిగాని, ఒకనాడు నేను ఇలా దీని మున్నుడి వ్రాసి భావము వివరిస్తానని గాని తెలియను. ఓ ఏడుకొండల రాయా! ఏ జన్మలో ఏ పుణ్యం చేశానో కాని నాకీ మహద్భాగ్యాన్నిచ్చి దయచూపించావు. అన్నమయ్య అన్నట్లు "ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి యిదిగాక వైభవం బికనొకటి కలదా?" లేదు తండ్రీ! లేదు.

**కం॥ నారాయణు దశ విధ అవ-**
**తారంబుల నన్నమయ్య తగ గీర్తించెన్**
**ఈ రీతి భావ వివరణ**
**కోరిక తీరంగ జెప్పి కొలుత నిరువురన్.**

**రాగం : లలిత**

తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు
ఎప్పుడూ లోకాల నేలేటి వాడు ॥తెప్పగా॥

మోత నీటిమడుగులో ఈత గఱచినవాడు
పాతగిలేనూతికింది బాయని వాడు
మూతి దోసిబట్టి మంటిముద్ద పెల్లగించువాడు
రోతయైన పేగుల పేరులు గలవాడు ॥తెప్పగా॥

కోడికూత నోరివాని కుఱ్ఱ తమ్ముడైన వాడు
బూడిద పూసిన వాని బుద్దులవాడు
మాడవన్నె లేడివెంట మాయల తగిలినవాడు
దూడల నావుల గాచి దొరయైనవాడు ॥తెప్పగా॥





ఆకసాన పారేవూరి అతివల మానములు
కాకుసేయు వాడు, తురగముపై వాడు
ఏకమై వేంకటగిరి నిందిరా రమణి గూడి
యే కాలము బాయని యెనలేని వాడు ॥తెప్పగా॥

### భావామృతం :

ఇంకా సృష్టి ఆరంభం కాలేదు. అంతా జలార్ణవమే. ఆ నీటిపై ఒక మఱ్ఱి ఆకు తేలుతూ పోతున్నది. ఆ మఱ్ఱి ఆకుపై శిశువు రూపంలో నారాయణుడు పడుకొని వున్నాడు. తనకాలి బొటనవ్రేలిని తననోటిలో పెట్టుకొని బాల్యచేష్టగా దానిని చీకుతున్నాడు. నిరంతరం లోకాలనన్నింటిని పరిపాలించే శ్రీమన్నారాయణుడు వాడే.

ఆయన, మోత నీటిమడుగు (బరువైన నీరు వున్న సముద్రం) లోన ఈదులాట నభ్యసించిన వాడు (మత్స్యావతారం). ఆయన పాతగిలె నూతికింద (పాతబడ్డ బావిలో) బాయని వాడు (విడువకుండా వుండే తాబేలు (కూర్మావతారం). మూతిని అంజలివలె పట్టి, మట్టి ముద్ద అయిన భూమండలాన్ని సముద్రంలోంచి పెల్లగించి నిలబెట్టినవాడు (వరాహావతారము). ఆయన రోతకలిగించు పేగులను హారములుగా ధరించినవాడు (నరసింహావతారము).

ఆయనకోడి కూత నోరు (ధ్వని) వాని (అంటే... ఇంద్రుని) కుఱ్ఱతమ్ముడైనవాడు (పొట్టి వామనావతారము). ఆయన బూడిద (విభూతి) పూసికొనువాని బుద్ధులు గలవాడు. బ్రాహ్మణ ధర్మము నాచరించిన వాడు (పరశురామావతారము). మాడవన్నెలేడి (బంగారులేడి) వెంట మాయకులోనై పరుగుతీసినవాడు (శ్రీరామావతారం). చిన్నప్పుడు దూడలను పెద్దయ్యాక ఆవులను కాచి ఆ తరువాత ఏలికయై ద్వారకను కాచినవాడు (శ్రీకృష్ణావతారము).

ఆయన, ఆకసాన పారేవూరి అతివల (ఆకాశంలో ఎగిరే త్రిపురాసురుల భార్యల) మానములను, కొల్లజేసిన (చెడగొట్టిన) వాడు (బుద్ధావతారము). ఆయన తురగము (ఉచ్ఛైశ్రవము అను అశ్వమును) యెక్కిన వాడు (కల్కి అవతారుడు). ఇవన్నీ ఏకమై నేడు వేంకటాద్రిపై అలమేల్మంగమ్మతో గూడ ఏ కాలముననైనా విడువని అనమానుడై అవతరించాడు. అనండి ఏడుకొండలవాడా... వేంకటరమణా... గోవిందా.

**2-86**

## మున్నుడి

చతుర్విధోపాయముల ద్వారా మానవజన్మకు సాఫల్యత తెమ్మన్నారు పెద్దలు. ధర్మమార్గమున అర్థమునార్జించి, ఆ ధర్మార్థముతో కామముననుభవించి ఆ ధర్మార్థ కామము లందును విరక్తి కలిగి వైరాగ్యంతో మోక్షమును పొందమన్నారు. కామమును కూడ ఒక యజ్ఞమువలెనే భావించి కేవలం 'తృష్ణ' కే కొక కైవల్య సాధనకు సోపానంగా యెన్నుకొన్నారు. శృంగారరసం జాలువారే ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు అలమేల్మంగ స్వామివారికోసం దేవతల ప్రీతికై కామయాగం నిర్వహించి తిరుమలేశుని 'పొందు' అనే దివ్యభోగమును సంపాదించిందని అంటున్నారు.

**మత్తకోకిల :**

**కామయాగము చేసెనప్పుడు కల్కి కామన పూర్తికై**
**ప్రేమనే సురవర్యులందరి ప్రీతికర్పణ జేసెరా**
**ఏమిచేసెను యెన్ని చేసెను యెట్లు శ్రీపతి గెల్చెనో**
**భామపాట్లను అన్నమార్యుడు పాడెనద్భుత కీర్తనన్**

**రాగం : కన్నడగౌళ**

కామయాగము చేసె కలికి తన
ప్రేమయే దేవతాప్రీతిగాను ॥కామ॥

పొలుపలర సురత తాంబూల రసపానంబు
నలినాక్షి సోమ పానంబుగాను
కలకలంబుల మంచి గళరవంబుల మోత
తలకొన్న వేదమంత్రములు గాను ॥కామ॥

పడతి తన విరహతాపమున పుట్టినయగ్ని
అడరి దరికొన్న హోమాగ్ని గాను
ఒడబడిక సమరతుల నుదయించిన చెమట
దడియుటే యది యవభృథంబుగాను ॥కామ॥





తనర కుచముల రుచులు దంతక్షతక్రీడ
ననుపైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీతిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను ॥కామ॥

**భావామృతం :**

ఆ భామిని అలమేల్మంగమ్మ దేవతల ప్రీతి కొఱకు స్వామిపై తన ప్రేమను వినియోగించి కామయాగమును నిర్వహించినది. తత్ఫలితంగా ఆయన పొందునార్జించి యజ్ఞఫలం సంపాదించింది. ఆవిధంబెట్టిదనిన..

పద్మనయన అయిన ఆ పద్మావతి సురతంబున ఒప్పుగా తాంబూలరసాస్వాదనమే సోమపానముగా భావించినది. చక్కటి తన కంఠస్వరము యొక్క ధ్వని వేదమంత్రములను వల్లించుచున్నట్లున్నది.

ఆ జవ్వని తను స్వామి విరహముతో తపించగా పుట్టిన విరహాగ్నినే అధికమై నెగడినట్టి హోమాగ్నివలె భావించినది. ఆమె స్వామివారితో ఒడంబడిక చేసికొని సమరతి నిర్వహించగా స్వేదజలము అధికమై వారు తడిసిపోయిరి. ఈ కామయాగమున వారిద్దరు అవభృత స్నానము (యజ్ఞమున దోషనివారణార్థము మంత్రోక్తముగా నాచరించు అభ్యంగన స్నానము) అనునట్లున్నది.

అతిశయించిన కుచద్వయములపై దంతక్షత కాంతులు మిఱుమిట్లు గొలుపుతూ అవి విద్యుక్తమైన యజ్ఞపశువైన మేకను బంధించిన త్రాటి ఒరిపిడి గుర్తులేమో అన్నట్లున్నది. చతుర్దశ భువనాలలో ఏ యజ్ఞం నిర్వహింపబడినా దాని భోక్త శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుడే. కనుక ఆ దేవి నిర్వహించిన ఈ కామయాగమునకు కూడ శ్రీవేంకటేశ్వరుడే భోక్త. ఆమె పొందును స్వామివారు ఘనమైన దివ్యభోగముగా స్వీకరించి ఆమెను ఆనందంలో ముంచారు.

## 2-87

### మున్నుడి

పరమాత్మ తత్త్వాన్ని విశదపరుస్తున్నారు అన్నమయ్య. పిండికొద్ది రొట్టె అన్నట్లు భక్తికొద్ది భగవంతుడు. చేసికొన్నవారికి చేసికొన్నంత. ఇది జగమెరిగిన సత్యమే. ఈ కీర్తనలో ఆచార్యులవారు పరమాత్మను కంసాలి గీటురాయి, పచ్చిపాలలో వెన్న, బట్టబయలుచేసిన ధనం, పట్టపగటి కాంతి, అందివచ్చిన బిడ్డ, పలుకులలోని తేటవంటి అసమాన వుదాహరణలతో పోలుస్తున్నారు. ఆ అద్భుతవైనం చిత్తగించండి. భగవంతుడైన శ్రీవేంకటేశ్వరుడే జీవులలో ప్రాణము రూపంలో వున్నాడంటున్నారు.

**తే॥ భక్తి తగినట్లు పరమాత్మవ్యక్తుడగును**
**భువిని జీవులకొసగును భుక్తి, ముక్తి**
**అన్నమార్యుడు భక్తితో ఆలపించి**
**వేంకటేశుని తత్త్వము విశదపఱచె**

**రాగం : రామక్రియ**

భక్తి కొలది వాడే-పరమాత్ముడు
భుక్తి ముక్తి దానె యిచ్చు- భువి పరమాత్ముడు ॥భక్తి॥

పట్టిన వారి చే బిడ్డ-పరమాత్ముడు
బట్ట బయటి ధనము-పరమాత్ముడు
పట్టపగటి వెలుగు-పరమాత్ముడు
ఎట్టయెదుటనే వున్నా-డిదే పరమాత్ముడు ॥భక్తి॥

పచ్చిపాలలోని వెన్న-పరమాత్ముడు
బచ్చెన వాసిన రూపు-పరమాత్ముడు
బచ్చు చేతివొరగల్లు-పరమాత్ముడు
ఇచ్చకొలది వాడు పో-యీ పరమాత్ముడు ॥భక్తి॥





పలుకులలోని తేట-పరమాత్ముడు
పలియించు నిందరికి -పరమాత్ముడు
బలిమి శ్రీవేంకటాద్రి -పరమాత్ముడు
ఎలమి జీవుల ప్రాణ-మీ-పరమాత్ముడు ॥భక్తి॥

### భావామృతం :

పరమాత్మకు మనపట్ల కలిగే కరుణయెప్పుడూ మనభక్తికి తగ్గట్లుగానే వుంటుంది. జీవులకు భుక్తి ముక్తి రెండూ ఇచ్చేవాడు ఆ పరమాత్ముడు దక్క వేరెవ్వరూ కాదు.

పరమాత్మ 'పట్టినవారిచే బిడ్డ'. అంటే ఎవరు ఎత్తుకొంటే వారి దగ్గరకు వెళ్ళే బిడ్డవలె ఎవరు నాకు నీవే కావాలి తండ్రీ! అంటే వారిని కరుణిస్తాడు. పరమాత్మ బట్టబయలు చేసుకోగలిగిన ధనం (వైట్ మనీ అన్నమాట). గుప్తధనంకాదు. పరమాత్ర ఆరుబయట పట్టపగలు కనబడే సూర్యకాంతి వంటివాడు. కృత్రిమంగా వెలిగించిన దీపంకాదు. పరమాత్మ వేరెక్కడనో లేడు, మన యెట్టయెదుటనే వున్నాడు. (మనపుణ్యం కొఱవైనందువలన మనకు కనిపించడు. అంతే...

వెచ్చజేయని పచ్చిపాలలో దాగియున్న వెన్నవలె ఆ పరమాత్మ అణువణువులో వున్నాడు. పరమాత్మ 'బచ్చెనబాసిన రూపు' అనగా ఏవిధమైన పైపూతల వంటి మెఱుగులు లేని నిజస్వరూపుడు. పరమాత్మ బచ్చు (వైశ్యుడు) చేతిలోని 'వొరగల్లు' అనగా గీటురాయి. (అన్నమాచార్యుల కాలంలో వైశ్యులే నేటికాలంలో స్వర్ణకారులు చేసే పనికూడా నిర్వహించేవారు). ఎవరిదెంత నిజమైన భక్తియో ఆ గీటురాయికి తెలియకుండా వుంటుందా? మన ఇచ్చ (కోరిక) కొలది ఆయన మనని అనుగ్రహిస్తాడు.

పరమాత్మ పలుకులలోని తేట. అనగా వేదవేదాంగము లన్నింటిలోని వాక్యములలోని భావస్వరూపుడు. ఇంతమంది జీవులకు స్వపరభేదం లేకుండా "చేసికొన్నవారికి చేసికొన్నంత" ఫలితం ఇచ్చే న్యాయమూర్తి. ఈయనే శ్రీవేంటాద్రిపై వెలసిన పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు. ఈయన అనుపమ శక్తి సంపన్నుడై వాత్సల్యంతో జీవులందరిలోను ప్రాణరూపంలో వున్న పరమాత్మ.

## మున్నుడి 2-88

"ఇన్నిటా చక్కని 'జాణ' జవరాలు, చక్కెర బొమ్మవంటిది" అని మెచ్చుకొంటూ స్వామికి విన్నవిస్తున్నారు అన్నమాచార్యుల వారు. నాయకుడు వేంకటేశ్వరుడే కాని నాయిక అయిన ఆ 'జాణ' స్వామివారి అసంఖ్యాక జవరాళ్లలో ఎవరైనా కావచ్చు. ఆయనకోసం విరహంతో ఏ జవరాలు 'వేగి' పోదు చెప్పండి. ఈరోజు దీపావళి. తెల్లవారుజామున నా భావనాకాశంలో తళుక్కుమని మెరసిన నాయిక సత్యభామ. శ్రీవేంకటేశ్వరుడే మోహనకృష్ణుడు. నారాయణుని 'నందక ఖడ్గం' కూడా 'సెబాస్' అని తళుక్కుమంటుంది స్వామి సన్నిధిలో. శృంగార కీర్తన కాబట్టి భావామృతం నిగూఢముగానే వుంచాను. 'జాణ' అంటే నేర్పరి. ఇక్కడ శృంగారంలో అని భావించాలి.

**ఉ॥ చక్కని జాణయీమె తగు స్వామికి ఈ జవరాలు జంటగా**
**చక్కెర బొమ్మవంటిదని 'సత్య'ను మెచ్చిరి అన్నమార్యుడున్**
**మ్రొక్కుచు పాడె కీర్తనము మోహనకృష్ణుని వేంకటేశుగా**
**"చొక్కెను జంటలౌ రతుల సుందరియౌ జవరాలనెన్", భళా!!**

**రాగం : శుద్ధ ధన్యాసి**

చక్కని జాణ యిన్నిటా జవరాలు
చక్కెర బొమ్మవంటిది జవరాలు ॥చక్కని॥

కన్నులు తప్పక చూచి కప్పురాన నిన్నువేసి
సన్నసేసీ నిదివో జవరాలు
వెన్నెల నవ్వులు నవ్వీ వేడుక నీకు పుట్టించి
చన్నుల నొరసీ నిన్ను జవరాలు ॥చక్కని॥

తెరమరుగున నుండి తేనెగార మాటలాడి
సరిపెనగీ నీతో జవరాలు
విరులు నీపై చల్లి వింత చేత లెల్లా చేసి
సరసములు నెరపీని జవరాలు ॥చక్కని॥





తమకము నీకురేచి దయపుట్ట సేవసేసి
సముకాన కొసరీనీ జవరాలు
అమర శ్రీవేంకటేశ అన్నిటా నీవు గూడగా
జమళి రతుల చొక్కీ జవరాలు ॥చక్కని॥

**భావామృతం :**

స్వామీ! నీజవరాలైన ఈ భామామణి చక్కని జాణ. చాలనేర్పరి. నిజంగా చక్కెర బొమ్మవంటిది అనుకో. (అటువంటి నీ జవరాలి నేర్పరితనం గురించి విను)

ఆమె నిన్ను 'కన్నులు తప్పక' చూస్తుంది. అంటే తన రెప్పకూడ వాల్చక చూస్తుంది. కర్పూరంతో నిన్ను వేస్తుంది. ఇదిగో నీ జవరాలు ఏవేవో నర్మగర్భమైన సైగలు చేస్తున్నది నీకు. మనోహరమైన వెన్నెల కురిపించే చిరునవ్వులు చిందిస్తున్నది. తద్వారా నీకు ఉల్లాసమును కలిగిస్తున్నది. నిన్ను తన కుచకుంభముల ఒరిపిడికి గురిచేసి నీ జవరాలు నిన్ను పులకరింపజేస్తున్నది.

'అవనిక' మరుగున నుండి తేనెలు జల్లువారినట్లు మధురంగా మంజులంగా మాట్లాడుతున్నది. కాని నీమాటకు తగిన జవాబు చెప్పుచున్న నీజవరాలిని చూశావా స్వామీ? (ఇక నిన్ను మాటలతో గెలవలేనని) నీపై పుష్పములను చల్లి ఏవేవో వింతచేష్టలు చేసి నీజవరాలు నీతో సరసములాడింది.

స్వామీ! దానితో (ఆ చేష్టమూలంగా) నీకు పరవశత్వము అధికమైనది. నీకు ఆమెపై దయకలిగింది. నీవు ఆమెకు పరిచర్యలు చేయుట నారంభించితివి. ఇప్పుడు ఆమె బెట్టు చేస్తున్నది. నీ జవరాలు నీ సముకాన (నీవు యెదురుగా వుండగా) సంకోచిస్తున్నది. ఓ మహానుభావా! నీవెవరవ? సాక్షాత్తు అలనాటి శ్రీకృష్ణుని చిలిపితనమంతా కలబోసుకొన్న శ్రీవేంకటేశ్వరుడవు నీకు లొంగకుండవుండుట సాధ్యమేనా? అమరియున్న నీవు ఆమెను (సత్యభామను) అన్ని విద్యలతో నీవు కూడి, మురిపించగా నీ జవరాలు జంటరతులతో పరవశించిపోయింది. (ఇంతకన్న నేనేం చెప్పగలను మహానుభావా! నీవు సర్వజ్ఞుడివి తండ్రీ!)

## 2-89

### మున్నుడి

చిన్నతిరుమలాచార్యులవారు మన కందించిన అనేక ఆణిముత్యాలలాంటి భజనలలో ఇదికూడా ఒకటి. సాధారణ మానవుడు, జ్ఞానం పెద్దగా లేనివాడు కూడా హరికి 'దగ్గరయ్యే' అత్యుత్తమ మార్గం భజనయే. హరికథాశ్రవణంలో మధ్య మధ్య 'పరధ్యానం' కలుగవచ్చును గాని భజనలో ఆ ప్రమాదం లేదు. ఈ కీర్తనలో అన్ని తేలిక పదాలే కాబట్టి భావామృతం పెద్దగా అవసరం లేదు అనుకోకండి. వివరణ కావలసిన పదాలు ఇందులోను ఒకటి రెండు లేకపోలేదు. 'సోవల' అంటే... ఏమిటి? 'సావ' అంటే జాడ. 'సోవ'ల అనే పదం నాకు దొరకలేదు. సోవల అంటే సోవల రూపాంతరంగా అని 'భావించాను'.

**కం॥ కొలువరె గోవిందా యని**
**పలుకుచు హరి నామములను పాయక ఎపుడున్**
**తొలగును పాపపురాసులు**
**తెలిపెను చిన తిరుమలయ్య తిరుమల రాయా!**

**రాగం : బృందావని**

గోవింద గోవిందయని కొలువరే
గోవిందాయని కొలువరే ॥గోవింద॥

హరియచ్యుతాయని యూడరే
పురుషోత్తమాయని పొగడరె
పరమ పురుషయని పలుకరే
సిరివరయనుచును చెలగరె జనులు ॥గోవింద॥

పాండవ వరదాయని పాడరే
అండజ వాహను కొనియాడరె
కొండలరాయనినె కోరరె
దండితో మాధవునినె తలచరె జనులు ॥గోవింద॥





దేవుడు శ్రీ విభుడని తెలియరె
సోవల ననంతుని చూడరె
శ్రీవేంకటనాధుని చేరరే
పావనమై యెప్పుడును బ్రదుకరె జనులు ॥గోవింద॥

**భావామృతం :**

ఓ జనులారా! మనస్ఫూర్తిగా మీరంతా 'గోవింద.. గోవింద' అని శ్రీమన్నారాయణునికి మ్రొక్కండి. పూజించండి. గోవిందుని స్మరించండి.

ఓ భక్తులారా! పరవశించి మీరంతా హరీ.. అచ్యుతా... అంటూ నాట్యం చేయండి. పురుషోత్తమా... అంటూ ఆ మహానుభావుని పొగడండి. పరమపురుషా! అని పిలవండి. ఆ నామం పలకండి. సిరివరుడు అంటే లక్ష్మీకాంతా! అని విజృంభించి ఆ నారాయణుని భజించండి.

ఓ ప్రజలారా! శ్రీకృష్ణావతారుడై ధర్మస్థాపకుడైన ఆ స్వామిని పాండవ వరదుడని పాడుచూ కీర్తించండి. అండము(గ్రుడ్డు) నుండి పుట్టిన గరుత్మంతుడు వాహనముగా గల విష్ణుమూర్తిని కొనియాడండి. ఏడుకొండల రాయుడని ప్రసిద్ధిజెందిన ఈ స్వామిని మీకు కావలసిన వర్ణాలు కోరుకోండి. ధైర్యంగా ఆ మాధవుడే (లక్ష్మీకాంతుడు) దిక్కని తలచండి సందేహించకండి.

మానవులారా! ఈ శ్రీ వేంకటేశ్వరుడే శ్రీపతి. ఈయనే దైవం అని తెలియండి. అనంతుడని, వినుతి కెక్కిన ఆ ప్రభువు జాడ గ్రహించి ఆయనను దర్శించండి. ఆ విధంగా మీరు శ్రీవేంకటనాధుని చేరండి. ఆ విధంగా పుణ్యాత్ములై ఎప్పుడూ ఆ శ్రీవేంకటరమణునే ధ్యానిస్తూ బ్రతుకును వెళ్లబుచ్చండి.

## 2-90

## మున్నుడి

అన్నమాచార్యులవారి అత్యద్భుత వైరాగ్య కీర్తనమిది. అక్కరకు రాని చుట్టరికాలతో, సంతలలో (బజార్లు అనబడె కూటములు) పలకరించుకొనే 'ఆత్మీయతలతో', విసిగి వేసారిపోయి తిరుమలయ్య యొక్కడే దిక్కు అని ఎలా ఆక్రోశిస్తున్నారో చూడండి. ముయ్యంచు (ముప్పిధంబులగు) మనస్సుతో (మనో,వాక్,కర్మలు చేత) మోహమతినై చెడిపోయానంటున్నారు.

**సీ॥ అయ్యయ్యో! ప్రాయంబు అంతమై పోయెనే**
**కాలంబు గడచనే!! కనుల ముందు**
**ముప్పిధంబుల మదిన్ మోహంబునన్ జిక్కి**
**'సంతకూటముల సంచారి' నైతి**
**తల్లిదండ్రులుగాని తగు బంధువులు గాని**
**అన్నదమ్ములుగాని అక్కరవరు**
**సుతులు కాంతలుగాని హితులు భృత్యులుగాని**
**సాయంబు కారురా జంటరారు**

**ఆ.వె॥ అంతరాత్ముడైన హరియొక్కడే దిక్కు**
**అన్నమయ్య తెలిపెనద్భుతముగ**
**నమ్మికొలువుడయ్య నారాయణుని నేడె**
**వేంకటాద్రిపైన వెలసినాడు**

**రాగం : శివరంజని**

అయ్యోపోయె బ్రాయము కాలము
ముయ్యంచు మనసున నే మోహమతినైతి ॥అయ్యో॥

చుట్టంబులా తనకు సుతులు కాంతలు చెలులు
వట్టియాసల పెట్టువారేకాక
నెట్టుకొని వీరు కదు నిజమనుచు హరినాత్మ
బెట్టనేరక వృథా 'పిరి వీకు' లైతి ॥అయ్యో॥





తగుబంధులా తనకు తల్లులును తండ్రులును
వగల బెట్టుచు తిరుగువారేకాక
మిగుల వీరల పొందు మేలనుచు హరినాత్మ
తగిలించలేక చింతాపరుడనైతి ॥అయ్యో॥

అంతహితులా తనకు అన్నలును తమ్ములును
వంతువాసికి పెనగువారేకాక
అంతరాత్ముడు శ్రీవేంకటాధీశు కొలువకిటు
సంతకూటముల అలజడికి లోనైతి ॥అయ్యో॥

**భావామృతం :**

అయ్యో! హతవిధీ! నాకు భగవంతుడిచ్చిన కాలం అంతా తరిగిపోయింది. వయస్సు గడచిపోయింది ముయ్యంచు (మూడు విధములుగా నుండు) మనస్సుచేత (మనోవాక్ కర్మలచేత) నేను మోహమతినై చెడిపోయాను.

నా కుమారుడు, నా భార్య, నా స్నేహితులు అని మురిసిపోతామే!! వీరంతా ఏ విధమైన చుట్టాలు? వీరంతా ఆశలు కలిగించి చివరికి నిరాశయే మిగిల్చి పోతారు కాని వేరుకాదు. అతిశయముతో వీరే నిజమైన వారని నమ్మి శ్రీహరిని ఆత్మలో ధ్యానింపక వ్యర్థముగా 'పిరివీకు' (పీకు + పీకు అంటే పీకులాట) కలవాడ నయ్యాను.

నా తల్లి నాతండ్రి అని బాల్యం నుంచి చచ్చేదాకా ఎంతో ఇష్టపడతామే కాని వీరు తగిన బంధువులా? వీరంతా అంతులేని వేదన కలిగించే వారే. కాని వీరి పొందు మేలు చేస్తుందని నమ్మి శ్రీహరిని ఆత్మానుసంధానం చేసికొనలేక చింతామతినై జీవితం వ్యర్థం చేసికొన్నాను.

నా అన్నదమ్ములు అని నేనింతకాలం ఎంతో మమకారం పెంచుకొన్నాను. నిజానికి వీరంతా నా వారా? అంత హితులా? వారంతా మా పిత్రార్జితంలో వారి వారి వంతువాసికి (వాటా) కోసం ఆరాటపడే వారే. పెనగు వారే (పోట్లాడే వారే) కాని మేలుచేసే వారు కాదు. నా అంతరాత్ముడై యున్న శ్రీ వేంకటేశ్వరుని కొలువక ఈ ప్రపంచం అనే సంతకూటమి (బజారు, సంత ఏదో ఒకరోజు ఒక ప్రదేశమున ఏర్పాటుచేయబడి సరుకుల క్రయ విక్రయములు చేయబడు ప్రదేశము) లో కలిగే సంబంధాలతో అలజడి (వ్యాకులత)కి లోనై నానా బాధలు పడ్డాను. ఇకచాలు.

## 2-91

### మున్నుడి

అన్నమాచార్యులవారు చెప్పిన సరళమైన మేలుకొలుపు కీర్తన ఇది. వేంకటేశ్వరుడే ఆనాటి బాలకృష్ణుడని భావించి చెప్పిన కీర్తన. కృష్ణయ్య "మిన్నక వేసాలు" (ఊరకనే కొంటె వేషములు) వేస్తున్నాడట. అవి మాని మేలుకోవయ్యా స్వామి అంటున్నారు. సన్నలు అంటే సంజ్ఞలు. నీ సన్నల యోగనిద్ర అంటే సంకేతము నిచ్చే యోగనిద్ర. (అంటే నేను నిద్రపోవటం లేదు, లోకాల నన్నింటినీ గమనిస్తున్నాను అనే సంకేతమునిస్తున్న యోగనిద్ర) ఇక చాలు మేలుకో నందనందనా! అని అంటున్నారు.

**ఉ॥ మిన్నక వేసముల్ వలదు మేలుకొనంగదె బాలకృష్ణ! నీ**
**సన్నల యోగ నిద్ర యిక చాలును యెందరు గోప భామినుల్**
**నిన్నిటు ముద్దులాడుటకు నీదరిజేరిరి అన్నమయ్యనెన్**
**ఎన్నికజేసి వేంకటగిరీశుడె ఆ యదునందనుండనెన్.**

**రాగం : కీరవాణి**

మిన్నకవేసాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్రచాలు మేలుకోవయ్య ॥మిన్నక॥

ఆవులు పేయలకుగా నఱచీ పిదుకవలె
గోవిందుడా ఇక మేలుకోవయ్యా
ఆవలీవలి పడుచులు ఆటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా ॥మిన్నక॥

వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడ
కూడియున్నారిదే మేలుకోవయ్యా
తోడనే యశోద గిన్నెతో పెరుగువంటకము
ఈడకు తెచ్చిపెట్టేనింక మేలుకోవయ్యా ॥మిన్నక॥





పిలిచీ నందగోపుడు పేరుకొని అదె, కన్ను
కొలుకులు విచ్చి (ఇంక) మేలుకోవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రి మీది బాలకృష్ణ
ఇలమా మాటలు వింటివింక మేలుకోవయ్యా ॥మిన్నక॥

### భావామృతం :

ఓ బాలకృష్ణా! ఊరకనే దొంగ వేషాలు వేసి నిద్రనటిస్తున్నావు. ఇక మేలుకో తండ్రీ! యోగనిద్రపోతూనే ఒకకంట లోకాల నన్నింటినీ గమనిస్తూనే వుంటావు. ఇక నీ నిద్ర చాలించి మేలుకో మహానుభావా!

వింటున్నావా! ఆవులు వాటి దూడల కోసం అంబారావాలు చేస్తున్నాయి. నీవు దూడల్ని వదిలి వాటికడుపు నిండాక గాని గోమాత పాలు మనం త్రాగరాదు. దూడల్ని వదలాలి కదా! లేనాన్నా! నిద్రలే. నీవు ఎవరివి? గోవిందుడవు. ఇక మేలుకోవయ్యా! అక్కడా ఇక్కడా నీతోటి సహవాసగాళ్లు పడుచు కుర్రాళ్లు నీతో ఆటలు మరిగి దోవకాచుకొని యున్నారు. పాపం పొద్దుపోయింది. నిద్రమేలుకోరా బాబూ!

గోపవాడల్లోనుంచి గోపికలు నిన్నుపట్టుకొని ముద్దుల్లో ముంచెత్తాలని మూకుమ్మడిగా కూడియున్నారు. నిద్దురమేలు కొనవయ్యా! నీకు నిద్రలేవంగానే ఆకలేస్తుందనే గొప్ప ఆదుర్దాలో తనతోపాటు పెరుగువంటకము (దద్ధోజనం లేక పెరుగుపచ్చడి అన్నం) ఇక్కడికే తీసికొచ్చి నీకోసం నిరీక్షిస్తోంది, మీ అమ్మ యశోద. మేల్కొనరాదా? తండ్రీ!

అదిగో అటు చూశావా, మీనాన్న నందగోపుడు కన్నయ్యా! అని పేరు పెట్టి పిలుస్తున్నాడు. ఇకనైనా మేలుకో. నామాట అబద్ధమైతే నీ కనుకొలుకుల లోంచి నీవే చూడు. శ్రీ వేంకటాద్రిపై వెలసిన వేంకటకృష్ణుడవైన బాలకృష్ణా! నీవు మా మొరలన్నీ వింటూనే వున్నావు. (అసలు మా గోలతో మేము నిన్ను నిద్రపోనిస్తే కదా! అట్లా లాలి పాట పాడి నిద్రబుచ్చి వెంటనే సుప్రభాతం అని ఊదరగొట్టేస్తూనే వున్నాం కదా!) అందుకని నిద్రమేలుకొని మమ్మల్ని రక్షించు.

**2-92**

## మున్నుడి

'కేసరము' అంటే జూలు. కేసరి అంటే జూలు కల సింహం. నరకేసరి అంటే నరసింహస్వామి. అన్నమాచార్యులవారు అహోబల నరసింహునిపై చెప్పిన చక్కటి కీర్తన ఇది. గరుడాద్రిపై వెలసిన, మనోహరమైన నవ్వు మోము నరసింహుని కీర్తిస్తున్నారు. ఎడమతొడపై ఆదిలక్ష్మిని కూర్చొనబెట్టుకొని యున్న కనక నరసింహుడని మొక్కుతున్నారు. "రవి చంద్ర శిఖ నేత్రుడు" అంటె సూర్య, చంద్రులు మరియు శిఖ అను మూడు నేత్రములు కలవాడు. ఇకపోతే 'శిఖ' అంటే 'సెగ'. అంటే అగ్ని ఆయన మూడవ కన్ను.

**ఆ.వె॥నగు మొగంబుతోడి 'నరకేసరై' బ్రోచు**
**గరుడ శిఖరమందు కలతబాపు**
**వేంకటాద్రి నున్న విభుడునీ 'సింగవే'**
**అన్నమయ్య తలపె అద్భుతమురి.**

**రాగం : మాళవి**

నగుమోముతోడి ఓ నరకేసరి
నగరూప గరుడాద్రి నరకేసరి ॥నగుమోము॥

అమిత దానవహరణ ఆదినరకేసరి
నమిత బ్రహ్మాది సుర నరకేసరి
కమలాగ్ర వామాంక కనకనరకేసరి
నమో నమో పరమేశ నరకేసరి ॥నగుమోము॥

రవిచంద్ర శిఖనేత్ర రౌద్ర నరకేసరి
నవ నారసింహా నమో నరకేసరి
భవనాశినీ తీర భవ్య నరకేసరి
నవరసాలంకార నరకేసరి ॥నగుమోము॥





శరణాగతత్రాణ సౌమ్య నరకేసరి
నరకమోచననామ నరకేసరి
హరి నమో శ్రీవేంకటాద్రి నరకేసరి
నరసింహ జయజయతు నరకేసరి ॥నగుమోము॥

**భావామృతం :**

నవ్వులు వెలయించుచున్న వదనము గల ఓ నరసింహా! పర్వ రూపమునున్న గరుత్మంతుడు గరుడాద్రియై దానిపై నెలకొని యున్న నీకు వందనములు.

ఓ ఆదినరసింహా! అసంఖ్యాకులైన దానవులను నిర్జించినవాడవు నీవే. బ్రహ్మాది దేవతలు వినమ్రతతో మ్రొక్కు దేవదేవుడవైన నరసింహుడవు. ఆదిలక్ష్మిని ఎడమతొడపై కూర్చొన బెట్టుకొనిన కనక నరసింహుడవు నీవే. అట్టి పరమేశ్వరుడవైన నీకు నమస్కారములు.

ఓప్రభూ! నీవు రౌద్రరూపంలో వున్నప్పుడు నీకు మూడునేత్రములుగా సూర్యచంద్రులు మరియు అగ్ని దీప్తించుచున్నారు. అట్టి క్రొంగొత్త రూపముగల ఓ నరకేసరీ! నీకు వందనములు. భవనాశినీ నదీ తీరంలో వెలసిన శుభకరుడవైన నరసింహుడవు నీవు. శృంగార, రౌద్ర, భీభత్సాది నవరసములు అలంకారముగా ప్రదర్శించు నరకేసరివి. అట్టి నీకు వందనములు.

శరణు జొచ్చినవారికి బలము అనిపేరు పొందిన మనోజ్ఞ మూర్తి ఈ నరసింహుడు. ఈయన భక్తులను నరకమునుండి తప్పించును. శ్రీవేంకటాద్రిపై వెలసిన ఆ స్వామికూడా ఈ నరకేసరియే. ఓ నరసింహా! నీకు జయము. ఓ నరకేసరీ! నీకు జయమగు గాక!

## 2-93

### మున్నుడి

'మంగాంబుధి' లో వెలసిన హనుమంతుని సేవించి అన్నమాచార్యులవారు అనేక కీర్తనలు చెప్పారు. వాటన్నిటిలాగా ఈ కీర్తనకూడ బహుళ జనాదరణ బొందింది. ఇందులో వుటంకించిన భారత గాథలు సవివరంగా చెప్పాలంటే స్థలాభావం వలన సాధ్యంకాదు. క్షంతవ్యుడను. సుగ్రీవుడు రాముని సేవించి ధన్యుడయింది హనుమవల్లనే. శ్రీరాముడు ఆంజనేయుని వలననే సీతాదేవిని ప్రేమముతో 'ముగుడను బెండ్లాడె' (మరల భార్యగా పొందినాడు) అని అంటున్నారు. వేంకటేశ్వరుని 'యండనే' (ఆశ్రయము వలననే) హనుమ ఇవన్నీ చేయగలిగాడంటున్నారు అన్నమయ్య.

**చం॥ అనిలజుడైన యా హనుమ అంజన పుత్రుడు వాని చేతలన్**
**ఘనులగు దేవతాళికిని కాదిక నెంచగ అన్నమయ్యనెన్**
**అనుపమ లీలతో గెలుపు అర్జునుకిచ్చెను ఆలమందనెన్**
**వినుడిది అండ మారుతికి వేంకటనాథుడె తాననెన్ భళా!!**

**రాగం : ఆరభి**

ఆంజనేయ అనిలజ హనుమంత నీ
రంజకపు చేతలు సురలకెంచ వసమా ॥ఆంజనేయ॥

తేరిమీద నీ రూపుదెచ్చిపెట్టి యర్జునుడు
కౌరవుల గెలిచె సంగర భూమిని
సారెకు భీముడు పురుషామృగము దెచ్చుచోట
నీ రోమములు గావా నిఖిల కారణము ॥ఆంజనేయ॥

నీ మూలమున గాదె నెలవై సుగ్రీవుడు
రాముని గొలిచి కపిరాజాయెను
రాముడు నీవంకనే పో రమణి సీతాదేవి
ప్రేమముతో మగుడను బెండ్లాడెను ॥ఆంజనేయ॥





బలుదైత్యులను దుంచ బంటుతనము మించ
కలకాలమును నెంచ గలిగితిగా
అల శ్రీ వేంకటపతి యండనే మంగాంబుధి
నిలయపు హనుమంత నెగడితిగా ॥ఆంజనేయ॥

**భావామృతం :**

అంజని పుత్రుడవైన ఓ హనుమంతా! నీవు అనిలజుడవు (వాయునందనుడవు). మనోహరమైన నీచేష్టలను వివరించటం దేవతలకైనను సాధ్యమయ్యే పనేనా? ఎన్నటికీ కాదు.

ద్వాపరయుగంలో అర్జునుడు తన రథంపై 'జెండా' మీద నీ రూపము నుంచుకొని కౌరవలను గెలిచి విజయుడైనాడు. వాయునందనుడవుటచే నీ సోదరుడైన భీమసేనుడు 'పురుషామృగము'ను తెచ్చు సందర్భమున నీ రోమము (వెంట్రుక) తోనే ఆ కార్యము సాధించ గలిగెను. (త్రేతాయుగమునాటి నీవు చిరంజీవి వవుట చేతనే అట్లు చేయగలిగితివి కదా!)

త్రేతాయుగంలో శ్రీరామచంద్రునికి, సుగ్రీవునికి నీమూలంగానే పరిచయం కలిగి ఆత్మీయులై పరస్పరం సహాయం చేసికొన్నారు. కపిరాజై సుగ్రీవుడు శ్రీరాముని సేవించాడు. అంతెందుకు నీవు సీతా శోక వినాశకుడవు కనుకనే రాఘవుడు మరల జానకీదేవిని భార్యగా పొందాడు.

అసంఖ్యాకులైన దానవులను తెగటార్చి శ్రీరామదూత అని అజరామరమైన కీర్తిని సంపాదించి, కలకాలము నిన్ను కొలుచు భక్తులను రక్షించుచున్నావు. ఆనాటి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించుటవలన నేటికీ మంగాంబుధిలో నివాసివైన హనుమంతుడవై ఎనలేని కీర్తిని సంపాదించితివి. (అందుకే, 'శ్రీరామదూతం శిరసా నమామి' అని కీర్తించు అందరికీ నీ సహాయం దొరుకుతున్నది)

**2-94**

## మున్నుడి

'సువ్వి' అనే మాటకు అర్థం లేదు. దంచే ప్రక్రియలో ఆయాసం తీర్చుకొనుటకు దంచువారు నోటితో చేయు 'ధ్వని' అది. 'లాల' అంటే 'చౌంగ'. లాలి అంటే ఉయ్యాల. ఉయ్యాల పాపాయిని ముద్దుగా 'లాల' అని పిలుస్తారు. దంచుతున్న భామలు చిన్నారి కృష్ణుని తలుచుకొంటూ 'ఓలాల!' అని పిలుస్తున్నారు. ఇంతకీ ఆ పాపాయి ఎవరు? కృష్ణయ్యే కాదు ఆయనే నేటి ఏడుకొండలవాడు. ఈయన పాపాయిలా చౌంగకార్చుట లేదు, తెప్పలుగా రతి తేలుచు కోనేటి అప్పని వలెనున్నాడు. కోనేటి చెంతనున్న ఈ అప్పని (అయ్యని) కొలవని వానిది జన్మయేనా? వివరణకి భావామృతం చదవాల్సిందే.

**ఆ.వె॥ కొలిచి రన్నమయ్య 'కోనేటి అప్పని'**
**ఇవ్విధముగ పాడి 'సువ్విపాట'**
**కన్నెలంత చేరి 'కనుచూపు రోకండ్ల'**
**బాగ దంచిరనిరి, వహ్వా!! లాల!!**

**రాగం : కేదారగౌళ**

సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెద రోలాల ॥సువ్వి సువ్వి॥

వనితలు మనసున కుంచన చేసిటు
వలపులు తగనించో లాల
కనుచూపులనెడు రోకండ్లను
కన్నెలును దంచెదరో లాల ॥సువ్వి సువ్వి॥

బంగరు చెరగుల పట్టు పుట్టములు
కొంగులు తూలగ వోలాల
అంగనలందరు నతివేడుకతో
సంగడి దంచెద రోలాల ॥సువ్వి సువ్వి॥





ఘల్లుఘల్లుమను కంకణ రవముల
పల్లవ పాణులు వోలాల
అల్లన నడుములు అసియాడుచు సతు
లొల్లనె దంచెద రోలాల ॥సువ్వి సువ్వి॥

కప్పుర గంధులు కమ్మని పువ్వుల
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతితేలుచు కోనే
టప్పని పాడెదరోలాల ॥సువ్వి సువ్వి॥

**భావామృతం :**

(ఇద్దరు స్త్రీలు ధాన్యం రోట్లో దంచుతున్నారు. 'సువ్వి' అంటూ నోటితో అని, బలంగా రోకటిపోటు వేసింది ఒకామె. ఆమె రోకలిపైకి తీయంగానే రెండవ ఆమె 'సువ్వి' అంటూ తనూ రోకటి పోటు వేసింది. దంచటం పూర్తయ్యేదాక వారు 'సువ్వి', 'సువ్వి' అంటూనే వున్నారు. ఓలాల! ఈ సుదతుల్ని (స్త్రీలను) చూచితివా?)

ఓలాల! దంచుతున్న ఆ స్త్రీలు మనస్సులలో ఈవిధముగా తలపోయుచూ అతిశయించిన ప్రేమను నింపుకొనిరి. వారు కనుచూపులు పైకి క్రిందికీ మరల్చుచున్నందువల్ల (దంచేటప్పుడు రోకలిని గమనిస్తారు కదా!) ఆ కన్నెలు చూపుల రోకళ్లతో దంచుతున్నట్లు వున్నది.

బంగారు జరీగల పట్టు వస్త్రములను వారు కట్టిరి. ఓలాల! అందుచేత దంచుతున్నప్పుడు వారి కొంగులు తూలుచున్నవి. అక్కడి స్త్రీలందరు మిక్కిలి వేడుకతో ఒక కూటమిగా చేరి ఈ దంచుడు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది అద్భుతముగా నున్నది.

ఓలాల! పల్లవ పాణులు (చిగురుటాకులవంటి చేతులు గల) యైన ఆవనితలు ముంజేతి కంకణములు ఘల్లుఘల్లుమని ధ్వనించుచుండగా దంచుచున్నారు. వారి నడుములు మెల్లగా అటూ నిటూ చలించుచున్నవి. అది మనోహరముగా నున్నది.

ఓలాల! చప్పరములలో (పందిళ్లలో) దంచుచున్న ఆ కప్పుర గంధులు (కర్పూరపు ఒంటి సువాసన గల స్త్రీలు) కమ్మన పుష్పములను చల్లారు. అతిశయించిన రతుల దేలెడి ఆ కోనేటి అప్పడు (కోనేటి దరినున్న తండ్రి) అయిన శ్రీవేంకటేశ్వరుని పాడి కీర్తించెదరు. ఓలాల! వారిదే భాగ్యమంటే.

**2-95**

## మున్నుడి

శ్రీరామచంద్రుని కీర్తిస్తుంటే అన్నమాచార్యులవారిని, వినినవారు యెంత పులకించి వుంటారో ఊహించలేను కాని, ప్రతి కీర్తనలోను శ్రీరామదర్శనం నేటికీ చేయిస్తున్నారని చెప్పగలను. ఖర, దూషణాది పదునాలుగు వేలమంది దానవులను 'చదిపి' నాడట శ్రీరాముడు. ఒకే ఒక్క శరముతో ఏడు తాటిచెట్లను ధరను కూల్చాడట!కొండలతో జలనిధిని 'కట్టించి' లంకమీద విడిసినాడట ఈ ఏకాంగవీరుడు. మాల్యవంతాద్రిపై వెలసిన శ్రీరాముడే శ్రీవేంకటాద్రి మీదనే కాక వేవేల చందాల వెలసినాడట. "సొగసుచూడతరమా..."

**ఉ॥ ఈతడె రామచంద్రుడట ఏపుగ తానసహాయ శూరుడున్**
**ఏతల జూచినా ఇరవు ఈతడె శంభుని విల్లు ద్రుంచెరా**
**చేతలు జానకీపతివి చెప్పనుయెన్నని, మాల్యవంతమం**
**దీతడె తాను వేంకటగిరీశుడు యీతడె అన్నమయ్యనెన్**

### రాగం : రామక్రియ

ఈతడు వో రాముడు ఏకాంగ వీరుడు
ఏతల జూచినా తానె ఇరవుకొన్నవాడు ॥ఈతడు॥

చిరుతప్రాయమునాడు శివుని విల్లువిరచి
మెరసి సీతను పెండ్లాడి మించినవాడు
తరి పదునాలుగు వేల దానవుల నిమిషాన
జరసి తానొక్కడే చదివిన వాడు ॥ఈతడు॥

వోడక విల్లెక్కుపెట్టి ఊరకే ఒక్కమ్మున
ఏడు తాళ్ల ధరను కూలవేసినవాడు
జాడగా కొండలచేత జలనిధి గట్టించి
వేడుకతో లంకమీద విడిసిన వాడు ॥ఈతడు॥





రావణ కుంభకర్ణాది రాకాసుల పరిమార్చి
ఈవల అయోధ్యాపట్నమేలిన వాడు
శ్రీవేంకటాద్రిమీద జేరి మాల్యవంతమున
వేవేలు చందములను వెలసినవాడు ॥ఈతడు॥

### భావామృతం

ఓ భక్తులారా! ఇదిగో చూడండి. ఇతడే శ్రీరామచంద్రుడు ఈయన అసహాయ శూరుడు. ఎవ్వరి తోడులేకనే ఒంటరి పోరాటం జరుపగల ధీశాలి. ఎటువైపు చూచినా తానే యుద్ధం చేస్తున్నట్లు కనిపించునట్లుండు రణరంగమార్తాండుడు.

నవయౌవన ప్రాయంలోనే శివధనస్సును విరిచిన అసాధ్యుడు. తత్ఫలితంగా శోభాయమానంగా సీతాదేవిని పెండ్లియాడినాడు. పదునాలుగు వేలమంది రాక్షసులను (ఖరుడు మొదలైనవారు) మధించి ఒక్క నిమిషంలో, తానొక్కడే (లక్ష్మణుని సీతకు కావలియుంచి), జరసి(పోయి) చదివిన (చంపిన) వాడు.

ఈ శ్రీరాముడు ఓడక (వెనుకాడక) ధనస్సు నెక్కుపెట్టి ఊరకనే ఒకేఒక్క బాణముతో ఏడు తాటి చెట్లను నేలపడగొట్టాడు. (దానివల్ల సుగ్రీవునకు తనశక్తిపైన నమ్మకం కలిగించాడు. గుర్తించబడునట్లు అనంత జలరాశియైన సముద్రంమీదనే కొండరాళ్లతో వంతెన కట్టించి లంకకు విడిసిన (ప్రయాణమైన) వాడు, ఈ శ్రీరాముడు ఆ తరువాత రావణ కుంభకర్ణాది రాకాశి మూకను సంహరించి, ఇటు అయోధ్యా నగరాన్ని జనరంజకంగా పరిపాలించాడు. ఈయనే శ్రీవేంకటాద్రిపై చేరిన శ్రీవేంకటేశ్వరుడు ఈ మాల్యవంతమనే కొండమీద వెలసి అనేక రకములుగా ప్రజలను రక్షించుచున్నాడు.

## 2-96

### మున్నుడి

ఆంధ్రదేశంలో అతి సామాన్యులు కూడా నిత్యమూ వాడే సామెతలకి అన్నమాచార్యులవారి ఇటువంటి కీర్తనలే స్ఫూర్తియేమో అనిపిస్తుంది. "పరిగెత్తి పాలుతాగేకంటే నిలబడి నీళ్లుతాగితే మేలు", "కాకిలాకలకాలం బ్రతికేకంటే కోకిలలా కొద్దిరోజులు బ్రతికితే చాలు" వంటి అసంఖ్యాక సామెతలకు మూలం ఇదేనేమో! ఇంత చిన్న కీర్తనలో నాబోటి 'తెలుగు' వాడికి అంతుపట్టని మాటలు కోకొల్లలు. తప్పులేని జీతమొక్క తారమైన చాలు - అంటే? తప్పు చేయించకుంటే జీతము ఒక్క 'తారము' అయినా అంటే నాలుగు కాసులు అయినా చాలు.

**ఆ.వె. 'తిప్ప' లెన్నియైన 'అప్పు' లేకుండిన**
**అదియె మేలు అనిరి అన్నమయ్య**
**'తార' జీతమైన తప్పులేకున్నచో**
**చాలు, వేంకటేశ! జగతియందు.**

**రాగం : మిశ్రమలహరి**

అప్పులేని సంసారమైన పాటేచాలు
తప్పులేని జీతమొక్క తారమైనచాలు ॥అప్పులేని॥

కంతలేని గుడిశొక్క గంపంతయిన చాలు
చింతలేని అంబలొక్క చేరడే చాలు
జంతగాని తరుణియే జాతైన నదెచాలు
వింతలేని సంపదొక్క వీసమే చాలు ॥అప్పులేని॥

తిట్టులేని బ్రతుకొక్క దినమైననదె చాలు
ముట్టులేని కూడొక్క ముద్దెడే చాలు
గుట్టుచెడి మనుకంటే కొంచెపు మేలైన చాలు
వట్టిజాలి బడుకంటే వచ్చినంతే చాలు ॥అప్పులేని॥





లంపటపడని మేలు లవలేశమే చాలు
రొంపికంబమౌకంటే రోయుటే చాలు
రంపపు కోరికకంటే రతి వేంకటపతి
పంపున నాతని చేరే భవమే చాలు ॥అప్పులేని॥

### భావామృతం:

ఓ మానవులారా! డాంబికంగా తప్పులు చేస్తూ బ్రతికి గత జన్మపుణ్యవశాన దొరికిన మీ జన్మని వ్యర్థం చేసుకోవద్దు. నామాట వినండి. భగవంతుడు మెచ్చే విధంగా జీవించండి. సంసారం ఈదుస్తున్న సామాన్య మానవుడు ఏవేవో పాట్లు (తిప్పలు) పడుతుంటాడు. అది సహజం. కాని చేతికందిన అప్పులు చేస్తూ చేసే సంసారంకంటే వున్నదాంతో సరిపెట్టుకొని జీవించుట మేలుకదా! అప్పుతీర్చలేక తిట్లు, తన్నులు తినాలి కదా! జీతం ఎక్కువ వస్తున్నదని అకృత్యాలు చేసేకంటే సక్రమమైన కొలువులో 'తారము' (నాలుగు కాసుల నాణెం) జీతం లభించినా చాలు.

గంపంత చిన్న గుడిసెలాంటి ఇంట్లో, కంతలు (రంధ్రములు) లేని కప్పుకింద వుండటం మేలుకదా! బాధలు లేకుంటే అంబలి (గంజి) త్రాగి బ్రతికితే మాత్రం నష్టమేమిటి? భార్య గుణవంతురాలైతే ఏ జాతిదైతే నేమి? ఏ కులముదైతేనేమి? ఆమె 'జంత' (దుర్మార్గురాలు) కాకుంటే చాలును కదా! అందరూ ఆశ్చర్యంతో నోళ్లునొక్కుకొనే అక్రమార్జితమైన ఆస్తిపాస్తుల కంటే సంపద ఒక వీసమెత్తు (1/16 భాగము) వుంటే నష్టమేమిటి?

నిందలు పడకుండా ఒక్కరోజు బ్రతికినా చాలు కదా! ఎంగిలి చేయకుండా ఒక్కముద్ద భోజనం పెట్టినా ఎంతో మంచిది కదా! పదిమందిలో చులకనయై బ్రతికేకంటే గుట్టుగా కొంచెము వున్నా మేలేకదా! వట్టిగా జాలి చూపించే వాడికంటే తనకి వచ్చినది యేదో కొంత ఇచ్చేవాడు నయము కదా!

ఏవేవో లంపటములు (బంధాలు) గల బ్రతుకుకంటే ఏ చీకాకులేని బ్రతుకు లవలేశము (అతికొంచెము) యైనా నయమే. బురదతో నిండిన స్తంభం ఏ ఆధారమీయగలదు? దానితో అవస్థపడేకంటే దాన్ని విడిచిపెట్టుటయే నయము కదా! రంపపుకోత కలిగించు కోరికలను త్యజించి ప్రీతితో సర్వమూ శ్రీవేంకటేశ్వరుడే అని ఆయన ఆజ్ఞాబద్ధుడై ఆయనను చేరే జన్మయే మిక్కిలి మేలైనది. అదే చాలు.

## 2-97

### మున్నుడి

ఐదురోజుల వివాహమహోత్సవము శ్రీనివాసునికి, అలమేల్మంగమ్మకు జరుగుచున్నది. నాల్గవనాడు నాగవెల్లి అని పిలువబడే 'నాకబలి' తంతు జరుగుచున్నది. ముత్తయిదువులు మురిసిపోతున్నారు. చెలులంతా నృత్యం చేస్తూ పాడుతున్నారు. వధూవరుల పేర్లు చెప్పుకొంటున్నారు. వారిద్దరికీ ఒక్కపేరాయేమన్నానా? సహస్రనామములు గలవారు. ఒకరి కింకొకరు ధీటుగా ఉన్నారు. మరి ఇంత చక్కటి జంట ముల్లోకాలలో వుంటుందా? పెదతిరుమలాచార్యుల వారి అపూర్వ సృష్టి ఈ కీర్తన. ఓ చెలులారా! ఈ ఇద్దరికీ ఒకే కైవాడము కలిగింది అన్నారు. అంటే... ఏమో... భావామృతం చూడాల్సిందే.

**చం॥ కనుగొన నేడె పెండ్లియట, గాంచరె మీరలు నాగవల్లినిన్**
**మనముల శోభనా లలర పాడి చెలుల్ ఇటు ఆడరే తగన్**
**వనజ నివాసినిన్ జలదవర్ణుడు గూడెను తాళ్లపాకవా**
**రనె మన వేంకటేశ్వరుడు ఆ వరుడాయమ మంగమాంబరా.**

**రాగం : నాదబ్రుందావని**

నేడే పెండ్లివేళ నేడే నాగవల్లి
ఆడుచు సోబాన పాడుమనరే చెలులు ॥నేడే॥

కనకాంబరుడతడు కనక కుచగిరి యీకె
కొనబుగల యిద్దరికి కూడె పొంతనము
వనజనాభుడతడు వనజలోచన యీకె
ఘనమైన కంకణము గట్టరే చెలులు

నీలవర్ణుడతడు నీలకుంతలి యీకె
చాలుకొని యిద్దరికి జంట తగును
అలరైన శంఖధరు డతడీకె కంబుకంఠి
యీలీల నారతులు యెత్తరే చెలులు ॥నేడే॥





జలధి శాయిని యతడు జలధికన్యక యీకె
కలిగె నిద్దరికి నొక్కకైవాడము
అలరు శ్రీవేంకటేశుడతడీకె మహాలక్ష్మి
వెలయగల సిరి దీవించరే చెలులు ॥నేడే॥

### భావామృతం

ఓ చెలులారా! అపురూపమైన జంటకు పెండ్లి జరుగుచున్నది. ఈ వేళ నాగవల్లి. ఎంత చక్కగా జరుగుచున్నదో చూడండి. మీరంతా కలిసి నాట్యమాడండి. మధురంగా పాడండి. శుభములు కలుగవలెనని దీవించండి. ఈ జంట ఒకరికొకరు సమవుజ్జీగా నున్నారు.

ఈ వరుని చూశారా? ఈయన కనకాంబరుడు (పచ్చని పట్టుపీతాంబరధరుడు) ఈమె కనక కుచగిరుల చిన్నది. ఉద్యానవనం కోనేటి దరిలో వారిద్దరికీ పొత్తుకలిగిందట. ఈయన వనజనాభుడు (నాభియందు పద్మము గలవాడు) ఈమె వనజలోచన (పద్మనయన) వీరిద్దరికీ గొప్ప ముంజేతి కంకణము కట్టండి. చెలులారా! మీ జన్మతరింప చేసికొనండి.

ఇంకొక పోలిక చూశారా? ఈయన నీలవర్ణుడు (నల్లని దేదీప్యమానమైన మేఘవర్ణుడు). ఈమె నీలకుంతల (నల్లని తలవెంట్రుక గల సుందరి). ఒప్పయిన విధముగా ఇద్దరికీ జంట కుదిరినది. అతడు ప్రకాశించు దివ్య శంఖమును (ఆ శంఖము పేరు పాంచజన్యం. దాని ధ్వనికే రాక్షసులు తల్లడిల్లి మరణిస్తారు) ధరించువాడు. ఆమె శంఖమువంటి చక్కటి కంఠము కలది. ఈవిధమైనందున వీరికి హారతుల నీయండి.

ఈయన జలధిశాయి (సాగరముపై శయనించు వాడు శేషతల్పశాయి) ఈమె జలధికన్య (సాగర పుత్రిక). వీరిద్దరికీ ఒకే కైవారము కలిగినది. (ఒకే స్తోత్రముతో కీర్తించబడుతున్నారు. ఆమెను లక్ష్మీం క్షీర సముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం అంటాం. ఆయనా శ్రీరంగధాముడే) నిత్యానందుడైన శ్రీవేంకటేశ్వరుడీయన ఈమె శ్రీమహాలక్ష్మి వీరిని దీవించి శుభములు చేకూర్చుండి. ఓ చెలులారా! మీ జన్మలు చరితార్థం చేసికొనండి.

## 2-98

### మున్నుడి

దేవకీ వసుదేవులకు శ్రీమన్నారాయణుడు శిశువుగా కృష్ణునిగా (నల్లనివానిగా) జన్మించబోతున్నాడు. వారికి దివ్యమైన తన చతుర్భుజ రూపమూ తరువాత క్రమంగా అనంతమైన విశ్వరూపం చూపించాడు. చతుర్భుజుడు దశవిధ అవతారములను, సహస్రఫణి ఆదిశేషశయ్యాగతుడై అనంత దివ్యాయుధములతో దర్శనమిచ్చి వారిని ధన్యులను చేశాడు. అన్నమాచార్యులవారు ఆ విశ్వరూపుడే, ఆ శిశువే నేటి అనంత శ్రీవేంకటాద్రీశుడని కీర్తిస్తున్నారు. ఈ సంస్కృత కీర్తనపాడి ఆ పరమాత్మ విశ్వరూపం కన్నుల ముందు తెచ్చుకోండి.

**కం॥ శరణంటినయ్య నీకిక**
**హరిరూపా! చిన్నికృష్ణ! అని తెలిపిరిగా**
**వరుసగ సంఖ్యలలోనే**
**మురిపెంబుగ అన్నమయ్య మురహరి ఘనతన్**

**రాగం : మాండు**

తే శరణమహంతే శరణమహం
శైశవ కృష్ణా తే శరణం గతోస్మి ॥తేశరణం॥

దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసుర దళన
దశదిశాపరిపూర్ణ తపనీయ స్వరూప
దశావరణ లోక తత్త్వాతీత ॥తేశరణం॥

సహస్రలోచన సంతత వినుత
సహస్రముఖ శేషశయనా
సహస్రకరకోటి సంపూర్ణ తేజా
సహస్రార దివ్య చక్రాయుధ ॥తేశరణం॥





అనంత చరణ సర్వాధారాధేయ
అనంత కర దివ్యాయుధ
అనంత నిజకళ్యాణ గుణార్ణవ
అనంత శ్రీవేంకటాద్రి నివాస ॥తేశరణం॥

### భావామృతం

చిన్నారి శిశువురూపములో నున్న ఓ శ్రీకృష్ణా! నీకు నేనిదే శరణాగతితో వేడుకొంటున్నాను. ప్రభూ! శరణు శరణు శరణు. నీకు శరణు.

(నీ ఘనతను వర్ణించుట నావలన అయ్యే పనియేనా? అయినా ప్రయత్నిస్తాను)

నీవు దశవిధములైన, దివ్యమైన అవతారములను ధరించితివి. ధర్మరక్షకుడవై సర్వులను అనుగ్రహించితివి. పదితలల రావణాసురుని పరిమార్చితివి. దశదిశలు (ఎనిమిది దిక్కులు, ఊర్ధ్వ అధోలోకాలు) విస్తరించి సంపూర్ణముగా నిండిపోయినటువంటి తపనీయ స్వరూప (బంగారు కాంతితో మెరిసిపోయే స్వరూపుడవు). సమస్తలోకములలోని తత్త్వములకు అందని వాడివి.

ఓ దేవా! నీవు ఎల్లప్పుడూ సహస్రాక్షుడైన దేవేంద్రునిచే కీర్తించబడుతుంటావు. సహస్రఫణియైన ఆదిశేషుడు పాన్పుగా పాలకడలిలో వుంటావు. కోటిమంది సహస్రకర (సూర్యుల) పరిపూర్ణ తేజస్సుతో వెలుగొందుతూ వుంటావు. వేలకొలది అంచులుగల దివ్య చక్రాయుధమును ధరించి యుందువు.

ఓ మహానుభావా! నీవు అనంతమైన చరణములు (పాదములు) గలవాడవు. సర్వులకు ఆధార భూతుడైన వాడవు. అనంతమైన బాహువులలో అసంఖ్యాకమైన ఆయుధములను ధరించి యున్నావు. అనంతమైన కళ్యాణగుణ సాగరుడవు. ఈ దివ్య మంగళ స్వరూపముతో శ్రీవేంకటాద్రిపై నిలిచి శ్రీవేంకటేశ్వరుడని కీర్తించబడుతున్నావు.

**2-99**

## మున్నుడి

ఆరువందల సంవత్సరాల క్రిందట, అన్నమాచార్యులవారి నాటి 'ధన సంపాదన చదువును' దుయ్యబడుతున్నారు. ఆచార్యులవారు. ఏవేవో మాటలు చెప్పి ఆ రోజుకారోజు ఏదోరకంగా ధనం కోసమే ఉపయోగపడుతుంది నాచదువు. ఈ 'కలి' కాలం చదువు పరమాత్మను మఱిచేట్లు చేస్తుంది. ఈ ప్రౌఢల చదువు నిరుపయోగం. బ్రహ్మాది దేవతలు వేంకటపతిని నేర్చే చదువుకోసం ఆరాటపడుతుంటే శ్రీహరిని మఱచెడి సిరిసంపదల కోసం ఈ 'చదువు' పనికి వస్తున్నది అంతే... అంటున్నారు. ఆరువందల సంవత్సరాల తరువాత కూడా అదే కథ. దొరల కాళ్లు పట్టడమే పని. ఛీ! ఛీ!

**ఉ॥ నాటికి నాడె నా చదువు నాణ్యతలేనిది అన్నమయ్యనెన్**
**మాటలు మెండుగా కలిగి మాధవునెంచని దేమి విద్యరా?**
**యేటికి? వ్యర్థమా చదువు యేలికలందరి కాళ్లనొత్త, కో**
**నేటి పతిన్ మనోహరుని నీరజనాభుని 'విద్య' నేర్వుడీ**

**రాగం : వలజ**

నాటికి నాడే నా చదువు
మాటలాడుచును మఱచేటి చదువు ॥నాటికి॥

ఎనయ నీతని ఎఱుగుటకే పో
వెనక వారు చదివిన చదువు
మనసున నీతని మఱచుటకే పో
పనివడి యిప్పటి ప్రౌఢల చదువు ॥నాటికి॥

తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుత గృతయుగాదుల చదువు
కలిగిన యీతని కాదననే పో
కలియుగంబులో కలిగిన చదువు ॥నాటికి॥





పరమని వేంకటపతి గనుటకే పో
దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరులనితని మఱచెడి కొరకే పో
విరసపు జీవుల విద్యల చదువు ॥నాటికి॥

## భావామృతం

నేను నేర్చిన నా చదువంతా ఏ రోజుకారోజుకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఏవేవో మాటలు చెప్పుకొని బ్రతికే చదువు. అది మఱపు కలిగిస్తుంది. పరమాత్మ దారిలో పోనీయక మనకు చెఱుపు చేస్తుంది.

పరిశీలించి చూస్తే మన పూర్వీకులైన ఋషులు చదివిన చదువంతా కేవలం 'ఇతనిని' (పరమాత్మని) తెలుసుకొనుటకే వినియోగించారు. మరి, ఈనాటి మన చదువులు ఇప్పటి 'పెద్దల' చదువులు. ఇవియెందుకు వుపయోగ పడుతున్నాయో తెలుసునా? 'ఇతనిని' (పరమాత్మను) మఱచుటకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి.

తొలుత కృత, త్రేతా, ద్వాపరయుగాలలో గ్రహింపు తెచ్చుకొని 'ఇతనిని' (పరమాత్మను) తెలుసుకొనుటకే చదువు వినియోగింపబడినది. కాని నేటి కలియుగంలోని కలికాలం చదువులు, కలిగిన ఇతడు (పరమాత్మ) లేడని వాదించుట నేర్పెడి చదువు మాత్రమే. దానివలన ఏ ప్రయోజనమూ లేదు.

బ్రహ్మాది దేవతలు తాము ఆచరించి, మనకు 'పరము' అని నేర్పిన చదువు ఈ శ్రీవేంకటేశ్వరుని భావించుటయే. (ఇప్పుడు మీరు చేస్తున్న ప్రయత్నం కూడా ఆ 'చదువు' కోసమే సుమండీ...) అయితే విరసపు జీవుల (విరుద్ధంగా, వ్యతిరేకంగా ఆలోచించే జీవుల) విద్యలు నేర్పే 'చదువులు' కేవలం సిరి సంపదలు కూడబెట్టుకోటానికే పనికొస్తాయి. దాని వలన ఆ సిరిపతిని మఱచిపోతాం (తత్ఫలితంగా శ్లేష్మంలో పడిన ఈగలాగ చస్తూనే బ్రతుకుతాం).

## 2-100

### మున్నుడి

ఇహము అంటే ఈ భూమిపై జీవించు వేళ, పరము అంటే భూమిని వదలి వేరే లోకం చేరుకొన్నాక కూడ ఈ జీవుడికి దిక్కు పరమాత్మ శరణాగతి మాత్రమే. వేంకటేశ్వరుడే కనికరించి పాలించకపోతే నా గది అధోగతే. ఓ నారాయణా! అచ్యుతా! అనంతా! గోవిందా! శరణు. శ్రీహరీ! జగత్తులోని సారము తెలిసింది. ఇందులో అన్నీ ద్వంద్వాలే. సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు, రాత్రింబగళ్లు, నవ్వులు, ఏడ్పులు, ఇవన్నీ వ్యతిరేకములే. పులుపు, తీపి, వగరు, కారములు కల భోజనంచేసినట్లే ద్వంద్వ భావాలుగల సంసారంలో జీవించక తప్పదు. నన్ను కరుణించు. నేను గట్టెక్కి నిన్ను చేరునట్లు చేయి ప్రభూ! అంటున్నారు అన్నమాచార్యులవారు.

**చం॥ మనుజుల ద్వంద్వ భావముల మగ్గుట తప్పదు రేబవళ్లుగా**
**పనిగొని వేంకటేశ్వరుడ! భ్రాంతిని ముంచెదవయ్య! జీవులన్**
**వినుతిని జేసి నిన్ను యిటు వేడెదనే కరుణింపు మయ్యరో!**
**అనెనిటు తాళ్లపాక గురుడన్నయ కీర్తనమెంచి చూడుడీ**

**రాగం : మాళి గౌళ**

నారాయణాచ్యుతానంత గోవిందా హరి
సారముగ నీకు నే శరణంటిని ॥నారాయణా॥

చలువయును వేడియును సటల సంసారంబు
తొలకు సుఖమొకవేళ దుఃఖమొక వేళ
ఫలములివె ఈరెండు పాపములు పుణ్యములు
పులుపు తీపును కలిపి భుజియించినట్లు ॥నారాయణా॥

పగలు రాత్రుల రీతి బహుజన్మ మరణాలు
తగుమేను పొడచూపు తనుతానె తొలగు
నగియించు నొకవేళ నలగించు నొకవేళ
వొగరు కారపు విడెము ఉబ్బించి నట్లు ॥నారాయణా॥





యిహము పరమును వలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని
సహజ శ్రీవేంకటేశ్వర నన్ను కరుణింప
బహువిధంబుల నన్ను పాలించవే ॥నారాయణా॥

**భావామృతం :**

ఓ నారాయణా! అచ్యుతా! అనంతా! గోవిందా! శ్రీహరీ! శరణు-శరణు-శరణు. జగత్తుయొక్క సారము తెలిసింది. దీని చేవనెరిగితిని. నీకు శరణంటిని.

అన్నియును ద్వంద్వములే, విరుద్ధమైనవే ప్రభూ! చల్లదనము వేడిమి వలె ఈ కపటపు ప్రపంచమున ఒకప్పుడు సుఖ పారవశ్యము ఇంకొకప్పుడు దుఃఖ వివశత్వము కలుగుతాయి. మరి ఈ రెండును పుణ్యము పాపముల ఫలం అనుభవించే మార్గములే కదా! భోజనంలో ఒకప్పుడు తీపి మరొకప్పుడు పులుపు రుచులు కలుగుట సహజమే కదా!

పగలు రాత్రి ఒకదాని తరువాత ఇంకొకటి వచ్చినట్లు, శరీరానికి అనేక జనన మరణాలు అనుసరించి వస్తానే వుంటాయి. వాటంతట అవే తొలగిపోతుంటాయి. ఆ పరంధాముడు ఒకసారి నవ్విస్తుంటాడు. ఒకసారి బాధలతో నలగ కొడుతుంటాడు. తాంబూలం వేసికొంటే అది ఒకసారి కారంగా (ఘాటుగా) మరొకసారి వొగరు (కాచు ఎక్కువైనప్పుడు) గా ఉంటుంది. అట్లాగే మనకు కలిగే ఈ ద్వంద్వాలు కూడ.

మనం ఇహలోకంలోను పరలోకంలోను అనుభవించే కష్టసుఖాలు కూడా కల్ల నిజము వలె ద్వంద్వమే. భ్రాంతి (ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు భావించు స్థితి) నొందుట భ్రాంతిని వీడుట కూడ పరమాత్ముని అనుగ్రహం వల్లనే కలుగుతాయి. సహజ స్వభావుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను అనేక విధములుగా కరుణించి నన్ను రక్షించు చున్నావు. నేను సదా నీకు శరణార్థిని. నీ భృత్యుడను. నీకు విధేయుడను నన్ను కటాక్షింపుము తండ్రీ!

## 2-101

### మున్నుడి

ఆదిదేవుడైన ఆ శ్రీవేంకటేశ్వరుని కృపాధనమును సంపాదించాలని నేను ప్రయత్నించినప్పటికీ నా అసలు ఆశయం పూర్తిగా సిద్ధించే దాకా నాకు తృప్తిలేదు. 6 సంపుటాలలో 606 కీర్తనలకి అన్నమాచార్యుల వారిని, సంస్మరిస్తూ 'మున్నుడి' మరియు 'భావామృతం' వ్రాస్తాను. నా ఆశయం నెరవేరాలంటే ఆ ఏడుకొండలవాడే దిక్కు. దీనితో రెండవ సంపుటి పూర్తి అవుతున్నది. ఎలుగెత్తి నాతో మీరూ అనండి. "ఏడుకొండల వాడా! వేంకటరమణా! గోవిందా! గోవింద!"

**ఆ.వె.॥జయము మంగళంబు సర్వేశ్వరా! నీకు**
**జలజవాసినికిని జయము శుభము**
**అన్నమయ్య కృతికి మున్నుడి భావంబు**
**వినరె, జనులగావ వినుతి జేతు**

**రాగం : మధ్యమావతి**

జయ మంగళం నీకు సర్వేశ్వరా
జయమంగళం నీకు జలజవాసినికి ॥జయ॥

శరణాగత పారిజాతమా
పొరి నసురుల పాలి భూతమా
అరుదైన సృష్టికి ఆదిమూలమా
హరీ నమో పరమపుటాలవాలమా ॥జయ॥

సకల దేవతా చక్రవర్తీ
వెకలివై నిండిన విశ్వమూర్తి
అకలంకమైన దయానిధి ఓ
వికచముఖ నమో విధికి విధి ॥జయ॥





కొలిచిన వారల కొంగుపైడి
ములిగిన వారికి మొనవాడి
కలిగిన శ్రీవేంకటరాయా
మలసి దాసులమైన మాకు విధేయా ॥జయ॥

### భావామృతం

ఓ సర్వేశ్వరా! నీకు జయము కలుగుగాక! నీకు సమస్త సన్మంగళములు కలుగుగాక. పద్మసంభవి, పద్మనివాసినియైన నీ అర్ధాంగి శ్రీమహాలక్ష్మికి జయము, శుభము కలుగుగాక!

ఓ దేవా! నీ శరణు జొచ్చిన వారికి దివ్య పారిజాత వృక్షమువలె సర్వాభీష్టములను తీర్చుమహానుభావుడవు. మాటి మాటికీ అసురులు పాలిటి 'భూతము' వలె పట్టి పట్టి నిర్మూలించిన వాడవు. ఈ సృష్టికి నీవొక్కడవే ఆదిమూలము అయినవాడవు. ఓ శ్రీహరీ! సర్వమునకు నీవే ఆలవాలము (పాదు) అయివుంటివి. అట్టి నీకు వందనములు.

ఓ ప్రభూ! సకల దేవతలకు నీవు చక్రవర్తివి. అందరూ నీకు విధేయులే. ఆసక్తి కలిగించు విశ్వరూపమును ధరించినవాడవు. నిరాక్షేపణగల దయగలవాడవు. వికచముఖుడవు. (వికసించిన వదనము గలవాడవు) విధికి విధివి (బ్రహ్మకే బ్రహ్మవైన పరబ్రహ్మవు) అట్టి నీకు నమస్కారములు.

ఓ దేవదేవా! నిన్నుకొలిచిన వారిని నీవు ఎల్లప్పుడూ కొంగులో దాచుకొన్న బంగారమువలె తక్షణమే ఆదుకొంటావు. ములిగిన వారికి (మూలుగుచున్న ఆర్తులకు) నీవు మొనవాడివి (ముందుండి దారి చూపించువాడవు) ప్రత్యక్షముగా యెదుట నున్న శ్రీవేంకటేశ్వరుడవు. మలసి (నిశ్చయముతో) నీకు దాసులమైన మాకు నీవు సర్వదా విధేయుడవు. ఇది నిజం.

శ్లో॥ నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్॥

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ

భావయామి వేంకటేశం





















శ్రీరస్తు

శుభమస్తు                                                  అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-III

**ఎన్నుకోబడిన**

**అన్నమాచార్యుల సంకీర్తనలకు**

**మున్నుడి**

మరియు

**భావామృతం వివరణ**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-III**

**మొదటి ప్రచురణ**

**మార్చి 2011**

**రచన**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

**వెల : అమూల్యం**

**ప్రతులకు :**
**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,**
**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**డి.టి.పి. & ప్రింటింగ్ :**
**కె. మురళీ కృష్ణ**
**9848 51 51 09**





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

**- రచయిత**



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి III

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అతడే రక్షకుడందరికతడే | 81 |
| 2. | అతని పాడెదము | 143 |
| 3. | అదె చూడరయ్య పెద్ద | 93 |
| 4. | అన్నిటికి నిది పరమౌషధము | 121 |
| 5. | అంతర్యామీ అలసితి సొలసితి | 39 |
| 6. | ఆదిపురుష అఖిలాంత | 37 |
| 7. | అమరెగదె నేడు | 51 |
| 8. | అరయ శ్రావణ బహుళాష్టమి. | 119 |
| 9. | అలమేలు మంగ నీవభినవ | 115 |
| 10. | అహోబలేశ్వరుడు అఖిల | 187 |
| 11. | ఆకటివేళల అలపైన వేళల | 47 |
| 12. | ఇందరికి అభయందులిచ్చు | 97 |
| 13. | ఇతడొకడే సర్వేశ్వరుడు | 183 |
| 14. | ఇతనికంటే మరిదైవము | 05 |
| 15. | ఇతరులకు నిన్నెరుగ | 79 |
| 16. | ఇన్నాళ్ళు నందునందు | 169 |
| 17. | ఇన్నిట నింతట | 45 |







| | | |
|---|---|---|
| 18. | ఇహపర సాధన మిది యొకటే | 193 |
| 19. | ఈతడే రఘురాముడీతడే | 85 |
| 20. | ఎట్టుగూడె పెండ్లి | 71 |
| 21. | ఎంత మాత్రమున ఎవ్వరు | 177 |
| 22. | ఎన్నడు విజ్ఞానమిక | 89 |
| 23. | ఏమంటి వేమంటివి | 113 |
| 24. | ఏడ సుజ్ఞానము ఏడతెలివి | 53 |
| 25. | ఒక్కడే ఏకాంగవీరుడు | 7 |
| 26. | ఒక్కొక్క సతినడుమ | 147 |
| 27. | ఒకపరి కొకపరికొయ్యారమై | 99 |
| 28. | ఔనయ్యా జాణడవు | 161 |
| 29. | కంటి శుక్రవారము | 63 |
| 30. | కడునజ్ఞానపు కరువుకాలము | 197 |
| 31. | కంభమున వెడలి | 23 |
| 32. | కలశాపురముకాడ | 49 |
| 33. | కందువ మీనిచ్చు | 155 |
| 34. | కొలచిన వారల కొంగు | 13 |
| 35. | కోరికలు కొనసాగె | 103 |
| 36. | గోవిందాశ్రితగోకుల | 31 |
| 37. | గోవిందామేల్కొనవయ్యా | 181 |
| 38. | ఘుమ్మని యెడి శృతి | 175 |

| | | |
|---|---|---|
| 39. | చక్కని తల్లికి చాంగుభళా | 43 |
| 40. | చాటెదనిదియే | 73 |
| 41. | చాలదా మా జన్మము | 61 |
| 42. | చాలుచాలు నీజాజర | 157 |
| 43. | చిత్తగించు మిదె | 179 |
| 44. | చూడవమ్మ యశోదమ్మ | 29 |
| 45. | చెప్పరాదీ యంతి సిరులు | 117 |
| 46. | చేరియశోదకు శిశువితడు | 15 |
| 47. | చెలువపు సేతల శిన్నెకా | 189 |
| 48. | తగునయ్యా హరినీకు | 41 |
| 49. | తెలిసిన వారికి తెరువిదే | 9 |
| 50. | తొల్లియును మజ్జాకు | 173 |
| 51. | దనుజులు గనిరి తత్త్వమిది | 185 |
| 52. | దిబ్బలు వెట్టుచు | 163 |
| 53. | దేవ నమో దేవ | 151 |
| 54. | ధరణినెందరెన్ని | 167 |
| 55. | నందనందన వేణు | 57 |
| 56. | నరహరినీదయ | 65 |
| 57. | నమోనమోరఘుకుల | 55 |
| 58. | నానాదిక్కుల నరులెల్ల | 21 |
| 59. | నాటకమింతా | 101 |







| | | |
|---|---|---|
| 60. | నారాయణాయ నమో | 199 |
| 61. | నారాయణతే నమోనమో | 127 |
| 62. | నిత్యసుఖానంద మిదె | 95 |
| 63. | నిమిషమెడతెగక | 135 |
| 64. | నీ దాసుల భంగములు | 131 |
| 65. | నూరువద్దు తాగవద్దు | 77 |
| 66. | పరగీ నిదివో గద్దెపో | 149 |
| 67. | పరమవైష్ణవుల | 27 |
| 68. | పరమాత్ముడైన హరి | 3 |
| 69. | పసిడి యక్షింతలివి | 25 |
| 70. | పాలదొంగ వద్ద వచ్చి | 133 |
| 71. | పుట్టెడిదంతా బూటకము | 19 |
| 72. | పురుషోత్తముడవీవు | 33 |
| 73. | పెంచితము బెట్టుజెట్టు | 153 |
| 74. | భారమైన వేసమాను | 83 |
| 75. | మందర ధర మధుసూదన | 11 |
| 76. | మత్స్య కూర్మ వరహా | 69 |
| 77. | మతంగ పర్వతము | 137 |
| 78. | మనసిజ సముద్రమథన మిదె | 195 |
| 79. | మనుజుడై పుట్టి మనిషిని | 129 |
| 80, | మాధవునకు మంగళం | 201 |

| | | |
|---|---|---|
| 81. | మూడే మాటలు | 141 |
| 82. | మెరుగువంటిది | 139 |
| 83. | యజ్ఞమూర్తియజ్ఞకర్త | 165 |
| 84. | రచ్చకెక్కితివి | 87 |
| 85. | రామమిందీవరశ్యామం | 191 |
| 86. | వచ్చెను అలమేలుమంగ | 59 |
| 87. | వద్దేగొల్లెత | 35 |
| 88. | వాడల వాడల వెంట వసంతము | 107 |
| 89. | వాడె వేంకటాద్రి మీద | 1 |
| 90. | విజాతులన్నియు వృథా | 135 |
| 91. | వినుడిదె రఘుపతి | 145 |
| 92. | విరహపు రాజదె | 17 |
| 93. | శరణం బితడే | 109 |
| 94. | శరణు కపీశ్వరా | 171 |
| 95. | శోభనమే శోభనమే | 91 |
| 96. | సతులాల చూడరే | 75 |
| 97. | సింగార మూరితివి | 123 |
| 98. | సుగ్రీవ నారసింహ | 67 |
| 99. | సేవించరోజనులాల చేతులెత్తి మొక్కరో! | 105 |
| 100. | హరి రసమ విహారీ | 111 |
| 101. | హరి శరణా గతి | 159 |






# ప్రార్థన

కం॥ శ్రీమన్నారాయణునిన్
నామది అన్నయ్యవోలె నయముగ తలతున్
నీమముగ తెలుపుచుంటిని
ఈ 'మున్నుడి', 'భావములను' ఇంపుగ వినరో!

కం॥ శ్రీవల్లభునిన్ పొగడుచు
ఆవల అన్నయ్య తాను అలరించ హరిన్
భావించి వేల కీర్తన
లా వరదుడు భక్తిమీర ఆలాపించెన్

చం॥ ఘనుడగు వేంకటేశ్వరుని కామితదాయకుడైన శ్రీపతిన్
అనఘుడు అన్నమయ్య మనసార భజించెను వేల కీర్తనల్
అనుపమ లీలతో వినిచె, ఆయన స్ఫూర్తి తరింప నెంచితిన్
కనులకు కానరాని 'సిరికాంతుని' నామది నిల్పికొల్చితిన్

ఆ.వె॥ వేంకటేశుడొకడె వెలకట్టలేనట్టి
దైవమనుచు నమ్మి దీనుడనని
'భావయామి' అంటి బరువంత దిగిపోయె
అన్నమయ్య దారి నెన్నుకొంటి

కం॥ మున్నెరుగ నన్నమయ్య
ఎన్నుచు కీర్తనలు భావమిటు తెలుపుటయున్
మున్నుడి పద్యము జెప్పుట
ఇన్నియు చేసినది వేంకటేశుడె సుండీ!!!

## ముందు మాట (సంపుటి-III)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు

3. నేదునూరి కృష్ణమూర్తి గారు

4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు

5. గరికపాటి వెంకట్ గారు

6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు

7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)

8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు

9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ









**3-1**

## మున్నుడి

శ్రీవేంకటాద్రిమీద వెలసి, పోడిమితో (సౌందర్యముతో) కనిపించే పొడగాటి దైవమని, వరములిచ్చేదైవమని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆయన ఒక్కొక్క వెంట్రుకలో ఒక్కొక్క బ్రహ్మాండంవుందిట. ఒక బ్రహ్మాండంలోనే అంతులేని నక్షత్రాలు. వాటికి మళ్లీ గ్రహాలు. మన భూమండలం సూర్యుడనే నక్షత్రానికి ఒకగ్రహం. ఆ భూమిలో మనం వుండే చోటెంత? అసలు మన వునికి యెంత? మనం ఎంత అల్పులమైనా ఆ దేవదేవుని శరణు అంటే కాపాడుతాడు. ఎవరెవరో దేవతలెందుకు? వారందరినీ పుట్టించిన శ్రీనివాసుడు శాశ్వతుడు ఉండగా ఇంకే భయం? అంటున్నారు.

**ఉ॥ వాడె వరాలనిచ్చుటకు వాసముగా తిరువేంకటాద్రిపై**
**పోడిమి తోడ గన్పడె నపూర్వముగా పొడవాటి దైవమై**
**వేడుక వీని గొల్వుడనె ప్రీతిగ పాడుచు నన్నమార్యుడున్**
**చూడగ జన్మజన్మముల జొప్పిన భాగ్యము శ్రీనివాసుడా!**

**రాగం : వసంత**

వాడె వేంకటాద్రిమీద వరదైవము
పోడిమితో పొడచూపె పొడవైన దైవము ॥వాడె॥

వొక్కొక్క రోమకూపాన నొగి బ్రహ్మాండ కోట్లు
పిక్కటిల్ల వెలుగొందే పెను దైవము
పక్కనను తనలోని పదునాలుగు లోకాలు
తొక్కి పాదాన గొలచే దొడ్డ దైవము ॥వాడె॥

వేదశాస్త్రాలు నుతించి వేసరి కొనగలేని
మోదపు పెక్కుగుణాల మూలదైవము
(పొ)పోది దేవతల నెల్ల పుట్టించ రక్షించ





ఆదికారణంబైన అజుగన్నదైవము ॥వాడె॥
సరు(ర)స శంఖ చక్రాలు సరిబట్టి అసురుల
తరిగి పడవేసిన దండి దయివము
సిరి వురమున నించి శ్రీవేంకటేశుడయి
శరణాగతులగాచే సతమయిన దయివము ॥వాడె॥

**భావామృతం :**

అదిగో వాడే శ్రీవేంకటాద్రిపై వెలసిన వరదైవము. (వరములిచ్చే దేవుడు). ఎంతో సౌందర్యముతో గానవచ్చుచున్న ఆ పొడవైన దేవుని చూడండి. చూచి తరించండి.

ఆ స్వామి ఒక్కొక్క వెంట్రుకలో ఒక బ్రహ్మాండం చొప్పున కోట్లాది బ్రహ్మాండాలను తనలో నింపుకొని వెలుగొందుచున్న అనంతుడైన దైవము. తన సమీపముననే (తనలోనే) పదునాలుగు లోకములను తనపాదములతోనే కొలిచి తొక్కి చూపించిన (బలి చక్రవర్తికి) గొప్ప దైవము (త్రివిక్రముడు).

నాలుగు వేదములు, ఆరు శాస్త్రములు ఆయనను కీర్తించి యెంత శ్రమ నొందినా ఆయనను వివరించలేక పోయాయి. అంతులేని మంగళకరములైన గుణముల ప్రోవు ఆ స్వామి. దేవతా సమూహముల నెల్ల పుట్టించి, వారిని రక్షించుచున్న ఆదికారణము ఆ చతుర్ముఖ బ్రహ్మ. ఈ మహానుభావుడు ఆ బ్రహ్మదేవునే కన్నయట్టి దైవము (తండ్రి).

అతి సమీపముగా శంఖ చక్రములను యుక్తముగా ధరించి రాక్షసులను నరికి పారవేసిన దండి దయివము (గొప్పదైవము). శ్రీమహాలక్ష్మిని తన హృదయంలో నిలిపి శ్రీవేంకటేశ్వరుడై తనను శరణు జొచ్చినవారిని రక్షించుచున్న శాశ్వతుడైన దైవము ఈ తిరుమల నాథుడు.

**3-2**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణి అలమేల్మంగపై అన్నమాచార్యుల వారు చెప్పిన అద్భుత కీర్తన ఇది. పరమాత్మ దేవేరి, బ్రహ్మయ్యను కన్నతల్లి, చంద్రుని తోబుట్టువు, క్షీరసాగర కన్య అసంఖ్యాకమైన వేంకటపతి బంట్లకు ఇహము పరము ఇచ్చే తల్లిని కాస్తమాబోటి భూలోకంలోని నిర్భాగ్యులని కూడా విచారించు తల్లీ! అని వేడుకొంటున్నారు. శ్రీమహాలక్ష్మి సిరులనిచ్చే తల్లియే, కాని మనం అంతా గమనించాల్సిన విషయం ఏమంటే "నీమగని పంపునను నిజసిరులిచ్చితివి" అంటున్నారు. స్వామి తలవూపితేకాని అమ్మ మనకేసి చూడదు. అదీ సంగతి.

**చం॥ కమలకు, విష్ణురాణికిని, కాముని తల్లికి, కామధేనుతో**
**విమలపు జన్మనెత్తిన పవిత్రకు మొక్కిరి అన్నమార్యుడున్**
**రమ యని పేరునొందిన లలామకు వేంకటనాధుడే తగున్**
**అమరుల కన్నతల్లికిది అద్భుత కీర్తన మెంచి చూడరో**

**రాగం : శుద్ధధన్యాసి**

పరమాత్ముడైన హరి పట్టపు రాణివి నీవు
ధర మమ్ము విచారించదగు నీకు నమ్మా ॥పరమాత్మ॥

కనులజు గన్నతల్లి కాముని గన్నతల్లి
అమరుల గన్నతల్లి ఆదిమ లక్ష్మి
విమలపు నీపతికి విన్నపము సేసి మమ్ము
నెమకి యేలితి దయ నీకే తగునమ్మా ॥పరమాత్మ॥

కామధేను తోబుట్టుగ కల్పకము తోబుట్టుగ
దోమటి చల్లని చంద్రు తోబుట్టుగ
నీ మగని పంపునను నిజసిరులిచ్చితిని
నేమపు వితరణము నీకే తగునమ్మా ॥పరమాత్మ॥





పాలజలధి కన్యవు పద్మాసనివి నీవు
పాల పండే వేంకటపతి దేవివి
యేలిన ఇతని బంట్లకు ఇహపరాలిచ్చి మా
పాలగలిగితివి సంబంధము మేలమ్మా ॥పరమాత్మ॥

**భావామృతం :**

పరమాత్మునిగా సన్నుతింపబడుచున్న శ్రీహరికి పట్టపురాణివి తల్లీ! నీవు. ఆయన యేలుబడిలో వున్న ఈ భూమిపై నున్న మమ్ము రక్షించి మా బాగోగులు చూడవలసిన అమ్మవు నీవే.

నీకు నీవేమన్నా తక్కువా తల్లీ? నీవెవరివో తెలుసా? స్వయంగా చతుర్ముఖ బ్రహ్మగారి కన్నతల్లివి. భావనలోనే పుట్టి అలరించే కాముడు(మన్మధుని) అమ్మగారివి. దేవతలందరికి జననివి. ఆదిలక్ష్మివి. నిర్మలుడైన నీమగని కాస్త మాకొరకు అభ్యర్థించి మేం యెక్కడ వున్నా వెదకి పట్టుకొని దయచూపించమని చెప్పగల దానివి నీవొక్కదానివే. నీకే తగును. కాస్త దయచూడు తల్లీ!

ఇక నీ సోదరులు యెంత గొప్పవారో తెలుసునా తల్లీ! కామధేనువు అందరి కోరికలను తీర్చే సంగతి జగత్ప్రసిద్ధమే. కల్పకము (కల్పవృక్షం) యెక్కడ వుంటే అక్కడ కొఱతయే వుండదు. చంద్రుడు చల్లని చందమామయ్యేగాక, దోమటి (అన్నము) పెట్టే సస్యదాత. నీ మగడు అంగీకరిస్తేనే మాకు నిజమైన సౌభాగ్యములనిచ్చెదవు. అందుకని 'ఈవి' (దానగుణం) మీ వంశంలోనే వున్నది. కాస్తమాపై కూడ నీదయ చూపించు తల్లీ!

నీవు క్షీరసాగరకన్యవు. కమల నివాసినివి. పాలపండే (నైపుణ్యంగల) వేంకటేశ్వరుని దేవేరివి. ఆ స్వామి బంట్లము అయినందువల్ల మా యేలిక ప్రోద్బలమున మాకు ఇహము పరమునిచ్చే యజమానురాలివి. అందుచే నీవు మా పాలినుండు సంబంధముచే మమ్ము పరిపాలించి రక్షించు తల్లీ!

**3-3**

## మున్నుడి

'ఎందెందు వెదకి చూచిన అందంద గలడు హరి' అన్నాడు ప్రహ్లాదుడు. అయితే వెదకవలసినది మనమే. ఆరాటంతో, భక్తితో శరణాగతితో వెదకాలి. అప్పుడు తప్పక కనబడతాడు. లోకాల యేలిక నెక్కడ వెదకం? అని నిరుత్సాహపడరాదు. జలధిలో చేపలా కనబడలేదా? పాతాళంలో కూర్మంలా.. ఆఖరికి ఆవుల మందలలో రామకృష్ణులుగా... నేటికీ జీవులందరిలోనూ అంతర్యామియైన శ్రీవేంకటేశ్వరునిగా నున్నాడు. అన్నమాచార్యులవారు హరి అవతారాలను చాలా కీర్తనలలో నర్మగర్భంగా చెప్పారు. కాని ఇందులో చాల తేటతెల్లంగా చెప్పారు.

**కం॥ ఇతనిని మించిన దైవము**
**'వెతికిన' కనరాడు ఘనుడు వేంకటపతియే**
**ఇతనివె పదిరూపములన్**
**నుతియించిరి అన్నమయ్య నోరూరంగన్**

**రాగం : మోహన**

ఇతనికంటే మరిదైవము కానము యెక్కడ వెదకిన నితడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము తానె ॥ఇతని॥

మదిజలధులనొకదైవము వెదకిన మత్స్యావతారంబితడు
అదివో పాతాళమందు వెదకితే ఆది కూర్మమీ విష్ణుడు
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహునుని కంటిమి
(బె)చెదరక కొండల గుహల వెదకితే శ్రీ నరసింహంబున్నాడు ॥ఇతని॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముడొకడైనాడు
తలపున శివుడును పార్వతి వెదకిన తారక బ్రహ్మము రాఘవుడు
కెలకుల నావుల మందల వెదకిన కృష్ణుడు రాముడునైనారు ॥ఇతని॥





పొంచి అసుర కాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాడు
మించిన కాలము కడపట వెదకిన మీదటి కల్క్యావతారము
అంచెల జీవుల లోపల వెదకిన అంతర్యామై మెరసెను
యెంచుక ఇహమున వెదకిన యీతడే శ్రీవేంకట విభుడు ॥ఇతని॥

**భావామృతం :**

నరులారా! ఎక్కడ వెదకినా, మనకు ఇతనిని మించిన దైవము కానరాదు. ఈయనే అన్నిటికీ ఆధారమైన ఆది దైవము. అతిశయించిన దివ్య మహిమలతో ఈయన అనేక చోట్ల 'అవతరించి' దుష్టశిక్షణ శిష్టరక్షణ చేశాడు.

ఆ కథలన్నీ విన్నాం కదా!

మహాసముద్రంలో మత్స్యరూపంలో కనబడ్డాడు. మనస్సు అనే సముద్రంలో వెదకితే నేటికీ కనిపిస్తాడు. అదిగో చూశారా పాతాళంలో వెదకితే ఆదికూర్మమైన విష్ణువుగా కనిపించాడు. పొదిగొని (భారము వహించి) వెదకితే అడవులలో భూదేవితో నున్న వరాహమైనాడు. భయపడకుండా కొండలలో వెదకితే శ్రీనృసింహమూర్తిగా కనిపించాడు.

ఆయన మహిమను గ్రహించి వెదకితే "భూనభోంతరాల"లో (అంటే భూమిలోపల, భూమిమీద ఆకాశంలోను) సర్వమూ వ్యాపించి త్రివిక్రమునిగా (వామనావతారం) కనిపిస్తాడు. మహాపరాక్రమ వంతులలో వెదకితే పరశురామునిగా కనబడతాడు. శివపార్వతులకు కూడా భావించి వెదకితే తారక బ్రహ్మరూపంలో రఘురామునిగా కనిపించాడు. అంతెందుకు దిక్కులన్నింటిలోనూ (కెలకులలో) ఆవుల మందలలో వెదకితే బలరామకృష్ణులుగా కనిపిస్తాడు. కాకపోతే వెదకాల్సిన బాధ్యత మనదే.

పొంచియుండి వెదకితే రాక్షస స్త్రీలతో కూడా బుద్ధుని వలె కనబడతాడు. కలియుగం మించిన కాలంలో కూడా వెతికితే ఈ యుగాంతానికి కల్కి అవతారంలో కనిపిస్తాడు. అప్పటికి మనమెలాగూ వుండము, కాబట్టి నేడే అంచెలలో (వరుసగా) జీవులలో వెదకితే అంతర్యామిగా దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపిస్తాడు. ఇహపరములలో వెదకితే ఆయనే వేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరునిగా కనిపిస్తాడు.

**3-4**

## మున్నుడి

అన్నమయ్య కీర్తనలను పూర్తిగా అర్ధం చేసికొనుట మహామహా పండితులకే అసాధ్యమని నా నమ్మకం. నేను విన్న చాలా కీర్తనలలో ఇదమిద్ధంగా అర్ధం తెలియని పదములు తారామండలంలో నక్షత్రాలవలె అనేకం వున్నాయి. 'ఏకాంగవీరుడు' హనుమంతు 'ఏకాంగి' అంటే విరక్తుడైన విష్ణుభక్తుడు లేక ఒంటరివాడు అని అర్ధం. విష్ణువు వారందరికి ఆరాధ్యుడు కావున 'ఏకాంగ వీరుడు' అంటే విష్ణుమూర్తి. అసహాయశూరుడు అని కూడా అర్ధం. ఇంకొకపదం 'జలధి పుటమెగసి చంద్రుడు' అయ్యాడు. అంటే సముద్రాన్ని దాటాడు కాబట్టి చంద్రుడు అని. చాలా చిక్కులున్నాయి. చదవండి మరి... మంగాంబుధి హనుమంతునిపై అద్భుత కీర్తన.

**ఆ.వె॥ ఒకడు హరియె జగతి 'ఏకాంగవీరుడు'**
**అట్లె హనుమయనిరి అన్నమయ్య**
**బలిమి వేంకటేశు బంటీతడంచని**
**ఎదురు లేనివాడు ఈతడనిరి.**

**రాగం : తోడి**

ఒక్కడే ఏకాంగవీరుడుర్వికి దైవమౌనా
యొక్కడే హనుమంతుని కెదురా లోకము ॥ఒక్కడే॥

ముందట నేలే పట్టమునకు బ్రహ్మాయినాడు
అందరు దైత్యులజంపి హరిపేరైనాడు
అంది రుద్రవీర్యము తానై హరుడైనాడు
యెందు నీ హనుమంతునికెదురా లోకము ॥ఒక్కడే॥

చుక్కలు మోవ పెరిగి సూర్యుడు తానైనాడు
చిక్కుపాతాళము దూరి శేషుడైనాడు
గక్కున వాయుజుడై జగత్ప్రాణుడైనాడు
ఎక్కువ హనుమంతుని కెదురా లోకము ॥ఒక్కడే॥





జలధి పుటమెగసి చంద్రుడు తానైనాడు
చెలగి మేరువు పొంత సింహమైనాడు
బలిమి శ్రీవేంకటేశు బంటై మంగాంబుధి
ఇలయీా హనుమంతుని కెదురా లోకము ॥ఒక్కడే॥

## భావామృతం

జగత్తునకంతటికీ ఏకాంగ వీరుడు విష్ణుభక్తుల కొక్కడే ఇలవేల్పు శ్రీహరి. హరి(వానరము) శ్రేష్టుడైన హనుమంతుడు కూడా ఏకాంగవీరుడే కదా! ఇక ఆయనను కూడా ఎదురు అనేదేలేదు. అందుకే అసహాయ శూరుడు, అంటే హనుమంతుడే.

ముందు రాబోవు కాలంలో ఆయన బ్రహ్మ పట్టము పొంది 'బ్రహ్మ' అవుతాడు. దానవ మర్దనుడు కాబట్టి ఆయనకు హరి (వానరము మరియు విష్ణువు) అనే పేరు తగినదే. శివుని వీర్యసంజనితుడు కావున రుద్రుడు (శివుడు మరియు రౌద్రంకలవాడు) అయ్యాడు. ఇక ఈ హనుమంతునికి ఎదురు ఎక్కడుంటుంది.

లంకలో సీతమ్మకు తనపై నమ్మకం కలుగుటకు సూర్యమండలమంత ఎత్తునకు ఎదిగి ఈయన ఇంకొక సూర్యుడు అనిపించాడు. మైరావణుని సంహరించడానికి పాతాళలోకంలోనికి చొరబడి ఈయన ఆదిశేషుడా ఏమిటి అనిపించాడు. వాయునందనుడు గావున జగత్తునకు త్రాణ (ప్రాణం) యై కాపాడుతున్నాడు. అందుకే ఈయన అందరికంటే ఎక్కువయైన హనుమ అయ్యాడు. ఇక ఈయనకి ఎదురేలేదు.

సముద్రమును రాత్రివేళ దాటి (లోకమాత సీతమ్మకు చల్లని రామయ్య వార్త చెప్పాడు) చంద్రుడైనాడు. మేరు పర్వతము చెంత నివసిస్తాడు. కాబట్టి సింహము (సింహరాశి) యైనాడు. ఇవన్నీ ఇలావుండగా సర్వసమర్థుడైన బలవరి శ్రీవేంకటేశ్వరుని బంటు అయినందువలన మంగాంబుధి అనే ఈ వూరిలో వెలసి లోకములోనే ఎదురులేని హనుమంతుడు ఈ స్వామి అనిపించాడు.

**3-5**

## మున్నుడి

జ్ఞానులకు మోక్ష సాధనకు మార్గమేది? అమృతం యెక్కడ వున్నది? సుఖము అనేది యెక్కడ వున్నది? వేదాంతులను, భక్తులను నిరంతరం వేదించే ప్రశ్నలే ఇవి. వీటికి ఇదమిత్థంగా జవాబు చెప్పటం కూడా కష్టమే. కాని అతి సులువుగా అన్నమాచార్యులవారు ఈ ప్రశ్నలకి జవాబిస్తున్నారు. వృద్ధాప్యంలో వున్న ఆచార్యులవారి ఆలోచనల జలపాతం ఎంత గొప్పగా వున్నదో గమనించండి. వైష్ణవం స్వీకరించి ముద్రాధారులైన వారికి సర్వం శ్రీహరే.

**తే॥ తెలిసియున్న వారల కిదే తెరువు సుండి!!**
**లేదు మరియొక మార్గంబు వెదకి చూడ**
**నళినదళ నేత్రు పొగడెడి నామమందె**
**ఉన్నదనినారు దృఢముగా నన్నమయ్య**

**రాగం : బౌళి**

తెలిసిన వారికి-తెరువిదే మరి లేదు
నళినాక్షు బొగడెడి-నామములో నున్నది ॥తెలిసిన॥

ఆకసాన లేదు మోక్ష-మటు పాతాళమున లే
దీకడ భూలోకమందు-యెందు లేదు
పైకొని ఆసలెల్ల-పారదోలి వెదకితే
శ్రీకాంతు బొగడేటి-చిత్తములో నున్నది ॥తెలిసిన॥

సురలవద్దలేదు-సోదించ నమృతము
సరి దిక్కులందు లేదు-జలధిలో లేదు
శరణాగతుల పాద-జలములు చేర్చుకొనే
హరిదాసుల బూజించే-అరచేత నున్నది ॥తెలిసిన॥





రాజసాన సుఖమేది-రాసికర్మమందు నేది
వోజతోడ నియతుడై-వుండినా నేది
సాజాన శ్రీవేంకటేశ-సరిముద్రలు ధరించే
తేజముతో విజ్ఞాన-దేహములో నున్నది ॥తెలిసిన॥

**భావామృతం :**

నరులారా! తెలిసినవారికి (జ్ఞానులకు) తెరువిదే (మార్గం ఇదే) మరిలేదు. (ఇంకొకటి లేదు). ఇది (మోక్షము) నళినీ కాంతుని (శ్రీకాంతుడైన శ్రీహరిని) పొగడెడి (కీర్తించెడి) నామములోనే (నామసంకీర్తనములో) నున్నది. ఇంకా మరిదేనిలోనూ లేదు.

ఓ మానవులారా! మోక్షమనేది ఎక్కడో ఆకాశంలో లేదు. అటు పాతాళలోకంలోనూ లేదు. పోనీ ఇక్కడే భూలోకంలో వున్నదా అంటే అదీ నిజం కాదు. మరెక్కడున్నది? ఆక్రమించుకొని భ్రమింపజేసే 'ఆశ' లను విడనాడి వెదకితే రమాకాంతుని ఏ మనస్సు కీర్తిస్తుంటుందో ఆ స్వామి ఆ మనస్సులోనే వుంటాడు.

ప్రజలారా! సాగరమథనం చేసి అమృతం పొంది దేవతలు అమరులు అయినారని విన్నాం. కాని అమృతం దేవతలవద్ద వున్నదనుకొంటున్నారా? వెతికి చూస్తే అది వారివద్దలేదు. సరిసంఖ్యలోనున్న దిక్కుల యందు వున్నదా? లేదు. అనంతమైన సముద్రంలో వున్నదా? లేదు. మరెందులో వున్నది? శ్రీహరిని శరణుజొచ్చినవారి పాదజలములతో పవిత్రులైన వారిని పూజించే అరచేతులలో వున్నది.

ఓ భక్తులారా! నిజమైన సుఖము యెక్కడ నున్నదో తెలుసునా? రాజభోగములనుభవించు నృపతులవద్ద లేదు. కర్మిష్ఠులు చేసే కర్మలయందు లేదు. ఉత్సాహముతో నియమపాలకుడై నిష్ఠాగరిష్ఠుడై వుంటే సుఖమున్నదా అనుకోడానికి లేదు. శోభతో నున్న ఓ శ్రీవేంకటేశ్వరా! శంఖ చక్ర ముద్రలు ఇరు భుజములపై ధరించి తేజస్సుతో వెలుగొందే విజ్ఞానులైన వారి దేహములలో వున్నది.

**3-6**

## మున్నుడి

ఇది గీర్వాణ భాషలో అన్నమాచార్యులవారు చేసిన చక్కని భజన. శ్రీమన్నారాయణునిపై ఆయన అసంఖ్యాకమైన భజన కీర్తనలు చెప్పారు. శ్రీహరి భక్తుల కత్యంత ప్రీతిపాత్రం స్వామి భజన. 'భవ్యనిర్మల పాదపంకజ' అంటే శుభప్రదమైన మలినములేని పాదపద్మములు గల స్వామియని అర్థం. 'పరమ పరాత్పరు'డంటే శ్రేష్టులలోకెల్ల అత్యంత శ్రేష్టుడని అర్థం. ఈ పదములను మనం నిత్యం వాడుతూనే వుంటాం. కాని పట్టుకొని అర్థం చెప్పమంటే... ఇబ్బంది పడతాం.

**కం॥ నందుని నందనుడీతడు**
**మందర గిరిధరుడు తొల్లి మధుసూదనుడున్**
**సుందరుడు వేంకటేశుడు**
**అందముగా నన్నమయ్య హరిభజియించెన్**

**రాగం : బిలహరి**

మందరధర మధుసూదన
నంద గోపనందనా ॥మందర॥

నరసింహ గోవింద నవనీతానంద
హరి ముకుంద నయనారవిందా
కరివరద గరుడగమనరూప
గురుచాపా యదుకుల దీపా ॥మందర॥

భవదూర భయహర పరిపూర్ణామృత
భువనపాలన సురపాలన
భువనభూషణ పరమపురుష పురాతన
నవభోగా కరుణాయోగా ॥మందర॥





పంకజాసననుత భవ్యనిర్మలపాద
పంకజ పరమ పరాత్పర
వేంకటశైలనివేశ శు-
భంకరా క్షేమంకరా ॥మందర॥

**భావామృతం :**

క్షీరసాగర మధనము వేళ కూర్మావతారంలో మందర పర్వతమును నీ వీపుపై వహించి అమృత సాధనకు తోడ్పడిన దేవదేవా! నీకు వందనము. మధు అను రాక్షసుని మర్దించిన ప్రభూ! వందనము. నందగోపుని నందనుడివై (పుత్రుడివై) అనుగ్రహించిన గోపాలా! నీకు జయము.

ఓ నరసింహావతారా! ఓ గోవిందా! వెన్నతినుటయందు మిక్కిలి ప్రీతి కలిగిన దేవా! ఓ శ్రీహరీ! ముకుందా! పద్మనయనా! గజేంద్ర రక్షకా! గరుత్మంతుడు వాహనమైనవాడా! రూపము కలవాడా అనగా శ్రీరామచంద్రా!) యదువంశమునకు దీపము వంటి మహానుభావా! నీకు నమస్కారములు.

ఓ భవదూరా! (పుట్టుకలేకుండ చేయు ప్రభూ!) భయమును నిర్మూలించువాడా! సంపూర్ణ అమృత స్వరూపా! పదునాల్గు భువనములకు ఏలికయైనవాడా! దేవతలను కాపాడు దేవదేవా! విశ్వమునకు అలంకారమైన ప్రభూ! ఓ పురుషోత్తమా! ఓ సనాతనా! విశిష్టమైన భోగములను ప్రసాదించు వాడా! అందరికీ కరుణ ప్రసాదించు సర్వోత్తమా! నీకు అనేక వందనములు.

బ్రహ్మదేవునిచే సన్నుతింపబడు ప్రభూ! శుభప్రదమైన నిర్మలం పాదపద్మములుగల స్వామీ! శ్రేష్ఠులలోకెల్ల అత్యంత శ్రేష్ఠుడా! స్వామీ! శ్రేష్ఠులలో కెల్ల అత్యంత శ్రేష్ఠుడా! శ్రీవేంకటగిరి నిలయా! అనేక శుభములను ప్రసాదించు దేవా! సర్వులకు రక్షణ కల్పించు బాధ్యత స్వీకరించిన శ్రీమన్నారాయణా! నీకు శతకోటి వందనములు.

## 3-7

## మున్నుడి

రఘుకుల తిలకుడైన శ్రీరామచంద్రునిపై అన్నమాచార్యుల వారు చెప్పిన చక్కటి కీర్తన ఇది. మనుజరూపమున మనియెడి (జీవించిన), బ్రహ్మము (పరబ్రహ్మ స్వరూపం) అని కీర్తిస్తున్నారు. "మరగిన సీతా మంగళ సూత్ర"ముల శ్రీరాముడు. మరగిన అంటే వేడిచేసి మరగబెట్టడం అనుకోకండి. జానకికి తాళిగట్టిన భర్తగా మరగిన (పరిచయమైన) వాడు అని అర్థం. వికసించిన శ్రీవేంకట (గిరి) నిలయుడే శ్రీరాముడట. ఆ..హా...

**చం॥ కొలచిన వారలందరికి కొంగునగట్టిన పైడి యీతడున్**
**బలిమిని మోక్షదాతయని బ్రహ్మముతానని సన్నుతించుచున్**
**చెలువముతోడ గొల్చెనిటు శ్రీగిరి వాసుని శ్రీనివాసునిన్**
**నళిని దళాక్షుడైన తిరునాయకుడే రఘురాముడంచనెన్**

**రాగం : కాంభోజి**

కొలిచిన వారల కొంగుపైడి ఇతడు
బలిమి తారక బ్రహ్మమీతడు ॥కొలిచిన॥

ఇనవంశాంబుధి నెగసిన తేజము
ఘనయజ్ఞంబుల గల ఫలము
మనుజ రూపమున మనియెడి బ్రహ్మము
నినుపుల రఘుకుల నిధానమితడు ॥కొలిచిన॥

పరమాన్నము లోపలి సారపు చని
పరగిన దివిజుల భయహరము
మరగిన సీతా మంగళసూత్రము
ధరలో రామావతారం బితడు ॥కొలిచిన॥





చకిత దానవుల సంహార చక్రము
సకల వనచరుల జయకరము
వికసితమగు శ్రీవేంకట నిలయము
ప్రకటిత దశరథ భాగ్యంబితడు ॥కొలిచిన॥

**భావామృతం :**

ఈ శ్రీరామచంద్రుడు తనను సేవించిన వారికి కొంగుపైడి (పంచె లేక చీరె కొంగులో కట్టి దాచిపెట్టిన బంగారం). అంటే ఎక్కడికో వెళ్లి ఎంతో ప్రయత్నంతో స్వాధీనం చేసికొనే భాగ్యం కాదు. మన ఆధీనంలో మన దగ్గరే ఉన్న బంగారం. మోక్షము నొసగే ఘనమైన పరబ్రహ్మ స్వరూపం, ఈయన.

సూర్యవంశార్ణవమున వర్ధిల్లిన తేజస్వరూపము ఈ శ్రీరాముడు. ఘనమైన పుత్రకామేష్టి యాగము వలన ప్రాప్తించిన ఫలము ఈయన. మనుష్యుని రూపములోనున్న పరబ్రహ్మయే ఈ రాఘవుడు. ఈయన రఘుకులమున నిండిన నిధానము (పాతరవంటివాడు).

యజ్ఞపురుషుడిచ్చిన పాయసము లోపలి సారముతో కూడిన మాధుర్యము ఈ శ్రీరాముడు. భయ విహ్వలులైన దేవతల అభయ ప్రదాత. జానకీదేవికి తాళిగట్టిన ఈయన సుపరిచితుడు. భూమినవతరించిన శ్రీమన్నారాయణుని రామావతార మీ స్వామి.

శ్రీరాముడు బాణములు ప్రయోగించే వేగం ఎంతటిదంటే ఆయన అంబులపొదిలో నుంచి బాటంతీసి వింటికి సంధించి లక్ష్యంపై ప్రయోగించి అదిలక్ష్యాన్ని ఛేదించడం, కంటికి కనబడదట. (ఈనాటి పరిభాషలో మైక్రో సెకండు లోపల అయిపోతుందన్నమాట), అంతవేగంతో ఆయన రాక్షస సంహారం (ఖరదూషణాదులను) చేశాడు. తండోపతండాలుగా నున్న వానరసేనకు ఈయన జయరాముడు. వర్ధిల్లిన శ్రీవేంకటాద్రి నిలయముగా నున్న శ్రీవేంకటేశ్వరుడు కూడ ఈ రఘుపతియే. ఈయన దాశరథిగా ప్రకటించబడి జగద్విఖ్యాతుడైనాడు, అందరి భాగ్యం అయినాడు.

**3-8**

## మున్నుడి

సృష్టి స్థితిలయములను నిర్వహించే పరమాత్ముని వైభవం వర్ణిస్తున్నారన్నమాచార్యులవారు. గొప్ప, కొద్ది అనే తారతమ్యాలు పరమాత్మకు లేవు. భూమ్మీద గోకులంలో గోపెమ్మయైన యశోదకు గారాల కూచి ఇతడే. సత్యలోకంలో సృష్టికర్తయైన చతుర్ముఖ బ్రహ్మగారికి తండ్రి, సూర్యచంద్రులకు కాంతినిచ్చినవాడు, తన వూపిరిలోంచి వేదములను పుట్టించినవాడు, అవి నీటి పాలైతే (నీటగు) రక్షించాడు. మావంటి శరణు జొచ్చిన అనాథలకు నాథుడు, అంగము (దేహము) నిచ్చినవాడు సర్వాత్మయైన ఈ వేంకటేశ్వరుడే.

**ఉ॥ చేరియశోదకున్ శిశువు చింతన జేయచు యెంచి జూడగా**
**ధారుణి, బ్రహ్మదేవునకు తండ్రియునీతడు సూర్యచంద్రులన్**
**తీరుగ జిన్నబుచ్చుఘన తేజుడు, పాడెను అన్నమార్యుడున్**
**కోరిక తీర శ్రీహరిని గొల్చెడి కీర్తన తేనెజల్లురా.**

**రాగం : మోహన**

చేరియశోదకు శిశువితడు
ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు ॥చేరి॥

సొలసి చూచినను సూర్యచంద్రులను
లలివెద చల్లెడి లక్షణుడు
నిలిచిన నిలువున నిఖిల దేవతలు
కలిగించు సురల గనివో యితడు ॥చేరి॥

మాటలాడినను మరియజాండములు
కోటులు వొడమేటి గుణరాశి
నీటగు నూర్పుల నిఖిల వేదములు
చాటువ నూరేటి సముద్ర మితడు ॥చేరి॥



భావయామి వేంకటేశం

ముంగిట పొలసిన మోహన మాత్రల
పొంగించే ఘన పురుషుడు
సంగతి మావంటి శరణాగతులకు
నంగము శ్రీవేంకటాధిపు డితడు ॥చేరి॥

**భావామృతం :**

ఈ ఆదిదేవుడే భూమ్మీద చేరి (అవతరించి) యశోదకు శిశువు (పాలుతాగే పాపాయి) యైనాడు. మరి ఈయనే సత్యలోకంలో బ్రహ్మదేవునికి తండ్రి అయినాడు.

బాగుగా ప్రయత్నించి కనుగొంటే సూర్యచంద్రులకు, కాంతిని ప్రసాదించిన విలక్షణుడీయన. దేవతలందరికీ నిలిచి దిక్కై, గని వలె నిరంతరం అండగా నిలిచినవాడు ఇతడే. అందుకే ఈయన దేవదేవుడైనాడు.

పరమాత్ముడైన ఈయన మాట్లాడితే ఆ మాటలలోనుంచి సమస్త విశ్వము ఉద్భవించింది. గుణములన్నీ ఈయనలోంచే పుట్టాయి. సోమకాసురుడు వేదములన్నింటిని సముద్రంలో దాచివేస్తే, నీటగు (నీటిపాలైన) ఆ వేదములనన్నింటినీ రక్షించి, తన ఊపిరిలో నిలుపుకొని, లోకానికి చాటించి వాటిని నూరేట్లు చేశాడు. (అంటే వేదములు వ్రాతలో కాక వల్లెవేసి కంఠతాపట్టేట్లు వేదపండితుల 'నియమించి' సముద్రము వలె నిరంతరం ఉండేట్లు నిలిపాడు).

ముంగిట పొలసిన (ఎదురుగా ప్రకటించబడిన) మోహనము, ఆత్మతత్త్వము మొదలైన విద్యలను సగర్వంగా వెలయించిన పురుషోత్తముడు ఈ మహానుభావుడు. ఇక వీటన్నిటినీ మించి, మాబోటి శరణార్థులకు సంగతియై (సమీపించి) ఈ శ్రీవేంకటేశ్వరుడే అంగము (ప్రాణమున్న దేహము) అయినాడు. మా అంగరక్షకుడే కాదు, జీవనాధారము కూడా ఈ ఏడుకొండలవాడే.

**3-9**

## మున్నుడి

తొలినాళ్లలో అన్నమయ్య భావనాకాశంలో మెరిసి అలరించిన శృంగార కీర్తన అయివుంటుంది ఈపాట. అలమేలు మంగమ్మ విరహపు రాజుగారైన శ్రీవేంకటేశ్వరుడు విడిదికి (అమ్మవారి ఇంటికి) రాంగానే ఆమె సింగారములే స్వామికి వైభవములై అలరారినవట. ఒక విన్నపమేమంటే  తళతళ మెరిసే వజ్రం సూర్యకిరణాలను ప్రతిఫలింపజేసి అనేక రంగుల కాంతి కిరణాలు వెదజల్లుతుంది. నేను నీలం అనుకొంటే,  నీవు ఎఱుపు అనుకొంటావు. నేను భావించిందే అన్నమయ్య ఆలోచన అని చెప్పలేం...

**కం॥ విరహము రేపెడి రాజదె**
**దరిజేరగ సిరుల జేసె తరుణియు ఆపై**
**నెరపెను సింగారములను**
**పరవశుడై అన్నమయ్య పాడెను వినుడీ**

**రాగం : తోడి**

విరహపు రాజదె విడిదికి రాగా
సిరుల జేసె నిదె సింగారములు ॥ విరహపు ॥

నెలత నుదుటిపై నీలపు కురులనె
తొలుతనె గట్టెను తోరణము
మొలక చెమటులవె ముత్యపు ముగ్గులు
అలరించె మదనుండదె చెలిమేన ॥విరహపు॥

దట్టముగ ఇచింతాలతనే వడి
బెట్టి చప్పరము పెనగొనగా
పట్టినె మైతావులు పరిమళములు
కట్టించెను చెంగట వలరాజు ॥విరహపు॥





విందగు వేంకట విభుని ప్రేమచే
పొందగు (పొందుగ) బెట్టెను బోనాలు
ఇందువదనకి ఇందిరావిభునికి
కందుదేర నలుకలు చవిజేసె ॥విరహపు॥

**భావామృతం :**

విరహము ముప్పిరిగొనునట్లు చేయగల శ్రీనివాసుడు అలమేల్మంగమ్మ విడిదికి విచ్చేయగానే ఆమె సింగారములే స్వామి వారికి వైభవములైనవి, (సిరులజేసినవి). ఆ విశేషం వినండి.

స్వామివారు రాంగానే మొట్టమొదట ఆ జవ్వని నుదుటిపై నల్లని ముంగురులు స్వాగతం పలుకుతూ 'తోరణము' కట్టినవి. మన్మధుడు కలిగించిన అలజడి వల్ల మేనిపై కమ్మినట్టి లే చెమటలు ముత్యాల ముగ్గులై భాసిల్లినవి.

కిక్కిరిసిన చింతాలతనే (వలపు తీగెనే) పందిరి (చప్పరము) వలె పెనవేసుకొని శరీరపు మైపూతలు మదన తాపము పెంచి ఆయన యెట్టయెదుటనే వున్నంత అలజడి కలిగించుచుండెను. ఇక ఆమె ఆరాటము వర్ణించుటెట్లు?

విందైన శ్రీవేంకటేశ్వరుని ప్రేమలనే ఆ దేవి భోజనములుగా వడ్డించినది ఆ తరువాతఆ చంద్రవదనకు ఇందిరా రమణునికి మధ్య ప్రణయ కలహముల కందుదేరి (జాడ తెలియగా) అవి ఆ స్వామి భక్తులకి చవిజేసినవి, (మధురమైన చవులూరించినవి). ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతకన్నా వివరించే శక్తి నాకు లేదు తండ్రీ!

## మున్నుడి 3-10

క్షణభంగురమైన జీవితం గురించి చక్కటి కీర్తనలో హెచ్చరిస్తున్నారు అన్నమాచార్యులవారు. అంతా హరిమాయ. చావు పుట్టుకలు సుఖదుఃఖాలు అన్నీ బూటకాలే. ఏవీ శాశ్వతం కాదు. ఆత్మజ్ఞానంతో వేంకటేశ్వరుడు అప్రతిహతుడని కొలిచినవారిని ద్వంద్వములు బాధించలేవు. ఇది నిజం.

**సీ॥ పుట్టెడి దంతయూ బూటకమే జుమ్మీ!!**
**గట్టిదీ హరిమాయ కాననీదు**
**ముక్కున నుండెడి ముందటి ప్రాణంబు**
**ఏతీరు నమ్ముట ఇంకదాని**
**తోలు తిత్తిది యిందు తెలియని బ్రతుకాయె**
**గడుపుట యింకెట్లు కాలమెల్ల**
**ఆత్మలోనున్నది అఖిల జ్ఞానంబంత**
**కనుటెట్లు ఇక నేను ఘాతుకమును**

**ఆ.వె॥ శ్రీ తరుణి విభుడిని శ్రీవేంకటేశుని**
**కొలిచినాను నేను నిలిచి నాకు**
**అడ్డమగున దేది అన్నమయ్యనెనురా**
**ఏమి కీర్తనంబు!! ఏమి శైలి!!**

**రాగం : శివరంజని**

పుట్టెడిదింతా బూటకంబులే
గట్టిమాయ హరి కానగ నీదు ॥పుట్టెడి॥

ముక్కున నున్నది ముందట ప్రాణము
యెక్కడ నమ్మేదిక తనువు
చుక్కలు మోచీ చూపులెదుటనే
నెక్కొను మతికిని నిలుకడయేదీ ॥పుట్టెడి॥



భావయామి వేంకటేశం

నాలుక నున్నవి నానా రుచులును
వేళా వేళకు వెరవేదీ
తోలుననున్నది దొరకని బ్రతుకిది
కాలంబటువలె గడచేది ॥పుట్టెడి॥

ఆతుమ నున్నది అఖిల జ్ఞానము
ఘాతలు నెటువలె గనియేది
శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి
ఆతని కొలిచితి అడ్డంబేది ॥పుట్టెడి॥

**భావామృతం :**

మానవుని పుట్టుక యెంత మాయతో కూడినదో ఆలోచించారా? ఇది వుక్కిరిబిక్కిరి చేసే 'హరిమాయ'. ఇది తెలుసుకొనే అవకాశాన్నివ్వదు. దీని నెరుగుట అసాధ్యం.

మనమందరం ప్రాణంతో వున్నట్లు యెదురుగా కనిపిస్తున్నా, ఈ ప్రాణం ముక్కున బెట్టుకొన్నట్లు వున్నది. లోపలికి పీల్చిన శ్వాస బయటకు రాకపోయినా, బయటకు వచ్చిన నిశ్వాస తిరిగి లోపలికి పోకపోయినా అంతే సంగతులు. ఇక దీనినెట్లా నమ్మేది? శరీరమన్నా వుండేదా అంటే, చుక్క పొడిచాక ఎదుటనున్నది కాదు. చుక్కలు పోయాక వుంటుందో లేదో తెలీదు.మనస్సు చూద్దామా అంటే నిలకడలేని చంచల స్వభావం కలది. వీటిని నమ్ముకొని నేనేం చేయగలను?

నా నాలుక నానారుచులు కావాలంటుంది. క్షణక్షణానికి దానికో క్రొత్తరుచి కావాలి. దానికి భయభక్తులే లేవు. నవరంధ్రములున్న ఈ తోలు సంచీలో బ్రతుకు గడుపుతున్నాను. ఏ రంధ్రం ఎప్పుడు మూసుకుపోతుందో తెలీదు. ఇట్లా ప్రతిక్షణమూ భయపడుతూ కాలం ఎట్లా గడిపేది? దీనికి గత్యంతరమేమిటి?

అనంతమైన, శాశ్వతమైన జ్ఞానము నా ఆత్మలో వున్నమాట నిజమే. కానీ నాపై నా మనస్సు మొదలైన ఇంద్రియాలు చేసే ఎదురు దాడిని ఎట్లా తట్టుకొనేది? దీని నెలా గమనించగలను? శ్రీలక్ష్మీపతియైన శ్రీవేంకటేశ్వరుడు శరణని కొలిచాను. ఇక సరి, నాకు అడ్డమే లేదు. నన్ను ఏ మాయా ఏమీ చేయలేదు.

**3-11**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవం మొదలవుతోంది. బ్రహ్మగారిచే ప్రారంభించబడి, అన్నమయ్యచే అతిశయమంది, నేడు తిరుమల పాలకమండలిచే సంప్రదాయ బద్ధంగా కొనసాగుతున్న ఆ బ్రహ్మ వేడుకలను చూడటానికి ప్రజలు తండోపతండాలుగా వస్తారు. వయస్సుతోనూ, స్థితి గతులతోను, భాష, జాతి వర్ణములతోను నిమిత్తం లేదు వారికి. వారి వారి తాహతుకు తగ్గ కానుకలతో ముడుపులు తీసికొని వస్తున్నారు. అందరికీ కావలసింది ఒక్కటే. స్వామివారి కృప. సరిగ్గా ఐదు సెకన్లు లభించే ఆయన మూర్తి దర్శనానికే ఎంత ఆరాటం!!

**ఉ॥ వానలలోననే తడిసి వత్తురు చూడగ అన్నమయ్యనెన్**
**మానవులందరున్ కలిసి వారల కోర్కెల దీరనమ్మెయిన్**
**కానుకలన్ కరంబులను గైకొని గుంపుగ రాజుపేదలున్**
**పూనుచు వేంకటేశ్వరుని బ్రోవగ వేడుచు బ్రహ్మవేడుకన్**

**రాగం : ఆహిరి**

నానాదిక్కుల నరులెల్లా
వాలన లోననె వత్తురు గదలి ॥నానా॥

సతులు సుతులు సరిసరులు బాంధవులు
హితులు కొలువగా ఇందరును
శతసహస్రయోజనవాసులు సు-
వ్రతములతోడనె వత్తురు కదలి ॥నానా॥

ముడుపులు జాళెలు మోగి తలమూటలు
కడలేని ధనము కాంతలను
కడుమంచి మణులు కరులు తురగములు
వడిగొని చెలగుచు వత్తురు కదలి ॥నానా॥





మగటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులు చతురులును
తగు వేంకటపతి దరుశింపగ బహు
వగల సంపదల వత్తురు కదలి ॥నానా॥

**భావామృతం :**

నలుదిక్కులనుండి ప్రజలు వానలలో తడిసి ముద్దయిపోతూ కూడా కదిలి వస్తున్నారు. తండోపతండాలుగా ఈ బ్రహ్మోత్సవాలను సందర్శించటానికి వస్తున్నారు.

తమతమ భార్యలతోను, సంతానంతోను, తమ పరిసరాలలో నివసించే వారితోను, బంధువులతోను, హితులతోను, తమను సేవించే వారితోను కలిసి వస్తున్నారు.

వారంతా తమ ముడుపులు (ధనము, బంగారము ముడిచి దాచిన మూటలు) తీసికొని వస్తున్నారు. గుఱ్ఱములపై కొందరు, తమ తలమీద మూటలు మోస్తూ కొందరు, అంతులేని ధనరాసులతో కొందరు, స్త్రీలతోను (దాసీ జనములతో), బాగా శ్రేష్ఠమైన మణులతోను, ఏనుగులతోనూ, మంచి వేగముగల అశ్వములపైనను భక్త ప్రజలు తరలివస్తున్నారు. ఎంత అద్భుతంగా వున్నది ఆ దృశ్యం!!

సామంతరాజులు, వీరాధివీరులు మండలాధిపతులు, రాజులు, చక్రవర్తులు, చతురత కలిగినవారు శ్రీవేంకటేశ్వరుని దర్శించుటకు అనేకమైన విలాసములతో కొందరు, అనేకమైన సంపదలతో కొందరు వచ్చెదరు.

ఆనాడే కాదు ఈనాడు జరుగుతున్నది ఇదే. కానీ... ఈ తారతమ్యాలన్నీ మనకే కాని ఆ వేంకన్నకు అందరూ ఒకటే... అవునా?

**3-12**

## మున్నుడి

కంభము (స్తంభము) నుండి వెలువడి ఘనుడైన నరసింహుడు హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని రక్షించాడు. భయంకరమైన ఆ రూపాన్ని ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు వర్ణిస్తున్నారు. నమ్మిన భక్తునిగాచే నరసింహుని రౌద్రాకారాన్ని ఆయన చేసే భీభత్సాన్ని వర్ణిస్తున్నారు. ఆ భీభత్సాన్ని కీర్తనలో దర్శింపచేయటం అనితర సాధ్యం. దేవతలు ఆదిలక్ష్మీ కూడ గడగడ వణికిపోయారు. ప్రహ్లాదుని స్తుతి తనను శాంతపరచగా దేవతల భయం తీర్చి, శ్రీలక్ష్మికి తన అంకెమున చేరిక ననుగ్రహించారట స్వామి.

**మ॥ వెడలెన్ కంభమునుండి రౌద్రుడగుచున్ భీతిల్లగా దేవతల్**
**అడిచెన్ దైత్యుని చీల్చివాని వుదరంబానారసింగం బహో!!**
**మెడలోపేగులు దాల్చెజందెమటులన్, వేనోళ్ల కీర్తించెరా**
**విడువన్ జాలడు అన్నమయ్య తలచెన్ వేంకన్న నా స్వామిగా**

**రాగం : హరి కాంభోడి**

కంభమున వెడలి ఘన నరసింహము
కుంభిని హిరణ్యు గూలిచెను ॥కంభము॥

తొడికి దైత్యు తన తొడపై దిగిచి
కడుపు చించి రక్తము చల్లి
జడియక పేగులు జందెంబులుగా
మెడ దగిలించుక మెరసీ వాడే ॥కంభము॥

పెదవులు చింపుచు పెనుగోళ్ళనదిమి
వుదుటు పునుకకొరి కుమియుచును
సదరపు గుండెలు చప్పరించుచును
మెదడు గందముగ మెత్తీవాడే ॥కంభము॥





దేవతల భయము దీర్చి అంకెమున
శ్రీవనితను కృపసేయుచును
పావనపు టహోబల గిరిదైవము
శ్రీవేంకటగిరి చెలగీవాడే ॥కంభము॥

**భావామృతం :**

ఘనుడైన ఆ ఉగ్రనరసింహుడు స్తంభమునుండి వెలువడి భూమిపై హిరణ్యకశిపుని అతి భీకరంగా సంహరించాడు. ఆ వివరం వినండి.

ఆయన ఆ రాక్షసుని తొడికి (ఒడిసి బట్టుకొని) తన తొడపై పెట్టుకొని (దిగిచి), వాని కడుపును చించి వేశాడు. అప్పుడు వాని రక్తం వెదజల్లబడింది. ఆ నృసింహుడు ఏమాత్రము జడియక (చలించక) వాని పేగులను తన జందెముగా వేసికొనినాడు. కొన్ని తన మెడలో హారంలాగ ధరించాడు. వాడిని చూశారా భీకరంగా మెఱసిపోతున్నాడు.

ఇంకా ఏం చేశాడో చూశారా! ఆ దానవుని యొక్క పెదవులను తన పెద్ద పెద్ద గోళ్లతో అదిమి చీల్చివేశాడు. వాడి కపాలంమీద (పునుక) ఒక్క వుదటున (అమాంతం) కుమ్మినాడు. సదరు గుండెలలోనుంచి వచ్చిన రక్తాన్ని చప్పరించాడు. వాడి మెదడును బయటకు లాగి గంధములాగ మెత్తుకున్నాడు. బాబోయ్! ఎంత భీకరంగా వున్నాడో చూడండి. అప్పుడేం జరిగిందో తెలుసా? దేవతలే కాక, అమ్మవారు శ్రీలక్ష్మికూడా భయంతో గడగడా వణికిపోయారు. ప్రహ్లాదుడు కూడా తాళలేక వణికిపోయి ఆయనను కీర్తించాడు). కరుణాంతరంగుడైన ఆ స్వామి కరిగి పోయాడు.

ఆయన దేవతల భయమును తీర్చి ఆదరించాడు. శ్రీలక్ష్మి అమ్మవారిని కృపజూచి తన అంకెము (చేరిక) ను అనుగ్రహించి ఆ దేవిని కూడి పుణ్యనిలయమైన అహోబల గిరి మీద వెలసి అందరినీ రక్షించాడు. ఆ మహానుభావుడే శ్రీవేంకటాద్రిపై నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడు కూడా. ఆయన శరణు పొందండి.

**3-13**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఆనాడు ఆదిదేవునికి అమలుజేసిన నిత్య కళ్యాణ సేవ నేటికీ ఆ విధంగానే కొనసాగుతున్నది. అటువంటి ఒక కళ్యాణ మహోత్సవంలో అన్నమయ్య స్వయంగా పాడి పేరంటాండ్లను, దేవతలను, మునులను పిలుస్తున్నారు. రండర్రా! బంగారు అక్షింతలు పట్టుకొని దేవుని పెండ్లిని చూడటానికి రండి. వేంకటేశ్వరుడు అలమేల్మంగమ్మా తలంబ్రాలు పోసికొంటున్నారు, పరుగు పరుగున రండి బోలెడు వరాలిస్తారు మీకు. రండి, రండి... త్వరగా...

**ఆ.వె॥ పసిడి అక్షతలను పట్టరో! వడిరారొ!**
**వేంకటేశుడాయె పెండ్లికొడుకు**
**అమ్మలక్ష్మి వధువు అన్నమార్యుని గీతి**
**తేనెలూరు మనసు తేలిపోవు.**

**రాగం : శంకరాభరణం**

పసిడియక్షింతలివె పట్టరో వేగమే రారో
దెసల పేరంటాండ్లు దేవుని పెండ్లికిని ॥పసిడి॥

శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపు పెండ్లి ముహూర్తము నేడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజంబెక్కె
దైవతలు రారో దేవుని పెండ్లికిని ॥పసిడి॥

కందర్పజనకునికి కమలాదేవికిని
పందిరి లోపల తలబాలు నేడు
గంధము విడెమిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరి పెండ్లికిని ॥పసిడి॥





అదె శ్రీవేంకటపతికి అలమేలు మంగకును
మొదలి తిరునాళ్లకు మొక్కేము నేడు
యెదుట నేగేరు వీరె యిచ్చేరు వరములివె
కదలిరారో పరుషఘనుల పెండ్లికిని ॥పసిడి॥

**భావామృతం :**

నానాదిక్కులనున్న పేరంటాండ్లూ! త్వరగా పరుగుపరుగున రారేమర్రా! దేవుని పెండ్లి జరుగుతున్నది. బంగారు అక్షింతలను చేతిలో ధరించి వచ్చేయండి.

శ్రీవేంకటేశ్వరునికి, శ్రీమహాలక్ష్మికి ఇక్కడ దైవజ్ఞులు నిర్ణయించిన పెండ్లి ముహూర్తము నేడే కాబట్టి దుందుభులు మ్రోగుతున్నాయి. గరుడధ్వజము (గరుత్మంతుడు మోయుచున్నట్లు చేయబడిన ధ్వజస్తంభము) నిటారుగా లేచియున్నది. ఓ దేవతలారా! దేవుని పెండ్లికి పిలువ నవసరంలేదు. మీరూ విచ్చేయండి.

ఇక్కడి పెండ్లికొడుకెవరో తెలుసా? స్వయంగా మన్మధునికే తండ్రిగారైన నారాయణుడు. పెండ్లికూతురు కమలాదేవి. వాళ్లు పెద్ద పందిరికింద పెండ్లి తలంబ్రాలు పోసికొనుచున్నారు. ఓ మునులారా! మీరంతా విచ్చేయండి. ఇప్పుడే గంధము, తాంబూలము ఇస్తున్నారు. కలువడాలు (ధ్వజస్తంభముపై వ్రేలాడగట్టు కలువపూలదండ) కట్టారు. త్వరగా దయచేయండి. జాగు చేయకండి.

అదిగో శ్రీవేంకటపతికి, అలమేలు మంగకు జరుగుచున్న మొదటి తిరునాళ్ళు (దేవుని మహోత్సవము) ఇది. నేడు మీరంతా మ్రొక్కండి. ఎదురుకోలు (ఆడపెండ్లివారు మొగపెండ్లివారిని ఎదురు వెళ్లి ఆహ్వానించుట జరుగుతోంది) మనమంతా అమ్మవారి చుట్టాలం ఆడపెళ్లివారం. మనందరికీ వరుడు కానుకలిస్తాడు. కావలసిన వరాలు కోరుకుందాం. కదలిరండి. పరుష ఘనుల పెండ్లికి (బహుశా పురుష ఘనుని పెండ్లికి అయి వుంటుంది) అనగా పురుషోత్తముని వివాహానికి కదలిరండి.

**3-14**

## మున్నుడి

వైష్ణవ మతదీక్ష స్వీకరించిన అన్నమయ్య ఆ మత వ్యాప్తికి ఎంతో కృషి చేశారు. ఆయన అన్నమాచార్యులై వైష్ణవ వైశిష్ట్యం ఎన్నో కీర్తనలలో కొనియాడారు. ఇదీ ఇటువంటి కీర్తనే. ఆ గురువులకి నిరతితో (మిక్కిలి ఆసక్తితో) మ్రొక్కుతారు. అదే భాగ్యమంటే అని పాడుతున్నారు. బ్రహ్మపదవి ఇచ్చినా మేరు,పర్వతం (బంగారు కొండ) ఇచ్చినా వాళ్లకి కోట్లాది వైష్ణవుల సంగము తప్ప అన్యం అక్కరలేదట. శ్రీవేంకటేశ్వరుని శరణాగతియే వారి తుదిపదము (అంతిమలక్ష్యం) అంటున్నారు.

**తే॥ పరమ వైష్ణవులందరి భాగ్యమిదియె**
**నిరతి మ్రొక్కెద వారికి నిత్యమేను**
**ఉల్లమున వేంకటేశుని ఉన్నతముగ**
**దాల్చి శరణు కోరెదననె 'తాళ్ళపాక'**

**రాగం : షణ్ముఖ ప్రియ**

పరమవైష్ణవుల భాగ్యం బిదివో
నిరతి వారలకె నే మ్రొక్కెదను ॥పరమ॥

తలచరొకప్పుడు ధరణి భోగములు
తలచరితర మతదైవముల
తలతు రొకటి హరిదాసుల దాస్యము
తలపు మోక్షముల తగులమి(మె)గాన ॥పరమ॥

కోరరు బ్రహ్మాది గురుతర పదములు
కోరరు మేరువు కొన సుఖము
కోరుదురు తదియ్య కోట్ల సంగము
కోరిక భక్తితో గూడీగాన ॥పరమ॥





వొల్లరు కర్మములు ఒల్లరు పుణ్యములు
వొల్లరహంకార మొకపరియు
వుల్లము శ్రీవేంకటోత్తము శరణని
యెల్లందు తుదిపద మెక్కిరిగా ॥పరమ॥

## భావామృతం

వైష్ణవ దీక్షా తత్పరులైన వారి భాగ్యమే భాగ్యము. ఇదిగో నేను వారికి నిరతితో (మిక్కిలి ఆసక్తితో) మ్రొక్కెదను. ఆ విధంగా నేను కూడా తరించెదను.

వారు ఒక్కసారికూడా ఇహములోని భోగముల గురించి ఆలోచించరు. పరాయి మతం గురించిగానీ ఆ మతం ప్రబోధించే దైవముల గురించి గానీ ఆలోచించరు. వారు తలచేది ఒక్కటే, హరిదాసులైన వారికి దాస్యము చేయుట. ముక్తి, మోక్షము వంటి ఆలోచనలు వారికి తగులమే (ప్రతిబంధకమే).

ఆ పరమవైష్ణవులకు బ్రహ్మత్వం వంటి పదములు కూడా వ్యర్థమే. వారికి మేరు పర్వతంలాంటి బంగారు కొండను ఇచ్చినా తృణీకరిస్తారు. వారు కోరేది కోట్లాది వైష్ణవ భక్తుల సాంగత్యం మాత్రమే భక్తితో వారి కలయికనే ఆపేక్షిస్తారు.

పరమవైష్ణవులైన ఆ మహానుభావులు ఏవేవో కర్మల ద్వారా మోక్షం వస్తుందంటే ఒప్పుకోరు. పుణ్య కార్యాలు చేసి ముక్తి పొందుట సాధ్యంకాదు అంటారు. (పుణ్యం స్వర్గప్రాప్తి, విశిష్టమైన జన్మనిస్తుంది, అంతే) కించిత్తు అహంకారం కూడా వారు ఒప్పరు. చిత్తమును శ్రీవేంకటేశ్వరునిపై లగ్నం చేసి శరణు బొందిన వారికి ఎక్కడనైన చివరికి తుదిపదమైన విష్ణుసాంగత్యమే దక్కింది కదా! (అటువంటి పరమవైష్ణవునికి విష్ణువే తనదగ్గర చోటిస్తాడు. వారు కోరనక్కరలేదు.

**3-15**

## మున్నుడి

శ్రీకృష్ణుని ఆగడాలు భరించలేక గోపెమ్మలు యశోద దగ్గరకు వచ్చి మొత్తుకుంటున్నారు. కొన్ని పదాలు నేటి తెలుగు భాషలో వాడుకలో లేవు. వాటిని ఆ సందర్భాన్ని బట్టి 'భావించుట' కన్నా చేయలేకపోయాను. ఉదాహరణకి 'కంచపుటుట్లు' అనే మాట. ఉట్టి అంటే పాలు, పెరుగు, నెయ్యి దాచటానికి త్రాటితో ఎత్తుగా వ్రేలాడ కట్టిన బంధనం అని ఇదివరలో విన్నాం. మరి 'కంచపుటుట్లు' అంటే... ఉట్టిలో కంచము బిగించి కట్టిన ఉట్టి. దాంట్లో మట్టికుండలు కూడా భద్రంగా వుంటాయి కాబోలు. ఇది నాభావన. అన్నమయ్య వాడిన పదాలకోసం ఒక పదకోశము కావాలి. పెద్దలు ఆ ప్రయత్నంలోనే ఉన్నారు.

**మత్తకోకిల:చూడవమ్మ! యశోద! చూడవె సుంత న్యాయము జేయుమా**
**వాడవాడల వెల్లువాయెను వాగులాయెను చూడుమా**
**వీడి అల్లరి సైపజాలము పేరినేతుల చోరుడే**
**పాడి అన్నయ కృష్ణలీలలు బాగుగా వినిపించెరా.**

**రాగం : మిశ్రమాళవగౌళ**

చూడవమ్మ యశోదమ్మ
వాడల వాడల వరద లివిగో ॥చూడవమ్మ॥

పొంచి పులివాలు పెరుగు
మించు మించు మీగడలు
వంచి వారలు వట్టిన
కంచపుటుట్లు కాగులివిగో ॥చూడవమ్మ॥

పేరీ పేరని నేతులు
చూరల వెన్నల జున్నులను
ఆరగించి యట సగబాళ్లు
పారవేసిన బానలివిగో ॥చూడవమ్మ॥





తెల్లని కనుదీగెల సోగల
చల్లలమ్మేటి జవ్వనల
చల్లినట్లనే శ్రీవేంకటపతి
కొల్లలాడిన గురుతులివిగో ॥చూడవమ్మ॥

## భావామృతం

ఓ యశోదమ్మా! ఇదిగో... ఇటు చూడవమ్మా! వాడల వాడల (ప్రతి పేటలోనూ) వరదలై పొర్లి పారుతున్నా ఈ పెరుగు, పాలు, నెయ్యి చూశావా? ఇదంతా ఎవరి ఘనకార్యం అనుకున్నావు? (మీ అల్లరి పిల్లాడు కృష్ణయ్యవే) ఈ వివరం వినవమ్మా!

పొంచియున్న పులి దూకినట్లు పెరుగు కాగుల మీద దూకుతాడు. వాటిలో బాగుగా మీగడలు కట్టిన పెరుగును వదలడు. మేము ఆ కాగుల్ని క్రిందకూడా పెట్టలేదు. ఎత్తుగా కంచములతో బిగించిన వుట్లలో అమర్చిన కాగుల్లో దాచుకొన్నాం. వారలు (మీ కృష్ణుడు, వాడి అల్లరిమూక) అట్లా పెట్టుకొన్న కాగుల్ని వంచి అన్నీ నేలపాలు చేశారు. ఏమిటమ్మా! ఈ ఆగడం?

బాగుగా పేరిన నెయ్యి అయితే పారబోయలేదు అనేమో కానీ, మీవాడు పేరీపేరని నెయ్యి (ఇంకా గట్టిపడని నెయ్యి) ని, కొల్లగొట్టిన వెన్నలను జున్నులను సగంతిని సగం పారబోస్తాడు. వాడి అఘాయిత్యానికి సాక్ష్యంగా వున్న ఈ బానల్ని చూడవమ్మా! దీనికి నీ సంజాయిషీ ఏమిటి? చెప్పవమ్మా!

సరే ఇవన్నీ ఒక యెత్తయితే మీవాడు మాకన్నె పిల్లల్నేం చేశాడో చూశావా? ఇదిగో చూడు. తెల్లని సోగకన్నులున్న జవ్వనులు (యువతులు) మధురానగరంలో చల్లలు అమ్ముకోడానికి పోతుంటే వదిలిపెట్టడు (అవ్వ!! చెప్పుకొంటే సిగ్గుచేటు)ఇదిగో శ్రీవేంకటపతి అయిన మీవాడు వాళ్లను కొల్లలాడిన (చెఱచిన) గుర్తులు చూడు. చిందరవందరగా నున్న వీళ్లని చూస్తే తెలీటం లేదూ? మీవాడి ఘనకార్యం? ఇంకేం చెప్తావు? (యశోదకు ఒళ్లు ఎంతమండిపోయి వుంటుందో వూహించండి...)

**3-16**

## మున్నుడి

అన్నమయ్య పెద్దకుమారుడు పెద తిరుమలాచార్యుల వారు చెప్పిన రమణీయమైన భజన ఇది. అనునిత్యం వేలాది భక్తులు గానం చేసి తరిస్తున్న చక్కటి కీర్తన. భాష సంస్కృతం కావటం వలన మనం చెప్పుకొన్న విభక్తిని బట్టి అర్థం మారుతుంది. ఉదాహరణకి ఈ కీర్తనలో "దినకర సన్నిభ దివ్యాభరణా". "దినకర సన్నిభ' అనే మాట ఆభరణాలకు అన్వయించుకోవాలి. అంతేకాని స్వామికి కాదు. ఎందుకంటే దినకరుని తేజం స్వామితేజం ముందు అతి స్వల్పం. భావన బట్టి విభక్తి. నేను భావించినదే మీరు భావించనక్కరలేదు. యద్భావం తద్భవతి.

**కం॥ పెదతిరుమలయ్య చెప్పిన**
**మృదు మధురంబైన గీతమే ఇది, తలతున్**
**ముదమున తిరుమల నాథుని**
**మదిపులకించేను సుండి!! భజనను వినుడీ**

**రాగం : బహుదారి**

గోవిందాశ్రిత గోకులబృందా
పావన జయ జయ పరమానందా ॥గోవిందా॥

జగదభిరామా సహస్రనామా
సుగుణధామా సంస్తుత నామా
గగనశ్యామా ఘనరిపు భీమా
అగణిత రఘువంశాంబుధిసోమా ॥గోవిందా॥

జననుత చరణా శరణ్య శరణా
దనుజహరణ లలితస్ఫురణా
అనఘాచరణాయుత భూభరణా
దినకర సన్నిభ దివ్యాభరణా ॥గోవిందా॥





గరుడతురంగా కాదోత్తుంగ
శరధిభంగ ఫణి శయనాంగా
కరుణాపాంగా కమలాసంగా
వర శ్రీవేంకటపతి రంగా ॥గోవిందా॥

## భావామృతం

ఓ గోవిందా! గోకులము చేత ఆశ్రయించబడిన మహానుభావా! బృందావనమును పావనము చేసిన ప్రభూ! పరమానంద స్వరూపా! నీకు జయమగు గాక! జయమగు గాక!

జగత్తునంతటికీ మనోజ్ఞమైన (అభిరామా) ప్రభూ! సహస్ర (వేలకొలది) నామములు కల దేవా! సుగుణములకు నిలయమైన వాడా! ఎప్పుడూ నామసంకీర్తన జరుపబడువాడా! గగన నీలవర్ణా! ఉద్దండులైన శత్రుభయంకరా! ఎన్ననసాధ్యమైన రఘువంశమనెడి సాగరమున జన్మించి చంద్రమా! నీకు జయమగు గాక!

సర్వజనులచే నుతించబడు పాదపద్మములు గల ప్రభూ! శరణన్నవారికి శరణముననుగ్రహించు దేవా! దానవ నిర్మూలకా! మనోజ్ఞమైన రూపముతో స్ఫురించువాడా! సదా దోషరహిత కార్యములే చేయువాడా! సుదీర్ఘమైన భూభారమును నిర్వహించిన స్వామీ! సూర్యుని వంటి దివ్య తేజస్సుతో మెరయుచున్న ఆభరణములను ధరించిన మహానుభావా! నీకు జయమగు గాక!

గరుత్మంతుడు వాహనము వలెనున్న దేవా! చెరసాలలో ఉత్తుంగ తరంగము వలె జన్మించిన ప్రభూ! సాగరుని గర్వ భంగము నొనరించిన మహాత్మా! ఆదిశేషునిపై పవ్వళించు వాడా! కడకన్నులతో (అపాంగ) కరుణ చిలికించు సర్వేశ్వరా! లక్ష్మీదేవి సాంగత్యముచే అనేక దివ్యవరములననుగ్రహించు వేంకటేశ్వరా! ఓ శ్రీరంగనాథా! సదా నీకు జయమగు గాక!

## 3-17

## మున్నుడి

"ఓ వేంకటేశ్వరా! నీవెక్కడ? నేనెక్కడ? నక్కకు నాకలోకానికి (నాగలోకం కాదు) వున్నంత తేడా ఉన్నది మనమధ్య. నీవు పురుషోత్తముడివి. నేను పురుషాధముడిని" అంటూ తమ ఇద్దరి మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తున్నారు. అన్నమాచార్యులవారు. నిన్ను లక్ష్యపెట్టని నీచుణ్ణి నేను అయినా నీవు నన్ను విడువని దయాగుణ రాశివి అన్నారు. ఈ కీర్తనలో "నేరమింతయును నాది నేరుపింతయును నీది" అంటున్నారు. 'నేరమింతా నాది' అని భావించకండి 'నేరమి' యింతయును నాది అని చెప్పుకోవాలి. అంటే... 'తెలివితక్కువతనం అంతా నాది' అని అర్థం.

**చం॥ పురుషులలోన యుత్తముడ వోమధుసూదను యెంచి చూడనే**
**పురుషులలోన వ్యర్థుడనువుర్వికి భారము నాదుబోంట్లు ఈ**
**ధర నను యెంచ 'మంచి' దరిదాపున లేదుర వేంకటేశ్వరా!**
**కరుణరసాత్మకంబయిన గానము పాడెను అన్నమార్యుడున్**

**రాగం : శుద్ధవసంతం**

పురుషోత్తముడ వీవు -పురుషాదముడ నేను
ధరలో నాయందు మంచి-తన మేది ॥పురుషోత్తముడ॥

అనంతాపరాధములు - అటు నేను సేసేవి
అనంతమయిన దయ-అది నీది
నిను నెరుగ కుండేటి- నీచగుణము నాది
నను నెడయకుండేగు-ణము నీది ॥పురుషోత్తముడ॥

సకల యాచకమే - సరుస నాకు బని
సకల రక్షకత్వము -సరి నీపని
ప్రకటించి నిన్ను దూరే -పలుకే నాకెప్పుడును
వెకలివై నను గాచే-విధము నీది ॥పురుషోత్తముడ॥





నేర మింతయును నాది-నేరు పింతయును నీది
సారెకు నజ్ఞాని నేను - జ్ఞానివి నీవు
ఈరీతి శ్రీవేంకటేశ-యిటనన్ను నేలితివి
ధారుణిలో నిండెను ప్ర-తాపము నీది ॥పురుషోత్తముడ॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు పురుషోత్తముడవని జగత్తు కీర్తిస్తున్నది. మరి నేనో? పురుషులలో అధముడను, వ్యర్థుడను. ఈ ప్రపంచంలో నాయందు మంచితనమన్నది లేనేలేదు.

అటువైపు చూస్తే నేను చేసిన అపరాధములు అనంతములు (అంతులేనివి) మరి నీవో? అనంతమైన దయగలవాడవు. నీ మహిమను గుర్తించని నీచ స్వభావుడను నేను. అయినా నన్ను విడిచిపెట్టక అనుక్షణం కాపాడే కరుణాంతరంగుడవు నీవు. (నీసహజ గుణం వలన నన్ను కంటికి రెప్పవలె కాపాడుతూనే వుంటావు)

ప్రతిదానికీ చెయ్యిచాచి పరులను యాచించడమే నావృత్తి. మరి నీపనో? జగన్నాథుడవై సర్వులను రక్షించుట, అడిగింది ఇచ్చి కాపాడుట. ఇదే నీ పని. పనిగట్టుకొని నా తప్పులకు నీవే బాధ్యుడవైనట్లు నిన్ను నిందించే పరమ నీచుడిని నేను. నా నోట్లో నీ నిందా వాక్యములే వుంటాయి. నామీద వెకలివై (ఆసక్తికలవాడవై) నన్ను కాపాడే విధానం నీది. (ఎప్పటికైనా నేను మారగలనా?)

ఇన్ని తప్పులను చేస్తున్నవాడిని కావున నేనేదో తెలివిగలవాడినా? కాదు ప్రభూ! తెలివిలేని నా తెలివితక్కువతనం గోడకి వెల్లవేసినట్లు కనబడుతూనే వున్నది. నీవు బహు నేర్పరివి. నేను ప్రతిసారీ అజ్ఞానినని నిరూపించుకొంటూనే ఉన్నాను. నీవు జ్ఞాన స్వరూపుడవు. ఓ ఇందిరా రమణా! ఏడుకొండలవాడా! ఈ విధముగా నన్ను పాలించుచున్న నీ గొప్పతనముతో ప్రపంచమంతా నిండిపోయింది ప్రభూ!

**3-18**

## మున్నుడి

రేపల్లెలో చిలిపి వేంకటకృష్ణయ్యకు, పరువాల చిన్నది గొల్లభామకు సంవాదం జరుగుతోంది. నన్ను వదలిపెట్టొద్దని వేడుకొంటున్నాడు ఆ సరసుడు. నీకు మొక్కుతాను గానీ నన్ను నీ ముద్దు మాటలతో మైమరపించకయ్యా అంటోందామె. చివరికి ఆయన నిజం బయటపెట్టాడు. నేను వేంకటగిరి పైనున్న నీ చెలువుడను (ప్రియుడిని) అన్నాడు. నన్ను నీ కౌగిట్లో నింపుకో ప్రభూ! అని స్వాధీనురాలైపోయిందామె. ఆమెనే తననుగా భావించిన అన్నమాచార్యులవారి అద్భుత సృష్టి ఇది.విని తరించండి...

**ఆ.వె.॥ వదలబోకు నన్ను వద్దు ఓ గొల్లెతా!**
**ముద్దు మాటలాపు మ్రొక్కుదాన**
**గొల్లభామతోటి గోవిందు సరసము**
**ఆలపించినారు అన్నమయ్య**

**రాగం : బృందావని**

వద్దే గొల్లెత వదలకువే నీ
ముద్దుమాటలకు మొక్కేమయ్యా ॥వద్దే॥

ఏలే ఏలే ఏలే గొల్లెత
నా లాగెరగవు నన్ను నేచేవు
చాలు చాలునిక చాలు నీ రచనలు
పోలవు బొంకులు పోవయ్యా ॥వద్దే॥

కానీ కానీ కానీ (లే) గొల్లెత
పోనీలే నీవెందువోయినను
మాని మాని పలుమారు చెనకుచు మా-
తో నిటు సొలయక తొలవయ్యా ॥వద్దే॥





రావా రావా రావా గొల్లెత
శ్రీవేంకటగిరి చెలవుడను
నీవే నీవే నను నించితి కౌగిట
కైవసమైతిని కదవయ్యా ॥వద్దే॥

**భావామృతం :**

ఓ గోపికా! నన్ను విడనాడకే, వద్దే.
పోవయ్యా! నీకు దండం పెడతాను.
నీ ముద్దు ముద్దుమాటలు చాలు. ఇక ఆపు.

ఎందుకే ఏలే గోపిక! నాకు నీపైనున్న ప్రేమ ఎందుకు తెలుసుకోవు? నాపై ఎందుకు ఆ విసురుబాటు?

చాలు చాలు పోవయ్యా నీ మాటల గారడి ఇక చాలు. నీ అబద్దాలు నీ చేతలతో పోలవు. అయిందిక చాలు.

ఓ గోపికా! కానీ కానీ పోనీలే. నీవెక్కడికి పోతావో నేనూ చూస్తాను.

పో పో స్వామీ! ఇకనైనా మానెయ్యవయ్యా! మాతో అనేక మార్లు చీటికీ మాటికీ ఏదో నెపంమీద తాకుతావెందుకు? నీకు జంకూ గొంకూ లేదు. ఇక్కడి నుంచి తొలిగిపోవయ్యా!

ఓ గోపికా! ఒకపరి ఇటు చూడవా? ఇటు రావా! నేనెవరనుకొనినావు? నేను శ్రీవేంకటగిరిపై నున్న నీ ప్రియుడను నన్ను గుర్తించలేదా?

ఆహా! నిజం. నీవు సత్యమే చెబుతున్నావు ప్రభూ! నీవే నా వేంకట విభుడవు. నన్ను బిగియార కౌగిలించి నన్ను ధన్యురాలను చేయుము స్వామీ! నా స్వాధీనమైతివి కదా! దేవా!

**3-19**

## మున్నుడి

అన్నమాచార్యులవారి అద్భుత సృష్టి అమరములో నున్న ఈ సంకీర్తన. ఆది పురుషుడైన పురుషోత్తముడు మనందరిలోనూ అంతర్యామిగా మనందరి అంతరంగాలలో తిష్టవేసుకుని ఉన్నాడు. జీవుడి రూపంలో ఆ సర్వాంతర్యామి మనని వదిలిన మరుక్షణం పనికి రాని ఈ శరీరాన్ని "నిర్మూలించేస్తారు". భూకాంతుడైన ఆ శ్రీహరి పన్నగేంద్రునిపై పవళించి పాలసముద్రంలో ఉంటాడని భావించారు పెద్దలు శ్రీవేంకటేశ్వరుడే భవరోగ వైద్యుడు అని కీర్తిస్తున్నారు. సింధు భైరవి రాగం వింటే కలిగే ఆనందం చెప్పలేను.

**ఆ.వె॥ ఆదిపురుషుడైన అఖిలాంతరంగుని**
**సన్నుతించినారు అన్నమయ్య**
**భూరమణుని హరిని భోగీంద్ర శయనుని**
**ఇటుల కొలవకున్న యేమి జన్మ?**

**రాగం : సింధుభైరవి**

ఆదిపురుషా అఖిలాంతరంగా
భూదేవతా రమణ భోగీంద్రశయనా ॥ఆది పురుషా॥

భవపాథోనిధి బాడబానల
భవజీమూత ప్రభంజనా
భవపర్వత ప్రళయ భయదనిర్ఘాతదు-
ర్భవ కాలకూట భవ బహువిశ్వరూప ॥ఆది పురుషా॥

భవఘోర తిమిర దుర్భవకాలమార్తాండ
భవభద్ర మాతంగ పంచాననా
భవ కమలభవ మాధవరూప శేషాద్రి
భవన వేంకటనాథ భవరోగవైద్య ॥ఆదిపురుషా॥





**భావామృతం**

శ్రీవేంకటేశ్వరా! నీవు ఆది పురుషుడవు. (నీముందు ఎవ్వరూ లేరు). ఆ సమస్త జీవుల అంతరంగములలో నీవు ఆత్మరూపంలో నేలకొని యున్నావు. ఆది వరాహమూర్తిగా భూకాంతను చేబట్టిన నాథుడవు. అంతేకాదు నీవు పన్నగేంద్రుడైన ఆదిశేషునిపై పవళించియుండు విష్ణుమూర్తివి.

ఓ ప్రభూ! ఈ భవసాగరమున (సంసార సాగరమున) నీవు ఘోరమైన బడబానలము దహించివేతువు. అద్భుత ప్రభంజనం (ఝంఝామారుతం) వలె ఈ సంసార కారు మేఘాలను పటాపంచలు చేసివేతువు. భవ పర్వతములను సమూలంగా నిర్మూలించగల నిర్ఘాతము వంటివాడు. (అనగా పిడుగువలె పొడి పొడి చేయుగలవాడు). కాలకూట విషమువలె భవమును రూపుమాపు మహానుభావుడవు. విశ్వరూపుడై అనంతరూపుడై అనేకవిధముల నుండువాడు.

సంసారమును ఘోరాంధకారమునకు ఈ స్వామి ప్రచండ మార్తాండుడు, (జ్వలించు సూర్యుడు). సంసారమను భద్ర గజమును చీల్చి చెండాడు మృగరాజు (సింహము). సంసార కమలంలో నుంచి పుట్టిన బ్రహ్మ రూపుడు కూడా ఈ ప్రభువే. లక్ష్మీకాంతుడైన శ్రీమన్నారాయణుడు ఈయనే. శేషాచలమనే దివ్యసదనంలో శ్రీవేంకటేశ్వరుని రూపంలో ఈ భవరోగాన్ని సమూలంగా రూపుమాపే వైద్య శిఖామణి ఈ దేవదేవుడే.



## 3-20

## మున్నుడి

శరణాగతితో అన్నమాచార్యులవారు తననీ భవ బంధాలనుంచి విముక్తుణ్ణి చేసి రక్షించమని అంతర్యామియైన శ్రీవేంకటేశ్వరుని ప్రాధేయపడుతున్నారు. నేను అలసిపోయాను. సొలసిపోయాను. ఇకనీవే దిక్కు అంటున్నారు. శ్రీవేంకటేశ్వరుని గుండె ద్రవించి తనకిష్టం లేకున్నా అన్నమయ్య కోరిక మన్నించాడని పెద్దలు భావించారు. శివరంజని రాగం రాళ్లగరగించు రాగం. కోర్కెలు కోయనికట్లు అంటున్నారు. ఆ కోరిక తీరేదాకా, చచ్చేదాక (కొంతమందికి చచ్చినా) విముక్తి వుండదు. అవే, పునర్జన్మహేతువై 'పుట్టి' ముంచుతుంది.

**కం॥ అంతర్యామీ! అలసితి**
**ఇంతటు నీ శరణ మేను ఇదెజొచ్చితి నా**
**చింతలు మదిలో బాపుము**
**అంతా నీ కరుణ యనెను అన్నయ వినుడీ**

**రాగం : శివరంజని**

అంతర్యామీ అలసితి సొలసితి
యింతట నీ శరణిదె జొచ్చితిని ॥అంతర్యామి॥

కోరిన కోర్కెలు కోయనికట్లు
తీరవు నీవవితెంచక
భారపు బగ్గాలు పాపపుణ్యములు
నేరుపుల బోనీవు నీవు వద్దనక ॥అంతర్యామి॥

జనుల సంగముల జక్క రోగములు
విను విడవవు నీవు విడిపించక
వినయపు దైన్యము విడువని కర్మము
చనదది నీవిటు సం(శాం)త పరచక ॥అంతర్యామి॥





మదిలో చింతలు మయిలలు మణుగులు
వదలవు నీవవి వద్దనక
యెదుటనే శ్రీవేంకటేశ్వర నీవదె
అదన గాచితివి అట్టిట్టనక ॥అంతర్యామి॥

## భావామృతం

అంతర్యామిగా మాలోనే చరిస్తూ మా నీడలా వున్న ఓశ్రీవేంకటేశ్వరా! నేను బాగా అలసిపోయాను, తండ్రీ! సొలుపు వచ్చేసింది. ఇక నాకు వేరే దిక్కులేదు. నీవే నన్ను రక్షించాలి. నీ శరణు జొచ్చాను. నన్ను ఆదుకో, ప్రభూ!

మేము కోరే కోర్కెలే తెగని బంధనములై ఎన్నటికీ మమ్మల్ని విడిపింపని చిక్కులవుతాయి. మేము ఎలాగూ వాటిని తెంచుకోలేం. నీవు తెంచకపోతే మాగతి అంతే. మేము చేసికొన్న పాపపుణ్యాలే బరువైన పగ్గములై నీవు వద్దని వాటిని తెంచకపోతే అవి మమ్మల్ని సమర్ధవంతమైన ముక్తుల్ని జేయవు.

ఇతర జనులతో మేము పెట్టుకొనే సాంగత్యాలే సౌఖ్యం కలిగే భ్రమ నిచ్చే వ్యాధులు. ఆ వ్యాదే సుఖం అని మురిసిపోతుంటాం మేము. నీవు కృప జూపి విడిపించక పోతే ఆ రోగం మమ్మల్నెప్పుడూ విడువక వినయంతో దీనులమై ఆ కర్మబంధాలలో నలిగి అశాంతులమై తపిస్తుంటాం. నీవే మమ్మల్ని శాంత పరచాలి. లేకపోతే మాకు గడవదు తండ్రీ! మాకు వేరే దారిలేదు.

మా మనస్సుల్లో ఉన్న విచారములే మలినములైన మా లొంగుబాట్లుగా మారి మమ్మల్ని వదలవు. నీవే వద్దని మమ్మల్ని ఆ లొంగుబాటునుంచి రక్షించాలి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు మా యెదుటనే నిలిచి, సమయానికి అట్టిట్టనక (ఏవేవో సాకులు చూపించక) రక్షించావు. నీకు శరణార్థిని, కృతజ్ఞుడను.

## 3-21

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తనలు నర్మగర్భంగా వుంటాయి. వాటి భావ వివరణ అనుకొన్నంత తేలిక కాదనటానికి ఈ కీర్తన పల్లవే అద్భుతమైన ఉదాహరణ. శ్రీహరి కొక్కనికే ఈ జగత్తులో ఎవరికైనా ఏదానమైనా ఈయడానికి అర్హత ఉన్నదట. ఎందుకంటే భూకాంతను ఆయన దానంగా సర్వహక్కులతో పుచ్చుకొన్నాడట (ఎప్పుడు?), ఆ సౌభాగ్యలక్ష్మి మాత్రమే కాక జయలక్ష్మి, వీరలక్ష్మి, సంగ్రామ లక్ష్మి, వరలక్ష్మి, ఆదిలక్ష్మి, కళ్యాణ లక్ష్మి మొదలైన సర్వలక్ష్ములకు మగడైన ఆయనకు తప్ప ఎవరికైన ఏదైనా అనుగ్రహించాలంటే సాధ్యమా?

**మ॥ తగునయ్యా హరి! నీకు యొక్కనికెయే దానంబు నీయంగ ఈ**
**జగమందున్, వినిపింతు కారణము ఆ సౌభాగ్య లక్ష్మీసతిన్**
**తగగైకొంటివి దానమట్లు బలిచే ధాత్రీలలామన్ అహో!!**
**మగడైనాడవు సర్వ లక్ష్ములకు సౌభాగ్యంబు అన్నయ్యనెన్.**

**రాగం : కళ్యాణి**

తగునయ్య హరి నీకు దానము దెచ్చుకొనిన
జగములో భూకాంత సౌభాగ్యలక్ష్మి ॥తగునయ్య॥

కిమ్ముల శిశుపాలుని గెలిచి చేకొంటివిగ
సమ్మతించి రుక్మిణి జయలక్ష్మి
అమ్ముమొనను జలధినడచి లంక సాధించి
కమ్మరచేకొన్న సీతే ఘన వీరలక్ష్మి ॥తుగనయ్య॥

నరకాసురు నడచి నవ్వతా చేయివేసితివి
సరిగా సత్యభామే పో సంగ్రామలక్ష్మి
హిరణ్యకసిపుగొట్టి యింద్రాదులకు నీచే
వరమిప్పించిన యాకే వరలక్ష్మి ॥తగునయ్య॥





నిండిన వురము మీద నిఖిల సంపదలతో
అండనుండే యాకే పో ఆదిలక్ష్మి
మెండగు శ్రీవేంకటాద్రి మీద నీ సరుస నేగే
గండుమీరె కళలతో కళ్యాణలక్ష్మి ॥తగునయ్య॥

**భావామృతం :**

ఓ శ్రీహరీ! నీకొక్కనికే తగును. నీకే హక్కు. ఏ సౌభాగ్యమునైనా నీవీయగలవు. దానముగా నీవు తెచ్చుకొనిన ఈ జగములో భూకాంత నీది అయిన సౌభాగ్యలక్ష్మి (వామనావతారంలో ఆయన జగత్తులోని లోకాల నన్నింటిని త్రివిక్రముడై బలి చక్రవర్తినుంచి సర్వ హక్కులతో దానంగా స్వీకరించాడు)

ప్రభూ! కిమ్ముల శిశుపాలుని (అంటే అల్పముగా భావించు శిశుపాలుని) గెలిచి, తన సమ్మతిని బ్రాహ్మణుని ద్వారా తెలిపిన రుక్మిణీదేవిని స్వీకరించితివి. ఆమెయే నీకు స్వంతమైన జయలక్ష్మి. బాణమును సంధించి జలధిని అణచి వారధి నిర్మించి లంకలో రావణుని తుదముట్టించి, కమ్మర (కమ్మర అంటే మరల అని అర్థం) సీతాదేవిని చేకొనినావు. ఆమే నీకు స్వంతమైన వీరలక్ష్మి.

ప్రభూ! నీవు మూర్ఛిల్లితివని ఆగ్రహించి నరకాసురుని తుదముట్టించిన సత్యభామపై నవ్వుతూ నీచేతిని వేసినావు. ఆమెయే పో నీ సంగ్రామలక్ష్మి. హిరణ్యకశిపుని చీల్చి నరసింహరూపమున నీవు ఆగ్రహోదగ్రుడవై యుండగా నిన్ను శాంతపరచి ఇంద్రాదులకు అనేక వరములిప్పించిన ఆ దేవియే వరలక్ష్మి వలె మమ్మనుగ్రహించుచున్నది.

ప్రభూ! సువిశాలమైన నీవురముపై ఆవాసమై సమస్త సంపదలను అనుగ్రహించి అండయై నిలిచే ఆ తల్లినే పో మేమందరమూ ఆదిలక్ష్మిగా కీర్తిస్తున్నాం. ఇకనేడు అతిశయించిన వేంకటాచలం మీద ఓ వేంకటేశ్వరా! నీ సరసనే వుండి నీతో వూరేగుతూ కళల కాణాచియైన ఈ జగజ్జననియే నీ నిత్యవధువు అయిన అలమేలు మంగమ్మ. ఆమెయే కళ్యాణ లక్ష్మి.

**3-22**

## మున్నుడి

అన్నమాచార్యులవారి జానపద కీర్తన ఇది. తన యజమానురాలిని కూడా సెబాస్ అని మెచ్చుకొనే అమాయకులు వారు. అన్నమయ్య నాటి వాడుకపదం 'చాంగుభళా'. ఈ రెండు పదములు నేటి కాలంలో 'భలే భలే' గా మారి ఉంటాయి. అలమేల్మంగమ్మ మన తల్లి, యజమానురాలు. ఆమె అందం అసాధారణం. ఆమె మధురాధరం, చూపులు, స్తనయుగ్మం, నడుము, ఒయ్యారపు నడక, చిరుకోపము ఇత్యాది సమస్తం "చాంగుభళా" అంటున్నారు. అన్నమయ్య మధుర భావనలు ఈ కీర్తనలో ప్రతిఫలించినవి. వాటిని సవివరంగా చెప్పే సత్తా నాకు లేదు... బహుశా రాదేమో... కూడ.

**ఉ॥ చక్కని తల్లికిన్ పలికి చాంగుభళాయని అన్నమార్యుడున్**
**చక్కెరమోవినిన్ పొగడె చాంగుభళాయని యెంచిచూడరో**
**చక్కదనాల కీర్తనిది స్వామికి యుల్లము ఝల్లు మన్నదో**
**ఎక్కువ నర్మగర్భముగ యాకృతి భావము నెంచి జెప్పితిన్**

**రాగం : పాడి**

చక్కని తల్లికి చాంగుభళా తన
చక్కెర మోవికి చాంగుభళా ॥చక్కని॥

కులికెడి మురిపెపు కుమ్మరింపు తన
సలుపు చూపులకు చాంగుభళా
పలుకుల సొలపుల పతితో కసరెడి
చలముల యలుకకు చాంగుభళా ॥చక్కని॥

కిన్నెరతో పతి కెలన నిలుచు తన
చన్ను మెఱుగులకు చాంగుభళా
ఉన్నతి పతిపై నొరగి నిలుచు తన
సన్నపు నడిమికి చాంగుభళా ॥చక్కని॥





జందెపు ముత్యపు సరుల హారముల
చందనగంధికి చాంగుభళా
విందయి వేంకట విభు పెనచిన తన
సందిదండలకు చాంగుభళా ॥చక్కని॥

**భావామృతం :**

చక్కదనాల మాయమ్మ అలమేల్మంగకు చాంగుభళా! ఆమె మధురాధరమునకు కూడ చాంగుభళా!

సంతోషముతో ఆమె కులుకుచున్నప్పుడు, విలాసమును ఆమె కుమ్మరించుచున్నది. చురచురపోట్లు పొడుచునట్లు ఆమె చూపులకు చాంగుభళా! పరవశించి మాటలాడు తన పతిని చిరు కోపముతో కసిరి, మచ్చరము ప్రదర్శించు (పైకి మాత్రమే) ఆ అలుకకు చాంగుభళా!

చేతిలో కిన్నెర (వాయిద్యము) ధరించి తన భర్త పక్కన నిలుచున్నప్పుడు మెఱయుచున్న ఆమె స్తనయుగ్మమునకు చాంగుభళా! పతితో శృంగార కళావిన్యాసములో ఉన్నతి యందున్నప్పుడు ఆయనపై నొరగిన సన్నని జఘనమునకు చాంగుభళా!

ముత్యాల సరములున్న ఆమె హారములు మధ్య మధ్య జందెములవలె వ్రేలాడుచుండినవి. అది అత్యంతాకర్షణీయమై ప్రశంసనీయముగా నున్నది. అట్టి చందన పరిమళ విరాజమానమైన ఆ జవ్వనికి చాంగుభళా! ఆనందముగా తన విభుడయిన వేంకటేశ్వరుని బిగియార కౌగలించిన ఆ తల్లి ధరించిన సంది దండలకు (కేయూరాభరణములకు) చాంగుభళా!

**3-23**

## మున్నుడి

విష్ణునామ సంకీర్తనా వైభవాన్ని వివరిస్తున్నారు అన్నమయ్య. నారాయణ అని పలికినంత మాత్రమున అజామీళుడు నరకాన్ని తప్పించుకొని వైకుంఠం చేరినట్లు భాగవతం చెబుతున్నది. అంత్యకాలమున నారాయణా అనాలంటే నేటి 'ఆధునికులకు' అంత తేలిక కాదు. సంపాదించిన ఆస్తులేమైపోతాయోననే దిగులుతోనే సగం మంది 'శ్రీహరీ' అనకుండా 'హరీ' అని పోతారు. దానికి తరుణోపాయమొక్కటే అలవాటుగా 'రామా' అనో, నారాయణా అనో 'శ్రీహరీ' అనో అనటం మొదలు పెట్టండి. వెన్నుని నామమే వేదం. ఎంత గడించినా, ఎన్ని పదవులు పొందినా, ఎంత చదివినా నామమే గతి.... ఇది సత్యం.

**కం॥ వెన్నుని నామం బొకటే**
**ఇన్నిటికిని ఇంతటికిని ఇరవైనది పో**
**ఎన్నగ వేదంబాయెను**
**అన్నాడా అన్నమయ్య అలరించె హరిన్.**

**రాగం : అభోగి**

ఇన్నిటా నింతటా నిరవొకటే
వెన్నుని నామమే వేదంబాయె ॥ఇన్నిటా॥

నలినదళాక్షుని నామకీర్తనము
కలగి లోకమున కలదొకటే
యిల నిదియే భజియింపగ పుణ్యులు
చెలగి తలప సంజీవని ఆయె ॥ఇన్నిటా॥

కోరిక నచ్యుత గోవిందా యని
ధీరులు తలపగ తెరువొకటే
ఘోర దురితహర గోవర్ధనధర
నారాయణ యని నమ్మగ కలిగె ॥ఇన్నిటా॥





తిరు వేంకటగిరి దేవుని నామము
ధర తలపగ నాధారమిదే
గరుడధ్వజుని సుఖప్రద నామము
నరులకెల్ల ప్రాణము తానాయె ॥ఇన్నిటా॥

**భావామృతం :**

ఇన్నిటికి, ఇంతటికీ అత్యుత్తమమైన స్థానము ఏదో తెలుసునా? ఒక్కటే. శ్రీమన్నారాయణుని నామ సంకీర్తనమొక్కటే. అదే వేదం వలె అందరికీ ముక్తినిస్తున్నది.

ప్రపంచము అని పిలువబడే ఈ లోకమున అరవింద- దళనేత్రుడైన ఆ శ్రీహరి నామమొక్కటే గతిగా కలదని గ్రహించండి. పుణ్యాత్ములైన భక్తులు ఇది గ్రహించి, విజృభించి ఆ నామ సంకీర్తన జరుపగా అది సంజీవని వలె వారికి మేలు చేసింది. మీరెందుకు అట్లు చేయరు?

ధీరోదాత్తులైన వారు ఇష్టపూర్వకముగా ఓ అచ్యుతా! ఓ గోవిందా! అని ధ్యానిస్తూ జీవించుటకు ఆ నామసంకీర్తనయే మార్గం అయింది. అది వారు చేసిన ఘోర పాపములను నిర్మూలించివేసింది. గోవర్ధనగిరి ధారియైన శ్రీకృష్ణ పరమాత్మయే, నారాయణుడే దురితదూరుడని నమ్మిన సర్వమూ నెరవేరుతుంది. ఆ నామము అంతగొప్పది.

తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుని నామమే ఈ భూలోకంలో ఆధారముగా నిలిచినది. గరుత్మంతుని తన ధ్వజమున కలిగిన ఆ మహానుభావుని సుఖప్రదమైన నామము తానే ప్రజలందరికీ ప్రాణమువలె జీవనాధారమైనది.

## మున్నుడి 3-24

అన్నమయ్య జీవిత చరిత్ర రాసిన ఆయన మనుమడు 'చిన్నన' ఈ కీర్తన గూర్చి ఇలా ప్రస్తావించాడు. తనపై ఒక శృంగార కీర్తన వ్రాయమని సాళ్వ నృసింహరాయలు అడిగితే "హరిపై దక్క అన్యులపై కీర్తన చెప్ప"నని అన్నమయ్య నిరాకరించగా రాజు ఆగ్రహించి సంకెలలతో చెఱలో బెట్టించాడట. అన్నమయ్య ఈ కీర్తన పాడగా సంకెలలు తెగిపోయినవట. ఈ సంగతి విన్న రాయలు మఱొకమారు తనయెదుట సంకెలలు వేయించాడట. అవికూడా రాజు చూస్తుండంగానే తెగిపోయాయట. నిశ్చేష్టుడైన రాజు అన్నమయ్య కాళ్లపై బడి క్షమను వేడాడట. అన్నమయ్య రాజును క్షమించుటయే గాక "నిన్ను శ్రీహరి రక్షించును" అని దీవించారట కూడా...

**ఆ.వె ॥ ఆకలైన వేళ అలసిపోయిన వేళ**
**"తేకువా" సగజాలు దిక్కుయేది?**
**అన్నమయ్య తెలిపె హరినామమొక్కటే**
**వేరు దారిలేదు విబుధులార!**

**రాగం : ముఖారి**

ఆకలివేళల-నలపైన వేళలను
తేకువ హరినామమే- దిక్కు మరి లేదు ॥ఆకలి॥

కొఱమావియున్నవేళ-కులము చెడినవేళ
చెఱవడి యొరుదులచే-జిక్కినవేళ
ఒఱపైన హరినామ-మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన-మఱి లేదు తెఱగు ॥ఆకలి॥

ఆపదవచ్చిన వేళ - ఆఱడి బడినవేళ
పాపపు వేళల -భయపడిన వేళ
ఓపినంత హరినామ-మొక్కటే గతిగాక
మాపు దాక బొరలిన-మఱిలేదు తెఱగు ॥ఆకలి॥





సంకెళబెట్టిన వేళ - చంప బిలిచినవేళ
అంకిలిగా నప్పులవా-రాగిన వేళ
వేంకటేశు నామమే - విడిపించ గతిగాక
మంకు బుద్ధి బొరలిన- మఱిలేదు తెఱగు ॥ఆకలి॥

**భావామృతం :**

ఆకలితో బాధపడుతున్నప్పుడు, అలసి శ్రమపడి యున్నప్పుడు, మానవులకు తేకువ (ధైర్యము) నొసగునది యేది? శ్రీహరి నామము ఒక్కటే దిక్కు కాని మరింకేదీ లేదు (అని గ్రహించండి). కొఱమావియున్నవేళ (ఎందుకూ కొఱగాని స్థితియందు), కుల భ్రష్టత్వము చెందినప్పుడు, ఇతరుల చేతిలో జిక్కి చెరసాలలో బంధింపబడినప్పుడు, ఒఱపైన (చక్కటి) హరినామమొక్కటే గతి. పొరబాటుగానైనా ఇంకొకటి దిక్కు కాదని గ్రహించవలెను. అసలింకొక దారియే (తెఱవు) లేదు, ఉండబోదు.

మనకు అనుకోకుండా ఆపద సంభవించినప్పుడు, నిందకు గురియైన వేళలయందు, పాపము జరుగుచున్న వేళలయందు, భయకంపితులైయున్న సమయములలోను చేతనయినంత హరినామమొక్కటే దిక్కు. అంతేగాని చివరిదాక ఎంత బొరలినా(శ్రమించినా) ఇంకొకమార్గం లేదు.

నీపై వైరభావం కలిగినవారు సంకెళ్లతో బంధించి బాధించుచున్నప్పుడు, సంహరించుటకు సిద్ధపడినప్పుడు, అప్పులవాళ్లు అంకిలిగా (అడ్డుపడి) నిలబెట్టిన వేళ, ఆ శ్రీవేంకటేశ్వరుని నామమొక్కటే దిక్కు. అదొక్కటే నిన్ను విడిపించగలదు. అట్లుగాక మంకుబుద్ధితో (మూర్ఖత్వంతో) శ్రమిస్తే ఏమి ఉపయోగం? ఇంకొకదారి లేదు అని గ్రహించి ఆ ఏడుకొండల వాడిని "అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అని వేడుకోండి. మిమ్మల్ని తప్పక రక్షిస్తాడు.

## 3-25

## మున్నుడి

అన్నమాచార్యులవారు కలశాపురం (నేటి అనంతపురం జిల్లాలో వున్నది) దర్శించి అక్కడ వెలసిన 'హనుమంతుని' పై ఈ కీర్తన చెప్పారు. హనుమంత రాయుడని అభివర్ణిస్తూ ఆయన ప్రతాపాన్నీ శ్రీరామునికి ఆయన చేసిన సేవను గుర్తుచేస్తున్నారు. 'నీరు' అంటే అల్పమైనది (అల్పము) అని అర్థమున్నది. లంకను నిమిషాన నీరు సేసి-అంటే స్వర్ణలంకను క్షణంలో అల్పమైన బూడిద చేసి అని అర్థం. 'సహజాన నొక జంగచాచి' అంటె, స్వభావ సిద్ధంగా తన ఒక పిక్కనుచూచి యుంచి అని అర్థం. కొత్తచోటికి ఎగిరి దూకాలంటే అదే చేయాలి కదా! అన్నమయ్యకు రాముడే వేంకన్న.

**కం॥ కలశాపురమందున తా**
**నలరుచు నున్నాడు వాడె హనుమంతుడు ఆ**
**నళినీకాంతుని కొలుచుచు**
**అలయని బంటనెను అన్నమయ్యను వినుడీ.**

**రాగం : వసంత**

కలశాపురము కాడ కందువ సేసుకొని
అలరుచున్నవాడు హనుమంత రాయుడు ॥కలశా॥

సహజాన నొకజంగ చాచి సముద్రము దాటి
మహిమ మీరగ హనుమంత రాయుడు
ఇహమున రాముబంటై యిప్పుడు నున్నవాడు
అహరహమును దొడ్డ హనుమంతరాయుడు ॥కలశా॥

నిండు నిధానపు లంక నిమిషాన నీరు సేసె
మండిత మూరితి హనుమంత రాయుడు
దండితో మగి(గు)డి వచ్చి తగ సీత శిరోమణి
అండ రఘుపతికిచ్చె హనుమంత రాయుడు ॥కలశా॥





వదలని ప్రతాపాన వాయుదేవు సుతుడై
మదియించినాడు హనుమంతరాయుడు
చెదరక యేప్రొద్దు శ్రీవేంకటేశు వాకిట
అదివోకాచుకున్నాడు హనుమంతరాయుడు ॥కలశా॥

**భావామృతం :**

కలశాపురమునందు కందువ (జాడ) సేసుకొని (తెలియజేయుచు) విలసిల్లుచున్న ఈ మహానుభావుడే హనుమంతరాయుడు. (ఈయనను సేవించండి).

ఆకాశమున కెగిరి దూకి లంకజేరుటకు సంకల్పించిన వాడై, ఆ హనుమంతరాయుడు స్వభావ సిద్ధముగా ఒక పిక్కను చాచియుంచి మహిమను జూపుతూ సముద్రమును దాటినాడు. నేటి కలియుగమున కూడ అహరహము (రాత్రింబవళ్ళు) రామబంటువలె ఈ పెద్ద హనుమంతుడు నెలకొని యున్నాడు.

నిండు నిధానము (పూర్తిగా స్వర్ణమయం) అయిన లంకను నిముషంలో నీరు (అల్పమైనది) గా చేసి పారవేశాడు. ఈ మండితమూర్తి (అలంకరింపబడిన స్వామి). శౌర్యముతో మగుడివచ్చి (తిరిగివచ్చి) సీతాదేవి శిరోమణిని నాధుడైన శ్రీరామునికిచ్చి ఆ రఘుపతిని ఆనందపరచినవాడు ఈ హనుమంతరాయుడు. (ఈయనకు చేతకాని దేదీ వుండదు)?వాయునందనుడైన ఈ పరాక్రమశాలి ఎన్నడూ వీడని ప్రతాపము గలవాడు. అందుచే ఈ హనుమంతరాయుడు మదియించి వున్నాడు. (మదించి యున్నాడని అర్థం చేసికొనరాదు. ఇక్కడ మదియించి అంటే మనసులో ధ్యానము చేయుచూ వున్నాడని అర్థం) వున్నాడు. ఏ వేళలోనైనా ఈయన చెదరక (పరాకులేక) శ్రీవేంకటేశ్వరుని వాకిటిలో (అనంతపురం తిరుమల యెదుటనే వున్నదని భావన) అదిగో కాచుకొని సిద్ధముగా నున్నాడు. ఈ హనుమంత రాయుడు. (ఈ స్వామిని సేవించి తరించండి.

## 3-26

### మున్నుడి

అన్నమాచార్యుల వారి సరస శృంగార కీర్తన ఇది. 'అంత్యప్రాస' రకరకాల విన్యాసాలు చేసిన అద్భుత కవిత. వివరించి జెబితే సీమంతులు సిగ్గుల మొగ్గలయ్యే సామంతం. సమరతి అనుభవంలేని వారికి "చచ్చినా అర్థం కాని చమత్కారం". వేంకటేశ్వరుడు పులకరించి అమ్మవారిని ఆటపట్టించే తేట తెలుగు తేనెజల్లు. అర్థం కాని పరమార్థం. 'తములము' అంటే తాంబూలం అని తెలియని వారికి చెప్పి లాభంలేదు....

**సీ॥ చిరుచెమటల తోటి చెమరగ చెక్కిళ్లు**
**మొలక నవ్వులు నవ్వె మోహనాంగి**
**సొలపుల వేడ్కల చొక్కెను జవ్వని**
**తొలగని ఆసల తొక్కిడాయె**
**నెఱవగు చూపుల నిక్కిళ్లు మెరయగా**
**తమకంబు మించెనా తరుణి కపుడు**
**గుక్కిళ్లు మెఱసెను గురుతైన అధరంబు**
**వలపులు దక్కెనా వనిత కపుడు**

**ఆ.వె॥అమరె నేడు తనకు అన్ని సొబగులును**
**సమరతి గురుతులును సతికి గలిగె**
**అన్నమయ్య పాటనలరె శృంగారంబు**
**వేంకటేశు కదియె వేడుకాయె**

**రాగం : దేవగాంధారి**

అమరె గదె నేడు అన్ని సొబగులును
సమరతి చిన్నలు సతి నీ మేను ॥అమరె॥





చెలపల చెమటలు చెక్కిళ్ళ
మొలకల నువ్వులు మొక్కిళ్ళ
సొలపుల వేడుక చొక్కిళ్ళ
తొలగని ఆసలు తొక్కిళ్ళా ॥అమరె॥

నెఱవగు చూపులు నిక్కిళ్ళ
మెఱసెను తమకము మిక్కిళ్ళ
గుఱుతగు నధరము గుక్కిళ్ళ
తఱచగు వలపులు దక్కిళ్ళా ॥అమరె॥

నునుగోరి కొనలు నొక్కిళ్ళ
పొనుగని తములము పుక్కిళ్ళ
ఘనుడగు శ్రీవేంకటపతి కౌగిట(ళ్ళ)
యెనసెను పంతము లెక్కిళ్ళు ॥అమరె॥

**భావామృతం :**

తల్లీ! అలమేల్మంగా! నేడు అన్ని విధములైన అందములు నీకు సమకూడినవి. సమకూటములలో సొలసిన నీ మేనిలో ఆ చిహ్నములన్నియూ పొడజూపుచున్నవమ్మా! అవి స్వామికి వేడుక గనుక ప్రస్తావిస్తాను తల్లీ! ఆలకింపుము.

అందమైన నీ చెక్కిళ్ళు చెమటతో చెమరించినవి. నీ చిరునవ్వులలో కొంటెతనములు తొంగిచూచినవి. వెనుదీయని వేడుకలతో నీవు పరవశించిపోతివి. తీరని ఆశలతో సంకటములే మిగిలినవి.

విస్తరించిన నీ చూపులు నలుదిక్కుల గమనించుచున్నవి. ఆ చూపులలో యొకింత గర్వము తొంగిచూచుచున్నది. మిక్కిలియైన తన్మయత్వము కూడ మెఱసినది. అధరములపై గురుతైన దంతక్షతములు అలంకరణములైనవి. పలుమార్లు ప్రణయానుభవములు ఆమెను అలరించినవి. ఆమె స్థితి వర్ణనల కందకున్నది.

లేత కొనగోటి నొక్కిళ్ళు స్వామి శృంగార విభవమును చాటుచున్నది. విరామములేని తాంబూల సేవనముచే బుగ్గలు అలిసినను అలరినవి. ఘనుడైన శ్రీవేంకటేశ్వరుని పరిష్వంగములలో లెక్కకు మిక్కుటములైన పంతములు పరిఢవిల్లినవి.

**3-27**

## మున్నుడి

అన్నమాచార్యులవారి వైరాగ్య సంకీర్తన ఇది. కనులముందు కరిగిపోయే కాలం తిరిగి రమ్మంటే వస్తుందా? రాదు. ఇక్కడ 'బూడిదలో హోమం' అనే క్రొత్త పోలిక చెప్పారు అన్నమయ్య. హోమం చేయాలంటే జ్వలించే అగ్ని కావాలి కాని బూడిదలో నెయ్యిపోసి హోమం చేస్తారా యెవరైనా? కాలం పొంచియున్న మృగమట. ఏక్షణాన గుటుక్కుమని మింగుతుందో!! అగ్ని దగ్గరున్న వెన్న కరిగిపోకుండా వుంటుందా? పుక్కి పురాణం అంటే బుగ్గల్లో పెట్టుకొన్న పురాణ గాథలు. అంటే అప్పటికప్పుడు (కల్పించి) చెప్పిన ఇతిహాసం. భక్తి తక్కువ రక్తి ఎక్కువ. అది హరినెట్లు చూపగలదు?

**ఉ॥ ఏడ చనెన్ గదా! తెలివి ఏడకు పోయెను జ్ఞానమంతయున్**
**బూడిదలోన హోమమయిపోయెను క్రుంగిరి అన్నమార్యుడున్**
**వేడిమి సోక అగ్గికడ వెన్నయిపోయెను కాలమంతయున్**
**కూడక వేంకటేశ! నిను కోరితి వ్యర్థుల కూటముల్ హరీ!**

**రాగం : బౌళి**

ఏడ సుజ్ఞానము యేడ తెలివి నాకు
బూడిదలో హోమమై పోయె కాలము ॥ఏడ సుజ్ఞాన॥

ఇదె మేలయ్యెడి నాకదె మేలయ్యెడి నని
కదిసిన యాసచే గడవలేక
యెదురు చూచి చూచి యెలయించి యెలయించి
పొదచాటు మృగమై పోయె కాలము ॥ఏడ సుజ్ఞాన॥

ఇంతట దీరెడి దుఃఖ మంతట దీరెడి నని
వింత వింత వగలచే వేగి వేగి
చింతయు వేదనల చిక్కువడుచు నగ్గి
పొంతనున్న వెన్నయై పోయె కాలము ॥ఏడ సుజ్ఞాన॥





ఇక్కడ సుఖము నాకక్కడ సుఖంబని
యెక్కడికైనా నూర కేగి యేగి
గక్కన శ్రీతిరువేంకటపతి గానక
పుక్కిపురాణమయి పోయె కాలము ॥ఏడ సుజ్ఞాన॥

**భావామృతం :**

అయ్యో!! కాలమంతా బూడిదలో చేసిన హోమము వలె వ్యర్థమైపోయినదే!! నాకు తెలివి ఏమై పోయింది? నా సుజ్ఞానమంతా ఏమయిపోయింది?

ఇది నాకు మేలు చేస్తుంది, అది నాకు మేలు చేస్తుంది అని నమ్మివానిపై అనేక ఆసలు పెట్టుకొని నన్నుపెనవేసుకొన్న ఆసలతో గడపలేక పోయాను. ఇక కాలమేమో పొదచాటున చేరి దాగియున్న మృగము వలె ఎదురు చూచి ఎదురుచూచి నన్ను కబళించాలని ప్రయత్నిస్తోంది. ఇప్పుడు నేనేం చేయాలి? దారేమిటి?

అనంతమైన నా దుఃఖము ఇంతటితో వదలి పోతుందిలే అంతటితో పోతుందిలే అనుకొని వింత వింత వేదనలతో వేగిపోయాను. అంతులేని ఈ చింతలలో చితికిపోయి చిక్కువడిపోయి నిప్పు సమీపంలో వున్న వెన్నవలె నా వునికే మారింది. స్థిరంగా గట్టిగా వుండాల్సిన నేను నీరుగారిపోయాను.

నాకు ఇక్కడ సుఖమున్నది, అక్కడ సుఖమున్నదని భ్రమపడి ఊరకనే యెక్కడెక్కడికో పోయాను. సమయమంతా వృధా చేసికొన్నాను. శ్రీవేంకటేశ్వరుని తక్షణం దర్శించక పనికిరాని పుక్కిట పురాణాలయందు ఆశ కనబరిచి ఆ పురాణాలవలెనే కాలయాపనతో ఆ ఏడుకొండలవాడు నాకిచ్చిన కొద్దికాలాన్ని వ్యర్థం చేసికొన్నాను.

## 3-28

## మున్నుడి

హంపీ విజయనగరంలో వెలసిన వీరరామునిపై అన్నమాచార్యులవారు అనేక అత్యద్భుత సంస్కృత సంకీర్తనలు వినిపించారు. ఆ కోవలో ఈ కీర్తన కూడా ఒకటి. “తరణి తనూజాది తరుచర పాలక” అంటే సూర్యపుత్రుడైన సుగ్రీవుడు మొదలైన వానరులను పాలించిన వాడని అర్థం. ‘హరకోదండహర’ అంటే శివుని వింటిని విరిచినవాడని తెలియవలెను. తేలికగా కనిపించే తేలిక కాని కీర్తన చెప్పటం అన్నమయ్య ప్రత్యేకత. నామాట నమ్మాలంటే... పరిశీలించండి.

**తే॥ హంపి విజయనగరమున అలరియున్న**
**వీరరాముని గొలిచిరి పరవశించి**
**‘అమర’ గానము వినిపించి రన్నమయ్య**
**పూజ యిదియని పాడుడీ సుజనులార!**

**రాగం : నాటు**

నమో నమో రఘుకుల నాయక దివిజవంద్య
నమో నమో శంకర నగజానుత ॥నమో నమో॥

విహిత ధర్మపాలక వీరదశరథ రామ
గహన వాసినీ తాటక మర్దన
అహల్యాశాప విమోచన అసురకుల భంజన
సహజ విశ్వామిత్ర సవన రక్షకా ॥నమో నమో॥

హరకోదండ హర సీతాంగనా వల్లభ
ఖరదూషణారి వాలి గర్వాపహా
తరణి తనూజాది తరుచర పాలక
శరధి లంఘన కృత సౌమిత్రి సమేత ॥నమో నమో॥





బిరుద రావణ శిరోభేదక విభీషణ
వరది సాకేతపురివాస రాఘవ
నిరుపమ శ్రీవేంకట నిలయ విజయనగర
పుర విహార పుండరీకాక్షా ॥నమో నమో॥

**భావామృతం :**

ఓ రఘు కులాగ్రణీ! నీకు వందనము దేవతలచే నుతింపబడు రామచంద్రా! నీకు నమస్కారములు. శివపార్వతులచే నుతింపబడు వీరరామా! నీకు వందనములు.

ఏ సమయమున యెట్టి ధర్మము పాటించాలో అట్టి ధర్మమును పరిపాలించిన వాడవు. వీరాధి వీరుడైనవాడవు. దశరథాత్మజుడవు. గహనవాసిని (కారడవులలో నివసించునది) యైన తాటకను సంహరించినవాడవు. అహల్యాదేవిని శాపమునుండి విడిపించిన వాడవు. అసురకులాన్ని అంతమొందించినవాడవు. సహజ (తమ్మునితో) విశ్వామిత్రుని యాగమును రక్షించిన వాడవు. అట్టి నీకు వందనములు.

శ్రీరామా! శివధనస్సును విరిచిన నీవు సీతాదేవికి భర్తవు. ఖర దూషణాది రాక్షసుల శత్రువా, అజేయుడైన వాలి గర్వమును నిర్మూలించి తుదముట్టించితివి. సూర్యనందనుడైన సుగ్రీవాది వానరులను పరిపాలించిన వాడవు. హనుమంతునిచే సముద్రమును దాటింప చేసినవాడవు. ఎల్లప్పుడు సుమిత్రానందనుడైన లక్ష్మణుని తోడైన వాడవు.

బిరుద (సమర్థుడైన) రావణాసురుని శిరస్సును భేదించి సంహరించిన వాడవు. విభీషణుని రక్షించిన వాడవు. సాకేత నగరాధీశుడైన రాఘవుడవు. సాటిలేని తిరుమలాధీశుడైన శ్రీవేంకటేశ్వరుడవు. విజయనగర పురాధీశుడైన వీరరామచంద్రుడవు. పద్మదళ నేత్రుడవైన మహానుభావుడవు. అట్టి నీకు వందనములు.

**3-29**

## మున్నుడి

సంస్కృతంలో అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన ఇది. పట్టుమని ప్రతిపదార్థం చెప్పవయ్యా వింటాను అంటే పండితులకే తికమక కలిగే కీర్తన అని చెప్పగలను. పెద్దల సహాయంతో ఒక మోస్తరు వివరణ ఇవ్వగలిగాను. ఇట్లాంటి కీర్తనలు చదివాక అన్నమయ్య భాషాపాండిత్యానికి ముగ్ధులం కాకుండా వుండగలమా? కుందహాసుడంటే మొల్ల పుష్పముల మొగ్గల వంటి చిరునవ్వులు కల శ్రీకృష్ణుడు. "చిర చిర ఘన శ్రీవేంకటేశ్వర" అంటే ఏమిటి? చిరచిరలాడే శ్రీనివాసుడనుకోకండి... చదవండి.

**కం॥ నందుని నందన! నీకా-**
**నందము వేణు స్వనంబు నవనీత హరా!**
**అందముగ పాడి అన్నయ**
**కుందపు దంతాల సౌరు కొనియాడిరిగా**

**రాగం : అభేరి**

నందనందన వేణు నాద వినోద, ము
కుంద కుంద దంతహాస గోవర్ధనధరా ॥నంద॥

రామ రామ గోవింద రవిచంద్ర లోచన
కామ కామకలుష వికారవిదూర
ధామ ధామ విభవప్రతాపరూప దనుజ ని-
ర్ధామధామకరణచతనర భవభంజన ॥నంద॥

కమల కమలావాస కమలారమణ దేవో
త్తమ తమోగుణ సతత విదూర
ప్రమదప్రమదాను భవ భావకరణ
సుముఖ సుధానంద శుభరంజనా ॥నంద॥





పరమ పరాత్పర పరమేశ్వరా
వరద వరదామల వాసుదేవ
చిర చిరఘన నగ శ్రీవేంకటేశ్వర
నరహరినామ పన్నగ శయనా ॥నంద॥

**భావామృతం :**

ఓ నందనందనా! వేణుగాన వినోదా! ఓ ముకుందా! మొల్ల మొగ్గవంటి లేత చిరునవ్వుగల మనోహరా! గోవర్ధన పర్వతమునెత్తిన మహానుభావా! (నీకు వందనములు).

ఓ పరశురామా! రఘురామా! గోవిందా! సూర్యచంద్రులు నేత్రములైన ప్రభూ! మాయొక్క కామనలను, కామనలవలన జనించిన దోషములను పరిహరించువాడా! మోక్షమునకు స్థానమై ముక్తి వైభవము యొక్క ప్రతాపము రూపుదాల్చినవాడా! రక్కసి మూకను సమూలముగా కంపింపజేయువాడా! నేర్పరితనము ద్యోతక మగునట్లు భవబంధములను సడలించు మహానుభావా! నీకు వందనములు.

కమల (బ్రహ్మ)కు ఆవాసమైన (స్థానమైన) కమల (నాభియందు) గలదేవా! లక్ష్మీవల్లభా! దేవతలందరిలో శ్రేష్ఠుడా! ఎల్లప్పుడూ తమోగుణమును నిరసించి నిర్మూలించువాడా! ప్రమదానుభవమును (బ్రహ్మానందమును), ఆనందస్వరూపిణియైన లక్ష్మిని చేపట్టిన భావస్వరూపా! ప్రసన్నత చేకూర్చు మోక్షానందము కలిగించే శుభరంజనుడా! (నీకు అనేక వందనములు).

ఓ సర్వోత్తమా! పరాత్పరా! (సర్వశ్రేష్ఠా!) ఓ పరమేశ్వరా! వరములనొసంగు దేవదేవా! ఓ వరదామల! (నిర్మల లక్ష్మీనివాసా!) వాసుదేవా! శాశ్వతుడా! నిరంతరం వేంకటాద్రి ఆలయముగాగల వేంకటేశ్వరా! నరహరి నామముతో శేషతల్ప శాయియైన దేవాది దేవా! (నాకు శరణాగతియే ఆధారము తండ్రీ! నన్ను రక్షింపుము)

## 3-30

## మున్నుడి

"కూచిపూడి" సంప్రదాయంలో నాయిక (సత్యభామ) ఆగమనాన్ని సూచిస్తూ వైతాళికులు 'భామనే సత్యభామనే...' అంటూ పాడుతారు. వారందరికీ అన్నమాచార్యులవారి ఇటువంటి కీర్తనలే స్ఫూర్తి అయివుంటాయి. అలమేల్మంగమ్మ రాకను ప్రకటిస్తున్నారు ఆచార్యులవారు. అమ్మవారి సౌందర్యాన్ని రమణీయంగా వర్ణిస్తున్నారు. పచ్చల కడియాల 'పణతి' చెలంగ... అంటే మరకతములు తాపిన చేతి కడియములతో ఆ పడతి విరాజిల్లగా... అని అర్థం. రంభాది అప్సరసలు వారినటనారంభాన్ని ప్రదర్శిస్తూ అమ్మవారిని సేవిస్తున్నారట. ఏమి భావన!!

**ఉ॥ వచ్చెను వేంకటేశ్వరుని భామినియౌ అలమేలుమంగ ఈ**
**పచ్చల తాపదంబుగల బంగరువౌ కడియాల్మెరంగ తాన్,**
**మచ్చికయైన కీరముల మాటలు మైమరపించె జవ్వనిన్**
**మెచ్చెడి కీర్తనంబు వినిపించెను మేలుగ అన్నమార్యుడున్**

**రాగం : హిందోళం**

వచ్చెను అలమేలు మంగ ఈ
పచ్చల కడియాల పణతి చెలంగ ॥వచ్చెను॥

బంగారు చేదివిటీలు పూని
శృంగారవతులు వేవేలు రాగా
రంగైన వింజామరలు వీవ
మాంగల్య లీల సొంపగు జవరాలు ॥వచ్చెను॥

పలుకుల తేనియ లొలుక చెంత
చిలుకలు కలకల పలుక రవల
గిలుకు పావలు ముద్దు గులుక మేటి
కలికి చూపుల మొనలు తళుకని చిలుక ॥వచ్చెను॥





రంభాది సతులెల్ల చేరి ఎదుట
గంభీర గతులను మీర నటనా
రంభములను మేలు కోరి కొలువ
అంభోజాక్షుడౌ వేంకటేశునొయ్యారి ॥వచ్చెను॥

**భావామృతం :**

ఇదిగో చూడండి, ఇదే వచ్చెను అలమేల్మంగమ్మ. ఈమె మరకతములు తాపిన చేతి కడియములను ధరించి శోభిల్లుచున్నది.

అనేకమంది శృంగార పరిపూర్ణులైన చెలికత్తెలు బంగారు దివిటీలు (కాగడాలు) చేతిలో ధరించి వెంటరాగా అందమైన వింజామరలు (తెల్లని చామరము)చే వీచుటకు మరికొందరు ఆయత్తమవగా ఆ జవరాలి మాంగల్యము మనోహరముగా మెడలో వూగుచుండినది.

ఆమె పెంపుడు చిలుకలు, తేనెలొలుకునట్లు మధురముగా 'గలగల' పలుకు చుండినవి. ఆమె పావలు (పావుకోళ్ళు) ముద్దులొలుకు గిలుకు(సవ్వడి) ను చేయుచున్నవి, వాడియైన ఆమె చూపుల తూపులు తళుక్కుమని తళతళలను చిలుకుచున్నవి (వెదజల్లుచున్నవి).

రంభ మొదలైన అచ్చరలు అందరు చేరి ఆమె యెదుట గంభీరముగా నృత్యము సలుపుచుండిరి. వారి నటనా వైదుష్యమునంతయు ప్రదర్శించుచు ఆ దేవిని మేలుకొలుపు కొలువు సలుపుచున్నారు. పద్మదళాయతాక్షుడైన శ్రీవేంకటేశ్వరుని ఒయ్యారి భామ అయిన ఆదేవి మనోజ్ఞమైనది.

**3-31**

## మున్నుడి

మానవ జన్మకు సార్ధకత భగవద్దర్శనం మాత్రమే. ఐహికమైన, మానావ మానములు శరీరానికే గాని ఆత్మకు అంటవు. ఆత్మోన్నతి ఆ పరమాత్మ దర్శనంవలన కలుగుతుంది. సనకాది మునీశ్వరులు కూడా కోరేది అదే. దేవతలకు కూడా దుర్లభమైన ఆయన దర్శనం అతి సులువుగా ఈ ఏడుకొండల మీద దొరుకుతున్నది. నీరజనాభుని ఏ తపోదీక్షా లేకుండా తనివితీర చూచే భాగ్యం ఈ భూమ మీదనే కలుగుతున్నది. ఈ జన్మకిది చాలదా? ఆ స్వామి వారికి చెందిన వారిగా బ్రతికే కన్నా ఏంకావాలి? అన్నమయ్య చెప్పింది అక్షర సత్యం.

**మత్తకోకిల॥ చాలదా హరి! మేలు నాకిది జన్మధన్యత జెందె, నీ**
**పాలివారము వోలె మెల్గెడి భాగ్యమబ్బెను దేవరా!**
**వీలుకాదుర మౌనివర్యులు వేలయేండ్లు తపించినన్**
**మేలు వేంకటనాధు నమ్మిన మేటి అన్నయ తెల్పెరా.**

**రాగం : కొనడ**

చాలదా మా జన్మము నీ-
పాలింటి వారమై బ్రతుకగ గలిగె ॥చాలదా॥

కమలాసనాదులు కానని నీపై
మమకారము సేయ మార్గము గలిగె
అమరేంద్రాదులకు అందరాని నీ-
కొమరైన నామము కొనియాడ గలిగె ॥చాలదా॥

సనకాదులును కాన జాలని నిన్ను
తనివోవ మతిలోన తలపోయ గలిగె
ఘన మునీంద్రులకు అగమ్యమై వున్న
నిను సంతతము వర్ణింపగలిగె ॥చాలదా॥





పరమమై భవ్యమై పరగిన నీ
యిర విట్టిదని మాకు నెఱుగంగ గలిగె
తిరువేంకటాచలాధిప నిన్ను యీ
ధరమీద పలుమారు దరిసింప గలిగె ॥చాలదా॥

**భావామృతం :**

ఓ దేవదేవా! మా జన్మమునకు ఈ భాగ్యము చాలదా? నీకు చెందిన వారు అనిపించుకొంటూ బ్రతుకగలిగితే అంతకన్నా కావలసినది ఏమున్నది?

బ్రహ్మాది దేవతలు కూడా నిన్ను దర్శించాలంటే, ధ్యానించి తపించాలి. అప్పటికప్పుడు నిన్ను చూడాలంటే అయ్యేపనికాదు. దేవేంద్రాదులకు కూడ మనోజ్ఞమైన నీ నామమే. నిన్ను కీర్తించుట కాధారము. (అటువంటప్పుడు మాకు ఇంకా ఆలోచన యెందుకు? నీ నామస్మరణను చేబడితే చాలు కదా!)

సనక సనందనాది ఋషులు కూడా నిన్ను చూడాలి అంటే ద్వారపాలకుల అనుమతి తీసికోవలసి వచ్చింది. మరి మాకు ఆ బాధలేదు. తనివిదీరా నిన్ను మనస్సులో ధ్యానించగలుగుతున్నాం. (కళ్లుమూసుకున్నా నీ దివ్యమంగళ రూపం మా కనులముందు కనబడుతూనే వున్నది) గొప్ప గొప్ప యోగీశ్వరులకు నీవు అగమ్యమైన వాడవు. అటువంటి నిన్ను ఎప్పుడూ వర్ణించి కొనియాడే భాగ్యం కలిగింది. ఇది చాలదా? ఇంతకన్నా ఏం కావాలి?

నీవు పరబ్రహ్మావు. పుట్టుక అంతము వృద్ధి లేని అనంతుడవు. అటువంటి నీ వునికి ఇట్టిది అని మేము తెలుసుకోగలిగితిమి. ఓ తిరుమలనాథా! శ్రీవేంకటేశ్వరా! ఏ లోకమూ పోకుండా ఈ భూమి మీదనే నిన్ను దర్శించే అదృష్టం కలిగింది. ఇది చాలు మాకు ఇంకేమీ వద్దు.

## మున్నుడి 3-32

నేను ఈ మున్నుడి వ్రాస్తున్నది, సమయం ఆరు గంటలు, తెల్లవారబోతోంది. వైకుంఠ ఏకాదశి, శుక్రవారం. ఇంతకంటే ఈ కీర్తన చెప్పటానికి మంచి సమయం ఏముంటుంది? ఇది నా అదృష్టం. స్వయంగా పర్యవేక్షిస్తూ ఆనాడు ఇటువంటి సమయంలోనే అన్నమాచార్యులవారు ఈ కీర్తన చెప్పివుంటారు. ఆనాటి స్వామి సేవను మీ మనోనేత్రంతో మీరూ తిలకించి తరించండి. ఈ కీర్తనకున్న ఇంకొక ప్రత్యేకత ఏమంటే అన్నమయ్య కీర్తనలలో దర్శనమిచ్చే శ్రీవేంకటేశుని 'మకుటం' లేకపోవటం. నిఘంటువు లేకుండా దీన్ని వివరించగల పండితులు... బహుకొద్దిమంది.

**ఉ॥ కంటిమి శుక్రవారమనగా ఘడియల్ యిట ఏడు, స్వామి! నీ**
**కంటుచునుండె మా జనని ఆ యలమేల్ తిరుమంగచేరికై**
**పంటగ కన్నులున్ వెలిగె పాడెను కీర్తన మన్నమార్యుడున్**
**జంటగ భావమున్ దెలుప సాయము సేయర వేంకటేశ్వరా!**

**రాగం : ఆనందభైరవి**

కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామి ॥కంటి॥

సొమ్ములన్నీ కడబెట్టి సొంపుతో గోణము గట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు రొమ్ము తలమొలచుట్టి
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని ॥కంటి॥

పచ్చకప్పురమె నూఁటి పసిడి గిన్నెలనించి
తెచ్చి శిరసాదిగ దిగనలది
అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై
నిచ్చె మల్లెపూల వలె నిటుతానుండే స్వామిని ॥కంటి॥





తట్టు పునుగె కూర్చి చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరగించి వెండి పళ్యాల నించి
దట్టముగ మేను నిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే బిత్తరి స్వామికి ॥కంటి॥

**భావామృతం :**

శుక్రవారమునాడు, ఏడు ఘడియల సమయంలో ఈ మహానుభావుని చూశాను. ఈయన తన దేవేరియైన అలమేల్మంగను అంటిపెట్టుకొనివామె వెంటనే వున్నాడు. (చూడండి... చూచి తరించండి.)

ఈ స్వామి తన నగలన్నీ ఒకప్రక్కన పెట్టి (అభిషేకం చేస్తే నగలు తడిసి పాడవుతాయికదా!) అందంగా గోణము (గోచీవంటి చిన్న వస్త్రము) నొకదాన్ని కట్టాడు. పన్నీరు కలిపి చేసిన కమ్మని కదంబమును (మిశ్రమాన్ని) తడిసిన వలువలు రొమ్ము, తల, మొలచుట్టూ బిగింపబడియుండగా తుమ్మెద వంటి శరీర ఛాయగల ఆ శ్రీవేంకటేశ్వర స్వామి తన ప్రేమను (నెమ్మది) వ్యక్తము చేయుచూ శోభించుచున్నాడు.

బాగుగా నూఁటిన పచ్చకర్పూరమును బంగారు గిన్నెలో నింపి తెచ్చి ఆపాదమస్తకము దిట్టముగా అద్ది, చూచువారు ఆశ్చర్య చకితులవుతుండగా వారందరికన్నుల కింపువునట్లు నిత్యమల్లె పువ్వువలె ఇచ్చట ప్రకాశించుచున్న ఈ శ్రీవేంకటేశ్వర స్వామిని (తిలకించి తరించండి)

'పునుగుపిల్లి' నుంచి వచ్చిన తట్టు పునుగు (తట్టి ఎత్తిన మేలు రకపు పునుగు అను సుగంధద్రవ్యము) తో బాగుగా పూతలు వేసి నిప్పులో కరిగించి వెండి పళ్లెములలో నింపఇ తీసికొని వచ్చారు. దానిని స్వామి మేనికి దిట్టంగా పట్టించారు. తరువాత తీరికగా తీర్చి దిద్దారు. దానివలన శీఘ్రముగా ఆనందించిన ఆ తిరుమలనాథుడు బిత్తర స్వామియై (ప్రకాశము వెదజల్లు స్వామియై) కనువిందు చేసినాడు.

**3-33**

## మున్నుడి

వైష్ణవ మతదీక్ష తీసికొనిన అనంతరం తన గురువులు హరి శరణాగతిని పొందిన తనకు జ్ఞానబోధను చేసి వైకుంఠ ద్వారాలు తెరిచారని తనకిక కర్మలతోను వాటి ఫలాలతోను నిమిత్తం లేదని చెబుతున్నారు అన్నమాచార్యులవారు. నరహరిపై తనకు భక్తిని 'రేపిరి' అని అంటున్నారు. పరమాత్ముడైన వేంకటేశ్వరుని పొందులోగల ఆనందాన్ని తనకు అనుభవమయ్యేట్లు చేసి స్వామికీ తనకూ 'పొందుట' యేర్పరచారని కనుక తనకిక ఏ ఉద్యోగమూ ఎందుకని ప్రశ్నించి, అవేవీ వొద్దు వొద్దు అంటున్నారు.

**చం॥ నరహరి నీదయామృతము నన్నిటుముంచగ కర్మలేల? నీ**
**శరణము బొందు జీవులకు సాధ్యమె స్వేచ్ఛగ నుంటయెన్నడున్**
**నరకము రాదు, విష్ణుపురి నాకికదక్కును అన్నమయ్యనెన్**
**తిరుమలనాథు గొల్వుమని తేల్చిరి శ్రీహరిదాసులెల్లరున్**

**రాగం : బౌళి**

నరహరి నీదయమీదట - నా చేతలు గొన్నా?
శరణాగతియును జీవుని స్వతంత్రము రెండా? ॥నరహరి॥

మొఱయుచు నరకపు వాకిలి-మూసిరి హరి నీదాసులు
తెఱచిరి వైకుంఠపురము-తెరువుల వాకిళ్లు
నుఱిపిరి పాపములన్నియు-నుగ్గుగ నిటు తూర్పెత్తిరి
వెఱవము వెఱవము కర్మపు -విధులిక మాకేలా? ॥నరహరి॥

పాపిరి నా యజ్ఞానము-పరమాత్ముడ నీ దాసులు
చూపిరి నిను నామతిలో -సులభముగా నాకు
రేపిరి నీపై భక్తిని -రేయిని బగలును నాలో
వోపము వోపము తపములు -వూరకె యికనేలా? ॥నరహరి॥





దిద్దిరి నీ ధర్మమునకు -దేవా శ్రీవేంకటేశ్వర
అద్దిరి నీ దాసులు నీ -ఆనందములోన
ఇద్దరి నీ నా పొందులు-యేర్పరి చిటువలె గూర్చిరి
వొద్దిక నొద్దిక నాకిక- నుద్యోగము లేల? ॥నరహరి॥

**భావామృతం :**

ఓ నరహరీ! నాపై నీదయ కలిగిన తరువాత నాకోసం నేను చేసికొనవలసిన పనులేమున్నాయి? కొన్ని కూడా లేవు. స్వామీ! నిన్ను శరణుపొందిన జీవునికి స్వతంత్ర్యత యెక్కడుంటుంది? నీ శరణు వాడి స్వతంత్ర్యము అనే రెండు వుండనే వుండవు.

ప్రభు! నీ దాసులు గట్టిగా నీనామం పలుకుతూ నరకపు ద్వారాలన్నీ మూసేయించారు. వైకుంఠద్వారాలు తెరిచిపెట్టారు. మా పాపములన్నీ నుగ్గునుగ్గు చేశారు. తూర్పారబట్టారు. (జల్లెడ బట్టారు) ఇక మేం భయపడవలసిన పనిలేదు. ఆ కర్మల పద్ధతులతోను పని లేనేలేదు. (మాకు అంతా శ్రీహరియే).

పరమాత్మా! నీ దాసులు నా యజ్ఞానమును తొలగించి వేశారు. అతి సులువుగా వారు నిన్ను నా హృదయంలో చూపినారు. రేయింబవళ్లు నీపై భక్తి కుదురునట్లు చేశారు. మేము తపస్సు నాచరించలేము. మాకు ఏ తపస్సుతో అవసరమే లేదు. (నీ కరుణ మాపై వుంటే చాలు).

దేవా! శ్రీవేంకటేశ్వరా! నీ దాసులు నాకు భాగవత ధర్మమును ప్రబోధించి నీ శరణాగతికి అలవాటు చేశారు. నీ కీర్తన స్మరణ వలన దొరికే అమందానందానుభవమును నాకు రుచి చూపించారు. వారు నీకూ నాకూ సంయోగం ఒద్దికతో కలిగించి నన్ను ధన్యుని చేశారు. ఇక నాకు యే స్వతంత్ర ప్రయత్నములతో పనియే లేదు. అవి నాకు వొద్దేవొద్దు. వాటితో ఇంకా నేను సాధించాల్సిందేమున్నది?

**3-34**

## మున్నుడి

సుగ్రీవుడంటే మంచి మెడ కలవాడని అర్థం. అహోబల నరసింహుని 'సుగ్రీవ నారసింహు'డని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. అవధారు దేవ (ఆలకింపుము ప్రభూ!) అని పలుమార్లు వేడుకొంటున్నారు. వాయుదేవుడు ఆ స్వామికి సరినాలవట్టి మిచ్చాడట. ఆలవట్టము అంటే వస్త్రముతో చేసిన గుండ్రని విసనకర్ర. అరుదుగ (అపూర్వంగా) నున్న ఆ నరసింహరూపుని సిరులు మించిన శ్రీవేంకటాద్రి నాధునిగా భావించిన పరమయోగీంద్రులు ఆయనను ప్రార్థిస్తున్నారట. అది అన్నమయ్య అనుపమ సృష్టి.

**ఆ.వె॥ సులభుడైన యట్టి సుగ్రీవ నరసింహు**
**కొలిచెనన్నమయ్య కోర్కెమీర**
**అగ్రపూజలిడెను 'అవధారు దేవ'ని**
**అద్భుతమగు కీర్తనాలపించె.**

**రాగం : తోడి**

సుగ్రీవ నారసింహో సులభుడ వందరికి
అగ్రేసరుడ నీవు అవధారుదేవ ॥సుగ్రీవ॥

సనకాదులొకవంక జయవెట్టుచున్నారు
ఎనసి సురలు చేతులెత్తి మొక్కేరు
మునులిరు మేలానుండి మునుకొని నుతించేరు
అనుపమాలంకార అవధారు దేవ ॥సుగ్రీవ॥

గంగాది నదులెల్ల కడిగీ నీ పాదములు
పొంగుచు సప్తరుషులు పూజించేరు
సంగతి వాయుదేవుడు సరినాలవట్టమిడీ
అంగజ కోటిరూప అవధారుదేవ ॥సుగ్రీవ॥





పరగ నారదాదులు పాడేరు నీ చరిత
పరమయోగీంద్రులు భావించేరు
సిరులు మించిన యట్టి శ్రీవేంకటాద్రి మీద
అరుదుగ నున్నాడవు అవధారు దేవ ॥సుగ్రీవ॥

**భావామృతం :**

చక్కని మెడ కలిగినట్టి ఓ నరసింహ రూపా! నీవు అందరికీ అతి సులువుగా లభించు (అనుగ్రహించు) వాడవు. సర్వాధికుడవు నీవే. ఓదేవా! అవధారు (ఆలకింపుము).

నీకొకవైపున నిలచి సనక సనంద నాది ఋషులు జయజయధ్వానములతో కీర్తిస్తున్నారు. దేవతలంతా చేతులు పైకెత్తి నీకు నమస్కరించుచున్నారు. మునుకొని (ముందుండి) నీకిరువైపులా మునులు నిలుచుకొని నిన్ను నుతిస్తున్నారు. సాటిలేనట్లు అలంకరింపబడియున్న ఓ నృసింహ దేవా! మా మొర లాలకింపుము. రక్షింపుము ప్రభూ!

స్వామీ! గంగ మొదలైన పుణ్యనదులన్నీ ఈ భవనాశినీ నదిరూపంలో వచ్చి, నీ పాదములను కడుగుచున్నవి. ఆనందంతో పొంగిపోతూ సప్తఋషులు నిన్ను పూజిస్తున్నారు. ఇక వాయుదేవుడు నిన్ను సాకారుడై సమీపించి ఆలవట్టము (వస్త్రముతో తయారు చేయబడిన గుండ్రటి విసనకఱ్ఱ)ను ధరించి నీకు వీస్తున్నాడు. కోటి అంగజుల (అనేక మన్మధుల) వలె చక్కటి రూపముగల ఓ దేవా! మా ప్రార్ధనల నాలకింపుము ప్రభూ!

నారదుడు మొదలైన వారంతా నీ చరితమును చక్కగా పాడుచున్నారు. పరమయోగీంద్రులు నిన్ను వైభవోపేతుడైన శ్రీవేంకటేశ్వరునిగా భావించి ప్రస్తుతించుచున్నారు. నీవు అరుదుగా నున్నాడవు. (ఇదివరకు ఎవరికీ ఇటువంటి నరుడు సింహము కలిసిన రూపంలేదు) ఓ దేవా! అవధారు మా వినతిని ఆలకింపుము తండ్రీ!

## మున్నుడి 3-35

తండ్రి అడుగుజాడల్లోనే శ్రీవేంకటేశ్వరునికి అంకితమై అన్నమయ్య కుమారుడు 'పెదతిరుమలయ్య' చెప్పిన జగద్విఖ్యాతమైన కీర్తన ఇది. భక్తితో ఒకసారి పాడితే కేశవనామాలు పఠించిన పుణ్యమే కాక శ్రీమన్నారాయణుని దశావతారములను శ్రీవేంకటేశ్వరుని స్మరించిన పుణ్యం కూడా మీ 'కాతా' లో 'జమ' అవుతుంది. నన్ను నమ్మండి. ఈ కీర్తన పదే పదే వినండి. మనకు తెలియకనే అనేక పాపాలు 'అక్కడ' మన కాతాలో వస్తూనే వున్నాయి. 'వీడిమొహం' అని ఈ క్షణాన నన్ను మీరు తిట్టుకొంటే మీ 'పాపం!' కాతాలో ప్లస్ ఒకటి అయింది. అందుకే 'నమో వేంకటేశాయ' అనండి.

**కం॥ పెద తిరుమలయ్య పూనుచు**
**ముదమారగ భజన వోలె మురహరి కొరకై**
**పది అవతారంబుల నిటు**
**మది పులకించంగ పాడె మరి మరి వినరో!**

**రాగం : హిందోళ**

మత్స్య కూర్మ వరాహ మనుష్య సింహ వామనా
యిచ్చ రామ రామ రామ హితబుద్ధి కలికీ ॥మత్స్య॥

నన్ను గావు కేశవ నారాయణ మాధవ
మన్నించు గోవింద విష్ణు మధుసూదన
వన్నెల త్రివిక్రమ వామనా శ్రీధరా
సన్నుతించే హృషీకేశ సారెకు పద్మనాభ ॥మత్స్య॥

కంటిమి దామోదర సంకరుషణ వాసుదేవ
అంటే జాలు ప్రద్యుమ్నుడా అనిరుద్ధుడా
తొంటే(టి) పురుషోత్తమ అథోక్షజ నారసింహమా
జంటవాయకు మచ్యుత జనార్దన ॥మత్స్య॥





మొక్కేము వుపేంద్ర హరి మోహన శ్రీకృష్ణరాయ
యెక్కితి శ్రీవేంకట మిందిరానాథ
యిక్కువ నీ నామములు యివియే నా జపములు
చక్కగా నీ దాసులము సర్వేశ అనంతా ॥మత్స్య॥

**భావామృతం :**

ఓ మత్స్యావతారా! కూర్మరూపా! వరాహమూర్తీ! నారసింహా! వామనాకారా! పరశురామా! శ్రీరామా! బలరామదేవా! (శ్రీకృష్ణా!) హితమును బోధించిన బుద్ధభగవానుడా! కలికీ! (నీకు వందనములు).

ఓ కేశవా! నారాయణుడా! మాధవా! నన్ను రక్షింపుము తండ్రీ! ఓ గోవిందుడా! విష్ణుమూర్తీ! మధుసూదనా! నన్ను మన్నింపుము అనేక వర్ణములతో విరాజిల్లిన త్రివిక్రమా! వామనరూపా! శ్రీధరా! నిన్ను సన్నుతించెదను. ఓ హృషీకేశా! పద్మనాభా! మాటి మాటికీ నిన్ను స్మరించెదను.

ఓ దామోదరా! సంకర్షణా! వాసుదేవా! నిన్ను కనుగొన్నాము. ప్రద్యుమ్నా! అనిరుద్ధా! అంటే చాలు మా పాపములు పటాపంచలై పోతాయి. ఆది పురుషోత్తమా! అధోక్షజా! నరసింహ స్వరూపా! (నీకు అనేక నమస్కారములు). ఓ అచ్యుతా! జనార్దనా! ఏనాటికీ నా తోడు విడిచిపెట్టవద్దు ప్రభూ!

ఓ ఉపేంద్రా! శ్రీహరీ! మోహన శ్రీకృష్ణా నీకు మ్రొక్కెదము దేవా! ఓ ఇందిరారమశ్రీ! శ్రీవేంటాద్రి నెక్కి నీ జాడ కనుగొని నీయొక్క నామములను నా జపముగా గానము చేయుచున్నాను. ఓ అనంతా! నీవు సర్వేశుడవు అందుచే నీ దాసులమైన మమ్ము చక్కగా పరిపాలింపుము తండ్రీ!

## మున్నుడి 3-36

లక్ష్మీనారాయణుల వలె కనిపిస్తున్న ఈ పద్మావతి, శ్రీనివాసులు ఇద్దరికి పెండ్లియోగము (పెండ్లి సంబంధము) ఎట్లు కుదిరిందో కానీ ఇద్దరికీ ఎన్ని పోలికలున్నాయో చూడండి అని ఆ వివరాలందిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ పెళ్లి సంబరం సందర్భంగా నీ భక్తులమయిన మాకు పప్పన్నం పెట్టి తాంబూలం ఇయ్యి ప్రభూ! అని చనువుగా అడుగుతున్నారు. ఇద్దరికీ ఇన్ని పోలికలున్నాయి కనుక మేనత్త, మేనమామ పిల్లలేమో మేనరికం బాగుందని (మేలుమేలని) వారి సంబంధాన్ని (సమ్మందము) మెచ్చుకొంటున్నారు. ప్రతిపెండ్లిలోను పాడదగ్గ కీర్తన అని నేను వేరే చెప్పాలా...

**తే॥ ఎట్టు గూడె పెండిలి యోగ మిర్వురికిని**
**లక్ష్మినారాయణుల యోగలబ్ధి కలిగె**
**ఎంతచక్కటి పోలిక లెరుగ దెలిపె**
**అన్నమార్యుడు!! కీర్తన మద్భుతమురః.**

**రాగం : హరి కాంభోజి**

ఎట్టుగూడె పెండ్లి యోగ మిద్దరికి నీవేళ
అట్టె లక్ష్మీనారాయణ యోగము ॥ఎట్టు॥

నెలత కమలవాసి నీవు కమలాక్షుడవు
పొలతికి నీకు గూడె పొంతనాలు
వలుద చక్రవాలు వనిత కుచాలు నీవు
యెలమి చక్రాయుధుడ విద్దరికి తగును ॥ఎట్టు॥

తరుణి నీలకుంతలి తగు నీలవర్ణుడవు
సరుస మీకే తగు సమ్మంధము
నిరతి హేమ వర్ణాకె నీవు పీతాంబరుడవు
సరవి నిద్దరి కొక్క జాతియ్యము ॥ఎట్టు॥





పాలవెల్లి పుట్టెనాకె పాలవెల్లి యిల్లు నీకు
మేలు మేలు యిద్దరికి మేనవావి
యీ లీల శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
సోలి మాకు పెట్టరాదా సోబన విడేలు ॥ఎట్టు॥

**భావామృతం :**

స్వయంగా లక్ష్మీనారాయణుల వలె కనిపించుచున్న వీరిద్దరికీ (పద్మావతీ శ్రీనివాసులకు) పెండ్లి యోగము (పెండ్లి సంబంధము) ఎట్టు (ఎట్లు) కుదిరినదో కాని లక్ష్మీనారాయణ యోగము (కలయిక) లభించినట్లు వున్నది.

ఈ వధువు కమలవాసిని (పద్మాలయయైన శ్రీలక్ష్మి) ఈయనేమో కమలాక్షుడు (శ్రీమన్నారాయణుడు) ఈ వనితకు నీకూ చక్కటి పొత్తు కుదిరినది. స్థూలమైన చక్రవాక పక్షుల వంటి కుచయుగళము గల కోమలి ఈమె. మరి మురిపెముగా చక్రాయుధుడు ఈ వరుడు. ఈ ఇరువురికీ సరిపోయింది.

ఈ సుందరి కేశములు దట్టమై నల్లగా నుండుటచే ఈమెను నీలకుంతల అని పిలువవచ్చును. ఇక ఈయనేమో నీలవర్ణుడు (శ్యామసుందరుడు) వీరికి సంబంధము కూడ చక్కగా కుదిరినది. ఆకె (ఆమె) మిక్కిలి బంగారు శరీర ఛాయగల భామ. ఇక ఆయనేమో పీతాంబర ధరుడు (బంగారు పచ్చపట్టు వలువలు ధరించు స్వామి) ఈ క్రమమున వీరి జాతీయము కూడ నొకటిగానే తోచుచున్నది.

ఆమె క్షీరాబ్ధి కన్య. ఆయనేమో క్షీరాబ్ధి శయనుడు. భళిభళీ! మేనరికం ఎంత చక్కగా కుదిరిందండీ!! ఈ విధముగా ఓ శ్రీ వేంటేశ్వరా! ఈ కన్యను నీవు పరిణయ మాడితివి. పరవశించిపోవునట్లు మాకు పెళ్లి పప్పన్నం పెట్టి తాంబూలమిచ్చి ధన్యులను చేయుము ప్రభూ! (ఈ జన్మకు ఇది చాలు తండ్రీ!)

## 3-37

## మున్నుడి

సుండో! అనేపదం, సుమా! అనే పదమై నేటి కాలంలో ఇంకా వాడుకలో వున్నది. ఇదియే సత్యము సుండో! (సుమా!) అని చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఇహమున (జీవించి యున్న లోకమున) పరమున (ఊర్ధ్వలోకమున) రెంటిలోను ఈ స్వామియే మనకు కావలసినవి ఇచ్చువాడు. 'మనికై' అంటే మన్నికయై అని అర్థం. అన్నమయ్య చాటిన ఈ హరినామ సంకీర్తనా మహాత్మ్యాన్ని తెలుసుకొని శ్రీవేంకటేశుని దాసులై తరించండి. అజ్ఞానం వలన ముప్పాతిక పాలు జీవితం వ్యర్థం అయింది. ఇకనైన మేలుకోండి.

**ఉ॥ చాటెద నేనిదే వినుడు సత్యము సుండి! అనెన్ తరించగా**
**చేటులు రావుగా ఇతని సేవలు చేసినచో ముదంబునన్**
**మేటిది కీర్తనంబు భళి! మేలుగ జెప్పెను అన్నమార్యుడున్**
**దీటుగ పార్వతీ స్తుతు, మదిన్ తను నిల్పెను వేంకటేశునిన్.**

**రాగం : శుద్ధసావేరి**

చాటెద నిదియే సత్యము సుండో
చేటులే దితని సేవించినను ॥చాటెద॥

హరినొల్లని వా రసరులు సుండో
సురులీతని దాసులు సుండో
పరమాత్ముడితడే ప్రాణము సుండో
మరుగక మరచిన మరి లేదికను ॥చాటెద॥

వేద రక్షకుడు విష్ణుడు సుండో
సోదించె శుకుడు అచ్చుగ సుండో
ఆది బ్రహ్మగన్నాతడు సుండో
ఏదెస వెదకిన ఇతడే ఘనుడు ॥చాటెద॥





ఇహ పర మొసగను ఇతడే సుండో
వహి నుతించె పార్వతి సుండో
రహస్య మిదియే రహి శ్రీవేంకట
మహీధరంబున మనికై నిలిచె ॥చాటెద॥

**భావామృతం :**

నేను చాటి చెబుతున్నాను. ఓ జనులారా! వినండి. ఇదియే నిజము సుమా! ఏ విధమైన అపకారము లేనిదే ఇతని సేవ. కనుక ఇతనిని సేవించి తరించండి. (నామాట వినండి)

ఎవరైతే శ్రీహరిని ఒప్పని సేవించరో, వారంతా అసురులు, (కొమ్ములు, కోరలు వుండనక్కరలేదు). ఇతని దాసులై సేవించే వారంతా సురులు (దేవతలు) (అణిమాది మహిమలుండ నక్కరలేదు). ఈయనే పరమాత్ముడు. ప్రాణము రూపంలో మనందరిలోనూ వున్నాడని గ్రహించండి. ఇతనియందు అనురక్తులుగాక మఱచిపోతే, ఇక వారికి అథోగతియే. ముక్తి ఎన్నటికీ రాదు. (ఇవ్వాళ దీక్షితులు రేపు ఇంకెవడో పక్షి... అంతే తేడా).

ఈ శ్రీమహా విష్ణువే ఆనాడు సోమకాసురుని వధించి వేదములను రక్షించాడు. చక్కగా శోధన చేసి శ్రీ శుకమహర్షి మనకు భాగవతం ద్వారా భగవంతుని దర్శింప జేయించారు. ఈయనే ఆదియైన బ్రహ్మను కన్నతండ్రి. మీరు ఏ దిక్కున వెతికినా ఈయనే ఘనునిగా గోచరిస్తాడు. (అయితే... 'వున్నాడు' అని నమ్మి... వెదకాలి. 'వున్నాడా?' అని వెదకితే వుండడు)

ఇహలోకంలో మనకు కావలసిన సంతోషము, పరలోకంలో కావలసిన పుణ్యమును అనుగ్రహించేది వేరెవ్వరూ కాదు, ఈ మహానుభావుడే. పరమశివుని అర్థాంగియైన పార్వతీ దేవి వహించి నిత్యమూ స్తుతించునది ఈయననే. నేను ఇంకొక పరమ రహస్యం చెబుతాను వినండి. ఆనంద నిలయుడై శ్రీవేంకట పర్వతం మీద వున్న ఈ శ్రీవేంకటేశ్వరుడే మన్నికయైన దేవుడు. ఇది సత్యం.

**3-38**

## మున్నుడి

అన్నమాచార్యులవారు తనుకూడా ఒక గోపిక వలె భావించుచూ పాడిన చక్కటి కీర్తన ఇది. (బహుశా కృష్ణాష్టమి నాడు చెప్పి వుంటారీ కీర్తన). సర్వాభరణ భూషిత చతుర్భుజాకారంతో దేవకీ వసుదేవులకు తానెందుకు వారి కడుపున పుడుతున్నాడో వివరించి వారికి కర్తవ్యం బోధించి మరీ పుట్టాడు. బ్రహ్మరుద్రులచే కీర్తించబడ్డాడు. యశోదా నందగోపుల ఇంటజేరి గోపాలకృష్ణుడైనాడు. ఇదిగో నేడు మన మహద్భాగ్యంగా తిరువేంకటేశుడై అలమేల్మంగమ్మతో మన యెదుటనే వున్నాడు.

**కం॥ శ్రావణ బహుళాష్టమి తిథి**
**ఈ వసుధ జనించినాడు యీ కృష్ణుడు తాన్**
**దేవకి నందను డాయెను**
**గోవిందుడు, అన్నమయ్య గోపిక ఆయెన్.**

**రాగం : కాపి**

సతులాలా చూడరే శ్రావణ బహుళాష్టమి
కతలాయ నడురేయి కలిగె శ్రీకృష్ణుడు ॥సతులాలా॥

పుట్టేయపుడే చతుర్భుజాలు శంఖ చక్రాలు
ఎట్టు ధరియించెనే యీ కృష్ణుడు
అట్టే కిరీటము ఆభరణాలు ధరించి
ఎట్ట ఎదుట వున్నాడు ఈ కృష్ణుడు ॥ సతులాలా॥

వచ్చి బ్రహ్మయు రుద్రుడు వాకిట నుతియించగాను
ఇచ్చగించి వినుచున్నాడీ కృష్ణుడు
ముచ్చటాడీ దేవకితో ముంచి వసుదేవునితో
హెచ్చిన మహిమలతో ఈ కృష్ణుడు ॥సతులాలా॥





కొదదీర మరి నందగోపునకు యశోదకు
ఇదివో తా బిడ్డడాయె నీ కృష్ణుడు
అదన శ్రీవేంకటేశుడై అలమేల్మంగ గూడి
ఎదుటనే నిలుచున్నాడీ (వున్నాడుఈ) కృష్ణుడు॥సతులాలా॥

**భావామృతం :**

ఓ సతులారా! గోపికలారా! ఇటు చూడండి. ఈరోజు శ్రావణ బహుళాష్టమి. నేటి అర్ధరాత్రి వేళ ఈ శ్రీకృష్ణుడు వుదయించాడు. ఈయన చరిత్ర యెన్నో భాగవత కథలయినవి.

ఈయన పుడుతున్నప్పుడే చతుర్భుజునిగా పుట్టాడు. శంఖ చక్రాది ఆయుధములు ధరించి వాటితోబాటు పుట్టాడు. కిరీట ధారియైన ఆ శ్రీకృష్ణుడు యెట్టనెదుటనే ప్రత్యక్షమయ్యాడు. ఆ మహానుభావుడు అవతరించిన వెంటనే చతుర్ముఖ బ్రహ్మతో బాటు పరమశివుడు కూడా భూలోకానికి వచ్చి ఆయన అవతారాన్ని స్వాగతించి కీర్తించారు.

వాకిటిలో నిలిచి స్తుతిస్తున్న వారిని ప్రీతితో విని ఆనందించుచున్నాడు ఈ కృష్ణుడు. తరువాత ప్రేమతో (వారి పురాకృత కర్మవలన) దేవకీ వసుదేవులకు తనెందుకు వారికి జన్మిస్తున్నదీ వివరించి మరీ పుట్టాడు. అద్భుతమైన దివ్య మహిమలను చూపించి వారిని ధన్యులను చేశాడు.

ఇదిగో ఆ తరువాత కొరత తీరునట్లుగా యశోదా నంద- గోపుల యింట (రేపల్లెలో) చేరాడు. ముద్దుల బిడ్డడయ్యాడు. అదట్లా వుండగా అదన (ఈ సమయమున) శ్రీవేంకటేశ్వరుడై తన దేవేరి అలమేల్మంగతో గూడి మన యెదుటనే ఆ శ్రీకృష్ణుడు నిలిచియున్నాడు. మీరు ధన్యులు భావించి తరించండి.

**3-39**

## మున్నుడి

చిన తిరుమలయ్య కూడ తాళ్లపాక అన్నమాచార్యులవారి బాటలోనే నడిచి శ్రీవేంకటేశ్వరునిపై సంకీర్తనలు రచించి తరించాడు. కీర్తనలకు వేంకటేశుని మకుటం కూడా అలాగే వుండుట వలన వత్యాసం గుర్తించడం సామాన్యులకసాధ్యం. ఈ కీర్తనలో చిన తిరుమలాచార్యులవారు, ఏవేవో మందులు (భవరోగనివారణ కోసం) తయారు చేయుటకు 'నూరి' శ్రమపడవద్దు, తాగినోరు చేదయి బాధ పడవద్దు అని ఓదారుస్తున్నారు. ఒకచోట నీదగ్గరలోనే సంజీవని (ఆనాడు హనుమంతుడు తెచ్చి లక్ష్మణుని బ్రతికించిన) మందు వున్నదయ్యా తీసికో అంటున్నారు. ఏమిటా మందు? ఎక్కడ దొరుకుతుంది? వినండి మరి...

**కం॥ నూరుచు త్రాగే మందుల**
**నోరే చేదవును, వలదు, నోటికి మేలా**
**చేరువగల 'సంజీవని'**
**కోరుము చిరతిరుమలయ్య కూడవచించెన్**

**రాగం : శుద్ధ సావేరి**

నూర వద్దు తాగవద్దు నోరు చేదుగావద్దు
చేరువ నొక చోట సంజీవి వున్న దిదివో ॥నూరవద్దు॥

పొలమెల్లా తిరిగాడి పొడి పడనె వద్దు
తలకక గడ్డపార తవ్వవద్దు
వలవని వాగుల వంకల వెదకవద్దు
చెలగి వొకచోట సంజీవి వున్న దిదివో ॥నూరవ॥

మొక్కలాన చెరువులో మునిగి చూడవద్దు
నిక్కిన పుట్టల మీద నెమకవద్దు
వెక్కసాన చేతిపైడి వెలపెట్టి కొనవద్దు
చిక్కులెల్లా బాపెటి సంజీవి వున్నదిదివో ॥నూరవద్దు॥





దీవులను నో (ఓ) డ లెక్కి తిరుగాడనే వద్దు
సోవల బిలములోన చొరవద్దు
కావించి గ్రహణాదికాలము వెదకవద్దు
శ్రీవేంకటనాథుడై సంజీవి వున్నదిదివో ॥నూరవద్దు॥

**భావామృతం :**

ఓ మానవులారా! శ్రమ వద్దు, నూరటం, చేదు మందులు త్రాగటం వంటి అనవసరమైన యాతనలు పడవద్దు. నోరు చేదు అవటం తప్ప (ఈ భవరోగ నివారణకు ఆ మందులేవీ వుపయోగపడవు) లాభం లేదు. మీ సమీపముననే ఒక దివ్యమైన 'సంజీవిని' వున్నది. ఇదిగో అనవసరంగా ఎందుకు శ్రమపడతారు?

పొలముల వెంటపడి తిరిగి వెదకవలసిన పనేలేదు. అలా తిరిగి నుగ్గునుగ్గయిపోకండి. తలకక (భయపడకుండా) ఏవేవో చోట్ల గడ్డపారలతో తవ్వి కష్టపడవద్దు. వలనని (వేదన చెందుతూ) వాగుల వెంట వంకలవెంట తిరిగి వెదకవద్దు. దివ్యమైన సంజీవిని యొకచోట వున్నది. ఇదిగో తీసికోండి.

మొక్కలాన (ఎంతో ఉత్సాహపడి) చెఱువులలో మునిగి వెదకి చూడవలసిన పనియేలేదు. బాగా పెఱిగిపోయిన పుట్టలమీద వెదకనవసరం లేదు. వెక్కసాన (అధికముగా యెంత కావాలంటే అంత లభించే) వున్న చేతి బంగారం అది. ఎందుకు వెలపెట్టి కొంటారు? ఈ సంజీవిని వున్నది చూశారా, ఇది అన్ని ఇబ్బందులనీ నిర్మూలిస్తుంది. సందేహించకండి. ఈ దివ్యసంజీవిని పరిగ్రహించండి.

ఇది ఏవేవో దీవులలో దొరుకుతుందనుకొని ఓడలు యెక్కి వెళ్లవలసిన పనియేలేదు. సోవల (సవ అంటే జాడ కనుక సోవల అంటే జాడ తెలిసికొనే ప్రయత్నం అని భావించాను) కోసం ఏవేవో గుహలలో పోయి దూరవలసిన పనిలేదు. గ్రహణ కాలములలోనే కాని లభించని కొన్ని పదార్థముల వంటిది కాదు ఇది. ఎప్పుడు పడితే అప్పుడు దొరుకుతుంది, తీసికోండి. ఇంతకీ ఏమిటండీ మీరు చెబుతున్న సంజీవిని మాకు చూపించండి అంటారా? ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడే ఆ దివ్య సంజీవిని. ఇంకా చూస్తారేం ఈ స్వామిని సేవించి తరించండి. అనండి ఏడుకొండలవాడా... వేంకట రమణా... గోవిందా... గోవింద.

## 3-40

## మున్నుడి

పరమాత్ముడైన తిరువేంకటేశ్వరుని ఎవరు దర్శించగలరు? ఏ అర్హతలు కావాలి స్వామిని చేరటానికి? ఆయన వునికి ఎవరికి తెలుస్తుంది? ఆయనను కీర్తించే విధము ఎవరికి తెలుస్తుంది? ఆయన మాటలు ఎవరికి వినిపిస్తాయి? ఇవన్నీ అందర్నీ వేదించే సందేహాలే. అన్నమాచార్యులవారు ఈ చిక్కు ప్రశ్నలకు అతి రమ్యంగా జవాబిస్తున్నారు వినండి కాకపోతే అంత తేలికగా కొఱుకుడు పడే కీర్తన కాదిది. మహీధర సీతారామశర్మగారి అన్నమయ్య పదామృత వర్షిణి నాకు చాలా ఉపకరించింది. వారికి నా కృతజ్ఞతలు. ఇది చదివి స్వామి తత్త్వం ఇంకొంచెం తెలుసుకోగలిగితే చాలు కదా!

**చం॥ ఇతరులు యెట్లు నేర్చెదరు ఇందిరహృత్కమలానివాస! నిన్**
**సతతము సత్యవాక్పటిమ సొంతము మోహవిమోచనంబుతో**
**స్థితమతులైన వారు నిను చేరుదురన్యులకెట్లు సాధ్యమౌ?**
**మతిగొని అన్నమయ్య వినుమా! యనికీర్తన గొల్చె శ్రీపతిన్.**

**రాగం : శ్రీరాగం**

ఇతరులకు నిను నెఱగ తరమా
సతత సత్యవ్రతులు సంపూర్ణ మోహవిర-
హితులెఱుగుదురు నిను నిందిరా రమణా ॥ఇతరులకు॥

నారీకటాక్ష పటు నారాచ భయరహిత-
శూరు లెఱుగుదురు నిను చూచేటి చూపు
ఘోర సంసార సంకుల పరిచ్ఛేదులగు
ధీరులెరుగుదురు నీ దివ్యవిగ్రహము ॥ఇతరులకు॥

రాగభోగవిదూర రంజితాత్ములు మహా-
భాగు లెఱుగుదురు నిను ప్రణుతించు విధము
ఆగమోక్త ప్రకారాభిగమ్యులు మహా-
యోగులెఱుగుదు నీవుండేటి వునికి ॥ఇతరులకు॥





పరమ భాగవత పదపద్మసేవానిజా-
భరణు లెఱుగుదురు నీ పలికేటి పలుకు
పరగు నిత్యానంద పరిపూర్ణ మానస-
స్థిరులెఱుగుదురు నిను తిరువేంకటేశ ॥ఇతరులకు॥

**భావామృతం :**

ఓ ఇందిరా మనో వల్లభా! ఇతరులకు నిన్ను తెలిసికొనుట సాధ్యమయ్యే పనియేనా? అన్ని వేళలయందు నిజం చెప్పటమే దీక్షగా గల సత్యవాక్పరిపాలకులు, సంపూర్ణముగా (సొంతం) మోహ విరహితులు (వ్యామోహమును విడనాడిన వారు) మాత్రమే నిన్ను యెఱుగుటకు అర్హులు. (మొదట్లోనే దెబ్బతిన్నాం... ప్రభూ!).

నారీ కటాక్ష పటునారాచ భయరహిత శూరులు (వనితల వాలు చూపులనెడి) బాణములు గుచ్చుకొంటాయనే భయములేని వారు) చూచే చూపులకే నీ చూపు దక్కుతుంది. ఘోర సంసార సంకుల పరిచ్ఛేదులగు ధీరులు (దారుణమైన సంసారమనెడి సంకెళ్లను తెంపుకొనగలిగిన ధైర్యవంతులు) అయితేనే నీ దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించగలరు. (మామూలు కళ్లతో కాదు మనోనేత్రంతో).

రాగభోగవిదూర రంజితాత్ములు మహాభాగులు (అనురాగమునకు, సుఖలాలసకు దూరముగా నుండి పరమాత్మయందే సంతోసుఖమును పొందగలిగే మహద్భాగ్యాన్ని దక్కించుకొన్నటువంటి మహానుభావులు) మాత్రమే నిన్ను కీర్తించు పద్ధతి నెఱుగ గలరు. ఆగమోక్త ప్రకారాభిగమ్యులు (వేదములలో నేర్పబడిన ప్రకారముగా త్రికరణ శుద్ధిగా నిన్ను ఆశ్రయించిన వారు) మాత్రమే నీవుండే వునికి నెరుగగలరు.

పరమ భాగవత పదపద్మ సేవా నిజాభరణులు (గొప్ప భగవద్భక్తుల పాదపంకజముల సేవయే తమకు ఆభరణముగా గల ధన్యులు) మాత్రమే నీ మాటలు వినగలుగుతారు. ఏదో బ్రతికేస్తున్నాం అనునట్లు జీవించే వారికి నీమాట వినపడదు. ఓ తిరుమలగిరి రాయా! శ్రీవేంకటేశ్వరా! నిత్యానంద పరిపూర్ణ మానస స్థిరులు (శాశ్వతమైన ఆనందము చిత్తము నందంతా నింపుకొన్న స్థిర చిత్తులు) మాత్రమే నిన్నెఱుగ గలరు.

**3-41**

## మున్నుడి

శ్రీపతియైన శ్రీహరియే జీవులందరికీ రక్షకుడు. అతడే మనందరికీ నాథుడైయుండగా ఇక భయపడ వలసిన చోటెక్కడవుంటుంది? అని నిబ్బరంగా నొక్కి వక్కాణిస్తున్నారు అన్నమాచార్యులవారు. భక్తి జాలువారే ఈ కీర్తన నర్థం చేసికొనుట సులభమే. కాని చెవులకు అమృత వర్షంలా అనిపించే ఈ కీర్తనను వదలటం ఇష్టంలేక యెన్నుకొన్నాను. నరహరి కరుణే నమ్మినవారికి 'పరదున' నిక భయపడు, చోటేది? అని ప్రశ్నిస్తున్నారు. 'పరదు' అనే మాట 'పఱద' అనే మాటకు రూపాంతరం. 'వరద' అని దానికర్థం. వరదలో  కూడ భయమేలేదట.

**కం॥ అతడే రక్షకుడందరి**
**కతడే పతి, మరిక భయములగు చోటేదీ?**
**హితవైన మాట జెప్పెను**
**అతి సులువుగ అన్నమయ్య అద్భుత గీతిన్**

**రాగం : సుందర రంజని**

అతడే రక్షకుడందరి కతడే
పతియుండగ భయపడు చోటేది ॥అతడే॥

అనంతకరము లనంతాయుధము
లనంతుడు ధరించెనలరగను
కనుగొని శరణాగతులకు మనకును
పనివడి యిక భయపడ చోటేది ॥అతడే॥

ధరణి నభయ హస్తముతో నెప్పుడు
హరి రక్షకుడై యలరగను
నరహరి కరుణే నమ్మిన వారికి
పరదున నిక భయపడు చోటేది ॥అతడే॥





శ్రీవేంకటమున జీవులగాచుచు
నావల నీవల నలరగను
దైవ శిఖామణి దాపగు మాకును
భావింపగ భయపడ చోటేది ॥అతడే॥

**భావామృతం :**

ఓ జీవులారా! అందరికీ రక్షకుడు శ్రీమన్నారాయణుడైన అతడే. ఆయనే మనందరినీ భర్త వలె రక్షిస్తుండగా ఇంకా భయపడవలసిన చోటేముంది (అవసరం ఏముంది) చెప్పండి.

ఆ మహానుభావుని హస్తములు అనంతమైనవి. వాటన్నింటిలో లెక్కకు మిక్కుటమైన ఆయుధములను ఆయన ధరించియున్నాడు. అనంతుడని పేరుపొందిన ఆ స్వామి ఆ విధంగా విరాజిల్లుతుండగా ఆయనను కనుగొన్న మనబోటి శరణార్థులకు ఇంకా భయపడవలసిన అవసరం ఏమున్నది? భయపడే చోటేముంది?

ఆ శ్రీనివాసుని అభయహస్తమును చూశారా? ఆ విధంగా శ్రీహరి స్వయంగా 'నేను రక్షిస్తానని' రక్షకుడై యుండగా ఆ నరహరి యొక్క కరుణను నమ్మినవారికి వరదలలో (పరదున) కొట్టుకుపోతున్నా ఏమాత్రం భయపడవలసిన పనిలేదు. ఆయన భక్తుల్ని ఆయనే రక్షించుకొంటాడు (నీవే తప్ప ఇతఃపరంబెరుగ, అను చాలు).

శ్రీవేంకటగిరిపై నెలకొని ఆవైపునుండి (ఆవల) సర్వజీవులను ఆ శ్రీవేంకటేశ్వరుడు రక్షిస్తూ శోభిల్లుతుండగా దేవాదిదేవుడుయైన ఆ స్వామి దాసులమైన మాకు భావనలో కూడా భయమునకు తావులేదు కదా! లేదు లేదు లేదు – ముమ్మాటికీ లేదు.

**3-42**

## మున్నుడి

సమాజంలో మనకి కనిపిస్తున్న అనేకానేక నీతి శతకాలకు, చాటువులకు అన్నమాచార్యులవారి కీర్తనలు మాతృకలేమో అనిపిస్తుంటుంది నాకు.పాలు పోసి పెంచినా వేప గుణమేల మాను? వంటి సామెతలకు పుట్టిల్లు అన్నమయ్య వైరాగ్యతత్త్వ బోధనా కీర్తనలేనేమో. కొన్ని అర్థమైనట్లున్నా వివరించలేము. ఈ కీర్తనలో "వేరులేని మహిమల వేంకట విభుని కృప ఘోరమైన ఆసమేలు కోరసాకీనా?" అంటే అటువంటిది మరొకటి లేని మహిమలు గల స్వామి కృపకై విపరీతంగా ఆశపడుట మంచిది. దానికెప్పుడు కొఱత కలుగదు" అని భావం. అదండీ సంగతి....

**ఉ॥ భారపు వేపమానునకు పాలను వోయుచు పెంచినన్ సరే**
**తీరని చేదు కాక యది తీయగనుండుట సాధ్యమౌనె?బల్**
**కూరిమి తేలుదెచ్చి మనకోకను జుట్టిన కుట్ట కుండునా?**
**మీరిన జ్ఞానబోధనము మేలుగ అన్నయ చేసె శ్రీపతీ!**

**రాగం : దేవగాంధారి**

భారమైన వేపమాను - పాలువోసి పెంచినాను
తీరని చేదేకాక- తియ్యనుండీనా ॥భారమైన॥

పాయదీసి కుక్కతోక-బద్దలువెట్టి బిగిసి
చాయకెంత గట్టినాను -చక్కనుండీనా
కాయపు వికార మిది - కలకాలము జెప్పినా
పోయిన పోకలేకాక -బుద్ధి వినీనా ॥భారమైన॥

ముంచి ముంచి నీటిలోన - మూలనాన బెట్టుకొన్నా
మించిన గొడ్డలి నేడు - మెత్తనయ్యీనా
పంచమహాపాతకాల - బారిబడ్డ చిత్తమిది
దంచి దంచి చెప్పినాను - తాకి వంగీనా ॥భారమైన॥





కూరిమితో దేలు దెచ్చి - కోకలోన బెట్టుకొన్నా
సారె సారె గుట్టు గాక - చక్కనుండీనా
వేరులేని మహిమల - వేంకట విభుని కృప
ఘోరమైన ఆసమేలు - కొరసోకీనా ॥భారమైన॥

**భావామృతం :**

విపరీతంగా పెరిగిన వేపచెట్టుకు చేదు సహజంగా వుండే నైజం (గుణము). దానికి పాలుపోసి పెంచినా అది చేదు స్వభావం మార్చుకొంటుందా? విపరీతమైన చేదుగా వుండక తియ్యగా వుంటుందా?

పాయదీసి (తిన్నగా జేసి) ఒక వెదురు బద్దకు గట్టిగా బిగించి కట్టి సరియైన మార్గంలో పెట్టినా కుక్కతోక అట్లా వుంటుందా? దాని వంకర స్వభావం పోతుందా? ఈ మానవదేహానికి చెడుదారిలో పోవటం స్వభావం. దీనికెంత మంచి చెప్పినా కాయపు వికారం, కలకాలం (జీవితాంతం) చెప్పినా, పోయిన పోకలే (దానిష్టం వచ్చినట్లు పోవటమే) కాని బుద్ధి చెబితే వింటుందా?

ఒక గొడ్డలిని తీసికొనివచ్చి, మించిన పదునున్న దానిని నీటిలో ముంచి ముంచి (ఎక్కువగా ముంచి) యొకమూల నానబెట్టినా అది మెత్తనవుతుందా? నేడు దాని తీవ్ర స్వభావం పోతుందా? పంచమహాపాతకాలు చేయటం అలవాటయి, వాని పాలబడ్డ మనస్సు ఇది. దీన్ని దంచి దంచి తన్ని బుద్ధి చెప్పినా అది మంచిదారికి రావటం లేదు. (బ్రహ్మహత్య, సురాపానము, బంగారం దొంగతనం, గురుపత్నీ అక్రమ సంబంధం, పై నాలుగు దుర్గుణములు కలవారితో స్నేహము - ఈ అయిదింటిని పంచ మహాపాతకములంటారు.

ప్రేమతో యొక తేలును తెచ్చిమన ఒడిలో పెట్టుకొనుటకు ఒక గుడ్డలో భద్రంగా చుట్టిపెట్టినా అది మాటి మాటికీ కుట్టి బాధపెట్టకుండా వుంటుందా? శ్రీవేంకటేశ్వరుని మహిమలకు సాటియైనవి ఇక వుండనే వుండవు. ఆ స్వామి కరుణ కోసం విపరీతంగా ఆశపడుట మేలైన మార్గం దానికి కొఱతవుండనే వుండదు.

**3-43**

## మున్నుడి

ఏ కోవెలలో ఏ దేవతామూర్తిని చూస్తే ఆ మూర్తిపై కీర్తన చెప్పేవారు అన్నమాచార్యులవారు. ఆయనే శ్రీవేంకటేశ్వరునిగా భావించేవారు. నిజానికి 'ఏకోనారాయణా' అనేకదా! పెద్దల భావన. ఆంజనేయుని దర్శించినను ఆయన శ్రీవేంకటేశుని బంటు అని భావించి కీర్తించారు. శ్రీరామచంద్రుని మీద చెప్పిన ఈ కీర్తనలో కుశలవుల ప్రసక్తి రావటం నన్నాకర్షించింది. పురాణాలను అవపోసన పట్టిన అన్నమాచార్యులు ఒక చిన్న కీర్తనతో మనకు రామాయణ గానం అందించే పుణ్యం సంప్రాప్తింప చేస్తున్నారంటే... ఇంతకంటె కోరవలసిన దేముంది?

**ఆ.వె॥ ఈతడే రఘుపతి ఏకాంగ వీరుడు**
**ఇతని చేత లెన్ని కతలు గలవు**
**వేంకటేశుడగుచు పెక్కువరాలిచ్చె**
**తెలిపెనన్నమయ్య సలలితముగ**

**రాగం : నాట**

ఈతడే రఘురాముడీత దేకాంగ వీరుడు
యీతడు చేసిన చేతలెన్నియైనా గలవు ॥ఈతడే॥

ఖరదూషణాదులను ఖండతుండములు సేసె
అరుదుగా వాలినొక్క యమ్మునసేనె
సరవి కొండల చేత సముద్రము బంధించె
ఇరవై విభీషణునికిచ్చె లంకారాజ్యము ॥ఈతడె॥

కూడపెట్టె వానరుల, కుంభకర్ణాది దైత్యుల
తోడనే రావణుజంపె దురము గెల్చె
వేడుకతో సీతాదేవి గూడెను పుష్పకమెక్కె
యీడు జోడై సింహాసనమేలె నయోధ్యలోన ॥ఈతడే॥





పుడమి యంతయు గాచె పొందుగా దనంతలేసి
కొడుకులగాంచెను కుశలవుల
యెడయక శ్రీవేంకటేశుడై వరములిచ్చె
అడరి తారక బ్రహ్మమై ఇదె వెలసె. ॥ఈతడే॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఇదిగో ఈ మహానుభావుడే మన రఘురాముడు. ఈయన అసహాయశూరుడు. ఈయన చేసిన ఘనకార్యము లెన్నయినా వున్నాయి. (వాటిని కీర్తిస్తాను... వినండి).

ఆనాడు దండకారణ్యంలో ఖరదూషణాది రాక్షసులను పదివేలమందిని ఖండతుండములు (ముక్కలు ముక్కలుగ) చేశాడు. రావణాసురునే ముప్పుతిప్పలు పెట్టిన వాలిని ఒకే ఒక్క బాణంతో సంహరించాడు. సరవి (క్రమముగా లేక తదనంతరం) కొండరాళ్లతో సముద్రమున సేతు బంధనం చేశాడు. ఇరవై (ఇరవు+అయి=పాదుకొని) విభీషణునికి లంకారాజ్యమునకు ప్రభువును చేశాడు.

ఒక్కవానరాన్నే చెప్పిన మాట వినేట్లు చేయటం కష్టం. అటువంటిది వానర సైన్యాన్నే నడిపించి కుంభకర్ణాది దైత్యులతో సహా రావణాసురుని సంహరించి దురము (యుద్ధము) గెల్చాడు. సంతోషముతో సీతాదేవిని స్వీకరించాడు. ఈడూ జోడైన ఆమెతో సింహాసన మలంకరించి అయోధ్యానగరాన్ని పరిపాలించాడు.

ఆ తరువాత భూమండలాన్నంతా అశ్వమేధ యాగం చేసి సుభిక్షంగా, పొందగా కాచె (అనుకూలముగా భూమిని పరిపాలించాడు తనంతలేసి (తనతో సమానమైన ప్రతాపము కల) కుశలవులు అనే కొడుకులను గాంచినాడు. ఇదంతా ఆ త్రేతాయుగంలో జరిగినా... నేడు ఈ కలియుగంలో, యెడయక (విడువక) తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడై తారకబ్రహ్మ (మోక్షప్రాప్తినిచ్చే పరబ్రహ్మవలె వెలసినాడు)

**3-44**

## మున్నుడి

చిన తిరుమలాచార్యులవారు అన్నమయ్యబాటలో నడుస్తూ సర్వదైవమూర్తులు శ్రీవేంకటేశ్వరుడే అనే భావనతో యెన్నో కీర్తనలు యెందరెందరో దేవతా మూర్తులపై చెప్పి తరించారు. కడప జిల్లా కోవిలకుంట్లలో వెలసిన పాండురంగ విఠలునిపై ఆయన చెప్పిన సరస శృంగార కీర్తన ఇది. "స్వామీ! నీపై మనసుపడి ఏదో గుట్టుగా కొసరి కొసరి నిన్ను చూచిన మాట నిజమే... కానీ అంతమాత్రాన నాగుట్టు రట్టు చేసి నవ్వులొలకబోసి నన్ను నవ్వుల పాలు చేయటం భావ్యమేనా?" అన్నమయ్య తాదాత్మ్యత వీరిలోనూ ప్రతిఫలిస్తోంది...

**తే॥ రచ్చకెక్కితివిగ పండ రంగి విఠల!**
**పచ్చిదేరేవు యింతలో పాండురంగి**
**పాడి చిన్న తిరుమలయ్య పరవశించి**
**కొలిచె కోవిలకుంట్ల విఠలుని తాను.**

**రాగం : దేశ్**

రచ్చకెక్కితివి పండరంగి విఠలా
పచ్చి దేరేవింతలోనె పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

గుట్టుగల దొరవని కొసరి చూచినంతనే
రట్టుగా నవ్వేవు పండరంగి విఠలా
మట్టుమీరి తమకపు మాటలనె నీవలపు
బట్టబయలు సేసేవు పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

సాగిన సబలలోన సన్న సేసినంతలోనె
రాగిదేవించేవు పండెరంగి విఠలా
వేగిరపు చేతలనె విరివి నీ మోహ మెల్ల
బాగుగా వెళ్లవేసేవు పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥





తతి నీ వున్న చోటికి దగ్గర వచ్చినంతనె
రతి కూడితివి పండరంగి విఠలా
గతియైన శ్రీవేంకటనాథ యేలితివి
పతివై కోవిలకుంట్ల పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

**భావామృతం :**

ఓ పాండురంగ విఠలా! వీధినబడి గోల చేస్తావేమయ్యా! (రచ్చకెక్కావు), కాస్తకూడ బిడియం లేకుండా పచ్చిదేరేవు (మరుగులేకుండా బట్టబయలు చేసేస్తున్నావు (నన్ను...) ఇంతలోనే అలా చేస్తే ఎలా స్వామీ!

నీవు నా గుట్టు కాపాడే స్వామివని నిన్ను కొసరి కొసరి (మరీ... మరీ) చూచిన మాటనిజమే. అందుకని రట్టుగా (నిందలపాలయేట్లుగా) నవ్వుతావా? హద్దుమీరిన మైమరపు మాటలాడి నీకు నామీద నున్న ప్రేమ బట్టబయలు చేసేస్తున్నావు. నీకిది తగునా విఠలా?

విఠలా ఒకపక్క సభ జరుగుతుంటే సన్నసేసేవు(సైగలు చేస్తావు) అంతలోనే రాగి దేలించేవు (రంజింప జేస్తావు) నీవేగిరంపు (తొందరపాటు) చేతలతో నీకు నాపైగల మోహాన్ని బాగా అందరికీ తెలిసేట్లు వెళ్లగక్కుతావు. ఓ పాండురంగా! ఇది నీకు మర్యాదా? (ఎందుకలా నలుగురిలో గుట్టురట్టు చేస్తావు?)

ఓ విఠలా! సమయం చూసికొని నేను నీవున్న చోటికి రాగానే వలపులలో ముంచెత్తుతావు (రతికెక్కితివి) అక్కడ తిరుమలలో వున్న వేంకటనాధుడే నీవై ఈనాడు కోవెల కుంట్లలోని పాండురంగ విఠలా! నీవు మాకు భర్తవై మమ్ము సదా కటాక్షించు ప్రభూ!

## 4-45

## మున్నుడి

తత్త్వబోధ చేస్తున్న అన్నమాచార్యుల వారి కీర్తనలలో ఇది ఒక మణిపూస. విభక్తులతో ఏదన్నా ఒక విషయం చెబితే సరిఅయిన విభక్తి వాడకపోతే భావమే మారిపోతుంది. మనం అన్వయించుకొనే విధానాన్ని బట్టి అర్థమే మారిపోతుంది. ఉదాహరణకు 'శ్రీహరి ధ్యాస' అంటే శ్రీహరి యొక్క ధ్యాస' కావచ్చు, 'శ్రీహరి కొఱకు ధ్యాస' కావచ్చు. సందర్భాన్ని బట్టి అర్థం చెప్పుకోవాలి. అటువంటి తీవ్ర ప్రయత్నం చేస్తేగాని ఇంత తేలికగా కనిపించే ఈ కీర్తన నా చిన్ని బుఱ్ఱకు అర్థంకాలేదు. అదీ-పూర్తిగా కాలేదేమో కూడా...

**కం॥ ఎన్నడు విజ్ఞానం బది**
**యెన్నగ కలిగేను వేంకటేశా! నా ఈ**
**విన్నపము నాలకింపుము**
**అన్నాడా అన్నమయ్య అనుపమ గీతిన్**

**రాగం: శివరంజని**

ఎన్నడు విజ్ఞాన మిక నాకు
విన్నపమిదె శ్రీవేంకటనాథా ॥ఎన్నడు॥

పాసిన పాయవు బంధములు
ఆస దేహమున్నన్నాళ్లు
కోసిన తొలగవు కోరికలు
గాసిలి చిత్తము కలిగినన్నాళ్ళు ॥ఎన్నడు॥

కొచ్చిన గొరయవు కోపములు
గచ్చుల గుణములు గలనాళ్లు
తచ్చి(చ్చు)న తలగవు తహతహలు
రచ్చల విషయపు రతులన్నాళ్లు ॥ఎక్కడ॥





వొకటి కొకటికిని వొడబడవు
అకట శ్రీవేంకటాధిపుడ
సకలము నీవే శరణంటే యిక
వికటము లణగెను వేడుకనాళ్లు ॥ఎక్కడ॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు ఇక ఎన్నటికి విజ్ఞానము (తత్త్వమును గురించిన జ్ఞానము) కలుగుతుంది ప్రభూ! ఇది నీ కృప వల్లగాక ఇంకో విధంగా కలుగదు. అందుకని ఇది నా మనవి. నాకు ఆ విజ్ఞాన ప్రాప్తినందించుము స్వామీ!

మేము పెంచుకొన్న ఈ బంధము లెటువంటివంటే... అవి పాసిన పాయవు. (వదలించు కొందామన్నా వదలటంలేదు). ఈ మానవ దేహం వున్నంతకాలం ఆశ చావదు. కోసి తొలగించు కోవాలనుకొన్నా కోర్కెలు తీరటంలేదు. వీటన్నిటివల్లా నా చిత్తము (మనస్సు) నేను కలిగినన్నాళ్ళూ (వున్నంతకాలమూ) గాసిలి(బాధ) పడుతూనే వుంటుంది. (నాకేదిదారి?)

ప్రభూ! గచ్చుల గుణములు (పైపై పూతల-వంటి నటనలు చూపించే గుణములు), కొచ్చిన గొరయవు (తగ్గించు కొందామనుకొనినా తగ్గుటలేదు). అందువల్ల నాలో సహజంగా వుండే క్రోధం 'నన్ను వదలుటలేదు. (శాంతం నటించినా కోపంతో మనస్సు కుతకుత లాడుతూనే వున్నది). విషయపు రతులు (విషయవాంఛలు) అన్నాళ్ళూ (అన్ని రోజులూ) తచ్చిన (ఎంత ప్రయత్నించినా) తగలవు (తొలగవు). అవి రచ్చలవుతూనే తహతహలాడిస్తాయి. (ఇది ఎంత చిత్రహింస?)

ఓ వేంకటనాథా! పైనజెప్పిన విరుద్ధ భావములన్నియును ఒకదానితో ఒకటి ఒడబడక (సమాధానపడక) వున్నాయి, అకట! (అయ్యో నేనేం చేయగలను?) ఒక్కటే మార్గం కనిపిస్తోంది. ఇక సకలము నీవేనని శరణంటే వికటములు (దుర్గుణములు) అణగేను (తగ్గిపోతాయి). వేడుకనాళ్లు (ఆనందకరమైన సమయం) నిత్యమూ వుంటుంది.

**3-46**

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవంలో అన్నమయ్య పాడిన అజరామరమైన సంకీర్తన ఇది. ఎన్నిసార్లు పాడినా తనివిదీరని ఆనందహేల. ముచ్చటయిన మూడు పెండ్లిండ్లను ఆవిష్కరిస్తున్నారు ఆచార్యులవారు. నరకాసుల వధ తరువాత పదియారు వేలమంది అతని బందీలైన రాచకన్నెలను కృష్ణయ్య పెండ్లాడాడు, ఒకేసారి. శిశుపాలుని ఓడించి రుక్మిణిని పెండ్లియాడాడు. దేవదానవుల సాగరమథనంలో జన్మించిన శ్రీలక్ష్మిని పెండ్లాడినాడు. అటువంటి శ్రీవేంకటగిరి శ్రీనిధిని వసంతరాగంలో కీర్తిస్తున్నారు.

**మత్తకోకిల॥ వైభవంబున లక్ష్మి గూడిన పావనుండగు మూర్తినిన్**
**శోభలీనెడి వేంకటేశుని సూర్యకోటి సమప్రభున్**
**శోభలీనెడి మూడు గాథల సూరి అన్నయ గొల్చెరా**
**ఈ భవాబ్ధిని దాట జెప్పెను ఇంపు సొంపగు బాటనే**

**రాగం : వసంతం**

శోభనమే శోభనమే
వైభవముల పావన మూర్తికి ॥శోభనమే॥

అరుదుగ మును నరకాసురుడు
సిరులతో చెరలు దెచ్చిన సతుల
పరువపు వయసుల పదాలు వేలను
సొరది పెండ్లాడిన సుముఖునికి ॥శోభనమే॥

చెందిన వేడుక శిశుపాలుడు
అంది పెండ్లాడగ నవగళించి
విందువలెనె తా విచ్చేసి రుకుమిణి
సందడి పెండ్లాడిన సరసునికి ॥శోభనమే॥





దేవదానవులు ధీరతను
దావతి పడి వార్ధి దరువగను
శ్రీవనితామణి చెలగి పెండ్లాడిన
శ్రీవేంకటగిరి శ్రీనిధికి ॥శోభనమే॥

**భావామృతం :**

వైభవము విలసిల్లు చుండగా పుణ్యమూర్తియైన ఈ శ్రీవేంకటేశ్వరునికి అంతయూ మంగళప్రదమే. అన్నియూ శుభములే.

పూర్వము నరకాసురుడు అరుదైన విధముగా అనేక సంపదలతో సహా పదియారు వేలమంది రాచకన్నెలను చెఱబట్టి తెచ్చియుంచగా సత్యభామా సహితుడై శ్రీకృష్ణమూర్తి అవతారమున స్వామి వెళ్లి ఆ దనుజుని సంహరించి వారిని విడిపించెను. ఆ తరువాత వారి అభ్యర్థన మేరకు వారందరినీ పెండ్లాడుటకు సుముఖుడై ఒకే క్రమములో ఆ జవ్వనులను వరుసగా పరిణయమాడెను. అట్టి శుభప్రదుడైన మూర్తికి శుభమగుగాక!

(పరిణయమాడుటకు) వేడుకజెందిన శిశుపాలుడు పెండ్లాడుటకు ఆయత్తమవగా, తానుకూడా విందుకు వచ్చినవానివలె విచ్చేసి పెండ్లికూతురు రుక్మిణిని ఎత్తుకొనిపోయి సందడిగా పెండ్లాడిన సరసపు శ్రీకృష్ణమూర్తికి మంగళమగు గాక!

దేవతలు దైత్యులు ధైర్యస్థులై పోటీపడి సముద్రమును (క్షీరసాగరమును) మథించగా అనేకమైన దివ్య వస్తువులతోపాటు శ్రీలక్ష్మి కూడా వుద్భవించింది. ఆమె శ్రీమన్నారాయణుని వరించగా ఆయన ఆ స్వయంవరంలో నెగ్గి సాగరపుత్రియైన శ్రీవనితను పెండ్లాడినాడు. ఆయనే శ్రీవేంకటగిరిపై శ్రీనివాసుడై వెలసియున్నాడు. ఆ శ్రీనిధికి శుభములు కలుగు గాక!

**3-47**

## మున్నుడి

హనుమంతుని ప్రతాపాన్ని అద్భుతంగా ఈ కీర్తనలో ఆవిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇదే బాణిలో యెన్ని కీర్తనలు చెప్పినా దేవి మాధుర్యం దానిదే. హనుమంతుడు తనతోకను బ్రహ్మాండం దాక నిక్కించి, దిక్కులనిండా ఏమాత్రం సందులేకుండా తన మేను పెంచాడట. ఒక్క క్షణం వామనుని త్రివిక్రమ రూపం కనులముందు దర్శింపచేస్తోంది అన్నమయ్య వర్ణన. ఆంజనేయుడు శ్రీవేంకటేశ్వరుని 'హితవరిబంటు' అయ్యాడట అంటే ఎప్పుడూ యజమాని మేలుకోరే బంటుట. ఏమి భావన!!

**చం॥ అదె కనులార గాంచుడటు అంజన సూనుని పెద్ద కాయమున్**
**గుదిగొని దేవతల్ కొలిచి కోరికతో కొనియుడు ధీరునిన్**
**యెద పులకించు కీర్తనము యేర్పడ జెప్పెను అన్నమార్యుడున్**
**ఇది గతజన్మ భాగ్యమురా యిత్తరి మున్నుడి జెప్పితిన్ హరీ!**

**రాగం : భౌళి**

అదె చూడరయ్య పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు కొనియాడేరయ్య ॥అదె॥

ఉదయాస్త శైలములు ఒక జంగగా చాచె
అదివో ధృవమండల మందె శిరసు
చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
ఎదుట ఈతని మహిమ యేమని చెప్పేమయ్య ॥అదె॥

దండిగా బ్రహ్మాండము దాక తోక మీది కెత్తె
మెండగు దిక్కుల నిండా మేను వెంచెను
గుండు గూడ రాకాసుల కొట్టుగ చేతులు చాచె
అండ ఈతని ప్రతాప మరుదరుదయ్య ॥అదె॥





దిక్కులు పిక్కటిల్లగ దేహరోమములు పెంచె
పక్కన లోకములకు ప్రాణమై నిల్చె
నిక్కడ శ్రీవేంకటేశు హితవరి బంటాయ
మిక్కిలి ఈతని లావు మేలు మేలయ్య ॥అదె॥

**భావామృతం :**

అదిగో అటు చూడండయ్యా! పెద్ద హనుమంతుడు కనిపిస్తున్నాడు కదా! ఆ మహానుభావుని దేవతలంతా గుదికొని (అతిశయించునట్లుగా) ప్రస్తుతించి తరిస్తారు.

ఒక్క అంగతో తూర్పున ఉదయాచలమును పశ్చిమమున అస్తాచలమును ఆక్రమించి నిలుచుని యున్నాడతడు. అదిగో అతని తల ధృవమండలమును అంటుచున్నది. ఆ విధంగా నిలుచుని ఆ హనుమంతుడు తన తలను సూర్యుడు ఎటుంటే అటు తిప్పుతూ వేదములన్నీ ఆ సూర్యభగవానుని ద్వారా ఏకసంత గ్రాహివలె నేర్చుకున్నాడు. ఈతని మహిమనేమని చెప్పగలము?

ఈ హనుమంతు దండిగా (గొప్పగా) తన తోకను బ్రహ్మాండముదాకా పైకెత్తి దిక్కులన్నీ నిండిపోవునట్లుగా తన శరీరమును వ్యాపింప చేశాడు. గుండుగూడ (చుట్టుముట్టిన) రాక్షసులను చావబాదుటకు చేతులు చాచి యున్నాడు. అండయైన ఈ మహానుభావుని ప్రతాపము అరుదరుదు (చాలా అరుదు).

ఆ హనుమంతుడు దిక్కులు పిక్కటిల్లునట్లు (దిక్కులన్నీ నిండిపోవునట్లు) తన దేహముపైగల వెంట్రుకలను పెంచాడు. ఆ విధంగా లోకములన్నింటికీ ప్రాణమై నిలిచాడు. ఇక్కడ వున్న ఈ రామబంటు సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుని మేలుకోరే బంటువలె వున్నాడు. ఇతని గొప్ప గొప్ప వుపకారములు ఎంతో మంచిని చేసినవి.

## 3-48

## మున్నుడి

సత్యము, నిత్యము అవనట్టి ఏ సుఖమైనా అసలు సుఖమే కాదంటున్నారు అన్నమాచార్యులవారు. చాలు ప్రభూ! నీ దాస్యమే నాకు చాలు. అదే నిత్య సుఖప్రదం. పొల్లు (లోపం) లేని నీ భక్తియే ఈ పుట్టుకకు సుఖము. మాచనవోలు లోని చెన్నకేశవునిపై ఈ కీర్తన చెబుతున్నారు. నిజంగా నా శ్రమ ఫలించి జన్మధన్యమయింది శ్రీవేంకటేశ్వరా!

**సీ॥ నీ దాస్యమే కదా! నిత్య సుఖప్రదము**
**సత్యమవని సుఖం చాలుస్వామి!**
**చక్కని నీరూపు సరికన్నుల సుఖము**
**వీనుల సుఖము నీపేరు దేవ!**
**తులసి నీపదముల నాలుక సుఖమయ్య!**
**మనసుకు సుఖము నీమంచి ధ్యాస**
**నీపాద పద్మాల నెగడు సువాసన**
**యూర్పు సుఖమునంత కూర్పు స్వామి!**

**ఆ.వె॥ పుటక కెల్ల సుఖము పొల్లులేనిది భక్తి**
**చెన్నుడైన దేవ! శ్రీనివాస!**
**అన్నమయ్య పాట అత్యద్భుతము ప్రభూ!**
**జన్మధన్యమయ్యె శ్రమ ఫలించె**

**రాగం : లలిత**

నిత్య సుఖానంత మిదె నీ దాస్యము
సత్యము లేని సుఖాలు చాలు చాలునయ్యా ॥నిత్య॥

కన్నుచూపుల సుఖము కడు నీ చక్కని రూపె
యెన్నగ వీనుల సుఖమిదె నీపేరు
పన్ని నాలుక సుఖము పాదపు నీ తులసి
వున్న సుఖములు తెరువొడబడునయ్యా ॥నిత్య॥





తనువుతోడి సుఖము తగు నీకైంకర్యము
మనసులో సుఖము నీమంచి ధ్యానము
పనివి యూర్పు సుఖము పాదపద్మము వాసన
యెనయని పెర సుఖమేమి సేసేనయ్యా ॥నిత్య॥

పుట్టుగు కెల్ల సుఖము పొల్లులేని
నీభక్తితొట్టి కాళ్ళ సుఖము పాతురలాడుట
జట్టి శ్రీవేంకటేశ మాచనవోలి చెన్నుడవై
పొట్టు(త్తు)కొని మమ్మేల(లి)తివోహో మేలయ్యా ॥నిత్య॥

**భావామృతం :**

ఓ ప్రభూ! ఇదే నీ దాస్యమొక్కటియే నిత్య సుఖానందము నొసగును. ఈ ఐహిక సుఖములన్నియు సత్యములేనివి. ఇవి ఇక చాలు చాలు తండ్రీ! (అసలు సుఖమేదో నేను తెలుసుకొన్నాను).

అధికముగా సుందరమైన నీ చక్కని రూపము కన్నులకు సుఖము. నీ నామ సంకీర్తనం వీనులకు (చెవులకు) సుఖము. నీ పాదపద్మములనలంకరించు తులసిదళములు మా నాలుకకు యుక్తమైన సుఖము. ఇవిగాక ఈ అవయవముల వల్ల కలిగే ఇంకే సుఖములైనా మాకు నీ దారిని చూపించలేవు స్వామీ!

మాకు నీవు ఇచ్చిన ఈ శరీరంతో నిజమైన సుఖం. అది నీకు కైంకర్యమైనప్పుడే కలుగుతుంది. అట్లే నీపై మంచి ధ్యాస కుదిరినప్పుడు మాత్రమే, మా మనస్సుకు సుఖం దొరుకుతుంది. మా ఊపిరికి సుఖము నీ పాదపద్మముల సువాసన అన్యములైన సుఖములు ఆ నిజమైన సుఖముతో (నీ ధ్యాస సుఖంతో) సరిపోల్చలేని సుఖములే తండ్రీ!

ఓ ప్రభూ! పొల్లలేని (ఏలోపమూలేని) నీ భక్తి ఈ జన్మకే సుఖము. తొట్టికాళ్లు (కదలునట్టి కాళ్లు) వలన సుఖమేదన్నా వుందంటే నీతో నీకొఱకు తిరుగుటయే సుమా! జట్టి శ్రీవేంకటేశా! (విలువైన వేంకటేశ్వరా!) నేడు మాచనవోలులో వెలసిన చెన్నకేశవుని రూపమున, పొట్టుకొని (పొత్తుకొని అంటే... జతకూడి) మమ్ము పరిపాలించుచుంటివి. ఓహో! మేలు మేలు తండ్రీ! చరితార్థులమైతిమి.

## 3-49

### మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని వరద హస్తాన్ని అభయ హస్తాన్నీ చూచి పులకించిన అన్నమాచార్యులవారు ఆ చేయి మహాత్యాన్ని కీర్తిస్తున్నారు. అది సామాన్యమైన చేయికాదు అని శ్రీహరి దశావతారములలో ఆ చేయి చేసిన ఘన కార్యములను ఏకరువు పెడుతున్నారు. పురాణ పాండిత్యం వున్నవారికి ఈ కీర్తన అర్థమవుతుంది కాని ప్రతిపదార్థం చెప్పమంటే మాత్రం 'బిక్కమొగం' వేయక తప్పదు. ఈ శ్రీహరి చేయి ఒకసారి దైత్యుల చక్రవర్తి బలిదగ్గరకు వెళ్లి మూడు అడుగుల నేల 'భిక్షాందేహి' అని దానమడిగింది (వామనుడు) ఒకసారి బ్రాహ్మణులకు భూమండలాన్నే దానం చేసింది (పరశురాముడు) అంటున్నారు.

**కం॥ ఇందరికి అభయమిచ్చెడి**
**కందువ బంగారు చేయిగా తను తెలిపెన్**
**విందగు అవతారంబులు**
**అందంబుగ అన్నమయ్య హరిదాల్చెననెన్**

**రాగం : మిశ్రహరికాంభోజి**

ఇందరికి నభయంబు లిచ్చుచేయి
కందువగు మంచి బంగారుచేయి ॥ఇందరికి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి కింద చేర్చు చేయి
కలికి యగు భూకాంత కౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాడి చేయి ॥ఇందరికి॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసగు చేయి
మొనసి జలనిధి యమ్ము మొనకు దెచ్చిన చేయి
ఎనయ నాగేలు ధరించు చేయి ॥ఇందరికి॥





పురసతుల మానములు పొల్ల సేసిన చేయి
తురగంబు బరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల తెలిపెడి చేయి ॥ఇందరికి॥

### భావామృతం :

ఈ శ్రీమన్నారాయణుని 'చేయి' ఇంతమందికి అభయమునొసగినది. ఇది కందువగు (సామర్థ్యంగల) మంచి బంగారము వంటి చేయి. ఈ దివ్య హస్తం చేసిన ఘనకార్యములను వివరిస్తాను వినండి.

ఈ చేయి అమూల్యమైన వేదములను వెదకి తిరిగి తీసికొచ్చిన చేయి (మత్స్యావతారము). ఇది పాలసముద్రమును చిలుకుతున్న గుబ్బలి (కొండ) కిందచేరి అది మునిగిపోకుండా కాపాడి క్షీరసాగరమథనమునకు సహకరించిన చేయి, (కూర్మావతారం). భార్య కాగోరిన భూదేవిని కౌగలించుకొనిన చేయి (వరాహావతారం). ఇది కొనలు దీరి వాడియైన గోళ్లువున్న వలనైన (ఉపాయమున్న) చేయి (నృసింహావతారం).

బలిచక్రవర్తిని దానమడిగినతనివోక చేయి, అంటే తృప్తి చెందని చేయి (వామనావతారం). ఒనరంగ (ఒప్పగునట్లు) భూదానమును చేసిన చేయి (పరశురాముడు). మొనసి (పూనుకొని) సముద్రుని అమ్ము మొనకు (బాణమును గురిచేసి దెచ్చి) తన యెదుట నిలబెట్టిన చేయి (శ్రీరామావతారము). పొందుగా నాగేలు (నాగలి) ధరించిన చేయి (హలాయుధుడైన బలరాముని అవతారము).

పురసతుల మానములు (త్రిపురాసురుల యొక్క భార్యల శీలములు) పొల్ల సేసిన (భంగపరచిన) చేయి (బుద్ధావతారము). తురగంబు బరపెడి(గుఱ్ఱముపై స్వారీ చేసిన) చేయి (కల్కి అవతారము). నేడు ఇక్కడ తిరువేంకటాచలాధీశుడై, ప్రాణులకు (జీవులకు) మోక్షంబు తెరుపు (ముక్తిమార్గము) తెలిపెడి చేయి. ఇంతకీ ఏమిటా ముక్తి మార్గం? ఇవిగో నా పాదములే... అని చూపుతున్న చేయి. అదే... నాకు... దిక్కు.

**3-50**

## మున్నుడి

తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి 'తిరుమంజనం' సేవ జరుగుతోంది. తట్టు పునుగు స్వామికి దట్టంగా అద్ది, కర్పూరధూళి చల్లి, తళతళ మెఱిసే నగలు అలంకరిస్తే వేంకటపతిని ఆయన దేవేరి అలమేల్మంగమ్మను చూడటానికి రెండు కళ్లూ చాలటం లేదు. స్వామి ముఖమున కళలన్నీ మొలకెత్తినట్లుంది. ఒక్కోసారి ఒక్కో అందం కనపడుతోంది. ఆయన ఒయ్యారాలను (అందములను) పెద తిరుమలయ్య ఖరహరప్రియ రాగంలో కీర్తిస్తున్నారు. అన్నమయ్య సంప్రదాయం సజావుగా నడిపి తండ్రికి తగ్గ తనయుడు అనిపించారు. భళి భళీ!!

**ఆ.వె॥ ఒక పరి కొక పరికి ఒయ్యారమై యొప్పె**
**మొకమునందు కళలు మొలచినట్లు**
**వెలుగులెగయ జిమ్మె వెలది, వేంకటపతి**
**పరవశించెను పెద తిరుమలయ్య.**

**రాగం : ఖరహరప్రియ**

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమున కళలెల్ల మొలచినట్లుండె ॥ఒకపరి॥

జగదేకపతిమేన చల్లిన కర్పూర ధూళి
జిగికొని నలువంక చిందగాను
మొగి చంద్రముఖి నురమున నిలిపెగాన
పొగరు వెన్నెల దిగబోసి నట్లుండె ॥ఒకపరి॥

పొరి మెఱుగు చెక్కుల పూసిన తట్టుపునుగు
కరిగి ఇరుదెసల కారగాను
కరిగమన విభుడు గనుక మోహమదము
తొరిగి సామజ సిరి దొలకినట్లుండె ॥ఒకపరి॥





మెఱయు శ్రీవేంకటేశు మేన సింగారముగాను
తఱచైన సొమ్ములు ధరియించగా
మెఱుగు బోణి అలమేలు మంగయు తాను
మెఱుపు మేఘము గూడి మెఱసినట్లుండె ॥ఒకపరి॥

**భావామృతం :**

(ఆహా!! ఎంత అద్భుతంగా వుంది ఈ జంట. ఏమి అందం!!) ఒకసారి ఒకరకమైన అందం, ఇంకొకసారి ఇంకొకరకమైన అందం... స్వామివారి ముఖమున కళలన్నీ మొలక లెత్తాయా? అనునట్లున్నది. (వర్ణనాతీతమైన వీరి సౌందర్యం గురించి యెంత చెప్పినా... తక్కువే అవుతుంది.

ఈయనెవరు? జగదీశ్వరుడు, జగదేకపతి, ఈయన దేహంపై కర్పూరం పొడి చల్లారు. దాని జిగి(కాంతి) నలుదిశలా చిందుతున్నది. ఇటుచూస్తే ఈ చంద్రముఖిని ఈయన తన హృదయంపై వుంచి నిలుపుకొన్నాడు. అందువలన పొగరు వెన్నెల (దట్టంగా కాస్తున్న వెన్నెల) దిగబోసినట్లుండె (కురిసినట్లున్నది).

ఓహో! పొరి మెఱుగు చెక్కుల (పదేపదే మెఱయుచున్న చెక్కిళ్ళు) పై పూసిన తట్టుపునుగు కరిగి ఆయన రెండు చెక్కిళ్ళు (చెంపల) పై కారుచున్నది. ఈ స్వామి సామజవరగమనుడు (మదపుటేనుగు నడక వంటి ఠీవి గల నడకగల వాడు) అమ్మవారిపై ఈ స్వామికున్న మోహము, మోహమదమువలె స్రవించుచుండుటచేత, ఈయనను సాజముతో పోల్చుట యెంతయో సమంజసముగా నున్నది. తొరిగి సామజసిరి దొలకి నట్లున్నది. (స్రవించుచున్న మదపుటేనుగు యొక్క మదజలము చెక్కులపై ఒలికినట్లున్నది).

శ్రీవేంకటేశ్వరుని శరీరంపై సింగారింపబడి తళతళ మెఱయు ఆభరణములు అనేకములు అలంకరింపబడినవి. మెఱుగు బోణి (మెఱయుచున్న శరీరముగల) ఈ అలమేల్మంగమ్మ ఈ స్వామి పక్కన వుంటే నల్లటి మేఘముల మధ్య తటిల్లత (మెఱుపు) తళుక్కుమన్నట్లున్నది. ఈ సౌందర్యం కన్నులారా చూచిన వారి జన్మ ధన్యము. అందుకు సందేహమా?

## 3-51

## మున్నుడి

నేటికాలంలో మనం వింటున్న సామెతలు, నీతివాక్యాలూ, విమర్శనాస్త్రాలు-ఇవన్నీ అన్నమాచార్యులవారి ఇటువంటి కీర్తనలనుంచే పుట్టివుంటాయని నా నమ్మకం. వారి కీర్తనలలో వాడిన భాషనేటి తరానికి అర్థం కూడా కాదేమో. ఇంతతేలికగా కనుపించే ఈ కీర్తన ప్రతిపదార్థం చెప్పమంటే మాత్రం నీళ్ళునమలకతప్పదు. “మెలుతల”,“అఱమరపులు”,మొఱగే మొయిలైపోవు, సన్నెరిగిన, “వెన్నెలమాయ”-వంటి తెలుగు మాటలకి కూడా అర్థం తెలియని దశకిమనం వచ్చేశాం.... ఇక అన్నమయ్య భావం తెలియటం తేలికా? తెలుగువాడా!

**కం॥ నాటక మీ సంసారము**
**బూటకమౌ అన్నమయ్య బోధనజేసెన్**
**పూటకు బూటకు బొల్లై**
**చేటులు కల్పించు శాంతి చెడు, శ్రీనాథా!**

**రాగం : గుండక్రియ**

నాటకమింతా-నవ్వులకే
పూటకుబూటకు-బొల్లైపోవు ॥నాటక॥

కోటివిద్యలును- గూటికొఱకె పో
చాటువ మెలగేటి- శరీరికి
తేటల నాకలి-దీరిన పిమ్మట
పాటుకుబాటే-బయలై పోవు ॥నాటక॥

మెఱసేటిదెల్లా-మెలుతల కొఱకే
చెఱల దేహముల-జీవునికి
అఱమరపుల సుఖ-మందిన పిమ్మట
మొఱగుకు మొఱగే-మొయిలై పోవు ॥నాటక॥





అన్ని చదువులును-నాతని కొఱకే
సన్నెరిగిన సు-జ్ఞానికిని
యిన్నిట శ్రీవేంక-టేశు దాసునికి
వెన్నెల మాయలు-విడివడిపోవు ॥నాటక॥

**భావామృతం :**

మానవులారా! ఈ సంసారముంది చూశారా? ఇదంతా ఒక నాటకమే. చివరికి ఇదంతా నవ్వులకే (నవ్వులపాలైపోయేదే). ఇందులో మనం చేసేదంతా ఏపూటకాపూట నిరుపయోగమైపోయేదే సుమా!

కోటివిద్యలు నేర్చినా గూటికొఱకే,(కూడుతినుటకే కదా!).చాటువ మెలగేటి శరీరికి (చాటించబడిన పాండిత్యం గల నరునికి ) ఆ విద్యలుయెందుకు ఉపయోగపడతాయి? కేవలం జీవించటానికేగాని, తత్త్వజ్ఞానమునకు నిరుపయోగమే. మన చదువులతో ఒకసారి ఆకలి తీరాక, పాటుకు బాటే బయలైపోవు (ఆ పడిన పాట్లన్నీ నిరుపయోగమైపోతాయి) మరి ఇంకాయెందుకు అటువంటిపాట్లు?

చెఱలదేహముల జీవునికి (చెరసాల వంటి దేహములో చిక్కుకొన్న జీవునికి) మెఱసేటిదెల్లా మెలుతల కొరకే (ఈ పైపై మెరుగులన్నీ కేవలం స్త్రీల కొఱకే). ఒక్కసారి అఱమరపుల సుఖం (సగం మైమరపుతో గూడిన సంభోగ సుఖం) దక్కిన పిమ్మట, మొఱగుకు మొఱగే మొయిలైపోవు (వంచనల మీద వంచనలన్నీ మబ్బులైపోతాయి) సుమా! అంటే మబ్బులెలా క్షణంలో రూపం మార్చుకొంటాయో ఆ స్త్రీ సుఖం విపరీతమైన దుఃఖమైపోతుంది. ఇదితప్పదు.

అన్ని చదువులలో గల సన్నెరిగిన (రహస్యం తెలిసినకొనిన) సుజ్ఞానికి ఆ చదువులన్నీ పరమాత్మను చేరుటకే అని తెలియును. అటువంటి శ్రీ వేంకటేశ్వరుని దాసునికి, వెన్నెలమాయలు (వెన్నెల వలె అప్పటికి మాత్రమే ఆహ్లాదం కలిగించే మాయలు ఏ మాత్రం హాని చేయలేవు సుమా!

**3-52**

## మున్నుడి

అన్నమాచార్యుల వారు గోవిందురాజస్వామిపై చెప్పిన సరస సంకీర్తన వినండి. బాలకృష్ణునిగా, గోపికృష్ణునిగా, కుబ్జకు రతిసుఖము నిచ్చిన కృష్ణయ్యగా, సత్యభామ ఒడిలో మధురానుభూతితో నిదురించే కృష్ణ మూర్తిగా, పదియారువేల రాచకన్నెలను ఒకేసారి పరిణయమాడి వారి పాలిండ్ల 'తలగడల' పై భోగించు శృంగార నాయకునిగా కీర్తిస్తున్నారు. మేరమీరి మెరిసిపోతున్నావు స్వామీ! అంటున్నారు. నేడు ప్రత్యక్షంగా శ్రీవేంకటేశ్వరుని వలె తిరుపతిలో నీళాదేవిని, భూదేవిని, రమాదేవినీ ముగ్గురినీ నిద్రపోనీయటం లేదంటున్నారు. ఇంకా...ఏం చెప్పాలి...

**ఆ.వె॥ కోర్కెలు కొనసాగె గోవిందరాజులూ!**
**మేరమీరయిట్లు మెరసినావు**
**నీళ, భూమి, రమల నిదురబోనీయక**
**అలరినావు అనెను అన్నమయ్య.**

**రాగం: లలిత**

కోరికలు కొనసాగే గోవిందరాజా
మేరమీరి ఇట్లానే మెరసితవా ॥కోరికలు॥

బాలుడవై రేపల్లెలో పాలుతాగే వేళ
ఈ లీలనే పవళించి ఇరవైతివా
గోలవై తొట్టెలలోన గొల్లెతలు వూచిపాడగా
ఆలకించి విని పాటలు అవధరించితివా ॥కోరికలు॥

కొంచెక మధురలోన కుబ్జఇంట నీలాగుల
మంచాలపై పవళించి మరగితివా
చంచుల ద్వారకలోన సత్యభామ తొడపైన
ముంచి ఈ రీతినొరగి ముచ్చటలాడితివా ॥కోరికలు॥





పదియారువేల ఇంతుల పాలిండ్లు తలగడలై
పొదల నీవు ఇటువలెనే భోగించితివా
ఎదుట శ్రీ వేంకటేశ ఇట్టె తిరుపతిలోన
నిదురించక శ్రీభూమి నీళల కూడితివా ॥కోరికలు॥

**భావామృతం :**

ఓ గోవిందరాజా! నీ కోరికలు కొనసాగుతూనే వున్నవి స్వామీ! నీవు ఈ విధంగానే అంతులేక మెరసిపోతున్నావు.

నీవు రేపల్లెలో పాలు త్రాగే బాలునిగావున్నప్పుడు ఈవిధంగానే విలాసంగా పవళించి నీయొక్క అందాలొలికించి యుంటావు. నిన్ను తొట్టెలో వేసి ఊపుతూ గోపికలు మధురంగా పాడుతుంటే ఆ జోలపాటలు వింటూ గోలవై (ముగ్ధడవై) వారిని అవధరించితివి (ఆలకించితివి). ఆవిధంగావారిని నీవు అనుగ్రహించావు.

కొంచెక(సంకోచించకుండా) నీవు ఆనాడు మధురానగరంలో కుబ్జ ఇంట ఈ విధముగానే మంచాలపై పవళించి మరగితివా (మాకు పరిచయమైతివా స్వామీ! అట్లే ద్వారకానగరంలో చంచుల సత్యభామ (వేగముకల సత్యభామ) యొక్క తొడపై ముంచి (ఆక్రమించి) ఈ విధముగానే ఒరిగి ముచ్చటలాడినావా? (జగన్నాధుని శృంగారంతో అలరించిన ఆ జాణలకంటే అదృష్టవంతులెవరుంటారు?వారిదే కదా! వైభవం.)

ఓ మహానుభావా! పదియారువేలమంది రాచకన్నెలను నరకాసురుడు చెఱబడితే వానిని వధించి వారికి విముక్తినిచ్చావు. వారు నిన్నే పెళ్ళాడ గోరితే ఒకసారి వారిని పరిణయమాడావు వారి పాలిండ్లపొదలలో భోగించితివి. ఈ విధంగా తిరుపతిలో శ్రీవేంకటేశ్వరుడవై లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి-ముగ్గురుతోటి నిదురకూడా పోకుండా కూడియున్నావు. (మమ్ము తరింపజేయుచున్నావు తండ్రీ!)

**3-53**

## మున్నుడి

అహోబల సుగ్రీవ నరసింహస్వామిపై అన్నమాచార్యులు చెప్పిన చక్కని సంకీర్తన ఇది. భజన వలె కొనసాగే ఈ కీర్తనలో కఠినమైన పదాలే లేవు అనే చెప్పాలి. 'వావిరి ప్రహ్లాదునికి వరదుడు వీడే"-అంటే ఎంతో ఉత్కృష్టమైన చక్కటి ఆనందము కలిగించు ప్రహ్లాదునికి వరములిచ్చినది వీడేనని అర్థం. ప్రహ్లాదుడిచ్చే ఆనందమేమిటి? హరినామసంకీర్తన. 'నరసఖుడు' అంటే నరనారామణులలోని నరుడు అర్జునుడై అవతరించగా అతని చెలికాడై దుష్టశిక్షణ చేయించిన నారాయణుడు (శ్రీకృష్ణుడు) అని అర్థం. ఇది నా భావనకందిన అర్థం మాత్రమే....

**కం॥ సేవింపుడు జనులారా!**
**వావిరి ప్రహ్లాదునికిని వరదుడు వీడే**
**భావించి చేతులెత్తుడు**
**ఆ విధి అన్నయ్య కొలిచె హరినరరూపున్.**

**రాగం :సావేరి**

సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో
వావిరి ప్రహ్లారునికి వరదుడు వీడె ॥సేవింపరో॥

జగన్నాథుడు వీడే సర్వరక్షకుడు వీడె
నిగమవేద్యుడైన నిత్యుడు వీడె
సగుణవంతుడు వీడే సర్వకాముడు వీడె
నగుమోము సుగ్రీవ నరసింహుడు వీడె ॥సేవింపరో॥

మరుజనకుడు వీడే మహిమాధికుడు వీడె
పరగ శ్రీలక్ష్మీపతియు వీడె
సురల కేలిక వీడే శుభమూరితి వీడె
నరసఖుడు సుగ్రీవనరసింహుడు వీడె ॥సేవింపరో॥





భువనాధిపతి వీడే పురుషోత్తముడ వీడె
వివిధప్రతాప కోవిదుడు వీడె
ఇవల శ్రీవేంకటాద్రి నిరవైనతడు వీడె
నవమూర్తి సుగ్రీవనరసింహుడు వీడె ॥సేవింపరో॥

**భావామృతం**

ఓ ప్రజలారా! సుగ్రీవుడైన (చక్కటి కంఠముగల) ఈ సుగ్రీవనరసింహుని సేవించండి. చేతులెత్తిమొక్కండి. ఎంతో ఉత్కృష్టుడైన (వావిరి) ప్రహ్లానుకి వరములిచ్చినది ఈయనయే.

లోకములన్నింటికీ నాథుడు ఈయనే.అందరినీ రక్షించే రక్షకుడు కూడా ఈయనే.వేదములన్నింటి చేతా కీర్తింపబడి నిత్యుడు అని గ్రహింపబడినవాడు ఈయనే. విశిష్టములైన సద్గుణములు గల స్వామి ఈయనే. అన్ని కోర్కెలను తీర్చువాడు ఈయనే. ఇదిగో నవ్వులొలికించు ముఖము చక్కటి మెడగలసుగ్రీవ నరసింహుడు ఈయనే. వీరిని సేవించి తరించండి.

వీడే మరుజనకుడు (మన్మథునికి తండ్రి). అధికమైన మహిమలు కలవాడు ఈయనే. సుప్రసిద్ధుడైన లక్ష్మీవల్లభుడు ఈ స్వామియే. దేవతలందరికీ పరిపాలకుడు ఈయనే. శుభప్రదుడైన మూర్తి ఈ దేవుడే. అర్జునుడై అవతరించి దుష్టులైన రాజులను సంహరించిన నరునికి చెలికాడైన 'నారాయణుడు' కూడా ఈ సుగ్రీవునరసింహ దేవుడే. ఈయన శరణుపొందండి.

చతుర్దశ భువనాలకు అధిపతి ఈయనే. పురుషోత్తముడని కీర్తించబడుచున్న శ్రీహరి కూడా ఈయనే. రకరకములైన ప్రతాపములలో దిట్టఅయినవాడు ఈయనే. ఇక్కడ శ్రీవేంకటాద్రి స్వస్థానమైన ఆ శ్రీవేంకటేశ్వరుడు కూడా వేదెవ్వరో కాదు, నవీనముగా (సగం సింహం సగం నరుడుగల రూపం) కనుపించే నవమూర్తియైన సుగ్రీవనరసింహుడు. ఈ పరమపురుషుని సేవించి జన్మ చరితార్థం చేసుకోండి.

## మున్నుడి 3-54

నేటి కాలంలో కాముని పున్నమి సందర్భంగ'హోలీ' ఆడుతున్నారు. రకరకాల రంగులు చల్లుకొంటూ యువతీయువకులు మైమరచి పోతూ పాటలు పాడూతూ నృత్యములు చేస్తారు. ఆంగ్లేయ 'నాగరికత' అణచివేయని పల్లెల్లోనూ, ఉత్తర హిందుస్తాన్‌లోను ఈనాటికీ ఈపండుగ అలరిస్తూనే వున్నది. మన భాషలో దీన్ని 'వసంతం' ఆడటం అన్నారు. అట్లాచల్లే వసంతంలో పుపొడి, కస్తూరి, కర్పూరం పొడి, కుంకుమ. నీళ్ళు, వుంటే యువతీయువకులు రెచ్చిపోతుంటారు. అది ఒక 'జాజర! హరినీ సిరినీ (వేంకన్న మంగమ్మలను) అన్నమయ్య జాజరలో పూహించారు..... వినండి....

**ఆ.వె॥ వాడవాడలందు ఆడి వసంతంబు**
**పడతులన్ను ప్రియులు పరమశించి**
**జాడతోడకూడి చల్లేరుజాజర**
**అన్నమయ్య తలచెహరినిసిరిని.**

### రాగం : శ్రీరాగం

వాడలవాడల వెంట వసంతము
జాడతో చల్లేరు నీపై జాజర జాజర జాజ ॥వాడల॥

కలికి నవ్వులె నీకు కప్పుర వసంతము
వలచూపు కలువల వసంతము
కులికి మాటాడినదె కుంకుమ వసంతము
చలమున చల్లె నీవై వసంతము ॥వాడల॥

కామిని జంకెన నీకు కస్తూరి వసంతము
వాముల మోహపు నీటి వసంతము
బూమెల సరసముల పుప్పొడి వసంతము
సామజ గురుడ నీపై జాజర జాజర జాజ ॥వాడల॥





అంగన అధరమిచ్చే అమృత వసంతము
సంగడి శ్రీవేంకటేశ సతిగూడితి
ముంగిటి రతి చెమట ముత్తేల వసంతము
సంగతాయెనిద్దరికి జాజర జాజర జాజ ॥వాడల॥

**భావామృతం :**

వీధివీధికీ పేటలన్నిటిలోను వసంతోత్సవం జరుగుచున్నది. ఓ శ్రీనివాసా! యువతులు నీపై జాడతో (దారి పొడుగునా) చల్లుతారు. ఎక్కడచూచినా జాజర, జాజర, జాజ, (జాజర అంటే జజ్జర.....అంటే వంచన అని అర్థం. పున్నమినాడు ప్రేయసీప్రియులు, వరుసయైన యువతీయువకులు ఒకరిపై ఒకరు నేరుగానూ, వంచనతో హఠాత్తుగానూ వసంతం చల్లుకొంటారు. అదే ....జాజర అంటే)

(అలమేల్మంగ నీతో వసంతమాడుతున్నది. ఆమె వసంతం అందరు చల్లే వసంతంలా లేదు. అది ఒక విచిత్రమైన వసంతం. దాన్ని వివరిస్తాను వినుము ప్రభూ.)

ఆ కలికి నవ్వులే నీకు కర్పూరవసంతము. వలపు చూపులే కలువరేకుల వసంతము. కులుకుతో ఆమె మాట్లాడు మాటలు నీకు కుంకుమ వసంతము. ఆ విధముగా ఆమె నీపై చలమున (చలాకీతనముతో) వసంతములాడుచున్నది.

ప్రభూ! ఆ కామిని యొక్క జంకెన (శృంగారముతోగూడిన వుత్తుత్తి బెదిరింపు ) నీకు కస్తూరి వసంతము. ఇక బెదిరించినా స్వామి వసంతం చల్లడం ఆప లేరు. ఈ సారి ఆవిడ 'వాముల' నాడింది. (అంటే చేత్తో 'జౌరు' చేసింది...అంటే చరించింది) అయితే ఆ మోహపు వాములు నీటితో ఆడే వసంతం వలెవున్నది. ఆయన చేసే బూమెల (చాటుమాటు) సరసాలు పుప్పొడి వసంతమా అన్నట్లు శోభించింది. ఓసామజగురుడా! (గజేంద్రునికి స్వామివైన దేవా!) నీమీద జాజర జాజర జాజ.

స్వామీ! అంగన యొక్క అధరం నీకు అమృత వసంతమైయొప్పారినది. ఓ సంగడి శ్రీవేంకటేశా! (స్నేహశీలిమైన తిరుమలేశా!) నీవు అట్టి సతిని గూడితివి. రతి సంగరమున కమ్మిన చెమటజల్లులు ముత్యాల వసంతమై శోభించింది. ఆ 'సంగతి' మీ ఇరువురికి జాజర అయింది. ఒకటే జాజర జాజర జాజ.

## 3-55

## మున్నుడి

అద్భుతమైన శరణాగతిని ఆలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ముని గజేంద్రవరదుడైన ఆ రక్షకుని శరణు పొందమన్నారు. "ఉభయ విభూతుల కొడయండు" అంటే ఇహపరములు రెంటినీ అనుగ్రహించగల ప్రభువు అని అర్థం. శరణంటే దగ్గరకు వచ్చి మరీ రక్షిస్తాడు. ఎటు చూచి నా పూర్ణత ఆ స్వామి స్వభావం. ఈ శ్రీవేంకటేశ్వరుడు వేదమయుడు. వేదమే స్వరూపంగా భాసించేవాడు.

**మ॥ శరణంబీతడె సర్వమున్ హరియె నాసంకీర్తనల్ వానికే**
**ఇరవౌ శ్రీపతిగాంచుమా వెరవునన్ ఇంపార చిత్తంబునన్**
**పరమున్ యాతడె దైవమై భువనముల్ పాలించు అన్నయ్యనెన్**
**హరిసంకీర్తన చేయువాని గొలువన్ ఆనందమౌ శ్రీహరీ!**

**రాగం :మలహరి**

శరణం బితడే సకలము నాకును
వెరవున మనసా వెతలవో యితని ॥శరణం॥

అభయం బొసగేటి యతడెవ్వడు ముని
యిభరక్షకు డతడెవ్వడు
వుభయ విభూతుల కొడయండెవ్వడు
ప్రభువతడే నా పాలిదేవుడు ॥శరణం॥

శరణాగతులకు సరిదాపెవ్వడు
యిరవుగ శ్రీపతి యెవ్వడు
అరిదుష్టదైత్య హంతకుడెవ్వడు
పరమును నతడే నా పాలిదేవుడు ॥శరణం॥





ఆది శంఖ చక్రాయుధుడెవ్వడు
యేదెస పూర్ణుండెవ్వడు
వేదమయుడు శ్రీవేంకటపతియై
పాదాయ నిదె నా పాలిదేవుడు. ॥శరణం॥

**భావామృతం :**

నాకు సర్వస్వమూ ఈ శ్రీవేంకటేశ్వరుడే. నాకు శరణము కూడా ఈతడే. ఓ మనసా! ఇతనిని వెరవున (ఉపాయముతో) వెతకవలెను. (అట్లు చేయకుంటే నీకెట్లా కనిపిస్తాడు?)

నీకు అభయమిచ్చి కాపాడగల వాలడెవ్వడు? ఆ నాడు గజేంద్రునకు అభయమిచ్చి రక్షించిందెవరు? ఇహము, పరము అనే రెండు విభూతులను (రెండు వైభవములను) ఈయగల సమర్థుడెవరు? ఇంకెవరు... నాపాలిటి దైవము, ప్రభువు అయిన తిరుమలరాయుడే.

శరణు జొచ్చిన శరణాగతులను దూరంగా వుండి రక్షిస్తారు కొందరు. కానీ వారి దగ్గరకు వెళ్లి రక్షిస్తారు, ఎవరు? ఇదిగో ఈయనే అన్ని ఐశ్వర్యములకు స్థానమెవ్వరు? ఈయనే. దుష్ట దానవులను అంతమొందించిన ఆర్తరక్షకుడెవరు? ఈయనే. జీవులందరికి మోక్షమూ ఈతడే. నాపాలిటి దైవము కూడా ఈ ఏడుకొండలవాడే.

ఆది శంఖచక్రాయుధుడైన వాడు ఎవరు? ఏవైపున చూచినా పూర్ణుడై పరిపూర్ణుడై గోచరించువాడు ఎవరు? వేదమయుడై, వేద నిలయుడై, వేదరూపుడైన శ్రీవేంకటేశ్వరుడై మూలాధారమై యున్న వీడే నాపాలిటి దైవము. నా సర్వస్వమూ ఈతడే.

**2-56**

## మున్నుడి

హరిరసము నాస్వాదించి బ్రహ్మానందమును పొందు హరిదాసుని అద్భుత విభవమును గీర్వాణ భాషలో ఆలపిస్తున్నారు అన్నమయ్య. సహృదయులైన నా మిత్రుల సహకారముతో దీని భావం వివరించగలిగాను. నా భావనయేమంటే, విశిష్టాద్వైతం స్వీకరించిన అన్నమయ్య తన గురువుల చేత ప్రభావితులై అనేక కీర్తనలు వారి నిస్వార్థ, సదాచార, నిరాడంబర భగవత్ కైంకర్య జీవనంపై చెప్పారు. వారిని సేవిస్తే శ్రీహరిని సేవించినట్లేనని అనేకమార్లు చెప్పారు. ఇక భావ వివరణలో పాడింత్య లోపాలను పెద్దలు మన్నించ ప్రార్థన.

**ఆ.వె॥ హరిరసమున పూని నిరతంబు విహరించు**
**నతడు సరసుడనెను అన్నమయ్య**
**"అమలు డతడు నాకు శ్రమను నివారించు"**
**అమరకీర్తనంబు అద్భుతమురా!**

**రాగం : హిందోళం**

హరి రసమ విహారి స తు
సరసోయం మమ శ్రమ సంహారి ॥హరిరసమ॥

దయా నివృత తనుధారీ సం-
శయాతిశయ సంచారీ
కయాప్యజిత వికారీ
క్రియా విముఖ కృపాణధారీ ॥హరిసమ॥

సదా మిథ్యా జ్ఞానీ సతు
మదాలి మతాభిమానీ
తదాశ్రిత సంధానీ సతు
తదా తదా చింతాశయనాని ॥హరిరసమ॥





పరామృత సంవాదీ
స్థిరానందా స్వేదీ
వరాలాప వివాదీ శ్రీ
తిరువేంకటగిరి దివ్యవినోది ॥హరి రసమ॥

### భావామృతం

హరిరసమునందు (బ్రహ్మానందమునందు) విహరించు భక్తుడు అయినవాడు, మిక్కిలి సరసుడు. అట్టివాడు నాకు శ్రమ నివారించు వాడైయున్నాడు.

హరి దయతో నిశ్చయమైన తనువును ధరించిన వాడు, సంశయమును అతిక్రమించి సంచరించువాడై యున్నాడు. ఆయన ఎవ్వరి చేతనూ జయింపబడని విశిష్టాకారము గలవాడై యున్నాడు. ఆయన క్రియారాహిత్యము అను కరవాలమును ధరించినవాడు.

ఆ శ్రీహరి భక్తుడు ఎప్పుడూ సంసారము మిథ్య అను తత్త్వము నెరిగిన వాడైయున్నాడు. ఆయన నా అభిమతమును ఆమోదించి అభిమానించు వాడై యున్నాడు. ఆయన ఆశ్రితాభిమానియై యున్నాడు. ఆయన అప్పుడప్పుడు తన శిష్యుల గురించి ఆలోచించుట మాననివాడై యున్నాడు.

భక్తుడు వరము అనునట్టి అమృతమును ప్రసాదించువాడై యున్నాడు. ఆయన స్థిరమైన ఆనందమును ప్రసాదించు వాడైయున్నాడు. ఆయన శ్రేష్ఠమైన వాక్కుల ద్వారా పలుకబడినవాడు. ఆయన తిరుమలలోని తిరువేంకటగిరియందు వినోదించు శ్రీవేంకటేశ్వరుని భక్తుడై యున్నాడు.

**2-57**

## మున్నుడి

అన్నమయ్య కీర్తనలలో ఏలపాటలు విఖ్యాతిగాంచినవి. నాయికా నాయకుల సంవాద రూపంలో వున్న ఈ కీర్తనలు 'ఉత్కంఠ'తో ఆద్యంతం సాగిపోతూ, చిట్టచివరికి నాయికకు నాయకుడు శ్రీవేంకటేశ్వరుడని తెలియటంతో ఆయన స్వాధీనమవుతుంటుంది. (ఏలే ఏలే మరదలా... వంటివి). తనెవ్వరో గుర్తించటానికి నాయకుడు ఎన్నో ఆధారాలను (క్లూస్) ఇస్తాడు. వాటిని ఆవిడ చివరికి గానీ అర్థం చేసికోదు. 700 ఏళ్లక్రిందట ఇంత విశిష్ఠ కీర్తన చెప్పిన ఆచార్యులవారిని 'ఏమని పొగడుదునో'... అని కీర్తించటం తప్ప ఏమిచేసి వారి ఋణం తీర్చగలం చెప్పండి.

**కం॥ సరసపు సంవాదంబులు**
**జరిగెను హరి రమల నడుమ, చక్కటి కృతితో**
**యెరిగించె నన్నమార్యుడు**
**అరవిందాక్షుని నెఱింగె ఆయమ తుదిలో.**

**రాగం : ఖరహరప్రియ**

ఏమంటి వేమంటి వెఱగ నేను? వో
కామిని నీకిప్పుడైన కానవచ్చెగా ॥ఏమంటి॥

వేలతలుపు మీటిన విటుడెవ్వడే! వో
తాలిమి నేనే మాధవుడను
వాలిన మాధవుడవంటె వసంతుడవా?
గాలింపు చక్రము చేత కలవాడ నేను ॥ఏమంటి॥

ధర చక్రివైతే కుమ్మరివాడవా? కాదే
సిరుల భూమి ధరించిన వాడనే
శిరసున భూమిమోచే శేషుడవా? కాదే
అరయనిన్నియు నేలే హరినే నేను ॥ఏమంటి॥





వంతులకు హరివైతే వానరమవా? నీ
మంతనపు లక్ష్మీ రమణుడ నేను
యింత యేల శ్రీవేంకటేశుడ ననగ రాదా?
అంతే పో నా మారు నీవంటివి గదే! ॥ఏమంటి॥

## భావామృతం

(ఈ కీర్తన నాయిక ప్రశ్న, నాయకుని జవాబుతో సాగిపోతున్నది. ప్రశ్న ఏదో తెలియటానికే నేను ప్రశ్నార్థకం '?' పెట్టాను.)

ఏమంటున్నావు? నీవేమంటున్నావు? నాకు తెలీటంలేదు. నీవేం మాట్లాడుతున్నావు? (నాయిక ప్రశ్నించింది)–ఓ కామినీ! నీకు ఇప్పటికైనా కానవచ్చెగా (కనిపించలేదా?)–(ఇది నాయకుని జవాబు...)

ఈ వేళప్పుడు తలుపు తట్టావు, ఎవడవయ్యా నీవు? ఏ సరసుడవయ్యా నీవు? అన్నది ఆమె. నేను తాలిమి (క్షమాగుణంకల) మాధవుడనే (ఇది ఆయన జవాబు). తాలింపు అంటే తిరుగుబోతు అనికూడా అర్థం. అందుకని ఆవిడ, వాలిన మాధవుడవంటే దిగివచ్చిన వసంతుడవా? (మన్మధుడివా?) అన్నది. కాదే... నేను గాలింపు చక్రము (వెదకి వెంటబడే) చక్రంగలవాడనే. (చక్రియైన శ్రీహరినే).

ఓహో! ఇంతా చేసి, చక్రధారి అంటే కుమ్మరివాడవా? అన్నది. కాదే... పిల్లా! సిరుల భూమి ధరించిన వాడినే (అన్ని సంపదలు గల భూదేవిని పెండ్లాడిన విష్ణువునే) అన్నాడాయన. ఓహో! అట్లా అయితే భూమిని తలమీద మోస్తున్న ఆదిశేషుడవన్నమాట. (ఇంతా చేసి, సర్పానివా...) అంతేనా? అన్నది ఆమె. కాదే... పిల్లా! ఆ ఆదిశేషుణ్ణీ, భూదేవినీ, చక్రాన్నీ, వసంతుణ్ణి కూడా ఆధీనంలో వుంచుకొన్న హరినే నేను.

ఓహో! ఇలా వంతులకు వచ్చి (పోటీగా వచ్చి) చెబుతున్నావు హరివా? వానరమా? (నీ కోతిబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు...) అన్నదామె. ఆయన, ఓ భామా! నీ ఆలోచనల్లో సదా నిలచియుండే లక్ష్మీకాంతుడినే... నేను, అన్నాడు. అయితే నేను స్వయంగా శ్రీవేంకటేశ్వరుడు అనరాదూ... అన్నదామె. అంతే పోవే... సరిగ్గా కనుక్కున్నావు. నా మారు నీవంటివి. (నా బదులు నీవే చెప్పేశావు... సెహబాసు...) అన్నాడాయన.

**3-58**

## మున్నుడి

అలుమేలు మంగమ్మపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన ఇది. ఆమె అభినవరూపం (సరికొత్తరూపం) స్వామిని ఆనందంలోముంచి, ఆ సరసీరుహాక్షుని కన్నులకు చవులిస్తుంది. (ప్రీతిని కలిగిస్తుంది) అంటున్నారు. ఈమే గరుడాద్రి నరసింహుని ఘనవక్షము నాక్రమించిన ఆదిలక్ష్మి. తనవల్లభుని రసికతను పెంపొందించే శ్రీరమణి. సర్వాధికారి (రట్టడి) యైన శ్రీవేంకటరాయని పట్టణపు రాణి అయిన ఈ తల్లి లోకమాత. ఎండిపోయిన చెట్లను (వట్టిమాకులను) చిగురించ గల వలపుల మూట అటు... ఆహా...

**కం॥ అలమేల్మంగమ్మా! ఈ**
**జలజాక్షుని కనుగవలకు చవులిచ్చెను నీ**
**చెలువగు అభినవరూపము**
**నళినీ! ఆ అన్నమయ్య నయముగ తెలిపెన్**

**రాగం : భైరవి**

అలమేలుమంగ నీ వభినవరూపము
జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా ॥అలమేలు॥

గరుడాచలాధీశు ఘనవక్షమున నుండి
పరమానంద సంభరితవై
నెరతనములు చూపి నిరంతరము నాథుని
హరుషించగ జేసితి గదమ్మా ॥అలేములు॥

శశికిరణములకు చలువల చూపులు
విశదముగా మీద వెదచల్లుచు
రసికతపెంపున కరగించి యెప్పుడు నీ-
వశము చేసుకొంటి వల్లభునోయమ్మా ॥అలమేలు॥



భావయామి వేంకటేశం

రట్టడి శ్రీవేంకట రాయనికి నీవు
పట్టపురాణివై పరగుచు
వట్టి మాకు లిగిరించు వలపుమాటల విభు-
జట్టిగొని వురమున సతమైతివమ్మా ॥అలమేలు॥

**భావామృతం :**

ఓ జగజ్జననీ! అలమేలు మంగమ్మా! నీ అభినవ రూపం (సరికొత్త రూపం), నళినదళాక్షుడైన శ్రీవేంకటేశ్వరుని కన్నులకు, చవులిచ్చేవి (ప్రీతిని కలుగజేస్తుంది). అమ్మా! నా విన్నపం, విను తల్లీ!

గరుడాద్రీశుడైన అహోబల నరసింహుని దేవేరియైన ఆదిలక్ష్మివై స్వామి వురమును ఆక్రమించినావు తల్లీ! అందుచేత పరమానంద సంభరితవైనావు. నీ నెరతకము (నేర్పరితనము) చూపి నిరంతరం నీ నాథుని ఆనందమూర్తిగానుంచి అలరిస్తుంటావు కదా తల్లీ!

శశికిరణముల చలువల చూపులు (చంద్రకిరణముల కంటే చల్లని చూపులు, విశదముగా (స్పష్టముగ) స్వామిపై వెదచల్లుచుందువు. ఓ తల్లీ! నీ రసికత చూపించి నీ నాథుని కరిగించి ఎప్పుడూ నీ వల్లభుడు నీ స్వాధీనుడై యుండునట్లు చేసికొందువు.

(రట్టడి అంటే గ్రామాధికారి అని అర్థం. ఇక్కడ జగన్నాథుడని భావించాలి) జగపతియైన శ్రీవేంకటేశ్వరునికి నీవు పట్టపు రాణివిగా పరగుచున్నావు. (ప్రసిద్ధిచెందినావు). వట్టి మాకు లిగిరించు (ఎండిన మ్రోడులను చిగురింపచేయగల) వలపుమాటల (ప్రేమలొలికించు పలుకలతో) నీ విభుని జట్టిగొని (కొనుక్కొని) ఆయన వురముపై సతమైతివమ్మా! (శాశ్వతమైతివి తల్లీ!). (వేంకటరమణుని అప్పులన్నీ అమ్మవారే తీరుస్తున్నది కాబట్టి ఆయనను జట్టిగొన్నది... అంటున్నారు)

**3-59**

## మున్నుడి

ఇది అన్నమాచార్యులవారి శృంగార కీర్తన. అలివేలు మంగమ్మ చెలికత్తెలు ఆవిడ సౌందర్యం చెప్పరానిదని ఆ అందపు వైభవాన్ని చూచి తీరాలని కొనియాడుతున్నారు. సాధ్యమైనంత నర్మగర్భంగా చెప్పటానికి ప్రయత్నించిన కారణం చర్విత చరణమే. ఆ ప్రయత్నంలో భావామృతంలో కొన్ని భావాలు లోపించికూడా ఉండవచ్చును. ఆ చిన్నదాని కంఠ సీమనలంకరించిన నీలమణులహారం వేంకటరమణుడు ఆమెను బిగికౌగిట నిలిపినట్లున్నదట. అన్నమయ్యకి సాటిలేరు...రారు.

**చం॥ సిరులిటు ఇంతికున్నవని చెప్పుట కాదని అన్నమయ్యనెన్**
**ఒరుపుల లెక్కమిక్కుటము ఒప్పుల కుప్పకు నెంచి చూడగా**
**మెరసెను కంఠహారమున మేలగు నీలమణుల్ కనుంగొనన్**
**తరుణిని శ్రీవిభుండు తనదట్టపు కౌగిలి నించినట్లయెన్.**

**రాగం : కాపి**

చెప్పరాదీ యింతి సిరులు దీని
వొప్పులిన్నియు చూడ వొరపులో కాని ॥చెప్పరాదీ॥

ముదిత జఘనము మీది మొలనూలి గంటలివి
కదలు రవమెట్లుండె కంటిరే చెలులు
మదనుడుండెడి హేమమందిరము దిరిగిరా
కదిసి మ్రోసెడి పారిఘంటలో కాని ॥చెప్పరాదీ॥

కొమ్మపయ్యెదలోని కుచముల రుచి వెలికి
చిమ్ముటది యెట్లుండె చెప్పరే చెలులు
యిమ్మైన మరుధనములెల్ల రాసులు వోసి
కమ్ముకొని చెంగావి గప్పిరో కాని ॥చెప్పరాదీ॥





నెలత కంఠమునందు నీలమణిహారములు
అలరుటెట్లుండె కొనియాడరే చెలులు
లలితాంగి ప్రాణవల్లభుడు వేంకట విభుడు
నెలకొన్న కౌగిటనె నిలిచెనో కాని ॥చెప్పరాదీ॥

**భావామృతం :**

ఓహో! ఈ యింతి సిరులు (వైభవములు) చెప్పరాదు (వర్ణించలేము) దీని (ఈవిడ) వొప్పులన్నియు (ఐశ్వర్యములన్నియును) చూడ వొరపులో (అందమైనవే) కదా!

చెలులారా! ఈ ముదిత యొక్క జఘనము (నడుము) మీది మొలనూలిగంటలు కదలాడుతున్నప్పుడు చేయు సవ్వడి యెట్లున్నదో చూచినారా? అవి మన్మథుడు నివసించు బంగారు మేడలో తిరుగాడు చుండగా దగ్గరలో వినబడుచున్న ఆయన కాలి అందియల స్వరము వలెనున్నది.

చెలికత్తెలారా! ఈ లతాంగి ఒల్లెవాటులోని కుచమూల ములయొక్క రుచి (కాంతి) బహిర్గతమవుచున్న విధంబెట్టిదో యెఱింగిరా? విరివియైన మరుధనము ఎఱ్ఱని రాసులుగా ఆక్రమించినవా యేమి? అంతేకాని అన్యము కాదు అనునట్లు యుండెను.

ఓ చెలియలారా! ఈ భామిని కంఠమున ధరించిన నీలమణుల హారము లెట్లున్నవో గమనించితిరా? వాని అందమును మీరు కొనియాడుడు. ఆహారము ఆమె మెడచుట్టు అల్లుకొని యుండి నీలవర్ణుడైన శ్రీవేంకటేశ్వరుని కౌగిట ఈమె ఇమిడిపోయినదా యేమి? అనునట్లున్నది.

## 3-60

## మున్నుడి

శ్రావణ బహుళ అష్టమినాడు (కృష్ణాష్టమినాడు) అర్ధరాత్రి చంద్రోదయ సమయంలో పరమాత్మ శ్రీకృష్ణునివలె ఆభరణాలతో, సర్వాయుధములతో, చతుర్భుజుడై దేవకీ, వసుదేవులకు తను జన్మించే కారణం వివరించి తరువాత శిశువుగా జన్మించాడు. ఆ దేవదేవుడు యెవరినెట్లా అనుగ్రహించాడో, కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆ మహానుభావుడు తనను సేవించే దాసుల పాలిటి మాణిక్యము అట. శ్రీవేంకటాద్రి నేచిన బ్రహ్మము అట. ఓవరి అలమెల్మంగనురముపై బెట్టుకొని చెవదేరనుదయించాడట... అంటే? చదవండి మరి...

**తే॥ కనగ శ్రావణ బహుళాష్టమి నడిరేయి**
**చంద్రుడుదయించ, జగములు సంతసించ**
**సిరులతో బుట్టె కృష్ణయ్య శిశువు వోలె**
**అన్నమార్యుడు కృతిజెప్పె నద్భుతముగ.**

**రాగం : అమృతవర్షిణి**

అరయ శ్రావణి బహుళాష్టమి చంద్రోదయాన
సిరులతో నుదయించె శ్రీకృష్ణుడిదివో ॥అరయ॥

వసుదేవుని పాలిటి వర తపోధనము
యెసగి దేవకీదేవి యెదపై సొమ్ము
సుసరాన గొల్లెతల సొంపు మంగళసూత్రము
శిశువై వుదయించె శ్రీకృష్ణుడిదివో ॥అరయ॥

నందగోపుడు గన్న నమ్మిన నిధానము
పొందగు యశోదకు పూజదైవము
మందల యావులకును మంచి వజ్రపంజరము
చెంది యుదయించినాడు శ్రీకృష్ణుడిదివో ॥అరయ॥





సేవసేసే దాసుల చేతిలోని మాణికము
శ్రీవేంకటాద్రి నేచిన బ్రహ్మము
వోవరి నలమేల్మంగ నురముపై బెట్టుకొని
చె(సే) రదేర నుదయించె శ్రీకృష్ణుడిదివో ॥అరయ॥

**భావామృతం :**

(ఓ ప్రజలారా!) శ్రావణ బహుళాష్టమినాడు అర్ధరాత్రి చంద్రుడుదయిస్తున్న సమయంలో (పరమాత్మ) సకల వైభవములతో పాటు శ్రీకృష్ణునివలె వుదయించాడు. (అవతార పురుషుడైన ఆయన యెవరినెట్లనుగ్రహించాడో వినండి)

అరయగా ఆతడు వసుదేవుని పాలిటి వర తపోధనము (పూర్వజన్మలో చేసిన తపస్సువల్ల పుట్టాడు). ఆతడు దేవకీదేవి యెదపైన యెసగిన (శోభిల్లిన) సొమ్ము, (ఆభరణం). ఆయన గోపికలకు సుసరాన సొంపగు మంగళసూత్రము, (చక్కటి హారమే, కట్టిన మంగళసూత్రంగా శోభిల్లిన మనోనాథుడు). ఇదిగో అట్టి లీలలు చూపిన శ్రీకృష్ణుడు శిశువై వుదయించాడు చూడండి.

ఈయన నందగోపుడు చూచి తన నిధానము అని నమ్మిన దేవదేవుడు. యశోదాదేవికి అతడు పొందబడిన పూజదైవము (విశ్వరూపుడై తరింప చేసిన దైవం, కానీ భ్రమ ఆవిణ్ణి వదలలేదు). ఆవుల మందలకు ఈ గోపాలుడు వజ్ర పంజరము (వజ్ర పంజరం వంటి రక్షణ). ఈవిధంగా అందరికీ చెందినవాడై శ్రీకృష్ణుడు వుదయించాడు.

ఈ స్వామి సేవచేసి తరించాలనుకొనే దాసులకు అరచేతిలో మాణిక్యం (ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపయోగపడతాడు) ఈయనే శ్రీవేంకటాద్రిని యేచిన (అతిశయించిన) పరబ్రహ్మ స్వరూపుడు. ఈయన అలమేలు మంగను హృదయంపై పెట్టుకొనిన నాథుడు. ఆయన హృదయం, ఓవరి(లోపలిగది) లో ఆమె నిండియున్నది. సెవదేర (సేవదీర అని వుంటే బాగుంటుంది) అంటే ఈ శ్రీకృష్ణుడు చేవదీర వుదయించాడు అంటే... సామర్థ్యం కలవాడై వుదయించాడు అని నేను భావిస్తున్నాను.

## 3-61

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు వైద్యునిగా మారి, మన 'రోగం' కుదర్చటానికి మంచి మందేదో సెలవిస్తున్నారు. మనిషి నాగరికుడైన దగ్గరనుంచి ఎన్నో వ్యాధులు వాణ్ణి పట్టి పీడిస్తున్నాయి. మనశ్శాంతిలోపం, బంధుప్రీతి, భవబంధాలు, పాపకర్మలు చేయటం, దైవ విముఖత వంటి విచిత్రమైన రోగాలు ఈ మానవుణ్ణి పీడిస్తున్నాయి. పదునాల్గు భువనాలలోను ఈ రోగాలకి మందులిచ్చే వైద్యుడు కనపడటంలేదు. మన సుకృతం కొద్దీ అన్నమాచార్యులవారు కలిశారు. విచారించకండి వీటన్నిటికీ ఒక్కటే మందు వుందన్నారు. ఒక్క 'పైస' కూడ పారితోషికం తీసికోని ఆయన మందు సేవించండి...

**కం॥ అన్నిటి కౌషధమిదియే**
**వెన్నుని నామంబె మీకు విమలౌషధమౌ**
**సన్నుతిజేయుచు గొనుడిది**
**అన్నయ్యను వినుడు నేడె హరి దిక్కనుడీ.**

**రాగం : మోహన కళ్యాణి**

అన్నిటికి నిది పరమౌషధము
వెన్నుని నామమే విమలౌషధము ॥అన్నిటికి॥

చిత్త శాంతికిని శ్రీపతి నామమె
హత్తిన నిజ దివ్యౌషధము
మెత్తపు బంధ విమోచనంబునకు
చిత్తజగురుడే సిద్ధౌషధము ॥అన్నిటికి॥

పరిపరి విధముల భవరోగములకు
హరిపాదజలమె ఔషధము
దురిత కర్మముల తొలగించుటకు
మురహరి పూజే ముఖ్యౌషధము ॥అన్నిటికి॥





యిల నిహపరముల ఇందిరా విభుని
అలరి భజింపుటె ఔషధము
కలిగిన శ్రీవేంకటపతి శరణమే
నిలిచిన మాకిది నిత్యౌషధము ॥అన్నిటికి॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! మీ వ్యాధులన్నిటికీ ఇది పరమౌషధం. (దీన్ని మించినది లేదు). విష్ణుదేవుని నామ సంకీర్తనే శుద్ధమైన ఔషధము అని గ్రహించండి.

తరచుగా మీ అందరూ 'మనశ్శాంతి' కఱువయిందని వాపోతుంటారు. కోటీశ్వరుడైనా, కూటికి లేని వాడైనా ఇదే వ్యాధితో సతమతమవుతున్నాడు. దీనికి 'హత్తిన' (కలిగిన) దివ్యౌషధం వున్నది. అదే లక్ష్మీకాంతుని నామసంకర్తన. 'హరి హరి' అంటే చాలు (ఉత్తిగా నోటితో అంటే చాలదు మనస్సుతో అనాలి మరి). ఇంకొక ఘోరమైన వ్యాధి వున్నది. దానిపేరు 'బంధుప్రీతి'. మొత్తం బంధు వ్యామోహం నుండి విముక్తి లభించాలంటే ఒక గొప్ప సిద్ధౌషధమున్నది. అదే చిత్తజ గురుని (మన్మధుని తండ్రియైన మాధవుని) ఆశ్రయించుట, అని తెలిసికొనండి.

రకరకములైన వ్యాధులు భవము (పుట్టుక) చేత ప్రాప్తిస్తుంటాయి. (అవి మన పూర్వజన్మలలోని అకృత్యాలకు ఫలితంగా ఈ జన్మలో మనం అనుభవించటానికి కలుగుతుంటాయి. ఇప్పుడు మన చేతుల్లో ఏమీలేదు). దీనికి కూడా ఒకమంచి ఔషధం వున్నది. అదే శ్రీహరి పాదోదకం. శ్రీహరిని పూజించి అభిషేకం చేస్తే ఆయన పాదప్రక్షాళన తరువాత ఆ జలమును స్వీకరించండి. భవరోగం రూపుమాసిపోతుంది. మనం చేసిన పాతపాపాలే కాక ఈ జన్మలోనూ ఎన్నో చెడు కర్మలు చేస్తూనే వున్నాం కదా! ఇవి పోవాలంటే ఏం చేయాలి? మురహరి అన్ని కీర్తించబడే శ్రీమన్నారాయణుని పూజించండి. అది అతి ముఖ్యమైన ఔషధం.

ఈ ప్రపంచంలో ఇహ పరములు రెండింటికీ ఒక్కటే మందు వున్నది. అదే ఇందిరావల్లభుని భజన. ప్రీతితో ఆయనను భజించండి. ఈ ఏడుకొండల మీద ఈ దివ్యక్షేత్రంలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుని శరణాగతి ఒక్కటే మాకు ప్రతిదినమూ తీసికోవలసిన ఔషధమై నిలిచియున్నది.

**3-62**

## మున్నుడి

"ఓ పరమాత్మా! నీవు వ్యక్తుడవు, అవ్యక్తుడవు. వ్యక్తుని వలె నున్నప్పుడు నీవు శ్రీమన్నారాయణుడవు. శృంగారమూర్తివి. చిత్తజుడైన మన్మధుని తండ్రివి. అవ్యక్తునిగా నున్నప్పుడు నీవు ఆత్మరూపుడవు. జీవాత్మగా మా సాంగత్యంలోనే వుంటావు. ఓ సాసముఖా! (శ్వాస రూపంలో 'హంస' అని పిలువబడే నీవు 400 కోట్ల సార్లు ఉచ్ఛ్వాస నిశ్వా రూపంలో 100 సంవత్సరాలు మాలోకి వెళ్లి బయటకు వచ్చి మా ప్రాణం నిలుపుతున్నావు). ఆ రూపంలో నీవు మావద్దనే వున్నా, నిన్ను మేం చూడలేం. కానీ నీవు మా కన్నులకు ఈ తెప్పోత్సవంలో ఇద్దరి దేవేరులతో కూడి దేవదేవునిగా శ్రీవేంకటేశ్వరునిగా కనిపిస్తున్నావు" అన్నారు అన్నమయ్య.

**ఆ.వె॥ చిత్తజు గురుడీవు సింగార మూరితీ!**
**సంగతిని గనెదవు 'సాస' వదన!**
**తిరుమలందు జరుగు తెప్పోత్సవము నాడు**
**అన్నమయ్య గీతమాలపించె**

**రాగం : ఖమాస్.**

సింగార మూరితివి చిత్తజ గురుడవు
సంగతి జూచేరు మిమ్ము సాసముఖా ॥సింగార॥

పూవుల తెప్పల మీద పొలతులు నీవు నెక్కి
పూవులు ఆకసము మోవ పూచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు కొలువగా
సావధానమగు నీకు సాసముఖా ॥సింగార॥

అంగరంగ వైభవాల అమర కామినులాడ
నింగి నుండి దేవతలు నిను చూడగా
సంగీత తాళవాద్య చతురతలు మెరయ
సంగడి దేలేటి మీకు సాసముఖా ॥సింగార॥





పరగ కోనేటిలోన పసిడి మేడనుండి
అరిది ఇందిరయు నీవు ఆరగించి
గరిమ శ్రీ వేంకటేశు కన్నుల పండువగాగ
సరవి నోలాడు మీకు సాసముఖా ॥సింగార॥

## భావామృతం

ప్రభూ! నీవు శృంగారమూర్తివి. మనుస్సులో జన్మించి మనోవైకల్యం కల్పించే మన్మధునకే తండ్రివి. ఓసాసముఖా! వూపిరి రూపింలోవున్న మిమ్ము నిత్యమూ అనుభవిస్తూ నీ సాంగత్యతంలో మేము మిమ్ము జూచుచునే యున్నాము.

(అయినా మా అజ్ఞానం వల్ల నిన్నెరగకున్నాము.)

ఈ పూల తెప్పమీద వూరేగుతున్నావు. అప్పుడు దేవతలు దేవదుందుభులు మ్రోగించుచున్నారు. ఆకాశమును తాకునట్లు పూలు వెదజల్లుచున్నారు. అందరూ సావధానులైయున్నారు. ఓ సాసముఖా! నీకు అందరూ విధేయులే.

అదిగో అంగరంగ వైభవంతో అప్సరసలు నృత్యంజేస్తున్నారు. ఆకాశంలో దేవతలంతా ఆ నృత్యాన్ని ఆనందంగా చూస్తున్న నిన్ను కనులారగాంచుటకు వుత్సాహపడుతున్నారు. సంగీత తాళముల కనుగుణముగా వాయిద్యములన్నియు చాతుర్యము ప్రదర్సింపబడుచు మ్రోగుచున్నవి. ఈ వీరందరితో సంగడిదేలేటి (బృందముగా పాల్గొనే) మీకు వారందరూ విధేయులే. ఓసాసముఖా! అందరూ నీ దాసులే.

తండ్రీ! ఈ కొనేటిలో నీవు అతిశయించి నీ దేవేరులతో బంగారు మేడనుండి వచ్చి స్నానమాడుచున్నావు. అరిది (దుర్లభము) అయిన ఇందిరాదేవి నీవు నైవేద్యమునారగించుము. ఆ వెనుక ఓశ్రీవేంకటేశ్వరా! మా కన్నులపండువగా సరవితో (ఇంపుగా) ఓలలాడుము. ఓ సాసముఖా! ఇంతకంటే జన్మతరించే మార్గం ఏమున్నది?.

## 3-63

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో జాతి వివక్షతను నిరసిస్తున్నారు. హరి భక్తుడేజాతివాడైతేనేమి? అందరిలోను అంతరాత్మగా హరివున్నప్పుడు, లౌకికవైదిక కర్మలు చేస్తున్నంత మాత్రాన విశిష్ఠత కలుగుతుందా? వసుధానాధుడు, శ్రీకాంతడు అయిన శ్రీవేంకటేశ్వరుడు తన మాయచేత భ్రమ కల్పించి మానవులు ఈ జాతిభేదం పాటించేట్లు చేస్తున్నాడు. నిజానికి ఆ శ్రీపతినామమే సుజాతి. గీతాచార్యుడుచెప్పిన పరమ సత్యాన్నే అన్నమయ్య పామరులకు కూడ అర్ధమవునట్లు చక్కటి కీర్తనలో చెబుతున్నారు. ఆలకించండి...

**చం॥ అనెను విజాతులన్నియును వ్యర్థము వ్యర్థము యెంచితూచినన్**
**కనిన ప్రయోజనంబు కలికంబది వేసియు కానరాదురా**
**తనదగు మాయచేత వసుధాపతి! జీవులకిన్ని బేధముల్**
**అనువుగ పెట్టినాడనెను అన్నయ కీర్తన మద్భుతంబురా**

**రాగం : లలిత/మిశ్రమలహరి**

విజాతులన్నియు-వృథా వృథా
అజామీళాదుల -కదియే జాతి ॥విజాతు॥

జాతి భేదములు-శరీరగుణములు
జాతి శరీరము-సరితోడనెచెడు
ఆతుమ పరిశుద్ధంబెప్పుడును-అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపు దాస్యం-బిదియొక్కటె పో సుజాతి ॥విజాతు॥

హరి యిందరిలో -నంతరాత్ముడిదె
ధరణి జాతిభే-దము లెంచిన
పరమ యోగు లీభావ మష్టమదము-భవనికారమని మానిరి
ధరణిలోన బరతత్త్వ జ్ఞానము-ధర్మమూలమే సుజాతి ॥విజాతు॥





లౌకిక వైదిక-లంపటులకు నివి
కైకొను నవశ్య-కర్తవ్యంబులు
శ్రీకాంతుడు శ్రీవేంకటపతిసే-సిన సంపాదన మిందరికి
మేకొని యిన్నియు మీరిన వారికి-మీ నామమే సుజాతి ॥విజాతు॥

**భావామృతం :**

(ఓ మానవులారా!) విజాతులన్నియు (విభిన్నములైన జాతులన్నియునూ) వ్యర్ధమే వ్యర్ధమే. శుద్ధ నిరుపయోగములు. అజామీళుని వంటి కులభ్రష్ఠులది యేజాతి అని చెప్పగలం? (అతను విష్ణువును చేరినాడు కదా!)

నశించిపోయే అశాశ్వత శరీరానికి మాత్రమే జాతిభేదం శరీరం పోయాక జాతీ పోయింది. కానీ దీంట్లో వున్న ఆత్మ సదా పరిశుద్ధమైనది. దోషరహితమైనది. కావున దేహ భావ మొదలి ఆత్మభావం అలవడితే, హరివిజ్ఞానం వలన హరిదాసుడైన వానిదే సుజాతి అని తేలికగా అర్ధమవుతున్నది.

శ్రీహరి జీవులందరిలోను అంతరాత్మ రూపంలో వున్నాడు. కానీ మానవులకు ఈ భూమిమీద అన్న మదము, అర్ధమదము వంటి ఎనిమిది రకముల మదములు కలుగుచున్నవి. ఇది మాయ వలన సంసారమందున కలుగుచున్న తిరస్కార భావములు. జ్ఞానులైన యోగులు ఈ మాయ నెరుగుటవలన తుచ్ఛమైన జాతిభేదమును విడనాడి పరతత్త్వము నెఱిగి దానికవసరమైన ధర్మమును మాత్రమే పాటిస్తారు. వారి లక్షణము మాత్రమే ఉత్తమజాతి లక్షణములని గ్రహించవలెను.

లౌకికములైన వైదిక కర్మలలో నిమగ్నులైన వారు మాత్రమే చేపట్టవలసిన కర్తవ్య కర్మలవలన ఏమి ప్రయోజనం కలుగుతుంది? చెప్పండి. ఇవన్నీ శ్రీకాంతుడైన వేంకటేశ్వరుడు తన మాయా ప్రభావము చేత జీవులకు అమర్చిన 'సంపదలు'. ఓ శ్రీవేంకటేశ్వరా! ప్రయత్న పూర్వకముగా ఈ లౌకిక వైదిక కర్మకాండనతిక్రమించిన నీ దాసునికి నీ నామ సంకీర్తన యొక్కటియే సుజాతి లక్షణము. ఇదే నిజం.

## 3-64

## మున్నుడి

నాకు అత్యంత ప్రియమైన అన్నమయ్య కీర్తన ఇది. 265 కీర్తనల తరువాత ఇంత ఆలస్యంగా దీని భావామృతం వివరించటానికి కారణం 'ఇంత సులువైన కీర్తనకి నా వివరణ అవసరమా! అనే నా అజ్ఞానమే' ముక్తికి అర్హులైన వారి 'క్యూ' లో మనం నిలబడితే (ఎప్పటికైనా) ఈ కీర్తనని 'స్మరిస్తే' మీముందున్నవాడిని ఆపి మిమ్మల్ని ముందుకు పంపిస్తారు. అంటే ఎన్నిసార్లు ఈ కీర్తన ఆలపిస్తే అంతముందుకు వెడతారు. దయచేసి ఈ కీర్తన 'బట్టీపట్టి' రోజూ పాడుకోండి. 'జలరుహభవనుత చరణయుగ' అంటే బ్రహ్మదేవునిచే కీర్తింపబడు పాదపద్మములు గలవాడని అర్థం. 'బలి బంధన' అంటే త్రివిక్రముడై బలిచక్రవర్తిని బంధించినవాడని.

**తే॥ భజన నారాయణునికిది మధురమైన**
**తేనెతేటరా చల్లని వానజల్లు**
**అన్నమయ్య సంకీర్తన నెన్న తరమె!!**
**నారదుడు సన్నుతించి ఆనందమందు**

**రాగం : బెహాగ్**

నారాయణతే నమో నమోభవ
నారద సన్నుత నమో నమో ॥నారాయణ॥

మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభా
పరమ పురుష భవబంధ విమోచన
నరమృగ శరీర నమో నమో ॥నారాయణ॥

జలధి శయన రవిచంద్ర విలోచన
జలరుహభవనుత చరణయుగ
బలి బంధన గోప వధూవల్లభ
నలినోదర తే నమో నమో ॥నారాయణ॥





ఆదిదేవ సకలాగమ పూజిత
యదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీవేంకటనాయక
నాదప్రియ తే నమో నమో ॥నారాయణ॥

**భావామృతం :**

ఓ శ్రీమన్నారాయణుడా! నీకు నమో వాకములు. నీకు అనేక వందనములు. నీవు భవుడవు (సత్తు అని పిలువబడే సత్యము నీవే. నారదుడు అహరహమూ నిన్ను కీర్తిస్తుంటాడు. అట్టినీకు శతకోటి వందనములు.

నీవు మురహరుడవు (ముర అను రాక్షసుని నిర్జించిన వాడవు). భవహరుడవు (పుట్టుక లేకుండా చేయువాడవు). నీవు ముకుందుడవు (ఎఱ్ఱని తామరపువ్వు చేత ధరించినవాడవు). మాధవుడవు (లక్ష్మీపతివి). గరుడ గమనుడవు (గరుత్మంతుని పై పయనించువాడవు). పంకజ నాభుడవు (పద్మనాభుడవు). పరమ పురుషుడవు (పురుషోత్తముడవు). భవబంధ విమోచనుడవు (పురాకృత కర్మల వలన కలిగిన తల్లిదండ్రి, బిడ్డలు, భార్య మొదలైన బంధములను సడలించు వాడవు). నరమృగ శరీరుడవు (నరసింహ స్వరూపుడవు). ప్రభూ! అట్టి నీకు వందనములు.

తండ్రీ! నీవు జలధిశయనుడవు (క్షీరసాగరమున పవ్వళించియుండు వాడవు). రవిచంద్ర విలోచనుడవు. (సూర్యచంద్రులు నేత్రములుగా కలవాడవు). జలరుహభవనుత చరణ యుగ్మము (పద్మ సంభవుడైన బ్రహ్మ దేవుడు కీర్తించు పాదముల జంట) కలవాడవు. బలి బంధనుడవు (వామనావతారంలో మూడవ అడుగు పెట్టడానికి చోటు చూపించలేదని బలిచక్రవర్తిని త్రివిక్రముడవై బంధించిన వాడవు). గోపవధూవల్లభుడవు (గోపకాంతలను వధువులుగా స్వీకరించిన వాడవు). పద్మము వుదరమునందు కలవాడవు. అట్టినీకు అనేక వందనములు.

ప్రభూ! నీవు ఆది దేవుడవు. సకలాగమములచేత (చతుర్వేదములచే) కీర్తింపబడువాడవు. యాదవకులమున జన్మించిన జగన్మోహనుడవు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వేదములను వుద్ధరించి రక్షించినవాడవు. అంతేకాదు నాదము (ఓం కారము మరియు సంగీతము) అంటే చాలా ప్రీతి కలవాడవు. అట్టి నీకు అనేక వందనములు. నన్ను రక్షింపుము తండ్రీ!

## 3-65

## మున్నుడి

చక్కటి తత్త్వబోధను ఇంత చిన్న కీర్తనలో అద్భుతంగా చేస్తున్న అన్నమాచార్యులవారిని ఆకర్ణించండి. మానవ జన్మ అతి దుర్లభమైనదని జీవియెన్నో జన్మలు అనుభవించాక గానీ నరజన్మ లభించదని శాస్త్రం చెబుతున్నది. ఆ మానవజన్మ నెత్తికూడా జంతువులాగా బ్రతుకుతూ మనకంటే బలవంతుణ్ణి ఆశ్రయించి, పిడికెడి పొట్టకోసం, క్షణికమైన సుఖంకోసం ఏవేవో బాంధవ్యాల చిక్కుల్లో తగులుకొని, మళ్ళీ వాటి ఫలితంగా అనేక జన్మల్లో అందరిలోనూ పుట్టి పెరిగి ఏవేవో రూపాలు ధరించి మనిషి వేసారిపోతున్నాడు. అందరాని శ్రీవేంకటేశ్వరుని సేవించడు. అయ్యో...

**ఉ॥ మానవుడై జనించి ధరమానవునిన్ గొని సేవ జేయుచున్**
**మానక దుఃఖమంది అవమానము లందగనేల హీనుడై**
**దీనశరణ్యునిన్ హరిని దీటుగ గొల్పుడు అన్నమయ్యనెన్**
**ఆ నళినీధవుండు తను అండగ నుండును వేంకటేశుడై**

**రాగం : అభోగి**

మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖ మందనేల ॥మనుజుడై॥

జుట్టెడు కడుపుకై చొరని చోట్లు చొచ్చి
పట్టెడు కూటికై బతిమాలి
పుట్టిన చోటికే పొరలి మనసు పెట్టి
వట్టి లంపటము వదలనేరదు గాన ॥మనుజుడై॥

అందరిలో పుట్టి అందరిలో పెరిగి
అందరి రూపము లటు తానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి
అందరాని పదము అందెనటు గాన ॥మనుజుడై॥





**భావామృతం :**

ఓ మానవులారా! ఏమిటీ విచిత్రం!! మానవుని వలె జన్మించిన వాడు, ఇంకొక మానవుని సేవించడమేమిటి? పోనీ దానివలన ఏమన్నా సుఖపడుతున్నాడా అంటే లేదే!! ప్రతి దినము దుఃఖిస్తూనే వున్నాడు. మరి ఇక ఇదంతా యెందుకు? ఆలోచించండి.

సరే! తిండికోసం పడరాని పాట్లు పడవలసి వస్తోంది అనుకుంటే, మన కడుపు యెంత వుంది? జుట్టెడు (జానెడు కడుపు). దీనికోసం చొరరాని చోట్లు (వెళ్లకూడని స్థలములకు) చొచ్చి (వెళ్ళి), అవస్థలు పడుతున్నాడు. పట్టెడు కూటికోసం (పిడికెడు తిండికోసం) ఎవరెవర్నో బ్రతిమిలాడి, భంగపడి, మనస్సంతా తనుపుట్టిన చోటుపైనే పెట్టి, ప్రవర్తించి, వుపయోగపడని లంపటాలను (తగులుకొన్న బాంధవ్యాలనే ఊంపిని) వదలనే లేడు. కాబట్టి వీడు మనిషై పుట్టి సాధించినదేమిటి? శుద్ధ దండుగే కదా!

ఇక ఈ మానవ జన్మలో వీడు చేసిన అకృత్యాలవల్ల యేం జరుగుతున్నదో చూడండి. వీడు (ఈ ఆత్మ) మళ్ళీ అందరిలోనూ పుడుతున్నాడు. కాబట్టి అందరిలోనూ పెరుగుతున్నాడు. ఆ హీనజన్మల రూపములన్నీ తానే అవుతున్నాడు. ( ఈ దీక్షితులు యెక్కడో ఏ గాడిద జన్మనో పొందుతాడనే ఆలోచనే... కంపరం కలిగిస్తున్నది కదా!) మరి యెందుకండీ ఈ తిప్పలు? మనోజ్ఞమూర్తియైన ఆ స్వామిని, శ్రీవేంకటేశ్వరుని సేవించి, మానవులకు అందరాని కైవల్య పదవ నందుకొనుటకు ప్రయత్నించాలి, కానీ వ్యర్థజీవితం గడుపవచ్చునా?

## 3-66

### మున్నుడి

బహుశా యేదో కష్టం వచ్చినప్పుడు అన్నమాచార్యుల వారు ఈ కీర్తన చెప్పి వుంటారు. రాజదండనకు గురియై దిక్కు తోచక ఆయన స్వామితో మొరపెట్టి వుంటారు. "ఘోరపు రాజసభలో కుంది విన్నవించితిమి నీకు' అన్నారు. "నీదాసుల అవమానం నీవు చూస్తుంటావా? ప్రభూ! నీవు ఏది చూచి వుపేక్షించావు?నీకు ప్రత్యేకంగా హెచ్చరించవలసిన పనేమున్నదయ్యా? క్షీరసాగరంలో నిద్రించి వున్నా యెన్నిసార్లు దేవతలని రక్షించావు? ద్వారకలో వున్నా... ద్రౌపదిని హస్తినాపురంలో రక్షించావు. వైకుంఠంలో లక్ష్మీదేవితో వున్నవాడివి మొసలి బారి నుండి గజేంద్రుని రక్షించావు. నీ తిరుమల ఇక్కడే కదా! రావయ్యా! నన్ను రక్షించు తండ్రీ!"

**కం॥ నీ దాసుల భంగమ్ముల**
**ఏదని చూచేవు నీవు హెచ్చరికేగా?**
**రాదా నీ దయ మాపై**
**ఖేదంబున అన్నమయ్య కీర్తించె హరిన్**

**రాగం : మలయమారుతం**

నీ దాసుల భంగములు నీవు జూతురా
ఏదని చూచేవు నీకు ఎచ్చరించ వలెనా ॥నీ దాసుల॥

పాలసముద్రము మీద పవ్వళించినట్టి నీకు
బేలలై సురలు మొరపెట్టిన యట్టు
వేళతో మా మనవులు విన్నవించితిమి నీకు
ఏల నిద్దిరించేవు మమ్మిట్టె రక్షించరాదా ॥నీ దాసుల॥

ద్వారకానగరములో తగ నెత్తమాడే నీకు
బీరాన ద్రౌపది మొర వెట్టిన యట్టు
ఘోరపు రాజసభల కుంది విన్నవించితిమి
యే రీతి పరాకు నీకు ఇంకా రక్షించరాదా ॥నీ దాసుల॥





యెనసి వైకుంఠములో ఇందిర కూడున్న నీకు
పెనగి గజము మొరవెట్టిన యట్టు
చనవుతో మా కోరిక సారె విన్నవించితిమి
విని శ్రీవేంకటేశుడ వేగ రక్షించరాదా ॥నీ దాసుల॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసులమైన మా బాధలు, అవమానాలు నీవు చూస్తూనే వుంటావా? ఏదని చూస్తావు? అన్నీ తెలిసిన నీకు మళ్ళీ హెచ్చరించవలసిన పనేమున్నది ప్రభూ! (ఓ ఆర్త రక్షకా! రా తండ్రీ! నన్ను రక్షించు)

నీవు క్షీరసాగరంలో యోగ నిద్రలో వుంటే దీనులై దేవతలు యెన్నిసార్లు మొరపెట్టి నీకు చెప్పుకోలేదు? అట్లాగే మేమూ మా మొరలను ఈవేళ నీకు విన్నవిస్తున్నాము. ఆనాడు వాళ్లని ఆదుకుని రక్షించావు కదా! (బలిచక్రవర్తి దగ్గర 'భవతి భిక్షాందేహి!' అని కూడా అన్నావు). మరి నేడు ఇంకా నిద్రపోతున్నావెందుకు? మమ్ము 'ఇట్టే' రక్షించరాదా తండ్రీ!

ద్వారకా నగరంలో సత్యాదేవితో నెత్తమాడుతున్న (పాచికలాట ఆడుతున్న) నీతో, బీరాన ద్రౌపది (బలహీనురాలైన ద్రౌపదీ దేవి) హస్తినాపురంలో మొరపెట్టి "నన్ను మానభంగం కాకుండా ఈ దుశ్శాసనుని రక్షించు కృష్ణా!" అని మొరపెట్టుకొన్నది. అప్పుడు 'అక్షయ' మైన చీరెలిచ్చి ఆమెని రక్షించలేదా? ఈ రాజసభలో ఘోరపు అవమానాల పాలై కుంది (దుఃఖించుచూ) విన్నవించుచున్నాము. ప్రభూ! ఏ విధమైన పరాకుతో (అన్యమనస్కుడవు యై) వున్నావు? ఇంకా నన్ను రక్షించవేల తండ్రీ!

వైకుంఠపురంలో యెనసి (పొందుగా) లక్ష్మీదేవితో నీవు ఏకాంతములో వుంటే యెక్కడో కారడవిలో కొలనులో మొసలి బారిన పడిన గజేంద్రుడు "నీవే తప్ప ఇతః పరంబెరుగ... రావే ఈశ్వర! కావవే వరదా! సంరక్షించు భద్రాత్మకా!" అంటే పరుగు పరుగున వెళ్ళి రక్షించావు కదా! నీమీద వున్న చనవుతో మా కోరిక నీకు విన్నవించి "మమ్ము కాపాడు ప్రభూ!" అని మొరపెట్టుకొన్నాం. "ఓ శ్రీవేంకటేశ్వరా! వినికూడా రావేమి? వేగమే వచ్చి మమ్ము రక్షించు తండ్రీ! నీవే నాకు దిక్కు."

## 3-67

## మున్నుడి

ఎంత అద్భుతమైన దృశ్యాన్ని వర్ణిస్తున్నారో చూడండి. మన అన్నమాచార్యులవారు. రేపల్లెలో వున్న ఒక దొంగ పిల్లవాడిని, (అదీ వజ్ర సువర్ణ చౌర్యం కాదు) పాలు వెన్న దొంగతనం చేసి, విపరీతమైన అల్లరి చేసే ఒక గొల్లపిల్లాడిని కీర్తిస్తున్నారు. ఎవరు? బ్రహ్మాది దేవతలు. ఎక్కడ? ఆకాశ వీధిలో వరుసగా నిలబడి. ఎవర్ని? ఒంటినిండా నూగుధూళి (గాలిలోకి లేచిన గోధూళి) అంటి, అట్టుకట్టుకొని పోయి, చొల్లు కార్చుకొంటున్న పాపాయిని. ఆదిశేషుడు వేదమంత్రాలతో నుతిస్తున్నాడట. “చద్దికి వేడికి వచి సనకాది మునులు వీడే శ్రీవేంకటేశ్వరుడ”ని పాడుతున్నారట. అంటే...? చదవండి మరి...

**మత్తకోకిల : పాలదొంగని ఆడిపాడుచు పాలిదైవమనెంచుచున్**
**నీలవర్ణుని సన్నుతించుచు నింగి బ్రహ్మయు దేవతల్**
**రోలగట్టిన చిన్ని కృష్ణుని లోకనాథు నుతించగా**
**మేలు కీర్తన మన్నమార్యుడు మించి తాన్వినిపించెరా.**

**రాగం : మోహన**

పాలదొంగ వద్ద వచ్చి పాడేరు తమ
పాలిటి దైవమని బ్రహ్మాదులు ॥పాలదొంగ॥

రోల గట్టించుక పెద్దరోలలుగా వాపోవు
బాలుని ముందర వచ్చి పాడేరు
ఆలకించి వినుమని యంబర భాగమునందు
నాలుగు దిక్కుల నుండి నారదాదులు ॥పాలదొంగ॥

నోరినిండా జొల్లుగార నూగు ధూళి మేనితో
పారేటి బిడ్డని వద్ద పాడేరు
వేరులేని వేదములు వెంట వెంట చదువుచు
చేరి చేరి యింతనంత శేషాదులు ॥పాలదొంగ॥





ముద్దులు మోమునగారు మూలమూలల దాగే
బద్దుల బాలుని వద్ద పాడేరు
అద్దివో శ్రీ తిరువేంకటాద్రీశు డితడని
చద్దికి వేడికి వచ్చి సనకాదులు ॥పాలదొంగ॥

**భావామృతం :**

పాలు దొంగతనంగా త్రాగే చిన్ని కృష్ణుని దగ్గరకు కైలాసం నుండి శివుడు, సత్యలోకం నుండి బ్రహ్మ, స్వర్గలోకం నుండి దేవతలు వచ్చి, స్వామీ! నీవే మా పాలిట దేవదేవుడవు అని పాడుతూ కీర్తిస్తున్నారు. (ఆ అద్భుత దృశ్యాన్ని మీ మనోనేత్రంతో వీక్షించండి).

రోలు, వంటలో పచ్చళ్ళు పొడులు చేసికొనుటకు వాడతారు. కానీ కుండెడుపాలు నేలపాలు చేశాడని కోపం భరించలేక బాలకృష్ణుని రోటికి కట్టేసింది తల్లియశోద. వాడు వూరకుంటాడా? పెద్ద రోలలుగా వాపోతున్నాడు. (గట్టిగా పెడబొబ్బలు పెడుతూ ఏడుస్తున్నాడు). మనందరి ఏడుపును వూరుకోబెట్టేవాడు ఎలా ఏడుస్తున్నాడో చూడండర్రా అని, అందర్నీ వినండి వినండి అని నారదుడు మొదలైన వారు నాలుగు దిక్కుల్నించీ వచ్చి ఆకాశవీధిలో నిలబడి పాడి కీర్తిస్తున్నారు.

నోటినిండా చొల్లుకారుతుంటే, నూగుధూళి (గాలిలోకి రేగిన గోధూళి) ఒంటికి అంటుకుపోయి తెట్టుకట్టి నేలమీద పాకుతున్న చిన్న పాపాయి కృష్ణయ్య దగ్గరకు వచ్చి మేరలేని (హద్దులు లేని) వేదమంత్రములు పదే పదే చదువుతూ ఆయన చుట్టూ గుమిగూడి కీర్తిస్తున్నదెవరో తెలుసునా? స్వయంగా ఆదిశేషుడు మొదలైన వారు. (మనబోటి అల్పులకి కనబడరు... అంతే)

ముద్దులు మూటగట్టే మొఖముతో మూలమూలకు పోయి దాగికొని ఆడుకొంటున్న, బద్దుల బాలుడు (చీటికీ మాటికీ అబద్ధాలు చెప్పే పిల్లవాడు) యైన బాలకృష్ణుడే అల్లదిగో ఆ శ్రీవేంకటేశ్వరుడు. వేంకటాద్రి మీదనున్న ఇతని వద్దకు చద్దికి వేడికీ వచ్చి (చల్లగా వుండే రాత్రివేళల్లోను, వేడిగా వుండే ఎండవేళల్లోనూ) సనకసనందానాది ఋషులు పాడి నుతించేరు. (అదండీ ఈ స్వామి వైభవం...)

## 3-68

## మున్నుడి

అన్నమాచార్యుల వారి స్ఫూర్తితో ఆయన కుమారుడు పెద తిరుమలయ్య, అతని కొడుకు చిన తిరుమలయ్య కూడా తమ జీవితాలు శ్రీవేంకటేశ్వరుని సేవకే అంకితం చేసి వేల కీర్తనలు వేంకటపతి మకుటంతో చెప్పి తరించారు. ఈనాడు వాటిని మననం చేసికొంటూ మనం మన స్థాయిలో స్వామిని కొలుస్తున్నాం. వైరాగ్యం తొణికిసలాడే ఈ కీర్తనలో "ఓ శ్రీహరీ! ఒక్క నిముషం కూడా వదలక నిన్ను స్మరించి అనురాగమంతా నీపై నిలిపి బ్రతికితే... అది బ్రతుకుగాని.. నిద్రలోను, వ్యామోహంలోను, వృద్ధాప్యంలోను, ధనం కోసం వెంపర్లాడుతూ... బ్రతికితే... అదీ బ్రతుకేనా? అంటున్నారు.

**కం॥ చిన తిరుమలయ్య చెప్పిన**
**అనుపంబగు కీర్తనంబు, హరిని మరువకన్**
**మన వలెను జీవితాంతము**
**వెనుకాడక నిముషమైన వీడక అనియెన్**

**రాగం :మౌళవిగౌళ**

నిమిషమెడతెగక హరి నిన్ను తలచి
మమత నీ మీదనే మరిపి బ్రతుకుటగాక ॥నిమిష॥

నిదురచే కొన్నేళ్ళు నేరముల కొన్నాళ్ళు
ముదిమిచే కొన్నాళ్ళు మోసపోయి
కదిసిరి కోరినను గత కాలంబు వచ్చునే
మది మదినె యుండి ఏమరక బతుకుటగాక ॥నిముష॥

కడు తనయులకు కొంత కాంతలకునొకకొంత
వెడయాసలకు కొంత వెట్టిసేసి
అదరి కావలెననిన అందు సుఖమున్నదా
చెడకనీ సేవలే సేసి బతుకుటగాక ॥నిముష॥





ధనము వెంట తగిలి దాస్యంబునకు తగిలి
తనవారి తగిలి కాతరుడైనను
కనుకలిగి శ్రీవేంకటనాథ కాతువె
కొనసాగి నిన్ను నే కొలిచి బతుకుటగాక ॥నిముష॥

**భావామృతం :**

ఓ శ్రీహరీ! నిముష మాత్రమైనా నిన్ను వదలక మమతాను రాగములను నీపైననే మరట్చి బ్రతుకుగడుపుట తగినపని. అట్లు గాక జీవించిన, అదీ బ్రతుకేనా?

మనిషి జీవితంలో మూడవ వంతు నిద్రకే వ్యర్ధమై పోతున్నది.

అట్లా నిద్రకు కొన్నాళ్ళు, తగని పనులు చేస్తూ కొన్నాళ్ళు, వృద్ధాప్యంలో చింతిస్తూ కొన్నాళ్ళు, మోసపోయి కాలమంతా వ్యర్ధం చేసి కొన్నాను. కదిసి (దగ్గరయై) కోరుకొనినా గడిచిపోయిన ఆ కాలం తిరిగివస్తుందా? మనస్సును అదుపులో వుంచి ఏమరుపాటు లేక బ్రతకాలి. అట్లు గాక జీవిస్తే అది కూడా ఒక బ్రతుకేనా?

మానవుడి జీవతమంతా వెట్టి చాకిరి (జీతం కోసం పని చేస్తూ...) చేస్తూ బ్రతుకుతున్నాడు. తన ప్రియమైన కుమారులకు కొంత, భార్యకు ఇంకాకొంత, వెడ (వ్యర్ధమైన) ఆసలకు కొంత ఆ జీతాన్నీ, తన జీవితాన్నీ ఖర్చు చేస్తాడు. కావాలనుకొన్నా అదరి ఆసక్తితో ప్రయత్నించినా అందులో (అట్టి జీవితంలో) సుఖమున్నదా? చెడిపోక నీ సేవ చేయుచు బ్రతకాలి. అట్లుకాక ఎన్నాళ్లు బ్రతికినా అదీ బ్రతుకేనా?

నరుడు ధన సముపార్జనలో వ్యసనపడి, దాస్యం చేస్తూ అదే యావతో, తనవారి కోసం, వారి బాగు కోసం చింతిస్తూ కాతరుడై (భీరువై) బ్రతుకుతాడు. అట్లుగాక ఓ శ్రీవేంకటేశ్వరా! కనుకలిగి (దృషి మమ్ము రక్షించెదవు కద! అట్లా బ్రతకాలి గానీ ఇంకొక విధంగా బ్రతికితే అదీ బ్రతుకేనా....

## 3-69

## మున్నుడి

విజయనగరము (హంపీ) లో వెలసియున్న వాయునందనుడు హనుమంతునిపై అన్నమాచార్యులవారు చెప్పిన రమణీయమైన కీర్తనమిది. మతంగ పర్వతం మీద ఒక కాలు మాల్యవంత పర్వతం మీద ఇంకొక కాలు జాపి నిలుచుని అతిశయిల్లుచున్న పెద్దహనుమంతుడితడా!!!! అని ఆశ్చర్యంతో కీర్తిస్తున్నారు. ఆయన 'ఆతత బలాఢ్యు'డట (అంతులేని బలశాలి). కాలనేమిని భంజించాడట (విరిచాడట). నిరతితో (మిక్కిలి ఆసక్తితో) వేంకటాద్రిపై కూడా అరిది (అరుదైన) వరములిచ్చేవాడు ఈతడేనా!!! అంటున్నారు.

**మ॥ ఘనుడాకాలు మతంగ పర్వతము యీకాలూనె మాల్యాద్రిపై**
**పెను ఆకారము వాడురా, హనుమ ఈ వీరాగ్రణిన్ గొల్వుడీ**
**అనియెన్ అద్భుత కీర్తనంబు నుడివెన్ అన్నయ్యనాలింపుడీ**
**తను శ్రీవేంకటనాథు బంటు,వరముల్ దానంబు జేసెన్ భళా!**

**రాగం : శంకరాభరణం**

మతంగ పర్వత మాడ మాల్యవంతమునీడ
అతిశయిల్లిన పెద్ద హనుమంతు డితడా ॥మతంగ॥

యీతడా రాముని బంటు యీతడా వాయుసుతుడు
ఆతత బలాఢ్యుడందు రాతడితడా
సీతను వెదకివచ్చి చెప్పిన యాతడితడా
ఘాతల లంకలోని రాక్షసవైరి యితడా ॥మతంగ॥

అంజనా సుతుడితడా అక్షమర్దను డితడా
సంజీవని కొండ దెచ్చె సారె నితడా
భంజించె కాలనేమిని వంతంబున నితడా
రంజిత ప్రతాప కపిరాజ సఖుడితడా ॥మతంగ॥





చిరజీవియీతడా జితేంద్రియుడితడా
సురులకుపకారపు చుట్ట మీతడా
నిరతి శ్రీవేంకటాద్రిని విజయనగరములో
నరిది వరములిచ్చీ నందరికి నితడా ॥మతంగ॥

**భావామృతం :**

అక్కడ మతంగపర్వతం మీద ఒకకాలు, ఇక్కడ మాల్యవంత పర్వతం మీద ఇంకొక కాలు ఉంచి కాళ్ళు బారజాపి నిలుచున్నట్లు అతిశయముతో నిలుచున్న పెద్ద హనుమంతుడితడేనా!!!

ఈ మహానుభావుని ఘనతను వినండి. ఆ నాటి శ్రీరామచంద్రుని నమ్మిన బంటు యీతడేనా!! వాయునందనుడైన అత్యంత బలశాలి అని కీర్తిస్తున్నారే.... ఆయన ఈయనేనా!! సీతాదేవిని అన్వేషించి ఆమె క్షేమ సమాచారం రఘునాథుని కందించిన ఆతడీయనేనా!! లంకానగరంలో ఘాతల రాక్షసుల శత్రువు ఇతడేనా!!

అంజనీదేవి పుత్రుడని భక్తులందరు కొనియాడుచున్నది ఇతనినేనా!! రావణసుతుడైన అక్షుని మర్దించి సంహరించిందితడేనా!! సారెకు (కావలసినప్పుడల్లా) సంజీవని పర్వతం తెచ్చినదితడేనా!! పంతము వహించి కాలనేమి అనే దానవుని భంజించింది(విరచి సంహరించినది) ఇతడేనా!!(రంజితము అంటే ఎఱ్ఱని అనే అర్థం. అనురాగము అని ఇంకొక అర్థం. కానీ ఇక్కడ శోభాయమానమైన లేక చక్కటి అనే అర్థంలో చెప్పారు) చక్కటి ప్రతాపముకల కపిరాజు సుగ్రీవుని హితుడీతడేనా!!

చిరంజీవిగా వర్ధిల్లుచున్నదీయనేనా!! ఇంద్రియములను గెలిచిన జితేంద్రియుడీయనేనా!! దేవతలకు బంధువు వలె వుపకారములు చేసిన దీయనేనా!! మిక్కిలి ఆసక్తితో శ్రీవేంకటేశ్వరుని నెలవైన అంజనాద్రిపై రక్షకుడైయున్న ఆయనే ఈ విజయనగరంలో కూడా వెలసి తన భక్తులందరికీ అరుదైన వరముల ననుగ్రహించుచున్నది ఈ రామదూతయేనా!!!

## 3-70

## మున్నుడి

అన్నమాచార్యులవారు అలమేలు మంగమ్మపై చెప్పిన చక్కటి కీర్తన ఇది. వేంకటనాధుని రాక కోసం నిరీక్షిస్తూ ఆ తల్లి పడుతున్న పాట్లను వర్ణిస్తున్నారు. నా మున్నుడిలో నేను రెండు సంగతులు నిరూపించదలచాను. అన్నమయ్య కవిత ఛందోబద్ధమైనది నా పద్యంలో కీర్తన అలాగే వాడాను. తెలుగు పాటలో అర్థం కాని దేముంటుంది అనుకొనే వారి కనువిప్పుకోసం ఆ మాటలు అలాగేవాడాను. ఎంతమందికి ఈ పద్యం అర్థమవుతుంది? అవునా?

**సీ॥ మెరుగువంటిది అలమేల్మంగ గాంచుడీ**
**అరిమురి నవ్విని అలరుబోడి**
**పలుచని యెలుగున పాటనీపై పాడి**
**మెలుపుకూరిమి జూపె మెరుగుబెడి**
**చెలులతో నీ సుద్ది తలమునకగ జెప్పి**
**అలయును సొలయును అగరుబోడి**
**ఈడుగా నీరాక కెదురెదురై చూచు**
**మేడపై నుండి ఆ మిసిమి బోడి**

**ఆ.వె॥ పేరు కొని పిలుచును ప్రియములు చెప్పును**
**వేంకటేశ! నీదు వెలది గనుము**
**అన్నమయ్య పాట అది పద్యమైపోయె**
**ఛందమందు చెప్పినందు చేత.**

**రాగం : ఖమాస్**

మెరుగువంటిది అలమేలుమంగ
అరిమురి నవ్విని అలమేలుమంగ ॥మెరుగు॥

పలుచని యెలుగున పాడీ నీ మీద పాట
మెలుపు కూరిమి నలమేలుమంగ
చెలులతో నీ సుద్ది చెప్పిచెప్పి కరిగీని
అలయుచు సొలయుచు నలమేలుమంగ ॥మెరుగు॥





యీడుగా నీ రాకకు నెదురుదురు చూచీ
మేడమీదనుండి యలమేలుమంగ
వాడు మోముతో నీపై వలపు చల్లి చల్లి
ఆడీ నాట్యము సారె నలమేలుమంగ ॥మెరుగు॥

పేరుకొని పిలిచీని ప్రియములు చెప్పిచెప్పి
మేరమీర నిన్ను నలమేలు మంగ
యీరీతి శ్రీవేంకటేశ నిన్ను గూడె నేడు
ఆరితేరి నన్నిటాను అలమేలుమంగ ॥మెరుగు॥

**భావామృతం :**

(ఓ శ్రీనివాసా! ఈ మా అలమేలుమంగమ్మ ఎటువంటిదంటా వేమో? వినుము ప్రభూ!)

మా అలమేలుమంగ మెరుగు (ఆకాశంలోని మెఱపు) వంటిది. ఆమె నిన్ను చూడగానే... అరిమురి (సంభ్రమముతో) నవ్వుతుంది.

పలుచని యెలుగున (సన్నని గొంతుతో) మా అలమేలుమంగమ్మ నీ మీద పాటలు అల్లి పాడుతూనేవున్నది. ఆమెకు నీపై అంత మెలుపు కూరిమి (గాఢమైన ప్రేమ)వున్నది. తన చెలికత్తెలకు నీ కబుర్లు చెప్పిచెప్పీ ఆ పరవశంలో కరిగిపోయి అలసిపోయింది, సొలసిపోయింది. (అట్టి మా అలమేలుమంగమ్మను అనుగ్రహించవయ్యా!)

మా అలమేలుమంగమ్మ,ఈడుగా (ఆలస్యమైన) నీరాకకోసం యెదురెదరు (ఎదురతెన్నులు) మేడ మీదనుంచి యెలా చూస్తున్నదో చూడవయ్యా! ఆమె సారెకు (మాటిమాటికీ), నీపై వలపు కురిపించీ నాట్యమాడీ ఆడీ, వాడు మోముతో (వాడిపోయిన మొగముతో) ఎలావున్నదో చూశావా? (నీకింకా దయరాదేమయ్యా?)

మా అలమేలుమంగమ్మ నీ ప్రియురాలవటంచేత నీ పేరును యెన్నిసార్లు పిలిచిందో లెక్కలేదు. మేరమీద (అమితముగా) నీ నామస్మరణ చేస్తూనే వున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె ఈ విధంగా నేడు నిన్ను గూడినది. నీ సాంగత్యంలో మా అలమేలు మంగ అన్నిటిలోనూ ఆరితేరింది ప్రభూ! (మా అమ్మ సంతోషమే... మా సంతోషం)

**3-71**

## మున్నుడి

విశిష్టాద్వైతం స్వీకరించి అన్నమాచార్యులయిన అన్నమయ్య ఆ మతం చెప్పే వేదాంత రహస్యాల గురించి, ఆ గురువుల విశిష్టత గురించి అనేక కీర్తనలు చెప్పారు. మూడుమాండ్లు తొమ్మిది మాటలలో వేదాంత రహస్యమంతా గురువులను వేడుకొని గ్రహించారట. మూడు మాటలు ఏమిటి? జీవుడు, దేవుడు, ప్రకృతి. సరే...జీవుని గురించిన 'జ్ఞానము", 'ఆచార్యునిపై విశ్వాసం' వలన వస్తుంది. అలాగే దేవునిపై 'భక్తి' 'శరణాగతి' వలన వస్తుంది. అదే విధంగా... ప్రకృతియందు 'వైరాగ్యం' 'భగవద్దాస్యం' వలన కలుగుతుంది. వేదాంత రహస్యం అంతా ఈ విధంగా, మొత్తం మూడు మూండ్లు తొమ్మిదే మాటలట.

**ఉ॥ మాటలు మూడు మూండ్లనుట మాత్రము నిక్కము తొమ్మిదౌనురా**
**దీటుగ శ్రద్ధతో గురుని దీవెన పొంది గ్రహింపుమన్నియున్**
**పాటను పాడుచున్ తెలిపె మంచిని ప్రాజ్ఞుడు అన్నమార్యుడున్**
**సాటి మరేది? శ్రీహరికి సాగిలి మ్రొక్కుడు జన్మధన్యమౌ**

**రాగం : ఖమాస్**

మూడే మాటలు మూడు ముళ్ళు తొమ్మిది
వేడుకొని చదువరో వేదాంత రహస్యము ॥మూడే॥

జీవస్వరూపము చింతించి యంతటాను
దేవుని వైభవము తెలిసి
భావించి ప్రకృతి సంపద యిది యెరుగుటే
వేవేలు విధముల వేదాంత రహస్యము ॥మూడే॥

తనలోని జ్ఞానము తప్పకుండా దలపోసి
పనితోడి నందువల్ల భక్తి నిలిపి
మనికిగా వైరాగ్యము మరువకుండుటే
వినవలసిన యట్టి వేదాంత రహస్యము ॥మూడే॥





వేడుకతో నాచార్య విశ్వాసము గలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరు గొలిచి దాసుడౌటే
వీడని బ్రహ్మానంద వేదాంత రహస్యము ॥మూడే॥

**భావామృతం :**

వేదాంతమునందు రహస్యమైన మాటలు మొత్తం మూడు మూండ్లు తొమ్మిది మాత్రమే కలవు అని జిజ్ఞాసువులైన వారు గురువులను వేడుకొని చదివి, గ్రహించారు. ఆ వేదాంత రహస్యములను మీరుకూడా గ్రహించండి.

జీవుని స్వరూపమెట్టిదో చింతించెదము. సర్వాంతర్యామియైన దేవుని వైభవమును గ్రహించవలెను. భావించుచూ ప్రకృతి సంపద యెట్టిదో యెఱుంగవలెను. ఈ మూడింటినీ గ్రహించిన వేదాంతరహస్య గ్రహణయందు మొదటి మూడు మెట్లు యెక్కి , వివిధమైన వేదాంత రహస్యములను నేర్చినట్లే యగుచున్నది.

తనలోని జ్ఞానమును తప్పకుండా భావించవలెను. ప్రయత్నపూర్వకంగా ఆ జ్ఞానము స్థిరపడితే, భక్తిని (దేవునిపై) నిలుపుట సాధ్యమవుతుంది. ఆ భక్తి దృఢమై వైరాగ్యమే జీవిత సారమని గ్రహింపు కలిగి మరువకుండా ఆ వైరాగ్యంతో వేదాంత రహస్యములన్నీ వినవలసినవి విని స్థిర చిత్తుడవ్వాలి.

అప్పుడు ఆనందముతో ఆచార్యునిపై నమ్మకం నిలుపవలెను. దానివలన ఆయన భగవంతుని శరణాగతి పొందుటెట్లో నేర్పుతారు. (దాన్ని తెలుసుకొన్నంతమాత్రాన సరిపోదు, సాధన చేయాలి) ఆ శరణాగతితో భగవంతుడైన శ్రీ వేంకటేశ్వరుని కొలిచి దాస్యం చేయాలి. అప్పుడేం జరుగుతుందో తెలుసా.... ఎన్నడు విడువని బ్రహ్మానందము కలుగుతుంది. ఇంతకంటే... వేదాంత రహస్యం ఏముంటుందయ్యా?

## 3-72

## మున్నుడి

తండ్రి బాటలోనే నడచిన అన్నమాచార్యులవారి పుత్రుడు పెదతిరుమలయ్య కూడా ఎన్నో చక్కటి కీర్తనలు అవి అన్నమయ్యవేమో అని భ్రమపడేలా చెప్పారు. అదే భక్తి వైరాగ్యం తొణికిసలాడటం, అదే శ్రీవేంకటేశ మకుటం వుపయోగించటం వల్ల అలా భావించటం సహజమే. ఈ కీర్తనలో 'చతురుడైన శేషాచల నివాసుని శ్రీనివాసుని అది ఒక వ్రతము అని భావించి ఆయననే పాడెదను (కీర్తించెదను) అంటున్నారు. ఎవ్వరిని సనకాదులు, శుకుడు, ధ్రువుడు, నారదుడు, విభీషణుడు, భీష్ముడు, ప్రహ్లాదుడు, వసిష్ఠుడు, వ్యాసుడు, అర్జునుడు, అలమేల్మంగ-వీళ్ళంతా కొలిచారు? శ్రీవేంకటేశ్వరునే...

**చం॥ అనిశము శ్రీశుకుండు, సనకాదులు నెమ్మది గొల్చి రెవ్వనిన్**
**వినయముతో విభీషణుడు, భీష్ముడు పొందిరి వేని సత్కృపస్**
**మునుపు కిరీటియున్ అతని ముందరి భక్తులు వేడి రెవ్వనిన్**
**అనఘుడు వానినే తిరుమలయ్యను గొల్చెను అన్నమార్యుడున్**

**రాగం : సరస్వతి**

అతని పాడెదను అది వ్రతము
చతురుని శేషాచల నివాసుని ॥అతని॥

సనకాదులు ఏ సర్వేశు గొలిచిరి
అనిశము శుకుడెవ్వని దలచె
ముని ధ్రువుడే దేవుని సన్నుతించె
ఘన నారదుడే ఘనుని పొగడెను ॥అతని॥

ఎలమి విభీషణుడే దేవుని శరణనె
తలచె భీష్ముడే దైవమును
బలు ప్రహ్లాదుని ప్రాణేశుడెవ్వడు
ఇలలో వశిష్ఠుడే మూర్తి దెలిసె ॥అతని॥





పురిగొని వ్యాసుడే పురుషుని చెప్పెను
తిరముగ అర్జునుని దిక్కెవ్వడు
మరిగిన అలమేల్మంగపతి యెవ్వడు
గరిమల శ్రీవేంకటేశుడీతడు ॥అతని॥

**భావామృతం :**

(ఓ ప్రజలారా!) చతురుని (అత్యంత చాతుర్యంగల) శేషాచలనివాసుని కీర్తించెదను. అది నాకు వ్రతము.

ఆది నుంచి సనకాది మహర్షులు ఏ సర్వేశ్వరుని పూజించారు? అనిశము (ఎల్లప్పుడు) శుకమహర్షి యెవ్వనిని తలచుకొనే వాడు? ముని(కృతయుగంలో) ధ్రువనక్షత్రమై జగద్విఖ్యాతిగాంచిన ధ్రువుడు యే దేవుని సన్నుతించాడు? ఘనుడు, బ్రహ్మమానస పుత్రుడైన నారదుడు యే ఘనుని ప్రతి క్షణం పొగడుతుంటాడు? (వానినే నేనూ ప్రార్థిస్తాను).

ఎలమి (సంతోషముతో) తన అన్న రావణుని కాదని త్రేతాయుగంలో అతని తమ్ముడు విభీషణుడు యేదేవుని శరణుజొచ్చాడు? ద్వాపరయుగంలో కురుపితామహుడైన భీష్ముడు, తనని చక్రంతో ఖండిస్తానని వచ్చిన యే దేవుని 'తెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు" అని వేడుకొన్నాడు? బలు ప్రహ్లాదుని (అతిశయించిన ప్రహ్లాదుని) ప్రాణేశ్వరుడై నీడవలె కాపాడినది యే దేవుడు? ఈ భూమిపై సప్తఋషులలో ఒకడైన వశిష్ఠుడు ఏ మూర్తిని జగద్రక్షకుడని తెలుసుకొన్నాడు? (అదిగో... ఆయననే నేనూ ప్రార్థిస్తాను.)

పురిగొని (దిట్టముగా) వ్యాసుడు యే పురుషుని ఇతడే పురుషోత్తముడని చెప్పాడు? ఆయన (వ్యాసుడు) సంతతివాడైన అర్జునుడు ఎవ్వరిని దిక్కని నమ్మాడు? శ్రీమహాలక్ష్మి అవతారమైన జగన్మాత అలమేల్మంగమ్మ క్షణం కూడా వీడలేక హృదయ వాసినియై ఎవ్వరి గుండెల్లో తిష్టవేసికొని వుంటుంది? అదిగో... అల్లదిగో... గరిమల (మహిమాన్వితుడైన) ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. ఈయనే మన సర్వస్వం.

## 3-73

## మున్నుడి

శ్రీరామచంద్రుడు రావణ సంహారం జరుపవలసిన సమయమాసన్నమైనది. ఆయనకోసం స్వర్గం నుంచి 'మాతలి' సారధిగా తన స్వంత రథం పంపించి జగముల నుద్ధరించమని వినుతించాడు దేవేంద్రుడు. శ్రీరాముడు ఆ దివ్యరథం యెక్కి బయలుదేరాడు. ఆ దృశ్యాన్ని మన కళ్ళకు కడుతున్నారు ఆచార్యులవారు. దీనినిబట్టి ఆయన సంపూర్ణ రామాయణం కీర్తనలలో చెప్పి వుంటారని, మన దౌర్భాగ్యం కొలది అది లభించడం లేదని తెలుస్తోంది. కనుల యెదుట వున్న రత్నాన్ని రాయి అనుకోవడం పారవేసుకోవటం, ఇంకొక డొచ్చి ఆ సంగతి చెబితే యేడవడం, తెలుగువాడి తెగులే కదా!

**ఆ.వె॥ వినుడిదే రఘుపతి విజయము లిన్నియు**
**పనుపడి దనుజులిడు బాధలుడిగె**
**చుక్కలెల్ల'డల్లె'స్రుక్కె' భూతములన్ని**
**అన్నమయ్య పాట అంత సులువె?**

**రాగం : ఆరభి**

వినుడిదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షస బాధలుడిగెను ॥వినుడిదె॥

కులగిరులదరెను కుంభిని వడకెను
యిల రాముడు రధమెక్కినను
కలగె వారిధులు కంపించె జగములు
బలు విలునమ్ములు వట్టినను ॥వినుడిదె॥

పిడుగులు దొరిగెనుపెనుగాలి విసరె
తొడిబడి బాణము దొడిగినను
ముడివడె దిక్కులు మొగ్గె దిగ్గజములు
యెడపక రావణ నేసినను ॥వినుడిదె॥





చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసుర తల దుంచినను
గక్కున శ్రీవేంకటగిరి నిలువగ
అక్కజమగు శుభమందరి వొదవె ॥వినుడిదె॥

**భావామృతం :**

(ఓ ప్రజలారా!) ఇదిగో రఘుకుల పతియైన శ్రీరామచంద్రుని విజయమునెట్లు దేవతలు వీక్షించారో... ఆపైన, పనుపడి రాక్షస బాధలు (రాక్షసులవల్ల కలిగిన బాధలు) వుడిగెను (క్షీణించినవి). ఆ సమాచారం వినండి.

ఆ శ్రీరామచంద్రుడు బలు విలునమ్ములు (అసమాన్యమైన కోదండమును బాణములను) పట్టుకొనగానే... కులగిరులు (హిమాలయము,వింధ్యవంటి పర్వతములు)అదిరిపోయినవి. భూమి వణికిపోయి కంపించింది. కోదండపాణియైన ఆయన రథము నెక్కగానే "కలిగె వారధులు" (సముద్రములు సంక్షోభించినవి). జగములన్నియు కంపించినవి.

ఆ శ్రీరాముడు బాణము దొడిగిన వెంటనే, పిడుగులు రాలిపోయి నేలపై దొరికినవి. పెనుగాలి తొడబడి విసరె (పెద్దగాలి చలించి పోవునట్లు వీచింది). ఆయన యెడపక (వెనువెంటనే) రావణుని వధించాడు. అప్పుడు దిక్కులు ముడివడెను, (దిక్కులు గడ్డకట్టి పోయాయి). దిగ్గజములు మొగ్గె (మ్రొగ్గె అంటే మోకరిల్లినవి). (అటువంటి సంక్షోభం జరుగగా ఆయన రావణుని సంహరించాడు.

అప్పుడు ఇంకా ఏం జరిగిందంటే... చుక్కలు డుల్లెను. (నక్షత్రాలు ఆకాశం నుంచి, వూడిపడ్డాయి).

స్రుక్కెభూతములు (సమస్త ప్రాణులు భయపడిపోయాయి.) ఆ విధంగా శ్రీరాముడు అసురుని తలతొక్కి త్రుంచివేశాడు. ఆశ్చర్యకరంగా ఆ వెంటనే ఆయన శ్రీవేంకటాద్రి నివాసుడై పోగానే ప్రజలందరికి శుభములు కలిగినవి.

(వావిలిపాడులోని వీరరామచంద్రునిపై చెప్పిన కీర్తన అయివుంటుంది).

## 3-74

## మున్నుడి

"నారీ నారీ నడుమ మురారి" అనే రాసకేళి దృశ్యం మన మనోఫలకం మీద ముద్రిస్తుందీ అన్నమాచార్య కీర్తన. కృష్ణుడి 'పోకడలకు' కినుక వహించిన గొల్లెతలు అతనిని దెప్పిపొడుస్తున్నారు. ఒక్కొక్క దాని మధ్య వొక్కక్క రూపంలో వుంటావు. కృష్ణా! నిన్ను చూడబోతే అసాధ్యుడిలావున్నావు. నిన్నెట్లా నమ్మమంటావు? అంటున్నారా అమ్మాయిలు. ఒక దానితో మాట్లాడితే ఒక దానికేసి జంకూగొంకు లేక చూస్తాడట. ఒకదానికి కన్ను కొడతాడట, ఒకదాన్ని కౌగలిస్తాడట. వెన్నతిన్న నోటితోనే ముద్దులిస్తాడట. అందరితోనూ రాసక్రీడలో పాల్గొంటాడట. అయినా శ్రీవేంకటేశ్వరుడివి నిన్ను గాక ఎవర్ని నమ్మమంటావయ్యా.......

**కం॥ ఒక్కొక్క భామ నడిమిని**
**ఒక్కొక రూపంబుదాల్చి ఒదిగే కృష్ణా!**
**యెక్కడ నిను నమ్మేదిర?**
**చక్కగనా అన్నమయ్య సంకీర్తించెన్.**

**రాగం : మలహరి**

ఒక్కొక్క సతి నడుమ నొక్కక్క రూపుగైకొని
యెక్కువైతి కృష్ణా నిన్నెట్ట నమ్మేదిరా ॥ఒక్కొక్క॥

మాటలాడే వొకతెతో మళ్ళి చూచేవొకతెను
వోటలేక నవ్వునవ్వే వొకతెతోను
కూటువై గొల్లెతలము గుంపుగూడున్నారమిదే
యేటిది నీ మోహమిక నెందని నమ్మేదిరా ॥ఒక్కొక్క॥

కన్నుగీటేవొకతెకు కాగిలించే వొకతెను
వెన్నదిన్న మోవిచ్చేవు వేరొకతెకు
వున్నతి రాసక్రీడలున్నార మిందరము
ఇన్నిటిలో నీ వలపు యెందని నమ్మేదిరా ॥ఒక్కొక్క॥





తమ్మువెట్టే వొకతెకు తగమెచ్చే వొకతెను
సమ్మతించ చేసొకతె చన్నులంటేవు
యెమ్మెల శ్రీవేంకటేశ ఇందరి మమ్ము గూడితి
విమ్ముల నేనమ్మితిగా కెటుల నమ్మేదిరా ॥ఒక్కొక్క॥

**భావామృతం :**

శ్రీకృష్ణా! ఒక్కొక్క భామ మధ్య ఒక్కొక్క రూపము దాల్చి యెక్కువైయున్నావు. (అసలు కృష్ణుడు ఎవరో కూడా తెలియటం లేదు) నిన్నెట్లు నమ్మేదిరా?

ఒకవైపు చూస్తే ఒకానొక గోపికతో మాట్లాడుతూ కనిపిస్తాడు. ఒకవైపు ఏదో యొక గోపికకేసి తిరిగి తదేకంగా చూస్తూ కనిపిస్తావు.

ఒకదానితో, వోటులేక (జంకూగొంకూ లేక) పకపక నవ్వుతూ కనిపిస్తాడు. అందుకనే మేం గోపికలమందరమూ కూటవై (గుంపుగా) గుమిగూడివున్నాము. ఇది ఎట్లాంటి మోహమో గాని ఎక్కడని నిన్ను నమ్మేదిరా? ఓ కృష్ణా! ఏమిటిరా నీ మాయ?

పోనిలే...అనుకుంటే... ఒకగోపికకు కన్నుగీటు...తున్నావు. ఎవరేమనుకొంటారో అని కూడా చూడక ఒక దాన్ని కౌగలిస్తావు.ఇంకొక గోపికను నీ వెన్న దిన్న పెదవులతోనే ముద్దపెట్టుకొంటున్నావు. అందరమూ పొడవుగా బారులు దీరి రాసక్రీడలో వున్నాము.

ఇన్నింటిలో మాయ వేషాలు వేసే నిన్ను ఎట్లా నమ్మేదిరా కృష్ణా!

మరీ విడ్డూరుమేమంటే ఒకతెకు నీ అర్ధాంగి వలె నీ నోటి తాంబూలం పంచి ఇస్తావు.ఒకదాన్ని తెగ మెచ్చుకొంటావు. ఒకదాన్ని ఎలాగో అంగీకరింప చేసి దాని వక్షొజాలను తాకుతావు. ఎంత టక్కరివి? అయాని యెమ్మల (విలాసవంతుడవైన) శ్రీవేంకటేశ్వరుడవై మమ్మల్నింతమందిని కూడియున్నావు. అందుచేత నమ్మను అంటూనే...నిన్నేనమ్ముతున్నాను, నమ్ముతాను.

**3-75**

## మున్నుడి

అహోబల నరసింహస్వామి పై అన్నమాచార్యులవారు చెప్పిన కమనీయమైన కీర్తన ఇది. అహోబల అంటే ఔ(ను) భళా! అనే అర్థం. సగం సింహం సగం నరుడు అయిన ఆకారం ఆశ్చర్యం కలిగించక మానదుదు కదా! అత్యద్భుతమైన ఆ సింహాన్ని "ఔభళనారసింహా!" అని కీర్తిస్తున్నారు. సింహాసనంపై నవ్వులొలికిస్తూ కూర్చున్న మోక్షదాత. ఆయన విడిచే ఊపిరి వెదజల్ల బడుతూవుంటుంది. ఆర్తుల అట్టడి (తిప్పలు) నివారించే, ఆఱడి సింహము (వ్యర్థము చేసే నరసింహము) అంటున్నారు.

**చం॥ పరగెను గద్దెపై కనుడు బాగుగ నవ్వెడి సింగ మిద్దిరా**
**సిరులతొ 'ఔభళా నరుడు సింగముతానగు అన్నమయ్యనెన్**
**పరమముయైన సింహమిది బల్లిదుడౌటనెరింగి రందురున్**
**విరివిగ ఆతడే వెలసి వేంకట సింగము ఔను తాననెన్.**

**రాగం :శంకరాభరణం**

పరగీ నిదివో గద్దెపై సింహము వాడె
పరమైన ఔభళ నారసింహము ॥పరగీ॥

తెల్లని మేని సింహము దేవసింహము
మెల్లని చిరునవ్వుల మేటి సింహము
చల్లేటి ఊరుపులతో జయసింహము వాడె
బల్లిదుడై వెలసే ఔభళ నారసింహము ॥పరగీ॥

నిలుచున్న సింహము నిత్యసింహము
అలరు కొండల మీద ఆదిసింహము
వెలుపల కడపపై వీర సింహము
పలుకు పంతముల ఔ భళ నారసింహము ॥పరగీ॥





పుట్టు (ట్ట) జడలసింహము పూర్ణసింహము
అట్టడి ఆర్తుల ఆఱడి సింహము
జట్టిగొన్న దాసులకు శాంతిసింహము
పట్టపు శ్రీవేంకట ఔభళ నారసింహము ॥పరగీ॥

**భావామృతం :**

(ఓ భక్తులారా!) ఇదిగో సింహాసనంపై పరగీ ( ప్రవర్తిల్లుచున్న)సింహము. ఈయన పరమైన (శ్రేష్ఠమైన) ఔ భళ నారసింహము (అహోబల నరసింహుడు. ఈయన శరణము పొందండి).

ఈ సింహము ఎట్లావున్నదో చూశారా? ఈయన తెల్లని శరీరం గల సింహము, దేవదేవుడైన సింహము మెల్లని (సన్నటి) చిరునవ్వులు చిందించేసింహము. అత్యంత శ్రేష్ఠమైన సింహము. విజయము. ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీసికొనే సింహము. విజయము స్వంతం చేసికొనిన సింహము. బల్లిదుడు(అతి బలవంతుడైన) సింహము. ఇన్ని సుగుణములున్న ఈయనే ఔ భళనారసింహము. (ఈయన శరణు పొందండి.)

ఈయన విశిష్ఠతను గమనించారా?

ఈయన నిత్యుడై నిలిచియున్నాడు. (ఆది మూలము మరియు అనంతుడు కావున నిత్యుడై నిలిచియున్నాడని ఒక అర్థం) ఈయన కొండల మీద వెలసిన ఆదిదేవుడైన నరసింహుడు. హిరణ్యకశిపుడు ఇంట్లో తన చావు రాకూడదన్నాడు కాబట్టి, ఇంటి వెలుపల కడపపై (గడప మీద )కూర్చొని వాడిని భీకరంగా గోళ్ళతో చీల్చిచంపిన వీరసింహము. అందుకే ఈయన పంతము పలుకుల అహోబల నారసింహుడు. ఆ రాక్షసుడేం కొరితే ఈ 'పలుకునకు' పంతంతో విరుగుడు చేశాడు. ఔ భళ నారసింహుడంటే మరి మాటాలా?

ఇతడు పుట్ట జడల సింహము. (పెద్దపుట్ట వలె కనుపించు జూలు గల నరసింహుడు) ఈయన పూర్ణుడు. (పరిపూర్ణతగలవాడు). ఆర్తుల యొక్క అట్టడి (తిప్పలు లేక బాధలు) నివారించు ఆఱడి సింహము వ్యర్థముచేసే నరసింహము. జట్టిగొన్న (అమ్ముడు బోయిన, లేక దాసోహం అనిన) దాసులకు శాంతిని ప్రసాదించే సింహము. నేడు శ్రీవేంకటాద్రి పై పట్టము గట్టుకొనిన ఔ భళ నారసింహము ఈయనే సుమా!

**3-76**

## మున్నుడి

గీర్వాణ భాషలో అన్నమాచార్యులవారు చెప్పిన మధురమైన కీర్తన ఇది. దేవదేవుడైన శ్రీమన్నారాయణుని పావనమైన గుణగణము లన్నీ భావస్వరూపముగా కలవానిగా కీర్తించి స్వామికి నమస్కరిస్తున్నారు. సూర్యచంద్రులు రెండు కన్నులగా కల ఆ స్వామి అధరం ఎఱ్ఱని సూర్య బింబంలావుండట. శ్రీవేంకటగిరి శిఖరం మీద విహరిస్తుంటాడట ఆ శ్రీనివాసుడు. శ్రీవనితా హృదయాధినాధుడయిన ఆ స్వామి స్తుతి హంసధ్వని రాగంలోవున్నది.

**ఆ.వె॥పావన గుణములవి భావస్వరూపంబు**
**దాల్చినట్టి దేవ! దండములివె**
**అమర కీర్తనంబు అన్నమయ్యది విని**
**వేంకటగిరి నాథు వేడరేల?**

**రాగం : హంసధ్వని**

దేవ నమో దేవ
పావన గుణగణభావా ॥దేవనమో॥

జగదాకారా చతుర్భుజా
గగన నీలమేఘశ్యామా
నిగమ పాదయుగ నీరజనాభ
అగణిత లావణ్యానన ॥దేవనమో॥

ఘనవేదాంతైర్గణన వుదార
కనక శంఖ చక్ర కరాంక
దినమణి శశాంక దివ్యవిలోచన
అనుపమ రవి బింబాధరా ॥దేవనమో॥





భావజ కంజభవ జనక
శ్రీవనితా హృదయేశ
శ్రీవేంకటగిరి శిఖర విహార
పావన గుణగణ భావా ॥దేవనమో॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! దేవా! నీకు నమస్కారములు. ఓ దేవా! పుణ్యప్రదమైన గుణగణములన్నీ భావస్వరూపముగా కలమహానుభావా! నీకు వందనములు.

నీవు జగత్తే ఆకారముగా గలవాడవు. నిన్ను సాకారుడిగా భావించువారికి నాలుగు భుజములు గల నీల గగనఘనశ్యాముడవు. వేదములే పాదములై నీకు ఆధారమైనవి. పద్మము నాభియందుగల పద్మనాభుడవు. నీ వదనము యొక్క లావణ్యము గణించుటకు అసాధ్యమైయున్నది. అట్టి నీకు అనేక వందనములు.

ఓ తిరుమలనాథా! నీవు ఘనులైన వేదాంతుల చేత మాత్రమే ప్రతిపాదింప దగినవాడవు. బంగారు శంఖ చక్రములను కరయుగళమునందుగల దివ్యరూపుడవు. సూర్యచంద్రులు నీకు దివ్య నేత్రములై దీప్తించుచున్నారు. ఎఱ్ఱని సూర్యబింబము వంటిడి నీ అధరమును వేరొక దానితోపోల్చుటకు అలవికాకున్నది. అట్టి నీ దివ్య రూపమునకు వందనములు.

ఓ దేవదేవా! నీవు భావమునుంచి జనించు మన్మథునికి పద్మమునుంచి పుట్టిన బ్రహ్మదేవునికి తండ్రివి. శ్రీలక్ష్మీ హృదయాధినాధుడవు. శ్రీవేంకటాద్రి శిఖరముపై విహరించు మహనీయుడవు. పుణ్యప్రదమైన గుణగణములన్నీ భావస్వరూపముగా కల సర్వేశ్వరుడవు. అట్టి నీకు వందనములు.

## 3-77

## మున్నుడి

అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరునే సూటిగా అడుగుతున్నారు. తాము నీరుపోసి పెంచిన చెట్టుని సరిగా పెరగలేదని ఎవరన్నా పీకి పారేస్తారా? నేను మంచివాడిని కాను, నిజమే. కానీ నేను నీ బిడ్డనయ్యా! నన్ను నీవు క్షమించకపోతే ఇంకెవరు క్షమిస్తారు? నీవే నానేరాలన్నింటినీ లెక్కించి శిక్షిస్తానంటే సమస్త సృష్టికి యేలికవు నిన్ను కాదని నన్నెవరు రక్షిస్తారు? మా మొరలు వేల సంఖ్యను మించిపోయాయి వాటిని నీవు విచారించక పోతే ఇంకా ఎవరు పట్టించుకుంటారు? రావయ్యా తండ్రీ! నన్ను రక్షించు అంటున్నారు.

**ఉ॥ పెంచినచెట్టునెవ్వడును పీకడు ఆవలపారవేయగా**
**మంచి నరుండుగాడనుచు మన్నన వీడకు వేంకటేశ్వరా!**
**యెంచకు నాదు నేరములు యేలిక నీవు సమస్త సృష్టికిన్**
**మించినమామొరల్వినుము మేలునను జేయుముఅన్నమయ్యనెన్.**

**రాగం : వరాళి**

పెంచి తమ పెట్టు జెట్టు-పెరికివేయరెవ్వరు
మంచివాడగాకున్న- మన్నించకుండేవా ॥పెంచి॥

తెరవు దప్పియడవి-దిరిగేటివారి దెచ్చి
తెరువున బెట్టెదురు-తెలిసిన వారలు
నరుడనై నేరక-నడిచేటి నన్ను నీవు
మరిగించి కావక- మానవచ్చునా ॥పెంచి॥

దిక్కుమాలినట్టి వారి-దెచ్చిదయగలవారు
దిక్కయి కాతురు వారి-దిగదోయరు
తక్కక మాయలోబడి-దరిదాపులేని నన్ను
వెక్కసాన రక్షించక-విడిచేవా నీవు ॥పెంచి॥





ఆవల భయపడ్డవా-రంగడి బడితే దొర
లో వ(వు?)ల విచారించి- వూరడింతు రంతలోనే
శ్రీవేంకటేశ నీవు-సృష్టికల్లా నేలికవు
వేవేలు మామొర నీవు- విచారించకుండేవా ॥పెంచి॥

**భావామృతం :**

తామే స్వయంగా నాటి,నీరు బోసి పెంచిన చెట్టుని (దారికడ్డమొస్తున్నదని) ఎవరన్నా పీకి అవతలపారవేస్తారా? నేను మంచి వాడను కాను. (ఆ మాట నిజమే. కానీ నేను నీ బిడ్డను). అందుకని నన్ను నీవు మన్నించవా? (మరి నన్నెవరు రక్షిస్తారు?)

అడవిలో ప్రయాణించే వారు దారి తప్పటం సహజం వాడిదారిన వాడు పోతాడులే అని దారితెలిసిన వారు వాడిని వదలివేస్తారా? నేను నరుడను. కామక్రోధముల వంటి వాటిచే పీడితుడను. తెలియక తప్పుదారిలో పోతున్నాను అటువంటి నన్ను ఇంకా వాటికి నన్ను మరిగించి (అలవాటు చేసి) రక్షించకుండా వుండవచ్చునా? ఇది నీకు న్యాయమేనా?

దయగలిగిన వారు దిక్కులేని అనాథలను తెచ్చి వారికి తామే దిక్కయి రక్షిస్తారు. వాళ్ళని దయలేక దిగదోయరు (విడనాడరు) తక్కక (విడువక) మాయలో బడి, దశ దిశలేని నన్ను మిక్కిలి దయామయుడవై రక్షించక, పోతేపోయాడులే అని నన్ను విసర్జించవచ్చునా? ఇది నీకు తగిన పనియేనా తండ్రీ!

ఎవరన్నా భయపడిన వాళ్ళు అంగడిబడి (తమ కొలువుకు) వచ్చి ఆశ్రయిస్తే దొరలయిన వారు వాళ్ళభయం పోగొట్టి, ఓవల (ఉచితరీతిని) రక్షిస్తారు కానీ వదలివేస్తారా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు సృష్టి కర్తవు, సృష్టి భర్తవు. అనంతుడవు. అనంతములైన మా మొరలను విని ఈ సంసారపీడితులమైన మమ్ము రక్షించాలి గాని మాగతి విచారించకుండా విడిచి పుచ్చవచ్చునా? వద్దు తండ్రీ! మమ్మల్ని విడిచిపెట్టకు.

## 3-78

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరునికి నిత్యకళ్యాణ సంప్రదాయాన్ని అన్నమాచార్యులవారే ప్రారంభించరని పెద్దలంటారు. మనం చేసికొన్న పుణ్యమేమో నేడు ఆ నిత్య కళ్యాణవైభవాన్ని కళ్ళారాచూస్తున్నాం మనం. ఒకానొక కళ్యాణ సందర్భంలో అన్నమయ్య ఆ కళ్యాణంలో వివిధ పుష్పాలతో అమ్మవారు అయ్యవారు పుష్పతలంబ్రాలు (సేసలు) చల్లు కొంటుంటే ఆ పుష్పాలు వారిపై పడ్డాక ఎలా అగుపిస్తున్నాయె సరసంగా భావించారు. ఎంత అద్భుతమైన భావనంటే... కళ్ళు మూసుకొని మీరు తిరుమలలో చేరండి...ఎన్ని పుష్పాలో! అవెట్లావున్నాయంటే ...ఆ అందములు 'అదన'య్యాయుట అంటే...సమయానికి తగ్గట్లు మారిపోయాయట...అంటే....

**కం॥ "కందువ మీ కళ్యాణపు**
**అందంబుల్ ఆయెనదను" అన్నయనెరా**
**ఇందీవరాక్షు గొలిచెను**
**సుందరమగు కీర్తనంపు సొంపును గనుడీ**

**రాగం : దేశ్**

కందువ మీ నిచ్చ కళ్యాణమునకు
అందములాయను అదననివి ॥కందువ॥

కలువల సేసలు కలికికి నీకును
సొలవక చూచేటి చూపులివి
చిలుకుల మొల్లల సేసలు మీలో
నలుగడ ముసిముసి నవ్వులివి ॥కందువ॥

తామరసేసలు తలకొనె మీకును
మోము మోమొరయు ముద్దులివి
సేమంతి సేసలు చెలియకు నీకును
చేమరి గోళ్ళ చెనకులివి ॥కందువ॥





సంపెంగ సేసలు సమరతి మీకును
ముంపుల వూర్పుల మూకలివి
యింపుల శ్రీవేంకటేశ చెలి కలసి
సంపద తేలితి చనవులివి ॥కందువ॥

**భావామృతం :**

తండ్రీ! శ్రీ వేంకటేశ్వరా! మీ నిత్యకళ్యాణ వైభవం యొక్క అందాలు అన్నీ అదనయ్యాయి (క్షణ క్షణానికి సమయానికి తగ్గట్లు మారి పోతున్నాయి.) వాటి వివరాలు విను స్వామీ!

అతివేగంగా సేసలు (తలంబ్రాలు) పోసుకొని అలసిపోయి మీరు ఒకరినొకరు చూచుకొంటున్నారు. మీరు పోసుకొంటున్న 'కలువపూల సేసలు' అదిగో నీవూ అమ్మవారు చూసుకునే చూపుల్లావున్నాయి. నలుదిక్కుల ప్రసరించుచున్న మీ ముసిముసి నువ్వుల కాంతులలే'చిలుకలు మొల్లల సేసలు (చల్లుకొనుచును) మొల్ల పుష్పముల తలంబ్రాలు)

మీ ఒరయుమోములు (ఒరిపిడినొందిన వదనములు) ముఖపద్మములై నందున చుంబనములచే ఎఱ్రబడి తామరపూవులై మీరు చల్లుకొనుచున్న తామరపూల సేసల వలెనున్నవి. మీ చేమిరి గోళ్ళు చెనకులు'(మీ మీ వాడి గోళ్ళు గీట్లు) నీ చెలికీనీక్కూ చామంతి పూల రేకులు విడిపోయి ఒంటిపై విస్తరించి, ఆ నఖ క్షతములే ఈ చామంతి రేకులా అన్నట్లున్నవి. (చేమిరి, అంటే, కాగిన పాలు తోడుపెట్టేటప్పుడు మజ్జిగ చుక్కలు మొనగోటితో వేయటం)

మీ సమరతి కూటమిలో ముంచుకొని వస్తున్న మీ నిట్టూర్పులెలావున్నాయంటే ఇప్పుడు మీరు చల్లుకొంటున్న సంపెంగపూల సేసలే ఆ వూర్పులా అన్నట్లున్నాయి. అవే ఇవి, ఇవే అవి అనిపించుట చేత ఎంతో ఇంపుగానున్నవి. ప్రభూ! తిరుమల నాయకా! నీవు నీ చెలితో కూడి ఐశ్వర్యములలో తేలుతున్నావు. మీ అనురాగములే మీ వైభోగములై అలరారుచున్నవి.

## 3-79

## మున్నుడి

జాజర అంటే వంచన అని అర్థం. ప్రేయసీ ప్రియులు, బావామరదళ్ళు సరసంగా ఒకరిపై ఒకరు రంగులు, వసంతం పూల పుప్పొడి చల్లుకొని నృత్య గానాలతో పరవశించే వేడుకని జాజర అని పిలుస్తారు జానపదులు. శృంగార పురుషుడైన శ్రీవేంకటేశుని వలచి వేదనకు గురైన ఒక భామిని, ఇక నీ జాజర చాలు స్వామీ! ఈ జాజర 'జావి బరచెను' నన్ను అంటోంది. 'జాలి బరచెను' అంటే అసలు అర్థం... మనఃఖేదము అప్పుగా ఇస్తున్నదని అంటే నీ జాజర చివరకు నాకు దుఃఖాన్నే మిగులుస్తుందని. అన్నమాచార్యులవారేవొక భామిని అయి, ఈ విధంగా భావిస్తున్నారు.

**ఆ.వె॥'జాలిబరచు' నీదు జాజర చాలురా**
**వలపు వేదనలకు వాడిపోతి**
**తివిరి వేంకటేశు 'కవుగిటి' కబ్బితి**
**అన్నమయ్య పాట అద్భుతముర**

**రాగం : ముఖారి**

చాలు చాలునీ జాజర నన్ను
జాలి బరచె నీ జాజర ॥చాలు చాలు॥

వలపు వేదనల వాడేను యీ-
తలనొప్పులచే దలకేను
పులకల మేనితో బొరలేను కడు-
జలిగొని చల్లకు జాజర ॥చాలు చాలు॥

బల్లని నినుగని వుడికేను నీ-
చిల్లర చేతల జిమిడేను
కల్ల గందవొడి గాగేను
జల్లకు చల్లకు జాజర ॥చాలు చాలు॥





తివిరి వేంకటాధిప నేను నీ-
కవుగిటి కబ్బితి గడు నేను
రవ రవ చెమట గరగి నేడుయిదె
చవులాయను నీ జాజర ॥చాలు చాలు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ ఈ వలపు జాజర ఇక చాలుచాలు. అది చివరికి నాకు మనఃఖేదమునే ఎరవుగా నిస్తుంది. (అప్పు ఇస్తుంది) అటువంటప్పుడు నాకెందుకీ తలనొప్పి).

(అయినా నాకు బుద్ధిలేదు). నీ వలపు నాకు కలిగించే పరితాపంలో వాడిపోతూనే వుంటాను. ఆ తలనొప్పితో తలకేను (చలించిపోతూనే వుంటాను)

నా శరీరం పులకరింతలతో పొరలుతూనే వుంటాను ఈవిధంగా 'జలిగొని' (అతిశయించి) నాపై నీవు జాజర చల్లవద్దు స్వామీ! (నేను తట్టుకోలేను).

స్వామీ! బల్లని (బలవంతుడవైన) నిను గని వుడికెను. (ఉక్రోషంతో వుడికిపోతాను). ఇకనీ చిల్లర వేషాలకి చిమిడేను (జావగారి పోతాను). నీ అబద్ధాలతో కందువడి (తపించిపోయాను) పోయాను, కాగిపోయాను. ఇక చాలు చాలు. నాపై నీ జాజర చల్లవద్దు. (నన్నింకా మోసం చేయవద్దు).తివిరిఇక్కడ 'తివిరి' అంటే కుతూహలముతో అనే భావంతో అన్నమయ్య ఈ పదం వాడారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను చివరికి (దొరికి పోయాను). నీ పెనగులాటలో పట్టిన చెమటలో ఈరోజు కరగిపోయాను. అందుకని, ఇదివరకు నన్నెంత ఏడిపించినా నీ జాజర చాలా ఆసక్తికరంగానే వున్నది ప్రభూ!

**3-80**

## మున్నుడి

ఆత్మకు, దేహం తోడులేకపోతే శ్రీహరిని చేరే మార్గమే లేదు. కానీ దేహాన్ని ధరించగానే ఈ ఆత్మను 'హరిమాయ' ఆక్రమించి రుచుల మీద, కోరికల మీద, సుఖముల మీద ధ్యాస పోతుంది. అవి తీరక క్రోధం కలుగుతుంది. ఈలోగా కాలం 'టిక్‌టిక్' మని గడిచి పోతూనే వుంటుంది. ఇక సరే నిద్ర తమోగుణ నిలయమే. కానీ మూడవవంతు జీవితం దానికోసమే వెచ్చిస్తున్నాము, కదా! మరి ఇవన్నీ సత్యరూపుడైన ఆత్మకు రోత కలిగించే విషయములే. కర్మల ఫలంగా జన్మలు తప్పటంలేదు. ఇదంతా ఒక 'లంపటం' అయింది ఆత్మకు. దిక్కెవరు? అంటున్నారు అన్నమాచార్యులవారు.

**చం॥ హరిశరణాగతొక్కటియె ఆయన చెంతకు జేర్చు 'ఆతుమమని'**
**అరయగ ఇంద్రియములాత్మను దూరము చేయుతోడవన్**
**మురియగ జేయు భోగములు ముద్దుల భామలు అన్నమయ్యనెన్**
**తిరుమలనాథు సత్కృపయె దీటు ప్రమాణము ఆత్మనెంచగన్**

**రాగం : కళ్యాణి**

హరిశరణాగతి యాతుమది
సరుస నిదియ పో సతుమయ్యెడిది ॥హరి॥

దినదిన రుచులివి దేహమువి
చెనకేటి కోరిక చిత్తమువి
యెనసేటి కాంతలు యింద్రియంబులవి
పనివి యాత్మకివి పనిలేదయ్యా ॥హరి॥

పదలే(రే)టి కోపము పాపమువి
అదన కాలములు అనాదివి
నిదుర తమోగుణ నిలయమువి
యెదుట నాత్మకివి యెరవెరవయ్యా ॥హరి॥





కాయపు జననము కర్మమువి
మాయ లంపటము మమతలవి
యేయెడ శ్రీవేంకటేశుడితని కృప
పాయని యాత్మకు ప్రయాణమయ్యా ॥హరి॥

## భావామృతం

శ్రీహరిని 'శరణు' అనుటయే ఆత్మను ఆయన సరుసకు (సమీపమునకు) చేర్చుటయగును. ఇదియే పో గొప్ప సత్యము. ఓ తిరుమలయ్యా! ఇది చిత్తగించుము.

ప్రతిదినము అనేక రుచులను కాంక్షించునది దేహము (ఆత్మ కాదు సుమా!). ఆకర్షణకు లోబరచి కోరికలను కలిగించేది చిత్తము (ఆత్మకాదు). కాంతల వంటివి ఇంద్రియములు (వాటిగోల వాటిదే కాని నీ మంచి చెడ్డలు ఆలోచించవు). 'పనివి ఆత్మకు' (నియోగించబడిన ఆత్మకు ఈ దేహాదులతో పనిలేదయ్యా! స్వామీ!

తొందర పాటు కలిగించు ఆగ్రహము (పదలేటి కోపము) గొప్ప పాపము. ఇకపోతే కాలమునకు ఆది అనునదియే లేదు. మనిషి నిదురించే కాలమంతా నిరుపయోగమైన తమోగుణ ప్రధానమైనది. దానివల్ల నష్టమే కాని లాభంలేదు. ప్రత్యక్షముగానున్న ఆత్మకు ఇది యెరవెరవయ్యా! (రోత కలిగించు విషయము) అందువలన యేమో, ఆత్మ ప్రత్యక్షముగా తోచదు.

ఆత్మ శరీరం ధరించి జన్మించుటకు కారణమెవరు? పూర్వజన్మలలో అది చేసికొన్న కర్మ మాత్రమే. ఇకపోతే మమత వలన మాయదారి లంపటాలు (తగులములు) కలుగుతున్నాయి. ఎక్కడెక్కడైనా ఆ శ్రీవేంకటేశ్వరుని కృప ఈ ఆత్మకు విడువని ప్రమాణము, అనగా ఆ స్వామి కరుణ సత్యమైన సాక్ష్యము.

## 3-81

## మున్నుడి

తండ్రి అన్నమయ్య బాటలో నడిచి, అనేక అద్భుత కీర్తనలు శ్రీవేంకటేశ్వరునిపై చెప్పిన పెదతిరుమలయ్య అహోబల నృసింహుని (ఔ భళ నరసింహుని) శ్రీవేంకటేశ్వరునిగా భావించి చెప్పిన అమృత వాహిని ఇది. భయంకరంగా హిరణ్యకశిపుని చీల్చి చంపినెత్తురు తాగిన వాడు కూడా, ప్రహ్లాదుని భక్తికి, శ్రీసతి సౌందర్యానికి లొంగిపోయి భక్తునికి వరాలు, నళినాక్షికి వలపు ఇచ్చాడు. పనిలో పనిగా అనాథలకూ నాథుడై జగన్నాథుడై సిరిసంపదలే కాక అర్థులకి అల్లదిగో వైకుంఠం కూడా ఇచ్చాడు.

**ఆ.వె॥ ఔను జాణడవుర ఔ భళ నరసింహ**
**ఆనలిట్లు వెట్టకనెను పెద్ద-**
**తిరుమలయ్య కొలిచె తిరుమలేశుగ నెంచి**
**తండ్రి బాట నడుచు తనయుడతడె.**

**రాగం : తిలంగ్**

ఔనయ్యా జాణడవు ప్రహ్లాద వరద
ఆనలు వెట్టకుము ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

వేసరక శ్రీసతితో వేడుక నవ్వులు నవ్వీ
ఆసలు చూపేవు ప్రహ్లాద వరద
సేస వెట్టిన చేతుల చెరగువట్టి తీసేవు
ఆ సుద్దులు చెప్పేను ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

నంటున తొడమీదను నలినాక్షినెక్కించుక
అంటేవు సిగ్గులు ప్రహ్లాదవరద
గెంటక ఏ పొద్దును కేలు కేలు కీలించుక
అంటువాయ వదివో ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥





కందువతో కౌగిలించి కైవసము సేసుకొంటి
వందముగ నీకెను ప్రహ్లాద వరద
పొంది శ్రీవేంకటమున పొంచి ఔభళములోన
అంది వరాలిచ్చేవు ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

## భావామృతం

ఓ ప్రహ్లాద వరదా! అహోబల నృసింహా! ఔనయ్యా! నీవు జాణతనంగలవాడవే. మాకు ఆనలు (నిర్బంధము కలిగించు షరతులు) పెట్టవద్దు తండ్రీ! (నీవు పెడితే మేం తట్టుకోలేము, మేము పెడితే నీవు అవలీలగా దాటివేస్తావు).

వేసరక (సునాయాసంగా) శ్రీలక్ష్మీతో విలాసముగా నవ్వులొలక బోస్తున్నావు. ఆమెకు ఆస (అపేక్ష) చూపుచున్నావు. ప్రహ్లాదుని దీవించావు. సేసవెట్టిన (అక్షతలు చల్లన) ఆ చేతులతోనే నిర్బంధించి హిరణ్యకశిపుని ప్రాణలు తీసేవు. ఓ ప్రహ్లాద వరదా! నేను ఆ సుద్దులు చేప్పును (ఆ కథలను వివరిస్తాను.

ఓ ప్రహ్లాద వరదా! పద్మనేత్రియైన శ్రీలలనను నంటున (స్నేహముతో) నీతొడపై కూర్చుండబెట్టుకొని ఆమె సిగ్గులను (లజ్జను) స్పృశించెదవు. ఏ సమయముననైనా ఆమెను గెంటక (నెట్టివేయక), కేలుకేలుకీలించి (చేయి చేయి తగలించి), అంటువాయవు (విడనాడవు)

కందువతో (సామర్థ్యముతో) అందముగ ఈకెను (ఆమెను) కౌగలించి నీ వశము చేసికొంటివి. శ్రీవేంకటగిరిపై ఈమెనా విధముగా పొంది, ఇక్కడ ఈ ఔభళములో (అహోబలంలో) అంతులేని వరములను అనుగ్రహించుచున్నావు.

## 3-82

## మున్నుడి

అన్నమాచార్యులవారి తత్త్వ బోధాత్మకమైన చక్కటి సంకీర్తన ఇది. స్వచ్ఛతకు, పవిత్రతకు, సత్త్వగుణానికి హంసను ఒక గుర్తుగా చెబుతారు. అటువంటి గుణములున్న గొప్పయోగులను పరమహంస అని కూడా అంటారు. అన్నమయ్య యోగులకే పరమయోగియైన గీతాచార్యుని, పరమాత్మస్వరూపుని హంసతో పోల్చి, జీవుల పాపపుణ్యములనే నీటినీ పాలనీ వేరుచేసి పాలు (పుణ్యం) మాత్రమే గ్రహించి పాపము అనే నీటిని వదలివేస్తాడు అంటున్నారు. అది ఆయన 'వాసుదేవా' తత్త్వం. ఎంత చెప్పినా దీని వివరణ ఆమూలాగ్రం చెప్పటం అసాధ్యం. ఉదాహరణకి ఈ పద్యమే.... తలకెక్కదు. భావామృతం చదివిప్రయత్నించండి.....

**కం॥ ఉబ్బుజలంబులదేలెను**
**అబ్బురముగ నొక్కహంస అన్నయ్యనెరా**
**దిబ్బలు వెట్టుచు తిరిగెను**
**అబ్బో! తలమునకలైతి నర్థము తెలుపన్.**

**రాగం : ఖరహరప్రియ**

దిబ్బలు వెట్టుచు దేలిన దిదివో
ఉబ్బు నీటిపై నొక హంస ॥దిబ్బలు॥

అనువున కమల విహారమె నెలవై
ఒనరియున్నదిదె ఒక హంస
మనియెడి జీవుల మానవ సరసుల
వునికి నున్నదిదె ఒక హంస ॥దిబ్బలు॥

పాలు నీరు వేర్పఱచి పాలలో
నోల లాడెనిదె వొక హంస
పాలుపడిన యీ పరమ హంసముల
ఓలి నున్న దిదె వొక హంస ॥దిబ్బలు॥





తడవి రోమ రంధ్రంబుల గ్రుడ్లను
ఉడుగక పొదిగీ నొక హంస
కడువేడుక వేంకటగిరి మీదట
వొడలు పెంచె నిదో వొక హంస ॥దిబ్బలు॥

## భావామృతం

ఒక హంస ఉబ్బునీటిపై (సముద్రము మీద) దిబ్బలు వెట్టుచున్ తేలినది (అది ఒక ఉన్నతమైన భూ భాగమా అనునట్లు తేలి యాడినది).

(అనగా ఆ హంసకు సముద్రమనిన వెఱపులేదు. చెడును మంచినుంచి వేరు చేసి, జీవుల మంచిని మాత్రమే గ్రహించి చెడును వారి 'కర్మ'కే వదలి వేసే పరమహంస ఇది). దాని తత్త్వాన్ని వినండి.

అది ఒకానొక హంస. అది అనవున (సౌకర్యముగా) కమల విహారము (పద్మముల మధ్య విహరించుట) నెలవై (దాని స్థానమై) ఒనరియున్నది (ఒప్పుచున్నది). హంసగా అది దాని ప్రవృత్తి. పరమహంసగా అనగా శ్రీమన్నారాయణునిగా దాని కమల విహారము, కమల (లక్ష్మీదేవి) మానసమందు విహరించుటయే. జీవుల మానస సరోవరములందు మనియెడి (వుండే అలవాటుగల) ఆ హంసవునికి ఇదియే. అనగా పరమహంసయైన ఆ పరమాత్మకు ఆశ్రయం జీవుల 'మానస' సరోవరములే.

హంసయెలాగైతే పాలనుండి నీటిని విడదీసి స్వచ్ఛమైన పాలను మాత్రమే గ్రహిస్తుందో, ఈ పరమహంస పాప పుణ్యములు కలిసియున్న జీవుల కర్మలలోనుంచి వారి పుణ్యమనే పాలను విడదీసి పాపమనే నీటిని వదిలివేస్తాడు. అది పురాకృత కర్మగా వారు అనుభవించాక స్వచ్ఛమైన ఆ జీవాత్మయే పరమాత్మలో ఐక్యమై వాసుదేవ సిద్ధి పొందుతుంది. అట్లు ఒకహంస, పాలుపడిన పరమహంసల (తనకాశ్రయించిన పరమయోగుల) ఓలి నున్నది (వరుసలో నున్నది). అనగా పరమాత్మ పరమయోగులందరి దగ్గరగా వుంటాడని అర్థం.

ఒక హంస, తడవి (అనురాగముతో స్పృశించుచూ) రోమరంధ్రములలో ఒక్కొక్క బ్రహ్మాండం చొప్పున అసంఖ్యాకమైన గ్రుడ్లను పొదుగుచున్నాడు. అవి మళ్ళీ జీవుల నిలయాలై వర్ధిల్లుతున్నాయి. ఇది అనంతం. నేడు మనందరికోసం, ఒక హంస మిక్కిలి వేడుకతో వేంకటాద్రిపై వొడలు పెంచుకొనినది. (రెక్కలను విస్తరింప చేసి హంస యెలా తన 'కూన'లను రక్షిస్తుందో, అట్లు వ్యాపించి కూనలమైన మనని రక్షిస్తోంది. ఆ హంసయే శ్రీవేంకటేశ్వరుడు.

## 3-83

## మున్నుడి

గీతాచార్యుడైన శ్రీకృష్ణపరమాత్మ యజ్ఞమునందు యజ్ఞమూర్తి (యజ్ఞరూపుడు), యజ్ఞ భోక్త (స్వీకరించువాడు), యజ్ఞకర్త (నిర్వహించేవాడు), యజ్ఞఫలప్రదాత అన్నీతానే నన్నాడు. అన్నమయ్య అదే పునరుద్ఘాటిస్తున్నారు ఈ కీర్తనలో. జీవులలో ప్రాణం రూపంలో వున్నవాడే మన పూజలన్నీ స్వీకరిస్తున్నాడు.ఆయన పాదములనుండి పుట్టిన గంగవలననే జీవుల దాహం తీరుతున్నది. ఆయన నెలకొల్పిన పుణ్యతీర్థాల వలననే అనుక్షణం పాపాలు చేసే జీవులు నరకం తప్పించుకొంటున్నారు. వేదములను రక్షించి తిరిగి మానవుల కిచ్చిన ఆయన నివేదమంత్రాలతో పూజించటం మన కనీస ధర్మం కదా! నేడు ఆయనే శ్రీవేంకటేశ్వరుడైతే.. ఇంకా ఆలోచన దేనికి?

**ఉ॥ యజ్ఞపు కర్తవయ్య హరి! యజ్ఞపు భోక్తవు యెంచి చూడగా**
**యజ్ఞపు మూర్తివీవనుచు అన్నయపాడెను కీర్తనంబు, ఆ**
**యజ్ఞ ఫలంబు రూపయిన ఆతడు వేంకటనాథుడంచనెన్**
**విజ్ఞత వేదమంత్రముల విష్ణుని గొల్చెదరెల్లరీభువిన్**

**రాగం : ఖమాస్**

యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాది ఫలరూప మిటు నీవై వుండవే ॥యజ్ఞ॥

పరికించ జీవులకు ప్రాణమలైన నీకు
నిరతి ప్రాణ ప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ము గాచెడి కొరకు
హరినీ మూర్తి ప్రాణమావహించవే ॥యజ్ఞ॥

జగతికి నీ పాద జలమే సంప్రోక్షణ
జిగినీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేక మందవే ॥యజ్ఞ॥





వేదములు తెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు
వేద మంత్రముల పూజావిధి సేసేమా
యీ దెస నీ దాసులమైన మమ్ముగాచుట కొరకు
వేదమూర్తివై యిందే విచ్చేసి ఉండవే ॥యజ్ఞ॥

## భావామృతం

స్వామీ! యజ్ఞమూర్తివి, యజ్ఞ భోక్తవు, యజ్ఞకర్తవు, ఆ యజ్ఞఫలప్రదాతవు కూడా నీవే. ఇవన్నీ నీవై వుండగా ఇంకా భగవంతుడవు నీవు కాక మరెవ్వరు?

మేమెంత బుద్ధిహీనులమయ్యా!! పరికించి చూస్తే జీవులన్నిటిలోనూ ప్రాణం రూపంలో వున్నదెవ్వరు? నీవే. అట్టి నీకు ఏము(మేము) నిరతితో (అత్యంతాసక్తితో) ప్రాణ ప్రతిష్ఠ చేసి పూజిస్తున్నాము. నీకు ప్రాణమివ్వటానికి మేమెవ్వరం తండ్రీ! అయినా మమ్మల్ని క్షమించి మా పూజల్ని స్వీకరించటానికి మమ్మల్ని రక్షించటానికి ఈ మూర్తి రూపాల్లో ప్రాణ రూపంలో ఆవహించివుండు ప్రభూ!

ఈ సమస్త సృష్టికీ నీపాద జలమైన గంగానది, దాహం తీరుస్తున్నది. దాన్ని సంప్రోక్షించుకొని (నెత్తిపై చల్లుకొని) మేము పాపవిముక్తులమవుతూన్నాము. కాని మేము జిగితో (గొప్పగా) నీకు సంప్రోక్షణచేసి పూజిస్తున్నాము. ఇది ఎంత అవివేకమైన పని? అయినా నేడు నన్ను సగటున (బాహాటముగా) పాప విముక్తుని చేయుటకు అన్ని పుణ్యతీర్థములలోనూ నాచేత అభిషేకములను స్వీకరించి నన్ను అనుగ్రహించు. నీ అంతటివాడిని అభిషేకించాననే తృప్తి నాకు కలిగించు. శ్రీవేంకటేశ్వరా! వేదములను తెచ్చిన (సోమకాసురుని మత్స్యావతారంలో సంహరించి తెచ్చినవాడు శ్రీహరి). అట్టి నీకు, ఏము (మేము), (నేము అనే పాఠంలో వున్నది. నేము అంటే ధాన్యం చెరుగుట అని అర్థం) వేదమంత్రాలు వల్లిస్తూ పూజచేస్తున్నాం. సరే మా అజ్ఞానమది. అయినా ఓ మహానుభావా! ఈ చోట మమ్మురక్షించుటకు నీ దాసులమైన మమ్ము కరుణించి ఈ మూర్తిలోనికి వేదమూర్తివై వచ్చి ఇందులోనే నెలకొని మమ్ము ధన్యులను చేయుము తండ్రీ!

**3-84**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చక్కటి సందేశం ఇస్తున్నారు ఈ కీర్తనలో. భూమిమీద యెన్ని తపస్సులు చేసినా హరిని కీర్తించిన వాడు మాత్రమే పూజ్యుడు. పండినదే విత్తనం , రాజు మెచ్చినదే పట్టపురాణి, యజమాని మెచ్చిన వాడే మేలైన బంటు. దానంచేసిందే అక్కరకొచ్చే ధనం. ధర్మవర్తనుడే నిజమైన కొడుకు. శ్రీవేంకటేశ్వరుని సన్నుతించేదే వున్నతమైన చదువు. ఈ కీర్తనలో అన్నమయ్య చేసినాను, జల్లినాను, కొలిచినాను, కలిగినాను – వంటి ఉత్తమ పురుష ఏకవచన ప్రయోగాలు చేశారు. అవి అట్లు భ్రాంతి కలిగిస్తాయి. కానీ 'చేసినను', జల్లినను – అనే అర్థం చేసికొనవలెను.

**చం॥ ధరణి మరెందరో మునులు తాపములెన్ని యొనర్చి వేగినన్**
**హరికృప గాంచువాడె తగనన్నిట బూజ్యుడు అన్నమయ్యనెన్**
**సిరియది యెంత గల్గినను చేయక దానము సాయమీయునా?**
**తిరుమలనాథు గొల్వనిదె దేనికి ఆ చదువంత కాల్వనా?**

**రాగం : దేసాళం**

ధరణినెందరెన్ని – తపములు చేసినాను
హరికృప గలవాడే – అన్నిటా బూజ్యుడు ॥ధరణి॥

మితిలేని విత్తులెన్ని – మేదినిపై జల్లినాను
తతితో విత్తినవే – తగ బండును
ఇతర కాంతలు మఱి – యెందరు గలిగినాను
పతి మన్నించినదే – పట్టపు దేవులు ॥ధరణి॥

పాలుపడి నరులెన్ని –పాట్లుబడి కొలిచినా
నేలికి చేపట్టిన వాడే –యెక్కుడు బంటు
మూలనెంత ధనమున్నా – ముంచి దాన ధర్మములు
తాలిమితో నిచ్చినదే – దాపురమై నిల్చును ॥ధరణి॥





ఎన్నికకు గొడుకులు – యెందరు గలిగినాను
ఇన్నిటా ధర్మపరుడే – యీడేరును
ఉన్నతి జదువులెన్ని – వుండినా శ్రీవేంకటేశు
సన్నుతించిన మంత్రమే – సతమై ఫలించును ॥ధరణి॥

**భావామృతం**

ఈ లోకంలో యెందరెన్ని తపస్సులు చేసినప్పటికీ, హరికృప పొందినవాడు మాత్రమే అన్నింటిలోను పూజకు అర్హుడు.

తతితో (అదనుతో) విత్తనాలు భూమిలో నాటకుండా యెన్ని విత్తనాలు చల్లినా లాభమేముంది? బాగుగా దున్నిన నేలలో అదను చల్లిన విత్తనమే మొలకెత్తుతుంది. ఒకరాజు చేరదీసిన స్త్రీలెంత మంది వున్నా అతని మన్నింపు పొందినది మాత్రమే పట్టపు రాణిగా పరిగణించబడి రాజ్యాన్నేలుతుంది.

ఒక ఏలిక (ప్రభువు) వద్ద యెంతమంది భృత్యులు వూడిగం చేస్తున్న వారంతా పాలుపడి, పాట్లుపడి కొలిచినా వ్యర్థమే. ఆయన నమ్మిన బంటు మాత్రమే ముఖ్యమైన అధికారి అవుతాడు. తక్కినవారంతా జీతం తీసికొనే పనివాళ్ళు మాత్రమే. మూలనెంత ధనం వున్నా ( ఆరోజుల్లో ధనవంతులు ఇంట్లో వొక మూల త్రవ్వి, బిందెల్లో నాణెముల రూపంలో వున్న ధనం పోసి, ఒక వస్త్రంతో మూసికట్టి, పాతిపెట్టి దాచి వుంచేవారు. ఒక బిందెకు ఇంకొక బిందెకు 'లంకె' వేసి ఇంకో తాడు కట్టేవాళ్లు. అవి వాళ్లకి ఉపయోగపడక ఆ తరువాత యెవరికో దొరికి వారికి వుపయోగపడేవి. అవే 'లంకెబిందెలు' అనేవారు. అది నిరుపయోగమే. తాలిమితో (శ్రద్ధతో), ముంచి (అతిశయించి) దానధర్మం చేసినది మాత్రమే దాపరమై (ప్రాప్తమై) జన్మాంతరములలో అక్కరకొచ్చును.

ఎన్నికకు (లెక్కించుటకు) ఎంతమంది కొడుకులున్నా వాళ్లు నిరుపయోగులే. ఇన్నిటా (ఇందరిలోనూ) ధర్మవర్తనుడు మాత్రమే ఈడేరుతాడు (తల్లిదండ్రిని, కడతేరుస్తాడు) అహో!! అన్నమాచార్యా! ఆరువందల ఏళ్లక్రిందనే, ఎంత సత్యం చెప్పావయ్యా!) ఉన్నతమైన చదువులు యెన్నివున్నా శ్రీవేంకటేశ్వరుని సన్నుతించె మంత్రం (ఓం నమో వేంకటేశాయ) ఒక్కటే సతమైన (శాశ్వతమైన) ఫలితాన్నిస్తుంది. తక్కినవన్నీ వ్యర్థమైన చదువులే అవి బిరుదులవలె పేరు వెనకాలో ముందరో తగిలించుకోటానికి తప్పించి ఆ స్వామి కరుణ పొందటానికి అస్సలు... ఉపయోగపడవు)

**3-85**

## మున్నుడి

అన్నమాచార్యుల వారి కీర్తనల్లో గూఢార్థం ఒక్కొక్కప్పుడు ఒక పట్టాన అర్థమవదు. ఉదాహరణకి ఈ కీర్తనలో 'అంగపు' నన్నేచూచి అంతరాత్మ గంటి అనే వాక్యం. దేహము ధరించినది ఎవరు? అంతరాత్ముడు. 'నేను' అని అనుకుంటున్నది కూడా వాడే. దేన్ని 'నేను' అనుకుంటున్నాడు? దేహాన్ని. అంటే, అంగములు వున్న నన్ను అంతరాత్ముడు అని గుర్తించాను - అని ఆ వాక్యానికి అర్థం. మనలో శ్రీవేంకటేశ్వరుడే అంతర్యామిగా వున్నాడు. జీవ భావము తొలగిపోయి, మనలోని ఆ స్వామిని గుర్తించగలిగిననాడు ఆయన శ్రీపాదం తప్ప ఇంకేమీ కనిపించవు. ఆ స్థితి చేరగలమా?... ఏమో...

**కం॥ ఇన్నాళ్లునందు నందున**
**ఎన్నగ నేనేమి గంటి? హే శ్రీరమణా!**
**అన్నయ్య కీర్తనము విను,**
**"అన్నిటనే శరణుజొచ్చి హరిగంటి" ననెన్**

**రాగం : కాంభోజి**

ఇన్నాళ్ళు నందు నందు నేమిగంటిని
అన్నిటా శరణుచొచ్చి హరి నిన్నుగంటిని ॥ఇన్నాళ్ళు॥

అంగనల పస జిక్కి అలయికలే కంటి
బంగారు వెంటదగిలి భ్రమ గంటిని
ముంగిటి క్షేత్రాలంటి ముంచి వెట్టిసేయగంటి
అంగపు నన్నేచూచి అంతరాత్మగంటి ॥ఇన్నాళ్ళు॥

చుట్టాలజేరి చూచి సుద్దుల వావులు గంటి
మట్టులేని వయసుతో మదము గంటి
వట్టి కామములు సేసి వరుస మాయలు గంటి
పట్టి నారాయణాయని భక్తి నిన్నుగంటిని ॥ఇన్నాళ్ళు॥





వింత చదువుల వల్ల వేవేలు మతాలు గంటి
సంత కర్మముల వల్ల సాము గంటిని
యింతట శ్రీవేంకటేశ యిటు నా జీవ భావము
చింతించి అందులోన నీ శ్రీపాదాలు గంటి ॥ఇన్నాళ్ళు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్నాళ్ళూ, అందునందున్ (అక్కడక్కడా) ఏమేమి కంటిని (చూచితిని)? నీకు శరణు చొచ్చి (శరణని), అన్నింటిలోను హరివైన నిన్నే చూచాను. (ఇందుగలడందు లేడని సందేహము వలదు... అంటే ఏమిటో తెలిసింది).

నా తొలి జీవితంలో, స్త్రీల పస జిక్కి (చాతుర్యానికి లొంగిపోయి) అలయికలే గంటి (శ్రమ మాత్రమే పొందాను). బంగారము వెంట పరుగులు తీసి భ్రమ పడ్డాను. ముంగిటి క్షేత్రాలు (మధ్య ప్రదేశాలలో గల పొలాలు) కోసం ఎంతో, వెట్టి సేయగంటి (చాకిరీ చేశాను). కానీ... నేడు, అంగపు నన్నేచూచి (దేహం ధరించియున్న నన్ను గ్రహించి) నాలోని అంతరాత్ముని చూచాను.

పూర్వం నా బంధువర్గములందరితో కలిసి, సుద్దుల వావులు గంటి (వాయింపులవంటి వారి ఉచిత సలహాలు, మాటలు విన్నాను) వయస్సువల్ల కలిగిన మట్టులేని (అంతులేని) మదమును పొందాను. వ్యర్థమైన కోరికల వలన, వరుసగా అనేక మాయలకు లోనయ్యాను. నేడు అవన్నీ వదిలిపెట్టి నారాయణా అని భక్తితో నీ శరణుచొచ్చి నిన్ను కనుగొన్నాను. ఓ ప్రభూ! వింతగొలిపే అనేక చదువులు (శాస్త్రాలు) వలన ఏవేవో మతాలు చూశాను. సంత కర్మముల వల్ల సాముగంటి (ఏవేవో విద్యుక్త ధర్మాలు అనుకొని వాటితో అనేక వ్యాయామాలు చేశాను). అంతా.. అయిపోయింది. స్వామీ! ఏడుకొండలవాడా! ఇంతట (ఇప్పుడు), ఇటు నా జీవ భావము (నేను జీవిని అనే భావమును) చింతించి (గ్రహించి) అందులోనే నీ శ్రీపాదములను చూచాను. తండ్రీ! నేను ధన్యుడనయ్యాను.

**3-86**

## మున్నుడి

పవనపుత్రుడైన ఆంజనేయుని అన్నమాచార్యులవారు కపీశ్వరా! శరణు అని కీర్తిస్తున్నారు. సరవి యెంచి చూచిన ఆయన సాటివాడు లేడని అంటున్నారు. పుట్టిన వెంటనే ఆయన సూర్యుణ్ణి పండు అని పట్టుకోబోతే లోకాలు తల్లడిల్లి పోయాయట. మెరయుచున్న సంపదలు కలిగిన సంజీవని పర్వతాన్ని తీసికొని వచ్చిన నీపెంపు సొంపు పేర్కొన సాధ్యమా అన్నారు. ఈ చరణం వ్రాస్తుంటే నేటి మన చలన చిత్రాల్లో సంజీవని పర్వతంపై మెరిసె 'లైట్లు' యెందుకు పెడుతున్నారో అర్థమయింది. ఎవరి భావన వారది మరి!!

**మ॥ శరణంబో కపినాయకా! పవనజా! సామాన్యమా నీ కథల్**
**సరవిన్ యెంచగ నీదు బోంట్లు కలరే!! అన్నయ్య కీర్తించెరా**
**అరయంగా ఇపుడీవు వేంకటపతిన్ ఆరాధనల్ సేయుచున్**
**వరభక్తాళికి అండవైతివి కదా! పాడేము నీ సేతలన్.**

**రాగం : చారుకేశి**

శరణు కపీశ్వర శరణంబ నిలజ
సరవి నెంచ నీ సరి యిక వేరీ ॥శరణం॥

పుట్టిన వాడే భువనము లెరగగ
పట్టితి సూర్యుని పండనుచు
ముట్టిన చుక్కలు మోపుగ బెరిగితి
విట్టి ప్రతాపివి యెదురేదయ్యా ॥శరణం॥

అంపిన యప్పుడె యంబుది దాటితి
వింపులు సీతకు నిచ్చితివి
సంపద మెరయుచు సంజీవి దెచ్చితి
పెంపును సొంపును బేర్కొన వశమా ॥శరణం॥





చెదరక నేడే శ్రీవేంకటగిరి
గదిసి రాముకృప గైకొంటి
వదలక నీ కృపవాడనైతి నిదె
యెదటనే కాచితి విక గదవేమి ॥శరణం॥

**భావామృతం :**

కపిశ్రేష్ఠుడవైన ఓ ఆంజనేయా! శరణు జొచ్చెదను. పవనకుమారా! యెంచి చూడగావినీ సాటియైన వాడెవరూ సరవి (క్రమముగా) నాకు కనిపించుట లేదు.

ఈ భువనములు (లోకములు) అన్నియు తెలుసుకొను విధముగా, పుట్టిన వెంటనే పండు అని భ్రమపడి సూర్యుని పట్టుకొంటివి. ముట్టిన చుక్కలు (నక్షత్రములను తాకునట్లు నీ శరీరమును పెంచితివి. ఇట్టి ప్రతాపశాలివైన నిన్ను ఎదురించు వాడెవడు? నీకు ఎదురే లేదు.

శ్రీరామచంద్రుడు నిన్ను పంపించగానే శతయోజన విస్తీర్ణమైన సాగరమును లంఘించి దాటితివి. సీతాదేవికి వైభవముల నొసంగితివి. సంపదల వంటి అనేక దివ్య ఓషధులు ప్రకాశించు సంజీవని పర్వతమును పెకలించి తెచ్చితివి. అటువంటి నీ సొంపును పెంపును (సౌందర్యమును, అతిశయమును) పేర్కొనుట మా వల్ల అయ్యే పనియేనా?

నేడు ఈయనెవరా అని చెదరిపోక శ్రీవేంకటగిరి వాసుడైన వేంకటేశ్వరుడే నీ శ్రీరామచంద్రుడని కదిసి (సమీపించి) ఆయన కరుణ బొందితివి. ఇక వదలక నీ కృప పొందిన వాడనయ్యాను. నా యెదుటనే నిలచి నన్ను కాచుచుంటివి. ఇక నాకేం తక్కువ తండ్రీ!

**3-87**

## మున్నుడి

శ్రీరంగంలో వెలసిన రంగనాథస్వామిపై అన్నమాచార్యులు చెప్పిన అమరమైన సంకీర్తన ఇది. స్వామిని శ్రీరంగ శిశువని కీర్తిస్తున్నారు. నాలుగు వేదములూ నాలుగు తాళ్ళులాగా కట్టుబడిన వుయ్యాలలో ఆదిశేషుడు తొట్టెగా అమర్చబడిన చక్కటి వూయలలో వూగుతున్నాడు. ఆ చక్కటి నల్లని శిశువు. వాడే శ్రీదేవితో కలిసి వేంకటాద్రిపై సేద తీరుతున్నాడట. ఆ శ్రీరంగ శిశువు కమలభవాండమను (బ్రహ్మాండమను) తొట్టెలో బ్రహ్మాండమైన నీటి తరంగాలలో వూపుతుండగా స్థిరమైన సిరులతో వూగుతున్నాడట.

**ఉ॥ తొల్లిట మఱ్ఱియాకుపయి తోయజనాభుడు చిన్నిపాపగా**
**చెల్లుబడై తనూగెనట చిత్రముగా నొక తొట్టెయట్లుగా**
**నల్లని రంగనాయకుని నాణ్యత గొల్చెను అన్నమార్యుడన్**
**చల్లటి మాటగా శిశువు చక్కటి వేంకటనాథుడంచనెన్**

**రాగం : రాగమాలిక**

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూగె గన
చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

కలికి కావేరి తరగల బాహు లతలనే
తలగకిటు రంగమధ్యపు తొట్టెలన్
పలుమారు తను జూచి పాడగా గీని
చిలుపాల సెలవితో శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

అదివొ కమలజుని తిరువారాధనం బనగ
అదన కమలభవాండమను తొట్టెలన్
ఉదధులు తరంగముల నూచగా నూగీని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥





వేదములె చేరులై వెలయంగ శేషుడే
పాదుకొను తొట్టెలై పరగ గాను
శ్రీదేవితో గూడి శ్రీవేంకటేశుడై
సేదదీరెడి వాడె శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

**భావామృతం :**

పూర్వం ఒక మఱ్ఱి ఆకు తొట్టెవలె భాసించి దానిపై శ్రీరంగనాథస్వామి శిశువు వలె వూగినాడు కదా! అట్లు చెల్లుబడియైన ఆ మహానుభావుని కీర్తించెదము.

కావేరీనది కలికివలె (యువతివలె) బాహులతలవంటి తన తరంగములపై నదీ మధ్యమంలో అమర్చబడిన వేదిక అనే తొట్టెలో ఈ శ్రీరంగ శిశువు వూగుచున్నాడు. తనను చూచి అనేక కీర్తనలు పాడుచుండగా, చిలుపాల సెలవితో (చిక్కగా మరగబెట్టిన పాలచారికలు మూతిపై గల) శ్రీరంగ శిశువు వూగుచున్నాడు.

అదిగో కమలభవుని తిరునాళ్ళ సమయంలో బ్రహ్మాండమును ఈ తొట్టెలో, బ్రహ్మాండమైన నీటితరంగములు వూచగా (వూపుతుండగా) చెదరని (స్థిరమైన) సిరిసంపదలతో ఈ శ్రీరంగశిశువు కనుల పండువుగా వూగుచున్నాడు. దర్శించి తరించండి.

చతుర్వేదములైన సామ, ఋక్, యజుర్, అథర్వణ వేదములు నాలుగు చేరులై (కట్టుడు త్రాళ్ళయి) భాసించగా ఆదిశేషుడు చక్కగా అమర్చబడిన తొట్టెయై విలసిల్లగా తనదేవేరి శ్రీదేవితో కూడి తిరుమల శ్రీవేంకటేశ్వరుడై ఈ స్వామియే సేదదీరుచున్నాడు. (విశ్రాంతి తీసుకొనుచున్నాడు) వాడే శ్రీరంగ శిశువైన ఈ శ్రీరంగనాథుడు. ఈ స్వామిని సేవించి మీ జన్మ చరితార్థం చేసికొనండి.

**3-88**

## మున్నుడి

గోవుల్ని కాచే గోపాలకృష్ణయ్యే శ్రీవేంకటేశ్వరుడని భావించి అన్నమాచార్యులవారు చెప్పిన అద్భుతమైన కీర్తన ఇది. ఘుమ్మనే శృతితో నేతులు కమ్మగా కాగి ఆనందంలో ముంచెత్తాయట. అన్నమయ్య కవిత ఛందోబద్ధమని నిరూపించటానికే ఈ కీర్తనను యధాతథంగా సీసపద్యంలోకి మార్చాను.

**సీ॥ నీలవర్ణుండని నీరజాక్షుండని**
**బాలుని పాడేరు పడతులచట**
**బానల కాగుల పాలు పితుకుచును**
**త్రచ్చుదురు పెరుగు తరుణులచట**
**మందరధరుడని మాధవుడనుచు గో-**
**విందుని పాడేరు వెలదులచట**
**నందవ్రజంబున నలుగడ నావుల-**
**మందల రవములు పొందుమీర**

**ఆ.వె॥ఘుమ్మనియెడి శృతుల కూడ గరమ్మని**
**నేతులెల్లకాగె, ప్రీతి గొలుప**
**వేంకటేశు నందుబిడ్డగా భావించి**
**అన్నమయ్య పాడె నద్భుతముగ**

**రాగం : పూర్వి కళ్యాణి**

ఘుమ్మనియెడి శృతి కూడగను
కమ్మని నేతులు కాగగ చెలగె ॥ఘుమ్మని॥

నీల వర్ణుడని నీరజాక్షుడని
బాలుని నతివలు పాడేరో
పాలు పిదుకుచును బానల కాగుల
సోలి పెరుగు త్రచ్చుచు చెలరేగె ॥ఘుమ్మని॥





మందరధరుడని మాధవుడని గో-
విందుని పాడేరు వెలదులిదే
నంద వ్రజమున నలుగడ నావుల
మందల పేయల మంచిరవముల ॥ఘుమ్మని॥

వేంకటపతియని వేదనిలయుడని
పంకజనాభుని పాడేరు
అంకుల చేతను అలరు రవంబుల
బింకపు మాటల బృందావనమున ॥ఘుమ్మని॥

**భావామృతం :**

ఘుమ్మనే శృతి బద్ధమైన ధ్వనితో పెద్ద పెద్ద కాగులలో నేతులు కాగుచున్నవి. (గోపాలకృష్ణుని నందవ్రజము శోభలీనింది. ఆ వివరం వినండి...)

గోపభామినులందరూ ఆ గోపబాలుని నీలవర్ణుడని నీరజాక్షుడని కీర్తించుచు పాడినారు. పాలు పిదుకుచు కొందరు గోపికలు బానలు కాగులు నింపసాగిరి. కొందరు స్త్రీలు పెరుగును సోలి(వివశులైపోయి) చిలుకుచూ చెలరేగి కాననైరి.

గోవిందుడని పేరు గాంచిన ఆ శ్రీకృష్ణుని గోపికలు (వెలదులు) అందరూ మందరగిరి ధరుడని (గోవర్ధన పర్వతమును తన చిటికిన వ్రేలిపై ఎత్తిన వాడని), మాధవుడని పాడి కీర్తించెడివారు. నందవ్రజమున (రేపల్లెలో) నలుదిక్కులా, మంచి ధ్వనిగల ఆవులు మందలను పేయలను (దూడలను) కాచినాడు.

ఇపుడు పద్మనాభుడైన ఆ మహానుభావుని శ్రీవేంకటపతియనియు, వేదములే నిలయముగాగల శ్రీమన్నారాయణుడనియు భక్తితో పాడి జనులు కీర్తించుచున్నారు. ఆ విధముగా బృందావనమున అంకుల చేతను (విశిష్టమైన ఆభరణములు గల చేతులతోను) బింకపు మాటలతోను గర్వముగల మాటలతో జగతి విలసిల్లినది.

## 3-89

## మున్నుడి

ఈశ్వర తత్త్వం పూర్తిగా ఆకళింపు చేసికొనిన అన్నమాచార్యుల వారు ఆ పరమాత్మను యెవ్వరు. యే పేరుతో పిలిచినా యెలా భావించినా భక్తి, శరణాగతి అనే రెండు చేతులతో పట్టుకుంటే ఘోరమైన సంసార ఝరినుంచి రక్షింప బడవచ్చును అంటున్నారు. వారు సామెతలను రాగబద్ధమైన కీర్తనలలో చెప్పటం చూస్తే ఆయన పాండిత్యానికి ముగ్ధులవుతాం "అంతరాంతరము లెంచి చూడ 'పిండంతే నిప్పటి' యున్నట్లు" – అంటే లోలోపలి బేధములు పరిగణించితే, నిప్పటి (నిప్పుమీద కాల్చిన రొట్టె) ఎంతవుంటుంది అంటే 'పిండంతే' (పిండి ఎంతవుందో అంత).

**ఉ॥ ఈతని యెంతమాత్రమున యెవ్వరు యెంచిన అంతమాత్రమే**
**ఈతడు సర్వరక్షకుడు ఈశ్వరుడింతటి సృష్టికంతకున్**
**ఈతడె బ్రహ్మయున్ హరుడు ఈతడె శక్తియు అంతకుందుతా**
**నీతడె వేంకటేశ్వరుడు ఇంపుగ జెప్పెను అన్నమార్యుడున్**

**రాగం : ద్విరాగమాలిక**

ఎంతమాత్రమున నెవ్వరు దలచిన–అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడ బిం–డంతే నిప్పటి యన్నట్లు ॥ఎంత॥

కొలుతురు మిము వైష్ణవుల–కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు–పరబ్రహ్మంబనుచు
తలతురు మిముశైవులు–తగిన భక్తును శివుడనుచు
అలరిపొగడుదురు కాపాలికులు–ఆదిభైరవుడనుచు ॥ఎంత॥

సరి నెన్నుదురు శాక్తేయులు–శక్తిరూపు నీవనుచు
దరిశనములు(ల) మిము నానావిధులను తలపుల కొలదులు భజింతురు
సిరుల మిమునే యల్పబుద్ధిదల–చినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలచిన–ఘనబుద్ధులకు ఘనుడవు ఎంత॥





నీవలన కొరతే లేదు మరి–నీరు కొలది తామరవు
ఆవల భాగీరథి దరి బావుల–ఆ జలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము–జేకొని వున్న దైవమని
యీవలనే నీ శరణనియెదను–యిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నిన్ను ఎవ్వరు ఎంతమాత్రముగా భావించిన అంతమాత్రమే, అదే విధముగా నీవుంటావు. లోలోపలి భేదము నెంచి చూచినచో నిప్పటి (నిప్పుల మీద కాల్చిన రొట్టె) యెంతవుంటుందంటే పిండంతే (పిండి యెంతవుందో అంతే) అనే చెప్పుకోవలసి వుంటుంది).

దేవా! మిమ్ము వైష్ణవులు విష్ణుమూర్తి అని ప్రేమగా కీర్తిస్తున్నారు. వేదాంతులందరూ మిమ్మల్ని పరబ్రహ్మ అని అంటున్నారు. ఇంకొకవైపున శైవులందరూ మిమ్మల్నే శివుడు అని భక్తులై కొలుచుచున్నారు. కాపాలికులు మిమ్మల్నే ఆదిభైరవుడనే పేరుతో పూజిస్తున్నారు.

స్వామీ! శాక్తేయు నిన్ను సరియైన విధముగా శక్తిరూపముతో వున్నవాడవని ఎన్నిక చేసి యున్నారు. మిమ్ముల్ని అందరూ వారివారి భావాలకు తగ్గట్లుగా (వారి వారి మతానుసారముగా) దర్శించుచున్నారు. సిరి పతివైన నిన్ను అల్పబుద్ధులెవరైనా అల్పముగా భావిస్తే వారికి అల్పముగానే తోచెదవు. మహిమాన్వితుడవైన నిన్ను ఘనుడవని భావిస్తే వారికి ఘనునిగానే కనుపించెదవు.

ప్రభూ! నీవలన ఏవిధమైన కొరతాలేదు. నీవు నీరుకొలది తామరవు (భక్తి కొలది ఫలమొసగు పరమాత్మవు) పవిత్రమైన గంగానది ఒడ్డున మరియు పరిసర ప్రాంతాలలో కల బావులలో ఆ గంగానది జలమే వూరుతుంది కదా! ఓ శ్రీవేంటేశ్వరా! మమ్మల్నందరినీ చేపట్టి రక్షించు దైవము నీవేనని గుర్తించి నిన్నే శరణని నీ దాసుడనైతిని. ఇదియే మాకు గొప్ప పరతత్త్వమై విలసిల్లుచున్నది.

## 3-90

## మున్నుడి

చక్కటి సరస శృంగార కీర్తనలో తల్లి అలమేల్మంగ స్వామి నెలా ఆకట్టుకొన్నదో వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. శృంగారం స్వామిని అలరిస్తుంది అని నమ్మిన ఎందరో మహానుభావులు ఇటువంటి కీర్తనలనెన్నో చెప్పారు. ఆ పలుకులు వారి హృదయాంతరాళాల్లోంచి వెల్లువలా వస్తాయి. (బుర్రలోంచి కాదు). "కాటుక కంటినీరు చనుకట్టు పయిన్ బడనేల యేడ్చెదో.." అని ఓదార్చే పోతన గారికి సరస్వతీదేవి తల్లిగా కనిపించింది, స్త్రీగా కాదు. అలా కనిపించిన వాడినే ఆ తల్లి బిడ్డగా స్వీకరిస్తుంది. అలమేల్మంగమ్మ కూడా అంతే...

**ఆ.వె॥ చిత్తగించు మిదియె చెలియ విలాసంబు**
**పొత్తులు కలిపేను భోగములకు**
**అమ్మమంగ సొగసు హరిమది నలరించు**
**అన్నమయ్య పాట అద్భుతముర.**

**రాగం : శివరంజని**

చిత్తగించుమిదె చెలియ విలాసము
పొత్తులు గలపీ భోగంబులకు ॥చిత్తగించు॥

వెన్నెలరేకులు వెద చల్లీనదె
సన్నల సెలవుల సకియా
కన్నుల మొక్కులు కానుక లొసగీ
నిన్ను జూచి యిదే నివ్వెరగులను ॥చిత్తగించు॥





జక్కవ పిట్టల నంతము సేసీ
అక్కున గప్పుచు నతివా
చక్కని మోవిని చవులటు గొలపీ
నెక్కొని నీపై నేస్తంబులను ॥చిత్తగించు॥

పలుకు తేనియలు పలుమరు చిలికీ
మెలుపు రతుల నలమేల్మంగ
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
అలరీ నీతో నదె సరసములా ॥చిత్తగించు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదిగో ఈ చెలియ విలాసమును గమనించుము ప్రభూ! నీతో భోగించుటకు ఈమె నీ జత కలిసినది.

ఈ నీయొక్క సఖియ, వెన్నెల తెరకలను వెదజల్లినట్లు సన్నలు సెలవులు చేస్తోంది. (సంజ్ఞలూ చేయుచూ ఆజ్ఞాపించు చున్నది). నిన్నుజూచి ఇదిగో నివ్వెరగులను, (పారవశ్యముతో) కన్నులతోనే నీకు మొక్కుచున్నది. నీకొక్కనికే అర్థమవునట్లు ఎన్నో కానుకలు సమర్పించుకొంటున్నది. ఆమెను చిత్తగించుము తండ్రీ!

ఈ అతివ, జక్కువ పిట్టలను అంతముచేసి(గుండ్రటి కుదిమట్టసపు జక్కువ పక్షులతో జవ్వని పయోధరములను పోల్చుచున్నారు అన్నమయ్య) తనయెదను కప్పుకొనుచున్నదా అనిపించుచున్నది. నీపై నెక్కొని నేస్తంబులను (పాదుకొనిన చెలిమితో) కలిగిన ఆమె చక్కని అధరము చవులూరించు చున్నది ప్రభూ!

అమె తీయని మాటలతో పలుమార్లు తేనెలను చిలకరించుచున్నది. ఆ తల్లి అలమేల్మంగమ్మ. పెనవేయు రతులతో మిక్కిలి సంతోషముతో నిన్ను కూడినది. ఓ శ్రీనివాసా! మనోజ్ఞమైన సరసములతో ఆమె నీతోచేరి ఆనందించినది తండ్రీ!

**3-91**

## మున్నుడి

తాతగారైన అన్నమాచార్యులవారి ఒరవడిలోనే ఆయన మనుమడు తాళ్లపాక చిన్న తిరుమలయ్య శ్రీవేంకటేశ్వర మకుటంతో అనేక భక్తి శృంగార కీర్తనలు తిరుమలనాథునిపై రచించి, వినిపించి, తరించారు. ఈ మేలుకొలుపు కీర్తనలో చిన్న తిరుమల "ఓ గోవిందా! నిదుర మేలుకొనవయ్యా! వశపరచుకొనే భోగాలు నీకు లెక్కలేనన్ని వున్నాయి. శ్రీదేవి భూదేవి చెరొకవైపున వున్నా మనస్సులో స్థిరంగా ఉండే నీళాదేవి శృంగార లీలలు మఱువవు. 'నాలి' తనంతో కొంటెపనులు మానలేవు. శ్రీవేంకటేశ్వరా! అవన్నీ చాలించి, లేచివచ్చి ఈ నీ లోకాలను, దాసులను పాలించు తండ్రీ!" అంటున్నారు.

**కం॥ గోవిందా! మేల్కొనవే**
**కావించిన భోగములవి కడమా స్వామీ!**
**కోవిదుడు చిన్న తిరుమల**
**ఈ వేంకటపతిని నిదుర ఇక చాలుననెన్.**

**రాగం : సామ**

గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమా నీకు ॥గోవిందా॥

కమలజ చల్లని కౌగిట దగిలి
సతురతి బాయగ జాలవు
కమలభవాదులు కడు నుతియింపగ
విమలపు శయనము విడువగ లేవు ॥గోవిందా॥

భూసతితోడుత పొందులు మరిగి
వేసర విదె నీ వేడుకలా
వాసవముఖ్యులు వాకిట నుండగ
పాసి వుండనని పవళించేవు ॥గోవిందా॥





నీళామనసిజ లీలల తగిలి
నాలితోడ మానగలేవు
వేశాయను శ్రీవేంకటనాథుడ
పాలించి దాసుల బ్రతికించగను ॥గోవిందా॥

**భావామృతం :**

ఓ గోవిందా! నీవు నిద్ర చాలించి త్వరగా మేల్కొనవయ్యా! కావించి భోగము (సాధారణమైన భోగములు కావించునవే, లోబరచుకొనేవే) అవి నీకు కడమా? (వాటికంతేమున్నది ప్రభూ!)

కమలము నుండి పుట్టిన లక్ష్మీదేవి యొక్క చల్లటి పరిష్వంగములో సమరతి భోగముల దగిలిన నీవు వదల లేవు. నిజమే.. కానీ ఇంకొక ప్రక్క పద్మసంభవుడైన బ్రహ్మ మొదలైన వారు వచ్చి నిన్ను ఎంతో కీర్తిస్తున్నారు. నిర్మలమైన నీ పాన్పుని వదలి రాలేకున్నావు. ఇదేమి ప్రభూ!

ఇటువైపు ఇదిట్లుండగా అటువైపు భూకాంతతో కూటములు అలవాటయి నీవు వేసరవు. (నీకు విసుగు కలగదు). ఇదే నీకు ఒక వేడుక వలె నున్నది. పోనీ, అటువైపన్నా నీవు స్థిమితంగా సుఖించకుండా, వాసవ ముఖ్యులు (దేవేంద్రుడు మొదలైన ముఖ్యమైన దేవతలు నీ బంగారు వాకిలి బయట కాచుకొని వున్నారు. అయినా నీవు భూసతిని పాసివుండనని (విడిచి పెట్టనని) పవ్వళించే యున్నావు. ఇట్లాగైతే యెలా ప్రభూ! నిదురలేవయ్యా మహానుభావా!

సరే! వారిరువురూ నీ కిరువైపులా వున్నారనుకో... ఇంకొక ఆమె వున్నది. ఆమెయే 'నీళాదేవి' ఆమె నీ మనసిజ. మనస్సులోనే వుంటుంది. ఆమెతో నీలీల ఒరవడిలో తగిలి 'నాలి' తోడ (టక్కరి తనముతో) (నీ కొంటె పనులు) మాననే మానవు. శ్రీవేంకటనాథుడవైన ఓ సర్వేశ్వరా! ఎంతో వేళయింది ప్రభూ! నిదురలేచి నీ దాసులమైన మమ్ము పరిపాలించి మమ్మల్ని బ్రతికించు తండ్రీ!

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అజరామరమైన కీర్తన ఇది. ఈయన ఒక్కడే సర్వేశ్వరుడు. తెల్లని కమల నయనుడైన ఈ తిరుమలనాధుని మించిన నాధుడు లేడు, లేడు, లేడు అంటున్నారు. ముగ్గురు వేల్పుల మూలము ఇతడే అంటున్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఈ విశ్వపు సృష్టి, స్థితి, లయల కోసం భగవంతుడైన పరబ్రహ్మచే నిర్దేశించబడిన ముగ్గురు వేల్పులు. మరి ఈ శ్రీవేంకటేశ్వరుడు వారికి మూలమైన పరబ్రహ్మ. అయినా, కృష్ణయ్యగా ఆయనే రేపల్లెలో గొల్ల భామలకు కౌగిటి సౌఖ్యమయ్యాడు. అది వాళ్ళ అదృష్టం.

**చం॥ ఇతడొకడే జగద్విభుడు ఈశ్వరుడందరి మోక్షదాతయున్**
**సితకమలాక్షుడీ హరియె శ్రీపతి వేంకటశైలనాధుడున్**
**జతగొని గోపభామినుల సందిట జేర్చిన కృష్ణమూర్తియున్**
**అతిమధురంపు కీర్తనకు నాకృతినిచ్చెను అన్నమార్యుడున్**

**రాగం : మోహన**

ఇతడొకడే సర్వేశ్వరుడు
సితకమలాక్షుడు శ్రీవేంకటేశుడు ॥ఇతడొకడే॥

పరమయోగులకు భావనిధానము
అరయ నింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతల కౌగిటి సౌఖ్యము
సిరులొసగే ఈ శ్రీవేంకటేశుడు ॥ఇతడొకడే॥

కలికి యశోదకు కన్న మానికము
తలచిన కరికిని తగు దిక్కు
అల ద్రౌపదికిని ఆపద్బంధువు
చెలరేగిన యీ శ్రీవేంకటేశుడు ॥ఇతడొకడే॥





తగిలిన మునులకు తపముల సత్ఫలము
ముగ్గురు వేల్పులకు మూలము
ఒగి నలమేల్మంగ కొనరిన పతి యితడు
జిగిమించిన యీ శ్రీవేంకటేశుడు ॥ఇతడొకడే॥

**భావామృతం :**

ఓ భక్తులారా! వినండి...

ఇతడొక్కడే సర్వేశ్వరుడని కీర్తించదగినవాడు. ఈయన సితకమలాక్షుడు (తెల్లని పద్మనయనుడు). ఈయనే శ్రీవేంకటేశ్వరుడు. అందరికీ ఈయనే ఆధారము, గతి, దిక్కు అయ్యాడు.

ఇతడు పరమయోగులకు భావనలలోని నిధానము (నెలకొని యున్న రూపము). ఇంద్రుడు మొదలైన దేవతలకు ఐశ్వర్యముల నొసగే దేవదేవుడు. రేపల్లెలో గొల్ల భామలకు గొప్ప కౌగిటి సౌఖ్యప్రదాత. ఇన్ని చేసిన ఈయన వేరెవరో కాదు. మనందరికి సిరిసంపదల నొసగే శ్రీవేంకటేశ్వరుడు.

ఇతడు యశోదాదేవికి బిడ్డయైన మాణిక్యము. తననే తలచి 'రావే ఈశ్వర! కావవే... వరదా! సంరక్షించు... నీవే తప్ప ఇతఃపరంబెరుగను...' అని గజేంద్రుడు మొరబెట్టుకున్న తగుదిక్కు. అక్కడ ద్రౌపదీదేవికి మానసంరక్షణ చేసి ఆపదల నివారించిన బంధువు. ఇన్ని విధముల విజృంభించిన ఈ మహానుభావుడే శ్రీవేంకటేశ్వరుడు.

ఈయన తననే అంటిపెట్టుకొనిన మునులకు వారి తపములిచ్చిన సత్ఫలితము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని కీర్తించబడుతున్న ముగ్గురు వేల్పులకు, మూలకారణమైన పరబ్రహ్మము ఈయనే. క్రమముగా జగజ్జనని అలమేల్మంగమ్మకు కలిగిన, మగడు ఈయన. ఈ సర్వేశ్వరుడే అసదృశమైన కాంతులతో విరాజిల్లే మన శ్రీవేంకటేశ్వరుడు.

**3-93**

## మున్నుడి

విభిన్నంగా కనుపించే ఈ కీర్తనలో అన్నమాచార్యుల వారు, ఒక తమాషా సందేశమిస్తున్నారు. దనుజులు శ్రీహరిపై ద్వేషంతో అన్యదేవతలకోసం తపస్సుచేసి అనేక వరాలు పొందికూడా చెడి నశించారు. కాని చివరికి శ్రీహరినే చేరుకొని మేలు పొందారు. వేదాంతులు మొదలైన వారు అన్యదేవతలని కొలిచి పొందే పుణ్యంనిరుపయోగమైనది. దానికంటే హరినిందతో పొందే పాపమే నయము. మనల్ని శిక్షించినా రక్షించినా శ్రీవేంకటేశ్వరుడొక్కడే. ఊరిలో వుండే 'దేవుళ్ళు' ఈతని సరిసమానమా అని అంటున్నారు.

**తరళము॥దనుజులున్ గనివారు తత్త్వము తాము కాదని శ్రీహరిన్**
**వినిచెనన్నయ భక్తకోటికి విష్ణుతత్త్వము దెల్పుచున్**
**పనిచి అన్యులమేలుగా స్తుతి పాడుచున్ ఘనపుణ్యముల్**
**గొనుటకంటెనుపేంద్రు దిట్టగ కూడు పాపమె మేలనెన్**

**రాగం : శంకరాభరణం**

దనుజులు గనిరి తత్త్వమిది
వనజాక్షుని కృప వసించ నేలా! ॥దనుజులు॥

హరి పరమాత్ము డనాది పురుషుడు
సురులకు నరులకు సులభుడు
హరి కోపముతో నన్యుల వరములు
సరిగా వెంచగ జగములలోన! ॥దనుజులు॥

వేదాంత విదుడు విష్ణుడు కృష్ణుడు
శ్రీదేవికి బతి శేఖరుడు
పోది బరస్తుతి పుణ్యముకంటే
పాదుగ హరి దిట్టే పాపము మేలు! ॥దనుజులు॥





నారాయణు డున్నతు డచ్యుతుడుప
కారుడు శ్రీవేంకటవిభుడు
చేరి యీతడే శిక్షించ రక్షించ
వూరదయివములు వొగి నితని సరా! ॥దనుజులు॥

**భావామృతం :**

(ఓ మానవులారా! సురులు విష్ణుభక్తులనే భ్రమతో అసురులు విష్ణ విరోధులయ్యారు. విష్ణుభక్తులను హింసించి, పాపకార్యాలు చేసి హరిచే శిక్షింపబడ్డారు. అందువల్ల మరింత హరిని ఎదుర్కొనటానికి అన్యదేవతల కోసం తపస్సు చేసి వరాలు పొంది హరితోపోరి, హరిచేతిలో నశించి ఇదివరకు తాము హరి నిందతో మూటగట్టుకొన్న పాపం నశించి, పుణ్యంతో వైకుంఠం పొందారు. ఆ దనుజులకు అన్యదేవతల మేలుకంటే హరి చేసిన కీడే పరమ సుఖాన్నిచ్చింది. అవునా?) దనుజులు ఈ విచిత్రమైన తత్త్వమును ఆకళింపు చేసికొనిరి. వనజాక్షుడు (పద్మనయనుడు) అయిన శ్రీహరి కృపతో వసించనేలా! (మనము వుండటమెందుకు?)

నిజం ఆలోచిస్తే, శ్రీహరి పరమాత్ముడు, ఆదిపురుషుడు. ఆయన సురులకు, నరులకు, సులభుడు (సులభంగా వరములిచ్చే పక్షపాతి) అని భావించి, హరిపై కోపముతో ప్రపంచంలో అన్యుల (ఇతర దేవతల) వరములను యెంచగా (పొందాలనుకోవటం) సరికాదు. (అదివారికి హానికరమే అవుతుంది).

వేదాంతుల చేత తెలుపబడినవాడే కృష్ణుడయిన (నీలవర్ణుడైన) విష్ణువు. ఆయనే శ్రీలక్ష్మీ వల్లభుడు, అత్యున్నతుడు. పరస్తుతి చేసి (అన్య దేవతలను కీర్తించి) పోది (పోగుచేసికొనిన) పుణ్యము కంటే, పాదుగా (నిలచి) శ్రీహరిని తిట్టే పాపమే మేలు. (చివరికి అది విష్ణుపురిని ప్రాప్తింప చేస్తుంది)

శ్రీమన్నారాయణుడు ఉన్నతమైనవాడు. నాశనములేని అచ్యుతుడు. ఎంతో ఉపకారము చేయువాడు. ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. ఆయన నాశ్రయించినచో మనం చేసికొన్న పాపపుణ్యాలను బట్టి, శిక్షిస్తాడో రక్షిస్తాడో ఆయన ఇష్టం. అంతేకాని, వూరినిండా లెక్కకు, మిక్కుటంగా క్రమముగా వుండే ఇతర దేవతలెందుకు? వారు ఈ ఏడుకొండలవాడితో సమానమా?

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన ఇది. అన్నమయ్య వాడిన కొన్ని పదాలు 'నభూతో నభవిష్యతి' అనునట్లుంటాయి. నరసింహునిది 'వాడి ప్రతాపము' అని అందరూ అంటే, అన్నమయ్య 'వేడి ప్రతాపము' అంటున్నారు. స్వామి 'బగివాయని శ్రీపతి' అట. అంటే ఆదిలక్ష్మిని తోడు వీడని భర్త అని అర్థం. 'దెసల పరాత్పర తెజము' అంటే... దిక్కులన్నిటా వ్యాపించిన శ్రేష్టమైన తేజస్సు - అని. ఏదో తెలుగుపాట ఇందులో ఏముంది అనుకుంటే... అది మన అమాయకత్వమే.

**ఆ.వె॥ ఇతని గొలిచి మనుడు ఇలలోని జనులార!**
**అఖిలవందితుండు అయిన దితడె**
**ఇహ పరంబులిచ్చు ఈ అహోబలపతి**
**పాడెనన్నమయ్య పరవశించి**

**రాగం : శంకరాభరణం**

అహోబలేశ్వరుడు అఖిల వందితుడు
మహి నితని గొలిచి మనుడిక జనులు ॥అహో॥

మూడు మూర్తులకు మూలం బీతడు
వేడి ప్రతాపపు విభుడీతడు
వాడి చక్రాయుధ వరదుండీతడు
పోడిమి పురాణ పురుష డీతడు ॥అహో॥

అసురులకెల్ల కాలాంతకుడీతడు
వసుధ దివ్య సింహంబితడు
విసువని ఏకాంగ వీరుడీతడు
దెసల పరాత్పరతేజం బీతడు ॥అహో॥





నిగిడి శ్రీవేంకట నిలయుడీతడు
బగివాయని శ్రీపతి యీతడు
సొగిసి దాసులకు సులభు డీతడు
తగు ఇహపరముల దాతయు నీతడు ॥అహో॥

**భావామృతం :**

ఓ జనులారా! ఈ అహోబల నరసింహస్వామి సర్వులచేత నుతింపబడెడివాడు. ఈ భూలోకంలో ఈయనను సేవించి జీవింపుడు. (మీ జన్మధన్యమవుతుంది).

ఈ నృశింహుడు మూడు మూర్తులకు మూలము. అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ఆది మూలమైన పరమాత్మ. తాపము కలుగజేయు ప్రతాపము కలిగిన జగన్నాథుడు. పదునైన చక్రాయుధం ధరించిన వరప్రదాత. ఇల నవతరించిన పురాణ పురుషుడు ఈ అహోబల నృసింహస్వామి. ఈయనను సేవించండి.

ఈ మహానుభావుడు రాక్షసుల పాలిటి కాలయముడు. భూమిపై అవతరించిన దివ్యమైన సింహము ఈయను. ఇదివరకెన్నడైనా, యెక్కడైనా మనిషి శరీరంతో తలమాత్రమే సింహాకారంగల రూపాన్ని చూశారా! ఈయన విసువని ఏకాంగ వీరుడు (విసుగుపుట్టని అసహాయ శూరుడు). అన్ని దిక్కులకు వ్యాపించిన, పరాత్పర తేజము (శ్రేష్ఠుడైన తేజోమూర్తి). (ఈ స్వామిని అనన్య భక్తితో ధ్యానించండి). ఈ స్వామియే నిగిడి (వ్యాపించి), శ్రీవేంకటాద్రి నిలయుడై వెలసినాడు. ఈయన బగివాయని (ఎన్నడూ తోడు విడువని) శ్రీపతి. ఈ పురాణపురుషుడే సొగిసి దాసులకు (ఇంపుగా తన దాసులకు, సులభముగా అనుగ్రహించు దాత. మరి ఎటువంటి దాత? ఇహలోకమున కావలసిన కోరికలను దీర్చి, పరలోకమున కైవల్యము నొసగే దాత. ఇటువంటి దాతవుంటాడా? లేదుగాక లేదు. ఈ అహోబలేశ్వరుని శరణనండి.

**3-95**

## మున్నుడి

జానపద శైలిలో నడిచిన ఈ కీర్తనలో తల్లి అలమేల్మంగ తన స్వామి 'వలపు వేదనలో' వాడి పోయింది, అయ్యో! అని, ఆమె చెలికత్తెలలో తనూ ఒకతెగా భావించుకొని మా 'శిన్నెకా' (చిన్నక్క) ఎంత బాధపడుతోందో! అని వాపోతున్నారు. అన్నమయ్య నిఘంటువే కాక, పెద్దలు కూడా సహకరిస్తేనే నా బోటి సామాన్యునికి ఈ కీర్తన అర్ధమవుతుంది. అద్భుతంగా మలచిన రాగయుక్తమైన ఈ జానపద తేనె జల్లులో ప్రతిపదార్ధం వివరించాలంటే.. పచ్చి వెలక్కాయ గొంతుకడ్డం బడుతుంది... నిజంగా..

**కం॥ చెలువపు సేతల చిన్నది**
**వలపుల వేదనల రగిలి వాడీనయ్యో!**
**తెలిపెను అన్నయ కీర్తన**
**చెలి వేంకటనాథు గవయు శిన్నెక్కనియెన్.**

**రాగం : దేశ్**

చెలువపు సేతల శిన్నెకా పెద్ద
వలపు వేదనల వాడీనయ్యో ॥చెలువపు॥

మొగమున కెగరెడి మొనవాడి గుబ్బల
చిగురు పెదవులాడి శిన్నెకా
నిగనిగ మెరిచేటి నీలిమేనివాని
సొగసు చూచి వాని సొలసీనయ్యో ॥చెలువపు॥

మొగ్గల మొలకల మురిపెపు కన్నుల
శిగ్గుల చిరునవ్వు శిన్నెకా
ఉగ్గున రేపల్లె వుసురుగొనేటి వాని
దగ్గరి తమకాన తడవీనయ్యో ॥చెలువపు॥





చంకల బంగారు చల్లిన మెఱుగుల
చింత బెదురులాడి శిన్నెకా
వేంకటపతి గూడి వేడుక తోడుత
సుంకుల సోగల సొలసీనయ్యో ॥చెలువపు॥

## భావామృతం

ఈ 'శిన్నెకా' (చిన్నక్క), అందమైన సేతల (పనులను) నిర్వహించు భామిని. ఈమె ఎంతో అధికమైన వలపు వేదన (విరహ బాధ)లో వాడిపోతున్నది. అయ్యో! పాపం!

ముఖమువైపునకు చొచ్చుకొని వచ్చునట్లు మొనదేలు కుచగిరులున్న జవ్వని ఈ శిన్నెకా. అంతేకాక, చిగురు- టధరముల చిన్నది. పాపం, ఈమె నిగనిగ మెఱయుచున్న నీలవర్ణ శరీర ఛాయగల శ్రీనివాసుని చూచి, వాని సౌందర్యానికి వశురాలై, వేదనకు గుఱి అయింది.

అయ్యో పాపం!! మొలకెత్తుచున్న మొగ్గలవంటి సొగసరి నయనములు కల ఈ శిన్నెకా చిరునవ్వులలో సిగ్గులు మొగ్గలై పూస్తున్నాయి. (ఎక్కడో మధురానగరం కారాగారంలో పుట్టి), ఆపై రేపల్లెలో ఉగ్గుపాలు త్రాగి, జీవించి పెద్దవాడయిన వాడి, జతకట్టు వలన కలిగిన మోహముతో అధికమైన విచారమునకు గురి అయినది. అయ్యో శిన్నెకా!

వెదజల్లిన బంగారము వలె మెఱయుచున్న బాహుమూలములుగల ఈ శిన్నెకా, బెదురు చూపుల మృగనయని. రసికుడైన ఈ శ్రీవేంకటేశ్వరుని యొక్క సుదీర్ఘము మరియు ప్రతిబంధకమైన కూటములతో, వేడుక పొందిననూ అయ్యో! పాపం ఈ శిన్నెకా విపరీతంగా అలిసిపోయింది.

**3-96**

## మున్నుడి

శ్రావ్యమైన సంస్కృత సంకీర్తనను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆయన యెన్నుకొన్న పదములు మరెవ్వరికీ తోచను కూడా తోచవు. ఆయన "రాముడు సుర సార్వభౌముడనటం" 'ప్రాసకోసం' కాదు. సార్వభౌముడు తన ప్రజల్ని అనేక రకాలుగా అనేకమార్లు రక్షించి ఆదుకొన్నట్లు సురులను ఆదుకొన్నాడని ఆచార్యుల భావన. 'శూరాధారాచార సుగుణోదారం' అంటే యేమిటో చెప్పగలిగిన వారికి నా ప్రణతులు. చెప్పలేని వారు శ్రమపడి నిఘంటువులు వెదకనక్కరలేదు. భక్తితో భావామృతం చదివితే చాలునండీ...

**తే॥ రాము డిందీవరశ్యాము దమర విభుడు**
**పరమధాముందు నతడని నిరుపమముగ**
**అన్నమార్యుడు వినుతించె నమరమందు**
**తిరుమలేశుదై జనులకు పరిచితుడనె.**

**రాగం : మిశ్రమలహరి**

రామ మిందీవర శ్యామం పరాత్పర-
ధామం సురసార్వభౌమం భజే ॥రామమ్॥

సీతావనితా సమేతం
పీత వానర బల వ్రాతం
పూతకౌసల్యా సంజాతం
వీత భీత మౌని విద్యోతం ॥రామమ్॥

వీరం రణరంగ ధీరం
సారధర్మకు లోద్ధారం
క్రూరదానవ సంహారం
శూరాధారాచార సుగుణోదారం ॥రామమ్॥





పావనం భక్త సేవనం
దైవిక విహగ వధావనం
రావణానుజ సంజీవనం
శ్రీవేంకట పరిచిత భావనం ॥రామమ్॥

**భావామృతం:**

ఓ శ్రీరామచంద్రా! నీవు నల్ల కలువల శ్యామవర్ణం (మెరుపు కలిగిన నీలిరంగు మిశ్రమమైన నలుపు) తో కూడిన దేహచ్ఛాయకలవాడవు. మోక్షమునకు స్థానమైన వాడవు. దేవతలందరికీ సార్వభౌముని వంటివాడవు. అట్టి నిన్ను నేను భజింతును గాక!

ఓ స్వామీ! నీవు సీతాదేవితో కూడి యున్నవాడవు. పసుపు పచ్చని దేహచ్ఛాయగల వానరసైన్యముచే కొలువబడిన వాడవు. పవిత్రురాలైన కౌసల్యాదేవి యొక్క గర్భమున జన్మించిన కులదీపకుడవు మునిజనులకు భయమును పారద్రోలి, తేజోరూపుడవై ప్రకాశించిన వాడవు.

ఓ మహానుభావా! నీవు వీరాధివీరుడవు. రణరంగ ధీరుడవు. నీవు రసవత్తరమైన ధర్మకులమునకు ఉద్ధారకుడవై యున్నవాడవు. అతి క్రూరులైన రాక్షసులను నిర్జించి సంహరించినవాడవు. నీవు శూరులకు తగినటువంటి సుగుణములను ఆచారముగా కలిగిన ఉదార స్వభావుడవు.

ఓ దాశరధీ! నీవు పవిత్రమైన పుణ్యప్రదుడవు. నీవు భక్తులచే అనునిత్యం సేవింపబడెడి వాడవు. దైవాంశ సంభూతమైన విహంగము (జటాయువు) ను వధచే పొందిన మృత్యువునుండి తప్పించి ముక్తి నొసగినవాడవు. రావణుని కనిష్ఠ సోదరుడైన విభీషణుని, సంజీవని మృతులనుద్ధరించినట్లు ఉద్ధరించిన వాడవు. ఓ కరుణామయా! నీవు శ్రీవేంకటేశ్వరునిగా పరిచయమయ్యే భావన కలిగినవాడవు.

**3-97**

## మున్నుడి

"ముర అనే అసురునికి శత్రువైన శ్రీమన్నారాయణుని సహజంగా ఏ కల్మషమూ లేకుండా సంకీర్తంచవలెను. ఇది ఒక్కటే ఇహమున (జీవించియున్న లోకంలోను), పరమున (మన మరణానంతరం పరలోకములలోను) చక్కటి సాధనమై కాపాడుతుంది" అంటూ మన తాళ్ళపాక అన్నమాచార్యులవారు నామ సంకీర్తన విశిష్ఠతను తెలియజేస్తున్నారు. శ్రీహరినామ సంకీర్తనము మన అజ్ఞానము అనే దానికి 'పులివాకట్టు' అంటున్నారు. పులి నోటికి బిగించి కట్టిన బంధనం అని అర్థం.

**కం॥ ఇహపర సాధన మొకటే**
**సహజంబుగ మురవిలోధి సంకీర్తనయే,**
**మహి లేదన్యము, అన్నయ**
**అహరహమా హరిని గొల్వుడనెనిది వినుడీ**

**రాగం : మలయమారుతం**

ఇహపర సాధన మిదియొకటే
సహజపు మురారి సంకీర్తనొకటే ॥ఇపహర॥

భవసాగరముల బాపెడిది తేప
భువి నజ్ఞానము పులివాకట్టిది
జవళి నాశాపాశములకు కొడువని
నవనీత చోరు నామం బొకటే ॥ఇహపర॥

చింతా తిమిరము చెరిచేటి సూర్యుడు
అంతట దరిద్ర హతపు నిధానము
వింత మరణభయవినాశ మంత్రము
మంతుకు హరినామం బిది యొకటే ॥ఇహపర॥

మించు దుఃఖముల మృత సంజీవని
అంచల పంచేంద్రియముల కంకుశము
ఎంచగ శ్రీవేంకటేశు దాసులకు
పంచిన పాళ్ళ పరగిన దొకటే ॥ఇహపర॥





### భావామృతం

ఓ జనులారా! శ్రీమన్నారాయణుని నామ సంకీర్తనము ఇహలోకమున మరియు పరలోకమున కూడా వుద్ధరించగల ఒకే ఒక సాధనము. అయితే... ఆ మురారియైన ఆయన సంకీర్తన సహజముగా ఏ కల్మషమూ లేకుండా త్రికరణ శుద్ధిగా వుండాలి. (నోరు నొప్పి పుట్టేట్లు అరుస్తూ భజన చేస్తే ఆయాసం తప్ప ఏమీ మిగలదు). దాని విశిష్ఠత వినండి.

శ్రీహరి నామ సంకీర్తనము, ఈ భవ సాగరము (సంసార జలధి) ను దాటించ గలిగిన తేప (పడవ). ఈ లోకంలో అజ్ఞానమునకు శ్రీహరి నామ సంకీర్తనము 'పులివాకట్టు'

ఏవేవో భ్రమలను కలిగించి ఆశ అనే పాశము మనల్ని కట్టి పడేస్తే, ఆ రకరకాల కట్లను త్రెంచగల కొడవలి. వెన్నదొంగయైన ఆ సర్వేశ్వరుని నామ సంకీర్తన యొక్కటే ఇవన్నీ చేయగలదు.

శ్రీ రమణుని నామ సంకీర్తనము, చింత (విచారము) అను అంధకారమును రూపుమాపగల సూర్యుడు. మన దరిద్రమునంతటినీ నాశనము చేయగలిగిన ఐశ్వర్యము ఇదే. తప్పక వస్తుంది అని తెలిసికూడా ప్రతివాడూ చచ్చేదాక, చావంటే చచ్చేభయం పడుతూనే వుంటాడు. అది ఒక వింత భయం. పనిచేస్తుందో లేదో తెలియక పోయినా మంత్రం వేస్తే భయం పోతుంది. ఆ మృత్యుభీతికి నామమంత్రమే విరుగుడు. ఇవన్నీ అంతం కావాలంటే మనకి ఆ నారాయణుని నామ సంకీర్తన మొక్కటే గతియైనది.

అధికమైన దుఃఖము చివరికి మృత్యువునిస్తుంది. సంజీవని అనే మందు మృత్యువుని దూరం చేస్తుంది. కాబట్టి ఆ వైకుంఠనాయకుని నామసంకీర్తన దుఃఖమునకు సంజీవనిలా విరుగుడు. మన పంచేంద్రియములూ సుఖాలకు మనల్ని మచ్చిక చేసి మదపుటేనుగులై స్వైరవిహారం చేస్తూ పీడ కలిగిస్తాయి. శ్రీహరి నామసంకీర్తన అంకుశం వలె అంచల (మనవైపునుండి) ఆ పంచేంద్రియాలను అదుపుజేస్తుంది. ఆ శ్రీవేంకటేశ్వరుడు తన దాసులమైన మనకు యెంచి (లెక్కకట్టి) పంచి ఇస్తే మన పాళ్ళైన (వంతువచ్చిన) పరగీ నిదొక్కటే (ప్రీతిని కలిగించేది ఇదొక్కటే...)

**3-98**

## మున్నుడి

ఆనాడు దేవ దానవులు సాగర మధనం చేస్తే తొలుదొల్త హాలాహలము, ఆ తరువాత కల్పవృక్షము మొదలైన అనేక దివ్యోపకరణములు, నక్షత్రములు, చంద్రుడు, పిమ్మట శ్రీలక్ష్మి, చిట్ట చివరకు అమృతము లభించాయని పురాణాలు చెబుతున్నాయి. నేడు మన్మధుని వేదనతో అలమేల్మంగమ్మయొక్క చింతాకవితమైన మనస్సులో సాగరమధనం జరుగుతోంది. మరి ఇప్పుడు కూడా గరళము ఇత్యాదివి జనించాయి. ఓ వేంకటేశ్వరా! శ్రీకాంతుడా! ఇప్పుడు నీవు అవేమిటో చిత్తగించి ఆమెను నీ కౌగిట్లోకి తీసుకో అంటున్నారు అన్నమాచార్యులవారు.

**తే॥ మనసిజ సముద్రమున జేయు మధనమిదియె**
**కనుగొనుము నీవు ఇంతటన్ కమలనాభ!**
**నేడు శ్రీవేంకటేశుడై కూడి తరుణి**
**పొందినావనె అన్నయ్య పులకరించి**

**రాగం : శంకరాభరణం**

మనసిజ సముద్ర మధనమిదె
కనుగొన మింతట కాంతుడనీవు ॥మనసిజ॥

సతి చింతామణి జలనిధి తరువగ
అతిగరళపు విరహము బొడమె
తతినా పిమ్మట తమకపు కోర్కుల
లతల కల్పకపు లాకలు వొడమె ॥మనసిజ॥

పొలతి కూరిముల పొంగులు వొంగగ
పులకల తారలు వొడమెనవె
ఫలమై సాత్త్విక భావపు చంద్రుడు
నిలువున వొడమగ నేరుపులలరె ॥మనసిజ॥





సుదతి తానెనీ చొక్కపు కొగిట
అదనున నిందిరయై పొడమె
కదిసిన శ్రీవేంకటపతి నీదెస
అధరామృతమయ్యతివకు వొడమె ॥మనసిజ॥

## భావామృతం

ఓ శ్రీవేంకటేశ్వరా! శ్రీకాంతుడా! ఇదే మనసిజ సముద్ర మధనము (మన్మధుడొనరించు సాగర మధనం). ఇంతట నీవు కనుగొనవయ్యా! మహానుభావా! ఆ వివరముల నందిస్తాను. మా అమ్మ అలమేల్మంగ మనస్సులో కూడా సాగర మధనం జరిగింది.

నీ సతీమణి వ్యాకులచిత్తయైనది. జలనిధి (చిలక బడినది) అప్పుడు అతి విరహము అనే గరళము పెల్లుబికి వచ్చింది. ఆ పిమ్మట, తతి తమకపు కోర్కెలు (అధికమైన పారవశ్యముతో కూడిన కోరికలు) లతల వలె వ్యాపించి, లాకలు వొడమి (శాఖోపశాఖలై), అదివొక కల్పవృక్షమా యేమి? ఈ చింతా సాగరమధనంలో ఇప్పుడే పుట్టిందా!! అనిపిస్తోంది. శ్రీనివాసా! ఇది గమనించవయ్యా!

ఆ పొలతి (యువతి), ప్రేమాతిశయముతో, వొంగగ (వినమ్రురాలైనది). ఆమె తనువు పులకరించి తనువెల్లా రోమాంచితమైనది. నక్షత్రముల వలె తోచుచున్న ఆ పులకలు ఆమె మానస సాగరమధనంలో జనించినవా యేమి!! అనునట్లుండెను. నీ ధ్యానము ఆమె వ్యాకులత దూరముచేసి సాత్త్విక భావములు కలిగినవి. దాని ఫలితంగా, నేర్పుగా ఆమెలో నిట్టునిలువుగా సాత్త్విక చంద్రోదయమై, ఈ సాగరమధనంలో కూడా చంద్రుడు పుట్టాడే!! అనిపించింది.

ఓ ఏడుకొండలవాడా! ఈ సుదతి (సుందరి) తానే నీ కౌగిట కరగి పోయి ఈ సమయంలో ఇందిరాదేవియై (సముద్ర మధనంలో పుట్టిన లక్ష్మీదేవి) వలె భాసించినది. కదిసిన (దగ్గరయైన) తిరుమలరాయా! మీ అనురాగ సాగర మధన ఫలితంగా ఆమెకు లభించిన అమృత మేమిటో నేను వేరే చెప్పవలెనా? నీ అధరామృతమే ఆమెకు లభించినది. (దీనిని దర్శించిన నా జన్మ కూడా తరించింది తండ్రీ!)

**3-99**

## మున్నుడి

అజ్ఞానం ఆవరించినప్పుడు చేయకూడని పనులు చేస్తారు మానవులు. అలాగే చేయవలసిన పనులు చేయరు. కరువు కాలంలో జీవించటానికి తిండికూడా దొరక్క సరిగ్గా అలాగే చేస్తారు. దైవభక్తి కూడా నశిస్తుంది. ఏడుకొండల వాడా? అట్లాంటి పాడు కాలాన్ని 'వెడలదొబ్బి' మా భీతిని తీర్చి, మమ్మల్ని ఆదుకో తండ్రీ! అంటున్నారు అన్నమాచార్యులవారు. ఇది కలియుగం, ఆకలియుగం. కాస్త 'యెండ గాయవయ్యా!' అంటున్నారు. నాకు తెలిసినంతవరకు అన్నమయ్యలాగ స్వామిని 'లలితంగా' ఇట్లా శరణు వేడినవారు లేరు.

**చం॥ కడబడ జ్ఞానమే కరవు కాలమిదే యిటు దాపురించెరా**
**వెడలగ దొబ్బి మా వెఱపు వేగమె దీర్పవె తాళలేనురా**
**వడిగొనె మారుడన్ 'అగడు వాయువు' సైపను అన్నమయ్యనెన్**
**విడువక చొచ్చితిన్ శరణు వేంకటనాయక! చిత్తగించుమా.**
***కడబడ = అంతమైపోగా**

**రాగం : లలిత**

కదు నజ్ఞానపు - కరవుకాల మిదె
వెడల దొబ్బి మా - వెరపు దీర్పవే ॥కదునజ్ఞాన॥

పాపపు పసురము - బందెలు మేయగ
పోపుల పుణ్యము - పోలివోయ
శ్రీపతి నీకే - చేయి చాచెదము
యేపున మమ్మిక - నీడేర్చవే ॥కదునజ్ఞాన॥

ఇల గలియుగమున - యెండలు గాయగ
చెలగి ధర్మమను - చెరువింకె
పొలసి మీ కృపాం-బుధి చేరితిమిదె
తెలిసి నా దాహము - తీర్చవే ॥కదునజ్ఞాన॥





వడిగొని మనసిజ-వాయువు విసరగ
పొడవగు నెఱుకలు - పుటమెగసె
బడి శ్రీవేంకట-పతి నీ శరణము
విడువక చొచ్చితి - వెసగావగదే ॥కదునజ్ఞాన॥

### భావామృతం

ఓ ప్రభూ! అధికమైన అజ్ఞానం అనే గొప్ప కరవుకాలము మాకు దాపురించింది. దానిని 'వెడలదొబ్బి' (వదలిపోవనట్లు 'తోసి' అవతల పారవేయుము) మా భయం తొలగించి మమ్ము కాపాడు.

మేము చేసికొనిన కొద్దిపాటి పుణ్యమనే పంటను, మా పాపము అనే పశువు బందులమేసింది. (దొంగతనంగా చొరబడి మేసేసింది). మా పోవులైన (రాసులైన) పుణ్యం నశించింది. ఓ శ్రీపతీ! చేయునది లేక దీనులమై చేయిచాచి నీ దయా భిక్షను వేడుకొంటున్నాము. ఇక నీవే దిక్కు. ఏపున (చొరవతీసికొని) మమ్మల్ని గట్టెక్కించు తండ్రీ!

ఈ కలికాలం ఆకలికాలం ప్రభూ! కలియుగమనే ఎండలు ఎక్కువై 'ధర్మము' అనే ప్రశస్తమైన చెఱువు ఇంకిపోయి, ఎండిపోయి బీటలు వారింది. మేము పొలసి (తిరిగి తిరిగీ) నీ కరుణాసాగరము అనే మంచినీటి జలనిధిని చేరుకొన్నాం. మేము దాహంతో నీదయకోసం ఎంత తపించిపోతున్నామో తెలుసుకొని నా దాహం తీర్చవయ్యా! నన్ను కరుణించు తండ్రీ!

దేవా! వడిగొని (ఉద్ధృతముగా) మనసిజ వాయువు (మన్మధుడనే హోరుగాలి) వీచగా, పొడవగు నెఱుకలు పుటమెగసె (నేను సంపాదించుకొన్న విజ్ఞానమంతా కళ్ళుమూసి తెఱచు లోపల గాలి కెగిరిపోయింది.) ఇప్పుడు నేను అనాధను. వడిగా (శీఘ్రముగా) శ్రీవేంకటేశ్వరా! నేను నీ శరణు జొచ్చితిని "అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" - అని నీ అండ జేరాను. విడువక నన్ను రక్షించుము తండ్రీ!

## 3-100

## మున్నుడి

భజనద్వారా భగవంతుని ఆరాధించటం మన అనాది సంప్రదాయం. అన్నమాచార్యులవారు చెప్పిన అనేక భజన కీర్తనలలో ఇదికూడా తలమానికమైనది. 'ఈ రచనలను ఎవ్వరు తలచిన (అవి), ఇహపరమంత్రము లిందరికి' అని, ఓ నారాయణా! వివిధాత్మల రూపా! అట్టి నీకు 'నమో నమో' అని వందనములర్పిస్తున్నారు. ఇట్టి కీర్తనలలో భావామృత వివరణ అంత ప్రాధాన్యమైనది కాకున్నా, రెండు మూడు పదాలకు వివరణ ఇవ్వటం సమంజసం అనిపించి ఇవ్వటం జరిగింది. అనునిత్యం ఇటువంటి భజనలతో నారాయణుని సంకీర్తించండి, తరించండి.

**కం॥ ఈ రచన నెవరు తలచిన**
**నారాయణ ఇహపరములు నశియించునయా!**
**వరమైన మంత్రమదియే**
**గురుడౌ హరి నన్నమయ్య కొలిచె ప్రణతితో**

**రాగం : మిశ్రదేశ్**

నారాయణాయ నమో నమో
నానాత్మనే నమో నమో
ఈ రచనలనే ఎవ్వరు తలచిన
ఇహపరమంత్రము లిందరికి ॥నారాయణా॥

గోవిందాయ నమో నమో గోపాలాయ నమోనమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో నమో
ఈ వరుసలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రము లిందరికి ॥నారాయణా॥

దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో
శ్రీమహిళాపతయే నమో నమో శిష్టరక్షణే నమో నమో
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో
ఈ మేరలనే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి ॥నారాయణా॥





పరిపూర్ణాయ నమో నమో ప్రణవాగ్రాయ నమో నమో
చిరంతనా శ్రీవేంకటనాయక శేషశాయినే నమో నమో
నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో
ఇరవుగ నీగతి నెవ్వరు దలచిన ఇహపరమంత్రములిందరికి ॥నారాయణా॥

**భావామృతం :**

ఓ శ్రీమన్నారాయణా! నమోనమః నానాత్మల రూపుడవై భాసిల్లుతున్న పరమాత్మా! నమోనమః నీ రచనా చమత్కారంతో జగములన్నీ సృష్టించి, పోషించి, లయం చేస్తున్నావు. ఎవ్వరు నీ ఈ రచనలను తలచి నిన్ను భజిస్తారో... వారికి ఇహలోకంలో సుఖ సంతోషాలు, పరలోకంలో మోక్షప్రాప్తి కలిగి తీరుతాయి. నీ భజనలు ఇంతమంది జనులకు ఇహపరములిచ్చే మంత్రములు.

ఓ గోవిందా! నీకు వందనములు. గోవులను పాలించిన యదు నందనా! నీకు వందనములు. భావనలలోనే జన్మ కలిగిన మన్మధుని కన్నతండ్రీ! నీకు వందనములు. దివ్యమైన గుణములు కలిగిన దేవా! నీకు వందనములు. ఈ విధముగా నిన్ను ఎవ్వరు భజింతురో ఆ భజనలు వారికి ఇహపరములను సాధించగలిగిన దివ్య మంత్రములు.

ఓ దామోదరా! నీకు ప్రణతులు (నమస్కారములు). ఓ ధరణీశా! (భూదేవికి మగడా!) నీకు ప్రణతులు. ఓ శ్రీమహిళాపతీ! (శ్రీపతీ) నీకు ప్రణతులు. శిష్టులైన సన్మతులను రక్షించు అనాథ రక్షకా! నీకు ప్రణతులు. వామనునిగా బలి నణచి సుర రక్షకుడవైన దేవా! నీకు ప్రణతులు. ఓ పద్మనయనా! నీకు ప్రణతులు. ఈ మేరలనే (ఈ క్రమములోనే) నిన్ను ఎవ్వరు భజింతురో వారికి ఇహపరములలో సౌఖ్యము కలుగుతుంది. ఈ భజనలు ఇందరికీ ఇహపర సుఖములనొసగే మంత్రములు.

పరిపూర్ణుడవైన ఓ సర్వేశ్వరా! నీకు నమస్కారములు. ఓంకార స్వరూపా! నీకు నమస్కారములు. ఓ చిరంతనా! (ఆది అనునది లేని 'అనాది') గా ఆదిశేషుడు తల్పముగా క్షీరసాగర శయనుడవు అయిన శ్రీవేంకటేశ్వరా! నీకు నమస్కారములు. నరకాసురుని వధించిన శ్రీకృష్ణా! నీకు నమస్కారములు ప్రహ్లాదవరదుడవైన నరసింహస్వరూపా! నీకు నమస్కారములు. ఈ విధముగా నీవు నెలకొని యుంటివని ఎవ్వరు భావిస్తారో వారికి నీ ఈ భజనలు ఇహపరములనొసగే దివ్యమంత్రములు.

## 3-101

## మున్నుడి

మంగళం పాడుతున్నారు అన్నమాచార్యులవారు. దీనితో ఈ సంపుటిలో చిట్ట చివరి కీర్తనకు మున్నుడి మరియు భావామృతం వివరణ పూర్తి అవుతాయి. మాధవుడు, భూధవుడు అయిన శ్రీధరునికి చిన్మయమూర్తికి సాధుజన ప్రియునికి మంగళం పలుకుతున్నారు. ఎవ్వరూ ఇదివరలో వేంకటరమణుని చదువులమూర్తి అని కీర్తించలేదు. అలమేల్మంగమ్మను ఆయన ఛాయ (నీడ) అని కీర్తించలేదు. మా యింటి పతి అని కీర్తించలేదు. మన అన్నమయ్యకు సాటిలేరు, రాలేరు, రాబోరు...

**ఉ॥ మాధవ! నీకు మంగళము మన్మథు తండ్రికి మంగళంబహో!!**
**సాధుజనాళికిన్ ప్రియుదు సజ్జన వందితుడైన స్వామికిన్**
**భూధవుడైన దేవునికి పూజలు సేసెద నన్నమయ్యనెన్**
**శ్రీధర! చిన్మయా! జయము శ్రీకరుడౌ తిరువేంకటేశ్వరా!**

**రాగం : సురటి**

మాధవునకు మంగళం
సాధుప్రియునకు జయమంగళం ॥మాధవు॥

మదనగురునకును మంగళం, మా
మదిలో హరికిని మంగళం
మదరిపు హరునకు మంగళం
చదువులమూర్తికి జయమంగళం ॥మాధవు॥

మహిమాధికునకు మంగళం
మహామహునకు మంగళం
మహీధవునకు మంగళం
సహజతేజునకు జయ మంగళం ॥మాధవు॥





మాయారహితునికి మంగళం
మా యింటిపతికిని మంగళం
యీ యెడ శ్రీవేంకటేశ్వరు డీతని
చాయ శ్రీసతికి జయ మంగళం ॥మాధవు॥

## భావామృతం

మాధవుడైన శ్రీమన్నారాయణునకు మంగళమగు గాక! సాధుజనులకు ప్రియుడైన శ్రీహరికి జయమంగళము.

మన్మథుని తండ్రిగారైన మహానుభావునికి మంగళముగాక! హృదయాలలో స్థితుడై ఆత్మారామునిగానున్న శ్రీహరికి మంగళమగుగాక! మన శత్రువైన మదమును హరించు దేవదేవునికి మంగళమగుగాక! చదువులమూర్తికి (వేదములే మూర్తిగా అవతరించిన స్వామికి) మంగళము, జయమంగళము పలుకుచున్నాను.

అధికమైన మహిమలు గల దేవునకు మంగళము. మహామహుడైన జగన్నాథునకు మంగళము అగుగాక! వరాహమూర్తియై, మహిని ధరించిన స్వామికి మంగళమగు గాక! సహజ తేజస్సుతో వెలుగులు విరజిమ్మే ఆదిదేవునకు జయమంగళమగుగాక!

మాయకు ఏమాత్రమూ లొంగని ప్రభువునకు మంగళమగు గాక! మా ఇలవేల్పు అయిన స్వామికి మంగళమగు గాక! ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడయిన ఈ మహానుభావునికి అతని నీడవలె వెంటనుండే అలమేల్మంగమ్మకు జయమంగళమగు గాక!

Author

రచయిత :

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**పిలవండి** : **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**పుట్టింది** : **9-6-1945**

**చదివింది** : **M.Tech**

**ఉండేది** : ఫ్లాట్ నెం.5, ప్లాటు నెం.61,
సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్దార్థ నగర్,
హైదరాబాద్–500 038. ఆం.ప్ర. భారతదేశం.

**రంధి** : భగవన్నామ సంకీర్తన

**నచ్చింది** : శాస్త్రీయ సంగీతం

**నచ్చంది** : నక్కజిత్తులు

**మెచ్చింది** : సజ్జన సాంగత్యం

**రింగండి** : **00919393021360**

**చదవండి** : **www.geetadeeksha.com**

**ఇవ్వండి** : **e-mail : geetadeeksha@gmail.com**

భావయామి వేంకటేశం



















శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-IV**

**ఎన్నుకోబడిన**

**అన్నమాచార్యుల సంకీర్తనలకు**

**మున్నుడి**

మరియు

**భావామృతం వివరణ**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-IV**

**మొదటి ప్రచురణ**
**జూన్ 2011**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

వెల : అమూల్యం

**ప్రతులకు :**
**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,**
**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**డి.టి.పి. & ప్రింటింగ్ :**
**కె. మురళీ కృష్ణ**
**9848 51 51 09**





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

**- రచయిత**



**అంకితము**

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి IV

### అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అందరికీ నెక్కుడైన | 21 |
| 2. | అంజనా తనయుడైన | 57 |
| 3. | అన్ని మంత్రములు ఇందే | 01 |
| 4. | అరుదీ కపీంద్రుని | 187 |
| 5. | అలివేణిని పెండ్లాడవయ్య | 85 |
| 6. | అతడు లక్ష్మీపతి | 133 |
| 7. | అమరాంగన లిదే | 157 |
| 8. | అవధారు చిత్తగించు | 137 |
| 9. | అవధారు రఘుపతీ | 65 |
| 10. | అబ్బురంపు శిశువు | 113 |
| 11. | ఆదరో పాదరో | 25 |
| 12. | ఆరగింపవో | 143 |
| 13. | ఇందులకు జింతించ | 109 |
| 14. | ఇతర దేవతలకిది | 71 |
| 15. | ఇదిగాక సౌభాగ్య | 03 |
| 16. | ఉన్నతోన్నతుడు | 177 |
| 17. | ఎందు నీకు ప్రియమో | 165 |







| | | |
|---|---|---|
| 18. | ఎత్తరో ఆరతులు | 117 |
| 19. | ఎట్టునేరిచితివయ్యా | 191 |
| 20. | ఎదుటనున్నాడు వీడె | 155 |
| 21. | ఎదురేది ఇంక మాకు | 129 |
| 22. | ఏదుపాయము | 39 |
| 23. | ఏమి సేయవచ్చు | 127 |
| 24. | ఏమి నిద్దురించేవు | 183 |
| 25. | ఏడే జేనలు ఈ దేహము | 69 |
| 26. | ఏల రాడమ్మా ఇంతిరో | 77 |
| 27. | ఒక్కడే మోక్షకర్త | 05 |
| 28. | కాదనకు నామాట | 49 |
| 29. | కేశవ కృష్ణావతార | 37 |
| 30. | కొమ్మలాల అమ్మలాల | 159 |
| 31. | కొమ్మలు చూడరే | 53 |
| 32. | ఘనుడవు నీ మహిమ | 41 |
| 33. | గోవింద నంద నందన | 101 |
| 34. | చక్కని ఈ వెన్నుడు | 199 |
| 35. | చదివితి దొల్లి | 167 |
| 36. | చలిగాలి వేడేల | 59 |
| 37. | చలువకు వేడికి | 51 |
| 38. | చిత్తజు గురుడ నీకు | 203 |

| | | |
|---|---|---|
| 39. | చూడ పిన్నవాడు గాని | 27 |
| 40. | జడమతి రహం | 63 |
| 41. | జయ జయ నృసింహ | 29 |
| 42. | జయము మనది వనచరులాల | 185 |
| 43. | జయ జయ రామ | 147 |
| 44. | జోజో దీన జనావన | 195 |
| 45. | జోజోయని మీరు | 107 |
| 46. | తగుదువమ్మ | 07 |
| 47. | తెలియ చీకటికి | 19 |
| 48. | దీనుడనేను దేవుడవు నీవు | 161 |
| 49. | దేవదేవోత్తముని | 11 |
| 50. | దేవదేవుడెక్కెనదె | 67 |
| 51. | నగధర నందగోప | 35 |
| 52. | నందగోప నందనుడే | 73 |
| 53. | నరులాల మునులాల | 09 |
| 54. | నమో నమో దానవ వినాశక | 103 |
| 55. | నీవనగ నొకచోట | 47 |
| 56. | నీ నామమే మాకు నిధియు | 99 |
| 57. | నీవు దేవుడవు | 171 |
| 58. | నెలత సొబగులివి | 131 |
| 59. | నెలత మోహించెనదె | 13 |







| | | |
|---|---|---|
| 60. | నేడే సుక్కురారము | 45 |
| 61. | పదియు బదియుగాను | 83 |
| 62. | పరమ సుజ్ఞానులకు | 153 |
| 63. | పలుమరు పుట్ట | 17 |
| 64. | పిలువరే కృష్ణుని | 87 |
| 65. | పురుషులకు పురుషుడవు | 169 |
| 66. | పెద ఔబళపు కొండ | 135 |
| 67. | పేరంటాండ్లు పాడరో | 125 |
| 68. | పొలియలుక నిద్దురలు | 79 |
| 69. | పోయగాలం బడవికి | 95 |
| 70. | పోపో నీ పొందు చాలు | 173 |
| 71. | బంగారు మేడల లోన | 93 |
| 72. | భక్త సులభుడును | 145 |
| 73. | భళి భళి రామ | 97 |
| 74. | మించి దేవాంగనలిట్టే | 193 |
| 75. | ముందే తొలగవలె | 175 |
| 76. | మూల మూలనమ్ముడు | 119 |
| 77. | రమణుడు పిలిచీని | 141 |
| 78. | రసికుడవౌదు | 123 |
| 79. | లలిత లావణ్య | 115 |
| 80. | వట్టి విచారములేల | 33 |

81. వాడెవో ప్రహ్లాదవరదుడు 189
82. వీడెవో అల విజయ 31
83. వీడేవీడే కూచున్నాడు 91
84. విష్ణుదేవు పాదములే 121
85. వెగ్గల మింతా వృథా వృథా 75
86. వెన్నలు సెలవిగారే 105
87. వెట్టివలపు చల్లకు విష్ణుమూర్తి 23
88. శ్రీపతి పురనాయక 197
89. శ్రీహరీ నిత్యశేషగిరీశ 179
90. శ్రీవేంకటేశుడు 181
91. శరణు శరణు నీకు సర్వేశ్వరా 61
92. శరణు శరణు దేవా సర్వ పోషక 201
93. సకలము జదివిన 43
94. సతతం శ్రీశం. 111
95. సర్వ సులభుడితడు 55
96. సమబుద్ధే అందరికి 139
97. సంతలే జొచ్చితిని గాని 15
98. సిగ్గరి పెండ్లికూతురు 163
99. సీతాశోక విఘాతక 89
100. సేవే భావే శ్రీబృందం 151
101. హీనాధికములింక 149





# ప్రార్థన

కం॥ శ్రీ లక్ష్మీసతివల్లభ!
నీలీలల నెరుగ నాకు నిపుణత కలదా?
తేలికగ అన్నమయ్యకు
మాలావుగ మున్నుడులను భావాల్జెబుదున్

కం॥ శ్రీలలన నోరకంటను
భూలలనకు తెలియకుండ మురవైరి కనున్
మేలగు కీర్తన జెప్పును
ఆ లీలల కన్నమయ్య అలరించ హరిన్

కం॥ "ఉన్నాడెల్లెడ" యొకడనె
"ఉన్నాడోలేడొ" యనెను యొక గజము వనిన్
ఉన్నతుడు అన్నమయ్యనె
ఉన్నాడా విష్ణుమూర్తి యొదిగి తిరుమలన్

కం॥ శ్రీవల్లభునే నమ్మితి
భావామృతమిట్లు వ్రాయ ప్రార్థించితిగా
ఈ వూహ అన్నమయ్యది
నా వాక్కున పలుకువాడు నయముగ హరియే

ఆ.వె॥ అన్నమయ్య కృతుల నెన్నుచు మున్నుడిన్
భావములను విశదపరచినాను
'భావయామి' యనుచు శ్రీవేంకటేశ్వరా!
శరణుజొచ్చినాను పరమపురుష!



## ముందు మాట (సంపుటి-IV)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.





భావయామి వేంకటేశం



**4-1**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఈ సుప్రసిద్ధమైన కీర్తనలో తమకు చిన్ననాటినుంచే వేంకటేశ్వరుని మంత్రం పెన్నిధిగా మిగిలిందనీ, లోకంలోని మంత్రాలన్నీ ఆ మంత్రంలోనే 'ఆవహించి' వున్నాయని నమ్మకంగా చెబుతున్నారు. ఆదిలో నారదముని మొదలుకొని కృతయుగపు ప్రహ్లాదుడు, త్రేతాయుగపు విభీషణుడు, ద్వాపరయుగపు అర్జునుడు, పురాణకాలంలో ధ్రువుడు, శుకమహర్షి – అందరూ నమ్మినది ఇందిరావల్లభుడైన శ్రీహరినే. పరబ్రహ్మయైన ఆయనే రకరకాల మంత్రాలవల్ల ఆరాధించబడ్డ తిరుమలనాథుడు.

**ఉ॥ మంత్రములన్నియున్ నిలిచి మానవులార! తమావహించెనీ**
**మంత్రము, వెన్నతో కలిగె మాకది భాగ్యము అన్నమయ్యనెన్**
**మంత్రము వేంకటేశునిది మానక తానటు యెంచినాననెన్**
**మంత్రములన్యులేవి తమ మన్నన నెంచిరి లెక్కజెప్పిరా.**

**రాగం : అమృతవర్షిణి**

అన్ని మంత్రములు ఇందే ఆవహించెను
వెన్నతో నాకు కలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

నారదుడు జపియించె నారాయణ మంత్రము
చేరి ప్రహ్లాదుడు నారసింహ మంత్రము
కోరి విభీషణుడు చేకొనె రామమంత్రము
వేరె నాకు కలిగె వేంకటేశు మంత్రము ॥అన్ని॥

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుడు జపియించె
అంగవించె కృష్ణమంత్రము అర్జునుడు
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము ॥అని॥





ఇన్ని మంత్రములకెల్ల ఇందిరానాథుడే గురి
పన్నిన దిదియే పరబ్రహ్మ మంత్రము
నన్ను కావగలిగే పో నాకు గురుడియ్యగాను
వెన్నెల వంటిది శ్రీవేంకటేశు మంత్రము ॥అన్ని॥

**భావామృతం :**

ఓ మానవులారా! లోకాలన్నింటిలోను వున్న మంత్రములన్నింటికీ శ్రేష్ఠమైన మంత్రం ఇందులోనే ఆవహించియున్నది. ఇదే శ్రీవేంకటేశ్వరుని దివ్యమంత్రము. ఇది నాకు వెన్నతో కలిగింది (చిన్నప్పుడు అమ్మ వెన్న తినిపించిన వయస్సునుంచే అలవడింది). ఈ మంత్రాన్నే పలువురు, పూర్వం పలువిధాలుగా స్మరించారు.

అనాదిగా నారద మహాముని 'నారాయణ' అని పలుకుతూ, వూత పదంలాగ స్మరించారు. అదే ఆయనకు ఓం నమోనారాయణ – అనే నారాయణ మంత్రమయింది. కృతయుగంలో ప్రహ్లాదవరదుడైన నారసింహుని శరణని, ఆ నారసింహ మంత్రం పఠించి రసాతలంలో తన మనుమడు బలిచక్రవర్తితో స్థిరపడ్డాడు, ప్రహ్లాదుడు. త్రేతాయుగంలో శ్రీరామమంత్రం పఠించి, జానకీ వల్లభుడైన శ్రీరామచంద్రుని కరుణతో, స్వర్ణ లంకాధిపతి అయ్యాడు విభీషణుడు. ఆ విధంగా వారందరికీ ఆయా మంత్రాలు కలిగితే, నాకు మాత్రం ప్రత్యేకంగా శ్రీవేంకటేశ్వరుని మంత్రం దొరికింది.

పూర్వం చిన్ని బాలుడైన ధ్రువుడు "ఓం భగవతే వాసుదేవాయ" అనే మంత్రం పఠించి శ్రీహరి దయను సంపాదించి ధృవనక్షత్రమై జగద్విఖ్యాతుడైనాడు. ద్వాపరయుగంలో అర్జునుడు, అంగవించి (ఉత్సాహంతో) 'శ్రీకృష్ణా! యదుభూషణా!' అని శ్రీకృష్ణ మంత్రం పఠించిన విజయుడైనాడు. ఆ తరువాత శుకయోగీంద్రుడు విష్ణుమూర్తిని సేవించి సదా ఆయన గాథలు ఇతర భక్తులకు చెబుతూ తరించాడు. నేడు నాకు శ్రీవేంకటేశుని మంత్రము, వింగడమై(ప్రత్యేకంగా) దొరికింది.

పైన చెప్పిన ఇన్ని మంత్రాలకు లక్ష్యం లక్ష్మీకాంతుడైన శ్రీమన్నారాయణుడే. ఈ మంత్రమే పరబ్రహ్మ మంత్రంవలె, పన్నినది (నెలకొనినది). ఇకపో, నన్ను రక్షించుటకు మా గురుదేవులు నాకందించిన మంత్రమే "ఓం నమో వేంకటేశాయ" అనే అష్టాక్షరీ మంత్రం. అది వెన్నెల వలె చల్లనైనది. మీరూ శరణని నేటినుంచే మొదలు పెట్టండి. తరించండి.

## 4-2

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తనపైకి తేలికగా అర్థమవుతున్నట్లుండే నిగూఢ తత్త్వ చింతన ప్రతిపాదన చేసే కీర్తన. ఒక యోగి భగవంతునే ధ్యానిస్తూ, సాలోక్య, సాయుజ్య, సామీప్య సిద్ధిని పొంది చిట్ట చివరకు సారూప్య స్థితిని పొందుతాడని వేదాంత తత్త్వం చెబుతోంది. ఇక్కడ నాయిక కూడా స్వామిపై 'మోహాపేక్షలతో' ఆరంభమైన స్థితినుంచి నెమ్మదిగా మనస్సుని జయించి నిశ్చలతత్త్వం అలవరచుకొని మనో చింతనపోయి పరతత్త్వ భావం పెంపొందించుకొని 'త్వమేవాహం' స్థితిని పొంది తానే స్వామి, స్వామియే తను అను భావన పొందింది.

**చం॥ సిరిపతి నాత్మలో తలచి చిత్తమునందున నిల్పి కోరికల్**
**తరుణిజయించి, యోగివలె తాపము వీడుచు శాంత చిత్తయెన్**
**తిరుమలనాథు తత్త్వమును దేవియెరింగెను స్వామి సత్కృపన్**
**స్థిరమయి యుల్ల మా చెలియ ధీరత నొందెను అన్నమయ్యనెన్.**

**రాగం : కాంభోజి**

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బికనొకటి కలదె ॥ఇదిగాక॥

అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్షలన్నియు విడచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసన వోలె నుండె ॥ఇదిగాక॥

తరుణి హృదయము కృతార్థత పొంది విభు మీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసి జానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ఇదిగాక॥





శ్రీ వేంకటేశ్వరుని చింతించి పరతత్త్వ
భావంబు నిజముగా పట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ ॥ఇదిగాక॥

**భావామృతం :**

ఇది కాకుండా సౌభాగ్యము ఇంకోటుంటుందా? ఇది కాకుండా తపస్సు ఇంకా వేరే వుంటుందా? ఇదిగాక వైభవం అంటూ మరొకటుంటుందా? సాధ్యంకాదు. అదేమిటో చిత్తగించండి.

స్వామివారి 'నాయిక' జన్మసఫలమైన యోగీశ్వరునివలె అన్యములైన వ్యామోహములను, అపేక్షలను విడిచిబుచ్చినది. ఇటు పరికించి చూడగా ఈవిడ కోరికలు గొప్ప శాంతిని పొంది, నిరంతరం విజ్ఞాన వాసన (ఆత్మజ్ఞానానుభూతి యొక్క స్మృతి) వోలె నుండె (కలిగినదానివలె నుండెను). శరీరభావంపోయి నేను ఆత్మను అనే భావం కలుగగానే రాగద్వేషాలు నశించి శాంతి కలుగుతుంది. అదే ఆమెకు జరిగింది.

ఆ భామిని హృదయము వుత్తీర్ణత పొందినది. తన ప్రాణనాథుని యొక్క ఆలోచనే ఆమెకు పారవశ్యముతో కూడిన ఆనందమునీయసాగినది. ఆమె హృదయము ఆనందమునకు స్థానమై పోయినది. ఆ పద్మముఖి తన మనస్సుపై విజయం సాధించింది. ఆమె నిరుపమానమైన నిశ్చలభావముతో గొప్ప నిశ్చల స్థితిని పొందినది. ఆ స్థితిలో ఆమె మనసు నిండా స్వామియే. ఆయనకు అతి సమీపముగా నున్న భావము ఆమెకు నిశ్చలానంద మమేక భావన కలిగించసాగినది.

అట్టి నిరంతర చింతన వల్ల ఆమె ఆత్మ శ్రీవేంకటేశ్వరునే ధ్యానించుచూ నిజమైన పరతత్త్వ భావమునుపొందినది. సారూప్యసిద్ధిని పొందిన ఆమె తనే స్వామిగా, స్వామియే తనుగా భావించసాగినది. అదే మోక్షప్రాప్తి. 'త్వమేవాహం'- అంటే అదే. నీవేనేను,నేనే నీవు అనే భావం స్వామి యెడల కలిగితే అదే నిత్యానంద స్థితి. ఆమె దేవదేవుని కృపనార్జించి ఇప్పుడు తన అంతరంగంలో స్థిరచిత్తురాలై సాయుజ్యస్థితిని పొందినది.

4-3

## మున్నుడి

వేదముల సారార్థమును అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో గీతావాక్యముగా వివరిస్తున్నారు. భగవంతుని శరణాగతి ఒక్కటే జీవితపరమార్థము. మోక్షకర్త కూడా ఒక్కడే. నానాదేవతలని సంతోమపరచి,కామ్యకర్మలు (యజ్ఞంలాంటివి) చేయవలసిన అవసరం జ్ఞానికేమాత్రంలేదు. ఒక కొలనుంటే దాహంతీర్చుకొనే వాడు దాహం తీర్చుకొంటాడు, ఈతకొట్టేవాడు ఈతకొడతాడ. అలాగే జ్ఞాని వేదాల్లోసారం మాత్రమే గ్రహిస్తాడు కాని వేదాంగాలైన మీమాంసలాంటివి వాడికెందుకు? దీన్నేకదా! కృష్ణుడు అర్జునుడికి గీతలో చెప్పింది. ఆయనే మనవేంకన్న కదా!

**ఆ.వె॥ఒకడె మోక్షకర్త వొక్కటే శరణంబు**
**హరిని దిక్కనంచు అవనిజనులు**
**బ్రతికినారుతొల్లి, భగవానుగీత వా-**
**క్యమును జెప్పినారు అన్నమయ్య.**

**రాగం : దేవగాంధారి**

ఒక్కడే మోక్షకర్త - వొక్కటే శరణాగతి
దిక్కని హరిగొల్చిబ -దికిరి తొంటివారు ॥ఒక్కడే॥

నానాదేవతలున్నారు-నానాలోకాలున్నవి
నానావ్రతాలున్నవి-నడచేటివి
జ్ఞానికి గామ్యకర్మాలు-జరిపి పొందేదేమి
ఆనుకొన్న వేదోక్తా-లైనా నాయగాక

ఒక్కడు దప్పికి ద్రాపు-వొక్కడు కడవనించు
నొక్కడీదులాడు మడు-గొక్కటియందే
చక్క జ్ఞానియైన వాడు-సారార్థము వేదమందు
తక్కక చేకొనుగాక-తలకెత్తుకొనునా ॥ఒక్కడే॥





ఇదిభగవద్గీతార్థ-మిది యర్జునునితోను
ఎదుటనే వుపదేశ-మిచ్చెగృష్ణుడు
వెదకి వినరో శ్రీ- వేంకటేశు దాసులాల
బ్రతుకుద్రోవమనకు-పాటించి చేకొనరో ॥ఒక్కడే॥

**భావామృతం :**

తొంటివారు అంటే మన పూర్వీకులు శ్రీమన్నారాయణుడైన శ్రీహరియే దిక్కని ఆయన నారాధించి బ్రతికారు. వాళ్ళు నమ్మిన సత్యం ఇదే. మోక్షకర్త ఈ ప్రపంచంలో ఒక్క శ్రీహరియే. ఆయన్ని సేవించే పద్ధతి కూడా ఒక్కటే. అదే ఆయనను శరణువేడటం.

దేవతలు యెందరెందరో వున్నారు. ఈ విశ్వంలో లోకాలు కూడా ఎన్నెన్నో వున్నాయి. ఆయాలోకాలు పొందుటకు సాధనలు కూడా యెన్నెన్నోవున్నాయి. స్వర్గప్రాప్తి కోసం చేయాల్సిన కామ్యకర్మల వివరాలు వేదాల్లో చెప్పబడే వున్నాయి. అయినా జ్ఞానికి ఈ కామ్యకర్మలనాచరించి పొందవలసిన దేదీలేదు. పైగా ఆ స్వర్గవాసమన్నా శాశ్వతమనుకొందామంటే మనపుణ్యం తరిగిపోగానే మళ్ళీ భూలోకంలో జన్మించక తప్పదు. అందుకనే జ్ఞాని కామ్యకర్మల గురించి ఆరాటపడదు.

నీటిమడుగును చూసిన ప్రతివాడూ వెంటనే నీరుతాగడు. దాహపీడితుడు మాత్రమే త్రాగుతాడు. ఇంకొకడు కడవలో పట్టుకొని నీరు దాచుకొంటాడు. ఇంకొకడు ఆ మడుగులో స్నానం చేస్తాడు. అట్లే వేదాల్లో ఎన్నో విషయములు చెప్పబడివున్నవి గావున ఎవరికి ఏ విషయం మీద ఆసక్తియుంటే ఆ విషయం చదివి నేర్చుకొంటాడు. అయితే జ్ఞాని మాత్రం ఏది వేదసారార్థమో అది మాత్రమే గ్రహించి తక్కినవి తలకెత్తుకొనడు. అసలు వాటి జోలికేపోడు.

భగవద్గీతలో చెప్పబడిన భావము ఇదే. శ్రీకృష్ణుడు అర్జునునికి తన సమక్షములో ఉపదేశించిన గీత ఇదే. శ్రీవేంకటేశ్వరుని దాసులారా! సావధానులై ఈ విషయాన్ని వినండి. ఉపయోగకరమైన జీవన మార్గం ఇది ఒక్కటే. దీనినే చేకొని పాటించి ధన్యులవండి.

**4-4**

## మున్నుడి

అలమేల్మంగమ్మ సొగసులును వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. అందచందాలలో ఆమె మన్మథుని తండ్రిగారైన స్వామికి అన్నివిధములా సరిజోడు అంటున్నారు. తనఅధరములలో అష్టామృతములు కలిగినదైనందు వల్ల ఆమే, తిరుమలేశునికి తగినది అని తెగవేసి చెబుతున్నారు. ఆ నాటి, కవుల పంథాలోనే అన్నమయ్య కూడా అమ్మవారి అంగాంగ వర్ణన కీర్తిస్తున్నారు. చదువరులలో పిన్న వయసు వారుంటారనే భావనతో భావ వివరణలో అమృతాన్నిలోపింపజేశాను. క్షంతవ్యుడను స్వామీ!

**కం॥ తగుదువు మదనుని తండ్రికి**
**మొగి యెనిమిది అమృతములు మోవి కలుగుటన్**
**తెగవేసి చెప్పెనన్నయ**
**మగడగు వేంకటవిభుండు మన్నించెననెన్.**

**రాగం : బృందావని**

తగుదువమ్మ నీ వందపు మరుతండ్రికి
మొగిదచ్చిన మృతము మొమి నుంది గాన ॥తగుదు॥

కోమలి నీ జవ్వనము కొలదివెట్టగ రాదు
ప్రేమమున మీద మీద పెరిగీ గాన
ఆమని నీ సింగార మంత యింత అనరాదు
వేమారు నీచూపు వెల్లి విరిసీ గాన ॥తగుదు॥

తొయ్యలి నీ వొరపులు తులదూచి చెప్పరాదు
నెయ్యపు నీ తురుమిదె నిక్కీ గాన
చయ్యన నీ సొబగు లిచ్చట నియమించరాదు
అయ్యన నీ పిరుదున కలవిలేదు గాన ॥తగుదు॥





వనిత నీ భావమింక వర్ణించి పలుకరాదు
కొన నీ పాదములు చిగురులు గాన
తనరు నీ భాగ్యము తలచ నలవి కాదు
ఘనుడగు శ్రీవేంకటేశు కలసితిగాన ॥తగుదు॥

## భావామృతం

తల్లీ! అలమేల్మంగా! నీవు అన్ని విధమూలా అందచందములలో, మదనజనకుడైన అందగాడు వేంకటరమణునికి, సరితూగ గలదానివే. నీకేమమ్మా! మొగి(మొత్తము) దచ్చిన (ఎనిమిది రకములైన) అమృతములు, నీ మోవినుండీగాన (నీ అధరములో నున్నవి కదా!)

కోమలమైన అలమేల్మంగమ్మా! నీయవ్వనమును కొలతపెట్టగలమా!! అంతకంతకు నీకు స్వామిపై ప్రేమ అధికమవుతూనేవున్నది కదా! అందుచేత నీ యవ్వనము కొలత మీరుచునేయున్నది. ఆమని (సమృద్ధియైన) నీ అలంకరణకు కూడ 'ఇంత' అని పరిమితిలేదు. నీ చూపు వేయిరెట్లు శోభతో వెల్లివిరియుచున్నది కదా!

తొయ్యలీ! (ఓ వనితా!) నీ వొరపులు (అందములు) తూచిచెప్పుటకసాధ్యమైన పని. ఏలనందువా, ఇంపైన నీ కొప్పు, ఇదే వున్నతమై నీకు గర్వము కలిగించునట్లున్నది. వర్ణింపనసాధ్యమైన నీ సొగసులకు, చయ్యన (శీఘ్రముగా) ఇక్కడ ఒక హద్దు పెట్టనసాధ్యమే. అబ్బురపడు నీ పృష్ఠమున కలవి లేదు తల్లీ!

ఓ వనితా! నీ స్వభావమును వర్ణించుటయు దుస్సాధ్యమైన యత్నమే. నీ పాదముల అంచులు చిగురుల వలె కోమలముగా నున్నవి. పుష్కలమైన నీ భాగ్యమును తలచుటకే సాధ్యము కాకున్నది. ఏలనందవా, సర్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వరుడు నిన్ను చేరగా నీవాయనను కూడితివి కదా! నీకు వైభవములలో సరితూగువారెవ్వరు? తల్లీ!

4-5

## మున్నుడి

ప్రపంచంలోని నరులను,మునులను, రకరకాల దేవతలను (యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుషోదులు) అన్నమాచార్యులవారు పిలుస్తున్నారు ఈ కీర్తనలో. ప్రత్యక్షంగా యెట్టనెదుట నరసింగరూపంతో, వున్నతమైన సింహాసనం మీద ఆదిలక్ష్మిని తొడపై నుంచుకొని, చేతులలో శంఖచక్రాలతో తేజోమూర్తివలెనున్న ప్రహ్లాద వరదుని వీక్షించమంటున్నారు. ఇక్కడ అహోబలంలో వున్న ఈ ఆదిమూర్తే అక్కడ ఏడుకొండల మీద వున్న కొదలేని మూర్తి అంటున్నారు. అంటే .....చదవండి మరి.

**తే॥ ఇతడు పరబ్రహ్మ ప్రత్యక్షమిచ్చెనెదుట**
**వీని ప్రహ్లాదవరదు భావించి చూడు-**
**దనుచు నరులను, మునులను, అఖిల సురుల**
**బిలిచె నన్నయ్య పాడుచు కొలువుదంచు.**

**రాగం : రామక్రియ**

నరులాలమునులాల నానా దేవతలాల
పరబ్రహ్మమీతడే ప్రత్యక్షమై వున్నాడు ॥నరులారా॥

భావించిచూడరో వీడె ప్రహ్లాద వరదుడు
సేవించరో తొడమీది శ్రీసతిని
వావిరి నుతించరో వర శంఖచక్రాలవె
కోవిదుడు గద్దె మీద కొలువై వున్నాడు ॥నరులారా॥

చెలగి మొక్కరో వీడె శ్రీనరసింహదేవుడు
తెలియరో ఈతని తేజోరూపము
అలరి పూజించరో అనంత హస్తము లవె
కొలది మీర విష్ణుడు కొలువై వున్నాడు ॥నరులారా॥



భావయామి వేంకటేశం

ఇదె శరణనరో హిరణ్య దైత్యహరుని
అదన జపించరో ఈ హరినామము
ఎదుట శ్రీవేంకటాద్రిని అహోబలమునందు
కొదలేక ఆదిమూరితి కొలువై వున్నాడు ॥నరులారా॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! మునులారా! వివిధ దేవగణములారా విచ్చేయండి. ఇదిగో ఈ నృసింహుడే పరబ్రహ్మ స్వరూపుడు. మన యెదుటనే ప్రత్యక్షమై యున్న ఈ మహానుభావుని చూచి తరించండి.

వీడే ప్రహ్లాదునికి అనేక వరములిచ్చిన దేవుడు. మీ భావనలో సుస్థిరంగా నిలిపి వీనిని తిలకించండి. తన ఎడమ తొడమీద ఆదిలక్ష్మిని కూర్చుండ బెట్టుకొనియున్న వీనిని సేవించండి. అదిగో వావిరి (చక్కగా) కనిపించుచున్న ఆ శంఖు చక్రాలను గమనించండి. ఉన్నతమైన సింహాసనంపై కూర్చునియున్న ఈ శ్రేష్ఠుని పరికించండి.

ఉద్యమించి, ఈ నరసింహ దేవునికి మొక్కండి ఈతని తేజో మయమైన దివ్యరూపాన్ని తెలిసికొనండి. ఈయనకి అనంత హస్తములు (లెక్కలేనన్ని చేతులు) వున్నవి. (హిరణ్యకశిపుడు తన రక్తం ఒక్కబొట్టు కూడా క్రింద పడని చావు కావాలని విచిత్రమైన వరాలను కోరాడు కాబట్టి అనంతమైన హస్తాలతో వచ్చిన రక్తాన్ని వచ్చినట్లే తుడిచి వేసి నోటితో పీల్చేశాడు. ఆ చేతులు మనబోటి సామాన్యులకు కనుపించవు.) అటువంటి అనంత విష్ణు రూపుని, కొలువైన ఈ స్వామిని సేవించండి.

ఆ విధంగా హిరణ్యాసురాంతకుని ఇప్పుడే శరణని వేడుకోండి. ఈ హరినామమును జపించండి. మన యెదుటనే అహోబల నృసింహుడుగానున్న ఈ దివ్యుడే ఏడు కొండల వేంకటేశ్వరుడు. ఆది దేవుడైన ఈ స్వామిని కొదలేక (కొఱతలేక అంటే ఏ మాత్రం తగ్గకుండా సేవించండి.

**4-6**

## మున్నుడి

గరుడవాహనంపై నెక్కి, ముత్యాల కుచ్చులు వూగిసలాడుచున్న రధంపై, మంగళవాయిద్యాల 'హోరు'లో దానవులు భయకంపితులయ్యేట్లు తిరువీథులగుండా తన దేవేరితో దేవదేవోత్తముడైన శ్రీవేంకటేశ్వరుని ఊరేగింపు సాగిపోతున్నది. అన్నమాచార్యులవారి కీర్తన అంత తేలిక కాదు. చదివితే మీకే అర్థమవుతుంది, ఏమీ అర్థం కావట్లేదని....

**సీ॥ దేవదేవోత్తముడౌ విష్ణు దేవుని**
**తేరు దేవతలెల్ల తీర్చి గొలుచు**
**తిరువీధులను బోవు తిరుతేరు జూడుడీ**
**తిరుపు గొన్నట్లాను తేరుకనుడు**
**ధిక్కరించు ధ్వనుల తిరుతేరు, దిక్కరి**
**కుంభాల దరగనీ గొప్పతేరు**
**తీరిచె గలకలు తిరుతేరు గాంచుడీ**
**గరుడవాహనుడేగు తేరుగనుడు**

**ఆ.వె॥ అన్నమయ్య పాటనవలీలగా మార్చి**
**సీసపద్య మొకటి చెప్పవచ్చు**
**వెనక జన్మఫలము వేంకటేశుని గొల్వ**
**ఇంతకన్న మంచి ఇరవుకలదె?**

**రాగం : బౌళి**

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువగా తిరుతేరు ॥దేవ॥

తిరువీథులేగీని తిరుతేరు
తిరుపు గొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజులను తిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు ॥దేవ॥





ధిక్కరించీ మోతల దిరుతేరు
ధిక్కరి కుంభా లదర దిరుతేరు
తిక్కు ముత్తేల కుచ్చుల తిరుతేరు
తెక్కుల బ్రతాపించీ తిరుతేరు ॥దేవ॥

తీరిచె గలకలెల్ల దిరుతేరు
దీర గరడవాహనపు దిరుతేరు
చేరి యలమేలు మంగతో శ్రీవేంకటేశ్వరుని
తీరున నెలకొన్నట్టి తిరుతేరు ॥దేవ॥

**భావామృతం :**

దేవదేవుడని పిలువబడెడి దేవతాశిఖామణులందరిలోన సర్వశ్రేష్టుడెవరో ఆయన దేవదేవోత్తముడు. ఆయనే శ్రీమన్నారాణుడైన శ్రీవేంకటేశ్వరుడు. అదిగో ఆ వస్తున్నదే ఆయన 'తిరుతేరు ' (శ్రీప్రదమైన రథము). దేవతలందరూ కొలుచుచుండగా సాగివస్తున్నదా 'తిరుతేరు'.

ఆ తిరుతేరు తిరుమలలోని తిరువీధుల గుండా సాగివచ్చుచున్నది. ఆ తిరుపు గొన్నట్లు ఆను' తేరు, (భగవంతుడు తిరుగుటకు నియమించబడినది). ఆ తేరు దానవులను తెరలించింది (తొలగించింది. అంటే, స్వామి ఆ రథంపై నుండే అనేక దానవులను నిర్మూలించాడని). నేడు తిరువీధులలో అన్ని దిక్కులలోనూ సాగుచున్నది స్వామి యొక్క తిరుతేరు, (దీన్ని చూస్తున్న మనదే భాగ్యం.)

ఈ తిరుతేరు సాగుచున్నప్పుడు తప్పెట్లు,బాకాలు, డోళ్ళు, మంగళ వాయిద్యములు చేయుచున్న ధ్వనుల యొక్క 'హోరు' ధిక్కరించుచున్నట్లు (యుద్ధములో తిరుగుబాటు చేయుచున్నట్లు) ఉన్నది. అది, స్వామి వెంట వచ్చుచున్న 'దిక్కరి కుంభాలు' (పెద్దపెద్ద కుండలు) అదురుచున్న తిరుతేరు (అదరిపడుచున్న తిరుతేరు). ఇది, తిక్కు ముత్తేల కుచ్చుల తిరుతేరు, (అంటే..... ఆకర్షణీయమైన ముత్యములు కుచ్చులుగా కట్టి, వ్రేలాడదీసిన తిరుతేరు). తెక్కుల (గర్వముగల) ప్రతాపము కనబరచుచున్న తిరుతేరు.

ఈ తిరుతేరు కలకలము తీరిచె (క్షోభను నివారించును). గరుత్మంతుడు వాహనముగా అలంకరించిన తిరుతేరు ఇది. శ్రీవేంకటేశ్వరుడు మరియు అలమేల్మంగ ఒకటిగా చేరి, శోభాయమానంగా (తేరుగా) నెలకొని ఊరేగుచున్న తిరుతేరు ఇదియే. చూచి మీ జన్మధన్యం చేసికొనండి.

4-7

## మున్నుడి

లలిత శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఆమెవద్దకు, వేంకటరమణుడు నడిరేయి అయినా రాలేదు. "వేచివేచి కనులు కాయలేకాచును, కరుణించి ఒకసారి కానదావో ప్రభు!" అని ఆమె పరితపిస్తోంది. సిగ వీడిపోయింది కన్నీటి పర్యంతమైన తల్లి అలమేల్మంగ ముత్యాల వంటి కన్నీరు కారుస్తున్నది. "పేటుగంధము" ఎండి పోయింది. మనస్సులోనే నీకు ఎన్నివిన్నపాలు చేస్తున్నదో చూశావా? నిన్ను ప్రేమించటమే ఆమె చేసిన నేరమా యేమిటయ్యా? ఎంత బండరాయి అయిందయ్యా! నీ గుండె....

**మ॥ వలపే నేరమ? విన్నపంబు వినవో మా వేంకటేశా! ప్రభో!**
**నెలతన్ ప్రేమము జూపి చేర్చుకొనవో నీ అక్కునన్ వేగమే**
**"బలిమిన్ గుండెల రాయి బెట్టితివయా! వాత్సల్యమే శూన్యమై"**
**పలికెన్ "మానుము'మేనపచ్చి' పనులన్," ప్రార్థించె అన్నయ్యయున్**

**రాగం : నిషాది**

నెలత మోహించినదే నేరమటయ్యా
పలు విన్నపాలకింక పనిలేదయ్యా ॥నెలత॥

చెక్కున జేర్చిన చేత సేమంతిరేకులు రాలె
చొక్కపు నీసతి దెస చూడవయ్యా
నిక్కి చూడ నంతలోనే నిలువున కొప్పువీడె
వెక్కసపు చలమేల విచ్చేయవయ్యా ॥నెలత॥

ముంచిన పూర్పుల వెంట ముత్యపు కన్నీరు జారె
నించుకంత తెమలవు యిదేమయ్యా
చంచలపు నడపుల సందడించె చెమటలు
అంచెల నీ మనసు రాయటవయ్యా ॥నెలత॥





పెట్టిన పయ్యదలోన బేటుగందములు రాలె
చిట్టకాల కింతి నింత సేసితివయ్యా
యిట్టె శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
అట్టె మేనపచ్చి సేతురటయ్యా ॥నెలత॥

**భావామృతం :**

ఆ నెలత (యువతి) నిన్ను ప్రేమించింది. అదే నేరమై పోయిందటయ్యా! ఆమె నీకు యెన్నో వేడికోళ్ళు(వినతులు) చేసింది. వాటితో నీకు పనియే లేదా? ప్రభూ? ఏమిటయ్యా! ఇది.

పోనీ మా అలమేల్మంగ పరిస్థితిని ఒక్కసారి చూచి మాట్లాడవయ్యా! నీకోసం తన చెక్కిళ్ళపై చేతులు పెట్టుకొని, ఇంకా రాడేమిటని పాపం యెంతసేపు నిరీక్షించినదో కాని, తన చెక్కిళ్ళపై అద్దుకొన్న చేమంతిరేకులు అన్నీ రాలిపోయాయి. చొక్కపు నీసతిని (నిర్దోషియైన నీ భార్య) ఒక్కసారిచూడవయ్యా! ఎన్నోసార్లు నిక్కినిక్కి నీ కోసంయెదురు చూచుటవలన ఆవిడ కొప్పుముడి విడిపోయి జుట్టు చిందరవందర అయిపోయింది. నీకు వెక్కసపు చలమేల? (అధికమైన మచ్చరము, పట్టుదలయెందుకయ్యా? ఒక్కసారి ఆమె వద్దకు రావయ్యా!

ఉవ్వెత్తుగా వస్తున్న నిట్టూర్పులతో పాటు, ముత్యాలవంటి కన్నీటి బొట్లు జలజలారాలుతున్నాయి. నీ ఆర్తత్రాయపరాయణత్వం ఎప్పుడూ ఉండేదే కదా! తెమలేపనులా నీవి? త్వరత్వరగా నడుస్తుంటే ఆమె ఆరాటానికి ఒళ్ళంతా చెమటలతో తడిసి ముద్దయిపోయింది. అంచెల (ఈ వరుస చూస్తుంటే), నీ మనస్సు వాత్సల్యం కోల్పోయి బండరాయి అయిపోయిందా అనిపిస్తున్నది. ఇంత కఠినత్వం ఎలా వచ్చిందయ్యా?

ఎదపై ఆమె రాసుకున్న 'పేటు గందము' యెండిపోయిన గంధము పొడివలె రాలిపోయింది. నీ చిలిపి శృంగారానికి ఇంత చేసితివా? ఇప్పుడు హఠాత్తుగా వచ్చి ఇట్టే ఆమెను కూడినావు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదేమయ్యా? అట్టె (హవ్వ!!!), ఇట్లా మేనపచ్చి సేతలు (దైహికమైన మొరటుపనులు) చేస్తారుటయ్యా? నీకు ఇది తగునా!! జగన్నాథా!

**4-8**

## మున్నుడి

అన్నమాచార్యులవారి వైరాగ్య కీర్తనను పరిశీలించండి. ఓ శ్రీహరీ! కాళ్ళరిగేట్లు సంతల చుట్టూ తిరిగి అలసిపోయాను గాని అనువైన 'సరకు' మాత్రం దొరకలేదు, అంటున్నారు. అంటే ... స్వామీ! అనేక జన్మలెత్తి అలసిపోయ్యానయ్యా! కాని విజ్ఞానం మాత్రం దొరకలేదు. స్త్రీవ్యామోహంతో అల్లాడిపోయాను కాని మోక్షమార్గంలో ఒక్కమెట్టు కూడా ఎక్కలేకపోయాను. ఓ శ్రీవేంకటేశ్వరా! 'కమ్మర నీ కృపచేత దనిసి, యే విధులను దట్టు వడనైతి'- అంటున్నారు. అంటే...చదవండి మరి...

**మత్తకోకిల: సంతలే తెగ జొచ్చితిన్ కన జాలనే సరుకున్ ప్రభూ!**
**ఇంతటన్ కరుణించవైతివి యేమిన్యాయము శ్రీహరీ!**
**కాంత చన్గవ కొండలెక్కితి కాని మోక్షపు మెట్టులన్**
**యెంతజేసియు యెక్కనైతిని యిట్లు అన్నయ కుందెరా.**

కుందెరా= దుఃఖించాడు

**రాగం : కాంబోది**

సంతలే చొచ్చితి గాని- సరుకు గాననైతి
యింతట శ్రీహరి నీవే- యిటు దయ జూడవే ॥సంతలే॥

కాంత చనుగొండలు-కడకు నెక్కితి గాని
యెంతైనా మోక్షపు మెట్టు- యెక్కలేనైతి
అంతట జవ్వనమనే-అడవి చొచ్చితిగాని
సంతత హరి భక్తనే -సంజీవి గాననైతి ॥సంతలే॥

తెగి సంసార జలధి -దిరుగులాడితి గాని
అగడై వైరాగ్య రత్న-మది దేనైతి
పొగరు జన్మాలరణ-భూములు చొచ్చితి గాని
పగటు గామాదుల - పగ సాధించనైతి ॥సంతలే॥





తనువనియెడి కల్ప-తరువు యెక్కితి గాని
కొన విజ్ఞానఫలము -గోయలేనైతి
ఘనుడ శ్రీవేంకటేశ-కమ్మర నీ కృపచేత
దనిసి యే విధులను - దట్టువడనైతి ॥సంతలే॥

**భావామృతం :**

శ్రీహరీ! నేను అనేక సంతలలో ప్రవేశించి తిరిగాను. కాని నాకు అవసరమైన సరకు మాత్రం సంపాదించ లేకపోయాను. (అనగా... విలువైన మానవ జన్మనైతే పొందాను కాని, దాన్ని తరింపచేసికొనుటకు కావలసిన 'పరతత్త్వ జ్ఞానమును మాత్రం సంపాదించలేకపోయాను). కావున ఈ నిరుపయోగ జన్మ తరింపజేసి నీవే నన్ను రక్షించాలి.

స్త్రీల స్తనములనెడి కొండల నాసాంతం అధిరోహించితిని. కాని మోక్షమును సాధించు మెట్లను మాత్రం ఎక్కలేకపోయాను. జీవితం నిరుపయోగమైపోయింది. ఆ తరువాత యౌవనము అనే అడవులలో పడి తిరిగాను. కాని నిరవధికమైన విష్ణుభక్తి అనే సంజీవని మూలిక (మరణం నుంచి తప్పించగలిగినది) మాత్రం పొందలేకపోయాను.

తెగి (తెగువతో) సంసారమను సంద్రములో దుమికి తిరుగాడాను. కాని వైరాగ్యమనే రత్నాన్ని మాత్రం ఆ సముద్రంలో యెక్కడా సంపాదించలేకపోయాను. మనస్సుని దిటవు చేసికోలేకపోయాను. అనేక జన్మలనే రణరంగాలలో గర్విష్ఠినై ఎన్నోమార్లు ప్రవేశించాను. కాని సగటు (ప్రకటింపబడిన) కామము మొదలైన వాటి పగ సాధించలేక పోయాను. వాటికి లొంగిపోయాను.

శరీరం అనే కల్పవృక్షమునైతే యెక్కగలిగాను కాని దాని చివరనున్న విజ్ఞానమనే పండును మాత్రం కోయలేకపోయాను. ఘనుడవైన శ్రీవేంకటేశ్వరా! కమ్మర (కమ్మర అంటే... మఱల) నీయందు భక్తితో కృతార్థుడనైతిని. ఇక నేను ఏ కర్మవలనను బాధ పడక ధన్యుడనయ్యాను.

## మున్నుడి 4-9

'ధ్వన్యలంకార ప్రక్రియను' ఈ అద్భుత కీర్తనలో అన్నమయ్య విస్తృతంగా వినియోగిస్తున్నారు. 'పుటుక్కున' ఆ కట్టె విరిగిందంటే విరిగినప్పుడు ఆ ధ్వని వచ్చిందని భావం. సహజత్వం కోసం కవులు ఈ అలంకారం భాషలో వాడుక చేస్తారు. అల్లరి కృష్ణయ్య రేపల్లెలో పాలు, వెన్న, పెరుగు, నెయ్యి దొంగిలించి తన మిత్ర బృందాన్ని మేపేవాడు. ఆతనికి అవి అందకుండా ఎత్తుగా కట్టిన వుట్లలో దాచుకొనేవారు గోపికలు. కృష్ణయ్య మీ పని ఇట్లా వుందా... అని ఆ వుట్లు పగులకొట్టే వాడు. పాలు, నేలపాలుచేసి పలు బాధలు పెట్టేవాడు. అదెట్లాగో తెలియాలంటే... 'చటుక్కున' ఇది చదవాల్సిందే... మరి.

**కం॥ తెంచెను 'వుట్ల'ను కృష్ణుడు**
**ముంచెను గోపికల నేడ్పు ముప్పెన లందున్**
**యెంచెను పదముల నన్నయ**
**అంచనలకు యిట్టి ధ్వనులు అందవు సుండీ!!!**

**రాగం : ముఖారి**

పలువురు వుట్ల పండుగను
చిలుకు చిడుక్కని చిందగను ॥పలుమరు॥

ఊళ్ళ వీధుల వుట్ల కృష్ణుడు
తాళ్ళు తెగిపడ తన్నగను
పెళ్ళు కరిల్లు పెరిల్లు చిరిల్లని
పెళ్ళుగ మ్రోసె పెనురవము ॥పలుమరు॥

బంగరు బిందెల పాలు పెరుగులు
ముంగిట నెగయుచు మోదగను
కంగు కళింగు కరింగు ఖణింగని
రంగుమీరు పెనురవములై ॥పలుమరు॥





నిగ్గుగ వేంకట నిలయు డుట్టి పా-
లగ్గలిక పగుల నడువగను
బగ్గు బగిల్లని పరమామృతములు
గుగ్గిలి పదనుగ కురియగను ॥పలుమరు॥

**భావామృతం :**

అనేకమార్లు గ్రామాలలో వుట్ల పండుగలు జరుగుతాయి. అప్పుడు వుట్లను ఆనాడు కృష్ణయ్య పగులకొట్టినట్లు, ఈనాడు పిల్లలు పగులకొడతారు. ఆ వుట్లలో వుంచిన పాలు పెరుగు చింది నేలపాలవుతాయి. ఎలా అవుతాయో తెలుసునా "చిలుకు చిలుక్క"ని చింది, నేలపాలవుతాయి.

ఆనాడు రేపల్లెలో కృష్ణయ్య చేసినట్లే నేడు అనేక గ్రామాలలో వీధులలో కృష్ణుడు (చిన్నారి కృష్ణయ్య వేషం ధరించిన పిల్లవాడు) తాళ్ళు తెగిపడునట్లు తంతాడు. అప్పుడు "పెళ్ళు, కరిల్లు, పెరిల్లు, చిరిల్లు" మని ఒక్కసారిగా పెద్ద ధ్వనులతో మ్రోతలు వెలువడుతాయి.

ద్వాపరయుగంలో ఆనాటి స్థితిగతులను బట్టి ధనికులైన గోపికలు బంగారు బిందెలలో పాలు పెరుగు వుట్లలో దాచుకొనేవారు. కృష్ణయ్య వూరక నుంటాడా? వాళ్ళ యెదుటనే ఎగిరి, ఆ బిందెల్లి క్రిందపడేట్లు కొట్టేవాడు. అప్పుడు "కంగు, కళింగు, కరింగు, ఖణింగు – అనే పెద్ద పెద్ద చప్పుళ్ళతో ఆ బిందెలు నేలపై బడి ఆ ప్రదేశం రమణీయంగా వుండేది.

మరి ఈనాడు, నిగ్గున (కాంతులు వెదజల్లుతూ) వేంకటగిరీశుడైన శ్రీవేంకటేశ్వరుడు మనం పాపాలు అనేవుట్లలో దాచుకొన్న దుష్కర్మలను పాలు, పెరుగు, నేతులను "అగ్గలిక పగుల నడుపగ" (మిక్కిలి వేగంగా పగులకొడితే) ఈనాడు కూడా 'భగ్గు, భగిల్లు' అనే ధ్వనులతో గుగ్గిలి పదనుగ (గుగ్గిళ్ళవానవలె) పరమామృతములు (పుణ్యకర్మలనే అమృతముల) వాన వ్యాపించినది.

## 4-10

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఆ ఏడుకొండలవాడినే సూటిగా ప్రశ్నిస్తున్నారు. చీకట్లో దిక్కు తెలియక అవస్థలు పడుతున్న వాడికి దీపం చూపించాలి కాని గొప్ప వెలుగులో వున్న వాడికెందుకయ్యా? వరదలో కొట్టుకుపోయేవాడిని ఆ ముంపునుంచి రక్షించాలి కాని, ఒడ్డున హాయిగానున్న వాడిని కాపాడే పనేముంది? మేము కర్మబంధాలలో చిక్కుకుపోయి కట్లు తెంచుకోలేక తిప్పలు పడుతున్నాం. ధైర్యము పోయింది తెలిసీ తెలియక అనేక పాపాలు చేస్తున్నాం మమ్మల్ని నీవే కాపాడాలి. లేకపోతే నీవెందుకయ్యా? అనాధరక్షకా...

**చం॥ తెలియక చీకటిన్, తెరల, దీపము కావలె వానికండయై**
**వెలుగును జూప నన్యులకు వెల్గది యేలనొ వెల్గునున్నచో!!**
**తొలగని కర్మబంధముల దుఃఖితు బ్రోవుము వేంకటేశ్వరా!**
**అలయని ముక్తునేమిటికి ఆదుకొనన్ యనె నన్నమార్యుడున్**

**రాగం : నీలాంబరి**

తెలియ చీకటికి దీపమెత్తక పెద్ద-
వెలుగు లోపలికి వెలుగేల ॥తెలియ॥

అరయ నాపన్నునికి అభయమీ్మవలెగాని
ఇరవైన సుఖిని కావనేల
వరత(ద) పోయెడివాని వడితీయవలెగాని
దరివాని తివియంగ తానేల ॥తెలియ॥

ఘన కర్మారంభుని కట్టు విడవలె గాక
ఎనసిన ముక్తుని గావనేల
అనయము దుర్బలునికి అన్నమిడవలెగాక
తనిసిన వానికి తానేల ॥తెలియ॥





మితిలేని పాప కర్మికి తా వలెగాక
హితవెఉగుపుణ్యునికి (తా) నేలా
ధృతిహీను కృపచూచి తిరువేంకటేశ్వరుడు
తతి కావకుండిన తానేల ॥తెలియ॥

**భావామృతం :**

ఏమీ కనుపించక చీకటిలో కొట్టుమిట్టాడుతుంటే వాడికి దీపం చూపించి వెలుగు నందించాలి. అంతే కాని గొప్ప వెలుగులో వున్నవాడికి దీపం యెందుకు? అనవసరం కదా!

ఆపదలో నున్నవానికి అభయమిచ్చి ఆదుకోవాలి. కాని సుఖంగా బ్రతుకుతున్న వాడికి అభయమెందుకు? గొప్పవేగంగల వరదలో కొట్టుకొనిపోతున్నవాడిని ఆ వరద ప్రవాహం నుంచి ఏదో వుపాయంతో రక్షించాలి కాని, ఒడ్డునే హాయిగా వున్నవాడిని రక్షించే పనేమున్నది? ఏమాత్రం లేదు.

గొప్ప కర్మబంధాలలో కట్టువడిపోయి ఆకట్లు తెంచుకోలేక ఇక్కట్లు పడుతున్నవాడికి నీ సహాయం కావాలి కాని, ముక్తుడై యోగివలెనున్నవానికి ఇంకా నీ సహాయంతో పనేమిటి? అనయము (ఎల్లవేళలా) బలహీనుడై అన్నమో రామచంద్రా! అని ఆరాటపడే వాడికి కడుపునిండా అన్నంపెట్టాలి కాని, తనిసిన వానికి (తృప్తిగానున్న వానికి) తానెందుకు (స్వామి సహాయం ఎందుకు?)

అంతులేని పాపాలు చేసి, తెలిసీ తెలియక అనునిత్యం పాపాలలోనే బ్రతుకుతూ, రాబోయే జన్మలకు సరిపడా పాపాలు మూటగట్టుకొంటున్న నాకు, తను (శ్రీవేంకటేశ్వరుడు) కావాలి. కానీ మంచిదారిలో వున్న పుణ్యాత్మునికి, తానెందుకు? కాబట్టి తిరువేంకటేశ్వరుడు ధృతిహీను (ధైర్యం కోల్పోయిన) మాబోటి వారిని, తతి (సరియైన సమయంలో) కావకుండిన (రక్షించకపోతే) తానేలా (ఇంకా ఆయనెందుకు?) (అన్నమయ్య ఎంత ఆవేదనతో ఈ కీర్తన నాలపించారో అర్థమవుతున్నది, అవునా?

## 4-11

## మున్నుడి

కలశాపురంలో వెలసిన హనుమంతునిపై అన్నమాచార్యులవారు అనేక అద్భుత కీర్తనలు చెప్పారు. ఇదీ అటువంటి వాటిలో యొకటి. సముద్రాన్ని లంఘించి జానకీదేవికి శ్రీరామ ముద్రికనిచ్చి, ఆమె తన గుర్తుగా నిచ్చిన శిరోమణిని తిరిగి తెచ్చి రామునికిచ్చిన 'అంకెకాడు'. కొంకక సంజీవని తెచ్చి, తెంకినే వేంకటేశ్వరుని మెప్పించినాడట అంకె కలశాపురి హనుమంతుడు. ఇట్లాంటి వేంకటరామయ్య గారి దూతను సేవించి ఆయన తరించటమే కాక నాబోటివాణ్ణి తరింపచేశారు. ఏనాటి పుణ్యమో.

**ఉ॥ అందరికెక్కుడైన కపి అంజనసూనుని మెచ్చు కీర్తనల్**
**పొందుగ అన్నమయ్య తను పూనిక జెప్పెను మిక్కుటంబుగా**
**అందుకొనెన్ ఫలంబనుచు ఆ రవి బింబము బాల్యచేష్టగా**
**అందుకు వేంకటేశ్వరుని అండను జేకొనె నంచు దెల్పెరా**

**రాగం : కానడ**

అందరికి నెక్కుడైన హనుమంతుడు
అందుకొనె సూర్యఫలమని హనుమంతుడు ॥అందరికి॥

బల్లిదుడై లంకచొచ్చి బలురాకాసుల గొట్టి
హల్లకల్లోలము జేసె హనుమంతుడు
వొల్లనె రాముల ముద్దుటుంగరము సీత కిచ్చె
అల్లదె నిలుచున్నాడు హనుమంతుడు ॥అందరికి॥

దాకొని యాకె ముందర తన గురుతెరుగించి
ఆకారమటు చూపె హనుమంతుడు
చేకొని శిరోమణి చేతబట్టి జలనిధి
ఆకసాన దాటివచ్చె హనుమంతుడు ॥అందరికి॥





కొంకకిట్టె సంజీవి కొండ దెచ్చి రిపులకు
నంకకాడై నిలిచెను హనుమంతుడు
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాడు
అంకె కలశాపురపు హనుమంతుడు ॥అందరికి॥

**భావామృతం :**

అందరికంటె అధికుడైన ఈ హనుమంతుని, చూడండి. బాల్యచేష్టగా ఈయన సూర్యబింబాన్నే 'పండు' అని భ్రమించి పట్టుకొన్నాడు. ఈయన ప్రతాపం వివరిస్తాను వినండి.

ఈ హనుమంతుడు బల్లిదుడై (గొప్ప బలశాలియై) అనేకమంది రాక్షసులను సంహరించి లంకను అల్లకల్లోలముజేసినాడు. ఒల్లనే (ఒప్పుగా) శ్రీరాముని ముద్రికయైన వుంగరమును సీతాదేవి కందించి అల్లదిగో అక్కడ నిలుచున్నాడు. ఆ మహానుభావుని చూడండి.

ఆకె ముందర (ఆమె యెదుట) దాకొని (చేరుకొని) తన వివరముల నెరింగించి, నూరు యోజనముల ఎత్తుకు పెరిగిన తన విశ్వరూపం చూపించి తన శక్తి సామర్థ్యములను తెలుపకనే తెలిపిన హనుమంతుడు ఈయనే. ఆమె ఇచ్చిన శిరోమణిని తీసికొని ఆకాశమార్గాన సముద్రమును దాటివచ్చి శ్రీరామకార్యం జయప్రదంగా నెరవేర్చిన అగ్రగణ్యుడీ హనుమంతుడు.

ఈ హనుమంతుడు యేమాత్రము, కొంకక (వెనుదీయక) సంజీవిని పర్వతమును ఇట్టె తెచ్చి, సౌమిత్రిని రక్షించి శత్రువుల అంకెకాడై (వశపరచుకొని, లొంగదీసినవాడై) నిలిచాడు. తెంకినే (తన సామర్థ్యంతో) ఈయన శ్రీ వేంకటాద్రి మీది దేవుడైన శ్రీవేంకటేశ్వరుని మెప్పించినాడు. అంకె (అందుచేత) ఈ కలశాపురి హనుమంతుడు జగజ్జెట్టి.

## 4-12

## మున్నుడి

పెద తిరుమలయ్యరచనయైన ఈ కీర్తనలోఆద్యంతం 'వ' కారం (వ-అనే అక్షరం 'విరివిగా వాడ బడింది'). తండ్రి అన్నమయ్య వలె ఈయన కూడా ప్రతి కీర్తనలోను 'వేంకట' మకుటం వాడటమే కాక ఏదో ఒక 'నూతనత్వం' కళ్ళకు కట్టేట్లు చూపిస్తాడు. శ్రీ కృష్ణుని విష్ణువుగా గుర్తించిన గోపిక "ఓ విష్ణుమూర్తీ ఏదో బత్తెం (రోజు కూలీ) తీసికొనెవాడిలాగ కృత్రిమమైన ప్రేమ చూపించకు, మా వెట్ట (తాపము లేక ఆర్తి) తీరునట్లు మాట్లాడు, "అంటున్నారు. వెల లేని అంటే విలువలేని అని కాదు విలువ చెప్పలేని అని అర్థం.

**తే॥ వెట్టి వలపును చల్లకు విష్ణుమూర్తి!**
**వెట్ట దీర మాటాడుము వినతి జేసె**
**పెద్ద తిరుమలాచార్యుల మేటి రచన**
**వినుచు ముటిసెనేమో కదా! విష్ణుమూర్తి.**

### రాగం: శ్రీ రాగం

వెట్టివలపు చల్లకు విష్ణుమూరితి నాతో
వెట్ట దీర మాటాడు విష్ణుమూరితి ॥వెట్ట॥

వినయము సేసేవు విష్ణుమూరితి నీవు
వెనకటి వాడవెగా విష్ణుమూరితి
వినవయ్యామా మాటలు విష్ణుమూరితి మమ్ము
వెనుకొని పట్టకుమీ విష్ణుమూరితి ॥వెట్టి॥

వెరవుగల వాడవు విష్ణుమూరితి నేడు
వెరగైతి నిన్ను జూచి విష్ణుమూరితి
విరివాయె నీమాయాలు విష్ణుమూరితి నాకు
విరులిచ్చే వప్పటికి విష్ణుమూరితి ॥వెట్టి॥





వెలసె నీ సేతలెల్ల విష్ణుమూరితి మా
వెలుపల లోన నీవె విష్ణుమూరితి
వెలలేని శ్రీవేంకట విష్ణుమూరితి కూడి
విలసిల్లితివి నాతో విష్ణుమూర్తి ॥వెట్టి॥

### భావామృతం:

(స్వయంగా శ్రీమహావిష్ణువు, శ్రీ కృష్ణమూర్తిగా అవతరించాడనీ, ప్రేమ, వలపు , విరహతాపం వంటి పైత్యగుణాలు స్వామికుండవని గుర్తించిన జ్ఞానియైన ఒక గోపిక శ్రీకృష్ణునితో పాటరూపంలో చెప్పినట్లు ఊహిస్తున్నారు పెదతిరుమలయ్య). ఓ విష్ణుమూర్తీ! వెట్టివలపు (బత్తెము తీసుకొనేవాడు చేసే పని వలె కృత్రిమమైన ప్రేమ) చూపించకయ్యా! నీవు నాతో నా వెట్ట (తాపము) తీరునట్లు మాట్లాడు. నాకదే చాలును.

ఓ విష్ణుమూర్తీ! ఇంత వినయము చూపిస్తున్నావు. కానీ నీవు వెనకటి వాడివే, (ఆ నాడు మేం స్నానం చేస్తుంటే మా చీరెలెత్తికెళ్ళిపోయావు) కదా! కొంచెం మా మాటలుకూడా వినవయ్యా! అట్లా మమ్మల్ని వెనుకొని (వెనకనుంచి) పట్టుకోవద్దు. ఎందుకంటె అలా ఆయన పట్లుకుంటే లొంగిపోని గోపిక ఎవతెవుంటుంది?

ఓ విష్ణుమూర్తీ! నీవు వెరవుగలవాడవు (ఉపాయం తెలిసినవాడవు, నన్ను మాయ చేయగలవు). అందుచేత నిన్ను జూచి వెరగైతిని (భయపడుచుంటిని). ఇంత ప్రేమగా నాకు 'విరులిచ్చేవు అప్పటికి' (పూలు వున్నట్లుండి అందిస్తున్నావు.) అబ్బో!! నీ మాయలు విరివాయె (చాల ఎక్కువవుతున్నాయి). విష్ణుమూర్తీ! నీవు లీలామానుషరూపుడవని నాకు తెలుసు.

స్వామీ! నీ సేతలెల్ల వెలసె. (నీ లీలలు అన్నీ ప్రకటితమైనవి). నీవు వెలుపల ఇలా శ్రీకృష్ణునిగా వున్నా, మా లోపల కూడా అంతర్యామిగా నీవే వున్నావు. ఓ శ్రీవేంకట విష్ణుమూర్తీ. నీవు వెలలేని వాడవు. (వెలయెంతో చెప్పనసాధ్యమైన వాడవు). అంతటి మహానుభావుడవైనప్పటికీ నేడు నీవు నాతో విలసిల్లితివి. అదంతా నా అదృష్టం ప్రభూ!

4-13

## మున్నుడి

అద్భుతమైన పెండ్లి పాటను ఆవిష్కరిస్తున్న అన్నమాచార్యులవారిని వినండి. అప్సరసలను తాంబులం స్వీకరించి నృత్యగానాలతో శ్రీవేంకటేశ్వరుని కళ్యాణం కనువిందు చేయమంటున్నారు. గంధాక్షతలు స్వీకరించి గరుడధ్వజమెగురుట జూచి, దేవదుందుభుల మ్రోతలు విని, అంకురార్పణ మహోత్సవము తిలకించి ధన్యులవ మంటున్నారు. ముడుపులు చెల్లించుకోమంటున్నారు. ఇంతకీ మనబోటి అల్పులు కూడా ఆయనకి చదివించగలిగినదేమిటి? చదవండి....మరి

**ఆ.వె॥ ఆడిపాడు డిపుడు అప్సర గణములు**
**విభవమాయె నేడు వీడెమిదియె**
**పెండ్లిపాటజెప్పె వివరించి అన్నయ్య**
**తరలిరండు చూడ తనివిదీర.**

**రాగం : రామక్రియ**

ఆడరో పాడరో అప్సరోగణము
వీడెము లిందరో విభవము నేడు ॥ఆడరో॥

కమలారమణుని కళ్యాణమునకు
తమినదె గమడధ్వజమొసగె
తెమలుచు మ్రోసెను దివ్యదుందుభులు
గమనించరో దివిగలదేవతలు ॥ఆడరో॥

వెలయగ లక్ష్మీవిభుని పెండ్లికిని
బలసి అంకురార్పణ మదివో
కలగొన నిచ్చేరు గంధాక్షతలవె
చెలగి గైకొనరో శ్రీవైష్ణవులు ॥ఆడరో॥





బడి శ్రీవేంకటపతికి శ్రీసతికి
అదరిన తలబాలందెనదె
నడచీ పరుషలు నానాముఖముల
ముడుపులు చదువరో ముయిగానరులు ॥ఆడరో॥

**భావామృతం :**

ఓ అప్సరసలు మొదలైన గణములారా! నేడు శ్రీవేంకటేశ్వరుని కళ్యాణము జరుగుచున్నది. మీరంతా ఆడండి, పాడండి. ఇదే మీకు ఆహ్వాన తాంబూలం ఇస్తున్నాము. నేడు స్వామి కళ్యాణ వైభవము. మీరంతా ఆహ్వానితులే.

నేడు రమారమణుని కళ్యాణము. అందుకే అత్యుత్సాహముగా గరుడధ్వజము విజృంభించి ఎగురుచున్నది. దేవదుందుభులు చలించి పోవునట్లు మ్రోగుచున్నవి. స్వర్గముననున్న దేవతలారా! సమయమయిందని గమనించండి.

ఈ లక్ష్మీకాంతుని పరిణయ మహోత్సవము బలమైన అంకురార్పణము జరుగుచున్నది. అదిగో కనులారా గాంచుడు. గుంపుగా అందరికీ గంధాక్షతలనిచ్చుచున్నారు. ఓ శ్రీవైష్ణవులారా! అతిశయముగా మీరు వాటిని స్వీకరించండి.

సర్వసమర్థుడైన శ్రీవేంకటేశ్వరునికి మరియు శ్రీదేవికీ తలంబ్రాల సందడి జరుగుచున్నది నడచీ పురుషలు (నడచివచ్చుచున్న బాటసారుల సమూహములు) అనేక విధములైన కానుకలు, ముడుపులు చదివించుచున్నారు కొందరు ముయిగా (తామిచ్చుచున్న దేదో కానరాని విధముగా...అంటే ...ఆత్మార్పణము గావించుచున్నారు), నరులు సేవించుచున్నారు.

## 4-14

## మున్నుడి

నేటి కర్నూలు జిల్లా కోవెలకుంట్ల - అన్నమయ్యకాలంలో సుప్రసిద్ధమైన కోయిలకుంట్ల. ఇక్కడ రుక్మిణీ సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుడు పాండురంగ విఠలునిగా అవతరించాడు. అక్కడ వుండి విశిష్టాద్వైత మతాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన అన్నమాచార్యులవారు ఈ అద్భుతమైన కీర్తనతో ఆ విఠలుడే తన శ్రీవేంకటేశ్వరుడనే భావనతో ఈ కీర్తన చెప్పారు. వేదుకకాడని ఆ స్వామిని కీర్తించారు. ఆయన లీలలన్నీ మన కళ్లముందుకు తెచ్చి మధుర శృంగార భక్తికి అద్దం పదుతున్నారు.

**ఉ॥ "చూడగ పిన్నవాడు మరి జూటు దనంబులు యెక్కుడైన వా-**
**డేడను చూచినా కలదు ఈ విఠలున్ కొనియాడరో, యిదే"**
**వాడిగ అన్నమయ్య హరి భామల వేడుకకాడనెన్ భళా!!**
**కూడిన వేంకటేశ్వరుని కొల్చెను "రంగని" రూపుతాననెన్.**

**రాగం : ఆనంద భైరవి**

చూడ పిన్నవాడు గాని జూటుదనాల నెక్కుదు
యేడ చూచినా తాను యీ విట్ఠలుండే ॥చూడ॥

గోవులలో విహరించే గోవిందుదు పెక్కు
వాపుల గోపికలకు వల్లభుదు
చేవమీరి ముద్దుల శ్రీకృష్ణుదు
యేవల్ల జూచినాను యీ విట్ఠలుడే ॥చూడ॥

రాసక్రీడలలోని రాజీవాక్షుదు
ఆస పదారువేల పెండ్లాడినవాడు
బాసతో రుక్మిణీ సత్యభామా సమేతుదు
యీ సుద్దుల వెలసీనీ విట్ఠలుడే ॥చూడ॥





వింత మధురాంగనల వేడుక కాడు
చెంత కొలని సతుల సిగ్గులవాడు
కాంత లక్ష్మీపతి శ్రీవేంకటేశ్వరుడు
యింతటా వినోదించీనీ విట్ఠలుడే ॥చూడ॥

**భావామృతం**

ఈ చిన్నారి విఠలుని చూశారా. చూడటానికి చిన్న పిల్లవానివలెనున్నాడు కాని ఇతడు చాలా జిత్తులమారి. మరి ఈయన సర్వాంతర్యామియైన శ్రీమన్నారాయణుడే కాబట్టి 'యేడ చూచినా తానే'. ఎందెందు వెదకి జూచిన అందందే కలదు.

భక్తి, శరణాగతులతో వెతకండి. గోవులమందలలో గోవిందుడై విహరిస్తుంటాడు. ఉత్కృష్టమైన గోపికలకు (నిజానికి వారంతా దేవతా స్త్రీలే, కదా!) వల్లభుడు, (మనస్ఫూర్తిగా వరించిన మగడు). (కాళియ మర్దన జేసిన) ఈ ముద్దుల కృష్ణయ్య చేవమీరి (మిక్కిలి ధైర్యశాలియై) యున్నాడు. ఏవిధంగా చూచిన ఈయనే విఠల దేవుడు.

ఈయన గోపాంగనలతో రాసక్రీడయందు పరవశించిన రాజీవాక్షుడు (పద్మనేత్రుడైన శ్రీహరి). నరకాసురుని చెఱలో మగ్గుతున్న పదియారువేలమంది రాచకన్నెలను రక్షించి వారి ఆస (కోరిక) తీర్చుటకు పెండ్లాడిన పురుషోత్తముడు. విఠలదేవునిగా వెలసినప్పుడు రుక్మిణీ సత్యభామ (శ్రీదేవి, భూదేవి అవతారములే కావున) ఇద్దరినీ కూడియుంటానని, అట్లే వెలసి అనేక సుద్దులకు (కథలకు) కథానాయకుడైనాడు.

కుబ్జవంటి వింతరూపంగల మధురానగర వనితలకు ఈ స్వామి గొప్ప వేడుక కాడు (ప్రియుడు). ఇదిగో ఇక్కడ ఈ కొలనులో గోప స్త్రీల సిగ్గులు దోచిన చిలిపివాడు. ఈయనే లక్ష్మీసతీ వల్లభుడు. కలియుగ వైకుంఠమైన తిరుమల నాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు. ఈయనే కోవిలకుంట్లలో విహరించుచున్న విఠలదేవుడు. ఈ స్వామిని సేవించి తరించండి.

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అనేక అద్భుత కీర్తనలలో ఇది బహుజనరంజకమైనది. సంస్కృత కీర్తనలో ప్రహ్లాదవరదుడైన వీరనరసింహునికి జయము పలుకుతున్నారు. సంస్కృతంలో తాళ్ళపాక కవులు చెప్పిన సన్నుతి కీర్తనలు ఆలపించటానికి అతి శ్రావ్యంగా వుంటాయి. అర్థం వివరించమని అడిగితే ఇబ్బంది కలిగే మాట వాస్తవమని నేను స్వానుభవంతో నేర్చిన సత్యం. అందుకే... ఈ భావయామి వేంకటేశమ్‌లో ఆ లోటు సరిచేసికొనే ప్రయత్నం చేస్తున్నాను. అంతా స్వామి దయ.

**ఆ.వె॥జయ జయ నరసింహ సర్వేశ! ప్రహ్లాద**
**వరద! వీర! నీవు భయహరుడవు**
**అన్నమయ్య పలికె నద్భుత గీర్వాణ**
**కీర్తనంబు యెంచి గిరి నిలయుని**

**రాగం : మోహన**

జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాదవరద ॥జయ జయ॥

మిహిర శశినయన మృగనరవేష
బహిరంగ స్థల పరిపూర్ణ
అహినాయక సింహాసన రాజిత
బహుళ గుణగణ ప్రహ్లాద నరసింహ ॥జయ జయ॥

చటుల పరాక్రమ సమఘన విరహిత
నిటలనేత్ర మౌని ప్రణుత
కుటిల దైత్యతతి కుక్షి విదారణ
పటు వజ్రనఖ ప్రహ్లాదవరద ॥జయ జయ॥





శ్రీవనితా సంశ్రిత వామాంక
భావజ కోటి ప్రతిమాన
శ్రీవేంకటగిరి శిఖర నివాస
పావనచరిత ప్రహ్లాదవరద ॥జయ జయ॥

## భావామృతం

సర్వేశ్వరుడవైన ఓ నరసింహా! ఓ ప్రహ్లాదవరదా! నీకు సర్వదా జయమగుగాక! వీరాగ్రేసరుడవు భయ నిర్మూలకుడవుయైన నీకు అన్నివేళలా జయమగుగాక!

ఓ ప్రహ్లాద వరదా! నీవు మిహిర (సూర్యుడు) శశి (చంద్రుడు) నయనుడవు. (కన్నులుగా కలవాడవు). బహిరంగ స్థలమైన గిరి శిఖరములలో పరిపూర్ణుడవై వెలసినవాడవు. అహి నాయక సింహాసనుడవు. (పన్నగ నాయకుడైన ఆదిశేషుని సింహాసనము వలె అలంకరించినవాడవు. రౌద్ర, వీర, శాంత, శృంగారములవంటి అనేక గుణగణములచే విరాజిల్లువాడవు. అటువంటి ఓ నరసింహా! నీకు సర్వదా జయమగు గాక!

ఓ ప్రహ్లాదవరదా! నీవు చటుల పరాక్రముడవు (శత్రువులు భీతిచే చలించిపోవునట్లు చేయగల పరాక్రమశాలివి). సమఘన విరహితుడవు. (గొప్పదనములో సాటియైన వారు లేనివాడవు). నిటల నేత్రుడవు (మూడవ కన్ను ఫాలభాగమున కలవాడవు). మునులచే సన్నుతించబడువాడవు. దుర్మార్గులైన రాక్షస సమూహముల కుక్షి విదారణుడవు (కడుపులు చీల్చి సంహరించిన వాడవు). బలమైన వజ్రములవంటి నఖములు (గోళ్ళు) కలవాడవు. అట్టి నీకు జయమగుగాక.

ఓ ప్రహ్లాదవరదా! నీవు శ్రీలక్ష్మిని నీ వామాంకము (ఎడమ తొడపై) కూర్చొనబెట్టుకొనిన వాడవు కోటి మన్మధులకు ప్రతిమానుడవు (సమానమైన రూపసివి). శ్రీవేంకటగిరి నివాసుడవైన శ్రీవేంకటేశ్వరుని అవతారుడవు. పరమ పావనమైన చరిత్ర కలవాడవు. అట్టినీకు సర్వదా జయమగు గాక!

**4-16**

## మున్నుడి

నేటి కడప జిల్లా వావిలిపాడులో వెలసియున్న వీర విజయ రఘురామునిపై ఆనాడు అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. పోడిమి కొలువై వున్నాడట. తాను కూడా ఒక భక్తురాలై తనతోటి మరొక భక్తురాలికి శ్రీరామచంద్రుని గుణగణాలను వర్ణిస్తూ, ఈయనకు మొక్కవే చెలియా! నీడెస చూపులు నించీనే... ఓవరికొలువున వున్నాడే చెలియా! అని పాడుతున్నారు. పోడిమి కొలువై వున్నాడట. అంటే యేమిటో వివరంగా తెలియటం లేదు కదా! శ్రీ వేంకటగిరి సీతాపతిగారి గురించి చదవండి... మరి...

**తే॥ అల విజయరాఘవుడు వీని నరయుడిచట**
**పోడిమి కొలువై తను చెలీ! పొరలినాడు**
**వేంకటగిరి సీతాపతి వీడె సుమ్మీ!!!**
**అనెను వావిలిపాటిలో అన్నమయ్య.**

**రాగం : బృందావని**

వీడెవో అల విజయరాఘవుడు
పోడిమి కొలువున పొదలీ చెలియా ॥వీడెవో॥

రాముడు లోకాభిరాముడు గుణ-
ధాముడ సురులకు దమనుడు
తామర కన్నుల దశరథ తనయుడు
మోమున నవ్వీ మొక్కవె చెలియా ॥వీడెవో॥

కోదండధరుడు గురుకిరీట పతి
పోదిగ సురముని పూజితుడు
ఆదిమ పురుషుడు అంబుదవర్ణుడు
నీడెస చూపులు నించీ చెలియా ॥వీడెవో॥





రావణాంతకుడు రాజశేఖరుడు
శ్రీవేంకటగిరి సీతాపతి
వావిలిపాటిలో వరమూర్తి తానై
వోవరి గొలువున నున్నాడే చెలియా ॥వీడెవో॥

## భావామృతం

ఓ చెలియా! ఆనాటి విజయ రాఘవుడు వీడేనే. వీడు, పోడిమి (ఒప్పుగా) కొలువై పొదలీనే (వున్నాడే).

ఈ రాముడు లోకాభిరాముడు. (లోకములన్నింటిలోను మనోజ్ఞమూర్తి). సకల సద్గుణములకు నిలయుడు. ఇతడు (ధాముడసురులకు=ధాముడు+అసురుకు) దమనుడు (దహించువాడు). పద్మదళ నేత్రుడైన వీడు దశరథ తనయుడు. ఓ చెలియా! నవ్వీమోమున వున్న వీనికి మొక్కవే... నీ జన్మధన్యమవుతుంది.

ఈ కోదండరాముడు కోదండ మను ధనువును ధరించి, గొప్ప కిరీటముచే అలంకరింపబడి యున్నాడు. ఈ కోవెల పోదిగ (స్థానమై) సురులచేత మునులచేత పూజింపబడుచున్నాడు. ఈయనే ఆది పురుషుడైన శ్రీమన్నారాయణుడు. ఈయన అంబుజ వర్ణుడు (నీటితో నిండియున్న నల్లని మేఘము యొక్క రంగుతో శోభిల్లువాడు). ఓ చెలియా! నీడెస చూపులు నించీ (నీవైపు చూచుచున్నాడు). ఈ రామచంద్రునికి నమస్కరించుము.

రావణాసురుని అంతమొందించిన ఈయన రాజశేఖరుడు (చక్రవర్తి). ఈయన శ్రీవేంకటగిరి సీతాపతి. (శ్రీవేంకటాద్రిపై వెలసిన వేంకటరామయ్య అని పిలువదగిన శ్రీవేంకటేశ్వరుడు. ఆ స్వామియే తానై ఈ వావిలిపాటిలో వరములిచ్చేమూర్తిగా, వోవరి గొలువున వున్నాడు (అంతర్యామిగా మన అంతరంగాలలో కొలువై సుస్థిరంగా ఉన్నాడు. ఓ చెలియా! ఈ అంతర్యామిని సేవించి తరించుము.

**4-17**

## మున్నుడి

తన తాతగారు అన్నమాచార్యులవలె చిన తిరుమలయ్య శ్రీవేంకటేశ్వరునిపై అనేక అద్భుత కీర్తనలు చెప్పి స్వామి కృపావారాహిలో వోలలాడారు. నెట్టన శ్రీహరిని జేరుటెట్లో నేర్వవలెను గాని వట్టి విచారము వగపు యెందుకు వ్యర్థము కదా! కాలము, కర్మము కలిసి రావాలనీ, పాపము, పగ పనికిరావని; కులము, గుణము ఔన్నత్యం తెస్తాయని అంటారు కానీ, ధ్రువుడు, అజామీళుడు, ప్రహ్లాదుడు, ఘంటాకర్ణుడు, వాల్మీకి, అహల్యవంటి వారి గురించి పెద్దలు చెప్పిన కథలు శ్రీహరిని తెలుసుకుంటే చాలని చెపుతున్నాయి కదా!

**కం॥ వట్టి విచారము వగపులు**
**పట్టవు, చిన తిరుమలయ్య పలికెను వినుడీ**
**నెట్టన శ్రీహరి జేరగ**
**గట్టిగ నేర్వంగ వలయు, ఘనులగుదు రనెన్.**

**రాగం : ఝుంఝూటి**

వట్టి విచారములేల వగపులేల
నెట్టన శ్రీహరిజేర నేరవలె గాక ॥వట్టి॥

కాలమేమి సేసీని కర్మమేమి సేసీని
యేలిన శ్రీరమణుడె యెదనుండగా
ఆలించిన ధ్రువునుని అజామిళునిని
కాలమేమి సేసెనయ్య కర్మమేమి సేసెను ॥వట్టి॥

పాపమేమి సేసీనీ పగయేమి సేసీని
కాపాడే దేవుడే దగ్గరనుండగా
యేపున ఘంటాకర్ణుని యెలమి ప్రహ్లాదుని
పాపమేమి సేసెనయ్యా పగయేమి సేసెను ॥వట్టి॥





కులమేమి సేసీని గుణమేమి సేసీని
నలువైన శ్రీవేంకటనాథుడుండగా
అలమి వాల్మీకికి అలనాడహల్యకు
కులమేమి సేసెనయ్యా గుణమేమి సేసెను ॥వట్టి॥

**భావామృతం :**

ఓ మానవులారా! వూరకనే మన సమయం వ్యర్థం చేసికొంటున్నాము. వట్టి (వ్యర్థమైన) విచారము (ఆలోచనలు), వగపులు (శోకములు) యేల? నెట్టన (తప్పకుండా) శ్రీహరిని జేరుటెట్లో నేర్వవలెను. అంతేకాని అనవసరమైన విషయాల గురించి ఆలోచన లెందుకు?

పాలించే శ్రీవేంకటరమణుడు హృదయంలో వుంటే కాలమేమి చేస్తుంది? కర్మమేమి చేస్తుంది? ధ్రువుని వేదన విని శ్రీహరి ఆ బాలుని వుద్ధరించి తారాపథంలో నిలిపాడు కదా! దుష్కర్మియైన అజామీళునికి వైకుంఠ వాసము నొసగినాడు కదా! వారికి కాలము కర్మము యేమి అడ్డమొచ్చాయి?

కాపాడే దేవుడు కమలనాభుడు దగ్గరవుండి ఆదుకొంటే మన పాపము మననేం చేస్తుంది, మన శత్రువుల పగ మననేమి చేస్తుంది? రాక్షసుడైన ఘంటాకర్ణుడు చేసిన పాపంవల్ల వాడికే అపకారం జరిగింది? హరిద్వేషియైన తనతండ్రి పగబట్టి హరిభక్తి మానమని చిత్రహింసలు పెడితే ప్రహ్లాదునికేమి నష్టం జరిగింది? జగద్విఖ్యాతి కలిగింది కదా!

కులీనుడనని కొందరు గొప్పలు చెప్పుకుంటారు. సద్గుణ భరితులమని, తమకు మోక్షము అనివార్యమని ఇంకా కొంతమంది భుజాలు చరుచుకొంటారు. ఎంత తెలివితక్కువవారు? నలువైన (సామర్థ్యముకల) శ్రీవేంకటేశ్వరునిపై భక్తి వుండాలి కాని, కులమెందుకు గుణమెందుకు? వాల్మీకి బోయవాడైనా ఆదికావ్యం రామాయణాన్ని రచించలేదా? అహల్య చిత్త చాపల్యంతో శాపగ్రస్థయై శ్రీరామపాద స్పర్శచే పునర్జీవితురాలు కాలేదా? మరి ఇంకా కులము గుణము అని ఈ వ్యర్థపుటాలోచనలెందుకు? భావయామి వేంకటేశమ్ అంటూ బ్రతికితే చాలదా?

## మున్నుడి 4-18

ఇది ఒక చక్కటి భజన. నారసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అసంఖ్యాక కీర్తనలలో ఇదొకటి. ఆచార్యులవారు స్వామిని 'నమక చమక హిత' అని కీర్తిస్తున్నారు. ఈవిధంగా హరిహరులకు భేదం లేదని పేర్కొంటున్నారు. నరసింహుడు నముచిసూధన వంద్యుడంటున్నారు. అంటే 'నముచి' అను రాక్షసుని చంపిన ఇంద్రునిచే కీర్తింపబడెడి ప్రభువని, అర్థం. మండెము నారసింహా అంటే... నవగుణి నారసింహ అంటే... కాస్త ఓపికపట్టి భావామృత వివరణ చదవాల్సిందే... మరి.

**ఆ.వె॥ నగధర! నరసింహ! నందగోపుని సుతా!**
**నగజ వరద! శరణు నారసింహ!**
**భజన వోలె పలికె భక్తితో అన్నయ్య**
**నారసింహు గొలిచె పరవశించి.**

**రాగం : యమునా కళ్యాణి**

నగధర నందగోప నరసింహా వో-
నగజవరద శ్రీ నారసింహ ॥నగధర॥

నరసింహ పరంజోతి నరసింహా వీర
నరసింహ లక్ష్మి నారసింహా
నరసఖ బహుముఖ నారసింహా వో-
నరకాంతక జేజే నారసింహా ॥నగధర॥

నమో నమో పుండరీక నారసింహా వో-
నమిత సురాసుర నారసింహా
నమక చమక హిత నారసింహా వో-
నముచి సూదన వంద్య నారసింహా ॥నగధర॥

నవరసాలంకార నారసింహా వో-
నవనీతచోర శ్రీ నారసింహా
నవగుణి వేంకటనారసింహా వో-
నవమూర్తి మండెము నారసింహా ॥నగధర॥



భావయామి వేంకటేశం

**భావామృతం :**

ఈ నారసింహుడు నందగోప నగధరుడు అనగా నందగోపుని బిడ్డడైన నగధరుడు, (గోవర్ధనధారి) అయిన శ్రీకృష్ణపరమాత్మయే అని భావము. నగజవరదుడు (పార్వతీదేవిచే కీర్తింపబడు శ్రీమన్నారాయణుడు) అట్టి దేవదేవా! శ్రీనారసింహా! నిన్ను భజించెదను.

ఓ పరంజ్యోతి స్వరూపుడవైన నరసింహా నీవు వీరాగ్రేసురడవైన నారసింహుడవు. లక్ష్మీ నారసింహుడవు. (వామాంకమున శ్రీలక్ష్మిని ధరించిన నారసింహుడవు. నర సఖుడవు (అర్జునుని ఆప్తమిత్రుడవైన శ్రీకృష్ణ స్వరూపుడవు). బహుముఖ నరసింహుడవు (అనేక అవతారములను ధరించిన శ్రీహరివి). నీవు నరకాంతక జేజేవయిన నరసింహుడవు (అనగా నరకాసురుని చంపిన దైవమైన కృష్ణయ్యవు). అటువంటి దేవా! నిన్ను భజించెదను.

పుండరీక నారసింహా (తెల్లని దేహచ్ఛాయ గల నారసింహా నీకు వందనములు. సురాసుర నమిత (దేవతలచేత మరియు రాక్షసులచేత కూడ కీర్తింపబడిన దేవుడవైన స్వామీ!) వందనము. నమక చమక హిత (నమకము చమకములపై ప్రీతిగల (శివ స్వరూపుడవైన) నారసింహా నీకు వందనములు. 'నముచి' అను రాక్షసుని దునిమిన దేవేంద్రునిచే కీర్తింపబడు నరసింహా! నీకు ప్రణతులు.

నవరసములైన భక్తి, శృంగార, భీభత్సాది రసములచే శోభిల్లి, ప్రదర్శించు నరసింహా నమస్కారములు. నవనీత చోరుడు (వెన్నదొంగ) అయిన కృష్ణమూర్తి స్వరూపుడవైన నారసింహా వందనము. ఈ వేంకట నారసింహుడు నవగుణి. క్రోధమైన ద్వేషమైన ఈ స్వామికి క్షణికములే. ఎప్పటికప్పుడు నూతన గుణములు (ఆశ్రిత వాత్సల్యం వంటివి) ప్రదర్శించువాడు ఈ స్వామి. (శ్రీవేంకటేశ్వరుడే కదా!) ఓ నవమూర్తి మండెము నారసింహా! (క్రొత్త రూపం దాల్చిన నారసింహా!) నీవు మండెమున వెలసియుంటివి. నీకు అనేక వందనములు (మండెము నేటి కడప జిల్లాలోని ఒక వూరు).

**4-19**

## మున్నుడి

నేటి కడప జిల్లా 'వెలిగోడు'లో వెలిసిన చెన్నకేశవస్వామిని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. కేవలుడు అంటే పరమాత్ముడని అర్థం. దివ్య దేహంతో విరాజిల్లే ఆ దేవదేవుడు కేశి అనే రాక్షసుని తుదముట్టించి కేశవుడైనాడు. అన్నమయ్య వాడిన కొన్ని విశేషణాలు ఇతర కవుల వూహలకూ అందవు. శ్రీకృష్ణుని 'కేకివాహన వరద' (నెమలి వాహనుడైన సుబ్రహ్మణ్యుని వరములచే అనుగ్రహించువాడనటం ఆయనకే చెల్లింది). 'శరధి గంభీరశాయి' అంటే గంభీరమైన సముద్రముపై పవళించు వాడైన శ్రీమన్నారాయణుడని. ఇట్లాంటివి అనేకం వున్నాయి.

**ఉ॥ కేవలకృష్ణ రూపుడవు కేశవుడీవని సన్నుతించెరా**
**దేవగణాధిదేవ! తమ దేహము దివ్యము కేశవా! ప్రభూ!**
**ఈవు సురేంద్రవంద్యుడవు ఇంపగు వక్షము కుంకుమాంకమౌ**
**కోవిదుడన్నమయ్య ఇటు కొల్చె నుతించుచు చెన్నకేశవున్**

**రాగం : బేహాగ్**

కేవల కృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా ॥కేవల॥

కిరణార్క కోటితేజ కేశవా
హరి లక్ష్మీనాయక యాది కేశవ
గిరిరాజ సుతనుత కేశవా నమో
శరధి గంభీర శాయి జయజయ కేశవా ॥కేవల॥

కేకి పింఛావతంస కేశవా
శ్రీకర గుణాభిరామ చెన్నకేశవా
కేకివాహనవరద కేశవ
పాకశాసనవంద్య భళిభళి కేశవ ॥కేవల॥





కింకర బ్రహ్మాది గణ కేశవ నా-
మాంకిత శ్రీవేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ
శంకాహరణ నమో జగదేక కేశవ ॥కేవల॥

## భావామృతం

కేవల రూపుడవైన శ్రీకృష్ణావతారా! కేశవా! దేవదేవా! నీవు లోకములన్నింటికీ ప్రభువు. దివ్యమైన దేహముతో అలరారు మహానుభావుడవు.

ఓ కేశవా! నీవు కోటి సూర్య తేజుడవు. లక్ష్మీ వల్లభుడైన శ్రీధరుడవు. ఆదిమూర్తివైన ఆదికేశవుడవు. హిమగిరి పుత్రికయైన పార్వతీదేవిచే నిత్యమూ సన్నుతింపబడు వాడవు. గంభీరమైన క్షీరసాగరమున శయనించు శేషతల్పశాయివైన శ్రీమన్నారాయణుడవు. అట్టి కేశవా నీకు జయము జయము ప్రభూ!

నెమలి పింఛమును సిగలో దాల్చి అలంకరించుకొను ఓ కేశవా! నీవు శ్రీకర గుణాభిరాముడవైన (శుభకరములైన గుణములుగల మనోజ్ఞమూర్తివైన) చెన్నకేశవుడవు. నెమలి వాహనుడైన సుబ్రహ్మణ్యుని వరములచే అనుగ్రహించిన వాడవు. (షణ్ముఖుడు దేవసేనను పరిణయమాడి దేవగణాదులకు సర్వసైన్యాధిపతి పదవి నలంకరించి నప్పుడు విష్ణుమూర్తి ఆయనకు ఎన్నియో వరములనిచ్చి ఆశీర్వదించాడు). పాకశాసనుడైన (పాకాసురిని శాశించిన) దేవేంద్రునిచే కీర్తింపబడు కేశవుడు. భళిభళీ!! నీవు దేవదేవుడవు చెన్నకేశవా!

బ్రహ్మాది దేవతలు భృత్యులుగా గల కేశవుడను నామముచే శోభిల్లు ప్రభూ! నీవు వేంకటాద్రిపై వెలసిన కేశవుడవు. కుంకుమ అంటినందున ఎఱ్ఱగా ప్రకాశించుచున్న వక్షముగల కేశవుడవు. వెలిగోడులో వెలసిన చెన్నకేశవస్వామివి నీవే. నీవు తిరుమలనాథుడవేనా? అనే శంకను హరించు జగదేకపతివైన చెన్నకేశవుడవు నీవే మా శ్రీవేంకటేశ్వరుడవు.

## మున్నుడి 4-20

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ శరణాగతి మీరూ పాడి తరించండి. అచ్యుతుడు, గుణాతీతుడు, విశ్వరూపుడు, అచింత్యుడు, పూర్ణకాముడు, అగోచరుడు – అయిన ఈ శ్రీవేంకటేశ్వరుని మనం సాధించగలమా!! మన వలన అయ్యే పనియేనా? అసాధ్యం. మరి ఏదుపాయము? శరణాగతి... నాకు ఇంకేమీవద్దు నీవే కావాలి... నీవే దిక్కు.. అనటమే... అదీ త్రికరణ శుద్ధిగా...

**సీ॥ ఏడుపాయము నిన్ను యేరీతి చేరేది?**
**ఆద్యంతములు లేని అచ్యుతుడవు**
**వెలయనీ గుణములు వినుతించెదమనంటె**
**తెలియ నీవే గుణాతీతుడవట**
**పొదిగి చేతుల నిన్ను పూజించెదమనంటె**
**కదిసి నీవే విశ్వకాయుడవట**
**కన్నులచే నిన్ను కనుగొనెదమనంటె**
**సన్నిధి నీవగోచరుడవంట**

**తే॥ ఇన్నిటను వేంకటేశ్వరా! ఈవె కలవు**
**వన్నెల శరణమనియెడి వాక్యమొకటి**
**నిన్ను కొలవంగ జాలనె అన్నమయ్య**
**పద్యమందున నిముడు యీ పాట వినుడు**

**రాగం : ముఖారి**

ఏడు పాయము నిన్ను చేరుటకు
ఆది అంత్యములేని అచ్యుతమూరితివి ॥ఏడు పాయము॥

వెలయ నీ గుణములు వినుతించేనంటే
తెలియ నీవు గుణాతీతుడవు
చెలరేగి నిను మతి చింతించేనంటే
వలసి నీవచింత్య మహిముడవు ॥ఏడు పాయము॥





పొదిగి చేతుల నిన్ను పూజించేనంటే
కదిసి నీవు విశ్వకాయుడవు
అదన నేమైన సమర్పించేనంటే
సదరమై అవాప్త సకల కాముడవు ॥ఏడు పాయము॥

కన్నుల చేత నిన్ను కనుగొనేనంటే
సన్నిధి దొరక నగోచరుడవు
ఇన్నిటాను శ్రీవేంకటేశ నీవు కలవని
వన్నెల శరణనే వాక్యమే చాలు ॥ఏడు పాయము॥

**భావామృతం**

ఓ దేవదేవా! నిన్ను చేరుకొనుట యెట్లు? నిన్ను తెలుసుకొనుట యెట్లు? నిన్ను పొందుట యెట్లు? ఏడుపాయము (ఉపాయం యేది?) నీవేమో అచ్యుతుడవు, అనాదివి, అనంతుడవు. అంటే ఆదిమధ్యాంత రహితుడవు కదా!

వెలయ (ప్రసిద్ధికెక్కిన) నీ గుణములను చక్కగా కీర్తించెదను అనుకొంటే నాకో సందేహం వచ్చింది. నీవు గుణాతీతుడవు కదా! నిర్గుణుడవు కదా! విజృంభించి నిన్ను మనస్సులో చింతించెదములే అనుకొంటే, నీవు ఆలోచనలకే అందని అచింత్యుడవు. నీ మహిమలనూహించుటయే సాధ్యము కాదాయెను. మరి యేది దారి?

స్వామీ! నిన్ను చేతులలో వుంచుకొని పూజిద్దామా అంటే, కదిసి (సమీపించిన) నీవు విశ్వరూపుడవు. దివ్య చక్షువులను పొందిన అర్జునుడే నిన్ను చూడలేక బెంబేలెత్తిపోయాడు. నావల్ల అయ్యే పనియేనా? పోనీ ఇదే సమయం నీకేదన్నా సమర్పించి నీ అనుగ్రహం సంపాదిద్దామా అంటే... నీవు సదరమై (కోటికయేలేని) అవాప్త సకలకాముడవు (అన్నీ పొందిన పూర్ణకాముడవు). ఇక నేను నీకు ఇయ్యగలిగినదేమిటి తండ్రీ!

అన్నిటికంటే తేలికయైన పని కళ్ళెదుట యేదన్నా వుంటే చూడటం. నీ విషయంలో మాకు అదీ అసాధ్యమే. నీ సామీప్యం సాధ్యమవుతుందా? నీవు యెవరికీ కనిపించని అగోచరుడవు. నిన్నెట్లా చూడగలము? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఇన్నిటా (వీటన్నిటియందునూ) కలవు. అట్టి, వన్నెల (ప్రసిద్ధుడవైన) నీకు శరణు అనే మాటయే చాలును. దయా సాగరుడవైన నీవు మమ్ము కరుణించి నీ శరణము నిస్తావు. అనండి మరి...

శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే...

## 4-21

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తన నర్థం చేసుకోవటం అంత తేలికకాదు "ఘనుడవైన నీ మహిమ కనుగొన్న వారెవరయ్యా? మినుకుల కొంతకొంత మెచ్చుట ఇంతేకాని" అంటున్నారు. మినుకుల అంటే వేదములలో, అక్కడక్కడా నిన్ను కీర్తించటం తప్ప నీ మహిమ ఎవరికి తెలుసయ్యా అని అంటున్నారు. ఎన్నెన్నో అసాధ్యమైన పనులు చేయవచ్చుగానీ, నీవునన్ను కరుణించి నా దగ్గర వున్నంతకాలం నీకు నాకూ భేదం కనుక్కోవటం ఎవరివల్లాకాదు. నీవే నేను, నేనే నీవు అంటున్నారు. ఆలోచిస్తే గూఢంగా దశావతారములు ప్రస్తుతి కనబడుతుంది.

**చం॥ ఘనుడవు నీదు లీలలను కానగజాలిన వారలెవ్వరో!!**
**మినుకుల కొంతకొంత నిను మెచ్చగ వీలగునింతియే ప్రభూ!**
**మనవిగ నన్నమయ్య హరిమాయ నెరుంగుట వీలు కాదనెన్**
**వినుడు దశావతారముల వెన్నుని ప్రస్తుతి జేసె చూడరో.**

**రాగం : మోహన**

ఘనుడవు నీ మహిమ గన్నవారెవ్వరు
మినుకుల కొంతకొంత మెచ్చుటింతేకాని ॥ఘనుడవు॥

జలధి నీరు సొచ్చి సారెసారె నీదవచ్చు
ములుగుచు గొండైన మోవవచ్చు
యిల యెల్ల నెత్తవచ్చు నేరూపైన గావచ్చు
బలిమి నీ చిత్తమే పట్టరాదు గాని ॥ఘనుడవు॥

ఆకసమింతంతని యంటి కొలవగ వచ్చు
చేకొని ఘోరతపము సేయవచ్చు
రాకాసులజంపవచ్చు రామలగలయవచ్చు
ఆకడ నీ గుట్టు తెలియగరాదు ॥ఘనుడవు॥





పట్టరాని వ్రతములు పట్టించి సేయించవచ్చు
గట్టిరాయైన కదు గరచవచ్చు
ఇట్టె శ్రీవేంకటేశ యిటునన్ను గూడితివి
దిట్ట నీనాలోన భేదించరాదు గాని ॥ఘనుడవు॥

**భావామృతం :**

ఓ మహానుభావా! నీవు ఘనుడవు. నీ మహిమను లెక్కించగల వారెవ్వరు? ఏదో కొంతకొంత మెచ్చుకొంటూ నిన్ను కీర్తించటమేకాని, నిజానికి నీ మహిమ ఎంతో ఎవరు చెప్పగలరు?

సముద్రంలో దూరి ఈద వచ్చు. మాటిమాటికీ మునిగి తేల వచ్చు (మత్స్యావతారం). పెద్దకొండనైన మోయ వచ్చును (కూర్మావతారం). భూమండలాన్నైనా యెత్త వచ్చును (వరాహావతారం). ఏదో సిద్ధి పొంది యే రూపం కావాలంటే ఆ రూపం ధరించవచ్చును (నరసింహం). కాని మనస్సులో నిన్ను పట్టి యుంచటం మాత్రం జరిగే పనికాదు.

ఆకాశమును పట్టుకొని ఇంత లేక అంత అని కొలవవచ్చును (వామనావతారం). పూనుకొని ఘోరమైన తపము నాచరించవచ్చును (పరశురాముడు). దుర్మార్గులైన రాక్షసులను చంపివేయవచ్చును (రామావతారం). రామల గలయవచ్చు (భోగాసక్తి కల వనితలను కూడ వచ్చును (అంటే శ్రీకృష్ణుడు). కాని ఆద్యంతం నీ తత్త్వం తెలిసి కొనుట మాత్రం జరిగే పనికాదు.

ఈ భూలోకంలో ఎవ్వరూ చేయని గొప్ప గొప్ప వ్రతములను పట్టుదలతో ఆచరింపజేయవచ్చును (బుద్ధావతారం). కఠినమైన శిలను కూడ కరగించవచ్చును, పాషాణ హృదయాన్నైనా సద్వర్తునులై కరిగించవచ్చును, (కల్కి అవతారము). ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను ఈ విధముగా అతి తేలికగా కూడితివి. ఇక నీకు నాకు భేదమే లేదు. నేను ఆత్మసాక్షాత్కారమైన జీవాత్మ పరమాత్మలొక్కటే అని గ్రహించగలిగాను ప్రభూ!

**4-22**

## మున్నుడి

విశిష్టాద్వైత మతం స్వీకరించి శ్రీహరి తత్త్వాన్ని ప్రచారం చేసిన అన్నమాచార్యుల వారు ఈ కీర్తనలో చక్కటి తత్త్వ రహస్యాన్ని వారి గురువు చెప్పినట్లు మనకు చెబుతున్నారు. అన్ని శాస్త్రములు చదివినా, యెంత నేర్చినా, మనకు తెలిసేది ఆనాడు శ్రీశుకుడు చెప్పినది. స్వానుభవంతో ధ్రువుడు నేర్చినది అయిన గొప్ప సత్యం ఒక్కటే. భవము (అనగా జీవి పుట్టుక) యేదైనా, నామ రూపములు వేరైనా శ్రీహరి దాస్యంచేత మాత్రమే ఆయన మాయను తెలియగలను. వేరే దారే లేదు.

**ఉ॥ అన్నియు శ్రద్ధతో చదివి ఆవల శాస్త్రములన్ని నేర్చియున్**
**ఎన్నగ శ్రీశుకుండు ధ్రువు దేర్పడ జెప్పిన సత్యమొక్కటే**
**ఉన్నతమైన మోక్షమది యొక్కటె యేమతమైన నేమిరా**
**అన్నయ కీర్తనంబు గొని అద్భుత తత్త్వము నేర్పె శ్రీహరీ!**

**రాగం : మలహరి**

సకలము జదివిన శాస్త్రములెఱిగిన
శుకధ్రువాదులిటు చూపినది ॥సకలము॥

భవభవములకును ప్రకృతులు వేరే
భువి నామరూపములు వేరే
యివల నీదాస్యం బెప్పుడు నొకటే
కలిసిన నీమాయ గడచినది ॥సకలము॥

మతము మతమునకు మార్గము వేరే
అతి సంశయములు అవివేరే
గతి నీ శరణము గలిగిన దొకటే
యితవగు మోక్షం బిచ్చేది ॥సకలము॥





జాతిజాతియాచారము వేరే
ఆతల మోక్షం బది యొకటే
శ్రీతరుణీశ్వర శ్రీవేంకటేశ్వర
చేత మా గురుడు చెప్పినది ॥సకలము॥

**భావామృతం :**

ఓ మానవులారా! చదవవలసినదంతా చదివినా, శాస్త్రములన్నియు నేర్చినా చివరికి నేర్చెడి సత్యమొక్కటే. అదే ఆ నాడు శ్రీ శుకమహర్షి బోధించారు. అదే తెలుసుకొని ధ్రువుడు శ్రీహరి కరుణబొంది ధ్రువతారయై ప్రసిద్ధిగాంచినాడు.

జీవుల పుట్టుకలన్నిటికీ (భవభవమునకు) ప్రకృతి వేరువేరుగా వుంటుంది. ఈ లోకంలో ఒక్కొక్క జీవికి ఒక్కొక్క పేరు, రూపం వుంటాయి. కాని అవి ఆ పరమాత్మ మాయ తెలిసికొనలేక బ్రతుకుతుంటాయి. చస్తుంటాయి. మళ్ళీ పుడుతుంటాయి. ఏదో ఒక జన్మలో ఆ దేవదేవుని దాస్యం స్వీకరించి, సేవానురక్తిని పొందితేగాని ఆయన మాయను గవయలేడు (దాటలేడు).

ప్రపంచంలో ఒక్కొక్క మతం ఒక్కొక్క మార్గం ద్వారా పరమాత్మను పొందవచ్చని చెప్పింది. మళ్ళీ ఆ మతాలలో కూడ వేర్వేరు సందేహాలు వున్నాయి. అయితే నీ శరణాగతి యొక్కటి మాత్రమే హితమును కలిగించు మోక్షప్రాప్తిని ఈయగలదు. ఎవరేమి చెప్పినా పరమాత్మ శరణు పొందనివాడు యెన్నటికీ మోక్షం సాధించలేడు.

ఈలోకంలో అనేక జాతులున్నాయి. వీటన్నిటికీ వేర్వేరు ఆచారాలున్నాయి. కాని వాటన్నిటికీ లక్ష్యమైన మోక్షం మాత్రం ఒక్కటే. అదే మరల పుట్టుకలేని ఆనందం పొందటం. శ్రీవనితావల్లభుడైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీదయ నొందిన మా గురుదేవులు చెప్పిన సత్యంకూడ ఇదే.

## 4-23

## మున్నుడి

అన్నమాచార్యులవారి కాలంలో శ్రీమంతులు పుణుగు అనే సుగంధ ద్రవ్యం ఒంటిపై మెత్తుకొని (సామాన్యులు సున్నిపిండి వాడేవారు) స్నానం చేసేవారు. ఆ సుగంధ ద్రవ్యం పునుగు పిల్లినుంచి లభిస్తుంది. తిరుమలనాథునికి ప్రతి శుక్రవారము అభిషేక స్నానపు సేవ జరుగుతుంది. పన్నీటితో స్నానంచేసి, కర్పూర ధూళి మెత్తుకొని తట్టు పుణుగు సువాసనలతో ఘుమఘుమలాడుతూ ఆ పురుషోత్తముడు తన దేవేరి అలమేల్మంగమ్మతో చక్కటి హరాల నలంకరించుకొని, పట్టువస్త్రాలు ధరించి, పలు విందులారగించి, బాగాలు తీసికొని (అంటే?) అందరినీ కరుణిస్తాడు.

**కం॥ నేడే 'సుక్కురవారము'**
**చేడెలు యీ 'పుణుగుకాపు' సేవల నిడరే**
**పోడిమి సేవల కొలువుడు**
**వాడిగనా అన్నమయ్య పాడెను వినుడీ.**

**రాగం : అభేరి**

నేడె సుక్కు రారము నెలతలాల
పోడిమి సేవసేయరే పుణుగుకాపు ॥నేడే॥

పన్నీటి కాలువలు పారీని జూడరే
అన్నిటా గొండవంటి శ్రీహరి మీదను
యెన్న నభిషేక మంత్రాలిదె చెప్పేరు వినరే
తిన్నని పుణుగుకాపు దేవునికి నేడు ॥నేడే॥

రాలీని కప్పుర రజమిదె చూడరే
నీలమేఘమువంటి యీ నీరజాక్షుపై
తాలిమితో జాలువారీ తట్టుపుణుగది గోరే
పోలింప బుణుగుకాపు పురుషోత్తమునికి ॥నేడే॥



భావయామి వేంకటేశం

అలమేలు మంగతోడి హారాలు సేవించరే
వెలయ ధరించెను శ్రీవేంకటేశుడు
పలువిందులారగించె బాగాలు యియ్యరే
చెలగీ పుణుగుకాపు శేషాద్రిపతికి

**భావామృతం :**

ఓ వనితలారా! నేడు శుక్రవారము. పోడిమి (ఒప్పుగా) మీరంతా స్వామికి పుణుగుకాపు సేవచేయండి. ధన్యులు అవండి.

ఇదిగో ఇటుచూడండి. పన్నీటితోస్వామి స్నానం చేస్తుంటే పన్నీరు కాలువలై పారుతున్నది. ఈ శ్రీహరి కొండవలె స్థిరంగా నున్నాడు. ఆయనపై పన్నీటి అభిషేకం జరుగుతుంటే స్థిరంగా నున్నాడు. వేదపండితులు మంత్రాలు శ్రావ్యంగా చదువుతున్నారు. మీరంతా వినండి. తిన్నని (మనోజ్ఞమైన) ఈ దేవునికి నేడు పుణుగుకాపు సేవ జరుగుతున్నది. చూచి తరించండి.

పద్మదళనేత్రుడైన ఈ నీలమేఘశ్యాముని ఒంటిపై కర్పూర ధూళి మెత్తుతున్నారు. స్వామి ఒంటిపై నుండి కొంత కర్పూర ధూళిరాలిపోతున్నది. ఈ చక్కటి దృశ్యం చూడండి. తట్టుపుణుగు అనే సుగంధద్రవ్యం తాలిమితో (ఇక్కడ సమృద్ధిగా) జాలువారుచున్నది. ఈ పురుషోత్తమునికి జరుగుచున్న పుణుగుకాపు సేవను తిలకించండి.

శ్రీవేంకటేశ్వరుడు తనదేవేరి అలమేల్మంగతోపాటు శోభాయమానంగా దివ్యహారాలు ధరించి వెలుగొందుచున్నాడు. ఓ చేడెలారా! (వనితలారా!) ఈ చక్కటి జంటను సేవించండి. ఇప్పుడు స్వామి తన దేవితో వివిధములైన విందుల నారగించినాడు. ఇప్పుడాయనకు బాగాలు (వక్క, తాంబూలము) యియ్యరే. ఈ శేషాచలాధిపునికి, చెలగి (విజృంభించి) పుణుగుకాపు సేవచేసి తరించండి.

## 4-24

### మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన వింటే నరుడే నారాయణుడనే సత్యం తేటతెల్లమవుతుంది. వివిధ రూపాలలో వివిధ దేవతలనారాధించే మనం, మనలోనే వున్న పరమాత్మను గుర్తించలేక స్వామి దర్శనానికి వైకుంఠ ద్వారంలో నిలిచి కూడా, తోటివారిని దూషిస్తూ, కోపతాపాలతో వేగిపోతూ, ధనవ్యయం గురించి ఆలోచిస్తూ అప్పటికప్పుడు అబద్ధాలు చెబుతూ, ఏదో ఒక్క అర నిముషంలో ఆ నల్లనయ్యను 'చూసేస్తున్నాము'. కానీ పరమాత్మని దర్శించటంలేదు. ఎందుకంటే... ఆయన మనలోనే వున్నాడు. శ్రీవేంకటేశ్వరునికే... ఆమాట చెబుతున్నారు.

**మత్తకోకిల:** **నీవనన్ యొకచోట నుండవు నీవు వుందువు యెల్లెడన్**
**నీవుయంచు కనుంగొనేదదె నీవు నిక్కము శ్రీహరీ!**
**ఈవిధిన్ వచియించెనన్నయయెంచి చూడరొసత్కవిన్**
**లావుగా నరులందుదేవుని లబ్ధినొందగ జెప్పెరా.**

**రాగం : కాపి**

నీవనగనొకచోట నిలిచివుండుట లేదు
నీవనుచు కనుగొన్న నిజమెల్ల నీవే ॥నీవనగ॥

తనయాత్మవలెనె భూతముల యాతుమలెల్ల-
ననయంబు గనుగొన్న యతడే నీవు
తనుగన్న తల్లిగా తగనితర కాంతలను
అనఘుడై మదిజూచు నతడే నీవు ॥నీవనగ॥

సతత సత్యవ్రతాచార సంపన్నుడై
అతిశయంబుగ మెలగు నతడే నీవు
ధృతిదూలి ద్రవ్యంబు తృణముగా భావించు-
హతకాముకుడైన యతడే నీవు ॥నీవనగ॥





మోదమున సుఖదుఃఖములు నొక్క రీతిగా
నాదరింపుచునున్న యతడే నీవు
వేదోక్తమతివైన వేంకటాచలనాథ
ఆదియును సంత్యంబు నంతయును నీవే ॥నీవనగ॥

### భావామృతం :

ఓ సర్వాంతర్యామీ! పరమాత్మా!

'నీవు' అంటే ఈ గర్భగుడిలో నిలిచియున్న విగ్రహం కాదు. నీ తత్త్వం అర్థం చేసికొని నిజం తెలిసికొంటే, నీవు అని గ్రహించిన ప్రతిదీ నీవే. అంటే.. అన్నీ నీవే. నీవు కానిది ఏదీ లేదు.

సర్వభూతములలో (జీవరాశిలో) వున్న ఆత్మకు తనలోవున్న ఆత్మకు భేదంలేదని ఎల్లప్పుడు గ్రహించియున్న వాడే నీవు. పరస్త్రీలను తన మాతృమూర్తిగా భావించి, మనస్సులో కూడ వారిపై అదే గౌరవం చూపించగలిగిన పుణ్యాత్ముడే నీవు.

ఎల్లవేళలయందు సత్యవ్రతుడై (పరమాత్మ సత్య స్వరూపుడు కదా!) అదే ఆచారముగాను సంపదగాను, వుత్కృష్టతతో మెలగునటువంటి మానవుడే నీవు. ద్రవ్యము (ధనము) పుష్కలంగా వుండికూడ దానిని గడ్డిపరకవలె భావించి, హతకాముడు (నశించిన కోరికలు గల) వాడేనీవు. వాడే నిర్మోహి.

మనుష్యులకు సుఖాలవెంట దుఃఖాలు, దుఃఖాల వెంట సుఖాలు వస్తూనే వుంటాయి. సుఖాలకు పొంగిపోవటం, దుఃఖాలకు క్రుంగిపోవటం తగదు. వాటిని సమానముగా భావించాలి. అదికూడా సంతోషంతో సమానంగా స్వీకరించాలి. అట్లు చేయగలిగిన నరుడే నారాయణుడు. ఓ ప్రభూ! కనుక అతడే నీవు. వేదములచే నిర్వచించబడిన శ్రీవేంకటాచలాధిపా! సమస్తమునకు ఆరంభమూ నీవే, అంత్యమునూ నీవే. నీవుకానిదేదీ లేదు, లేదు, వుండబోదు.

## 4-25

## మున్నుడి

నేటి కడపకు అతి సమీపంగానున్న దేవుని గడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై అన్నమాచార్యులవారు చెప్పిన రమణీయమైన కీర్తన ఇది. తనన తాను ఆ స్వామి ప్రేయసిగా భావించి ఆచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో ప్రతిచరణము 'క' అనే అక్షరంతో మొదలై అర్థం తెలుసుకోవటానికి నిఘంటువులు తిరగవేయాల్సి వచ్చింది. నేను నీకు 'కలదాననే' ప్రభూ! అంటున్నారు. కలికి వేంకటాద్రి అంటే మనోజ్ఞమైన వేంకటాద్రి అని అర్థం.

**తే॥ కాదననకు నా మాటను కడపరాయ!**
**నీకు గాదె బోసెను కదా! నీవలపులు**
**కడప వేంకటరమణుని కరుణ కొఱకు**
**అన్నమార్యుడు నుతియించె నద్భుతముగ**

**రాగం : మోహన**

కాదనకు నామాట కడపరాయా – నీకు
గాదెబోసె వలపులు కడపరాయ ॥కాదనకు॥

కప్పురమియ్యగరాదా కడపరాయా–నీకు
గప్పితి నాపయ్యెదెల్ల గడపరాయ
కప్పుమివే కుచములు కడపరాయా– వో
కప్పుమొలులుమేని చాయ కడపరాయ ॥కాదనకు॥

కందువకు రారాదా కడపరాయా–ముందే
గందమిచ్చినవాడవు కడపరాయ
కందము నీమాటలిక గడపరాయా–వో
కందర్ప గురుడ మొక్కె గడపరాయ ॥కాదనకు॥





కలసితివిటునన్ను గడపరాయా–నా
కలనేడు నిజమాయె కడురాయ
కలదాననే నీకు గడపరాయా–వో
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయ ॥కాదనకు॥

**భావామృతం :**

ఓ కడపరాయా! (దేవుని గడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరా!) నామాట కాదనక మన్నించి నన్ను చరితార్థురాలను చేయుము ప్రభూ! నీవలపులు (వాత్సల్యములు అని భావన) గాదెబోసెను. (కుప్పగా కుమ్మరించితిని). ధన్యురాలను తండ్రీ!

ఓ కడపరాయా! నాకు కర్పూర తాంబూలము నీయరాదా ప్రభూ! నీపై నాపయ్యెదను కప్పియుంచితిని. నా స్తనముల నాక్రమించి కప్పివేయుము. కప్పు మొయిలు మేని చాయ (నల్లని నెమలి వంటి శరీర కాంతిగల) కడపరాయా! నేను నీదానను.

ఓ కడపరాయా! నీవు నాతో కందువకు (ఏకాంత సేవకు) రాకూడదా ప్రభూ! ఎందుకంటే నీవు ఇంతకుమునుపే నాకు గంధము (చందనము) నిచ్చావు. (నీకు గుర్తుందో లేదో?) స్వామీ! నీ మాటలు ఇక కందము వంటివి (మబ్బు వంటివి). మేఘాలకు నిలకడ వుంటుందా? నా పిచ్చిగాని నేను నీమాటలు నమ్మడమేమిటి? ఓ కడపరాయా! నీవు కందర్పగురుడవు (మన్మధునికే తండ్రిగారివి) మనోజ్ఞమూర్తివి. నీకు భక్తితో మొక్కెదను ప్రభూ!

ఓ కడపరాయా! నీవు నేడు నన్నీవిధముగా కలిసితివి. నా కలలన్నీ నేడు నిజమైనాయి. ఓ ప్రభూ! నేను నీకు కలదాననే. (నీ స్వంతమై సర్వహక్కులు నీకర్పించిన దానను). ఓ కడపరాయా! నీవు కలికి వేంకటాద్రి (మనోజ్ఞమైన వేంకట నగముపై వెలసిన పురుషోత్తముడవు. నన్ను అనుగ్రహించుము ప్రభూ!

**4-26**

## మున్నుడి

జీవిత చరమాంకంలో అన్నమాచార్యులవారు వైరాగ్యమనస్కులై యెన్నో అద్భుతమైన కీర్తనలు చెప్పారు. కన్నీరు మున్నీరైతేగాని మనిషికి 'నేను' అనే అహంకారంపోదు. సమానంగా కష్ట సుఖాలు, శీతోష్ణాలవలె కలుగుతూనే వుంటాయి. వాటిని అనుభవించక తప్పదు. ఎంతయెక్కువ చదివితే అంత యెక్కువ సందేహాలు కలుగుతాయి. నాకెందుకు స్వామీ! ఈ యమాటెక్కు? నీవే నిక్కమైన వేల్పువు. నన్ను ఈ ఊొంపిలోంచి బయట పడవేయి తండ్రీ! నీ ఇష్టం...

**ఆ.వె॥ సరికి సరియగునిక చలువకు వేడికి**
**అరయకలదు మాకు హరి శరణము**
**వేంకటేశ! చదువ మిగులు సందేహాలు**
**అన్నమయ్య తెలిపె సన్నుతించి.**

**రాగం : మోహన**

చలువకు వేడికి సరికి సరి
కలదిక హరి నీ కరుణే మాకు ॥చలువకు॥

కాయము గలిగిన గలుగు దోడనే
పాయువు మదములు పైపైనే
రోయదు తను గని రుచులే వెదకును
యేయెడ హరి నిను నెరుగుట యెపుడో ॥చలువకు॥

కడుపు నిండితే ఘనమై నిండును
బడి బంచేంద్రియ పదిలములు
విడువ వాసలును వెలయు బంధములు
కడగిన మోక్షము గైకొనుటెపుడో ॥చలువకు॥



భావయామి వేంకటేశం

పెక్కులు చదివిన పెనగు దోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా-
నిక్కపు వేల్పవు నీ చిత్తమికను ॥చలువకు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ప్రారబ్ధం వలన కలిగే కష్టసుఖాలు అనివార్యాలు. శీతోష్ణములు ప్రకృతికెట్లు సహజమో అవీ వచ్చిపోతూనే వుంటాయి. మరి దారి ఒక్కటే వున్నది. అదే నీ శరణాగతి. శ్రీహరీ! మాకు అదొక్కటే దారి.

ఒక్కసారి, జీవుడు ఈ కాయము (దేహం) లో ప్రవేశించగానే, అరిషడ్వర్గాలు వాడిని పట్టుకొంటాయి. అవి పాయవు (వదలవు). మదముతో పేట్రేగిపోతుంటాడు. విసుగు లేకుండా వివిధ రుచులకోసం (అనుభవాల కొరకు) వెదకుతూనే వుంటాడు. ఓ శ్రీహరీ! ఇక నిన్ను తెలియుటకెప్పుడు తీరిక దొరుకుతుంది? మా జీవితం ఈలోగా ముగిసేపోతుంది.

ఒక్కసారి కడుపునిండి ఆకలి తీరగానే నా పంచేంద్రియములు (కళ్ళు, ముక్కు, నాలుక, చెవులు మరియు చర్మము) ఘనముగా నిండిపోయిన స్థైర్యం చేజిక్కించుకొంటాయి. ఇక ఎన్నో ఆశలు నన్ను పట్టుకొని విడువవు. వాటివల్ల రకరకాల సంబంధాలలో చిక్కుకొనిపోతాను. ఇక నేను కడగిన మోక్షము (సాధించవలసిన ముక్తిని) పొందుట యెప్పుడు జరుగుతుంది ప్రభూ!

మనుష్యుడు యెంత ఎక్కువ చదువుకొంటే అంత ఎక్కువ తెక్కులు (టెక్కు, లేక గర్వము) కలుగుతాయి. వాటితో పాటే అనేక సందేహాలూ కలుగుతాయి. మరి ఈ నిరుపయోగమైన చదువులెందుకు ప్రభూ! ఓ ఏడుకొండల వేంకటరమణా! నీవే మా దైవానివి. నిన్నే నేను నిజంగా నమ్ముకొన్నాను. నీ చిత్తము వచ్చినట్లు చేయుము తండ్రీ!

## మున్నుడి 4-27

అన్నమాచార్యులవారి కీర్తనలు యతిప్రాసలతో అత్యద్భుతమైన కవిత్వ ఝరులని ఇదివరలో చాలాసార్లు చెప్పాను. ఈ శ్రీకృష్ణలీలలు యెంత చక్కటి సీసపద్యమయినదో గమనించండి. ఇది దీక్షితులు గొప్పతనంకాదు. సంపెంగపూలు పెట్టిన బుట్ట ఘుమఘుమలాడదా? మల్లెలు కట్టిన దారం సువాసన వెదజల్లదా? ఇదీ... అంతే...

**సీ॥ కొమ్మలు! జూడరే గోవిందు డీతడు**
**కుమ్మరించెను ముద్దు గొలుపుచుండె**
**దిట్ట బాలురతోటి తిరుగాడి వీధుల**
**గొట్టెనుట్లు నితడు కొల్లగొట్టె**
**వలసిన పాలను వారలు వట్టుచు**
**కులుకుచు నవ్వీని కొండెగాడు**
**బారలు చాపుచు బట్టుగ నింతుల**
**కూర్మితో గూడెను కోర్కెపెంచి**

**ఆ.వె॥ గోర జెనకె నతడు గోవిందు డాతడే**
**ఏడుకొండలకును ఏలికయట**
**అన్నమయ్య కవిత అత్యద్భుతంబుగా**
**సీసపద్యమాయె శ్రీనివాస!**

**రాగం : మోహన**

కొమ్మలు చూడరే గోవిందుడు
కుమ్మరించీముద్దు గోవిందుడు ॥కొమ్మలు॥

దిట్టబాలులతో దిరిగీ వీధుల
గొట్టీనుట్లు గోవిందుడు
పట్టిన కోలలు పైపై జాపుచు
కుట్టీదూంట్లుగా గోవిందుడు ॥కొమ్మలు॥





నిలువుగాశతో నిడిగూతలతో
కొలకొలమని గోవిందుడు
వలసిన పాలు వారలు వట్టుచు
కులికి నవ్వీ గోవిందుడు ॥కొమ్మలు॥

బారలు చాపుచు బట్టుగ నింతుల
గూరిమిగూడీ గోవిందుడు
చేరి జవ్వనుల శ్రీవేంకటాద్రిపై
గోర జెనకీ గోవిందుడు ॥కొమ్మలు॥

**భావామృతం :**

ఓ వనితల్లారా! ఇదిగో ఈ గోవిందుని గమనించండి. ఈ గోవిందుడు ఎంత ముద్దులు కుమ్మరిస్తున్నాడో చూడండి. ఇతని అల్లరి యెంతని చెప్పగలను.

ఇతను రేపల్లెలో వీధులవెంట దిట్టబాలురతో (ధైర్యంగల పిల్లమూకతో) దిరుగులాడుతూ, ఎత్తుగా పాలు, నెయ్యి, పెరుగు దాచి వుంచిన వుట్లను పడగొడుతున్నాడు. ఈ గోవిందుని అల్లరి చూడండి. చేతులలో పట్టుకొన్న కోలలు (కఱ్ఱలు) మీది మీదికి లేపి కుండలు దూంట్లుగా (చిల్లులు పడనట్లు) కొట్టినాడీ అల్లరి గోవిందుడు.

ఎంతో కాశతో (శ్రమ కల్పించుచు), నిడిగూతలతో (దీర్ఘమైన కేకలతో) కొలకొలమను (రణగొణధ్వని చేయు) ఈ గోవిందుని చూడండి. మనకు, మన దూడలకు, మన పిల్లలకు కావలసిన పాలను, వారలు వట్టుచు అనగా నిష్కారణంగా నిరుపయోగంగా ఆపోశన పట్టుచున్నాడు. (కాని ఆ గొల్లభామలకి ఏం తెలుసు? పరమాత్మే అవపోశన పడుతున్నాడని). అదేమిటని గద్దిస్తే ఈ గోవిందుడు ఎట్లా కులుకుతూ నవ్వుతున్నాడో చూడండి.

సరేలే అని గోపికలంతా కలసి చేతులు బారచాచి పట్టుకొంటె ఈ గోవిందుడు వారిని వలపులతో రమించినాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడే ఆ యువతులను చేరి గోవిందుడై గోర జెనకీను (గోళ్ళతో గీట్లు పెట్టుచూ వారిని పరవశింపజేయుచున్నాడు). ఆహా! ఏనాటి సుకృతమో కదా!

**4-28**

## ముున్నుడి

శ్రీవేంకటేశ్వరుని తత్త్వాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. అన్నమయ్య కాలంనాటి నుడికారం నేటి తెలుగులో లేదు. ఆయన మనోగతం పూర్తిగా అర్థం చేసికొనుట పండితులకే అసాధ్యమని నా భావన. ఇక నాబోటి సామాన్యులకు అన్నమయ్య భావవివరణ యెంత 'కత్తిమీద సామో' వూహించండి. పొడిబడకుంటేనే పూర్ణభావమలరు - అంటే ఇదమిద్ధంగా తెలియటంలేదు. భావామృత వివరణ చదివిన వారికి నేను చెప్పిన వివరణ సమంజసమేమో!! అనిపించకమానదు.

**కం॥ సర్వసులభుడగు నీహరి**
**సర్వేశ్వరుడైన యతని శరణన వలెరా**
**గర్వము బాసిన గనబడు**
**నుర్వీధవు నన్నమయ్య ఒప్పుగ బొగడెన్.**

**రాగం : అభోగి**

సర్వసులభుడితడు సర్వేశ్వరుడు
గర్వము బాసితేను కానవచ్చునితని ॥సర్వ॥

చింతలెల్లానుడిగితే శ్రీపతి యందే వుండు
మంతనాన నుండితేను మరినాతడే
పంతపు వుబ్బుమానితే పరమాత్ముడు దోడౌను
వింతలు దలచకుంటే విశ్వరూపమే ॥సర్వ॥

వెడకర్మాలు దోసితే విష్ణుని సాన్నిధ్యమబ్బు
కడునాసలొల్లకుంటే కలడాతడు
వొడలోముకొనకుంటే వుపేంద్రుడు రక్షించు
పొడిబడకుంటేనే పూర్ణభావమలరు ॥సర్వ॥





ఇతరమెరుగకుంటే నిందిరానాథుడు మెచ్చు
సతిబారిబడకుంటే జంటౌ నాతడు
హితవులు గోరకుంటే నెదుట శ్రీపతి నిల్చు
జితేంద్రియ వ్రతమందే శ్రీవేంకటేశుడు ॥సర్వ॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఈ శ్రీహరి సర్వజీవులకు సులభముగా లభించు సర్వేశ్వరుడు. గర్వమును విడనాడి ఎవరు ఈయనను శరణు వేడితే వారికి ప్రత్యక్షమవుతాడు. ఈమాట సత్యం.

అన్ని విచారములు వుడిగిన(నశించిన) శ్రీపతియైన ఆ స్వామిలోనే ఆ భక్తుడుంటాడు. తెలివితేటలతో రహస్యపుటాలోచనలతో ఆయన్ని సాధించుదామనుకొంటే ఆస్వామికూడ పంతము వహిస్తాడు. విశ్వరూపుడయిన ఆయన చేయు వింతలకు అంతేమున్నది.

వెడకర్మాలు (తుచ్ఛమైన చేతలు) దోసితే (తొలగిపోతే) వానికి విష్ణుమూర్తియొక్క సన్నిధి లభిస్తుంది. అత్యధికమైన ఆశలనాదరించకుంటే ఆ దేవదేవుడు మనలనాదరిస్తాడు. ఒడలోముకొనకుంటే (తనదేహాన్ని రక్షించుకోవాలనే తపన లేకుంటే) ఆ ఉపేంద్రుడే (శ్రీహరి) రక్షిస్తాడు. పొడిబడకుంటేనే పూర్ణభావము కలుగుతుంది. (స్వార్థం లేకపోతేనే ఆ స్వామి పూర్ణానుగ్రహం కలుగుతుంది.

ప్రాపంచిక విషయముల నెఱుగని వానిని ఇందిరానాథుడైన నారాయణుడు మెచ్చుకుంటాడు. జంటగా స్త్రీ కావాలని, ఆమె బారిన బడని నిస్సంగునికి తనే జంటగా వెంటనుంటాడా శ్రీహరి. అపేక్షలేనివాని యెదుటనే శ్రీపతి నిలిచియుంటాడు. ఏడుకొండల యేలికయైన ఆ శ్రీవేంకటేశ్వరుడు ఇంద్రియములను జయించు వ్రత దీక్షగల వారికే దక్కుతాడు కాని, "మొక్కుబడి"గా ముడుపులు కట్టుకొనేవారికి కాదు. ఇది నిజం. మొక్కులతో ఐహిక కోర్కెలు తీరవచ్చుగాక!

## 4-29

## మున్నుడి

ఆకాశము తాకునంత ఎత్తుకెదిగిన హనుమంతుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. అంజనీసుతుడైన ఈ హనుమంతుడు మనోజ్ఞమైన మతంగ పర్వతంపై వెలసి దానవదమనుడై, స్వామికార్యసాధకుడై, సూర్యభగవానుని శిష్యుడై, శ్రీవేంకటేశ్వరుని కిష్టుడై ఈ భీకర ప్రతాపశాలి సీతాశోక వినాశకుడని దేవతలచే పొగడబడినాడు. ఈ మంజులమైన ఆంజనేయుని పద్మనయనుడైన తిరుమలేసుని జపిస్తున్నట్లు శ్రీరామజపముతో తన పెదవులు కదలించుచున్నట్లున్నాడు ఈ మారుతి.

**ఉ॥ అంజన సూనుడీ హనుమ అద్భుతరూపుని నిల్చి చూడరో**
**రంజితమౌ మతంగ గిరి రక్కసి మూకల జంపు వీరుడై**
**మంజుల మూర్తిగా వెలసె మారుతి గొల్వుడు అన్నమయ్యనెన్**
**కంజదళాయతాక్షు పనిగా యిట మ్రొక్కెడి బంటుతాననెన్.**

**రాగం : మిశ్రతిలంగ్**

అంజనాతనయుడైన హనుమంతుడు
రంజితపు మతంగ పర్వత హనుమంతుడు ॥అంజనా॥

రాకాసు నెల్లా గొట్టి రావణుని భంగపెట్టి
ఆకాశము మోచెనదే హనుమంతుడు
చేకొని యుంగరమిచ్చి సీతకు సేమము చెప్పె
భీకర ప్రతాపపు పెద్ద హనుమంతుడు ॥అంజనా॥

రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాడు హనుమంతుడు
స్వామి కార్యమునకే సరిబేరువద్దవాడు
ప్రేమముతో బూజగొనీ బెద్ద హనుమంతుడు ॥అంజనా॥



భావయామి వేంకటేశం

ఉదయాస్త శైలముల కొక్క జంగగా జాచి
అదె సూర్యుతో జదివె హనుమంతుడు
యెదుట శ్రీవేంకటేశుకిష్టుడై రామజపాన
బెదవులు గదలించీ బెద్ద హనుమంతుడు ॥అంజనా॥

**భావామృతం :**

అంజనీదేవి సుపుత్రుడైన ఈ హనుమంతుడు మనోజ్ఞమైన మతంగ పర్వతముపై నెలకొనియున్నాడు. ఈ స్వామిని సేవించండి.

ఈ ఆంజనేయుడు రాక్షసులందరిని చంపి రావణుని భంగపరచాడు. ఆకాశమంత యెత్తుకెదిగి నింగిని మోసినాడు. శ్రీరామముద్రికను సీతాదేవి కొసగి ఆమె క్షేమ సమాచారము శ్రీరామచంద్రునికి చెప్పిన అరి భీకర ప్రతాపశాలి ఈ పెద్ద హనుమంతుడు. ఈ మహానుభావుని అనుగ్రహమును పొందండి.

అర్ధరాత్రి పూట వాయువేగమున పయనించి ఆకాశమార్గమున సంజీవని పర్వతమును దెచ్చి రాముని మెప్పించి నేడు ఈ విధముగా ఇక్కడ ఆముకొని (వ్యాపించి) యున్నాడీ పవనపుత్రుడు. స్వామి కార్యము సాధించవలెనంటే ఇటువంటివాడు మరొకడు లేడని పేరుపొందినవాడీ అనిలాత్మజుడు. వాత్సల్యముతో ఇక్కడ తన భక్తుల పూజలను స్వీకరించుచున్నాడు.

సూర్యభగవానుని వద్ద వేదముల నభ్యసించుటకు ఆయన శిష్యుడై అద్వితీయమైన పెద్ద ఆకారము దాల్చి, తూర్పుకొండపై నొకకాలు పడమటి కొండపై నొకకాలు చాచియుంచి సూర్యగమనమునకు అనుగుణముగా తన శిరసును కదలించుచు ఒక దినములో వేదములను నేర్చిన బుద్ధిమంతుడు. మన యెదుట నున్న ఈయనే, తిరుమలరాయుడైన శ్రీవేంకటేశ్వరునికి ప్రీతిపాత్రుడై శ్రీరామనామజపము చేయుచున్నట్లు పెదవులు కదలించుచున్నాడు. ఈ పెద్ద హనుమంతుని చూడండి, సేవించండి ఆపై తరించండి.

## 4-30

### మున్నుడి

అద్భుతమైన శృంగార విరహగీతాన్ని ఆలపిస్తున్నారు. అన్నమయ్య. నాయిక (అలమేల్మంగమ్మ) తన బాధను వర్ణిస్తూ ఇంకా స్వామి రాడేలనే అని తన సఖియతో వాపోతున్నది. చల్లటిగాలి వేడిగావుందట. రాసిన కర్పూరము చందనము చల్లదనాన్నీయటంలేదు సరికదా! మండిస్తున్నాయట. అసలీ బ్రహ్మయ్యనాతో ఈ 'రాయడికి' ఎందుకు ముడిపెట్టాడో? కాయజుడు తానేల కసరీనే? అని విచారిస్తోంది. చేకొనిదె మన్నించె శేషాద్రి వల్లభుడు అన్నారు అన్నమయ్య. శేషాద్రి వల్లభుడు, శ్రీవేంకటేశ్వరుడైతే మకుటం వుండేదేమో? అనిపించింది.

**ఆ.వె॥ చల్లగాలి వేడి చల్లీనె, కర్పూర**
**మలయజము తనేల మండజేసె?**
**విరహబాధ వేగె వేంకటేశుని రాణి**
**అన్నమయ్య పాడె హరి మురియగ.**

### రాగం : యమన్ కళ్యాణ్

చలిగాలి వేడేల చల్లీనె కప్పురపు
మలయజము తానేల మండీనే ॥చలిగాలి॥

పాపంపు మనసేల పారీనే నలుగడల
చూపేల నలువంక జూచీనే
తాపంపు మేనేల తడవీనె పూవింటి-
తూపేల చిత్రంబు దూరీనే ॥చలిగాలి॥

వాయెత్తి చిలుకేల వదరీనె పలుమారు
కోయిలలు దామేల గొణగినే
రాయడికి నలులే (వే) ల రాసీనె మాతోను
కాయజుడు తానేల కసరీనే ॥చలిగాలి॥





ఏకాంతముననేల యెదురైతినే తనకు
లోకాధిపతికెల లోనైతినే
చేకొనిదె మన్నించె శేషాద్రివల్లభుడు
పైకొనిదె మమ్మేల పాలించెనే ॥చలిగాలి॥

### భావామృతం :

ఓ చెలియా! చలిగాలి వేడిగా మారిపోయి తాపము కలిగించుచున్నది. కప్పురపు మలయజము (కర్పూరం మిళితమైన చల్లని చందనము) నా శరీరాన్ని తనెందుకు మండిస్తోంది?

పాపపు ఆలోచనలతో నలిగిపోతున్న మనస్సు నలుగడల అన్నివైపులకు, పోరీనే (పోతున్నది). నా చూపులు నాలుగు దిక్కులను గాలిస్తున్నాయి. విరహ తాపముతో రగిలిపోతున్న నాశరీరం ఎందుకు నన్ను బాధిస్తున్నది? పూవింటి తూపు (మన్మథుని వింటినుంచి విడువబడిన బాణము) యేల చిత్తంబు దూరీనే (నా మనస్సును వేధిస్తున్నది?) చెలియా నాకేల ఈ వేదన?

అనేకమార్లు ఈ చిలుక, వాయెత్తి (గొంతెత్తి) వదరీనే (వాగుతూనే వున్నది). కోయిలలు అదే పనిగా 'కూ' యని గొణుగుతూనే వున్నాయి. మాతో ఈ రాయడికి (రాజుకి... లేక... స్వామికి) ఆ నలువ (బ్రహ్మదేవుడు) ఎందుకు రాసిపెట్టాడే? కాయజుడు తానేల కసరీనే (మన్మథుడు నాపై ఎందుకు ఆగ్రహిస్తున్నాడే?) ఆ సర్వేశ్వరుడు నన్ను నిలువనీయుటలేదు కదే!

సఖీ! తనకు (శ్రీవేంకటేశ్వరునకు) నేను ఒంటరిగా యెందుకు యెదురయ్యానే? సరే, ఎదురైనదానను ఎందుకు లొంగిపోయానే? పోనీ నేను లొంగిపోయానే? పోనీ నేను లొంగిపోయినా, ఆ శేషాద్రినాథుడు నన్ను ఆదరించి యెందుకు స్వీకరించాడే? స్వీకరించి యెందుకు పరిపాలిస్తున్నాడే? ఆ సర్వేశ్వరుడు నన్ను నిలువనీయుట లేదు కదే!

**4-31**

## మున్నుడి

ఆనాడు విశ్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మకు అర్జునుడు శరణన్నట్లే, సర్వేశ్వరుడు ఆర్తత్రాణ పరాయణుడునైన శ్రీమూర్తిని శరణు అంటున్నారు అన్నమాచార్యులవారు. వేయి శిరసులు, అనంతమైన బాహువులు గల వేదరక్షకుని ముగురయ్యల మూలపుటయ్యగా కీర్తిస్తున్నారు. మునులకు ఓంకార స్వరూపుడైన సురరక్షకుని విశ్వనేత్రుని, సచ్చిదానంద వినోదుని, పంచవింశతి ఆత్మతత్త్వాన్ని దాసులపాలిటి కరుణానిధి అంటున్నారు. ఈ విశ్వరూపుడే వరములనిచ్చే శ్రీవేంకటేశ్వరుడట...

**మ॥ శరణంటిన్ హరి! నీకు నేను యిటు వోసర్వేశ్వరా! మ్రొక్కెదన్**
**శరణంబొక్కటె దిక్కునాకు, కరియున్ సాధించె నీసత్ కృపన్**
**వరదా! వేంకటనాయకా! శరణునీపాదంబు అన్నయ్యనెన్**
**మురవైరిన్ కొనియాడు కీర్తనము శ్రీమూర్తిన్ భజించెన్ అహో!**

**రాగం : రామక్రియ**

శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ
శరణాగతే దిక్కు సామజవరదా ॥శరణు॥

వేయి శిరసులతోడి విశ్వరూపమా
బాయట నీ పరంజ్యోతి పరబ్రహ్మమా
మ్రోయుచున్న వేదముల మోహనాంగమా
చేయిచేత అనంతపు శ్రీమూరితి ॥శరణు॥

ముగురు వేలుపులకు మూలకందమా
వొగి మునుల ఋషుల వోంకారమా
పగటు దేవతలకు ప్రాణబంధుడా
జగమెల్లా కన్నులైన సాకారమా ॥శరణు॥





వెలయు సచ్చిదానంద వినోదమా
అలరు పంచవింశతి యాత్మతత్త్వమా
కలిగిన దాసులకు కరుణానిధీ
చెలగి వరములిచ్చే శ్రీవేంకటేశుడా ॥శరణు॥

**భావామృతం :**

ఓ సర్వేశ్వరా! నీకు శరణు. శరణు తండ్రీ! ఆనాడు అడవిలో గజేంద్రుని రక్షించిన వరదా! నీ శరణాగతే దిక్కునాకు. నిన్నే శరణు వేడుచున్నాను.

ప్రభూ! నీవు వేయి శిరసులున్న (లెక్కలేనన్ని తలలున్న) విశ్వరూపుడివి. పరంజ్యోతి స్వరూపుడవైన పరబ్రహ్మవు. వేదోద్ధరణ చేసి, మ్రోయుచున్న (రవళించు) ఆ వేదములకు తలమానికమైన వాడవై నిలిచితివి. అనంతమైన చేతులచేత శోభిల్లుచున్న శ్రీమూర్తివి. అట్టి విశ్వమూర్తినే శరణు వేడెదను.

ఓ పరాత్పరా! నీవు ముగ్గురు వేల్పులకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు) మూలకందానివి, (తల్లివేరు వంటివాడవు). మునులకు ఋషులకు శ్రేష్ఠమైన ఓంకారానివి. పగటు దేవతలకు ప్రకాశించుచున్న సురులకు అనేకమార్లు ప్రాణములు నిలిపిన ప్రాణబంధుడవు. నిన్ను సాకారునిగా (ఒక ఆకారము కలవానిగా) భావించినచో విశ్వమే నేత్రముగాగల అనంతరూపుడివి.

దేవా! నిరాకారునిగా నిన్ను భావించినచో నీవు సచ్చిదానంద వినోదుడివి. పంచవింశతి (ఇరువదియైదు) ఆత్మ తత్త్వములతో అలరారు విశ్వాత్ముడవు. అటువంటి నీ విశ్వరూపము చూడలేక (ఆనాటి అర్జునుని వలె) నీకు దాసోహం అని శరణు జొచ్చినవారిని కృపజూచు కరుణానిధివి. అంతేకాదు, చెలగి (విజృంభించి) వరములిచ్చి నీ భక్తును అనుగ్రహించుచున్న ఈ శ్రీవేంకటేశ్వరుడు కూడా నీవే.

**4-32**

## మున్నుడి

చక్కటి సంస్కృత కీర్తన నాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. 'జడము' అని పిలువదగిన ఈ సాంసారిక జగత్తు అతి రహస్యమైనది. దీనిలో నేను కర్మప్రేరితుడనై చరించుచున్న ప్రాణిని. ఓ పద్మదళాయతాక్షా! శ్రీహరీ! జడరూపమైన ప్రపంచానికి ఆశ్రయ భూతుడవైన సర్వేశ్వరా! నీకు వందనములు అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఆచార్యులవారు వాడిన 'సింధు రహితాయ' అనే విశేషణాలు అర్థం కావాలంటే భావామృతం చదవాల్సిందే మరి...

**కం॥ జడమతిరహస్యమగునట**
**కదు ప్రేరితుడై చరించు కర్మలచేతన్**
**అడగితి జడ జగమందున**
**పడిపెట్టెను అన్నమయ్య వందనము హరీ!**

**రాగం : మోహన**

జడమతి రహం కర్మజంతు "రేకోఽహం"
జడధి నిలయాయ నమో సారసాక్షాయ ॥జడమతి॥

పరమ పురుషాయ నిజభక్తజన సులభాయ
దురితదూరాయ సింధు రహితాయ
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో ॥జడమతి॥

నగసముద్ధరణాయ నందగోపసుతాయ
జగదంతరాత్మాయ సగుణాయ
మృగనరాంగాయ నిర్మిత భవాండాయ ప-
న్నగరాజు శయనాయ నమో నమో నమో ॥జడమతి॥





దేవదేవేశాయ దివ్యచరితాయ బహు-
భావనాతీతాయ పరమాయ
శ్రీవేంకటేశాయ జితదైత్య నికరాయ
భూవల్లభాయ నమో పూర్ణకామాయ ॥జడమతి॥

**భావామృతం :**

సారసాక్షుడవైన (పద్మదళనేత్రుడవైన) ఓ శ్రీహరీ! జడమతి రహం (జడము అని పిలువబడే ఈ సాంసారిక జగత్తు అతి గోప్యమైనది) ఇందులో నేను కర్మప్రేరితుడనై చరించు ప్రాణిని. జడరూపమైన ప్రపంచానికి ఆశ్రయభూతుడవైన దేవా! నీకు వందనములు.

ఓ దేవా! నీవు పరమపురుషుడవు. నిజమైన నీ భక్తజనులకు సులభముగా స్వాధీనమగు వాడవు. వారి పాపములనన్నింటిని నిర్మూలింపగలిగినవాడవు. సింధురహితుడవు అనగా సముద్రమును నిర్మూలించెదనని (శోషించెదనని) ప్రతిన పూనినవాడవు (శ్రీరామావతారంలో). నరకాసురుని అంతమొందించిన శ్రీకృష్ణుడవు. శ్రీమన్నారాయణుడవు. ప్రభూ! నీవు 'మురి' అను దానవుని హరించినవాడవు. అటువంటి నీకు అనేక వందనములు.

ఓ దేవదేవా! నీవు నగ సముద్ధరణ చేసిన వాడవు (కూర్మమై మంధరగిరి నెత్తిన వాడవు). నందగోపుని బిడ్డవు. ఈ జగత్తునకు అంతరాత్మ రూపుడవు. సుగుణములన్నీ రూపుదాల్చినవాడవు. మృగనరాంగములు గలవాడవు. (నరసింహుడవు). భవము (ప్రపంచము) అండరూపంలో పొదిగినవాడవు. పన్నరాజైన ఆదిశేషునిపై పవ్వళించియుండువాడవు. అట్టి నీకు అనేక వందనములు.

ప్రభూ! దేవదేవులని పిలువదగ్గవారికి నీవు ఈశ్వరుడవు. దివ్యమైన చరిత్రగలవాడవు. అనేకమైన భావనలచేత కూడ వివరింప శక్యము కాని వాడవు. సర్వశ్రేష్ఠుడవు. స్వామీ! నీవు శ్రీవేంకటేశ్వరుడవు. దైత్యగణములను జయించినవాడవు. భూదేవీవల్లభుడవు. పూర్ణకాముడవు, (కోరికలన్నీ సిద్ధించినవాడవు). అట్టి పరమాత్మవైన నీకు అనేక నమస్కారములు.

**4-33**

## మున్నుడి

శ్రీరామచంద్రమూర్తి నిండు సభ దీర్చియున్నాడు. ఆ కొలువులో సముఖంబుననే (యెదురుగానే) అదే అందరినీ చిత్తగించుచున్న (యోచించుచున్న) ఆ సార్వభౌముని సభ ఎట్లా వున్నదో కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. విని (చదివి) తరించండి. అన్నమయ్య మాత్రమే భావించగల నారద, రంభాదులు కొలువులో వుండటం, కుశలవులు 'వినుదు వినుదు రామాయణ గాథా' అని పాడటం యెంత అబ్బురమో కదా! కౌసల్యా గర్భరత్నాకర అని ఆ వేంకటరామయ్యగారిని కీర్తిస్తున్నారు...

**ఆ.వె॥ రఘుపతి! అవధారు రక్షింపుమందరిన్**
**నిండు కొలువునందు నీదు జనుల**
**చిత్తగించు మొఱలు చెప్పెరా అన్నయ్య**
**కనుల రామసభను కట్టె సుండి!!**

**రాగం : లలిత**

అవధారు రఘుపతి యందరిని జిత్తగించు
యివల నిండె గొలు విదె నదె సముఖా ॥అవధారు॥

రామరాఘవ రామభద్ర రామచంద్ర
శ్రీమదయోధ్యాపతి సీతాపతి
ప్రేమనారదుడు వాడీ బెక్కురంభాదులాడేరు
మోమెత్తి కపులెల్లా మొక్కెరదివో ॥అవధారు॥

ఘనవంశ కులజాత ఇక్ష్వాకు తిలకా
ఘనదశరథ సుత కౌశిక ప్రియ
మునులు దీవించేరు ముందుటా భరతుడదె
వెనక లక్ష్మణుడు సేవించీ వింజామర ॥అవధారు॥





కందువ గౌసల్యా గర్భ రత్నాకర
చెందిన శ్రీవేంకటాద్రి శ్రీనివాసా
సందడి గుశలవులు చదివేరు వొకవంక
చెంది నీరాజసము చెప్పరాదు రామా ॥అవధారు॥

**భావామృతం :**

రఘుకులపతివైన ఓ శ్రీరామచంద్రా! అందరిని చిత్తగించి (మొఱలను విని, లేక, ఆలోచించి) అవధారు (సావధానుడవగుము). ఇవల (ఈ ప్రక్క) ఇదే కొలువు నిండె (నీ సభ అంతా నిండిపోయింది). అదే సముఖ (అదిగో యెదురుగా) దర్శనమిచ్చుచున్నది ప్రభూ!

ఓ రాఘవా! రామభద్రా! రామచంద్రా! రామా! శుభప్రదమైన అయోధ్యాధినాథా! ప్రేమాస్పదయైన జానకీ వల్లభా! అదిగో వాడే నారదమహాముని. వారే రంభాది దేవనర్తకీ మణులు యెందరో నర్తించుచున్నారు. మోమెత్తి కపులెల్లా మొక్కేరదివో. (అంటే... నరుల మధ్య మేము వానరులుగా వున్నామే, అని మొగమాట పడుతూ వానర శ్రేష్ఠులంతా వినయంగా మొక్కుచున్నారు. అదిగో అని అర్థం)

ప్రభూ! నీవు సూర్యవంశ సంజాతుడవు. ఇక్ష్వాకుల తిలకుడవు. ఘనుడైన దశరథనందనుడవు. విశ్వామిత్రుని ప్రియశిష్యుడవు. ఎంతమంది మునులు నిన్ను దీవిస్తున్నారో చూడవయ్యా! అదిగో ఆ ముందర నిలుచున్నవాడే నీకు ప్రియాతి ప్రియమైన తమ్ముడు భరతుడు. నీ వెనుక వింజామరతో వీచుచూ సేవించుచున్నవాడే లక్ష్మణుడు.

శ్రీరామా! నీవు ప్రసిద్ధుడవైన కౌసల్యా గర్భరత్నాకరుడవు. (రత్నాకరుడంటే... అనేక రత్నాలకు నిలయమైన సాగరుడవు). శ్రీవేంకటాద్రికి చెందిన శ్రీనివాసుడు కూడా నీవే ప్రభూ! అదిగో సందడి చేయుచూ శ్రీరామాయణ గాథను గానం చేయుచున్న నీ కవల పుత్రులు కుశలవులు యొకవంక యెంత అందంగా వున్నారో చూడు. ఇక నీ ఠీవి, నీ రాజసము, నీవైభవము వర్ణించుట నావల్ల అయ్యే పనియేనా? నిజానికి ఎవరివల్లాకాదు. ఆ రఘుపతిని శరణని భావించండి... మనో నేత్రంతో తిలకించండి.

**4-34**

## మున్నుడి

పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడు అనేక సందర్భాలలో అనేక రథములనెక్కి తన ఆశ్రితుల మనోరథం చెల్లించాడు. అదిగో ఆ కనబడుతున్న దేవ దేవుని రథం ఆ సందర్భాలను అన్నమాచార్యులవారికి గుర్తుచేసి ఈ అద్భుత కీర్తనకు మూలమయిందేమో అనిపిస్తోంది. మన పురాణాలమీద అన్నమయ్యకు ఎంత పట్టువున్నదో ఈ కీర్తన తెలుపుతున్నది. దురదృష్టమేమంటే... మనకి ఇతిహాసాలపై పట్టుపోయింది, తెలుగు వ్యాకరణంపై పట్టుపోయింది, తెలుగు భాషపై పట్టుపోయింది, భక్తిపై పట్టుపోయింది.... ఇక దిక్కెవరు? ఆ ఏడుకొండలవాడే...

**చం॥ కనుడదె దేవదేవుడటు గారవమొప్పగ నెక్కు తేరు మీ**
**మనముల కోర్కె తీరు కద! మా సరివారలు పుల్కరించగా**
**ఘనపు రథోత్సవం బటుల కన్నుల గట్టెను అన్నమార్యుడున్**
**వినుడిది క్లిష్ట కీర్తనము వేంకటనాథుడు మెచ్చుదీనినిన్**

**రాగం : అఠాణా**

దేవదేవుడెక్కెనదె దివ్యరథము
మావంటి వారికెల్ల మనోరథము ॥దేవ॥

జగతి బాలులకై జలధులు వేరజేసి
పగటున దోలెనదె పైడి రథము
మిగులగ గోపగించి మెరయు రావణుమీద
తెగియెక్కితోలేనదె దేవేంద్ర రథము ॥దేవ॥

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకు
బక్కన మరలిచె బుష్పక రథము
నిక్కి నరకాసురుపై నింగి మోవనెక్కితోరె
వెక్కసపు రెక్కలతో విష్ణురథము ॥దేవ॥





బలిమి రుక్మిణి దెచ్చి పరుల గెలిచి యెక్కె
అలయేగు బెండ్లి కల్యాణరథము
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలు మంగగూడి
కల(లి)కాలమును నేగె ఘనమైన రథము ॥దేవ॥

**భావామృతం :**

అదిగో... దేవదేవుడెక్కిన ఆ దివ్యరథమును చూడండి. మావంటి వారికి (శరణాగతినొందిన భక్తులకు) యెల్లరకు అది మనోరథము (మనస్సులలోని కోర్కెలను తీర్చునదై యున్నది).

అనాది కాలంలో శ్రీమన్నారాయణుడు ఈ ప్రపంచాన్ని వేరుజేసి మహా సముద్రముల నెల్లలుగా వేర్పరచి, ఈ జగతిని పాలించమని అనేక పాలులకు (పరిపాలకులకు) ఒప్పజెప్పాడు. అప్పుడాయన ఒక దివ్య సువర్ణరథమెక్కి పగటున (దేదీప్యమానముగా) తోలినాడు. అదిగో ఆ సువర్ణ రథాన్ని (మీ మనోనేత్రంతో) దర్శించండి. అదిగో రామరావణ యుద్ధం జరుగుతోంది. మొదటిరోజు ఓడిపోయి నిర్వీర్యుడై ప్రాణదానం పొందిన రావణుడు మరునాడు దివ్యమైన రథమునెక్కి విపరీతమైన క్రోధంతో జ్వలిస్తూ వచ్చాడు. దేవేంద్రుడు మాతల్లి తోలుతున్న దివ్య రథాన్ని శ్రీరామచంద్రుని కోసం పంపించాడు. ఆయన విన్నపం మన్నించి ఆ దేవదేవుడు ఆ రథమెక్కి రావణ సంహారం చేశాడు. అదే... ఆ రథం.

దిక్కులు సాధించి (దుష్ట శిక్షణ చేసి త్రిలోక విజేతయై) శ్రీరాముడు సీతాదేవితో తిరిగి అతి త్వరగా అయోధ్య చేరుటకు పుష్పక విమానం యెక్కి కపిసేనతో, విభీషణాదులతో బయలుదేరాడు. అది రథమువలె అలంకరింపబడిన పుష్పక రథము. నిక్కిన (గర్వించిన) నరకాసురుని చంపుటకు సత్యభామతో, వైకుంఠమునుండి వచ్చిన విష్ణు రథాన్ని యెక్కాడు. శ్రీకృష్ణపరమాత్మ. దారుకుడుతోలే ఆ రథమును సత్యభామ తోలి శ్రీకృష్ణుని విజయానికి తోడ్పడింది. అదే.. వెక్కసపు రెక్కలతో (దుస్సాహమైన రెక్కలతో ఎగుర గలిగిన) ఆ రథం.

ఇక ఆ కళ్యాణ రథాన్ని చూడండి. బలవంతంగా రుక్మిణిని తెచ్చి శత్రువులను చిత్తుగా ఓడించి అతివేగంగా ద్వారకవైపు దూసుకుపోతున్న శ్రీకృష్ణమూర్తి పెండ్లి రథం అదే. దానిని ఈసారి రుక్మిణీదేవితోలింది. మరి ఈనాడు తిరుమలలో, కల(లి) కాలంలో అంటే కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడు తనదేవేరి అలమేలు మంగతో ఎలమి (సంతోషముతో) యేగుచున్న ఘనమైన రథమును తిలకించండి. తరించండి.

**4-35**

## మున్నుడి

వేదాంతమును అతి తేలిక భాషలో వివరిస్తున్నారు. అన్నమాచార్యులవారు. ఏడు జానెలు మాత్రం పొడవుండే ఈ మానవదేహం ఎంత విచిత్రమైనది! దీనికి తోడైన నా మనస్సు తృప్తితో నిండనే నిండదు. నాపాపము పండనే పండదు. నేనేం చేయగలను? నా వయస్సుని పట్టి యుంచలేను. నా కోపాగ్నిని ఆర్పలేకున్నాను. నా కాలాన్ని తెలిసికోలేను. మరి నాకేది దారి? నీ గాథలు వింటూ నిన్నే ధ్యానిస్తూ నా శేష జీవితాన్ని గడిపేస్తాను అంటున్నారు అన్నమయ్య.

**ఉ॥ జానెలు యేడు దేహమిది జాడనెరుంగను దీని నైజమున్**
**ౖమానులవంటి పాపములు పండవు, కోపము నార్పజాలరా**
**కానగ నాదు కాలమును కాదుర సాధ్యము అన్నమయ్యనెన్**
**సోనల బుట్టు సుద్దులివి సుందర శ్రీగిరి వేంకటేశ్వరా!**

**రాగం : పాడి**

ఏడే జేనలు యీ దేహంబును
యేడా నిక మరి యెరగము నేము ॥ఏడే॥

నిండును జలధులు నిముషమాత్రమున
నిండియు నిండదు నెటి మనసు
పండును భువిగల పంటలన్నియును
పండదు నాలో బాపపు మనసు ॥ఏడే॥

పట్టవచ్చు నల పారేటి పామును
పట్టరాదు నాపాయము
అట్టే ఆరును అనలము నీటను
యెట్టైన నారదు యీకోపంబు ॥ఏడే॥



భావయామి వేంకటేశం

కానవచ్చు నదె ఘన పాతాళము
కానరాదు నాకాలము
శ్రీనగ విహార శ్రీవేంకటేశ్వర
సోనల బుట్టిన సుద్దులు నివిగో ॥ఏడే॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఈ మానవ దేహమున్నదే... దాని పొడవు ఏడు జానెలు మాత్రమే. నేము (మేము) మరి యేడా (యెక్కడా) ఇక యెరుగము (దీని తత్త్వమును తెలియుము).

ఈ దేహానికి ఒక మనస్సు జతగా వుంటుంది. మహాసాగరములైనా నిముషంలో నిండుతాయేమో కాని ఈ మనస్సు మాత్రం నిండికూడా నిండదు. (తృప్తి చెందదు). ఈ భూమిపైనున్న పంటలన్నీ పండుతాయేమో కాని నా మనసులోని పాపము మాత్రం పండనే పండదు.

చకచక పాకుతూ పారిపోతున్న పామును అవలీలగా పట్టవచ్చును. కాని నా పాయము (వయస్సు) ను మాత్రం పట్టలేము. ప్రతిదినము నా వయస్సు ఒకరోజు పెరుగుతోంది. (నా ఆయువు ఒకరోజు తరుగుతోంది). అనలము (అగ్ని) నీటితో ఇట్టే ఆరిపోతుంది. కాని నా కోపాగ్ని మాత్రం ఏ విధముగానూ ఆరనే ఆరుటలేదు.

చొరరాని ఘనమైన పాతాళ లోకమును జొచ్చి కానవచ్చునేమోకాని రాబోయే నాకాలమును మాత్రం కానలేకున్నాను. శ్రీనగము అని పిలువబడే తిరుమల కొండపై విహరించు శ్రీవేంకటేశ్వరా! సోనలబుట్టిన సుద్దులు నివిగో. (వర్షములవలె పుట్టిన నీ పురాణగాథలు ఇవిగో) ఎన్ని విన్నాను, ఎన్ని కన్నాను. ప్రభూ! నీ మహిమలు అనంతం.

## 4-36

## మున్నుడి

అద్భుతమైన ఈ కీర్తనలో శ్రీవేంకటేశ్వరుని సన్నుతిస్తున్నారు అన్నమాచార్యులవారు. సన్నుతి రూపంలో తిరుమలేశుని సేవించడం తరించటానికి అత్యంత సులభోపాయము. మనం కీర్తి ప్రతిష్ఠలున్నవారిని మా బంధువులని చెప్పుకొని సంతోషిస్తుంటాం, తృప్తిజెందుతుంటాం. వారు మనకు ఆపదలో సహాయం చేస్తారనే నిబ్బరంతో వుంటాం. సుఖంగా వుంటాము. కాని అది నిజమైన సుఖం కానేకాదు. మనం ఆ శ్రీపతివారము అనుకోవటమే నిజమైన సుఖం అంటున్నారు అన్నమయ్య.

**ఆ.వె.॥ ఇతర దేవతలకు ఇదిగలదా హరీ!**
**మారు ఏది నీ ప్రభావమునకు**
**నిజ సుఖంబొకటియె నీవారమనుటయే**
**అన్నమయ్య పలుకునదియె నిజము.**

**రాగం : ఆరభి**

ఇతర దేవతల కిది గలదా
ప్రతివేరీ నీ ప్రభావమునకు ॥ఇతర॥

రతిరాజజనక రవిచంద్రనయన
అతిశయ శ్రీవత్సాంకుడవు
పతగేంద్ర గమన పద్మాసతీపతి
మతి నిను దలచిన మనోహరము ॥ఇతర॥

ఘన కిరీట ధర కనకాంబర పా-
వన క్షీరాంబుధి వాసుడవు
వనజ చక్రధర వసుధావల్లభ
నిను బేరుకొనిన నిర్మలము ॥ఇతర॥





దేవపితామహ త్రివిక్రమ హరి
జీవాంతరాత్మక చిన్మయుడా
శ్రీవేంకటేశ్వర శ్రీకర గుణనిధి
నీవార మనుటే నిజసుఖము ॥ఇతర॥

**భావామృతం :**

ఓ దేవదేవా! అన్యదేవతలకు ఇది (నీయొక్క ఘనత) కలదా? నీ ప్రభావమునకు ప్రతివేరీ (సమానమైన ఇంకొకరు, యెక్కడ వున్నారు?) లేనేలేరు ప్రభూ!

ఓ రతిరాజ జనకా! (మన్మథుని తండ్రీ!) సూర్యచంద్రులు కన్నులుగాగల దేవా! శ్రీవత్సము అను పుట్టుమచ్చతో శోభిల్లువాడా! పతగేంద్ర గమన (పక్షిరాజయిన గరుత్మంతునిపై) పోవువాడా! పద్మావతీ దేవి మనోవల్లభా! నిన్న ధ్యానించుటకన్న మనోహరమైన దింకొకటి లేనేలేదు.

ఘనమైన కాంతులు వెదజల్లు కిరీటమును ధరించు శ్రీనివాసా! బంగారు పీతాంబరమును కట్టి శోభిల్లు దేవా! పుణ్య నిలయమైన క్షీరసాగర వాసా! ఒకచేత పద్మమును వేరొకచేత సుదర్శన చక్రమును ధరించు శ్రీమన్నారాయణా భూదేవి వరించిన విష్ణుదేవా! నిన్ను పేరుకొనిన (కీర్తించిన) మా మనస్సే కాక మేము కూడ నిర్మలమై నీదయ పొందుటకు అర్హత సంపాదిస్తాం.

ప్రభూ! నీవు దేవపితామహుడవు (దేవతలను సృజించిన బ్రహ్మగారు వారి తండ్రి అయితే బ్రహ్మగారి తండ్రి వారికి పితామహుడే కదా!) త్రివిక్రముడని కీర్తింపబడిన వామనమూర్తివి, శ్రీహరివి, సర్వజీవులకు అంతరాత్ముడవై వారి ప్రాణప్రతిష్ఠ చేయువాడవు, చిదానంద స్వరూపుడవు. శ్రీవేంకటేశ్వరుడవు, మంగళ ప్రదమైన సద్గుణములు నిధివలె కలవాడవు. మాకు నిజమైన సుఖం ఏమిటంటే నీవారము అనే విశ్వాసంతో, నీవిచ్చిన ఈ జీవితాన్ని నీవు సంతోషించునట్లు నీవు పిలిచేదాక గడుపుటయే. మరొకటి లేదు.

## 4-37

## మున్నుడి

సంస్కృతాంధ్రములు రెండూ సరిగా రాని నాబోటి సామాన్యునికే అన్నమాచార్యులవారి కీర్తనలు ఇంత ఆనందం కలిగిస్తుంటే...పండితులు, భాషా కోవిదులు, పురాణ వాఙ్మయము తెలిసినవారు ఇంకెంత రసాస్వాదన చేసి వుంటారో కదా! అనిపించి.. ఆ అదృష్టం నాకు లేనందుకు విచారము... పోనీలే గుడ్డిలో మెల్ల అనే వూరట కలుగుతాయి. నా వివరణ సరిగా అన్నమయ్య మనోగతం కాకపోవచ్చును. శ్రీవేంకటేశ్వరా! భావయామి... కేవలం నేను భావిస్తున్నాను. అసలు నిజం నీకే తెలియాలి. అన్నమయ్యకీ వూహనిచ్చింది నీవేగా...

**ఆ.వె॥నాటి బాలుడితడు నందగోప సుతుండు**
**నందవ్రజములోన నయము మీర**
**పెరిగినాడు నేడు వేంకటరమణుడు**
**అన్నమయ్య భాష అంత సులువె?**

**రాగం : బౌళి**

నందగోప నందనుండే నాటి బాలుడు
ఇందు నేడే రేపల్లె నేచి పెరిగెను ॥నంద॥

పువ్వువంటి లేత మఱ్ఱియాకు పొత్తి బవళించ నేర్చె
యెవ్వడో కాని తొల్లియీ బాలుడు
మువ్వంక వేదములను ముద్దుమాటలాడ నేర్చె
యెవ్వరూ గొంత నేర్ప నేటికీ వీనికి ॥నంద॥

తప్పటడుగుడు లిడగనేర్చె ధరణియందు నాకసమున-
నెప్పుగా రసాతలమును నొంటి తొల్లియే
రెప్పలెత్తి చూడనేర్చె రేసీ జెంద్రునందు పగలు
గొప్ప సూర్యునందు నింక గొత్తనేర్పనేటికి ॥నంద॥





మంచి వెన్నబువ్వలిపుడు మలసియారగించ నేర్చె
నంచితముగ శ్రీవేంకటాద్రి మీదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కౌగిలించనేర్చె
దించరాని వురముమీద దివ్యకాంతను ॥నంద॥

**భావామృతం :**

ఓ భక్తులారా! ఈ బాలుడెవరనుకున్నారు? నేడు ఇతను నందగోప నందనుడే. ఇందు (ఇక్కడ) రేపల్లెలో (నందవ్రజమున) యేచి పెరిగెను (చక్కగా పెరుగుచున్నాడు) కాని వీడు "నాటి బాలుడు" పురాణ పురుషుడు.

తొల్లియెప్పుడో (సృష్టి ఆరంభంలో) వీడు పువ్వువంటి లేతమఱ్ఱి ఆకుపై పొత్తిళ్ళలో పడుకొన్నట్లు పవ్వళించి యున్నాడు. వీడు ముద్దు ముద్దుమాటలు పలుకగానే అవే మువ్వంక వేదములైనవి, (ఋక్, యజుర్, సామ వేదములు). అటువంటి వీనికి ఇంకా ఎవరో కొంత నేర్పవలెనా? యేటికి? (ఎందుకు?) వీడే వేదమూర్తి, వేద నిలయుడు.

ఇక కృతయుగం వచ్చేసింది. దుష్ట దానవులు తొల్లి త్రిలోకముల నాక్రమించి, దేవతలను స్వర్గం నుంచి వెళ్ళగొట్టారు. వీడు తప్పటగుడులు వేయటం నేర్చుకొని (వామనమూర్తియై) ఒంటి (ఒంటరిగా) భూమండలాన్ని ఒక అడుగుతోను, ఆకాశము (స్వర్గము మరియు ఊర్ధ్వలోకములు) ఇంకొక అడుగుతోను. రసాతలమును మూడవ అడుగుతోను ఆక్రమించి బలిచక్రవర్తి నుంచి దానం పుచ్చుకొని అతన్ని రసాతలంలో వుండమని నియమించాడు. ఆ దేవదేవుడు రెప్పలెత్తి చూడగా ఒక కన్ను పగలు కలిగించే గొప్ప సూర్యునిగాను, ఇంకొక కన్ను రేచీ (రాత్రి) వెలిగించు చంద్రునిగాను తోచినవి. అటువంటి వీనికి కొత్తగా తెలియవలసిన వేముంటాయి?

ఇదిగో, ఇప్పుడు వేంకటాద్రి మీద ఆ బాలుడే అంచితముగా (పూజనీయుడై) మంచి వెన్నబువ్వ, మలసి యారగించె (పూనుకొని నైవేద్యము స్వీకరించుచున్నాడు). ఆ తరువాత ఈ శృంగారరాయుడు యెంచి తన దేవేరులనెంచుకొని అప్పలప్పనుచు (లొట్టలు వేయుచు) వారిని యెనసి (పొంది) కౌగిలించుట నేర్చినాడు. తన వురము మీద (హృదయముపై) దించరాని దివ్యకాంతను (శ్రీదేవిని) నిలుపుకొనినాడు. వీడే శ్రీవేంకటేశ్వరుడు.

## ముున్నుడి

చక్కటి హితబోధ చేస్తున్నారు అన్నమయ్య. 'వెగ్గలము' అంటే అధికము అని అర్థం. ఇంత వెగ్గలము చేయకు అంటే ఇంత ఎక్కువ తపన వద్దు అని. మనం అనుకొన్నది నెరవేరాలనే 'యావ'తో మానవుడు తగ్గివుండి, దీనుడై పరులముందు చేయి జాచి వేడుకొంటాడు. అటువంటి వాడు జీవితాంతం అడుక్కుతింటూనే వుంటాడు. అట్లా బ్రతకటంలో ఏం ఆనందముంది? అది వృథా. మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తే ఇదంతా ఆ తిరుపతయ్య మాయకాక మరేమిటి? మురారిని శరణని మోక్షం పొందండయ్యా! అంటున్నారు.

**ఉ॥ ఇంతటి వెగ్గలంబు మనకెందుకు? వ్యర్థము వ్యర్థమౌనురా**
**అంతములేని దైన్యమున అన్యుల ముంగిట చేయి జాచగా**
**సంతసమౌనె దేనికది? చక్కగ మోక్షము నిచ్చు విష్ణువే**
**వంతను అన్నమయ్య ఇక వద్దని వేంకటనాధు మ్రొక్కనెన్.**

**రాగం : నాగవరాళి**

వెగ్గలమింతా వృథా వృథా
తగ్గి పరులతో దైన్యము లేలా ॥వెగ్గల॥

పెంచగ బెంచగ పెరగీ నాసలు
తుంచగ దుంచగ దొలగు నవి
కంచము కూడును కట్టిన కోకయు
వంచన మేనికి వలసినదింతే ॥వెగ్గల॥

తడవగ దడవగ దగిలీ బంధము
విడువగ విడువగ వీడునవి(ది)
గుడిసెలోన నొక కుక్కి మంచమున
వొడలు సగమునను వుండెడిదింతే ॥వెగ్గల॥





మరవగ మరవగ మాయలే యింతా
మురహరుదలచితే మోక్షము
నిరతి శ్రీవేంకటనిలయుడే కాయపు
గరిమెల నిలచిన కాణాచింతే ॥వెగ్గల॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఇంతటి దైన్యంతో పరులను యాచిస్తూ, తగ్గి వారిముందు చేతులు, జాచుచూ బ్రతుకుట దేనికి? ఇంతటి 'వెగ్గలము' (అధికమైన యావ) వ్యర్థము వ్యర్థము. అవునా?

ఈ ఆశలు వున్నాయి చూశారా? ఇవి ఎన్నటికీ తగ్గవు. పెంచగా పెంచగా పెరుగుతూనే వుంటాయి. అయితే కిటుకేమిటంటే అవి తుంచగా తుంచగా లేకుండా తొలగిపోతాయి. కంచం నిండా కూడు, కట్టుకోడానికో గుడ్డ – కావలసినదింతే కదా? వంచనమేనికి (మోసము దేనికి), నీ వెంట తీసుకుపోయేదేముంది?

తడవగ, తడవగ (విచారించినకొద్దీ) నావాళ్ళనే బంధాలు తగులుకొనేవే కానీ తొలిగిపోయేవి కావు. అయితే విరక్తితో విడువగా, విడువగా విడిపోతాయి. నీవు ముసలివాడివై చావుకి ఎదురుచూస్తూ ఒక కుక్కి మంచంలో, వొడలు (శరీరం) సగమైపోయి బ్రతకాల్సి వస్తుంది. ఉండేదింతే (జరిగేది ఇంతే). మరి దేనికోసం ఈ తాపత్రయం?

మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తే ఇదంతా మాయలే అని తెలుస్తుంది. దీనినుంచి ఇక ముక్తి ఎప్పుడు? ఆ మురహరిని శరణంటే మోక్షము దక్కుతుంది. ఎందుకంటే... ఆయన ఎక్కడనో వేరొకచోట లేడు. శ్రీవేంకటేశ్వరుడై మనకాయపు గరిమల (శరీరధారియైన ఘనుడై, ఆత్మరూపుడై) నిలచిన కాణాచియై (చిరకాల వాస్తవ్యుడై), నిరతితో (మిక్కిలి ఆసక్తితో) వున్నాడు.

**4-39**

## మున్నుడి

అత్యద్భుతమైన కీర్తనరూపంలో అలమేల్మంగమ్మ తన చెలికత్తెతో 'ఆయన ఇంకా రాదేమిటో' అని వాపోతున్నది. వాడెటువంటి వాడో తన చెలియకు వివరిస్తోంది. అన్నమాచార్యులవారి ఈ కీర్తన వింటే ఆయనకు పురాణ వాఙ్మయం మీద యెంత "పట్టు" వున్నదో అర్థమవుతుంది. నా భావామృత వివరణలో సాధ్యమైనంత వివరణ, ఇచ్చాను కాని నేటి యువతరానికి ఈ వివరణ 'మార్జాలం' అంటే 'బిడాలము' అని వివరించినట్లే అవుతుందేమో... అని నా అనుమానం. నా ప్రయత్నం నేను చేశాను. ఆపై... ఆపైవాడిదయ.. అంతే.

**తే॥ ఏలరాదమ్మ ఇంతిరో! యేలనన్ను**
**వాడు నన్నేలువాడమ్మ! వల్లభుండు**
**అన్నమార్యుని కీర్తన అద్భుతంబు**
**పుణ్యగాథలు జ్ఞప్తిలో పొరలజేయు.**

**రాగం : భైరవి**

ఏలరాదమ్మ ఇంతిరో వా-
దేల రాదమ్మ నన్నేలినవాడు ॥ఏల॥

పచ్చని పులుగుల బండి మీదనుండు-
పచ్చవింటి పిన్నబాలుని తండ్రి
పచ్చని చాయల బాయని బంగారు-
పచ్చడము గట్టి(న) బాగైన వాడు ॥ఏల॥

తెల్లని పులుగుపై దిరుగ మరిగినట్టి
తెల్లని సతిపాలిదేవర తండ్రి
తెల్లని పరపుపై దేలి పొరలు వెట్టు-
తెల్లని కన్నుల తెలివైన వాడు ॥ఏల॥





కొండవింటి వాని గుత్త గొనినయట్టి-
కొండుక పాయపు గూతురు తండ్రి
కొండరాయుడు కోనేటి తిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైన వాడు ॥ఏల॥

**భావామృతం :**

ఓ భామినీ! వాడు (నా హృదయేశ్వరుడైన శ్రీనివాసుడు) ఏల రాదమ్మా? (ఎందుకని వచ్చుటలేదు?) నన్నేలినవాడు (నాభర్త) ఏలరాదమ్మా? (నన్ను కైవసం చేసికొని పరిపాలించుటకు రాదేమి?)

వాడెవరనుకొన్నావు? "పచ్చని పులుగుల బండిమీద నుండు, పచ్చవింటి పిన్న బాలుని తండ్రి" - ఆకుపచ్చని చిలుకలు లాగుచున్న రథమునెక్కి పోవు చెఱకు వింటి చిన్నవాడైన మన్మథుని తండ్రి శ్రీమన్నారాయణుడు. "పచ్చని చాయలు బాయని బంగారు పచ్చడము గట్టిన బాగైనవాడు" - పసుపు, పచ్చని రంగుతో మెఱయుచున్న బంగారు వస్త్రము (పీతాంబరము) కట్టిన సర్వశ్రేష్ఠుడు.

"తెల్లని పులుగుపై దిరుగ మరిగినట్టి తెల్లని సతి పాలిదేవర తండ్రి" - తెల్లని రాజహంసపై తిరుగుటకు అలవాటు పడిన తెల్లని సరస్వతీ దేవి నాథుడైన చతుర్ముఖ బ్రహ్మ యొక్క తండ్రి (శ్రీహరి). "తెల్లని పరపుపై దేలి పొరలువెట్టు తెల్లని కన్నుల తెలివైనవాడు"- తెల్లని ఆదిశేషుడే పరపుగా తెల్లని పాలసముద్రంపై తేలి పొర్లుతుండే శేషశయనుడై తెల్లని కనులుగల తెలివైన శ్రీ విష్ణుమూర్తి. (తన తెలివితో ఆ స్వామి తెలివిగా వరాలు నలువచే పొంది, తొలగని చావుని వలదనుకొనే అతి తెలివి అసురుల ఉసురులు తీసే తెలివైనవాడు).

"కొండలవింటి వాని గుత్తగొనినయట్టి కొండొక పాయపు కూతురు తండ్రి" - మేరు పర్వతాన్ని ధనస్సుగా చేసికొని త్రిపురాసురులను సంహరించిన పరమేశ్వరుని తన భక్తితో వశం చేసికొనిన పర్వత రాజు హిమవంతుని పెద్దకూతురైన గంగాదేవి జన్మకు కారణమైన గంగా జనకుడు అయిన శ్రీహరి. నేడు ఈ కలియుగంలో ఈయనే కొండలరాయుడు (ఏడు కొండల వేంకన్న). కోనేటి తిమ్మయ్య అని పిలువబడే శ్రీవేంకటేశ్వరుడు అంతేకాదు ఈయన ఒకప్పుడు "కొండతలనెత్తిన గుఱుతైనవాడు" - గోవర్ధన పర్వతాన్ని మోసి తనవారిని రక్షించిన శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఈయనే.

**4-40**

## మున్నుడి

సుదీర్ఘమైన మేలుకొలుపు వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇదికూడా అర్ధమవుతున్నట్లనిపించే అర్థంకాని కీర్తన. ఇటువంటి కీర్తనలు ఇదివరలో కొన్ని విన్నాం కాబట్టి మొత్తం కాకపోయినా దీని రసాస్వాదన మాత్రం తేలికగా చేయవచ్చును.

**సీ॥ ముదిత కన్గలువలు మొగిచెను, మదనుని**
**బాణాల కమలాలు బాగ విరిసె**
**అతివకున్ నిట్టూర్పు అగడు మారుతమాయె**
**వరుణుండు చెమటల వానదెచ్చె**
**తురుమున సుమములు తోచె పూవుల వాన**
**మారుండు పుల్కల బ్రహ్మఆయె**
**ఒడికముగ జెలిలో నుదయరాగంబాయె**
**ఆలయ రవళాయె ఆమె పలుకు**

**ఆ.వె॥ పడతి గూడినట్టి మా వేంకటేశ్వరా!**
**నిదుర మేలుకొనుము నిఖిలవంద్య**
**మేలుకొలుపు పాడె మేటి అన్నయ కవి**
**ఇంతకంటె భాగ్యమేమి కలదు?**

**రాగం : భూపాలము**

పొలయలుక నిద్దరలు భోగించ దొరకొంటి
అలరవడి మేల్కొనవె అఖిలేశ్వరా ॥పొలయలుక॥





తరుణిమైనపుడె పరితాప సూర్యుడు వొడిచె
వరుస చెలికన్ను గలువలు మొగిచెను
మరుని సాయకపు తామరలు వికసించె
కరుణతో మేల్కొనవె కమలేశ్వర ॥పొలయలుక॥

కాంత నిట్టూర్పులను గాలియును నగ్గియును
వంతచమటల వాన వరుణుండును
వింతలుగ నిన్ను సేవింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె పరమేశ్వర ॥పొలయలుక॥

మెలుత పెను దురుమనెడి మేఘమండలములో
నలుగడల జెలగె సుమనపు పంక్తులు
కులికి పూవులవాన గురియంగ నున్నదిదె
చలముడిగి మేల్కొనవె సర్వేశ్వర ॥పొలయలుక॥

కదిసి పులకల సృష్టి కడలేక పొదమించు
మదనుడను మానస కమలభవుడును
ముదిత కోపపు హరుడు మొనసి యున్నారిదే
నిదుర మేల్కొనవె జలనిధి శయనుడ ॥పొలయలుక॥

ఒడికముగ జెలిలోన నుదయరాగము వొడమె
వెడలెనదె పలుకు గోవిలరవములు
పడతి గూడితివి రవి పరవశంబికనైన
కడగి మేల్కొనవె వేంకటరమణుడ ॥పొలయలుక॥

**భావామృతం :**

ప్రభూ! ప్రణయ కలహము ప్రదర్శించుచు నిద్ర నటించుచున్నావు. భోగము ననుభవించుచుంటివి. ఇకచాలు. ఓ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! నిదుర మేల్కొనవయ్యా!

నీయెడబాటు క్షణమైన సహించలేని ఆ తరుణి (పద్మావతి) శరీరంలో పరితాప సూర్యుడు ఉదయించబోతున్నాడు. చెలియకన్నులు (నిద్రలేక) కలువలై ముకుళించు కొన్నవి. మన్మథుని బాణములై తామరపూలు వికసించినవి. ఓ కమలేశ్వరా! (లక్ష్మీవల్లభా! మమ్మల్ని కరుణించి మేల్కొనవయ్యా!

నీ కాంత యొక్క నిట్టూర్పులే వాయుదేవుడు, అగ్నిదేవుని వలెనను, ఏఱులై పారు చెమటల వానలు వరుణదేవుని వలెనను, నిన్ను సేవించుటకు వచ్చారా అనిపించుచున్నది. వారి సేవలు స్వీకరించటానికి వీలుగా పరమేశ్వరుడవైన నీవు మేల్కొనుము ప్రభూ!

ఓ సర్వేశ్వరా! ఆ భామ కొప్పు అనునట్టి మేఘమండలములో నలుదిక్కులా పూమాలల వరుసలు తురిమినది. ఆమె కులికినప్పుడు ఆ మేఘాలు పూలవాన కురిపించినవి. ఇక నీ బెట్టుసరి మాని మేల్కొనుము తండ్రీ!

కదిసి (సమీపించగానే) ఆమెకు అంతులేని పులకరింతలు ఆమెలో





పొడజూపినవి. మన్మథుడనే మానసిక బ్రహ్మ, ఆమె అలుక అనే హరుడు బ్రహ్మాది దేవతలవలె వేచి యున్నారు. ఓ క్షీరసాగరశయనా! నిదుర మేల్కొనుము తండ్రీ!

దేవా! ఒడికముగ (మనోజ్ఞముగా) ఆ చెలియలో ఉదయరాగములు (జ్ఞాన జ్యోతులై వెలిగినవి) ఆలయములోని రవములవలె, మాటలు వెలువడినవి. ఆమె 'త్వమేవాహం' స్థితికి జేరినది. అప్పుడు ఆమెపై నీ ప్రేమ ద్విగుణీకృతమై ఆమెను కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆ పారవశ్యం మఱచి ప్రయత్న పూర్వకంగా మేలుకొని మా మొఱలాలకించుము తండ్రీ!



## 4-41

## ముస్నుడి

అన్నమాచార్యులవారి పాండిత్య ప్రదర్శన ఆయన చెప్పిన శ్రీహరి దశావతార కీర్తనలలో ప్రతిఫలిస్తుంటుంది. 21వ శతాబ్ది తెలుగువారికి ఈ కీర్తనలు నూటికి పదిమందికి మించి అర్థంకావని నా అభిప్రాయం. నాబోటి సామాన్యుడు ఇది వివరించాలంటే... ఆ శ్రీనివాసుని అనంతమైన కృప లేక సాధ్యమా? "కాంతలనే కూడెనట కడగడదొక్కెనట" అంటే ఏమిటి? కూడటం అంటే గణితంలో కూడిక అని అనుకొని ఎవర్ని తొక్కుతున్నారా!! అని ఆశ్చర్యపోతే.. ఏమాత్రం ఆశ్చర్యంలేదు. ఒకటికి రెండుసార్లు చదివితేగాని "పదియు బదియు గాను"... అంటే తెలియదు. ఏడుకొండలవాడి అభిషేక సమయంలో పాడిన కీర్తన ఇది.

**కం॥ పది అవతారంబుల హరి**
**ఉదయించెను చెడునుద్రుంచ ఒప్పుగ బ్రోవన్**
**తుదిలేని శిష్టగణముల**
**పదిలముగా అన్నమయ్య పాడెను వినుడీ.**

**రాగం : రామక్రియ**

పదియు బదియుగాను పరమాత్ముడితనికి
వెదకి చవులు దెచ్చి విందులిట్టె సేయరే ॥పదియు॥

పొలసుపై బారెనట బురుదమేనంటెనట
యిల మన్ను మోచెనట యీ దేవుడు
నెలవైన రాకాసి నెత్తుట దోగినాడట
కల పన్నీరెల్లబోసి కడుగరే దేహము ॥పదియు॥

బాపన జిడ్డంటెనట పట్టెనట ముమ్మురము
కైపగు నల్లని కోక గట్టినాడట
చాపలాన జెంచుదాని సంగడి దిరిగెనట
కోపుల గప్పురధూళి గుప్పరే యీతనికి ॥పదియు॥





కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతల దట్టుపుణుగు పూయరే నేడు
యింతట శ్రీవేంకటేశు నెద నలమేలుమంగ
గాంతుని మెడ గుచ్చి కట్టరే మొక్కుదుము ॥పదియు॥

**భావామృతం :**

ఓ భక్తులారా! పరమాత్ముడైన ఇతనికి పదియున్ (పది అవతారములునూ) పదియుగాను (చక్కగా నుండుగాక!) వాటిని వెదకి, చవులు దెచ్చి (కనుక్కొని రసస్ఫూర్తితో) విందులిట్టే సేయరే (నైవేద్యం పెట్టండి).

(ఈస్వామి ఒకనాడు) పొలసుపై బారెనట (పొలుసులుగల శరీరంతో పరిగెత్తాడట... అంటే మత్స్యాయవతారుడు). బురదమేనంటె నట (ఒళ్ళంతా బురద అంటిందట... అంటే కూర్మావతారంలో మందర పర్వతం క్రింద వున్నప్పుడు ఆ కొండపైన మట్టితో ఈ స్వామి ఒళ్ళంతా బురదయిందట. ఈ దేవుడు యిలమన్ను మోచెనట (భూ భారం మోశాడట... అంటే వరాహావతారం). రాకాసినెత్తుట దోగినాడట. (హిరణ్యకశిపుని రక్తంతో పొరాడినాడట... అంటే నరసింహావతారం). అందుకని నేడు ఈ స్వామికి 'కలపన్నీరెల్ల బోసి కడుగరే దేహము (ఉన్న పన్నీరంతా పోసి ఈయన దేహాన్ని కడగండి)

ఈయనకు బాపన జిడ్డంటెనట. అగ్నిహోత్రంలో నెయ్యివేసి వేసి ఒళ్ళంతా జిడ్డయిందట, బ్రాహ్మణుడు కదా! (వామనావతారం). పట్టెనట ముమ్మారము (సర్వశ్రేష్ఠుడయ్యాడట, అంటే.. రాజులందరినీ వధించి విజేత అయ్యాడు అంటే... పరశురామావతారం). నల్లని (నీలవర్ణ) వలువలు ధరించి బలరాముడయ్యాడట. (బలరామ అవతారం). చాపలాన చెంచుదాని సంగడి దిరిగేనంట (మనోవైకల్యంలో వుండగా, చెంచుజాతి వృద్ధురాలు శబరిని స్నేహభావంతో కరుణించి మెసలినాడట... అంటే శ్రీరామావతారం) అటువంటి ఈ స్వామికి కోపుల కర్పూరధూళి గుప్పరే! (అందముగా కర్పూరం పొడి మెత్తండి).

ఈయన కాంతలనే కూడెనట (త్రిపురాసురుల భార్యలను సంగమించినాడట... బుద్ధావతారము). కడగడదొక్కెనట (పాపములను త్రొక్కివేశాడట.... అంటే కల్కి అవతారుడు). అట్టి ఈ స్వామికి తట్టుపునుగు అనే సుగంధద్రవ్యం, పొందల పూయరే (ఆరంగారంగ పూయండి). నేడు ఈ శ్రీవేంకటేశ్వరునికి అలమేల్మంగను మెడకు అంటగట్టి మ్రొక్కండి. మీ జీవితం ధన్యం చేసికోండి.

## 4-42

## మున్నుడి

ఏడుకొండలవాడి కళ్యాణ సందర్భంగా అన్నమాచార్యులవారు చెప్పిన శృంగార సంకీర్తన ఇది. పద్మావతీదేవి చెలికత్తెలు స్వామిని ఆమెను పెండ్లియాడమని వేడుకొంటున్నారు. వారిలో ఆచార్యులవారూ ఒక చెలియవలె ఈ కీర్తన ఆలపిస్తున్నారు. నా వివరణే అన్నమయ్య భావన అని భావించటం, భావ్యం కాదు. అది నా భావన మాత్రమే. కాకుంటే మధురమైన భావన. భావయామి వేంకటేశమ్‌లో ఇంతకంటే భావించలేనందుకు ఆ భావజ గురుడు మన్నిస్తాడనే... నా భావన.

**చం॥ చెలులిటు విన్నపంబులను చేసిరి "వల్లభ!యాలకింపుమా**
**ఎలమి సరోజవాసినిని ఈ అలివేణిని బెండ్లియాడుమా**
**చెలువముతోడ", అన్నమయ శ్రీపతి కిత్తరియాలపించగా**
**జలజదళాక్షుడైన హరి సాగరకన్యను గూడె ప్రేమతో.**

**రాగం : శంకరాభరణం**

అలివేణిని బెండ్లాడవయ్యా
చెలుల విన్నపము చేకొనవయ్యా ।అలివేణి॥

సొలపుల తొలితొలి చూచిన చూపులు
కొలది మీర నుంకువలాయ
చెలగి చేతులను సేసిన సన్నలు
తలపగ నలుగడ దలబాలాయ ॥అలివేణి॥

ననుపున సెలవుల నవ్విన నవ్వులు
గొనకొనగ బాలకూళ్ళాయ
అనువుగప్రియమున నాడిన మాటలు
మనసిజతంత్రపు మంత్రములాయ ॥అలివేణి॥





వేడుక కాగిట వినయపు సేతలు
కూడిన కూటపు గురులాయ
యీడనె శ్రీవేంకటేశ యేలితివి
తోడలమేల్మంగ దోమట్లాయ ॥అలివేణి॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! నీవు మా అలివేణిని (తుమ్మెదలవంటి నల్లని ముంగురులుకల సుందరి) పెండ్లియాడవయ్యా! ఆమె చెలులమైన మేము చేయు వినతులను వినుము స్వామీ!

నీవు అందగాడివని మా చెలియ నిన్ను పారవశ్యంతో చూస్తున్నది. ఆమె తొలిచూపులే నీకు ఆమె ఇచ్చే కొలది మీరిన ఉంకువలాయ (అంతులేని కన్యాశుల్కం అయింది ప్రభూ!). ఆమె మాకెవ్వరికీ అర్థం కాని ఏవేవో సన్నలు (సంజ్ఞలు) చెలగి (వేగంగా) చేతులతో స్వామివారికి చేస్తున్నది. అవే స్వామి శిరసుపై ఆమె పోయగా నలువైపులా చిమ్మిన తలంబ్రాలై అలరారుచున్నవి.

ప్రభూ! ఆమె ననుపున (అనురాగంతో) సెలవుల (పెదవుల చివరలనుండి) నవ్వినట్లు మనోహరంగా నవ్వుతున్నది. ఆ నవ్వులే, గొనకొనగ బాలకూళ్ళాయ (కళ్యాణంలో కాశీయాత్రకు పోయేటప్పుడు ధరించే పావుకోళ్ళయినవి). అనువుగ ప్రియమున నాడిన మాటలు (ఆమె మాకు తెలియకుండా, నీతో ప్రేమగా మాటలాడుచున్న మాటలు) మన్మథుని తంత్రములు నేర్పిన మంత్రములేమో అన్నట్లున్నాయి స్వామీ! ఇంకా వేరే పెండ్లి మంత్రములెందుకయ్యా!

ఓ శ్రీవేంకటేశ్వరా! వేడుకతో నీవామె నాలింగనము సేయగా ఆమె వినయముగా నీకు సహకరించి నిన్ను కూడినది. ఆ కూటపు సేతలే మీకు గురులాయ (గవయుటలైనవి ప్రభూ!). ఈడనే (ఈ తిరుమలయందే) నీవామెను యేలితివి. నీతోడే మా అలమేల్మంగకు దోమట్లాయ (అన్నము అయినది... అనగా జీవనాధారం అయినది). కనుక నీవామెను స్వీకరింపుము తండ్రీ!

**4-43**

## మున్నుడి

తనని తల్లి యశోదమ్మగా భావించుకొని ఈ కీర్తన చెబుతున్నారన్నమాచార్యులవారు. బిడ్డ యెంత ఆకలితో వున్నాడో, వేడి కూరలు చల్లబడి పోతున్నాయి అని వాపోతున్నారు. ఆదమఱచి ఏ మగువకౌగిట్లో నిదురిస్తున్నాడో అనటం అన్నమయ్యకే సాధ్యము. సాందీపుని దగ్గర విద్యలు నేరుస్తున్నాడేమో అని రేపల్లె ఇంతి సందేహించటం తర్కానికి అందకపోయినా, శ్రీవేంకటేశ్వరుడే చిన్నికృష్ణుడనే భావనే అన్ని తర్కాలకు తెరదించి వేంకట కృష్ణయ్యను సన్నుతించే కీర్తనగా వెలసింది.

**ఉ॥ ఇంతట కృష్ణమూర్తి నిటు యాకడ బిల్వరె యారగింపనై**
**యెంతటి పొద్దుబోయె తను యేకడనుండెనొ తల్లి కుందగా**
**ఇంతుల కాగిటన్ గలదొయేపుగ విద్యల నేర్చుచుండెనో**
**చెంతకురాడు, అన్నమయ చెప్పెను కీర్తన వెన్నదొంగపై.**

**రాగం : శుద్ధసారంగ్**

పిలువరే కృష్ణుని పేరుకొని యింతటాను
పొలసి యారగించే పొద్దాయనిపుడు ॥పిలువరే॥

వెన్నలారగించ బోయి వీధులలో దిరిగీనో
యెన్నరాని యమునలో యీదులాడీనో
సన్నల సాందీపనితో చదువగ బోయినాడో
చిన్నవా డాకలి గొనె చెలులాల యిపుడు ॥పిలువరే॥

మగువల కాగిళ్ళ మఱచి నిద్దిరించీనో
సొగిసి యావుల గాచే చోట నున్నాడో
యెగువనుట్లకెక్కి యింతులకు జిక్కినాడో
సగము వేడి కూరలు చల్లనాయ నిపుడు ॥పిలువరే॥





చెంది నెమలి చుంగుల సింగారించుకొనీనో
ఇందునే దేవరవలె ఇంటనున్నాడో
అందపు శ్రీవేంకటేశుడాడివచ్చె నిదెవీడై
విందుల మాపొత్తుకు రా వేళాయ నిపుడు ॥పిలువరే॥

**భావామృతం :**

ఓ చెలియలారా! మా చిన్నారి కృష్ణయ్యను ఇక్కడకు పేరుపెట్టి పిలవండమ్మా! ఇంతట (ఇప్పుడు) పొలసి (వచ్చి) తిండితినే వేళయిపోయింది. యెక్కడున్నాడో యేమో కాస్త కనుక్కోండమ్మా!

పోయి వెన్నతిందామని యే వీధులలో తిరుగుతున్నాడో? యమునానదిని యెంచి ఇంతలోతు వుంటుందని చెప్పటం కష్టం. ఒకవేళ అందులో ఈదులాడుతున్నాడేమో!! సన్నల సాందీపనితో (సాందీపని కనుసన్నలలో మెలగుతూ) చదువుకొనుటకు బోయినాడో యేమో!! వాడెంత చిన్నపిల్లవాడు!! ఆకలితో వున్నాడేమో!! ఓ చెలియలారా వాడిని వెదకండమా!

ఒకవేళ ఏ గోపికన్నా జోకొడుతుంటే ఆమె కౌగిట్లో ఆదమఱచి నిదురిస్తున్నాడేమో!! గోపాలకులు ఆవులను కాస్తుంటే తనుకూడా అక్కడే వుండిపోయాడేమో!! లేక వుట్లను పగులగొడుతూ యే గోపికకైనా చిక్కి బంధించబడ్డాడేమో!! వేడివేడి కూరలు సగం చల్లబడిపోయాయి ఇప్పుడు. కొంచెం మా కృష్ణయ్యను పిలువండమ్మా!

పొంది, చక్కటి నెమలి పింఛమును సింగారించుకొంటున్నాడోయేమో? ఇక్కడే దైవం వలె ఇంట్లోనే వున్నాడేమో!! నేడు కృష్ణయ్యే అందమైన శ్రీవేంకటేశ్వరుడై వచ్చినాడు. వీడే నాటి కృష్ణుడు. మాతోపాటు విందు ఆరగించటానికి ఇప్పుడు వేళయింది. వీనిని పిలవండమ్మా!

4-44

## మున్నుడి

సీతా శోక వినాశకుడైన హనుమంతరాయునిపై చక్కటి కీర్తన చెబుతున్నారన్నమయ్య. ఈ కీర్తనలు ఒకదానితో ఇంకొకటి పోలినట్లు వున్నప్పటికి దేని ప్రత్యేకత దానిదే. “రవిఫలగిళన ప్రతాప” అని హనుమని వేరెవరూ కీర్తించి యుండరు అని నాకనిపిస్తుంది. కుళక దానవులంటే కుళ్ళుబోతు రాక్షసులని అర్ధం. ‘కింకరూప’ అంటే కోపము మొహంలో ప్రస్ఫుటించేవాడు అని అర్ధం. ఈరోజువరకు ఇటువంటి మాటలు తెలుగులో వున్నాయని నాకూ తెలియదు... అదీ అన్నమయ్య భాషా పటిమ.

**తే॥ జానకీ శోకనాశక! సత్వధనిక!**
**మహిని పాతాళ లంకేశు మదవిదూర!**
**రామకార్యము నెరపిన లంకిణిహర!**
**హనుమ నీరీతి గీర్తించె అన్నమయ్య**

**రాగం : దేశాక్షి**

సీతాశోక విఘాతక వో-
పాతాళ లంకాపతి విభాళా ॥సీతా॥

హనుమంతరాయ అంజనీ తనయ వో-
వనధి లంఘన గాత్ర వాయుపుత్ర
యినకులాధిప నిజహిత జగన్నుత-
వనజోదర సేవక సత్వధనికా ॥సీతా॥

ప్రళయాంతక రూప బలదీప రవిఫల-
గిళన ప్రతాప సుగ్రీవప్రియా
కుళక దానవ సంకుల విదారణ
భళిభళి జగత్పతి బలుబంటా ॥సీతా॥





పంకజాసను దివ్యపదవైభవ వో-
లంకిణీ ప్రాణ విలంఘన
వేంకటేశ్వరు సేవా వీర మహాధీర
కింకరూయ సుఖీభవా ॥సీతా॥

**భావామృతం :**

ఓ సీతాశోక విఘాతకా (నివారకా)! పాతాళ లంకేశుడైన, మహిరావణుని నిర్జించిన మహానుభావా! ఆంజనేయా! నిన్నిదే కీర్తించెదను.

ఓ హనుమంతరాయా! అంజనీదేవి తనయా! వనధిలంఘన గాత్ర! (నూరు యోజనముల సముద్రమును దుమికి దాటుటకు అనువైనట్లు శరీరమును పెంచినవాడా!) వాయుదేవుని పుత్రా! సూర్యవంశ దీపకుడైన శ్రీరామునికి నిజమైన హితప్రదాతా! విశ్వమందందరిచే నుతించబడినవాడా! పద్మనాభుని సేవాతత్పరా! సత్వధనిక! (సత్వగుణము అను ధనము పుష్కలంగా వున్నవాడా!) నీకు వందనములు.

దేవా! నీవు ప్రళయాంతకుడైన శంకరుని అంశతో జన్మించినవాడవు. దీప్తించిన బలముకలవాడవు. ఓ రవిఫలగిళన ప్రతాపా! (సూర్యుని పండు అనుకొని తినబోయిన ప్రతాపశాలీ!) సుగ్రీవుని ప్రియ స్నేహితుడా! కుళకదానవ (కుళ్ళుబోతు రాక్షసులు... అంటే పైకి నవ్వుతూ వున్నా మనసులో దుఃఖించే అసురులు) సంకుల నిదారణ (సమూహములను చీల్చి వేసినవాడా!) జగన్నాధుడైన శ్రీరాముని బలిష్టుడైన బంటూ! భళిభళీ!

బ్రహ్మదేవుని యొక్క దివ్యపదవీ వైభవమును పొందబోవు మహానుభావా! లంకిణి ప్రాణములను ఒక్క గుద్దుతో త్యాగము చేయించినవాడా! శ్రీవేంకటేశ్వరుని సేవకులలో మహాధీరుడవైన వీరాగ్రేసరా! ఓ కింకరూపా! (కోపము మొహంలో తాండవించే ఉగ్రాంజనేయా!) సుఖీభవ (నీకు సర్వ సుఖములు ప్రాప్తించుగాక!

**4-45**

## మున్నుడి

అహోబల నరసింహునిపై అన్నమాచార్యులవారు అసంఖ్యాకమైన కీర్తనలు ఆశువుగా చెప్పారు. ఈ కీర్తనలో అన్నమయ్య ఆ నరసింహుని వివిధ విశిష్టతలుగల సింహముగా పేర్కొంటున్నారు. ఈ స్వామి దిట్టయైన వేదాలలోని 'తెరవేట' సింహము అని కీర్తిస్తున్నారు. అంటే ఏమిటో తెలుసుకోవాలంటే... భావామృతం చదవక తప్పదు. అంచెల మూడు మూర్తులకు ఆధారమైన మూర్తియట అహోబల నారసింహుడు.

**ఉ॥ వేడుకతోడ గద్దెపయి వీడటు కూర్చునియుండె జూడరో**
**వాడి ప్రతాపశాలియట మానవ సింగము అన్నమయ్యనెన్**
**కూడుచు తానహోబలపు గొప్ప నృసింగము వేంకటేశుడే**
**పాడెను మూడు మూర్తులకు వాడొకడే పెను మూలమంచనెన్.**

**రాగం: ధన్యాసి**

వీడె వీడె కూచున్నాడు వేడుకతో గద్దెమీద
వాడి ప్రతాపముతోడి వరదాన సింహము ॥వీడె॥

అరయ ప్రహ్లాదుని ఆపదోద్ధార సింహము
గిరిపై ఇందిరకును క్రీడాసింహము
నిరతి సురుల భయనివారణ సింహము
సరి హిరణ్యకశిపు సంహార సింహము ॥వీడె॥

ఇట్టె విశ్వమునకు ఏలికైన సింహము
గట్టిగ శరణాగతుల గాచే సింహము
దిట్టయై వేదాలలోని తెరవేట సింహము
నెట్టుకొనిన దురిత నివారణ సింహము ॥వీడె॥





అంచెల మూడుమూర్తుల కాధారమైన సింహము
పంచల మునుల భాగ్యఫల సింహము
పొంచి శ్రీవేంకటాద్రికి భూషణమైన సింహము
చెంచుల అహోబలపు శ్రీనారసింహము ॥వీడె॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! సంతోషంతో సింహాసనంపై కూర్చొనియున్న సింహము వీడే. వీడే వాడి ప్రతాపము (తీక్షణమైన పరాక్రమము) తో పెక్కు వరములను దానము చేయు సింగము. (ఈయన వివిధ గుణ భూషితుడై ఒక్కొక్కరి యెదుట ఒక్కొక్క గుణం ప్రదర్శించాడు)

చూడగా ప్రహ్లాదునికి ఈయన ఆపదోద్ధారక సింహము (తండ్రిపెట్టు ఆపదల నుంచి రక్షించిన నరసింహుడు). ఈ కొండమీద లక్ష్మీదేవికి ఇతడు క్రీడా సింహము (వలపు సయ్యాటలు ప్రదర్శించు సింహము). దేవతలకు భయమును ప్రీతితో నివారించిన సింహము. హిరణ్యకశిపుని సరి సంహారక సింహము (వాడి వరములన్నిటికీ సరిపోలు విధముగా సంహరించిన నరసింహము). ఈ స్వామిని కీర్తించండి.

ఈ నరసింహుడు ఇట్టే (తేలికగా అని భావము) విశ్వపాలకుడైనాడు. తనను శరణన్నవారిని గట్టిగ (సమర్థవంతముగా) రక్షించు సింహమితడే. దిట్టయైనవాడని వేదములు కీర్తించిన ఈ దేవదేవుడు 'తెరవేట' సింహము. (తెరవేట లేక "ఏదువేట" అనునది వేటలోని ఒక విధానము. ఈయన అటువంటి వేటలో దిట్ట). ఈ స్వామి నెట్టకొని (పూనుకొని) పాపములను నివారించిన సింహము.

ఈ మహానుభావుడు అంచెల మూడుమూర్తులకు ఆధారమైన సింహము. (సృష్టియందు బ్రహ్మకు స్థితియందు విష్ణువునకు, లయమున ఈశ్వరునకు ఆధారభూతుడైన నరసింహుడు), మునులకు వారి భాగ్యఫలములను పంచి ఇచ్చు సింహము. ఈ స్వామియే పొంచి వేంకటాద్రికి అలంకారమైన సింహము. ఇచ్చట చెంచుల (అడవిలో) ఈయన అహోబల నారసింహుడై శరణాగత రక్షకుడై యున్నాడు.

**4-46**

## మున్నుడి

బంగారు మేడలో పవళించిన శ్రీవేంకటేశ్వరుని నిద్రలేపిన చెలియలు, ఆ పురుషోత్తమునికి సుగంధద్రవ్యాలతో నలుగుబెట్టి, పన్నీటితో స్నానం చేయించి, చక్కగా విసరి, కర్పూర ధూళిమెత్తి, కొప్పు దువ్వి, గొజ్జంగపూలు ముడిచి, అనేక సొమ్ములు బెట్టి, తాంబూలమిచ్చి, తులసి మాలలు వేసి, ఆరగింపులు చేసి ఎలా సేవిస్తున్నారో చెబుతున్నారు అన్నమాచార్యులవారు.

**సీ॥ బంగారు మేడలో పరమాత్ముడే వాడు**
**చెలులు సింగారాలు చేయరేల**
**తట్టు పుణుగు నూనె దట్టంబుగా నించి**
**కస్తూరి బాగుగా కలియబెట్టి**
**పన్నీట మజ్జనం బెన్నంగ సేయించి**
**వెట్టదీరగ వాన్కి వీవరేల?**
**కర్పూర గంధంబు కదు నిట్టె మెత్తరే**
**కొప్పులో ముడువరే 'గొజ్జగలను'**

**తే॥ మేన సొమ్ములు నించరే మిలమిలయన**
**తులసిదండలు వేయరే నిలువుగాను**
**ఆరగింపులు సేయరే, అన్నమయ్య**
**పాట వినిపించి వేంకటపతికినిపుదు**

**రాగం : మధ్యమావతి**

బంగారు మేడలలోన పరమాత్ముడు వాడే
సింగారాలు మీద మీద సేయరే చెలులు ॥బంగారు॥

తట్టుపుణుగుల నూనె తలనిండా నంటుకొని
గట్టిగా కస్తూరి అట కలివెట్టి
మట్టులేని పన్నీట మజ్జన మాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥బంగారు॥





కప్పురంపు గందవొడి కదునిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి ముడిచెను గొజ్జంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేను సొమ్ములెల్లా
దప్పిదీర విడమీరే తలకొని చెలులు ॥బంగారు॥

అలమేలుమంగను వురమందు నిట్టనించుకొని
తులసి దండలు మోచె నిలువునను
చెలరేగి ఆరగించె శ్రీవేంకటేశ్వరుడు
కొలువున్నాడు మోహాలు గుప్పరే చెలులు ॥బంగారు॥

**భావామృతం :**

ఓ చెలులారా! అతగాడు బంగారపు మేడలో నివసించు, పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడు. వానికి ఒకదానిని మించిన దింకొకటియైన అలంకరణలు చేయండి.

ఆ స్వామి తలకి (శిరోజములకు) తట్టు పుణుగు నూనెను (పునుగు పిల్లినుంచి వచ్చిన సుగంధపు నూనె) తలనిండా అంటి కస్తూరితో బాగుగా కలియబెట్టి, నలుగువలె బెట్టి స్వామికి ఆపై పన్నీటితో స్నానం చేయించండి. స్నానమైన తరువాత ఆయనకు వెట్టదీర (వేడిమి తగ్గిపోవునట్లు) మీరింతమంది చెలులు ఆయనకు వింజామరలతో విసరండి.

ఆ తరువాత ఎక్కువ కర్పూర ధూళితో ఆయనకు మెత్తి ఒళ్ళంతా సుగంధం వచ్చేట్లు చేయండి. ఆపైన ఆయన కొప్పును చక్కగా దువ్వి, 'గొజ్జెంగలు' (గొజ్జగ పుష్పములు) ఆ కొప్పులో ముడిచి అలంకరించండి. అప్పుడా స్వామి పవిత్రమైన తన శరీరంపై సొమ్ములు (ఆభరణములు) తెప్పలుగా (ప్రోవుగా) ధరించి మిలమిల మెఱసి పోయాడు. ఓ చెలులారా! మీరింత హడావిడి చేస్తుంటే ఆయనకి దప్పికతో నోరెండిపోతుంది. అట్లాకాకుండా మీరు పూనుకొని కర్పూర తాంబూలమియ్యండి.

ఓ చెలులారా! తన హృదయంపై అలమేల్మంగను పెట్టుకొనిన ఆ శ్రీవేంకటేశ్వరుడు, గుబాళించు తులసి మాలలను తన మెడలో నిలువుగా ధరించాడు. ఆపై విజృంభించి తనకి నివేదించిన పదార్థములనారగించి కొలువు దీరియున్నాడు. మీకు ఆయనపైగల మోహమునంతా గుప్పించి "శ్రీవేంకటేశ చరణం శరణం ప్రపద్యే..." అని శరణాగతి నొందండి. తరించండి. మీపై దయతో ఆయన మీకిచ్చిన మానవజన్మను సార్థకం చేసికోండి.

**4-47**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని చిత్తములో నిలుపుకొని, చిత్తమును మత్తెక్కించే ఆయన కొడుకు చిత్తజుని జోలికి పోకుండా భవసాగరమును తరించమని బోధిస్తున్నారు అన్నమాచార్యులవారు. అడవిలో యెంత చక్కటి వెన్నెల కాసినా, చూసి ఆనందించే వాడెవడుంటాడు? ఎంతో విలువైన కాలమును వ్యర్థం చేసికొని మాయలోబడి విచారించకండి. ఆ స్వామి శరణు పొంది పాపవిముక్తులై ఆయనను సేవించండి అని హితబోధను చేస్తున్నారు.

**మ॥ అడవిన్ గాసిన వెన్నెలట్లు తగునా అత్యంత నాణ్యంపుయా**
**పుడమిన్ గాలము పాడుసేయ సరికాదో మానవా! మాయరా**
**కడువేదన్ బడకన్నమయ్య తను యీ గానంబు సేసెన్ భళా!!**
**విడువన్ జాలని వేంకటేశు గొలువన్ వీడున్ గదా పాపముల్.**

**రాగం : కన్నడ గౌళ**

పోయగాలంబడవికి - గాయువెన్నెల కరణిని
శ్రీయుతుదలచుడీ నరులు - మాయబడి చెడక ॥పోయ॥

చిత్తము చేకూరుచు కొని - చిత్తైకాగ్రతను
చిత్తజగురుని దలచుడీ- చిత్తజు జొరనీక ॥పోయ॥

బూరుగు మాకున జెందిన - కీరము చందమున
ఆరయ నిష్ఫలమగు మరి- యన్యుల జేరినను ॥పోయ॥

కూరిమి మా తిరువేంకటగిరి- గురు శ్రీపాదములు
చేరిన వారికి భవములు - చెందవెపుడు నటుగాన ॥పోయ॥



భావయామి వేంకటేశం

**భావామృతం :**

ఓ నరులారా! కాలమంతా నిరుపయోగంగా గడచిపోయింది. అడవిలో గాచిన వెన్నెల వలె వ్యర్థమైపోయింది. ఈ మాయలో తగులుకొని చెడిపోవద్దు. శ్రీయుతుడు (లక్ష్మీపతి) అయిన ఆ దేవదేవుని స్మరించండి.

మీ మనస్సును దిటవు పఱచుకొని, మనస్సున ఏకాగ్రత సాధించి, చిత్తజుడైన (మనస్సులోనే పుట్టుక గలిగిన) మన్మథునికి తండ్రిగారైన శ్రీమన్నారాయణుని ధ్యానించండి. చిత్తజుని మాత్రం మనస్సులోకి దూరనీయకండి. చెడిపోకండి.

బూరుగు చెట్టుపూలు చక్కటి రంగుతో ఆకర్షణీయంగా వుంటాయి. వాటికి సువాసన కూడా వుంటుందేమో అనే ఆశతో దానినాశ్రయిస్తే క్రమంగా పూవు, కాయగా, కాయ దూదిగా మారి, దూది గాలికి కొట్టుకుపోతుంది. కాబట్టి చిలుక యొకటి అందమైన బూరుగు పూవు తియ్యటి కాయ అవుతుందేమో అనే భ్రమతో వేచియుంటే దానికి మిగిలేది నిరాశ మాత్రమే. అట్లే శ్రీహరిని గాక ఇతరులను ఆశ్రయిస్తే మీ జీవితం నిష్ఫలమైపోతుంది.

భక్తి, ప్రేమ పెనవేసుకొనునట్లు శ్రీవేంకటేశ్వరుని శ్రీపాదములను చేరి ఆశ్రయించినవారికి ఎన్నటికీ 'భవములు' (జన్మలవలన సంసార సాగరములోబడి తిరిగే దుస్థితి) చెందవు. అందుకని శ్రీవేంకటేశ్వరుడే దిక్కని ఆయన శరణు పొందండి.



**4-48**

## మున్నుడి

నేడు శ్రీరామనవమి భద్రాచల శ్రీరామచంద్రుని కళ్యాణం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను చూచి భక్తులు ధన్యులవుతున్నారు. దుష్టశిక్షణకు శిష్టరక్షణకు అనుక్షణం కోదండం ధరించే వుంటానని పంతము వట్టిన ఆ రాఘవుని నీ బలమునకెదురేదయ్యా? అని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. బ్రహ్మాదులు ఆయనను పరబ్రహ్మ అని కీర్తించారట. జవసత్త్వ సంపన్నుడట... ఆయనే వేసాల పొరలే వేంకటేశ్వరుడట, దాసులను రక్షించుటకు తలకొన్న రాముడట.

**తరలము :** **భళిభళీ! రఘురామ రాఘవ పంతమూనిన భూవరా!**
**జలజసంభవ సన్నుతా! సతి జానకీ ప్రియ వల్లభా!**
**ఇల జనించిన రాముడే మన ఇష్టుడౌ వేంకన్ననెన్**
**బలిమి నీకెదురేది లేదుర బాగుబాగనె అన్నయున్.**

**రాగం :**

భళిభళి రామ పంతపు రామ నీ-
బలిమి కెదురులేదు భయహరరామ ॥భళిభళి॥

విలువిద్యరామ వీర విక్రమరామ
తలకొన్న తాటకాంతకరామ రామా
కొలయై తరుణి తలగొండు గండరామ
చలమది సమరపు జయరామ రామ ॥భళి భళి॥

రవికులరామ రావణాంతక రామ
రవిసుత ముఖ కపిరాజ రామరామ
సవరగా కొండలచే జలనిధి కట్టిన రామ
జవసత్వ సంపన్న జానకి రామ ॥భళి భళి॥





కౌసల్య రామ కరుణానిధి రామ
భూసురవరద సంభూతల రామ
వేశాలపొరలే శ్రీవేంకటాద్రి రామ
దాసుల మమ్ము కావ తలకొన్న రామ ॥భళి భళి॥

**భావామృతం :**

ఓ శ్రీరామచంద్రా! దుష్టశిక్షణ చేసి శిష్టులను రక్షిస్తాను అని ప్రతిజ్ఞ చేసి దీక్షాదక్షుడై కోదండ ధనువును ధరించియే యుంటానని పంతము పూనిన నీ దీక్ష భళి భళీ! ఏమని పొగడను!! ఆర్తుల భయము హరించు శ్రీరామా! నీ బలము సాటిలేనిది.

ప్రభూ! నీవు విలువిద్యా పారంగతుడవు. వీర విక్రమ రాముడవు. తాటక సంహారమునకు తలకొన్న (పూనుకొనిన) రామచంద్రుడవు. పాపియైన స్త్రీకి (శూర్పణఖకి) తలకొండు (భయమును కలిగించిన) గండ (శూరుడు) అయిన రామచంద్రుడవు. రణరంగంలో యుద్ధంకూడ ఏమాత్రం మత్సరము (చలము) లేకుండా చేయు సద్గుణశీలి అయిన జయరాముడవు.

ఓ దేవదేవా! నీవు సూర్యవంశ దీపకుడవైన శ్రీరాముడవు. రావణుని వధించిన శ్రీరామచంద్రుడవు. కపిరాజైన సుగ్రీవునికి సూర్యపుత్రుడగుటచే సూర్యవంశస్థుడైన రామునితో మైత్రి కలిగి ఆయన వదనమును శోభాయమానముగా చేసినది. (ఆయన అటువంటి శ్రీరాముడు). కొండలచే సవరగా (చదునుగా) జలనిధికి (సముద్రానికి) కట్టిన (బంధించిన) శ్రీరామచంద్రా! జవసత్త్వములు సమృద్ధిగా వున్న నీవు జానకీ వల్లభుడైన రాముడవు.

కౌసల్యానందనుడవైన శ్రీరామా! నీవు కరుణానిధివి. భూలోకవాసులను, దేవతలను రక్షించుటకు మానవ జన్మనెత్తిన రామచంద్రుడవు. వేశాల (వేషాల... అనగా అలంకరణలతో) పొరలే (ప్రవర్తించు) శ్రీవేంకటాద్రి రాముడవు. మావంటి దాసులను కాపాడుటకు సిద్ధమైన శ్రీరామచంద్రుడవు. నీవే మా తిరుమలనాథుడవు కూడ.

**4-49**

## మున్నుడి

శ్రీమన్నారాయణుని కేశవ నామాలను ఒక చక్కటి కీర్తనలో భజన మాదిరి చెప్పగలగటం, అదీ ఒకే క్రమంలో చెప్పగలగటం ఒక్క అన్నమాచార్యులవారికే సాధ్యమైన ప్రక్రియ అని నాకనిపిస్తుంది. ఈ కీర్తన పాడితే శ్రీహరి నామాలు పలికినట్లే. నాబోటి 'చదువు సంధ్య' లేని సామాన్యులకోసం అన్నమయ్య ఎంత శ్రమపడ్డారో చూడండి. 'నీనామమే ఆత్మ నిధానాంజనము' అన్నారు. అది ఆత్మ నిధ్యానాంజనమేమో...అనిపించింది. అన్నమయ్య కత్తికి రెండువైపులా పదునే... మరి.

**కం॥ మాకది నిధియు నిధానము**
**తాకుచు మా ఆత్మకది నిధానాంజనమౌ**
**శ్రీకరుని నామమొకటే**
**ఆకడ తను భజన వోలె అన్నయ తెలిపెన్.**

**రాగం : తిలంగ్**

నీనామమే మాకు నిధియు నిధానము
నీ నామమే ఆత్మ నిధానాంజనము ॥నీ నామమే॥

నమో నమో కేశవ నమో నారాయణ
నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదనా
నమో త్రివిక్రమ నమో వామన ॥నీ నామమే॥

నమో నమో శ్రీధర నమో హృషీకేశ
నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ
నమో ప్రద్యుమ్నతే నమో అనిరుద్ధ ॥నీ నామమే॥





నమో పురుషోత్తమా నమో అధోక్షజ
నమో నారసింహా నమోస్తు అచ్యుత
నమో జనార్దన నమోస్తు ఉపేంద్ర
నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణ ॥నీ నామమే॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నీ నామ సంకీర్తనమే మాకు నిధి, అనగా ఐశ్వర్యము. అదియే నిధానము, అనగా భద్రంగా భూమిలో ఒక రహస్య ప్రదేశమున పాతరవలె దాచి వుంచిన ధనము. ఇహలోకంలో ఈ రెండు అత్యవసరమే. కాని నీ నామము ఇహలోకంలోనే కాక పరలోకంలో అవసరమైన ఆత్మనిధానాంజనమును (ఆత్మ జ్ఞానంబును) సమకూరుస్తుంది. [అంజనము అంటే ఎక్కడో వున్నవాటిని కనులకు చూపించే కాటుక వంటి లేపనము. నిధానాంజనము అంటే, నిధిని చూపించే అంజనము. ఆయన నామం ఆత్మనిధిని వెలికి తీసి చూపించే అంజనము అని అర్థం. "ఆత్మ నిధ్యానాంజనము" - అంటే ఆత్మ దర్శనము చేయించే అంజనము అని అర్థం. కాబట్టి ఈ నిధానాంజనము 'నిధ్యానాంజనము' అయి వుంటుందేమో అని నాకు అనిపించింది]

ఓ కేశవా! ఓ నారాయణా! ఓ మాధవా! ఓ గోవిందా! ఓ విష్ణు! ఓ మధుసూదనా! ఓ త్రివిక్రమా! ఓ వామనా! నీకు వందనములు ప్రభూ!

ఓ శ్రీధరా! ఓ హృషీకేశా! ఓ పద్మనాభా! ఓ దామోదరా! ఓ సంకర్షణా! ఓ వాసుదేవా! ఓ ప్రద్యుమ్నా! ఓ అనిరుద్ధా! నీకు అనేక నమస్కారములు తండ్రీ!

ఓ పురుషోత్తమా! ఓ అధోక్షజా! ఓ నరసింహా! ఓ అచ్యుతా! ఓ జనార్దనా! ఓ ఉపేంద్రా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఓ శ్రీకృష్ణా! నీకు మా నమోవాకములు. నీ నామమును మించిన మోక్షసాధనము మరియొకటి లేదు.

**4-50**

## మున్నుడి

తనతండ్రి అన్నమాచార్యులవారి అడుగుజాడల ననుసరించిన పెద తిరుమలాచార్యులవారు కూడ వెంకటేశ్వర మకుటంతో అనేక కీర్తనలు రచించారు. ప్రతిదేవునీ ఆయన శ్రీవేంకటేశ్వరునిగానే భావించారు. ఈ కీర్తనలో గోపికలలో తానూ ఒకతెయై కృష్ణునితో మొరబెట్టుకొంటున్నారు. నీ భావమేమిటో మాకు తెలిసిపోయిందిలే గోపాలకృష్ణా! నీ పస నాకు తెలియదా? నీకు కూడా బమ్మెరపాటు వుంటుందా? (నీవు దేవదేవుడవు కదా!)

**కం॥ గోవింద నందసుత! నీ**
**భావము గోపాలకృష్ణ! మాకటు చిక్కెన్**
**శ్రీవేంకటేశు గొలుచుచు**
**ఈ విధి పెదతిరుమలయ్య ఇంపుగ పాడెన్**

**రాగం : మిశ్రమోహన**

గోవింద నందనందన గోపాలకృష్ణ నీ-
భావము మాకు చిక్కె గోపాలకృష్ణ ॥గోవింద॥

కొంగువట్టే వదేమోయి గోపాలకృష్ణా మా-
పంగెన కోపుదువా గోపాలకృష్ణ
గొంగతనాల నవ్వేవు గోపాలకృష్ణ
బంగారు కాశతోడి గోపాలకృష్ణ ॥గోవింద॥

కొమ్మల చీరె లంటిన గోపాలకృష్ణ
పమ్మి నిన్ను తిట్టము గోపాలకృష్ణ
కుమ్మరించే వేల సిగ్గు గోపాలకృష్ణ
బమ్మెర పోకిందుల గోపాలకృష్ణ ॥గోవింద॥





కొసరకు మంత నీవు గోపాలకృష్ణ నీ-
పస నే నెఱుగనా గోపాలకృష్ణ
పొసగ శ్రీవేంకటాద్రి పొందితి నిన్ను
పసి మెక్కె మొగము గోపాలకృష్ణా ॥గోవింద॥

**భావామృతం :**

నందగోపుని కుమారుడవైన గోవిందా! నీవు గోవులను పాలించే గోపాలకృష్ణుడవు. నీ ఆలోచనలేమిటో మాకు దొరికిపోయినవి. (నీ జిత్తులు మేము గ్రహించితిమి. మేము వెర్రిగొల్ల కన్నెలం కావచ్చును. కాని నీకిటుకులన్నీ మేమెరుగుదుములేవయ్యా!)

ఓ గోపాలకృష్ణా! మా కొంగు పట్టేవు ఇదేమోయి? నీ పంగెన (జిత్తులు) మేము సహించలేమయ్యా! (పంగెన అంటే ఏనుగును బంధించే పెద్దగొయ్యి. పైన గడ్డి కప్పివుంచిన వ్యూహం) గొంగతనాల నవ్వేవు (కపట శత్రువువలె నవ్వుతున్నావు). ఇది నీకు తగునా కృష్ణా! బంగారు రంగు కాశ (చిన్న పంచె) కట్టినావు గోపాలకృష్ణా! (నీవు పీతాంబరుడవని అందుకే అన్నారు).

స్త్రీల చీరెలెత్తుకొని పోయిన ఓ గోపాలకృష్ణా! మేము నిన్ను పమ్మితిట్టము లేవయ్యా! (అతిగా నిందించము). మేము నీతో ఇంత మంచితనం చూపిస్తే... నీవేమో మా సిగ్గులన్నీ కుమ్మరించేస్తున్నావు (బట్టబయలు చేస్తున్నావు). మమ్మల్ని బమ్మెరపోకునకు (భ్రమపాటునకు) ఇందుల (ఇక్కడ) గురిచేస్తున్నావు. గోపాలకృష్ణా! ఇది న్యాయమా?

ఓ గోపాలకృష్ణా! నీవు అంత కొసరకుము స్వామీ! (ఇంకాస్త... ఇంకాస్త... అని మా వలపులు దోచుకోవద్దు). నీ సామర్థ్యం మేమెరుగనిదా!! కృష్ణా! అటువంటి నిన్ను శ్రీవేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుని రూపంలో పొందినాము. అందుచేత మా మొగములు కాంతులతో వెలిగిపోతున్నాయి ప్రభూ!

## 4-51

## మున్నుడి

శ్రీహరిచేతి సుదర్శన చక్రాన్ని కీర్తిస్తున్నారు అన్నమయ్య. బాల్యంలో అట్టముక్కను 'విష్ణుచక్రం' లా కత్తిరించి చూపుడు వేలికి పెట్టుకొని ఆడుకోవటం నాకింకా గుర్తు. ఒకనాడు అన్నమయ్య వర్ణనకి వివరణ వ్రాస్తానని నేను కలగని కూడ వుండను. శ్రీహరి చక్రానికి ఇన్ని 'కోణాలు' ఉంటాయని ఎంతమందికి తెలుస్తుంది చెప్పండి... పండితులకి, పౌరాణికులకు మాత్రమే తెలిసిన ఈ సుదర్శన చక్ర వర్ణన ఈ కీర్తనద్వారా మనం తెలుసుకొన్నామంటే అది మన పూర్వజన్మ సుకృతమే కదా!

**ఆ.వె॥ అసుర ఘాతమైన హరిచేతి చక్రమా!**
**సమర విజయమైన చక్రిపనుప**
**ఇట్టి వర్ణనంబు నెరుగము యెన్నడు**
**అన్నమయ్య పొగిడె నద్భుతముగ.**

**రాగం : సాళంగనాట**

నమో నమో దానవ వినాశ చక్రమా
సమర విజయమైన సర్వేశు చక్రమా ॥నమో॥

అట్టె పదారు భుజాల నమరిన చక్రమా
పట్టిన ఆయుధముల బలు చక్రమా
నెట్టన మూడుగన్నుల నిలిచిన చక్రమా
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా ॥నమో॥

ఆరయ నారు గోణాల నమరిన చక్రమా
ధారలు వేయిటి తోడి తగు చక్రమా
ఆరక మీదికి వెళ్ళే అగ్ని శిఖల చక్రమా
గారవాన నీ దాసుల గావవే చక్రమా ॥నమో॥





రవిచంద్ర కోటితేజ రాసియైన చక్రమా
దివిజ సేవితమైన దివ్యచక్రమా
తవిలి శ్రీవేంకటేశు దక్షిణ కర చక్రమా
యివల నీ దాసులము యేలుకోవే చక్రమా ॥నమో॥

**భావామృతం :**

ఓ సుదర్శన చక్రమా! దానవుల వినాశనమునకు రూపుదాల్చిన చక్రమా! సర్వేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరునికి అనేక యుద్ధములలో విజయమును చేకూర్చిన చక్రమా! నమో నమః (నీకు వందనములు)

ఓ సుదర్శన చక్రమా! నీకు 'పదారు భుజాలు అమరినవి' (పదియారు వైపులున్నవి). శ్రీహరి పట్టిన ఆయుధములలోకెల్ల నీవే బలమైన దానివి. నెట్టన (అనివార్యమైన) త్రినేత్రమువంటి చక్రమా! అట్టుగా మన్నించవే మెఱయు చక్రమా! (అట్టు అంటే 'నింద' అని అర్థం. కాని ఇక్కడ బాహాటంగా ఆర్తులను మన్నించుమా సుదర్శనమా! అనే అర్థంలో అన్నమయ్య వాడారు) అని నా భావన.

పరిశీలించగా ఈ సుదర్శనానికి ఆరు కోణములున్నవి. దానికి వేయి పదునైన ధారలు (కోయుశక్తిగల అంచులు, కటింగ్ ఎడ్జెస్) వున్నవి. ఆర్పినా ఆరని అగ్ని కీలలు, విస్ఫులింగాలను వెదజల్లుతుంటే, అది మీది మీదికి వస్తుంటుంది. అట్టి సుదర్శన చక్రమా గారవాన (ప్రేమతో) నీ దాసులను రక్షింపుము.

ఓ సుదర్శన చక్రమా! నీవు కోటి సూర్యచంద్రుల దివ్య తేజస్సుకలదానవు. దేవతలచే సేవించబడు దివ్యమైనదానవు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని కుడిచేతిలో వెలుగొందు సుదర్శన చక్రమా! నీవు నీదాసులమైన మమ్ము పరిపాలించుకొనుము.

**4-52**

## మున్నుడి

ఈ కీర్తన పండరంగవిఠ్ఠలునిపై చెప్పారు అన్నమాచార్యులవారు. హంపీ విజయనగరంలోని విఠ్ఠలేశ్వరునిపైననే ఆయన చెప్పారు. కాని ఈ విఠ్ఠలుడే పండరిపురంలోని విఠ్ఠలునిగా అభేద దృష్టితో చెప్పారు. అన్నమయ్య తన సమకాలికుడైన పురంధరదాసుల వారి సహచర్యంతో విఠ్ఠలదేవునిపై కొన్ని కీర్తనలు చెప్పారు. శ్రీకృష్ణుని లీలలను బాల, ప్రౌఢ రాజలీల క్రింద విడగొట్టిన పెద్దలు మొదటి రెండు రకముల లీలలను విఠ్ఠలుని సేతలగా కీర్తించారు. ఆ స్వామియే తిరువేంకటాద్రిని ఉల్లమలర నిలిచాడంటారు అన్నమయ్య.

**ఉ॥ వెన్నలుగారె నీ సెలవి విఠ్ఠలనాథ! మరింత 'నాలి' గా**
**నన్నిటుచూచి తుంటరితనంబుల నవ్వెదవేల న్యాయమా?**
**సన్నుతిజేసె విఠ్ఠలుని చక్కగ దూడలగాచి నాడనెన్**
**అన్నయ కీర్తనంబు విని ఆ తిరువేంకటనాథుడౌననున్.**

**రాగం: ముఖారి**

వెన్నలు సెలవి గారే విఠ్ఠలేశా
నన్ను జూచి నవ్వేవు నాలి విఠ్ఠలేశా ॥వెన్నలు॥

బాలులతో నాడియాడి బడలితివి రావయ్య
వేలేటికురుల ముద్దు విఠ్ఠలేశా
కాళింగు దొక్కితి వట కటకట వుద్దండాలు
వోలి జేయ దొరకొంటి వోవిఠ్ఠలేశా ॥వెన్నలు॥

దూడల వెంట దిరిగి దూళి మేన నంటె నిదే
వేడుక యెంతో నీకు విఠ్ఠలేశా
యేడకొండో వొకవేల నెత్తితివి నీవట
వోడక యింత సేతురా వో విఠ్ఠలేశా ॥వెన్నలు॥





గొల్లెతల నంటి యంటి గొల్లు మేన నిండె నిదే
వెల్లవిరాయ బనులు విఠ్ఠలేశా
యిల్లిదె పండరంగిని యిటు శ్రీవేంకటాద్రిని
వుల్ల మలర నిలిచితో లి విఠ్ఠలేశా ॥వెన్నలు॥

**భావామృతం :**

ఓ విఠ్ఠలేశ్వరా! నీ పెదవుల అంచుల (సెలవి) నుంచి వెన్నలు కారి, నీవు ఎవరికీ తెలియకుండా వెన్నతిన్నావని చెప్పకనే చెబుతున్నది. అయినా ఏమీ తెలియనట్లు 'నాలి'గా (టక్కరితనంతో) నన్ను జూచి నవ్వుతావు. నీవు భలేవాడివయ్యా!

ఓ విఠ్ఠలా! నీతోటి గోపబాలురతో ఏవేవో ఆటలు ఆడి యెంత అలసిపోయావో చూడు. నీ వేలేటి కురులు (ఉప్పెన వలె యెగసిపడే వెంట్రుకలు) ఎంత ముద్దొస్తున్నాయో చూడు. కాళింగుని ఆగడాలను నివారించుటకు, వాడియొక్క ప్రతాపము నణచుటకు పూనుకొంటివి విఠ్ఠలేశ్వరా!

ఓ విఠ్ఠలా! (బాలకృష్ణా) దూడలవెంట తిరిగి తిరిగి నీ ఒంటినిండా యెంత దుమ్ముకొట్టుకొనిపోయి వున్నదో గమనించావా? నీకు అదే గొప్ప వేడుకగా వున్నదేమో కాని (మీ అమ్మ యెంత కోపగించుతుందో) ఎలా వున్నావో చూడు. అదటువుంచి, యాడకొండో (యెక్కడి గోవర్ధన పర్వతమో) కాని దానిని ఒకవేలిమీద యెత్తినావు. ఏమాత్రమూ ఓడక (వెనుదీయక) ఇన్ని ఘనకార్యములను చేశావుకదయ్యా! విఠ్ఠలా! నీవు అసాధ్యుడవు.

స్వామీ! నీవు గొల్లభామలను అంటుకొని అంటుకొని తిరిగినందున వారి గొల్లకంపు నీకు కూడ అంటింది. నీవు చేసిన కొంటెపనులను ఆ కంపే వెల్లివిరాయె (బయటపెడుతున్నది). ఇదిగో ఇక్కడ పండరంగిలో వున్న నీవే, అక్కడ తిరుమలలో వున్న శ్రీవేంకటేశ్వరుడవు. నీవు మా హృదయములానందకందళితములగునట్లు మాయెదుట నిలిచియున్నావయ్యా! విఠ్ఠలేశ్వరా!

## మున్నుడి 4-53

బహుశా కృష్ణాష్టమినాడు అన్నమాచార్యులవారు ఈ కీర్తన చెప్పివుంటారు. "వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్ళు పట్టుకొన్నా" డనే సామెతను ఈ కీర్తన కళ్ళకు కడుతుంది. ఆయన ఆ గాడిదకు 'కవణము' పెట్టాడట. శ్రీకృష్ణుడు గౌరవ దానవులను జంపాడట. కాయము దేవకికిచ్చాడట. వీయపు చుట్టాలెల్లవీడు వెట్టరో... అంటే? గంధాక్షతలు వాసుదేవుని కీయరో... అంటే? ఎన్ని సందేహాలొస్తున్నాయో చూశారా! ఈ వేంకటకృష్ణయ్య కీర్తనకు న్యాయం చేయాలనే... నా తపన.

**ఆ.వె.॥ జోలపాడరేల జోజోయనుచు మీరు**
**సహజమౌ జయంతి సఫలమాయె**
**షోడశోపచారమిడరె వేంకట కృష్ణు**
**కనెను పాడి యిటుల అన్నమయ్య**

**రాగం : దేసాళం**

జోజోయని మీరు జోల పాడరో
సాజపు జయంతి నేడే సఫలమిందరికి ॥జోజో॥

అదె చంద్రోదయమాయ హరియవతారమందె
మొదలు జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి
కదిసి యిట్టె నామకరణము జేయరో ॥జోజో॥

కాయము దేవకికిచ్చి గక్కున వాసుదేవుని-
కీయరో గంధాక్షతలిటు విడేలు
కాయకపు గాడిదెకు కవణము వెట్టిమరి
వీయపు చుట్టాలెల్ల వీడు వెట్టరో ॥జోజో॥

షోడశోపచారముల జొక్కించి శ్రీవేంకటేశు
బాడరో ధర్మము నిల్పె భారమణచె
వోడించె గౌరవదానవుల గంసాదుల జంపె
ఆడనే పాండవుల గాచెనని యర్ఘ్యమియ్యరో ॥జోజో॥





## భావామృతం

ఓ యువతుల్లారా! ఈరోజు 'సాజపు జయంతి'. (సహజముగా జరుపుకొను శ్రీకృష్ణ జయంతి) దీనిని సాఫల్యమగునట్లు జరుపుకొనండి. ఊయలలోని శిశువునకు జోజోయని జోలపాట పాడండి.

అదిగో చంద్రోదయమయింది చూడండి. శ్రీహరి అవతరించినాడు. మొట్టమొదట జాతకర్మలు (బొడ్డుకోయటం వంటివి) చేయండి. అదన (ఈ సమయమున) పుత్రోత్సవము అను 'ముచ్చట' జరుపండి. ఆపై పుణ్యాహము (పుణ్యాహవచనము అను పేరుగల ఆచారమున మూడుమార్లు పుణ్యాహము అని మంగళముల కొరకు చెప్పెదరు) చేయండి. కదిసి (సమీపించి) నామకరణ మహోత్సవము చేయండి.

ఓ నారీమణులారా! దేవకీదేవి ఇప్పుడే (గక్కున) ప్రసవించింది. ఆమెకు 'కాయము' (బాలెంతకు ఇచ్చే ఔషధము) ఈయండి. వాసుదేవునికి (వసుదేవునికి అని వుండాలి...) గంధాక్షతలు, విడేలు (తాంబూలము) ఈయండి. (దేవకి ప్రసవించగానే ఓండ్రబెట్టి తనను హెచ్చరించమని గార్ధభాసురుని కంసుడు నియమించాడట. ఇప్పుడా గాడిదను వసుదేవుడు కాళ్ళు పట్టుకొని ఓండ్రపెట్టవద్దని వేడుకొన్నాడట) గాడిద ఆయనను మన్నించి కాయకము (జీవనము) ఇచ్చిందట. అందుకు కృతజ్ఞతగా నేడు గాడిదకు 'కవణము' ఉలవలు మొదలైన పౌష్ఠికాహారము పెట్టండి. బంధువులంతా వచ్చారు. వీయపు చుట్టాలెల్ల వీడువెట్టరో (వియ్యాలవారు వచ్చి గుమిగూడండయ్యా!)

ఓ భామల్లారా! ఆ బాలకృష్ణుడే ఈ తిరుమలలోని వేంకటేశ్వరుడు. చొక్కించి (పరవశించి) ఆయనకు షోడశోపచారములు చేయండి. ఈయనే ఆనాటి శ్రీకృష్ణునిగా ధర్మసంస్థాపనము జేసి, భూభారమును, తగ్గించటానికి అవతరించి, కంసాది 'గౌరవదానవులను' (గొప్ప రాక్షసులను) ఓడించి చంపియున్నాడు. పాండవులను అక్కడే రక్షించాడు. ఆనాడు ధర్మజుడిచ్చినట్లు నేడు మీరూ ఈయనకు అర్ఘ్యమునియ్యండి.

**4-54**

## మున్నుడి

విరాగియైన అన్నమాచార్యులవారు అనేక అద్భుత వైరాగ్య కీర్తనలు చెప్పారు. అన్నిటికీ కారణం 'హరిమాయ' కదా! ఇంకా విచారించడం దేనికి? శ్రీవేంకటేశ్వరుని శరణని చేసిన పాపాలన్నీ పొగమంచులా రూపుమాపుకోరాదా? అంటున్నారు. టెంకాయలో నీరు వచ్చినట్లు, ఏనుగు తిన్న వెలగపండులో గుజ్జు పోయినట్లు మేళ్ళూ (మంచి) కీళ్ళూ (చెడు) వస్తూపోతూనే వుంటాయి. మనం చేసేది యేదైనా వుందంటే ఆ శ్రీహరిని 'శరణు మహాప్రభో!' అనడమే. ఆ తరువాతి కాలంలో వచ్చిన అనేక 'సుభాషితాలకు' అన్నమయ్యే మూలమనడానికి ఈ కీర్తన చాలదా?

**ఉ॥ ఇందుకు యేలరా వగపు ఈశ్వరు మాయలివెంచి చూడగా**
**యెందుకు మూలమౌ హరిని యెంచవు చింతనజేయవేలనో?**
**అందని నారికేళమున అద్భుతనీరములెట్లు వచ్చెరా**
**పొందుగ వేంకటేశ్వరుని మొక్కరొ దిక్కని అన్నమయ్యనెన్.**

**రాగం : మాళవి**

ఇందులకు జింతించనేల - యీశ్వరుని మాయలివి
యెందుకు మూలము హరి - యీతని జింతించరే ॥ఇందులకు॥

ఇల నారికడపుగా - య(యె) కు నీరు వచ్చినయట్టు
తలచి రాగలమేలు - తన్ను దానే వచ్చురే
లలి నేనుగు దిన్న వె - లగ పంటి బేసము
వలనే పోగలవెల్ల - వడి దానే పోవురే ॥ఇందులకు॥

నిండిన యుద్దములోన - నీడ వొడచూపినట్లు
దండియైన పుట్టుగులు - తన్నుదానే వచ్చురే
పండిన పండ్లు తొడమ - బాసి వూడినయట్లు
అండనే మరణములు - అందరికి సరిరే ॥ఇందులకు॥





పెనురాతిపై గడవ - పెట్టగా గుదురైనట్లు
తనుదానే చింతింప - దలపు నిలుచురే
ఘనుడు శ్రీవేంకటేశు - గని శరణన్న జాలు
వెనక పాపాలు మంచు - విచ్చినట్లు విచ్చురే ॥ఇందులకు॥

**భావామృతం :**

ఓ నరుడా! ఇందుకోసం చింతించుట దేనికి? అన్నిటికీ (చావు పుట్టుకలకు, శుభాశుభాలకు) కారణం ఆ ఈశ్వరుడే కదా? ఆయన మాయవలననే అన్నీ జరుగుతాయి. కనక ఆ శ్రీహరినే చింతించి శరణు పొందరాదా?

శ్రీహరి కరుణవలన మనకి జరుగవలసిన మంచి మన ప్రమేయం లేకనే జరుగుతుంటుంది. నారికడపుగాయ (టెంకాయ) లో తీయటి నీరు వచ్చినట్లు వస్తూనే వుంటుంది. శ్రీహరి కృపలేకపోతే ఏనుగు మింగిన వెలగపండులో 'గుజ్జు' మాయమైనట్లు వైభవం పోయి తనకు తానే మటుమాయమైపోతుంది.

నిండు అద్దములో నీడలు (ప్రతిబింబాలు) వాటంతట అవే అనేకం వస్తూ పోతూవుంటాయి. ఏదీ స్థిరంగా నిత్యముగావుండదు. అదేవిధముగా అంతులేని పుట్టుకలూ, మరణాలూ వాటికవే సంభవిస్తూనే వుంటాయి. ఆ శ్రీహరిని రమ్మని పిలిచినప్పుడు తొడిమ వూడి పండు తనంతతానే పడిపోయినట్లు ఈ శరీరమూ దానంతట అదే పడిపోతుంది. ఇవి అందరికీ సరిరే... (అందరికీ సమానమేరా...) భగవంతునిగా పూజలందుకొనే వానికైనా, పరమ నికృష్టునికైనా ఒకేలా జరుగుతాయి.

పెద్దరాతిపై ఒక నీటి కడవ పెట్టాలని ప్రయత్నం చేస్తే మొట్టమొదటి ప్రయత్నంలోనే సాధ్యం కాదు. కానీ ప్రయత్నం చేస్తుంటే దానంతటదే కుదురుగా నిలబడుతుంది. మనస్సు నిలకడ పొందాలంటే ఒక్కసారిగా జరిగే పనికాదు. సాధనవలననే పనులు సమకూరు జగతిని. స్థిరచిత్తం కూడా ప్రయత్నంవలననే అబ్బుతుంది. సర్వసమర్థుడైన శ్రీవేంకటేశ్వరుని శరణుంటే చాలును మనం వెనక జన్మలలో చేసిన పాపాలు కూడా పొగమంచువలె విడిపోయి విచ్చుకొంటాయిరా...

## 4-55

## మున్నుడి

సంస్కృతంలో నా పాండిత్యం 'అమావాస్య చంద్రుడు'. నా మిత్రుల సహకారంతో దీని తాత్పర్యం ఒకచోట క్రోడీకరించి, భావామృతం ఎలా వ్రాయాలా అని ఆలోచించాను. ఆలోచించినకొద్దీ అన్నమాచార్యులవారు శ్రీహరి దశావతారములను గానం చేస్తున్నారేమో... అనిపించింది. నా వివరణే ఆచార్యులవారి మనోగతం అనే సాహసం చేయలేను, కాని సప్తవర్ణ భూషితమైన సూర్యకాంతి ఏ వర్ణమని చెప్పగలం. భావయామి వేంకటేశమ్‌లో ఆ స్వామిని యెలా అయినా భావించ వచ్చును. ఇలా... భావించి... చూడండి.

**ఆ.వె॥ తరచి తరచి చూడ హరి అవతారముల్**
**మెరిసె తళుకుమనుచు మేధయందు**
**ఏమి కీర్తనంబు!! అమరవాణియె భళా!**
**అన్నమయ్య సాటి అవని కలరె?**

**రాగం : బేగడ**

సతతం శ్రీశం
హితం పరాత్పర మీడే ॥సతతం॥

గదాధరం మేఘ గంభీర ని-
నదం పరమోన్నత శుభదం
మృదుతర గమనం మేదినీధరం
హృదయ నిలయ మహమీడే ॥సతతం॥

నందకధరం జనార్దనం గో-
విందం చారు ముకుందం
నందగోప వరనందన కందం
యిందు రవి నయన మీడే ॥సతతం॥





గరుడగమన మురగశయన మధికం
పరమపదేశం పావనం
తిరువేంకటగిరి దేవ మతులం మ-
హిరమణం స్థిరమీడే ॥సతతం॥

**భావామృతం :**

సతతం (ఎల్లప్పుడు) శుభంకరుడును, హితం (శ్రేయస్సును ప్రసాదించువాడను) పరాత్పరం (శ్రేష్ఠులకెల్ల శ్రేష్ఠుడును), అయిన వానిని, ఈడే (ప్రార్థించుచున్నాను).

గదాధరం (కౌమోదకి అను గదను ధరించు వాడును) మేఘ గంభీర నినదం (మేఘ గర్జనవంటి కంఠ స్వరం కలిగినవాడును... నరసింహుడు), మిక్కిలి ఉన్నతమైన శుభప్రదములైన వాటిని నొసగినవాడును (వేదములనిచ్చిన మత్స్యావతారుడు), మృదుతర గమనం (మెల్లగా కదలు చలనము కలవాడును... కూర్మావతారం), మేదినీధరం (భూమిని తనముట్టెపై ధరించినవాడును (వరాహావతారం) సర్వజనుల హృదయ వాసియైన మహానుభావుని ప్రార్థించుచున్నాను.

నందకము అను ఖడ్గమును ధరించువాడును (కల్కిఅవతారం), జనార్దనం (జనులచేత వేడుకోబడినవాడు... శ్రీరాముడు), గోవిందం (గోవులను కాచినవాడును... బలరాముడు), చారు ముకుందం (అందమైన పద్మమును హస్తమున దాల్చిన వాడును), నందగోప వరనందనకందం (నందగోపునికి శ్రేష్ఠమైన ఆనందము నొసగు స్వరూపము కలవాడును... శ్రీకృష్ణావతారము), రవిచంద్రులు నయనములుగా భాసించినవాడును... (త్రివిక్రముడైన వామనుడు) అయిన సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాను.

గరుత్మంతునిపై పయనించువాడును, ఉరగశయనం (ఆదిశేషునిపై నిద్రించువాడును), పరమపదేశం (పరమ్+అపదేశమ్=పరమును సాధించుటెట్లో తెలిసినవాడును... బుద్ధావతారము), ఇప్పుడు ఇవన్నీ ఒకేచోట వెలసిన తిరువేంకటాచలాధిపతియుయైన స్థిరమైన శ్రీవేంకటేశ్వరుని నేను ప్రార్థించుచున్నాను.

## 4-56

## మున్నుడి

'త్రువి' అనే పదము యే నిఘంటువులో వెదకినా దొరకదు. చిన్న పాపలు తమ రెండు పెదవులను ఒకేసారి కదిలిస్తూ 'గాలి'ని బయటకు వదిలితే 'త్రువ్' అనే ధ్వని వస్తుంది. పెద్దవాళ్ళు అలా చేస్తే పాప ఆ ధ్వనికి నవ్వుతుంది. వాళ్ళు పాపని నవ్వించటానికి అలా చేయగా పాపకూడా నేర్చుకొంటుంది. "త్రువ్వట బాబా తలపై"... అనే తెనాలి రామకృష్ణుని పద్యం ఒకటి విన్నాను నా చిన్నప్పుడు. చిన్నారి కృష్ణయ్యకు 'త్రువి' పాట పాడిన అన్నమాచార్యులవారు, అది చదువుతున్న మనం యెంత అదృష్టవంతులం!!!

**ఆ.వె॥ అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు**
**వేంకటగిరిపైన వెలయు శిశువు**
**దొబ్బురోలు శిశువు త్రువి త్రువి త్రువియని**
**అన్నమయ్య పాడెనద్భుతముగ.**

**రాగం : మంగళకేశిక**

అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు
దొబ్బుడు రోలశిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥

పుట్టు శంఖ చక్రముల బుట్టిన యా శిశువు
పుట్టుకతోల్లేమారు పుట్టువైన శిశువు
వొట్టుక పాలువెన్నలు నోలలాడు శిశువు
తొట్టెలలోని శిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥

నిండిన బండి దన్నిన చిన్ని శిశువు
అండవారి మదమెల్ల నణచిన శిశువు
కొండలంతేశసురుల గొట్టిన యాశిశువు
దుండగంపు శిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥





వేగైన వేంకటగిరి వెలసిన శిశువు
కౌగిటి యిందిర దొలగని శిశువు
ఆగిపాల జలధిలో నందమైన పెనుబాము
తూగు మంచము శిశువు త్రువి త్రువి త్రువి ॥అబ్బు॥

**భావామృతం**

ఈ శిశువు చాల అబ్బురంపు శిశువు (ఆశ్చర్యకరమైన పాపాయి). వీడు ఆకుమీది శిశువు (ఆనాడు జగత్తంతా నీటితో నిండిపోయినప్పుడు మఱ్ఱి ఆకుమీద పవళించిన శిశువు). ఇతడు "దొబ్బుడు రోల శిశువు" (ఱోటిని తోసుకుంటూ పోయి మద్దిచెట్లు కూల్చిన శిశువు). త్రువి...త్రువి...త్రువి.

ఇతడు శంఖ చక్రాలతో జన్మించిన శిశువు. ఇతడు 'పుట్టుకతోల్లే మారుపుట్టువైన శిశువు' అనగా, పుట్టిననాడే మార్పిడి జెందిన శిశువు (యశోద కన్న ఆడ శిశువు స్థానంలో తను పెరిగిన శిశువు). ఇతడు పాలు వెన్నలు అధికముగా కలుగుటచే వాటిలో ఓలలాడిన శిశువు. రేపల్లెలో ప్రతి స్త్రీ తొట్టెలలో వేసి వూపి తరించిన శిశువు. త్రువి...త్రువి...త్రువి.

ఇతడు 'నిండిన బండి' ని (పూర్తిగా సిద్ధముగా వున్న శకటమును) ఒక్క తాపు తన్నిన చిన్ని శిశువు. (శకటాసురవధ చేశాడు కదా!) అండవారు (రాజులు) అనబడు మదాంధుల మదమును నిర్మూలించిన శిశువు. కొండలంతేశసురులగొట్టిన శిశువు, (పర్వతాలవంటి పూతన మొదలైన రాక్షసులను తుదముట్టించిన శిశువు). ఇతడు దుండగంపు శిశువు (దుష్టుడైన పిల్లవాడు... అన్నీ పాడుచేయు అల్లరివాడు) త్రువి...త్రువి...త్రువి.

ఇతడే వేంకటాద్రిమీద వెలసిన 'వేగైన' శిశువు. వేగముగా కనికరించు శిశువు. ఇతడు తన కౌగిట లక్ష్మీదేవిని యెల్లప్పుడు తొలగక స్థిరవాసము చేసికొనిన శిశువు. ఇతడు పాలసముద్రముపై విశ్రమించిన శిశువు. ఇతడు తూగుమంచముపై (వూగుతున్న వూయలే మంచముగా) పవళించు శిశువు. త్రువి...త్రువి...త్రువి.

4-57

## మున్నుడి

అన్నమాచార్యులవారి 'అలరులు కురియగ నాడెనదే' అనే జగద్విఖ్యాతమైన కీర్తనకు, ఈ కీర్తనకు ఎన్నో పోలికలున్నాయి. ఈ లలిత శృంగార కీర్తనలో అమ్మ అలమేల్మంగ సొగసులను వర్ణిస్తున్నారు, ఆచార్యులవారు. ఆమె ప్రదర్శించే చిరు సిగ్గు సిరిదొలకుతున్నదట. లలితమైన లావణ్యపు విలాసముతో ఆ నెలత (యువతి), శ్రీనివాసునికి తనను తానర్పించుకొని నేటితో ధన్యత పొందినది అంటున్నారు. ఎందుకంటే... ఆమె తిరువేంకటాచలాధిపుని మన్నన పొందిందట.

**తే॥ లలిత లావణ్య గరిమ విలాస మొప్ప**
**నెలత ధన్యత గాంచెను నేటితోడ**
**వేంకటేశుని మన్నన పేర్మినొందె**
**అరవిరై యొప్పె తెలిపెను అన్నమయ్య.**

**రాగం : లలిత**

లలిత లావణ్య విలాసము తోడ
నెలత ధన్యత గలిగె నేటి తోడ ॥లలిత॥

కుప్పలుగా మైన సలుకొన్న కస్తూరితోడ
తొప్పదోగేటి చెమటతోడ
అప్పుడటు శశిరేఖలైన చనుగవతోడ
దప్పిదేరేటి మోము తమ్మితోడ ॥లలిత॥

కులుకు గబరీభరము కుంతలంబులతోడ
తొలగదోయని ప్రేమతోడ
మొలక నవ్వులు దొలకు ముద్దు చూపులతోడ
పులకలు పొడవైన పొలుపుతోడ ॥లలిత॥





తిరువేంకటాచలాధిపుని మన్ననతోడ
సరిలేని దివ్య వాసనల తోడ
పరికించరాని అరవిరి భావము తోడ
సిరి దొలకెడి చిన్ని సిగ్గుతోడ ॥లలిత॥

### భావామృతం

లలితమైన (అందమైన) ఆమె లావణ్యము (ముఖకాంతి) యొక్క విలాసము (ప్రియుని సందర్శనముచే ఇనుమడించిన ముఖసౌందర్యము) తోడై ఆ నెలత (యువతి) నేటితో ధన్యత బొందినది.

ఆమె తన శరీరముపై కస్తూరిని కుప్పలుగా సలుకొన్నది (మెత్తుకున్నది). ఆమెకు కంగారుతో 'తొప్పదోగేటి చెమట' (తడిసి ముద్ద అయ్యేంత చెమట) పట్టినది. ఆమె కుచయుగళము అర్ధచంద్రుని రేఖలై మెఱయుచున్నవి. నోరు తడి ఆరిపోతున్నందున ఆమె తాంబాలమును సేవించినది. ఆ తాంబూలపు తెమ్మతో ఆమె ముఖసౌందర్యం ఇంకా ఎక్కువయింది.

స్వామిపై ప్రేమ భావములు వుప్పొంగి ఆమె కులికినది. అప్పుడామె కబరీ భారములోని (కొప్పులోని) కుంతలములు (కేశములు) రేగి ఆమె వాటిని మెల్లిగా సవరించుకొనుచున్నది. స్వామి ఆలోచనలతో ఆమె పెదవులపై చిరునవ్వు నాట్యమాడింది. ముద్దు చూపులతో దీర్ఘమైన పులకరింత వలన ఆమె అందం ద్విగుణీకృతమైంది.

ఆమెకు అంతలోనే తిరువేంకటాచలాధీశుని మన్నన కలిగింది. సాటిలేని దివ్యమైన పూర్వజన్మ స్మృతులు ఆమెకు కలిగినవి. తను శ్రీలక్ష్మినని, ఆమెకు అవగతమవగానే ఎన్నడూ కానరాని 'అరవిరి భావములు' (అప్పుడే మొగ్గ తొడుగుతున్న భావములు) ఆమెలో పొడచూపి, వైభవోపేతమైన లేత సిగ్గుల దొంతరయైనది ఆ శ్రీదేవి.

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని రథోత్సవమును కన్నుల పండుగలా చూచి పులకించిన అన్నమాచార్యులవారు, చక్కటి కీర్తనను వినిపిస్తున్నారు. ఇందిరానాథుడు తేరుమీద వస్తున్నాడు, హారతులు, కానుకలు ఈయండి. సృష్టిలోని జీవకోట్లే కాక, ముక్తిపొంది నిత్యులైన దివ్యాత్మలు కూడ, మూవరుసలలో (మూడు వరుసలలో) కొలిచే తేరు ఇదే నంటున్నారు. వేదములు ఈ స్వామి రథమునకు లాగే త్రాళ్ళట. పంచభూతముల తేరు... అంటే జీవనాధారమైన పంచభూతములన్నీ కనరాని దేవతలై కొలిచే తేరు అని నేను భావించాను.

**ఉ॥ ఆరతులెత్తరో హరికి ఆవల కానుక లీయరో వెసన్**
**కూరిమి ఇందిరారమణు గొల్వరొ ఏగుచు వచ్చె వీధులన్**
**తేరున వేంకటేశ్వరుని తేకొని గాంచుడు అన్నమయ్యనెన్**
**మీరిన భక్తితో వినిచె మేలగు కీర్తన నాలకింపరో.**

**రాగం : బౌళి**

ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తల నేగి వచ్చీని యిందిరానాథుడు ॥ఎత్తరో॥

గరుడ ధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదముల చేరుల తేరు
సురలు మునులు బట్టి సొంపుతోడ దియ్యగాను
యిరవుగ నేగివచ్చీ నిందిరా నాథుడు ॥ఎత్తరో॥

జీవకోట్లున్న తేరు శేషుడే రూపైన తేరు
వేవేల సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులును ముక్తులును గొలువగా
యీవల నేగి వచ్చీ నిందిరానాథుడు ॥ఎత్తరో॥





పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రి మీదటి తేరు
కొంచక యలమేల్మంగ గూడివచ్చేనదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాథుడు ॥ఎత్తరో॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఇత్తలన్ (ఇక్కడ) ఇందిరానాథుడైన శ్రీవేంకటేశ్వరుడు, యేగివచ్చె (ప్రయాణమై వస్తున్నాడు). ఈ మహానుభావునికి హారతులెత్తండి. విరివిగా కానుకల నర్పించి తరించండి.

ఈ తేరు గరుడధ్వజము యెత్తినటువంటి తేరు. ఇది బంగారముతో నిండిపోయిన తేరు. దీనికి వైభవోపేతముగా చతుర్వేదములు, నాలుగు చేరులై (కట్టిలాగునటువంటి త్రాళ్ళు) శోభిల్లినవి. దేవతలు, మునులు పట్టుకొని సొంపుగా తీయగా కీర్తిస్తూ తాము కూడ ఈ తేరు త్రాళ్ళు పట్టి లాగుతున్నారు. (మనబోటి అల్పులకు వారు కనిపించరు). ఈ విధంగా నెలకొని ఇందిరానాథుడు తెరుమీద వస్తున్నాడు.

ఆదిశేషుడు భరించి ధరించిన తిరుమలనాయకుడున్న ఈ తేరు వస్తుంటే, సృష్టిలోని జీవకోట్లే కాక ముక్తి పొందిన వారు, నిత్యులైన ఈ లోకంలో వుండి స్వామిని సేవించే దివ్యాత్మలు కూడ మూడు వరుసలలో నిలిచి వెంట వూరేగి వస్తున్నారు. ఈ ఏడుకొండలవాడిని ఇందిరానాథుని కొలిచి తరించండి.

పంచభూతములని పిలువబడే భూమి, గాలి, నీరు, కాంతి, శూన్యము దేవతా స్వరూపులై దివ్యశక్తులై ఈ స్వామిని సేవిస్తాయి. ఆయన వచ్చే ఈ బ్రహ్మాండమైన తేరుని లాగుతుంటాయి. ఉన్నతమైన శ్రీవేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరి అలమేల్మంగతో కూడి "కొంచకనేగివచ్చె", సంకోచము లేక వూరేగి వస్తున్నాడు. లెక్కించలేని మహిమలుగల ఈ దేవదేవుని, ఇందిరానాథుని సేవించండి... తరించండి.

## 4-59

## మున్నుడి

మారుమూల ప్రదేశాలకు పోయి (మధురానగరంలో) చల్ల అమ్ముకొంటున్నారు రేపల్లెలోని గొల్లభామలు. అన్నమాచార్యులవారు అవి యెటువంటి చల్లలో వర్ణిస్తున్నారు. కూచిపూడి వారి "మధురానగరిలో చల్లలమ్మబోదూ...' వంటి కీర్తనలకు, మూలములు ఇట్లాంటి అన్నమయ్య కీర్తనలేనేమో అని నాకు అనిపిస్తుంటుంది. ఈ కీర్తన మొదటి పాదంలో 'నమ్ముదు' ఆఖరి పాదములో 'నమ్మీ' ఒకటే అనుకొంటే... తొందరపడక జాగ్రత్తగా భావామృతం చదవాల్సి వుంటుంది. ఎంత చక్కని కీర్తనో కదా!

**ఆ.వె॥ మూలమూలపోయి ముద్దుగుమ్మలు చల్ల**
**అమ్ముచుందురనెను అన్నమయ్య**
**రేయి బగలు త్రాగరే యని పాడెను**
**చల్లగూర్చి ఎవడు అల్లె కవిత?**

**రాగం : పాడి**

మూలమూల నమ్ముదు చల్ల ఇది
రేలు బగలు గొనరే చల్ల ॥మూల॥

పిక్కటిల్లు చన్నుల గుబ్బెత వొకతి కడు
జక్కనిది చిలికిన చల్ల
అక్కున జెమట గార నమ్మీని యిది
యెక్కడ బుట్టదు గొనరే చల్ల ॥మూల॥

వడ చల్లు మేని జవ్వని వొకతి కడు
జడియుచు జిలికిన చల్ల
తడబడు కమ్మని తావులది మీ-
రెడయ కిపుడు గొనరే చల్ల ॥మూల॥





అంకుల కరముల వొయ్యారొకతి కడు
జంకెనల జిలికిన చల్ల
వేంకటగిరిపతి వేడుకది
యింకానమ్మీ గొనరే చల్ల ॥మూల॥

**భావామృతం :**

ఓ జనులారా! మధురానగరంలో మారుమూల ప్రదేశాలకు కూడ పోయి, రేపల్లె గొల్లభామలమైన మేము అమ్ముకొనే చల్ల ఇదిగో రాత్రి కాని, పగలు కాని దీనిని కొనుక్కొని త్రాగండి.

ఈ చల్లని చూశారా? పిక్కటిల్లు చన్నులు గల ఒక చక్కని చుక్క, దీనిని చిలికినది. గుండెలపై చెమట ధారాళంగా కారుతున్నా లెక్కసేయక తిరిగి తిరిగి అమ్మినటువంటి చల్ల ఇది. ఇటువంటి చల్ల ఎక్కడా పుట్టదు. ఇప్పుడు దొరికింది కాబట్టి ఈ చల్ల త్రాగండి.

ఒంట్లో వేడి అధికంగా వున్న ఒక గొల్లభామ, ఎంతో భయంతో (వడకుతూ) జాగ్రత్తగా చిలికిన చల్ల ఇది. ఈ చల్ల తావులు (పరిమళములు) కమ్మగా వుండి మీకు తడబాటు కలుగజేస్తాయి. కావున మీరంతా వదలకుండా ఇప్పుడే ఈ చల్ల త్రాగండి.

ఈ చల్లని చూశారా? ఒక ఒయ్యారి దీనిని అంకుల కరములతో (లేత మొగ్గల్లాంటి చేతులతో) జంకెనల (బెదరింపులకు లోనై) చిలికినది. అందుకని ఇదంటే ఏడుకొండల వేంకన్నరునకు భలే ఇష్టము. (ఆయనకి కావలసింది మన భయ భక్తులే కదా!) అందుకని ఆ స్వామిని ఇంకా యెక్కువగా 'నమ్మి' ఈ చల్లని సేవించండి. తరించండి.

**4-60**

## మున్నుడి

విశిష్టాద్వైత మతం స్వీకరించి అన్నమాచార్యులయిన అన్నమయ్య వైష్ణవ ప్రాశస్త్యంపై లెక్కకు మిక్కుటమైన కీర్తనలు చెప్పారు. ఈ కీర్తనలో విష్ణుపాదసేవా మహాత్మ్యమును వివరిస్తున్నారు ఆచార్యులవారు ఇహపరసాధనములైన ఆ శ్రీహరి పాదముల మహిమ మీరూ ఈ సంకీర్తనలో అవధరించండి. వేంకటరమణుడైన, అనంతుని పాదములే ఆయుష్యభౌష్యములట, అంటే... చదవండి మరి...

**చం॥ వదలము విష్ణుపాదములు మాకవి విద్య సుబుద్ధి నీయుగా**
**చెదరక వైష్ణవంబుగొని శ్రీపతి నమ్మితిమింక కర్మమా**
**వదలుము మమ్ములన్ హరికి భక్తుల మంచనె అన్నమార్యుడున్**
**ముదముగ బొందుచున్ శరణు మోక్షపు బాటను తొక్కెరా భళా!!**

**రాగం : వసంత**

విష్ణుదేవ పాదములే విద్యాబుద్ధీ మాకు
వైష్ణవుల మైతి మింక వదలవో కర్మమా ॥విష్ణు॥

గోవిందుని పాదములే కోరి యిహపరములు
శ్రీవిభుని పాదములే చేరు వేదశాస్త్రములు
దేవదేవుపాదములే దిక్కును దెసయు మాకు
భావములో నిలిపితి పాయరో పాపములు ॥విష్ణు॥

హరిపాదములే మాకు నన్నపాన భోగములు
పరమాత్మ పాదములే పాడీ పంటామాకు
మురహరి పాదములే ముందర వెనకా మాకు
శరణంటి మెందైనా చనరో దుఃఖములు ॥విష్ణు॥





అనంతుని పాదములే ఆయుష్య భౌష్యములు
దనుజారి పాదములే ధనధాన్య ధర్మములు
యెనలేని శ్రీవేంకటేశుడితని పాదములే
మనసున గొలిచితి మానరో భవములు ॥విష్ణు॥

**భావామృతం :**

ఓ భక్తులారా! శ్రీమన్నారాయణుడైన విష్ణుమూర్తి పాదపద్మములే మాకు విద్యాబుద్ధులు. ఓ కర్మమా! మేమిప్పుడు విశిష్టాద్వైతమతం స్వీకరించి వైష్ణవులమయ్యాము. కావున నీవు మమ్మల్ని వదలిపెట్టుము.

గోవిందుని పాదములే మాకు ఇహపరసాధనములు. అన్యమైనవి కోరనేల? మేము శ్రీపతి పాదములు చేరుకొంటే చతుర్వేదములు పఠించినట్లే. మాకు దిక్కుదారి కూడ ఆ దేవదేవుని పాదములే.

మాకు అన్నపానములందించే భోగముకూడ శ్రీహరి పాదపద్మములే. మా ఇంట పాడీ పంటాకూడ పరమాత్మ యొక్క పాదపంకజములే. మా వెనక ముందు వేరే మంచి కోరువారులేరు. ఆ శ్రీహరి పాదములే మాకు మంచి నిచ్చేవి. మేము ఆ లక్ష్మీవల్లభుని ఆశ్రయించాము. ఆయన శరణు పొందాము. కనుక దుఃఖములారా! మీరెక్కడి కన్నా వెళ్లిపోండి.

అనంతుని పాదపంకజములే మాకు ఆయురారోగ్యముల నందించును. దానవ వైరియైన దామోదరుని పాదములే మా పాలిట ధనధాన్యములు మరియు ధర్మముకూడా. లెక్కింపరాని శ్రీవేంకటేశ్వరుని పాదపద్మములే నా మనస్సున ఆరాధించుచున్నాను. ఇక భవబంధముల బాధ మాకేల?

## 4-61

## మున్నుడి

బహుశా హంపీ విజయనగరంలోని విఠలేశ్వరునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అనేక కీర్తనలలో ఇది ఒకటి అయివుంటుంది. పండరంగినాథునివి రుచులైన మాటలు. తమని రూఢి కెక్కించిన రచనకాడలు. స్వామి నవ్వులు చిలకరిస్తున్నట్లు ఆ మూర్తి వున్నదేమో అనిపిస్తోంది. పులకలు పైరులవలె విస్తరించినట్లు ఒక్క అన్నమయ్య మాత్రమే భావించగలరు. 'బాపు' అంటే నేటికాలంలో 'అమ్మబాబోయ్' అనటం వంటిది.

**చం॥ రసికుడ పండరంగి విఠలా! యని పాడెను అన్నమయ్యనీ**
**పసలను చిక్కినామనెను భామినియై తను చెప్పె కీర్తనన్**
**ముసిముసి నవ్వుతో ముదిత ముంగిట చన్నులనంటి నాడనెన్**
**వెసగల రంగడే వెలసె వేంకటనాథుని రూపుతో యనెన్**

**రాగం : దేసాళం**

రసికుడవౌదు పండరంగినాథా నీ
పసల జిక్కితి మిదె పండరంగినాథా ॥రసికుడ॥

యివ్వల నవ్వల నేడు యిటు నీతో నవ్వి నవ్వి
రవ్వైతిమి గదో పండరంగినాథా
కువ్వ లాయ నీ చేతలు గురి యయితి మింతకు
పవ్వళించితిరి మేలు పండరంగినాథా ॥రసికుడ॥

రుచు లైన నీమాటలె రూఢి కెక్కించెను మమ్ము
రచనకాడ వో పండరంగినాథా
యిచట నీ రాకలకు నెదురు చూపించి మేలె
పచరించితివి బాపు పండరంగినాథా ॥రసికుడ॥





సారె దీసితివి కొప్పు చన్నులంటి చూపితివి
రారాదా యిక పండరంగినాథా
కూరిమి శ్రీవేంకటాద్రి గూడి చొక్కించితి మమ్ము
పైరు లాయ బులకలు పండరంగినాథా ॥రసికుడ॥

**భావామృతం :**

ఓ పాండురంగ విఠలా! నీవు చక్కటి 'రసికుడ'వయ్యా! మేమేమో నీ పసల (చాతుర్యమునకు) చిక్కినాము ప్రభూ!

ఓ పండరంగి నాథా! నీవు ఇట్లా నవ్వుతుంటే మేముకూడ నీతోబాటు నవ్వినవ్వి, రవ్వయితిమి (చులకనయిపోయాం). నీ చిలిపి చేష్టలు కువ్వలాయ (చాల యెక్కువైనాయి). నీవల్ల మేము ఇన్ని చిక్కుల్లో పడ్డాము. ఇకనైనా నీవు నీ దేవేరులు పవ్వళించారు. మాకదే మేలు.

ఓ విఠలా! రుచికరమైన నీమాటలు, రూఢి కెక్కించెను (మమ్ము నలుగురి నోళ్లల్లో నానేట్లు చేశాయి). నీవు యెంత రచనకాడవు!!). ఇక్కడ నీరాక కోసం మేం యెదురు తెన్నులు చూసేట్లు చేసి మమ్ము పచరించితివి (తినేసినంత పనిచేశావు) స్వామీ!

ఓ పండరంగినాథా! ఇంకా యేం చెప్పమంటావు. ప్రభూ! నీవు కొప్పును సారెదీసితివి. (నీ కొప్పును చుట్టవలె చుట్టుకొంటివి). మధ్యమధ్య మా స్తనములను యేదో ఒక నెపంతో తాకుచునే యుంటివి. ఇప్పుడెవరు కాదన్నారు? ఒక్కసారి మావద్దకు రారాదా? నీకు మాత్రం తీరిక యెక్కడిదయ్యా! శ్రీవేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుడువై మమ్మల్ని పరవశింపచేస్తూ నే వున్నావు కదా! ఓ పండరంగినాథా! నిన్ను తలచినంత మాత్రాన మా శరీరంపై పులకరింతలు 'పైరులాయ' (విరివిగా పండిన పైరువలె మొలకలెత్తాయి) ప్రభూ!

**4-62**

## మున్నుడి

అలమేల్మంగను వేంకటేశ్వరుడు పరిణయమాడుతున్నాడు. ఐదురోజుల పెళ్ళి. నిర్వాహకులు అన్నమాచార్యులవారు. తానే ఒక పేరంటాలై తోటి వారితో ఈ పెండ్లికొడుకు, పెండ్లికూతురు మాటిమాటికీ సంతోషపడుతూ ఆనందంలో తలమునకలైయున్నారు. మీరంతా పాడుతూ వారినింకా సంతోషపెట్టండి అంటున్నారు. ముహూర్తం దగ్గర పడుతుంటే తత్తరపాట్లు పడతారెందుకు అని హెచ్చరిస్తున్నారు. ఘన రతుల నలసిన వేళ గంధము, కస్తూరి ఇమ్మనటం ఆచార్యులవారి ప్రత్యేకత. వారికే స్వామివద్ద ఆ చనువు వున్నది.

**కం॥ పేరంటాండ్లను పిలిచెను**
**పేరిమితో నన్నమయ్య పెండిలి జూడన్**
**శ్రీరమణి వేంకటేశుని**
**చేరువయై పెండ్లియాడె సిరులొలుక ననెన్**

**రాగం : సాళంగనాట**

పేరంటాండ్లు పాడరే పెండ్లివేళ
సారెసారె నిద్దరికి సంతోషవేళ ॥పేరం॥

చిత్తజు తల్లికి వేగ సింగారించరె మీరు
తత్తరించే రిదె ముహూర్తపువేళ
హత్తి తలబాలు నారాయణుని బోయుమనరె
పొత్తుల నిద్దరికిని బువ్వపు వేళ ॥పేరం॥

పాలవెల్లి కూతురుకు పసపులు నలచరే
చాలించరే జోలి వీడు చదివే వేళ
పాలుపడి పరపులు పరచరే దేవునికి
నాలుగో దినము నేడు నాగవెల్లి వేళ ॥పేరం॥





అంది బో(బా)గాలియ్యరే అలమేలు మంగకును
కందువ శ్రీవేంకటేశు గలసేవేళ
గందము గస్తూరి నీరె ఘనరతి నలసిరి
కుందక యిద్దరు నిక గొలువుండేవేళ ॥పేరం॥

## భావామృతం

ఓ పేరంటాండ్లలారా! శ్రీవేంకటేశ్వరుడు తన ప్రియురాలు అలమేల్మంగను పరిణయమాడుతున్నాడు. మీరంతా చక్కటి పెండ్లిపాటను అందుకోండి. మాటిమాటికీ సంతోష పారవశ్యం చెందుతున్నారు వీరిద్దరూ. వీరి కోసం చక్కగా పాడండి.

మన్మథుని తల్లిగారైన ఈమెను త్వరగా సింగారించండి. ముహూర్తం వేళ దగ్గరపడుతున్నది. ఏ క్షణాన్నైనా 'త్వరగా పెండ్లికూతుర్ని తీసుకు రారండని' పురోహితులు కేకవేస్తారు. త్వరపడండి. నారాయణుడైన ఈ పెండ్లి కొడుకును హత్తి (కలసి) తలంబ్రాలు పోయమని చెప్పండి. వీరిద్దరినీ ఒక పొత్తులో కూచోబెట్టి భోజనం పెట్టండి. ఇది బువ్వపు వేళ (భోజనాల సమయము).

ఈ వధువు పాలవెల్లి (క్షీరాబ్ధి) కూతురు. ఈమెకు పసుపు అలది నలుగుపెట్టి చక్కగా మంగళస్నానం చేయించండి. ఇది వీడు (కట్నము) చదివే వేళ (చదివించేవేళ). మీరు జోలి (సరదా కబుర్లు) చాలించండి. ఈ దేవదేవునికోసం పాలుపడి (పూనుకొని) మెత్తలు పరవండి. ఇవేళ నాలుగవరోజు. నేడు నాగవెల్లి జరుగనున్నది. ఆయన పెండ్లి కొడుకు. సుఖాసీనుడు కావలెను కదా!

ఈ అలమేల్మంగకు భోగాలీయండి. (తాంబూలము మొదలైనవి) కందువ వేంకటేశ్వరుడు (సమర్థుడైన వేంకట రమణుడు) తన వధువును కలిసే సమయమాసన్నమైనది. ఘన రతులతో ఇద్దరూ అలిసిపోయారు. నేడు కస్తూరి గంధములను ఈయండి. కుందక (ఏ లోటు లేకుండా) ఇద్దరూ కొలువు దీరినవేళ ఇది. మన సుకృతం వల్ల వీరిని సేవించే భాగ్యం కలిగింది.

**4-63**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో శ్రీహరి దశావతారములను వుటంకిస్తున్నారు. కాని సాహితీ గంధం లేని సామాన్యులకి ఇవి ఒక పట్టాన అర్థంగాక ప్రహేళికవలెనే వుంటాయి. "యిదుమ పాటుకు జొచి యియ్యకున్నా లేదు" – అంటే... మనఃక్లేశమును కల్పించి (చీరెలు ఎత్తుకెళ్ళి) యియ్యకున్నా లేదు. అంటే... శ్రీకృష్ణావతార లీలను స్తుతిస్తున్నారా అన్నమయ్య. చేసికొన్నవారికి చేసికొన్నంత... కర్మమిచ్చినంతే, కాని సేసినంత "వట్టు" (తామెంత దుఃఖం ఇంకొకరికిస్తే... తమకు బోరాదు, అంటున్నారు.

**ఆ.వె.॥హరి దశావతార పరిచయంబులు సేసె**
**అన్నమయ్య కవిత అద్భుతమురా**
**తరచి తరచి చూడ తెరతొలగును మదిన్**
**వేంకటేశ! తొలగు శంకలన్ని.**

**రాగం : సామంతం**

ఏమిసేయవచ్చు గర్మమిచ్చినంతే కాని లేదు
తాము సేసినంత వట్టు తమకు బోరాదు ॥ఏమి॥

ఇట్టునట్టు మిట్టిపడ్డ యించు కంతా లేదు వీపు
బట్టగట్టు మోపు మోచి పాటుపడ్డాలేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొనినా లేదు
తెట్ట దెరువున నోరు దెరచినా లేదు ॥ఏమి॥

అడిగి పరుల బదుకాస పడ్డాలేదు భీతి
విడిచి నెత్తుట దోగి వీరుడైనా లేదు
అడవులెల్లా దిరిగి అలమటించిన లేదు
యిదుమ పాటుకు జొచ్చి యియ్యకున్నాలేదు ॥ఏమి॥





వచ్చి వచ్చి వనితల వలపించుకొన్నా లేదు
మెచ్చులు గుఱ్ఱము నెక్కి మెరసినా లేదు
యెచ్చరిక దిరువేంకటేశు గొలువక వుంటే
యిచ్చట నచ్చట సుఖమించుకంతా లేదు ॥ఏమి॥

**భావామృతం :**

మనం ఏమి చేయగలం చెప్పండి. కర్మమిచ్చినంతే కాని ఇంకొక తేలికయైన తరుణోపాయం లేదు కదా! తాము సేసినంత 'వట్టు' (దుఃఖము) తమకు బోరాదు. (తాము అనుభవించక తప్పదు కదా!)

ఇటూ అటూ 'మిట్టిపడ్డా' (త్రుళ్ళిపడినా) కొంచెమైన, 'లేదు' (లాభం లేదు), (అంటే... మత్స్యావతారాన్ని స్తుతిస్తున్నారు). వీపు బట్టగట్టు మోపుమోచి (వీపుమీద చారలు పడునట్లు బరువుమోసి) పాటుపడ్డా (కష్టపడినా... లేదు). అనగా (కూర్మావతారం వర్ణిస్తున్నారు). తట్టువడ (అటూ ఇటూ) లోకమెల్లా దవ్వుకొన్నా (లోకమంతా తవ్వి పారేసినా... లేదు). అంటే హిరణ్యాక్షుడికోసం లోకమంతా పాతాళం దాకా తవ్వి ఆది వరాహావతారం యెత్తినా లాభం లేదు. తెట్టతెరవున (బహిరంగంగా) నోరుతెరచినా (గర్జించినా) లేదు. (అంటే... నరసింహావతారం).

అడిగి పరుల బదుకాసపడ్డాలేదు. (బ్రతకుటకు దారికావలెనని పరాయివాడిని అర్థించినా...లేదు) (అంటే బలిని అర్థించిన వామనావతారం). విడిచి నెత్తుటి దోగి వీరుడైనా... లేదు (అంటే, తన ధర్మం విడిచి వీర పరశురాముడై నెత్తురులో పొర్లాడినా... లాభం లేదు) (అనగా పరశురామావతారం). అడవులెల్లా తిరిగి అలమటించినా (దుఃఖించినా లేదు) (రామావతారం). యిదుమ పాట్లకు జొచ్చి (మనఃక్లేశము కలిగించి) చీరలెత్తికెళ్ళి ఈయకున్నా లేదు (శ్రీకృష్ణావతారం).

తనంతట తాను వచ్చి వచ్చి స్త్రీలను మోహింపచేసినాలేదు. (త్రిపురాసురుల స్త్రీల వ్రత భంగం చేసిన బుద్ధుడు). మెప్పు పొందిన గుఱ్ఱము నెక్కినా లేదు (కల్కి అవతారము). ఇవన్నీ ఇట్లా వుంటే తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుని నేటి కలియుగంలో అప్రమత్తులై సేవించకుండా వుంటే... యిచ్చట నచ్చట కూడ (ఇహపరములలో సుఖము అణుమాత్రమైన వుండదు.

**4-64**

## మున్నుడి

వీనుల విందైన భజన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. స్వామీ! నీ రెండు పాదములు మాకు సంపదలు, సౌఖ్యములు ఇస్తాయి. ఇక మాకు యెక్కడ చూచినా ఎదురే లేదు అంటున్నారు. ఆ శ్రీవేంకటేశ్వరుని పాదములే నిధియు నిధానము అంటున్నారు. అవే తల్లియు తండ్రియునంటున్నారు. అవే ఇహము పరము నొసగే సాధనలంటున్నారు. జీవులలో అంతరాత్మవలె సంచరించే ఆ సంకర్షణాఖ్యుడు కైవల్యనిలయుడని కీర్తిస్తున్నారు.

**తే॥ ఇంక నెదురు లేదుర మాకు యెందు జూడ**
**పదములివి రెండు సంపదల్ ముదము లీయు**
**భజన వోలె ఈ కీర్తన పాడెనయ్య**
**అన్నమార్యుడు శ్రీవేంకటాద్రినాథ!**

**రాగం : హిందోళం**

ఎదురేది యింక మాకు యెందు చూచినను నీ-
పదములివి రెండు సంపదలు సౌఖ్యములు ॥ఎదురేది॥

గోపికానాథ గోవర్ధనధరా
శ్రీపుండరీకాక్ష జితమన్మథా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీ పాదములే మాకు నిధి నిధానములు ॥ఎదురేది॥

పురుషోత్తమా హరీ భువన పరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుంద రక్షకా
ధరణి నీ పదములె తల్లియును దండ్రి ॥ఎదురేది॥





దేవకీనందనా దేవేంద్ర వందితా
కైవల్యనిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావ నీ పాదములె గతి ఇహము పరము ॥ఎదురేది॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తులమైన మాకు యెందు చూచినను, ఇంక యెదురు లేనే లేదు. నీ ఈ రెండు పాదములు మాకు సంపదలు. అవే సుఖదాయకములు ప్రభూ!

ఓ గోపికానాథా! గోవర్ధనధారీ! నీవు పుండరీకాక్షుడవు (పద్మలోచనుడవు). మన్మథునే తలదన్ను అందగాడివి. మా పాపములను హరించు సర్వేశ్వరుడవు. పరమపురుషుడవు. అచ్యుతుడవు (నాశరహితుడవు). నీ పాదములే మాకు ఐశ్వర్యము. మాకు అవే 'నిధానము' (పాతరలో దాచిన ధనము... అంటే నేటి కాలంలో లాకర్లలో దాచుకొన్న నోట్లకట్టలన్న మాట...)

ఓ శ్రీహరీ! పురుషోత్తమా! ఈ ప్రపంచాన్ని పాలించే దేవా! నీవు గజేంద్ర మోక్ష ప్రదాతవు, శ్రీ మహాలక్ష్మికి మగనివి, మురారివి. నీవు దేవతలందరికీ రక్షకుడవు. నీవు శ్రీకృష్ణుని అవతారంలో ముచుకుందుడనే రాజర్షిచే యవనరాజును భస్మం చేయించి, ఆ రాజర్షిని (ముచుకుందుని) బ్రోచి రక్షించావు. అట్లు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయు నీ దివ్య పాదములే మాకు తల్లిదండ్రులవంటివి.

ఓ దేవకీనందనా! నీవు దేవేంద్రునిచే నిత్యము పూజింపబడువాడవు. నీవు మోక్షప్రదాతవు. నీవే సంకర్షణాఖ్యుడవు (బలరాముని రూపంలో పేరుపొందిన అవతారమూర్తివి). జీవులందరిలోను అంతరాత్మవలెనున్న తిరుమలనాయకుడవు. మమ్ము రక్షించుటకు నీ పాదములే దిక్కు. అవే మాకు ఇహము (ఈ భూలోకంలో సుఖము) పరము (మరణించాక పైలోకంలో ఆనందము) ఒసగునట్టి సాధనములు.

**4-65**

## మున్నుడి

అలమేల్మంగమ్మ సొబగులను (చక్కదనములను) వర్ణించి, ఓ ప్రభూ! అవన్నీ నీ సొమ్ములు... కనుక ఆమెతో 'కలసి మెలసి' (పెనవేసి) గైకొనవయ్యా అని ప్రార్థిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది సరస శృంగార కీర్తన కనుక సాధ్యమైనంత నర్మగర్భంగానే వివరించాను. నేటి తెలుగుకు ఆనాటి తెలుగుకు పడికట్టులో కొంత తేడా వున్నందువల్ల మనకు కష్టం అనిపించినా అతి సరళమైన భాష వాడారు అన్నమయ్య.

**కం॥ నెలత సొబగులివి దేవా!**
**అలయక గైకొనుము నీవు అన్నయ వేడెన్**
**కలసీ మెలసీ మీరలు**
**అలరిన కాన్కలన్ గొనుడు అని తను పాడెన్**

**రాగం : రంజని**

నెలత సొబగులివి నీ సొమ్ము
కలసి మెలసి యిటు గైకొనవయ్యా ॥నెలత॥

వేమరు నవ్వుల వెన్నెల గాసీ
రామ కడకు నిటు రావయ్యా
దోమటి పలుకుల దొరిగీ తేనెలు
ఆమని కాలము అవధరించవయ్యా ॥వెలత॥

వలపుల చెమటల వానలు గురిసీ
పొలవక యీకెను చూడవయ్యా
పెలుచు కుచంబుల పిందెలు వొడమెను
అలరిన కానుక లందుకోవయ్యా ॥వెలత॥





గములై మెయి మరు కళలు దొలకీ
తమితో కౌగిట తగులవయ్యా
జమళి శ్రీవేంకటేశ్వర సతిగూడితి
వమరె నీకు మేలవునయ్యా ॥నెలత॥

**భావామృతం :**

ఓ శ్రీ వేంకటేశ్వరా! నేను వర్ణించిన ఈ దేవి చక్కదనములన్నీ నీ సొమ్ము. ఆమెతో నీవు 'కలసి మెలసి' (పెనవేసికొని) మా అలమేల్మంగమ్మను స్వీకరించవయ్యా!

నీవు ఆమెకు కనపడగానే ఆమె నవ్వుల వెన్నెలలను వెదచల్లుతుంది. ప్రతిసారి అట్టి స్వాగతం చెప్పే ఈ 'రామ' (అందాల భరిణ) దగ్గరకు ఒక్కసారి రావయ్యా. (దోమటి అంటే అన్నము అని అర్థం. ఇక్కడ రుచిగల అని భావించాలి) రుచికరమైన ఆమె పలుకులలో తేనెలు జాలువారుతాయి. ఇదేమో 'ఆమని కాలము' (వసంత ఋతువు). ఆమెను అవధరింపుము (గైకొనుము) ప్రభూ!

నీపై కలిగిన కోర్కె ఆమెకు చెమటల వానవలె పరిణమించి, ఆమె తడిసి ముద్దయింది. ఇంక పొలవక (బెట్టుసరి చేయక) యీకెను (ఈమెను) స్వీకరించవయ్యా! శ్రీనివాసా! కఠినమైన కుచములు పిందెలవలె జూపట్టినవి. నీకోసం ప్రత్యేకించబడిన ఆ కాన్కలను స్వీకరించవయ్యా!

ప్రభూ! మెయి (ఆమె దేహమున) మరు కళలన్నీ గములై దొలకినవి (విస్తారముగ కన్పట్టినవి). కోర్కెదీర ఆమెను సందిట జేర్చుకొనవయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! జమళి (జంటవై) నీ సతిని కూడితివి. నీకు అన్నీ శుభ మంగళములే కలుగుతాయి. కనుక మాబోటి వారిని కూడా అనుగ్రహించుము తండ్రీ!

# 4-66

## మున్నుడి

"శ్రీ వేంకటేశ్వరుని సేవించక పరులను (అధికారులను) వేడుకొంటే ఏమవుతుంది? లక్ష్మీకాంతుని నమ్ముకోవాలి గాని యితర దేవతలను పూజిస్తే సుఖమేమిటి?ఏ పూజకైనా అర్హుడు శ్రీహరి యొక్కడే. ఆయన కొసగని పూజలు వరదలో కొట్టుకొని పోయిన చింతపండువలె వృథా అవుతుంది" అంటున్నారు అన్నమాచార్యులవారు.ఎంత యెత్తుమీంచి పడే వాడైనా నేలమీద పడక తప్పదు. అట్లాగే దేవదేవుడు ఏడుకొండలవానిని గాక, శరణని పరులను ప్రార్థించినా వాళ్ళవల్ల యేమవుతుంది?

**ఉ॥ ఆతడు లక్ష్మివల్లభుడు అన్నియు నిచ్చునుగాక! నమ్మడీ**
**ప్రీతిగ వేడి అన్యులను వేసరినాఫలమేమి మానవా!**
**భూతలమొక్కటే నిలువ, వుండునె వేరొక చోటు నిల్వగా**
**ఈతల వేంకటేశ్వరుడు యేలిక అందరి కన్నమయ్యనెన్**

### రాగం : గుండక్రియ

అతడు లక్ష్మీకాంతు-డన్నియు నొసగు గాక
యితరుల వేడుకొంటే - నేమిగలదు ॥అతడు॥

మోదముతో నొకమాని -మొదల బోసిన నీరు
పాదుకొని కొననెక్కి -ఫలించుగాక
ఆదిమూలమగు హరి-నాతుమ సేవించక
యే దైవముల గన్నా - నేమి సెలవు ॥అతడు॥

తల్లి భుజించిన వెల్లా - తగు గర్భము శిశువు
కెల్లగాగ బరిణామ - మిచ్చుగాక
ఉల్లము లోపలి హరి - కొసగని పూజలెల్లా
వెల్లి జింతపంటివలె - వృథా వృథా ॥అతడు॥





ఓలినెంత జారిపడ్డా - నూరకే యెవ్వరికైనా
నేలే యాధారమై - నిలుచు గాక
తాలిమి శ్రీవేంకటేశు - దలచక తలచినా
పాలించ నాతడే కాక - పరులకు వశమా ॥అతడు॥

### భావామృతం :

ఆ శ్రీ వేంకటేశ్వరుడు లక్ష్మీపతి. అన్నియును ఇవ్వగల సమర్థుడాయన. ఇస్తే ఆయన ఇవ్వాలి కాని ఇతరులను (అధికారులను, దేవతలను) యాచిస్తే యేమవుతుంది?

ఒకచెట్టు పెరిగి వృద్ధి జెందాలంటే దాని మొదలులో (వ్రేళ్ళు తడిసేట్లు) నీరు పోయాలి. అప్పుడు స్థిరముగా ఆ నీరు చిటారు కొమ్మలకెగబ్రాకి పుష్పించి ఫలించటానికి దోహదపడుతుంది. శ్రీహరి ఆదిమూలము. ఆయన ఆత్మస్థితుడు. ఆయన నాత్మలో పూజించాలి. అట్లుగాక అన్యదేవతల నాశ్రయిస్తే...యేమి సెలవు? (యేమి ఉపయోగం)

గర్భిణియైన తల్లి తీసికొనిన ఆహారం గర్భస్థ శిశువుకు చేరి ఆ శిశువు పెరుగుటకు దోహదపడుతున్నది. హృదయ స్థితుడైన నారాయణుని పూజించని వ్యర్థమైన పూజలు "వెల్లి జింతపండు వలె వృథా వృథా", (వరదలో కొట్టుకుపోయిన చింతపండు వలె నిరుపయోగము. ఒకవేళ ఏదో కొంత దక్కించుకొన్నా.. తడిసిపోయిన చింతపండు యేమి నిలవవుంటుంది?)

ఓలి (ల) నెంతజారిపడ్డా (యేవేవో ఆటలు ఆడుతూ యెంత జారిపడినా) చివరికి నేలమీద చేరవలసిందే కదా! ఎందుకంటే నేలమాత్రమే ఆధారం. ఒక్క నమస్కారం పెడితే ఆయన ఆదుకొంటాడను కోరాదు. తాలిమితో (ఓర్పుతో) శ్రీవేంకటేశ్వరుని ధ్యానించాలి. అట్లుగాక పరులను ధ్యానిస్తే వాళ్ళవల్ల అవుతుందా? ఆయన పరిపాలించి రక్షించాలి కాని పరులకు వశమే... కాదు.

**4-67**

## మున్నుడి

పెద అహోబలం కొండపైన నృసింహుని కీర్తిస్తున్న అన్నమయ్యను వినండి. 'వదలక కొలిచితే వరము లిచ్చీని' అంటున్నారు. ఇది యెంత ఛందోబద్ధమైన కీర్తనో నిరూపించవలసిన పనేమిటి? ఈ సీసపద్యం వినండి. అనంతమైన పాదాలు, కన్నులు, చేతులు, పదివేల శిరసులుగల స్వామిగా భావిస్తున్నారు. భావనకు పరిమితేమిటి?

**సీ : పెదయౌబళపు కొండ పెరిగిని కొల్వుడీ**
**వదలక మీకెల్ల వరములిచ్చు**
**పదివేల శిరసుల బలు నరసింహము**
**గుదిగొన్న చేతుల గురుతు కలది**
**ఘన శంకచక్రాల కైదువనున్నది**
**కనక దైత్యుని జంపె కడుపు చింపి**
**శ్రీలక్ష్మితొడమీద చేకొని నిల్పెను**
**ఘనులు సురలు గొల్వ గద్దెమీద**

**ఆ.వె॥ వేంకటాద్రిపైన వెలసి భోగించెడి**
**దైవమితడుగాక యెవరు వారు?**
**భావమొంది కనుడు పరబ్రహ్మమీతడు**
**అన్నమయ్య పాడె నద్భుతముగ**

**రాగం : మోహన**

పెదయౌబళపు కొండ పెరిగీనిదే
వదలక కొలిచితే వరము లిచ్చీని ॥పెద॥

పదివేల శిరసుల బలు నరసింహము
గుదిగొన్న చేతుల గురుతైనది
ఎదుట పాదాలు కన్ను లెన్నైన కలిగినది
యిది బ్రహ్మాండపు గుహ నిరవైనది ॥పెద॥





ఘనశంఖ చక్రాదుల కైదువలతో నున్నది
మొనసి రాకాసి మొకముల గొట్టేది
కనకపు దైత్యుని కడుపు చించినది
తను నమ్మిన ప్రహ్లాదుడు దాపును దండైనది ॥పెద॥

శ్రీ వనిత తొడమీద చేకొని నిలిపినది
దేవతలు కొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందు చెలగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది ॥పేద॥

**భావామృతం :**

జనులారా! ఈ "పెద అహోబలం కొండ" మీద (నృసింహుడు) పెరిగీనిదె (వృద్ధి చెందినాడు). ఈయనను వదలక సేవిస్తే కోరిన వరములను అనుగ్రహిస్తాడు.

ఈయన పదివేల శిరసులున్న బలు నరసింహము (బలాఢ్యుడైన నరసింహుడు). ఈయన గుదిగొన్న (దట్టముగా విస్తరించిన) చేతులు కలవాడు. ఈ నృసింహమునకు ఎన్నియో పాదములు, మరెన్నెన్నో కన్నులు కలవు. ఇది బ్రహ్మాండమైన గుహస్థానమై వెలసినది. ఈ దేవదేవుని కీర్తించండి.

ఈ నరసింహము ఘనమైన శంఖ చక్రములు మొదలైన 'కైదువలతో' (ఆయుధములతో) నున్నది. ఈయన "మొనసి రాకాసి మొకముల గొట్టెను" (విజృంభించిన రాక్షస గణములను వధించాడు). కనకపు దైత్యుని (హిరణ్యకశిపుని) కడుపు చీల్చినాడు. తను (అంటే తనను అని భావించాలి) నమ్మిన ప్రహ్లాదుని దాపును దండైనది. (దగ్గరవాడై రక్షకుడయ్యాడు). ఈ మహానుభావుని సేవించండి.

ఈ నరసింహము శ్రీ లక్ష్మిని తనతొడమీద నిడుకొని దేవగణములన్నీ సన్నుతించుచుండగా, సింహాసనముపై ఠీవిగా కూర్చొని యున్నాడు. ఈయన వేరెవరో కాదు. శ్రీవేంకటాద్రిపై వర్ధిల్లుతూ భోగములనుభవించుచున్న శ్రీవేంకటేశ్వరుడే. మీరు సరిగా భావించ గలిగితే ఈయనే పరబ్రహ్మ స్వరూపుడు... (మోక్షం ఇవ్వగల సత్తా ఈయనకే ఉన్నది అని భావము).

## మున్నుడి 4-68

ఈ కీర్తన హనుమంతుని ఘనత కీర్తించునదైనప్పటికీ అన్నమాచార్యులవారు శ్రీరామచంద్రునితో, నీ హనుమ ఇంతగొప్పవాడయ్యా! అని శ్లాఘిస్తూ చెప్పినట్లు సాగుతుంది. భాగవతంలో పోతనగారు వామనుడు త్రివిక్రముడైనప్పుడు చెప్పిన వర్ణన స్ఫురింపచేస్తుంది "పూని చుక్కలెల్లా మొలపూసలు గాగపెరిగె" అన్న వాక్యం. శ్రీవేంకటేశ్వరుని "ఇనవంశ" అనటంతో శ్రీరామునికి, తిరుమలేశునికీ అభేద భావన సూచిస్తున్నది. కలశాపురములో వెలసిన హనుమంతుని కీర్తిస్తున్నారని వేరే చెప్పవలెనా?

**తరళము॥ అవధరించుము చిత్తగించుము అంజనీసుతు డీతడే**
**భువిని యీ కలశాపురంబున పూని కాచెను భక్తులన్**
**రవి కులాంభుది సోమ!! హే రఘురామ! నీ వరభక్తుడే**
**ఇవల వేంకటనాథు గొల్వగ, యేలె నన్నయ తెల్పెరా.**

**రాగం: శంకరాభరణం**

అవధారు చిత్తగించు హనుమంతుడు వీడె
భువిలోన కలశాపుర హనుమంతుడు ॥అవధారు॥

రామనీ సేవకుడిదె రణరంగధీరుడు
ఆముకొన్న సత్వగల హనుమంతుడు
దీమసాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామిత ఫలదుడు ఈ ఘన హనుమంతుడు ॥అవధారు॥

జానకీరమణ సప్త జలధులు లంఘించి
ఆనుక సంజీవి తెచ్చె హనుమంతుడు
పూని చుక్కలెల్లా మొలపూసలు గాగపెరిగి
భానుకోటి కాంతితో చొప్పడు హనుమంతుడు ॥అవధారు॥





ఇనవంశ శ్రీవేంకటేశ నీ కరుణతోడ
అనుపమ జయశాలి ఈ హనుమంతుడు
పని బూని ఇటమీది బ్రహ్మపట్టమునకు నీ
అనుమతింగాచు కున్నాడదె హనుమంతుడు ॥అవధారు॥

**భావామృతం :**

ఓ రామచంద్రా! అవధారు (ఆలకింపుము). చిత్తగించుము ప్రభూ! వీడే హనుమంతుడు. ఈ భూమిపై కలశాపురములో వెలసిన హనుమంతుడు (నీ భక్తులను నిర్వహించి కాపాడుచున్నాడు).

ఓ దాశరథీ! ఈ నీ సేవకుడు యుద్ధరంగమున ఉద్దండుడు. ఆము కొన్న (అలముకొన్న) సత్వ (సత్తా) గలవాడీ హనుమంతుడు. ధైర్యంతో ఒంటరిగా లంకలో రాక్షసుల గెల్చి నీ ముద్దుటుంగరము తెచ్చి సీతకిచ్చాడు. ఘనుడైన ఈ హనుమంతుడు కోరిన కోర్కెలు తీర్చు మహానుభావుడు.

ఓ జానకీరమణా! ఏడు సముద్రములను ఒక్క దుముకుతో దాటి ఈ హనుమంతుడు ఆపైన సంజీవి తీసికొని వచ్చాడు. మేరుపర్వత రూపుడైన ఆ హనుమంతునికి ఆకాశంలోని నక్షత్రాలు మొలత్రాటిలోని పూసలవలె మెరసినవి. అంత ఎత్తుపెరిగిన ఆ హనుమంతుడు కోటిసూర్య తేజుడై ప్రకాశించాడు.

సాగరము వంటి ఇన వంశమునకు నీవు చంద్రుడవు. రవి కులాగ్రణీ! ఓ శ్రీవేంకటేశ్వరా! నీ కరుణ వలన ఈ హనుమ సాటిలేని జయశాలియై పనులన్నీ నిర్వహించుచున్నాడు. ఇకపై రాబోవు మన్వంతరములో ఈయన బ్రహ్మగా సృష్టి బాధ్యతలను చేపట్టుటకు నీ అనుమతికై వేచియున్నట్లు నేడు మాకు ఈ హనుమంతుడు కనుపించుచున్నాడు.

## 4-69

## మున్నుడి

గీతా వాక్యసారాన్ని వినిపిస్తున్నారు అన్నమయ్య. అన్ని వేదముల సారము, సమబుద్ధే (ద్వంద్వములందు). అందరికీ అదే హితమైన బోధ. అయితే సమబుద్ధి అంత తేలికగా రాదు. శ్రీహరి కృపవున్న వాడికే అది అలవడుతుంది అంటున్నారు ఆచార్యులవారు. శ్రీహరి అందరికీ సమానంగా కర్మఫలములందించే సముడు. ఆయన 'మాయ'వలన కీటకాలు తమ జీవితమే సుఖం అనుకొంటే... జంతువులందరికీ ఆహార, భయ, నిద్రా, సుఖవాంఛ లొక్కటే... ఎందుకంటే అన్నిటికీ అంతరాత్మ యెవరు? ఏడుకొండలవాడే... కదా!

**ఆ.వె॥సర్వ వేదములకు సారంబు సమబుద్ధి**
**యిందరికిని యనుచు హితవు జెప్పె**
**అందరికిని సముడు హరియనె అన్నయ్య**
**ముక్తి సాధనంబు మురవిరోధి.**

**రాగం : సామంతం**

సమబుద్ధే యందరికి - సర్వవేద సారము
సముడిందరికి హరి- సాధనమో యయ్యా ॥సమ॥

చీమకు తన జన్మము - చేరి సుఖమై తోచు
దోమకు తన జన్మము - దొడ్డ సుఖము
ఆమని యీగకు సుఖ - మా జన్మమై తోచు
ఏమిటా నెక్కువ సుఖ- మెవ్వరికేదయ్యా ॥సమ॥

జంతురాసులకు నెల్లా - జననములొక్కటే
అంతటాను మరణము - లవి యొక్కటే
చెంత నాహార నిద్రలు - స్త్రీసుఖాలొక్కటే
ఇంతటా నిందుకంటే - నెవ్వరేమి గట్టిరయ్యా ॥సమ॥





ఇందులోన నెవ్వరైనా - నేమి శ్రీవేంకటపతి
నందముగా దలచిన - దది సుఖము
ఎందు జూచినా నిత - డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి - స్వతంత్రమేదయ్యా ॥సమ॥

**భావామృతం :**

అన్ని వేదముల బోధనా సారం ఒక్కటే సుమా! అందరియందు సమబుద్ధి కగలిగి యుండవలెను. శ్రీహరి అందరి యెడల సముడు. ఎవరి కర్మఫలం వారికి నిష్పక్షపాతంగా సమానంగా అందిస్తుంటాడు. ఏ జీవియైనా ముక్తి సాధించాలంటే... శ్రీహరి కృప వుండవలసిందే. ఓరయ్యా... ఇది నిజం.

మనకి చీమ, దోమ, ఈగ, అల్ప ప్రాణులైన కీటకములే. కాని వేటికవే... తమ జీవితమే బాగుంది, అదే సుఖమైనది అనుకొంటాయి. మరి యెవరిది యెక్కువ సుఖమైన జీవితం? యెవ్వరికదే యెక్కువ సుఖము. ఓరయ్యా... ఇది నిజం. (ఇదే హరిమాయ).

భూమిపై పుట్టిన ప్రతి జంతువుకు పుట్టుక ఒకేలా వుంటుంది. (శారీరకంగా... కాదు, జీవి దృష్టితో చూస్తే...) అట్లే మరణం కూడా ఒకటే. వాటి జీవిత కాలంలో ఆహార, నిద్రా, భయ, మైథునాలు కూడా అన్ని ప్రాణులకూ సమానమే. ఓ ప్రభూ! ఇంతకంటే యెవ్వరు మాత్రం యెక్కువ మూటకట్టుకొని 'అక్కడికి' పోయారు? ఓరయ్యా... యెవ్వడూ కట్టుకొని పోలేదు... పోడు... పోడుగాక! పోడు...

ఈ సృష్టిలో యెవ్వరైనా... ఆ శ్రీవేంకటేశ్వరునికి సమానమే, ఎవ్వరైతే నేమి? ఆయనను స్మరించుటయే నిజమైన సుఖం. ఎందు జూచినా ఆయనే అంతరాత్ముని వలె ప్రకాశిస్తున్నాడు. చావు పుట్టుకలపై కానీ జీవనకాల పరిమితిపై కానీ జీవన యానంలో సుఖదుఃఖాలపై కానీ ఏమాత్రం స్వతంత్రం లేని ఈ జీవులలో యెవ్వడు అధికుడు ఎవ్వడు అధముడు? ఓరయ్యా... అంతర్యామియే... అధికుడు కదా?

## మున్నుడి

తన స్వామి తనను పిలిచాడు కావున వేగంగా పోయి ఆయనను కలవాలి రావే చెలియా! అని పిలుస్తున్నది నాయిక (అలమేల్మంగమ్మ). స్త్రీలకు, తమకమె వలెను గాక! (తన ప్రియునిపై మోహము వుండి తీరాలి) అంటూ హితబోధ చేస్తున్నది. శ్రీవేంకటేశ్వరుడంతటి వాడు నన్నేలుతుంటే "క్రియతో వేసర నేల కిమ్ముల దేవుళ్ళకు?" అంటున్నారు అన్నమాచార్యులవారు. 'కిమ్ముల దేవుళ్ళు' అంటే యే నిఘంటువులోను అర్థం కనబడలేదు. 'కిముడు' అంటే అల్పము అని అర్థం.'క్రియతో వేసరనేల' అంటే... ఈ విధంగా బాధపడుట దేనికి?

**కం॥ రమణుడు పిలిచెను రావే**
**తమకమె వలె గాక నీవు, తరుణలకనియన్**
**సమయమునకు తగు బోధను**
**విమలంబుగ అన్నమయ్య వెలదికి జేసెన్.**

**రాగం : నటహిందోళం**

రమణుడు పిలిచీని రావే చెలియా నీవు
తమకమె వలె గాక తరుణులకు ॥రమణుడు॥

తలపుకొలది మంచి తనమే వలె గాక
చలపాదితన మేల సరసులకు
వెలలేని మాటల వినయమే వలెగాక
సొలపు వెంగెము లేల సుగుణలకు ॥రమణుడు॥

కోటిసేయ వలపులు కుమ్మరించవలెగాక
నీటుతో గర్వము లేల నేర్పరులకు
మేటి సరసములాడి మెరయగ వలెగాక
జూటు దనము లేటికి సొంపు దొరలకును ॥రమణుడు॥





నయగారి తనమున నవ్వు నవ్వ వలెగాక
రయమున దాగనేల రసికులకు
నియతి నన్నేలినాడు నేడు శ్రీవేంకటేశుడు
క్రియతో వేసరనేల కిమ్ముల దేవుళ్ళకు ॥రమణుడు॥

**భావామృతం :**

ఓ చెలియా! రమణుడు (నాథుడు) నన్ను పిలిచినాడు. పోవుదము రావే. తరుణులకు (స్త్రీలకు) తమకమె వలెగాక! (తమ ప్రియునిపై మోహము వుండి తీరాలి).

స్త్రీకి భావనలలో కూడ మంచితనమే వుండాలి. సరసులకు (సరసత్వముగల స్త్రీలకు) చలపాదితనము యేల (మాత్సర్యము యెందుకు?) ఆమె మాట్లాడే మాటలలో చెప్పలేనంత వినయము తొణికిసలాడుతుండవలెను. సుగుణములే అలంకారములైన స్త్రీలకు, నొచ్చుకొనునట్లు చేయు వెంగెము (వ్యంగ్య సంభాషణ) నిషిద్ధము. ఇవి గుర్తుంచుకో.

కోటి సేయు (అతిశయించిన) వలపులను స్త్రీ తన భర్తపై, కుమ్మరించవలె గాక! (కురిపించాలి). నేర్పరులైన కాంతలకు "నీటుతో గర్వము" (మిడిసిపడే గర్వము) తగదు. వారు చక్కటి సరస సల్లాపములతో వ్యక్తపరచబడవలెను. కాని సొంపు దొరలకు (సుందరాంగులకు) జూటు దనములు (మోసము చేయు స్వభావము) యేటికి? (యెందులకు?)

ఓ చెలియా! స్త్రీలు, నయగారితనమున (మృదువుగా) నవ్వులు నవ్వవలెను. ప్రియుడు రసికుడైనప్పుడు, ఆయన యెదుటబడి ఎంతో ప్రీతిని కలిగించవలెను. కాని దాగికొని ఆయనను నిరుత్సాహపరచ రాదు. సరే... అదంతా అటుంచి, నేడు నా నాథుడైన శ్రీవేంకటేశ్వరుడు నిరతి (నా భాగ్యవశమున) నన్నేలినాడు. "క్రియతో వేసరనేల కిమ్ములదేవుళ్ళకు?" అంటే... అల్పులైన ఇతర దేవుళ్ళకు మొక్కి ఈ విధంగా బాధపడుట దేనికి? వాళ్ళందరికీ దేవదేవుడైన వాడే... నావాడు కదా!

## మున్నుడి 4-71

అన్నమాచార్యులవారి కీర్తనలలో దేని ప్రత్యేకత దానిదే. ఏడుకొండలవాడికి ఆరగింపచేసే 'ప్రసాదాలు' మనబోటి సామాన్యులు యెలాగో చూడలేరు. ఈ అన్నమయ్య కీర్తన విని స్వామికి ఆ రోజుల్లో ఏమేమి ఆరగింపులు చేసేవారో తెలుసుకోవచ్చును. మనం ఈనాడు 'కజ్జికాయలు' అనే తీపివంటకం ఆ రోజుల్లో 'కరజికాయలు' అనిపిలువబడేది. అనేక పురాతన వంటకాలు నేడు వాడుకలో లేక, పేరు మాత్రమే వాడుకలో వున్న వంటకాల పేర్లు వింటే ఆహా!! ఏమి రుచి!! అనిపిస్తుందేమో...

**తే॥ ఆరగింపవో మాయప్ప! అనుచు పాడె**
**అన్నమార్యుడు తెలుపుచు నద్భుతముగ**
**వేంకటేశునికిడిన నైవేద్యములను**
**వివరమిచ్చెను పఠియింపు డవధరించి**

**రాగం : ఖమాస్**

ఆరగింపవో మాయప్ప యివే
పేరిన నేతులు పెరుగులును ॥ఆరగింప॥
తేనెలు జున్నులు తెంకాయ పాలును
ఆనవాలు వెన్నట్లును
నూనె బూరెలును నురుగులు వడలును
పానకములు బహుఫలములును ॥ఆరగింప॥
పరమాన్నంబులు పంచదారలును
అరిసెలు గారెలు నవుగులును
కరజి కాయలును ఖండమండెగలు
పరిపరి విధముల భక్ష్యములు ॥ఆరగింప॥
కడ మధురంబగు కమ్మబూరణపు
కుడుములు నిడ్డెన కుడుములును
సుడిగొను నప్పాలు సుగినప్పాలును
పొరి బెల్లముతో బోరటుచును
కాయపు రుచులకు గనియగు మిరియపు
కాయలు నేలకి కాయలును
పోయరాని అంబాళపు కాయలు
నాయతమా చద్ద్యన్నములు ॥ఆరగింప॥





ఒడికపు కూరలు బలుపు పప్పులును
వడియాలపు రాజాన్నములు
బడిబడి కనకపు పళ్ళెరములతో
కదు వేడుక వేంకట రమణా ॥ఆరగింప॥

**భావామృతం :**

ఓ వేంకట రమణా! మా అప్పా! (మా తండ్రీ!) యివే (ఈ క్రింద చెప్పినవన్నీ) ఆరగింపవో! పేరిననేతితో చేసినవి, పెరుగుతో చేసినవీ, యెన్ని వంటకాలున్నాయో చూడు స్వామీ!

ప్రభూ! ఇవిగో తేనెతో చేసినవి, జున్నుతో చేసినవి, కొబ్బరి పాలతో చేసినవి, ఆనవాలు (మరగబెట్టిన పాలు), వెన్నట్లు (వెన్నతో చేసిన దోసెలు), నూనెతో చేసిన బూరెలు, నురుగులు, వడలు, పానకములు (పాలకాయలనే భక్ష్యం) మరియు రకరకములైన ఫలములు కూడ వున్నవి.

స్వామీ! నీ నివేదనకు యెన్నియో, పరమాన్నములు, పంచదార వంటకములు, అరిసెలు, నవుగులు, కరజికాయలు (కజ్జికాయలు), ఖండమండెగలు, మొదలైను అనేక భక్ష్యములున్నవి, ఆరగింపుము.

ప్రభూ! కమ్మని తీపి పూర్ణపు కుడుములు, ఇడ్డెన కుడుము (ఇడ్లీలు) లున్నవి, సుడిగొను అప్పాలు (జంతికలు), సుగినప్పాలు, బెల్లము దట్టించి చేసిన మధుర పదార్థములున్నవి.

ప్రభూ! కాయపు రుచులకు (ఘాటు, కలిగిన రుచుల) గనియగు (పుష్కలంగా ఉన్న) మిరపకాయలు, ఏలక్కాయలు, అంబాళపు కాయలు మొదలైనవి దట్టించిన చద్ద్యన్నములు (పులిహోర మొదలైనవి) అనేకం వున్నాయి. ఆరగింపుము తండ్రీ!

ఓ దేవా! ఒడికపు కూరలు (యుక్తితో చేసిన మంచి కూరలు), బలుపు పప్పులు (పుష్టినిచ్చే పప్పులు), ఆ పప్పు ముద్దలతో కరకర నమిలి నంజుకోటానికి అనేక రకముల వడియాలు, పుష్కలంగా వున్న రాజభోజనం సిద్ధంగా వున్నది. ఇవన్నీ 'బడి బడి కనకపు పళ్ళెరము' (దిట్టంగా వున్న బంగారు పళ్ళాలతో) వడ్డించారు. ఓ వేంకట రమణా! మిక్కిలి వేడుకతో వీటన్నింటిని ఆరగించి మమ్ము ధన్యులను చేయుము తండ్రీ!

4-72

## మున్నుడి

భక్తిరసం జాలువారే చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. సులభంగా భక్తులనాదుకొనే శ్రీహరి 'పరతంత్రుడు' అంటున్నారు. అంటే... భక్తులకు లొంగి వుంటాడట. కాని ఏ ఒక్కరికీ స్వంతంగా కాదు. అలా అనుకొన్న 'సత్యభామ' లాంటివారు భంగపడ్డారు. ఆయన 'యుక్తి సాధ్యుడు'. న్యాయమున్నవైపున వుంటాడు. దుర్యోధనుని తృణీకరించి విదురుని ఆతిధ్యం స్వీకరించాడు. ఈ పురుషోత్తముడు పొడవుకే పొడవైనాడట. మాచేత 'బుడి బుడి' పూజలుగొనేవాడు అంటున్నారు. అంటే....

**ఆ.వె॥ భక్త సులభుడితడు పరతంత్రుడీ హరి**
**యుక్తి సాధ్యుడితడు యొకరి కవడు**
**పొడవు కితడు పొడవు పురుషోత్తముడు, అహో!**
**అన్నమయ్య పాట అతిశయించె.**

**రాగం : మలయమారుతం**

భక్త సులభుడును పరతంత్రుడు హరి
యుక్తి సాధ్యమిదె యొకరికీ గాడు ॥భక్త॥

నినుపగు లోకముల నిండిన విష్ణుడు
మనుజుడ నాలో మనికి యయ్యె
మునుకొని వేదముల ముడిగిన మంత్రము
కొననాలికలలో కుదురై నిలిచె ॥భక్త॥

యెలమి దేవతల నేలిన దేవుడు
నలు డ నధముని నను నేలే
బలుపుగ లక్ష్మీపతి యగు శ్రీహరి
యిల మాయింటను యిదివో నిలిచే ॥భక్త॥





పొడవుకు బొడవగు పురుషోత్తముడిదె
బుడి బుడి మాచేత పూజగొనె
విడువకిదివో శ్రీవేంకటేశ్వరుడు
బుడి వాయడు మా పాలిట నిలిచి ॥భక్త॥

**భావామృతం :**

ఓ భక్తులారా! నా మాట నమ్మండి. శ్రీహరి భక్తిచే సులభంగా సాధింపబడువాడు. స్వామి భక్త పరతంత్రుడు. (వారికి లొంగిపోయి వుంటాడు). యుక్తికి సాధ్యుడు. న్యాయము ఏవైపున వుంటే ఆయన, ఆ వైపున వుంటాడు. ఏ ఒక్కరికీ స్వంతం కాడు. ఎవరిని కరుణించాలన్నది ఆయన ఇష్టం.

ఈయన విష్ణుడు. అంతటా నిండివున్నవాడు. లోకాలన్నింటిలోనూ నిండిపోయాడు. నేను మానవ మాత్రుడినే అయినా నాలోనూ వున్నాడు. మునుకొని (తొల్లి) వేదములన్నింటిలో ముడిగిన మంత్రము నిక్షిప్తమైన మంత్రము ఈ నారాయణుడు. అటువంటి మహానుభావుడు నా నాలికి చివర కుదురుకొని యుండి నాచే కీర్తించబడుతున్నాడు.

శ్రీహరి యెంతో సంతోషంతో దేవతల నాదుకొని రక్షిస్తాడు. అటువంటి దేవదేవుడు, "నలుగడ నధముని" (పీడితులలో అల్పుడనైన) నన్ను పరిపాలించి కాపాడినాడు. ఆయన లక్ష్మీపతి. అతిశయించిన ఆ శ్రీపతి, ఇదిగో మా ఇంటికి వచ్చి మా యెదుట నున్నాడు. ఇంతకంటే కావలసినది వేరొకటుంటుందా?

ఈ పురుషోత్తముడు పొడవుకే పొడవైన వాడు... (అంటే ఎనిమిది అడుగుల ఎత్తున్న వాడని కాదు, చక్కదనాని కన్నా చక్కనైన వాడని అర్థం). మాచేత "బుడి బుడి పూజ" (చిన్న చిన్న పూజలైనా) స్వీకరించి, మమ్మల్ని విడువక ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడై మాయందే నిలిచి మాతోడు నీడైవున్నాడు. ఇక మాకు లోటేమిటి చెప్పండి.

## మున్నుడి 4-73

అద్భుతమైన శ్రీరామనామ సంకీర్తన చేస్తున్నారు. అన్నమాచార్యులవారు 'రామ' అని ఒక్కసారి అంటేనే ఆనాటి వరకు చేసికొన్న పాపములు భస్మమవుతాయని, నమ్మే భరతజాతి మనది. ఈ కీర్తనలో యెన్నిసార్లు 'రామా' అని పిలుస్తున్నారో గమనించండి. మరి ఈ కీర్తన నొక్కసారి భక్తితో పాడితే పాపము మనల్ని సమీపించగలదా? 'సెలవిల్లు విరచిన సీతారామా' అంటే... సెలసుబద్దలతో తయారు చేసిన శివధనస్సును విరచిన సీతారాముడు అని అర్థం. సీతారాముడు ఒకేమాట. ఈయనే వితత మహిమల వేంకటాద్రి రామయ్య అంటున్నారు.

**చం။ జయ జయ రామచంద్ర! ఘన సంగరధీర! మహానుభావ! హే**
**భయహర! జానకీశ! నిజ భక్తజనంబుల బ్రోవుమా అనెన్**
**రయమున వేడె కీర్తనల రాముని గొల్చెను, యాతడే మహిన్**
**జయమిడు వేంకటేశ్వరుడు సప్తగిరీంద్రుడు, అన్నమయ్యనెన్**

**రాగం : మణిరంగు**

జయ జయ రామ సమర విజయరామ
భయహర నిజభక్త సారీణ రామా ॥జయ జయ॥

జలధి బంధించిన సౌమిత్రిరామా
సెలవిల్లు విరచిన సీతారామా
అలసుగ్రీవు నేలిన అయోధ్యరామా
కలిగి యజ్ఞము కాచే కౌసల్యరామా ॥జయ జయ॥

అరి రావణాంతక ఆదిత్యకులరామా
గురు మౌనులను గాచే కోదండరామా
ధరనహల్యపాలిటి దశరథరామా
హరురాణి నుతుల లోకాభిరామా ॥జయ జయ॥





అతి ప్రతాపముల మాయామృగాంతక రామా
సుత కుశలవ ప్రియ సుగుణరామా
వితత మహిమల శ్రీవేంకటాద్రిరామా
మతిలోన బాయని మనువంశరామా ॥జయ జయ॥

**భావామృతం :**

ఓ జయరామా! నీకు జయమగు గాక! యుద్ధరంగమున అజేయుడవైన రామచంద్రా! నీకు జయము. భక్తుల భయమును హరించు శ్రీరామా! నీవు నిజభక్త పారీణుడవు (అంటే... తన భక్తులను అవతలి గట్టు చేర్చువాడని అర్థం. అంటే తరింపజేసేవాడన్నమాట).

ఓ సౌమిత్రిరామా! నీవు సాగరమున సేతువు నిర్మించితివి. సీతారామా! నీవు సెలవిల్లు (సెలసుబద్దలతో చేసిన శివధనస్సును) విరిచినావు. ఓ అయోధ్య రామా! నీవు ఆనాడు సుగ్రీవుని కాపాడియేలినావు. కౌసల్యారామా! నీవు పూనుకొని విశ్వామిత్రుని యజ్ఞమును సంరక్షించితివి. ప్రభూ! అట్టి నీకు జయమగు గాక!

ఆదిత్యకులరామా! (సూర్యవంశ సంభవుడవైన రామా!) నీవు శత్రువైన రావణుని పరిమార్చిన వాడవు. ఓ కోదండరామా! నీవు గురుపుంగవులైన ఋషులను రక్షించితివి. దశరథరామా! నీవు అహల్యను వుద్ధరించితివి. శివుని రాణియైన పార్వతీదేవిచే కీర్తించబడు ఓ లోకాభిరామా! నీకు జయము కలుగుగాక!

మాయలేడి రూపంలోనున్న మారీచుని వధించిన రామచంద్రా! నీవు అతి ప్రతాపశాలివి. ప్రియ సుగుణరామా! (ప్రీతికరమైన సుగుణములుగల రామచంద్రా!) నీవు పుత్రులుగా కుశలవులు గలవాడవు. (బహుశా... ఆ శ్రీరామచంద్రుని అర్చామూర్తి కుశలవులతో బాటు వుండి వుంటుంది). వితతమహిమల (విస్తృతమైన మహిమలున్న) శ్రీవేంకటాద్రిపై నెలకొన్న వేంకటరాముడవు నీవే. మమ్మల్ని మతిలో బాయని (మనస్సున కూడా విడువని) మనువంశరామా! మానవాకృతిలో వెలసిన శ్రీరామచంద్రా! నీకు సర్వదా జయము.

4-74

## మున్నుడి

ఇదివరలో ఇటువంటిదే వేరొక కీర్తనలో అన్నమాచార్యులవారి అభిప్రాయం సుస్పష్టంగా విన్నాం. హీనుడు, అధికుడు ఎవరు?అందరికీ చావు పుట్టుకలొక్కటే. అణిగిమణిగి చేసే దాస్యము, స్నేహము అందరికీ నొకటే. అందరూ నారాయణుని ఒకేలా, కొలుస్తారు. భక్తిముఖ్యం – మార్గాలే వేరు. ఈ రోజుల్లో కూడా (ఏడువందల యేళ్లక్రితం) హీనాధిక్యము లెక్కడున్నాయి? వైష్ణవం స్వీకరించిన వారిది ఒక్కటే కులం, ఒక్కటే మతం. శ్రీవేంకటేశ్వరుని "యాదరాని పొందు" శరణాగతి యొక్కటే నట,... అంటే... చదవండి మరి.

**కం॥ హీనాధిక్యము లింకను**
**ఈనాడెచ్చటను గలవు? ఇటులన్నయనెన్**
**ఆనిన దాస్యము పొత్తులు**
**మానవులందరికి నొకటె మనకెరిగించెన్.**

**రాగం : కానడ**

హీనాధికము లింక నేడనున్నవో కాని
ఆనిన దాస్యము పొత్తు అందరికీ నొకటే ॥హీనాధి॥

నానావర్ణముల వారు నరహరి దలచేటి
ఆ నామమంత్ర జపమది యొకటే
పూని యాతని గొలిచి భువినేజాతైనాను
మోనమున పొందేటి మోక్షమూ నొకటే ॥హీనాధి॥

వెనుకకు ముందరికి విష్ణుకింకరులకెల్ల
పనివడి కైకొనేటి భక్తి యొక్కటే
వునికి నా దేవుడు వొకడే అంతర్యామి
మనెడి వైష్ణవ కులమతమెల్లా నొకటే ॥హీనాధి॥





భేదా భేదము లేదు పెక్కు మరగులు లేవు
ఆదినంత్యములను ముక్తాత్మలొక్కటే
శ్రీదేవుడైనట్టి శ్రీవేంకటేశ్వరుని
యాదరాని పొందు శరణాగతియు యొకటే ॥హీనాధి॥

**భావామృతం :**

మానవులారా! నా మాట వినండి. ఆలోచించండి. హీనుడని, అధికుడని ఇంకా యెక్కడున్నాయి? ఆనిన దాస్యము (అణచివుంచే బానిసత్వం) పొత్తు (స్నేహానుబంధము) అందరికీ ఒకేలా వుంటాయి. ఒకళ్ళకి తక్కువ వేరొకరికి యెక్కువ వుండవు.

ప్రపంచంలో వివిధ రకములైన వర్ణములున్నవి (బ్రాహ్మణ, క్షత్రియ మొదలైనవి). వారిలో ఎవరు శ్రీహరీ! అనినా ఆ మంత్రజపం ఒకేలా ధ్వనించటమే కాక, ఒకేలా సత్ఫలితమిస్తున్నది. ఈ భువిని యేజాతియైనా, పూని (దీక్షతో) ఆతని (నారాయణుని) మోనమున (మౌనివలె) గొలిచి (సేవించి) పొందేటి మోక్షము కూడా ఒక్కటే సుమా!

విష్ణుని కింకరులకు (దాసులకు) పూర్వముగాని, రాబోయే కాలాల్లోగాని, పనివడి కై కొనేటి (పూని స్వీకరించేటి) భక్తి యొక్కటే. అంతర్యామిగా జీవులందరి దేహాల్లో (పిల్లిగాని, నల్లిగాని, తిమింగలం గానీ, నరులుగాని) వున్న పరమాత్మ వొక్కడే. ప్రపంచంలో వైష్ణవులుగా జీవించేవారి కులమూ ఒక్కటే మతమూ ఒక్కటే.

ముక్తాత్ములకు (జీవన్ముక్తులకు) భేదము ఉండటం కాని, లేకపోవటంకాని సంభవించదు. వారికే రహస్యములూ వుండవు. వారికి ఏదీ మొదలుకాదు.. అయిపోదు కూడా. అంతదాకా యెందుకు.. శ్రీపతి అయిన శ్రీవేంకటేశ్వరుని యాదరాని (నిర్విచారంతో) పొందు శరణాగతి రకరకాలుగా వుంటుందా? ఉండదు. "నీవే తప్ప ఇతఃపరం బెరుగ, మన్నింపన్ తగున్ దీనునిన్... రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా", అని ఆ గజేంద్రునిలా శరణు కోరండి. ఇంకోదారి... లేదు గాక లేదు.

## 4-75

### మున్నుడి

శ్రీవల్లభుని చింతనే సర్వస్వం. అదే గొప్ప ఆనందం. 'శ్రీబృందాన్ని' అనగా శ్రీహరి శరణాగతిబొందిన భక్త బృందాన్ని సేవించి భావించే వారే ధన్యులు. అని చక్కటి సంస్కృత సంకీర్తన పాడుతున్నారు అన్నమయ్య పుత్రుడు పెదతిరుమలయ్య. వక్రంగా, నాస్తికవాదులు చెప్పే దుర్బోధలను ఖండించి, పరిశుద్ధ విజ్ఞాన బోధకులైన వైష్ణవ మతాచార్యులు చూపిన మేలైన బాటలో నడవమంటున్నారు. నిర్వికార గుణాఢ్యుడైన శ్రీవేంకటేశ్వరుని సేవించమంటున్నారు.

**కం॥ శ్రీ వల్లభునికి ముదమగు**
**సేవింపుము అనవరతము శ్రీబృందములన్**
**భావించమనుచు చెప్పెను**
**దేవా! పెద తిరుమలయ్య దివిజులవాణిన్**

**రాగం :సావేరి**

సేవే భావే శ్రీబృందం
శ్రీవల్లభ చింతానందం ॥సేవే॥

పటుకు తర్కనగ భంజన దీక్షం
కుటిల దురితహర గుణదక్షం
ఘటిత మహాఫల కల్పక వృక్షం
చటుల రామానుజ శమదమ భిక్షం ॥సేవే॥

కృద్ధమృషామత కుంతన కుంతం
బౌద్ధాంధకార భాస్వంతం
శుద్ధచేదమణి సుసరస్వంతం
సిద్ధాంతీ కృత చిన్మయ కాంతం ॥సేవే॥





చార్వాక గహన చండకుఠారం
సర్వాప శాస్త్ర శతధారం
నిర్వికార గుణనిబిడ శ్రీవేంక-
టోర్వీధర సంయోగ గభీరం ॥సేవే॥

**భావామృతం :**

శ్రీవల్లభుని మనస్సునకు ఆనందం కలిగించు శ్రీబృందాన్ని సేవించుము, ఆపై భావించుము.

కఠినమైన కుతర్కము అను కొండను తుత్తునియలు చేయు దీక్షగల వానిని, వక్రమైన పాపములను హరింపజేయు గుణదక్షత కలిగిన వానిని, మహాఫలములనందించు భక్తి అను కల్పవృక్షమును నిర్మించిన వానిని, రమణీయులైన రామానుజులచేత శమదమాదులను భిక్షగా గొనిన వానిని సేవించెదను మరియు భావించెదను.

క్రోధమును తెప్పించు మిథ్యావాదమును ఖండించు కరవాలము, బౌద్ధాంధకారము నిర్మూలించు జ్యోతియు, పరిశుద్ధమైన చేతన (విజ్ఞానము) అనే సరస్వతిని ప్రకాశింప చేసినవాడును, వైష్ణవమతమును సిద్ధాంతీకరించిన వాడును అయిన నా గురుదేవుని సేవించెదను మరియు భావించెదను.

చార్వాకమను దట్టమైన అంధకారమును నిర్మూలించు గొడ్డలియును, సమస్త ఆపదలను నిర్మూలించు శాస్త్ర సముచ్ఛయము కలవాడును, నిర్వికార గుణములతో నిండిన శ్రీవేంకటేశ్వరుని అనుసరించు గొప్పదైన అనుసరణము కలవాడును అయిన వానిని సేవించుము మరియు భావించుము.

4-76

## మున్నుడి

అన్నమాచార్యులవారి సుపుత్రుడు తాళ్ళపాక పెద తిరుమలయ్య చెప్పిన అద్భుతమైన కీర్తన వినండి. పులి కడుపున పిల్లి పుడుతుందా? తండ్రి బాటనే నడచి శ్రీవేంకటేశ్వరునిపై, అదే మకుటంతో అనేక కీర్తనలు రచించాడు పెద తిరుమల. ఈ కీర్తన, దాని భావామృతం చదివాక మీరు నాతో తప్పక ఏకీభవిస్తారు. "అప్పసమైన భ్రమ ఆలజాలాలకున్నట్లు"... అంటే యేమిటి? ఆలుబిడ్డలపై వుండె భ్రమ అని నేను భావించాను. తండ్రికి తగ్గ కొడుకే మరి...

**తే॥ "పరమ సుజ్ఞానులకును ప్రపన్నులకును**
**మరు గురునిమీద బాయని మనసు వుండ**
**వలదె", పెద్ద తిరుమలయ్య తెలిపినాడు**
**తండ్రి బాటను నడచిన ధన్యుడతడు.**

**రాగం : తోడి**

పరమ సుజ్ఞానులకు ప్రసన్నులకు
మరు గురుని మీద మనసుండ వలదా ॥పరమ॥

ఆకలిగొన్నవానికి నన్నముపైనుండినట్లు
యేకట వుండవలదా యీశ్వరునిపై
కాకల విటుల చూపు కాంతలపై నుండినట్లు
తేకువ నుండవలదా దేవుని మీదటను ॥పరమ॥

పసిబిడ్డలకు నాస పాలచంటిపై నున్నట్లు
కొసరి భక్తి వలదా గోవిందునిపై
వెస దెరువరి తమి విడిదలపై నున్నట్లు
వసియించ వలదా శ్రీవల్లభు మీదటను ॥పరమ॥





నెప్పున ధనవంతుడు నిధిగా యుండినట్లు
తప్పక శ్రీవేంకటేశుదగుల వద్దా
అప్పసమైన భ్రమ ఆలజాలాలకున్నట్లు
యిప్పుడే వుండవలదా యీతని మీదటను ॥పరమ॥

**భావామృతం :**

ఓ మానవులారా! పరమ సుజ్ఞానులకు (శ్రేష్ఠమైన చక్కని జ్ఞానము కలిగిన వారికి), ప్రపన్నులకు (భక్తిపారవశ్యముచే శరణాగతి నొందిన వారికి) మరు గురుని మీద (మన్మధుని తండ్రియైన శ్రీహరిపై) మనసుండవలదా? (చిత్తములగ్నమై వుండవద్దా?) ఇంకో దారి వున్నదా?

బాగుగా ఆకలిగా వున్నవానికి అన్నముపై ఇష్టం ఎలావుంటుందో, అట్లా ఈశ్వరునిపై మనకు యేకట (మిక్కిలి అపేక్ష) వుండవద్దా? కాకల విటుల (తాపము మీద నున్న శృంగార పురుషుల) దృష్టి, స్త్రీలపైననే వున్నట్లు, భక్తుల దృష్టి ధైర్యంగా యెల్లప్పుడు భగవంతునిపై వుండవద్దా?

పసిపాపలు తల్లియొక్క ఒక చంటిపాలు త్రాగుతూనే వేరొక చంటిపై చెయ్యివేసి భద్రంగా వున్నదో లేదో చూసుకుంటారు. ఆ గోవిందుని భక్తులకు కూడా ఆయన భజనలో ఆనందం అనుభవిస్తూనే యెక్కడ ఆ ఆనందం ఆగిపోతుందో అనే ఆరాటంతో కూడిన అనురాగం వుండాలి. ఒక బాటసారి అపేక్ష అంతయూ, తను విడిది చేయబోవు సత్రముపైనున్న విధముగా జీవనయాత్రలో నిమగ్నమైన మానవుని ధ్యాస అంతా శ్రీనాధునిపై వుండవద్దా?

ఒక ధనవంతుడు నెప్పన (ఉపాయముతో) తన నిధిని (ధనమును) కాపాడుకొనినట్లు భక్తుడు శ్రీవేంకటేశ్వరునిపై తప్పక (విడువక) తగులవద్దా? (వ్యామోహం కలవాడై వుండవద్దా?) అట్లాగే అప్పనమైన భ్రమ (అను నిత్యమూ వుండే భ్రమ) ఆల బాలాలకున్నట్లు (భార్యా బిడ్డలపై) వున్న విధముగా ఈతని (ఈ శ్రీవేంకటేశ్వరునిపై) మీదటను కూడా ఇప్పుడే, యెడబాయలేని భ్రమ వుండవద్దా? (భమరం యెట్లా పిచ్చిపట్టినట్లు మకరందం కోసం వెంపర్లాడుతుందో అట్లా ఆ దేవదేవునికోసం భ్రమించాలి).

**4-77**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఘనత ప్రతిఫలించే కీర్తన ఇది. శ్రీకృష్ణునిది పరిపూర్ణావతారం. నేనే పరమాత్మనని తెగవేసి చెప్పి, చీరెలు యెత్తుకెళ్ళిన చేతులతోనే మృతశిశువు పరీక్షిత్తును బ్రతికించాడు. వేదపురుషుడు వెన్నదొంగ అయ్యాడు. బ్రహ్మకు తండ్రియైనవాడు గొల్లయశోద పాలుత్రాగాడు. పరమపురుషుడై కూడ గొడ్లు కాచాడు. "కొలదొకరికి చెప్ప కూడునా"... అంటున్నారు అన్నమయ్య. అంటే.. యేమిటి? తనూ ఒకగోపికయై తోటి గోపికలకి 'కతలు' చెబుతున్న అన్నమయ్య ఋణం తీర్చుకోగలమా?

**కం॥ ఎదుటను కలడీ బాలుడు**
**మది తెలియము వీని మాయ మరులేమొ కదా!**
**తుదిలేని ఆదిమూలము**
**అదె వేంకటకృష్ణుడతడె అన్నయ్యనెరా!**

**రాగం : భుజంగిణి**

ఎదుటనున్నాడు వీడె ఈ బాలుడు
మది తెలియమమ్మ ఏమరులో కాని ॥ఎదుట॥

పరమపురుషుడట పసుల గాచెనట
సరవులెంచిన విన సంగతాయిది
హరియె తానట ముద్దులందరికి జేసెనట
ఇరవాయనమ్మ సుద్దులేటివో గాని ॥ఎదుట॥

వేదాల కొడయడట వెన్నలు దొంగిలెనట
నాదించి విన్నవారికి నమ్మికా యిది
ఆదిమూల మీతడట ఆడికెల చాతలట
కాదమ్మ ఈ సుద్దులెట్టి కతలో కాని ॥ఎదుట॥





అల బ్రహ్మతండ్రియట యశోదకు బిడ్డడట
కొలదొకరికి చెప్పకూడునా యిది
తెలిపి శ్రీవేంకటాద్రి దేవుడై నిలిచెనట
కలదమ్మ తనకెంతో కరుణో కాని ॥ఎదుట॥

**భావామృతం :**

ఓ గోపెమ్మలారా! మన యెదురుగావున్నాడే... ఈ బాలుడు. వీడే కృష్ణుడు. ఏమి మరులు (మోహములు) కలిగిస్తాడో కాని, తెలుసుకోలేమమ్మా! ఆలోచనల కందని చేతలమ్మా వీనివి.

పరమపురుషుడైన పరమాత్మ వీడే. (ఇది నారదాదులేనాడో గ్రహించారు) కానీ అడవుల కెళ్లి పశువుల్ని కాచాడట. వీని చేష్టలకు 'సరవు' (ఒక క్రమము) లెంచలేము. యెంతవినినా ఆ సంగతి (మర్మం) తెలియు లేము. తాను స్వయంగా శ్రీహరి. కానీ ముదుసలులు దగ్గరనుంచి ముద్దుగుమ్మలదాక వీనికి ముద్దు నివ్వని వాళ్ళు, ముద్దులివ్వాలని తహతహలాడని వాళ్ళూ వున్నారా? వీడి కథలు ఏమోగాని, ఇరవాయనమ్మా! (ప్రసిద్ధమైనాయి).

ఈ శ్రీకృష్ణుడు వేదాలకు ఒడయడట (నాథుడట) కాని వెన్నదొంగ అని అందరిచేతా నిందించబడ్డాడు. ఈయన మహిమలను నాదించి (వినుతించి) విన్నవారి నమ్మకం ఏమిటంటే ఈయనే పరమాత్మ తాను ఆది పురుషుడై కూడా, ఆడికెల చాతలట (తిట్లు తినే చేష్టలట). ఏమి కథలో గాని ఇవి కథలు కాదమ్మా! వీని మహిమలేమని చెప్పగలం.

సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మగారికి ఈయన స్వయంగా తండ్రి. కానీ గొల్లకాంత యశోదాదేవి చనుబాలు త్రాగే ముద్దుబిడ్డ అయ్యాడు. 'కొలదొకరికి చెప్పకూడునా?' (పరిమితి ఇంత వున్నది అని చెప్పుటకు సాధ్యమా? వీని మహిమ లెంచగలమా?) ఈయనకి మనవంటి సామాన్యులమీద కూడ యెంత దయగలదో చెప్పలేం, యెందుకంటే స్వయంగా వైకుంఠం, దిగివచ్చి మీకోసం, కలియుగంలో మిమ్మల్ని రక్షించటంకోసం శ్రీవేంకటాద్రిపై నిలిచి వుంటానని తనమాట నిలబెట్టుకున్న వేంకటకృష్ణయ్య వీడే.

**4-78**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని దివ్యరథం తిరుమల వీధులలో వూరేగింపుగా పోతున్నది. గోవిందనామ సంకీర్తనం ఆకాశాన్నంటుతున్నది. ఇసుక వేస్తే రాలనంత జనం పులకించి పోతూ జగన్నాథుని మళ్ళీ చూడలేమేమో అనే తపనతో చూస్తున్నారు. మనకి గోచరించని ఇంకొక అద్భుత దృశ్యం అన్నమాచార్యులవారికి దృశ్యమానమైనది. చక్కటి కీర్తనలో ఆ వైభవాన్ని వర్ణిస్తున్నారు. నా భావన ననుసరించి నేనూ భావించాను. ఆ భావంబెట్టిదనిన... వినండి.

**ఆ.వె॥ అమరలోక వనితలాడేరు చూడరో**
**ప్రమదమూనివారు పాడినారు**
**వివిధ వాహనాల వేంకన్న వూరేగ**
**అన్నమయ్య హరిని సన్నుతించె**

**రాగం : దేవగాంధారి**

అమరాంగనలదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు ॥అమరాంగ॥

గరుడ వాహనుడు కనకరథముపై
యిరవుగ వీధుల నేగీని
సురులును మునులును సొంపుగ మోకులు
తెరలిచి తెరలిచి తీసేరు ॥అమరాంగ॥

యిలధరు దదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మ శివాదులు
చెలగి సేవలటు సేసేరు ॥అమరాంగ॥





అలమేల్మంగతో నటు శ్రీవేంకట-
నిలయు దరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారదాదులును
పొలుపు మిగుల గడు బొగడేరు ॥అమరాంగ॥

**భావామృతం :**

పరమాత్ముని రథోత్సవము జరుగుచున్నది. అదిగో, అమరాంగనలు (దేవతా స్త్రీలు) నాట్యమాడుచున్నారు. అదిగో ఎంతో సంతోషంతో స్వామి స్తోత్రాలు పాడుతున్నారు. (మనబోటి మానవమాత్రులకు ఆ దృశ్యం చూసే భాగ్యం లేదు. భావనలో ఆ కమనీయ దృశ్యాన్ని అనుభవిద్దాం).

గరుత్మంతునిపై తిరుగాడే శ్రీమన్నారాయణుడు, నేడు బంగారు రథముపై తిరువీధులలో వెళుతున్నాడు. దేవతలు, మునీశ్వరులు బారులు దీరి కమనీయ దృశ్యమానముగా "మోకెలు తెరలిచి తెరలిచి తీసేరు" (సాష్టాంగ నమస్కారములు గుంపులు గుంపులుగా చేయుచున్నారు). కనులారా ఆ దృశ్యం వీక్షించండి.

అదిగో చూడండి. ఇలధరుడు (భూకాంతుడు) ఇంద్ర రథముపై పోవుచున్నాడు. నరకాసురుని పీడ నివారించినందుకు ఇంద్రుడు తన రథంపై ఆనాడు స్వామిని సత్యభామ (భూకాంత) తో పాటు అలకాపురి వీధులలో వూరేగింపుగా తీసికొని వెళ్ళాడు. కెలయుచు (విజృంభించి) దిక్కులు గెలిచి త్రిభువనాలను తిరిగి ఇంద్రుని కిచ్చివేసిన స్వామిని ఆదిశేషుడు, బ్రహ్మదేవుడు, శంకరుడు మొదలైన వారు విశేషముగా సేవిస్తున్నారు. ఆ ఇంద్ర రథము వైభవం నేడు కూడా వర్ణనాతీతంగా వున్నది.

ఈనాడు అలమేల్మంగమ్మతో ఆ స్వామే శ్రీవేంకటేశ్వరునివలె తిరుమల వీధులలో తన రథముపై విజృంభించి వూరేగుచున్నాడు. అదిగో దశదిశలా, ముక్తులు (ముక్తిపొంది వైకుంఠవాసులైనవారు) నారదాది భక్తగణములతో వారంతా స్వామిని, పొలపు మిగుల (విస్తృతంగా) కదు బొగడేరు (మిక్కిలి కీర్తించుచున్నారు).

4-79

## మున్నుడి

తిరుపతిలో నెలకొన్న గోవిందరాజ స్వామి కొమ్మలిద్దరితో (శ్రీదేవి, భూదేవి) కొలువుదీరి యున్నాడు. ఇమ్ములన్ చిక్కియున్నాడట అంటే... అనుకూలంగా దొరకినాడట. ఆ స్వామి కావాలనుకొంటే దొరకుతాడు వద్దనుకుంటే ఎంత మొరపెట్టినా కంటబడడు. ఉన్నతితో కొలువిచ్చాడు అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటగిరిపై నున్నది కూడా ఈయనేనట. తిరుపతిలో రేచిన మోహాన రేయీబగలు తన సతులను కూడినాడట. ఇలా అనటం ఒక్క అన్నమయ్యకే సాధ్యం.

**కం॥ ఇమ్ముల జిక్కున్నాడిదె**
**కొమ్మల్లారా! విభుండు గోవిందుడటే**
**రమ్మని చేయిని జాచెను**
**అమ్మల్లారా! యనంచు అన్నయ వినిచెన్**

**రాగం : సారంగం**

కొమ్మలాల అమ్మలాల గోవిందరాజ
నిమ్ముల జిక్కున్నవాడు యిక నే మమ్మా ॥కొమ్మ॥

పరపుమీద నూరక పవళించుండుట గాని
నిరతి మీ విభునికి నిద్దుర లేదు
పరగ మీరిద్దరును పాదములు పిసుకుగ
సురత మర్మపుగాక జొక్కినదే ॥కొమ్మ॥

వున్నతితో గొలు విచ్చి వుండుట యింతే కాని
కన్నుల చూపు మీపైనే కదరమ్మా
మన్నన సతులు మీరు మాటలిట్టే యాడగాను
విన్న వినుకుల మెచ్చి విఱ్ఱవీగీ నదివో ॥కొమ్మ॥





పూచి భుజములు మూడై పొరలి వుండుట గాని
చాచిన కరము మీకే సన్న సేసీని
ఆచి శ్రీవేంకటగిరి నదె తిరుపతిలోను
రేచిన మోహాన గూడె రేయీబగ లదివో ॥కొమ్మ॥

**భావామృతం :**

ఓ యువతుల్లారా! మా తల్లులారా! ఈ గోవిందరాజస్వామి నేడు "ఇమ్ముల జిక్కి యున్నాడు" (అనుకూలంగా కావాలనే వారికి దొరకియున్నాడు) ఇంకా ఏమిటమ్మా! ఆయన మీవాడేకదా!

గోవిందరాజ స్వామి ఏదో వూరకనే అలా పరుపుపై పవళించి యున్నాడు కానీ, నీపై మిక్కిలి ఆసక్తికల ఆయనకు నిద్ర యేదమ్మా! మీరిద్దరు ఆయన పాదములను ప్రేమగా ఒత్తుతుంటే ఆయన విలసిల్లి యున్నాడు. బహుశా సురతి మర్మముల బాగుగా తెలిసియుండుగాక!

స్వామి వున్నతముగా కొలువు దీరివున్నాడు. అందుచేత ఏదో కొలువులో వున్నాడు గానీ ఆయన కళ్ళు మీపైనే వున్నవమ్మా! ఆయన సదా మీ మాటలను మన్నిస్తూనే వుంటాడు. మీరేమి మాట్లాడినా ఆయనకు వినసొంపుగానే వుంటాయి. తను విన్నసంగతులను మెచ్చుకొని ఆయనని విఱ్ఱవీగుతాడమ్మా! (అతిశయించి వుంటాడమ్మా!)

అమ్మలారా! చతుర్భుజుడైన గోవిందరాజస్వామి మూడు చేతులు (భుజములు) శంఖచక్రాయుధసమేతములైనవి మరియు తలక్రింద ఒక చేయివుంచుకొనినాడు. ఆయన నాలుగవ చెతిని చాచి మీకేవో సైగలు చేయుచున్నాడు. ఈయన తిరుపతి నగరవాసుడైనప్పటికీ శ్రీవేంకటగిరిపై భద్రముగా నెలకొని రెచ్చిపోయిన మోహపరవశుడై రేబవళ్ళూ మిమ్మల్ని కూడి వుంటాడమ్మా! మీరంటే ఆయనకంత ఇష్టం.

## మున్నుడి

దీనులై దేవదేవుని శరణు జొచ్చి ఆర్తితో ఆలపిస్తున్న అన్నమాచార్యులవారిని వింటే రాళ్ళే కరిగిపోతాయి. ఏడుకొండలవాని గుండెలను పిండిచేసే కీర్తన ఇది. ప్రభూ! నేను దీనుడవను. నీవో దేవుడవు. నీ దివ్య మహిమ ప్రకటిస్తున్నావు. నిత్యమూ జరుగుతుండె చావుపుట్టుకల మర్మమే తెలియనివాడను. ఇక భూమ్యాది విశ్వమును పుట్టించిని నిన్ను తెలుసుకోగలనా? శ్రీపతివైన నీవే జాలితో నాపై దయదలచి ఈ బంధనాల నుంచి విడిపించాలి గాని నా వల్ల అవుతుందా? నిన్ను విడువనయ్యా! నా అంతిమ శ్వాస దాక నన్ను రక్షించే భారం నీదే ప్రభూ! అంటున్నారు....

**మ॥ వరదా! దీనుడ నేను దేవుడవు నీ వాత్సల్యమే చాలదా?**
**నెరపేనీ మహిమల్ నెరుంగ తరమా!! నీ చిత్తమే చెల్లురా**
**తిరువేంకన్నవు దేవదేవుడవు ఈ దీనున్ సదా బ్రోవుమా**
**విరివై కీర్తనలన్నమయ్య వినిచెన్ వేనోళ్ళ కీర్తించుచున్.**

**రాగం : నీలాంబరి**

దీనుడను నేను దేవుడవు నీవు
నీ నిజ మహిమే నెరపుట గాక ॥దీనుడ॥

మతి జనన మెరుగ మరణంబెరుగను
ఇతవుగ నిను నిక నెరిగేనా
క్షితి పుట్టించిన శ్రీపతిని నీవే
తతి నాపై ద్వయ దలతువు గాక ॥దీనుడ॥

తలచ పాపమని తలచ పుణ్యమని
తలపున ఇక నిను తలచేనా
అలరిన నాలో అంతర్యామివి
కలుష మెడయ నను గాతువు గాక ॥దీనుడ॥





తడవ నా హేయము తడవనా మలినము
తడయక నీమేలు తడవేనా
విడువలేని శ్రీ వేంకట విభుడవు
కడదాకా నను గాతువు గాక ॥దీనుడ॥

### భావామృతం

ఓ శ్రీనివాసా! నేను దీనుడను. నీవు భగవంతుడవు. నీ యొక్క దివ్య మహిమను ప్రకటింపజేయుట గాక, నీ విశ్వరచన మేము అర్థము చేసికొనగలమా?

ఎంత ఆలోచించినా మా బుర్రకు చావుపుట్టుకల మర్మం తెలుస్తుందా? యెవరు యెందుకు పుడతారో, యెందుకు మరణిస్తారో చెప్పగలవారెవరు? నిత్యము మా కళ్ళెదుటే జరిగే వాటినే తెలియని మాకు, నిన్ను తెలియుట సాధ్యమా? ఈ విశ్వాన్ని సృష్టించిన దేవదేవుడవు, శ్రీపతివి. దీనుడనని నాపై దయదలచెదవు గాక!

ప్రభూ! రోజూ తెలిసో తెలియకో ఎన్నో పాపాలు చేస్తున్నాను. అలాగే పుణ్యాలు కూడా చేసే వుంటాను. వాటినే తలచి నన్ను నేను సంస్కరించుకొనే 'తీరిక' లేని నాకు నీగురించి తలచే సమయముంటుందా? నా తలపులలో కూడా నిన్ను రానివ్వటం లేదు. పోనీ నీవెక్కడో దూరంగా వున్నావంటే కాదయ్యే. అంతర్యామిగా మాలోనే వుండి అనుక్షణం గమనిస్తావు. నా దోషములను తొలగించి నన్ను రక్షించెదవు గాక!

ప్రభూ! ఇక నా గురించి ఏమి చెప్పుకోమంటావు? నా బ్రతుకు గురించి, తడవనా (ఆలోచించుటకే) హేయము (నీచముగా నున్నది). తడవనా (దాని గురించి ప్రస్తావించుటయే) మలినము. తడయక (నిన్ను ధ్యానించక), నీమేలు, తడవేనా (సంపాదించగలమా?) అది అసాధ్యం. ఎన్నడూ విడువరాని శ్రీవేంకటేశ్వరుడవు నీవే. నేను నిన్నే నమ్ముకొన్నాను. కడదాకా (నా చివరి క్షణం దాక) నన్ను గాతువు గాక! (రక్షించెదవు గాక).

"క్షమస్వత్వం క్షమస్వత్వం శేషశైల శిఖామణే"

## 4-81

## మున్నుడి

నేటి కడప జిల్లాలోని వావిలిపాడులో వెలసిన వీరరాఘవుని కళ్యాణసందర్భంగా ఆనాడు అన్నమాచార్యులవారు పాడిన చక్కని పెండ్లిపాటనాలకించండి. సీతమ్మ 'దగ్గరి సింగార బొమ్మ'. రాఘవుడు శివధనస్సు విరిచాడు కాబట్టి జనకుడు నిన్ను ఆయనకిచ్చాడు అని అంటున్నారు. సీతారామకళ్యాణం కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నారు. వశిష్టుడు వేదమంత్రాలు చదువుతుంటే అక్షతలు చల్లవమ్మా! అని కీర్తన వినిపిస్తున్నారు. "తెంకుల నిన్ను గూడి తిరమాయనమ్మా" - అని అంటున్నారు. అంటే... యేమిటో చదవండి మరి...

**కం॥ సిగ్గరి పెండిలి కూతురు**
**దగ్గరి సింగార బొమ్మ తలవంచకుమా!**
**మొగ్గగు సీతమ్మకు నిటు**
**బిగ్గరగా అన్నమయ్య పేర్కొని తెలిపెన్.**

**(పేర్కొని=స్తుతించి)**

**రాగం : సాళంగనాట**

సిగ్గరి పెండ్లికూతుర సీతమ్మ
దగ్గరి సింగార బొమ్మ తలవంచకమ్మా ॥సిగ్గరి॥

అల్లనాడే రాఘవుడు హరువిల్లు విరిచెను
యెల్లి నేడే పెండ్లాడీ నిదివో నిన్ను
యెల్లగా జనకుడు నిన్నిచ్చీనట వీడె
వెల్లివిరినీ మాట వినవమ్మా ॥సిగ్గరి॥

అదె పెండ్లితెర యెత్తిరండనే వసిష్టుడుండి
చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా
మొదల రామునికంటె ముంచి తలబాలు వోసి
సుదతి యాతని మోము చూడవమ్మా ॥సిగ్గరి॥





కంకణదారాలు గట్టి కాలుదొక్కితివి మీరు
పొంకాన బువ్వమందరో పొత్తుల నమ్మ
(ఉం) మంకువ వావిలి పాటనుండి శ్రీవేంకటగిరి
తెంకుల నిన్ను గూడి తిరమాయనమ్మా ॥సిగ్గరి॥

**భావామృతం**

ఓ సీతమ్మా! సిగ్గుల మొగ్గవైన పెండ్లికూతురా! రామచంద్రునికి దగ్గరదానవైన శృంగారాల అపరంజి బొమ్మా! అంతగా తలవంచుకొనవద్దు తల్లీ! (రామయ్యకు నీవంతగా తలవంచుకొంటే నీ సౌందర్యమెలా కనబడుతుంది?)

అల్లనాడే (ఇదివరకే) రాఘవుడు శివధనస్సును విరిచాడు. యెల్లి (రేపటిరోజు, అనగా నిన్నటికి రేపటిరోజు) అయిన నేడే పెండ్లియాడుతున్నాడు. ఇదిగో జనకమహారాజు నిన్నిచ్చి కన్యాదానము చేయుచున్నాడు. ఈ మాట ప్రపంచమంతా వెల్లివిరియైనది. (ప్రకటించబడినది). నేటికీ ఆనాడు ఆయనన్నమాటలు ప్రసిద్ధమే. ఒక్కసారి చూడవమ్మా! వినవమ్మా!

అదిగో మీమధ్యనున్న తెఱపైకెత్తివేసినారు. అక్కడే వశిష్టుడు యుండి చక్కగా మంత్రాలు చదువుతున్నాడు. నీవు అక్షతలను చల్లవమ్మా! రామునికంటే ముందరే ఆయన శిరస్సుపై తలంబ్రాలు పోసి మనోహరమైన ఆ సుందర వదనము వంక కన్నార్పక చూస్తూ వుండిపోవమ్మా! నిన్ను కాదనగలవారెవరు తల్లీ!

మీ ఇద్దరి చేతులకు కంకణదారాలు కట్టి కళ్యాణ దీక్షనిచ్చారు. సన్నికల్లుతో రామచంద్రమూర్తి కాలు నీ కాలితో త్రొక్కించారు. పొందికగా, పొత్తుల (బంతిలో వుండి) మీరిద్దరు బువ్వమందరో (పెండ్లి బంతి భోజనం చేయండి). (ఇక్కడ మంకువ అని వున్నది గాని అది "వుంకువ" అయి వుండాలి. ఎందుకంటే... మంకువ అనే మాటకర్థంలేదు). ఉంకువ అంటే అల్లుడు మామగారికిచ్చే కన్యాశుల్కము. బంతి భోజనాలయ్యాక అల్లుడు కన్యాశుల్కం ఇచ్చి పెండ్లికూతుర్ని తనవెంట తీసికొని వెళ్తాడన్నమాట. సరే, ఇక్కడ వావిలిపాటిలో వున్న ఈ వీరరాఘవుడే శ్రీవేంకటగిరి తెంకుల (స్థానముగా) నిన్నుగూడి తిరమాయెనమ్మా! (స్థిరపడ్డాడమ్మా!)

## 4-82

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని తెప్ప తిరునాళ్ళ సందర్భంగా అన్నమాచార్యులవారు చెప్పిన చక్కని కీర్తన ఇది. స్వామికి పాలసముద్రంలో 'పాముతెప్ప' ఏర్పాటయిందిట. తొల్లి మఱ్ఱి ఆకు తెప్పపైనే ఆయన తేలిఆడాడట. సాగరమథనంలో మంధర పర్వతానికి తానే ఒక తెప్ప అయ్యాడట. కాళింగుని మర్దించినప్పుడు ఆ పడగలే స్వామికి యమునా నదిలో తెప్ప అయిందట. పదియారువేల భార్యల చెమటల తెప్పోత్సవం జరుపుకొన్నాడట. ఈ తిరుమలలోది "నేటి నేటి తెప్ప తిరునాళ్ళట" అంటే యేమిటి? తప్పదు... భావామృతం చదవాల్సిందే.

**ఆ.వె.॥ఎందునీకు ప్రియము యీ తెప్పతిరుణాళ్ళు**
**ఇందువడెను, సిరులు పొందు తెప్ప**
**అన్నమయ్య పాట నలరిన తిరుణాళ్ళు**
**లెక్కలెంచగలమె యెక్కడైన?**

**రాగం : బృందావన సారంగ**

ఎందునీకు ప్రియమో యీ తెప్ప తిరునాళ్ళు
దిం(ఇం)దువడె సిరులతో (యీ) తెప్ప తిరునాళ్ళు ॥ఎందు॥

పాదజలనిధిలో బవ్వలించీ పాముతెప్ప
దేలుచున్నదది దెప్ప తిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకు మీద
తేలుచున్న దది తెప్ప తిరుణాళ్ళు ॥ఎందు॥

అమృతము దచ్చునాడు అంబుధిలో మంధరము
తేమల దేలించు తెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగు సంగపు పడిగెలమీద
తిమిరి తొక్కిన తెప్ప తిరుణాళ్ళు ॥ఎందు॥





అప్పుడు పదారువేలు అంగనల చెమటల-
తెప్పల దేలిన తెప్ప తిరుణాళ్ళు
వొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతి కోనేటిలోన
తెప్పి (ప్ప) రిల్లె నేట నేట తెప్ప తిరుణాళ్ళు ॥ఎందు॥

## భావామృతం

ఓ ఏడుకొండలవాడా! తెప్ప తిరుణాళ్ళంటే యెందుకు నీకు ప్రియమో!! (ఎక్కడి ప్రీతి స్వామీ!) ఈ తిరునాళ్ళు సిరులతో 'ఇందువడె' (అనగా... ఇమిడిపోయినవి). (రాగి రేకుపై 'దిందువడె' అని వున్నది. కాని దిందువడెకి సరయిన అర్థం నాకు కనిపించలేదు).

(ప్రభూ! నీవు అనేకములైన తెప్పోత్సవములు ఇదివరలో చాలా చేసికొనినావు. కొన్నింటిని వివరిస్తాను) క్షీరసాగరమున, ఆదిశేషుడు అనే పాముపై శయనించు నీకు తేలిన ఆ పాము తెప్ప తిరుణాళ్ళు నిత్యమూ వుండేదే కదా! సృష్ట్యాదియందు, ఓలి (యెడ తెరపి లేకుండా) ఏకోదకమై ప్రపంచమంతయూ వున్నప్పుడు, నీవు ఒక మఱ్ఱి ఆకుపై తేలి శయనించినావు. అదిగో అదే నీకు మఱ్ఱియాకు తెప్ప తిరుణాళ్ళు.

ఆనాడు దేవదానవులు, క్షీరసాగరమథనం జరిపిన వేళ కవ్వమైన మంధర పర్వతం మునిగిపోతుంటే, నీవు ఆదికూర్మమై, ఆ మంధరగిరిని తేలించి చక్కటి తెప్ప తిరుణాళ్ళు జరిపించినావు. యమునానదిలో కాళింగుని మదమణచుటకు వాడి పడగలమీద నృత్యం చేసి ప్రాణాలు విలవిలలాడేట్లు చేసి, వాడి సంగపు పడిగెలు (కలిసియున్న పడిగెల)పై తిమిరి తొక్కి (తిమ్మిరి పోగొట్టు) తెప్ప తిరునాళ్ళు యమునలో చేసికొనినావు.

ద్వాపరయుగంలో పదియారు వేలమంది (నరకాసురుని బందీలయిన రాచకన్నెలను పెళ్ళాడి పదియారువేల కృష్ణులుగా వారితో ఒకేసారి సుఖించి వారి చెమటలు ఏరులై పారగా, ఆ అంగనల చెమటలో తేలి తెప్పోత్సవం జరుపుకొన్నావు. అవన్నీ అటుంచి, నేడు ఈ శ్రీవేంకటాద్రిపై ఈ కోనేటిలో తెప్పరిల్లి (సేదదీరి), ఒప్పుగా గొప్ప ఔన్నత్యముతో నీవు "నేటినేటి తెప్ప తిరుణాళ్ళు" (దృఢముగా నిశ్చయమైన తెప్ప తిరుణాళ్ళు) జరుపుకొనుచున్నావు. మమ్మల్ని తరింపజేయుచున్నావు.

## 4-83

### మున్నుడి

అన్నమాచార్యులవారి తత్త్వోపదేశం నేటికాలంలో వేమన శతకం చదివినట్లుంటుంది. పరనింద తగదు. ఇంకొకళ్ళ నెత్తిన బూజుని చూచి నవ్వేముందు నీ నెత్తిన యెంత బూజుందో చూసుకో, నేనూ అంతే...

పరులపై ఆగ్రహిస్తాను. కానీ అరిషడ్వర్గాలను జయించలేను. ఇంకొకళ్ళకి నీతులు చెప్తానేగానీ నా అంతర్యామియైన హరిని తెలియను. ఇంకొకళ్ళ దుర్గుణాల నేకరువు పెడతాగాని నా ఆసల నణచలేను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్నాళ్ళకూ నిన్నెరగని, నన్ను ఎన్నన్నా ఫలితం సున్నా. నా చదువు చట్టు బండలైనట్లుంది తండ్రీ!

**చం॥ చదివితి దొల్లి కొంత, మనసా పఠియించితినింక కొంత,నా**
**యెదుటనె యున్ననాదు మతియేను యెరుంగను యెంతయైన, నే**
**నిదివిను నిత్యమున్ పరుల యెగ్గుల నెంచెద వీడ నాసలన్**
**యెదగల వేంకటేశ్వరుని యెంచను దిక్కని అన్నమయ్యనెన్.**

### రాగం : శ్రీరాగం

చదివితి దొల్లి కొంత - చదివే నింకా గొంత
యెదిరి నన్నెఱగను - యెంతైన నయ్యో ॥చదివితి॥

ఒరుల దూషింతు గాని - వొకమారైన నా
దురితకర్మములను - దూషించను
పరుల నవ్వుదు గాని - పలు యోని కూపముల
నరకపు నామేను - నవ్వుకోను ॥చదివితి॥

లోకుల గోపింతుగాని - లోని కామాదులనెటి
కాకరి శత్రులమీద - గడుగోపించ
ఆకడ బుద్ధులు చెప్పే - అన్యుల బోధింతు గాని
తేకువనాలోని హరి - దెలుసుకోలేను ॥చదివితి





ఇతరుల దుర్గుణము - లెంచి యెంచి రోతుగాని
మతిలో నాయాసలు - మానలేను
గతిగా శ్రీవేంకటేశు - గని బ్రతికితిగాని
తతి నిన్నాళ్ళదాకా - దలపోయలేను ॥చదివితి॥

### భావామృతం

ఓ దేవదేవా! నేను ఇదివరకు కొంత 'చదివాను'. ఆ తరువాత కాలంలో కూడ మరికొంచెం చదివాను. కాని నా యెదుటనున్న వాని తత్త్వము నెరుగను. అంతయెందుకు నాగురించి నేనే తెలియకున్నాను.

పనివేళా పరదూషణ చేస్తానేగాని నేను చేయుచున్న దుష్కర్మములను మాత్రం దూషించను (పైగా నన్ను నేను సమర్థించుకొంటాను). పరులను చూచి పకపక నవ్వుతాను కాని, యేవేవో యోనుల యందు జన్మించి (వివిధ పుట్టుకలను పొంది నరకయాతనల ననుభవించుచున్న నా 'శరీరాన్ని' చూసి నాకు నవ్వు రావటంలేదు. ఎవరి నెత్తిన బూజు వారెరుగరంటే ఇదేనేమో!!

పరులపై కోపమును ప్రదర్శిస్తుంటాను కాని, నాలోనే వున్న "కాకరి శత్రువు"లను (మాయావులైన వైరులను) తెలియలేకున్నాను. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములనే ఆ ఆరుగురు శత్రువులపై యేమాత్రం నా కోపం ప్రదర్శించకున్నాను. ఇంకొకరికి యెన్నెన్నో బుద్ధులు నేర్పుతాను గాని, నాలోని 'అంతర్యామి' నాకు బుద్ధులు చెబుతుంటే, తేకువతో (వివేకముతో) నాలోని 'హరిని' తెలుసుకోలేక పోతున్నాను. నన్నేం చేయాలి?

ఇదిట్లా వుండగా, నేను ఇతరుల దుర్గుణాలను చూచి యేవగించుకొంటానే కాని, నా మనస్సులో వున్న ఆసలను విడనాడ లేకున్నాను. ఈ ఆశ ఒక పాశము వలె నన్ను బంధిస్తున్నది. చివరికి ఎలాగో అలా, శ్రీవేంకటేశ్వరుని కరుణవల్ల బ్రతికి బట్టకట్టగలిగాను కాని ఆయనపై 'తతి' (ఆసక్తి)తో ఇప్పటిదాకా ఆ ఏడుకొండలవాడి మహిమను మాత్రం గుర్తించలేకున్నాను. నేను బ్రతికుండగా అది జరుగుతుందో...లేదో.

4-84

## మున్నుడి

శ్రీమన్నారాయణుని దశావతారములను కీర్తించాలంటే అన్నమాచార్యులవారే ప్రథమ స్థానంలో వుంటారు. నూటికి తొంబది మందికి ఇది దశావతార కీర్తన అని అర్థం అవదు. అధవా... స్ఫురించినా అన్వయించటం అంత సుసాధ్యం కాదు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు దీని భావామృతం చదివితే అన్నమయ్య పాండిత్యం, అనంతం... అసామాన్యం అని అర్థం అవుతుంది. ఆయనని పొగడటం అటుంచి మన భాషతెలుగు అయినందుకు గర్వంతో మన తలపైకి లేస్తుంది. నిజం...

**ఆ.వె॥పురుషులకు పురుషుడ! పురుషోత్తమా నీకు**

**పురుడు లేదు, శ్రేష్ఠపురుషుడీవు**

**హరిదశావతార తీరునెరుగలేము**

**తరచి తరచి చూడ ఎరుకయగును.**

**రాగం : హిందోళము**

పురుషులకు పురుషుడవు పురుష్తోమా
పురుడు లేదికి నీకు బురుషోత్తమా ॥పురుష॥

పొలసులాడకు నీవు పురుషోత్తమా
బలిసి లోగగనేల పురుషోత్తమా
పొలము రాజవు నీవు పురుషోత్తమా
పొలకువదే కంబమున పురుషోత్తమా ॥పురుష॥

పొడవులకు బొడవైన పురుషోత్తమా
పుడిసిళ్ళ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిగైకొంటి పురుషోత్తమా
పొడమె జీకటి తప్పు పురుషోత్తమా ॥పురుష॥





బూటకపు బుద్ధిగల పురుషోత్తమా
పోటిగుఱ్ఱపు బసల పురుషోత్తమా
మేటి శ్రీవేంకటము మీది పురుషోత్తమా
పూటపూటవరాలు పురుషోత్తమా ॥పురుష॥

**భావామృతం**

పురుషులందరికీ (అంటే జన్మనెత్తిన జీవులందరిలోకి) పురుషుడవు (అధికుడవైన) పురుషోత్తమా (పరమాత్మవైన నారాయణుడా) పురుడులేదిక నీకు (అసలు నీకు జననమే లేదు ప్రభూ!)

ఓ పురుషోత్తమా! నీవు పొలసులాడకు. (చేపలకంపు కొట్టవద్దు...అంటే మత్స్యావతారము). బలిసి లోగగనేల పురుషోత్తమా! (అధికుడవై కూడ లొంగి ఒకరి క్రింద పడివుండుట యెందుకు పురుషోత్తమా!...అంటే కూర్మావతారం).

పొలము రాజవు నీవు (అడవికి మొనగాడైన అడవి పందివి (వరాహావతారం) పొలకువదే కంబమున (స్తంభమునందు, అదిగో నీ జాడ కనబడినది...అంటే అప్పటికప్పుడు స్తంభము నుండి ఆవిర్భవించినవాడు...అంటే నరసింహావతారం).

పొడవులకు పొడవైన (ఉన్నతులైనవారందరిలో ఉత్కృష్టుడవైన... త్రివిక్రముడు. అనగా వామనావతారము) పురుషోత్తముడు. పుడిసిళ్ళ జల్లితివి (పుడికిళ్ళతో...దీనినే నేటికాలంలో 'పిడికెళ్ళతో' అంటున్నాం.. అంటే పిడికెళ్ళతో రాజుల రక్తం వెదజల్లిన పురుషోత్తముడు..అంటే పరశురాముడు). పుడికి సతిగైకొంటివి (బుజ్జగించి భార్యను స్వీకరించిన పురుషోత్తముడు.. శ్రీరామావతారం). పొడమె చీకటితప్పు పురుషోత్తమా (జారత్వము పొడగాగల దేవా!..జారుడు అనిపించుకొని మచ్చ తెచ్చుకొన్న శ్రీకృష్ణా!)

బూటకపు బుద్ధిగల (మోసముతో మానం అపహరించు బుద్ధిగల పురుషోత్తమా...బుద్ధావతారము). పోటి గుఱ్ఱపు బసల పురుషోత్తమా (గొప్ప చాతుర్యంగల యుద్ధాశ్వమునెక్కిన కల్కిఅవతారం). మేటి పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరా! తిరుమల మీద ఏ పూటవరాలు ఆపూటనే ఇచ్చివేసే పురుషోత్తమా! శ్రీనివాసా! ధన్యోస్మి ప్రభూ!

## 4-85

## మున్నుడి

అన్నమాచార్యులవారు యెన్నుకొనే 'అంశం' ప్రతి కీర్తనలోను, వైవిధ్యం ప్రస్ఫుటిస్తుంది. నీవు పరమాత్మవు (దేవుడవు) మేము జీవులం. ఈ విధంగా మనకి ఋణానుబంధం వున్నది. కాని నీవెక్కడ నేనెక్కడ? సృష్టిలోని జగములన్నీ మీ వెంట్రుకల మొదళ్ళలోంచి ఆవిర్భవించాయి. గతంలో వున్న బ్రహ్మలు, రాబోయే కల్పములలో వుండబోయే బ్రహ్మలు (ఆంజనేయుని వంటివారు) మీ నాభికమలం (బొడ్డులోని తామరపువ్వు) నుంచే పుడతారు. నీ ఘనతనెరుంగ శక్యమా ప్రభూ! ఏదో నీ మహిమ తెలియకపోయినా నీకృప నర్థించి నిన్ను సేవించటం తప్ప మావల్లనేమవుతుంది శ్రీనివాసా!

**మత్తకోకిల :**

**నీవు దేవుడవయ్య శ్రీహరి నేను జీవుడ వల్లభా!**
**ఈ విధిన్ మన ఇర్వురిన్ ఋణమిట్లు గట్టెను నిక్కమౌ**
**ఆ విధాతలు యెందరైనను అబ్జనాభుని నాభిలో**
**దేవ! పుట్టినవారలే ఇది తెల్పె అన్నయ చూడరో.**

**రాగం : సింధుభైరవి**

నీవు దేవుడవు నేనొక జీవుడ
యీ విధి నిద్దరి కెంతంతరువు ॥నీవు॥

పొడమిన జగములు పుట్టెడి జగములు
గుడిగొనె మీ రోమ కూపముల
యెడయక నీ రూపమేమని ధ్యానింతు
అదరి మీవాడ నేననుటే కాక ॥నీవు॥





మునుపటి బ్రహ్మలు ముందరి బ్రహ్మలు
మొనసి మీ నాభిని మొలచేరు
ఘనుడవు నిన్నేగతి నే తెలిసెద
అనువుగ మిము శరణనుటే కాక ॥నీవు॥

సహజానందము సంసారానంద-
మిహము పరముగా నిచ్చేవు
అహిపతి శ్రీవేంకటాధిప నీ కృప
మహిలో సేవించి మనుటే కాక ॥నీవు॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నీవు పరమాత్మవు, అనంతుడవు. నేను జీవుడను. (సముద్రంలో నీటి బొట్టంత కూడా వుండను). అయినప్పటికీ మనిద్దరికీ నేను చెప్పబోయే విధముగా యెంతెంతో ఋణానుబంధం వున్నది. అందుకని నీకు నన్ను రక్షించక తప్పదు.

ప్రభూ! పొడమిన జగములు (ఇదివరకే వున్న లోకములు), పుట్టెడి జగములు (ఇకముందు రాబోయే లోకములు), అన్నీ అనంతుడవైన నీ రోమ కూపముల నుంచే (వెంట్రుకల మొదళ్ళనుంచే) గుడిగొన్నవి (పుట్టాయి). అటువంటి నీ రూపాన్ని ధ్యానించటం నాకు సాధ్యమా? ఏదో నేనూ నీవాడిని అని చెప్పుకొంటూ బ్రతుకుటకాక, నావలన యేమవుతుంది తండ్రీ!

దేవా! సృష్ట్యాదినుంచి వున్న బ్రహ్మదేవుళ్ళూ! రాబోయే కల్పములలో వుండబోయే బ్రహ్మలు, అంతా 'పద్మనాభు'డవైన నీ నాభికమలం నుంచే పుట్టారు. పుట్టబోతారు కూడా. అటువంటి ఘనుడవైన నిన్ను ఏ విధంగా తెలుసుకోగలనయ్యా? నిన్ను 'శరణు మహాప్రభో'! అని శరణు వేడుట కాక మేము చేయగలిగిందేమన్నావున్నదా ప్రభూ!

ఓ ఏడుకొండలవాడా! ఇహలోకంలో మేము పొందే సాంసారిక ఆనందము, పరలోకంలో మా కర్మఫలంగా మేము పొందబోయే 'పరభాగ్యము' అనే సహజానందము (అది మాతోబాటే పుట్టుతుంటుంది) ఇచ్చేది వేరెవ్వరోకాదు... నీవే. అహిపతి (శేషశయనుడవైన ఆదిశేషుని వల్లభా!) శ్రీవేంకటేశ్వరా! మహిలో నీకృప నర్థించి, నిన్ను సేవిస్తూ జీవించుట కాక, మేము చేయగలిగింది, చేయబోయేది, చేయవలసినది కూడా మరొకటి లేదు.

## 4-86

## మున్నుడి

అష్టవిధములైన శృంగార నాయికలలో "కలహాంతరిత" ఒకతె. ఈమెకు తన నాథుడంటే అంతులేని ప్రేమ. కాని ఆయన క్షణం ఆలస్యంగా తన దగ్గరకు వస్తే... ''గయ్యి''మని మాట్లాడే 'గయ్యాళి'. అగ్నిపర్వతంలా ప్రజ్వరిల్లి ఆయన అనునయించగానే కఱగినీరవుతుంది. కౌగిలిలో విలపిస్తుంది. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు 'కలహాంతరిత' వలె జగన్నాథునితోనే పోట్లాడుతున్నారు. దెప్పి పొడుస్తున్నారు... రుసరుసలాడుతున్నారు. బుసకొట్టే భుజంగమైపోయారు. ఆ తరువాత కథ అంతా మామూలే.

**ఉ॥ చాలుర నీదు పొందు, యిక సాధ్యము కాదుర పొమ్ము ఆవలన్**
**తాలిమి పోయె వీడితిని ధైర్యము బోరగ శక్తి లేదురా**
**నాలివి, ఆపవామె నను నవ్వగ మచ్చర మెక్కి వల్లభా!**
**యేల వితండవాదములు యెంచుము దాసిని అన్నమయ్యనెన్.**

**రాగం : మాళవి**

పోపోనీ పొందుచాలు పొసగదిక
వైపు గాదనుచు నీతో వడి బోరాడేనా ॥పోపో॥

అప్పుడే ఆపె మాటకు నదలించ వలదా
విప్పుచు నన్ను దిట్టగా విందురా నీవు
చెప్పనేల నీతోడి చెలిమేటి చెలిమి
ముప్పిరి చుట్టమవంటా మొగము చూచేదా ॥పోపో॥

మచ్చరాన నవ్వగాను మానుపంగవలదా
(వ) వొచ్చాన నావేళ నాపె వద్ద నుందురా
యిచ్చ కాన నీకు నాకు నేటి మొగమాట మింక
వచ్చినదే పదివేలు వాదులాటే చాలును ॥పోపో॥





పొత్తునగూచుండితేను పొమ్మనంగ వలదా
అత్తల సరిసేతురా ఆపెను నన్ను
అత్తిన శ్రీవేంకటేశ అలమేలు మంగ నేను
బత్తితో నన్ను గూడితి పంతమేటి పంతము ॥పోపో॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! "పోపోవయ్యా! నీ స్నేహము చాలు. నీకు నాకు ఇకపై యేమాత్రం పొసగదు. నీవు నావైపు వున్నావని నేననుకోవటం భ్రమ. అది నిజంకాదు", అంటూ తీవ్రంగా పోరాడిన ఆమెను నీవే కరుణించాలయ్యా!

స్వామీ! ఆమె (నీ ఆ భార్య) మాటకు అప్పుడే, అదలించ వలదా (అడ్డు చెప్పవద్దా!!) ఆమె విప్పుచు (అంత విపరీతంగా) నన్ను తిడుతుంటే... నీవు అదేమిటి అనకుండ అట్లా వింటూ కూర్చుంటావా? ఇంకా చెప్పవలసిన పనేమున్నదయ్యా! నీ స్నేహం అదేమిటి అనకుండ అట్లా వింటూ కూర్చుంటావా? ఇంకా చెప్పవలసిన పనేమున్నదయ్యా! నీ స్నేహం అదేమి స్నేహమో కాని, ఇకచాలు చాలు. ముప్పిరి చుట్టమవంటా? (నీవు నాకు ఆత్మబంధువు అని అనుకోనా!!) చాలు స్వామీ! మొగము చూచేదా (నీ ముఖము చూడమంటావా?) వద్దనేవద్దు.

ప్రభూ! ఆమెకు నేనంటే యెంత మత్సరమో తెలుసా? ఆ మచ్చరంతో ఆమె, 'దీని ముఖంతే' అన్నట్లు నన్ను చూసి నవ్వుతుంది. అప్పుడు నీవు ఆమెను మాన్పవద్దా? అట్లా చేయకపోగా, వచ్చాన (సమీపించి) ఆరోజు ఆమె వద్దనే గడుపుతావా? ఇప్పుడు నాతో ఇచ్చకాన గడుపుటకు చూస్తావా? ఇక నీకు నాకు 'యేటి మొగమాటము' (సంకోచం) యెందుకు? తమరు నావద్దకు వచ్చిందే... పదివేలు (అదే... భాగ్యం). ఇప్పుడు జరిగిన ఈ పోట్లాట చాలును.

స్వామీ! ఒకవేళ ఆమే వచ్చి నీ సరసన కూర్చుందే... అనుకో... నీవన్నా "పోపోవమ్మా! నా ప్రియ సఖి ఏమన్నా అనుకొంటుంది"... అనవద్దా? ఆమెను నన్ను సమానం చేస్తావా? యేం అన్యాయం... ఇది!! (వెనువెంటనే ఈ 'కలహాంతరిత'... అనగా... ముందుకోపించి తరువాత పరితాపంతో సమకూడు ప్రియురాలు) చల్లబడినది. అత్తిన శ్రీవేంకటేశా! (కూడిన శ్రీనివాసా!) అలమేల్మంగతో వలెనే బత్తితో (భక్తితో) నేను నిన్ను సేవించే దానినే. నాతో పంతం నీకేలనయ్యా! పంతం మాని నన్ను స్వీకరించుము.

## మున్నుడి 4-87

వైరాగ్య భావనల కద్దంపట్టే అన్నమాచార్యుల వారి కీర్తన నాస్వాదించండి. నా భార్య, నా సంతానం, నా బంధువులు అనే సంగత్వం, ముందే తొలిగిపోవాలి. మరణశయ్యపై చేరాక మాధవా, కేశవా అంటానులే అనుకుంటే... అది జరిగేపనికాదు. ముందుగా చెఱువుకి కట్టగట్టుకొని, వర్షంనీరు నింపి దానిని వాడుకోవాలి గాని నీళ్ళు పోయాక నీవు చేసేదేముంది అంటున్నారు.

**సీ॥ నిప్పులో మిడుతలు నివురాయెనన్నట్లు**
**స్త్రీజూచి పురుషులు చెడుట కద్దు**
**గాలానికెఱ్ఱల గాంచిన మీనులున్**
**జిక్కి చచ్చినయట్లు చెడుట కద్దు**
**కనకంపు మిసమిసల్ గాంచిన మనములు**
**విడువక దిగజారి చెడుట కద్దు**
**ముత్యపు చిప్పల మున్నీటి బిందువుల్**
**తేటముత్యాలుగ తేలకద్దు**

**తే॥ వేంకటేశుని దాసులు పేర్మిజేత**
**పుణ్యులగుదురు విషయాల మోసపోక**
**కట్టగట్టవచ్చునె నీరు గడచిపోవ**
**అన్నమయ్య బోధించెను హరిని గొలిచి**

**రాగం : రామక్రియ**

ముందే తొలగవలె-మోసపోక సంగ మెల్ల
కందువబోయిన నీళ్ళు-కట్టగట్ట వచ్చునా ॥ముందే॥

అనలము బొడగంటే - నందనున్న మిడుతలు
పనిలేకున్నా నందు-బడకుండీనా
పొనిగి చెలుల గంటే -పురుషుల చూపులెల్లా
ననిశము నందు మీద -నంటు బారకుండునా ॥ముందే॥





గాలపుటెఱ్ఱలగంటే-కమ్మి నీటిలో మీలు
జాల నా పసలజిక్కి -చావకుండీనా
ఆలరి బంగారు గంటే-నందరి మనసులూను
పోలిమి నాపసజిక్కి - పుంగుడు గాకుండునా ॥ముందే॥

చేరి ముత్యపు జిప్పల -చినుకులు నిలిచితే
మేర తేట ముత్యములై - మించకుండీనా
ధారుణి శ్రీవేంకటేశు - దాసుల సంగతి నుంటే
పోరచి నే జీవులైన - బుణ్యులు గాకుండురా ॥ముందే॥

**భావామృతం :**

మోక్షమునాసించు వారు, సంసారపు యావలో పడి మోసపోక, ముందే, సంగమెల్లా (నావాళ్ళు, నాది... అనే వెంపర్లాట) తొలగవలె (వదలించుకోవాలి). కందువ బోయిన నీళ్ళు (అతిశయించి వేగముగా వచ్చే నీళ్ళు, వర్షజలం పోయిన తరువాత...) దానికి కట్టగట్టుట సరియైన పనియేనా?

ఒక్కసారినిప్పును చూస్తే మిడుతలు, పనిలేక పోయినా అందులోపడి చావకుండా వుంటాయా? స్త్రీలను చూచిన పురుషులకు, అనిశము (ఎప్పుడూ) వారిపైనే తలమునకలవకుండా వుంటారా? కాంతాచింతతో కాంతి విహీనులు కాకుందురా?

నీటిలో గాలానికి తగిలించియున్న ఎఱ్ఱలను (యెరలను) చూచిన చేపలు చంచల బుద్ధితో, (ఎఱకోసం ఆ గాలానికి చిక్కి చావకుండా వుంటాయా...). వాటి ఆలరి (అల్లరి) వాటి వినాశహేతువే కదా! కాంచనమును గాంచిన అందరికీ చిత్తములు చెడి దాని మిలమిలలపై వ్యామోహం కలిగి, పోలిమి (వశులై) దాని వైభవానికి చిక్కి, పుంగడు కాకుండునా (దిగజారి చెడిపోకుండా వుంటారా) ?

తెఱచుకొనియున్న ముత్యపు చిప్పలలో పడిన నీటిబిందువులు తేజస్సుగల ముత్యములై శోభించకుండా వుంటాయా? అట్లాగే వ్యర్థులతో కాక, శ్రీవేంకటేశ్వరుని దాసుల సాంగత్యంలో, పోరచిన్ (ఘనతతో) ఏజీవులైనా పుణ్యాత్ములు కాకుండ వుంటారా?

## 4-88

## మున్నుడి

తనతండ్రి అన్నమాచార్యులవారి వలె పెద తిరుమలాచార్యులవారు కూడా విస్తృతంగా విశిష్టాద్వైత మతాన్ని ప్రచారం చేశారు. ఆ మతాన్ని ఆవిష్కరించిన శ్రీరామానుజాచార్యులవారిని శ్రీహరి అవతారంగా ఆరాధించారు పెదతిరుమల. తమిళులు శ్రీరామానుజుల వారిని "ఉడయవరు" (ప్రధాన అర్చకుడు) అని "ఎంబర్ మన్నార్" నడయాడే దైవము అని పిలుస్తారు "ఇదిగో శ్రీవేంకటేశ్వరుని ఈడై పొదలుచున్నాడు భువిని ఉడయవరు" అంటున్నారు. గురువులంటే అంత ఆరాధన వారికి.

**ఆ.వె॥ ఉడయవరుని మెచ్చి ఉన్నతోన్నతుడని**
**తాననంతుడనెను తాళ్ళపాక**
**పెద్ద తిరుమలయ్య వినుతించె చూడరో**
**వేంకటపతి సముడు వేత్త అనెను**

**రాగం : సునాదవినోదిని**

ఉన్నతోన్నతుడు వుడయవరు
ఎన్ననంతుడే ఈ ఉడయవరు ॥ఉన్నతో॥

సర్వలోకముల శాస్త్రరహస్యములు
ఉర్విపొడమెనీ ఉడయవరు
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు
నిర్వహించెనన్నిటా ఉదయవరు ॥ఉన్నతో॥

వెక్కసపు శ్రీవిష్ణు భక్తియే
ఒక్క రూపమే ఉదయవరు
చక్కనైన సుజ్ఞానమున కిరవై
వుక్కుమీరెను ఇదె ఉదయవరు ॥ఉన్నతో॥





కదిసె మోక్ష సాకారము తానై
ఉదుటున నిలిచెనీ ఉదయవరు
ఇదిగో శ్రీవేంకటేశ్వరుని ఈడై
పొదలుచున్నాడు భువిని ఉదయవరు ॥ఉన్నతో॥

**భావామృతం :**

ఉడయవరు (ప్రధాన అర్చకుడు) అని పిలువబడే ఈ శ్రీరామానుజాచార్యులవారు ఉన్నతులైన వారందరిలోన ఉన్నతుడైన గురువు. ఎంచి చూడవలెనంటే అనంతుడైన శ్రీమహావిష్ణువునకు ఈయనకు తారతమ్యమే లేదు.

అన్ని లోకములలోనున్న శాస్త్ర రహస్యములను భూలోకంలో పొడజూపించిన గురుదేవుడీ ఉడయవరు. వేదకాలంనుండి వెలుగులోనికి వచ్చిన పుణ్యశాస్త్రములను అన్నిటియందు నిర్వహించిన పుణ్యాత్ముడీ ఉడయవరు.

వెక్కసమైన (దుర్లభమైన) విష్ణు భక్తియే ఒక్క రూపముగా దాల్చిన వాడే ఉడయవరు. చక్కని విజ్ఞానమునకు ఇరవై (స్థానమై), ఇదిగో అధికమైన స్థైర్యముతో ఈ ఉదయవరు వున్నాడు.

గొప్ప ఉద్ధతితో తానే సాకారమైన మోక్షము అన్నట్లు ఈ ఉడయవరు నిలచియున్నారు. ఇదిగో శ్రీవేంకటేశ్వరునికి సమానమైన వాడై ఈ ఉడయవరు ఈ భూలోకంలో పొదలుచున్నాడు. (వర్ధిల్లుచున్నాడు). ఈయనను శరణనండి, ధన్యులు అవండి.

**4-89**

## మున్నుడి

నిత్యనూతనమైన (ఎవర్‌గ్రీన్) భజన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. దీనినాలపించి తరించండి. నిత్యశేషగిరీశ! అంటే నిత్యమూ శేషశైలమునకు అధిపతి అనికాదు... నిత్యుడును మరియు శేషాద్రి శిఖరనాథుడును అయిన శ్రీహరిగా నేను భావించాను. 'రామనామ త్రయరూప' అంటే పరశురామ, బలరామ, శ్రీరామ అను నామములు ధరించినవాడని అర్థం. 'చిరంతను'డంటే 'అనాది' అయిన వాడని అర్థం. 'సామజావను' డంటే గజేంద్రుని కాపాడిన వాడని అర్థం. చిన్న భజనలో మనకు తెలియని వెన్నివున్నాయో...

**తే॥ "శ్రీహరీ! నిత్య! శేషాద్రి శిఖరనాథ!**
**మోహనాకార తే నమో మురవిదార!"**
**మధురముగ తేనెలూరెడి 'భజన' పాడి**
**హరిని వినుతించె ధన్యుడు అన్నమయ్య**

**రాగం : భైరవి**

శ్రీహరీ నిత్య శేషగిరీశ
మోహనాకార ముకుంద నమో ॥శ్రీహరీ॥

దేవకీసుత దేవ వామన
గోవిందా గోప గోపీనాథా
గోవర్ధన ధర గోకులపాలక
దేవేశాధిక తే నమో నమో ॥శ్రీహరీ॥

సామజావన శార్ఙ్గపాణి
వామనా కృష్ణ వాసుదేవా
రామనామ నారాయణ విష్ణో
దామోదర శ్రీధర నమో నమో ॥శ్రీహరీ॥





పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి
చిరంతన అచ్యుత శ్రీవేంకటేశ్వర
నరమృగ తే నమో నమో ॥శ్రీహరీ॥

**భావామృతం :**

శ్రీమన్నారాయణుడవైన ఓ శ్రీహరీ! నిత్యమూ వర్ధిల్లువాడా! శేషశైల శిఖరాధినాథా! సమ్మోహనకరమైన రూపముగల ముకుందా! ఓ మురారీ! నీకు నమస్కరించుచున్నాను.

ఓ దేవకీనందనా! వామనాకారుడవైన దేవా! గోవిందా! గోపాలా! గోపీహృదయాధినాథా! గోవర్ధన పర్వతమును చిటికెన వ్రేలిపై యెత్తి ఏడు అహోరాత్రములు రేపల్లెను ఇంద్రుని భీభత్సంనుంచి రక్షించిన మహానుభావా! గోకులమును పాలించిన శ్రీకృష్ణా! దేవేశాధికా! (దేవేంద్రుని తమ్ముడవైనా యెన్నో రెట్లు అధికుడవైన దేవదేవా!) నీకు నమస్కరించుచున్నాను.

ఆనాడు కాననములోని కాసారములో గజేంద్రుని మొసలి బారినుండి రక్షించిన నారాయణుడా, శార్ఙ్గము అనే విల్లును ధరించు విష్ణుదేవా! త్రివిక్రముడైన వామనావతారా! శ్రీకృష్ణపరమాత్మా! వాసుదేవా! రామనామ త్రయారూపా! (పరశురామా, బలరామా, శ్రీరామా), యశోదాదేవికి చిక్కి త్రాటితో ఉదరము బంధింపబడిన దామోదరా! ఓ శ్రీకాంతుడా నీకు నమస్కారములు, అనేక వందనములు.

పురుషోత్తముడని ప్రసిద్ధి చెందిన దేవదేవా! పుండరీకాక్షా! (పద్మనయనా!) గరుడధ్వజా! కరుణానిధీ! చిరంతనా! (ఆది అనునది లేనివాడా!) అచ్యుతా! (నాశరహితా!) ఓ శ్రీవేంకటేశ్వరా! నరసింహ స్వరూపా! నీకు అనేక వందనములు ప్రభూ!

**4-90**

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు నిర్ద్వంద్వంగా శ్రీవేంకటేశ్వరుడే శ్రీపతి, వైకుంఠపతి అని తేల్చి చెబుతున్నారు. సప్తఋషులు, నారదాది సంకీర్తనాచార్యులు, శివపుత్రుడైన కుమారస్వామి, బ్రహ్మాది దేవతలు భాగవతాది గ్రంథములు వివిధ పురాణములు కీర్తించినది ఈ దేవదేవునే. వేంకటేశునివంటి దైవమే లేదు వేంకటాద్రి వంటి తీర్థమే లేదు అని నొక్కి వక్కాణిస్తున్నారు అన్నమయ్య.

**ఆ.వె॥ పావనమతియైన వైకుంఠపతి, హరి**
**వేంకటేశుడితడె శంక లేదు**
**నారదాదు లితని నయముగ గొలిచిరి**
**అన్నమయ్య హరిని సన్నుతించె**

**రాగం : బౌళి**

శ్రీవేంకటేశుడు శ్రీపతియు నితడే
పావనపు వైకుంఠ పతియును నితడే ॥శ్రీవేంక॥

భాగవతములో జెపే బలరాము తీర్థయాత్ర-
నాగమోక్తమైన దైవమాతడితడే
బాగుగా బ్రహ్మాండ పురాణపద్ధతి యాతడితడే
యోగమై వామన పురాణోక్త దైవమీతడే ॥శ్రీవేంక॥

వెలయ సప్త ఋషులు వెదకి ప్రదక్షిణము-
లలర జేసిన దేవుడాతడీతడే
నెలవై కోనేటి పొంత నిత్యము గుమారస్వామి
కలిమి దపము సేసి కన్నదేవుడీతడే ॥శ్రీవేంక॥





యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్న తత్త్వమీతడు
చక్క నారదాదుల సంకీర్తనకు జొక్కి
నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుడు నీతడే ॥శ్రీవేంక॥

**భావామృతం :**

శ్రీవేంకటేశ్వరుడును, శ్రీపతియును యీతడే. పావనమైన వైకుంఠనాథుడైన హరియునితడే. (ఇందులో సందేహం లేదు).

భాగవతములో చెప్పబడిన బలరాముని తీర్థయాత్రా ఘట్టములో వేదవిదుడైన పరమాత్మ ఎవరో, అతడే ఈతడు (శ్రీవేంకటేశ్వరుడు). బ్రహ్మాండ పురాణంలో పురాణపురుషుడెవరో ఆతడే యీతడు. వామన పురాణంలో యోగమైన దైవంగా చెప్పబడిన వాడితడే. ఈయనే తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుడు.

తొల్లి కృతయుగంలో సప్తఋషులు నిర్వహించి వెదకి దీటుగా కనుగొని ప్రదక్షిణము చేసి నమస్కరించిన భగవంతుడెవరో, ఆతడే యీతడు. స్థిరమై, కోనేటి సమీపమున నిత్యమూ శివపుత్రుడైన కుమారస్వామి వైభవోపేతంగా తపస్సు చేసి దర్శించిన దేవదేవుడు యీతడే. ఈయనే తిరుమలనాథుడైన శ్రీవేంకటేశ్వరుడు.

సర్వాధికులైన బ్రహ్మ మహేశ్వరులు, ఇంద్రాదులు నిత్యమూ వెనుదీయక కొలిచెడి తత్త్వము ఈతడే. నారదుడు, తుంబురుడు చక్కగా సంకీర్తనము జేసి అతిశయించి శరణన్న శ్రీవేంకటాద్రి నిలయుడు ఈ శ్రీవేంకటేశ్వరుడే.

## 4-91

## మున్నుడి

చక్కని మేలుకొలుపు వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఏమి నిద్రపోతున్నావు ప్రభూ! ఎంతసేపు నిద్రించెదవు? బ్రహ్మాది దేవతలంతా తమ కామనల పట్టికలను తీసికొని నీ వాకిట నిలిచియున్నారు. వారిని కనికరింపుము. శ్రీవైష్ణవులు తిరువాముడి చదువుతున్నారు. నీ ప్రియమైన అర్ధాంగి శ్రీదేవి ఆత్రముగా నీకొరకు వేచియున్నది. ప్రభూ! మా చరపు... ఇదే, యెదుట నిన్నటి మాపే యియ్యకుంటివయ్యా! అంటున్నారు. అంటే?

**ఉ॥ ఏమని నిద్దిరింతువిక యెప్పటిదాక మహానుభావ! మా**
**కామన లాలకింపుమని గాచుకనుందురు నీదు వాకిటన్**
**సోమధరుండు బ్రహ్మయును స్తోత్రము జేయుచు దేవనాథుదున్**
**కాముని తల్లి శ్రీలలన కాతర జెందెను అన్నమయ్యనెన్**

**రాగం : భూపాళం**

ఏమి నిద్దురించేవు యెందాకాను
కామించి బ్రహ్మాదులెల్ల గాచుకున్నా రిదివో ॥ఏమి॥

పులుగాలు బచ్చళ్ళు బోనము వెట్టినదిదే
వెలయు ధనుర్మాస వేళయునిదే
బలసి సంకీర్తన పరులు పాడేరిదే
జలజాక్షుడ లేచి జలకమాడవయ్య ॥ఏమి॥

తోడనే గంధాక్షతలు ధూ దీపాలివిగో
కూడిన విప్రుల వేదఘోషణ లివే
వారు దేర బూజించవలె గమ్మ బువ్వులివె
వీడెమిదే కొలువుకు విచ్చేయవయ్య ॥ఏమి॥





చదివేరు వైష్ణవులు సారె దిరువాముడిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది
అదనాయ శ్రీవేంకటాధిప మాచరపిదే
యెదుట నిన్నటి మాపే యియ్యకుంటివయ్యా ॥ఏమి॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! ఏమి నిదురించెదవు ప్రభూ! ఎంతదాక నిద్రపోయెదవు? బ్రహ్మాది దేవతలంతా తమ కామనల పట్టిక తీసికొని నీ వాకిట కాచుకొనియున్నారు.

పలు విధములైన పులుసులు, పచ్చళ్ళు కూడిన భోజనము నీకు అర్పించిరి. ఇది ప్రశస్తమైన ధనుర్మాసపు వేళ. పరివేష్టింపబడియున్న సంకీర్తనాచార్యులు మధురముగా నీ కీర్తనల నాలపించుచున్నారు. ఓ జలజాక్షుడా! (పద్మదళనేత్రా!) నిదుర లేచి జలకములాడెదవు లేచిరావయ్యా!

ఓ దేవదేవా! నీతోనే సిద్ధముగా నున్న గంధమును, అక్షతలను, ధూప దీపములతో కూడియున్న బ్రాహ్మణుల వేదఘోషణము వీనులకింపుగా వినవచ్చుచున్నది. నిన్ను శ్రద్ధగా పూజించవలెను శ్రేష్టమైన పుష్పములివిగో ప్రభూ! పరిమళ తాంబూలమిదిగో. ఓ సప్తగిరీశా! అందరూ వేచియున్న నీ కొలువునకు విచ్చేయ వయ్యా!

మాటిమాటికీ వైష్ణవులు భక్తితో పఠించు 'తిరువాముడి' కర్ణపేయముగా వినిపించుచున్నది. ఆలకింపుము ప్రభూ! అందరికంటె ముందె శ్రీలక్ష్మి నీకోసం కాచుకొని యున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు అదనాయ (సమయమాసన్నమైనది) ఇదే మేము నీకు చేయుచున్న చఱపు (అరచేతితో తట్టి లేపు ప్రయత్నము). "ఎదుట, నిన్నటి మాపే ఇయ్య కున్నావయ్యా!" (స్వామీ! నీకు రాత్రి గడచినట్లే లేదయ్యా).

**4-92**

## మున్నుడి

తమాషాగా వున్న కీర్తన ఒకటి వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. రావణుని లంకలో సీత దీనగాధ విన్న శ్రీరామచంద్రుడు అగ్గిమీద గుగ్గిలమై రావణుని అంతమొందిస్తానని శపథం చేశాడు. సుగ్రీవుని ఆజ్ఞమేరకు భూమండలంలో వున్న వనచరులంతా (వానరులు, భల్లూకములు) గుంపులు గుంపులుగా వచ్చి చేరారు. హనుమ, అంగదుడు, నీలుడు, జాంబవంతుడు... వంటి నాయకులతో ఆ కపిసేన యెలావుందంటే... అధర్మ ధారలు తుత్తుతూ అవుతాయట. తిడిం, ధమం, ధణం, పెటపెట, భంభం, ధింధిం... వామ్మో! ఏం కీర్తనరా నాయనా!

**కం॥ జయమగు వనచరులారా!**
**రయమున తుత్తునియలగును రాముని కృపచే**
**లయమగు "అధర్మరాసులు"**
**భయమొద్దని అన్నమయ్య "భంభం" అనెరా.**

**రాగం : హంసధ్వని**

జయము మనది వనచరులాల
రయము నధర్మధారలు తుత్తుతూ ॥జయము॥

రక్కసుల మీద రాముడలిగె నలు-
దిక్కుల నడవుడు తిడింతిడిం
యెక్కుడు సేనలు యిటు మొరయింపుడు
ఢక్కా నినదము ధమధమ ధమం ॥జయము॥

కుటిల దానవుల కొట్టుడు కోటలు
తటుకున దాటుడు ధణం ధణం
పటుగతి నార్చుచు పట్టుడు లగ్గలు
పెటులు చూడదదె పెటపెట పెటల్ ॥జయము॥





గుట్టున నుండక కూలె రావణుడు
పట్టుడు సంకులు భం భం భం
యిట్టే శ్రీవేంకటేశుడు గెలిచెను
దిట్టలై ఆడుడు ధిం ధిం ధిం ॥జయము॥

**భావామృతం :**

ఓ వనచరులారా! జయము మనదే సుమా! అతి శీఘ్రముగా అధర్మమనే పరంపరలు తుత్తుతూ అని నశించి తీరుతాయి.

అధర్మవర్తనులైన రాక్షసులపై శ్రీరామచంద్రుడు ఆగ్రహించాడు. అన్ని దిక్కులవైపునుండి నడిచి రండి. ఉత్సాహం వెల్లివిరియును, తిడిం తిడిం. ఇటువైపున ఎక్కువ సంఖ్యలో సైనికులను, మొరాయించండి. (మోహరించండి... యెదుర్కొనునట్లు చేయండి). ఢక్కాలు మ్రోగించి సైనికులను ఉత్సాహ పరచండి. ధమ ధమ ధమం.

కోట్ల సంఖ్యలో నున్న కుటిల దానవులను (వంచకులైన రాక్షసులను) కొట్టండి. ధణం ధణం అంటూ, చటుక్కున సాగరాన్ని దాటండి. పటుగతి (పట్టుదలతో) బొబ్బలు, కేకలు పెడుతూ, ముట్టడించి కోటగోడలపై యెగబ్రాకుటకు తాళ్ళు మొదలైనవి పట్టుకొని సిద్ధం అవండి. కోటలన్నీ పెటపెటలాడుతూ పెట్లిపోవాలి.

గుట్టున (రహస్యంగా) నున్న రావణాసురుడు కూలెను (మరణించాడు). పట్టుడు సంకులు (శంఖముల ధరించి వుత్సాహంగా పూరించండి. భం భం భం..). అవలీలగా శ్రీవేంకటేశ్వరుడు గెలిచాడు. ఆయనే అయోధ్యా రాముడు గదా!! ఇక ఆలోచించక ధింధిం అంటూ దిట్టలై (ధీరులై) ఆడండి.

## 4-93

## మున్నుడి

నేడు శ్రీహనుమజ్జయంతి. ఈ పర్వదినాన, నా గత జన్మల భాగ్యం కొలది అన్నమాచార్యులవారి కీర్తనలకు మున్నుడి, భావామృత వివరణ వ్రాసే సదవకాశం నాకులభించడం, శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో... మిత్రుల సహకారంతో మెల్లి మెల్లిగా ముందుకు పోవడం జరుగుతోంది. ఈ కీర్తనలో హనుమంతుని విశ్వరూపాన్ని వర్ణిస్తున్నారు. అధికమైన ఈ కపిశ్రేష్ఠుని ప్రతాపము బహు అరుదు, దేవతలలో కాని మానవులలోకాని ఇటువంటి 'వీరచరిత్ర' కలవారు వున్నారా? అంటున్నారు. ఈ పెద్ద హనుమంతుడు 'బెడిదపు మహిమల' వాడట. అంటే.. చదవండి మరి.

**చం॥ అరుదగు ఈ కపీశ్వరుని అద్భుతమైన ప్రతాప మెంచుడీ**
**సురులకు మానవాళికిని సుద్దులు సాధ్యమె!! ఇట్టి వెంచగా**
**పెరిగెను విశ్వరూపమది వేంకటనాథుని బంటు తానె బో**
**బిరుదుల 'పండ్లగోల' గల వేల్పును గొల్చెను అన్నమార్యుడున్.**

**రాగం : కళ్యాణి**

అరుదీ కపీంద్రుని అధిక ప్రతాపము
సురులకు నరులకీ సుద్దులెందు గలవా ॥అరుదీ॥

వుదయాచలము మీది నొక్క జంగ చాచుకొని
ఉదటున నపరాద్రి నొక్క జంగ చాచుకొని
తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకొంటా
పెదవు లెత్తి చదివె పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

వొక్క మొలగంట చంద్రు డొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్ల పెరిగెను పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥





పిడికిలించిన చేత బిరుదులపండ్లగోల
తడయక కుడిచేత దశ దిక్కుల
జడియక శ్రీవేంకటేశ్వరుని మన్నన బంటు
బెడిదపు మహిమల పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

**భావామృతం :**

ఓ భక్తులారా! ఈ కపిశ్రేష్ఠుని అత్యున్నతమైన ప్రతాపము బహు అరుదైనది సుమా! దేవతలలో కాని మానవులలో కాని ఇటువంటి చరిత్రగలవారున్నారా? (లేరు... ఆ కథలు వివరిస్తాను, వినండి).

ఈ మహానుభావుడు సూర్యభగవానుని వద్ద వేదముల నభ్యసించడం ఎలా జరిగిందో తెలుసా? సూర్యుడు ఉదయాద్రినుండి పశ్చిమాద్రికి నిరంతరం పయనిస్తూనే వుంటాడు కాబట్టి ఈయన, ఉదయాచలం మీద ఒక జంగ (పిక్క), అపరాద్రి (అస్తాచలం) మీద ఒక జంగ (పిక్క) చాచుకొని నిలుచున్నాడు. తన ముఖము సూర్యుని కనుగుణంగా తిప్పుతూ, పెదవులెత్తి పఠిస్తూ ఈ పెద్ద హనుమంతుడు వేదము నేర్చుకొన్నాడు.

ఇంత 'చిన్నకోతి' నన్ను లంకనుంచి తప్పించగలదా అని జగన్మాత సీత సందేహించినపుడు వరిష్ఠుడైన ఈ బుద్ధిమంతుడు, తన విశ్వరూపం ఆ దేవికి చూపి ఆమె సందేహ నివృత్తి చేశాడు. ఆనాడు సూర్యచంద్రులిద్దరూ ఆయనకు మొలత్రాటిలో కట్టుకొనే మొలగంటలవలె ధగధగ ప్రకాశించారు. నక్షత్రాలు మొలత్రాటి పూసలై మిలమిలలాడాయి. నిక్కినటువంటి ఆయన వాలాగ్రము (తోక చివరనుండే వెంట్రుకల కుచ్చు) బ్రహ్మలోకమును నింపివేసింది. ఆవిధంగా పిక్కటిల్లి (వ్యాపించి) ఈ పెద్ద హనుమంతుడు పెరిగినాడు.

ఇదిగా ఇప్పుడు మన యెదుట ఇంకొక విశ్వకాయుడు కనబడుచున్నాడు. ఈయనను దర్శించండి. పిడికిలించిన, (బిగించిన) కుడిచేత ఈయన బిరుదుల పండ్ల గోల (శౌర్య చిహ్నమైన పండ్లగోల) అను రాతి ముళ్ళగదను ధరించి యున్నాడు ఆలస్యము లేకుండా నిర్భయంగా దశదిశలను పర్యవేక్షించుచున్నాడు. అందుచేత లోకేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరునికి మన్ననలు పొందే నమ్మినబంటు అయినాడు. ఈ పెద్దహనుమంతుడు, అందుచేత, బెడిదపు మహిమలు (భయంకరమైన... లేక... అధికమైన మహిమలు కలవాడు). ఈయనను శరణని తరించండి.

**4-94**

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. భక్తి పారవశ్యంలో భగవంతుని "వాడు...వీడు" అన్నా ఆ సర్వాంతర్యామికి సంతోషమే. ప్రహ్లాదుని అనుగ్రహించిన ఆ భక్తవత్సలుని కీర్తిస్తున్నారు. 'కోరదవడలు' అంటే కోరలు బయటకు కనిపిస్తున్న దవడలు అని అర్థం. "తీగెల నవ్వుల తెల్లని సింహ" మట... అంటే నవ్వీనవ్వనట్లుండే నరసింహుడు ధవళవర్ణుడని అర్థం. శ్రీవేంకటాద్రిపై నున్నదీ ఈయనేనట... అన్నీ ఆయనే కదా!

**తే॥ వాడెవో బాలప్రహ్లాద వరదు, దవని**
**వాడెవో భక్తవత్సలు డాడిపాడి**
**వాని గొలువుడు ఈ అహోబలమునందు**
**అన్నమార్యుడు అతడె వేంకన్నయనెను**

**రాగం : గౌళ**

వాడెవో ప్రహ్లాద వరదుడు
వాడెవో భక్తవత్సలుడు ॥వాడెదో॥

కోర దవడలతోడ కోటి సూర్యతేజముతో
హార కేయూరాది భూషణాంబరాలతో
చేరి బ్రహ్మాదు లెల్లాను సేవలు సేయగాను
మేర మీరిన సిరుల మేడలో నున్నాడు ॥వాడెవో॥

తెల్లని మేనితోడ తీగెనవ్వుల తోడ
చల్లని గంధముల వాసనలతోడ
పెల్లుగా నారదాదులు పేరుకొని నుతించగా
వెల్లివిరి కొలువై వేడుక నున్నాడు ॥వాడెవో॥





సంకు చక్రములతోడ జంట పూదండలతోడ
పొంకపు నానావిధ భోగములతోడ
అంకపు శ్రీవేంకటాద్రి నహోబలమునందు
అంకెల నేపొద్దూ నెలవై తానున్నాడు ॥వాడెవో॥

**భావామృతం :**

ఓ భక్తులారా! అదిగో... వాడే ప్రహ్లాదుని రక్షించి అనేక వరముల ననుగ్రహించిన నరసింహుడు వాడే గొప్ప భక్తవత్సలుడని పేరుగాంచిన అహోబల నృసింహుడు.

ఈ నృసింహుడు కోటి సూర్యతేజోవిరాజితుడు. కోరలు బయటకు కనిపించుచున్న వీనిని చూడ భయమగుచున్నది. హారములు, కేయూరములు (బాహువులయందు ధరించు కంకణములు) మొదలైన అనేక నగలతో ఆయన అలరారుచున్నాడు. బ్రహ్మాది దేవతలు ఆయన వద్ద చేరి సేవలు చేయుచున్నారు. అతిశయించిన సిరిసంపదలతో ఈయన తన మేడలో (భవనములో) నున్నాడు.

ఈ నరసింహుడు తెల్లని శరీరం కలిగినవాడు. ఈయన వదనమున తీగెల నవ్వులు (లేత చిరునవ్వులు) తొణికిసలాడుతుంటాయి. శరీరం చల్లగా నుండుటకు గంధం దట్టంగా దట్టించినందున ఈయన సువాసనలను వెదజల్లుతున్నాడు. నారదాదులు ఈయనను సహస్రనామాలతో పెల్లుగా (అధికముగా) కీర్తించు చుండగా, ఉద్ధతితో కొలువుదీరి ఎంతో వేడుకతో నున్నాడు.

ఈ నృసింహుడు శంఖ చక్రములను ధరించియున్నాడు. రెండేసి పూలదండలు ఈయన మెడలో శోభస్కరంగా నున్నాయి. భక్తులు షోడశోపచారములతో అనేక భోగముల నర్పించు చున్నారు. శ్రీవేంకటాద్రి అంకెపు అహోబలమున (తిరుమల సమీపమున నున్న అహోబలమున) ఏ పొద్దూ (అన్ని వేళలలోను), అంకెల (వశమై) ఈ క్షేత్రము స్థానమై తానున్నాడు. ఈ మహానుభావుని సేవించి తరించండి.

**4-95**

## మున్నుడి

పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవం నయనానందకరంగా జరుగుతోంది. అన్నమాచార్యులవారు ఆనందంతో తలమునకలవుతున్నారు. ఎన్ని వాహనాలు!! ఎంత వైభవం!! ఏమి ఆనందం!! ఎట్లా నేర్చావయ్యా గట్టిగా, ఈ వాహనాలెక్కటం? ఓ శ్రీహరీ! ఇందుకే మేము నిన్ను యెంతో మెచ్చుకొంటాము. బ్రాహ్మణ పడుచుల నుద్ధరించువేళ, పారిజాతాపహరణం నాడు, లంకనుంచి అయోధ్య తిరిగి వచ్చేవేళ, రామరావణ యుద్ధంనాడు, కల్కి భగవానునిగా అనేక వాహనాలెక్కటం మేం పురాణాల్లో చదివాం. కాని, నేడు ఈ తిరుమలలో ఇందిరను పెండ్లాడి పల్లకీలో వూరేగుతున్నావే.. ఏమి వైభవం!!!

**మ॥ భళిరా! యెక్కితి విన్ని వాహనములన్ పాలించ మమ్మెల్లరన్**
**వలనౌనే యొరులిట్లు సేయగలరే! మా వేంకటేశా! ప్రభో!**
**అల శ్రీకాంతుడు యెక్కినట్టి "రథముల్" అన్నయ్య లెక్కించెరా**
**కలిగెన్ ప్రేరణ భావమిట్లు తెలుపన్ కాత్యాయనీ సన్నుతా!**

**రాగం : మాళవి**

ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనములెక్క
గట్టిగా నిందుకే హరి కడుమెచ్చేమయ్యా ॥ఎట్టు॥

గరుడుని మీద నెక్కి(వి) గమనించితివి నాడు
అరుదైన పారిజాత హరణానకు
గరిమతో రథమెక్కి కదివితివల్ల నాడు
సొరిది బ్రాహ్మణ పడుచుల నుద్ధరించను ॥ఎట్టు॥

చక్కగా గుబేరుని పుష్పకమెక్కి కదలితి
మక్కువ సీతాదేవి మరలించను
తక్కక వాయుజు నెక్కి దాడివెట్టితివి నాడు
చొక్కపు వానరుల పౌజులు చూడను ॥ఎట్టు॥





కొట్టగొన నీవు రాతి గుఱ్ఱము నెక్కి తోలితి
పట్టియెడ నధర్మము నడచగను
మెట్టుక శ్రీవేంకటాద్రి మీద బల్లకి యెక్కితి
విట్టె యిందిర గూడి యేగు బెండ్లి యేగను ॥ఎట్టు॥

## భావామృతం

ఓ దేవదేవా! ఇన్ని వాహనాలను యెక్కటం యెట్లు నేర్చితివయ్యా! గట్టివాడివేనయ్యా! ఓ శ్రీహరీ! అందుకే నీ భక్తులమైన మేము నిన్ను యెంతో మెచ్చుకొంటుంటాము. (నీవెక్కిన అనేకానేక వాహనాలు లెక్కించుట సాధ్యమయ్యే పనికాదు గాని, మచ్చుకి కొన్ని వుదహరిస్తాను).

ఆనాడు శ్రీకృష్ణునిగా సత్యభామ ఆనందం కోసం స్వర్గం నుంచి అరుదైన పారిజాత వృక్షాన్ని యెత్తుకొచ్చావు. అప్పుడు నీవెక్కిన వాహనం గరుత్మంతుడు. ఆ గరుడ వాహన వైభవం ఆనాడే మేము గమనించితిమి. అలనాడు దారుకుడుతోలేనీ రథం యెక్కి, గరిమతో (గొప్పతనముతో) కదలివచ్చి, సొరిది (ఆ క్రమములో) బ్రాహ్మణ స్త్రీలను వుద్ధరించినావు అదే దివ్యమైన నీ రథవాహనం.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా రావణవధానంతరము కుబేరుని పుష్పక విమానంలో, సీతాప్రభృతులను అయోధ్యకు మరలించుటకు మక్కువతో యెక్కి అయోధ్య చేరితివి. అది నీ పుష్పక వాహనము. రావణుని లంకను ముట్టడించువేళ, నీవెక్కిన వాహనం మాత్రం, అన్యులకు వూహకైనా చిక్కనిది. ఏ మాత్రము తక్కక (వెనుదీయక) వాయునందనుడైన మారుతిపై నెక్కి దాడివెట్టితివి (దాడిచేశావు) నీ పౌజు (వానరసేన) అంతా ఆనాడు చొక్కపు (పరవశించిన) సేన అయి చూచింది.

ఓ ప్రభూ! నీవు, కొట్టగొన (చిట్ట చివరకు) కల్కి అవతారమెత్తి "రాతి గుఱ్ఱము" (సముద్రమునుండి జన్మించిన గుఱ్ఱము 'ఉచ్ఛైశ్రవము') నెక్కి తోలితివి. ఆ సమయమున అధర్మమును పట్టి అణగ తొక్కితివి. (ఇంకా కల్కి అవతరించలేదని భావించేవారు 'రాతి గుఱ్ఱము' నెక్కెదవు అనుకొంటే... సరి). ఇక నేడు ఈ తిరుమలలో బ్రహ్మోత్సవాల సమయంలో మెట్టుక (మొత్తానికి) కళ్యాణం నీకు ఇందిరాదేవితో జరుగుతున్నది. అందుకని నీవు ఇట్టే, పెండ్లి వూరేగింపు పల్లకీలో జరుపుకొంటున్నావు. అది చూచి మా జన్మ తరించింది తండ్రీ!

## 4-96

## మున్నుడి

అలమేలు మంగమ్మ వేంకటేశ్వరుని పట్టపురాణి. స్వామియేకంగా ఆమెను తన ఉరముపై పెట్టుకొని, దేవకాంతలంతా మెచ్చుకొనె ఆమె సౌందర్యానికి వశుడైవుంటాడు. సరస సంభాషణలతో, వీనులవిందైన పాటలతో, ముంచే ప్రణయ కలహాలతో, నయనానందకరమైన నాట్యంతో, పతియే తప్ప పరులను చూడను అనే పాతివ్రత్యంతో, భర్త మనస్సుని చిగురింపజేసి, కౌగిట కరగించి ఆ జగదేకపతిని మెప్పించావు. మేము పరాయివారంకాదు తల్లీ! నీ వారము అమ్మా! మమ్మల్ని వేడుకతో ఒక కంట కనిపెట్టు తల్లీ! అంటున్నారు అన్నమాచార్యులవారు.

**కం॥ మించిన దేవాంగనలును**
**యెంచుచు మెచ్చేరు నిన్ను యెంత సరసవే?**

**ముంచుచు పతి మోహంబున**
**వుంచెద వన్నయ్య విష్ణు ఉవిదకు తెలిపెన్**

**రాగం : రామక్రియ**

మించి దేవాంగన లిట్టే మెచ్చేరమ్మ
యెంచ నలమేలుమంగ యెంతదానవమ్మా ॥మించి॥

మాటలనే వూరడించి మచ్చికల పొద్దుపుచ్చి
నీటున బతి దేలించ నేరుతువమ్మా
పాటలనే కరగించి పంతములు మరిగించి
చాటున నాతని గూడ జాణవమ్మా ॥మించి॥

నగుతానే రప్పించి నటనల మెప్పించి
తగుపతి దక్కగొన దంటవమ్మా
పగటుల భ్రమయించి బడినుండే వలపించి
చిగిరించ జేయ పతి చిత్తము వత్తువమ్మా ॥మించి॥





కాగిటనే చొక్కించి కందువల మెప్పించి
ఆగి పతి యురమెక్కే వప్పుడేయమ్మా
పాగిన శ్రీవేంకటేశు పట్టపురాణివి
నీగని వేడుకతోచ నీవారమమ్మ ॥మించి॥

**భావామృతం:**

తల్లీ! అలమేలు మంగమ్మా! దేవకాంతలందరు నీ మనోహరమైన 'సౌందర్యాన్ని', అత్యధికంగా మెచ్చుకొంటారు. నీవెంతటి దానవో తెలుసా తల్లీ!! నిన్ను యెంచి ఇంతదాని వనుట సాధ్యమా!!

నీభర్త చీకాకుగా వుంటే... తియ్యటి నీ మాటలతో ఆయనను వూరడిస్తావు. నీపై మోహముతో (మచ్చికతో) నీతోనే పొద్దుపుచ్చేట్లు చేస్తావు. నీటున పతి దేలించ (నీ పతిని మురిపాలలో ముంచెత్తుట) నేర్చెదవు. ఆయనను వీనుల విందైన నీ పాటలతో కరగిస్తావు. సమయంచూచి పట్టుదలతో పంతాలతో ఆయన వుక్కిరి బిక్కిరయ్యేట్లు మరిగిస్తావు. ఆ తరువాత రహస్యంగా ఆయనకు వశురాల వవుతావు. ఎంతటి జాణవు తల్లీ! నీకు నీకేసాటి.

తల్లీ! నీ నవ్వులు చూచి నీవాడైన శ్రీనివాసుని నీ దగ్గరకు రప్పించుకొంటావు. నీ నాట్యంతో మెప్పిస్తావు. తగు నీపతి దక్క (తప్పించి) అన్యులను గొనదంట (అంగీకరించనంటావు). నీ పగటున (లావణ్యముతో) స్వామి అంతటి వాడిని భ్రమింపచేసి, బడినుండే (ఒక పద్ధతి ప్రకారం) నీవలపులు పంచిబెట్టి, నీ నాధుని మనస్సును చిగురింపజేస్తావు తల్లీ!

ఆ శ్రీవేంకటేశ్వరుని నీ కౌగిలిలో చొక్కించి (పరవశింపజేసి), కందువల (చమత్కారములతో) మెప్పించి, ఆపై ఆయన వురముపై తిష్టవేసికొని వున్నావు తల్లీ! అట్లా పాగిన (ద్రవం అయ్యే వరకు కాచబడిన) శ్రీవేంకటేశ్వరునికి నీవు పట్టపురాణివి. వేడుకతో (సంతోషంతో) నీగని (నివర్తించి) మమ్ము ఆదుకో, ఎందుకంటే మేము నీ బంధువులం తల్లీ!

## మున్నుడి

గోపాలబాలుడైన చిన్నికృష్ణుని జోకొట్టి నిద్రబుచ్చుతున్నారు అన్నమాచార్యులవారు దీన జనావనలోలా! యదుకులతిలకా! జోజోయని జోలపాడుతున్నారు. నిజం నీలమేఘ శ్యామునికే తెలియాలి కాని నాకు ఈ కీర్తన అన్నమయ్య తొలినాళ్ళ కీర్తన అయివుంటుందని అనిపించింది. జన్మరహితునికి పది అవతారాలేమిటి? చిత్రమే కదా! మణి కిరీటంలా విశ్వశాంతి మెరుస్తుంటే స్వామి దివ్యశక్తులే మహా హారాలట. దాంతి కుసుమ మాలికయట. అంటే.

**కం॥ దీనజనావన లోలా**
**శ్రీనాథా! యదుకులేశ! సిరిగోపాలా!**
**తానన్నమయ్య 'జో' యని**
**వేనోళ్ళ నుతించె గొలిచి వేంకటరమణున్.**

**రాగం : నవరోజ్**

జోజో దీనజనావన లోలా
జోజో యదుకుల తిలకా గోపాలా ॥జోజో॥

వేదములు రత్నాల గొలుసులై యమర
వేదాంత మపరంజి తొట్లుగా నమర
నాదము ప్రణవము పానుపై యమర
ప్రణవార్థమై యిచ్చట పవ్వళింపు స్వామీ ॥జోజో॥

అతి చిత్రముగ బది యవతారముల బ్రోవ
అమరుచు పదినాల్గు జగముల బ్రోవ
బ్రతి యుగమున జనియించు మిగుల
ప్రబలి జన్మరహితు దనుకొన్న స్వామీ ॥జోజో॥





శాంతియు మణిమయ మకుటమై మెఱయ
శక్తులు మహాహారమై మెఱయ
దాంతియు గుసుమ మాలిక మైమెఱయ
ధరలో శ్రీవేంకటేశ రమణుడౌ స్వామీ ॥జోజో॥

## భావామృతం

ఓ దీనజనావనలోలా! (దీనజనులను కాపాడుటయందు మిక్కిలి ప్రీతిగలవాడా!) యదుకుల తిలకా! (యాదవ కులమునకు భూషణమైన వాడా) ఓ శ్రీకృష్ణా! జోజో... జోజో..

ఓ ప్రభూ! చతుర్వేదములు నీకు రత్నాల గొలుసులవలె శోభిల్లుచున్నవి. వేదాంత శాస్త్రము నీకు బంగారు తొట్టెవలె అమరియున్నది. ప్రణవనాదము (ఓంకారము) నీకు ప్రశస్తమైన పానుపు వలె వెలుగొందుచున్నది. నీవు ప్రణవార్థమై (ఓంకార స్వరూపుడవై) పవ్వళించి యున్నావు. ఇకనైన నిదురించుము తండ్రీ!

స్వామీ! నీ దశావతారములు అతి చిత్రములై దీనజనులను బ్రోచినవి. (నరసింహుడు... వామనుడు... వరాహ స్వరూపుడు.. ఏమి విచిత్ర రూపాలు). అనేక రూపములలో అమరి నీవు పదినాలుగు భువనములను రక్షించితివి. నీవు జన్మ రహితుడవని అనుకొన్న స్వామివి. మరి 'సంభవామి యుగే యుగే అని ప్రతి యుగములోను జన్మించుచునే యుంటివి.

ఇన్ని జన్మలెత్తినా, మాకోసం ఇన్ని ఇక్కట్లు పొందినా నీవు కోరుకునే రత్నాలు మాణిక్యాలు ఏమున్నాయి ప్రభూ! మా తృప్తికోసం నీకు రత్న కిరీటం పెట్టామే... కాని నీకు కావలసిన కిరీటం శాంతియే (విశ్వశాంతి)... నీ దివ్యశక్తులు వేరె చూపాల్సిన అవసరంలేదు. ఈ మహాహారములే నీ దివ్యశక్తులు దాంతియు (బ్రహ్మ చర్యాది తపఃక్లేశములే) ఈ స్వామికి పూలమాలలు. ఈ భూలోకంలో శ్రీవేంకట రమణమూర్తి అయిన ఈయనే స్వామి అంటే వేరెవ్వరూ లేరు.

**4-98**

## మున్నుడి

అన్నమాచార్యులవారి కుమారుని వలెనే మనుమడు చిన తిరుమలాచార్యులవారు కూడా అకుంఠిత శ్రీవేంకటేశ్వర దీక్షాదక్షుడు. తన తాతగారివలె అనేక కీర్తనలు శ్రీవేంకటేశ్వర మకుటంతో రచించి తరించారు. సంస్కృతాంధ్రములు రెంటిలోను దిట్ట అయిన చిన తిరుమలయ్య గీర్వాణిలో కూడా అద్భుత కీర్తనలు చెప్పారు. ఈ కీర్తన శ్రీరామునిపై చెప్పినట్లు తేలికగానే అర్థమవుతున్నా, ఈ కీర్తనకు వివరణ అనుకున్నంత తేలిక కాదు. ఈయన కూడా శ్రీరాముడు మన తిరుమలనాథుడే అంటారు.

**తే॥ శ్రీపతి పురాధి నాయకా! శ్రీనివాస!**
**చింతితాభీష్టదాయకా! సిద్ధి జయము**
**వేంకటేశ్వర రూపకా! వీరరామ!**
**చిన్న తిరుమలాచార్యులు చెప్పె కవిత.**

**రాగం : మాళవగౌళ**

శ్రీపతి పురనాయక జయ
చింతితాభీష్ట దాయక ॥శ్రీపతి॥

ఉన్నతోన్నత విగ్రహ దాసోపరిస్థానుగ్రహ
సన్నుతామర సుగ్రహా సామవేద పరిగ్రహా ॥శ్రీపతి॥

జానకీ ప్రియకారక శివ సాధితాఖిల తారక
మానుషాహిత మారక మామకాఘ నివారక ॥శ్రీపతి॥

శ్రీవేంకటనాథ రూపక సంచిత రఘుకుల దీపక
భావ సంతోష ప్రాపకా అభంగ మంజుల చాపక ॥శ్రీపతి॥



భావయామి వేంకటేశం

### భావామృతం

వైకుంఠాదిపతియును, కోరిన కోర్కెలు తీర్చెడి వాడును అయిన నీకు జయమగు గాక!

అత్యున్నతమైన స్వరూపము కలవాడును, దాసులయందు అత్యున్నతమైన అనుగ్రహం కలవాడవును, దేవతలచేత నుతింపబడు దివ్య మంగళ స్వరూపుడవును, సామవేదము చేత వివరింపబడెడి వాడవును అయిన నీకు జయమగు గాక!

సీతాదేవికి ఆనందము కలిగించువాడవును, పరమశివుని చేత సాధింపబడిన మోక్ష స్వరూపుడవును, మానవుల దుఃఖమును భేదించువాడవును, నాయొక్క పాపములను నివారించెడి వాడవును అయిన నీకు జయమగును గాక!

శ్రీవేంకటేశ్వరుని రూపమున నున్నవాడవును, సద్గుణముల చేత మూర్తీభవించిన రఘుకుల ప్రదీపకుడవును, సంతోషకరమైన భావముచేత ప్రాప్తించెడి వాడవును, ఎన్నడూ విరువబడని రమణీయమైన కోదండము కలవాడవును అయిన నీకు జయమగును గాక!



4-99

## మున్నుడి

నేటి కర్నూలు జిల్లా, శిరివెళ్ళ తాలూకాలోని సంబవరము అనే గ్రామమే ఆనాడు అన్నమాచార్యులవారు కీర్తించిన చెన్నకేశవుని సంబటూరు అని పెద్దలంటారు. ఈయనే శ్రీకృష్ణుడు కూడా. ఈ చెన్నుడు సన్నలు (సైగలు) చేస్తుంటాడట. ఎంతో జాణతనం గలవాడట. ఈయన వదలకుండా అప్పుడు యిప్పుడూ (అంటే ఎప్పుడూ) ఆసలు రేపుతుంటాడట. ఇంత సరసమైన కీర్తనలో నేటి తెలుగువారికి అర్థంకాని తెలుగు మాటలు యెన్నెన్నో.. వున్నాయి.

**ఉ॥ చెన్నుడు సంబటూరు తను చేసె నివాసము చక్కనైన ఈ**
**వెన్నుడు రేచె ఆసలను వీడక చూపుచు అప్పుడప్పుడున్**
**సన్నలు చేయువాడనెను జాణడు తానసె అన్నమార్యుడున్**
**మున్నిటువంటి కీర్తనము ముచ్చట తీరగ నాలకింతుమే!!!**

**రాగం : లలిత**

చక్కని యీవెన్నడూ సంబటూరి చెన్నుడూ
అక్కడ నిక్కడ చూపి ఆసలు రేచీని ॥చక్కని॥

చెన్నుని జూడ గదరే చెలులాల నేడు
చిన్న లేనవ్వులనే చెలరేగీని
సన్నలు సేసీ వాడే సటకాడు నాతో
యెన్నటికెన్నటి పొందు యిపుడే రేచీని ॥చక్కని॥

యేమనీనె చెన్నుడూ యేకతాన నన్నునూ
దోమటి వాపులు నాపై దొరలించీని
కోమలపు చేయిచాచీ కొత్త పెండ్లికొడుకు
గామిడితనాల నన్ను గాకలు రేచీని ॥చక్కని॥





శ్రీవేంకటాద్రి మీద జేరి కూడె జెన్నుడు
భావించి పచ్చడము పై గప్పీని
మోవి చూపీ గమ్మటి మొక్కళీడు వీడు
దేవుడు గదవే వీడు తీపులు రేచీని ॥చక్కని॥

**భావామృతం**

చక్కని ఈ చెన్నకేశవుడు 'సంబటూరి' నివాసియైన వెన్నుడు (శ్రీకృష్ణుడు). ఇతను గోపికలకు అక్కడ యిక్కడ అనేక ఆశలు కల్పించి లోబరచుకొన్నాడు.

ఓ చెలులారా! ఈ చెన్నకేశవుని చూడండమ్మా! నేడు ఇతను సన్నని లేత చిరునవ్వులు చిందిస్తూ చెలరేగుచున్నాడు. ఆ 'సటకాడు' (మోసగాడు) నాతో ఎలా సన్నలు (సైగలు) చేస్తున్నాడో చూడండి. ఎన్నటి కెన్నటి పొందు (ఎప్పటిదో పాతపరిచయం వంక పెట్టుకొని) యిప్పుడే రెచ్చిపోతున్నాడు చూశారా!

ఓ చెలియా! నేనేమని చెప్పనే! ఆ చెన్నుడు అదే పనిగా (ఏకాగ్రతతో) నన్ను చూచి, నన్ను కూడా లెక్క సేయక నాపై చెప్పకూడని ముఖ్యవిషయాలను మాటలలో దొర్లిస్తుంటాడు. కోమలమైన తనచేయి చాచి ఈ చెన్నుడు కొత్త పెండ్లికొడుకు వలె ఎంతో అధికముగా నన్ను ఉద్రేక పరచుచున్నాడు.

శ్రీవేంకటాద్రి మీద జేరిన శ్రీవేంకటేశ్వరుడే ఈ చెన్నుడని భావించి ఈయనపై వస్త్రమును కప్పిరి. ఈ మొక్కళీడు (ముష్కరుడు) కమ్మటి తన అధరమును అందించి విరహతాపము నింకా రెచ్చకొడతాడు. అయినా ఈయన పురుషోత్తముడు కదవే... అందుకే ఈయనను ఆశ్రయిద్దాం.

**4-100**

## మున్నుడి

భగవంతుని కారుణ్యం సిద్ధించాలంటే... అత్యుత్తమమైనది అత్యంత సులువైనదీ ఒక ఉపాయం వున్నది. పెద్దలు నమ్మి ఆచరించిన ఆ సులభోపాయమే... శరణాగతి. శరణంటే రావణునైనా రక్షిస్తానని ఆనాడు స్వయంగా శ్రీరామచంద్రమూర్తి చెప్పాడు. అందుకని ఏడుకొండల వేంకటరాముని యెలుగెత్తి శరణు వేడుతున్నారు అన్నమాచార్యులవారు. కరుణకు ఆలయమైన కౌసల్యానందనుడే సర్వపోషకుడు అంటున్నారు. ఏడుతాటిచెట్లను ఒకే బాణంతో ఒకేసారి ఖండించి ఈ రాముడే ఏడుకొండల ఏలికట... ఆహా!!

**ఆ.వె.॥ శరణు శరణు దేవ! సర్వ పోషక! రామ!**
**అనుచు శరణు జొచ్చె నన్నమయ్య**
**కరణకాలయమని కౌసల్యనందనున్**
**రూఢి వేంకటేశు రూపమనెన్.**

**రాగం : అభేరి**

శరణు శరణు దేవ సర్వ పోషక
కరుణా నిలయ రామ కౌసల్యానందన ॥శరణు॥

వారిధిబంధన రావణ శిరచ్ఛేదక
మారీచ సుబాహు బలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజసంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ ॥శరణు॥

సనవ రక్షక ముని జనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనానాయక
వివిధ సప్తతాల విధ్వంసన చతుర
భువనేశ సాకేతపురవాసరామ ॥శరణు॥





హరచాప హర అహల్యా శాపవిమోచక
ఖరశరవాలి నిగ్రహ బిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభక్త రక్షక
ధరణిజా సమేత దశరథరామ ॥శరణు॥

**భావామృతం :**

దేవా! శ్రీరామచంద్రా! నీవు సర్వ పోషకుడవు. క్రిమికీటకాదుల నుంచి బ్రహ్మాది దేవతల వరకు, అందరూ చతుర్దశ భువనాలూ నీ పోషణలోనున్నవే. శ్రీరామునిగా నీవు కౌసల్యానందనుడవు. పరిపూర్ణ మానవుడవు. అందుచేత కరుణకు ఆలయమైన వాడవు.

ప్రభూ! నీవు సముద్రముపై వారిధిని నిర్మించితివి. రావణుని శిరస్సులను ఖండించితివి. మారీచ సుబాహుల మదము నణచితివి. దుర్మార్గులైన కుంభకర్ణాది దైత్యులను సంహరించితివి. నేడు వీరప్రతాప పరిపూర్ణుడవైన వీర విజయ రాఘవుడవై శరణన్న వారిని సంరక్షిస్తున్నావు.

రామా! నీవు మునిజనులు నిన్నాశ్రయించగా వారు చేయు సవనములను (యాగములను) రక్షించి, నిర్వహించుట దీక్షగా కలవాడవు. అందుచేత దేవతలందరికీ నీవు ఆరాధ్యుడవు. అనంతమైన కపిసేనకు నాయకుడవై ఒక్క త్రాటిపై నడపినవాడవు. సుగ్రీవుని సందేహ నివృత్తికి వేరువేరుగా నున్న ఏడు బలమైన తాటిచెట్లను ఒకే ఒక శరముతో నేలకూల్చిన ఉద్దండుడవు, చతురుడవు, లోక నాయకుడవు, సాకేతపురాధి నాథుడవు. అట్టి నిన్ను శరణు వేడుచున్నాను.

ఓ శ్రీరామచంద్రా! నీవు శివధనస్సును విరిచినవాడవు. అహల్యా దేవిని శాపము నుండి విమోచన మొసగినవాడవు. ఖరుడు, శరుడు, వాలి మొదలగు వారిని 'బిరుద' నిగ్రహుడవు. (ప్రతిజ్ఞ చేసి కూల్చినవాడవు). నేడు నిరతి (మిక్కిలి ఆసక్తితో) శ్రీవేంకటేశ్వరుని వలె నీ నిజ భక్తులను రక్షించుచున్నావు. సీతా సమేతుడవైన ఓ దశరథరామా! శరణు తండ్రీ! నీవే మాకు దిక్కు.

**4-101**

## మున్నుడి

పరమాత్ముడైన శ్రీహరియే తిరుమలేశుడైన శ్రీవేంకటేశ్వరుడు అపార కరుణా సముద్రుడు. ఘటనా ఘటన సమర్థుడు. ఏ అర్హతా లేని నావంటి అతి సామాన్యునిచేత ఆయన నీవిధంగా సేవించి తరించే అవకాశం ఇచ్చాడు. ఈ జన్మకిది చాలు... చివరిసారిగా, భావ వివరణలో వైవిధ్యమున్నా, లోపమున్నా, స్పష్టత లేకపోయినా నా అజ్ఞానానికి పెద్దలు మన్నింతురు గాక!

**సీ॥ చిత్తజ గురునికి శ్రీమంగళంబిదే**
**మా చిత్తమున హరీ! మంగళంబు**
**శ్రీదేవి నురముపై చేర్చిన పీతాంబ-**
**రా! నీకు జయమంగళములు దేవ!**
**నీలాల సురగంగ నీపాదమున బుట్టె**
**భక్త చింతామణీ! మంగళంబు**
**అరిది పచ్చలవంటి అంగన నెమ్మదిన్**
**భక్తి గొల్చెడి నీకు మంగళంబు**

**ఆ.వె॥గరిమ వేంకటేశ! ఘనసంపదల తోడ**
**సిరియు మంగళంబు సిరికి మగడ!**
**అన్నమయ్య కృతికి మున్నుడి భావంబు**
**పలుకుచుంటి తండ్రి! మంగళములు.**

**రాగం : మధ్యమావతి**

చిత్తజ గురుడ నీకు శ్రీమంగళం నా-
చిత్తములో హరి నీకు శ్రీమంగళం ॥చిత్తజ॥





బంగారు బొమ్మవంటి పడతి నురము మీద
సింగారించిన నీకు శ్రీమంగళం
రంగుమీర బీతాంబరము మొలగట్టుకొని
చెంగలించే హరి నీకు శ్రీమంగళం ॥చిత్తజ॥

వింతనీలములవంటి వెలది నీపాదముల-
చెంతబుట్టించిన నీకు శ్రీమంగళం
కాంతుల కౌస్తుభమణి గట్టుక భక్తుల కెల్లా
జింతామణివైన నీకు శ్రీమంగళం ॥చిత్తజ॥

అరిది పచ్చలవంటి యంగన శిరసుమీద
సిరులదాల్చిన నీకు శ్రీమంగళం
గరిమ శ్రీవేంకటేశ ఘనసంపదల తోడి
సిరివర నీకు నిదె శ్రీమంగళం ॥చిత్తజ॥

**భావామృతం**

చిత్తజుడైన మన్మథునికి కన్నతండ్రివైన ఓ శ్రీహరీ! నీకు శ్రీమంగళంబగు గాక! నా చిత్తములోని హరివైన (అంతరాత్మరూపివైన) నీకు శ్రీమంగళము.

కుందనపు బొమ్మవంటి ఇందిరాదేవిని ఉరముపై నిలుపుకొని సింగారించుకొనిన నీకు శ్రీమంగళము. కాంతులు వెదజల్లు పసుపు-పచ్చని పీతాంబరమును ధరించి శోభించే శ్రీహరీ! నీకు శ్రీమంగళమగు గాక!

వింతైన నీలికాంతులు వెదజల్లు ఆకాశగంగమ్మ! నీ పాదముల చెంత బుట్టినది. అట్టి నీకు మంగళము. కాంతులు వెదజిమ్ము కౌస్తుభ మణిని ధరించు భక్త చింతామణీ! నీకు మంగళమగు గాక!

అరుదైన మరకతము వంటి దేహపు ఛాయగల అంగన (పార్వతీదేవి) నీకు తలవంచి మ్రొక్కుచుండును. అట్టి నీకు జయమంగళము. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మహిమలయొక్క ఘనమైన సంపదలతో సిరికి మగనివైన నీకు ఇదే శ్రీమంగళమగు గాక!

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు

3. నేదునూరి కృష్ణమూర్తి గారు

4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు

5. గరికపాటి వెంకట్ గారు

6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు

7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)

8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు

9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ























భావయామి వేంకటేశం

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-V

## ఎన్నుకోబడిన
## అన్నమాచార్యుల సంకీర్తనలకు
## మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-V

మొదటి ప్రచురణ
**సెప్టెంబర్ 2011**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

- రచయిత



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి V

## అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అంతరంగమెల్ల శ్రీహరికి | 35 |
| 2. | అదిగో కొలువై యున్నాడు | 41 |
| 3. | అదిగాక సౌభాగ్యమది | 167 |
| 4. | అనంతమద్భుత | 189 |
| 5. | అన్నిటి మూలంబితడు | 81 |
| 6. | అన్ని విభవముల అతడితడు | 129 |
| 7. | అస్మదాదీనాం | 195 |
| 8. | అప్పని వరప్రసాది | 115 |
| 9. | అల వటపత్రశాయి | 153 |
| 10. | అహోబలేశ్వరు దరికుల | 43 |
| 11. | ఆదరమ్మ పాదరమ్మ | 97 |
| 12. | ఆలించు పాలించు | 79 |
| 13. | ఇందిరయు దానుగూడి | 31 |
| 14. | ఇతడే అతడు కాబోయి | 137 |
| 15. | ఇదివో సుద్దులు | 95 |
| 16. | ఇదియే నాకు మతము | 61 |
| 17. | ఇన్నిటికి మూలము యీతని | 101 |







| | | |
|---|---|---|
| 18. | ఈతడే హరుడు ఈతడే అజుడు | 93 |
| 19. | ఈ విలాసంబులును | 67 |
| 20. | ఎంత నేరుచుకొన్నది | 187 |
| 21. | ఎదురులేక చరియింతరు | 183 |
| 22. | ఎంత మన్నించితో | 29 |
| 23. | ఎచ్చట చూచిన నితడై | 159 |
| 24. | ఎటువంటి బిడ్డండే | 145 |
| 25. | ఎవ్వడో గాని ఎరుకరాదు | 49 |
| 26. | ఏటికి నెవ్వరి పొందు | 57 |
| 27. | ఏలవయ్య లోకమెల్ల | 21 |
| 28. | ఏమన వచ్చును | 107 |
| 29. | ఓహో! డేండేం | 165 |
| 30. | కంటి కంటి మిదె | 147 |
| 31. | కంటి గంటి నిలువు చక్కని | 185 |
| 32. | కాంతల మాన మనేటి | 47 |
| 33. | కిం కరిష్యామి | 159 |
| 34. | కరుణానిధిం | 23 |
| 35. | కలిగె నిదె నాకు కైవల్యము | 15 |
| 36. | కలశాపురము కాడ గంధపుమాకుల | 181 |
| 37. | కేశవ నారాయణ | 53 |
| 38. | కొమ్మ సింగారములివి | 5 |

| | | |
|---|---|---|
| 39. | కొమ్మలు పాదాలొత్తగ | 191 |
| 40. | గడ్డపార మింగితే | 169 |
| 41. | గరుడధ్వజం బెక్కె | 117 |
| 42. | గాలినే పోయ కలకాలము | 121 |
| 43. | గోనెలె కొత్తలు | 87 |
| 44. | చిత్తా అవధారు జియ్యా | 17 |
| 45. | జయమాయె నీకు నాపె | 113 |
| 46. | జవ్వనంపు మదమున | 59 |
| 47. | జవ్వాది మెత్తినది | 105 |
| 48. | త్వమేవ శరణం | 177 |
| 49. | తెగక పరమునకు | 71 |
| 50. | దేవదేవోత్తమ | 135 |
| 51. | దేవదేవంభజే | 73 |
| 52. | దేవకామినులు ఆడరో | 65 |
| 53. | దేవునికి దేవికిని | 99 |
| 54. | దేహము సంబంధము | 143 |
| 55. | ధారుణీపతికిని దలబాలో | 149 |
| 56. | నగవులు నిజమని | 83 |
| 57. | నారాయణు డీతడు | 11 |
| 58. | నారాయణా నిను | 141 |
| 59. | నిన్ను నమ్మివిశ్వాసము | 123 |







| | | |
|---|---|---|
| 60. | నీవే మాకు దిక్కు | 179 |
| 61. | నీకే శరణంటి | 139 |
| 62. | నేనేమీ చేయగ లేను | 39 |
| 63. | నేనొకటి సేయగాను | 75 |
| 64. | నేనొక్కడ లేకుండితే | 155 |
| 65. | పట్టితే పది రూపులై | 13 |
| 66. | పదుచు జేతలు గావు | 9 |
| 67. | పరమయోగీశ్వరుల | 173 |
| 68. | పరుల సేవలు చేసి | 27 |
| 69. | పాలజలనిధిలో | 33 |
| 70. | పులకల మొలకల | 127 |
| 71. | పొడవైన శేషగిరి | 109 |
| 72. | బాపుదైవమా మాపాలి | 51 |
| 73. | భావములోన బాహ్యమునందున | 193 |
| 74. | భోగీంద్రులను మీరు | 37 |
| 75. | భోగీంద్రశయనము | 175 |
| 76. | మంగళం గోవింద | 201 |
| 77. | మానవెప్పుదును | 151 |
| 78. | మాదృశానాం భవామయ | 131 |
| 79. | మిక్కిలి నేర్పరి అలమేల్మంగ | 171 |
| 80. | ముద్దుల మోమున | 133 |

| | | |
|---|---|---|
| 81. | మొకమొక మెదుట | 45 |
| 82. | మేలుకో శృంగారరాయా | 125 |
| 83. | మోసమున మాయా | 77 |
| 84. | రామ రామ రామకృష్ణ | 163 |
| 85. | రామ రామచంద్ర రాఘవ | 197 |
| 86. | వందేహం జగద్వల్లభం | 103 |
| 87. | వరుసతో సొసముఖా | 91 |
| 88. | వారిదే పో జన్మము | 9 |
| 89. | వాడె వేంకటేశుడనే వాడే | 3 |
| 90. | విజయపుటమ్మ | 119 |
| 91. | విపరీతములివి | 69 |
| 92. | విడువరాదెంతైన | 19 |
| 93. | వీడివో యిదె వింత దొంగ | 85 |
| 94. | వైష్ణవులు గానివారలు | 111 |
| 95. | వేదములే నీనివాసమట | 25 |
| 96. | వేదము దీర్పదు వేరే | 157 |
| 97. | శ్రీశోఽయం | 55 |
| 98. | సర్వేశ్వరుడే | 199 |
| 99. | సుదతుల కితనికి | 1 |
| 100. | సోదించిరిదియే | 89 |
| 101. | హరియే ఎఱుగును | 63 |






# ప్రార్థన

ఉ॥ శ్రీరమణీ మనోవిభుని చేరి నుతించెను అన్నమార్యుడున్
వారిజనాభ! నీ కరుణ వ్రాసెను వేల సుకీర్తనంబులన్
వారి మనోగతంబయిన భావన నేర్వగ నాకు శక్యమా
కోరిక దీర మున్నుడిని కూర్చుచు భావము జెప్ప జూచితిన్

కం॥ ఎన్నో జన్మల పుణ్యము
అన్నయ్యకు వివరణంబు అందించుటయున్
వెన్నుని కృపయే జుమ్మీ!!
మున్నుడినే చెప్పుటయును మురహరి కృపయే.

ఉ॥ శరణము వేడెదన్ యితని సర్వము, నాకభయప్రదాతయున్
వెరపున ఈ మహామహుని వేంకటనాథుని నామనంబునన్
తిరముగ నిల్పుమా, యెద ప్రతిష్ఠను జేయుచు అన్నమయ్యనెన్
మురియుచు వాని కీర్తనకు మున్నుడి భావములేర్చికూర్చితిన్

చం॥ గొనకొని అన్నమయ్యనిను గొల్చుచు పాడెను వేల కీర్తనల్
అనుపమ దీక్షనా గురుని నాత్మ స్మరింపుచు కొన్ని యెన్నితిన్
దినమున కొక్క కీర్తనను తేట తెనుంగున వ్రాయు ధైర్యమున్
అనువగు శక్తినీయ గదె ఆదిపరాత్పర వేంకటేశ్వరా!

కం॥ శ్రీకరుడు వేంకటేశుడు
సాకారపు పరబ్రహ్మ సత్యంబిదియే
మీకెందుకు అనుమానము?
ఆ కరుణానిధిని వేడు దన్నయ్యనెరా!



## ముందు మాట (సంపుటి-V)

"మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి"....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే 'ధనం' అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి 'ఆ' అనే అక్షరం గమనించండి. 'ఆ' అంటే 'అది' అని అర్థం. ( 'ఆ' పుస్తకం ఇటివ్వు). 'ఆ' అంటే 'ఏమిటి'? అని అర్థం ('ఆ' ఏమన్నావు ఇంకోసారి చెప్పు).'ఆ' అంటే 'అవును' అని అర్థం. ('ఆ' నేనూ సభలో వున్నాను). ('ఆ') అంటే ప్రశ్నార్థకం ('ఆ' అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. 'వేదాంతం తెలుపుతాడు'-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) 'నాకు తెలుసా' అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

"ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.



భావయామి వేంకటేశం

ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









## మున్నుడి

శ్రీదేవి, భూదేవి పెండ్లి కూతుళ్ళు పురుషోత్తముడు వరుడు. కన్నులపండువగా జరుగుతోంది కళ్యాణం. బ్రహ్మాది దేవతలు బారులు తీరి వీక్షిస్తున్నారు. వాళ్ళు మనబోటి అల్పులకు కనబడరు కాని, మనల్నికూడ పనిలోపనిగా వధూవరులతో పాటు ఆశీర్వదిస్తారు. అందుకనే జీవితంలో ఒక్కసారన్నా... స్వామివారి కళ్యాణం జరిపించాలి. నిత్య కళ్యాణం పచ్చతోరణం అనే సంప్రదాయాన్ని ఆరువందలయేళ్ళ క్రితమే ప్రవేశపెట్టి మనల్నందరినీ తరింప జేస్తున్న "పదకవితా పితామహుడు" తాళ్ళపాక అన్నమాచార్యులవారి ఋణం తీర్చుకోగలమా? ఎన్నటికీ తీరదు... ఆనాడాయన పాడిన కీర్తన ఇది...

**కం॥ సుదతుల కిద్దరి కితనికి**
**ముదముగ జరిగేను పెండ్లి భువనాల్ చెలగెన్**
**వుదటున శాయరె వూడిగ**
**మిదె భాగ్యము అన్నమయ్య ఇంతుల కనియెన్**

**రాగం : నాగవరాళి**

సుదతుల కితనికి సోబనవేళ
వుదుటున జెలులెల్ల నూడిగాలు శాయరే ॥సుదతుల॥

ఇద్దరు పెండ్లి కూతుల కితడు గట్టె బాసిక-
మొద్దిక గప్పుర వీడె లొడిబెట్టెను
పెద్దరికాన నడుమ బెండ్లి పీటపై గూచుండె
వొద్దనుండి సతులెల్ల నూడిగాలు (సే) వేయరో ॥సుదతుల॥

రెండు చేతుల శాసలు రెట్టించి చల్ల దొడగె
దండలిద్దరి మెడల దగుల వేసె
గండు మీరి ముంజేతుల గంకణ దారాలు గట్టె
వుండినట్టే చెలువెల్ల నూడిగాలు సేయరే ॥సుదతుల॥





భూమిన నలమేల్మంగను భూసతి గాగిట గూడె
దోమటి దొడికి ముందే తొక్కె బాదాలు
యీమేటి శ్రీవేంకటేశు డిన్ని విధాల మెఱసె
వోముచును చెలులెల్ల నూడిగాలు సేయరే ॥సుదతుల॥

**భావామృతం :**

ఓ చెలులారా! (అన్నమాచార్యులవారు కూడా... పెండ్లిచూడటానికి వచ్చిన ఒక తరుణి అని భావించాలి), సుదతులకు (శ్రీదేవి, భూదేవి అనే ఈ భామలకు), ఇతనికి (పురుషోత్తముడైన ఈ శ్రీ వేంకటేశ్వరునికీ), ఇది సోబనవేళ (శుభకార్యం జరిగే సమయం). మీరు వుదటున (గర్వంగా పెళ్ళిపెద్దలవలె) వూడిగము (సేవలు) శాయరే.

ఈ పెండ్లి కూతుళ్ళిద్దరికీ ఇతడు 'బాసికము'లు కట్టినాడు. అనుకూలంగా కర్పూర తాంబూలములను ఈ దేవేరులు వొడిలో బెట్టినాడు. ఆ తరువాత తన పెద్దరికం చూపిస్తూ మధ్యలో వేసిన పెండ్లిపీటలపై కూర్చుని వున్నాడు. ఓ సతులారా! మీరంతా ఈయన వద్దనుండి సేవలు చేయండి, తరించండి.

చూడండమ్మా! ఈ జగన్నాథుడు, రెట్టించి (రెండురెట్లయిన వుత్సాహంతో) తన రెండు చేతులతోటి శాసలు (తలంబ్రాలు) పోస్తున్నాడు. వధువులిద్దరి మెడలలోను పూల దండలను తగుల (తన చేతులను తాకిస్తూ) వేసినాడు. ఈ వరుడు (గండుమీరి తన పౌరుషము చూపిస్తూ) వధువుల ముంజేతులకు కంకణ దారాలు కట్టినాడు. ఉండినట్లే... (ఉన్నవాళ్ళంతా) వూడిగాలు (సేవలు) చేయండమ్మా! ఓ చెలులారా! మీదేకదా! భాగ్యమంటే.

ఈ భూమిని (ఈ తిరుమలలో) తన దేవేరులైన అలమేల్మంగను, భూదేవిని 'దోమటిదొడికి' (నేటి కాలంలో మన భాషలో చెప్పాలంటే... "ఎగురుకొంటూ" (ఆచారంగా, పాదాలు తొక్కి... ఆ నొప్పి తగ్గుటకా అన్నట్లు వారిని తన కౌగిట చేర్చినాడు. మేటి (నేర్పరి) యైన ఈ శ్రీవేంకటేశ్వరుడు వోముచును (జగద్రక్షణ చేయుచు) (ఇన్ని విధముల ప్రకాశించి కన్నులపండుగ చేయుచున్నాడు. ఓ చెలియలారా! మీరంతా వీరికి వూడిగాలు చేయండమ్మా! తరించండి.

**5-2**

## మున్నుడి

రంగనాథస్వామిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. ఈ కీర్తనలో రంగనాథస్వామి లీలలను వివరించారు అన్నమయ్య. పెరియాళువారినే శ్రీకృష్ణదేవరాయలవారు ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తులు అన్నారు. ఆయన కూతురే గోదాదేవి. ఆమె రంగనాథస్వామిని వలచి వలపించుకొంది. ఆమె తన తలలో ముడిచి విడిచిన విరిదండలను స్వామికి అర్పిస్తే వాటి సువాసనలధికమై ఆయన ప్రేమగా స్వీకరించి ఆమెనే పెండ్లాడాడు. పామరులైన తనబోటివారిని (అన్నమయ్య వంటివారిని...) "నా మీద పాటలు పాడండిరా"...అని నూరిపోశాడట...ఆహా!! వీడు వాడే వేంకటేశ్వరుడు అంటున్నారు.

**ఉ॥ వాడట వేంకటేశ్వరుడు వానిని వీడని యెంచి చూడరో**
**వాడు కరంబులన్ వలయు వావిరి ఆయుధముల్ ధరించెబో**
**కూడెను విష్ణుచిత్తులకు కూతురు నాతడు ప్రేమ మీరగా**
**నేడిటు వేంకటాద్రిపయి నీటుగ బ్రోచెను అన్నమయ్యనెన్.**

*** వావిరి = అధికమైన**

**రాగం : రసికరంజని**

వాడే వేంకటేశుడనే వాడే వీడు
వాడి చుట్టు కైదువ వలచేతివాడు ॥వాడే॥

కారిమారసుతుని చక్కని మాటలకు చొక్కి
చూరగా వేదాలగుట్టు చూపినవాడు
తీరని వేడుకతో తిరుమంగైయాళువారి
ఆరడి ముచ్చిలి కూటికి ఆసపడ్డవాడు ॥వాడే॥

పెరియాళువారి బిడ్డ పిసికి పై వేసిన
విరుల దండల మెడవేసిన వాడు
తరుణిచేయి వేసిన దగ్గరి బుజముచాచి
పరవశమై చొక్కి పాయలేని వాడు ॥వాడే॥





పామరుల దనమీది పాటలెల్లా పాడుమంటా
భూమికెల్లా నోర నూరి పోసినవాడు
మామ కూతు రలమేలుమంగ నాంచారియుదాను
గీముగానే వేంకటగిరి నుండేవాడు ॥వాడే॥

**భావామృతం :**

ఓ నరులారా! వాడే వేంకటేశ్వరుడనే వాడు. వాడే మన యెదురుగానున్న వీడు (రంగనాథుడు). వాడిచుట్టూ చేతులలో కోరిన ఆయుధాలు ధరించినవాడు.

'కారిమారన్' కుమారుడు చక్కగా మాట్లాడి తనని సంతోషపరచగా విద్యాగంధంలేని అతనికి వేదముల మర్మమెల్ల గుత్తగా యెరిగించి విఖ్యాతుని జేశాడు. తీరని వేడుకతో ఈ స్వామి అలనాడు 'తిరుమంగై ఆళ్వారు' తనని ఆరడి చేసినా (వద్దని ఆంక్షలు పెట్టినా), ముచ్చిలి (దొంగతనంగా) తిందామని దొంగకూటికి ఆశపడ్డవాడు. (ఆవిధంగా తన భక్తునికోసం యెంతకైన తను సిద్ధమేనని మరొక్కసారి నిరూపించినాడు)

పెరియాళ్వారు (విష్ణుచిత్తులవారు) వారి కూతురైన గోదాదేవి పిసికి (వాడుకొని), పై వేచిన (తనపై వేసిన) విరుల దండలను (పూమాలలను) ప్రీతిగా మెడవేసినవాడు (తన మెడలో ధరించిన శ్రీరంగనాథుడు) చేయి వేసిన గోదాదేవిని, తన భుజము చాచి దగ్గరకు తీసికొని పరవశమై చొక్కి (పరవశించి) ఆమెను పాయలేనివాడు (వదలలేని వాడు). వీడు (ఈ రంగనాథుడు) వాడే... వాడే ఏడుకొండల వేంకటేశ్వరుడు.

తనమీద, పామరులు (విద్యాగంధంలేని అల్పులైన) వారిని కూడ, పాటలెల్లా పాడమంటా (పాడండిరా కీర్తనలను) అని, భూమికెల్లా (భూలోకంలో అనేక చోట్ల) నోర నూరిపోసినవాడు. (నోటితో చెప్పి చెప్పి నూరిపోసి బోధించినవాడు). ఆ రంగనాథుని కథ ఇట్లా వుంటే... అక్కడ వేంకటాద్రిమీద (శ్రీవేంకటేశ్వరుడై) తన మామకూతురైన అలమేల్మంగమ్మ నాంచారీ, తానూ గీముగానే (నివాసముగా) నుండేవాడు.... యెవరనుకొంటున్నారు? వాడేవీడు... వీడేవాడు.

**5-3**

## మున్నుడి

సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు. అన్నమాచార్యులవారు. అన్నమయ్య కూడ ఒక చెలికత్తెయై తనతోటి చెలికత్తెలతో..."ఈ భామిని (కొమ్మ) సింగారాలు (అందాలు) కొలది వెట్టగరావు (లెక్కలేనన్ని వున్నాయి). పమ్మిన (అతిశయించిన) ఈ అందాలను వూహించాలేగాని ఇదమిద్ధంగా చెప్పుటు సాధ్యంకానిపని" అని చెబుతున్నారు. 'వయసురాని' వారికోసం ఈ కీర్తన సాధ్యమైనంత నర్మగర్భంగా వివరించాను. ఆ ప్రయత్నంలో కొండొకచో అసలుకే మోసం వచ్చి వుండవచ్చును. దాసుని తప్పులు దండముతో సరి...

**తే॥ కొమ్మ సింగారములనెంచి కొలది వెట్ట**
**రావు, సొబగుల భావించి రమణులార!**
**చెలగుడనె అన్నమార్యుడు చెలుల తోడ**
**సరస శృంగార కీర్తన హరికి దెలిపె.**

**రాగం : మిశ్రమోహన**

కొమ్మ సింగారములివి కొలది వెట్టగ రావు
పమ్మిన యీ సొబగులు భావించరే చెలులు ॥కొమ్మ॥

చెలియ పెద్దతురుము చీకట్లు గాయగాను
యెలమి మోముకళలు యెండగాయగా
బలిసి రాతిరియు పగలు వెనకముందై
కలయ కొక్కట మించీ కంటిరటే చెలులు ॥కొమ్మ॥

పొందుగ నీకె చన్నులు పొడవులై పెరగగా
నందమై నెన్నడుము బయలై వుండగా
ఇందునే కొండలు మిన్నుకిందు మీదై యొక్కచోనే
చెందివున్నవివివో చూచితిరటే చెలులు ॥కొమ్మ॥





శ్రీవేంకటేశు వీపున చేతు లీకెవి గప్పగా
యీవల నీతని చేతు లీకె కప్పగా
ఆవల కొమ్మలు తీగె ననలు కొనలు నల్లి
చేవదీరిని తిలకించిరటే చెలులూ ॥కొమ్మ॥

**భావామృతం :**

ఓ చెలియలారా! ఈ కొమ్మ (యువతి) సింగారములు (అందాలు), ఇవి అని కొలదివెట్టగ రావు (పరిమితి విధించుట సాధ్యము కానిపని). పమ్మిన (అతిశయించిన) ఈ సొబగులు (అందాలు) భావించరే (వూహించండే). ఇదమిద్ధంగా చెప్పుటకు వీలులేదు.

ఈ చెలియ 'సిగకొప్పు' చాల పెద్దది. అది చీకట్లను సృష్టించగలదు. ఆమె ముఖకాంతి యెండగాసినట్లు వున్నది. దానివల్ల రాత్రి పగలు వెనకా ముందులై (ఎన్నడూ కలసి ఒక్కచోట వుండని రేబవళ్ళు) మించి ఒక్కటైనాయా అన్నట్లుంది. ఓ చెలులారా! ఈ వింత కంటిరా! (చూశారా).

ఈమె పొంకమైన వురోజములు వున్నతములై, నెన్నడుము బయలై (శూన్యమై) యున్నందువలన... వున్నతమైన గిరులు మీదై శూన్యమైన గగనం క్రిందైనట్లున్నది. మరి ఇవిగో ఈ తారుమారు వ్యవహారం చూశారా! కనుక ఓ చెలులారా! యెన్నివింతలైనా అసాధ్యంకాదు.

ఓ భామినులారా! నల్లని దృఢమైన శ్రీవేంకటేశుని ఈ సుందరి తమకంతో తన చేతులు ఆయన వీపు చుట్టూ గప్పగా, ఆయన తన చేతుల నామె వీపు చుట్టూ బిగించినాడు. మనోజ్ఞమైన ఆ దృశ్యం సుకుమారమైన పూ లత దృఢమైన కొమ్మచుట్టూ అల్లుకొనినట్లున్నది. చేవదీరిన ఈ అల్లిక చూశారా! మీ జన్మ తరించిందే...

**5-4**

## మున్నుడి

ఎన్ని జన్మలెత్తినా జ్ఞానశూన్యులై జీవించి, మళ్ళీ మళ్ళీ పుట్టుతూ చనిపోతూ బ్రతుకుతున్నారు జీవులు. అవి జన్మలనటం శుద్ధదండుగ అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎవడు భారత, రామాయణాల్లోని నీ గాథలు ఈ భూమిపై ప్రచారం చేశారో వారిదేపో జన్మంటే. రాముడివై ధర్మవర్తనం నేర్పావు. కృష్ణుడివై దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశావు. నరసింహుడివై చావే అసాధ్యమైన హిరణ్యకశిపుని చంపావు. ఎన్నెన్నో రూపాలెత్తి నేడు ఈ తిరుమలలో శరణాగత రక్షకుడవైన నీవే శరణని బ్రతుకుతూ నీదయకోసం వేచివున్నాం.

**చం॥ జననము వారిదే భళిర! చక్కగ దెచ్చిరి నిన్ను భూతలిన్**
**వెనుక పురాణముల్ కలిగె వెన్నుడ! నీకథలెల్ల నెక్కుడై**
**అనిశమధర్మమెక్కుడయి, అల్పము ధర్మముయైన తావులన్**
**తనువును దాల్తువయ్య! హరి ధాత్రిని కొండల నన్నమయ్యనెన్.**

### రాగం : దేసాళం

వారిదే పో జన్మము – వడి నిన్ను దెచ్చిరి
భారత రామాయణాలై – పరగె నీ కథలు ॥వారిదే॥

భువిమీద రావణుడు – పుట్టగాగా రాముడవై
తవిలి యిందరికి బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాడు – వెలసితేగా నీవు
అవతార మందితే ని–న్నందరును జూతురు ॥వారిదే॥

రమణ గంసాది యసు–రలు లూటి సేయగాగా
తమి గృష్ణావతార మిం–దరికైతివి
గములై యంతటి వారు – గడగితేగా నీవు నేడు
అమర జనించి మాట – లాడుదు విందరితో ॥వారిదే॥





ఎంత వుపకారియో – హిరణ్యకశిపుడు
చెంత నరసింహుడని – సేవ యిచ్చెను
ఇంతట శ్రీ వేంకటేశ – యిన్ని రూపులును నీవే
పంతాన నీ శరణని – బ్రతికితి మిదివో ॥వారిదే॥

### భావామృతం

ఓ శ్రీవేంకటేశ్వరా! జన్మము అంటే... వారిదేపో... వారు నిన్ను మాముందుకు తెచ్చారు. వారు (వ్యాసుడు, వాల్మీకి వంటి మహానుభావులు) చెప్పిన నీ కథలే భారతము, రామాయణము అని ప్రసిద్ధి చెందాయి. అంతేకాదు దుర్మార్గులని అందరూ తిట్టిపోసే రావణుడు, కంసుడు, హిరణ్యకశిపుని వల్లనే ఆ కథలు వెలుగులోకి వచ్చాయి. కాబట్టి వారివల్ల కూడా మేలే జరిగింది. లేకపోతే నీవు భూమ్మీదకెందుకొస్తావు? మాబోటి సామాన్యులు నిన్నెట్లా చూస్తారు?

రావణాసురుడు పుట్టుటవలననేకదా నీవు రాముడివై ఇంతమందికి కనబడ్డావు. అంతవాడు పుట్టాడు కాబట్టే నీవు అవతరించావు. కాబట్టి రావణుడివల్ల మంచే జరిగింది.

ఓ రమణుడా! కంసుడు మొదలైన అసురుల వల్ల కూడా వుపకారమే జరిగిందయ్యా! వాళ్ళు లూటీసేసి (పీడించి) నీ భక్తులను బాధించినందువల్లనే నీవు కృష్ణుడవై పుట్టి గొల్లవారిని కూడా వుద్ధరించావు. మాబోటి అల్పులతో కూడ మధురంగా మాట్లాడావు. నీకోసం దేవతలంతా భూమిపై అవతరించారు. మాకు కీడుకన్నా మేలే ఎక్కువ జరిగింది.

హిరణ్యకశిపుని వల్ల ప్రహ్లాదుడు బాధపడ్డమాట నిజమే కాని వాడివల్ల కూడ మాకు మంచే జరిగింది. వాణ్ణి చంపటంకోసం నీవు నరసింహుడివై అవతరిస్తే నిన్ను చూచి మేమంతా తరించాం. ఇన్ని రూపాలెత్తిన నీవే నేడు తిరుమలలో మాకోసం ఏడుకొండలవాడివై అవతరిస్తే... పంతంతో నీవే దిక్కని యేదో ఇలా బ్రతుకుతున్నాం. తండ్రీ! మాకు ఇదే బాగున్నది.

**5-5**

## మున్నుడి

నేటి నెల్లూరు జిల్లాలోని దర్శితాలూకాలోని 'పోలేపల్లి' గ్రామంలో ప్రాచీనమైన విఠలేశుని ఆలయం వున్నది. అన్నమాచార్యులవారికాలం నాటికి అదే గోపాల కృష్ణుని ఆలయం అయ్యుంటుందనీ, ఈ కీర్తనలోని కథానాయకుడు ఆ స్వామేనని కొందరు పెద్దలు నమ్ముతారు. అన్నమయ్య వాడిన పదజాలం కూడ నేటికాలంలో మనబోటివారికి అంత సుపరిచితంకాదు. నేనైతే విశ్వప్రయత్నంతో మాత్రమే ఈ వివరణన్నా ఈయగలిగా. పడుచు జేతలంటే కుఱ్ఱచేష్టలని అర్థం.

**ఆ.వె.॥ తొడికి మోవి పంటితో దుండగీడురా**
**పడుచు పనులు గావు బాలకృష్ణ!**
**తుంగభద్రత టిని దుడుకు కృష్ణుండనె**
**అన్నమయ్య కొలిచె వెన్ను నిటుల**

**రాగం : మంగళ కౌశిక**

పడుచు జేతలు గావు బాలకృష్ణుడు
తొడికీ మోవి పంటికె దుండగపు కృష్ణుడు ॥పడుచు॥

వెన్నచేతబట్టుకొని వేలు చాచి వుట్లకు
సన్న చేసీ గదవమ్మ జాణకృష్ణుడు
కన్నెలు దన్నెత్తుకొంటే కాగిట చవులు చూపీ
యెన్నిట తా నసకాడె యీ కృష్ణుడు ॥పడుచు॥

అంకెల దొంగెడు తానె అందపు చూపులు చల్లీ
లంకె మగనాండ్లపై లలి గృష్ణుడు
పొంకపు చెక్కు గీటితె పుక్కిట లోకాలు చూసి
సంకెలేక యశోదకు సటకాడు కృష్ణుడు ॥పడుచు॥





గొల్లెతలు ముద్దాడితె గురుతులెల్లా నించె
చల్లచాడెల కాడనె సరి గృష్ణుడు
అల్ల శ్రీవేంకటాద్రిని అదె తుంగభద్ర దరి
కొల్లలుగా వరా విచ్చీ గోవిందకృష్ణుడు ॥పడుచు॥

**భావామృతం :**

ఈ బాలకృష్ణుడు చేసే చేష్టలు పడుచు జేతలు (బాలుడి చేష్టలు) కావు. వీడివి యువకుని చేష్టలు. ఈ దుండగీడు (దుందుడుకు పిల్లగాడు) మా అధరములను తన పంటితో ఆకర్షిస్తాడు. ఇంకా విడమరచి చెప్పాలా?

ఒక చేత్తోవెన్న పట్టుకొని తను తింటూనే తనతోటి కుఱ్ఱాళ్ళకి వేలు చాచి వుట్లకేసి చూపించి వాటిని పగలగొట్టమని ఎట్లా సైగలు చేస్తున్నాడో చూడండి. ఈ కృష్ణుడు ఎంతటి జాణమ్మా! పడుచు పిల్లలు ఏదో చిన్నపిల్లాడులే అని తననెత్తుకొంటే, హఠాత్తుగ వారిని కౌగలించి కౌగిటిరుచి చూపిస్తాడు. ఓయమ్మో! ఈ కృష్ణుడు యెన్నిరకాలుగా నసకాడు (నసపెట్టే వాడు... అంటే ఒక పట్టాన తృప్తినొందని 'దురద' లాంటివాడు)

ఆకర్షణీయమైన తన చూపులతో తానే దొంగతనంగా కన్నెలను వశము చేసికొని ఆ మగనాండ్రపై (ఆ యువతులపై), లలి (ప్రేమ) అనే 'లంకె' బిగిస్తాడు. ఈ కృష్ణుని చేష్టలనేమని చెప్పగలము "ఏమిటిరా ఈ పనులు" అని యశోదాదేవి చక్కటి వాడి చెంపలు పట్టుకొంటే తనకేమీ తెలీదని పుక్కిట (వూరకనే) తన నోరుతెరచి దాంట్లో, సంకెలేని (అసంఖ్యాకమైన) లోకాలను చూపినాడు. వీడెంత సటకాడు (టక్కరివాడు)!!

చిన్నపిల్లాడు కదా! అని గోపికలు తనని ముద్దాడితే తాగిన చల్ల గుర్తులన్నీ వారి బుగ్గలపై నింపుతాడు. వీడికి సరియెవ్వరూ లేరు. అదిగో తుంగభద్రానది ఒడ్డున కొల్లలుగా (అంతులేకుండా) వరాలిచ్చే ఈ గోవిందకృష్ణుడే అల్ల (అదిగో) వేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరుడై యున్నాడు. వీనిని సేవించి తరించండి.

**5-6**

## మున్నుడి

శ్రీమన్నారాయణుని భక్తితో కీర్తిస్తూ అన్నమాచార్యులవారు శరణాగతితో ఈ కీర్తన వినిపిస్తున్నారు. భక్తులు ఆయన నెక్కడ స్మరిస్తే అక్కడే వున్నాడు. తనే కావాలన్న వారికి తాను లొంగివుంటాడట. భక్తి అనే తాటితో తప్ప యెన్ని తాళ్ళు తెచ్చినా ఆయన్ని కట్టలేమని యశోద తెలుసుకొన్నది. దుర్యోధనుడు తెలుసుకొన్నాడు. దిక్కని నమ్మినవారు యెక్కడికి పిలిస్తే... అక్కడికి వస్తాడు. ఎక్కడ చూచిన అక్కడే తన రూపం చూపే ఆయనే... మన శ్రీవేంకటేశ్వరుడు "చేచేత పూజింప సేవలు గొనడా?" అంటున్నారు.

**మ॥ నరులారా! యితడేను దేవుడనగా నారాయణుండీతడే**
**శరణంబంచును వీనిగొల్వుడిపుడే చక్కంగ రక్షించురా**
**అరిగెన్ వామనుడై జగాల కొలిచెన్ ఆనాడు మూడడ్గులన్**
**వరమై గైకొనె, అన్నమయ్య పాడిడెన్ వాత్సల్య రూపున్ హరిన్.**

**రాగం : మోహన**

నారాయణుడీతడు నరులాల
మీరు శరణనరో మిమ్ము గాచీని ॥నారాయణ॥

తలచిన చోటను తానే ఉన్నాడు
వలచిన వారికైవసమెపుడు
కొలచెను మూడడుగుల జగమెల్లాను
కొలిచిన వారిని చేకొనకుండునా ॥నారాయణ॥

యెక్కడ పిలిచినా ఏమని పలికీ
మొక్కిన మన్నించు మునుముగను
రక్కసుల నణచి రక్షించు జగములు
దిక్కని నమ్మిన తిరముగా నేలడా ॥నారాయణ॥





చూచిన యందెల్ల చూపును రూపము
వోచిక పొగడిన వుండు నోటను
యేచిన శ్రీవేంకటేశుడే యితడట
చేచేత పూజింప సేవలుగొనడా ॥నారాయణ॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ మహానుభావుడే నారాయణుడు. మీరు ఈయనే దిక్కని శరణు వేడండి. మిమ్మల్ని తప్పక రక్షిస్తాడు.

ఈ దేవదేవుడు తలచిన చోటనే వున్నాడు. తానే వున్నాడు. స్వయంగా తానే వస్తాడు. తనను ఎవరు ప్రేమిస్తే వారికి కైవసమై (లొంగిపోయి) వుంటాడు. సమస్త భువనాలను మూడంటే మూడు అడుగులు (పాదాలు) పెట్టి 'కొలిచిన' వాడు కొలిచిన వారిని (పూజించినవారిని) చేకొనకుండునా?

ఈ సర్వేశ్వరుడు ఇక్కడా, అక్కడా అని చూడడు. ఎక్కడకు పిలిచినా వస్తాడు. రావటమే కాదు, ఏమి... యెందుకు పిలిచావు అని మరీ కనుక్కొంటాడు. "మొక్కిన మన్నించు మునుముగను"... (అంటే... అంత హడావుడిగా యెందుకు పిలిచావని విసుగుకొనకుండా వరుసగా మన్నిస్తాడట...). హిరణ్యకశిపుని వంటి రాక్షసుల బారినుండి కూడా తన భక్తులను కాపాడుటకు, వచ్చి రక్షిస్తాడని ఋజువయింది కదా! జగద్రక్షకుడు దిక్కని నమ్మినవారిని, తిరముగా నేలడా? (స్థిరముగా రక్షించడా?)

ఈ శ్రీహరి 'ఇందుగలడందులేడని సందేహము వలదు'... అన్నట్లు తన రూపము చూచిన యందెల్ల చూపును. ఓచిక పొగడిన (ఉచితమైన రీతిగా కీర్తించిన) ఆ కీర్తించిన వారి 'నోటి' యందే వుంటాడు. అంటే పలుకులోన పలుకు దైవము అన్నమాట.

అటువంటి ఈ శ్రీమన్నారాయణుడు వేరెవరోకాదు, యేచిన శ్రీవేంకటేశ్వరుడే (అతిశయించిన తిరుమలాధీశుడే). మరి... చేచేత పూజింప (చేతులారా పూజిస్తే) మన సేవలు గొనడా? (తప్పక స్వీకరిస్తాడు).

## 5-7

## మున్నుడి

అన్నమాచార్యులవారి కీర్తనలలో దశావతార వర్ణన కీర్తనలకొక ప్రత్యేకత వున్నది. గొప్ప 'క్విజ్ ప్రోగ్రామ్' లా సాగుతుంది. ఎంతో ఆలోచిస్తేగాని అసామాన్యులైన పండితులకు సైతం అర్థంకావు. 'పట్టితే పది రూపులనటం వల్ల' ను ఇదివరలో కొన్ని కీర్తనలు చూసినందువల్లను ఇది దశావతార వర్ణన అని తెలిసింది కాని, ఆపైన సాగలేదు. సప్తగిరీశుని శరణన్నవారు సప్తసముద్రాలే దాటగలరు. ఇదొక లెక్కా. నిద్ర లేచేసరికి భావామృత వివరణ మనస్సులో "వెలిగింది" చదవండి అదేమిటో...

**మత్తకోకిల : పట్టితే పదిరూపులై ఇల వాసుదేవుడు బుట్టెరా**
**యెట్టులున్నను మేలు జేసెను యెల్లలోకములేలెరా**
**గట్టివాడుర ద్రుంచె దుష్టుల గాచెశిష్టుల మెచ్చెరా**
**దిట్టయౌ తిరుపట్ల రాయుడు ధీరుడన్నయ తెల్పెరా.**

**రాగం : రామక్రియ**

పట్టితే పదిరూపులై పాయదు నావొద్ద దాగు
యెట్టు వున్నమేలు ఇకనెప్పుడైనా రానీవే ॥పట్టితే॥

కన్నులనే వొకరూపు కాళ్ళబెనగీ రూపు
వెన్నెలాదురువంటి వన్నెలరూపు
నెన్నడిమిదొక రూపు నిచ్చలు నామేని మీద
ఇన్నిటా బాయదు తాను యెప్పుడైనా రానీవే ॥పట్టితే॥

చేతిలోని దొకరూపు చేరి నాపేరిట రూపు
కాతరపు జవ్వనాన గలదు రూపు
పై తరవైనా బుజ బలముననొకరూపు
యీతల నాయందు బాయదెప్పుడైనా రానీవే ॥పట్టితే॥





కదు బుద్ధుల నొకరూపు కలికి తనాల రూపు
బడిబడి బాసినాను పాయదు నన్ను
అదరి శ్రీవేంకటాద్రి మీద నన్ను గూడి
యెడయడెన్ని విధాల నెప్పుడైనా రానీవే ॥పట్టితే॥

**భావామృతం :**

పట్టితే (అనుకుంటే) పదిరూపులై (పది అవతారములెత్తి) నావొద్ద దాగు (నా మేధస్సులో దాగి వుంటాడు), పాయడు (నన్ను విడువడు). ఆయన శ్రీమన్నారాయణుడు "సంభవామి యుగే యుగే" అని చెప్పి యున్నాడు. యెట్టులున్ననూ (ఏరూపంతోనైనా.. మేలు (లోక కళ్యాణమే) చేస్తాడు. ఇక నెప్పుడొస్తే ఏమి? రానీవే (రానీయండి, చూచి తరిద్దాం).

కన్నులనే వొకరూపు (ఈయన ఒకరూపంలో కన్నులతోనే వున్నాడు. చేప ఎన్నడూ కన్నులు తెఱచే వుంటుంది. మూయదు... కనుక ఈరూపం మత్స్యావతారము) కాళ్ళబెనగీరూపు (కాళ్ళతోఈదులాడే కూర్మావతారం). వెన్నెలవంటి తురుము (వెంట్రుకలు) గల వన్నెల రూపు (శ్వేతవరాహ అవతారము). నెన్నడిమి దొకరూపు (నడిమిపైనుంచి వేరే ఒక రూపు వున్న నరసింహుడు). నిత్యమూ నా ఒంటిమీదే వుంటాడు, యెన్నటికీ పాయడు (వదలడు). తాను యెప్పుడైనా రానీలే... మంచిదే.

చేతిలోని దొకరూపు (లోచెయ్యి.. అంటే భిక్ష స్వీకరించిన రూపము... అనగా వామనావతారము). చేరినే పేరిటరూపు (సమీపించి.. అతిశయించిన రూపము.. అనగా పరశురాముడు). కాతరపు జవ్వనాన గలదురూపు (యవ్వనమంతా కలతతోనే గడపిన రూపు... అనగా శ్రీరామావతారం). పై తరవైన (అందరికంటే యెక్కుడైన) భుజబలం గలదొకరూపు (బలరామావతారము) ఇకపైన ఈయన నన్ను విడువడు. ఎప్పుడైనా రానీవే. (రానీవే అనే మాటని నేటికాలంలో రానీలే చూద్దాం అంటున్నాం).

కదు బుద్ధుల నొకరూపు (అత్యంత బుద్ధిశాలియైన బుద్ధుడు). కలికితనాల రూపు (కల్కి అవతారము). ఇట్టి అవతారమూర్తి, నేను బడిబడిబాసినాను. (క్రమము తప్పినప్పటికీ) నన్ను పాయడు (నన్ను విడువడు). అదరి (అతిశయించి) శ్రీవేంకటాద్రిమీద నన్ను సమీపించి, యెన్ని విధాలనైనా యెడయడు (త్యజించడు). ఈ శ్రీవేంకటేశ్వరుని యెప్పుడైనా రానీలే... నావాడే కదా!

## 5-8

## మున్నుడి

'మోక్షలక్ష్మి' ప్రాప్తించినప్పుడు కలిగే భావోద్వేగాన్ని పొందుతున్నారు అన్నమాచార్యులవారు. ఇదివరలో అదెవ్వరికీ దొరకని భాగ్యం అంటున్నారు. అంటే ఇదివరకెవ్వరికి ముక్తి లభించలేదని కాదు. యోగీశ్వరులకు దొరికివుండవచ్చుకాని సామాన్య సాంసారిక జీవితం గడిపి సుఖదుఃఖాలనుభవించి, కామక్రోధాలకు లోనైన బ్రతుకు గడిపిన తనకు ఆ శ్రీవేంకటేశ్వరుడు కైవల్యము నియ్యటం మాత్రం అసామాన్యమే... బహుళ జనాదరణ బొందిన భజన ఇది "నా క్రమమెల్ల నీ కైంకర్యమే" అంటున్నారు. అంటే... యేమిటి?

**కం: కైవల్యము కలిగెనురా**
**ఏవారికి దొరకలేదు ఇది తొల్లింటన్**
**శ్రీవేంకటేశ! కనుగొని**
**నీవాకిలి నన్నమయ్య నిను భజియించెన్.**

**రాగం : సింధుభైరవి**

కలిగెనిదె నాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది ॥కలిగె॥

జయపురుషోత్తమ జయపీతాంబర
జయ జయ కరుణా జలనిధి
దయ యెఱుంగనే ధర్మము నెఱగనా
క్రియ యిది నీ దివ్య కీర్తనమే ॥కలిగె॥

శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీ జనార్దనా
పరమ మెరుంగను భక్తి యెరుంగను
నిరతము నాగతి నీ దాస్యమే ॥కలిగె॥





నమో నారాయణ నమో లక్ష్మీపతి
నమో పుండరీకనయనా
అమిత శ్రీవేంకటాధిప యిదె నా
క్రమమెల్లను నీ కయింకర్యమే ॥కలిగె॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదిగో... ఇదే నాకు ముక్తి లభించింది. (రాగద్వేషాలకు అతీతమైన నిత్యానంద స్థితి కలిగిందని భావము). యోగీశ్వరులకేమో గాని ఇటువంటి స్థితి, ఇదివరకు యెవ్వరికీ (సామాన్యులైన నాబోటి వారికి) సిద్ధించలేదు. కేవలం ఆ దేవదేవుని కరుణవలన లభించిన కైవల్య లక్ష్మి అది.

ఓ పురుషోత్తమా! నీకు జయము. పీతాంబరముల ధరించు కరుణాసాగరా! నీకు జయమగు గాక! నాకు 'దయ' ఇంతవరకు తెలియదు. ధర్మమార్గం యేమిటో యెరుగను. నాకు తెలిసిన సులువైన దారి ఒక్కటే వున్నది. ఆ 'క్రియ' (పని) నీ దివ్య కీర్తనము చేయుటే.

ఓ గోవిందా! నిన్ను శరణు జొచ్చియున్నాను. ఓ కేశవా! నీకు శరణు అంటున్నాను. శ్రీ జనార్దనా! శరణు శరణు. నాకు పరము (మోక్షము) అంటే యేమిటో నిజంగా తెలియదు. భక్తి అని దేనిని పిలుస్తారో యెరుగను. ఇక నా గతి (మార్గము) యేమిటి? నిరంతరము నీకు భృత్యునిగా బ్రతుకుటయే.

ఓ నారాయణుడా! నీకు వందనములు. ఓ లక్ష్మీవల్లభా! నీకు నమస్కారములు. ఓ పుండరీకాక్షా! (పద్మదళనేత్రుడవైన దేవా!) నీకు నమో వాకములు. మితి అనునది లేని ఓ శ్రీవేంకటేశ్వరా! నాక్రమము (నా పద్ధతి) యెల్లా (అంతా) నీ కైంకర్యమే (నీకు సమర్పించుకొనుటయే... అంటే నన్ను నీకు సమర్పించుకొనుట యొక్కటే.

**5-9**

## మున్నుడి

శ్రీరామపట్టాభిషేక మహోత్సవాన్ని దృశ్యమానం చేస్తున్నారు, అన్నమాచార్యులవారు. ఈ శ్రీమత్ అయోధ్యా విహారియే తిరుమలలోని శ్రీవేంకట నివాసుడు అంటున్నారు. "సామజ, వారి, రథముల సందడివేళ" అంటే గజ, అశ్వ, రథ సేనలు మోహరించి జయజయ ధ్వానాలు పలుకుతూ, కోలాహలం చేస్తున్నాయట. కీర్తన వింటుంటే రాజా రవివర్మ వర్ణచిత్రాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. కీర్తన పల్లవిని విని జాగ్రత్తగా అర్థంచేసికొంటే మిగతా చరణాలన్నీ ద్రాక్షాపాకమే.

**ఆ.వె॥ చిత్తగించవయ్య జియ్య! శ్రీరఘురామ!**
**అవధరింపుమనెను అన్నమయ్య**
**రాజరాజులీయు రమ్యమౌ కాన్కలన్**
**స్వీకరింపుమనెను వినుతి జేసి.**

**రాగం : సాళంగనాట**

చిత్తా అవధారు జియ్య పరాకెచ్చరికె
హత్తి కానుక లిచ్చేరు అదె రాజరాజులు ॥చిత్తా॥

రామ రఘుకుల వీర రాజీవలోచన
కోమలశ్యామల వర్ణ కొలువు వేళ
వామదేవాది మునులు వారె సుగ్రీవుడు వాడె
వేమారును వానరవీరులు మొక్కేరు ॥చిత్తా॥

దేవ సీతాసమేత ధీర లోకనాయక
భావించ నవధరించు పౌజువేళ
పావని యల్లవాడె భల్లూకపతి వీడె
సేవించీని భరతుని జేకొను శత్రుఘ్నుని ॥చిత్తా॥





శ్రీమదయోధ్యావిహార శ్రీవేంకట నివాస
సామజ వాజి రథాల సందడి వేళ
సౌమిత్రి యీవంక విభీషణుడు నావలి వంక
నీ మహిమ లెల్లా మెచ్చి నీకు విన్నవించేరు ॥చిత్తా॥

**భావామృతం :**

ఓ జియ్యా! (దైవమా!) చిత్తా అవధారు (మా మనవి ఆలకింపుము). పరాకెచ్చరిక (ఏ మాత్రమూ తొట్రుపడక సావధానముగా విన్నపములను వినుము). అదె (అదిగో) రాజరాజులు (రాజులకే రాజులైనవారు), హత్తి కానుకలిచ్చేరు (నిన్ను సమీపించి బహుమతులనిస్తున్నారు) స్వీకరించి అనుగ్రహింపుము తండ్రీ!

ఓ శ్రీరామచంద్రా! రఘుకుల వీరుడవైన రాజీవలోచనా! (పద్మనయనా!), మృదువైన నల్లని శరీరవర్ణముగల నీవు కొలువుదీరియున్నవేళ ఆ దృశ్యం ఎంత కన్నులపండువుగా వున్నది!! అదిగో ఆ మునీంద్రులు, వామదేవుడు మొదలైనవారు నిన్ను ఆశీర్వదిస్తున్నారు. అనంతమైన కపిసేనని తన సుగ్రీవాజ్ఞచే కట్టుదిట్టంచేయగల వానర రాజు సుగ్రీవుడు మొదలైన వానరవీరులు వేమారు నీకు మ్రొక్కేరు. (మళ్ళీ మళ్ళీ నీకు నమస్కరించుచున్నారు).

సీతా సమేతుడవైన ఓ దేవా! లోకనాయకుడవైన నీవు ధీరుడవు. పౌజువేళ (అందరూ బారులుదీరి వున్నవేళ) భావించి అవధరింపుము. (మేము వేరే చెప్పవలసిన అవసరంలేకుండానే.. మా మనోగత భావాలను గ్రహింపుము) నీ బహిఃప్రాణమైన హనుమంతుడు అదిగో, ఈ వైపున వున్నాడు. భల్లూకరాజు జాంబవంతుడు ఆ వైపున నున్నాడు. భరత శత్రుఘ్నులు పూని నిన్ను సేవించుచున్నారు.

మహాఅయోధ్యానగరాధిపతివైన శ్రీరామచంద్రా! తిరుమలాధీశుడవైన శ్రీవేంకటేశ్వరుడవూ నీవే. నీ గజ, అశ్వ రథ సేనలు కోలాహలము చేయుచున్నవి. ఇటువైపు లక్ష్మణస్వామి నిలుచుని వున్నాడు. అటువైపున రాక్షసరాజు విభీషణుడు నీ శరణాగతుడై వినయంగా నిలిచియున్నాడు. 'ఓ ప్రభూ! వీరంతా నీ మహిమలను ప్రస్తుతించుచూ నీకు విన్నపములను చేయుచున్నారు. (ఓ శ్రీరామచంద్రా! తారకరాముడవై, నన్నును తరింపజేయుము తండ్రీ!).

## మున్నుడి 5-10

కరుణారసాత్మకమైన అన్నమాచార్యులవారి కీర్తన నాస్వాదించండి. మనకు పుట్టిన పిల్లలలో ఎవడో ఒకడు పిచ్చివాడయితే వాణ్ణివదలివేస్తామా, ఇంకా ఎక్కువ జాగ్రత్త వహించి కాపాడుకొంటాము కదా! నీ బిడ్డను, నేను శరణార్థిని, పిచ్చోడిని నన్ను విడవటం న్యాయం కాదంటున్నారు.

**సీ॥ విడువరాదెంతైన వెట్టివాడను నేను**
**కడవార నవ్వక కావుమయ్య**
**జ్ఞానము నెఱుగ నజ్ఞానంబు నెఱుగను**
**మానను విషయాల మఱగినాను**
**నీ నామము నొడిగి నీ దాసుడనుకొంటి**
**దీనికే దయబూని దిద్దుకొమ్ము**
**ఎఱుగ నకర్మము ఎఱుగ సుకర్మము**
**పాట్లు సంసారాన మానవైతి**

**ఆ.వె॥ 'కాన'ముందు, వెనుక 'కాన' విచారించి**
**దేహధారినైతి అహము వీడ**
**మ్రొక్కువాడ నీకు దిక్కు వేంకటనాథ**
**అసలు వీడకనెను అన్నమయ్య.**

**రాగం : విటపి**

విడువరాదెంతైనా వెట్టివాడనైన నీకు
కడువారు నవ్వకుండా కాచుకో నన్నును ॥విడువ॥

జ్ఞానము నేనెఱుగ నజ్ఞానము నేనెఱుగను
మానను విషయములు మరిగి ఎంతైనా
నీనామము నొడిగి నీదాసుడ ననుకొందు
దీనికే వహించుకొని దిద్దుకో నన్నును ॥విడువ





అకర్మము నెఱగను సుకర్మము నెఱగను
ప్రకట సంసారముపై పాటు మానను
వొక పనివాడనై వూనిముద్రధారినైతి
మొకమాడి యిందుకే గోమున నేలు నన్నును ॥విడువ॥

వెనకగానను ముందు విచారించి కానను
నినుపై దేహధారినై నీకు మ్రొక్కేను
ఘనుడ శ్రీవేంకటేశ కన్నులెదుట బడితి
కని పో విడువరాదు కరుణించు నన్నును ॥విడువ॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నేను వెట్టివాడనయ్యా! అలాగని నన్ను వదలివేయుట ఎంతైనా తగని పనియే. నా వెట్టి పనులకి కడువారా (మనసారా) నవ్వుకో. కాని నన్నును (నన్నుకూడా) కాచుకో (రక్షించు). ఎందుకంటే నాకింకో దిక్కులేదు.

నేను జ్ఞానినా అంటేకాదు. అజ్ఞానమంటే యేమిటో కూడ తెలియదు. విషయ వాంఛ (సంగత్వము) లను బాగా మరిగి వాటిని వదలలేకుండా వున్నాను. నీ నామమును ఒడిసి పట్టుకొనినట్టి నీ దాసుడను అనుకొని జీవిస్తాను. దీనికే నన్ను భరించి నా తప్పులనన్నింటిని దిద్దుకో. ఏదోలాగున నన్ను కనికరించు.

ఓ దేవా! అకర్మము అంటే నేనెరగను. సుకర్మము అంటే కూడా తెలియదు నాకు. బహిర్గతమైన ఈ మాయా సంసారంలో పడరాని పాట్లు పడుతూనే వుంటాను కాని ఈ 'యావ' వదిలించుకోలేకుండా వున్నాను. ఒక పనివాడనై (భృత్యుడనై) దీక్ష తీసికొని వైష్ణవ ముద్ర ధరించిన నీ భృత్యుడనయ్యాను. ఇందుకే గోమున (అలవోకగా) నన్నును, మొకమూడి (దయదలచి) ఏలుకో ప్రభూ!

ప్రభూ! వెనుక గానను (నా గత జన్మగురించి నాకు తెలియదు)... ముందు విచారించుకొనను (రాబోవు జన్మలో యేమి కానున్నదో ఎరుగను). నేను నిండుగా దేహమును ధరించిన మానవమాత్రుడను. అట్లే నీకు మ్రొక్కుచున్నాను. ఘనుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీకంటబడ్డాను. నన్నుచూచి, పోవిడువరాదు (పోనియ్యరాదు). నన్నును కరుణించాలి తండ్రీ!

## మున్నుడి 5-11

అత్యద్భుతమైన కీర్తన అన్నమాచార్యులవారు హనుమంతునిపై చెబుతున్నారు ఆలకించండి. నల్లని శరీర ఛాయగల పవనపుత్రునితో ఓ హనుమా! రాముని దీవెనచేత ఈ లోకాలను పరిపాలించవయ్యా! నీవే మాకు రక్ష అంటున్నారు. మంగాంబుధిలో వెలసిన వాయునందనుడు రకరకాలైన దేవతలచేత సర్వ అవయవములకు రక్ష కల్పించుకొనినాడు. అన్నమయ్య హనుమ అంగాంగములకు యెవ్వరెవ్వరు రక్ష కల్పించుచున్నారో వివరించుచున్నారు. “నాలుక కుర్వర రక్ష” అంటే ఏమిటి? చదవండి.. మరి.

**కం॥ మంగాంబుధి హనుమయ్యకు**
**చెంగట శ్రీరామరక్ష శ్రీగిరివరుడే**
**అంగాంగములకు రక్షలు**
**అంగపు సురలెల్ల అన్నమార్యుడు తెలిపెన్.**

**అంగపు = అందమైన**

**రాగం : శంకరాభరణం**

ఏలవయ్యలోకమెల్ల యిట్టె రాముదీవెనచే
నీలవర్ణ హనుమంత నీవె మాకు రక్ష ॥ఏల॥

మొదలనింద్రుడు నీ మోమున కెల్లారక్ష
యిదెనీ శిరసునకు ఇనుడు రక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకలురక్ష
చెదరని నీమేనికెల్ల శ్రీరామరక్ష ॥ఏల॥

పిరుదు వాలమునకు బెడిదపు శక్తి రక్ష
గరుడుడు నీకరయుగముల రక్ష
గరిమ నీ కుక్షికి కరివరదుడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీరామ రక్ష ॥ఏల॥

వడి నీపాదములకు వాయుదేవుడు రక్ష
తొడలకు వరుణుడు తొడగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామ రక్ష ॥ఏల॥





నలువ నీగళరక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీ సందులకు హరుడు రక్ష
పలు నీ రోమములకు బహు దేవతలు రక్ష
చెలగు నీ చేతలకు శ్రీరామ రక్ష ॥ఏల॥

అంగపు నీ తేజమున కగ్నిదేవుడు రక్ష
శృంగారమునకెల్లా శ్రీసతి రక్ష
మంగాంబుధి హనుమంత నీకే కాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష ॥ఏల॥

**భావామృతం :**

నీలవర్ణుడవైన (నల్లని) హనుమంతా! ఈ లోకముల నన్నింటినీ ఏలవయ్యా! శ్రీరాముని దీవెన నీకు ఎప్పుడూ వుంటుంది గావున నీవే మా అందరికీ రక్షకుడవు.

మొట్టమొదటగా ఇంద్రుని ఆశీర్వాదముచేత నీ ముఖమునకంతా రక్షకలుగు గాక! సూర్యునిచేత నీతలకు రక్ష కలుగుగాక! నవగ్రహములు మరియు అసంఖ్యాకమైన నక్షత్రములచేత నీ కన్నులకు రక్ష కలుగుగాక! చలించని నీ శరీరానికెల్లా శ్రీరామరక్ష కలుగుగాక!

పిరుద (వెనుకనున్న) తోకకు బెడిదపు రక్ష కలుగుగాక! గరుత్మంతునివలన నీ కరములకు రక్ష కలుగుగాక! నీ వుదరమునకు గజేంద్రరక్షకుడైన శ్రీహరి రక్ష కలుగుగాక! వైభవోపేతమైన నీమహిమకు శ్రీరాముని రక్ష కలుగుగాక!

ఓ హనుమా! వేగముగల నీ పాదములకు వాయుదేవుని రక్ష కలుగుగాక! నీ తొడకు వరుణదేవుని రక్ష కలుగుగాక! ఎన్నడూ నిన్ను వీడని నీ మేధస్సుకు వేదరాశియొక్క రక్ష కలుగుగాక! చిరంజీవివైన నీ ఆయువుకు శ్రీరామరక్ష కలుగుగాక!

నీ గళమునకు (కంఠమునకు) బ్రహ్మదేవుని రక్ష కలుగుగాక! నీ నాలుకకు ఉర్వర రక్ష (పచ్చగా పండిన నేలయొక్క రక్ష) కలుగుగాక! నీ కళ్ళకు యెముకలకు శివుని రక్ష కలుగుగాక! అసంఖ్యాకమైన నీ వెంట్రుకలకు సమస్త దేవతల రక్ష కలుగుగాక! అతిశయించిన నీ చేతులకు శ్రీరామరక్ష కలుగుగాక!

ఓ మారుతీ! నీ దేహకాంతికి అగ్నిదేవుని రక్ష కలుగు గాక! నీ మనోజ్ఞతకు శ్రీదేవియొక్క రక్ష కలుగుగాక! మంగాంబుధిలో నెలకొనిన ఓ హనుమంతుడా! నీకు ఏకాలమునందైనా, చెంగటనే (సమీపముననే) వున్న శ్రీవేంకటాద్రి నిలయుడైన శ్రీరామరక్ష (వేంకటరాముని యొక్క రక్ష) కలుగుగాక!

**5-12**

## మున్నుడి

సంస్కృతభాషలో చెప్పిన హరినామ సంకీర్తన ఇది. ఇటువంటి మధుర కీర్తనలకు అన్నమాచార్యులవారు పెట్టింది పేరు. దేవదేవుని పొగడు ఈ కీర్తనలో వివరించటానికి ఏమీ వుండనిమాట నిజమే కాని, సంస్కృతం రాని సామాన్యులకు భగవన్నామంలోని అర్థం వివరిస్తే... భక్తి స్థిరపడుతుందని నా నమ్మకం. ఈ జన్మలో భక్తి అంటే యెరుగని వారికి కూడ గతజన్మ పుణ్యవిశేషాన అకారణంగానే ప్రేమ జూపి అనేకమైన ప్రియమైన వాటిని ఇచ్చేవాడట...ఈ ఒక్కమాటకే అంతులేని వివరణ వ్రాయవచ్చును.

**తే॥ కరుణ పెన్నిధియౌ గదాధరుని హరిని**
**శరణునర్థించ బ్రోచు వత్సలు భజింతు**
**అనెను గీర్వాణిలో మన అన్నమయ్య**
**తేనెలూరెడి కీర్తన దేవదేవ!**

**రాగం: కన్నడ గౌళ**

కరుణానిధిం గదాధరం
శరణాగత వత్సలం భజే ॥కరుణా॥

శుకవరదం కౌస్తుభాభరణం
అకారణప్రియ మనేక దం
సకల రక్షకం జయాధికం సే-
వకపాలక మేవం భజే ॥కరుణా॥

వురగ శయనం మహోజ్జ్వలం తం
గరుడా రూఢం కమనీయం
పరమపదేశం పరమం భవ్యం





హరిం దనుజభయదం భజే ॥కరుణా॥

లంకాహరణం లక్ష్మీ రమణం
పంకజ సంభవ భవప్రియం
వేంకటేశం వేదనిలయం శు-
భాంకం లోకమయం భజే ॥కరుణా॥

**భావామృతం:**

కరుణానిధియును, కౌమోదకి అను గదను ధరించినవాడను, తనను శరణు కోరిన వారిని యెట్టి పరిస్థితిలోను పదునాల్గు లోకాలలో యెక్కడ వున్నా వెళ్ళి రక్షించువాడును అయిన శ్రీమన్నారాయణుని భజించెదను.

ఆయన శుకమహర్షికి భాగవతమును బోధించు వరమునను(గహించినాడు. జీవుల భాగ్యఫలముగా అనేకమైన ప్రియముల నొసగువాడు. సర్వులను రక్షించువాడు. అధికముగా విజయముల నొసగువాడు. తనను సేవించు వారిని పరిపాలించు ప్రభువు ఆ శ్రీహరియే. నేను అటువంటి దేవదేవుని మాత్రమే భజించెదను గాక!

శ్రీహరి ఆదిశేషుడను నాగేంద్రుని పాన్పుగా క్షీరసాగరమున పవళించి యుంటాడు. దేదీప్యమైన తేజస్సుతో ప్రజ్వరిల్లుతుంటాడు. ఆయన యెక్కడికి పోవాలన్నా గరుత్మంతునిపై పోతుంటాడు. ఆయన "కమనీయం" (మనోహరము) గా వుంటాడు. ఆయన పరమ్ అపదేశం (మోక్షమునకు స్థానమై యున్నాడు). మోక్షమును అనుగ్రహించునదీ ఆయనయే. అసురులకు భయంకరుడైన ఆ శ్రీహరిని భజించెదను గాక!

శ్రీమన్నారాయణుడు రామావతారమున లంకను హరించినాడు. ఆయన లక్ష్మీపతి. పద్మమున బుట్టిన బ్రహ్మదేవునిచేతను, భవుడైన (శుభంకరుడైన) శంకరుని చేతను కీర్తించబడెడి వాడే శ్రీహరి. శ్రీవేంకటేశ్వరుడైన ఆ మహానుభావుడు వేదనిలయుడు, శుభప్రదమైన అనేక చిహ్నములు కలిగినవాడు, సమస్త లోకములు తనలో నిండిన వాడు. అట్టి తిరుమలాధీశుని భజించెదనుగాక!

## 5-13

## మున్నుడి

అహోబల నరసింహ స్వామి సేవలో అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యులవారు చెప్పిన మధురాతి మధురమైన కీర్తన ఇది. "నిర్మలుడవైన నరసింహా! నీకువేదములే నివాస స్థానములు. సంగీతనాదము అంటే మక్కువగల నీవు సకలలోకేశ్వరుడవు. అట్టి నీకు నమోవాకములు" అంటున్నారు. గోవిందుడైన ఈయన గుణాగుణ రహితుడట. నీ రూపానికి పరిమితి చెప్పలేం కాబట్టి త్రివిక్రమాకృతిలో విజృంభించుచున్నావు అంటున్నారు. తన తండ్రి అన్నమయ్య వలెనే, వేంకటగిరి వాసుడే అహోబల అర్చావతారం అని నమ్మిన వాడీ పెద తిరుమల. సర్వమునీవే... అంటున్నారు.

**కం॥ వేదములే నీవాసము**
**నాదప్రియ! సకల లోకనాథ! నమస్తే**
**ఆదరముగ నరసింహుని**
**పాదుగ పెదతిరుమలయ్య పనివడి కొలిచెన్**

పాదుగ = నిలకడగా

**రాగం : మధ్యమావతి**

వేదములే నీనివాసమట విమలనారసింహ
నాదప్రియా సకలలోకపతి నమో నమో నరసింహా ॥వేద॥

ఘోరపాతక నిరుహరణ కుటిలదైత్యదమన
నారాయణ రమాధి నాయక నగధర నరసింహా
నీరూపము ఇంత అంతయని నిజము తెలియరాదు
ఈరీతి త్రివిక్రమాకృతి నేచితి నరసింహా ॥వేద॥





గోవింద గుణాగుణ రహిత కోటి సూర్యతేజ
శ్రీవల్లభ పురాణ పురుష శిఖనఖ నరసింహా
దేవా మిము బ్రహ్మాదులకును తెలియనలవి కాదు
భావించగ ప్రహ్లాదు నెదుట పరగితి నరసింహా ॥వేద॥

దాసపరికర సులభ తపన చంద్రనేత్ర
వాసవ సురముఖ మునిసేవిత వందిత నరసింహా
భాసురముగ శ్రీవేంకటగిరిని పాయని దైవమ వటుగాన
ఓసరకిపుడు ఏగితి విట్ల అహోబల నరసింహా ॥వేద॥

**భావామృతం :**

నిర్మలుడవైన ఓ అహోబల నరసింహా! నీ నివాస స్థానములు వేదములే. నీవు సంగీతనాదమున ఎక్కువ ప్రీతి కలిగినవాడవు. సకలలోకాలకు భర్తవు. అట్టి నీకు నా నమోవాకములు.

ఓ ప్రభూ! నీవు ఘోరమైన పాపములను రూపుమాపెదవు. నీవు దుర్బుద్ధినున్న రాక్షసాంతకుడవు, నారాయణుడవు, లక్ష్మీపతివి, గోవర్ధనధరుడవు. ఆనాటి నీ త్రివిక్రమ రూపానికి ఆద్యంతములు లేవు. అట్లు విజృంభించితివి (ఏచితివి) కనుక నీ నిజమైన రూపము తెలియనసాధ్యముగా నున్నది.

ఓ దేవా! నీవే గోవిందుడవు. నీవు గుణాగుణరహితుడవు. (గుణము, అగుణము రెండూ నీకు లేవు). నీ తేజస్సు కోటి సూర్యులకు మించినది. నీవు శ్రీదేవికి వల్లభుడవు (భర్తవు). నీవు పురాణపురుషుడవు. (అనాది పురుషుడవు). శిరస్సున కేశపాశము, వ్రేళ్ళకు వాడిగల గోళ్ళున్నవాడవు. స్వామీ! మీరేమిటో బ్రహ్మాది దేవతలకే అంతుపట్టదు. నీ భక్తుడైన ప్రహ్లాదుడొక్కడే నిన్ను భావించగలిగాడు. ఎందుకంటే నీవు వానికి ప్రసన్నుడవై వాని ఎదుట నిలిచితివి కదా! అట్టి నరసింహా! నీకు వందనములు.

ఓ దాసపరికర సులభ! (దాసుల సమూహములకు సులభంగా లభించువాడవు అయిన దేవా!) నీవు తపన చంద్ర నేత్రుడవు (సూర్యచంద్రులు నేత్రములుగా గలవాడవు). ఇంద్రాది సురప్రముఖులు, మునీశ్వరులు అర్చించి సేవించెడివాడవు. వెలుగొందుతూ ఎన్నడూ శ్రీవేంకటాద్రిని వదలని దైవానివి. అందుచేత నీవే వోసరక (తొలగిపోకుండా), ఇప్పుడు ఏగితివిట్ల (ఇట్లు ఊరేగుచున్నావు).

**5-14**

## మున్నుడి

చక్కటి తత్త్వ బోధన చేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఒక ధనికుని ఆశ్రయించి బ్రతికితే తిండికి, బట్టకు లోటు వుండకపోవచ్చును, కాని ఆ కొలువు క్షణభంగురమే. వానికి కోపం వచ్చినా... ఈ బంటు పని సరిగా లేకపోయినా ఆ బంటు జీవితం హుళక్కియే. శ్రీకాంతుని సేవకుల కొలిస్తే, కీటకం తుమ్మెదగా మారినట్లు వాడే కులంవాడైనా అధికుడే అవుతాడు. ఒకరాజుగారి ఆజ్ఞ వాని కొలువులో వాళ్ళే పాటిస్తారు. ఏదేశం నాణాలు ఆదేశంలోనే చెల్లుతాయి. కానీ శ్రీపతి ముద్రలు ధరిస్తే వారికి చెల్లకపోవటమంటూ వుంటుందా?

**చం॥ పరులను గొల్చి జీవితము బంగరు పంటగ చేయుకంటె ఆ**
**సిరివరుదాసులై బ్రతికి చేకొనుటంతములేని భాగ్యముల్**
**వరమగు జన్మధన్యమగు ప్రాప్తిలు మోక్షము అన్నమయ్యనెన్**
**ధర వొరులెవ్వరైన ఇటు ధర్మము నేర్పిరె వేంకటేశ్వరా!!**

**రాగం : బేగడ**

పరుల సేవలు చేసి బ్రతికేరటా
సిరివరు దాసులు సిరులందు టరుదా ॥పరుల॥

కోరివొక నరుని గొలిచిన వారలు
ధీరులై సలిగెల దిరిగేరట
కూరిమి బ్రహ్మండ కోటులేలెడివాని-
వారలింతట జనవరులౌ టరుదా ॥పరుల॥

చేకొన్న తుమ్మిద చేపడ్డ కీటము-
లాకడు తుమ్మిదలయ్యీనటు
శ్రీకాంతుని పాదసేవకులగు వార-
లేకులజులయినా నెక్కుడౌ టరుదా ॥పరుల॥





ధరణీశునాజ్ఞల తమదేశములందు
సిరుల నాణెపు ముద్ర చెల్లినట
తిరువేంకటాద్రి శ్రీదేవుని ముద్రలు
ధరియింపగా నింతట చెల్లుటరుదా ॥పరుల॥

### భావామృతం

అయ్యో!! ఏమిటీ విపరీతం? ఈ మానవులు ఇతరులను సేవించి బ్రతుకుతున్నారుట. శ్రీపతి దాసులైన వారికి 'సిరి' కొరత వుండదట.

కోరికలు దీరుటకు పరులను గొలిచెడివారు ధైర్యంగా ఆశ్రయిస్తూ తిరుగగలుగుతున్నారు. అటువంటప్పుడు కోట్లాది బ్రహ్మాండములను యేలెడి వానియొక్క జనులు, సర్వశ్రేష్ఠులవటం అరుదా? ఎన్నటికీ కాదు. వారు ఎప్పుడూ సర్వశ్రేష్టులే.

శ్రీహరి దాసులయితే ఇంకొక మంచి జరుగుతుంది. కీటకములు తుమ్మెదల ననుకరించి, పూలచుట్టూ భ్రమించి... భ్రమించి చివరికి భ్రమరములు, అనగా తుమ్మెదలయిపోతాయి. అదేవిధంగా శ్రీకాంతుని పాదసేవకులతో, జీవితం గడిపేవారు ఏ కులమున జన్మించిన వారలైనా, సర్వాధికులు కాకపోవటం అంటూ వుంటుందా? యెన్నటికీ వుండదు.

అంతెందుకు, ఇది అందరికీ తెలిసిన విషయమే కదా! ఒకరాజుగారి ఆజ్ఞలు వానిదేశంలో పాటించబడతాయి. ఏ దేశంలో ముద్రించబడిన నాణెములు ఆ దేశంలో మాత్రమే చెలామణి అవుతాయి. కాని తిరువేంకటాధీశుడైన శ్రీవేంకటేశ్వరుని ముద్రలు ధరించినవారికి ఇంతటా... (ఈ సృష్టిలో) చెల్లుబడికాకపోవటం అంటూ వుంటుందా? ఒక్కనాటికీ వుండదు.

**5-15**

## మున్నుడి

ఓ తిరుమల నాయకా! నీవీ అలమేల్మంగను యెంత మన్నించావయ్యా! ఇప్పుడామె నీపై అంతకంతకు మించిన ప్రేమపారవశ్యంలో మునిగిపోతున్నది... అంటున్నారు. అన్నమాచార్యులవారు. తనని రంజింపచేసి అలసిన జవరాలికి జగన్నాధుడు సైతం సేదతీర్చి 'సేవలు' చేసి పరవశింపచేశాడట. ఆ పరవశానందమే బ్రహ్మజ్ఞానులు తహతహలాడే బ్రహ్మానందం. స్వామిచేత సేవలు చేయించుకొన్న జగన్మాత ఆయన వలపు తలచుకొని మరీ మరీ భరించలేని తాపవశురాలవుతున్నదట. అన్నమయ్య 'కత్తి' యే సుమా!

**కం॥ ఎంతగ మన్నించితివీ**
**ఇంతినిదే నీవు తిరుమలేశా! వినుమా**
**ఎంతో ప్రేమల నలరెను**
**అంతకునంతకును మించి అన్నయ్యనెబో**

**రాగం : సుమనేశ రంజని**

ఎంత మన్నించితో యీ యింతినిదే నీవు
అంతకంతకు ప్రేమ నలరీ నిపుడు ॥ఎంత॥

పడతి నాట్య శ్రాంతి బవళించి తొల్లి నీ-
తొడలపై నీవు తలదువ్వగాను
కడలేని యటువంటి కళలుదలచే కదా
విడువని వియోగమున వేగీనిపుడు ॥ఎంత॥

ఒన రగుచ భారమున నొరగి యీమలుగలపై
నెనసి నీ వాకు మడిచియ్యగాను
పడతి నేడటువంటి వలపు దలచేకదా
ఘనమైన తాపమున కాగీనిపుడు ॥ఎంత॥





సిరులు(ల) నీ మోముపై జెక్కులొయ్యన జేర్చి
యరమోడ్చి కనురెప్పలలమి యలమి
తిరువేంకటాచలాధిపుడ నిను గూడియే
పరవశానంద సంపద తేలెనిపుడు ॥ఎంత॥

## భావామృతం

ఓ ప్రభూ! ఈ దేవిని యెంత మన్నించితివయ్యా! నీపై ఆమెకు అంతకంతకు ప్రేమపెరిగిపోతున్నది. ఇప్పుడామె నీ అనురాగం తలచి తలచి తపించి పోవుచున్నది. నీ ప్రేమలో తలమునకలవుతున్నది.

తొల్లితానుచేసిన నాట్యమువలన ఆమె అలిసిపోయి విశ్రాంతికోసం నీ తొడపై బవ్వళించినది. నీవు కరుణతో ఆమె తల ప్రేమగా దువ్వినావు. అటువంటి అనంతమైన నీ శృంగార కళలను తలచిన కొలది ఇప్పుడామె విరహాగ్నిలో వేగిపోవుచున్నది.

స్వామీ! స్వకుచ భారంబున ఈమె 'అలుగలపై నెగసిన' (నలిగిపోతుంటే) శ్రమదీరుటకు తమలపాకు మడిచి స్వయంగా ఆమె నోటికందించినావు. అటువంటి నీ వలపును తలచి తలచి నేడామె గొప్పతాపమున కాగిపోవుచున్నది. ఇప్పుడామె బాధ వర్ణనాతీతము.

సిరులొలుకు నీ ముఖముపై తన చెక్కిళ్ళను ఒయ్యన (మెల్లగ) ఆనించి, అరమోడ్చిన కనురెప్పలను అలమి అలమి (అదిమి అదిమి) ఆ తల్లి పరవశించినది. తిరుమలాధీశుడవైన శ్రీవేంకటేశ్వరా! నీ కలయిక కలిగించిన పరవశానంద కందళిత హృదయారవిందయై ఆమె బ్రహ్మానందమును పొందిన ఇందిరయైనది. ఎంత మన్నించితివయ్యా!

**5-16**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని రథోత్సవాన్ని కన్నులపండువగా వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తనకి ప్రతిపదార్థం చెప్పగల పాండిత్యము నాకులేదు. పైగా కొండొకచో అచ్చు పొరబాట్లు కూడా వుండివుండవచ్చు. ఏది ఏమయినా, ఇందిర ఇందీవరశ్యాముల రథం వెంట పోవటం కంటే వైభవం మరొకటుంటుందా? సందడిచేయు దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. దిక్కుల్ని సాధించిన దేవదేవునే దిక్కని మ్రొక్కండి. స్వామి రథంవెంట నడిచి తరించండి. ఎందుకంటే... ఇది మామూలు రథం కాదు. ఎట్లాంటిదో-చదవండి.

**ఆ.వె॥ ఇట్టివరములిత్తు రిందిరయును హరి**
**అన్నమయ్యపాడె నద్భుతముగ**
**సందడించెదిశలు సాధించెనని బల్కె**
**హరి రథంబు బారె అరయుడనెను**

**రాగం : దేశాళం**

ఇందిరయు దానుగూడి యిట్టివరాలొసగుతా
సందడించి దిక్కులెల్లా సాధించీ నిదివో ॥ఇందిరయు॥

వేదములే గుఱ్ఱములు విష్ణుని రథమునకు
వాదపు శాస్త్రములే తీవుపు పగ్గాలు
పాదగు పంచభూతాలే పరగు బండికండ్లు
ఆడిగొని మనోవీధులందు నేగీ నిదివో ॥ఇందిరయు॥

జీవులెల్లా సారధులు శ్రీ విభుని తేరునకు
కావించు నెజ్జిలు పడిగల గుంపులు
భావించ దన ప్రకృతి పట్టపు సింహాసనము
వేవేలు సంపదలతో వెలసీ నే డిదివో ॥ఇందిరయు॥





చందురుడు రవియును సరుస బైడి కుండలు
చెందిన పుణ్యములెల్ల సింగారాలు
అందపు శ్రీవేంకటేశు డలమేలు మంగ దాను
కందువల మెరయుచు కరుణించీ నిదివో ॥ఇందిరయు॥

### భావామృతం

ఓ ప్రజలారా! శ్రీవేంకటేశ్వరుని దివ్యరథము తిరువీధులలో యేగుచున్నది. ఆ రథములో ఇందిరాదేవితో వూరేగుచున్న శ్రీకాంతుడు తాను ఆమెతోగూడి ఇట్టి వరముల నిస్తున్నాడు. జనం గుంపులు గుంపులుగా ఆ వరాలకోసం యెగబడుతున్నారు. దిక్కులన్నీ సందడిగా వున్నాయి. ఆ దేవదేవుడు దిక్కులన్నీ సాధించినవాడు కావున దిక్కులు నిండేట్లు జనం వచ్చారు ఇదిగో...

ఈ విష్ణుమూర్తి రథానికి నాలుగు వేదములు నాలుగు గుఱ్ఱముల రూపములో నున్నవి. తర్కము మొదలై ఆరు శాస్త్రములే ఈ రథమును గుంజుటకుపయోగించిన త్రాళ్ళు. పంచభూతములని పిలువబడే భూమి, ఆకాశము, నీరు, తేజస్సు, గాలి - ఈ రథములో బండికండ్లు (నిలువుగా, అడ్డముగా వేసిన దూలములు. నడిపించుకొని పోవుచున్న ఈ రథము భక్తుల మనోవీధులగుండా ప్రయాణించుచున్నది. అదిగో తరించండి.

ఈ శ్రీరమణుని రథములో సమస్త జీవకోటీ సారథులే. ఆ జీవులు చేయు యజ్ఞ యాగములు రథములో అంచెలవలె కట్టిన మెట్లు. ప్రకృతియే ఈ దేవదేవుని రథమున అమర్చబడిన సింహాసనము. అనంతమైన సంపదలతో నేడు ఈ స్వామి రథముపై ఇదే వెలసియున్నాడు. చూచి తరించండి.

ఈ రథములోని బంగారు కుండలు (బిందెలు) స్వయంగా ఆ సూర్యచంద్రులే అనిపిస్తున్నది. ఈ రథములోని అలంకరణలన్నీ జీవులు చేసికొన్న సమస్త పుణ్యములు. అందమైన శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగ జంట, కందువల మెరయుచు (సామర్థ్యముతో ప్రకాశించుచూ) ఇదిగో... మనలనందరినీ కరుణిస్తున్నారు. మీరూ ఈ రథోత్సవంలో పాల్గొని తరించండి.

**5-17**

## మున్నుడి

పాలసంద్రమున పవ్వళించిన శేషతల్పశాయిని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. క్షీరసాగర శయనుడవై బాయని (మమ్మల్ని విడువని), నీల మేఘశ్యాముడవైన శ్రీమన్నారాయణుడవు, యిపుడు (ఈవేళ) మా యెదుట వున్నది నీవా? (నీవేనా?) అంటున్నారు. అరవిరి మోమున నల్లన నవ్వేడి నిరతమూర్తి నీవేనా అంటున్నారు. అంటే.. సగము విరిసిన మొగ్గవంటి ముఖమున లేత నవ్వులు ప్రదర్శించుచూ మిక్కిలి ఆసక్తి కలిగించు మూర్తి, అని అర్థం. తెలుగు తేలిక అన్న తెలివి తక్కువ తెల్లముఖం ఎవడో తెలుసుకోవాలనుంది నాకు...

**ఉ॥ పాలసముద్ర మందెపుడు పాన్పుగ శేషుని జేసికొన్న ఆ**
**నీలిమవర్ణుడౌ హరియు నీవట, దివ్యమునీంద్రవందితా!**
**భూలలనామణిన్ సిరిని పొందుగ కూడిన వేంకటేశ్వరా!**
**మేలుగ అన్నమయ్య తను మించిన ప్రజ్ఞతొ జెప్పెకీర్తనన్**

**రాగం : షణ్ముఖప్రియ**

పాలజలనిధిలో బాయని
నీలివర్ణుడవట నీవా యిపుడు ॥పాల॥

వెదచల్లు మణుల వేయి పడగలను
చెదరని మెరుగుల శేషునిపై
మృదువు బరపుగా మెల్లనె పొరలుచు
నిదుర వోదువట నీవా యిపుడు ॥పాల॥

పరమ మునీంద్రులు పద్మభవాదులు
ఇరువంకల నుతియించగను
అరవిరి మోమున నల్లన నవ్వేడి
నిరత (తి) మూర్తివట నీవా యిపుడు ॥పాల॥





పగటున సిరియును పరగిన ధరణియు
బిగియుచు నడుగులు పిసుకగను
తగు వేంకటగిరి దనరుచు జెలగెడి
నిగమమూర్తివట నీవా యిపుడు ॥పాల॥

**భావామృతం :**

విడువక పాలసముద్రమున నున్న నీలమేఘశ్యాముడవైన శ్రీమన్నారాయణుడవు నీవేనా ప్రభూ! ఇప్పుడు (నిన్ను కీర్తించెదను).

నీవు ఆదిశేషునిపై పవ్వళించినపుడు, వేయి పడగలు గల ఆ శేషుని పడగలపైనున్న దివ్యమణులు చెదిరిపోని కాంతులను వెదజల్ల సాగినవి. మెత్తని పరపువలెనున్న ఆదిశేషునిపై మెల్లగా పొర్లుచు నిదురకుపక్రమించు వాడవు నీవేనా ప్రభూ! ఇప్పుడు (నిన్ను సన్నుతించెదను).

పరమయోగీశ్వరులు, మునీంద్రులు, బ్రహ్మాది దేవతలు నీవు నిదుర మేలుకొనునప్పుడు నీకు అటూ, ఇటూ నిలుచుని నిన్ను కీర్తించుచుందురు. సగము విరిసిన మొగ్గవంటి ముఖమున లేత నవ్వులు ప్రదర్శించుచూ నిరతమూర్తివి (మిక్కిలి ఆసక్తి కలిగించుమూర్తి) వైన దేవదేవుడవు నీవేనా? ఇప్పుడు (నిన్ను ధ్యానించెదము).

ప్రభూ! పగటున (లావణ్యముతో) సిరియును (లక్ష్మీదేవియును) మరియు పరగిన (ప్రసిద్ధిజెందిన) ధరణియు (భూదేవియు)ను, బిగువుచు (గట్టిగ) నడుపులు పిసుకగ (నీ పాదములను ఒత్తుచుండగా) తగినట్టి వేంకటాద్రిపై శోభించుచున్న ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వేదములు సన్నుతించెడి వేదపురుషుడవు. ఇప్పుడు కరుణతో నాబోటి దీనులను కాపాడుచున్న మహానుభావుడవు నీవేనా? ధన్యులము తండ్రీ!

**5-18**

## మున్నుడి

అన్నమాచార్యులవారీ కీర్తనలో హరికర్పించనిదేదియైనా వ్యర్థమేనంటున్నారు. నేటి మన తెలుగు భాషలో ఆనాటి 'నుడికారం' లేదనిపిస్తున్నది. "అంతరంగమెల్ల శ్రీహరికి అర్పించకుంటే"... అని నేడు మనం అంటున్నాం. ఆనాడు అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటే... అనేవారు. "భావించి తాదేవుడైతే ప్రత్యక్షమౌనా".. అంటే "దేవుడైతే ప్రత్యక్షం కాదా?" అని అర్థం చెప్పుకోకూడదు. శ్రీవేంకటేశ్వరుడే దేవుడని భావించి శరణంటే ప్రత్యక్షమవుతాడు కదా!... అని అర్థం.

**చం॥ అనిశము అంతరంగమును అర్పణజేయుచు మెప్పుపొందుచున్**
**మనమున నిల్వగా హరిని మాన్యతగల్గును, లేక వీడునా**
**మనుజుని వింతయౌ విధుల బంధములన్నియు 'పిప్పి' జేయురా**
**విను, ఫలముండబోదనెను విజ్ఞత దెల్పుచు అన్నమార్యుడున్**

**రాగం : హుసేని**

అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటే
వింత వింత విధముల వీడునా బంధములు ॥అంత॥

మనుజుడై ఫలమేది మరి జ్ఞాని యౌదాక
తనువెత్తి ఫలమేది దయగలుగుదాక
ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాక
పనిమాలి ముదిసితే పాసెనా భవము ॥అంత॥

చదివియు ఫలమేది శాంతము కలుగుదాక
పెదవెత్తి ఫలమేమి ప్రియమాడు దాక
మది గల్గి ఫలమేది మాధవుదలచుదాక
యెదుట తాను రాజైతే ఏలెనా పరము ॥అంత॥





పావనుడై ఫలమేది భక్తి కలిగిన దాక
జీవించి ఫలమేది చింత దీరుదాక
వేవేల ఫలమేది వేంకటేశుగన్నదాక
భావించి తా దేవుడైతే ప్రత్యక్షమౌనా ॥అంత॥

**భావామృతం :**

మన అంతరంగమును (మనస్సును మరియు హృదయమును) శ్రీహరికి ఒప్పించకుంటే... (అర్పించకుంటే), వింత వింత విధముల (అనేకరకములైన వింత పద్ధతులలో పీడించు) బంధములు వీడునా? (అనుబంధాలు వదిలిపెడతాయా?)

జ్ఞానము కలిగేదాక మనిషిగా యెంతకాలం బ్రతికినా లాభమేముంది? దయకలిగి బ్రతుకకుంటే... తనువెత్తి (శరీరం పొంది) లాభమేమిటి? దానధర్మాలు చేయనివాడు యెంత ధనవంతుడైతే వుపయోగమేమి? "పనిమాలి ముదిసితే పాసెనా భవము" (వ్యర్థంగా వయసొచ్చినంతమాత్రాన సంసారపు యావ నశిస్తుందా?) ఏనాటికీ నశించదు.

శాంతగుణము కలిగి ప్రశాంత చిత్తుడు కానివాడు ఎంత చదివిన వాడైనా వ్యర్థుడే కదా! మధురంగా మాట్లాడలేనివాడు పెదవి విప్పకుండా వుంటే నయంకదా! మాధవుని మనస్సులో ప్రతిష్ఠించుకోలేని వానికి మనస్సు వుండి మాత్రం ప్రయోజనమేమిటి? "యెదుట తాను రాజైతే యేలెనా పరము?" (జీవిత కాలంలో ఒకదేశానికి రాజైనంతమాత్రాన పరము (మోక్షమును) సాధించగలడా?) ఎన్నటికీ సాధించలేడు.

భక్తిలేనివాడు ఎంత పవిత్రంగా వుండీ ప్రయోజనముంటుందా? అనుక్షణం ప్రతిదానికీ చింతిస్తూ జీవించేవాడి దుఃఖం కాలిబూడిదయినాపోదు (చితిలోకి పోయినా చింతపోదు). శ్రీవేంకటేశ్వరుని చూసేదాకా దేనివలనా ప్రయోజనంలేదు. దానికి ఒక్కటే బహుతేలికి మార్గమున్నది... స్వామిని భావనలో నిలిపి "అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ"... అని భావించితే ప్రత్యక్షం కాకుండా వుంటాడా? ఎన్నటికీ వుండడు.

## 5-19

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తనకొక ప్రత్యేకత వున్నది. ఇది ఏడుకొండలవానిని సన్నుతించే కీర్తన కాదు. బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా జరుపుటకు వచ్చిన బ్రహ్మాదిదేవతలను పేరు పేరునా పిలిచి శ్రీవేంకటేశ్వరుడు ఈ ఉత్సవాలలో మీరంతా బాగా అలసిపోయారు. నాకు చాలా ఆనందం కలిగించారు. ఇక మీరంతా వెళ్ళి వచ్చే యేడాది ఉత్సవాలకు ఉత్సాహంగా రండి. ఎక్కువ దూరం పోకండి. ఇట్టే తిరిగి మళ్ళీ వేంకటాద్రికి రండి. దిక్పాలులారా! నారదాది మునులారా! బ్రాహ్మణోత్తములారా! దేశ పరిపాలకులారా! నన్ను సేవించుకోవటానికి వచ్చే ఏడాది తిరిగిరండి... అంటున్నాడు శ్రీనివాసుడు... భలే.

**ఆ.వె॥ పోయిరండు మీరు భోగీంద్ర వరులార!**
**మరలిరండు మీరు 'మరుసటేడు'**
**పేరు పేరు జెప్పి పిలిచెను అన్నయ్య**
**సురుల, మునుల, వసుధసురులనెల్ల.**

**రాగం : ఆనందభైరవి**

భోగీంద్రులను మీరు పోయిరండు
వేగన మీదటి విభవాలకు ॥భోగీంద్ర॥

హరుడ పోయిరా అజుడ నీవును పోయి
తిరిగిరా మీదటి తిరుణాళ్ళకు
సురులు మునులును భూసురలు పోయిరండు
అరవి(ము)రి నిన్నాళ్ళు బడతిరి ॥భోగీంద్రు॥

జముడ పోయిరా శశియు నీవును పోయి
సుముఖుడవై రా సురులగూడి
గుములై దిక్పతులు దిక్కులకు పోయిరండు
ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి ॥భోగీంద్రు॥





నారద సనక సనందనాదులు
భూరి విభవముల పోయి రందు
దూరముగా పోకిట్టై తొరలి వేంకటగిరి
చేరి నన్నిట్లనే సేవించుడీ ॥భోగీంద్రు॥

## భావామృతం

భోగములనుభవించుటకు అలవడిన ఓ మహామహులారా! మీరంతా పోయి, మీదటి విభవాలకు (వచ్చే ఏడాది జరుగబోయే బ్రహ్మోత్సవాలకు) వేగాన తిరిగిరండి (మీకోసం ఎదురు చూస్తుంటాను).

ఓ శంకరా! కైలాసం నుండి శ్రమతీసికొని వచ్చావు. ఓ పరమేష్టీ! (బ్రహ్మ!) నీవు బ్రహ్మోత్సవాలను జటిపి యెంతో శ్రమపడ్డావు. మీరు వచ్చే తిరునాళ్ళకు తప్పక రావాలి. దేవతలారా! మునులారా! బ్రాహ్మణోత్తములారా! ఇన్నాళ్ళూ, అరమురి (కలతపడి) అలసిపోయారు. కనుక ఇప్పటికి పోయిరండి. (ఇక్కడ 'అరవిరి' అని వున్నది. బహుశా అది 'అరమురి' అయి వుంటుంది. 'అరవిరి' అంటే సగం వికసించిన మొగ్గ అని అర్థం).

ఓ యమధర్మరాజా! తమది క్షణం తీరికలేని బాధ్యత. ఓ చంద్రుడా! నీవి అంతులేని బాధ్యతలు. మళ్ళీ దేవతలందరితో కలసి సుముఖులై (నవ్వులొలికే మొగములతో) రండి. గములై (పయనించువారై) దిక్పాలకులారా! మీ మీ దిక్కులకు మీరుపోయి రండి. ఇన్నాళ్ళూ ప్రమదాన (సంతోషముతో) వున్నారు. అయినా ఎంతో అలిసిపోయారు. మీరంతా పోయి మరలిరండు.

ఓ నారదమహర్షీ! సనక సనందనాది మునివరులారా! గొప్ప ఉత్సవాలకు మళ్ళీ వచ్చేయేడాది తప్పక తిరిగిరండి. ఎంతోదూరం పోతే మీకు తిరిగి రావటానికి శ్రమ అవుతుంది, కనుక యెక్కువ దూరం పోకండి. తొరలి (మళ్ళీ) వేంకటగిరి చేరి నన్ను ఇట్లాగే సేవించండి. జన్మ సార్థకం చేసికోండి.

## ముున్నుడి 5-20

అద్భుతమైన శరణాగతి కీర్తన అన్నమాచార్యులవారు వినిపిస్తున్నారు. నేను జీవుణ్ణి నీవు దేవుడవు. నేను హీనుణ్ణి నీవు సర్వాధికుడవు. నాకేమీ చేతకాదు నీవు పరిపూర్ణుడవు. నేను నీ దాసుణ్ణి కాబట్టి నా తప్పులు నీవు క్షమించకపోతే ఎవరు క్షమిస్తారు? నీవు 'ఈశు' లేని శ్రీవేంకటేశుడివి, అందుకని నన్ను కరుణించక నీకు తప్పదు.

**సీ॥ పరిపూర్ణుడవు నీవు పాపిహీనుడ నేను**
**అధికుడవీవయ్య! అధముడేను**
**దండము బెడుదునే తప్పుకాయుము ప్రభూ!**
**అండగోరుదునేను అండ నీవు**
**శరణు కోరుట నాది కరుణజూపుట నీది**
**విరుల జల్లుట నాది వరము నీది**
**దాసుడనుట నాది చూసి యేలుట నీది**
**ఆసలు తీర్చేటి అయ్య వీవు**

**ఆ.వె॥ సేవజేతు నీకు శ్రీవేంకటేశ్వరా!**
**గైకొనుమిదె నన్ను కావుమయ్య!**
**ఏమి సేయగలను ఇంతకంటే నేను**
**హరిని గొలిచి వేడె అన్నమయ్య**

**రాగం : గుండక్రియ**

నేనేమి జేయగలేను - నీవు పరిపూర్ణుడవు
హీనుడ నే నధికుడ వ- న్నిటా నీవు ॥నేనేమి॥

దండము వెట్టుట నాది- తప్పు లో గొనుట నీది
నిండి నీ వెప్పుడు దయా-నిధివి గాన
అండఁజేరుకొంట నాది - అందుకు నూ కొంట నీది
దండియైన దేవదేవో-త్తముడవు గాన ॥నేనేమి॥





శరణుచొచ్చుట నాది - సరుగ గాచుట నీది
పరమపురుష శ్రీ -పతివి నీవు
విరులు చల్లుట నాది - వేవే లిచ్చుట నీది
పొరి నీవు భక్తసుల - భుడ వటుగాన ॥నేనేమి॥

దాసుడ ననుట నాది - తప్పక యేలుట నీది
ఆసదీర్చే వరదుడ-వటుగాన
నీ సేవ యొక్కటి నాది - నిచ్చలు గైకొంటనీది
యీసులేని శ్రీవేంక-టేశుడవు గాన ॥నేనేమి॥

**భావామృతం**

ఓ దేవదోత్తమా! నేను 'బక్కప్రాణిని'. నీవు పరిపూర్ణతగల మహానుభావుడవు. నేను హీనుడను. నీవు అన్నిటిలోను అధికుడవు. నేను నిన్ను శరణు వేడుటకంటె ఏమిచేయగలను? నాకేం చేతనవుతుంది ప్రభూ!

నీకు దండము పెట్టి వేడుకోవటం నాపని, నాతప్పులను లోగొని (మనస్సులో పెట్టుకొని) క్షమించటం నీపని. నీవు నిండైన దయాసాగరుడవు కదా! నీ అండలో చేరుకొని నిశ్చింతగా వుండటం నావంతు. అందుకు ఊకొని (సమ్మతించి) యుండుట నీవంతు. ఎందుకంటే నీవు దేవదేవుళ్ళందరిలోన సర్వోన్నతుడవు. నీవుగాక నాకు దిక్కు యెక్కడుంది?

ఓ ప్రభూ! నిన్ను శరణు వేడుట నాపని. నన్ను సరిగ్గా రక్షించుట నీపని. ఎందుకంటే నీవు శ్రీపతివి. లక్ష్మీదేవి నీవు వూకొట్టనిదే మమ్ము కరుణిస్తుందా?నీవు పరమపురుషుడవు శరణాగతవత్సలుడవు. నీకు పూలతో పూజించుట నాపని. నాకోరికలు తీర్చుట నీపని. ఎందుకంటే... నీవు భక్తసులభుడవు. నేను నీ భక్తుణ్ణి సరిపోయింది కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దాసుణ్ణి తండ్రీ! అని వేడుకొనుట నా కర్తవ్యం. వీడు నా దాసుడు కదా! అని నన్ను పాలించుట నీ కర్తవ్యం ఎందుకంటే మా ఆశలను దీర్చి వరములిచ్చే దైవం నీవే కదా! నీ సేవ ఒక్కటే నాకు తెలిసింది. నిచ్చలు (నిత్యమూ) నన్ను స్వీకరించుట నీ బాధ్యత అయిపోయింది. ఎందుకంటే నీవు 'ఈశు' (ఈర్ష్య) లేని వేంకటేశుడివి కదా!

**5-21**

## మున్నుడి

అలమేలుమంగపతి కొలువుదీరియున్నాడు. అదిగో అని వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. పదివేల విధములైన (అనేకమైన), పారుపత్తెములు జేయుచున్నాడట. అంటే అధికారములను చెలాయించుచున్నాడని అర్థం. శృంగారంగా (సొంపుగా) దేవతలంతా సేవిస్తున్నారట. వెన్నెలపూలదండలు వేశారట స్వామికి. "దండిమీరగ నిపుదు –దైవరాయదు" అని వుంటే 'ప్రాస' సరిపోతుంది. శృంగారమైనట్టి వేంకటేశ్వరుడట. ఈ ఒక్క చరణానికే యెంతైనా వివరణ ఇవ్వవచ్చును. స్వామి అనంతుడుకదా! చూడండి. ఆయన కొలువుయెలా వుంటుందో...

**మ॥ అదిగో ఆయలమేలు మంగపతి తానందంబుగా గొల్వునన్**
**పదివేలౌవిధముల్ చెలంగ విడిదై పాలించెరా లోకముల్**
**ఇదిగో చెప్పెను అన్నమయ్య కవితన్ ఈ సొంపు వీక్షించుడీ**
**ముదితల్ ఇద్దరు కూడి శ్రీరమణునిన్ మోహంబులన్ ముంచగా.**

**రాగం : దేశాక్షి**

అదిగో కొలువై యున్నాడవీ – అలమేలు మంగపతి
పదివేల విధములను పారుపత్తెము జేయుచు ॥అదిగో॥

రంగమండపములో – రత్న సింహాసనముపై
అంగనామణులతో – అమరవేంచేసి
బంగారు పావడలు – పసరించి యిరుగడల
శృంగారముగ సురలు – సేవశాయగను ॥అదిగో॥

వెండిబైడి గుదియలను – వేత్రహస్తలు పొగడ
నిందు వెన్నెల పూల – దండలమర
హుండిగను కానుకల – నొసర లక్కలు జేయ
దండి మీరగ నిపుదు – దే(ద్రై)వరాయడు చెలగి ॥అదిగో॥





అంగరంగ వైభవముల – రంగుగా చేకొనుచు
మంగళహారతుల–మహిమ వెలసి
శృంగారమైనట్టి మా వేంకటాధిపు
దంగనలు కొలువుగా ని(న)పుడు వేంచేసి ॥అదిగో॥

**భావామృతం :**

ఓ భక్తులారా! అదిగో కొలువుదీరివున్న శ్రీపతిని, అలమేలుమంగమ్మ మనోహరుని దర్శించండి. ఆయన లోకపాలకుడు. సామ, దాన, బేధ, దండోపాయములతో 'పారుపత్తెము' (అధికారము) చెలాయిస్తున్నాడు.

స్వామి యెలావున్నాడో చూడండి. రంగమండపములో (సభామండపము) రత్నాల సింహాసనము మీద కూర్చున్నాడట. ఇరుప్రక్కలా భార్యామణులైన శ్రీదేవి, భూదేవి వున్నారట. అట్లా వేంచేస్తున్నాడట. ఆ వనితామణులు బంగారు వస్త్రములను ధరించి శోభిస్తున్నారట. వారిని సమస్తదేవతలు శృంగారముగా (సొంపుగా) సేవిస్తున్నారట.

ఆయన కావలి వారు అంతమంది ప్రజలను అదుపు చేయవలెనంటే బెత్తం ఝళిపించక తప్పదు కదా! వారు వెండి మరియు బంగారు గుదియలను (నాలుగు మూరలు పొడవున్న దండమును) ధరించి వారిని అదుపులో వుంచుతున్నారట. స్వామికి ఆయన ఇద్దరు సతులకు వెన్నెల పూలదండలు వేశారట. "హుండిగను కానుకల నొసర లక్కలు జేయ" (హుండీలో వచ్చిన కానుకలను అధికారులు లెక్కలు వేసి, సరిజూసుకొంటున్నారట. ఆ విధముగా దైవరాయడు (దేవాదిదేవుడు) దండిమీరగ (గొప్పతనంతో) ఇప్పుడు కొలువుదీరియున్నాడు.

అటువంటి వేంకటేశ్వరునికి, ఆయన పట్టపురాణులకు మంగళహారతుల నిస్తున్నారు. రంగుగా (శోభస్కరంగా) అంగరంగవైభవములతో మా వేంకటరమణుడు ఇప్పుడు ఆ అంగనలతో (భామలతో) కొలువుదీరి విచ్చేయుచున్నాడు. అనంతమైన మహిమలు కల ఆ శృంగార పురుషుని చూచి తరించండి. ఇంతకంటే అదృష్టం దొరుకుతుందా?

## మున్నడి 5-22

అహోబలనృశింహుని భీకరాకారాన్ని వర్ణిస్తూ కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. నృసింహుడు అరికుల దమనుడట. (రాక్షసాంతకుడు). ''మహామహిమలను మలసీవాడె'' అంటున్నారు. గొప్ప మహిమలతో తిరుగాడుతున్నాడట. ఆయన మీసాలు అదిరి పడుతున్నాయట. "అతిసిత నఖములు" అంటే మిక్కిలి తెల్లటి గోళ్ళు. ఆయన తన మెడలో వేసికొనిన నగలు సందడి చేస్తున్నాయట అంటే చప్పుడు చేస్తున్నాయట. ఇటువంటి వర్ణన 'నభూతో నభవిష్యతి' అంటే మీకేమన్నా సందేహమా? తిరుమలలో వున్నాయనే... ఈయన అంటున్నారు.

**ఆ.వె.॥ తానహోబలమున దమనుడై అరికులం**
**బణచి మహిమ జూపె నతడు మలసి**
**కాచె దీనజనుల, కనుల గట్టినయట్లు**
**అతని సొబగు జెప్పె నన్నమయ్య.**

**మలసి = తిరుగాడు**

**రాగం : బిలహరి**

అహోబలేశ్వరు దరికుల దమనుడు
మహామహిమలను మలసీ వాడె ॥అహోబల॥

కదలు కన్నులును కరాళ వదనము
గుడి గొను భయదపు కోరలును
అదరు మీసములు నలరగ నవ్వుచు
వుదుటుతోడ గొలువున్నాడు వాడె ॥అహోబల॥

అతిసిత నఖములు ననంత భుజములు
వితత పరాక్రమ వేషమును
అతుల దీర్ఘ జిహ్వాయు గడుమెరయగ
మితిలేని కరుణ మెరసీ వాడే ॥అహోబల॥





సందడి సొమ్ములు శంఖచక్రములు
పొందుగ దివిజులు పొగడగను
యిందిరను దొండపై నిడి శ్రీవేంకట-
మందు నిందు గడు నలరీ వాడే ॥అహోబల॥

**భావామృతం :**

ఈ అహోబలమున వెలసిన నృసింహుడు అరికుల దమనుడు (శత్రువులైన రాక్షసులను అణచువాడు). గొప్ప మహిమలతో వాడే, మలసీ (తిరుగాడుచున్నాడు). ఆ మహానుభావుడెలావున్నాడో చూడండి.

ఆయన కన్నులు అతి వేగముగా అటునిటు కదలుచున్నవి. కరాళ వదనము-ఆయన ముఖము భయమును కలిగించుచున్నది. ఆయన కోరలను చూస్తుంటే భయం గుడిగొంటున్నది. (క్రమ్ముకొని వస్తోంది). ఆయన నవ్వుతుంటే, ఆయన మీసములు అదిరి పడుతున్నాయి. అట్టి ఆ స్వామి, ఉదటుతో (గర్వముతో) కొలువై వున్నాడు. ఆయనను సేవించండి.

ఆ నరసింహునికి అతిసిత నఖములు (మిక్కిలి తెల్లగా వున్నగోళ్లు), అనంత భుజములు... (ఆయనకు లెక్కలేనన్ని చేతులు). ఆయన వేషము చూస్తుంటే వితత పరాక్రమంగా వున్నది, (ఆయన పరాక్రమము అతిశయించియున్నది). ఎంతో పొడవైన ఆయన జిహ్వ (నాలుక) కడు మెరయగా, ఇతడు అంతులేని కరుణామూర్తియే మనం భయపడవలసిన పనియే లేదు అనిపించుచున్నది. వెంటనే ఈయన శరణుపొందండి.

ఇక ఈ దేవదేవుడు తన శరీరంపై ధరించిన సొమ్ములు (ఆభరణములు) తీవ్రమైన కదలికల వల్ల సందడి (చప్పుడు) చేయుచున్నవి. శోభలొలుకు శంఖచక్రములన చేబూనిన ఈ స్వామిని దివిజులు (దేవతలు) కీర్తించుచున్నారు. ఆయన ఇందిరను (ఆదిలక్ష్మిని) తన తొడపై కూర్చుండబెట్టుకొని యున్నాడు. ఈ నృసింహుడే శ్రీవేంకటాద్రిపైనున్న శ్రీవేంకటేశ్వరుడు. "అందు నిందు కడు నలరీవాడే..." (అక్కడా ఇక్కడా కూడా ఎంతో గొప్పగా వాడే శోభిల్లుచున్నాడు). మరి ఇంకా ఎందుకు ఆలస్యం ఆయనను ఆశ్రయించండి.

**5-23**

## మున్నుడి

కడపజిల్లా కడప తాలూకాలోని చిన్న దాసరిపల్లె సమీపాన లోయలో వేయినూతులు (బావులు) గల ప్రదేశమునకు 'వోనూతులకోన' అనియు 'వోగునూతులకోన' అనియు పేర్లుగల ప్రదేశమున్నది. అచట నరసింహస్వామి ఆరాధింపబడుచున్నాడు. ఆయన దేవేరి ఆదిలక్ష్మి. ఆ దేవిని వుద్దేశించి అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తన ఇది. ఎదురుగా వున్నప్పుడే నీకు ప్రధమకోపము ఎందుకమ్మా? ఆయనేమో పకపక నవ్వుతూనే తన పంతం చూపించుకొంటున్నాడు, అని అమ్మవారి తరపున మాట్లాడి సలహాలిస్తున్నారు అన్నమాచార్యులవారు.

**కం॥ "మొకమెదుటనె ముంగోపము**
**ఇకనేలనె ఆదిలక్ష్మి!" హితవు తెలుపుచున్**
**పకపక నగవు నృసింహుని**
**నిక గూడుము అన్నమయ్య ఇందిరకనియెన్**

**రాగం : రామక్రియ**

మొకమొక మెదుటనె ముంగోప మికనేల
పక పక నగుతానె పంత మిచ్చె నాతడు ॥మొకమొక॥

ఆతడె నీ వున్న చోటి కంగనల నంపగాను
యీతల దల వంచేవు యేలమ్మ నీవు
కాతరిం చంతట బోక ఘనుడు దానె వచ్చె
చేతులార నీవె సేవ సేయవమ్మ యిపుడు ॥మొకమొక॥

కదు మోహములె నీకు గప్ప మాతడు వెట్టగ
యెడమాటల దిట్టించే వేలమ్మ నీవు
తడవి మీ రాతని తరుణులు దొబ్బిరట
గొడవలు దీర వేడుకోవమ్మ పతిని ॥మొకమొక॥





ఆయములు సోక నాత దాన లెల్ల బెట్టుకోగా
యీ యెడ నవ్వులు నవ్వే వే మమ్మ నీవు
వోయమ్మ శ్రీవేంకటేశు డోగునూతలలో గూడె
నీ యిచ్చ నాత డున్నాడు నీవు మెచ్చ రాదా ॥మొకమొక॥

**భావామృతం :**

అమ్మా! ఆదిలక్ష్మీ నీవు నృసింహుని దేవేరివి, ఇంకనీకు మొగము మొగము ఎదురుగానున్నప్పుడు ముంగోపము (ముందు + కోపము) ఎందుకమ్మా? ఒకప్రక్క నీవు కోపంతో సతమవుతుంటే, ఆయన పకపక నవ్వుతూనే బెట్టు సరిగా పంతమున నున్నాడు.

అంతటి నృసింహుడు దిగివచ్చి నీదగ్గరకు చెలికత్తెలను సర్దిచెప్పటానికి పంపించగానే నీవు తలవంచి ఆయన చెప్పినవన్నీ అంగీకరిస్తావు. ఎందుకు తల్లీ! ఘనుడైన స్వామి తనంతట తానే లొంగిపోయి నీవద్దకు వచ్చాడు. సంతోషంతో నీ చేతులారా ఆయనకు సేవచేసికొనవమ్మా!

నీ కోపం తగ్గించుటకు స్వామి, నీకు కట్టే కప్పము ఏమిటో చూశావా తల్లీ! కదు మోహములే (నీపై అంతులేని అనురాగమే). అటువంటి స్వామిని, యెడమాటలతో (పెడసరి మాటలతో) తిట్టించేవేలమ్మా? తడవిమీర (ఆలస్యమైనదని), తరుణులు (నీ చెలికత్తెలు) అతని (నృసింహుని) దొబ్బిరట (గెంటివేశారట). ఇది తగదు తల్లీ! నీ పతిని గొడవలన్నీ దీరునట్లు వేడుకొనవమ్మా! ఆయన దయామయుడు నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు.

అంతటి గంభీర రౌద్ర నృసింహమూర్తి జరిగిన ఆలస్యానికి చింతిస్తూ ఇకముందు అలా జరుగదని ఎన్నో 'ఆనలెల్లబెట్టు' (ఒట్లు ఎన్నో పెట్టుకొని) వేడుకొంటుంటే, నీకు నవ్వు ఆగక పకపకమని యీయెడ (ఇప్పుడే) నవ్వుతావు. ఎందుకు తల్లీ? ఓ జగజ్జననీ! తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుడే ఇక్కడ ఈ "వోగునూతల కోన" లో "నీ ఇచ్చనాత డున్నాడు" (నీ ఇష్టప్రకారమే ఆయన నీపై అనురక్తుడైయున్నాడు). ఇందుకు నీవు ఆయన్ను మెచ్చరాదా తల్లీ!

**5-24**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చక్కటి జ్ఞానబోధను చేస్తున్నారు. వినండి. జీవుడనే మంచి మరకాడు (మంచి నావికుడు) వున్నాడట. వాడు మంచివాడే కాని స్త్రీల మానము అనే "కరపట్నాలలో" (ఓడరేవులలో) దిగాడట. అదీ, మంతనాన (రహస్యంగా) జరిపాడట. అంతే... ఇంకేముంది? సంసారసాగరంలో తిరుగులాడాడట. దేహం అనే ఓడమీద ప్రయాణం చేస్తూ, పాపపుణ్యాలనే సరుకులు నింపుకొని, ఒడ్డు చేరాడట. వ్యాపారం కోసం తిరుగుతూనే వున్నాడట. వాడు జీవించివున్నంత కాలం శ్రీవేంకటేశ్వరుని కృప కలిగేదాక ఆ 'యావ' తప్పదు.

**ఉ॥ లేమల మానముల్ యనెడి రేవులలో దిగె చాటు మాటుగా**
**కాముకుడైన 'జీవుడ'ను గద్దరి నావికుడన్నమయ్యనెన్**
**ప్రేమను మాయలో దగిలి వేదనజెందెను భ్రాంతి జిక్కుచున్**
**పామరుడై చరించి, తుది మాధవునెంచుచు పొందె సద్గతిన్**

**లేమలు= స్త్రీలు**

**రాగం : రామక్రియ**

కాంతల మానమనేటి - కరపట్నాలకు దిగె
మంతనాన జీవుడనే - మంచి మరకాడు ॥కాంతల॥

అరిది సంసారమనే - యంబుధిలోన దిరిగి
ఉరుగతి దేహపు- టోడమీద
సరిబాపపుణ్యముల - సరకులు నించుకొని
దరిజేరె జీవుడనే - తల మరకాడు ॥కాంతల॥

కడలేని నిటూర్పు-గాలి విసరగాను
జడియు గోరికలనే- చాపలెత్తి
అడి బరువుగ మాయ- అందు నిండా నించుకొని
యెడతాకె జీవుడనే-యీ మరకాడు ॥కాంతల॥





అలర శ్రీవేంకటేశు-డనియేటి మాలిమి
నలుదిక్కులకు నోడ - నడపగాను
ములిగె ధర్మార్థ కామ - మోక్షధనము గడించి
పలుమారు జీవుడనే - బలు మరకాడ ॥కాంతల॥

## భావామృతం :

ఓ నరులారా! జీవుడనే ఒక 'మరకాడు' (నావికుడు) వున్నాడు. వాడు స్వతహాగా మంచివాడే. కాని కాంతల మానము (స్త్రీలయక్క మానము) అనే "కరపట్నాలలో" (ఓడరేవులలో) మంతనాన (రహస్యంగా) దిగినాడు. (ఇకవాడి తిప్పలు ఏమి చెప్పగలము?)

అరిది (అలవిగాని) సంసారము అనే మహాసాగరంలో దేహము అనే ఓడమీద, ఉరుగతి దిరిగాడు (శ్రేష్ఠమైన విధంగా ప్రయాణించాడు). ఆ ఓడలో పాపపుణ్యాలనే సరియైన సరుకులను నింపుకొన్నాడు. ఆవిధంగా జీవుడు అనే ఆ తల మరకాడు (మంచి నావికుడు) దరిజేరె (ఒడ్డుకు చేరుకొనినాడు).

అంతులేని నిట్టూర్పులనే గాలి విసరసాగింది. జడియు (చలింపజేయు) కోరికలనే తెఱచాప లెత్తబడినవి. ఆ విపరీతమైన గాలి అడి (అధికముగా) బరువైన మాయను దాంట్లో (తెఱచాపలో) నిండా నింపింది. ఆ విధంగా జీవుడనే ఆ నావికుడు, యెడతాకె (తను చేరవలసిన స్థానమును చేరాడు). ఆవిధంగా నౌకా ప్రయాణాలు (సంసార తాపత్రయాలు) జరుగుతూనే వున్నాయి.

అయితే, ఒకనాడు, శ్రీవేంకటేశ్వరుడనేటటువంటి మాలిమి (ఓడనడిపె సరంగు, లేక, వాత్సల్యము కలవాడు) ఆ ఓడను నలుదిక్కులకు నడపగా ధర్మము, అర్థము, కామము అనే రకరకములైన ధనములను (సంపదలను) గడించి మాటిమాటికీ జీవుడనే ఆ నావికుడు అంత్యమున మోక్షము అనే సిరిని గడించి, తరించాడు.

**5-25**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ప్రతిభ కళ్ళకు కట్టినట్లు చూపే దశావతార వర్ణన కీర్తన నొకటి వినండి. పొడుపు కథలవలె గూఢార్థముతో కొనసాగే ప్రశ్నల ప్రహేళిక. ఎవ్వడో తెలియదు కానీ వాడు చాలా చాలా దూరంగా వున్నా నిరంతరం మన తలపులలోనే (ఆలోచనల్లోనే వుంటాడట). ఎవరబ్బా? 'వడిగిందుపడు' సేవకుడుగాడు, అంటే... చటుక్కున అధముడివలె అణిగి మణిగి వుంటాడు, కాని యెవ్వరికీ సేవకుడు కాడట. యెవ్వరో మరి? "తగు గాపు బనులు నెంతయు దెల్లతనము" - అంటే? మాబోటి వారికి 'పొడుపే' అర్థంకాదు. 'విడుపు' గురించి చెప్పేదేముంది?

**చం॥ కనుడిది ఎవ్వడో యెరుకకాదుర దవ్వున వుండికూడ తాన్**
**అనువుగ నిండియుండు మన అందరి దొడ్డ తలంపులందునన్**
**వినుమని అన్నమయ్య ఇక విష్ణుని ఆ యవతార లీలలన్**
**గొనకొని చెప్పగా మురిసి గోప్యము "విప్పగ" జూతు శ్రీహరీ!**

**రాగం : రామక్రియ**

ఎవ్వడో గాని యెరుక రాదు కదు
దవ్వులనే వుండు తలపులో నుండు ॥ఎవ్వడో॥

ఎడయవు తన రెక్కలెగసి పోలేడు
కదుదాగుగాని దొంగయు గాడు
వడిగిందు పడును సేవకుడును గాడు
వెడగు గోళ్ళు వెంచు విటుడును కాడు ॥ఎవ్వడో॥

మిగులా బొట్టివాడు మింటికిని బొడవు
జగడాలు తపసి వేషములును
మగువకై పోరాడు మరి విరక్తుడును
తగు గాపు బనులు నెంతయు దెల్లతనము ॥ఎవ్వడో॥





తరుణుల వలపించు తగిలి పైకొనదు
తురగముదోలు రౌతును గాడు
తిరువేంకటాద్రిపై దిరుగు నెప్పుడును
పరమమూర్తియై పరగు నీ ఘనుడు ॥ఎవ్వడో॥

**భావామృతం :**

ఎవ్వరో తెలియదు కానీ, కదు దవ్వులనే (చాలదూరంగానే) వున్నా... తలపులలోనే వుండును (మన మనస్సులోనే వుంటాడు).

"ఎడయవు తన రెక్కలెగసిపోలేడు"... (ఎడబాయని రెక్కలున్నా పాపం ఎగిరిపోలేడు... ఎవ్వరు? చేప... అంటే మత్స్యావతారం). "కదుదాగు గాని దొంగయు కాడు"... (ఎప్పుడూ ముడుచుకొని దాగికొని వుంటాడు. అంత మాత్రాన దొంగ అనుకోకండి... ఎవ్వరు? తాబేలు... అంటే కూర్మావతారం). "వడి గిందుపడును సేవకుడుకాడు"...(చటుక్కున అధముడివలె అణిగిమణిగి వుంటాడు కానీ సేవకుడు కాడు... మరియెవరు? ఇంకెవరు వరాహము). "వెడగు గోళ్లను పెంచు విటుడు కాడు" (వికారంగా గోళ్లను పెంచుకొని వుంటాడు కాని విటుడు మాత్రం కాదు...యెవ్వరో? నరసింహుడు)

"మిగుల బొట్టివాడు మింటికిని బొడవు"... అంటే (ఎంతో పొట్టివాడు కానీ ఆకాశాన్ని మించిపోయాడు... యెవ్వరు? వామనుడు). "జగడాలు తపసి వేషములు" (వేషమేమో బ్రాహ్మణునిది, చేసేదేమో పోట్లాట... యెవరు? ఇంకెవరు పరశురాముడు). "మగువకై పోరాడు మరి విరక్తుడును".. అంటే (భార్యకోసం యుద్ధం చేశాడు. కాని జీవితమంతా భార్యలేకుండా విరక్తితోటే బ్రతికాడు యెవరబ్బా? మన శ్రీరామచంద్రుడే). "తగుగాపు బనులు నెంతయు దెల్లతనము"... అంటే (తనకు తగిన విధంగానే) సువులను కాసిన ('తెల్లని' గొడ్ల కాపరి) యెవరు? బలరాముడు. తెల్లనివాడు అంటే అమాయకుడని కూడా...)

"తరుణుల వలపించు తగిలిపై కొనదు"... (స్త్రీలను మోహింప చేయగలడు కాని కాంతలపై వ్యామోహము లేనివాడు... యెవ్వరు? బుద్ధ భగవానుడు). గుఱ్ఱమును తోలును కాని రౌతుకాడు... (యెవరై వుంటారు? ఇంకెవరు కల్కి భగవానుడు). ఈ ఘనుడు పరమునొసగు పరమమూర్తియై, ఎప్పుడూ తిరువేంకటాచలముపై తిరుగుతుంటాడు... యెవరయ్యా ఆయన? ఏమో... ఆంగ్లభాషలో No money for guessing అంటారు. మీరు తలబద్దలు కొట్టుకొని చెప్పినా... పైసా కూడా ఇవ్వనని తెలుగులో అర్థం.

**5-26**

## మున్నుడి

భయానక రస ప్రధానంగా సాగిపోయే అన్నమాచార్యులవారి కీర్తన వినండి. “బాపు దైవమా! మా పాలి భవమా! తీపురాకాసి నెత్తురు దీం దోం దోం దోందోం దోం అని” మొదలుపెట్టారు కీర్తన. “బాబోయ్! దేవుడా! మాకున్న సత్తా (బలమా)! తీపురాకాసి (యాతనలు పెట్టే రాక్షసుల) నెత్తురు దీందోందోందోం (అని చిందించి వేయుచున్నావు) అని పల్లవికి అర్థం చెప్పుకోవచ్చును. అదీ దాదాపుగా శివమునెత్తిన అన్నమయ్య భక్తి పారవశ్యంలో, శ్రీవేంకటేశుడే కాలనేమి, మహోదరుడు, మురాసురుడు, హిరణ్యకశిపుడు వంటి రాక్షసుల నెత్తురు త్రాగిన అరి భయంకరుడని అంటున్నారు.

**తే॥ బాపు! మా పాలిదైవమా! తీపు దనుజు**
**దోగు నెత్తుట దీందోము దోం అనుచు**
**శివమునెత్తెను అన్నయ్య శ్రీనివాస!**
**భక్తి పారవశ్యంబదే “మమ్మ! మమ్మ!”**

**రాగం : మాళవి**

బాపు దైవమా మాపాలి భవమా
తీపు రాకాసి నెత్తురు దీం దోందోం దోందోం దోందోం ॥బాపు॥

కాలనేమి పునుకిది కంచువలె లెస్సవాగీ
తాళమొత్తరే తత్త తత తత్తత్త
కాలమెల్ల మా భూతగణమెల్ల వీడె కాచె
నేలబడి నేడును ధీంధీం ధీం ధీం ధీం ధీం ధీం ॥బాపు॥

పనిగొని మానక పచ్చి నెత్తురెప్పుడును
తెగి కొనుదానె తిత్తి తిత్తి తిత్తితి
తగు మహోదరు వీపు దణదణమని వాగీ
బిగియించరే తోలు భింభిం భింభిం భింభింభిం ॥బాపు॥





మురదనుజుని పెద్ద మొదలి యెముక దీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు
తిరువేంకట గిరిదేవుడు గెలిచిన స-
మరమునను మమ్మ మమ్మ మమ్మ మమ్మమ ॥బాపు॥

**భావామృతం :**

బాపు! దైవమా! మాపాలి భవమా!

(బాబోయ్! దేవుడోయ్! మాకున్న బలమా!) తీపురాకాసి నెత్తురు (యాతన పెట్టే రాక్షసుల నెత్తుటిలో) దీందోందోం దోందోం దోందోం అని పొర్లాడుము.

ఇదిగో నీ చేతిలో వున్నది కాలనేమి అనే రాక్షసుని ‘పుర్రె’. అది కంచు మ్రోగినట్లు ఎంతలెస్సగా (బాగుగా) శబ్దం చేస్తున్నదో చూడు. ఆ కరాళనృత్యానికి తగ్గట్లు తాళం వేయండి, తత్త తత తత్తత తత్తతా. సర్వకాలయందు మా భూతగణములకు రక్షించు దిక్కు వీడే ( శ్రీనివాసుడు). నేడును నేలమీద సాష్టాంగపడి వేడుకోండి. ధీంధీంధీం ధీంధీంధీం అని ధీరత్వంతో కాపాడి ఆదుకొంటాడు.

ఆనాడు హిరణ్యకశిపుని పచ్చినెత్తురు మానక (వదిలి పెట్టకుండా) పనిగొని (పనివేళా) తానె తెగికొను (ఆయనే తెగించి త్రాగివేశాడు). అప్పుడు ఎంత వింత శబ్దాలు వచ్చాయో... తిత్తి తిత్తి తిత్తితి. అడ్డమొచ్చిన మహోదరుడు వంటి రాక్షసుల వీపులన్నీ దణదణమని డోళ్లలాగా మ్రోగాయి. ఆ‘డోళ్లు’ సరిగ్గా మ్రోగటం లేదులా వుంది. వాటి తోలు బిగువుగా బిగించండి. ఇప్పుడు కొట్టిచూడండి. ఆ అదీ భిం భిం భిం భిం భిం భిం అని సరైన ధ్వని వస్తున్నది.

ముర అనేపేరుగల రాక్షసుని ఈ శ్రీహరి చంపిన సంగతి తెలుసుకదా! వాడి మొదలి యెముక (కాలి ఎముక) చాలా పెద్దది. అదిగో అక్కడ పడివున్న ఆ ఎముక తీసికొని తురులూదరే (అతిశయించి వూదండి). తుత్తు తుత్తు తుత్తు తూ. ఈ మాయదారి రాక్షసులందరినీ గెలిచిన వాడు వేరెవరో కాదు. మన తిరువేంకటేశ్వరుడే. ఆ సమరములన్నిటిలో గెలిచినది ఆ స్వామియే. మమ్మ! మమ్మ! మమ్మ! (వరేవా!... వరేవా!... వరేవా! అనే ప్రశంస)

## మున్నుడి 5-27

భజన వలె సాగే అన్నమాచార్యుల వారి కీర్తన ఇది. ముత్యపు చిప్పలో మూయబడిన ముత్యమువంటి వాడు ముకుందుడు. కేశవుడు ''తొట్టి'' కరిరాజవరదుడు. బహుశా అది 'తొట్ట' అయివుంటుంది. 'తొట్ట' అంటే దుండగీడు అని అర్థం. నేను "పదస్థుడ" నన్నారు. అంటే ఏ నిఘంటువులోను అర్థం దొరకలేదు. జన్మలనెత్తుతు దిక్కు తెలియక తిరిగే వాడిని... అని నేను భావించాను.

**సీ॥ కేశవ! గోవింద! కృష్ణ! నారాయణ!**
**మూసిన ముత్తెమా! మ్రొక్కెదమిక**
**నెమ్మి చక్రాయుధా! నీవు గలవు గాన**
**పమ్మి మాకికపైన భయమదేల?**
**పుట్టించువాడవు భూరమణుడవీవు**
**యెంచ 'పదస్థుడ' యేను దేవ!**
**గొల్లల గురుడవు గోవిందరాజువు**
**నిరతము గొలుతుము నిన్ను మేము**

**ఆ.వె॥ పరము నిహము మాకు బలువుగా కలిగెను**
**స్థిరము వరము నీవె శ్రీనివాస!**
**అన్నమయ్య కీర్తనత్యద్భుతము ప్రభూ!**
**భజనవోలె పాడె పరమపురుష!**

**రాగం : మోహన**

కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూసిన ముత్తెము వలె మ్రొక్కేము నీకు ॥కేశవ॥

నెమ్మి చక్రాయుధుడవు నీవు గలవటు గాన
పమ్మి మాకు నెన్నడును భయమేలేదు
యిమ్మల లక్ష్మీపతివి యేలికవైతివి గాన
సమ్మతి మాకు సర్వసంపదలు గలవు ॥కేశవ॥





పుట్టించిన వాడవు భూధవుడ వటుగాన
దట్టముగ నెంచగ పదస్థుడ నేను
తొట్టి(ట్ట) కరిరాజ వరదుడ నీవే దిక్కుగాన
గట్టిగా నా కోరిక లిక్కడ ఫలియించెను ॥కేశవ॥

గురువవు గొల్లలకు గోవిందరాజువు గాన
నిరంతరము పాడి నిండెను మాకు
చిరంతన దేవుడవు శ్రీవేంకటేశ్వర నీవు
పరము నిహము మాకు బలువుగా కలిగె ॥కేశవ॥

**భావామృతం :**

ఓ కేశవా! నారాయణా! శ్రీకృష్ణా! గోవిందా! ముకుందా! నీవు మూసిన ముత్తెము వంటివాడవు. నిన్ను భావించ గలిగిన వారికే నీవు వున్నావు. హిరణ్యకశిపునివలె లేవు అనే వారికి లేవు. ఇది ముత్యపు చిప్ప అనుకునే వాడికి 'చిప్పే' మిగులుతుంది. నీకు మ్రొక్కెదము ప్రభూ!

నెమ్మి (క్షేమము నొసగు) చక్రము ఆయుధముగా గలవాడనే నీవు. కావున మాకు ఇక ఎన్నటికీ 'పమ్మి భయం' (అతిశయించన భయము) యెందుకు? లేనేలేదు. ఇమ్ముల (విరివియైన) లక్ష్మీపతివి నీవు మా ఏలికవై యుండగా మాకు సమ్మతి సర్వసంపదలు (న్యాయబద్ధమైన అన్ని వైభవములు వున్నాయి. మాకు బెంగ యెందుకు?

ప్రభూ! నీవు భూరమణుడవు. కన (చూడబోతే) మాకు పుట్టుక నిచ్చిన వాడవూ నీవే. దట్టముగా నెంచగ (బాగుగా ఆలోచిస్తే...) నేనేమో 'పదస్థుడను' (పథికుడను) నాకు దారి చూపించే దిక్కునీవే. నీవేమో 'తొట్టకరిరాజ' వరదుడవు. (దుండగీడు వలె పొగరుబట్టిన గజేంద్రుని కూడా నీవే తప్ప నితఃపరంబెరుగ, దీనుడ... అని వేడుకుంటే, సిరికిన్ జెప్పక వెళ్లి రక్షించావు). అటువంటి నిన్ను శరణన్నాను కాబట్టి... ఇక్కడ నా కోరికలు గట్టిగా ఫలిస్తాయి. నాకు దిగులెందుకు?

స్వామీ! నీవు శ్రీకృష్ణునిగా గొల్లవారందరికీ గురుడవైతివి. కావున నీవు గోవిందరాజువే. మరి మాకేల చింత? మాకు నిరంతరము పాడి సమృద్ధిగా వుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దేవుడవు. నీవు చిరంతనుడవు (పురాతనమైన వాడవు). మాకు జీవనకాలంలో ఇహమును, మరణించాక పరమును కూడ నీవే. నీవు మాకు బలువుగా కలిగితివి. (పెద్ద దిక్కువలె వుంటివి).

## 5-28

## ముున్నుడి

చక్కటి సంస్కృత కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది శ్రీరామచంద్రమూర్తిని సన్నుతిస్తూ చెప్పిన కీర్తన. కొన్నిచోట్ల ప్రతిపదార్థంగా వివరించాను. ఒకప్రక్క శ్రీరాముడిని కీర్తిస్తూనే వేంకటేశ్వరుని లీల అయిన భృగుమహర్షి ప్రసక్తి తీసికొని రావటం రుక్మిణీదేవిని వీక్షించేవాడని అనటం ఆయనే చిరంతనుడనటం ఒక్క ఆచార్యులవారికే చెల్లింది. భక్తి పారవశ్యంలో సర్వము తిరుమలేశుడే ఆయనకు.

**ఆ.వె॥ సిరులనిచ్చువాడు స్థిరము అయినవాడు**
**కౌశిక సవనంబు గాచువాడు**
**తిరుమలేశుడైన దేవుడే అతడనె**
**అన్నమయ్య యెంచి అమరవాణి**

**రాగం : ముఖారి**

శ్రీ శోఽయం సుస్థిరోఽయం
కౌశిక మఖ రక్షకోఽయం ॥శీశోఽయం॥

నిగమనిధి నిర్మలోఽయం
జగన్మోహన సతీపతి(తిః)
విగత భయోఽయం విజయ సఖోఽయం
భృగు మునినా సంప్రీతోఽయం ॥శ్రీశోఽయం॥

సకల పతి శ్శాశ్వతోఽయం
శుకముఖ మునిజన సులభోఽయం
ప్రకట బహుళ శోభనాధికోఽయం
వికచ రుక్మిణీ వీక్షణోఽయం





సరసోఽయం పరిసరప్రియోఽయం
తిరువేంకటాధి పోఽయం
చిరంతనోఽయం చిదాత్మకోఽయం
శరణాగతవత్సలోఽయం ॥శ్రీశోఽయం॥

**భావామృతం :**

అయం (ఇతడు) శ్రీ (ఐశ్వర్యము) స(మంగళము) ఇచ్చువాడు. అయం (ఇతడు) సుస్థిరత్వము నిచ్చువాడు. ఇతడు విశ్వామిత్రుని యాగ సంరక్షణ చేసినవాడు.

"నిగమనిధి నిర్మలోఽయం" (వేద నిధులైన ఉపనిషత్తులలో వివరింపబడిన నిర్మలమూర్తి ఇతడే). జగన్మోహినియైన సీతాదేవి భార్యగా గలిగిన భర్త ఇతడే. సర్వులకు భయమును నివారించిన అభయ ప్రదాత ఇతడే. ఈ శ్రీరామచంద్రుడే, శ్రీహరివలె భృగు మహర్షిచేత సంతోషపెట్టబడినవాడై యున్నాడు. (భృగు మహర్షి తనను తన్ని అవమానించినా, దానివలన తను భూమిపై శ్రీవేంకటేశ్వరుడై అవతరిస్తే లోక కళ్యాణం జరుగుతుందిలే అని ఆనందపడ్డాడట స్వామి).

ఇతడు జగత్పతియైన శాశ్వతుడు. శుకమహర్షివంటి భాగవతోత్తములైన మునులకు సులభంగా సాధింపదగినవాడు. అనేక రకములైన మంగళములను అధికముగా అనుగ్రహించు వాడు ఈతడు. "వికచరుక్మిణీ వీక్షణోఽయం" (చెదరిన ముంగురులు గల రుక్మిణీ దేవి చేత బాగుగా తిలకించబడిన వాడు ఈతడు).

"సరసోఽయం" (ఇతడు బ్రహ్మ పదార్థము అయినవాడు). తనచుట్టూ వున్న అందరికీ ఇష్టుడైన వాడు ఈతడు. తిరువేంకటగిరికి అధిపతియైన శ్రీవేంకటేశ్వరుడును ఇతడే. ఈయనే చిరంతనుడు (శాశ్వతుడు). చిదాత్మ స్వరూపుడు కూడ ఈతడే. శరణన్నవారికి దిక్కువలె వాత్సల్యముతో అనుగ్రహించు 'అండ' ఈతడు అనిగ్రహించి శరణు వేడండి.

## 5-29

## మున్నుడి

వైరాగ్యంతో లంపటాలవంటి 'పొందు'లను నిరసిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఛీఛీ అన్నీ నాటకాలేనని పేరుపేరునా, భ్రమలో, యవ్వన మదములో హెచ్చిన గర్వంతో చేసిన పనులను, కలిగిన భావాలను ఛీకొడుతున్నారు. "బచ్చుర పణములోని బచ్చెన చీచీ" అంటే ఏ నిఘంటువులోనూ తిన్నని అర్థము దొరకలేదు. 'బచ్చు' అంటే, కోమటి వ్యాపారి 'పణము' అంటే ధనము. కాబట్టి 'బచ్చెన' అంటే నేటికాలంలోని 'వడ్డీ' అని భావించాను. చిట్టచివరిగా 'వీడెగా మీ బారము' అనే మాటలో 'మీ' బదులు 'మా' వుంటే బాగుండేది అని భావిస్తున్నాను.

**తరలము॥ నయము గానివి పొందులన్నియు నాటకంబని కొట్టె 'ఛీ'**
**లయము తప్పని జన్మలన్నియు లంపటంబని కొట్టె 'ఛీ'**
**వయసు పోయిన వంతహెచ్చును వాంఛపోదని కొట్టె 'ఛీ'**
**జయము నిచ్చెడి శ్రీహరే గతి చాటి 'అన్నయ' చెప్పెరా.**

**రాగం : పాడి**

ఏటికి నెవ్వరి పొందు యిస్సిరో చీచీ
నాటకములాల చీచీ నమ్మితిగా మిమ్మును ॥ఏటికి॥

జవ్వన మదమ చీచీ చక్కదనమరో చీచీ
రవ్వైన రాజస గర్వమరో చీచీ
కొవ్విన మదమ చీచీ కూరిమి యాసరో చీచీ
నవ్వుల దేహమ చీచీ నమ్మితిగా మిమ్మును చీచీ ॥ఏటికి॥

ముచ్చట మమత చీచీ ముచ్చుమురిపెమ చీచీ
బచ్చుర పణములోని బచ్చన చీచీ
తెచ్చుకోలు తాలిముల దిట్టతనమరో చీచీ
పుచ్చిన పోకరో చీచీ పోయగా మీ కాలము ॥ఏటికి॥





సిరుల చీకటి చీచీ సిలుగు సంపద చీచీ
వర విభవమ చీచీ వాసిరో చీచీ
కరుణించె దిరువేంకటగిరిపతి నన్ను
విరసవర్తన చీచీ వీడెగా మీ భారము ॥ఏటికి॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఎవ్వరి పొందు (స్నేహం) అయినా (చివరికి బాధించేదే). అది ఏటికి (ఎందుకు?) ఛీఛీ శుద్ధ దండుగ. నాటకములవంటి మిమ్మల్ని అందరినీ, ఇంతకాలము నమ్మి చెడ్డాను. ఛీఛీ

ఓ యవ్వనమదమా! నీవే శాశ్వతం అనుకొన్నానే ఛీఛీ. ఓ నా అందమా! నిన్ను చూసి గర్వించానే ఛీఛీ. ఓ రాజసగర్వమా! (రాచఠీవి వలన వచ్చిన అహంకారమా) నీ కఠినత్వం తగనిది. ఛీఛీ కొవ్విన మదమా! ఛీఛీ నీవలన యెంత చెడిపోయాను!! ప్రేమవలన కలిగిన ఆశలారా! ఛీఛీ! నవ్వుల దేహమా! (సుఖము నిచ్చే శరీరమా!) ఛీఛీ నీదీ ఒకసుఖమేనా? మిమ్మల్నందరినీ ఇంతకాలం యెంత నమ్మాను!! ఛీఛీ ఎంత మోసపోయాను!!

ఓ ముచ్చట మమతా! (కోరికలను పెంచే మమకారమా!) ఛీఛీ! యెంత బాధించారు!! ఓ ముచ్చు మురిపెమా! (దొంగవంటి సంతోషమా!) ఛీఛీ నిన్ను నమ్మవచ్చునా? కోమటి వ్యాపారి వద్ద తెచ్చిన ధనమునకు కట్టవలసిన పైకమా (వడ్డీ)! ఛీఛీ సర్వనాశనం చేస్తావు కదటే? "తెచ్చుకోలుతాలిముల" (తెచ్చిపెట్టుకొన్న ధైర్యం వల కలిగే) దిట్ట తనమరో (దర్పమా!) ఛీ ఛీ! నీ వలన నాకు నష్టమే కానీ లాభం లేదు. మీరు పుచ్చిన పోకచెక్కవంటివారు. ఛీఛీ! వ్యర్థులు.

సిరిసంపదవల్ల కళ్ళు బైర్లుకమ్మి చీకట్లు కమ్ముకొంటాయి. ఛీఛీ! యెంత అహంభావం వస్తుంది!! దానివలన 'సిలుగు' (ఉపద్రవం) తప్పదు. ఛీ ఛీ ఆ సంపదయెందుకు? ఓ వైభవమా! ఓ కీర్తీ! ఇప్పటికి శ్రీవేంకటేశ్వరుని దయకలిగి ఆ స్వామి నన్ను కరుణించాడు. వీడెగా మీబారము (ఇక మీ భారం వదలిపోయింది). ఓ విరసవర్తనమా! (ద్వేషము ప్రదర్శించే నా బలహీనతా!) ఛీఛీ! దూరంగా పో.....

## 5-30

### మున్నుడి

సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆనాడు జనబాహుళ్యానికి ఈ కీర్తన అర్థం అయిందో లేదో నాకు తెలియదు కాని, నేడు నా బోటి సామాన్యునికి ఈ కీర్తన వివరంగా అర్ధమవుతుందంటే నాకు నమ్మకం లేదు. పండితుల విషయం నేను ప్రస్తావించటం లేదు. శృంగారాన్ని బూతు అనుకొనే రోజుల్లో జీవిస్తున్నాం కాబట్టి, ఈ కీర్తన యొక్క భావామృతం సాధ్యమైనంత గోప్యంగా వివరించాను. పుట్టేటప్పుడు బట్టలేదు, గిట్టినప్పుడు బట్టరాదు. బట్టపరుల కోసమే కదా! అందుకనే, శృంగారం కనపడీకనపడనట్లు కనబడితేనే జనరంజకంగా వుంటుంది.

**చ॥ జడియుచు యవ్వనంపు ధృతి జవ్వని పువ్వుల పాన్పు మీద తాన్**
**తడబడి నిద్రలేమి పరితాపము జెందెను వింతచేష్టలన్**
**ముడిపడి వేంకటాద్రిపతి ముంగిట నిల్వగ వేడ్క కూడెరా**
**విడువక అన్నమయ్య చెవివిందుగ చెప్పెను మేటికీర్తనన్.**

**రాగం : సారమతి**

జవ్వనంపు మదమున జడిసేటి తరుణి
పువ్వుల పానుపు మీద పొరలీ చూడరే ॥జవ్వనం॥

ముత్తేల కంకణాల మురిసేటి కరము
చిత్తగించు చెలినేడు చెక్కు మీదను
కొత్తనెత్తావి విరుల కొమరైన తురుము
వత్తుల నెరులతోడ వదలీ చూడరే ॥జవ్వనం॥

పయెద్య వెలి మించు పగటైన గుబ్బలు
ముయ్యరాని పెనుతాపమున కాగీని
వొయ్యారపు రచనలతో వొరపైన చూపులు
వొయ్యనె కన్నుల నీట వులికీ చూడరే ॥జవ్వనం॥





కప్పురపు తావితోడ కరగేటి తనువు
వొప్పైన కస్తూరిచేత నొరపైనది
యిప్పుడిట్టె తిరువేంకటేశు కూడియాయింతి
చెప్పరాని వేడుకల చెలగీచూడరే ॥జవ్వనం॥

**భావామృతం :**

ఓ చెలులారా! ఈ యువతి జవ్వనంపు మదమున (యౌవనగర్వంతో) జడిసేటి స్త్రీ (చలించిపోవుచున్న భామిని). ఈమె తన పూలపాన్పుపై నిద్రలేమిచే, పొరలీచూడరే (పొర్లుతున్నదో చూడండమ్మా!)

ఈమె చేతులు ముత్యాల కంకణాలతో మురిసిపోతూ (గర్వంతో) వున్నాయి. ఆ చేతులను తన చెక్కిళ్ళపై ఆనించి, ఆమె తనకొప్పులో నూతనంగా గుబాళించు పుష్పములను ధరించియున్నది. ఆ కొప్పులోని కొన్నికురులు వత్తుగా వుండటం వల్ల వదలీ (వీడి పోయినవి). ఓ భామినులారా! చూడండి ఈమె ఎంత మనోహరంగా వున్నదో.

పయ్యెదనుంచి వెలవడయత్నించు గబ్బిగుబ్బలు ఈమె విపరీతమైన ప్రణయతాపమున మఱగుచున్నదని స్ఫురింపజేయుచున్నవి. ఈమె ఒయ్యారము రూపంగా నిర్మితమైనట్లున్నది. తిన్నగా చూచుచున్న ఈమె చూపులు నిశితమై కన్నుల నీరు చిమ్ముచున్నవి. అందుచే ఈమె భీతహరిణేక్షణయైనది. ఓ చెలులారా! ఈమె ఎంత మనోహరంగా వున్నదో చూడరే!

ఓ భామినులారా! ఈమె శరీరం కర్పూర ధూళి వలన చక్కటి తావితోడ (పరిమళతో) కరిగిపోవుచున్నది. మంచి కస్తూరి చేత ఈమె గుబాళించుచున్నది. అవన్నీ అట్లావుండగా, ఇప్పుడు ఈ ఇంతి జగన్నాధుడైన శ్రీవేంకటేశ్వరుని ఇట్టే కూడుట చేత చెప్పలేని సంతోషంతో మురిసిపోతోంది. చూడండర్రా! ఆమె అదృష్టం.

## 5-31

## మున్నుడి

అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు చెప్పిన అద్భుతమైన కీర్తన నాస్వాదించండి. మతము, వ్రతము, కర్మకాండ ఇవన్నీ దేనికి? భగవంతుని ఒక పద్ధతితో ఆరాధించటానికే గదా! వీటన్నిటికీ ప్రాణం వలె ఆధారమైనదేమిటి? హరి భక్తి, హరి శరణాగతి, హరిదాస్యం. హరినామ సంకీర్తనం. అవిలేనివాడు ఈ శాస్త్రాలూ, వేదాలు, పురాణాలూ అన్నీ నిరుపయోగమేనంటున్నారు. అలాగే నేనూ నా జీవితంలో నేర్చిన సత్యం కూడా ఇదే. ఈ నాటి 'యువకులు' కలలుకనే 'చదువులు' ఆనాగే చదివాను. కాని అవన్నీ 'శుద్ధదండగ' అని 'ఎడమచేతితో' అన్నం తినవలసి వచ్చిన రోజున గ్రహించాను.

**కం॥ నాకు మతం బిదె వ్రతమిదె**
**ఈ కర్మలనొల్ల నేను ఇక దలతు హరిన్**
**మాకితని శరణమే గతి**
**ఈకడ పెదతిరుమలయ్య ఇంపుగ తెలిపెన్.**

**రాగం : మోహన కళ్యాణి**

ఇదియె నాకు మతము ఇది వ్రతము
వుదుటుల కర్మము వొల్లనింకను ॥ఇదియే॥

నిపుణత హరి నే నిను శరణనుటే
తపములు జపములు ధర్మములు
నెపమున సకలము నీవే చేకొను
వుపమల పుణ్యము లొల్లనే యింకను ॥ఇదియే॥

హరి నీ దాసుడ ననుకొనుటే నా
పరమును ఇహమును భాగ్యమును





ధర నీ మాయల తప్పు తెరువులను
వొరగీ సుకృతము లొల్లనే యంకను ॥ఇదియే॥

నారాయణ నీనామము దలచుట
సారపు చదువులు శాస్త్రములు
ఈ రీతి శ్రీవేంకటేశ నిన్ను గొలిచితి
వూరక ఇతరము లొల్ల నే యంకను ॥ఇదియే॥

**భావామృతం :**

ఓ నరులారా! నాకు ఇదియే (హరిభక్తి) మతము. ఇదియే నాకు వ్రతము కూడ. నేను ఉదుటుల కర్మలు (డాంబికంగా చేసే కర్మకాండను) ఇంక ఒల్లను (ఒప్పుకోను). నాకు అవన్నీ వ్యర్థమైనవే.

ఓ శ్రీహరీ! నైపుణ్యంతో నేను నిన్ను 'శరణు మహాప్రభో!' అన్నాను. అదే నాకు తపస్సు, జపము, ధర్మము. వాటన్నిటిలోనూ ఎదోఒక నెపము దోషము కనిపిస్తుంది. కావున ఏదో విధంగా కరుణించి నీవే నన్ను స్వీకరించావి. ఇకపై నేను ఉపమలు (ఇతర ఉపాయాలు). పుణ్యకార్యముల తతంగములను ఒల్లను. ఇంక నాకు సర్వస్వం నీ శరణాగతియే.

ఓ దేవదేవా! నేను నీ దాసుడను. నీ దాసుడ ననుకోవటమే నాకు ఇహము (ఈ లోకంలో సాధించాల్సింది), పరము (మరణించాక పైలోకాల్లో సాధించాల్సింది) భాగ్యము (లౌకికమైన సిరిసంపదలు). ఈ ప్రపంచమంతా నీమాయయే. దాన్ని తప్పుకోవాలనే మార్గాలు ఏవేవో శుభకార్యాలు నీకు జరిపించడం (కళ్యాణం చేయించటం వంటివి) కాదు. తృప్తి కోసం వాటి ననుసరించటం నిరుపయోగం. వాటి వల్ల 'ఒరిగే'దేమీవుండదు. ఇంక నేను ఆ మార్గాలను ఒల్లనుగాక ఒల్లను.

ఓ శ్రీమన్నారాయణుడా! నీ నామ సంకీర్తనమే నాకు సారపు చదువు (శ్రేష్ఠమైన విద్య), శాస్త్రము (ఆరుశాస్త్రములను అభ్యసించుట). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ విధంగా నిన్ను ఆరాధిస్తాను. ఊరకనే ఏవేవో ఇతర మార్గాలను ఒప్పునుగాక ఒప్పను. నీవొక్కడివి నాకుంటే చాలు. ఇంకేమీ ఒద్దంటే ....ఒద్దు.

5-32

## మున్నుడి

అనన్య భక్తి ఒక్కటుంటే చాలు మానవజన్మ చరితార్థమవుతుందంటున్నారు అన్నమాచార్యులవారు. మనందరి బ్రతుకులు, మనకష్టాలు కన్నీళ్ళు యెరిగినవాడు శ్రీహరి ఒక్కడే. అటువంటి హరిగురించి యెరుగుట మేలుకదా! అంటున్నారు. అనంతకోటి బ్రహ్మాండాలున్న ఈ విశ్వంలో యెంతమంది బ్రహ్మలు రాలేదు, పోలేదు. వాళ్లనే ఎవ్వరూ గుర్తుపెట్టుకోరు. పురుగుల్లాంటి మనుష్యుల్ని తలవను కూడా తలవరు. తపములు, కర్మకాండలు... ఇవన్నీ నిరుపయోగం. ఏడుకొండలవాడిని వేడుకోండి. అది చాలు ఆయనే చూసుకుంటాడు.

**చం॥ ఎరుగును శ్రీహరే అవని యెల్లరి పాట్లను జీవితంబులన్**
**ఎరుగుట మేలు కాదె హరి నెల్లరు? జెప్పెను అన్నమార్యుడున్**
**మరచిరి తొంటి బ్రహ్మలను మానవ కీటములన్ స్మరింతురే!!**
**మొరలిడి వేంకటేశ్వరుని మ్రొక్కుడు వీడుచు కర్మమార్గముల్**

**రాగం : హంసధ్వని**

హరియే యెరుగును అందరి బ్రతుకులు
యిరవై యీతని యెరుగుటే మేలు ॥హరియే॥

వెనకటి బ్రహ్మలు వేవేల సంఖ్యలు
యెనసి బ్రహ్మాండము లేలిరట
పెనగొనివారల పేరులు మరచిరి
మనుజ కీటకముల మరెవ్వడెరుగు ॥హరియే॥

ఆస దొల్లి మునులనంత కోట్లు
చేసిరి తపములు సేనలుగా
యే సిరులందిరి యెరుగ రెవ్వరును
వేసపునరులకు విధి యేదో ॥హరియే॥





కల వనేకములు కర్మమార్గములు
పలు దేవత లిటు పాటించిరి
బలిమి శ్రీవేంకటపతికి మొరయిడి
వెలసిరి తుదనిదె వెర విందరికి ॥హరియే॥

**భావామృతం :**

ఓ మానవులారా! శ్రీమన్నారాయణుడైన హరికి మాత్రమే మనందరి బ్రతుకుల గురించి స్పష్టంగా తెలుసు. ఆశ్రయించి ఆయనను యెరుగుటే మేలుకాని అన్యములైన మార్గములు నిరుపయోగం కదా!

అనంతమైన ఈ బ్రహ్మాండమును కొన్నికోట్ల కోట్లు సంవత్సరాలనుంచి అనేకమంది బ్రహ్మలు పరిపాలించారు. నేడు, వారిలో ఒక్కడి పేరైనా ఏ ఒక్కడన్నా 'స్మరిస్తున్నాడా'? ఇక కీటము (కీటకము) ల వంటి మనుష్యుల్ని యెవడన్నా గుర్తుపెట్టుకొంటాడా? అసంభవం.

ముక్తిపొందాలనే ఆశతో, పూర్వం కోట్లాది మునులు దండువలె (సేనలుగా) తపములను ఆచరించారు. వాళ్లకి యే సిరిసంపదలు దక్కాయి? మరి, దొంగవేషాలు వేసే మనిషి గురించి చెప్పేదేముంది? వీళ్లకి దక్కబోయే భాగ్యం యెవ్వడెరుగును?

అనేక శాస్త్రములు, వేదములు మనకు యజ్ఞయాగముల వంటి యెన్నెన్నో కర్మమార్గములను నిర్దేశించాయి. ఎంతోమంది దేవతలు కూడా వాటి నవలంభించి వెలసిరి. (దేవేంద్రులు కూడా అయ్యారు). వాళ్లల్లో ఒక్కడికీ ముక్తి దక్కలేదు. వాళ్ల పుణ్యం అయిపోగానే మళ్లీ నీచమైన మనిషి జన్మ యెత్తవలసిందే. మరి ఇక ఆ తిప్పలెందుకు? ఈ జన్మలోనే... శ్రీవేంకటేశ్వరునికి మొరపెట్టుకొని బలం కూడగట్టుకొని శరణుజొచ్చి ఆయనను, వదలక వుంటే చాలుకదా! 'తుదనిదె వెరవిందరికి' (చివరికి అదంరి దారీ ఇదే...)

## 5-33

## మున్నుడి

దేవదేవునికి శ్రీదేవికి పెండ్లి జరుగుతోంది. అన్నమాచార్యులవారి ఆనందం అవధులను దాటింది. చక్కటి పెండ్లిపాట వినిపిస్తున్నారు. దైవాంశ సంభూతులైన అన్నమయ్య కళ్లకు స్వామివారి పెళ్లికి వచ్చిన ఆహ్వానితులైన సమస్త దేవతలు, మునులు కనిపిస్తున్నారు. (మనబోటి అల్పుల కంత అదృష్టం ఎలాగోలేదు, కనీసం కీర్తన విని తెలుసుకొందాం). అప్సరసల నాట్యం కనిపిస్తున్నది. సుదర్శన చక్రం కనిపిస్తోంది. పెండ్లి 'చవికె' కళ్లకు కట్టినట్లు వర్ణిస్తున్నారు. 'కోనేటిదండ' తిరువీధుల్లో ఊరేగే వధూవరులను కనులారా చూచి తరించండి.

**ఉ॥ ఆడిరి దేవకామినులు అల్లదె మ్రోగెను దేవదుందుభుల్**
**వేడుక దేవుడే కొలను వెంబడి ఆ తిరువీధి నేగెరో**
**పాడెను అన్నమయ్య తను పారవశంబున మేటి కీర్తనల్**
**జోడగు పెండ్లిపాట ఇది సొంపుగ దీనిని ఆలపించరో.**

**రాగం : సాళంగ**

దేవకామినులాడరో దివ్యదుందుభులు మ్రోసే
దేవుడు కోనేటి దండ దిరువీధి మెరసే ॥దేవ॥

యెత్తిరి గరుడ ధ్వజ మిందిరాపతి పెండ్లికి
యిత్తల సురలు మునులిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చెనదె కప్పురవిడేము
చిత్తగించి యాగసాల చేరె హనుమంతుడు ॥దేవ॥

కట్టిరి కలువడాలు కమలాపతి పెండ్లికి
యిట్టె పేరటాండ్లు నేడిందరూ రారో
చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనము మించి
కట్టలై తిరువాముడి ఘనులు వాడేరు ॥దేవ॥





వెలయ భాష్యకారులు విందు చెప్పె బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో
అలమి శ్రీవేంకటేశుడలమేలుమంగగూడె
వెలసేరు పెండ్లి చవికెలోన నదిగో ॥దేవ॥

**భావామృతం :**

దేవదుందుభులు మ్రోగుతున్నాయి. (గంధర్వులు చక్కటి గీతముల నాలపిస్తున్నారు). ఆ పాటలకు తగ్గట్లు దేవకామినులు (దేవతాస్త్రీలు) నృత్యములు చేస్తున్నారు. దేవదేవుడు కోనేటి దండ (దగ్గర) పవిత్రమైన తిరుమలవీధులలో శ్రీదేవితో ఊరేగుచున్నాడు. చూచి తరించండి.

లక్ష్మీవల్లభుని పెండ్లి సందర్భంగా గరుడధ్వజమును ఎత్తినారు. అదిగో చూడండి. ఇత్తల (ఇక్కడకు) సమస్త మునులు, సురులు రాండ్రా! రండి. స్వామికి అప్తుడు, సేనాధిపతి అయిన 'విష్వక్సేనుడు' హత్తి (గజారూఢుడైవచ్చి) కర్పూర తాంబూలము అందించాడు. దాసాంజనేయుడు సంతోషంగా యాగశాల చేరుకొన్నాడు. (మీ మనోనేత్రంతో వారిని దర్శించి నమస్కరించండి).

కమలాపతియైన స్వామి పెండ్లికోసం 'కలువడాలు' కట్టినారు. పేరంటానికి వచ్చే ముత్తైదువులంతా వేగంగా కదలి రాండ్రా, రండి. (ఇంతమంది జనంలో రక్షణ ఉంటుందా అని భయపడకండి). గిరగిరా తిరిగి క్షణంలో మెడ ఖండించగల సుదర్శన చక్రం, మించి (అతిశయించి) రక్షణగా వున్నది. ఇంకేం భయం? ఘనులైన వైష్ణవులు భక్తితో 'నమ్మాళ్వారు' రచించిన 'తిరువామొడి' లోని పాశురములను కట్టలై (గుంపులు గుంపులుగా) పాడుచున్నారు.

భాష్యకారులు (వ్యాఖ్యానం చేయువారు అంటే నేటి భాషలో చెప్పాలంటే 'అనౌన్సర్' అన్నమాట) విందు చెప్పేరు. (భోజనాలకు రాండ్రా... అని పిలుస్తున్నారు). బువ్వాలవారు (భోజనాలు చేసేవాళ్లు) నెమ్మదిగా రండి. నెలవై, ఇక్కడ కావలసినంత చోటుంది. తోసుకోకండి. అలమి (కౌగలించి) శ్రీవేంకటేశ్వరుడు, అలమేలుమంగ అని ప్రసిద్ధి జెందిన తనదేవేరిని కూడినాడు. అదిగో మిమ్మల్ని ఆశీర్వదించటానికి ఇప్పుడు, చవికెలోన (కళ్యాణ మండపంలో) వెలసినారు. వారికి అంజలి ఘటించి మీ జన్మ తరింప చేసికోండి.

## 5-34

## మున్నుడి

జగజ్జనని అలమేల్మంగ సౌందర్యాన్ని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు "స్వామీ! ఈ విలాసములు, ఈ చక్కదనము ఈమెకే తగును. ఒక్కసారి భావించి ఆమె అంగాంగ శోభనాకళింపుజేసికోవయ్యా!" అంటున్నారు. మంచి పాండిత్యమున్నవారికి తేలికగా అర్థమయ్యే ఈ కీర్తన నేటి యువతరానికి కష్టసాధ్యమే. అయినా 'సాధనవలన పనులు సమకూరుధరలోన' అన్నారు పెద్దలు. శృంగారము మోతాదు మించకుండా జాగ్రత్తపడటం. విజ్ఞులు గమనించే వుంటారు.

**ఆ.వె॥ ఈ విలాసములును ఈ చక్కదనములు**
**యెంచి చూడతగును ఇంతికిపుడు**
**యెనసె నీదు 'లలన' ఇన్ని సింగారాల**
**అన్నమయ్య పాడె హరి మురియగ.**

**రాగం : కళ్యాణి**

ఈ విలాసంబులును ఈ చక్కదనములును
భావించి చూడ నీపడతికే తగును ॥ఈ విలాసము॥

నళనాక్షి చెక్కులివి నవ్వు వెన్నెల పొలము
విలుసాముగరిడీ బొమ్మలకు నొసలు
పలుకు జిలుకకు మోవి పంజెరపు దండెంబు
నలికుంతలముల కాణాచి పెనుగొప్పు ॥ఈ విలాసము॥

గురు కుచము లివియే సిగ్గులకు బుట్టిన ఇండ్లు
సరసముల కిరవు హస్తముల కదలు
సురతి విభవముల దాపురమున నెయ్యపు బిరుదు
కరుల యానముల నిలుకడ వనము తొడలు ॥ఈ విలాసము॥





అన్నువగు నడుము గుట్టనెడి సింహపు నెలవు
తిన్నని మొగము కళలు దేరు తెంకి
మన్నించి యేలితివి మరిగి శ్రీవేంకటేశ
ఇన్ని సింగారముల నెనసె నీ లలన ॥ఈ విలాసము॥

**భావామృతం :**

ఓ తిరుమలనాయకా! ఈ పడతి (యువతి) యొక్క విలాసములు (ప్రియుని సందర్శించగా స్త్రీలో కలుగు శృంగార రూప చేష్టా విశేషములు), చక్కదనము ఈమెకే తగియున్నవి. భావించి చూస్తే) ఈ అలమేలుమంగ కొక్కదానికే ఇవి తగును స్వామీ!

ఈ పద్మనయని యొక్క చెక్కిళ్లు, వెన్నెలవంటి నవ్వులు పండించు పొలములు. ఆమె కనుబొమ్మలు విల్లులవలె చక్కగా వంగియున్నవి. ఆమె నుదురు సాముగరిడి అభ్యసించు రంగము వలె ప్రస్ఫుటముగా వున్నది. మాటలు నేర్చిన చిలుక పంజరంలో దండెము మీద (అడ్డంగా అమర్చిన కొయ్యబద్ద) ఎట్టిటి దొండపండుని తింటుంది. ఈ దేవి క్రింది పెదవి ఆచిలుకకిచ్చిన దొండపండు వలెనున్నది. ఈమె పెద్దకొప్పు నల్లని కేశములకు సుస్థిరస్థానమన్నట్లున్నది.

ఈ దేవి ఘన ఉరోజములు సిగ్గుల పుట్టిళ్లు. ఈమె చేతుల కదలికలు సరసపు చేష్టలకు నెలవులు. సురతము ఈమెకందించిన వైభవమే. శూరునకొసగిన ఇంపైన బిరుదమువలె జూపట్టు చున్నది. ఈమె ఊరువులు గజగమనమునకు ఆవాసములైన వనములు (స్థానములు). (ఇంతకంటే వివరణము అనవసరం అని నా భావన).

స్వామీ! అన్నువగు (అల్పమైన) ఈమె నడుము కొండగుహలో దాగిన సింగమును స్ఫురింపజేయుచున్నది. తిన్నని (మనోజ్ఞమైన) ఈమె వదనము కళలు దేరిన తెంకి (సుస్థానము). ఈ అలమేల్మంగను కరుణించి నీ దానిగా చేసికొంటివి. అందుచేత ఈ యువతి ఇన్ని వైభములను యెనసినది (పొందినది), అనగా నీ హృదయాన్ని చేరుకొన్నది. నీ దేవేరియైనది.

**5-35**

## మున్నుడి

బ్రహ్మోత్సవములు జరుగుతున్నాయి. పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు, సూర్యప్రభ వాహనంమీద వూరేగుతున్నాడు. కోటి సూర్యుల తేజోమూర్తి స్వామి. చంద్రముఖియైన అందాలరాశి అలమేల్మంగ, ఆయన జోడై సూర్యప్రభ వాహనంలో భక్తుల మనస్సులను పులకరింపచేస్తున్నది. అన్నమాచార్యులవారు "ఇట్లాంటి విపరీతములు" వినను కూడ లేదు. ఎట్లాంటి ఉపమానాలైనా మీ దగ్గరనే వున్నాయి అని మెచ్చుకొంటున్నారు అన్నమయ్య. రేయింబవళ్ల వలె విడరాని జంట వారిది. కాంతుల కళల కలయిక అది... ఆహా! ఏమికీర్తన!!!

**కం॥ విపరీతము లివి వినుమా**
**వుపమలు మీవొద్ద కలిగె వున్నతముగ నీ**
**విపుడీ సూర్యప్రభలో**
**అపరంజౌ లలన గలియ, అన్నయ్యనెరా.**

**రాగం : నాగ గాంధారి**

విపరీతము లివి వినరాదు
వుపమ లెల్ల మీ వొద్దనె కలిగె ॥విపరీత॥

వువిద వదన చంద్రోదయ వేళను
రవియగు సూర్యప్రభ నీవేగగ
యివల నవల మీ యిద్దరి వలననే
దివమును రాతిరి దెలియగ గలిగె ॥విపరీత॥

అంగన తురుము మహర్నిశి వేళను
రంగగు సూర్యప్రభ నీవేగగ
సంగడి వెలుగును సరిజీకటియును
చెంగట మీయందే చెప్పగ గలిగె ॥విపరీత॥





కాంతమోవి చుక్కల నిండువేళ
రంతుల సూర్యప్రభ నీవేగగ
యింతట శ్రీవేంకటేశ్వర మీ యందే
కాంతులు గళలును గలయుట గలిగె ॥విపరీత॥

**భావామృతం :**

ఇవి (బ్రహ్మోత్సవములలోని ఈ వూరేగింపులు) విపరీతములు (అసామాన్యమైనవి). వీని వైభవమునకు సాటియైన వానిని గూర్చి వినరాదు (వినుట జరుగదు). ఎట్లాంటి ఉపమానములైనను మీ దగ్గరనే వున్నాయి. (అంటే మీకు మరొక పోలికలేదు అని అర్థం).

స్వామీ! ఆ భామిని వదనము అనెడి చంద్రుడు ఉదయించుచున్నవేళ సూర్యప్రభ వాహనముపై రవియగు (సూర్యభగవానుని వంటి) నీవు వెళ్లుచుండగా, ఇవల అవల (ఇక్కడ భూమిమీద అక్కడ ఆకాశంలోను) మీ ఇద్దరి వలననే రేయింబవళ్ళు కలిగినవా అనిపించుచున్నది.

ప్రభూ! ఆ అలవేల్మంగమ్మ ఘనమైన 'కొప్పు' గొప్పనిశిరేయిని తలపించుచున్నది. ఈవేళ రంగులీను సూర్యప్రభ వాహనంపై నీవు పోవుచుండగా, సంగడి వెలుగు (జతకట్టుటకు వచ్చిన వెలుతురుతో) సరిజీకటియును (సమవుజ్జీ అయిన చీకటియును) ఎదురుగా మీయందే ఆ చీకటి వెలుగులున్నట్లు అనిపించుచున్నది.

దేవదేవా! కాంతమోవి "చుక్కలు నిండువేళ" (ఈ రాత్రిపూట) చుక్కలవలె మిలమిల మెరయుచుండగా రంతుల (క్రీడవలె) సూర్యప్రభవాహనముపై నీవు వూరేగుచుంటివి. ఇప్పుడు ఓ శ్రీవేంకటేశ్వరా! మీ ఇద్దరిలోనే కాంతులు, కళలు కలసిపోవుట జరిగినది. మిమ్మల్ని చూచువారిదే కదా! మహత్ భాగ్యమంటే.

## 5-36

### మున్నుడి

చక్కటి తత్త్వ బోధచేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇహలోకంలో (ఇహము) బంధాలను వదలించి, తెగకొట్టుకొనేదాకా పరమునకు (మోక్షమునకు) తెరవు లేనేలేదు (మార్గములేదు). పగ, ద్వేషం వంటి మనో వైకల్యాలను విడనాడక భవము (ప్రాపంచిక చింతన, చింతనవల్ల జనన మరణాలు) పోదు (తప్పదు). ఎప్పటికైనా అంతే. శ్రీవేంకటేశ్వరుడు దయచూచిన ఆయన దాసులకి మాత్రం ఈ తిప్పలుండవు. అప్పటికప్పుడే వాళ్లకి వైకుంఠం దక్కుతుందట. చెబుతున్నది శ్రీహరి 'నందక ఖడ్గం' కాబట్టి దీనికి తిరుగులేదు.

**ఆ.వె॥ తెగక పరమునకును తెరవు లేనేలేదు**
**పగను విడువకుండ భవము పోదు**
**తత్త్వబోధ చేసె తా నన్నమార్యుండు**
**ఏడుకొండలయ్య కదు మురియగ.**

**రాగం : లలితపంచమా**

తెగక పరమునకు తెరవులేదు
పగయెల్లా విడువక భవమూ పోదు ॥తెగక॥

కన్నుల యెదుటనున్న కాంచనముపై మమత
వున్నంత దడవు మోక్ష మొనగూడదు
అన్నము తోడి రుచుల యలమట గలదాకా
పన్నిన సుజ్ఞానము పదిలము గాదు ॥తెగక॥

పక్కనున్న కాంతల భ్రమగల కాలము
మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు
వెక్కసపు సంసారవిధి నున్నంత దడవు
నిక్కి పరమధర్మము నిలుకడ కాదు ॥తెగక॥





చిత్తము లోపలి పలు చింతలు మానిన దాకా
సత్తుగా వైరాగ్యము సమకూడదు
యిత్తల శ్రీవేంకటేశు దేలిన దాసులకైతే
హత్తి వైకుంఠపదవి అప్పుడే కలదు ॥తెగక॥

**భావామృతం :**

ఓ నరులారా! తెగక (ఇహలోకంలో బంధాలను తెగకొట్టుకోకుండా) పరమునకు (మోక్షమునకు) తెరవులేదు (దారిలేదు). అదే విధంగా పగ ద్వేషం వంటి మానసిక వైకల్యాలను విడిచి పెట్టకుండా, భవమూ (చావు పుట్టుకలతో కూడిన సంసార తాపత్రయము కూడా) పోదు.

మన కళ్ళ ఎదుటనే మిలమిల మెరిసే బంగారంపై మమత వున్నంత తడవు (వ్యామోహం ఉన్నంత దాకా) మోక్షం ప్రాప్తించదు. అన్నం కేవలం బ్రతుకుటకు తినాలి. కాని రుచులకోసం అలమట (చింత) వున్నంతవరకు పన్నిన సుజ్ఞానము (కలిగిన చక్కటి జ్ఞానము) పదిలము కాదు (జాగ్రత్తగా స్థిరపడదు). కాబట్టి తిండిపై యావ వదలిపెట్టక జ్ఞానప్రాప్తి ఎలా సాధ్యపడుతుంది?

మన ప్రక్కనే వున్న స్త్రీలపై భ్రమ వున్నంతకాలం శ్రీహరిపై భక్తి మెరయలేదు. సదాహరిని గాక వారినే కాంక్షించి వెంపర్లాడాను. వెక్కసమైన (అధికమైన) సంసార తాపత్రయం వున్నంతవరకు ఉన్నతమైన ధర్మచింతనపై ధ్యాస నిలువదు. జీవితాంతం ధర్మమార్గం వదలి తనకి అనుకూలమైన మార్గంలోనే వుంటాడు.

ఆ విధంగా తన చిత్తములో అనవసరమైన చింత మాననంత దాకా బలంగా వైరాగ్యం సమకూడదు. ఇంత కథవున్నది. అన్నంతో మొదలై మన్నులో కలిసేదాకా చింత, ఆశ, రాగద్వేషాలు పోనేపోవు. దానివల్ల జన్మల చక్రభ్రమణం తప్పదు. ఇత్తల (ఈలోకంలో) శ్రీవేంకటేశ్వరుడు అనుగ్రహించిన ఆయన దాసులకైతే అప్పటికప్పుడే హత్తి (కూడి) వైకుంఠపదవి (వైకుంఠప్రాప్తి) కలుగుతుంది.

**5-37**

## మున్నుడి

మధురాతి మధురమైన శ్రీరామనామ సంకీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు గీర్వాణిలో ఆనందరస సిద్ధిని కలిగించే కీర్తన ఇది. శ్రీరాముడు రావణాసురవైరి, కాని శ్రీరామునికి వైరిభావం లేదు. ఆయన దుష్టశిక్షణ కోసమే వాణ్ణి సంహరించాడు. నీలజీమూత సన్నిభుడట. భూలల నాధిపుడట. పరమనారాయణుడట. శంకరార్పిత జనక చాప దళనుడట. లాలిత విభీషణుడట. వేరెవ్వరూ రామచంద్రునికి ఇట్లా కీర్తించలేదు "తాలాహి నగహరం" అంటే ఏమిటో చెప్పగలరా? ప్రయత్నించండి...

**తే॥ దేవదేవా! భజింతు ప్రభావ! దివ్య!**
**వైరి రావణు దునుమాడిన రఘురామ!**
**తేనెలూరెను వినవయ్య! తిరుమలేశ!**
**అద్భుతంబుగ పాడిరి అన్నమయ్య.**

**రాగం : హిందోళ**

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘు పుంగవం ॥దేవదేవం॥

రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజాను బాహుం నీలాబ్జకాయం
రాజారి కోదండ రాజ దీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం ॥దేవదేవం॥

నీలజీమూత సన్నిభ శరీరం ఘన వి-
శాల వక్షం విమల జలజనాభం
తాలాహి నగ హరం ధర్మ సంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం ॥దేవదేవం॥





పంకజాసన వినుత పరమనారాయణం
శంశరార్జిత జనక చాప దళనం
లంకా విశోషణం లాలిత విభీషణం
వేంకటేశం సాధు విబుధ వినుతం ॥దేవ దేవం॥

**భావామృతం :**

దేవదేవుడైన ఓ శ్రీరామచంద్రా! దివ్యమైన ప్రభావము కల వాడివి. రఘుపుంగవుడివి. (రఘువంశమున జన్మించిన శ్రేష్ఠుడవు). రావణాసుర వైరివి. (రావణునికి శత్రువుడవు). అట్టి నిన్ను భజించెదను.

తండ్రీ! నీవు రాజవరశేఖరుడవు (శ్రేష్ఠమైన రాజుల కెల్ల ఉన్నతుడవు). రఘువంశమునకు సుధాకరుడవు (చందమామవు). ఆజానుబాహుడవు (మోకాళ్లను తాకు చేతులు కలవాడవు). నీలాబ్జ కాయుడవు (నల్లని తామర పూవు వర్ణమున్న శరీరం కలవాడవు). దుష్టశిక్షణ అనే రాజదీక్షతో (విశిష్టమైన దీక్షతో) ఎప్పుడూ కోదండమనే వింటిని ధరించియున్న గురుడవు (రక్షకుడవు). రాజీవలోచనుడవు (పద్మనేత్రుడవు). అట్టి శ్రీరామచంద్రా! నీకు నమస్కరించెదను.

శ్రీరామా! నీవు నీలజీమూత సన్నిభ (నల్లని మేఘము వలె మెరియు) శరీరం కలవాడవు. ఘనమైన విశాల వక్ష స్థలము కలవాడవు . పద్మనాభుడైన శ్రీహరివి. "తాలాహి నగహరుడవు" (ఇక్కడ 'నగ"తాల'కు అన్వయించుకొని 'తాలనగము'అంటే 'తాటిచెట్టు' అని 'అహి' అంటే 'సర్పము' కాబట్టి 'తాలాహి నగహరుడు' అంటే తాటి చెట్టు రూపంతో వున్న అసురుని సర్పము రూపంలో వున్న అసురుని హరించినచో బలరాముడై ధర్మ సంస్థాపనకు అవతరించినవాడవు. భూకాంతాకాంతుడవు. (చక్రవర్తివి అని కూడా చెప్పవచ్చును). భోగిశయనం (నాగేంద్రుడైన ఆదిశేషునిపై పవ్వళించియుండే ఆదిమూర్తివి).

ప్రభూ! నీవు పంకజాసన వినుత పరమ నారాయణుడవు (బ్రహ్మచే కీర్తింపబడు శ్రీమన్నారాయణుడవు). శంకరార్చిత, జనక చాపదళనం (అని విడతీసి అర్థం చెప్పుకోవాలి.) శంకరునిచే అర్చించబడువాడవు, జనకుని వద్దనున్న శివధనస్సును భేదించినవాడవు. లంకను దహించినవాడవు. లాలితవిభీషణం (విభీషణుని బుజ్జగించిన వాడవు). సాధువిబుధ వినుతుడవు (సాధువులైన బుద్ధిమంతులచే కీర్తింపబడువాడవు). శ్రీవేంకటేశ్వరుడవు నీవే.ఓ మహానుభావా! నీకు నమస్కరించెదను.

## 5-38

## మున్నుడి

నేటి 'కడప' జిల్లా కడప తాలూకాకు చేరిన "నందిమండలము"నకు దక్షిణమున 'పాలకొండ' పర్వతమందలి 'కోన'లో చక్కని 'యూటలు' గల ప్రదేశమున్నది. ఇది చాల పవిత్ర ప్రదేశముగా నెంచబడుచున్నది. అచట చెన్నరాయని దేవాలయము వొకటి కలదు. చెన్నరాయుని కీర్తించుచు, అన్నమాచార్యులవారు చెప్పిన సరస శృంగార కీర్తన ఇది. ఓ కోన చెన్నకేశవా! నేనొకటి చేస్తే నీవొకటి చేస్తావు. ఇంకనైనా నీ గుణములను మానవు. ఆనపెట్టు కోవటం నీ ప్రత్యేకత. మమ్మల్నీ ఆనలతోనే రక్షించు"....

**కం॥ "నేనొకటి సేయగా, నువు**
**మానక సేసేవు వొకటి మానవుగుణముల్**
**'కోన'లొ చెన్నా! నెలకొని**
**ఆనల బ్రోచేవు మమ్ము" అన్నయ్యనెరా.**

**రాగం : పాడి**

నేనొకటిసేయగాను నీవొకటి సేసేవు
కోనచెన్న రాయడ నీ గుణ మింక మానవు ॥నేనొకటి॥

పక్కన నే నీతోడ పకపక నగగాను
తెక్కుల నీ వైతే నేల తిట్ట వచ్చేవూ
మొక్కలము విడిచి నే ముచ్చటలాడుకోగాను
వెక్కసపు వెంగమని వేరె తలచేవూ ॥నేనొకటి॥

తనివోక నే నిన్ను తప్పు కిట్టె చూడగాను
తనువు చూచుక నీకే తలవంచేవు
అనుమానము లేదని ఆన నీపై బెట్టగాను
పెనచి నీ వామాట పేరడి బెట్టేవూ ॥నేనొకటి॥





కందువ లంటుచు నిన్ను కాగిట నించగాను
పొందుల నుప్పు వేసి పొత్తు గూడేవూ
అందపు శ్రీవెంకటేశ అట్టె కోన చెన్నడవై
ముందు వెనకా గూడి మోహము చల్లేవూ ॥నేనొకటి॥

**భావామృతం :**

ఓ కోన చెన్నకేశవా! నేను వొకటి చేస్తే ప్రతిగా నీ వొకటి చేయుచున్నావు. ఇకనైనా నీ యొక్క యీ గుణములను మానుకోవు. (ఇక ఎట్లాస్వామీ?)

నేను నీతో ఒక పక్కన పకపకా నవ్వితే నీవు నన్ను తెక్కులితో (యౌవన గర్వంతో) ఏల తిట్టవచ్చేవు ప్రభూ! సరే నీకు కోపము వచ్చిందేమోనని మొక్కలము (కపటము) విడిచిపెట్టి నేను నీతో మాట్లాడితే, నీవేమో వెక్కసపు వెంగెమున (అధికమైన వ్యంగ్యముతో) అన్యధా భావిస్తావు. చెన్నకేశవా! నీతో గొప్పచిక్కు వచ్చిందయ్యా.

తనివోక (తృప్తి దీరక) నేను నిన్ను తిలకించగా, నీవు ఈకెకు (ఈమెకు) తలవంచేవు (లొంగిపోయెదవు). కానీ నీపై ఏ అనుమానమూలేదని నీపై ఒట్టు పెట్టుకొంటే నన్ను పెనవేసికొని నీవా మాటను మఱచి నన్ను మన్నింతువు. ఓ చెన్నకేశవా! నీ ఆంతర్యం నాకు అవగతం కాక తికమక పడుచున్నాను.

కందువలంటుచు నిన్ను కౌగిటనించగా (చమత్కారమును చూపించుచు నిన్ను నా కౌగిట నింపుకొనగా) నీ పొందుతో ఉప్పువేసి పొత్తుగూడేవు (ఆవిరి కుడుములా వుడికించి నన్ను సంగమించేవు). అందగాడివైన శ్రీవేంకటేశ్వరా! నీవే కోనలో చెన్నకేశవుడవై ఇరువైపులనుండి నన్ను మోహమున ముంచెదవు.

## 5-39

## మున్నుడి

దేవతల దగ్గరవుండే కల్పవృక్షం, చింతామణి, కామధేనువు నరులకిచ్చినా నిరుపయోగమే అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎందుకంటే పరమాత్మమాయలో జిక్కి పాపం వాడు మోసపోతున్నాడు. విమోహితుడై కాసు (అరదమ్మిడీ) విలువ చేయని పనికి అనేక తిప్పలు పడుతున్నాడు. కాని జగద్రక్షకుడైన శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించటం లేదు. కామంతో గుడ్డివాడై, సుఖాల ఎండమావుల వెంట తిరుగుతూ జన్మల వైకుంఠపాళిలో నిచ్చెనలెక్కుతూనే వున్నాడు, పాములకి చిక్కుతూనేవున్నాడు.

**ఉ॥ మోసపు మాయలన్ బలు విమోహితుడై చెడిపోయె ప్రాణి తాన్**
**గాసిబడెన్ అహో!! అవని కాతర జెందెను అన్నమయ్యనెన్**
**కాసుకుగానిదౌ పనికి కష్టము వద్దని బుద్ధిజెప్పెరా**
**ఈసు నెరుంగరాని జగదీశ్వరు జేరుడు వేంకటేశ్వరున్.**

**రాగం :ముఖారి**

మోసమున మాయా విమోహితుడైపోయి
కాసుసేయని పనికి గాసిపడె ప్రాణి ॥మోసము॥

కన్నులనియెడి మహాకల్పభూజములివి
తన్నుపుణ్యుని చేయతగిలి వచ్చినవి
వున్నతోన్నత బుద్ధినొసగూర్ప కది దేవి
కన్నచోటికి బఱపి గాసిపడె ప్రాణి ॥మోసము॥

చిత్తమని యెడిమహా చింతామణి దనకు
తొత్తువలె వలసి తను తోడు తేగలది
హత్తించి హరి మీద నలరింపకది వృథా
తిత్తిలో సుఖమునకు తిరిచెనీ ప్రాణి ॥మోసము॥





కామతత్త్వం బనెడి కామధేనువు తనకు
వేమారు కోరికల వెల్లిగొలిపెడిది
ఈమేను తిరువేంకటేశుజేరకపోయి
కామాంధుడై మిగుల గతిమాలె ప్రాణి ॥మోసము॥

**భావామృతం :**

ప్రాణి అని వ్యవహరింపబడుతున్న జీవుడు తానూ నిజానికి పరమాత్ముడే. వాడు అంతర్యామి. కాని పరమాత్ముని మాయలో విమోహితుడై మోసపోతున్నాడు. కాసుకు కూడా కొరగాని పనికి వ్యథజెందుతున్నాడు. పరమాత్మ వాడిపై దయతో యెన్నో ఇచ్చినా వినియోగించుకోలేక పోతున్నాడు.

స్వామి వాడికి 'కన్నులు'అనే మహా కల్పవృక్షములను ఇచ్చాడు వాడిని పుణ్యాత్ముని చేయటానికి వాడికవి వచ్చాయి. వాటికి సద్బుద్ధిని జతచేసి ఉన్నతమైన స్థితికి చేర్చకుండా దేహియైన జీవుణ్ణి అవి యెక్కణ్ణించి పుట్టాడో దానికే తగులుకొనేట్లు చేసినందువల్ల ఎంతో కష్టపడుతున్నాడు. ఎంత మోసపోతున్నాడు!!

ఆ దేవదేవుడు ఈ ప్రాణికి 'చిత్తము' అని పిలువబడే గొప్ప చింతామణి వంటి దివ్యమణినిచ్చాడు. అది నీ తోడుండే... నీతొత్తు (బానిస) రా నాయనా! దాన్ని హరిభక్తికి హత్తించు (కలిగించు), అంటే.. అలా చేయక వృథాగా 'తిత్తిలో సుఖమునకు' (గాలి తిత్తిలో వుండే క్షణికమైన గాలి వలె క్షణికమైన సుఖము కోసం), ఈ ప్రాణి వెంపర్లాడుతున్నాడు. ఎంత వింత!!

ఏ పూజచేయాలన్నా, యజ్ఞయాగాదులు చేయాలన్నా ప్రాణికి దేహం ఆవశ్యకమే. దీనికి కామతత్త్వం అనే కామధేనువు తోడిచ్చినందువల్ల వేలాది కోర్కెల పరంపర కలుగుతున్నది. ఈ దేహాన్ని తిరువేంకటేశ్వరుని వద్ద చేర్చుటకు ఆ కోరికలను అనుసంధానం చేయాలి. దానివల్ల ముక్తిని పొందాలి. అంతేకాని ఈ ప్రాణి మిక్కిలి కామాంధుడై గతి తప్పి వ్యవహరిస్తే ఆ కామధేనువు తోడున్నా లాభంలేదు కదా!

## మున్నుడి

నాకు అత్యంత ప్రీతిపాత్రమైన పది అన్నమాచార్యులవారి కీర్తనలు చెప్పమని అంటే ఈ కీర్తనని చెప్పక తప్పదు. కరుణరసప్రధారమైన ఈ అద్భుత శరణాగతిలో రాళ్ళను సైతం కరిగించగల ఆర్ద్రతవుంది. శ్రీవేంకటేశ్వరుని పై భక్తిగల ప్రతి ఒక్కరూ తన్మయత్వంతో పరవశించు ఈ కీర్తనను తోడిరాగంలో ఆనందించని వారుండరు. "సాకారరూపాం నీకే శరణుజొచ్చితిని" అంటున్నారు. పరమాత్ముడు నిరాకార నిరంజనుడు. నిర్గుణుడు. జీవుల కర్మఫలప్రదాత. ఇదే నిజం. కాని సాకారుడుగా ధ్యానించేది మన మనస్సు ఆయన పై నిలువటానికి, పూజలన్నీ మన తృప్తికే. ఆయనకు భక్తుల అనన్య భక్తి మాత్రమే.. కావాలి నిరాకారునిగా కూడా...

**కం॥ ఆలింపు మాది పురుషా!**
**పాలింపుము శరణ మిమ్ము ప్రార్థించి రహో!**
**జాలిగ వేడిరి అన్నయ**
**లీలాసాకారమూర్తి రిపుదమను హరిన్.**

**రాగం : తోడి**

ఆలించు పాలించు ఆదిమపురుషా
జావిదీర నీకే శరణుజొచ్చితిని ॥ఆలించు॥

గతినీవె మతినీవె కర్తవు భర్తవు నీవె
పతివినీవె ఏ పట్టున మాకు
ఇతరము లెవ్వరున్నారెంచి చూడ నిను బోల
చతురడా నిన్ననే శరణు జొచ్చితిని ॥ఆలించు॥

జననీ జనకులు శరణము నీవె
వునికి మనికి నీవె వుపమ నీవె
మనసిచ్చి నీవె మన్నించుకొంటేను
చనవి మనవి నీకే శరణుజొచ్చితిని ॥ఆలించు॥





లోక సాక్షివి నీవె లోకబంధుడు నీవె
ఈకడ శ్రీవేంకటేశ యిదివో నీవె
నీ కంటె మరిలేరు నిఖిలమంతయు గావ
సాకారరూప నీకే శరణు జొచ్చితిని ॥ఆలించు॥

**భావామృతం :**

ఓ ఆదిమపురుషా! (ఆదిమూర్తీ!) నాపై జాలి చూపించి నాకు శరణు ప్రసాదించుము తండ్రీ! నీకే శరణన్నాను. నా మొరలను ఆలింపుము. నన్ను దయతో పరిపాలింపుము.

ప్రభూ! గతినీవే (నీవే దిక్కు), మతినీవె (మా మేధాశక్తి కూడ నీవే), మా భర్తవు నీవే, మా కర్తవు (మేము చేస్తున్నట్లు కనుపించినా ఇవన్నీ మా చేతచేయించే అసలు కర్తవు) నీవే. ఈ సమయంలో మా పతివి (నాథుడవు అంటే యజమానివి) నీవే. నిన్ను పోలిన 'స్వామి' వేరెవ్వరున్నారు నాకు? సాటిలేని చతురుడవు (నేర్పరివి) యైన నీకునేను శరణువేడాను. నన్ను అనుగ్రహింపుము తండ్రీ!

ఓ దేవదేవా! మాకు శరణమిచ్చే తల్లీతండ్రీ కూడ నీవే. మా ఉనికి (ఉండటానికి కారణం అంటే ఈ రూపంలో వుండటానికి), మనికి (ప్రాణంతో వుండటానికి కారణమూ) నీవే. మా 'ఉపమ' (ఉపాయము) కూడ నీవే నీవు నీమనస్సులో నాకు స్థానమిచ్చి మన్నించకపోతే నాకు వేరే ఆధారం యేది? నా చనవి నీవే (నా అధికారమూ నీపైనే చెల్లుతుంది). నామనవి (విన్నపాలూ) నీకే. అందుకే నీవే శరణంటున్నాను.

ఓ సర్వేశ్వరా! ఈ లోకమునకు సాక్షీభూతుడవు నీవే. దీనికి పరమ ఆప్తబంధువు నీవే. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు, ఇక్కడగాని, ఈ లోకమంతా వెదకి చూచినా గాని నీ కంటె మరెవ్వరూ నాకు దిక్కులేరు. సాకారరూపునిగా పెద్దపెద్ద నామాలతో వున్న నీ మూర్తిని ధ్యానిస్తూ నిన్ను శరణు వేడుకొంటున్నాను. ఈ దీనునికి దయతో శరణమును అనుగ్రహింపుము తండ్రీ!

**5-41**

## మున్నుడి

'మూలము' అంటే వేరు, ఆధారము అని అర్థాలున్నాయి. 'అన్నిటి కాధారమైన ఆదిపురుషుడీతడని' అన్నమాచార్యులవారు వేరొక సంకీర్తనలో శ్రీహరిని కీర్తించారు. కావున ఈ 'మూలము'నకు ఆధారమనే చెప్పుకొందాం. అందరు వేల్పులకు ఈ వెన్నుడే వేల్పు. ఈయనపైన యెవ్వరూ లేరు. ఈయనే 'యెగువలోకపతి' అంటున్నారు. 'ముంచిన' అంటే యెవరినో దివాలా యెత్తించాడని కాదు, 'పూర్వకాలం వాడయిన' అని అర్థం. 'ఆదికి నవాది' అని ఇదివరలో కీర్తించారు అన్నమయ్య. యెనలేని దైవమీ శ్రీవేంకటేశ్వరుడే నంటున్నారు.

**కం॥ అన్నిటికి మూలమితడే**
**వెన్నుని తలదన్నువాని విన్నావట రా?**
**అన్నియు వేంకటనాథుడె**
**అన్నయ్యనె కీర్తనంబు అద్భుతము హరీ!**

**రాగం : పూర్వి కళ్యాణి**

అన్నిటికి మూలం బితడు
వెన్నుని కంటెను వేల్పులు లేరు ॥అన్నిటికి॥

పంచభూతముల ప్రపంచ మూలము
ముంచిన బ్రహ్మకు మూలము
పొంచిన జీవుల పుట్టుగు మూలము
యెంచగ దైవము ఇతడే కాడా ॥అన్నిటికి॥

వెనుకొని పొగడేటి వేదాల మూలము
మునుల తలపులకు మూలము
ఘన యజ్ఞాదుల కర్మపు మూలము
యెనలేని దైవమితడే కాడా ॥అన్నిటికి॥





అగపడి సురులకు నమృత మూలము
ముగ్గురు మూర్తులకు మూలము
నగు శ్రీవేంకటనాథుడే మూలము
యెగువలోకపతి యితడే కాడా ॥అన్నిటికి॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ శ్రీమన్నారాయణుడే అన్నిటికీ మూలము (ఆధారము). ఈ వెన్నుని (శ్రీహరి) కంటే ఇతరములైన దేవత లెవరున్నారు? లేనే లేరు.

ఈ ప్రపంచమంతా 'భూమి, నీరు, వాయువు, వేడిమి, శూన్యము' అనే పాంచ భౌతికమైనదే. ఆ పంచభూతములే ఈ ప్రపంచానికి మూలము, అనిపించినా వాటికి మూలమైన శ్రీహరియే అసలు మూలము. ఆయనే ముంచిన బ్రహ్మకు (పూర్వకాలంవాడయిన చతుర్ముఖ బ్రహ్మకు) ఆధారము. పొంచిన జీవులకు (ఎక్కడో తెలియనిచోట మరుగునవున్న జీవాత్మలకు) పుట్టుకకు ఆధారమీ మహానుభావుడే. మరి, యెంచగ (తలచవలసిన) దైవం ఇతడు కాడా? ఇంకొక రెవరు?

వెనుకొని (విలువ తెలుసుకొని) వేదములన్నియు కీర్తించెడి మూలపురుషుడితడే. మునులందరు భావించెడి మూలపురుషుడు కూడ ఈయనే. ఘనమైన యజ్ఞయాగములకు కర్మఫల ప్రదాత అయిన 'యజ్ఞమూర్తి' ఈ మూలపురుషుడే. ఈతడు అగణితుడైన దైవము కాకపోతే ఇంకొకరెవరు?

ఆనాడు సాగరమథనం సమయంలో మోహిని రూపంలో అగపడి దేవతలకు అమృత మిప్పించిన ఆధారభూతుడీ చిరునవ్వులు చిందిస్తున్న శ్రీవేంకటేశ్వరుడే. ఈయనే ముగ్గురు మూర్తులకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పిలువబడే త్రిమూర్తులకు) మూల పురుషుడు. యెగువలోకపతి (ఊర్ధ్వలోకములైన ఏడు లోకములకు) ఈ ఏడు కొండలవాడే నాథుడు కాడా? ఇంకెవరున్నారు?

**5-42**

## మున్నుడి

సుప్రసిద్ధము, మధురాతి మధురమైన అన్నమాచార్యులవారి "వైరాగ్య కీర్తన" నాస్వాదించండి. అమృతపు వర్షంలో తడిసినట్లుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మాయవల్ల జీవితం 'జుర్రు' కొందామనే భ్రమలో ఏవేవో అడియాసలతో సంతోషమే పరమావధిగా బ్రతికాను. ఆ నవ్వులే నిత్యమూ వుంటాయని చంచలమనస్కుడనై భామినుల పరిష్వంగ సుఖంకోసం పరితపించాను. వేయి నామముల వేల్పువయిన నిన్ను మఱచాను. పాత జన్మపాపం ఇంకా తీరనేలేదు... ఈ జన్మపాపం సంగతేమిటి? ఓ అయ్యా! నీవే దిక్కు. నన్ను రక్షించు అంటున్నారు.

**చం॥ నగవులు నిక్కమా? కనుము నమ్మకు వాటిని అన్నమయ్యనెన్**
**వొగి నడియాసలన్ బడకు, వొద్దనె సత్యము తేల్చి చెప్పెరా**
**తగునిక వేంకటేశ్వరుని దారిని చెంచల మేలరా? యనెన్**
**అగజనుతున్ హరిన్ గొలిచి అద్భుత కీర్తన మెంచి చెప్పెరా.**

**అగజనుతున్ = పార్వతీదేవిని స్తుతించు**

**రాగం : యమన్ కళ్యాణ్**

నగవులు నిజమని నమ్మేదా
వొగి నడియాసలు వొద్దనవే ॥నగవులు॥

తొల్లిటి కర్మము దొంతుల నుండగ
చెల్లబో యిక చేసేదా
యెల్లలోకములు యేలేటి దేవుడా
వొల్లనొల్లనిక వొద్దనవే ॥నగవులు॥

పోయిన జన్మము పొరుగుల నుండగ
ఛీయనక యిందు చెలగేదా
వేయి నామములు వెన్నుడ మాయలు
వోయయ్య యిక వొద్దనవే ॥నగవులు॥





నలి నీ నామము నాలిక నుండగ
తలకొని యితరము తలచేదా
బలు శ్రీవేంకటపతి నిన్ను గొలిచి
వొలుకు చెంచలము లొద్దనవే ॥నగవులు॥

**భావామృతం :**

ఓ దేవదేవా! ఈ నగవులు (సంతోషం) నిజమని (శాశ్వతమని) నమ్మమంటావా? 'ఒగి నడియాసలు' (ఒగిన్ + అడియాసలు = క్రమంగా జరుగుతాయిలే అనుకునే ఆశలు) వొద్దనవే (నాకు అవసరం లేదు అనలేకున్నానే... ఏమిటయ్యా! నీమాయ ప్రభూ! నాకు 'తొల్లిటి కర్మల దొంతర' (పూర్వం జన్మలనుంచీ చేసిన కర్మఫలమే గుట్టలు గుట్టలుంది). చెల్లబో (అమ్మయ్యో!!) యిక చేసేదా (ఇంకా కర్మలు చేసేదా?) సమస్త లోకములను పాలించు ఓ సర్వేశ్వరా! వొల్లనొల్లను (నేను ఒప్పుకోనే ఒప్పుకోను) నాకు ఒద్దంటే వద్దు.

స్వామీ! నేను పోయిన జన్మలో చేసిన పాపముల గుట్ట నా పొరుగునే (నా సమీపముననే) వున్నది. ఛీ యని అసహ్యంతో వుండక, ఇంకా ఇప్పుడు కూడా ఉత్సాహంతో కొత్త పాపాలు చేయమంటావా? వేయి నామములతో నిత్యమూ కీర్తింపబడే ఓ శ్రీహరీ! ఓ అయ్యా! ఇంక నీ మాయలు వొద్దనవే. (చాలు అని అనవేమయ్యా! ఇంకా నన్ను ఏడిపించడం న్యాయమేనా?)

(నలి అంటే రోగము, లేక, నలిగినది అని అర్థం కానీ కొంతమంది 'యోగ్యమైనది' అనే అర్థంలో ఉపయోగించారు ఈ పదాన్ని) ఓ శ్రీ వేంకటేశ్వరా! యోగ్యమైన నీ నామము నా నాలుక చివర వుండగా తలకొని (కావాలని యత్నించి) ఇతరములైన వాటిగురించి తలచుకోనా? ఒద్దు. నిన్నే ఆరాధిస్తాను. నాలో ఒలికిపోతున్న చెంచలము (చిందుతున్న చపలత్వమును, భ్రమలను, బలహీనతలను) వొద్దనవే (కాదని నివారించరాదా?) నన్ను అనుగ్రహించరాదా? నాపై జాలిలేదా?

**5-43**

## మున్నుడి

మన కత్యంత ఆప్తులను 'దొంగ' అని ముద్దుగా పిలవడం కద్దు. అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ ఇదిగో వీడు వింతదొంగ. వేడిపాలలో వెన్న ఉన్నట్లు, ఉన్నా కనబడక, వెరజిన (జారుకొనునట్టి) దొంగ అంటూ శ్రీహరి దశావతార వైభవమును వర్ణిస్తున్నారు. ఆయన నిరుపయోగంగా ఒక్క మాటకూడ వాడరు. అనడానికి "తెలిసి సందెకాడ తిరిగేటి దొంగ" అనే వాక్యమే సాక్ష్యం. హిరణ్యకశిపుడు బ్రహ్మనుండి పగలుగాని రాత్రిగాని తను చచ్చిపోకూడదని వరం పొందినట్లు తెలిసి నృసింహుడై సంధ్యా సమయంలో సంహరించి, తిరిగి తిరిగి వాడి అనుచరులను కూడా చంపాడు. అట్లాంటి దొంగట...

**ఉ॥ వింతలు గొల్పుదొంగయని విష్ణునుతించెను అన్నమయ్య, నే**
**నింత చమత్కృతిన్ కనను యెవ్వని కైతను, వేంకటేశ్వరా!**
**పంతముతోడ నీవపుడు పాయక దాల్చు దశావతారముల్**
**దొంతిగ జెప్పె నర్మముగ దూరుట కాదిది కీర్తనంబహో!!**

**రాగం : భైరవి**

వీడివో యిదె వింతదొంగ
వేడిపాలు వెన్న వెరజిన దొంగ ॥వీడివో॥

వెలయ నీట జొప్పు వేసేటి దొంగ
తలగొన నీకు దాగుదొంగ
తలకక నేల దవ్వేటి దొంగ
తెలిసి సందెకాడ తిరిగేటి దొంగ ॥వీడివో॥

అడుగు కిందలోక మడచేటి దొంగ
అడరి తల్లికినైన నలుగు దొంగ
అడవిలో నెలవైయున్న దొంగ
తొడరి నీలకాసెతో నుండు దొంగ ॥వీడివో॥





మోస మింతుల జేయు మునిముచ్చుదొంగ
రాసి కెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాల కిటు వచ్చి వేంకటగిరి మీద
మూసిన ముత్యమై ముదమందు దొంగ ॥వీడివో॥

**భావామృతం :**

ఇదిగో వీడేకదా! వింతదొంగ. ఈ దొంగ, కాచిన వేడిపాలలో వెన్నవున్నట్లు, వున్నా కనబడని వెరజిన దొంగ (జారుకొనే దొంగ). వీడిన పట్టుకోవటం ఎవరివల్ల అవుతుంది?

ఈయన "వెలయ నీట జొప్పు వేసేటి దొంగ" (ప్రసిద్ధి చెందిన నీటిలో తన జాడ కనబరచిన దొంగ... అంటే మత్స్యావతారము). ఈయన "తలగొన నీకు దాగు దొంగ" (తలకొనన్+ఈకు దాగిన దొంగ... అంటే యత్నించి నీటిలో దాగికొన్న దొంగ తాబేలు... అనగా కూర్మావతారము). ఈయన "తలకక నేలద్రవ్వేటి దొంగ". (హిరణ్యాక్షుడు పాతాళంలో వున్నాడని నేలను తవ్వుకొంటూ పాతాళలోకం వెళ్లి వాడిని చంపిన దొంగ... అనగా వరాహావతారము). "తెలిసి సందెకాడ తిరిగేటి దొంగ" హిరణ్యకశిపుని వరం తెలిసి సంధ్యాసమయంలో తిరిగి చంపిన దొంగ.. నరసింహావతారం.

ఈయన "అడుగు కిందలోకమడచేటి దొంగ" (తన పాదము క్రింద లోకమంతా అణిచి కొలిచిన దొంగ... అనగా వామనావతారం). ఈయన "తల్లికి నైన నలుగు దొంగ" (తల్లికోసం వ్యధ చెందిన దొంగ.. అంటే పరశురాముడు). ఈయన "అడవిలో నెలవైయున్న దొంగ" అరణ్యవాసం చేసిన దొంగ... అంటే శ్రీరామచంద్రుడు). ఈయన "తొడరి నీలకాసెతో నుండు దొంగ" (ఎదిరించు స్వభావము గలిగినవాడై నల్లని వస్త్రములు ధరించు దొంగ... అనగా బలరాముడు).

ఈయన "మోసమింతుల జేయు మునిముచ్చుదొంగ" (త్రిపురాసురుల భార్యలను మోసం చేసిన కపట ముని అయిన దొంగ... అంటే బుద్ధావతారము). ఈయన "రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ" (రాసి అంటే కుప్ప అనే అర్థం. కాని అన్నమయ్య ఇక్కడ ప్రసిద్ధి చెందిన అనే అర్థంతో వాడినట్లు నాకు అనిపించింది... ప్రసిద్ధి చెందిన గుఱ్ఱము కలిగిన దొంగ... కల్కి అవతారము). ఈయన "వేసాల కిటువచ్చి వేంకటగిరి మీద, మూసిన ముత్యమై ముదమందు దొంగ" (అన్ని అవతారములను ధరించుటకు భూమిమీదకు వచ్చి, వేంకటాద్రి మీద ముత్యపు చిప్పలో దాగిన ముత్యంవంటి నిత్య సంతోషియైన దొంగ... అంటే ఇంకెవరు మన ఏడుకొండలవాడే...)

**5-44**

## మున్నుడి

అచ్చతెలుగు మాటలు వాడిన అన్నమాచార్యులవారి ఆధ్యాత్మ కీర్తన నాస్వాదించండి. నేటి కాలంలోని తెలుగువారికి అగమ్య గోచరంగా వున్నా... ఒక్కసారి అర్ధంచేసికొంటే మనస్సు ప్రశాంతత పొందుతుంది. సముద్రాల లక్ష్మణయ్యగారు వంటి పెద్దలు మాత్రమే ఇటువంటి కీర్తనలను వివరించగలరు. గోనెలె కొత్తలు అంటే... ఈ శరీరాలు మాత్రమే కొత్తవి. కోడెలెప్పటివి? అంటే... వీటిలో వుండే ఆత్మలు ఏనాటివి? ఇన్నాళ్ళు అజ్ఞానంలో వున్న అది ఒక్కసారికే జ్ఞాని అవుతుందా? ఒక్కసారి నానపెడితే... ఇనుము మెత్తబడి పోతుందా?

**తే॥ గోనె లెల్లను కొత్తలు, కోడెలెపుడు**
**పాతవేనని అన్నయ్య పాడినాడు**
**నాన్చిలోహంబు నీటిలో నయము మీర**
**మెత్తబరచంగ వచ్చునే!! వేంకటేశ!**

**రాగం : బౌళి**

గోనెలె కొత్తలు - కోడె లెప్పటివి
నానిన లోహము - నయ మయ్యీనా ॥గోనె॥

మున్నిటి జగమే - మున్నిటి లోకమె
యెన్నగ బుట్టుగు - లివె వేరు
నన్ను నెవ్వరు - నృతి బోధించిన
నిన్న నేటనే - నే నెటిగేనా ॥గోనె॥

చిత్తము నాటిదె - చింతలు నాటివె
యిత్తల భోగము - లివి వేరు
సత్తగు శాస్త్రము - చాయ చూపినా
కొత్తగ నేనిక - గుణి నయ్యేనా ॥గోనె॥





జీవాంతరాత్ముడు - శ్రీవేంకటేశుడె
యీవల భావన - లివెవేరు
ధావతి కర్మము - తప్ప దీసినా
దైవము గావక - తలగీనా ॥గోనె॥

**భావామృతం :**

ఈ శరీరాలు (గోనెలు) మాత్రమే కొత్తవి. కాని వీటిలో వున్న కోడెలు (ఆత్మలు) యేనాటివి? ఎప్పటివో.. చాలా పాతవి. దాని సహజగుణం అజ్ఞానం. ఎన్నేళ్లయినా లోహానికి (ఇనుముకి) నానిపోయినా గట్టితనంపోయి నయమవుతుందా? ఈ ఆత్మకూ అంతే. దీనికి అజ్ఞానం పోదు.

ఈ జగత్తు పాతదే, ఈ లోకమూ పాతదే. చూస్తే... వీటిలో జీవుల పుట్టుకలు మాత్రమే కొత్తవి. అజ్ఞానం మాత్రం అలాగే వుంది. నాకు ఉన్నతమైన తత్త్వం ఒకటి రెండు జన్మలకే వచ్చేస్తుందా? జ్ఞానినైపోతానా? పరమాత్మ నెరుగగలనా?

నా చిత్తము యెన్నో జన్మలనుంచి వచ్చిన వాసనలను పేర్చిపెట్టుకొనివున్నది. దీనికెన్నో పాత చింతలు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త భోగములను పొందుతున్నా ననుకొంటుంది. సత్త్వ స్వరూప శాస్త్ర జ్ఞానం యెంత నేర్పినా ఇక కొత్తగా గుణవంతుడను కాగలనా? ఎంత అజ్ఞానం పోగొట్టుకోవాలని చూచినా పాత మాయరోగం పోతుందా?

మరి తరుణోపాయమేమిటి? మనలో అంతరాత్మ రూపుడై శ్రీవేంకటేశ్వరుడు వున్నాడు. ఆయన ఈ ఆత్మలన్నింటికీ అనాది. ఈ జీవాత్మలు భావాలు మాత్రమే వేరు వేరుగా భ్రమలలో పెట్టి, ధావతి కర్మలు (దుందుడుకు కర్మలు) అలవాటుచేసి అజ్ఞానం జీవుణ్ణి తప్పుదోవలలో నడుపుతుంటుంది. ఒక్కసారి ఆ స్వామికి ఈ జీవుడిపై అనుగ్రహం కలిగితే వీడు బాగుపడతాడు. ఆ దైవానికి తప్ప ఆ పని ఇంకెవరివల్ల అవుతుంది?

## 5-45

## మున్నుడి

హరినామ వైశిష్ట్యాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. దేవతలు మునులు శోధనచేసి కనుక్కొన్నారట దాని మహాత్మ్యాన్ని. ఆ శ్రీహరినామం ఇప్పటిదా? అదతీ ఆదికిన్ అనాదియైనది (అత్యంత పురాతనమైన) దంటున్నారు. "సకల పుణ్యఫలములకు సార విహారము" అంటున్నారు. (సర్వపుణ్యముల ఫలములు ఫలించెడి తోట... అని అర్థం). ఏ ఫలము పెద్దదో, ఏది చిన్నదో, ఏది రుచిగలదో ఏది రుచిలేనిదో ఆయన తప్ప ఎవరు చెప్పగలరు? శ్రీహరినామము నాశ్రయించిన వారిలో కుటిలత్వము అంటే వంకరబుద్ధి వుండదట.

**ఆ.వె॥సురులు మౌనులున్న సోదించి రిద్దియే**
**అకుటిలంబలు యనిరి అన్నమయ్య**
**ఆదికిని అనాది హరినామమొక్కటే**
**మేటి కీర్తనంబు వేంకటేశ!**

**రాగం: లలిత**

సోదించి రిదియే సురలును మునులును
ఆదికి ననాది హరినామం ॥సోదించి॥

అరిది వేదశాస్త్రార్థ సంగ్రహము
అరయగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరి భయంకరము హరినామం ॥సోదించి॥

సకల పుణ్యఫల సార విహారము
అకలంకము శ్రీహరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది శ్రీహరినామం ॥సోదించి॥





కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
యెందును శ్రీవేంకటేశ్వరు కరుణకు
నందుకోలైన హరినామం ॥సోదించి॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ శ్రీమన్నారాయణుని హరి... హరి... అని కీర్తించండి. ఈ హరినామం ఇప్పటిదికాదు. ఇది అనాది అని పిలువబడిన ప్రతిదానికంటే... ఆది (మొదలు) అయినది. ఈ విషయాన్ని దేవతలు, మునులు పరిశోధించి, మరీ కనుక్కున్నారు.

ఈ శ్రీహరినామం, అరిది వేద శాస్త్రముల (దుర్లభమైన చతుర్వేదములు, షట్ శాస్త్రముల) సంగ్రహము (సారము). పరిశీలించగా ఇదొక్కటే ఇట్టి విశిష్టత కలిగియున్నది. ఈ శ్రీహరినామము పాప నిర్మూలకము. పుట్టుక అనెడి దుఃఖమును నివారించునది. దీనిని నమ్మిన వారికి శత్రువుల పీడ లేకుండ చేయునది. మరి శ్రీహరీ... అని ఆ దేవదేవుని నామమును యెందుకు ఆశ్రయించరు?

ఈ శ్రీహరి నామము అకలంకము (ఏ నిందాలేనిది). సర్వపుణ్యములు (అనగా గత జన్మలో మనం చేసినకొనిన పుణ్యములు ఈ జన్మలో చేసికొనిన పుణ్యములు, ఇంకొకరి ద్వారా సంక్రమించిన పుణ్యములు) ఫలించెడి సారవిహారము (పండ్లతోట). ఈ శ్రీహరినామము అకుటిలము (ఏమాత్రము వంకర బుద్ధి లేనిది). ప్రకటము (అందరికీ తెలియునట్లు ప్రకటించబడినది). ఇది సులువైనది. ఎంతో పునీతమైనది.

ఓ ప్రజలారా! ఈ శ్రీహరినామమే అందరికీ కైవల్యపదము (ముక్తి మార్గము నొసగునది). ఇది కందువ సదరము (కందువన్... చదరము అనగా సామర్థ్యమున ఏ మాత్రము కొఱతలేనిది). శ్రీ వేంకటేశ్వరుని కరుణకు యెందును (ఎక్కడనైన) అందుకోలై (అతి సమీపముగా వున్నదై) ఈ హరినామము సర్వులను ఉద్ధరించుచున్నది.

**5-46**

## మున్నుడి

ఇదివరలో 'సింగారమూరితి'... అనే అన్నమాచార్య కీర్తనలో, నేను 'సాసముఖ' అంటే హంసరూపి అనగా ఆత్మారాముని రూపుడైన పరమాత్మగా భావించి భావామృతం వివరించాను. ఈ రోజున 'సాసముఖ' అన్నదానికి అనేక అర్థాలు పెద్దలు భావించారని తెలిసి నేను ఇంకొంచెం ఆలోచించి 'సాసముఖ' అంటే 'సారసముఖ' అంటే పద్మముఖుడు అయి వుంటుందని నిశ్చయించుకొన్నాను.

**సీ॥ లలిత గోవిందుడు లక్ష్మి మండపమందు**
**వలరాజుతో కూడి వచ్చినాడు**
**వెల్లగొడుగు బట్టె చల్లని చంద్రుండు**
**పవనుండు విసరెను పట్టి సురటి**
**పుష్పాల పూజించె పూని వసంతుడు**
**భ్రమరాలు ఝుమ్మని పాడె మురిసి**
**సంగడి చిలుకలు చదివెను పద్యాలు**
**కోయిలలును పాడె గొంతు విప్పి**

**తే॥ ఈ వసంత పౌర్ణమినాడు ఈ విభవము**
**వొప్ప సేవింతుమని "సాసముఖుని" గొలిచె**
**అన్నమార్యుడు కీర్తనమాలపించి**
**వేంకటేశ్వర! 'మితిమీరి' వేడె నిన్ను.**

**రాగం : వరాళి**

వరుసతో సాసముఖా వసంత పూర్ణిమ నేడు
సిరుల యీ విభవాలు సేవించరో ॥వరుసతో॥

లలితపు గోవిందుడు లక్ష్మీమండపమందున్న
వలరాజదివో కొలువుగ వచ్చెను
వెలి జంద్రుడు తోడనే వెల్ల గొడ(డు) గట్టువట్టె
సులభాన బవనుడు సురటి విసరెను ॥వరుసతో॥





పొందుగా వసంతుడు పువ్వుల బూజించవచ్చె
కందువతో దుమ్మిదలు గానము సేసె
సందడించి చిలుకలు చదువ జొచ్చె పద్యాలు
గొందినే కట్టిగవారై కోవిలలుగ్గడించె ॥వరుసతో॥

రతిదేవి మొదలైన రమణులు నాట్లమాడి
రతి వసంతమాడె మేఘావళి యెల్ల
తతి శ్రీవేంకటగిరి దాపుకొని యిందునందూ
మితిమీరగా మొక్కేరు మెరసి దేవతలు ॥వరుసతో॥

**భావామృతం :**

ఓ సాసముఖా! (సారసముఖా! లేక పద్మముఖా!) వరుసతో నేడు వసంతపూర్ణమి (క్రమముగా వచ్చిన వసంత పౌర్ణమి) ఈ విభవాల (వైభవములను) సిరుల సేవించరో (శోభాయమానంగా జరుపుడు).

అదిగో లక్ష్మీమండపమున, లలితపు గోవిందుడు (అందమైన వేంకటేశ్వరుడు). ఆ కొలువునకు 'వలరాజు' (మన్మథుడు) విచ్చేసినాడు. బయట, చంద్రుడు తెల్లటి గొడుగును పట్టి నిలిచియున్నాడు. స్వామికి వాయుదేవుడు సురటి (వింజామర) తో వీచుచున్నాడు. ఆ వైభవమును తిలకించండి.

అదిగో ఇంద్రుని కుమారుడైన వసంతుడు, స్వామిని పుష్పములతో పూజించుచున్నాడు. తుమ్మెదలు కందువతో (చమత్కారముగా) ఝుమ్మని గానము చేయుచున్నవి. చిలుకలు ఏవేవో పద్యాలు పాడుతూ సందడి చేయుచున్నవి. కోవిలలు (గండు కోయిలలు) గొందినే (మూలమూలల్లో) కట్టిగవారై (కట్టడి చేయువారై) ఆజ్ఞాపించుచూ ఉగ్గడించెను (చక్కటి ధ్వనులు చేసెను).

అదిగో రతీదేవి మొదలైన రమణులు రమణీయంగా నాట్యము చేయుచున్నారు. మేఘముల పంక్తి అనేక వర్ణములలో నయనానందకరముగా రతి వసంతము (రమణీయమైన వసంతమును) ఆడెను... (నేటి భాషలో, హోలీ ఆడినవి). ఈ కన్నుల పండుగను చూచి శ్రీవేంకటగిరి వద్దకు వచ్చి, ఇక్కడా-అక్కడా అనేక చోట్ల దేవతలంతా గుమిగూడి, తతితో (గుంపుగా) మితిమీరినవారై మెరసి మొక్కేరు (దేదీప్యమానంగా మ్రొక్కుతున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! వారితో బాటు నాబోటి దీనులను కూడ సంతుష్ట మనస్కుడవై అనుగ్రహించు తండ్రీ!

## 5-47

## మున్నుడి

హరిహరులకు అబేధం సూచిస్తున్నారు అన్నమాచార్యులవారు. సృష్టి స్థితి లయలు నిర్వహించే మూడు రూపాలూ పరమాత్మునివే. ఆయా పనులు చేస్తున్నప్పుడు ఆ పరమాత్మనే మూడు వేర్వేరు పేర్లతో పిలుస్తున్నాము. కాని అన్నీ ఆయనే. ఆయా చేతలవలననే ఆయనకు ఆయాపేర్లు వచ్చాయి అంతే. పూతనాంతకుడైన శ్రీకృష్ణుడు ఇతనే. బ్రహ్మాండములను కడుపులోదాచుకొన్న పరమాత్మ ఇతడే. దేవ దేవోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడు, అచ్యుతుడు, అభవుడు ఇలా సహస్రనామములున్న ఈయనను తప్పక కొనియాడాలంటున్నారు.

**మత్తకోకిల :**

**ఈతడే హరుడెంచగా అజుడీతడే అనె అన్నయున్**
**చేతలీతని వెన్నరాదని జెప్పె కీర్తన మెప్పుగా**
**ప్రీతితో తిరువేంకటేశుని వేయినోళ్ళ నుతించెరా**
**పూతనాంతకు మ్రొక్కుడీ యనె బూమెకాడనె శ్రీహరిన్**

***బూమెకాడు = మాయలు చేయువాడు**

**రాగం : బిలహరి**

ఈతడే హరుడు యీతడే యజుడు
ఈతనికి నీ చేతలెంత ఘనమటుగాన ॥ఈతడే॥

కడుపెక్కు బ్రహ్మాండ కటకములు సుడివడిన
కడుపులో నిడుకొన్న ఘనుడు
వెడలి పూతకి చంటి విషము తాగిన యంత
వడిదనకు నేమాయ వట్టి బూమెలు గాక ॥ఈతడే॥





ఎల్లజలధులు మిగిలి యేకమై పబ్బినపు-
డుల్లసిల్లుచు నీతడుండు
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి
బల్లిదుడవని నిన్ను పరిణమింతురు గాన ॥ఈతడే॥

తిరువేంకటేశ్వరుడు దేవదేవోత్తముడు
పరిపూర్ణుడచ్యుతుడభవుడు
శరణాగతుల రక్షసేయువాడనుమాట
గురుతుగా తలపోసి కొనియాడగా వలసె ॥ఈతడే॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఈ సత్యం తెలుసుకోండి. ఈతడే (ఈ శ్రీవేంకటేశ్వరుడే) శివుడు. ఈయనే బ్రహ్మదేవుడు. ఈతనికిన్, ఈ చేతలే (పనులే) ఎంతగొప్పవో అట్లే ఆయన ఘనముగా అట్లు పిలువబడుచున్నాడు. అంతెగాక వేరుకాదు.

ఈ ఘనుడు కోట్లాది బ్రహ్మాండములను తన కడుపులో వుంచుకొనినాడు. ఇట్టి సకల జగదీశ్వరుడు పూతన చనుబాలలోని విషము తాగితే ఏమవుతుంది? వట్టి బూమెలు గాక (వుత్త మాయాజాలం కాకపోతే... ఇంకేమిటి?)

సృష్టి అంతా జలరాశిలో, మునిగిపోయినపుడు ఈతడు ఉల్లసిల్లుచుంటాడు (నిర్వికార నిరంజనుడై వుంటాడు. దోగాడుకుంటూ పోయి చిన్న పాపాయిగా (బాలకృష్ణునిగా) రెండు పెద్ద మద్దిచెట్లను చటుక్కున విఱిచిన నీవు అమిత బలాఢ్యుడవు అని పరిగణించక యెట్లుండగలము? అందుకే నీవు జగజ్జెట్టివి.

ఈ తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు దేవదేవులందరిలోను సర్వశ్రేష్ఠుడు. ఈయన పరిపూర్ణుడు (ఏ కొదవాలేనివాడు). ఈయన 'చ్యుతి' (నాశనము) లేని అచ్యుతుడు. ఈయన అభవుడు (పుట్టుకే లేనివాడు). ఈయన శరణాగత రక్షకుడు అనే మాటను తలచుకొంటు జీవించుచూ ఈయననే ధ్యానించవలెను. అదియే ముక్తిమార్గము.

## 5-48

### మున్నుడి

రేపల్లెలో కొంటె కృష్ణుడు గొల్ల భామలతో జరిపిన చిలిపి అల్లరిని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. 'కదిసి ఇందరివి గైకొనవయ్యా' అంటున్నారు అంటే... 'దగ్గరకు వచ్చి ఇవన్నీ వినవయ్యా' అని అర్థం. పాండిత్యంతో అన్నమయ్య వాడిన తెలుగు సంధులవల్ల నేటికాలంలో అవగాహనకి ఇబ్బంది కూడా కలుగుతుంటుంది. "అదె చిగురు గేదగుల వెనక నుండి నినువేసెనట"... అంటే 'కుఱ్ఱ గేదెల' గురించి అన్నమయ్య చెప్పటం లేదు. లేతపచ్చని మొగలి పూలగురించి చెబుతున్నారు. ఒక గోపిక వెనక నుండి కృష్ణుడిపై మొగలిపూలువేసి వులికి పడేట్లుచేసిందన్నమాట.

**కం : ఇదివో సుద్దులు వినుడీ**
**ముదముగ రేపల్లె కతలు మురిపించుననెన్**
**కదిసివి గైకొనుమయ్యా!**
**వదలకుమనె అన్నమయ్య వారిజనాభున్.**

**రాగం : మోహన**

ఇదివో సుద్దులు ఈ రేపల్లెను
కదిసి ఇందరివి గైకొనవయ్య ॥ఇదివో॥

పలచని రెప్పల పగటులు నెరపుచు
సొలసి నిన్నొకటె చూచెనట
తళుకుల గోళ్ళదండె మీటి యిదె
పలికి నిన్నొకతె పాడెనట ॥ఇదివో॥

చనవులు నెరపుచు సన్న చేయుచును
ననుపున నొక్కతె నవ్వెనట
చెనకి యొక్కతె అదె చిగురు గేదగుల
వెనక నుండి నిను వేసెనట ॥ఇదివో॥





అదన నీవు నన్ను అలమి పట్టంగా
కొదలి యొక్కతె కనిగొణిగెనట
ఎదురనె శ్రీవేంకటే యొకతె నీ
చెదరిన అలుకలు చెరిగెనట ॥ఇదివో॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ రేపల్లెలో జరిగిన 'కథలన్నీ' చెబుతాను. అవన్నీ ఆ నాడు చిలిపి కృష్ణయ్యగా నీవు చేసినవే. ఈ గోపికలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క కథ వుంది. వీటిని వినవయ్యా తండ్రీ!

స్వామీ! ఒక గోపిక సన్నని తన కనురెప్పలను సగటున నెరపుచు (లావణ్యము ప్రదర్శించుచూ), సొలసి (విసుగుతో... బహుశా నీవు రాలేదని...) నీకేసి చూసిందట. ఇంకొక గోపిక తళతళ మెఱయు తన గోళ్ళతో, ఇదే విధంగా దండెమీటి (వీణను మ్రోగించి) మధురంగా పాడినదట. ఆమెకూడా నీవెప్పుడు వస్తావా అని యెదురు చూచుచునే వున్నది.

ప్రభూ! నీతో చనవున్న ఇంకొక గోపిక సన్నలు చేయుచు (ఏవేవో సైగలు చేస్తూ) ననుపున (అనురాగంతో) నిన్ను చూసి నవ్వినదట. ఇంకొక గోపిక నిన్ను తాకునట్లు లేతపచ్చని మొగలిపూలు వెనకనుండి నీపై వేసి నీవు వులికి పడునట్లు చేయుచున్నది.

స్వామీ! సమయం చూచి నీవు నన్ను అలమి పట్టంగా (ఆక్రమించి కౌగలించగా) ఒక్కతె కొదలి (ఒక గోపిక రెచ్చిపోయి మనవి తిట్టుకొంటున్నట్లు ఏదేదో గొణిగింది). ఓ తిరుమలాధీశా! నాకంటే ధైర్యంగల ఇంకొకతె నా యెదురుగానే చెదరిని నీ ముంగురులను (అలుకలను) ప్రేమగా చెరిగేనట (చెదరగొట్టిందట). యెంత తెంపరితనం!!!

## 5-49

### మున్నుడి

అహోబలంలో నరసింహస్వామి వారి కళ్యాణం శ్రీలక్ష్మి అమ్మవారితో జరుగుతున్నది. మనబోటి సామాన్యుల కంటికి కనిపించకపోయినా అన్నమాచార్యులవారి జ్ఞాన నేత్రాలకి ఆ వైభవం దృగ్గోచరమైనది. చక్కటి కీర్తన చెబుతున్నారు. ఓ వనితల్లారా! చూడండి, ఆడండి, పాడండి. ఓ బాటసారులారా! మీరంతా వీధులలో మూగిరండి. పన్నిద్దరు (పన్నెండుమంది) ఆళ్వారులు స్వామిని కొలుస్తున్నారు చూడండి అంటున్నారు. ఈయనే కళ్యాణముల వేది (విద్వాంసుడు) యైన శ్రీవేంకటేశ్వరుడు కూడ. అన్నమయ్య భావనలకంతే లేదు.

**ఉ॥ అంగనలార! పాడుడిటు ఆడరె చూడరె యీ నృసింహునిన్**
**ముంగిట జేరి తెర్వరులు మూగుచు వీధులనుండరమ్మ! ఆ**
**చెంగట నాళువార్లు నదె చేరిరిగా పదిరెండుమంది, యీ**
**సంగతి దెల్పు కీర్తనము చక్కగ పాడెను అన్నమార్యుడున్.**

**రాగం : ఖరహరప్రియ**

ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుక పరుషలెల్ల వీధి నుండరమ్మ ॥ఆడరమ్మ॥

అల్లదివో ఓగునూతల ఔభళేశు పెద్దకోన
వెల్లిపాల నీటిజాలు వెడలే సోన
చల్లని మాకుల నీడ సంగడి మేడలవాడు
ఎల్లగాగ నరసింహు డేగీ నింతితోడ ॥ఆడరమ్మ॥

సింగారపు మండపాల సింహాల మునిమందలు
అంగపు తెల్లగోపురము అదె మిన్నంద
చెంగట నాళువార్లు చేరి పన్నిద్దరు గొల్వ
సంగతి తా కొలువిచ్చీ జయనరసింహము ॥ఆడరమ్మ॥





కందువ శ్రీవేంకటేశు కళ్యాణముల వేది
అందమై భూమికెల్ల ఆదికినాది
మందల పాలకొండ మలకు నట్టనడుమ
విందగు దాసులతోడ విహరించీ దేవుడు ॥ఆడరమ్మ॥

**భావామృతం :**

ఓ వనితల్లారా! మీరంతా ఆడండమ్మా! పాడండి. ఈ వైభవం చూడండమ్మా! వేడుక తిలకించుటకు వచ్చిన పరుషులెల్లా (బాటసారులందరు) వీధిలో నుండి వీక్షించండి.

అదిగదిగో ఓగునూతలలోనున్న అహోబలేశ్వరుని పెద్దకోన (లోయ). అదిగో "వెల్లిపాల నీటిజాలు వెడలే సోన" (హోరుమని ప్రవహించే జలపాతం యొక్క జల్లు) అదిగో చల్లని వృక్షముల నీడలో "సంగడి మేడలవాడు" (జంటగా నున్న సౌధములలో వుండే స్వామి). అదిగో తన పొలిమేరదాటి నరసింహుడు, తనదేవేరితో వూరేగి వస్తున్నారు.

అదిగో అలంకరించబడిన మండపాలలో జంట సింహాలున్న సింహాసనం. అదో అందమైన తెల్లని గోపురం. అది ఆకాశాన్ని తాకుతున్నట్లుంది. దాని ముందర, పన్నిద్దరు (పన్నెండుమంది) ఆళ్వారులు చేరి స్వామిని కీర్తిస్తున్నారు భక్తితో సేవిస్తున్నారు. ఈ జయ నరసింహుడు సంగతి (ప్రేమ)తో భక్తులకు తాను దర్శన మొసగుచున్నాడు. తిలకించి మీ జన్మ చరితార్థం చేసికోండి.

ఇదే సర్వసమర్థుడైన శ్రీవేంకటేశ్వరుని కళ్యాణవేదికగా భావించండి. అందమైన ఆయన "కళ్యాణముల వేది" (పెళ్లిళ్ళకు పేరు మోసినవాడు). ఆయన మరెవరో కాదు ఈయనే (ఈ నృసింహుడే). ఈయనే ఈ భూమిమీద "ఆదికి ననాది" (సృష్టికే ఆదిదేవుడు). పాలకొండ సమీపముననున్న మెట్ట ప్రదేశమున, విందగు దాసులతో (తనను సేవించుటకు వచ్చిన దాసభక్తులతో) ఈ దేవుడు విహరించుచున్నాడు. ఈయనను సేవించి తరించండి.

**5-50**

## మున్నుడి

శ్రీదేవికి శ్రీవేంకటేశ్వరునికి తెప్పోత్సవం జరుగుతోంది. ఆ కోనేటి మహాత్మ్యాన్ని వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. దీని ఆకారము శ్రీమన్నారాయణుని వైకుంఠనగరము యొక్క వాకిలి వలెనున్నదంటున్నారు. ఈ కోనేటి చుట్టూ వున్న వృక్షములన్నీ తపస్సమాధిలో వున్న మునీశ్వరులని కీర్తిస్తున్నారు. "దీకొని నీ తీర్థమాడితిమి కావుమమ్మా" అంటున్నారు.

**కం॥ తెప్పల కోనేటమ్మా!**
**ఎప్పుడు తేల్చేవు హరిని ఈ శ్రీరమణిన్**
**ఇప్పుడు మ్రొక్కెను అన్నయ**
**అప్పునిదీ లోకమాతయని కీర్తించెన్.**

**రాగం : హిందోళం**

దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥దేవునికి॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోబనాలు
అర్మిలి నాలుగు వేదాలదె నీదరులు
నిర్మలపు నీజలము నిండు సప్త సాగరాలు
కూర్మము నీ లోతువో కోనేరమ్మా ॥దేవునికి॥

తగిన గంగాది తీర్థములు నీకడళ్ళు
జగతి దేవతలు నీ జలజంతువులు
గగనపు పుణ్యలోకాలు నీ దరిమేడలు
మొగినీ చుట్టుమాకులు మునులోయమ్మా ॥దేవునికి॥





వైకుంఠనగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ జీవభావము
యేకడను శ్రీవేంకటేశుడే నీవునికి
దీకొని నీ తీర్థ మాడితిమి కావుమమ్మా ॥దేవునికి॥

**భావామృతం :**

దేవదేవుడు, శ్రీదేవి తెప్పోత్సవం జరుపుకొనే ఓ కోనేటి తల్లీ! నీవు లోకములను పావనము చేయుదానివమ్మా! నీకు వేల కొలది వందనములు సమర్పించుకొనుచున్నాము. (నీమహిమను నేను ఎంతయని వర్ణించను?)

ఓ కోనేటమ్మా! ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములు నీ శోభలుగా రూపొందినవి. ఆర్మిలి (అపేక్షతో చదివే) నాలుగు వేదములు నీ నాలుగు తీరములు (ఒడ్లు). నిర్మలములైన నీ నీరు, సప్తసముద్రములలోని నీరు ఒక్క చోటచేరినంత ప్రశస్తమైనవి. గంభీరమైన నీ లోతు మంథర పర్వతమును తేల్చిన ఆది కూర్మము వంటిది.

ఓ కోనేటమ్మా! నీ కడళ్ళు (అలలు) గంగమొదలైన పవిత్ర నదులవంటివి. (అనేక అలలు వస్తుంటాయి కాబట్టి, ఒక్కొక్క అల ఒక్కొక్కనది అని అన్నమయ్య భావన అయి వుండవచ్చును). నీలో వున్న జలజంతువులన్నియు యక్ష, కిన్నెర, కింపురుషాది దేవతలు. నింగిలో నున్న ఊర్ధ్వలోకములన్నియు మాకు కనబడవు కానీ, నీ ఒడ్డున వున్న పలురకములైన ఎత్తయిన మేడలన్నీ ఆ పుణ్యలోకములే అనిపించుచున్నది. నీ చుట్టూ వున్న మొగిమాకులు (మొత్తం చెట్లు అన్నియూ) వేరెవరో కాదు స్వామికోసం అకుంఠిత దీక్షతో తపస్సమాధిలో వున్న మునీశ్వరులు.

ఓ కోనేటి తల్లీ! నీ ఆకారము నాకు శ్రీమన్నారాయణుని వైకుంఠమును తలపించుచున్నది. నీయందు తీర్థస్నానముతో పొందే పుణ్యములు నీ జీవ భావము. (నీవు కేవలం నీళ్ళుకాదు, ప్రాణమున్న తల్లివి అనే నా భావన). శ్రీవేంకటేశ్వరుడే నీ వునికి (స్థానము). ఓ కోనేటమ్మా మేము దీకొని (నిర్భయంగా) నీలో తీర్థస్నానమాచరించితిమి. మమ్మల్ని కావుమమ్మా!

**5-51**

## మున్నుడి

మూడు అద్భుతమైన ఉపమానములతో శ్రీవేంకటేశ్వరుని అభిషేకానంతర అలంకరణను వర్ణిస్తున్నారు, అన్నమాచార్యులవారు. ఇతని రూపము ఇన్నింటికీ (ఈ ఉపమానములకు) మూలము అంటున్నారు. ఎన్నగ ఉపమానములకు ఈ రూపము, ఇరవైనట్లుండె (స్థానమైనట్లున్నది) అంటున్నారు. అలమేల్మంగమ్మతో కలసి ఈ స్వామి దండిగా సొమ్ములు (ఆభరణాలు) ధరించగా అంతా తళతళలాడే పసుపు పచ్చరంగయి, అది గోపికల పరిష్వంగములలో వారి కుచకుంభములపై నున్న పసుపు స్వామి ఛాతికంటినదా అన్నట్లుందట. ఆహా!!

**చం॥ కనుగొన వీని రూపమది కాగలదిన్నిటి మూల మందుచే**
**అనుపమ మైన రీతి యిది అన్నిటికిన్ ఇరవైన దంచనెన్**
**గొనకొని గొల్ల కన్నియల గుబ్బల పై పసుపంటిసొమ్ములై**
**చెనకెను వేంకటేశుకని చెప్పెనసాధ్యుడు అన్నమార్యుడున్.**

**రాగం : సామంతం**

ఇన్నిటికి మూలము యీతనిరూపు
యెన్నగ నుపమలకు నిరవైనట్లుండె ॥ఇన్నిటి॥

కమలనాభునికి కప్పురకాపు మేన
సముచితముగ బైపై చాతినప్పుడు
అమృతము దచ్చేవేళ నట్టే మేనదుంపుర్లు
తమితోడ నిండుకొని దట్టమైనట్లుండె ॥ఇన్నిటి॥

దైవ శిఖామణికి తట్టుపుణుగు మేనను
చేవమీర నించి సేవసేసేయప్పుడు
వేవేలుగా యమునలో వేమారు నీదులాడగా
కావిరి కాళిమ నిండా గప్పినయట్లుండె ॥ఇన్నిటి॥





అలమేలుమంగతోడ నట్టే శ్రీవేంకటపతి-
కెలమితో సొమ్మువెట్టి యెంచినపుడు
కులికి గొల్లెతలను కూడగా గుబ్బలమీద
గలపసపెల్లా వచ్చి కమ్ముకొన్నట్లుండె ॥ఇన్నిటి॥

**భావామృతం :**

ఓ జనులారా! ఈ దేవదేవుని రూపమే ఇన్నింటికి (ఈ కథలన్నింటికి) మూలము (ఆధారము) అయివున్నది. ఈ ఉపమలన్నింటికి (నేను చెప్పబోవు ఉపమానము లన్నింటికీ) ఈతని రూపమే ఇరవైయున్నది (స్థానమై యున్నది).

పద్మనాభుడైన ఈ స్వామికి 'కర్పూరకాపదము' ఆయన వంటిపై పైన సముచ్ఛితముగా (మిక్కిలి పొదవుగా) మెత్తినప్పుడు, అది ఎట్లా వుందంటే... అమృతము కొరకు పాలసముద్రమును దచ్చి (చిలికి) నప్పుడు, ఆ పాల తుంపర్లు (చిందిన బిందువులు) తమితో (త్వరత్వరగా) అంటుకొని నిండిపోయి దట్టంగా అయిపోయిందా అన్నట్లుంది.

దేవతలందరికీ అధినాథుడైన ఈయన శరీరంపై 'తట్టుపుణుగు' (పునుగుపిల్లినుంచి వెలివడు నల్లని సుగంధ ద్రవ్యము) చేతనయినంత అద్ది సేవించుసమయమున అదెట్లా వున్నదంటే... వేవేలుగా (అనేకమారులు) యమునానదిలో ఈదులాడినందువల్ల, అసలే నల్లటివానికి ఆ యమునానది నల్లని నీళ్లు, నల్లదనమును పెంచాయా అన్నట్లుంది.

నేడు ఆ కృష్ణయ్యే శ్రీవేంకటేశ్వరుడై తన దేవేరి అలమేలుమంగతో ఎలమితో (సంతోషంగా) యెంచి సొమ్ములువెట్టి (ఎంచిన ఆభరణములన్నింటిని అలంకరించుకొని యున్నప్పుడు). ఆ పచ్చని తళతళలు ఎట్లావున్నాయంటే... నాడు తమ ఛాతులపై దట్టంగా పసుపు రాసికొనిన గోపికలను బిగియార సందిటజేర్చినందున ఆ పసుపు నల్లనయ్య ఛాతికంటుకొని పచ్చగా మెరుస్తూ కమ్ముకొని వున్నదా అనిపిస్తున్నది. (నాకింతకన్నా వివరించే శక్తిలేదు తండ్రీ! క్షమించు).

**5-52**

## మున్నుడి

పెదతిరుమలయ్య వినిపిస్తున్న మధురమైన భజన నాస్వాదించండి. అవటానికి సంస్కృత భాషలోని కీర్తన అయినప్పటికి ఇందులో అర్థంకాని మాటలు బహుస్వల్పం. కాకపోతే, ఒక విశేషణం ఎందుకు వాడబడిందో గ్రహించాలంటే... మరీ అనుకున్నంత తేలికకాదు. ఉదాహరణకి 'నందనిజనందం' అనే పదము గమనించండి. దాని అర్థం, నందుని స్వంత పుత్రుడు అనికాదు... నిజనందనుడు ఏ విధంగా తండ్రికి ఆనందం కలిగిస్తాడో, నందగోపునికి అట్లు ఆనందం కలిగించినవాడని అర్థం.

**కం॥ జనకుని సరియగు తనయుడు**
**మన పెదతిరుమల రచించె మధుర భజనమున్**
**వినుడిది గీర్వాణములో**
**తనివారగ కొలిచినాడు ధరణీధరునిన్.**
***తనివారగ = తనివితీర**

**రాగం: హంసధ్వని**

వందేహం జగద్వల్లభం దుర్లభం
మందరధరం గురుం మాధవం భూధరం ॥వందే॥

నరహరిం మురహరం నారాయణం పరం
హరి మచ్యుతం ఘన విహంగవాహం
పురుషోత్తమం పరం పుండరీకేక్షణం
కరుణాభరణం కలయామి శరణం ॥వందే॥

నందనిజనందనం నందకగదాధరం
యిందిరానాథ మరవిందనాభం
యిందు రవిలోచనం హితదాసవరదం, ము
కుందం యదుకులం గోపగోవిందం ॥వందే॥





రామనామం యజ్ఞరక్షణం లక్షణం
వామనం కామినం వాసుదేవం
శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం
శ్యామలం కోమలం శాంతమూర్తిం ॥వందే॥

**భావామృతం :**

జగత్పతియైన ఓ శ్రీవేంకటేశ్వరా! బహుకష్టము చేతకాని లభించని నీవు మందర పర్వతమును కూర్మరూపుడవై ధరించినవాడవు. మాకందరికీ గురుపుంగుడవు. మాధవుడవు (లక్ష్మీదేవి పతివి). భూధరం వరాహమూర్తివై భూకాంతను చేపట్టినవాడవు. నేను (అట్టినీకు) నమస్కరించు చున్నాను.

ఓ ప్రభూ! నీవు నృసింహుడవు. ముర అనుదైత్యుని నిర్జించిన వాడవు. దురితములను నివారించు నారాయణుడవు, శ్రీహరివి, చ్యుతి (నాశనము) లేని అచ్యుతుడవు. గొప్ప పక్షిమీద (గరుత్మంతునిపై) విహరించువాడవు, పురుషోత్తముడవు, పరం (మోక్షము నొసగువాడవు). పుండరీకములు (పద్మముల) వంటి కన్నులు కలవాడవు. కరుణయే ఆభరణముగాకల నీకు నేను శరణు నర్థించుచున్నాను.

ఓ దేవదేవా! నీవు నందగోపుని నీ కన్నతండ్రివలె గౌరవించిన వాడవు. నందకము అను ఖడ్గమును, కౌమోదకి అను గదను ధరించినవాడవు. ఇందిరాదేవికి (లక్ష్మీదేవికి) నాథుడవు. పద్మనాభుడవు. స్వామీ! నీవు సూర్యచంద్రులు నేత్రములుగా కల విశ్వరూపుడవు. నీదాసులకి హితవైన వరముల ననుగ్రహించువాడవు. పద్మము హస్తమున గల ముకుందుడవు. యాదవకులమునకు గొప్పనిధివి. గోపకులను గోవులను దీక్షగా రక్షించినవాడవు.

ఓ మహానుభావా! నీవు శ్రీరామ నామమును ధరించినప్పుడు విశ్వామిత్రుని యజ్ఞమును రక్షించితివి. నీవు సులక్షణ శోభితుడవు. నీవు బలిచక్రవర్తి నణచుటకు, వామనుడవైతివి. అమృతమును అసురులనుండి తప్పించుటకు మోహిని వైతివి. వసుదేవసుతుడవై వాసుదేవుడవైతివి. కోమలము, శ్యామలము (నల్లని) వాడవైన నీవు శాంతమూర్తివి, శ్రీవేంకటేశ్వరుడవు. తండ్రీ! నీవు సర్వసంపదలకు నిలయుడవు.

**5-53**

## మున్నుడి

అలమేల్మంగమ్మ సుందర రూపాన్ని అందచందాలను వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. తనవంటి మీద జవ్వాది అనే సుగంధ ద్రవ్యం మెత్తుకొన్నదట. ఆమె తన యౌవనాన్నే... జన్నెవట్టినదట. 'జన్నెవట్టు' అంటే దేవతల ప్రీతికోసం త్యజించటం. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కోసం ఆమె త్యాగంచేసినదేమిటి... తన యౌవనాన్ని త్యాగం చేసిందట. చిత్తజుడైన మన్మథునే లెక్కసేయనిదట. (మరి... వాని తల్లికదా!) స్వామి కమ్మని కౌగిట కలశు(సు)న్నదట. ఇట్లా, ఎవరు కీర్తించగలరు... ఒక్క అన్నమయ్యకే సాధ్యం.

**ఆ.వె॥ జవ్వనమున ఈమె జన్నెవట్టిన దనె**
**అన్నమయ్య భాష అంత సులువె?**
**చాన తనదు మేన జవ్వాది మెత్తిన**
**దనెను తిరుమలయ్య మనము మురియ.**

**రాగం : శంకరాభరణం**

జవ్వాది మెత్తినది తన
జవ్వనమే జన్నె వట్టినది ॥జవ్వాది॥

ముద్దుల మాటలది చెక్కు-
టద్దముల కాంతినలరినది
గద్దరి చూపులది తన-
వొద్ది (ద్ద) చెలియ మీద నొరగున్నది ॥జవ్వాది॥

పుత్తడి బోలినది తన
చిత్తము నీ సొమ్ము చేసినది
గుత్తపు గుబ్బలది అల
చిత్తజుని లెక్క సేయనిది ॥జవ్వాది॥





ఎమ్మెలు యెఱగనిది తన
కెమ్మోవి చిరునవ్వు కెరలున్నది
కమ్ముకొనగ వెంకటరాయా నీ
కమ్మని కౌగిట కలశున్నది ॥జవ్వాది॥

## భావామృతం

ఓ జగన్నాథా! ఈ అలమేల్మంగ సొగసు చూడతరమా? ఈమె తన శరీరంపై సుగంధమును వెదజల్లు జవ్వాది (జవ్వాతి అను పిల్లినుంచి వెలువడు సుగంధ ద్రవ్యము) మెత్తుకొనినది. దేవతల ప్రీతికోసం అందరూ ఏవేవో త్యజిస్తుంటారు. దానిని 'జన్నె పట్టుట' అంటారు. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కోసం ఈమె తన జవ్వనాన్నే (యౌవనమే) త్యజించిందట.

ఈమె మాట్లాడేమాటలు ముద్దులొలుకుతుంటాయి. ఈమె చెక్కిళ్ళు అద్దములవలె తళతళలాడుతుంటాయి. ఈమె చూపులు గద్దించినట్లు (నీ చిలిపితనం నిరోధించుటకు) వుంటాయి. ఆమె తన వొద్దనున్న తన చెలికత్తియపై ఒరిగి (ఆనుకొని) యున్నది.

ఈమె మేని రంగు సువర్ణపు రంగు అవుటచేత ఈమె పుత్తడి (బంగారమును) బోలియున్నది. ఈమె తన మనస్సును నీ సొమ్ము (క్రైవశం) చేసినది. ఈమె గుత్తపు గుబ్బలది (బిగువు పొంకముల తరుణి). అల (ఆనాటి) మన్మథుని సైతము లెక్కసేయని సౌందర్యవతి. (నిజానికి ఆ మన్మథుని కన్నతల్లి ఈమేకదా!)

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె ఎమ్మెలు ఎరుగనిది. (ఎమ్మె అంటే విలాసము... కానీ ఇక్కడ వగలు తెలియనిది అనే భావనలో ఈ పదం వాడివుంటారు). ఈమె తన కెమ్మోవి (కెంపు వర్ణముగల పెదవుల) ని చిరునవ్వుల కెరలున్నది (ఒలుకుచున్నది). ఓ వేంకటరాయా! నీవామె నాక్రమించగా... నీ మధుర పరిష్వంగములో ఈ దేవి కటిగిపోయినది. మిమ్మల్ని కీర్తించిన మా జన్మతరించినది తండ్రీ!

**5-54**

## మున్నుడి

అన్నమాచార్యులవారు యెంత స్థిరచిత్తుడో చూడండి. రకరకములైన దేవతలనారాధించేవారిని విమర్శించకుండా అయ్యా! మీ దేవుళ్ళంతా గొప్పవాళ్లే... వున్నది. అద్వైతమే 'అంతర్యామి' చీమకైనా, సిద్ధయోగికైనా ఒక్కడే. అందరూ పుట్టేది, చచ్చేది ఒక్కలాగానే. ఈ చావు పుట్టుకలు తప్పాలంటే... ముక్తి పొందాల్సిందే. ఏ దేవతని కొలిచినా కోరేదదే. కానీ జిహ్వకో రుచి పుర్రెకో బుద్ధి అన్నారు పెద్దలు. ఏంచేస్తాం? నా అంత సోమరిపోతు నేనే. నాకు అంతమందిని కొలిచే శక్తి లేదు. నాకు ఈ తిరుమలయ్య చాలును అంటున్నారు.

**ఉ॥ ఏమనవచ్చు గొందరికి ఇంపగు తీపులు పుల్లనౌ రుచుల్**
**తామటులే భజించెదరు తప్పక నమ్మిన ఇష్టదేవతన్**
**సోమరినైన నేను బహుసొంపుగ కొల్తును అన్నమయ్యనెన్**
**ఆ మహనీయుడే తిరుమలయ్యని చెప్పెను నమ్మకంబుగా**

### రాగం : సామంతం

ఏమనవచ్చును గొందరి - కింపౌ బులుసులు దీపులు
సోమరితనమున నిన్నిట - జొరదీ నా తలపు ॥ఏమన॥

పదిలంబుగ సర్వాత్మక - భావము దలచిన పిమ్మట
ముదమున నెవ్వరి జూచిన - మొక్కక పోరాదు
వదలక యిన్నిటను శ్రీ - వల్లభుడున్నా డుండిన
హృదయము చంచలమిన్నిట - నెనయదు నా మనసు ॥ఏమన॥

ఎక్కడ జూచిన బ్రాణుల - కిన్నియు నాచారములే
చిక్కక యిన్నియు గైకొని - చేయకపోరాదు
మక్కువ నిన్నియు శ్రీహరి - మతములె కానీ అయినా
ఒక్కటియే చాలును నా - కొడబడ వితరములు ॥ఏమన॥





ఏరీతుల నటు చూచిన - నిందరు బలుదైవములే
కూరిమి నందరి నటువలె - గొలువక పోరాదు,
ధారుణి వేంకటపతి చే - తలు ఇవియైనా గాని
కోరిక నాకితడే మరి - కొర కొర లిన్నియును ॥ఏమన॥

### భావామృతం :

ఈ ప్రపంచంలో మానవుల పోకడల గురించి ఏమని చెప్పగలము? కొందరికి తీపి తినటం ఇష్టం. కొందరికి పులుసులు ఇష్టం. 'లోకోభిన్నరుచిః' అన్నారు. రకరకాల దేవతలనారాధించేవారు కొందరైతే, మానవుల్నే కొందరు దేవుళ్ళుగా ఆరాధిస్తున్నారు. నేనేం చెప్పగలను? నావంటి బద్ధకస్తుడు లేడు. అందుకని నా మనస్సుకి ఇవన్నీ పట్టవు. (నాకు అందరు దేవుళ్ళు వద్దు).

అందరిలో అంతర్యామి హరియేనని తెలియును. కావున ఏ ప్రాణిని చూచినా జాగ్రత్తగా మ్రొక్కవలసినదే. సర్వం విష్ణుమయం. నిజమే... కానీ నా మనస్సు మహాచంచలమైనది. అంతమంది దేవుళ్లను నేను సమదృష్టితో చూడలేకున్నాను. అందుచేత నేను ఆ పరమాత్మునికి తప్ప ఇంకెవరికీ నమస్కరించలేను. (నాతిప్పలు నన్ను పడనివ్వండి).

ఎక్కడ జూచినా సృష్టిలో ప్రాణులన్నీ ఏవేవో ఆచారాలను పాటిస్తూనే వున్నాయి. తపములు, జపములు, యజ్ఞములు, భజనలు... ఒకటేమిటి? లెక్కలేనన్ని ఉపాయాలున్నాయి. వీటన్నిటినీ ఆచరించవలసినదే. అన్నీ శ్రీహరికి ప్రీతిపాత్రములైన మతములే అయినప్పటికీ ఆ దేవదేవుని శరణాగతి తప్ప నా కితరములేవియును గిట్టవు. నాకు అదొక్కటే చాలును. (నాదారిన నన్ను వదిలేయండి).

ఏ రీతిగా పరిశీలించినా ఇందరు దేవతలూ గొప్ప గొప్పవాళ్ళే. కాదనలేను. కావున అందరినీ ప్రేమగా ఆరాధించవలసిందే. ఈ లోకంలో వీటన్నిటినీ నియమించినది శ్రీ వేంకటేశ్వరుడే. నిజమే. నాకుమాత్రం ఈయనను సేవించాలన్న దొక్కటే కోరిక. ఇతరములన్నీ కొరకొరలే (అయిష్టములే). (నన్ను ఆ ఏడుకొండలవాడికే వదలిపెట్టండి).

## 5-55

## మున్నుడి

అన్నమాచార్యుల వారి హరి దశావతార వివరణ కీర్తన ఇది. ప్రతి కీర్తనలోను ఏదో క్రొత్తదనాన్ని ప్రతిపాదించడం ఆచార్యుల ప్రత్యేకత. పొడవైన శేషగిరి అంటే ఎత్తైన శేషాద్రి అని. పెద్దబోయనాయుడు అంటే? నాయడు అంటే 'నాయకుడు' అని అర్థం. బోయనాయడు అంటే ప్రధాన జాలరి అని అర్థం. మరి ఈ జాలరికి చిక్కిన చేపలే సమస్త జీవులు. 'పంచగాలవేలముల' అంటే వంచనలలో శిఖరమువంటివాడు అని భావించాను. "వెలయమోటున నుండే వేట బోయనాయడు" అంటే నరసింహుడు. కాని మోటున అంటే ఇదమిద్ధంగా తెలియదు. స్తంభము అని భావించాలి.

**ఆ.వె॥ బోయనాయుడితడు పొడవైన శేషాద్రి**
**నున్న హరి యితడనె నన్నమయ్య**
**విడువరాని వాడు వేంకటేశుండని**
**హరి దశావతార పరిధి దెలిపె.**

**రాగం : బౌళి**

పొడవైన శేషగిరి బోయనాయడు
విడువ కిందరిగాచు వెడబోయనాయడు ॥పొడవైన॥

పొలసి మీసాల పెద్ద బోయనాయడు
మలిగి వీపున గట్టే మంకు బోయనాయడు
పొలమురాజై తిరిగే బోయనాయడు
వెలయ మోటున నుండే వేట బోయనాయడు ॥పొడవైన॥

పొట్టి పొట్టి యడుగుల బోయనాయడు యెందు
బుట్టు పగ సాధించే బోయనాయడు
బొట్టుల మెకమునేసే బోయనాయడు
పట్టపు నెమలి చుంగ బలుయనాయడు ॥పొడవైన॥





పొంచి శిగ్గెగ్గెఱగని బోయనాయడు
మించి రాలమీద దాటే మెండు బోయనాయడు
అంచెల శ్రీవేంకటేశుడనే బోయనాయడు
పంచగాలవేలముల బలుబోయనాయడు ॥పొడవైన॥

**భావామృతం :**

ఈతడే పొడవైన (ఎత్తైన) శేషాద్రిపైనున్న 'బోయనాయడు' (జాలరి నాయకుడు). ఈయన విడువక అందరినీ కాచు (రక్షించు), వెడ బోయనాయడు (వికారంగా ఉండే బోయనాయడు). వికారం అంటే అసహ్యం అని అర్థం చెప్పుకోకూడదు. ఒక ఆకారంలేని అని భావము.

ఈయన 'పెద్ద పొలుసులు మీసాలు వున్న బోయనాయడు' (మత్స్యావతారము). ఈయన వీపున మలగి (కొండను) కట్టుకొన్న బోయనాయడు (మందర పర్వతాన్ని మోసిన కూర్మావతారం). ఈయన పొలమురాజై (అడవిపందివలె) తిరిగే బోయనాయడు (వరాహావతారం). ఈయన వెలయ మోటుననుండే వేట బోయనాయడు (స్తంభమునుండి వెలసిన వేటాడు బోయనాయడు) అనగా నరసింహావతారం.

ఈ బోయనాయడు పొట్టి పొట్టి అడుగులవాడు (చిన్ని చిన్ని పాదాలు వున్న... త్రివిక్రముడు అంటే వామనావతారం). ఈయన ఎందు (ఎక్కడెక్కడో) బుట్టుపగ (పుట్టుకతో వచ్చిన పగ) సాధించిన బోయనాయడు (పరశురామావతారము). ఈయన బొట్టుల మెకము నేసే బోయనాయడు. (బంగారు శరీరంపై వెండిచుక్కలున్న లేడిని చంపిన బోయనాయడు... అంటే రామావతారం). ఈయన పెద్ద నెమలి పింఛములను అలంకరించిన బోయనాయడు. (బలరాముడు కావచ్చు శ్రీకృష్ణుడు కావచ్చు). వారిలో నిజానికి ఎవరైనా ఒక్కటే.

ఈయన, పొంచి శిగ్గెగ్గెరగని బోయనాయుడు. (సమయం చూచి సిగ్గు ఎగ్గులేకుండా త్రిపురాసురుల భార్యల మానముల నపహరించిన బోయనాయడు. అనగా బుద్ధావతారం). ఈయన మించిరాలమీద దాటే మెండు బోయనాయడు. (మించిన కొండలు అనగా తిరుమల మీదనున్నఘనమైన బోయనాయడు....అని నాభావన ఏడుకొండల వాని అవతారము). అంచెల (ఈ వరుసక్రమములో శ్రీవేంకటేశుడైన బోయనాయడు, పంచగాలవేలముల బలుబోయనాయుడు. అనగా శ్రీవేంకటేశ్వరుని ప్రక్కనున్న బలమైన కాలఖడ్గమును ధరించిన బలమైన బోయనాయడు, అనగా రాబోవు కల్కి అవతారము.

## 5-56

## మున్నుడి

అనాదిగా వైష్ణవులకు అన్యమతస్థులకు మధ్య వైషమ్యాలు తలయెత్తి స్పర్థలు పెరుగుతూనే వున్నాయి. శివకేశవులిద్దరూ, పరమాత్ముని వివిధ రూపాలని ఇద్దరికీ ఏ బేధమూలేదని, నిజమైన వైష్ణవునికి సర్వమూ విష్ణువేనని చెబుతున్నారు. అన్నమాచార్యులవారు. విశ్వరచన అంతా విష్ణు సంకల్పంతోనే నడుస్తున్నది. ఆయన ప్రభావమే ఈ విశ్వమంతా. అతి చంచలమైన ఆత్మ కలిగించే ఎన్నో చిత్తగతుల వల్ల భ్రాంతి పొంది ఇతర దేవతలను సేవిస్తున్నామేకాని, ఎవరిని కొలిచినా చివరికి చేరదీసి మోక్షం ఇచ్చేవాడు శ్రీవేంకటేశ్వరుడే అంటున్నారు.

**తే॥ వైష్ణవులుగాని వారలు వసుధ గలరె?**
**విష్ణుమూర్తి ప్రభావమే విశ్వమంత**
**చంచలంబైన ఆత్మ తెప్పించు భ్రాంతి**
**అన్నమార్యుడే జెప్పెను హరిని గొలిచి**

**రాగం : ధన్యాసి**

వైష్ణవులు గాని వారలెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీ విశ్వమంతయు గాన ॥వైష్ణవు॥

అంతయు విష్ణుమయంబట మరి దేవ-
తాంతరములు గలవననేలా
భ్రాంతి బొంది యీ భావము భావించి-
నంతనే పుణ్యులవుట దప్పదుగాన ॥వైష్ణవు॥

యెవ్వరి గొలిచిన నేమి గొరత మరి
యెవ్వరి దలచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరి రూపుగాని వా-
రెవ్వరు లేరని యెరుక దోచిన జాలు ॥వైష్ణవు॥





అతి చంచలంబైన యాతుమగలిగించు-
కతమున బహుచిత్త గతులై
యితరుల గొలిచిన యెడయక యనాథ-
పతి తిరువేంకటపతి చేకొనుగాక ॥వైష్ణవు॥

## భావామృతం

ఓ నరులారా! ఈ ప్రపంచంలో వైష్ణవులు కాని వారలెవ్వరూ లేరు. ఎందుకంటే... ఈ విశ్వమంతయూ విష్ణు ప్రభావముచేతనే కలిగినది కదా!

సరియే... అంతయు విష్ణుమయము అని భావించితే.. దేవతల మధ్య ఆంతర్యం కలదని అనుకోవడం యెందువలన జరుగుతున్నది? భ్రాంతి బొంది ఇట్లు జరుగుచున్నది. ఈ భావము తెలిసినంతనే తప్పక పుణ్యం కలుగుతుంది. ఇది తప్పదు. కావున సర్వమూ విష్ణుమయమేననే భావం స్థిరపడుతుంది.

ఇంకొక సంగతి ఎవరిని ఆరాధిస్తే, ఏమన్నా తేడా వుంటుందా? వుండదు. ఏ లోపమన్నా కలుగుతుందా? కలుగదు. ఎవ్వరిని (ఏ దైవమును) తలుచుకొన్నా ఏమి బేధము వుంటుంది? అక్కడా, ఇక్కడా (ఏ లోకంలోనైనా) శ్రీహరి రూపుకాని వారలెవ్వరూ లేరు. ఈ ఒక్క విషయం మనస్సులో పెట్టుకొని ప్రవర్తిస్తే చాలు. అంతా మంచే జరుగుతుంది.

అసలిదంతా యెందుకు జరుగుతున్నది? సర్వం విష్ణుమయం అనే భావన కలుగక, యెందరో దేవతలనెందుకు కొలుస్తున్నారు? జీవులలో వున్న 'ఆత్మ' మిక్కిలి చంచల స్వభావం కలది. తను పరమాత్మయేననే అద్వైత భావన మఱచి, భ్రాంతికి లోనై నేను వేరు నీవు వేరు అని భావించి నాది నీది అనే భ్రమకు లోనైనందువలన ఎన్నెన్నో చిత్తగతులు (మనస్సుపోకడలు) కలుగుతున్నాయి. అందువల్ల నీకంటే త్వరగా, నీకంటే ఎక్కువ, నీకంటే చాలాకాలం వుండే సత్ఫలితం కావాలని నేను వేరే ఇంకొక దేవతనారాధిస్తున్నాను. అంటే... ఆ దేవతలనెవరిని కొలిచినా తిరువేంకటేశ్వరుని కొలిచినట్లేనని గ్రహించండి. చివరికి అందరినీ ఆదుకొనేవాడు ఆ ఏడుకొండలవాడే. ఇదే నిజం సుమా!

## 5-57

## మున్నుడి

కడప జిల్లా, జమ్మలమడుగు తాలూకాలో కుందేరు నది యొడ్డున పెద్దముడియము అనుగ్రామమున్నది. దీనికి పడమటి దిక్కున పురాతనమైన పాటి దిబ్బ కలదు. అచట ప్రాచీనమైన కొన్ని దేవాలయములున్నవి. వాటిలో ఒకటి శ్రీనరసింహస్వామి దేవాలయము. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో ముడియము నరసింహస్వామిని కీర్తిస్తున్నారు. శృంగార కీర్తన నృసింహునిపై ఇట్లా చెప్పగలుగుట ఒక్క అన్నమయ్యకే సాధ్యమేమో అని నా అభిప్రాయం. అమ్మవారు నృసింహునితో చెక్కు జెక్కు గదియించి నీతితో నీమెడ సొమ్మై నెలకొన్నది" అంటున్నారు.

**చం॥ ముడియము నారసింహుడవు ముచ్చటలాడవదేటి కామెతో**
**తొడపయినుంచు కొంటివిగ, తోయజవాసిని నన్నమయ్యనెన్**
**మెడగల సొమ్ము నీకెయగు మించిన వేంకటశైలమందునన్**
**యెడయదు నిన్ను నీ జయము ఇందిర తాననె కీర్తనంబునన్.**

**రాగం : సాళంగనాట**

జయ మాయ నీకు నాపె సరసములూ
నయగారి ముడియము నారసింహా ॥జయ॥

మోము చూచి నీతోడ ముచ్చట లాడ వలసి
కోమలి నీతొడమీద గూచున్నది
ఆముకొని అట్టె మాటలాడవయ్య ఆపెతో
నామాట విని యిట్టె నారసింహా ॥జయ॥

మన్నన నీయలుకల మంకు దెలుప వలసి
చన్ను లురమున బెట్టి సత మైనది
చెన్నుడ వాపె చనవు చెల్లించ వయ్య యిట్టె
నిన్నడిగేదింకా నేమి నారసింహా ॥జయ॥





చేతుల నిన్ను నలమి చెక్కుజెక్కు గదియించి
నీతితో నీమెడ సొమ్మై నెలకొన్నది
యీతల శ్రీవేంకటాద్రి నెనసితి వాపెతోడ
నా తలపు లీడేరించి నారసింహా ॥జయ॥

## భావామృతం

ఓ ముడియము నారసింహ దేవా! నీకు ఆపె(ఆమె) (శ్రీలక్ష్మి) యొక్క సరసోక్తులు, జయమాయె (జయమును కలిగించుచున్నవి). ఆమె నయగారి (మృదుభాషిణి) అవుటవలన నీకు అన్నివిధములా తగియున్నది.

చిరునవ్వులొలికించు నీముఖమును చూచి ఆ కోమలాంగి నీతో ముచ్చటలాడవలెనని నీతొడమీద కూర్చున్నది. అందుకు ఆముకొని (గర్వముతో) త్వరగా ఆమెతో మాట్లాడవయ్యా! ఓ నారసింహా! ఇప్పుడు నామాట వినవయ్యా! (ఈ అవకాశం వదలిపెట్టకు).

హిరణ్యకశిపుని వధ తరువాత అంతులేని నీ కోపమును గౌరవించి ఆమె నీ మంకు దెలుపవలసి (నీ మొండితనమును తేల్చివేయుటకు) తన కుచములను నీ వక్షమున కానించి కూర్చొని సతమైనది (శాశ్వతురాలైనది). చెన్నుడవు (సుందరమూర్తివే, ఆమె చనవు (కోరిక) చెల్లించవయ్యా! (తీర్చవయ్యా!) ఇంకా నిన్నడిగేదేమిటి? ఓ నారసింహా! నీకు ఆమె కోరిక తీర్చక తప్పదు స్వామీ!

ఆ శ్రీలక్ష్మి నిన్ను తన చేతులను జూచి అలమి (ఆలింగనం చేసికొని) నీ చెక్కిలికి తన బుగ్గలను గదియించి (దగ్గరగా జేర్చి), నీతితో (పొందికగా) నీ మెడలోని ఆభరణమువలె స్థిరపడినది. ఓ తిరుమలేశా! శ్రీవేంకటేశ్వరా! యీతల (ఇక్కడా) నీవే యెనసితివి (వర్ధిల్లుచుంటివి). నా తలపులు (భావనలు) ఈడేరించి (నెరవేర్చి) ఈ ముడియము నరసింహుడవై స్థిరపడితివి.

**5-58**

## మున్నుడి

తన తాతగారైన అన్నమాచార్యులవారిపై ఆయన మనుమడు చినతిరుమలయ్య చెప్పిన చక్కటి సంకీర్తన ఇది. అప్పుడు అంటే తండ్రి. జగతికే తండ్రి శ్రీ వేంకటేశ్వరుడు. అన్నమయ్య ఆయన వరప్రసాది. అప్పసము అంటే శాశ్వతము. మాకే శాశ్వతంగా అన్నమయ్య కలిగినాడు అని అంటున్నారు. శ్రీమన్నారాయణుని మనస్సులో ప్రతిష్ఠించుకొన్న అన్నమయ్య నిత్యమూ బ్రహ్మానందులైన, సనకసందనాది మునులంటివాడు అంటున్నారు. ఆయన రచించిన వేలాది సంకీర్తనలే ఆయన సామర్థ్య చిహ్నాలైన జెండాలుగా రెపరెపలాడుతున్నాయంటున్నారు.

**కం॥ అప్పని వరప్రసాదిగ**
**అప్పసమై మాకు కలిగె అన్నయ్యనెరా**
**ఇప్పుడు చిన తిరుమల తాన్**
**గొప్పగ కీర్తించె తాత కోవిదుడగుటన్.**

**రాగం : తిలంగ్**

అప్పని వరప్రసాది అన్నమయ్య
అప్పసము మాకే కలడన్నమయ్య ॥అప్పని॥

అంతటికి ఏలికైన ఆదినారాయణు తన
అంతరంగాన నిలిపిన అన్నమయ్య
సంతసాన చెలువొందే సనక సనందనాదు-
లంతటివాడు తాళ్లపాక అన్నమయ్య ॥అప్పని॥

బిరుదు టెక్కెములుగా పెక్కు సంకీర్తనములు
హరిమీద విన్నవించె నన్నమయ్య
విరివిగలిగినట్టి వేదముల అర్థమెల్ల
అరసి తెలిపినాడు అన్నమయ్య ॥అప్పని॥





అందమైన రామానుజాచార్య మతమును
అందుకొని నిలిచినాడు అన్నమయ్య
విందువలె మాకును శ్రీవేంకటనాథునినిచ్చె
అందరిలో తాళ్లపాక అన్నమయ్య. ॥అప్పని॥

**భావామృతం :**

అన్నమాచార్యులవారు అప్పని వరప్రసాది (మనందరి తండ్రియైన శ్రీహరి వరముగా జన్మించినవాడు). మాకే (తాళ్లపాక వంశస్థులకు) అప్పసము కలడు (శాశ్వతముగా కలిగినాడు). అన్నమయ్య మా భాగ్యం.

సమస్తమునకు ఏలిక (ప్రభువు) అయిన ఆదినారాయణుని తన మనస్సులోనే ప్రతిష్ఠించుకొని అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరునికే తన జీవితం అంకితము చేసినాడు. మన తాళ్లపాక అన్నమయ్య. (చెలువు అంటే అందము, కానీ చెలవు అంటే ఒప్పు అని అర్థం). కాబట్టి నిత్యసంతోషంతో ఒప్పునటువంటి సనకసందనాది మునులంతటి వాడు మన అన్నమయ్య (అని అర్థం).

అన్నమయ్య, బిరుదు టెక్కెములుగా (సామర్థ్య చిహ్నములైన జెండాలుగా) అనేక సంకీర్తనలు కలవాడు. ఆ కీర్తనలను ఆయన భూపతులైన రాజులపై చెప్పలేదు. కేవలం శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరునిపైననే చెప్పారు. జగత్ప్రసిద్ధములైన వేదములసారముగా దర్శించి వేలాది సంకీర్తనలను తెలిపినవాడు తాళ్లపాక అన్నమయ్య.

మనోజ్ఞమూర్తియైన రామానుజాచార్యులవారి విశిష్టాద్వైతమతమును స్వీకరించి అన్నమాచార్యులవారై అన్నమయ్య విఖ్యాత చెందినాడు. ఆయన వంశస్థులమైన మాకు కూడా గొప్ప విందువలె శ్రీవేంకటేశ్వరుని అందించినారు. ఈ తాళ్లపాక అన్నమాచార్యులవారు అందరిలోను మా కీర్తిని నిలబెట్టినారు.

## మున్నుడి 5-59

అద్భుతమైన పెండ్లిపాటను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆ కమలనేత్రుని పెండ్లికి గరుడధ్వజం లేచింది. పరుషలు (చిత్రవర్ణములు కల వస్త్రములను ధరించినవారు). అదిగో వచ్చారు. వారు స్వామిని పైపై (సామర్ధ్యముతో) సేవించుచున్నారు. దేవతలంతా పాల్గొన్న ఈ పెండ్లిని దర్శించండి. మీ మనోనేత్రంతో.

**సీ॥ గరుడధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి**
**పరుషలు వచ్చిరి బరుపసేవ**
**భారతి గిరిజలు పాడిరి సోబాను**
**ఆడిరి రంభాది అచ్చరలును**
**కురిసె పువ్వుల వాన కుప్పలై ధరలోన**
**దేవదుందుభులెల్ల దివిని మ్రోగె**
**వేసిరి కాన్కలన్ వేల కొప్పెరలలో**
**పోసిరక్షింతలన్ పుణ్యసతులు**

**ఆ.వె॥ వేంకటాద్రిపైన వెట్టిరి సేసలన్**
**రమణు పెండ్లివేళ రమణితోడ**
**కొలువు ఇచ్చిరనెను కూరిమి నన్నయ్య**
**సురులు భువికి జేరి మురియు వేళ**

**రాగం : రామక్రియ**

గరుడధ్వజం బెక్కె కమలాక్షుపెండ్లికి
పరుష లదివో వచ్చె బైపై సేవించను ॥గరుడ॥

పాడిరి సోబాను నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాది అచ్చరలెల్ల
కూడిరి దేవతలలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరగ శ్రీవిభుని పెండ్లికిని ॥గరుడ॥

కురిసె బువ్వుల వాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మ్రోతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని ॥గరుడ॥





వేసిరి కానుకలెల్ల వేవేల కొప్పెరల
పోసి రదె తలంబ్రాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుడలమేలుమంగ దాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి ॥గరుడ॥

**భావామృతం :**

ఓ భక్తులారా! అదిగో తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి, అలమేలు మంగమ్మకు కళ్యాణం కన్నుల పండువగా జరుగుతోంది. ఆ కమలనేత్రుని పెండ్లి సందర్భంగా అదిగో గరుడధ్వజమునెత్తారు చూడండి. అదిగో "పైపై" సేవించను (శక్తికొలది సేవించుటకు) పరుషలు (చిత్రవర్ణములు కల వస్త్రములను ధరించిన ప్రజలు) వచ్చుచున్నారు.

అదిగో సరస్వతీదేవి, పార్వతీదేవి మధురముగా గొంతెత్తి సోబాను (పెండ్లిపాటను) పాడుచున్నారు. రంభ మొదలైన అప్సరసలు అదిగో కన్నులపండువగా ఆడిరి (నర్తించుచున్నారు). దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రిమీద, వేడుకలు జరుపుటకు శ్రీవేంకటేశ్వరుని పెండ్లికి వస్తున్నారు. (మీ మనోనేత్రంతో దర్శించి వారందరికి మ్రొక్కండి).

అదిగో ఎందుచూచినా కుప్పలై (గుట్టలు గుట్టలుగా) పువ్వులవాన కురియుచున్నది. స్వర్గంలో దేవదుందుభులు మొరసె (మ్రోగుచున్నవి). ఆ శబ్దములనన్నింటినీ చెవులకింపుగా వినండి (మనబోటి అల్పులకు వినపడవు అయినా భావించండి). శ్రీవేంకటాద్రి మీద సంపదలన్నీ పెంటలై బెరసినవి (కుప్పలు తెప్పలుగా కలిగినవి). దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని పెండ్లికి తిరమై మించినది (స్థిరముగా ఆ సంపద వృద్ధి చెందుచునే యున్నది).

అదిగో వేవేల కొప్పెరలలో (అనేకములైన హుండీలలో) కానుకలెల్ల వేసిరి (భక్తులు కానుకలను వేసారు). వధూవరులు తలంబ్రాలు పోసుకుంటున్నారు). పుణ్యస్త్రీలు అక్షతలను చల్లుచున్నారు. అటువంటి సింగారపు పెండ్లికి (మంగళప్రదమైన కళ్యాణమునకు) విచ్చేయండి. (ఏనాటి పుణ్యమో మీరూ దర్శించగలిగారు కనుక పరవశించి వధూవరులకు నమస్కరించండి). శ్రీవేంకటేశ్వరుడు తనదేవి అలమేలు మంగమ్మతో మిమ్మల్ని కరుణిస్తాడు.

## 5-60

### మున్నుడి

ఒకానొక విజయదశమినాడు శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తూ శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా, శ్రీవేంకటేశునిగా ఆయన విజయపరంపరలను నుతించారు అన్నమాచార్యులవారు ఆ విజయాలకోసం ఆయన వేసిన అమ్ములపై (బాణములపై) కీర్తన చెప్పారు. ఆలకించండి. ఆ తిరుమలేశుడే విజయుని సఖుడు. రుక్మిణిని చేపట్టిన విజయకృష్ణుడు అంటున్నారు. దశకంఠుని పది శిరస్సుల ఖండించిన ఆదిదేవుడు ఈయనే అంటున్నారు. ఇందిరాదేవిని గూడి పంతమున అమ్ము వేసి సర్వులను రక్షించు విష్ణు దేవుడు కూడా ఈయనే అని కీర్తిస్తున్నారు.

**మ॥ వినుడా వేంకటనాథుడెత్తి వడిగా వేసెన్, భళా!! అమ్ములన్**
**ఘనమాయెన్ విజయాలు పార్థ సఖుకున్ గావించె కళ్యాణముల్**
**దునిమెన్ ఆ దశకంఠుకున్న శిరముల్ తొల్లింటనా లంకలో,**
**కొనియెన్ రుక్మిణి దెచ్చి ద్వాపరమునన్ గోవిందు డన్నయ్యనెన్.**

**రాగం : షణ్ముఖప్రియ**

విజయపు టమ్ము వేసె వేంకటేశుడు
విజయుని సఖుడు యీ వేదమూరితి ॥విజయ॥

పాతితెంచి దశకంఠు పది శిరసులమీద
ఆతికి నమ్ము వేసె నాదిదేవుడు
ఆఁటి సేనలతోడ నంబుధి మీద వేసె
వేఁటొక యమ్ము దొడిగి విష్ణుదేవుడు ॥విజయ॥

చాలుగ నేడు దాళ్ల సర్వము నొక్కటిగాగ
ఆలములో నమ్ము వేసె నఖిలేశుడు
ఆలించి రుక్మిణి బెండ్లి యాడునాడు వైరులపై
జాలియమ్ము వేసెను విజయకృష్ణుడు ॥విజయ॥





భజన నిందిరగూడి పంతమున నమ్ము వేసె
విజయదశమిని శ్రీవేంకటేశుడు
సుజనుల దేవతల సొరిది నిందరిగాచు
విజయము చేకొనె విష్ణుదేవుడు ॥విజయ॥

**భావామృతం :**

శ్రీవేంకటేశ్వరుడు విజయపుటమ్ము (విజయమును కలిగించెడి బాణమును) వేసినాడు. వేదమూర్తియైన ఈ దేవదేవుడు విజయునికి (అర్జునునికి) సఖుడు (మంచి స్నేహితుడు)

అతి శీఘ్రముగా పోయి, రావణాసురుని పదిశిరస్సులను ఖండించుటకు ఆదిదేవుడైన నారాయణుని మానవాకృతియైన శ్రీరామచంద్రుడు, వాని ఆతికి (నాశనమునకు) అమ్ము వేసెను (బాణమును వేసినాడు). ఆఁటి సేనలతో (వ్యర్థమైన వానరసేనతో) అంబుధిని దాటుటకు సముద్రునిపై వేఁటొక అమ్ము వేయుటకు శరమును సంధించినాడు. ఆయన స్వయంగా విష్ణుమూర్తియే కదా!

చాలుగ (వరుసగా) "సర్వము నేడు తాళ్లు" (అన్నీ, ఏడు తాటిచెట్లను) ఒక్కటిగా (ఒకేసారి) ఆలములోనమ్ము వేసె (శత్రు సంహారమునకు ఉపయోగించు బాణమును ఆ సర్వలోకనాథుడు వేసినాడు). ద్వాపరయుగంలో, ఆలించి (తన విన్నపమును విని) రుక్మిణీదేవిని తెచ్చుకొని పెండ్లియాడుటకు ఆ దేవదేవుడే శ్రీకృష్ణమూర్తిగా సిద్ధపడినాడు. ఆరోజున తన వైరులపై (శత్రువులైన రుక్మి మొదలైన వారిపై) జాలియమ్ము వేసినాడు (చాలియమ్ము... ధారగా బాణములను వేసినాడు). వారందరిని ఓడించి విజయకృష్ణుడైనాడు.

నేడు, ఈ విజయదశమినాడు తనదేవేరి ఇందిరాదేవితో కూడిన ఈ శ్రీవేంకటేశ్వరుడు, పంతమున (పట్టుదలతో) భజన అను అమ్ము వేసినాడు. సొరిది (వరుసగా) సుజనులను, దేవతలను, వీరందరిని గాచుటకు వేసిన ఆ అమ్ము(బాణము) వారందరికీ గుచ్చుకొని అందరూ ఆయన భక్తులైనారు. ఆ విష్ణుదేవుడు ఈవిధముగా కలియుగంలో కూడ విజయము చేకొనినాడు.

## 5-61

## మున్నుడి

చాలా తేలికగా అర్థమైపోతుంది అనుకొని, ఆ తరువాత మనం పొరబడ్డా మనిపించే కీర్తన ఇది. అన్నమాచార్యులవారి అద్భుత సృష్టి. వైరాగ్యం తత్త్వ చింతన ప్రతిపాదించే ఈ కీర్తనలో తన కాలమంతా గాలి తిరుగుళ్లతోనే సరిపోయిందని, తాలిమికి (క్షమకు) ఏమాత్రము సమయంలేకుండా గడిచిపోయింది. ఎన్నో చెత్త ఆలోచనలతో, వ్యాపకాలతో కాలం వృథా అయిపోయింది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీమీద ధ్యాసే లేకపోయింది. నన్ను క్షమించు ప్రభూ! నన్ను నీవాడిని చేసికో...

**కం॥ గాలిని పడినే పోయా**
**కాలంబున నంతులేక ఘనుడైన హరీ!**
**తాలిమికి ప్రొద్దు లేదనె**
**మాలావుగ అన్నమయ్య మాటను వినుడీ.**

**రాగం : కన్నడగౌళ**

గాలినే పోయ గలకాలము
తాలిమికి గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥

అడుసు చొరనే పట్టె నటునిటు గాళ్లు
గడుగుకొననే పట్టె గలకాలము
ఒడలికి జీవుని కొడయైన హరి
దడవగా గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥

కలచి చింతనే పట్టె గడవ నించగ బట్టె
కలుష దేహపు బాధ గలకాలము
తలపోసి తనపాలి దైవమైన హరి
దలచగా గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥





శిరసు ముడువ బట్టె చిక్కుదియ్యగ బట్టె
గరిమల గపటాల గలకాలము
తిరువేంకటగిరి దేవుడైన హరి
దరిచేరా గొంతయు బొద్దు లేదు ॥గాలినే॥

**భావామృతం :**

ప్రభూ! కలకాలము (కాలమంతా) నేను గాలినే పోయా (వ్యర్థంగా గాలికి తిరిగాను). తాలిమికి (క్షమకు) కొంతయును బొద్దులేదు (ఏమాత్రమూ సమయం లేదు...) అనగాలి క్షమ అనేది యెరుగక నాకాలము నంతయును గడిపితిని.

నా కాళ్లు, అడుసుచొరనే పట్టె గలకాలము (కాలమంతా బురదలోనే నడిచాయి). వాటిని (కడుగు కొనుటయే జరిగినది). కానీ, ఒడలికి జీవునికి ఒడయైన హరిన్ (శరీరానికి, జీవాత్మునికి స్వామియైన నారాయణుని) తడవగా (తలచుటకు) ఏమాత్రము సమయము లేకపోయింది. ఎంత దౌర్భాగ్యుడను!!

ప్రభూ! కలచి చిందనేపట్టెన్ (నింపిన నీరు చింది పోతూనే వున్నది). కడవనించగ బట్టె (కుండను నింపుతూనే వున్నాను). కలకాలము కలుషదేహపు బాధ (కాలుష్యంతో నిండిన దేహము యొక్క బాధ నిత్యమైనది). ఈ దేహపు అవసరాలు చూడటానికే కాలమంతా గడచిపోతోంది. తనపాలిదైవమైన హరిని గురించి తలపోసి (ఆలోచించి) తలచగా (ధ్యానించుటకు) ఏమాత్రమూ సమయము లేకపోయింది). ఎంత దురదృష్టం!!

ప్రభూ! ప్రతిదాంట్లోనూ, శిరసు ముడువగ బట్టె (తలదూర్చవలసి వచ్చింది). చిక్కుదియ్యబట్టె (దానివల్ల కలిగిన చీకాకులను వదిలించుకోవలసి వచ్చింది). గరిమల గపటాల (మధ్యలో వంచనలతోనే) కలకాలము గడచిపోయింది. తిరువేంకట గిరిదేవుడైన హరిన్(శ్రీవేంకటేశ్వరుని) దరిచేర (ఆశ్రయించుటకు) కొంతయును బొద్దులేదు (ఏమాత్రమూ సమయము లేనేలేదు). ఎంత మందభాగ్యుడను!!

## 5-62

## మున్నుడి

అన్నమాచార్యులవారు చక్కటి జ్ఞానబోధను చేస్తున్నారు. ఆలకించండి. "ఓ దేవదేవా! నిన్ను పూర్తిగా నమ్మి నిశ్చలమైన మనస్సుతో నీదాసునిగా వున్నాను. ఇంకా నాకు వేరే ఇతర ఉపాయము లెందుకు" అని అంటున్నారు. భక్తి అంటే వంద టెంకాయలు కొట్టి అభిషేకాలు అన్యమనస్కంగా చేయించి, హుండీలో 'నల్లధనం' వేయడం కాదని మనందరికీ తెలుసు. కాని భక్తులనుంచి స్వామి ఏమి కోరుతున్నాడనేది నిస్సందేహంగా తెలియదు. ఇది చదివితే కొంత తెలుస్తుందని నా నమ్మకం.

**మత్తకోకిల:**

**నిన్ను నమ్మితి నిల్చుకొంటిని నిశ్చలంబుగ నా మదిన్**
**ఉన్నవాడను నీదు మీదనె ఉన్నతంబగు నమ్మికన్**
**అన్నమయ్యనె వేరుపాయము అంతకంటెను లేదురా**
**వెన్నుడా! వెరపేల నాకిక వేల్పువై తమరుండగా.**

**రాగం : కన్నడగౌళ**

నిన్ను నమ్మి విశ్వాసము – నీపై నిలుపుకొని
ఉన్నవాడనిక వేరే – ఉపాయమేమిటికి ॥నిన్ను॥

గతియై రక్షింతువో – కాక రక్షించవో యని
మతిలోని సంశయము – మతి విడిచి
యితరులచే ముందర – నిక నెట్లౌదునో యని
వెతతోడ దలచేటి – వెఱపెల్లా విడిచి ॥నిన్ను॥

తిరమైన నీ మహిమ – తెలిసే వాడననే
గరువము తోడి వుద్యో–గము విడచి
వెరవున నీరూపు – వెదకి కానలే ననే
గరిమ నలపు నాస్తి – కత్వమును విడిచి ॥నిన్ను॥





ధ్రువమైన నా చేతకు – తోడుదెచ్చుకొనే ననే
అవల నన్నులమీది – యాస విడిచి
వివరించలమేల్మంగ – విభుడ శ్రీవేంకటేశ
తవిలితి నీ పుణ్యమం తయు నీకు విడిచి ॥నిన్ను॥

## భావామృతం

ఓ దేవదేవా! నిన్నే నమ్ముకొని నా నిశ్చలమైన నమ్మకాన్ని నీపైననే నిలిపివున్నాను. నాకు వేరే ఇతర వుపాయాలు యెందుకయ్యా! నన్ను తరింపచేయటానికి అది చాలును.

నీవు నాకు గతివై కాపాడుతావో కాపాడవో అనే కుశంకలను నా మనస్సునుండి తొలగించుకొన్నాను. నీపై నిశ్చలమైన నమ్మకం వుంచుకొన్నాను. ఇతరుల వలన నాకు ఇకముందు ఏమి అపకారాలు జరుగుతాయో అని నాకు ఇంకా భయమెందుకు? ఆ వెఱపునంతా విడిచిపెట్టి నిన్నే నమ్ముకొని నిశ్చింతగా వున్నాను.

స్థిరమైన నీ మహిమ నాకు తెలిసిపోయిందని మిక్కిలి గర్వంతో వున్న నా వుద్యోగము (ప్రయత్నము) విడిచిపెట్టాను. నీ రూపమును వెరవున (ఉపాయంతో) వెదకి ప్రయోజనం లేదనీ నిన్ను కనుగొనలేనని తెలిసి అలిసిపోయాను. ఆ అలపు గరిమ(ప్రభావం) వలన కొంత నాస్తికత్వం కూడా నన్ను ఆవహించింది. కానీ నీదయవలన దాంట్లోంచి బయటపడి నీపైన పరిపూర్ణ విశ్వాసమును పునః ప్రతిష్ఠించుకొన్నాను. నీపైన అచంచల విశ్వాసంతో వున్నాను.

ధ్రువమైన (స్థిరమైన) నా చేతకు (నిన్ను సేవించే ప్రయత్నములకు) తోడుదెచ్చుకొనేననే ఆసలు (ఇతరుల సహాయము, తోడ్పాటు వుంటాయి అనే ఆశలను) విడనాడితిని. అవల (అటుతర్వాత) ఆ భ్రమలన్నీ తొలగించుకొన్నాను. మా అమ్మ అలమేల్మంగకు నాథుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను నేనే వుద్ధరించుకోవాలని కృత నిశ్చయుడనయ్యాను. నేనింతవరకు ఏదన్నా పుణ్యం సంపాదించి వుంటే... అదంతా నీకే సమర్పిస్తున్నాను. నా బాధ్యత అంతా ఇక నీదే. నన్నేం చేసినా నీ ఇష్టం.

**5-63**

## మున్నుడి

అన్నమయ్య సుపుత్రుడైన పెదతిరుమలాచార్యులవారు చెప్పిన మనోహరమైన మేలుకొలుపు కీర్తన ఇది. నాకత్యంత ప్రీతిపాత్రమైన ఈ కీర్తన మదనగోపాలస్వామిమీద ఆచార్యులవారు చెప్పారు. శృంగారకీర్తనలు చెప్పటంలో తన తండ్రికి తగిన కొడుకనిపించారు. కొలనిలో జలకములాడే గోపీరమణుల కుచగిరులపై నిరతి (మిక్కిలి ఆసక్తితో) వాలిన నల్లని మేఘమా అని సంబోధిస్తున్నారు. మరి మదనగోపాలుడు కదా! తనతండ్రి బాణీలోనే, ఈ స్వామియే తిరుమలలోని మన వేంకన్న అంటున్నారు.

**ఆ.వె॥మేటి మదనగోప! మేలుకో శృంగార-**
**రాయ అనుచు పొగిడె రమ్యముగను**
**మేలుకోవె మాకు మించు నిధానమా!**
**పెద తిరుమలాలపించె వినుడు.**

**రాగం : మలయమారుతం**

మేలుకో శృంగారరాయ మేటి మదన గోపాల
మేలుకోవె నాపాలి మించిన నిధానమా ॥మేలుకో॥

సందడించే గోపికల జవ్వన వనములోన
కందువ దిరిగే మదగజమవు
యిందుముఖి సత్యభామ హృదయపద్మములోని
గంధము మరిగినట్టి గండుతుమ్మెదా ॥మేలుకో॥

గతిగూడి రుక్మిణి కౌగిటి పంజరములో
రతిముద్దు గులికేటి రాచిలుకా
సతులు పదారువేల జంట కన్ను కలువలకు
ఇతవై పొడమిన నా యిందు బింబమా ॥మేలుకో॥





వరుస కొలనిలోని వారి చన్నుకొండలపై
నిరతి వాలిన నా నీలమేఘమా
సిరి నురమున మోచి శ్రీవేంకటాద్రి మీద
గరిమ వరాలిచ్చే కల్పతరువా ॥మేలుకో॥

**భావామృతం :**

మేటి (అధిపుడైన) మదనగోపాలా! మేలుకో ప్రభో! ఓ శృంగారరాయా! మేలుకొనుము తండ్రీ! నీవు నాకే చెందిన శ్రేష్ఠమైన విధానమవు (నిధానము అంటే భూమిలో పాతిపెట్టి దాచివుంచిన ధనము... నేటికాలంలో ఫిక్సెడ్ డిపాజిట్ అన్నమాట)

నీవు అతిశయించిన గోపికల యౌవన వనములలో స్వేచ్ఛా విహారము చేయు మదకరీంద్రము వంటివాడవు. చంద్రవదనయైన సత్యభామ యొక్క హృదయ కమలములోని మకరందము నాస్వాదించు మగ తుమ్మెదవు నీవే ప్రభూ! అట్టి నీవు మేలుకొని మమ్మల్ని ఆదుకో.

ఓ దేవదేవా! నీవు రుక్మిణీదేవి కౌగిలి పంజరంలో ఉపాయముతో కావాలనే చిక్కిన రామచిలుకవు. మనోజ్ఞమైన శృంగారమును వెదచల్లు నీవు ఇప్పుడు మేలుకో ప్రభూ! పదియారువేలమంది రాచకన్నెలు వరించగా వారిని సతులుగా స్వీకరించి, కలువలవంటి వారికన్నులను వికసింపచేయు చందమామ నీవే తండ్రీ! ఆ కలువలకు, ఇతవై పొడమితివి (వారి హితుడవై పొడజూపితివి).

ఆనాడు రేపల్లెలో కొలనులో జలకములాడు గోపికల స్తనగిరులపై నిరతితో (మిక్కిలి ఆసక్తితో) కమ్మిన నల్లని మేఘము నీవే ప్రభూ! ఈనాడు శ్రీవేంకటాద్రి మీద శ్రీదేవిని నీ యెదపై మోయుచూ శ్రీవేంకటేశ్వరుడవై, గరిమ వరాలిచ్చే (గొప్ప వరములిచ్చే) కల్పవృక్షము నీవే నయ్యా! ఏవరం కోరితే ఆ వరం ఇస్తావు (కాకపోతే... ఏమి కోరుకోవాలో అది కోరుకోనట్టి మూర్ఖులము మాత్రం మేమే)

## 5-64

## మున్నుడి

జగన్నాధునికి జగన్మాతకు వసంతోత్సవం జరుగుతున్నది. అమ్మవారి పక్షాన జేరి ఆమెను ప్రోత్సహిస్తున్నారు అన్నమాచార్యులవారు. సంతోష సాగరంలో తేలిపోతున్న ఆ అలివేణికి పులకరింతలు, మొలకలెత్తి పున్నమి శోభతో చిగురించినట్లున్నది. నీపతితో వసంతము ఆడవే తల్లీ! అంటున్నారు. శృంగారకీర్తన అయినందువల్ల సాధ్యమైనంత నర్మగర్భంగానే వివరణ ఇవ్వటం జరిగింది. ఆలోచించినకొద్దీ అన్నమయ్య భావవైశిష్ట్యం అర్ధమవుతుంది. శ్రీపతికూడా చిరునవ్వులు చిందిస్తాడు.

**చం॥ పులకలు మొల్కలై పొడమె పున్నమితోడుత కూడెనే యనెన్**
**అలికులవేణి! నీపతితొ ఆడవె వేడుకతో వసంతమున్**
**చెలువముతోడనీ పగిది చెప్పెను శ్రీసతి కన్నమార్యుడున్**
**తలపగ మేటి కీర్తనము తన్మయుడై విను, వేంకటేశుడున్**

*** అలికులవేణి=తుమ్మెదల గుంపువంటి వెంట్రుకలుగల స్త్రీ**

**రాగం : వసంత**

పులకల మొలకల పున్నమితోడనె కూడె
అలివేణి నీ పతితో ఆడవే వసంతము ॥పులకల॥

మాటలు తేనెలు వారె మక్కువలు చిగురించె
మూటలకొద్దీ నవ్వులు మొగ్గ లెత్తెను
వాటపు జవ్వనానకు వసంతకాలమువచ్చె
ఆటదానవు పతితో ఆడవే వసంతము ॥పులకల॥

చెమట రసములూరె సిగ్గులు పూవక పూచె
తిమురు తరి తీపుల తేనెలుబ్బెను
క్రమమున తమకము గద్దియు మదనుండెక్కె
అమర నీపతితోడ ఆడవే వసంతము ॥పులకల॥





కడుగోరి తాకులు కాయము కాయలు గాచె
బడినే కెమ్మోవిని పండు పండెను
ఎడలేక శ్రీవేంకటేశుడిట్టె నిన్ను గూడె
అదరి నీపతితోనె ఆడవె వసంతము ॥పులకల॥

**భావామృతం :**

ఓ అలివేణీ! (తుమ్మెదలవంటి నల్లని ముంగురులు కలదానా!) నీకు ఆనందాతిరేకమున తనువు పులకరించి, మొలకలెత్తి పున్నమి శోభను వెలువరిస్తున్నది. దేవీ! నీవు నీపతితో ఈవేళ వసంతములాడవమ్మా!

ఈ వసంతోత్సవమున నీవు ఆయనతో మాటలాడుతుంటే తేనెలు జాలువారుతున్నాయి. నీ అనురాగము చిగురించుచున్నది. నీ నవ్వులు మూటలకెత్తిన మొగ్గలైనాయి. వాటమైన నీ యౌవనమునకు వసంతశోభ ఆవరించింది. నీవు ఆటదానవు (మంచి నర్తకివి). అటువంటి నీవు నీ విభునితో వసంతము లాడవే తల్లీ!

దేవీ! నీ స్వేదము రసములూరినట్లున్నది. నీ సిగ్గులు పూచీపూయని మొగ్గలైనవి. తిమురుతరి (అలసటతో ఒళ్లు విరుచుకొంటున్నప్పుడు) మధుర మకరందములు ఉబికినవి. తన్మయత్వపు గద్దియను (సింహాసనమును) తనువులేని కందర్పుడు అధిరోహించెను. అటువంటివేళ, నీపతితో వసంతములాడి ద్విగుణీకృతమైన ఆనందంతో దీప్తించవమ్మా!

దేవీ! చిలిపివాడైన నీ స్వామి నఖక్షతములతో నీ కాయము కాయలు కాచిందమ్మా! బడినే (ఆ తరువాత) కెంపువంటి నీ మోవి పండిన పండువలె జూపట్టినది. అవిశ్రాంతుడైన ఆ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను సునాయాసంగా కూడినాడు. అదరి (త్వరపడి) నీ మనోవల్లభునితో వసంతము లాడవే తల్లీ! మీకు యెనలేని ఆనందం కలుగుటయే గాక ఆ శోభను, భావించిన మా జన్మలు కూడ తరించినవమ్మా!

**5-65**

## మున్నుడి

ఇతడు అంటే మన కన్నులయెదుట నున్న ఈ శ్రీవేంకటేశ్వరుడు. అన్ని వైభవములుకల అతడు (పరమాత్మ). అతను నిరాకార, నిరంజన, నిర్గుణ పరబ్రహ్మ. ఇతడు సాకార, భక్తవత్సల, సకల సద్గుణాభరణుడు. ఇతడు సమవర్తి, కానీ ధర్మవర్తనుల యెడ పక్షపాతి. ఆది, అంతము, పుట్టుక లేనివాడే... కాని అదితి, కౌసల్య, దేవకి మొదలైన వారు ఇతని తల్లులే. ధనమే కావాలనుకొనే అజ్ఞానులకు ధనమే ఇస్తాడు. ఇవ్వాళ ఉండి రేపు పోయే ఈ సిరి వద్దు ముక్తి కావాలి తండ్రీ! అంటే... అదీ ఇస్తాడు. అతడే ఇతడు. అంటున్నారు అన్నమాచార్యులవారు.

**ఉ॥ ఈతడె వేయి నేత్రముల యేలిక, వైభవముల్ అనంతముల్**
**ఈతడె ఆది అంతములు నెన్నగదోపని పద్మనాభుడున్**
**ఈతడె ద్రుంపు నాభవము, యేలెను యాదవ గోగణంబులన్**
**ఈతడె వేంకటేశ్వరుడు ఇచ్చును ముక్తిని అన్నమయ్యనెన్**

**రాగం : రీతిగౌళ**

అన్ని విభవముల అతడితడు
కన్నులు వేవేలు గల ఘనుడితడు ॥అన్ని॥

వేదాంత కోట్ల విభుడితడు
నాదబ్రహ్మపు నడుమితడు
ఆదినంత్యములకు అరుదితడు
శ్రీదేవుడు సరసిజ నాభుడితడు ॥అన్ని॥

భవములణచు యదుపతి ఇతడు
భువనములన్నిటికి పొడవితడు
దివికి దివమైన తిరమితడు
పవన సుతునేలిన పతి ఇతడు ॥అన్ని॥





గరుడని మీదటి ఘనుడితడు
సిరులిందరికి నిచ్చే చెలువితడు
తిరువేంకట నగము దేవుడితడు
పరమపదమునకు ప్రభువితడు ॥అన్ని॥

**భావామృతం :**

ఓ జనులారా! అన్ని వైభవములు కల అతడే (పరమాత్మ) ఇతడు (ఈ శ్రీవేంకటేశ్వరుడు). కన్నులు వేవేల కల ఘనుడు (సహస్రాక్షుడని వేదములు కీర్తించే మహానుభావుడు... ఈయనే సుమా!!)

కోట్లాది వేదాంతులకు ఈయన “విభుడు” (సర్వవ్యాపకుడైన పరబ్రహ్మ). మననోటిద్వారా ధ్వని పుట్టించు ‘నాదబ్రహ్మ’, మన అంతర్యామీ ఇతడే. ఈయనకు ఆది (మొదలు) లేదు. అలాగే అంతము(నాశనము) కూడాలేదు. అందుకే ఈయన “అరుదు” (అపూర్వుడు). ఈయనే పద్మనాభుడైన శ్రీమన్నారాయణుడు.

ఈయనే ద్వాపరయుగమున యదువంశమున జన్మించి శ్రీకృష్ణుడై, భవము నణచాడు. (ప్రాప్తించు పాప ఫలమును నిర్మూలించినాడు... ముక్తి నిచ్చాడు). చతుర్దశ భువనాలకు ఈతడే పొడవు (రూపము). వాటికి రూపము నొసగినవాడు ఈయనే. ఇతడు “దివికి దివమైన తిరము” (స్వర్గానికే స్థిరమైన స్వర్గం..అంటే స్వర్గంకంటే స్థిర మైన వైకుంఠ ప్రదాత). ఎంతోమంది దానినొసగినాడు. పవనసుతుడైన హనుమంతుని యేలిన కోసలనాధుడు శ్రీరామచంద్రుడు కూడ ఇతడే.

ఇతడే గరుడగమనుడైన శ్రీహరి. అందరికీ సిరిసంపదల నొసగే చెలువు (హితుడు) ఈ స్వామియే. ఇతడే శ్రీవేంకటాద్రిపై నెలకొనిన దేవదేవుడు. పరమపదము (మోక్షము) నియ్యగల ప్రభువు ఇతడే సుమా!!

## 5-66

## మున్నుడి

క్లిష్టమైన సంస్కృత కీర్తన నందిస్తున్నారు అన్నమాచార్యులవారు. శంకర చంద్ర పవన్ గారి సహకారంతో దీనికి భావామృతం వివరించ గలిగాను. జనన మరణాలు గల మానవ దేహ పంజరంలో చిక్కుబడిన జీవుడు జ్ఞానమెట్లు పొందగలడు? విష్ణు సంకీర్తనపై మక్కువ యెలా పెంచుకోగలడు? కుటిలత్వమూ, వేశ్యాలోలత్వమూ ఎట్లు వదలగలడు? జంతువులాగా జీవించుట వదిలిపెట్టి శ్రీవేంకటేశ్వరుని ఎట్లు భజించగలడు? ఆయన దయలేక అది అయ్యే పనికాదు.

**కం॥ జనన మరణములు గలిగిన**
**జనులకు జ్ఞానంబు మించి సమకూడుటయున్**
**కనుగొనె నెవ్వడు ధరణిని-**
**ననువుగ? మన అన్నమయ్య హరిదెలియరనెన్.**

**రాగం : ముఖారి**

మా దృశానాం భవామయ దేహినాం
యాదృశం జ్ఞానమితి యేఽ పి న వదంతి ॥మాదృశా॥

వా చా మగోచరం వాంఛా సర్వత్ర
నీచకృత్యై రేవ నిబిడీ కృతా
కేచిదపి వా విష్ణు కీర్తనం ప్రీత్యా
సూచయంతో వా శ్రోతుం న సంతి ॥మాదృశా॥

కుటిల దుర్బోధనం కూ (కు) హకం సర్వత్ర
విటువిడంబన మేవ వేద్యధీతం
పటువిమల మార్గ సంభావనం పరసుఖం
ఘటయితుం కష్టకలికాలే న సంతి ॥మాదృశా॥





దురితమిద మేవ జంతూనాం సర్వత్ర
విరస కృత్యై రేవ విశదీకృతం
పరమాత్మానం భవ్య వేంకటానామ-
గిరివరం భజయితుం కేవా న సంతి ॥మాదృశా॥

**భావామృతం :**

జనన మరణములుగల మావంటి దేహాలకు జ్ఞానమనునది ఈవిధముగా వుంటుందని ఏ ఒక్కరును చెప్పుట జరుగలేదు. (ఇక మేము అజ్ఞానులమై యుండుటలో వింత ఏమి వున్నది?

ఈ లోకమంతయును మాటలకందనిది. ఇది కామప్రేరేపితమైనది. ఇది నీచకార్యములతో నిండిపోయియున్నది. కాని, అట్లుండరాదని నాకెవ్వరూ సూచించలేదు. విష్ణునామ సంకీర్తన గురించి విన్నవారు కూడా నాకు తటస్థపడలేదు. (ఇక నేను ఎంత దురదృష్టవంతుడను!!)

ఛీ ఛీ - అంతయునూ కుటిలత్వమే. అంతయును దుర్బోధనమే. అంతయునూ అజ్ఞానమే. వేశ్యాలోలత్వముతో అందరూ కాలము గడుపుతున్నట్లు తెలియుచున్నది. ఇట్టి గడ్డుకాలము గడుపుచున్న దౌర్భాగ్యులకు, పటిష్టమైన మరియు శుభప్రదమైన "పరసుఖము" లభిస్తుందా? ఆ మార్గాన్ని సంఘటితము చేయగల వారెవ్వరు? అట్టి మార్గదర్శకులు నాకు కనబడుట లేదే. ఎంత విచారకరము!!

జంతువుల వలె జీవించుచూ, పాపకర్మల నొనరించుచూ బ్రతుకుతున్న నిస్సారమైన మానవుల అకృత్యములతో లోకమెల్ల విస్తరించియున్నది. పరమాత్మ స్వరూపుడైన శ్రీవేంకటాచలాధిపుని భజించువారే కనబడుటలేదు. (ఇకవీరు జన్మజన్మల విషవలయంనుంచి ఎట్లు బయటపడగలరు?)

## 5-67

## మున్నుడి

చిన్నారి బాలకృష్ణుని వర్ణిస్తున్నారన్నమాచార్యులవారు. ఆ బాలుని మోహము ముద్దులు ముంచెత్తుతున్నదట. కొంటెకృష్ణుడు అని అందరూ భావించే ఆ స్వామి నిద్దపు కూరిమినించుతాడట. (ఆయన ప్రేమ... గొప్ప స్నేహ భావాన్ని నింపిన ప్రేమట). ఈ బాలుడే పరమపురుషుడు, గీతాచార్యుడు. నాడు ఈతడే త్రివిక్రముడై "నేలకు నింగికి మరీ పొడవైనాడు" (భూనభాంతరములను నిండిపోయాడు). తానే నేడు వేంకటాచలపతియై మేలిమి (బంగారం వంటి వన్నెగల) చేతలతో పురుషోత్తముడై మించిపోయాడట.

**ఆ.వె॥ ముద్దులెల్ల ముంచె మోమున యీతండు**
**నిద్దమైన కూర్మినించి మించు,**
**బాలకృష్ణుమీద పాడెరా అన్నయ్య**
**"కూర్మి" కృష్ణుడాయె కొండలయ్య**

***నిద్దమైన=స్నేహముగల**

**రాగం : మోహన**

ముద్దులు మోమున ముంచగను
నిద్దపు కూరిమి నించీని ॥ముద్దుల॥

మొలచిరుగంటలు మువ్వలు గజ్జెలు
గలగలమనగా కదలగను
ఎలనవ్వులతో ఈతడు వచ్చి
జలజపు చేతులు చాచీని ॥ముద్దుల॥

అచ్చపు గుచ్చుముత్యాలహారములు
పచ్చల చంద్రాభరణములు
తచ్చిన చేతు(త)ల తానై దైవమని
అచ్చట నిచ్చట ఆడీని ॥ముద్దుల॥





బాలుడు కృష్ణుడు పరమపురుషుడు
నేలకు నింగికి నెరి పొడవై
చాల వేంకటాచల పతితానై
మేలిమి చేతల మించీని ॥ముద్దుల॥

**భావామృతం :**

సమ్మోహనకరుడైన ఈ బాలకృష్ణుని మొగము ముద్దులు నింపుకొన్నది. ఈ బాలుడు నిద్దపు కూరిమి (స్నేహపాత్రమైన ప్రేమను) నింపిన దేవదేవుడు.

ఈతని మొలకు (నడుమునకు) చిన్ని గంటలు కట్టారు. ఈతని కదలికలను ఆ గంటలు తెలుపుతాయి. ఇతను కాళ్ళు కదిలిస్తే, కాలిగజ్జెలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి. ఇతడు 'ఎలనవ్వుల'తో (చిరు నగవుతో) ఇక్కడకు వచ్చి తన 'జలజపు చేతులు' (పద్మములవంటి చేతులను) చాచియున్నాడు. వీనిని చేతులతో ఎత్తుకొని తరించండి.

'అచ్చపు ముత్యాలు' (స్వచ్ఛమైన ముత్యములు) గుచ్చిన హారములను ఈ చిన్నారి ధరించినాడు. పచ్చల చంద్రాభరణములు (మరకతములు పొదిగిన చంద్రహారములను) ధరించియున్నాడు. తచ్చిన చేతల (నవ్వు తెప్పించే చేష్టలతో) ఇక్కడ ఆడిన ఇతడే, అక్కడ (యుద్ధభూమిలో) తానే దేవదేవుడని నిరూపించాడు.

ఇతడు బాలుడని, కృష్ణుడని (నల్లపిల్లవాడు అని భ్రమపడకండి). ఈయన పరమపురుషుడు (పరమాత్ముడు) ఆనాడు నేలకు నింగికీ పొడవైన (భూమండలమే కాక ఊర్ధ్వ లోకాలు కూడా చీమదూరే సందుకూడా లేకుండా నిండి) వున్నాడు (వామనావతారంలో). నేడు చాల వేంకటాచలపతియై (గొప్ప వేంకటేశ్వరుడై) మేలిమి చేతలమించియున్నాడు (బంగారం వంటి మహిమలు చూపిస్తున్నాడు).

## 5-68

## మున్నుడి

శ్రవణపేయమైన ఈ కీర్తనలో అన్నమాచార్యుల వారు శ్రీరామచంద్రమూర్తిని సన్నుతిస్తున్నారు. గీర్వాణిలో వున్నా ఈ కీర్తన చాలా తేలికగా అర్థమవుతుంది, యెందుకంటే ఇది రఘుకుల తిలకుని సన్నుతి. ఈ సీతారమణుడు ధవళాబ్జ నయనుడట (తెల్లతామరలవంటి కన్నులుగలవాడట). అనిలజవరదుడట (హనుమంతుని అనుగ్రహించిన వాడట). ఈయనే తిరుమలలో శ్రీ వేంకటేశుడై సాటిలేని ఉదార స్వభావంతో గంభీరముగా భక్తుల మానసావనిలో విహరించుచున్నాడు.

**తే॥ "దేవదేవోత్తమా! నమో దివిజవంద్య!**
**రావణదమనా! శ్రీరఘురామా!" యనుచు**
**వేంకటేశుడే జానకీ విభుడటంచు**
**అన్నమయ్య కీర్తించె నహల్యవరదు.**

**రాగం: యదుకుల కాంభోజి**

దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీరఘురామా ॥దేవ॥

రవికులాంబుధి సోమ రామలక్ష్మణాగ్రజ
భువిభరత శత్రుఘ్న పూర్వజ
సవన పాలక కౌసల్యానంద వర్ధన
ధవళాబ్జ నయన సీతారమణా ॥దేవ॥

దనుజ సంహారక దశరథనందన
జనక భూపాలక జామాత
వినమిత సుగ్రీవ విభీషణ సమేత
మునిజన వినుత సుముఖ సుచరిత్రా ॥దేవ॥





అనిలజ వరద అహల్యా శాపమోచన
సనకాది సేవిత చరణాంబుజ
ఘనతర శ్రీవేంకటగిరి నివాస
అనుపమోదార విహార గంభీరా ॥దేవ॥

**భావామృతం :**

ఓ దేవదేవోత్తమా! (దేవదేవులందరిలో అగ్రగణ్యా!) నీకు నమస్కరించుచున్నాను. రావణాసురుని వధించిన శ్రీరఘురామా! (నిన్ను సన్నుతించెదను గాక!)

ఓ ప్రభూ! నీవు రవికులాంబుధి సోముడవు. (సూర్యవంశమను సాగరమున వుద్భవించిన చంద్రుడవు). లక్ష్మణుని పెద్ద అన్నగారైన శ్రీరాముడవు. భూమిపై భరత, శత్రుఘ్నులకు ముందుపుట్టిన అగ్రజుడవు. విశ్వామిత్రుని సవనపాలకుడవు (యాగమును రక్షించిన వాడవు). కౌసల్యా గర్భమున పుట్టి ఆమె ఆనందమును వర్ధిల్ల జేసినవాడవు. తెల్ల తామరల వంటి కన్నులున్నవాడవు, జానకీ వల్లభుడవు. అట్టి నీకు వందనములు.

ఓ శ్రీరామచంద్రా! నీవు దానవాంతకుడవు, దశరథపుత్రుడవు. నీవు జనక రాజేంద్రుని అల్లుడవు, వినమిత (వినయంతో నమస్కరించుచున్న) సుగ్రీవుడు విభీషణుడు తోడైయున్నవాడవు. నీవు మునిజనులచేత కీర్తించబడుచున్నవాడవు, ప్రసన్నవదనుడవు, అకళంక చరిత్ర కలవాడవు. అట్టి నీకు నా నమస్కారములు.

ఓ రాజారామా! నీవు వాయునందనుడైన హనుమంతుని అనుగ్రహించిన వాడవు. గౌతమమహర్షి భార్య అహల్యకు శాపవిమోచనము చేసినవాడవు నీవే. సనక సనందనాది మునులు సేవించు పాదపద్మములు కలవాడవు నీవే. అత్యంత శ్రేష్టమైన శ్రీవేంకటగిరిపై నివసించు శ్రీవేంకటేశ్వరుడవు కూడ నీవే ప్రభూ! నీవు సాటిలేని ఉదార స్వభావం కలవాడవు. నీవు గంభీరముగా నీ భక్తుల మానసావనిలో విహరించుచున్నావు. అట్టి నీకు వినయముతో నమస్కరించుచున్నాను తండ్రీ!

## 5-69

## మున్నుడి

మంగాంబుధిలో వెలసిన ఆంజనేయస్వామిని చూచి పులకిత గాత్రుడై అన్నమాచార్యులవారు చేసిన అద్భుత సృష్టి, ఈ కీర్తన. ఇతడే (ఈ హనుమంతుడే, అతడు (శ్రీరాముడు) కాబోలు అంటున్నారు. పైకి చూడటానికి రాఘువుడు పరిమితే లేని ఏలిక (జగన్నాథుడు) మరియు హనుమంతుడు మేటి బంటవీ (సాటిలేని సేవకుడు). కానీ ఇద్దరూ ఒకటే. ఈయన శివుడు ఆయన శ్రీహరి. శివకేశవులొకటే కదా! ఇద్దరికీ యెన్ని పోలికలున్నాయో చూడండి. (ఇటువంటి కీర్తన ఒక్క అన్నమయ్యే చెప్పగలరు).

**కం॥ ఇతడే అతడా ఏమొకొ?**
**మితినెరుగని రాఘవుండు మేటి హనుమయున్**
**జతగూర్చె నిర్వురకు ఆ**
**కత వినుడీ అన్నమయ్య కవనములోనన్**

**రాగం : ఖమాస్**

ఇతడే యతడు గాబోలేలిక బందును నైరి
మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు ॥ఇతడే॥

జలధి బంధించి దాటె చలపట్టి రాముడు
అలరి వూరకే దాటె హనుమంతుడు
అలుకతో రావణుని యదటణచెనతడు
తలచి మైరావణుని దండించెనితడు ॥ఇతడే॥

కొండ వెల్లగించె దొల్లి గోవర్ధనుడతడు
కొండంత సంజీవి యెత్తె కోరి యితడు
గుండు గరచె నహల్య కొరకు సీతాపతి
గుండు గరగగపాడె కోరి యితడు ॥ఇతడే॥





అంజనాచలము మీద నతడు శ్రీవేంకటేశు-
దంజనీ తనయుడాయ అనిలజుడు
కంజాప్తకుల రామఘనుడు తానును దయా-
పుంజమాయ మంగాంబుధి హనుమంతుడు ॥ఇతడే॥

**భావామృతం :**

మంగాంబుధిలో వెలసిన ఈ అంజనీ తనూజుడు, అతడు (శ్రీరామచంద్రుడు) కాబోయి. పైకి చూచుటకు ఏలిక (ప్రభువు) గా నౌకరు బంటుగా నింకొకరు కనిపించుచున్నారు. ఒకరు పరిమితిలేని రఘురాముడు, ఇంకొకరు సాటిలేని బంటుయైన హనుమంతుడు.

రామచంద్రుడు చలపట్టి (ఆగ్రహించి) జలధిని బంధించి దాటినాడు. కాని ఇతడు (ఈ వాయునందనుడు) అతిశయించి పెరిగిన దేహంతో వూరకే (ఒక్క దుముకుతో) అదే సాగరమును దాటినాడు. ఆ శ్రీరాముడు తన భార్య నపహరించాడని అలిగి రావణుని అదటును (తెంపరితనమును) అణచివేశాడు. ఏ ఉద్రేకమూ లేక, ఆలోచనతో మైరావణుని దండించినాడీ మారుతి.

శ్రీకృష్ణావతారమున, ఆ శ్రీరాముడే కొండను పెల్లగించి గోవర్ధనధారియై గోవులను గోపాలురను కాపాడినాడు. కొండను (సంజీవని పర్వతమును) పెల్లగించి తెచ్చి ఆయననే కాపాడినాడితడు. ఆ సీతాపతి అహల్య నుద్ధరించుటకు గుండు గరచెను (రాతిని తన పాదముతో తాకినాడు). ఈ ఆంజనేయుడు కోరి గుండు గరగగ (రాయి కరిగిపోవునట్లు) గానము చేసినాడు.

ఆయన అంజనాచలము మీద శ్రీవేంకటేశ్వరుడైనాడు. ఈ పవనపుత్రుడు అంజనీదేవి తనూజుడైనాడు. ఆ ఘనుడు కంజాప్త కులజుడు (పద్మప్రియుడైన సూర్యుని వంశస్థుడు). ఈయన దయాపుంజమైన (దయరాశియైన) హనుమంతుడై మంగాంబుధిలో వెలసి సరులను రక్షించుచున్నాడు.

**5-70**

## మున్నుడి

శరణాగతితో చేతులు జోడిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ శ్రీహరీ! పైకొని (నీ పై భారంవేసి కొని ) నీవే నాచెడును పరిహరించాలి (విసర్జించాలి) అంటున్నారు. నాకుప్రజ్ఞలేదు, అజ్ఞానిని, అకృత్యములు చేయటంలో దిట్టను. వికృతమైన పనులు చేయటం నా స్వభావం. నేను మంచిని ఎఱుగను. కొంత ఎఱిగినా, ఆచరించను. ఒకవేళ ఆచరించినా, యధాలాపంగా మంచిని చేస్తానేమో కాని చిత్తశుద్ధితోచేయను. అయితే నా అదృష్టం కొద్దీ ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే మోక్షప్రదాతవనే మర్మం తెలుసుకొన్నాను. ఇక నీవే, నీవే, నీవే....నాకు దిక్కు.

**ఆ.వె॥ ప్రజ్ఞహీనుడైన పాపాల పుట్టను**
**చేయరాని పనుల జేతునెపుడు**
**శరణు నమ్మినాను తిరువేంకటేశ్వరా!**
**అన్నమయ్య ఆర్తి నెన్నతరమె?**

**రాగం : సింహేంద్ర మధ్యమం**

నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య
పైకొని శ్రీహరి నీవే పరిహరించవే ॥నీకే॥

విజ్ఞానములు కొన్ని విందునే నూరకే
సుజ్ఞానములు కొని చూతు నేనే పొద్దు
అజ్ఞానము నే ననిశము నడచేది
ప్రజ్ఞహీనుడ నెంత పాపకర్మమో ॥నీకే॥

సుకృతము లొకమరి సొరిది నే బోధింతు
ప్రకృతి యొక్కొక్క వేళ భావింతునాత్మలో
అకృతములే నే ననిశము జేసేది
వికృతాచారుడ నింకా వికారమెంతో ॥నీకే॥





ధర్మమార్గము కొంత తలపున నెరిగితి
నిర్మలచిత్తమై మోక్షనిలయము నెరిగితి
నిర్మించి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలగాను
మర్మమెరిగితి నెట్లమన్నన గాచితివో ॥నీకే॥

**భావామృతం :**

(అద్భుతమైన శరణాగతి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య.)

ఓ శ్రీహరీ! నిన్నే నమ్మితిని తండ్రీ! నీకే శరణు అని మొక్కుతున్నాను. నీవే నాభారం తీసికొని నా దుర్గణములను రూపుమాపాలి. ఆ పరిహరించడం (విసర్జించటం) నావల్ల కావటం లేదు.

ప్రభూ! పెద్దల ద్వారా కొంత విజ్ఞానం (శాస్త్రములు బోధించు జ్ఞానము) వూరకే (యధాలాపంగా) నేను నేర్చాను. సుజ్ఞానము (సదాచారమ బోధించు జ్ఞానము) అన్నివేళలా ఆచరించాలని ప్రయత్నించాను. కాని అనిశము (నిత్యమూ) నేను అజ్ఞానులు దారిలోనే నడిచాను. ఎందుకంటే నేను ప్రజ్ఞాహినుడను (బుద్ధిహీనుడను). అట్టి నేను యెంత పాపకర్మచేస్తానో యెవరు లెక్కకట్టగలరు?

ఓ దేవదేవా! ఒక్కొక్కసారి నేను సొరిది (వరుసగా) సుకృతము (పుణ్యము) గురించి బోధిస్తూవుంటాను. ఒక్కొక్కసారి ప్రకృతి (స్వభావము) వలన మంచీచెడు ఆచరించ బడుతున్నాయి అనుకొంటాను. అన్నీ తెలిసినవాడు అమావాస్యనాడు చచ్చినట్లు, నేను ఎప్పుడూ చేసేవి మాత్రం అకృత్యాలే (చేయరానిపనులే...) ఎంతోవికారములు కలుగుట చేత, నేను చేసేవన్నీ వికృతములైన పనులే. మరినాకు సద్గతి ఎలా వస్తుంది స్వామీ!

ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నా తలపున (హృదయమున) కొంత ధర్మవర్తనను నేర్చుకొన్నాను. నిర్మలమైన చిత్తమే మోక్షమునకు ఆలయమని గ్రహించాను. మర్మమెరిగానాను. నన్ను ఏలెడి రక్షకుడవు సర్వమును నిర్మించి పరిపాలించు పాలకుడవని గ్రహించాను. తండ్రీ! నన్నెంత మన్నించావయ్యా!

## 5-71

## మున్నుడి

భక్తిపారవశ్యంతో శ్రీమన్నారాయణుని కీర్తిస్తున్న అన్నమాచార్యులవారిని వినండి."మేరతో" అంటే 'ఏర్పడినదై' అని అర్థం. "ఓ నారాయణుడా! నేను నమ్మిన నీ పాదమే నాకు కూడా దిక్కుగా యేర్పడినదై కలిగియున్నది-"అన్ని ఈ కీర్తన పల్లవికి అర్థం. దాదాపు ఇటువంటిదే 'నారాయణా నీ నామమే గతియిక అనే కీర్తనలోగడ వినివున్నాము. అదే భావావేశంతో చెప్పిన కీర్తన ఇది. కాని దేని రుచి దానిదే, అన్నమయ్య అనే వృక్షానికి ఎన్నో మధురఫలాలుకాచాయి. దేనిని తిన్నా మధురమే....

**కం॥ నారాయణ! నిను నమ్మితి**
**మేరతొ నీపాదమొకటె మించిన గతియౌ**
**తీరగ దురితపు పంకము**
**దారేదనె అన్నమయ్య తగు కీర్తనలో**

**రాగం : జయంత శ్రీ**

నారాయణ నిను నమ్మిన నాకును
మేరతో నీ పాదమే గతి గలిగె ॥నారాయణ॥

చింతాజలధుల చిక్కిన దాటించ-
నంతట నీపాద మదె తేప
కాంతల మోహపు కట్లుదెంచగ
పంతపు నీ పాద పరశువు కలిగె ॥నారాయణ॥

అతి దురిత పంకమందిన కడుగగ
మితి నీ పాదమే మిన్నేరు
రతి కర్మజులు రాచిన నార్చక
వ్రతము నీ పాదమే వానయై(మై) నిలిచె ॥నారాయణ॥





జిగినజ్ఞానపు చీకటి వాయగ
తగు నీ పాద ముదయపు రవి
అగు శ్రీ వేంకటనాథ నన్నేలగ
మిగులగ నీ పాదమే శరణంబు ॥నారాయణ॥

**భావామృతం :**

ఓ శ్రీమన్నారాయణుడా! నేను నిన్నునెర (పూర్తిగా) నమ్ముకొనియున్నాను. నాకు మేరతో (ఏర్పడినదై) నీ పాదమే దిక్కుగనున్నది.

నిన్ను నమ్ముకొనినవారు 'చింతాజలధి'లో (విచారము అనే సముద్రంలో) చిక్కుబడిపోతే నీ పాదమే తేప (తెప్ప) వలె వారిని దాటిస్తుంది. వారు స్త్రీ వ్యామోహంలో కట్టుబడిపోతే... పంతపు నీ నామమే (సాటిలేని నీ సంకీర్తనమే) ఆ కట్లు తెంచే పరశువు (గండ్రగొడ్డలియై) యున్నది అందుకనే నేను నీ పాదాన్నే నమ్ముకొన్నాను.

అత్యధికమైన పాపమను పంకము (బురద) అంటుకొంటే నీ పాదమే మితిమిన్నేరు (పరిమితిలేని ఆకాశగంగ). ఆ సురగంగ కంటే శ్రేష్టమైనది వేరే ఇంకేమి వుంటుంది? "కర్మజులు ఆర్చకవ్రతము రతిరాచినని నీ పాదమే వానయై (మై) గలిగె" (అని విడదీస్తే...ఈ వాక్యం అర్థమవుతుంది). కర్మజులు (కర్మకాండయందు ప్రీతిగలవారు, ఆర్చకవ్రతము రతి రాచినన్ (అర్చించు వ్రతముల యందు మక్కువతో చెలచబడుతున్నప్పుడు), నీ పాదమే వానయై నిలిచె. (వానయై అనే మాట.. వానమై అయివుండాలి. ఎందుకంటే వానమై అంటే గతియై అని అర్థం. నీ పాదమే గతిగావున్నది అని భావము).

అజ్ఞానపు చీకటి 'జిగి వాయగ' (వెలుగును హరించుచున్నప్పుడు) నీ పాదమే 'దయపు రవియగున్' (దయామయుడైన సూర్యభగవానుడైనది). ఓ శ్రీవేంటేశ్వరా! నన్ను పరిపాలించి రక్షించుటకు నీ పాదమే అతిశ్రేష్టమైన శరణము తండ్రీ!

## మున్నుడి 5-72

వైరాగ్యంతో కూడిన చక్కని జ్ఞానబోధను చేస్తున్నారు అన్నమాచార్యులవారు. మానవులు శీతోష్ణముల ఉధృతిని తట్టుకోలేరు, సుఖదుఃఖాలకు చలించిపోతారు, కాని ఆత్మజ్ఞానం కలవారు మాత్రం ఈ ద్వంద్వములన్నియు దేహమునకు (బొందికి) సంబంధించినవే అని, దీంట్లో వుండే దేహికి (ఆత్మకు) వీటితో వేరేపని ఏమియు లేదని గ్రహించగలరు. అట్లు ఊహించగలరు. అట్లు ఊహించనేర్చినవారు మాత్రమే ఆ ద్వంద్వముల వైపరీత్యమును ఓర్చుకొని నిలువగలరు. అట్టి ఆత్మజ్ఞానం ఎలా వస్తుంది? శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించి ఆ శ్రీహరిదాస్యం వలన విరక్తులై జ్ఞానులవుతారు అని అంటున్నారన్నమయ్య.

**కం॥ ఘన సంబంధము బొందికి**
**వినుమా ఆత్మకును లేదు వేరే పనియున్**
**కొనియోర్చి నిలుతు రిది విని**
**అనెనా అన్నయ్య తాను హరికి దెలుపుచున్.**

**రాగం : మలహరి**

దేహము సంబంధము-యివి దేహికి బనిలేదు
వూహించ నేర్చినవారలే- వోరుచుకుందురయ్యా ॥దేహము॥

విడువవు శీతోష్ణంబులు -విడువవు సుఖదుఃఖంబులు
వెడవెడ మరణభయంబులు- విడిచినయందాకా
ఉడుగవుకాంక్షలు మమతలు -నుద్యోగంబులు చింతలు
పొడవగు విరక్తి తనలో-బొడమి నయందాకా ॥దేహము॥

మానదు చిత్తవికారము-మానదు దుర్గుణ దోషము
మానదు భోగములన్నియు- మానినయందాకా
పోనీదు సేసిన దురితము-పోనీదు వ్రాతఫలంబును
పూనిన తన యజ్ఞానము- పోయినయందాకా ॥దేహము॥





తెగవటు భవబంధంబులు-తెగవెడయని గర్వంబులు
నిగిడిన యీ యాత్మజ్ఞానము- నీ విచ్చినయందాకా
జగదేక విభుడ శ్రీవేంకటేశ్వర -సర్వము నీయానతి కొలదే
తగులుచుండు నివి నిశ్చలముగ నీ-దాస్యము గలిగినయందాకా ॥దేహము॥

**భావామృతం :**

ఓ ప్రభూ! ద్వంద్వములని పిలువబడే శీతోష్ణములు, సుఖదుఃఖముల వంటివి దేహాన్ని మాత్రమే చలింపజేయగలవు. ఈ దేహం నశించేది. కాని దీంట్లోవుండే దేహికి (ఆత్మకు) వీటితో పనిలేదు. ఈ ఆత్మ స్వరూపం వూహించగలిగిన వారు మాత్రం ఈ ద్వంద్వముల వైపరీత్యాన్ని ఓర్చుకొనగలుగుతారయ్యా!

శీతోష్ణములు, సుఖదుఃఖములు వంటి ద్వంద్వములు ప్రాణిని విడువవు. ఈ శరీరంవున్నంత కాలము, వెడవెడ మరణభయంబులు (మిక్కిలి తుచ్ఛమైన చావుభయం) విడువదు. దీనికున్న కోరికలు మమకారములు నశించవు. రకరకములైన వుద్యోగములు (ప్రయత్నములు), అవి నెరవేరక చింతలూ తప్పవు. తనలో 'పొడవగు' విరక్తి (గొప్పవైరాగ్యం) పొడమినదాక (కనబడువరకు) ఈ ద్వంద్వములు దేహికి తప్పవు.

భోగములన్నియు మాననంత వరకు, మనస్సుకుండే వికారముపోదు. దుర్గుణముల వలన కలుగు దోషములు పోనేపోవు. ఇక ఈ పాపములు చేసినందు వలన కలుగు పాపఫలం ఎలా పోతుంది? నుదుటవ్రాసిన ఆ వ్రాతఫలం పీడించక మానదు. తనను ఆవహించిన అజ్ఞానం పోయేదాక అనగా ఆత్మజ్ఞాని అయ్యేదాక ఈ పీడ తప్పదు.

అజ్ఞానం వలన భవబంధాలు (జన్మలలో సంసార బంధములు) కలుగుతున్నాయి. ఎడతెగని గర్వము కలిగి ఆత్మజ్ఞానం నశిస్తుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! మాపై దయకలిగి నీవు మాకు ఆత్మజ్ఞానం ఇచ్చేదాక, మేము ఈ కర్మబంధాలలో చిక్కుకుపోయేవుంటాము. సర్వమూ నీఇచ్ఛప్రకారవే జరుగుతుందని తెలుసుకొనలేము.నీ అనుగ్రహం వలన నీ దాసులమై నీ దాస్యం వలన మాత్రమే మాకు విముక్తి కలుగుతుంది. ఇది నిశ్చయం తండ్రీ!

## మున్నుడి 5-73

అన్నమాచార్యులవారు చెప్పిన దశావతార కీర్తనలన్నీ పొడుపు కథల్లాగా 'బుఱ్ఱ' తొల్వగా (తొలిచేస్తుండగా) చాలా నిఘంటువులు (డిక్షనరీలు) వెతికిస్తాయి. కొన్ని కీర్తనలు దశావతారాలకీ ఈ కీర్తనకీ సంబంధమేమి టనిపిస్తాయి. ఉదాహరణకు ఈ కీర్తనలోని "విచ్చన విడినె తడువు విడచిపారెడిని"- అనే వాక్యాన్ని తీసికోండి. దీని అర్థమేమిటి? మీరు తెలుగు పండితులైతే యేమో గాని, నా బోటి సామాన్య 'తెలుగోడు' అయితే..వాడి 'గోడు' చెప్పలేం. విచ్చనవిడినె (సర్వస్వతంత్రుడై) తడువు విడిచి (ధరించిన చిన్న బట్టను ఊడదీసుకొని) పారెడిని (పారిపోయాడు).. ఈయన ఎవరు?...చదవండి.

**చం॥ కనుగొననైతినివ్విధపు గద్దరి వర్ణన యెందునైన, నే**
**పెనచి నిఘంటువున్ తెలిచి పెక్కు తెరంగుల "బుఱ్ఱతొల్వగా"**
**మనుసుకు తట్టె భావ మది మాధవ! నీ అవతార వర్ణనల్**
**ఘనుడగు అన్నమయ్య తనుగట్టి ప్రహేళికవోలె చెప్పెరా!**

*** గద్దరి = దిట్టతనం కలది *ప్రహేళిక = చిక్కుప్రశ్న**

**రాగం : ఆహిరి**

ఎటువంటి బిడ్డండె యితడు
ఇటువంటి వయసుననె యిట్ల జేసీని ॥ఎటువంటి॥

నదుక కెటు నీటిలోననె యీదులాడీని
తడవి పట్టెదమనిన దాగిపోయీని
తడబడక నేలగుంతలు వోవ దవ్వీని
కడప మీదనె వుండి కదల దెప్పుడును ॥ఎటువంటి॥

కలిమిలే మెరుంగడిదె కలవెల్ల నడిగీని
చలమ రెవ్వరినైన జావ నడిచీని
అలయ కడవుల వెంట నాటలకే తిరిగీని
తొలగకిటు గిరులెక్కి దుముకులాడీని ॥ఎటువంటి॥

విచ్చన విడినె తడవు విడిచి పారెడిని
రచ్చలనె యింత గుబ్బము వంటి కొడుకు
దిచ్చరీడై యిట్లు దిరువేంకటేశ్వరుండు
నిచ్చ నిచ్చలును గడుబెచ్చు వెరిగీని ॥ఎటువంటి॥





**భావామృతం :**

(ఓ అమ్మలారా!) వీడు ఎటువంటి బిడ్డండె (పిల్లగాడే)! ఇటువంటి వయసుననె (ఇంత చిన్న వయస్సులోనే), యిట్ల జేసీని (ఇట్లాంటి పనులు చేసినాడే...వామ్మో!)

"నదుకకెటు నీటిలోననె యీదులాడీని "- (నడకరాక వీడు నీట్లో ఈతకొట్టాడు..ఎవరు? మత్స్యావతారము). "తడవి పట్టెదమనిన దాగిపోయీని"- (వెదకి పట్టుకొందామంటే కొండకింద దాగికొనినాడే... ఎవరు? కూర్మావతారం) "తడబడక నేల గుంతలు వోవ దవ్వీని" -(సంకోచించకుండా భూమినంతా పెద్దకందకంలా త్రవ్వినాడు.. ఎవరు? వరహావతారం) "కడప మీదనెవుండి కదలదెప్పుడును"-(గడప మీదనే కూర్చొని చలించక ఎప్పుడూ వుంటాడు.. ఎవరు? హిరణ్యకశిపుని ఇంటాబయటా కాక గడప మీదనే గోళ్ళతో చీల్చి రక్తం జుర్రి సంహరించిన నరసింహుడు.)

"కలిమిలేమెరుంగడిదె కలవెల్ల నడిగీని"- (ఈయనకి నీవు ధనికుడివా, బీదవాడివా అని పనిలేదు. నీ దగ్గరవున్న వన్నీ అడిగిలాక్కొంటాడు...ఎవరు? వామనమూర్తి!. "చలమరెవ్వరినైన జావనడిచీని"- (మాత్సర్యం కలవాడు కాబట్టి ఎవరినైనా సంహరిస్తాడు...ఎవరు? పరశురాముడు). "అలయ కడవుల వెంటనాటలకే తిరిగీని"-(ఈయన అలుపులేక అడవులన్నీ గాలించి తిరిగాడు. అదికూడా కేవలం ఆటలాగానే... ఈయన మంత్రించి ఒక్కగడ్డిపోచ వేస్తే, అది ఎటువంటి శత్రువునైన చంపగలదు.... ఎవరు?మన శ్రీరామచంద్రుడు. "తొలగకిటు గిరులెక్కిదుమికీని"- (వదలక ఇట్లా కొండలెక్కిదుమికి తిరిగాడు.. ఎవరు? శ్రీకృష్ణుడు. గోవర్ధనపర్వతం మీద తిరిగాడు కదా!

"విచ్చన విడిసె తడువు విడిచి పారెడిని"-(సర్వస్వతంత్రుడై ధరించిన చిన్నబట్టను ఊడదీసికొని పారిపోయాడు...ఎవరు? త్రిపురాసురుల భార్యల మానముల నపహరించువేళ దిగంబరుడైన బుద్ధభగవానుడు. "రచ్చలనె యింత గుబ్బము వంటి కొడుకు...ఎవరు? రచ్చలనె (గోష్టిలో) పాల్గొనే గుబ్బము వంటి కొడుకు... హయగ్రీవావతారము.ఇట్లు దిచ్చరీడై (ఎవర్నిబడితే వారిని అనుగ్రహించే) శ్రీవేంకటేశ్వరుడై "నిచ్చనిచ్చలును గడుబెచ్చువెరిగీని"- దినదినాభివృద్ధి చెందుతున్నాడు ఈ దేవదేవుడు.

**4-74**

## మున్నుడి

అహోబల నృసింహునిపై అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి కీర్తన నాలకించండి. ఇంత సరళమైన కీర్తనలో కూడా యెన్నో మెలికలున్నాయి. స్వామిని నానామహిమల నాటకుడు అన్నారు. నిజానికి నాటకుడు అంటే నర్తకుడు లేక నాటకములాడు వాడని అర్థం. అనేక మహిమలు గలవానిని 'నాటకుడు' అనటం వల్ల, అది 'నాయకు'డేమో అనిపించినప్పటికీ...నటన సూత్రధారిగానే వివరించాను. మా అందరికీ మా పాలిట ఇంటివేలుపై (ఇలవేల్పువలె) కలిగి పరిపాలిస్తున్న ఈ నరసింహుని చూచితిమి, అన్నారు. ఈయనే శ్రీవేంకట నిధియందును నిలిచె..అంటున్నారు.

**ఉ॥ కంటిమి కంటి మీతనిని కల్గెను మాకితడెంచి చూడ మా**
**ఇంటికి వేలుపై వెలసె యేలెను మమ్ముల అన్నమయ్యనెన్**
**మింటను దేవతల్ కొలుచు మేటి అహోబల నారసింహుడౌ**
**ఒంటిగ ఏడుకొండల మహోన్నతుడౌ తిరువేంకటేశుడున్**

**రాగం : కల్యాణి**

కంటికంటి మిదె కలిగె మా పాలిట
యింటి వేలుపై యేలీ వీడె ॥కంటి॥

శ్రీనరసింహుడు చిన్మయరూపుడు
నానా మహిమల నాటకుడు
దానవాంతకుడు దైవశిఖామణి
పూని యహోబల పురపతి వీడె ॥కంటి॥

పరమ పురుషుడు ప్రహ్లాదవరదుడు
హరిలోకోన్నతు డనంతుడు
దురిత విదారుడు దుష్ట భంజకుడు
సిరుల నహోబల శ్రీపతి వీడె ॥కంటి॥





చెలువుడు వరదుడు జీవాంతరాత్ముడు
నిలిచె శ్రీవేంకట నిధియందు
బలువుడు సులభుడు భక్తరక్షకుడు
లలి నహోబల విలాసుడు వీడె. ॥కంటి॥

**భావామృతం :**

ఓ జనులారా! ఇదే కంటిమి. మా పాలి ఇంటివేలుపై (మా యొక్క ఇలవేల్పు వలె) కలిగె (నిలిచాడు), వీడే (ఈయనే) యేలీ (మమ్మల్ని పరిపాలిస్తున్నాడు) అట్టి ఈ నృసింహుని కంటి (చూచితిమి).

ఈ శ్రీనరసింహుడు చిన్మయ (చిత్+మయ) రూపుడు...అనగా జ్ఞానస్వరూపుడు. నానామహిమల ప్రదర్శించు నాటకుడు (జగన్నాటక సూత్రధారియైన శ్రీమన్నారాయణుడు). ఈయన రాక్షస నిర్మూలనా దీక్షాదక్షుడు. దేవతలందరికీ శిఖామణి (తలమానికము) వలెనున్నాడు. వీడే పూని (కావాలని) అహోబలపురాధిపతియై ఇచ్చట అనుగ్రహించుచున్నాడు.

ఈ స్వామి పరమపురుషుడు. ప్రహ్లాదుని పరిరక్షించిన వాడు. ఈయనే లోకేశ్వరుడైన శ్రీహరి, అంత్యమునెరుగని అనంతుడు. దురితవిదూరుడు (పాపములను సమూలముగా నిర్మూలించువాడు). దుష్టులను భంజించువాడు (వధించువాడు). వీడే అహోబలమున సిరులనొసగే సిరి మగడు.

ఈ మహానుభావుని యెంతని కీర్తించగలము? ఈయన చెలువుడు(ప్రాయుడు... అనగా భక్త ప్రియుడు). ఈయన వరదుడు (వరప్రదాత). ఈయనే జీవులందరిలోను అంతరాత్మల వలె నెలకొనియున్నాడు. ఈ స్వామియే శ్రీవేంకటపర్వతమను నిధానములో కూడా వెలసినాడు. సులభుడు (సులభముగా అనుగ్రహించువాడు) భక్తసంరక్షకుడు. వీడే అహోబలమున లలి విలాసుడు (ఉత్సాహముతో వెలసియున్నాడు.

## 5-75

## మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణమహోత్సవములో పాలుపంచుకొంటున్న అన్నమాచార్యులవారు చెప్పిన పెళ్ళిపాట ఇది. భూకాంతునికి తలబాలో (తలంబ్రాలు). స్వామి, బహుదారారతుడట. అనేకమంది రమణులకు అనేకరకములైన ఆనందములను ప్రాప్తింపజేసినవాడని అర్థం. ఈ కీర్తనలో స్వామిని హేమవర్ణుడు (బంగారు ఛాయకలవాడు) అనుట, కళ్యాణం ఉత్సవ విగ్రహులకు జరుగుతుంది కనుక ఆ వర్ణన సరిపోయిందని నాభావన. ఈయన దినపెండ్లి గల తరుణులపతియట. అంటే భూదేవి శ్రీదేవి అనే భామినులనుపెళ్ళాడే "నిత్య పెళ్ళికొడుకు" అన్నమాట.

**కం॥ తలబాలు భూరమణునకు**
**తలబాలో పెక్కుసతుల తగు రతునకునున్**
**అలవోక జెప్పె నన్నయ**
**కొలువగు తిరుకొండలయ్య కూడ రమణులన్**

**రాగం : ఆహిరి**

ధారుణీపతికిని దలబాలో బహు
దారారతునకు దలబాలో ॥ధారుణీ॥

హేమవర్ణునకు నిందిరాపతికి
దామోదరునకు దలబాలో
సామజభయ రక్షకునకు దులసీ
ధామునకు హరికి దలబాలో ॥ధారుణీ॥

కలికి రుకిమిణికి గడు దమకించి
తలదైవమునకు దలబాలో
మలసి సత్యభామకు బతిపంకజ-
దళనేత్రునకును దలబాలో ॥ధారుణీ॥





తిరువేంకటమున దినపెండ్లిగల
తరుణుల పతికిని దలబాలో
యిరవుగ బాయక యిందిరనురమున
ధరిచు వా(హ)రికి దలబాలో ॥ధారుణీ॥

**భావామృతం :**

('తలబాలు' అసలు స్వరూపం 'తలబ్రాలు' (తలన్+ప్రాలు) అంటే పెళ్ళిలో వధూవరులు దోసిళ్ళతో ఒకరి తలపై నొకరు పోసికొను అక్షతలు. మనం ఈ రోజుల్లో 'తలంబ్రాలు' అంటున్నాం.) ధారుణీపతికిని (భూకాంతునికి) తలంబ్రాలు. బహుదారారతునకు (అనేకమంది వనితల ఆనందవర్ధనునికి) తలంబ్రాలు.

హేమ వర్ణునకు (బంగారు వర్ణముగల ఈ దేవదేవునికి), లక్ష్మీపతికి, దామోదరుడైన ఈ స్వామికి, తలబాలో (తలంబ్రాలో). సామజ భయరక్షకునకు (గజేంద్రుని భయమునుండి రక్షించిన శ్రీహరికి), తులసీధామునకు (తులసి మాలలు ధరించినవానికి), హరికిని (నారాయణునకు) తలంబ్రాలు.

రుక్మిణీదేవిని మిక్కుటముగా తమకించిన (త్వరపడు నట్లుచేసిన), తలదైవమునకు (దేవాదిదేవునకు) తలంబ్రాలు. మలసి (తపించి) సత్యభామను పరిణయమాడిన పద్మనయనునకు తలంబ్రాలు. (అక్కడ రుక్మిణీదేవి తపిస్తే ఇక్కడ సత్యభామ కోసం స్వామి తపించాడట. జగన్నాటక సూత్రధారి జరిపిన ఈ రెండూ లీలలే....ఆయన కోసం అందరూ తపిస్తారు కాని ఆయన భావాతీతుడు కదా!)

ఈ వేంకటాచలమున శ్రీవేంకటేశ్వరుడై "దినపెండ్లి" (నిత్యమూ పెండ్లాడు) గల, తరుణులపతికి (ఇద్దరు భామల ముద్దులమగనికి)తలంబ్రాలు. ఇరువుగ (నెలకొని) పాయక (వదలక) శ్రీలక్ష్మిని ఉరమున (హృదయమున) ధరించిన శ్రీహరికి తలంబ్రాలు. ఓ కళ్యాణచక్రవర్తీ! ఈ సంతోషసమయంలో నన్ను మరువకు తండ్రీ!

**5-76**

## మున్నుడి

కడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తున్నారు అన్నమచార్యులవారు. కడపరాయుడవై నెమ్మదిగా నన్ను కూడితివి. ఇదిగో (నా కలలు) నిజమాయె అని అంటున్నారు. తనని శ్రీవేంకటేశ్వరుని ప్రేయసిగా భావించుకొని ఈ సరసశృంగార కీర్తన చెబుతున్నారు. ఓ ప్రభూ! నీమాయలెల్లా మానవు. ఎప్పటికీ నీవు అంతే. నానిన నానునుపులు నవ్వించినప్పటికీ నీవు మానవు, అంటున్నారు. (నీరుగారిపోయిన నా అనురాగము నీకు నవ్వు తెప్పిస్తుందేమో కాని, నీవు మాత్రం నీ మాయలను మానుటలేదు...అని అర్థం).

**తే॥ మానవెప్పుడు నీదగు మాయలెల్ల**
**నాని నా ననుపులు నీకు నవ్వుదెచ్చు**
**కడపరాయునిగ తిరువేంకట విభుడిని**
**అన్నమార్యుడు కీర్తించెనద్భుతముగ**

**రాగం : పాడి**

మానవెప్పుడును నీమాయలెల్లాను
నానిన నా ననుపులు నవ్వించీ గాని ॥మాన॥

వాలుక రెప్పలు నీ పై వంచి నే నెంత లోచినా
తాలిమె చూపుదు గాక తత్తిరించేవా
వాలాయించి రాతి గుండెవాడ వౌత యెఱుగుదు
పాలు మాలిన నా యాస పాయ నీదు గాని ॥మాన॥

ఆయములు సోక మాటలాడి యంత కొసరిన
చాయకాడవె కాక సమ్మతించేవా
కాయకపు నీ సరిత గట్టిగా నేనెరుగుదు
పాయపు నా వేడుకలు పై కొలిపీ గాని ॥మాన॥





చిమ్ముచు నీ కౌగిటిలో చేతలెంత సేసినాను
కుమ్మరించి నాతోను నీ గుట్టు చెప్పేవా
కమ్మటి శ్రీవేంకటాద్రి కడపరాయడ వై
నెమ్మది గూడితి విదె నిజమాయ గాని ॥మాన॥

**భావామృతం :**

ఓ తిరుమల నాయకా! నీరు గారిపోతున్న నా ప్రేమ నీకు నవ్వు తెప్పిస్తున్నదేమో ప్రభూ! నీవు మాత్రం నన్ను నీమాయలతో భ్రమింపచేయుట మానలేదు.

నేను మీనముల వంటి నా కనురెప్పలను త్రిప్పి నీవైపు చూచిననూ నీవు తాలిమి చూపుదువు. (ఓర్పునే వహించుచున్నావు). కాక తత్తరించేవా (అంతేకాక నన్ను తొట్రుపడునట్లు చేయుదువు). నన్ను నిర్బంధింతువు. నీవు రాతిగుండె వాడివయ్యా! నీకు జాలిలేదు. అది నేనెరుగుదును. కాని నేనేమి చేయగలను? పాలు మాలిన నా ఆస (సోమరితనంతో కూడిన నా ఆశ) నన్ను విడిచిపెట్టదు.

నా స్థితి అట్లావుంటే....నీవు ఆయములు సోక మాటాలాడి (మర్మస్థానములంటి సంభాషింతువు). అంత కొసరిన చాయకాడవు (అతిగా కోర్కెలు పెంచిమాయమయ్యే మాయకాడవు). అట్లుగాక సమ్మతించి నన్ను చేరుదువా? నీ జీవన సరళి నేనెరుగనా? కాని నేనేంచేయగలను స్వామీ! నా పాయపు వేడుకలు పై కొలిపీ గాని (ప్రాయము వచ్చిన నా కుతూహలం అతిశయించుచున్నది కదా!)

నీ ఆలింగనమున త్వరపరచు నీసేత లెంత సేసినా నీ గుట్టు నేనెరుగగలనా? శ్రీవేంకటాద్రిపై వెలసిన ఓ మధురమూర్తీ! కడపలో నీవే కడపరాయడివై నెమ్మదితో కూడితివి. ఇదే నా కోర్కెలు నిజమాయెనయ్యా!

## ముున్నుడి 5-77

తిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామిపై అన్నమాచార్యులవారు చెప్పిన మధురమైన కీర్తన ఇది. వటపత్రశాయివై పొడచూపిన గోవిందరాజా! ఇట్టి రూపముతో కొలువై వున్నావా? అని కీర్తిస్తున్నారు. ఆయన కొంకక వరములిస్తాడట. సొరిది దాసుల కృపచూస్తాడట. ఒడికపు రాజసాన నొత్తిగిలినాడట. అర్థమైనట్లుండే అర్థంకాని మాటలెన్నున్నాయో!!

**సీ॥ కొలువౌచు తోపేవు గోవిందరాజ! ఆ**
**వటపత్రశాయివై వరలినావు**
**పడతులిద్దరిపైన పాదాలు చాచేవు**
**ఒడికంపు రాజసమొప్ప నీవు**
**నాభికమలములో నలువ నీకొడుకుండె**
**శేషశాయివినీకశేష సిరులు**
**పరగు దైత్యులమీద పాము విషము గుప్పి**
**దాసుల జూచేవు దయను నించి**

**తే॥ శంఖ చక్రాల కరములు చాచినావు**
**శిరసు క్రింద హస్తంబును చేర్చినావు**
**వేంకటాద్రి తిరుపతిలో వెలసినావు**
**అమృతంపు కీర్తన జేప్పె నన్నమయ్య.**

**రాగం : శంకరాభరణం**

అల వటపత్రశాయివైన రూపము ఇట్టిదని
కొలువై పొడచూపేవా గోవిందరాజా ॥అల॥

పడతులిద్దరి మీద పాదములు చాచుకొని
ఒడికపు రాజసాన నొత్తిగిలి
కడలేని నిజనాభి కమలమున బ్రహ్మను
కొడుకుగా కంటి విదె గోవిందరాజా ॥అల॥





సిరుల సొమ్ములతోడ శేషునిపై పవళించి
సొరిది దాసుల కృప జూచుకొంటాను
పరగు దైత్యుల మీద పాము విషములే నీవు
కురియించితివిగా గోవిందరాజా ॥అల॥

శంకు చక్రములతోడ చాచిన కరముతోడి
అంకెల శిరసుకింది హస్తముతోడ
తెంకిని శ్రీవేంకటాద్రి దిగువ తిరుపతిలో
కొంకక వరములిచ్చే గోవిందరాజా ॥అల॥

**భావామృతం :**

ఓ గోవిందరాజా! ఆనాడు వటపత్రశాయివై (మర్రియాకుపై నోటిలో కాలి బొటనవ్రేలు పెట్టుకొని చీకుచూ పవ్వళించిన) శిశువువలె నున్న రూపము ఇట్టిదేలే... అని ఇచ్చట పవ్వళించినట్లు కొలువు దీరి పొడచూపేవా (కనుపించుచున్నావా?)

స్వామీ! నీవు పడతులిద్దరిమీద (శ్రీదేవి, భూదేవి అను నీ ఇద్దరు భార్యలపై) నీ పాదములు చాచి వుంచి, వారిద్దరూ నీ పాదము లొత్తుచుండగా, ఒడికపు (మనోహరమైన) రాజసాన (రాజదర్పముతో), ఒత్తిగిలి పరుండి కనిపించుచున్నావా? అంతులేక నీ నాభినుంచి పుట్టిన తామర పుష్పములో జనించిన నీ పుత్రుడు బ్రహ్మదేవుని, ఇదిగో మేమూ దర్శించితిమి. ఓ గోవిందరాజా! మేము ధన్యులము తండ్రీ!

ప్రభూ! వైభవములొలుకు నీ నగలను అలంకరించుకొని నీవు ఆదిశేషునిపై నిద్రించుచుంటివి. అయినా నీ భృత్యులైన మమ్ము కృపతో ఒక కంటగమనిస్తూనే వున్నావు. పరగు (వీర విహారము చేయు) రాక్షసుల మీద పాము విషములే (ఆదిశేషుని గరళము) వర్షింపజేయుచుంటివయ్యా! ఓ గోవిందరాజా! మమ్ము రక్షించుట మఱువకు తండ్రీ!

ఓ దేవదేవా! చాచివుంచిన నీ చేతులలో శంఖ చక్రములు ఆయుధములై మెరయుచున్నవి. అంకెల (గురుతైన) నీ శిరస్సుక్రింద ఒక చేయినుంచికొని నిదురించుచుంటివి. శ్రీవేంకటాద్రి కింద తిరుపతిలో తెంకిని (స్థావరమై) నీవే మాత్రము కొంకక (వెనుదీయక) వరములిచ్చుచుంటివి. ఓ గోవిందరాజా! నిన్ను సేవించు మా జన్మధన్యమైనది తండ్రీ!

## 5-78

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు శ్రీవేంకటేశ్వరుని గడుసుగా ప్రశ్నిస్తున్నారు. నీ భక్తులంతా జ్ఞానులు, యోగులు, మునులు. వాళ్లని నీవెలాగూ రక్షిస్తావు. దానివల్ల నీకు ప్రత్యేకంగా ఒరిగేదేమిటి? నాబోటి 'అజ్ఞాన సామ్రాట్టు'ను, ఎన్నెన్నో నీచ జన్మలెత్తిన వాడిని, నీచాతి నీచుణ్ణి, ఐదు ఇంద్రియాలచే పరిపాలింపబడు గర్విష్టిని నీవెంత వెదకినా దొరుకుతాడా? నేనే లేకపోతే నీదయ ఎవరిపై చూపిస్తావు? నావల్లనే నీకు ఆర్తత్రాణ పరాయణుడవన్న బిరదూ వచ్చింది. నీవల్ల నాకు బ్రతుకు వచ్చింది. నావల్ల నీకు పుణ్యము వచ్చాయి. కాబట్టి మేలు ఇద్దరికీ కలిగింది సుమా! అంటున్నారు.

**తరలము :**

**వినుము నేనొకడన్ జగంబున వేంకటేశ్వర లేనిచో**
**ఘనుడ! నీదయ బొంద బాత్రుడు కాడుయెవ్వడు నిక్కమౌ**
**వెనుక మూర్ఖుడు నన్ను మించుచు విశ్వమందున లేడురా**
**కనుక నావలనన్ ప్రసిద్ధిని గాంచినావనె అన్నయున్**

**రాగం : బౌళి రామక్రియ**

నేనొక్కడ లేకుండితే - నీ కృపకు బాత్ర మేది
పూని నావల్లనే కీర్తి - బొందేవు నీవు ॥నేనొక్క॥

అతి మూఢులలోన - నగ్రేసరుడ నేను
ప్రతిలేని ఘనగర్వ - పర్వతమను
తతి బంచేంద్రియముల - ధనవంతుడను నేను
వెతకి నావంటివ ఆ (వా) ని - విడువగ జెల్లునా ॥నేనొక్క॥

మహిలో సంసారపు సా - మ్రాజ్యమేలే వాడ నేను
యిహమున గర్మవహి - కెక్కితి నేను
బహుయోని కూప సం-పద దేలే వాడ నేను
వహించుక నావంటి - వాని దేనోపేవా ॥నేనొక్క॥





భావించి నావంటి నీచు -బట్టి కాచినప్పుడుగా
యే వంక నీ కీర్తిగడు - నెంతురు భువి
నా వల్ల నీకు బుణ్యము - నీవల్లనే బ్రదుకుదు
శ్రీవేంకటేశుడ యింత - చేరె జుమ్మీ మేలు ॥నేనొక్క॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నేనే లేకపోతే నీదయ ఎవరి మీద చూపిస్తావు? నా ఒక్కడివల్లనే నీవు "ఆర్తత్రాణపరాయణుడు" అనే కీర్తిని పొందావు అవునా? కాదా?

నేను 'మూర్ఖాగ్రేసర చక్రవర్తి' అనే బిరుదాంకితుడను. పర్వతములంత గర్వం కలవాడిని. శ్రోత, త్వక్కు, చక్షు, జిహ్వా, ఘ్రాణ (చెవులు, చర్మం, కళ్ళు, నాలుక, ముక్కు) అనే ఐదు గొప్ప సంపదలున్న ఘనుడిని. ఇంత గొప్ప అజ్ఞాని నీకు కాగడావేసికొని వెదకినా కనిపిస్తాడా? ఇటువంటివాడిని నన్ను వదిలిపెట్టుట నీకు తగునా? ఇక ఆలస్యం చేయక నా సంగతి చూడవయ్యా!

ఈ లోకంలో "సంసార సామ్రాజ్యాధిపతి"ని నేను. నావంటి ఏలిక (పరిపాలకుడు) మరి లేనే లేడు. నా కర్మలవల్ల (మంచివి కావు చెడ్డ కర్మలే) ఎనలేని పేరు సంపాదించాను. ఎన్నెన్నో మురికి యోనికూపాలలో జన్మించి అదే జీవితమనుకొని, ఆ వైభవం కోసమే తపించిపోయాను. నావంటి వాణ్ణి మరొక చోట తేనోపేవా (తేగలవా?) సాధ్యమేకాదు. ఇంకా ఆలోచిస్తావెందుకు? నాగురించి ఒక్కసారి ఆలోచించు ప్రభూ!

స్వామీ! జ్ఞానులను, యోగులను, మునులను, నీవెలాగూ రక్షిస్తూనే వుంటావు. అందులో యేమి గొప్ప వుంది? నావంటి నీచాతి నీచుణ్ణి వెదకి పట్టుకొని వాడిని రక్షిస్తే... అప్పుడు నీ కీర్తి ఇనుమడిస్తుంది. అప్పుడు అంతా నిన్ను 'దీనజనరక్షకుడు' అని పిలుస్తారు. నీకు కూడా ఎంతో పుణ్యం దక్కుతుంది. నేను నీవలన బ్రతికిపోతాను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇది మనిద్దరికీ లాభసాటి బేరమే ప్రభూ! ఇంతమేలు చేరెన్ జుమ్మీ! (ఇంత మేలు మనిద్దరికీ కలిగింది సుమా!) అందుకని నా సంగతి చూడవయ్యా తండ్రీ!

**5-79**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఒక్కొక్కసారి కీర్తన పల్లవిలోనే "తీరని చిక్కులు" పెడుతుంటారు. 'ఓ దేవదేవా! వేదము కూడా తీర్చదు. వేరు వేరు అంశములను తెలిపే ఆరు శాస్త్రములూ తీర్చలేవు. ఏదీకూడా యిది తీర్చదు. నీమాయ అంటున్నారు. నీ మాయే ఒక చిక్కు అని ఆచార్యులవారి భావన కావచ్చు. మనవంటి 'చిన్న' వాళ్లకి అది చిక్కే-మరి. "తెమ్మలాయె నీ తీరని చిక్కు" - అంటే ఏమిటో? బహుశా అది 'తెమలాయె' కి రూపాంతరం అయివుంటుంది. తెమలాయె అంటే 'చలించి పోవునట్లు చేసేవి' - అని అర్థం. మరి ఆ శ్రీనివాసుని 'చిక్కు'లు మనల్ని ఏడిపించవూ?

**ఉ॥ వేదము దీర్చలేనిదిది వేరగు శాస్త్రములెట్లు దీర్చురా**
**యేదియు దీర్చదో తిరుమలేశ్వర నీదగు మాయ దెల్వగా**
**లేదుర దారి నీ శరణు రెప్పల నార్పెడి యంతలోననే**
**ఆదుకొనున్ విపన్నులగు యందరినో ప్రభు! అన్నమయ్యనెన్.**

**రాగం : శంకరాభరణం**

వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియు దీర్చదు యిది నీమాయ ॥వేదము॥

నీవల్ల బ్రదికిరి నిండు దేవతలు
నీవల్ల నసురులు నెఱి జెడిరి
ఆవల నిందరి కాత్మవు నీవు
చేవదీరె నీ చిక్కులే భువిని ॥వేదము॥

నెమ్మి బాండవుల నీవారంటివి
కమ్మర విడిచి కౌరవుల
యిమ్ముల నీ వావి యిద్దరి కొక్కటే
తెమ్ములాయ నీ తీరని చిక్కు ॥వేదము॥





జగమున నీదే స్వతంత్ర మెల్లా
నెగడిన జీవులు నీవారు
తగు శ్రీవేంకట దయివమవవు యిన్నియు
తెగి నీ దాసులు తెలిసిన చిక్కు ॥వేదము॥

**భావామృతం :**

ఓ మహానుభావా! ఇది(ఈ జగత్తంతా) నీ మాయయే తండ్రీ! ఇదొక గొప్ప చిక్కు ప్రశ్నలాంటిది. వేదము ఈ చిక్కుముడి విప్పలేదు. ఆరు శాస్త్రములూ ఆ చిక్కును వివరించలేవు. నీమాయ కల్పించే చిక్కునెవరూ సవరించలేరు. (నావల్ల ఏమవుతుందయ్యా?)

దేవతలందరూ నీవలననే బ్రతికిపోయారు. అసురులందరూ "నెఱిజెడిరి" (క్రమముగా నశించారు. ఒకరి తరువాత ఇంకొకరు నశించారు) అదట్లా వుంచి వాళ్లకీ వీళ్లకీ కూడా ఆత్మవు పరమాత్మవైన నీవే. ఈ ప్రపంచంలో నీవు కల్పించే చిక్కులే చేవదీరినవి (ధైర్యమును నిర్మూలిస్తాయి) ప్రభూ! (ఆచిక్కు విప్పటం నాకు సాధ్యమా?)

దేవా పాండవులను నెమ్మిన్ (ప్రేమతో) నీవారు అన్నావు. కమ్మర (క్రమ్మర = మరల) కౌరవులు కూడ అదే బంధుత్వం కలిగినవారే కదా! నీవావి (చుట్టరికం) ఇద్దరికీ ఒక్కటే. కానీ ఒకళ్లని అనేక విధాలుగా రక్షించావు. ఒకరిని చేయకూడని విధంగా అంతమొందించావు కదా! నీ చిక్కు తెమ్మలాయె (చలించి పోవునట్లు) చేయుచున్నది. (దీనిని తట్టుకోవడం నావల్ల అవుతుందా తండ్రీ!)

ప్రభూ! ఈ జగత్తులో కేవలం నీ స్వాతంత్ర్యమే చెల్లుబాటు అవుతుంది. నెగడి (వర్ధిల్లెడి) జీవులందరూ నీ బిడ్డలే కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ జీవులందరికీ నీవే దేవుడవు. నీకు భృత్యులై తెగి(విరక్తులైన) నీ దాసులు మాత్రమే తెలిసిన చిక్కు (అర్థం చేసికొనగల చిక్కుముడి) ఈ నీ లీల. తగునట్లు నీలీల అర్థం చేసికొనగల శక్తి నాకున్నదా తండ్రీ! (అందుకే నిన్నే శరణు జొచ్చాను స్వామీ!)

## 5-80

## మున్నుడి

గోపాలకృష్ణుడు రేపల్లెలో చేసిన గోలని కీర్తిస్తున్నారు. అన్నమాచార్యులవారు ఆనాడు తన అల్లరితో అందర్నీ ముప్పు తిప్పలు పెట్టిన కృష్ణుడు “ఎచ్చట జూచిన నితడే” అంటున్నారు. అంటే అక్కడెక్కడో వున్న రేపల్లెలోనే కాదు ఇక్కడ (తిరుమలలో) కూడా వాడే. ఇక్కడ మచ్చికన్ (మోహముతో) ఈ అలమేల్మంగతో కూడి వెలసినాడు అంటున్నారు. ఉట్లను పగులగొట్టి, అల్లరి గొల్లలతో ‘కోలలు’ ఆడిన ఆ నంగనాచికి చక్కిలాలు, అడు(టు)కులు ఇష్టమట. నెఱవాదికాండ్ల, నురుగులు – వంటి మాటలు మన భాషలో మరుగునపడ్డాయి. నాబోటి వాడికి నిఘంటువున్నా కష్టంగానే వున్నది.

**మ॥ ఇతడే యెచ్చట జూచినన్ నిలిచెరా ఈకృష్ణుడే మంగకున్**
**సతికిన్ మచ్చికయై తగున్, వెలసెగా చక్కంగ గోవిందుడై**
**జతయై గొల్లల కొట్టె ‘నుట్లు’ భళిరా! జాణందు అన్నయ్యనెన్**
**వెతలన్ బెట్టెను గోపకన్నియల ఈ వేంకన్న నేమందురా?**

**రాగం : మిశ్ర బలహరి**

ఎచ్చుట జూచిన నితడై కృష్ణుడు
మచ్చిక నలమేలు మంగతో వెలసీ ॥ఎచ్చుట॥

కొట్టరో వుట్టులు గోపాల బాలులు
యిట్టె కృష్ణుని యెదుటను
పట్టరో వారలు పాలు నేతికిని
గట్టిగ జోరున కారీ నవిగో ॥ఎచ్చుట॥

కూడరో మూకలు కోలల వారలు
వేడుక కృష్ణుని వెంటవెంట
ఆడుచు మెసగరో అడుకులు చక్కిలాలు
వాడల వాడల వరుసతోను ॥ఎచ్చుట॥





నిక్కి తీసుకోరో నెఱవాది కాండ్లు
మక్కువ కృష్ణుని మఱగునకు
యెక్కరో శ్రీవేంకటేశు కొండమీద
పెక్కు నురుగులు పెరుగులు నవిగో ॥ఎచ్చుట॥

## భావామృతం

ఓ ప్రజలారా! ఎచ్చుటజూచినను ఇతనే (శ్రీవేంకటేశుడే) అయి శ్రీకృష్ణుడు, మచ్చికన్ (గాఢమైన అనురాగము) కలవాడై ఈ అలమేల్మంగతో వెలసి యున్నాడు. (వీనిని సేవించండి).

ఓ గోపాలబాలులారా! భయపడకండి. కృష్ణుని యెదుటను వుట్టులు (ఉట్లు), ఇట్లే కొట్టరో (తేలికగా పగులకొట్టండి). ‘పట్టరో వారలు’.. (అంటే వారలు పట్టరో... అనగా ఆపోసన పట్టండి... అంటే ఎంగిలి చేసి వదలటం అన్నమాట). పాలు, నెయ్యి ఎంగిలి చేసి అన్నం తిని, త్రాగినంత త్రాగి పారేయండి. జోరుగా గట్టిగా (అధికముగా) ఆ పాలూ నేయూ కారిపోతున్నాయి. అదిగో చూడండి.

కోలల వారలు (కోలాటము ఆడే కుర్రవాళ్ళు) మూకలు కూడరో (ఒక గుంపులాగా రాండర్రా). శ్రీకృష్ణుని వెంట మీరంతా వస్తుంటే ఎంత వేడుకగా వున్నదో. వాడల వాడల (వీధులన్నిటిలోను) వరుసగా, ఆడుచూ (ఆడుకొంటూ) మీరంతా అడుకులు (అటుకులు) చక్కిలాలూ, మెసగరో (తినండర్రా).

మక్కువతో (ప్రేమగా) శ్రీకృష్ణుని మఱగునను (చాటున నిలిచికొని), నిక్కి (అతిశయించి) నెఱవాది కాండ్లు (నేర్పరితనంగల వారంతా) మక్కువ తీసుకొనరో (ఆశ్రయం తీసికొనండి). అంటే... శ్రీకృష్ణ పరమాత్మను ఆశ్రయించండి. మరినేడు కలియుగంలో ఉట్ల పండుగ తిరుమలలో, శ్రీవేంకటేశుని కొండమీద జరుగుతున్నది. మీరంతా ఆ కొండ యెక్కరో (ఎక్కండయ్యా!) అవిగో ఎన్నో పెరుగులూ, నురుగులూ (పేణీలు) వున్నాయి. ఇవి స్వామి ప్రసాదం, భక్తితో స్వీకరించండి.

**5-81**

## మున్నుడి

ఈ చిన్న సంస్కృత కీర్తనలో అన్నమాచార్యుల వారు ఎన్నో సందేహాలను వెలిబుచ్చుతున్నారు. "అసలు నేను చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి? అన్నీ అనుమానములే. నేను నిత్యశంకితుడనై నా శంకలకు సమాధానం లేని బుద్ధి జాడ్యమును పొందుచున్నాను" - అని అంటున్నారు. కరిరాజ వరదుడైన శ్రీవేంకటేశ్వరుడే నాకు దిక్కు. దేహాభిమానముతోను చంచల బుద్ధితోను నేను పీడించబడుచున్నాను. స్వామి శరణు కోరుచున్నాను, అంటున్నారు.

**ఆ.వె॥ శంకలన్ని నన్ను జాడ్యంబులై బట్టె**
**చేయుచుంటి నేమి, చేయుటేమి?**
**కరిని గాచినట్టి తిరువేంకటేశుడే**
**ఉన్న దిక్కు అనెను అన్నమయ్య**

**రాగం : శుద్ధవసంతం**

కిం కరిష్యామి కింకరోమి బహుళ-
శంకా సమాధాన జాడ్యం వహామి ॥కిం కరిష్యామి॥

నారాయణం జగన్నాథం త్రిలోకైక-
పారాయణం భక్తపావనం
దూరీ కరోమ్యహం దురిత దూరేణ సం-
సారసాగరమగ్న చంచలత్వేన ॥కిం కరిష్యామి॥

తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ-
వరదం శరణాగతవత్సలం
పరమపురుషం కృపాభరణం న భజామి
మరణభవదేహాభిమానం వహామి ॥కిం కరిష్యామి॥





**భావామృతం**

"ఏమి చేయవలెను? ఏమి చేయుచున్నాను?" అను గొప్ప శంకకు సమాధానములేని బుద్ధిజాడ్యమును పొందుచున్నాను.

జగన్నాథుడైన నారాయణుని, ముల్లోకముల చేత పారాయణము చేయబడు వానిని భక్తులను పునీతులను చేయువానిని నేను నాకు దూరము చేసికొనుచున్నాను. ఏలననగా నేను దుర్మార్గముల చేతను, సంసార సాగర నిమగ్నమగు చంచలత్వము చేతను పీడించబడుచున్నాను కదా!

తిరువేంకటాచాలాధిపతిని, గజేంద్ర సంరక్షకుని, శరణాగతవత్సలుని, పరమపురుషుని, కృపయే ఆభరణముగా గలవానిని, నేను భజించకున్నాను. పైగా మరణమే సహజ లక్షణముగా గల నా ఈ దేహమునందు వల్లమాలిన అభిమానమును పొందియున్నాను. ఏమి చేయవలెను ప్రభూ!



## 5-82

## మున్నుడి

చమత్కారంతోను, ఆర్ద్రతతోను కవిత చెప్పటంలో పెద తిరుమలయ్య తన తండ్రి అన్నమాచార్యులవారికి సమవుజ్జీ అనిపిస్తారు. ఈయనకూడ శ్రీవేంకటేశ్వర మకుటంతోనే సంకీర్తనలు రచించటం వల్ల నాబోటి సామాన్యులు ఏ కీర్తన నెవరు చెప్పారో కూడ కనుక్కోలేరు. ఈ కీర్తనే ఒక చక్కని ఉదాహరణ. 'రామ రామ రామ రాజీవ లోచన' అంటే... పద్మదళనేత్రుడవై పరశురామ, శ్రీరామ, బలరామ రూపములలో దర్శనమిచ్చిన దేవా! అని అర్థం. నేదీము వంటి బంటున (బంటు+ అన), తేజమే నాది (నేను చిరుదీపాన్ని) నీకు బంటును... నా తేజము ఎంత... అదీ నీవిచ్చిందే.

**కం॥ పెద తిరుమలయ్య ఉద్ధతి**
**నిది చెప్పెను, దీమువంటి హితుడను బంటన్**
**పదిలముగ తిరుమలేశుడె**
**ముదముగ రామయ్యలున్న మురవైరి యనెన్**

**రాగం : కళ్యాణి**

రామ రామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటననే తేజమే నాది ॥రామ॥

వారధి దాటి మెప్పించ వాయుజుడనే గాను
సారె చవుల మెప్పించ శబరిగాను
బీరాన సీతనిచ్చి మెప్పించ జనకుండగాను
ఏరీతి మెప్పింతు నన్నెట్లా గాచేవో ॥రామ॥

ఘనమై మోచి మెప్పించ గరుడుడనే గాను
కొన కామసుఖమిచ్చు గోపిక గాను
వినుతించి మెప్పించ వేయినోళ్ళ బోగిగాను
నిన్నెట్లు మెప్పింతు నన్ను గాచే దెట్లా ॥రామ॥





నవ్వుచు పాడి మెప్పించ నారదుడ నేగాను
అవ్వల ప్రాణమీయ జటాయువు నేగాను
ఇవ్వల శ్రీవేంకటేశ యిటు నీకె శరణంటి
అవ్వల నా, తెరువిదే రక్షించే దెట్లా ॥రామ॥

## భావామృతం

ఓ ప్రభూ! పద్మదళనేత్రుడవైన నీవే రాముడవు (పరశురాముడవు), నీవే రాముడవు (శ్రీరాముడవు), నీవే రాముడవు (బలరాముడవు). అట్టి నీకు, నేను దీమువంటి బంటు అన (చిరు దీపము వంటి సేవకుడను), తేజమే నాది (ఆత్మజ్యోతి మాత్రమే నాది)

నేనెంత అల్పుడనో చెబుతాను విను. నిన్ను మహామహులు సేవించారు. వారితో పోలిస్తే నేనెంత తండ్రీ! సముద్రాన్ని దాటి నిన్ను మెప్పించుటకు పవనపుత్రుడైన హనుమను కాను. సారె చవుల (మాటిమాటికీ రుచులతో) మెప్పించుటకు శబరిని కాను. బీరాన (పరాక్రమంతో.. ధీరుడై అని ఇక్కడ భావము) సీతనిచ్చి మెప్పించుటకు జనక మహారాజును కాను. మరి నిన్ను ఏ విధముగా మెప్పించగలను? నీవు నన్నెట్లు రక్షించెదవో తెలియుట లేదు.

ఓ దేవదేవా! నిన్ను ఘనమై మోచి (గొప్పగా మోసి) మెప్పిద్దామంటే, గరుత్మంతుడికున్న బలం నాకేది? పోనీ కామ సుఖమిచ్చుకొన (రతి సుఖమిద్దామంటే) నేను బృందావనంలో గోపికను కాను. కృష్ణయ్యా! నిన్ను కీర్తించి పొగిడి మెప్పించుదామంటే భోగిని (ఆదిశేషుడిని) కాను. ఆయనకి వేయినోళ్ళు వున్నాయి. మరి నాకో? ఇకనేను నిన్నెట్లు మెప్పించగలను? నన్ను నీవెట్లా రక్షిస్తావు తండ్రీ!

స్వామీ! నిన్ను నవ్వుచూ (ఆనందంతో) పాడి (కీర్తించి) మెప్పిద్దామంటే నేను నారద మహర్షిని కాకపోతిని. ఆనాడు ప్రాణత్యాగం చేసి (సీతాదేవికోసం) నిన్ను మెప్పించిన జటాయువునన్నాకాదు. ఈనాడు ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను శరణుజొచ్చి యున్నాను. నా తెరువిదే.. (నాకు తెలిసిన మార్గం ఇదొక్కటే...). ఇక నన్ను రక్షించేదెట్లా? నీ చిత్తము.. నా భాగ్యము తండ్రీ! నీవే నాకు దిక్కు.

## 5-83

## మున్నుడి

"ఓహో! డేండేం"... అంటూ చాటింపు వేస్తున్నారు అన్నమాచార్యులవారు. "డేండేం" చాటింపు వేసే వాయిద్యాల ధ్వని అన్నమాట. ఒగి (క్రమముగా నెరిగినచో..) బ్రహ్మమంటే ఇదే అని సాహసంతో వేదము చెబుతున్నది... చాటింపు వేస్తున్నది... అంటున్నారు.

భగవద్గీతలో పరమాత్మ వివరించిన పరము, అపరము, ప్రకృతి, జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాన గమ్యము, దేహాత్మ, క్షరము, అక్షరము, సాక్షి, సాత్వికము, కూటస్థుడు, సాక్షిపురుషుడు – వీటన్నింటి గురించి వివరించారీ కీర్తనలో. శ్రీపురుషోత్తముడే.. శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు.

**కం॥ ఆహా! బ్రహ్మము ఇదియని**
**సాహసమున శ్రుతులు పూని చాటెను వినుడీ**
**"ఓహో! డేండేం" అనెరా**
**శ్రీహరి నన్నయ్య కొలిచి చెప్పెను 'గీతన్'**

**రాగం : రామక్రియ**

ఓహో డేండేం వొగి బ్రహ్మ మిదియని
సాహసమున శ్రుతి చాటెడిని ॥ఓహో॥

పరమును నపరమును బ్రకృతియు ననగా
వెరవు దెలియుటే వివేకము
పరము దేవుడును, అపరము జీవుడు
తిరమైన ప్రకృతియె దేహము ॥ఓహో॥

జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును
పూని తెలియుటే యోగము
జ్ఞానము దేహాత్మ, జ్ఞేయము పరమాత్మ,
జ్ఞానగమ్యమే సాధించు మనసు ॥ఓహో॥





క్షరము నక్షరమును సాక్షి పురుషుడని
సరవి దెలియుటే సాత్వికము
క్షరము ప్రపంచ, మక్షరము కూటస్థుడు
సిరిపురుషోత్తముడే శ్రీవేంకటేశుడు ॥ఓహో॥

## భావామృతం

ఓహో! (ప్రజ్ఞావంతులారా!) డేండేం అని (ధమ ధమయని డప్పు వాయించి) సాహసముతో చాటింపు వేసి, మరీ చెబుతున్నాను. ఒగి (క్రమముగా నెరిగిన) బ్రహ్మము అంటే... ఇదే సుమా!

'వివేకము' అని దేనినంటారో తెలియండి. పరము, అపరము మరియు ప్రకృతి అనే మూడింటి గురించి, వెరవున (ఉపాయముతో) తెలియుటయే "వివేకము". పరమునే దేవుడు అని అంటున్నాం. అపరమునే జీవుడు అంటున్నాం. ఆ రెంటికీ నాశనము లేదు. తిరమైన (స్థిరమైన) ప్రకృతియే దేహము రూపంలో కనబడుతున్నది. స్థూలంగా ఇది తెలిస్తే... చాలును.

పూని (పుద్యమించి) జ్ఞానము అని దేనినంటారో, జ్ఞేయము అంటే యేమిటో, జ్ఞాన గమ్యము అనగా నేమియో, గ్రహించుటే "యోగము" అని వ్యవహరిస్తారు. దేహములలో నివసించే దేహాత్మ జ్ఞానస్వరూపుడు. బాహ్య ప్రపంచంలో మూర్ఖునివలె కనిపించే వానియొక్క దేహాత్మ కూడా జ్ఞానస్వరూపుడే. జ్ఞేయము అనగా దేని గురించి తెలిసినచో ఇక తెలుసుకోవలసిన దేమియూ లేదో, అదియే. పరమాత్మనే జ్ఞేయము అంటారు. మనస్సును సాధించి అర్థం చేసికొనిన వాడు జ్ఞాన గమ్యమును చేరినట్లే.

ఇప్పుడు సాత్వికము అని దేనిని, పిలుస్తారో సరవి (క్రమముగా) ఆకళింపు చేసికొందాం. క్షరము, అక్షరము మరియు సాక్షి పురుషుడు అనే మూడింటి గురించి తెలుసుకొనుటయే సాత్వికము. మన కనులయెదుట వున్న ప్రపంచమే క్షరము. ఇది ఏదో ఒకనాడు నశించునదే. అక్షరుడు అనగా క్షయముగాని కూటస్థుడు. దేహంలో వుండియే నాటికీ నశించని వాడే అక్షరుడు. ఇక సాక్షిపురుషుడు ఎవరు? ఇంకెవరు... శ్రీ పురుషోత్తముడైన తిరువేంకటేశ్వరుడే. ఈయనేసాక్షి... రాగద్వేషాలకు అతీతుడు.

## 5-84

## మున్నుడి

వలపు, ప్రేమ అంటే యేమిటో నిజానికి "నేను ప్రేమిస్తున్నాన" నే యెంతమందికి తెలుసు? నూటికి తొంబది తొమ్మిది మందికి కామవాంఛకు, వలపునకు తేడా తెలియదు. అన్నమాచార్యులవారు "నిజమైన ప్రేమయే (భక్తులకు స్వామి మీద - వలచిన వారికి తాము వలచిన వారి మీద) సౌభాగ్యము. అదే వలపు. అదే సుఖమంటే. అదిగాక ఇంకొకటి యేదన్నా వున్నదా?" అని ప్రశ్నిస్తున్నారు. చిత్తములో తానే శ్రీహరిగా భావించి అన్ని విచారములను మరచి హత్తించి (పెనవేసికొని... అంటే అణువణువు ఆయనే తానయి వుండవలదా? అంటున్నారు.

**తే॥ ఏది సౌభాగ్యమదిగాక యేది వలపు?**
**ఏది సుఖమింక నిదిగాక యేమి గలదు?**
**చిత్తమున దానె శ్రీహరై చింత మఱచి**
**హత్తి యుండవలయుననె అన్నమయ్య.**

**రాగం : ప్రతిమాభేరి**

అదిగాక సౌభాగ్య మదిగాక వలపు
అదిగాక సుఖమింక నందరికి గలదా ॥అదిగాక॥

ప్రాణవల్లభుని బెడ బాసి మరుబాణములు
ప్రాణబాధలు నెగులు పడుటేటి వలపే
ప్రాణేశ్వరుడు దన్ను బాయ జూచిన యపుడు
ప్రాణంబు మేనిలో బాయంగ వలదా ॥అదిగాక॥

ఒద్దికై ప్రియునితో నొడుగూడి యుండినపు
డిద్దరై విహరించుటిది యేటి వలపే
పొద్దు వోకలకు తమ పొలయలుక కూటముల
బుద్ధిలో పరవశము పొందంగ వలదా ॥అదిగాక॥





చిత్తంబు లోపలను శ్రీవేంకటేశ్వరుని
హత్తించి వాడు దానయివుండవలదా
కొత్తయిన యిటువంటి కొదలేని సంగతుల
తత్తరము మున్నాడి తగులంగ వలదా ॥అదిగాక॥

**భావామృతం**

అదిగాక (స్వామిప్రేమ) సౌభాగ్యము ఇంకేదన్నా వుంటుందా? అదిగాక వలపు అనేదేదన్నా వున్నదా? అదిగాక సౌఖ్యం అనేది మరేదన్నా వున్నదా? అందరికీ అదే... శ్రీనివాసుని ప్రేమయే సర్వస్వం. ఇక ఆయనే ప్రాణవల్లభుడు (ప్రాణంవంటి భర్త) అయితే... ఇంకా ఏమి కావాలి?

ప్రాణవల్లభునిన్ వెడబాసి (ఎడబాటు పొంది) మన్మధుని పుష్పబాణములకు గురి అయి ప్రాణాంతకమైన వ్యధ జెందుతూ, నెగులు పడుట (దుఃఖించుట) అదేమి ప్రేమండీ? తన ప్రాణేశ్వరుడు తనను విడచిన తక్షణమే తన ప్రాణాలు గాలిలో కలిసి పోవద్దా? తన శరీరంలో ఇంకా ప్రాణం వుంటే... అదేమి ప్రేమ?

ఒద్దికై (అనుకూలవతియై) ప్రియునితో వున్నప్పుడు తాము 'ఇద్దరు' అనే భావనతో విహరించ వచ్చునా? అట్లా వుంటే అదేమి ప్రేమండీ? ప్రొద్దస్తమానం పైపైన ప్రణయకలహములతోను, బుద్ధిలో (మనస్సులో) పరవశత్వము పొందుతూ వుండవద్దా? ఆ విధంగా లేకపోతే... అదేమి ప్రేమ?

చిత్తంబులోపల (తన మనస్సులో) శ్రీవేంకటేశ్వరుని, వాడే తానయి హత్తించి (అణువణువూ ఆయనే తానయినట్లు పెనవేసుకొని) వుండవద్దా? నూతనమైన ఇటువంటి కొదలేని (అంతులేని) విషయములతో తగులంగ వలదా (ముందుగానే అమితమైన ఆసక్తి కలిగి యుండవద్దా?) అట్లుగానిచో ఇంకా ప్రేమయేమిటి?

## మున్నుడి 5-85

ఆకలితీరాలంటే అన్నం తినాలి. అంతేకాని గడ్డపార మింగితే కడుపు నిండుతుందా? భవము (ప్రాపంచిక యావ) తనను ఒడకమ్ము (విశేషముగా లొంగదీస్తుంది). అది ఒడ్డినది (చాచుకొని విస్తరించినది కదా!) ఇక ఉపాయమేమిటి? వేంకటేశ్వరుని శరణాగతి ఈ భవబంధాలను తొలగిస్తుంది - అంటున్నారు అన్నమాచార్యులవారు... అదీ సోదాహరణంగా - వినండి.

**సీ॥ ఒడ్డు భవము దన్ను ఒడకమ్ము గావించు**
**గడ్డపారాకలి నడ్డుకొనునె?**
**చిందుచు దూకెడి జింకలన్ బండికి**
**కట్టి సాగెదమన్న వట్టిమాట**
**మండు అగ్గిని దెచ్చి మసిపాత బిగియించి**
**ఇంట దాచెదమన్న యెట్టులగును?**
**విష సర్పమును దెచ్చి పెట్టి దిండుగ నిద్ర-**
**పోజూడ నణగుచు యుండగలదె?**

**తే॥ వెట్ట సంసార మియ్యది వేంకటేశ!**
**మనిషి చెప్పిన తీరున మాట వినునె**
**నిన్ను గొలువక కడతేరు టన్నకాదు**
**అన్నమార్యుడు బోధించె నద్భుతముగ.**

**రాగం : కాంబోది**

గడ్డపార మింగితే నాకలి దీరీనాయీ-
వొడ్డిన భవము దన్ను వొడ కమ్ముగాక ॥గడ్డ॥

చించుక మిన్నుల బారే చింకలను బండి గట్టి
వంచుకొనే మన్ననవి వసమయ్యీనా
యెంచరాని యింద్రియము లెవ్వరికి నేల చిక్కు
పొంచి పొంచి వలపుల బొండబెట్టుగాక ॥గడ్డ॥





మంటమండే యగ్గి దెచ్చి మసిపాత మూటగట్టి
యింటిలోన దాచుకొన్న నితవయ్యీనా
దంట మమకార మిట్టె తన్నునేల సాగనిచ్చు
బంటుజేసి ఆసలనే పారదోసుగాక ॥గడ్డ॥

పట్టరాని విషముల పాము దెచ్చి తలకింద
బెట్టుకొన్నానది మందపిలి వుండీనా
వెట్ట సంసార మిది వేంకటేశు గొలువని
వట్టి మనుజుల పెడవాడ బెట్టుగాక ॥గడ్డ॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఎవడికన్నా ఆకలి తీరాలంటే, అన్నం తినాలి. అంతేకాని గడ్డపార నొకదాన్ని మింగితే ఆకలి తీరుతుందా? భవము (ప్రాపంచిక యావ) తనను ఒడకమ్ముగాక! (విశేషముగా లొంగదీస్తుంది కదా!) ఎందుకంటే అది ఒడ్డిన భవము (చాచుకొని విస్తరించియున్న భవము).

చించుక మిన్నుల బారే (విజృంభించి పైపైకి ఎగిరి పరుగులెత్తెడి) చింకలను (జింకలను) తీసికొనివచ్చి బండికి కట్టి పరిగెత్తించి మన వశములో వుంచుకొందామంటే... అది జరిగే పనియేనా? అంచనా వేయలేని ఇంద్రియాలు యెవ్వరికన్నా యేల చిక్కు (యెందుకు లొంగుతాయి?) పొంచి పొంచి (దాగి దాగీ) వలపులతో, బొండబెట్టుగాక! (పండబెట్టును కదా!)

భగభగమండే మంటను తీసికొని వచ్చి, మసిపట్టిన పాతగుడ్డలో కట్టి మన ఇంట్లో దాచి వుంచుకొందాం అంటే అది జరిగే పనియేనా? హితము కలుగుతుందా? దంట మమకారము (దిట్టమైన వ్యామోహము), తనను బంటును చేసి, ఆశల వెంట తరుముతుంది. అంతేకాని తనని యెందుకు కొనసాగనిస్తుంది?

అశక్యమైన విషమున్న సర్పమును తీసికొని వచ్చి దిండు క్రిందబెట్టుకొని పడుకొనవచ్చునా? అది వూరుకొని వుంటుందా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇది వెట్ట సంసారము (తాపము కలిగించు ప్రపంచము). నిన్ను గొలువని వట్టి మనుజులను (సామాన్యులైన మనష్యులను), ఇది పెడవాయ బెట్టును (పెడచెవిని బెడుతుంది).

**5-86**

## మున్నుడి

ఈ సరస శృంగార కీర్తనలో అన్నమాచార్యులవారు అలమేలుమంగ మిక్కిలి నేర్పరి అంటున్నారు. ఆవిడ వేంకటపతి శ్రీనివాసుని 'అక్కరలన్నీ' తీరుస్తుందట. కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ..." అన్నారు కదా! పెద్దలు. జగన్నాథుడైన భర్తను తన కనుసన్నలలో వుంచుకోవటం అంత తేలికయైన పనేమీ కాదు. ఆవిడ ఆయనను 'యిక్కువలంటి యంటి' మెచ్చుకొంటుందట..ఆయన క్షేమ సమాచారాలు మళ్ళీ మళ్ళీ అడిగి చాలా మెచ్చుకొంటూ మాట్లాడుతుందట. చెచ్చెర (అతి శీఘ్రంగా) సందిట దెందము కరిగిస్తుందట. తల్లి నేర్వని విద్య వుందా?

**ఉ॥ మిక్కిలి నేర్పరైన సతిమించిన ఈ అలమేలుమంగయున్**
**అక్కర దీర్చి వల్లభుని కచ్చముగా నురమెక్కె పేర్మితో**
**చక్కని కీర్తనంబు గొని జాను తెనుంగున జెప్పె అన్నయున్**
**నిక్కము వేంకటేశుడును నీరజవాసిని మెచ్చు దీనినిన్**

**రాగం : మధ్యమావతి**

మిక్కిలి నేర్పరి యలమేలు మంగ
అక్కర దీరిచి పతినలమేలుమంగ ॥మిక్కిలి॥

కన్నులనె నవ్వు నవ్వి కాంతుని తప్పక చూచి
మిన్నక మాటాడీ నలమేలుమంగ
సన్నలనే యాసరేచి జంకెన బొమ్మలు వంచి
అన్నువతో కొసరీని యలమేలుమంగ ॥మిక్కిలి॥

సారెకు చెక్కులు నొక్కి సరుసనె కూచుండి
మేరలు మీరీ నలమేలు మంగ
గారవించి విభునికి కప్పుర విడెమిచ్చి
యారతులెత్తీ నదె యలమేలుమంగ ॥మిక్కిలి॥





ఇచ్చకాలు సేసిసేసి యిక్కువలంటి యంటి
మెచ్చీ నతని నలమేలుమంగ
చెచ్చెర కౌగిట కూడి శ్రీవేంకటేశ్వరుని
అచ్చముగా నురమెక్కీ నలమేలు మంగ ॥మిక్కిలి॥

**భావామృతం :**

జగజ్జననియైన ఈ అలమేలుమంగ ఎంతో గొప్ప నేర్పరి (జాణ). ఈమె పతి 'అక్కరలన్నీ దీరిచినది' (తన భర్త అవసరములనన్నింటినీ తీర్చు స్వభావము కల జవరాలు).

ఆమె తన కన్నులతోనే నవ్వుతూ తన నాథుని తప్పక (అతిక్రమించక... వినయంగా) చూస్తుందట. మిన్నక (ఊరకనే.. బెట్టుసరి లేకుండా) మాట్లాడుతుందట. సైగలతోనే ఆశలు పురికొల్పుతుందట. జంకెన (బెదిరిస్తున్నట్లు) కనుబొమ్మలు ముడివేస్తుందట. స్వామిని అన్నువతో (ఆపేక్షతో) కసురుకొంటుందట. అంతటి గొప్ప నేర్పరి ఆ తల్లి.

మాటి మాటికీ సంభ్రమంతో తన చెక్కిళ్ళు నొక్కుకొంటుందట. అబ్బ! నా స్వామి ఎంత త్వరగా నన్ను చేరాడు అని పొంగిపోయి, మేరలు మీరి (తన బిడియం వదలివేసి), ఆయన ప్రక్కనే కూర్చుంటుందట, ఆ అలమేలుమంగ. స్వామి రాంగానే గౌరవంగా కర్పూర తాంబూలముతో తన భర్తను ఆహ్వానించి, హారతినిస్తుందట. (సంప్రదాయ బద్ధంగా గౌరవనీయులను అలా ఆహ్వానించాలి). అంతటి గొప్ప నేర్పరి, ఆ తల్లి.

ఇచ్చకాలు సేసిసేసి, (ప్రియవచనములను మరల మరల మాట్లాడి, క్షేమ సమాచారములడుగుతూ మరీ మరీ మెచ్చుకుంటుందట, ఆ అలమేలు మంగ. తరువాత ఆ శ్రీవేంకటేశ్వరుని చెచ్చెర కౌగిట (అతి శీఘ్రముగా కౌగలించి) ఆయన నలరించునట. దాని ఫలితంగానే అచ్చముగా (కేవలం తనకే అన్నట్లుగా) ఆయన "వురమెక్కీను" (వక్ష స్థలము నాక్రమించిందట). అంతటి గొప్పనేర్పరి ఈ అలమేలుమంగ తల్లి.

## మున్నుడి 5-87

'వివేకి' అంటే ఆధునికులు తలచునట్లు 'అనలైజ్' చేయగలిగినవాడే... కానీ ఇక్కడి అర్థం దేహమునకు ఆత్మకుగల తారతమ్యాన్ని 'అనలైజ్' చేయగల యోగి. వివేకులు ఎప్పుడూ 'తలపోసుకొంటూ' (ఆలోచనల్లో నిమగ్నమై) యుంటారు. వారు పరమయోగులు. పరమ వైష్ణవులు. వారి పద్ధతే అంత.. అంటున్నారు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు. వారి పద్ధతేమిటో చక్కగా వివరిస్తున్నారు. వారు శ్రీవేంకటేశ్వరునిపై తమ భారం వేసి వైష్ణవుల దయను పొంది అలరుచుంటారు, (సుఖంగా వుంటారు). ఈ కీర్తనలో విజ్ఞానము అంటే భగవంతుని తత్త్వము తెలుసుకొనే మార్గము అని అర్థం.

**తే॥ పరమ యోగీశ్వరులు మెచ్చు పద్ధతి యిది**
**ధర వివేకులు చింతించు తలపు నిదియె**
**తిరుమలేశునిపైననే భారముంచి**
**అలర, వైష్ణవ కృపయనె అన్నమయ్య**

**రాగం : ఖరహరప్రియ**

పరమయోగీశ్వరుల పద్ధతి ఇది
ధరణిలో వివేకులు తలపోసుకొనుట ॥పరమ॥

మొదల నాత్మజ్ఞానము తెలిసి పిమ్మట
హృదయములోని హరినెరుగుట
వుదుటైన ఇంద్రియాల నొడిసి వంచుకొనుట
గుడిగొన్న తనలో కోరికె లుడుగుట ॥పరమ॥

తన పుణ్య ఫలములు దైవము కొసగుట
పనివడి అతనిపై భక్తి సేసుట
తనివితో నిరంతర ధ్యానయోగపరుడౌట
మనసుతో ప్రకృతి సమ్మంధము మరచుట ॥పరమ॥





నడుమ నడుమ విజ్ఞానపు కథలు వినుట
చిదుముడినాచార్య సేవసేయుట
ఎడయక శ్రీవేంకటేశుపై భారము వేసి
కడువైష్ణవుల కృప కలిగి సుఖించుట ॥పరమ॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఈ లోకంలో పరమ యోగులు ప్రత్యేక పద్ధతి కలిగివుంటారు. వారు వివేకులు. బాగుగా విచారించి (ఆలోచించి), భగవత్తత్త్వము అర్థం చేసికొని, పరమ వైష్ణవుల దయను పొంది, నిశ్చింతగా వుంటారు.

మొదల (మొట్టమొదట) వారు ఆత్మజ్ఞానం తెలిసికొంటారు. ఆత్మ అయినదేదో, ఆత్మకానిది (అనాత్మ) ఏదో తెలిసికొంటారు. తరువాత శ్రీహరి తమ హృదయంలోనే వుంటాడని గ్రహించి ఆయనను వెదుకుటమాని, ఆయన ధ్యానంలో వుంటారు. ఆ పనికి అడ్డంకి అయిన తమ ఇంద్రియాల పొగరును అదుపులోవుంచి తమలో నిక్షిప్తమై వేదించే కోర్కెలను ఉడిగించుకొంటారు (నిర్మూలించుకొంటారు).

ఆ యోగులు తమ పుణ్యఫలాన్ని "కృష్ణార్పణం" అని భగవంతునికే అర్పిస్తారు. శ్రద్ధగా దేవునిపై భక్తి సేసుట (భక్తిమార్గంలో వుండి నిర్వహించుట) కూడ వారి పద్ధతియే. ఇష్టపూర్వకంగా, తృప్తిగా ఎప్పుడూ పరమాత్మ ధ్యానంలో (ధ్యాన యోగంలో) వుంటారు. వారి శరీరం ఈ ప్రకృతిలో వున్నప్పటికీ, మనస్సు మాత్రం ఈ ప్రకృతితో ఏ సమ్మంధమూ (సంబంధము) లేకుండా తమని తాము మరిచి రమిస్తుంటారు.

అయితే వారు జీవించియున్నారు కావున, మధ్యమధ్య ఈ ప్రపంచంతో సంబంధం పెట్టుకొనివున్నప్పుడు భగవత్తత్త్వం వివరించే కథలు వింటుంటారు. చిదుముడితో (అసలు చిదుముడి అంటే...తొట్రుబాటు అని అర్థం... ఇక్కడ సంభ్రమంతో అని అర్థం చేసికోవాలి). గురువుల సేవచేయుట వారి పద్ధతి. విడువక అంతా శ్రీవేంకటేశ్వరునిదే భారమని తమ కర్తవ్యం చేస్తుంటారు. పరమవైష్ణవుల అనుగ్రహం పొంది వారు నిత్యమూ సుఖముతోనే వుంటారు.

**5-88**

## మున్నుడి

అద్భుతమైన మేలుకొలుపు వినిపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. శ్రీమన్నారాయణుడైన ఆదిశేషతల్పశాయి యోగనిద్రపోతున్నాడు. శేషుడు బుసకొడుతున్నా ఆయన యోగనిద్రపాయుటయే (విడచుటే) లేదు. స్వామీ! త్వరగా మేల్కోనవయ్యా! అంటున్నారు. విరాట్పురుషుడైన ఆయనకు సూర్యచంద్రులే నేత్రములు. ఆయన కళ్ళుమూసుకొంటే లోకాలలో మిగిలేది చీకటియే కదా! అందుకే మెఱుగులు చల్లుచూ మేల్కొనవే... అంటున్నారు. రాగిరేకులపూ అన్నమయ్య ఈ కీర్తన వ్రాసినవారు అ, రల మధ్య ఆంతర్యం పట్టించుకొన్నట్లు.. లేదు.

**చం॥ తెరువక తెల్లనౌ కనుల తెల్లగవారదు సూర్యుడేడిరా?**
**మరియొక కన్ను చంద్రుడట మత్తిలు వెన్నెలరాదు, అందుచే**
**త్వరపడి శేషతల్పమిటు తాన్ బుసకొట్టెను మేలుకోవయా**
**తిరుమలనాయకా! యిపుడు తేల్చుము నిద్దుర అన్నమయ్యనెన్.**

**రాగం : భూపాళం**

భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్రపాయును మేల్కొనవే ॥భోగి॥

కన్నులు దెరువక కమలబాంధవుడు
వెన్నెల రేణువు వెలయ దిదే
అన్నువ మలసీ నరుణోదయమిదే
మిన్నక నీవిటు మేలుకొనవే ॥భోగి॥

తెల్లని కన్నులు దెరువక విరియగ
నొల్లక జలజము లున్న వివే
కల్ల నిదుర నిను గవియగ నియ్యక
మెల్ల నాయె నిట మేలుకొనవే ॥భోగి॥





తెరవగు(గ) రెప్పల దెల్ల వార వలె
తెరవక చీకటి దీర దిదే
తెరగు వేంకటాధిప నీ వెఱుగుదు
మెఱుగులు చల్లుచు మేలుకొనవే ॥భోగి॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నీభోగిశయనమును (తల్పమైన ఆదిశేషుడు కూడా) బుసకొట్టెడిని (బుసకొట్టుచున్నాడు). నీవు యోగనిద్ర పోవుచున్నావు. దానిని పాయుము (విడిచి) మేలుకొనవే (నిద్రమేల్కొనవయ్యా!)

ప్రభూ! నీవు కన్నులు తెఱువనిచో నీ నేత్రములైన సూర్యచంద్రులెలా ద్యోతకమవుతారు? ఆ కమల మిత్రుడైన సూర్యుడు, వెన్నల రేణువు (రాజు అయిన) అయిన చంద్రుడు వెలయరు (వెలువడరు). అదిగో అరుణోదయమవుతున్నది (తెల్లవారుబోతున్నది) అన్నువ మలసీ (కొంచెము ప్రయత్నించి) నీ విటు (నీవు ఇప్పుడు) మిన్నక (ఊరకనే) మేల్కొనవయ్యా!

స్వామీ! నీ తెల్లని కన్నులు తెరువక పోతే జలజములు (పద్మములు, కలువలు విరియగ నొల్లవు (వికసించవు) సూర్యుడురాక పద్మములు చంద్రుడు రాక కలువలు వికసించలేవు కదా! నీ కల్ల నిదుర (దొంగనిద్ర) మెల్లనాయె(కంటికొలుకులకు వచ్చి చేరింది). అది నిన్ను కవియగ నిచ్చుటలేదు (నిన్ను వ్యాపించనియ్యదు... అనగా వ్యవహరించనియ్యదు). అందుకనే నిదురమేల్కొనవయ్యా!

దేవా! నీ రెప్పలు తెరువగ సూర్యదయమై తెల్లవారుతుంది అవి తెరువక (తెరిచియుంచక పోతే) చీకటి ఎలా తొలుగుతుంది? తెఱగు వేంకటాధిప (చక్కని వేంకటేశ్వరా!) నీవు సర్వము నెఱుగుదువు. మెఱుగులు చల్లుచు (కాంతులు విరజిమ్ముతూ) మేలుకోవయ్యా!

**5-89**

## మున్నుడి

మధురమైన భజన గీర్వాణిలో వినిపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. ఓ జగన్నాథా! త్వం ఏవ శరణం (నీవే దిక్కు) అంటున్నారు. కమలనాభా! నీకే శరణు. ఓ శ్రీనివాసా! అని ఆర్తితో ఆలపిస్తున్నారు. భక్తితో ఈ భజనపాడితే మన పాపాలు పటాపంచలవుతాయనే మాట పరమసత్యం "జంతుఘటకారక కరణ"- అంటే సృష్టిలోని జంతు సంఘములన్నింటి యొక్క ఉనికికీ మనికికీ కారణభూతుడైన వాడని అర్థం. కుంజర వరదుడు అంటే గజేంద్రరక్షకుడు అని అర్థం.

**ఆ.వె॥ నీవె శరణమయ్య! నీరజనాభ! మా**
**శరణమీవె సర్వజగతివంద్య!**
**భజనవోలె తెలిపె మా అన్నమార్యుండు**
**పరమపురుషుని దయ బడసె నతడు.**

**రాగం : ఆనందభైరవి**

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీజగన్నాథ ॥త్వమేవ॥

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీసతీశ సరసిజనేత్రా
భూ సురవల్లభ పురుషోత్తమ పీత-
కేశేయవసన జగన్నాథా ॥త్వమేవ॥

బలభద్రానుజ పరమపురుషదుగ్ధ-
జలధివిహార కుంజరవరద
సులభ సుభదాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా ॥త్వమేవ॥





వటపత్రశయన భువనపాలన జంతు-
ఘటకారక కరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం-
కటగిరినిలయ జగన్నాథా ॥త్వమేవ॥

**భావామృతం :**

ఓ కమలనాభా! శ్రీ జగన్నాథా! నిన్నే నేను శరణుజొచ్చి యున్నాను. నిన్నే శరణుజొచ్చాను ప్రభూ!

ఓ వాసుదేవా! శ్రీకృష్ణా! వామనమూర్తీ! ఓ నారసింహా! శ్రీవనితావల్లభా! పద్మనయనా! ధరణీనాథా! దేవనాథా! ఓ పురుషోత్తమా! పీతాంబరధారీ! జగన్నాథా! నిన్నే శరణుజొచ్చితిని.

ఓ బలరాముని తమ్ముడా! పరమపురుషా! క్షీరసాగరనివాసా! ఓ గజేంద్ర సంరక్షకా! సులభముగా అనుగ్రహించువాడా! శుభకరా! సుముఖా! దేవవల్లభా! నీవు కలిపురుషునిచే ప్రాప్తించు దోషములను నివారించువాడవు. ఓ జగన్నాథా నేను నిన్నే శరణుజొచ్చి యున్నాను.

ఓ వటపత్రశాయీ! (మఱ్ఱి ఆకుపై నిద్రించు దేవా!) జగదీశ్వరా! ఓ జంతుఘట కారక కరణా! (సృష్టిలోని జంతు సంఘములన్నింటియొక్క ఉనికికీ, మనికికీ కారణభూతుడైన వాడా!) శృంగార నాయకా! నిత్యమూ దిట్టమైన వైభవములతో శోభిల్లు ప్రభూ! పవిత్ర వేంకటగిరి నివాసా! ఓ జగన్నాథా! నేను నిన్నే శరణు జొచ్చియున్నాను, తండ్రీ!

## మున్నుడి 5-90

ఇదివరలో చాలా కీర్తనలలో అన్నిటికీ ఆదిమూలము శ్రీహరే అని చెప్పారు అన్నమాచార్యులవారు. "ఇందుగలడందులేడని సందేహము వలద"న్నారు పోతన. చరాచర సృష్టిలో అన్నీ పరమాత్మే అన్నది వేదము. ఆ సత్యాన్నే నొక్కి వక్కాణిస్తున్నారు ఇంకొకసారి అన్నమయ్య, అలవోకగా (సునాయాసంగా) తెలుపుతున్నారు. అనవరతము (ఎల్లప్పుడూ) నిన్ను కొలిచెదము స్వామీ! అంటున్నారు. గమి చంద్రాక్షా! అంటే సూర్యచంద్రులే నేత్రముగా కలవాడని. అంటే... ఆయన కంటబడకుండ ఏదిజరుగుతుంది? ప్రపంచంలో, సుఖం..సుఖం...సుఖం... అని సంసారసుఖం కోసం వెంపర్లాడే వారే, అంతా. అది కూడా శ్రీహరే...అంటున్నారు.

**కం॥ తలతుము నీవే దిక్కని**
**కలకాలము కావుమయ్య గమి చంద్రాక్ష!**
**కొలుతుము అనవరతము నిన్**
**అలవోకగ అన్నమయ్య హరి గీర్తించెన్.**

**రాగం: ధేనుక**

నీవే మాకు దిక్కు నిన్నేతలతుము
కావుము నేరమెంచక కరుణానిధీ ॥నీవే॥

నెట్టన సూర్యలోని నెలకొన్న తేజమా
గట్టిగా చంద్రునిలోని కాంతిపుంజమా
పుట్టిరక్షించే యజ్ఞపురుషుని ప్రకాశమా
వొట్టుక దేవతలలో నుండిన శక్తీ ॥నీవే॥

సిరులు మించినయట్టి జీవులలో ప్రాణమా
గరిమవేదములలో గల యర్థమా
పరమ పదమునందు పాదుకొన్నబ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా ॥నీవే॥





జగములో వెలసేటి సంసార సుఖమా
నిగిడిన మంత్రముల నిజమహిమా
మిగుల శ్రీ వేంకటాద్రి మీద నున్న దైవమా
ముగురు వేల్పులలోని మూలకందమా ॥నీవే॥

**భావామృతం :**

ఓ దేవదేవా! శరణు తండ్రీ! మాకు దిక్కు నీవే. ఎల్లవేళలా నిన్నే తలచుకొంటాం. ఓ కరుణానిధీ! మా నేరములనే, పరగణించి మమ్మల్ని వెలివేయకు ప్రభూ! మేము నీ బిడ్డలం. మమ్మల్ని నీవు కాక ఇంకెవరు రక్షిస్తారు? అన్నీ నీవే అయినప్పుడు ఇంకెవరినడుగ గలం?

మానెట్టనే (ఎదురుగా..అనివార్యంగా) వుండే సూర్యునిలోని అద్భుతకాంతి నీవే. చంద్రునిలోని దివ్యకాంతి పుంజము కూడా నీదే. యజ్ఞనారాయణునివలె ఆవిర్భవించి అందర్నీ రక్షించే ప్రకాశరూపా! దేవతలందరిలోనూ వున్న దివ్యశక్తులన్నీ నీనుంచేవారికి వచ్చాయి. (లేకపోతే వాయుదేవునికి ఈ ప్రభంజనం యెట్లా వస్తుంది?). అట్టి నీకే శరణు.

ప్రభూ! జీవులందరిలోను 'ప్రాణం' అన్ని వైభవాలనూమించినది. ఆ ప్రాణమే నీవు. వేదములన్నింటిలోని గొప్ప అర్థము ఏదైతేవున్నదో అదికూడా నీవే. పరమపదము ద్వారానే జీవికి జననమరణాల చక్రబంధంనుంచి విముక్తి లభిస్తుంది. ఆ పరమ పదం అనుగ్రహించగల పరబ్రహ్మ వేరెవ్వరూ కాదు.. నీవేనయ్యా! చరములు (గమనముగలవి), అచరములు (గమనములేని వృక్షములు మొదలైనవి), వీటన్నిటి ఆధారమైనవాడవు నీవే. అట్టి నీవే మాకు దిక్కు.

ఓ సర్వేశ్వరా! జగములో సంసారమే సుఖం అన్నట్లు భావించి ఆ సుఖం కోసమే తపించి పోతూ, దాని కోసమే కష్టనష్టాలు భరిస్తూ అంతాజీవిస్తారు. ఆ సుఖం ఏదైతే వున్నదో... అదీనీవే. మంత్రమునకు దివ్యమహిమ యెక్కడినుంచి వచ్చింది? నీనుంచే వచ్చింది. శ్రీవేంకటాద్రి పై వెలసిన దైవము ఇంకెవరు? నీవే..ప్రభూ! నీవే. ఆ ముగ్గురు దేవతలకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) మూలకందము (ఆదిమూలము) పరబ్రహ్మ. ఆ పరబ్రహ్మ స్వరూపుడే తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు.

## 5-91

## మున్నుడి

కలశాపురంలో వెలసిన హనుమంతుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆనాడు కలశాపురం ప్రాంతంలో దట్టంగా చందన వృక్షాలు వుండివుంటాయి అని భావిస్తున్నాను. అలవాటు ప్రకారం అంజనీ తనయుడు శ్రీవేంకటేశ్వరుని బంటు అని కీర్తిస్తున్నారు. "లంకెల సుగ్రీవునికి లలిప్రధానివైతివి" అంటున్నారు. సుగ్రీవునికి లంకెల లలి ప్రధానివైనావు... అని చెప్పుకోవాలి. అంటే సుగ్రీవునికి బద్ధుడై ప్రియమైన ప్రధానమంత్రివైనావు అని అర్థం. అంకెలెల్ల నీకు చెల్లే... అంటే వశీకరణమొనర్చు చమత్కారములు నీకే తగినవి అని.

**చం॥ అలరెను అంజనీసుతుడు ఆ కలశాపురమందు దట్టమై**
**చలువగు చందనంపు తరుఛాయలలో హనుమంతరాయడై**
**కొలిచెడి భక్తసంఘముల కోరిక దీర్చె ప్రతాపశాలియై**
**విలువగు బంటు శ్రీపతికి వీరుడు ఈ కపి అన్నమయ్యనెన్**

**రాగం : హిందోళం**

కలశాపురముకాడ గంధపు మాకుల నీడ
అలరేవు మేలుమేలు హనుమంతరాయ ॥కలశా॥

సంజీవి కొండదెచ్చి సౌమిత్రి బ్రతికించితివి
భంజించితి వసురులను పలువురిని
కంజాతకుని రాఘవుని మెప్పించితివి
అంజనీతనయ ఓ హనుమంతరాయా ॥కలశా॥

లంక సాధించితివి బీరములెల్ల చూపితివి
గొంకక రాముని సీతను గూర్చితివి
లంకెల సుగ్రీవునికి లలి ప్రధానివైతివి
అంకెలెల్ల నీకు చెల్లె హనుమంతరాయ ॥కలశా॥





దిక్కులు గెలిచితివి దివిజపూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో వేంకటేశు బంటవైతివి
అక్కజపు మహిమల హనుమంతరాయ ॥కలశా॥

**భావామృతం :**

కలశాపురం దగ్గిర గంధపు వృక్షముల నీడలలో నీవు అలరుచున్నావు. ఓ హనుమంతరాయా! మేలు..మేలు తండ్రీ! మేలుమేలు.

అంజనీపుత్రుడైన ఓ హనుమంతరాయా! సంజీవిని పర్వతమును తీసికొనివచ్చి సుమిత్రా నందనుడైన లక్ష్మణుని ప్రాణములను కాపాడినవాడవు. పలువురు అసురులను మర్ధించిన వాడవు. కంజాతకుడు (పద్మసంభవుడైన బ్రహ్మదేవుని, రఘుకులనాయకుడైన శ్రీరామచంద్రుని మెప్పించిన వాడవయ్యా హనుమంతరాయా!

ఓ వాయునందనా! నీవు లంకలో అసాధ్యమైన విజయమును సాధించి గెలిచితివి. నీ వీరత్వమును చూపితివి. గొంకక శ్రీరాముని, సీతను కలిపితివి. సుగ్రీవునకు బద్ధుడవై ప్రియమైన ప్రధానమంత్రివైనావు. ఓ హనుమంతరాయా! వశీకరణ మొనర్చుచమత్కారములు నీకే తగునయ్యా!

ఓ రామదూతా! వాయుగమనుడవైన నీవు దిక్కులన్నీయు గెలిచితివి (మైరావణుని వధించుటకు మారుతి పాతాళమునకు పోయి గెలిచినాడు కదా!) దేవతలు కూడా నిన్ను కీర్తించిరి. ఎనలేని ప్రతాపముతో ప్రకాశించితివి. ఓ హనుమంతరాయా! నీవు ఇక్కవతో (మక్కువతో) శ్రీరాముని బంటువై ఆశ్చర్యము గొలుపు మహిమలను చూపించితివి. (నీ భక్తులకు రక్షయై నిలచితివి.

## 5-92

## మున్నుడి

చక్కటి జ్ఞానబోధ చేస్తున్న అన్నమాచార్యులవారిని ఆకర్ణించండి. శ్రీవైష్ణవులకు సర్వస్వం ఆ శ్రీహరియే కదా! అందుకే వారు ఎదురన్నదే లేక ఎట్లావారికి తోస్తే.. అట్లా వుంటారు. వారి గురువును, శ్రీవేంకటేశుని తప్ప వేరెవ్వరినీ లెక్కజేయరు. మదగజమునకు 'మట్టుమేర' (మితి) అనేది వుంటుందా? అంటున్నారు. ఉపమానాలు (ఉదాహరణలు) చెప్పటంలో అన్నమయ్యకు ఎవ్వరూ సాటికారు. ఈ కీర్తన ఈ సత్యాన్ని మరొక్కమారు నిరూపిస్తుంది. శ్రీవైష్ణవులనే పాపమూ ఏమీ చేయలేదంటున్నారు.

**ఆ.వె॥ ఎదురులేక నడతురెట్టైన వైష్ణవుల్**
**మదగజముల కేది మట్టుమేర?**
**వేంకటేశు శరణు వేడిన విరసంబు-**
**లసలు వుండవనెను అన్నమయ్య**

**రాగం : దేసాళం**

ఎదురులేక చరింతు - రెట్టైన శ్రీవైష్ణవులు
మదించి నేనుగులకు - మట్టుమేర వున్నదా ॥ఎదురు॥

భాగీరథిలోన-బాపమున్నదా పుణ్య
భోగపు వేదములలో - బొంకు లున్నవా
సాగరపు టమృతపు - చవిలో చేదున్నదా
ఆగతిహరిదాసుల - కపరాధ మున్నదా ॥ఎదురు॥

ఆకసములోన నెరు- సందున్నదా భూమి
జేకొని రవి యెదుట - జీకటున్నదా
యీకడ గామధేనువు - కియ్యరాని వున్నవా
కైకొన్న ప్రసన్నులను - గరిహించ మున్నదా ॥ఎదురు॥





హరినామ మంత్రములో - నౌగాములున్నవా
గురుకృప కలిగియు- గొరతున్నదా
సరవి శ్రీవేంకటేశు-శరణన్న వారికి
విరసంబు లందులో-వెదకగా గలదా ॥ఎదురు॥

**భావామృతం :**

శ్రీ వైష్ణవులు సర్వస్వతంత్రులు. వారు శ్రీహరిని, తమకు శ్రీహరినందించిన గురువులను తప్ప వేరెవ్వరినీ లెక్కసేయరు. ఎదురు బెదురులేక ఎట్టైనను నడుచుకుంటారు. మదగజములకు ఏ విధమైన 'మట్టుమేర' (మితి) వుండదుకదా! (మదపుటేనుగు మావటివానికొక్కనికే లొంగి వుంటుంది, అట్లే వైష్ణవులు తమ గురువుగారికి మాత్రమే లొంగి వుంటారు. ఎందుకంటే వారికి పాపమన్నదే... వుండదు).

గంగానదికి పాపమనేది వుంటుందా? పుణ్యము అనే వైభవాన్ని అందించే వేదములలో అబద్ధం అనేది వుంటుందా? క్షీరసాగరమునుంచి పుట్టిన అమృతములో చేదువుంటుందా? అదే విధంగా హరిదాసులైన వారికి అపరాధము (పాపము) అనేది వుండనే వుండదు.

ఆకాశములో నెరుసు, అందున్నదా? (అంటే-ఆకాశములో కళంకమున్నదా... అంటే ఉన్నతోన్నతమైన ఆకాశంలో దోషముంటుందా?) సూర్యుడు వుండే చోట చీకటికి చోటుంటుందా? అట్లే కామధేనువుకు ఇయ్యలేని దేదైనా వుంటుందా? కైకొన్న ప్రపన్నులకు (పూనుకొని శరణాగతిని పొందిన భక్తులకు) గర్వము అనేది వుంటుందా? ఉండనే.. వుండదు.

శ్రీహరి నామం పారాయణ చేసేవారికి ఔగాములు (ద్వంద్వములు.. మంచి, చెడు వంటివి) ఉన్నవా? గురువు యొక్క కృపపొందిన వారికి లోటు అనేది వుంటుందా? సరవి (క్రమముగా) శ్రీవేంకటేశ్వరుని శరణుపొందిన వారికి, ఆ శరణాగతిలో ఎంత వెదకినా 'విరసము' (రసములేనిది... అనగా సారములేనిది) ఏదన్నా వున్నదా? లేనే లేదు.

**5-93**

## మున్నుడి

శేషాచార్యులవారి వ్రాతప్రతి ద్వారా వెలుగులోకి వచ్చిన అన్నమాచార్య కీర్తన ఇది. మన దురదృష్టవశాన ఇందులో ఒక చరణము *లుప్తమైనది. దానిని పూరించే శక్తికూడ మనవంటి సామాన్యులకు లేదంటే అతిశయోక్తి కాదు. 'నిలువు చక్కని మేనుదండలు'... నిలువుగా నున్న చక్కని పుష్టిగల శరీరం - అని భావించాను. అంటుజూపులు అంటే, స్నేహపూరితమైన చూపులు. నిలువెత్తునా స్వామిని వర్ణిస్తున్న కీర్తన ఇది. లుప్తమైన చరణాన్ని పూరించే 'అర్హత' నాకు లేకపోయినా, నా ఆత్మతృప్తికి చేశాను... యెందుకంటే ఈ కీర్తనలో అమ్మవారి ప్రసక్తి లోపించిందనిపించింది.. నాకు దాసుని తప్పులు దండముతో సరి...కదా!.

**చం॥ నిలువుగ చక్కనైన హరి నీరజనాభుని మేను దండలున్**
**మొలకల అంటు జూపులును, మోమున నవ్వులు బూచు దేవునిన్**
**అలరిన శంఖచక్రములు హస్తములన్, వర రక్షణంబులన్**
**దొరవలె యిచ్చు స్వామి, మది దోపగ కంటిని అన్నమయ్యనెన్.**

**రాగం : రామక్రియ**

కంటి గంటి నిలువు చక్కని మేను దండలును
నంటు జూపులను జూచే నవ్వుమోము దేవుని ॥కంటి॥

కనకపు బాదములు గజ్జెలు నందెలును
ఘనపీతాంబరముపై కట్టు కటారి
మొనసి యొడ్డాణపు మొగపుల మొలనూలు
ఒనర నాభికమల ముదరబంధనము ॥కంటి॥

గరిమ వరహస్త కటిహస్తములును
సరస నెత్తిన శంఖ చక్రహస్తములు
ఉరముపై కౌస్తుభ మొప్పుగు హారములు
[తరుణులెక్కిన యెద దనరు మాలలును]* ॥కంటి॥





కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు
కట్టాణి ముత్యాల సింగార నామము
నెట్టన శ్రీవేంకటేశ నీకు గర్ణపత్రములు
నట్టె సిరసు మీద నమరెకిరీటము ॥కంటి॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! నేను నిలువుగా నున్న చక్కని పుష్టిగల శరీరంతో శోభిల్లుచున్న స్వామిని కంటిని (చూచితిని). అంటుజూపులను (స్నేహపూరితమైన దృష్టిని) ప్రసరించుచున్న ప్రభువును కంటిని. ఆ దేవుడు నవ్వుల మోము జూపి మనలను ధన్యులను చేయుచున్నాడు.

ఈ స్వామి కనకపు (బంగారు) పాదములకు గజ్జెలు, అందియలు (కాలికి మువ్వల వంటివి) ధరించియున్నాడు. ఘనమైన పసుపు పచ్చని పట్టువస్త్రమును ధరించి దానిపై నడుమునకు కట్టుకొను కటారి (ఖడ్గము) ధరించియున్నాడు. ఈయనకు "ఒడ్డాణము" (నడుమునకు ధరించు పటకా... నేటికాలంలో బెల్టు) 'ఒనసినది' బిగించబడియున్నది. మొగపుల మొలనూలు (పైకి కనిపించు మొలత్రాడు) అదిగో. ఆయన నాభిలోనుండి పుట్టిన కమలము కూడ ఒనరియున్నది (ఒప్పుచున్నది). ఉదరబంధనము (పొట్టకు బిగించిన వస్త్రము) అందముగా కనిపించుచున్నది. ఏమి ఈ దివ్యమంగళ విగ్రహము!!

గరిమ మధ్యభాగంలో ఒకవైపు స్వామి వరద హస్తము ఒకవైపు నడుముపై అభయ హస్తము కనుపించుచున్నవి. సరసన్, ఎత్తిన శంఖచక్రములున్న హస్తములు కనుపించుచున్నవి. (ఎదురు రొమ్ముపై) హారములు, కౌస్తుభమణి మెఱయుచున్నవి. [తరుణులు అధిరోహించిన గుండెలమీద శోభిల్లు చున్న మాలలు (పుష్పమాలలు, తులసి మాలలు) నయనానందకరముగా నున్నవి] చూచినవారిదే భాగ్యము కదా!!

ఈ శ్రీవేంకటేశ్వరునికి కంఠమున 'కంటసరులు' (కంఠసరులు) కట్టిఉన్నవి. భుజములకు గొప్ప భుజకీర్తులు బిగించియున్నవి. కట్టాణి ముత్యాలు (ముత్యాలహారములు), సింగారించబడిన చక్కటి నామము (నుదుటి బొట్టు) యెంతో అందంగా మెరుస్తున్నాయి. ఓ ప్రభూ! నీకు కర్ణపత్రములు (చెవి దుద్దులు) నెట్టన (తప్పకుండా) ధరింపబడియున్నవి. అట్టె (అదేవిధముగా) నీ సిరసు (శిరస్సు) మీద కిరీటము అమరియున్నది. నిన్ను జూచి మా జన్మ తరించింది తండ్రీ!

## 5-94

## మున్నుడి

సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ చిన్నది ఎన్ని విద్యలు నేర్చుకొన్నది!! అని ఆశ్చర్యపోతున్నారు. ఓ ప్రభూ! నీవామెకు దగ్గరవగానే నిన్ను ఆకర్షించి, ఇట్టే (తేలికగా) తనవశం చేసికొనినది... అంటున్నారు. అద్దానికోసమామె చేసిన సమ్మోహన విద్య యేమిటో వివరిస్తున్నారు. కొన్ని మాటలు నిఘంటువుకి కూడ చిక్కక ఆచార్యులవారి భావన వూహించుట జరిగింది. కొన్ని సమయాల్లో మా 'పాండిత్యం ఇంతే ప్రభూ!' అనక తప్పదు. దాసుని తప్పులు దండముతో సరి అని పెద్దలేనాడో చెప్పారు కదా! గోప్యంగా వివరణకు క్షంతవ్యడను.

**కం॥ ఎంతగ నేరుచుకొన్నది**
**చెంతను యున్నట్టి నిన్ను చేకొననయ్యా!**
**పంతమున నీదు చిన్నది**
**ఇంతుల నెఱజాణ జెప్పెనిటు అన్నయయున్.**

**రాగం : శంకరాభరణం**

ఎంత నేరుచుకొన్నది ఈ చిన్నది
చెంతనుండే నిన్ను ఇట్టే చేకొన్నది ॥ఎంత॥

చిగురు పెదవి మీది చిన్నలు
సగము మాటల తోడి సన్నలు
నగియేటి సెలవుల నయములు
బిగిసేటి కౌగిట ప్రియములు ॥ఎంత॥

తనివోక చెలులతో తలపోతలు
ననుపులే పొద్దు మానని చేతలు
పనివడి నీ మీది పాటలు
మొనపి ఎప్పుడు నీతో మొగమాటలు ॥ఎంత॥





వద్ద నుండి పై జల్లీ వలపులు
అద్దుకొని రతిలోని అలపులు
నొద్దికై శ్రీవేంకటేశ్వర ఒనగూడితి వీకెను
కొద్దిమీరె బింకములు కూడిన పొంకములు ॥ఎంత॥

**భావామృతం :**

ఓ ప్రభూ! ఈ చిన్నది (అలమేల్మంగమ్మ) ఇంతలో యెంత (యెన్ని విద్యలు) నేర్చుకొనినదయ్యా!! తనవద్దకు నీవు చేరగానే నిన్ను ఇట్టే (తేలికగా) చేకొనినది (తన వశము చేసికొనినది).

ఆమె లే చిగురు పెదవులపై గురుతులు, మర్మగర్భమైన మాటలతో మధ్య మధ్య సైగలు, నవ్వుతూనే నీపై పెత్తనం చూపిస్తూ చేసే ఆజ్ఞలు, బిగి కౌగిటి ప్రియములు వివరించుట కతీతముగ నున్నవి ప్రభూ!

తనివోక (తృప్తిదీరక) తన చెలులతో కూడా ఆమె నీగురించే తలపోతలు (ఆలోచనలు) చేయుచున్నది. నీపైననే ననుపులు (అనురాగము) యే సమయముననైనా మానని (వీడని) చేతలు (పనులను) చేస్తుంది. నీ మీద పనివేళా ఏవేవో చక్కటి పాటలు పాడుతుంది. నీ చెంతకూడా ఆమెకు మొగమాట మెక్కువ ఎప్పుడూ బెట్టసరి చూపునట్లే వుంటుంది. అందుకే.. ఆమె మనోజ్ఞమూర్తి స్వామీ!

ఓ దేవదేవా! ఆమె నీ దాపున నున్నప్పుడు నీపై వలపుల జల్లు కురిపిస్తుంది. అద్దుకొన్న సమాగమములలో ఆమె అలసిపోతుంది. ఈకెను (ఈమెను) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఒద్దికై (అనుకూలుడవై) ఒనగూడితివి. ఆమె బింకములన్నీ కొద్దిమీరి (అతిశయించి) నిను గూడినది. ఆ అందముల వర్ణింప నా తరమా ప్రభూ!

## 5-95

### మున్నుడి

తండ్రి అన్నమాచార్యులవారికి సమవుజ్జీ అయిన కొడుకు ఈ పెద తిరుమలాచార్యులు. ఈయన కూడ తండ్రివలెనే లెక్కకు మిక్కుటమైన సంకీర్తనలను శ్రీవేంకటేశ్వర మకుటంతో రచించి తరించాడు. ఈ కీర్తనలో పెద తిరుమల శ్రీవేంకటేశ్వరుని "ప్రభూ! ఇది (నీ మహిమ) అనంతము.... ఇది (నీమూర్తి) అద్భుతము... ఇది (నీ కథలు) ఆశ్చర్యకరము. ఓ సనాతనుడ! (ఆదికి ననాదియైన వాడా) నన్ను సరవి (క్రమముగా) రక్షించుమయ్యా!" అంటున్నారు. ఈయనా వైష్ణవుడై ఆ మతప్రచారం చేసి తరించాడు. స్వామి యెవరెవరికి ఏమిటో వివరిస్తున్నారు.

**ఉ॥ ఈయది అద్భుతంబగును యెంతటి అచ్చెరవౌ అనంతమౌ**
**రాయడ! ఓ సనాతనుడ! రమ్మిక గానవు నన్ను, పిమ్మటన్**
**తోయజనాభు గొల్చితమితో పెద తిర్మల చెప్పె గీర్తనన్**
**నాయన మించిపోయె భళి! నా పలుకుల్ నిజమౌను నమ్ముడీ.**

**రాగం : అఠాణా**

అనంతమద్భుత మాశ్చర్యం బిది
సనాతనుడ నను సరవి గావవే ॥అనంత॥

బలిమి నసురులకు భయంకరుడవు
అలరి యమరులకు నానందకరుడవు
తలకొని ఋషులకు తపఃఫలదుడవు
పలు నీ మహిమలు పలుకగ వశమా ॥అనంత॥

అరయ వేదముల కాధారంబవు
పరగగ జీవుల ప్రాణనాథుడవు
పరమయోగులకు పరబ్రహ్మమవు
తిరముగ నీమూర్తి దెలియగ వశమా ॥అనంత॥





జగముల కెల్లను సర్వబంధుడవు
తగిలిన శ్రీకాంతకు నివాసమవు
జిగి శ్రీవైష్ణవులకు శ్రీవేంకటపతివి
తగు నీ కతలిని తలచగ వశమా ॥అనంత॥

### భావామృతం

సనాతనుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అనంతమైన (మహిమలు) కలవాడవు. నీవు అద్భుతమైన (మూర్తివి). నీ ఆశ్చర్యకరమైన కథలు తలచిన వారి జన్మ ధన్యము. ఒక్కమాటలో చెప్పాలంటే... ఇది అనంతమద్భుతమాశ్చర్యంబు... అందుచేత నన్ను రక్షించవయ్యా!

దేవా! నీవు ఎంతో బలవంతులైన అసురులకు కూడా భయంకరమైన వాడవు. వారిని వెదకి మరీ... సంహరించావు. అమరులైన (మరణంలేని) దేవతల కందరికీ ఆనందము నొసగువాడవు. తలకొని (పూనుకొని) మునులకు వారి తపస్సులకు తగిన ఫలితముల నొసగు పరమాత్మవు. అటువంటి నీ మహిమ యెట్టిదో పలుకుట నా వశమా! నీవు అనంతమైన మహిమలు కలవాడవు.

ప్రభూ! నీవు చూడబోతే, వేదములన్నింటికీ ఆధారభూతుడవు... (వేద రక్షకుడవు, వేద నుతుడవు, వేదవేద్యుడవు). జీవులందరికీ (చీమ అయినా తిమింగిలమైనా, తీతువు పిట్ట అయినా గండ భేరుండమైనా, అమ్మకడుపులో పెరుగుతున్న బిడ్డ అయినా పర్వతాకారుడైన రాక్షసుడైన ప్రాణనాథుడవు (ప్రాణం రూపంలో వున్న అంతర్యామివి) నీవే. పరమయోగులందరూ పరబ్రహ్మగా భావించి ఆరాధించేది నిన్నే. అట్టి నీ మూర్తి (స్వరూపం) ఇది... అని తిరముగ (స్థిరంగా) తెలుసుకోవటం, మా వల్ల అవుతుందా?

ఓ దేవదేవా! జగములకెల్ల (పదునాల్గు భువనాలకు) నీవు సర్వబంధుడవు. తగిలిన (నిన్ను వలచి వలపించుకొన్న) శ్రీకాంతకు (లక్ష్మీదేవికి) నివాసమవు (హృదయంలోనే నివాసమై వున్నవాడవు). శ్రీవైష్ణవులందరికీ నీవు శ్రీవేంకటేశ్వరుడవు. ఓ శ్రీమన్నారాయణా! నీ భాగవత కథలు ఆశ్చర్యకరమై విన్నవారిని పావనులను చేస్తాయి. ఆ కథల నన్నింటిని తలచి నీ ఘనత నెరుగుట నావల్ల అయ్యే పనేనా? అది నేను సాధించగలనా ప్రభూ!

## మున్నుడి 5-96

తిరుపతిలో నెలకొన్న శ్రీగోవిందరాజస్వామిపై చక్కటి సంకీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. గొల్లభామల గూడి నిరతితో సరసములాడి, అలసిపోయి (నిరతితో అంటే ఆసక్తితో) పవళించాడట. తనతోటి గోపాలకులతో కచ్చుకాయలాడి (నేటికాలంలో గచ్చకాయలు... అంటున్నాం), గుదిగొని (బాగా) పడుకొన్నాడట. ఓ అమ్మాయిలారా! ఈ గోవిందుడు, యెమ్మెలకే (విలాసంగా) పవళించాడు... మీరు ఆయన పాదములు ఒత్తితే, అలసట తీరుతుంది... అంటున్నారు. పదియారువేలమంది రాచకన్నెలను ఒకేసారి చేపట్టి వాళ్లని లెక్కించుకొంటూ వారి గాఢపరిష్వంగంలో పవళించాడు... ఈ గోవిందుడే... కొండలపై శ్రీవేంకటేశ్వరుడట. ఇంకేం చెప్పను? పైగా నేడు శ్రీకృష్ణాష్టమి.

**మ॥ కనరో కొమ్మలు! నిద్దురించె నిదివో గారాల గోవిందుడున్**
**కొనిమీరిప్పుడు వొత్తుడీ నయముగా గోవిందు పాదంబులన్**
**అనె తా నన్న సత్కవీంద్రు దదివో ఆ కృష్ణమూర్తిన్ సదా**
**మన వేంకన్నను భావనంబు తెలిపెన్ మారాడగా శక్యమా!!**

**రాగం : హంసధ్వని**

కొమ్మలు పాదాలొత్తగా గోవిందుడు
యెమ్మెలకే పవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥

సరిగా గొల్లెతలతో సరసాలాడి యలసి
నిరతితో బవళించె నేడు గోవిందుడు
అరసి బృందావనాన ఆవుల గాచి వచ్చి
ఇరవుగ బవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥

కదిసి గోపాలులతో కచ్చుకాయలాడి వచ్చి
గుదిగొన బవళించె గోవిందుడు
మొదల గోవర్ధనాద్రి మోపు మోచి వచ్చి నేడు
యెదుటనే పవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥





నించి శ్రీ వేంకటాద్రిని నిలిచిందు బవళించె
కొంచక తిరుపతిలో గోవిందుడు
అంచెల బదారువేల నలమి వారి వరుస
లెంచుకుంటా బవళించె నిదివో గోవిందుడు ॥కొమ్మలు॥

**భావామృతం:**

ఓ కొమ్మలూ (అమ్మాయిలూ)! ఈ గోవిందుని పాదము లొత్తండి, ఇదిగో ఈయన యెమ్మెలకే (విలాసంగా) పవ్వళించియున్నాడు. ఈయనను ప్రశాంతంగా నిదురపోనివ్వండి.

ఈయన జవ్వనులైన గొల్లభామలతో సరిగా (సమవుజ్జీగా), నిరతితో (ఆసక్తితో) సరసములాడి అలసిపోయి, పవళించినాడు. ఈయన బృందావనంలో అరసి (వెదకుచూ) ఆవులను కాచినందువల్ల, ఇరవుగ (నెలకొని) పవ్వళించి యున్నాడట. ఇదిగో ఈ గోవిందుని సేద తీరనివ్వండమ్మా!

ఈ గోవిందుడు తనతోటి గోపబాలకులతో కదిసి (సమానముగా) కచ్చుకాయలు (చిన్న చిన్న రాళ్లతో ఆడే గచ్చకాయలు.. అనే ఆట) ఆడి అలసిపోయి గుదికొని (బాగుగా) పడుకొని నిద్రపోతున్నాడు. మొదల (ఇదివరకు) గోవర్ధన పర్వతం ఎత్తి దానిని మోసి మనల్నందర్నీ ఇంద్రుని రాళ్లవర్షంనుండి కాపాడి... నేడు అలసి మనయెదుటనే పవ్వళించి యున్నాడు. ఇదిగో ఈ గోవిందుని సేద తీరనివ్వండి.

కొంచక (ఏమాత్రమూ సంకోచించక) ఇక్కడ ఈ తిరుపతిలోని గోవిందుడే (గోవిందరాజ స్వామే) శ్రీ వేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరుడై నిలిచి (ఎప్పుడూ కంటికి రెప్పలా భక్తులందరినీ, కాచీ, కాచీ... అలసిసొలసి) పవ్వళించి యున్నాడు, పాపం... మరి అలసినాడంటే అలసిపోడా? ఒక్కటికాదు, పదియారు వేలమంది రాచకన్నెలు, వలచి ఈయనను పరిణయమాడినారు. వారినందరినీ సమానంగా సంతోషపెట్టాలంటే మాటలా. ఎవరన్నా తప్పిపోయారేమో చూసుకోవద్దూ... అందుకే "అంచెలవారి వరుసలెంచుకొంటూ" (వరుసగా వారిని లెక్కించుకొంటూ) అలసి పవ్వళించి యున్నాడు. ఇదిగో ఈ గోవిందుని సేదతీరనివ్వండి.

## మున్నుడి 5-97

ఇదివరలో చాలాసార్లు చెప్పటం జరిగింది, అన్నమాచార్యులవారి కవిత యెంత ఛందోబద్ధమైనదంటే... అతితేలికగా ఈ కీర్తన నొక సీసపద్యంలా మార్చవచ్చును. గమనించండి మరి... ఓ మనసా!... భావములోన (అంతఃకరణలోను), బాహ్యమునందున (నోటితో వెలుపలికి కూడా) గోవిందా! గోవిందా! అని చెప్పుకో, తరిస్తావు... అంటున్నారు చక్కని భజన రూపంలో.

**సీ॥ భావంబు లోనైన బాహ్యంబులోనైన**
**గోవింద గోవింద కొలువుడనుచు**
**హరియవతారము లఖిలమంత్రములును**
**హరిలోని వేను బ్రహ్మాండములును**
**విష్ణుని మహిమలే విహిత కర్మంబులు**
**విష్ణునె పొగడెను వేదములును**
**అచ్యుతడీతడే ఆదియునంత్యంబు**
**అచ్యుతుడే అసురాంతకుండు**

**ఆ.వె॥ వేంకటేశ్వరుండె వెలసిన అచ్యుతు**
**డతడె హరిహరియనె అన్నమయ్య**
**ఏమి భజన జెప్పె ఈ జన్మకిది చాలు**
**భావమిటుల జెప్పు భాగ్యమబ్బె.**

**రాగం : శుద్ధ ధన్యాసి**

భావములోనా బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా ॥భావము॥

హరియవతారములే అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి యనవో మనసా ॥భావము॥

విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా ॥భావము॥





అచ్యుతుడితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీద నిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా ॥భావము॥

**భావామృతం**

ఓ మనసా! భజన చేసేవారంతా బాహ్యంలో గోవిందా అని అంటూనే వుంటారు. అదొక్కటే చాలదు. భావములో కూడా, అంటే, మన అంతఃకరణములో కూడా గోవిందా అని తలుచుకొంటూ, నోటితో గోవిందా అనాలి. (అప్పుడే అది ఆ స్వామికి వినిపిస్తుంది. లేకపోతే నోరు నొప్పి పుడుతుంది... అంతే).

మనం ఎంతోమంది దేవతలకు మ్రొక్కుతుంటాం. వారంతా వేరెవరోకాదు... శ్రీహరి అవతారములే. ఈ పదునాల్గు భువనాలూ వేరుగా యెక్కడో లేవు. ఇవన్నీ ఆయన వుదరంలో (పొట్టలోనే) వున్నాయి. (మనమంతా పుట్టింది ఒకని నుంచే... పెరుగుతున్నది ఒకనిలోనే.. రేపు చచ్చాక పోయేదీ ఒకని దగ్గరకే... మరి మనలో మనం యెందుకు విభేదించుకొంటున్నాం? ఎంత మూర్ఖులం?) మనం రకరకాల మంత్రాలు గురువు ద్వారా ఉపదేశం పొంది పఠిస్తుంటాం. ఆ మంత్రాలన్నీ శ్రీహరి నామములే. మరి ఇంక నోరు తిరగని ఆ మంత్రాలను అపశబ్దాలు పలుకుతూ పలకటం దేనికి? హరి... హరి... హరి... అంటే చాలదా? ఓ వెఱ్ఱి మనసా! చాలును. హరి అను.

ఓ మనసా! మనం యజ్ఞయాగాది కర్మలు అనేకం యెంతో శ్రమపడి చేస్తాం. అవన్నీ వేదం నుంచే కదా! వెలుగులోకి వచ్చాయి. మరి ఆ నాలుగు వేదాలూ యెవరిని పొగడుతున్నాయి? విష్ణుని కీర్తిస్తున్నాయి. ఈ విశ్వానికంతటికీ ఆయనే అంతరాత్మ. అంతరాత్మ కనిపిస్తుందా? మరి కనబడని దేవుని యెందుకు వెదకుతావు? విష్ణువు అని భావించి వెదకి చూడు, యెక్కడనైనా ఆయనే కనిపిస్తున్నాడు. కాకపోతే, వెదకవలసిన వాడివి నీవే. అది నీ బాధ్యతే.

అచ్యుతుడంటే.. "చ్యుతి" (నాశనము) లేని వాడని అర్థం. ఆది (పుట్టుక), అంత్యము (మరణము) లేనివాడే అచ్యుతుడు. ఆయనే అసురాంతకుడు. మన మనస్సులో పుట్టి, మనసులో పెరిగే అసురుడే, అజ్ఞానం. ఆ అసురాంతకుడు యెవరు? అచ్యుతుడు. మరి ఆ అచ్యుతుడెవరు? ఏడుకొండలపై వెలసిన ఈ దేవదేవుడు, శ్రీవేంకటేశ్వరుడే. ఈయనే విష్ణువు. ఈయనే శ్రీహరి. ఆయననే, అచ్యుతా! శరణు తండ్రీ! అని భజించండి. ఆయనే చూసికొంటాడు.

**5-98**

## మున్నుడి

చాలా క్లిష్టమైన సంస్కృత కీర్తన నావిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు. కీర్తన పల్లవిలో క్రియా వాచకమే లేకపోవటంచేత భావసమన్వయం బహుకష్టతరముగా వుందని, నాకు అనిపించింది. నా మిత్రుల సహకారంతో ఈ మాత్రం వివరించ గలిగానంటే.. అది ఆ వేంకటపతి కృపకాక ఇతరము కాదు. పెద్దలు సంస్కృతంలో నిష్ణాతులు నా యత్నంలోని లోపాలను మన్నిస్తారని నా ఆకాంక్ష. ఈ కీర్తన పల్లవి "మా వంటివారికి, అన్యులకు, ఆయా విషయముల యందు, ఆయా స్థలములలోనూ, ఇంకా..." అని వుంది. చరణాలతో సమన్వయం చేసికొంటే కాని ఒక కొలిక్కి రాదు..

**ఆ.వె॥ మాదు బోంట్లకున్న మరి అన్యులకునైన**
**వివిధ విషయములలొ వేరుచోట్ల**
**ఏది గతిగ గలదు? ఈ వేంకటేశుడే**
**ఉన్న దిక్కు అనెను అన్నమయ్య.**

**రాగం : పాడి**

అస్మ దాదీనాం అన్యేషాం
తస్మిన్ తస్మిన్ తత్ర చ పునశ్చ ॥అస్మదా॥

సతతాధ్యయన నిష్ఠాపరాణాం దృఢ-
వ్రతినాం యతీనాం వనవాసినాం
గతిరిహ స్మర్తుం కా(కోవా) జగత్యాం పర-
స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ ॥అస్మదా॥





మోహినామత్యంత ముష్కరాణాం గుణ-
గ్రాహిణాం భువనైక కఠినానాం
దేహ సంక్షాళన విదేశకోవా సదా
శ్రీహరి స్మరణ విశేషః పునశ్చ ॥అస్మదా॥

కింకుర్వాణ దుఃఖిత, జీవినాం
పంకిలమనోభయ భ్రాంతానాం
శంకాం నిరురుతి స్సరసా కా, శ్రీ-
వేంకటాచలపతేర్వినుతిః పునశ్చ ॥అస్మదా॥

**భావామృతం**

మావంటి వారికీ, అన్యులకు... ఆయా విషయములలో, ఆయా స్థలములయందు... ఇంకా...

ఎల్లప్పుడూ అధ్యయనపు నిష్ఠాగరిష్టులకు, దృఢ చిత్తముగలవారికి, యతులకు, వనవాసులకు (వానప్రస్థ వాసులకు) స్మరించుటకు ఇక్కడే ( ఈ తిరుమలయే) గతి, ఇంకా జగత్తులో ఏముంది? ఇదే పరము. ఇంతకంటే విష్ణుసేవయేముంది?

మోహితులకు, అత్యంత దుర్మార్గులకు, సద్గుణులకు, లోకాలన్నింటిలో అజేయులైన వారికి, దేహాభిమానము యేమాత్రమూ లేని యోగులకు... సదా శ్రీహరి స్మరణయే విశేషించినది. ఇంకా...

ఏమి చేయాలో తెలియని దుఃఖభాజనుల విషయంలోనూ, మనస్సు పంకిలమై (మలినమై) భయావహులైన వారి విషయములలోనూ, ఏదిగతి అంటే... "అనుమాన సాగరమును" నివారించు మార్గమేమంటే, శ్రీవేంకటాచలపతికి విన్నవించుటయే... అదేగతి.

## మున్నుడి 5-99

విజయనగరంలో నెలకొన్న వీరరాఘవునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. రామపట్టాభిషేక దృశ్యాన్ని కళ్లకు కట్టి వినిపిస్తున్నారు. "శిరస్సు మీద కూకటుల రాఘవు"డట. ఆయన అంటే చిన్న పిల్లలకున్నట్లు బాగా పెరిగిన జుట్టువున్నవాడని అర్థం. "గరిమ నా వయసున దాటికి జంపిన కౌసల్య నందన రాఘవా!" అంటే... గరిమన్ ఆ వయసునన్ తాటకిన్ చంపిన కౌసల్యపుత్రుడా! అని ఆశ్చర్యపోతున్నారు. చిన్నారి పొన్నారి వయస్సులో అన్న మాట. ఈ కీర్తన భజనలాగ కూడ పాడుకోవచ్చు. పెద్దపెద్ద చరణాలు వుండటం వల్ల రాఘవా అనే మకుటం బృందగానానికి అనుకూలంగా వుంటుంది.

**ఆ.వె॥ రామ రామచంద్ర రాజీవలోచనా!**
**రఘుకులేశ! భరత, లక్ష్మణులును,**
**జయము బలుక నీకు శత్రుఘ్నుతో గూడి**
**అవని నేలుమనెను అన్నమయ్య.**

**రాగం : వరాళి**

రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరత శత్రుఘ్నుల తోడ జయమందు దశరథ రాఘవా ॥రామ॥

శిరసు కూకటుల రాఘవా చిన్నారి పొన్నారి రాఘవా
గరిమ నా వయసున దాటకి జంపిన కౌసల్యనందన రాఘవా
అరిది యజ్ఞముగాచు రాఘవా అట్టె హరువిల్లు విరిచిన రాఘవా
సిరులతో జనకుని యింటను జానకి జెలగి పెండ్లాడిన రాఘవా॥రామ॥

మలయునయోధ్యా రాఘవా మాయామృగాంతక రాఘవా
చెలగి చుప్పనాతి గర్వమడచి దైత్యసేనల జంపిన రాఘవా
సొలసి వాలిజంపి(న) రాఘవా దండి సుగ్రీవు నేలిన రాఘవా
జలధిబంధించిన రాఘవా లంక సంహరించిన రాఘవా ॥రామ॥





దేవతలు చూడ రాఘవా నీవు దేవేంద్రు రథమెక్కి రాఘవా
రావణాదులను జంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయ పట్నమేలి(న) రాఘవా
శ్రీవేంకటగిరిమీద నభయము చేరి మాకిచ్చిన రాఘవా ॥రామ॥

**భావామృతం**

ఓ రామా! రామచంద్రా! రాఘవా! (రఘువంశ తిలకా!) రాజీవలోచనా! (పద్మనయనా!) భరత, లక్ష్మణులు, శత్రుఘ్నులతోబాటు వారు జయజయ ధ్వానములుచేయుచుండగా, విరాజమానమైన దశరథరాఘవా! నీకు జయమగుగాక.

ఓ రాఘవా! నీవు శిరసుకూకటులవాడవు. (తలమీద చిన్నపిల్లలకున్నట్టు పెరిగిన జుట్టువున్నవాడవు) ఓ చిన్నారిపొన్నారి (మనోజ్ఞమైన) రాఘవా! గరిమన్, ఆ వయసునన్ (అంతాలేత వయస్సులో) తాటకిని చంపిన కౌసల్యానందనా! అరిది (దుర్లభమైన విధంగా) యజ్ఞసంరక్షణ చేసినవాడా! శివధనస్సును విరిచి జానకిని చేపట్టిన రాఘవా! నీకు జయమగుగాక!

ఓ రాఘవా! నీవు మలయునయోధ్య రాఘవుడవు (తిరిగి అయోధ్య జేరిన రాఘుడవు. మాయలేడిని చంపిన వాడవు. చేలరేగిన '(శూర్పణఖ) గర్వమును అడచిన వాడా, రాక్షస సైన్యాన్ని తుదముట్టించిన వాడా, సొలసి (మరుగున నుండి వాలిని సంహరించిన రాఘవా! సుగ్రీవునికి అభయము నొసగిన రాఘవా! సముద్రమును బంధించి వారధిని నిర్మించిన వాడవు, లంకను తుదముట్టించిన రాఘవా! నీకు జయమగుగాక!

ఓ రాఘవా! ఆ నాడు రామరావణయుద్ధంలో దేవతలందరు చూస్తుండగా దేవేంద్రుని రథమెక్కిరావణునితో యుద్ధమును చేసితివి. రావణునితో బాటువానిసేనను పుత్రులను తుదముట్టించితివి.కాని సజ్జనుడైన విభీషణుని పట్టాభిషిక్తుని చేసి రాజ్యమేలునట్లు చేసితివి. వేవేల (అతిశీఘ్రంగా) మరలి వచ్చి... ఇదిగో హంపీ విజయనగరమను ఈ పురమును పరిపాలించుచున్నావు. అంతేకాదు, అక్కడ తిరుమల నభయము నొసగుచు, రక్షించుచున్నావు. ఓ రాఘవా! అట్టి నీకు సదా జయమగుగాక! ఓ రామయ్య తండ్రీ! మమ్ముకనికరించుము.

**5-100**

## మున్నుడి

గొప్పశరణాగతి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అన్నిటికీ ఆ శ్రీవేంకటేశ్వరుడే నిర్వాహకుడు (నిర్వహించువాడు). కాబట్టి ఆ సర్వేశ్వరునే శరణుజొచ్చెదను... అంటున్నారు. తగు విధముగా, నిచ్చలు (ఎల్లవేళలా) తనదాసులు అయిన వారికి ఆ జగదేకపతియే శరణ్యము (దిక్కు) అంటున్నారు. ఆ మహానుభావుడు 'చిగురుజేవ' అవుతాడట. అంటే మనలో...మనకు ఆయనున్నాడనే, చేవ (ధైర్యము)ను, చిగురింపచేస్తాడట. అగు వరములిస్తాడట.. అంటే ఏమిటి? చదవండి..

**కం॥ సర్వేశ్వరుడే శరణము**

**నిర్వాహకుడిన్నిటికిని, నిగమ నుతుండున్**

**సర్వోత్తము డన్నయ్యనె**

**ఉర్వీపతి హరిని గొల్చె ఉద్ధతి తెలిపెన్.**

**రాగం : సింధుభైరవి.**

సర్వేశ్వరుడే శరణ్యము
నిర్వాకుడిన్నిటగాన ॥సర్వే॥

బలుదేవతలకు బ్రహ్మాదులకును
జలజనాభుడే శరణ్యము
అలరిన బ్రహ్మాండ మవిసిననాడును
నిలిపె నాతడిన్నిటి గాన ॥సర్వే॥

అనేక విధముల అఖిలజీవులకు
జనార్దనుడే శరణ్యము
అనాథనాథుడంతరాత్మకుడు
అనాదిపతి యితడటుగాన ॥సర్వే॥





తగునిశ్చలులగు తనదాసులకును
జగదేకపతే శరణ్యము
చిగురుజేవయగు శ్రీవేంకటేశ్వరుడు
అగువరములొసగు నటుగాన ॥సర్వే॥

**భావామృతం :**

ఓ మానవులారా! మనకు దిక్కు ఎవరు? కాపాడేవారు ఎవరు? ఇంకెవరున్నారు....ఆ సర్వేశ్వరుడే శరణము. ఎందుకంటే...అన్నిటినీ నిర్వహించేవాడు ఈ శ్రీవేంకటేశ్వరుడే కదా!

బలవంతులైన దేవతలకే కాదు, బ్రహ్మ మొదలైన దేవోత్తములకు కూడ పద్మనాభుడే శరణ్యము. వారంతా శరణని ఆయననే ప్రార్థిస్తారు. నేడు అలరియున్న ఈ లోకములన్నీ అవిసిన వాడు. వీటన్నింటిని ఆయనే నిలిపి సంరక్షిస్తాడు. అందుకే ఆయనని జగద్రక్షకుడని అందరూ కీర్తిస్తారు.

ఆ మహానుభావుని పేరే జనార్దనుడు. అఖిల జీవులకు ఎన్నెన్నో విధములుగా శరణు నందించి కాపాడుటయే అతని పని. దిక్కు మొక్కులేని ఆర్తులకు ఆయనే అండ. ఆయనే వారికి భర్త. పోనీ ఆయన యెక్కడో వైకుంఠంలో వుంటాడు మన గోడు ఆయనకు వినపడదేమో అని సందేహించాల్సిన పనియే లేదు. అంతరాత్మరూపంలో ఆయన మనలోనే వుంటాడు. పోనీ ఈ పతి (నాథుడు) మొన్నమొన్న వచ్చాడనుకోరాదు. ఆయన ఆదిలేని అనాది. అందుచేత ఆయనను శరణనండి.

'తగు నిశ్చలులగు' (తగినట్లు నిశ్చలత్వంతో) తన దాసులైన వారికి ఈ జగదేకపతియే శరణ్యము. "చిగురుజేవయగు శ్రీవేంకటేశ్వరుడు" (మనలో మనకే ఈ శ్రీవేంకటేశ్వరుడున్నాడులే... అనునట్టి చేవ (ధైర్యము) చిగురించునట్లు చేయు స్వామి, అగు వరము లొసగును (అన్నివరములు సానుకూలమయ్యేవే ఇస్తాడు). అటుగాన (అందుచేత) శ్రీవేంకటేశం శరణం ప్రపద్యే... అని శరణువేడండి.

## 5-101

## మున్నుడి

చక్కటి మంగళం పాడుతున్నారు అన్నమాచార్యులవారు చాలనిడుపైన చరణాలున్న కీర్తన ఇది. కాకపోతే, నారికేళపాకం కానందువల్ల తేలికగా అర్థమవుతుంది. నా అభిప్రాయమేమంటే... ఇటువంటి ఒక్క కీర్తన నిత్యపారాయణకు పెట్టుకుంటే ఇక ఏ స్తోత్రమూ, సహస్రనామపారాయణమూ, ధనవ్యయ శ్రమోపేతమైన వ్రతములు-యజ్ఞములు-తపస్సులు అవసరం లేదు. నా మాట నమ్మండి. అయితే ఒక చిన్న కిటుకువుంది.....పరిపూర్ణ విశ్వాసంతో, భక్తితో ఏకాగ్రతతో ఈ కీర్తన పాడాలి.. (దానికీ ఆయన అనుగ్రహం కావాలి, మరి)

**కం॥ గోవిందా! మంగళమిదె**
**దేవా! సర్వాత్మ! ధర్మదివ్య స్వరూపా!**
**భావించెను గరుడధ్వజ!**
**నీ వాడగు అన్నమయ్య నీరజనాభా!**

**రాగం : ఆనందభైరవి**

మంగళం గొవిందునకు జయ మంగళం గరుడధ్వజునకు
మంగళము సర్వాత్మునకు ధర్మ స్వరూపునకూ జయజయ॥మంగళం॥

ఆదికిని నాదైన దేవున కచ్యుతున కంభోజనాభున
కాదికూర్మంబైన జగదాధారమూర్తికిని
వేద రక్షకునకును సంతతవేద మార్గ విహారునకు బలి
భేదికిని సామాదిగాన ప్రియ విహారునకు ॥మంగళం॥

హరికి పరమేశ్వరునకును శ్రీధరునకును కాలాంతకునకును
పరమపురుషోత్తమునకును బహు బంధదూరునకు
సురముని స్తోత్రునకు దేవ సురగుణ శ్రేష్ఠునకు కరుణా-
కరునకును కాత్యాయనీనుత కలిత నామునకు ॥మంగళం॥





పంకజాసన వరదునకు భవ పంకవిచ్ఛేదునకు భువనకు
శంకరున కవ్యక్తునకు నాశ్చర్యరూపునకు
వేంకటాచలవల్లభవకును విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభకుంకుమ పంకలోలునకు ॥మంగళం॥

## భావామృతం

గోవిందుడైన శ్రీమన్నారాయణునికి మంగళమగుగాక! గరుడధ్వజునికి జయమునిచ్చు మంగళాశాసనములందించెదను. అందరి ఆత్మలలో నెలకొనిన, ఆ ధర్మస్వరూపునకు మంగళము, జయము కలుగుగాక!

ఆది అనేది ఏదివున్నా, దానికే ఆదియైన ఆ భగవంతునికి, చ్యుతి (నాశనము) లేని అచ్యుతునికి, కంబుజనాభునికి (పద్మము నాభియందు కలిగిన వానికి), ఆదికూర్మమువలె క్షీరసాగర మథనము చేయించిన జగదాధారునికి, వేదములను రక్షించిన మత్స్యరూపునకు, ఎప్పుడూ వేదములు నిర్దేశించిన మార్గములోనే చరించువానికి, బలిచక్రవర్తిని కట్టడిచేసిన వామనమూర్తికి, సామవేదము గానము చేయబడుచోట ప్రీతితో విహరించు దేవదేవునకు మంగళమగు గాక!

శ్రీహరికి, పరమేశ్వరుడైన నారాయణునికి, శ్రీవల్లభునికి, ప్రళయకాలమున ప్రభవిల్లు కాలాంతకుని, పరమపురుషుడని కీర్తింపబడు పురుషోత్తమునికి, అన్ని బంధములనుండి మనలను ముక్తులను చేయువానికి, దేవతలు, మునులు మొదలైనవారిచే స్తోత్రింపబడు వానికి, అన్ని దైవ సంబంధమైన గుణములున్న శ్రేష్ఠుడైన వానికి, కరుణాస్వరూపునకు, పార్వతీదేవిచే నిత్యమూ స్తోత్రింపబడు వానికి, కలితనామునికి (పొందబడిన పేరుగలవానికి... అనగా... నిత్యమూ, సర్వులచే హరి హరీ అని అంటూ నామపారాయణం చేయబడువానికి) జయమంగళ మగుగాక!

బ్రహ్మదేవుని అనుగ్రహించిన వానికి, బురదవంటి యెన్నో పాపములను ప్రక్షాళనము చేయువానికి, భవుడు అని పేరుగన్న శంకరునకే అవ్యక్తుడైన (గ్రహింబడని) వానికి, ఆశ్చర్యము గొలుపు రూపముగలవానికి, వేంకటాచలనాథునికి, విశ్వమంతటికీ ఈశ్వరుడయిన విశ్వరూపునకు, పద్మమునందు పుట్టిన శ్రీలక్ష్మీ కుచకుంభములకంటిన కుంకుమాపంకము నందు మక్కువగల శ్రీవేంకటేశ్వరునకు మంగళము కలుగుగాక! సర్వజయములు కలుగుగాక!

**ఓం నమో వేంకటేశాయ**

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ

























శ్రీరస్తు

శుభమస్తు                                                                  అవిఘ్నమస్తు

# భావయామి వేంకటేశమ్

## సంపుటి-VI

## ఎన్నుకోబడిన
## అన్నమాచార్యుల సంకీర్తనలకు
## మున్నుడి

మరియు

## భావామృతం వివరణ

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.

# భావయామి వేంకటేశమ్

**సంపుటి-VI**

మొదటి ప్రచురణ
**జనవరి 2012**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.
**Cell: 9393021360**

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09





## అన్నమాచార్యులవారి
## 602వ జయంతి సందర్భంగా భక్తితో

ఆ.వె॥ ఇష్టదేవతలను యెల్లర భావింతు
'వేంకటేశ్వరునిగ, వేడుకొనెద
అన్నమయ్య కృతికి అత్యంత సులువైన
వివరమీదలంతు విజ్ఞులార!

- రచయిత



## అంకితము

చం॥
హరివెలయింపగా నరిగి ఆయన నందక ఖడ్గ మీభువిన్
వరముగ రూపుదాల్చి నుతి బాడెను కమ్మని కీర్తనంబులన్
వరదుడు "అన్నమయ్య" హరి భక్తుడు యందరి మోక్షదాతయున్
గురువుగనెంచి అంకితము కోరిక తీరగ నిత్తు నీకృతిన్.

# భావయామి వేంకటేశమ్

## సంపుటి VI

## అన్నమయ్య కీర్తనల విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అందరి వశమా – హరినెరుగ | 3 |
| 2. | అటువంటి వాడవా | 5 |
| 3. | అణురేణు పరిపూర్ణుడౌ | 79 |
| 4. | అనరాదు వినరాదు ఆతని | 31 |
| 5. | అతడే పరబ్రహ్మమతడే | 163 |
| 6. | అదెవచ్చె నిదెవచ్చె | 99 |
| 7. | అదె శ్రీవేంకటపతి అలమేలుమంగయు | 109 |
| 8. | అప్పులవారే అందరును | 53 |
| 9. | అరసి నన్ను గాచినాడు | 69 |
| 10. | అలకలు చెల్లవు హరి పుండరీకాక్ష | 87 |
| 11. | ఆడువారు కడు గోపులు | 61 |
| 12. | అదిదేవా పరమాత్మా | 159 |
| 13. | ఇంతకంటే ఘనమిక లేదు | 107 |
| 14. | ఇంత చాలదా మాకు | 151 |
| 15. | ఇందునే తుది పదమెక్కిరి | 45 |
| 16. | ఇందులోగల సుఖమింతే చాలు | 101 |
| 17. | ఇందరు నీకొక్క సరి– యెక్కువ | 93 |







| | | |
|---|---|---|
| 18. | ఇట్టే సంసారి – కేదియు | 133 |
| 19. | ఇతర మేదియు లేదు | 57 |
| 20. | ఇతడే పరబ్రహ్మమిదియే | 117 |
| 21. | ఇన్నిచేతలను చేసెనిందు | 135 |
| 22. | ఇన్నియు చదువనేల | 67 |
| 23. | ఈపెకు నితడు తగును | 191 |
| 24. | ఊరులేని పొలిమేర | 27 |
| 25. | ఎంతకాలమో కదా | 177 |
| 26. | ఎక్కడనీ ఉద్యోగమిటు | 49 |
| 27. | ఏ కులజుడేమి యెవ్వరైననేమి | 65 |
| 28. | ఏదాయె నేమి హరీ | 197 |
| 29. | ఏమంటి వేమంటి వెరుగ నేను | 103 |
| 30. | ఏమి సేతు మమ్ము నేము | 155 |
| 31. | ఏమీ ననకురే యెప్పుడు మీరు | 85 |
| 32. | ఏల మోసపోయిరో | 185 |
| 33. | ఓహో నిలిచిన దొకటిదె | 147 |
| 34. | కలిగె మాకు నిదె కైవల్యము | 157 |
| 35. | కానరు నాలుగు కరముల వాని | 29 |
| 36. | కాయమనే వూరికి గంతలు | 105 |
| 37. | కొండల గుబ్బల నాలో | 95 |
| 38. | కొలది పుణ్యపాపాలే | 113 |

| | | |
|---|---|---|
| 39. | కొలువు చేయించుకొనే | 137 |
| 40. | కొలువుడీ భక్తి కొండల | 19 |
| 41. | కొమ్మకు నీవిట్టే | 83 |
| 42. | గోవిందనామోచ్చరణ | 193 |
| 43. | చొల్లెపు జుట్టుతోడి చుంగుల | 175 |
| 44. | జయము జయము ఇక | 111 |
| 45. | జీవుడెంతటి వాడు | 139 |
| 46. | జ్ఞానులాల యోగులాల | 123 |
| 47. | తానెతానె ఇందరి గురుడు | 189 |
| 48. | తెలియక వూరక | 13 |
| 49. | దేవశిఖామణివి దిష్ట | 121 |
| 50. | నన్ను నిన్ను నెంచుకోవో | 55 |
| 51. | నమిత దేవంభజే | 9 |
| 52. | నమామ్యహం మానవ సింగం | 59 |
| 53. | నవ నారసింహా నమో నమో | 51 |
| 54. | నరసింహ రామకృష్ణ | 89 |
| 55. | నల్లని మేని నగవు చూపులు | 169 |
| 56. | నారాయణ నీ నామము బుద్ధి | 143 |
| 57. | నిత్యపూజలివివో నేరిచిన | 63 |
| 58. | నీవంటి దైవాలు లేరు | 173 |
| 59. | పంకజాక్షులు సొలసి | 21 |




భావయామి వేంకటేశం


| | | |
|---|---|---|
| 60. | పట్టిన వారల భాగ్యము | 97 |
| 61. | పట్టినదెల్లా బ్రహ్మము | 171 |
| 62. | పసిడి చీరవాడు | 161 |
| 63. | పారకుమీ వో మనసా | 73 |
| 64. | పూజలందరూ చేసేదే | 141 |
| 65. | పెక్కులంపటములు | 195 |
| 66. | పెట్టిన కోటిందరికీ | 15 |
| 67. | పొందెరుగుదు నందువు | 129 |
| 68. | పోయ బోయ గాలమెల్ల | 7 |
| 69. | బాపు బాపు మెచ్చితిమి | 11 |
| 70. | బాలులతో వీధులలో | 77 |
| 71. | మందులేదు దీనికి | 179 |
| 72. | మరిచితిమంటే మరిలేదు | 47 |
| 73. | మాయల కగుపడి–మతిచెడి | 75 |
| 74. | ముందటి జన్మములెల్లా | 23 |
| 75. | ముగురు వేల్పులకు మూలము | 125 |
| 76. | మొక్కరో పరుషలు మోహన | 1 |
| 77. | మెఱుగు చెక్కుల అలమేల్మంగ | 145 |
| 78. | రమ్మనవే చెలువుని | 41 |
| 79. | రసికుడ తిరుపతి రఘువీర | 71 |
| 80. | రాముడిదె లోకాభిరాముడు | 17 |

81. లావణ్య శృంగారరాయ 43

82. వననిధి గురిసిన వానలివి 119

83. వలపులధికము సేయు 81

84. వలపుల సొలపుల వసంతవేళ 181

85. విచ్చేయవయ్య వేంకటాచలపతి 39

86. విభుని వినయములు వినవమ్మా 37

87. వీధుల వీధుల విభుడేగీ 149

88. వెఅపేల రమ్మనవే 167

89. వెలపల వెదకితే-వెసనాత్మ 165

90. వెట్టివాడు వెట్టిగాడు 25

91. వేదములు నుతించగ 91

92. సకల శాంతికరము 35

93. సకల జీవులకెల్ల సంజీవని 131

94. సత్యభామ సరసపు నగవు 115

95. సముఖ ఎచ్చరిక 187

96. సుగ్రీవ నారసింహుని చూడరో 153

97. సుముఖ మంగళము శుభమంగళము 201

98. సురులకు నరులకు శుభమాయె 127

99. సేవించరో నరులాల చేరి మొక్కరో 183

100. శరణంటి మాతని సంబంధమున 199

101. హరినీవు లేవా అన్నిచోట్ల 33




భావయామి వేంకటేశం

# ప్రార్థన

కం॥ శ్రీవల్లభ! మున్నుడితో
భావంబును గూర్ప ఐదువందలు దాటెన్
దేవా! అన్నయ కీర్తన
లేవేవోయెన్నితినిర హితవుగ నీకై.

ఆ.వె॥ అన్నమయ్య పాట ఆణిముత్తెపు మూట
అతని కీశ్వరుండు హరియునొకటె
ఉత్తమముగ బలికె నూయల కృష్ణుడు
ఎక్కినిలిచినాడు ఏడుగిరులు.

కం॥ శ్రీకర వేంకటనాథా!
చేకొని నాబోంట్లచేత చెప్పింతు వహో!!
తూకపు మున్నుడి, భావము
ఈ కడనా అన్నమయ్య ఇంపుకృతులకున్

ఆ.వె॥ శ్రీరఘువర! రామ! సీతామనోహర!
మున్నుడి వివరముల నెన్నుకొంటి
పరవశించి చెబుదు భావామృతము నేను
అన్నమయ్య కవిత అద్భుతమురా.

ఆ.వె॥ విత్తునాటువాడు విష్ణుడే నాట్లకు
నీరమిచ్చునదియు నిజము వాడె
అన్నమయ్య కరుణనందిన వానికి
తిరుమలయ్య కృపయు దొరకునయ్య



## ముందు మాట (సంపుటి-VI)

“మాయా మేయ జగంబు నిత్యమని సంభావించి”....అని హరిశ్చంద్రుడు కాటికాపరియై వేదాంతం తెలుపుతాడు. మన మాతృభాష అయిన ఈ తెలుగు ఎంత అద్భుతమైన భాష అంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. పై వాక్యంతో నా ముందుమాట ఎందుకు మొదలు పెట్టానంటే....

భగవానుడు తిప్పుతున్న ఈవిశ్వాన్ని మాయ ఆవరించి, సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను గోచరిస్తుంది. మిధ్య అయిన వన్నీ నిజాలుగా భావించి మనకు మనమే ‘ధనం’ అన్నదాన్ని సృష్టించుకొని దానితో పొందగలిగే సుఖాలన్నీ నిజంగా సుఖాలు కాదని, నివురు కప్పిన నిప్పులా,దుఃఖమే సుఖమనే వేషంలో వచ్చినదని, దానిని నమ్మరాదని పెద్దలు ఏనాడో చెప్పారు. పంచమ వేదమయిన భారతంలో చెప్పినదే 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులవారు అద్భుతమైన తెలుగు కీర్తనలలో చెప్పారు.

తెలుగులో ఆ మహానుభావుడెందుకు చెప్పారంటే...తెలుగులో ఒక చిన్నమాటలో ఎంతో గొప్పభావం తెలుపవచ్చును. ఒకే అక్షరాన్ని రకరకాలుగా పలికి రకరకాల అర్థాలు వచ్చేట్లు చేయువచ్చును. ఉదాహరణకి ‘ఆ’ అనే అక్షరం గమనించండి. ‘ఆ’ అంటే ‘అది’ అని అర్థం. ( ‘ఆ’ పుస్తకం ఇటివ్వు). ‘ఆ’ అంటే ‘ఏమిటి’? అని అర్థం (‘ఆ’ ఏమన్నావు ఇంకోసారి చెప్పు).‘ఆ’ అంటే ‘అవును’ అని అర్థం. (‘ఆ’ నేనూ సభలో వున్నాను). (‘ఆ’) అంటే ప్రశ్నార్థకం (‘ఆ’ అలా అయిందా?)

మళ్ళీ ఇంకొక్కసారి ఈ ముందుమాటలోని మొదటి వాక్యం గమనించండి. ‘వేదాంతం తెలుపుతాడు’-అన్న వాక్యంలో తెలుపుతాడు అంటే తెలియజేస్తాడు అనే కదా! అర్థం. తెలుపు ఒక రంగు. తాడు, కట్టటానికి ఉపయోగపడే ఒకనూలు. రెండూ కలిపితే తెలుపుతాడు (తెలియజేస్తాడు) అయింది.





ఇంత విశాల పరిధి వున్న భాష కాబట్టే తాళ్ళపాక అన్నమాచార్యుల వారు తన కీర్తనలకు ఈభాషనెన్నుకొన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో దైవస్తుతి కీర్తనలు కొన్ని సంస్కృతంలో వున్నా అవి సంఖ్యలో చాల తక్కువ, జన ప్రియత్వంలో ఎక్కువ.

దేశభాషలందు తెలుగులెస్స- అని శ్రీ కృష్ణ దేవరాయలు ఊరకనే అనలేదు. సంస్కృతం నుంచి ఆవిర్భవించినా తనదైన శైలిలో జాను తెలుగుగా రూపు దిద్దుకొని పల్లెల్లో నాట్లు వేసుకొని నేటికీ అజరామరంగా ఉన్నది జానపదుల తెలుగు. కాకపోతే నేటి ఇంగ్లీషు వ్యామోహం వల్ల బలహీనమై నాబోటి వాడి పద్యానికే తాత్పర్యం వ్రాయాల్సిన అగత్యం ఏర్పడింది.

అన్నమయ్య కీర్తనలకు భావం వ్రాయాలని నేను నిశ్చయించుకొని ఒకరి సలహా అడిగితే. తెలుగు కీర్తనలకి వివరణ అవసరమా అన్నట్లు మాట్లాడారు. పరమాత్మ దశావతారములను అచ్చతెలుగులో పాడిన అన్నమయ్య కీర్తనలు చూడండి. దీనికి సరి అయిన అర్థం (భావం) ‘నాకు తెలుసా’ అని ఎవరికి వారు మనస్సులో ప్రశ్నించుకోండి. దీక్షితులు నిజమే చెబుతున్నాడని మీకు తప్పక అనిపిస్తుంది. అన్నమాచార్యులవారి కీర్తనలు అంతతేలికగా కొరుకుడు పడవు.

సంస్కృత, తెలుగు నిఘంటువుల సహాయంతో మాత్రమే నేను ఈ నా సంకల్పం నెరవేర్చానని చెప్పటానికి నేనేమాత్రం సిగ్గు పడటం లేదు.

“ఎందరో మహానుభావులు అందరికీ వందనములు” ...అని అన్నారు త్యాగరాజ స్వామి. అన్నమాచార్యుల వారి సంకీర్తనలను సంరక్షించి, పరిశోధించి, పరిశ్రమించి, తగిన రాగములను కట్టి, సంకీర్తనలుగా పాడి, తాము ధన్యులవుటే కాక కోట్లాది మంది నాబోటి సామాన్య సంగీత ప్రియులను నిత్యమూ ఆనందపరుస్తున్న పెద్దలైన వారందరికీ పాదాభివందనలు. పిన్నలైన వారికి ఆ పెద్దవారంతటి వారు కావాలని శుభాశీస్సులు.

ఒకమాట... నిష్ణాతులు, వాగ్గేయకారులు, సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, ఎవరో ఒకరి వారు కారు. వారు అందరివారు. అట్లాగే వారి కీర్తిప్రతిష్ఠలు వారివే కాదు అందరివీ. మా అన్నమయ్య, మా ఘంటసాల, మా బాలమురళి, మా లతా మంగేష్కర్, మా మహమ్మద్ రఫీ,... వీరికి జాతి కుల మత వయో బేధాలతో పని లేదు. కీర్తిశేషులైనా వీరు మాహృదయాలలోనే వున్నారు. రేపు మేములేకపోయినా వారు మా హృదయాలలోనే వుంటారు.

అందుకని నేను ఈ నా ప్రయత్నంలో ఎవ్వరెవ్వరి శ్రమనో, కష్టార్జితాన్నో, ఈ రచనను మెరుగు పెట్టటానికి ఆ'శ్రమ' ఉపయోగించుకొని వుంటే, వారికివే నాకృతజ్ఞతలు. వారందరి సహకారంతోనే ఈకృతి సాధ్యమయిందని మనస్ఫూర్తిగా చెబుతున్నాను.

నా రచనలు పుస్తకంగా నా మిత్రుల కివ్వటంలో నాకు అది భగవత్సేవ అనే భావనే కాని వేరే చింతన లేదు. డబ్బుకి నేనెన్నడూ సరస్వతిని అమ్మలేదు, అమ్మనుగాక అమ్మను.

నాలాగే ఇతరులుకూడ ఆలోచించక పోవచ్చు. వారి కష్టాన్ని వారు ప్రతిఫలరూపంలో ఆశించవచ్చును. నేను ఉపయోగించుకొన్న అన్నమయ్య కీర్తనలు వారి శ్రమ ఫలంగా వెలుగులోకి వచ్చి ఉండవచ్చును. అప్పుడు వారికి ఇందులో నేను వారి కష్టాన్ని దోచుకున్న భావన కలుగవచ్చును. మనందరికి గురువైన తాళ్లపాక గురుపుంగవులను చూచి నన్ను మన్నిస్తారని నా ఆకాంక్ష, విన్నపము కూడా. ఈ రచన చేయాలనే ఆలోచన పుట్టించిన బ్రహ్మ, శ్రీ ఎమ్.వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ప్రోత్సాహాన్నిచ్చింది డా॥ బి.వి.ఎస్.ఆర్. మూర్తిగారు. సహకరించింది ఎందరో మహానుభావులు. అందరికీ నా కృతజ్ఞతాభివందనలు.





ఇకపోతే మున్నుడి ప్రతికీర్తనకి కావాలా? దాంట్లో పద్యం ఎందుకు? అనే ప్రశ్నలుత్పన్నమయ్యాయి. మున్నుడి అంటే ఉపోద్ఘాతం లేక అవతారిక. మున్నుడి తెలుగు మాట కాబట్టి దాన్నే ఎన్నుకొన్నాను. కీర్తన వైశిష్ట్యం తెలిపే ఉద్దేశ్యంతోనే ప్రతికీర్తనకి మున్నుడి చెప్పాను. ఇక ప్రతి కీర్తనకి ఒక పద్యం చెప్పటానికి కారణం మాత్రం పద్యాలపై నా ప్రేమ స్ఫురింప చేయటమే కాక, అన్నమాచార్యుల వారిని నా ఇష్ట దైవమైన వేంకటేశ్వరుని కీర్తించటమే.

భావామృతంలో కీర్తనని ప్రతి చరణంలోని ప్రతిమాటను వివరించాలని నా ఆశయం. అందుకనే పేరా లుగా విడివిడిగా వ్రాశాను. ఏ చరణాన్నయినా తేలికగా అర్థం చేసికొనవచ్చును.

నాకు ఆత్మానందం కలిగించిన ఈ నా ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంటుంది. నా తుదిశ్వాసదాకా. ఎందుకంటే రోజుకి ఒకకీర్తన చేసినా అన్నమయ్య కీర్తనల కన్నీ భావం వ్రాయాలంటే నా జీవితకాలం చాలదు. అలా చాలకూడదనీ, ఈ నా అన్నమాచార్యారాధనలోనే వేంకటేశ్వరుని కీర్తిస్తూనే నా కలంతో పాటు శ్వాస కూడా ఆగిపోవాలని నా నిరీక్షణ.. నా ఆకాంక్ష.

నా వెబ్‌సైట్ **www.geetadeeksha.com** లో నా ఇతర రచనలు చదివి ఆనందించి నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తాను.

**Note :** ప్రతి సంపుటిలోను ముందుమాట అంకితం యథాతథంగానే ఉంటాయి.









**6-1**

## మున్నుడి

శ్రీహరి రథోత్సవాన్ని వీనుల విందుగా వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. 'పరుషలు' అంటే చిత్రమైన వర్ణములు గల వస్త్రములను ధరించిన వారు అని అర్థం. దేవుని వూరేగింపులో పాల్గొనే నాట్యమాడు వారు కోలాటములు వేయువారన్నమాట. మోహనమూర్తి అయిన శ్రీవేంకటేశ్వరునికి మొక్కరో అంటున్నారు. ఆయన వెక్కసమైనవాడట. అంటే దుర్లభమైనవాడట. పెండ్లిచేసికొని రథంలో వూరేగి వస్తున్నాడట ఆ ఏడుకొండలవాడు. నాలాగ చూచే భాగ్యంలేనివారు, చదివి తరించండి. నేడు వినాయకచవితి... సంపుటి VI కు శ్రీకారం చుట్టాను.

**ఆ.వె॥మొక్కరో పరుషలు మోహన మూర్తికిన్**
**వెక్కసమగు గిరుల వెలసినట్టి**
**వేంకటేశ్వరునికి వెలయించె నన్నయ్య**
**రథము తాకి కొలువరందు అనెను.**

**రాగం : శంకరాభరణం**

మొక్కరో పరుషలు మోహనమూర్తికి
వెక్కసమగు శ్రీవేంకటపతికి ॥మొక్కరో॥

హరిరథమదె ముందరి నొగలవిగో
గరుడ ధ్వజమదె ఘంటలవే
సరిదిరిగేటి కాంచన చక్రములవే
తిరువీధుల నేతెంచీ గనరో ॥మొక్కరో॥

తేరుపడగలనే తెల్లగొడుగులవే
తోరణంబులవే సారథి వాడే
ధీరతగట్టిన దివ్యహయములవె
మేరువు వలెనే మెరసీనదివో ॥మొక్కరో॥





పసిడికుండయదే పట్టుకుచ్చులవే
వెస నడుమవాడే శ్రీవేంకటేశుడు
యెసగి యురమునకు యిదే యలమేల్మంగ
వసుధ పెండ్లి తేరు వచ్చీ నిదివో ॥మొక్కరో॥

**భావామృతం :**

ఓ పరుషలారా! (చిత్రమైన వర్ణములు గల వస్త్రములను ధరించిన భక్తులారా! మోహనమూర్తి అయిన శ్రీ వేంకటేశ్వరునికి మొక్కండయ్యా! ఈయన వెక్కసమైనవాడు. (దుర్లభమైనవాడు). (పదే పదే ఈ అవకాశం రాదు, మరీ...)

అదిగో శ్రీహరి రథము. అదిగో ముందరగా కనిపిస్తున్న 'నొగలు' (రథానికి కూర్చొనుటకై అమర్చిన కర్రలు) అదిగో గరుడధ్వజము. మ్రోగుచున్న ఘంటలవిగో. సమానముగా తిరుగునట్టి బంగారు రథ చక్రములవిగో. పవిత్రమైన ఈ వీధులలో వూరేగి వస్తున్న దేవదేవుడు యేతెంచినాడు. స్వామికి మొక్కి తరించండి.

అవిగో తేరు పడగలు (రథానికి కట్టిన జెండాలు) అవిగో ధవళవర్ణముతో మెరయుచున్న గొడుగులు. రథానికి కట్టిన తోరణాలు అవిగో. రథసారథి ఎంత ఠీవిగా ఉన్నాడో చూడవలసినదే. ధీరత్వంతో గట్టిన, దివ్యమైన గుఱ్ఱములవిగో. ఆహా! ఆ శ్రీహరి రథం మేరు పర్వతంలాగా మెఱిసిపోతోంది. చూచి ధన్యులవండి.

స్వర్ణముతో చేసిన కుండ (బిందె) అదిగో. పట్టువస్త్రముతో కుచ్చెళ్లుపోసి కట్టిన తెరలవిగో చూడండి. నట్టనడిమినున్నవాడే శ్రీవేంకటేశ్వరుడు. స్వామి పురముననుండే అలమేలుమంగమ్మ నేడు ఈ పెండ్లితేరు (రథము) లో వసుధ (భూదేవి)తో సహా తిరుమలేశుని రథములో మనోజ్ఞముగా వూరేగి వచ్చుచున్నది. మొక్కి మీ జన్మపావనం చేసికొనుడయ్యా!

**6-2**

## మున్నుడి

భగవానుని గీతావాక్యాన్ని మధురకీర్తనలో వినిపిస్తున్న అన్నమాచార్యులవారిని ఆలకించండి. వేలాది నా భక్తులలో వొక్కడు మాత్రమే నన్నెరుగ గలడన్నాడు పరమాత్మ. అసలు, భక్తుడు కావాలంటేనే యెన్ని నీచ జన్మలెత్తాలో. అందుకే హరినెరుగుట అందరి 'వసమా?' (వశమా), ప్రయత్నించి, యే వొక్కడోగాని యెరగడు అంటున్నారు. ఇక్కడ 'కోటి' అంటే 'వంద లక్షల' నికాదు. అనేకమంది అని అర్థం. శ్రీహరి భక్తులలో 'నిత్యుడయ్యే జీవన్ముక్తుడు' యే వొక్కడో వుంటాడు. అట్లాంటి కోట్లమందిలో తిరుమలయ్యని వెదకి పట్టుకోగల వాడొక్కడేనట... మా గతేమిటి మహానుభావా!

**ఉ॥ అందరికెట్లు సాధ్యమగు ఆ హరిమాయ నెరుంగ ఈ భువిన్**
**కందువ యెవ్వడో యొకడుగాని యెరుంగడు అన్నమయ్యనెన్**
**వందల కోట్లు కోట్లయినవారల నొక్కడు నేర్చునేవెుకో!!!**
**ముందుగ శ్రీహరిన్ గనును మోహవిముక్తుడు ముక్తుడాతడే.**

**రాగం : రామక్రియ**

అందరి వసమా- హరి నెరుగ
కందువ నొకడు- గాని యెరుగడు ॥అందరి॥

లలితపు పదిగో-ట్ల నొకడు గాని
కలుగడు శ్రీహరి-గని మనగ
ఒలిసి తెలియు పు-ణ్యుల కోట్లలో
ఇల నొకడు గాని- యెరగడు హరిని ॥అందరి॥

శ్రుతి చదివిన భూ- సురకోట్లలో
గతియను హరినె యొ- కానొకడు
అతిఘను లట్టి మ-హాత్మ కోటిలో
తతి నొకడు గాని- తలచడు హరిని ॥అందరి॥





తుదకెక్కిన ని-త్యుల కోట్లలో
పొదుగు నొకడు తల- పున హరిని
గుదిగొను హరి భ-క్తుల కోట్లలో
వెదకు నొకడు శ్రీ- వేంకటపతిని ॥అందరి॥

**భావామృతం :**

శ్రీ మన్నారాయణుడైన హరిని తెలుసుకొనుట అందరి వలనా అయ్యే పనియేనా? కందువగ (సామర్థ్యముతో) యే వొక్కడో గాని యెరగడు. పదికోట్లమంది 'లలితపు' (సరళస్వభావము) గలవారిలో శ్రీహరిని కనిమనుటకు (దర్శించు అభిలాషతో) ఏ ఒక్కడో వుంటాడు. ఒలిసి (విడమరిచి) తెలిసి కొనగలుగు పుణ్యాత్ములలో ఈ ప్రపంచంలో ఆ తెలివి శ్రీ హరిని కనుగొనడానికి వుపయోగించి కృతకృత్యుడయ్యే అదృష్టవంతుడు యే ఒక్కడో వుంటాడు. (చాలామంది ఆ తెలివితేటల్ని దేవుడి పేరుతో ధనార్జనకే వినియోగిస్తారు.... మరి శ్రీ హరి దయ వారి పై అంతవరకే వున్నది).

సద్బ్రాహ్మణ వంశంలో పుట్టిన అనేక మందిలో వేదాధ్యయనం చేయని 'నరులే' యెక్కువ, యే వొక్కడో వేదాధ్యయనం చేసినా అట్లాంటి కోట్లాది మందిలో వేదమూర్తియైన శ్రీ హరిని నీవే నాకు గతి ప్రభూ! అని ఆశ్రయించే వాడు ఏ వొక్కడో గాని వుండడు. అటువంటి అతిఘనులలో, మహాత్ములుంటారు. ఈ మహాత్ముల, తతిలో (గుంపులో) యే ఒక్కడో గాని శ్రీ హరిని మనసారా తలుచుకొనేవాడుండడు. (అట్లా తలుచుకోనివారికి శ్రీ హరి దయ ఎలా కలుగుతుంది, చెప్పండి)

సరే... ఇవన్నీ సాధించిన విరక్తుడు చివరికి 'నిత్యుడు' అవుతాడు. వాడే జీవన్ముక్తుడు. అట్లాంటి కోట్లాది మందిలో తన తలపులలో శ్రీ హరిని పొదుగుకొను (బిగించుకొనువాడు)యే ఒక్కడో గాని వుండడు. గుదిగొని (అతిశయించి), అట్లాంటి శ్రీహరి కోట్లాది భక్తులలో శ్రీ వేంకటేశ్వరుని నీవు నాకు కావాలయ్యా అని ఆశ్రయించి ఆయనను వెదకి పట్టుకోగలిగినవాడు...యేఒక్కడోవుంటాడు.(ఇక నా బోటివాడి గతేమిటి తండ్రీ!)

**6-3**

## మున్నుడి

సరస శృంగార కీర్తన చెబుతున్న అన్నమాచార్యులవారి నాకర్ణించండి. కడపలో వేలసిన దైవం శ్రీ వేంకటేశ్వరుని కడపరాయుడని పిలుస్తారు. ఆ వూరిని "దేవుని గడప" అంటారు. తిరుమల వెళ్ళాంటే  ఇక్కడినుంచే మొక్కుబడితీసుకొని భక్తులు ఆ రోజుల్లో బయలుదేరేవారు. స్వామిని వలచిన యెవ్వతైనా తనకు తెలియకుండా ఆయనను వశపరచుకొంటున్నదాయేమిటి అని అలమేలమంగమ్మకి తెగ అనుమానం వచ్చి "ఏమిటి స్వామీ! నీవు అటువంటి వాడవా? నీవన్నీ నటనతో కూడిన మొహమాటాలేనా? అని అడుగుతున్నది.

**కం॥ "నటనలు మోమాటములే**
**కుటిలంబులు నడుపువాడ!" కుందె రమణియున్**
**అటువంటివాడవా!! నువు**
**ఇటుజెప్పెను అన్నమయ్య ఈ కీర్తనమున్.**

**రాగం : సామంతం**

అటువంటివాడవా అద్దో నీవు
నటన మొక మాటాలు నడపేవు గాకా ॥అటు॥

తలపులోపల నీకు తగులు గలిగితేను
అలరి రా కుండుదువా అక్కడ నీవు
చలముల నెవ్వతో జాగుల బెట్టుక నిన్ను
వెలిలోను మఱపించి వెట్టి జేసెగాకా ॥అటు॥

కడు దమకము నీకు గమ్మి పెరరేచితేను
అదరినాతో మాట లాడకుందువా
వడి నెవ్వతో నిన్ను వాకట్టు గట్టుక యింత
ముడి వెట్టి విడిచి తా మొప్పె జేసె గాకా ॥అటు॥





తటుకన నన్ను గూడే దయ నీకు లేకుండితే
ఘటన నెదురుకొని కాగిలింతువా
యిటువలె శ్రీ వెంకటేశ కడపలోన
సటల కెవ్వతో నిన్ను చండి సేసెగాకా ॥అటు॥

**భావామృతం :**

స్వామీ! నీవు అటువంటి వాడవా! అదిగో నీవన్నీ నటనతో కూడిన మొహమాటాలే....(సంకోచములే)

ప్రభూ! నీకు తలపు లోపల (మనస్సులో) తగులు (ఆసక్తి) కలిగితే, నా దగ్గరకు రాకుండా వుంటావా? మాత్సర్యం గల యెవతై అయినా నిన్ను జాగుల బెట్టినదా? (నిరీక్షించేటట్లు చేసిందా యేమయ్యా?) నిన్నామె బయటనేవుంచి నిన్ను మఱపించి వెట్టివాడిని చేసిందాయేమయ్యా!

స్వామీ! నీకు మిక్కుటమైన పరవశత్వం కమ్ముకొనుట్లు ఆమె పెరరేచితే (ప్రేరేపిస్తే), నీవు అదరి (అతిశయించి) నాతో మాట్లాడకుండావుంటావా? ఎవత్తో నిన్ను వడిన్ (త్వరగా) వాకట్టు కట్టిందా (నోరు కట్టేసి మాట్లాడకుండా చేసిందా యేమి? నాతో మాటలు మానివేశావు) పోనీ నిన్ను ముడివేసిపెట్లుకొని విడిచి పెట్టుట లేదా యేమి?

ప్రభూ! నన్ను శీఘ్రంగా కూడే దయ నీకు లేకపోతే దైవఘటన అన్నట్లు నా యెదురు పడి కౌగలించెదవా.... ఈ విధంగా ఓ కడపరాయా! శ్రీవేంకటేశ్వరా! సటలక (మోసముతో) యెవ్వతో నిన్ను " చండిసేసెగాక!" (మూర్ఖపు పట్టుదలతో నిర్బంధించిన దేమో స్వామీ!

**6-4**

## మున్నుడి

ఒకటికి పదిసార్లు చదివినా పూర్తిగా అర్ధంకాని కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు అద్భుతమైన ఉదాహరణలతో......"తృప్తి అనేది యెరుగకనే పూటపూటకీ కొంత చొప్పున కాలమంతా గడచిపోయింది, కొత్తకొత్త రుచులు కోరుకొంటూ యెన్నడు వాటిని అసహ్యపడలేదు. వాటి వశమైపోయాను ఇకదారేమిటి?" అంటున్నారు. భావామృతం జాగ్రత్తగా ఆనాటి రాగిరేకుల వ్రాతలలోని లోపాలను పెద్దలు సవరించారు. మన కష్టం తగ్గించారు.

**చం॥ తనియక కాలమెల్ల చనె, దారుల బట్టితి హేయమైనవౌ**
**గొని రుచులన్ని కోరితిని, కొంతయు రోయక బోతినెన్నడున్**
**పనివడి నాదు చిత్తమును వంచక బోతిని అన్నమయ్యనెన్**
**దునుముచు భీతినెమ్మదిని తోయజనాభుని నిల్పుచాలురా.**

* తనియక = తృప్తి జెందక

### రాగం : దేసాక్షి

పోయబోయ గాలమెల్ల పూటపూటకు
రోయని రోతలు చూచి రుచి చూర బోయ ॥పోయ॥

తాడిమానెక్కేటి వాని తడయక పట్టిపట్టి
తోడ దోడ నెందాకా దోయ వచ్చును
కాడువడ్డ చిత్త మిది కలకాలము నిట్టే
ఆడి కెలకులోనై తనియక పోయ ॥పోయ॥

మన్నుదినియేటి దూడ మానుమంటా మొత్తిమొత్తి
కన్నిగట్టి యెందాక గాయవచ్చును
సన్నపుటాసల మీది చరిబడ్డ దేహమిది
కన్నపు గత్తుల చూపు కట్టరాకపోయ ॥పోయ॥





హేయము దొక్కకుమన్నయేచి తినేననే వాడు
చాయకురాకున్న నేమి సేయవచ్చును
మాయల వేంకటపతి మచ్చు చల్లనా యాత్మ
పాయక యాతని జేరి భయమెల్లబోయ ॥పోయ॥

### భావామృతం

అయో! జీవితంలో కాలమంతా వ్యర్ధమైపోయిందే!! పూట పూటకి క్రొత్త క్రొత్త రుచులకోసం వెంపర్లాడి, రోత బుట్టవలసిన వాటిపై రోతపుట్టక చివరికి రుచులన్నీ చూరబోయినవి (కొల్లగొట్టబడినవి ప్రభూ!)

తాటిచెట్టు నెక్కేవాడు తగిన ఏర్పాట్లు చేసికొని ధైర్యంతో తనంతట తానే మెల్లమెల్లగా పైపైకి యెక్కాలి. అంతేకాని వాడిని పట్టుకొని ఎవరన్నా కొద్ది కొద్దిగా తడయక (ఆలస్యం చేయక) ఎక్కించ గలరా? కాడువడ్డ చిత్తమిది (మన మనస్సు వ్యసనమునకు లోనయ్యేది) ఇది ఎప్పుడూ ఆడికెలకులోనై (నిందలకు గురియై) తనియక పోవును (తృప్తిచెందకుండా వుంటుంది). దీనిని మెల్ల మెల్లగా తృప్తిపడేట్లు అలవాటు చేయాలి. ఒక్కసారికే కమ్మంటే.. కాదు.

ఏదన్నా దూడ 'మన్ను' తినటానికి అలవాటు పడితే, మనం నెత్తీ నోరూబాదుకొని మన్ను తినొద్దే అంటే మానుతుందా? దాని కళ్లకు "కన్నిగట్టి" ఎంతదాక దాన్ని కాయవచ్చు (రక్షించవచ్చు?) ఈ దేహము, సన్నపు ఆశలకు (అల్పమైన కోరికలకు) చరిబడ్డదై (లోనై) కన్నపుగత్తుల చూపులను (సమ్మోహనపరచు స్త్రీ చూపులను) కట్టరాకపోవు (నియంత్రించ లేకపోతాడు) కోర్కెలకు లొంగిపోతాడు, (జీవుడు)

హేయము దొక్కకుమన్న, (యేచి తినేవాడు) చాయలకు రాకున్న (ఒప్పు చేయుటకు అలవాటు పడకపోతే) యేమిసేయగవచ్చు? (ఏమి చేయగలం?) మాయలమారి శ్రీవేంకటేశ్వరుని మత్తుమందు చల్లి, నీ ఆత్మను ఆయనకు అంటగట్టు. అప్పుడది పాయక (విడువక) ఆతనిని జేరి, భయమెల్ల బోయ (భయమునంతా పోగొట్టుకొన్నది).

## 6-5

## మున్నుడి

గీర్వాణిలో నారసింహుని స్తుతిస్తున్నారు అన్నమాచార్యులవారు. స్వామిని సుముఖుడని (చక్కటి ముఖం కలవాడని) కరుణ నిండిన చూపులు కలవాడని, సులభంగా అనుగ్రహించే నారసింహుడని కీర్తిస్తున్నారు. అట్టి నరసింహదేవునికి నమిత (వినయముగా) భజే (సేవించెదనంటున్నారు). కీర్తన అంతా సన్నుతి కావటంచేత, దాదాపు తేలికగానే అర్థమవుతుంది. రమణీయ భూషాభిరాముడట స్వామి... అందమైన నగలతో అలంకరింపబడిన అభిరాముడట (మనోజ్ఞమూర్తియట).

**తే॥ నమిత దేవంభజే వీర నారసింహ!**
**సుముఖ! కరుణేక్షణా! దివ్య సులభచరిత!**
**అన్నమార్యుడు గీర్వాణ మెన్నుకొనుచు**
**నారసింహుని వినుతించె తిరుమలేశ!**

**రాగం : హంసధ్వని**

నమిత దేవంభజే నారసింహం
సుముఖ కరుణేక్షణం సులభ నరసింహం ॥నమిత॥

విజయనరసింహం వీరనరసింహం
భుజబలపరాక్రమ స్ఫుట నరసింహం
రజనీచర విదళన విరాజిత నృసింహం
సుజన రక్షక మహాశూర నరసింహం ॥నమిత॥

దారుణ నృసింహం ప్రతాపనరసింహం
చారుకళ్యాణ నిశ్చల నృసింహం
ధీరచిత్తావాస దివ్య నరసింహం
సారయోగానంద చతుర నరసింహం ॥నమిత॥





విమల నరసింహం విక్రమ నృసింహం
కమనీయ గుణగణాకర నృసింహం
అమిత సు శ్రీవేంకటాద్రి నరసింహం
రమణీయ భూషాభిరామ నరసింహం ॥నమిత॥

**భావామృతం :**

ఓ నృసింహ దేవా! నీకు నేను వినయముగా నమస్కరించి సేవించెదను. నీవు చక్కని వదనారవిందముతో ఒప్పుచున్న సుముఖుడవు. నీ చూపులు కరుణ తొణికిసలాడు తుంటాయి. ఆర్తులైన నీ భక్తులను సులభముగా అనుగ్రహించు స్వభావము కలవాడవు.

ఓ నారసింహా! నీవు విజయములను పొందెడి వీర నరసింహుడవు. హిరణ్యకశిపుని అమాంతం ఎత్తుకొనిన భుజబలము కలిగిన నరసింహా నీ పరాక్రమము ఒక్కసారిగా స్ఫుటమైనది (స్పష్టమైనది). రజనీచరులు (చీకటిలో సంచరించు రాక్షసులను) విదళన (తుత్తునియలు చేయుచూ) విరాజితుడై (దీప్తించుచూ విలసిల్లిన) నారసింహుడవు. సుజనులను రక్షించు మహాశూరుడవు.

ఓ దేవా! నువ్వు దారుణ పరాక్రమము గల (భయంకరమైన ప్రతాపముగల) నరసింహుడవు. అందమైన, మంగళకరమైన గుణములతో నొప్పు వాడవు. నిశ్చల స్వభావము కలవాడవు. ధీరత్వం కలిగిన చిత్తము వున్నవాడవు, దివ్యమైన నరసింహుడవు. సమయస్ఫూర్తిగల యోగా నరసింహుడవు.

ఓ దేవదేవా! నీవు విమల నరసింహుడవు (నిర్మల స్వభావము గలవాడవు). పరాక్రమము ప్రదర్శనచేయువాడవు. మనోహరమైన గుణగణములు సాకారంగా రూపుదిద్దుకొనిన వాడవు. అంతులేని మంగళకరమైన వేంకటాద్రి నిలయుడవైన నరసింహుడవు. అనగా వేంకట నరసింహుడవు. అందమైన ఆభరణములతో విలసిల్లుచున్న మనోజ్ఞ నరసింహుడవు. అట్టి నిన్ను వినయముతో సేవించెదను తండ్రీ!

**6-6**

## మున్నుడి

అత్యద్భుతమైన దశావతార వర్ణన నాలకించండి. అన్నమాచార్యులవారి కీర్తనలలో నారాయణుని అవతార ప్రస్తుతి ప్రహేళికలవలె ఒక పట్టాన కొరుకుడు పడకుండా వుంటాయి. ఈ కీర్తనలో సిద్ధుడా అంటే ఈడేరిన వాడు అని అర్థం. ఆయన కోరుకోవాల్సినవేవీ లేవు. ఆయనకు అన్నీ సిద్ధించాయి. బాబోయ్ నీవు అన్నీ సిద్ధింపజేసుకొనే బాలసిద్ధుడవు. నిన్ను మెచ్చుకొంటున్నామయ్యా! నీవు రావుల సింగారపు రసము (రాచఠీవి గలిగిన శృంగారమూర్తివైన) సిద్ధుడివి. కొచ్చన వేంకటాద్రి అంటే ఏమిటి? అచ్చపు లోకాలంటే... చదవండి భావామృతం.

**కం॥ మెచ్చితివి బాల సిద్ధుడ!**
**మచ్చుకు పదిరూపులాయె బాపురె బాపూ!**
**కొచ్చన వేంకటనాథా!**
**అచ్చపు లోకాలనేలు మన్నయ్యనెరా!**

**రాగం : రామక్రియ**

బాపు బాపు మెచ్చితిమి బాలసిద్ధుడా
రావుల సింగారపు రససిద్ధుడా ॥బాపు॥

నీరధిలో విహరించు నిజసిద్ధుడా
తారితారిమెలగే పాతాళ (పాదాల) సిద్ధుడా
భారపు భూమిమోచేటి బలు సిద్ధుడా
తోరపు కంబముమీది దొడ్డ సిద్ధుడా ॥బాపు॥

మింటి పొడవైనట్టి మేటి సిద్ధుడా
గెంటిన తల్లి బదికించు సిద్ధుడా
పెంటిరాకాసి జంపిన పెను సిద్ధుడా
దంట భూతముల నెత్తురు దాగితి సిద్ధుడా ॥బాపు॥





మచ్చివూళ్లు చెరచిన మాయ సిద్ధుడా
రచ్చలోని ఱాతి గుఱ్ఱపు సిద్ధుడా
కొచ్చిన శ్రీవేంకటాద్రి గుహ సిద్ధుడా
అచ్చపు లోకములేలే ఆది సిద్ధుడా ॥బాపు॥

**భావామృతం :**

బాబోయ్... బాబోయ్... సెబాసు... ఓ బాల సిద్ధుడా (ఈడేరిన సిద్ధపురుషా!) నీవు రావుల సింగారపు రస సిద్ధుడవు (రాచ ఠీవిగలిగిన శృంగార రస సిద్ధికలిగిన దేవదేవుడవు). అట్టి నీ విభవము వర్ణించెదను.

ప్రభూ! నీవు మహాసముద్రములో ఈదులాడి విహరించిన నిజమైన సిద్ధుడవు (మత్స్యావతారం). తారి తారి మెలిగేటి పాతాళ సిద్ధుడవు (పాదాల సిద్ధుడవు) మెల్లిమెల్లిగా చలించు పాదములుగల సిద్ధుడవు (కూర్మావతారము). చాలా బరువైన భూమిని మోసిన బలమైన సిద్ధుడవు. (వరాహావతారము). తోరపు కంభము మీది దొండ సిద్ధుడా (లావుపాటి స్తంభముననున్న పెద్ద సిద్ధుడా! అనగా నృసింహావతారము).

మింటి పొడవైనట్టి మేటి సిద్ధుడా! (ఆకాశమంత యెత్తు కెదిగిన వామనుడు). గెంటిన తల్లిని బదికించు సిద్ధుడా! (భర్తచే త్యజించబడిన తల్లిని ఖండించి తిరిగి వరంగా ఆమెను బ్రతికించిన పరశురాముడు). పెంటిరాకాసిని జంపినపెను సిద్ధుడా (ఆడ రాక్షసియైన తాటకిని సంహరించిన గొప్ప సిద్ధుడు...శ్రీరామచంద్రుడు) దంట భూతముల నెత్తురు దాగితి సిద్ధుడా (దుష్ట రాక్షసులను సంహరించిన సిద్ధుడా! కృష్ణుడు లేదా బలరాముడు)

మచ్చివూళ్ల చెరచిన మాయ సిద్ధుడా! (మచ్చరము కలిగిన త్రిపురాసురులను వారి భార్యలను చెరచి చంపించిన బుద్ధభగవానుడు). రచ్చలోని రాతి గుఱ్ఱపు సిద్ధుడు (యుద్ధములో కఠినమైన అశ్వముగల సిద్ధుడు కల్కి అవతారము). కొచ్చిన (కోసుగా నున్న లేక ఎత్తైన వేంకటాద్రిమీద గుహలో (మారుమూల వున్న సిద్ధుడు (శ్రీవేంకటేశ్వరుడు). లోకములన్నింటిని అచ్చము (స్వంతంగా) ఏలునట్టి ఆదిదేవుడైన సిద్ధుడు శ్రీమన్నారాయణుడు).

**6-7**

## మున్నుడి

'చలమరి' అంటే 'మత్సరము' లేక 'ఈర్ష్య' గలవాడు. మానవ జన్మనెత్తిన జీవికి జన్మతః వచ్చే దుర్గుణములలో అది ఒకటి. తనకంటే ఇంకొకరికి యెక్కువ వుంది అని తెలియగానే కలిగేది ఈర్ష్య. అది వినాశనకారి. ఇది తెలియక వూరక (వ్యర్థంగా) సంచరించితే శాశ్వత సుఖము కలుగుతుందా అంటున్నారు అన్నమాచార్యులవారు. చక్కటి తత్త్వ బోధచేస్తున్నారు. జీవికి (ఆత్మకి) కర్మానుసారం జనన మరణాలు తప్పవు. కర్మానుభవమూ తప్పదు. శ్రీవేంకటేశ్వరుని దయకలిగేదాకా మనకు ఇంకొక గతియేది? లేదు గాక... లేదు.

**కం॥ తెలియక తిరిగే మూరక**

**చలమరికిని సుఖము యెటుల సతతం బగురా?**

**పలికెను అన్నమ సత్కవి**

**విలువగు కీర్తనము తెలిపె వేంకటనాథా!**

**రాగం : సామంతం**

తెలియక వూరక తిరిగేము
చలమరి కగునా సంతత సుఖము ॥తెలియక॥

హేయము కడుపున నిడుకొని యింకా
'చీ' యనని మాకు సిగ్గేది
పాయము పిడికిట బట్టుచునుండేటి-
కాయధారులకు గలదా విరతి ॥తెలియక॥

అంగనల రతుల యాసల నీదేటి-
యెంగిలి మనుజుల కెగ్గేది
ముంగిట నార్గురు ముచ్చుల గూడిన-
దొంగ గురుని కిందుల నిజమేది ॥తెలియక॥





జనన మరణములు సరిగని కానని
మనుజాధమునకు మహిమేది
యెనగొని శ్రీవేంకటేశు శరణ మిటు
గని మనకుండిన గతి యిక నేది ॥తెలియక॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ విచ్చిన ఈ జీవితంలో నీకు సంతోషం కలిగే ఒక్క పనికూడ చేయలేక పోయాను. మంచీ చెడు తెలియకుండా వూరకే (వ్యర్థంగా) తిరిగినాము. ఈర్ష్యతో సతమతమవుతూ బ్రతికాము. మావంటి చలమరికి (ఈర్ష్యగలవారికి) సంతత సుఖము (శాశ్వత సుఖము అనగా ముక్తి) దక్కుతుందా?

మా కడుపునిండా తుచ్ఛమైన ఆలోచనలను పెట్టుకొని, దానికి 'ఛీఛీ' అని సిగ్గుపడకనే పోతిమి. పిడికిలి పట్టుకొన్నదేదైనా యెంతసేపు వుంటుంది. నా యౌవనమూ అంతే... చూస్తుండగానే చేతిలోంచి జారిపోయినది. కాయధారులము (శరీరమును ధరించువారు) అయిన మాకు విరతి (విశ్రాంతి) అనేదుంటుందా? (చచ్చేదాక వెంపర్లాటే... కదా!)

ప్రభూ! మేము 'మనుష్యులము'. స్త్రీ సుఖం కోసం యెంగిలి బ్రతుకులు గడుపుతూ, ఆశా జలధులలో ఈదులాడుతున్నాం. అదే సుఖం అనుకొంటున్నాం. మాకు 'యెగ్గు' అనేదే లేదు. (మాకు అపరాధం అను పచ్చాత్తాపమే లేదు). ఎందుకంటే... మాముందు ఆరుగురు ముచ్చులు (దొంగలు) వున్నారు. వాళ్లకో దొంగ గురువు వున్నాడు. [కామ, క్రోధ, మోహ, లోభ, మద, మత్సరము (ఈర్ష్య) అనే ఆరుగురి గురువు మనస్సు]. వాళ్లుండగా నాకు నిజము తెలిసే అవకాశమే లేదు.

జనన మరణముల చక్రభ్రమణంలో నిరంతరం ఈ జీవుడు తిరుగులాడుతూనే వున్నాడు. మనుజాధములు సరియైనది కానలేక నీ మహిమనెరుంగకున్నారు. ఎనగొని (సమముగా తెలిసికొని) శ్రీవేంకటాధిపా! నీ శరణని నీ కరుణ పొంది "మనవలెను" (జీవించవలెను). ఇంతకన్న ఇక గతియేది తండ్రీ! మాకు.

## మున్నుడి 6-8

ఈ క్రింది సీసపద్యం చదివి ఏమాత్రం అర్థం కాకపోతే 'అబ్బో' ఈ రచయిత నారికేళపాకంలో పద్యాలు చెప్పగల ఉద్దండ పండితుడు అనుకొంటే పప్పులో కాలు వేసినట్లే. ఈ ఘనత అన్నమాచార్యులవారిది. ఏ పండితుడైన ఈ కీర్తన ప్రతిపదార్థం వివరిస్తే... మీరు నిస్సంకోచంగా ఆయనకు పాదాభివందనం చేయవచ్చును. నామాట... నిజం.

**సీ॥ పెట్టని కోట యీ పెండ్లి కుమారుడు**
**పుడమి నసురులను బొమ్మపెట్టు**
**పెల్లగించెను భూమి పిల్ల దీపులవాడు**
**పిల్లగోవిని వూదు పెండ్లికొడుకు**
**పెంచెపు తలపాగ పెండ్లికొడుకు వీడు**
**వలపించె సిరిని తాన్ నిలిపి యెదుట**
**పెంట, పెరుగు దొంగ పెంటిపోతుల గూర్చు**
**పెంట పెట్టుకొనిన పెండ్లికొడుకు**

**ఆ.వె॥ పెండ్లి పాట నెవడు వెనక యీ తీరున**
**ఆలపించె నిటుల అవనియందు**
**అన్నమయ్య పాటనెన్న నా తరమౌనె**
**దీని భావమేమి తిరుమలేశ!**

**రాగం : బౌళి**

పెట్టని కోటిందరికి పెండ్లికొడుకు బొమ్మ
బెట్టె నసురులకెల్ల పెండ్లికొడుకు ॥పెట్టని॥

పెల్లగించి భూమెతీ(త్తీ) బెండ్లికొడుకు వాడె
పిల్లగోవి రాగాల పెండ్లికొడుకు
పెల్లైన యీవుల పెండ్లికొడుకు వాడె
పిల్లదీపు పెన్నుద్ది పెండ్లికొడుకు ॥పెట్టని॥





పెంచెపు శిరసుపాగ పెండ్లికొడుకు గుం-
పించిన కోపగించీ బెండ్లి కొడుకు
పెంచకప్పుడే పెరిగె పెండ్లికొడుకు వల-
పించె జక్కని సిరి బెండ్లికొడుకు ॥పెట్టని॥

పెంట పెరుగుల దొంగ పెండ్లికొడుకు భూమి
బెంటి పోతులగూరిచె బెండ్లికొడుకు
గెంటులేని వేంకటగిరి మీదను వాడె
పెంట పెట్టుకున్నవాడు పెండ్లికొడుకు ॥పెట్టని॥

**భావామృతం :**

ఓ భక్తులారా! ఈ వివాహమహోత్సవమున మీరు చూచుచున్న ఈ పెండ్లి కొడుకున్నాడే... ఈయన మనకందరికీ 'పెట్టనికోట' (కోట ఎలా రక్షణ నిస్తుందో అలా రక్షణ నిచ్చేకోట... కాకపోతే మనమెవ్వరమూ శ్రమపడి ఆ కోటని కట్టుకోలేదు). ఈయన అసురులనెల్ల (దుర్మార్గులందరిని) బొమ్మ బెట్టెను (నిశ్శేషులయ్యేట్లు) చేసినాడు.

ఈ పెండ్లికొడుకు ఒకప్పుడు (వరాహావతారంలో) పెల్లగించి భూమిని తన ముట్టెపై యెత్తి రక్షించినాడు. ఈయన పిల్లగోవితో (వేణువుతో) రాగాలు తీసినాడు. (చక్కని పాటలు వినిపించినాడు). ఈయన "పెల్లై" (పెల్లు+అయిన=అసంఖ్యాకమైన) ఆవులను (గోవులను, లేక జీవులను పాలించే సర్వాత్మకుడు). ఈయన పిల్లదీపు పెన్నుద్ది (అందరికీ అంతులేని మాధుర్యం పంచిన జతకాడైన బాలుడు).

ఈ పెండ్లి కొడుకు "పంచెపు శిరసుపాగ" వున్నవాడు. (తలమీద పాగా బిగించి అందులో నెమలి పింఛమును అలంకరించుకొన్న అందగాడు... కృష్ణయ్య కదా!) ఈయన "గుంపించిన" కోపగించేవాడు (అతిక్రమించిన కోపము చూపినవాడు... వాళ్ల అమ్మ యశోదమీద అలిగి పాలకుండలు బద్దలు కొట్టేశాడు). ఈతడు "పెంచక అప్పుడే పెరిగినాడు" (తృణావర్తుడనే రాక్షసుడు సుడిగాలిలా వచ్చి చిన్నికృష్ణయ్యను ఎగరవేసికొని పోదామనుకొంటే అంతులేని బరువు, దేహాన్ని పెంచకనే, ఎక్కువ చేసి వాణ్ణి చిత్తుచేశాడు). చక్కని సిరిని (రుక్మిణీదేవిని) పెండ్లాడిన పెండ్లికొడుకే ఈ స్వామి.

ఈయన "పెంట పెరుగుల దొంగ" (పసుల కోష్టముల లోకి దొంగలా దూరి పెరుగులు తినేవాడు). భూలోకంలో "పెంటి, పోతులను" (స్త్రీ పురుషులను) జతకూర్చే కళ్యాణచక్రవర్తి ఈ దేవదేవుడే. గెంటులేని (సాటిలేని) వేంకటాద్రిమీదనున్న వాడే ఈ కృష్ణయ్య కూడ. ఈ పెండ్లికొడుకు కావాలని "పెంట పెట్టుకున్నవాడు", (అంటే జగద్రక్షణ కార్యక్రమము పెట్టుకొన్న జగన్నాథుడైన శ్రీవేంకటేశ్వరుడు)

**6-9**

## మున్నుడి

శ్రీరామచంద్రమూర్తి మీద చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. రాముడు లోకాభిరాముడుట. (లోకాలన్నింటిలో మనోజ్ఞమైనవాడు). ఆయన గోమున (శ్రమలేకుండా) పరశురాముని కోపమును ఆర్చెనట (అణచినాడట). ఈ కీర్తనలో "తునుమాడె నేడు దాళ్లుతోడనే వాలి నడచె" అనే చరణానికి అర్థం చెప్పమంటే" ఈరోజు ఏడు తాళ్లతో నడిచిపోయాడని చెప్పే ప్రమాదం ఉంది. 'తెలుగు' భాషను అంత 'తేలిక'గా తీసికొంటే 'తెలివి తక్కువ' గా 'తెలవెలబోయే' తిప్పలొస్తాయి... తెలుగు వెలుగండీ.

**కం॥ లోకాభిరాముడితడే**
**ఆ కోపిని పరశురాము నటుమార్చెను బో**
**చేకొను వేంకటరాముడు**
**ఈ కథలను అన్నమయ్య ఇంపుగ పాడెన్**

**రాగం : సాళంగనాట**

రామడిదే లోకాభిరాము డితడు
గోమున పరశురాముకోప మార్చెనటరే ॥రాముడిదే॥

యీతడా తాటకి జించె యీ పిన్నవాడా
ఆతల సుబాహు గొట్టి యజ్ఞముగాచె
చేతనే యీ కొమారుడా శివుని విల్లు విటిచె
సీతకమ్మ బెండ్లాడె చెప్పగొత్త గదవే ॥రాముడిదే॥

మనకౌసల్య కొడుకా మాయా మృగము నేసె
దనుజుల విరాధుని తానే చెటిచె
తునుమాడె నేడు దాళ్లు తోడనే వాలి నడచె
యినకులు డితడా యెంత కొత్త చూడరే ॥రాముడిదే॥





యీ వయసు తానే యాలి యెక్కువ జలధి గట్టి
రావణు జంపి సీత మరల దెచ్చెను
శ్రీవేంకటేశు డితడా సిరుల నయోధ్య యేలె
కావున నాటికి నేడు కంటి మిట్టె కదరే ॥రాముడిదే॥

**భావామృతం :**

ఇదే రాముడు, లోకాభిరాముడు (లోకాలన్నింటిలోన మనోజ్ఞమూర్తి) ఆయన గోమున (ఏమాత్రం శ్రమలేకుండా) పరశురాముని కోపమును ఆర్చెను (అణచెను). ఆవిధంగా ఆయన మారిపోయి శాంతుడవునట్లు చేశాడు.

ఈ చిన్నపిల్లవాడా!! తాటకి వంటి రాక్షసిని చించివేశాడు (చీల్చి చెండాడినాడు). ఆ తరువాత సుబాహుని కొట్టి (వధించి) విశ్వామిత్రుని యజ్ఞమును కాపాడినాడు. ఆ చేతితోనే జనకుని ఇంట శివధనస్సును విఱిచి, సీతను 'కమ్మ'గా (మధురముగా) పెండ్లాడినాడు. ఈ సంగతులు చెప్పన్ కొత్త గదవే (చెప్పుకోవటానికి ఎప్పటికప్పుడు కొత్తగా వుంటాయి కదా!)

మన కౌసల్య ముద్దుల కొడుకు, మాయలేడిని "ఏసెన్" (వధించినాడు). విరాధుడు మొదలైన పదివేలమంది రాక్షసులను తానొక్కడే చెఱిచె (రూపుమాపినాడు). ఆయన "తునుమాడె నేడు దాళ్లుతోడనే వాలి నడచె... (అంటే, తునుమాడెన్ + ఏడు తాళ్లు, తోడనే వాలిన్ అణచెన్... అని విడదీసికొంటే.. ఏడు తాటిచెట్లను నరికివేసి దానితో బాటు వాలి, అనే వానరరాజును అణిచివేసినాడు) అని అర్థం. సూర్యవంశస్థుడైన ఈయన చేతలు యెంత కొత్తగా వుంటాయో, చూడండి.

తానే ఈ వయస్సులోనే యెక్కువైన (అనంతమైన) జలధిని (సముద్రాన్ని) కట్టి (బంధించి సేతువుని కట్టినాడు). రావణాసురుని సంహరించి సీతను తిరిగి అయోధ్యకు తీసికొనివచ్చాడు. ఆనాడు సిరుల (వైభవముతో) అయోధ్యను యేలినది ఇతడా... ఈ శ్రీవేంకటేశ్వరుడా? అవును... కాబట్టే ఆనాటి నుంచి నేటివరకు ఆయననే కంటిమి (చూస్తున్నాం). కదరే... (కదండీ...)

**6-10**

## మున్నుడి

అత్యద్భుతమైన భక్తి జాలువారే కీర్తన ఆలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. చాల చిన్న కీర్తన అయినప్పటికీ విశేష జనాదరణ పొందిన కీర్తన ఇది. కొండలలో నెలకొన్న కోనేటి ఒడ్డున వెలసిన ఈ కోనేటి నిలయుని కొలవండి అని బోధిస్తున్నారు అన్నమయ్య. ఆయనే శ్రీనిధియైనవాడు. లక్ష్మీదేవియే ఆయన నిధి. ఆయన సామవేదం వినదించే చోటు ప్రీతితో వుంటాడట. ఆ శ్రీవేంకటేశ్వరుడే పరదేవత (పరబ్రహ్మ). భూదేవ తత్పరుడంటే... యేమిటి? చదవండి మరి.

**తరలము :**

**కొలువుడీ ఘనుడైన యీతని కోటి సూర్య ప్రకాశునిన్**
**కొలను ఒడ్డున వున్న దేవుని కొండలయ్యను భక్తితో**
**నిలుపుడీతని శ్రీనిధిన్ నవనీరజాక్షుని నెమ్మదిన్**
**కలలు పండగ అన్నమార్యుడు కాంతముక్తియు దక్కనెన్.**

**రాగం : కళ్యాణి**

కొలువుడీ భక్తి కొండల కోనేటి
నిలయుని శ్రీనిధియైన వాని ॥కొలువుడీ॥

ఆది దేవుని అభవుని సామ
వేదనాద వినోదుని నెర-
వాది జిత ప్రియుని నిర్మల తత్త్వ-
వాదుల జీవనమైన వాని ॥కొలువుడీ॥

దేవదేవుడైన దివ్యుని సర్వ-
భావాతీత స్వభావుని
శ్రీవేంకటగిరి దేవుడైన పర-
దేవుని భూదేవ తత్పరుని ॥కొలువుడీ॥





**భావామృతం :**

ఓ భక్తులారా! మరువకండి. అనన్యమైన భక్తితో ఈ ఏడుకొండలలోని వేంకటగిరిపై నెలకొనిన కోనేటి ఒడ్డున నిలయము గలిగిన ఈ కోనేటి రాయని కొలవండి. లక్ష్మీదేవియే నిధిగా గలిగిన ఈ మహానుభావుని శరణని ఆరాధించండి.

ఈ స్వామి ఆదిదేవుడు. అనాది అని ఆయనను అందరూ కీర్తిస్తుంటారు. ఈయనకు ముందు ఏమీ లేదన్నమాట. ఈయన అభవుడు అనగా పుట్టుకయే లేనివాడు. ఆయన సామవేదం ఎక్కడ గానం చేయబడుతుందో అక్కడ ఆనాదం అంటే ప్రీతితో వినోదిస్తుంటాడు. ఆయన “నెరవాది” (అంటే... బహునేర్పరి... దేంట్లో... దుష్టశిక్షణ శిష్టరక్షణలో బహునేర్పరి, అని అర్థం). ఆయన జితప్రియుడు. అంటే జయింపబడిన ప్రీతి గలవాడు. అంటే ఆయనకు దేనిమీదా ప్రీతివుండదు. ఆయన నిర్మలమైన తత్త్వము తరపున వాదించు వారికి జీవనమైన వాడు.

ఆయన దేవదేవుడు. (అనగా దేవతలకే దేవుడు. దివ్యమైన ప్రభావంగలవాడు. అన్ని భావములకు అతీతుడు అయినవాడు. అనగా ఆయనకు ఏ భావమూ వుండని స్వభావము కలవాడు. ఆయన శ్రీవేంకటగిరిపైన వుండే దేవుడు. ఆయనే పరబ్రహ్మ అని పిలువబడుతున్నాడు. ఆయన భూదేవ తత్పరుడు, అంటే భూదేవ (భూసురులు) అని పిలువబడే బ్రాహ్మణులయందు ఆసక్తికలవాడు. వారివేద పారాయణము అంటే ప్రీతికలవాడని భావము.

**6-11**

## మున్నుడి

పరమాత్ముని ఆరగింపుచేస్తున్నారు అర్చకులు. రకరకాల వంటకాలు, పిండివంటలు, పులుగములు, తీపి పదార్థములు, మీగడ పెరుగులు, వూరగాయలు ఘుమఘుమలాడే నెయ్యి... మున్నగునవి స్వామి ఆరగింపునకు సిద్ధంగా వున్నాయి. తామరలవంటి నయనములున్న తరుణులు (భూదేవి శ్రీదేవి), సొలసి (పారవశ్యంతో) ఆయనతో యేవేవో ప్రియవచనాలు చెప్పి నవ్వుతూ తినిపిస్తున్నారట. ఆ వేంకటేశ్వరుడు గబగబ ఆరగిస్తున్నారట. అన్నమాచార్యులవారు తన దివ్యమనో నేత్రంతో చూచి చక్కటి కీర్తన చెబుతున్నారు... వినండి.

**ఆ.వె॥ వంటకములు, పిండివంటలు, తీపులు**
**మధుర మీగడలును మంచి నేయి**
**పంకజాక్షులెంచి వడ్డించ నవ్వుతో**
**ఆరగింపుమనెను అన్నమయ్య**

**రాగం : ధన్యాసి**

పంకజాక్షులు సొలసి పలికి నగగా-
నింకా నారగించు మిట్లనే అయ్యా ॥పంక॥

కలవంటకములు పులుగములు దుగ్ధాన్నములు
పలుదెరగులైన అప్పములు అగములు
నెలకొన్న నేతులును నిరతంపు చక్కెరలు
గిలుకొట్టుచును నారగించవయ్యా ॥పంక॥

పెక్కువగునై దంపు పిండివంటల మీద
పిక్కటిలు మెఱుగు బొడి బెల్లములును
వొక్కటిగ గలపు కాని వొలుపు బప్పులతోడ
కిక్కిరియ నిటు లారగించవయ్యా ॥పంక॥





కడు మధురమైన మీగడపెరుగులను మంచి-
అడియాల వూరుగాయల రుచులతో
బడిబడిగ నవకంపు బళ్లెరంబులతోడ
కడునారగించు వేంకటగిరీంద్రా ॥పంక॥

**భావామృతం :**

పంకజాక్షులైన (తామరలవంటి కళ్లున్న) తరుణులు (శ్రీదేవి, భూదేవి) సొలసి పలుకుచు (పరవశముతో ప్రియవచనాలు చెబుతూ, నగగా (నవ్వుతూ) తినిపిస్తుంటే... అయ్యా! ఇట్లనే ఇంకా యెక్కువగా ఆరగింపుము తండ్రీ!

స్వామీ! నీ ఆరగింపునకు పులు(ల)గములు, దుగ్ధాన్నములు (పాలతో చేసిన పాయసాన్నములు), రకరకాల అప్పచ్చులు, అగములనే వంటలు, నేయికారిపోతున్న నేతి వంటకములు, నిరతంపు (మిక్కిలి ఆసక్తికలిగించు) చక్కెర పదార్థములు, ఇటువంటి వెన్నోవున్నాయి. గిలుకొట్టుకొని (వ్రేళ్లతో కలయబెట్టుకొంటూ) ఆరగింపుము తండ్రీ!

స్వామీ! బాగుగా దంచివేసిన పిండ్లతో (శనగపిండి, బియ్యపు పిండి, గోధుమ పిండి మొదలైన పిండ్లతో) రకరకాల పిండి వంటలున్నాయి. పొడిబెల్లము అధికముగా చల్లుటవలన కొన్ని తీపివంటకములు మెఱిసిపోతున్నాయి. వాటిని ఒక్కటిగా, కలపుకొని... ఒలుపు బప్పులలో (ఎక్కువ అయి ఒలికి పోతున్న పప్పులతో) కిక్కిరియునట్లు (కాస్తంత కూడా సందులేకుండా కడుపునిండునట్లు) ఆరగింపుము తండ్రీ!

స్వామీ! యెంతో మధురమైన మీగడ పెరుగున్నది. నీకు చిన్నప్పటినుంచీ (కృష్ణయ్యగావున్నప్పటినుంచీ) ఇష్టంకదా! అడియాల వూరగాయలు (బాగుగా వూరిన పచ్చళ్లు) మంచి రుచులతో వున్నాయి. వాటిని నవకంపు పళ్లెములలో (తొమ్మిది రకములైన పళ్లెములలో వడ్డించినారు). ఓ దేవదేవా! వాటన్నింటినీ బడిబడిగా (ఒకదాని తరువాత ఒకటిగా) కడు నారగించుము. (సమృద్ధిగా భుజించుము) ఓ వేంకటగిరీంద్రా! వాటినారగించి మమ్మల్ని తరింపజేయుము తండ్రీ!

**6-12**

## మున్నుడి

వెనకజన్మలలో మనం చేసికొనిన కర్మఫలం పొమ్మంటే పోదు. శరీరం పోయినా అది జీవిని అప్పులవాడి ఋణంలా వెంటపడి తరుముతూనే వుంటుంది. అందునా, అది మామూలు 'అప్పు' కాదు. వీడని బారువడ్డీ అప్పు. అంటే వడ్డీమీద కూడా వడ్డీ కట్టాల్సిందే. మనం యెందుచొచ్చినా (ఏ జన్మయెత్తినా) అది పోనీదు. ఈ ఋణం పట్టి పీడిస్తూనే వుంటుంది. మరి దారి యేమిటి? అన్నమాచార్యులవారు సులువైన దారి చూపిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించండి. తండ్రీ! నీవే మాకు దిక్కు అనండి. పూర్తిగా నమ్మండి అన్నీ ఆయనే చూసుకుంటాడు.

**ఉ॥ ముందటి జన్మ కర్మములు ముంచును తప్పక బారువడ్డియై**
**యెందును చొచ్చినన్ విడవు యీఋణమెప్పుడు పట్టి పీల్చురా**
**విందుగ అన్నమార్యుడనె పెట్టినవ్రాతగు నూరు యేండ్లకున్**
**పొందుగ వేంకటేశ్వరుని పూర్తిగ నమ్మిన వీడు జిక్కకన్.**

### రాగం: గుండక్రియ

ముందటి జన్మములెల్లా ముంచె బారుబడి వడ్డి
యెందు చొచ్చినాను బోనియ్యదీ రుణము ॥ముందటి॥

నుదుట వ్రాసిన వ్రాలు నూరేండ్ల పత్రము
పొదలు నా కర్మయే పూటకాపు
వెదకి సంసారము వెంట బైతరవు
యిది యెందు చొచ్చినా బోనియ్యదీ రుణము ॥ముందటి॥

పుట్టినప్పుడే తనువు భోగ్యమై నిలిచెను
జట్టి గామినుల పొందు సరియాకలు
నెట్టనయాహారములు నిచ్చ నిచ్చ లంచాలు
దిట్టనై యెందు చొచ్చినా దీరదీ రుణము ॥ముందటి॥





యెక్కువైన శ్రీవేంకటేశు మఱగు చొచ్చి
తెక్కుతోడ సలిగెల దిరుగగను
అక్కరతో నప్పుడెల్లా నవి మాకు దామచ్చి
చిక్కి యెందు చొచ్చినా జేరు నీరుణము ॥ముందటి॥

### భావామృతం:

ఓ నరులారా! మనం ముందుగా యెత్తిన జన్మలలో చేసికొనిన కర్మఫలము అంత తేలికగా పోదు. అప్పుల వాడి ఋణానికి బారువడ్డీలా పెరిగిపోతూనే వుంటుంది. అప్పుకు అయిన వడ్డీకి కూడా వడ్డీ వేస్తాడు ఆ వడ్డీకాసులవాడు. ఈ రుణము మనం యెందుకొచ్చినా (ఏ జన్మ యెత్తినా) పోనియ్యదు. (హరిశ్చంద్ర చక్రవర్తిని కూడా కాటికాపరిని చేసి కన్నీరు పెట్టించింది కదా!)

పూర్వ జన్మ కర్మఫలాన్ని మన నుదుటి మీద వ్రాసి అమ్మకడుపులో పడేస్తాడు ఆ పరమాత్మ. అది నూరేళ్ళ ఋణపత్రంలాగ "పూటకాపు" వలె వెంటపడి యేపూటకాపూట వడ్డీ కర్మఫలంలా వసూలు చేస్తూనే వుంటుంది. ఈ సంసారంలో (జగత్తులో) వెంటపడి తరుముతూనే వుంటుంది. ఇది మనం యెందుజొచ్చినా పోనియ్యదు. ఈ ఋణం వెంటాడుతూనే వుంటుంది.

ఈ తనువు (శరీరము) మనం పుట్టినప్పుడే భోగ్యమై (అనుభవించుటకు సిద్ధమైనదై) వస్తుంది. జట్టికామినుల పొందు (బోగందానితో ప్రణయం) లాగ, సరియాకలు (కూడుతుందీ, దగ్గరకు రానివ్వదు) యెంతిస్తే అంతే. తిండి దొరకాలన్నా దీనికి యే పూట లంచం ఆ పూట ఇవ్వాల్సిందే... (కోటీశ్వరుడైనా తిండిలేకుండా పడివుండాల్సిందే... అవునా? కాదా?) దిట్టంగా యెక్కడికి పోతానన్నా, ఇది పోనియ్యదు.

సర్వాధికుడైన శ్రీవేంకటేశ్వరుని, మఱుగుచొచ్చిన (ఆయనను శరణనిన) తెక్కువ సలిగెల దిరుగ అగును... (ధైర్యంతో ఆశ్రయం పొంది వ్యవహరిస్తే అన్నీ అవుతాయి అత్యవసరంగా మనం చేసిన అప్పులన్నీ మాకు "దామచ్చిచిక్కు" (తమంతట తామే సానుకూలమై తీరిపోతాయి. మనం యెందు చొచ్చినా ఈ రుణం తీరిపోవటం కూడా, దానంతటదే జరిగిపోతుంది. ఇది తథ్యం.

**6-13**

## మున్నుడి

కొన్ని కారణాంతరాల వల్ల మహాత్ములు మానవ జన్మ పొంది, భూమిపై జన్మించి వారి కర్మఫలం అనుభవించి తిరిగి వచ్చిన చోటికే వెళ్లిపోతారు. వారిలో కొంతమంది జ్ఞానబోధ చేశారు. కొంతమంది మౌనులై, నిస్సంగులై అవధూతలై కేవలం శేషజీవితం పరిసమాప్తి అవటం కోసమే జీవిస్తారు. వారు భగవంతునితోనే సంభాషిస్తూ వుంటారు. వారు ఒకప్పుడు నవ్వుతారు. ఒకప్పుడు ఏడుస్తారు. ఒకప్పుడు కోపిస్తుంటారు. అది మనకు వెఱ్ఱి చేష్టలాగ కనిపిస్తుంది. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో వాళ్లు వెఱ్ఱి కాదని, అసలు వెఱ్ఱివాళ్ళెవరో చెబుతున్నారు.

**ఆ.వె॥ విష్ణుదాస్యమెపుడు వీడు నహంకారి**
**వెఱ్ఱివాడు యతడె వినుడు నిజము**
**వెఱ్ఱివాడు కాదు వెఱ్ఱివాడన్నాడు**
**అన్నమయ్య పలుకు మిన్న జుమ్మీ!**

**రాగం : బౌళి**

వెఱ్ఱివాడు వెఱ్ఱిగాడు, విష్ణు దాస్యము లేక
విఱ్ఱవీగే యహంకారి వెఱ్ఱివాడు ॥వెఱ్ఱి॥

నాలుకపై శ్రీహరినామ మిట్టే వుండగాను
జాలితో మఱచిన నీచుడే వెఱ్ఱివాడు
ఆలరి యీజగమెల్లా హరిరూపై వుండగాను
వాలి తలపోయలేనివాడు వెఱ్ఱివాడు ॥వెఱ్ఱి॥

కూరిమి బ్రహ్మాండాలు కుక్షినున్న హరికంటే
కోరి వేరే కలడనే కుమతి వెఱ్ఱివాడు
చేరి తనయాత్మలోన శ్రీరమణుడుండగాను
దూరమై తిరిగే వాడే దొడ్డ వెఱ్ఱివాడు ॥వెఱ్ఱి॥





సారపు శ్రీవేంకటేశు శరణాగతి వుండగా
సారె గర్మములంటెడి జడుడు వెఱ్ఱివాడు
చేరువ నాతని ముద్ర చెల్లుబడి నుండగా
మోరతో పైవున్న వాడే ముందు వెఱ్ఱివాడు ॥వెఱ్ఱి॥

**భావామృతం :**

ఓ మానవులారా! మీరంతా వెఱ్ఱివాడు (పిచ్చివాడు) అనుకొనేవాడు వెఱ్ఱివాడు కాడు. నిజానికి శ్రీహరిని శరణని సేవించని అహంకారి వెఱ్ఱివాడు. విఱ్ఱవీగుతూ వాడుచేసే పనులే పిచ్చిపనులు.

'శ్రీహరి' అనుట యెంత సులభం!! సులభంగా ఆయన నామపారాయణ చేయక, జాలితో (మనోక్లేశముతో) ఆయనను మఱచిన నీచుడే వెఱ్ఱివాడు. ఈ జగమంతా శ్రీహరి రూపంతో అలరియుండగా, వాలి (అతిశయించి) ఆయనను ధ్యానించలేనివాడు అసలైన వెఱ్ఱివాడు. అంతేకాని మీరు వెఱ్ఱివాళ్లను కొనేవాళ్లు కాదు.

శ్రీహరి, కూరిమి (ఆప్యాయంగా) ఈ బ్రహ్మాండమునంతా తన కుక్షిలో (పొట్టలో) వుంచుకొని ప్రేమగా రక్షిస్తున్నాడు. ఆయన జగద్రక్షకుడు. ఆయన కాక వేరే ఇంకెవరో వున్నారు, వారివల్ల ఈ ప్రపంచం నడుస్తున్నదనే కుమతి (దుర్బుద్ధిగలవాడు) వెఱ్ఱివాడు. అంతర్యామిగా శ్రీకాంతుడు మనలోనే వున్నాడు. మనంలోపలికి గాలి పీలుస్తున్నది ఆయనవల్లనే. ఆయనే అంతరాత్మ. ఆయనవేఱే యెక్కడో వున్నాడని వెతికేవాడు అసలైన పెద్ద వెఱ్ఱివాడు. అవునా?

అన్నిటికీ సారము (మూలము) అయిన శ్రీవేంకటేశ్వరుని యొక్క శరణాగతి ఒక్కటిచాలు నిన్ను తరింపచేయటానికి. దాన్ని పట్టు కొనకుండా కర్మిష్ఠియై ఏవేవో కర్మలు (యజ్ఞ యాగాలు) చేసేవాడు అసలు జడుడు (వెఱ్ఱివాడు). ఆయన ముద్ర (నామము, శంఖ చక్రములు) విశ్వంలో యెక్కడైనను నీవు శ్రీహరి దాసుడవని నీకు విలువ నిస్తుంది. ఆ చెల్లుబడి నీ స్వంతమై వుండగా, మోరతో (పశువువలె) వ్యవహరించే వాడే ముందస్తు వెఱ్ఱివాడు.

**6-14**

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు చక్కని ఉపమానములతో తన మనస్సులోని మాటను చెబుతున్నారు. పోలి మేరలు లేకపోతే ఏ వూరుయేదో ఎలా తెలుస్తుంది? మంచిపేరు, అభివృద్ధియే బ్రతుకు వ్యర్థమే కదా! గౌరవం లేకపోయాక యెంత ప్రేమ వొలకపోసి వుపయోగమేమిటి అంటున్నారు. భయమూ శంకలేని భక్తితో శ్రీవేంకటేశ్వరుని వేడుకోవాలి. ఆయనలేని ఉత్సవాలెందుకు? దండుగ అంటున్నారు.

**మ॥ పొలిమేరొక్కటిలేక యుండ తగునా వూరన్న దింకేటికిన్**
**విలువౌ పెంపది లేనిచోట బ్రతుకన్, వేసార వ్యర్థంబగున్**
**చెలిమిన్ గారవమేమిలేక ప్రియమున్ సేసేము యింకేమిరా?**
**పలికెన్ సత్కవి అన్నమయ్య వినుమా పాలింపు మా శ్రీహరీ!**

**రాగం : రంజని**

ఊరులేని పొలిమేర పేరు పెంపులేని బ్రతుకు
గారవంబు లేని ప్రియము కదియ నేటికే ॥ఊరు॥

ఉండరాని విరహవేదన వుండని సురతసుఖమేల
యెండలేని నాటినీడ యేమి సేయనే
దండి గలుగు తమకమనెడి దండలేని తాలిమేల
రెండునొకటి గాని రచన ప్రియములేటికే ॥ఊరు॥

మెచ్చులేని చోట మంచిమేలు గలిగినేమి నెలవు
మచ్చికలేనిచోట మంచిమాటలేటికే
పెచ్చు పెరుగులేని చోట ప్రియము గలిగియేమి ఫలము
ఇచ్చలేని నాటి సొబగులేమి సేయనే ॥ఊరు॥





బొంకులోని చెలిమి గాని పొందులేల మనసులోన
శంకలేక కదియలేని చనవు లేటికే
కొంకుగొసరు లేని మంచికూటమలర నిట్లగూడి
వేంకటాద్రి విభుడు లేని వేడుకేటికే ॥ఊరు॥

## భావామృతం

ఓ జనులారా! ఊరు అనేదొకటుంటే... దానికి పొలిమేర (సరిహద్దులు) వుండాలిగాని, వూరే లేకపోతే సరిహద్దు దేనికి? పేరు మర్యాదలేని బ్రతుకు వ్యర్థం కదా! గౌరవము లేకపోయాక యెంత ప్రేమిస్తున్నా నిరుపయోగమే. (ఉప్పులేని పప్పులాగా ఎంతవున్నా వ్యర్థమే). ఇవన్నీ కదియనేటికి (కూడియేమి లాభము)

జవ్వని సమాగమము లేనప్పుడు అంతులేని విరహము దండుగ మారి వ్యవహరమే కదా! బాగా ఎండవుంటే నీడ వుపయోగం గాని యెండలేని రోజున నీడయెందుకు? దండి (శౌర్యము) ఉన్న వాడికి తమకము (మోహము) వున్నా చెల్లుతుంది. అట్లే అండ, దండలేనివాడికి యెంత ధైర్యమున్నా వ్యర్థమే కదా! ఇద్దరు ఒక్కటి కాకపోయాక, ఎంత ప్రేమ వొలకబోసినా అదంతా యెందుకు?

ఎవరికన్నా మంచిమేలు (వుపకారం) చేసినంత మాత్రాన, సరిపోదు, అప్పుడప్పుడూ వారిని మెచ్చుకోవాలి కూడా. ఎవ్వరిమీదనైనా మచ్చిక (ఆసక్తి) లేకపోతే వారితో యెన్ని మంచిమాటలు మాట్లాడినా లాభంలేదు. ఒక యజమాని దగ్గర పనికి జీతంలో పెరుగుదలవుండదు కాని ఎంతో ప్రేమ వొలకబోసి మాట్లాడుతాడు. ఆ ఊకదంపుడు వ్యర్థమే కదా! కోరికలేనివాడు సౌందర్యాన్ని యేమి చేసికొంటాడు?

అవసరమైతే స్నేహం కోసం, బొంకుటకైన సిద్ధపడే స్నేహితుడు కావాలి. అట్లు లేనివాడి పొందు యెందుకు? మనస్సులో యేమాత్రం శంకలేక కలిసిపోవలెను. కాని పైపై చనవులు (ఆప్యాయతలు) యెందుకు? కొంకుకొసరు లేని (భయము, సంకోచము లేనట్టి) మంచి భక్తితో శ్రీవేంకటేశ్వరుని వేడుకొనవలెను. అంతేకాని శ్రీహరియే లేని ఉత్సవము అదేమి ఉత్సవం చెప్పండి.

**6-15**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చతుర్భుజుడైన శ్రీకృష్ణుని వర్ణిస్తున్నారీ కీర్తనలో. ఆయన సాక్షాత్తు శ్రీనాధుడు. ఆయనను కనులారా దర్శించి చేరవలదా? అంటున్నారు. ఆయన శంఖచక్రములతో వరదహస్తుడైన విష్ణువువలె దేవకీ వసుదేవులకు దర్శనమిచ్చాడు. ద్వాపరయుగంలో దేవతల భయం నివారించాడు. విశ్వరూపం చూపాడు, చాపల్యం మాని కౌరవులను ఆయనని శరణనవలదా? సరే, నేడు ఆయనే వేంకటేశ్వరుడు అని శరణు కోరవలదా?

**కం॥ కనరే నాలుగు చేతుల**
**వనమాలిని శంఖచక్ర వరదున్ శౌరిన్**
**వినుమని అన్నయ పాడెను**
**తన కృష్ణుడు తిరుమలగిరి దాతని తెలిపెన్**

**రాగం : హిందోళం**

కానరు నాలుగు కరముల వానిని
శ్రీనాథుండని చేరగ వలదా ॥కానరు॥

ఘన చక్రముతో గరుడని నెక్కుక
కినిసి మెరయు నలకృష్ణునిని
ఘనులై ఇప్పటి కాలపు మనుజులు
మునుప విష్ణుడని మొక్కగ వలదా ॥కానరు॥

పలుదేవతలకు భయములు మాన్పుచు
అల విశ్వరూపమైనపుడు
చలము మాని యచ్చటి కౌరవులును
తెలిసి దేవుడని కొలువగ వలదా ॥కానరు॥





చెప్పిన యితడే శ్రీవేంకటమున
యెప్పుడు వరములు ఇయ్యగను
తప్పక యీతని దాసులవలనే
యిప్పటివారలె యెరగగ వలదా ॥కానరు॥

## భావామృతం

ఓ ప్రజలారా! చతుర్భుజుడైన ఈ శ్రీహరిని, శ్రీనాథుని దర్శించరేల? ఆయనను దర్శించి ఆయనను చేరుకోవలదా?

గొప్ప చక్రాయుధముతో గరుత్మంతుని అధిరోహించి వెలుగులు జిమ్ముచున్న శ్రీకృష్ణుని పూర్వపు శ్రీమహావిష్ణువని మొక్కవలదా?

ఎంతోమంది దేవతల భయమును హరించిన ఈ కృష్ణుడు అసురాంతకుడు. ఆనాడు కౌరవ సభలో విశ్వరూపం చూపించినప్పుడైనా వారు ఆయనెవరో గ్రహించి శరణన వలదా?

ఆనాడు భగవద్గీతను ఆవిధముగా చెప్పిన శ్రీకృష్ణుడే నేడు శ్రీవేంకటశైలమున వెలసిన శ్రీవేంకటేశ్వరుడు. ఎప్పుడూ వరములనీయుటకే ఆయన అవతరించినాడు. తప్పకుండా ఈయన దాసుల వలెనే ఈ కలియుగంలో జీవులు వ్యవహరించవలదా? తప్పకుండా అలాగే వుండాలి.

## మున్నుడి 6-16

అన్నమాచార్యులవారి అద్భుతసృష్టిని ఆస్వాదించండి ఇక్కడ ఈ కీర్తన రూపంలో ఆయన కూడా ఒక గోపబాలుడై యశోదమ్మతో కృష్ణయ్య ముచ్చట్లను చెబుదున్నారు. ఈ కృష్ణయ్య మాయలు ఏమని చెప్పమంటావమ్మా! ఈ సంగతుల గురించి అనరాదు వినరాదు. రోజుకు ఒక కొత్తమాయ చూపిస్తాడు. ఇదంతా మాకు ద్రిష్టము (భాగ్యము).. అంటున్నారు. కీర్తనలో ఆ మాయలను వివరించారు. ఏడిపించబడిన గోపబాలుర కన్నీళ్ళను వేంకటేశ్వరుడు పట్టిజోకితే (తూచంగానే) అవి మంచి ముత్యాలయిపోయాయట. ఎందుకంటే ఆ గోపాలకృష్ణయ్యే తిరుమలవేంకన్న అంటున్నారు.

**కం॥ అనరాదిది వినరాదనె**
**ఘనుడగు కృష్ణయ్యమాయ "కత"లాయె జుమీ!**
**దినదినము కొత్తలాయెను**
**మన ద్రిష్టము అన్నమయ్య మాటను వినుడీ!**

**రాగం : దేశాక్షి**

అనరాదు వినరాదు ఆతని మాయలు
దినదిన క్రొత్తలాయ ద్రిష్టమిదేమాకు ॥అనరాదు॥

ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లి
యీడమాతె జెప్పగాను యిందరము గూడిపోయి
చూడబోతే పంచదారై చోద్యమాయనమ్మా ॥అనరాదు॥

తీటతీగోలు సొమ్మంటా దేహము నిండా గట్టె
తీటకుగాక బాలులు తెగవాపోగా
పాటించి యీ సుద్ది విని పారితెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయె కొత్తలోయమ్మా ॥అనరాదు॥





కాకిజున్ను జున్నులంటా గంపెడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవగ
ఆకడ శ్రీవెంకటేశుడా బాలుల కంటి నీరు
జోకగ ముత్యాలు పేవె జూడగానేనేము ॥అనరాదు॥

**భావామృతం :**

ఓ యశోదమ్మా! ఈ కృష్ణయ్య మాయల గురించి ఎక్కడా అనరాదు వినరాదు (అనలేము వినలేము). అంటే మనం చెప్పి యెవ్వరూ నమ్మలేరు . ఈ సంగతులు రోజురోజుకీ కొంగ్రొత్తగానే వుంటాయి. ఇదంతా మాకు భాగ్యమేనమ్మా!

మీ కృష్ణయ్య స్వయంగా శ్రీహరియే. ఎందుకంటే ఒక సారి తనతో ఆడుతున బాలురను ఏదీ మీనోరుచూపండి అని అడిగి, ఆ వెర్రి గోపాలురు నోళ్ళు తెరువంగానే చటుక్కున నోట్లోదుమ్ము పోసినాడు. ఇంతమందిమీ కూడబలుక్కుని మీక చెప్పికొట్టిద్దామనుకొంటే నోట్లోవున్న దుమ్ము కాస్తా పంచదారగా మారిపోయింది. ఏమి చోద్యం (వింత) తల్లీ!

ఒకనాడు, తీటతీగోలు (దురదగుంట ఆకు తీగెలు) తీసుకువచ్చి, ఇవిగో మీ సొమ్ములు (నగలు) అని మెడకు చుట్టుతాడు. తీటకుగాక (దురద ఆపుకో లేక) వాళ్ళు ఏడుస్తుంటే పకపకానవుతాడు. ఈ సుద్ది (కథ) విని నువ్వు పారితెంచి (గబగబ) వచ్చి చూస్తె ఈ తీగెలే నగలుగా మారిపోయి మా నోళ్ళు మ్రాన్పడిపోయాయి. అదీ పాతనగలు కాదు సరికొత్తనగలు. ఇకమమ్మల్నేం చెప్పమంటావమ్మా!

ఒకసారి కాకిజున్నును తీసికొని వచ్చి, ఇదిగో జున్ను తినండి బాగుంటుంది అని గంపెడు కాకి జున్ను వెర్రి గోపాలురతో తినిపించాడు వా కొలిపి (నోళ్ళు చెడి) వాళ్ళంతా, వాపోతుంటే (ఏడుస్తుంటే) తను దయగల శ్రీ వేంకటేశ్వరుడు కాబట్టి వాళ్ళు ఎంత కంటినీరు కార్చారో, జేకగా (తూచినట్లు) అన్ని మంచి ముత్యాలు ఆ కన్నీటి బొట్లు అయ్యేట్లు చేశాడు. ఓ యశోదమా! నేము( మేము) ఇంకా ఏం చెప్పగలమమ్మా!

**6-17**

## మున్నుడి

హరిదాసులపై చక్కని కీర్తన నాలాపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. ఓ శ్రీహరీ! అన్ని చోట్లా నీవు లేవా! పూర్వం ప్రహ్లాదుడు వంటి నీ దాసులు నిన్ను సమస్తమునందును దర్శించిరి గదా! కాకపోతే అటువంటి నీ దాసులు ఈ అవనిలో అత్యల్పంగా వున్నారు. ఆ మాట నిజం. వాళ్ళ కోసం వెతకాల్సిందే..మరి సంకోచించకుండా నీ దాసులెంతో మంది నన్ను కరుణించారు. ఇక ఓ శ్రీవేంకటేశ్వరా! కడమలేమిటికి! (కొరతేమున్నది?) అంటున్నారు.

**చం॥ అరయగ నీదు దాసులిల అల్పము సంఖ్యల అంతియే ప్రభూ!**
**హరి! నిను జూడగాగలరు అద్భుత రీతిని అన్ని తావులన్**
**పరమ నిగూఢ సత్యమును బాగుగ జెప్పెను అన్నమార్యుడున్**
**మురియుచు వేంకటాధిపుడు ముందుగ కీర్తన నాలకించుటో.**

**రాగం : సావేరి**

హరి నీవు లేవా అన్ని చోట్లను తొల్లి
అరయ నీదాసులే యరుదింతే కాక ॥హరి॥

కంటిమి నీ దాసులను కన్నుల పండుగగాను
కొంటిమి పాదతీర్థము కొల్లలుగాను
వింటిమి నీ నామములను వీనుల పండుగగాను
అంటిన మోక్షము త్రోవ అడుగనేమిటికి ॥హరి॥

నుతించి మాటాడితిమి నోరార నీ దాసులను
మతి చొక్కితిమి దాస్యమహిమచేత
మతిగంటిమి వారి సంగతి కూటముల వల్ల
వెతకి విజ్ఞానము వేడనేమిటికి ॥హరి॥





మొక్కితి జాగిల నీ మోహపు దాసులకును
యెక్కితి పరమ పదమిహమందునే
తక్కక మన్నించిరి నీ దాసులెనన్నన్నిటాను
గక్కన శ్రీవేంకటేశ కడమలేమిటికి ॥హరి॥

**భావామృతం :**

ఓ శ్రీహరీ! యెల్లెడను (ప్రతిచోటా) నీవులేవా? ఉన్నావు. కానీ తొల్లి నీ దాసులే (పూర్వకాలం నాటి నీ దాసులే) అరుదుగావున్నారు. కాక (అంతేకాని మరొకటి కాదు).

ప్రభూ! మాకన్నుల పంటవలె నీ దాసులను గాంచితిమి. వారి పాదతీర్థమును సమృద్ధిగా స్వీకరించితిమి. వారు సంకీర్తనముజేయగా నీ నామమును మా చెవ్వులకు విందు అన్నట్లు వింటిమి. ఇంక మాకు మోక్షమార్గం తెలిసిందా అని వేరే అడుగవలెనా? అనగా మేము ముక్తి పథంలోనే వున్నాము. అచిరకాలంలోనే మేము శ్రీహరిని చేరుట తథ్యము.

ఓ శ్రీహరీ! నీ దాసులను పొగడుచు మా నోరార మాటలాడితిమి. నీ దాస్యము వలన అనగా దాని మహిమచేత మనస్సుచొక్కుట (పరవశించుట) అనుభవించితిమి. వారి కలయికలవల్ల మతిగంటిమి (సద్బుద్ధిని పొందితిమి). ఇంకా విజ్ఞానమనగా నేమియో తెలియుటకు పరులను వేడుకొనవలెనా?

ఓ దేవదేవా! నీ మోహపు దాసులకు (నీపై అపరిమితమైన వ్యామోహంగల నీ దాసులకు) మేము జాగిల మొక్కితిమి (సాష్టాంగ నమస్కారములను ఆచరించితిమి). ఇహ మందునే పరమపదము (మోక్షమార్గమును) అంటితిమి (చేరితిమి), ఇక నీ దాసులు మమ్ము విడువక అన్నిటిలోను అన్నివిధములా మన్నించిరి. ఓ శ్రీవేంకటేవ్వరా! ఇంకా కడమలేమిటికి? (ఇంక కొరతయేమున్నది) తండ్రీ!

## 6-18

## మున్నుడి

సర్వేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరునిపై భక్తివుంటే అది అన్ని విధములైన శాంతిని కలుగచేస్తుంది. మా అదృష్టం కొద్దీ అది ప్రకటింపబడి మాకు కూడా కలిగింది. అందువల్ల ఇదియే మమ్ముల్ని బ్రతికిస్తుందనే నమ్మకంతో వుండిపోయాం-అంటున్నారు అన్నమాచార్యులవారు. శ్రీహరి భక్తి వలన కలిగే ప్రయోజనాలుయేవేవో వివరిస్తున్నారు. ఈ శరీరంతో చేసే పాపకర్మలెల్లా నశిస్తాయి? కాయపు నీ ముద్రలచే గక్కున వీడు, అంటున్నారు. శంఖచక్రముల ముద్రలు ధరించిన వైష్ణవులకు యే పాపము అంట దంటున్నారు.

**ఆ.వె॥ సకల శాంతికరము సర్వేశ! నీపైన**
**భక్తి, మాకునబ్బె బ్రతికితిమిర**
**యెల్ల పాతకముల హే వేంకటేశ్వరా!**
**అణచు శరణమనెను అన్నమయ్య.**

**రాగం : బహుదారి**

సకల శాంతికరము సర్వేశ నీపై భక్తి
ప్రకటమై మాకు నబ్బె బతికించు నిదియె ॥సకల॥

మనుసులో పాపబుద్ధి మరియెంత దలచిన
నిను దలచినంతనే నీరౌను
కనుగొన్న పాపములు కడలేనివైనాను
ఘనుడ నిన్ను జూచితే కడకు తొలగును ॥సకల॥

చేతనంటి పాతకాలు సేనగానే చేసినాను
ఆతల నీకు మ్రొక్కితే నన్నియు బాయు
ఘాతల చెవుల వినగా నంటిన పాపము
నీతితో నీ కథవింటే నిమిషాన బాయును ॥సకల॥





కాయమున చేసేటి కర్మపు పాపము లెల్ల
కాయపు నీ ముద్రలచే గక్కున వీడు
యే యెడ వేంకటేశ యేయే పాతకమైనా
ఆయమైన నీ శరణాగతిచే నణగు ॥సకల॥

**భావామృతం :**

ఓ సర్వేశ్వరా! నీ పైన భక్తి మాకు అన్ని విధములైన శాంతిని కలుగచేస్తుంది. మా సౌభాగ్యం వలన మాకు నీ భక్తి అబ్బింది. మేము నిజంగా బ్రతికిపోయాం.

మేము మానవులం కాబట్టి పాపబుద్ధి కలుగుట సహజము. అయితే నిన్ను తలచినంత మాత్రముననే ఆ పాపబుద్ధి మా తలపులలోకే రాదు. మేము అంతులేని పాపాలు చేసినా, ఓ మహానుభావా! నీ దర్శనమాత్రమున అవి కడకు తొలగును (చివరికి వీడిపోతాయి).

దేవా! చేతనైనన్ని పాపాలు సేనగానే (మూకొమ్మడిగా) చేసినా.... ఆతల (అవతల) అవన్నీ నీకు మ్రొక్కితే నశిస్తాయి. చెవుల ద్వారా కూడా చెడు వినుటవలన ఘాతల (ఘోరమైన) పాపం మూటకట్టుకొంటూనేవున్నాం. అవన్నీ నీతితో కూడిన నీ కథలను వింటే నిమిషంలో విడిచిపోతాయి. చేటుతెచ్చే చెడు వినుట అంత ఘోరమైన పాపం.

ప్రభూ! కాయమున చేసేటి (శరీరంతో చేసే) కర్మలవలన యెన్నో పాపములు కలుగుతున్నాయి. అవన్నీ విశిష్టమైన నీ ముద్రలు (శంఖచక్ర చిహ్నాములు) ధరించుట చేత నశిస్తాయి. అదీ గక్కున (సత్వరమే). ఓ వేంకటేశ్వరా! ఏయెడ (ఎక్కడైనా, సరే) యేయే పాపములైనా సర్వులకు ఆయమైన (ఆధారమైన) నీ శరణాగతి చేత నశించి తీరుతాయి తండ్రీ!

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు తనని తాను అలమేలుమంగ చెలికత్తెలా భావించుకొని దేవికి స్వామి చమత్కారం గురించి దెప్పిపొడుపుగా చెబుతున్నారు. (నీ) విభుని వినయములు వినవమ్మా! అయ్యో పాపం, నిన్ను అభయం (భయపడకు అని బుజ్జగించాలట) అడుగుతున్నాడట తనంతటతాను. (నీవంటే అంత భయభక్తులట తనకు). పైకి సీదాసాదాగా కనిపించిన ఈ కీర్తన అంతతేలికగా కొఱకుడుపడదు. కాస్త పరికించండి....మరి.

**తరలము:**

**విభుని ఈ వినయమ్ములన్ చెవి విందుగా వినవే చెలీ!**
**అభయమే అడిగేను నిన్నిక అందునేమిటి జెప్పవే?**
**అభవుడాతడు అన్నమయ్యనె ఆదిదేవుని మెచ్చుచున్**
**ఇభము గాచిన వేంకటేశుడు యెట్టిజాణడొ తెల్పనే.**

**రాగం : ధర్మవతి**

విభుని వినయములు వినవమ్మా నిను
అభయం బడిగీ నయ్యో తాను ॥విభుని॥

రహస్యమున శ్రీరమణుడు పంపిన
విహరణలేకలు వినవమ్మా
అహిపతి శయనంబతి తాపంబై
బహువేదన కగపడెనట తాను ॥విభుని॥

ఆదిమపతి నీ యడుగులు కెరగిన-
వేదాంత రచన వినవమ్మా
నీ దయగానక నిముషమె యుగమై
ఖేదంబున నలిగీనట తాను ॥విభుని॥





కింకరుడట నీ కినుక సేతలకు
వేంకటపతిగతి వినవమ్మా
సంకెలేక నీ చనవున జగములు
కొంకకిపుడె చేకొనెనట తాను ॥విభుని॥

## భావామృతం

ఓ అలమేల్మంగమ్మా! నీ విభుని వినయములను గమనించితివా? నేను ఆయన వినయము లెట్టివో చెబుతాను వినవమ్మా! పాపం, నిన్ను అభయం (భయపడకు అనే బుజ్జగింపును) అడుగుతున్నాడమ్మా! అయ్యో! ఎంత అమాయకుడు చూశావా?

శ్రీపతియైన స్వామి, రహస్యంగా నాచేత ఒక విహరణ లేఖను (నీతో విహరించాలని లేఖని) పంపించాడమ్మా! ఆయనకు అహిపతి శయనం (ఆదిశేషునిపై పవ్వళించటం) విపరీతమైన తాపమును కలుగజేసి బహువేదనకు గురిచేస్తున్నదట. తాను చాలా బాధపడుతున్నాడట. అయ్యో! పాపం! విన్నావటమ్మా! చోర్యం.

ఆదిమ పతి (అనాది నాధుడు) అయిన నీ స్వామి నీ యడుగులకున్ (నీ ప్రశ్నల పరంపరకు) యెరగిని (ఎరిగించిన) వేదాంత రచన (మెట్టువేదాంతం) వినవమ్మా!నీవు కరుణించనందు వలన ఆయనకు నిముషం ఒక యుగములాగావున్నదట. అంతే కాక పాపం దుఃఖంతో నలిగి పోతున్నాడుట. తాను ఎంతో అలమటిస్తున్నాడట. పాపం కదా!

తల్లీ! నీ నాధుడు, నీవు కోపంతో ఏమన్నా చేస్తావేమోనని వణికిపోయే కింకరుడట (బానిసయట...) పాపం... శ్రీవేంకటపతి గతి ఎటువంటిదో వినవమ్మా! సంకెలేక జగములు (అసంఖ్యాకమైన జగత్తులను) నీచనవున (నీవు పురమాయించినట్లే), తానుచేకొనెనట (తాను పరిపాలిస్తున్నాడట, అయ్యో! పాపం!) నీవు లేక పోతే ఆయన జగన్నాధుడే కాడట. ఏమి చోద్యం తల్లీ!

## మున్నుడి 6-20

అన్నమాచార్యులవారు శ్రీ వేంకటేశ్వరునిపై వినిపిస్తున్న చక్కటి కీర్తన నాలకించండి, ధన్యులవండి. ఓ వేంకటనాథా! ఈ వేంకటాద్రి పొంతకు (సమీపమునకు) రావయ్యా! ఓ అచ్యుతా! నారాయణుడా! అచ్చుగ (గుర్తుగా పెట్టుకొని) నేము (మేము) వున్న చోటికే నీవు రావయ్యా! నీ వుండే చోటికి మేము చేరగలమో...లేరో? అంటున్నారు. స్వామి పట్ల అంత చనువువున్నది తాళ్ళపాక వారికి. బుద్ధుని ప్రస్తావని కూడవున్నదీ కీర్తనలో చదవండి....మరి.

**కం॥ విచ్చేయుమయ్య పొంతకు**
**అచ్చుగ తిరువేంకటేశ! అచ్యుత! మే**
**ఇచ్చటయుండెడి చోటుకు**
**మెచ్చుచు, అన్నయ్య పాడె మించిన కృతినిన్**

**రాగం : మధ్యమావతి**

విచ్చేయవయ్యా వెంకటాచలము పొంత
కచ్చుగా నేమున్న చోటికచ్చుత నారాయణ ॥విచ్చేయ॥

అల్లనాడులంక సాధించందరును బొగడగ
మల్లడినయోధ్యకు మరలినట్లు
యెల్లగాగైలాస యాత్రకేగా కమ్మరమరలి
వెల్లవిరి ద్వారకకు విచ్చేసినట్లు ॥విచ్చేయ॥

యెన్నికెతో గోమంతమెక్కి జయము చేకొని
మన్ననతో మధురకు మరవినట్లు
అన్ని చోట్లానుండి అల్లిరములారగించిన
వెన్నుడవై వేడుకతో విచ్చెసినట్లు ॥విచ్చేయ॥





వహికెక్కి ద్రిపురవనితల బోధించి
మహినిందిర వొద్దిక మరలి
విహగగమన శ్రీవేంకటేశ మము గావ
విహితమై నామతిలోకి విచ్చేసినట్లు ॥విచ్చేయ॥

**భావామృతం**

ఓ అచ్యుతా! నారాయణుడా! నీవు ఈ వేంకటాచలము యొక్క పొంతకు (వద్దకు), విచ్చేయవయ్యా! (రావయ్యా!) అచ్చుగా (గురుతుగా) మేమున్న చోటుకు నీవే రావాలి.( ఎందుకంటే నీవుంటే చోటుకు మేము రాలేము తండ్రీ! మాకా శక్తిలేదు.)

అల్లనాడు (ఆనాడు) లంకను గెలిచి, అందురునూ నిన్ను పొగడగ (కీర్తించగా), మల్లడి (అతిశయించి) అయోధ్యకు మరలివచ్చినట్లు మా వద్దకు విచ్చేయవయ్యా! నీ శ్రీకృష్ణావతారంలో నీవు కైలాసయాత్రకేగి, ఈశ్వరుని సందర్శించి మరలి ద్వారకానగరమునకు వచ్చితివి. అదే విధముగా నేడు మమ్ము కరుణించి మా తావునకు రావయ్యా!.

ఆ నాడు బృందావనములో గోమంతమును (గోవర్ధన పర్వతమును) యెక్కి విజయమును సాధించి అపై మధురానగరమునకు మరలి బోతివి, యెన్నో మన్ననలను పొందితివి. అదే విధముగా అన్ని చోట్లా నీవు మా అల్లిరములను (అత్తవారు అల్లుడికి పెట్టు విందు భోజనం) ఆరగించుటకు నేడు వెన్నుడవై (శ్రీకృష్ణుడవై) మా ఇంటికి రావయ్యా!

ఓ ప్రభూ! నీవు ఆనాడు బుద్ధుడవై, వహికెక్కి (కీర్తిగడించి) త్రిపురాసురుల భార్యలకు నీతత్త్వమును బోధించి వారి శీలముల నపహరించి తిరిగి నీవు నీ హృదయేశ్వరి లక్ష్మీదేవి వద్దకు మరలి ఒద్దికతో (అనుకూలడవై) వచ్చితివి. అదే విధముగా గరుత్మంతునిపై పయనించు ఓ శ్రీవేంకటేశ్వరా! మమ్ము రక్షించుటకు మాకు విహితమై (హితకారివై) యుండుటకు మా మనస్సులలో ప్రవేశించుమయ్యా! నీ రాక మమ్ము తరింపజేయును తండ్రీ!

## 6-21

## మున్నుడి

ఈ కీర్తనలో దేవి అలమేలుమంగ తన చెలికత్తెతో తన "రమణుని" (చెలువుని) రమ్మని చెప్పవే, మధ్యలో మమ్మల్ని రవ్వ చేయుట (చిన్నబుచ్చుట) దేనకి? ఆయన వస్తే ఎవరు కాదంటారు? తమ్మి పువ్వుల వాట్లు (పద్మములతో దెబ్బలు) తగిలేదాకా ఆయనంతే .....అంటున్నది. అన్నమాచార్యవారి ఈ కీర్తనలో స్వామి చేసే చేతలే, పెండ్లి తంతు వలెనున్నవి, అంటున్నారు. అన్నమయ్య నాటి తెలుగు అంతతేలిక కాదని మరొక్క సారి తెలుసుకొంటాం....

**ఉ॥ "రమ్మనవే చెలీ! విభుడు రవ్వను సేయగ నేల మమ్మికన్**
**తమ్మి విరుల్ పసందుగను తాకెడి దెబ్బల తాపు దాకనో"**
**తుమ్మెదమేని ఛాయగల తోయజనాభుని పెండ్లి పాటుగా**
**కమ్మని కీర్తనంబు, తమకంబున జెప్పెను అన్నమార్యుడున్.**

**రాగం : కళ్యాణి**

రమ్మనవే చెలువుని రవ్వమమ్ము సేయనేల
తమ్మి పువ్వుల వాట్లు తాకు దాకానా ॥రమ్మ॥

గక్కన జూచినంతనే కన్నులనే పెండ్లాయ
వెక్కనపు తలబాలు వేగినంతానా
పక్కన నవ్వినంతనే పాలకూళ్ళు సెలవాయ
మక్కువతో బువ్వములు మాపుదాకానా ॥రమ్మ॥

తొలుతటి సిగ్గులె దొడ్డ తెరమరుగాయ
వలిపెంపు తెరమాటు వడినింకానా
సొలపుల మాటలనే సోబాన పాటలాయ
చలివాసె పేరటాండ్ల సందడింకానా ॥రమ్మ॥





పై నొరగినప్పుడే పరవని పరపాయ
నానబెట్టి నాగవల్లి నాటి దాకానా
ఆనుక శ్రీవేంకటేశు డంతలోనే నన్నుగూడె
మేనిలోని సంతసాలు మెచ్చుదాకానా ॥రమ్మ॥

**భావామృతం :**

ఓ చెలియా! నా నాధుని నా దగ్గరకు వస్తే రమ్మనవే మధ్యలో మమ్ము "రవ్వసేయనేల"? (చిన్నబుచ్చుట దేనికి?) తమ్మిపువ్వుల వాట్లు (తామరపూల దెబ్బలు) తాకుదాకానా? (తగిలేదాకా ఇంతేనా?)

ఆయన గబుక్కున, నిన్ను చూడగానే, నీ కన్నులకు పెండ్లి కళవచ్చేసింది. అమితంగా తలంబ్రాలు పోసినట్లయింది. ఆయన నీ గాబరా చూసి పక్కున నవ్వగానే, పాలకూళ్ళ సెలవాయ (విందుకు అనుమతి లభించినట్లయింది.). చాలా ప్రీతితో మాపు దాకా (మరునాటి దాకా) బువ్వలు (పెళ్ళి భోజనాలే) పెట్టినట్లయింది.

ఓ చెలీ! నా తొలి సిగ్గులే పెద్దతెరచాటు పెళ్ళితంతు అయింది. ఆ తెరుమాటున వలిపెంపు (అధికమైన వణుకు) వడినింకానా? (ఇంకా ఉధృతమైనదా). పారవశ్యంతో నేను మాట్లాడే మాటలే స్వామికి మంగళగీతాల వలె తోచినవి. పేరటాండ్లు సందడించగా (కోలాహలము చేయగా) చలివాపె (నావణుకుపోయినది).

ఓ చెలీ! నేను స్వామిపై ఆనుకొనగానే పరవని పరుపువలె మృదువుగా తోచినది. ఈ అనుభూతి నాగవల్లి నాటిదాకానా (నాగవల్లి తంతు వరకు) నానబెట్టి (సిగ్గు పడునట్లు చేసినది). ఆనుక (అటుపిమ్మట) శ్రీ వేంకటేశ్వరుడు అంతలోనే నన్ను కూడినాడు. అందువలన నా దేహంలో సంతోషములు మెచ్చుదాకానా (బహుమతి వలె లభించినవి).

## 6-22

### మున్నడి

అన్నమాచార్యులవారు లావణ్య శృంగారరాయుడైన లక్ష్మీపతి శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తున్నారు. ఈ స్వామితో యేవేళనైనా నీ వినోదాన(ని)కి యేదాయెనేమి? (యేదయినది...అయ్యా) అంటున్నారు. తన మనస్సు పాలసముద్రమట. నీవు సముద్రశాయివి కాబట్టి తన మనస్సులో విశ్రమించమంటున్నారు. భూమిలో వలె తన మనస్సులో ఎన్నో దాగి వున్నాయట. ఆయన భూకాంతుడు కాబట్టి దానినీ పరిగ్రహించాలట. తన మనస్సు నిండు కొండలాంటిదట. ఆయన యేడుకొండలవాడు కాబట్టి దానిలో వినోదించాలట. ఇంకా ఏమి చెప్పగలము?

**తే॥ లక్ష్మినాధుడా! శృంగారరాయ! నీదు**
**ఏ వినోదానికేవేళ యేది హద్దు?**
**వేంకటేశ! లావణ్య! వేవేల నోళ్ళ**
**అన్నమార్యుడు కీర్తించె ఆలపించి.**

### రాగం : శ్రీ రాగం

లావణ్య శృంగారరాయ లక్ష్మినాథ
యేవళ నీ వినోదాన కేదాయె నేమి ॥లావణ్య॥

పాలజల ధివంటిది పవ్వళించు నా మనసు
గాలి వూర్పులే కడళ్ళు కలదులోతు
చాలగ దొల్లి నీవు సముద్రశాయివట
యీ లీల నీ వినోదానకేదాయెనేమి ॥లావణ్య॥

నిక్కపు భూమివంటిది నెలవుకో నామనసు
పెక్కులిన్నియు గలవు పెరుగుచుండు
వుక్కట దొల్లియు నీవు భూసతి మగడ వట
యెక్కువ నీ వినోదాన కేదాయెనేమి ॥లావణ్య॥





నిండుగొండ వంటిదిది నిటు చుండు నా భక్తి
వుండచోటనే వుండు నొక్క చోటను
కొండల రాయడ వట కోరిక శ్రీవేంకటేశ
అండ నీ వినోదాన కేదియాయె నేమి ॥లావణ్య॥

### భావామృతం :

ఓ లక్ష్మీనాధా! లావణ్యా! శృంగారరాయా! (శృంగార చక్రవర్తి), ఏ వేళ నీ వినోదానకు యేదాయెనేమి (ఏ నాడైనా నీ వినోదానికి ఏది అయితేనేమి?) అనగా అన్నీ నీ వినోదానికే కదా!

ఓ ప్రభు! నా మనసు కూడా క్షీరసాగరము వంటిదే నయ్యా! దానిపైనే కదా! నీవు పవ్వళించునది. నా గాలివూర్పులే (ఉచ్ఛ్వాస నిశ్వాసములే) ఆ సముద్రంలో కడళ్ళు (అలలు). అది చాలాలోతైనది. కాని నీవు తొల్లి (అనాదిగా) జలధిశాయివి ఈ విధముగా నీ వినోదానికి హద్దుయేదయ్యా! కావున నా మనస్సు అనే పాలజలధిలో కాస్త పవ్వళించి నన్ను అనుగ్రహించరాదా తండ్రా!

ఓ దేవదేవా! నా మనస్సు నిక్కపు భూమి వంటిది (నిజంగా భూమిలాంటిది). ఆ నెలవుకో (స్థానమునకు) చాలా సంపదలున్నవి. అవి పెరుగుచున్నవి కూడా. కానీ తొల్లి నీవు భూకాంతుడవు. కావున నా మనస్సులోని వైభవములన్నికీ నీవే నాధుడవు. నీకు ఎక్కువైన వినోదములకు ఏమవుతుంది? అన్ని వినోదములు నీవియే తండ్రీ!

ఓ శ్రీహరీ! నిలుచుండు నాభక్తి (నిశ్చలముగా నిలబడిన నా భక్తి) నిండుకొండవంటిరి (అతిశయించుకొండలాంటిది). అది తానున్న చోటునే అచంచలముగానున్నది. ఓ కొండలరాయా! (ఏడుకొండలవాడా) శ్రీ వేంకటేశ్వరా! అక్కడ నీ వినోదానికి కానిదియేదన్నా వున్నదా? లేనేలేదు తండ్రీ! అన్నీనీ వినోదానాకే

**6-23**

## మున్నుడి

మందర పర్వతమును తన కూర్మావతారంలో మోసి క్షీరసాగర మధనానికి తోడ్పడ్డ శ్రీహరిని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. నీ మహిమ వల్లనే ఇందునే (ఇహలోకంలోనే) ఇందరూ తుదిపదమెక్కిరి (ముక్తి పొందారంటున్నారు). కీర్తన యెంత చక్కటి సీసపద్యం అయిందో గమనించండి.

**సీ॥ ఇందునే తుది పద మెక్కిరి ఇందరున్**
**మందరధర! నీదు మహిమ యిదియే**
**మరిగిన పుణ్యుల మతిలోని కోరిక**
**పరమపు హరి! నీదు పాదము లివి**
**పంచిన యజ్ఞాల ఫలముగానున్నది**
**నించి వోదేవేశ! నీదు పూజ**
**కైవల్యమునకును కదుతెరువైనది**
**ఆవల నీ శరణాగతియును**

**ఆ.వె॥ వేంకటేశు మాకు వెలయించె గురుడిట్లు**
**మంత్రమిదియె జుమ్మి! మాకు యెపుడు**
**అన్నమయ్య పాట అతుకు పద్యమునందు**
**ఏమి చెప్పగలము ఇంతకన్న.**

**రాగం : బిలహరి**

ఇందునే తుదిపద మెక్కి రిందరును
మందరధర నీ మహిమిదివో ॥ఇందునే॥

మరిగిన పుణ్యుల మతిలో కోరిక
పరమపు హరి నీ పాదములు
గరిమ గోపికలు గావలెనన్నది
హరి నీ సంభోగ మదియేపో ॥ఇందునే॥





పొంచి వేదములు పొగడెడి యర్థము
అంచెల గుణకథలవి నీవి
పంచి యజ్ఞముల ఫలమైయున్నవి
నించి దేవ నీ నిజపూజలెపో ॥ఇందునే॥

కైవల్యమునకు గడు దెరువైనది
ఆ వల నీశరణాగతియే
శ్రీవేంకటేశ్వర చెప్పె మాగురుడు
మా వద్ద నిదె నీ మంత్రమె పో ॥ఇందునే॥

**భావామృతం :**

మందర పర్వతమును ధరించి కూర్మావతారంలో క్షీరసాగర మధనమునకు తోడ్పడిన ఓ శ్రీహరీ! ఇందరును (ఈ నీ భక్తులు) ఇందునే (ఈ ఇహలోకంలోనే, తుది పద మెక్కిరి (ముక్తిని పొందిరి). ఇంతయునూ నీ మహిమయేపో.

ఓ పరమపు హరీ, (ముక్తి నొసగు శ్రీ హరీ!) నీవే కావాలనుకొనే పుణ్యాత్ములైన నీ భక్తుల మనస్సులోని కోరికయే నీ పాదములు (పాదదాస్యము). అటుపిమ్మట ఓ హరీ! నంద వ్రజములోని గోపికలు కావాలనుకొన్నది నీతో సంభోగమే, పో.

విస్తృతమైన వేదములు కీర్తించు అర్థములన్నియు నీ గుణవైభవమును వివరించు భాగవతకథలే. వివరింపబడిన యజ్ఞముల ఫలములన్నియు దేవా! నీ యొక్క పూజలే సుమా! (అందుచేతనే నీవు యజ్ఞమూర్తివి, వేదమూర్తివి).

ఓ దేవదేవా! కైవల్యమునకు (మోక్షమునకు) కదుతెరువైనది (శ్రేష్ఠమైన దారియైనది) నీ యొక్క శరణాగతి మాత్రమే. ఓ శ్రీవేంకటేశ్వరా! మా గురుదేవులు శ్రీరామనుజాచార్యులవారు చెప్పిన జ్ఞానం ఇదే, మా వద్దవున్న గొప్ప మంత్రం కూడా ఇదే పో.

**6-24**

## మున్నుడి

అతి సునాయాసంగా, వేదాంత తత్త్వబోధను చేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ మాట మఱచిపోయామంటే ఇక దారిలేదు. కాబట్టి ఓ మనసా! దైవమునే తలచుకో. అంతే కాదు తరితో (కవచమువలె భావించి) తలచుకో అంటున్నారు. శ్రీవేంకటేశ్వరుని యొక్క దివ్యమహిమ వెలుపల (ప్రపంచమంతా), లోపల (అంతః కరణయందును), లోగొనియున్నది (వశపరచుకొనియున్నది). దానినే మనము సృష్టి అంటున్నాము. కనుక ఆయననే నమ్ముకొ అంటున్నారు.

**చం॥ మరిచితిమన్న లేదు మరి మార్గము, దేవుని నమ్ము చిత్తమా**
**తెరువిక శ్రీహరే జగతిదీనజనావళి దిక్కుమొక్కురా**
**నరహరి నామమున్ తలచినాగతి వాడనె అన్నమార్యుడున్**
**తిరుమల వేంకటేశ్వరుని దివ్యప్రభావము చాటిజెప్పెరా.**

**రాగం : భూపాలం**

మరిచితిమంటే మరిలేదు
తరితో తలచవో దైవము మనసా ॥మరచితి॥

పుట్టుచున్నది పోవుచున్నది
పట్టపు జీవుల ప్రపంచము
నట్టనడుమనే నరహరి నామము
గట్టున తలచవో గొనకొని మనసా ॥మరచితి॥

పొద్దు వొడచునదె పొద్దుగుంకెనదె
తిద్దిన జగముల దినదినము
అద్దపు నీడల యంతర్యామిని
వొద్దనె తలచె నొనరవొ మనసా ॥మరచితి॥





లోపల వెలుపల లోగొనివున్నది
శ్రీపతి మహిమల సృష్టియిదే
యేపున శ్రీవేంకటేశ్వరుడితడే
దాపని నమ్ముచు తలచవో మనసా ॥మరచితి॥

**భావామృతం :**

ఓ మనసా! ఈ మాట మఱిచిపోయామంటే మరింకొక దిక్కులేదు. నీవు ఆ దైవమునే 'తరితో తలచవో'' (కవచమువలె రక్షగాభావించి ధ్యానింపుము) అదియే సరియైనదారి.

ఈ పట్టపు జీవుల ప్రపంచము (స్థానమును పొందిన ప్రాణుల లోకము) జన్మలనెత్తుచున్నది మరియు ప్రాణములను వీడుచున్నది. నట్టనడుమనె (పుట్టుక, చావు మధ్యలో మాత్రమే) నరహరినామము ( ఆ జగన్నాథుని నామమును) స్మరించే అవకాశమున్నది. కావున ఓ మనసా! తలచవో (స్మరించరాదా?)

ఓ మనసా! పొద్దువొడచునదె (సూర్యోదయమగుచున్నది.) పొద్దుగుంకెనదె (సూర్యాస్తమయము అగుచున్నది. తిద్దిన (క్రమశిక్షణలో పెట్టబడిన) జగముల (లోకములలో) దినదినము గడచుచున్నది. అద్దపు నీడల అంతర్యామిని (అద్దములోని ప్రతిబింబము వంటి నీ అంతరాత్ముని నీ వొద్దనె (ఎదుటనే) భావించి, ఒనరవో (సుస్థిరముగానుండుము).

ఓ మనసా! ఈ సృష్టి వెలుపల (ప్రపంచములోను), లోపల (అంతః కరణములలోనూ, లోగొనివున్నది (వశపరచుకొన్నది) స్వామిదివ్య మహిమయే. ఎందుచేతనంటే ఇది శ్రీపతి (శ్రీ మన్నారాయణుడు) తన మహిమలతో సృష్టించిన జగత్తు. ఇతడే ఏపున (విజృంభించిన) శ్రీ వేంకటేశ్వరుడు. ఆ స్వామియే దాపని (ఆధారము అని ) నమ్ముచూ, తలచవో (ఆయననే స్మరించుము).

## 6-25

## మున్నుడి

బ్రహ్మోత్సవాల కోలాహలం. బంగారు గరుత్మంతుని వాహనంపై వూరేగుతున్నాడు తిరుమల దేవదేవుడు. ఆ వైభవం చూసి పరవశించిపోయిన అన్నమాచార్యులవారు చక్కటి కీర్తననాలపిస్తున్నారు. ఓ దేవా! నీ వుద్యోగము (కార్యక్రమము) యెక్కడనో వైకుంఠంలోవున్నది. ఇక్కువ (అనంతమైన) నీ మహిమకు ఎవ్వరు ఎదురు చెప్పగలరయ్యా! అంటున్నారు. చుల్లరి రాక్షసులు, పల్లించి, పల్లదము వంటి పదములు నేడు వాడుకలో లేవు.

**కం॥ "ఎక్కడ నీ వుద్యోగము?**
**ఇక్కువ, నీ దివ్య మహిమ కెదురేదయ్యా?**
**చక్కగ విచ్చేయుమయా!**
**ఎక్కుచు గరుడనిని," పాడె హితుడన్నయయున్.**

**రాగం :వసంత**

ఎక్కడ నీ వుద్యోగ మెటు విచ్చేసేవయ్యా
యిక్కువ నీ మహమకు నెవ్వరెదురయ్యా ॥ఎక్కడ॥

పల్లించి గరుడనిపై నీవుబ్బున నెక్క
అల్లనాడె పారిజాత మడవికెక్కె
పల్లదపు రుద్రుడును బాణుని వాకిలి దొక్కె
చుల్లరి రాక్షసమూక సురసుర సుక్కె ॥ఎక్కడ॥

గరుడనిపై నీవు కడు బేరెములువార
ధర జలధరుల నమృతములు దేరె
నిరతి గంసాదులనెత్తురుటేరు వారె
పరులు నీ కెదిరిన పగయెల్ల దీరె ॥ఎక్కడ॥





బంగారు గరుడని పై నీవు వీధులేగ
చెంగట శ్రీవేంకటేశ సిరులు మూగె
సంగతినమేల్మంగ సంతసాన విఱవీగె
పొంగారు దేవదుందుంభులు పైపై వాగె ॥ఎక్కడ॥

**భావామృతం :**

ఓ దేవదేవా! యెక్కడ నీ వుద్యోగము? (నీ కార్యనిర్వహణ యెక్కడ? వైకుంఠంలో) ఇక్కువ (ఇక్కడకు) ఎటువిచ్చేసేవయ్యా? (ఎట్లు వచ్చెదవు?) నీ మహిమకు నెవ్వరెదురయ్యా? ( ఎదురు ఎవరు చెప్పగలరయ్యా)

ప్రభూ! పల్లించి (మెత్తని ఆసనము వేసికొని) గరుడునిపై నీవు వుబ్బున (సంతోషంతో) యెక్కగానే, అల్లనాడు (పూర్వం ద్వాపరయుగంలో) స్వర్గంలోని పారిజాతవృక్షమును అడవికి (ద్వారకానగరమునకు) యెక్కె (చేరినది). ఎక్కడో కైలాసంలో వుండవలసిన, పల్లదంపు (అతిశయించిన) రుద్రుడు (పరమశివుడు) బాణాసురుని వాకిట్లోకి చేరవలసి వచ్చింది. చుల్లరి రాక్షసులమూకలు (పొగరుబట్టిన అసురులు) సురసురలాడె (చురచుర కాలిపోయారు) అంత ప్రతాపశాలివైన నీ దివ్య వాహనమే ఈనాడు మా కనువిందు చేస్తున్న గరుడుడు.

దేవా! నీవు గరుడునిపైనన్, పేరములు వార (వ్యాపించగా) భూలోకములో మేఘములు అమృతమును దేరె (వర్షించినవి). నిరతి (మిక్కిలి ఆ సక్తి గల) కంసాది దానవుల నెత్తురు యేరులైపారినది. పరులునిన్నెదిరించిన, వారి పగ నశించింది (అంటే వాళ్ళ చావుతో వారి పగ కూడ నశించినది అని అర్థం)

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు బంగారు గరుడనిపై వీధులేగ (వూరేగుతుంటే), చెంగట (అతిశయించు) సిరులు మూగె (ఐశ్వర్యములు బాగా పెరిగినవి). నీ సంగతి (సాహచర్యమున) మా తల్లి అలమేలుమంగ సంతసాన విఱవీగె (సంతోషంతో గర్వపడింది. పొంగారు (విజృంభించిన) దేవదుందుభులు పైపై వాగె (పెద్దపెద్దగా మ్రోగినవి).

## 6-26

### మున్నుడి

అహోబలంలో వెలసిన నవనారసింహులను (తొమ్మిదిమంది నృసింహులను) కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. మా జ్వాలా నృసింహుడు, యోగానందనృసింహుడు, కానుగుమాని నృసింహుడు, మట్టెమళ్ళ నృసింహుడు, భార్గోటి నృసింహుడు, ప్రహ్లాదనరసింహుడు, లక్ష్మీనరసింహుడు, వరాహనరసింహడు, శ్రీనరసింహడు, అను నవనారసింహులను కీర్తిస్తున్నారు. ఒక్కొక్కరి ప్రత్యేకతను కూడా ఉటంకిస్తున్నారాయన. స్వామికి తొమ్మిదేమిటి, పదివేల బహురూపములున్నవి అంటున్నారు. ఇక్కడ అహోబలంలోను, అక్కడ వేంకటాద్రి మీదనూ నీవే వున్నావంటున్నారు.

**కం॥ నవనారసింహ నమితం**
**భవనాశీ తటి నివాస! బలనరసింహా!**
**కవి అన్నమయ్య తలచెను**
**నవవిధ నరసింహుడవల నడచె తిరుమలన్.**

**రాగం : నాట**

నవనార సింహా నమో నమో
భవనాశితీర అహోబల నారసింహ ॥నవ॥

సతత ప్రతాప రౌద్ర జ్వాలా నారసింహ
వితత వీరసింహ విదారణా
అతిశయ కరణ యోగానంద నరసింహ
మతి శాంతపు కానుగుమాని నారసింహ ॥నవ॥

మరలి భీభత్సపు మట్టెమళ్ళ నారసింహ
నరహరి భార్గోటి నారసింహ
పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నరసింహ
సిరుల అద్భుతపు లక్ష్మీనరాసింహ ॥నవ॥





వదన భయానకపు వరాహా నారసింహా
చెదరని వైభవాల శ్రీనరసింహా
అదన శ్రీవేంకటేశ అందు నిందు నిరవైతి
పది వేలు రూపముల బహునారసింహా ॥నవ॥

**భావామృతం :**

ఓ నవ నారసింహా! (తొమ్మిది విధములుగానున్న నారసింహా!) వందనములు. ప్రభూ! నీకు నమస్కారములు, భవనాశి నదీతీరమున అహోబలక్షబలక్షేత్రములో నెలకొన్న నృసింహ దేవా! నిన్ను శరణుజొచ్చితిని.

స్వామీ! జ్వాలానృసింహుని రూపంలోనున్న నీవు 'సతతప్రతాపరౌద్ర' మూర్తివి (ఎల్లపుడు కోపిష్టి అయిన ప్రతాపశాలివి). అంతేకాదు ఆయన 'వితత వీర విదారణ సింహము (వ్యాపించిన వీరత్వముతో వధించు సింగము). ఇకపోతే రెండవ స్వామి యోగానంద నృసింహుడు. ఈయన అతిశయించన కరుణామూర్తి, మూడవ వాడు 'కానుగమాని' నారసింహుడు. ఈయన అమితశాంతమూర్తి.

నాలుగవ నరసింహుని పేరు 'మట్టెమళ్ళ నృసింహుడు', ఈయన భీభత్సమూర్తి. మిక్కిలి వెఱపు కలిగించువాడు. ఇక ఐదవవాడు భార్గోటి నరసింహుడు. ఈయన నరహరి. మొండెము నరుని ఆకారముతోను, శిరస్సు కేసరి ఆకారముతోను వున్నవాడు. మనకు కనుపించు ఈ ఆరవ నృసింహుడు ప్రహ్లాద నరసింహుడు. ఈయన పరిపూర్ణ శృంగార మూర్తి. ఏడవ నృసింహుని పేరు లక్ష్మీనారపింహుడు, ఈ స్వామి అద్భుతమైన వైభములను ప్రసాదించు దేవదేవుడు.

అహోబలమున వెలసిన ఎనిమిదవ నృసింముడు వరాహనరసింముడు, ఆయన భయంకరమైన వదనము గల భీకరాకారుడు. ఆఖరివాడు శ్రీనరసింహుడు. ఈయన చెదరని వైభవాల స్వామి (చెడిపోని సంపదలు ప్రసాదించు నరసింహుడు). ఆదుకొనునట్టి ఓ శ్రీవేంకటేశ్వరా! అందునిందు నీవే ఇరవైతివి. (అక్కడ తిరుమలలోను ఇక్కడ అహోబలంలోను నీవే సుస్థిరుడవైతివి). నీవు పదివేల (అసంఖ్యాకమైన) రూపములు గల బహునరసింహుడవు.

**6-27**

## మున్నుడి

'ఋణానుబంధరూపేణామ్, పశు, పత్నీర సుతాలయాః' అన్నారు పెద్దలు, ఋణం వుండటంవల్లనే బంధాలు కలుగుతాయి. అదే మాటను అన్నమాచార్యులవారు, అందరు అప్పులవాళ్ళే అంటున్నారు. " కప్పగన్ తిప్పగన్ కర్తలు వేరీ (వీరలా...) అంటున్నారు. కప్పగన్ అంటే కర్మఫలం కల్పించుకోవటం, తిప్పగన్ అంటే కర్మఫలం మార్చుకోవటం.... వీరి వలన అవుతుందా? వీరు కర్తలా? అంటున్నారు. ఈ బంధాలు యెప్పుడు వీడీ (విడిపోతాయి?) అవి విడిపోవటం వెన్నుడైన వేంకటేశ్వరునకే అది సాధ్యం అంటున్నారు.

**ఉ॥ అప్పులవారె యందరును అద్భుతతత్త్వము నెంచి చెప్పెరా**
**"కప్పగ దిప్పగన్" యెపుడు గర్తలు కారనె అన్నమార్యుడున్**
**ఎప్పుడు వాయు బంధములు యెన్నడు వీడును, కల్లయే యనెను**
**ఒప్పులు జేయగా మరియు యున్నతి సేయగ వెన్నుడే తగున్.**

**రాగం : కాంభోజి**

అప్పుల వారే అందరును
కప్పగ దిప్పగ గర్తలు వేరీ ॥అప్పుల॥

ఎక్కడ చూచిన నీ ప్రపంచమున
జిక్కులు సిలుగులు జింతలును
దిక్కెవ్వరు యీ తీదీపులలో
దిక్కుమొక్కులకు దేవుడెకాక ॥అప్పుల॥

యేది దలంచిన నేకాంబును
సూదులమూటల సుఖము లివి
కాదన నౌనన గడగనిపించగ
పోదికాడు తలపున గలడొకడే ॥అప్పుల॥





యెన్నడు వీడీ నెప్పుడు వాసీ
బన్నిన తమతమ బంధములు
వున్నతి సేయగ వొప్పులు నెరపగ
వెన్నుడు వేంకటవిభుడే కలడు ॥అప్పుల॥

**భావామృతం :**

ఓ మానవులారా! అందరునూ అప్పులవారే సుమా! ఋణం తీర్చుకోవటానికే జన్మిస్తారు. అదీ భగవదిచ్ఛానుసారం జరుగుతుంది. కర్మఫలం అనుభవించటమే జీవుడు చేయగలగింది. కప్పగన్ (కర్మఫలాన్ని కల్పించుటకు గాని), తిప్పగన్ (కర్మఫలాన్ని తారుమారు చేయుటకు గాని), కర్తలు వేరీ (వీరు కర్తలా?) అది ఆ దేవుని వలన జరిగే పని, వీరి వలన అవుతుందా?

ఎప్పుడు చూచిననూ ఈ ప్రపంచంలో చిక్కులు (ఇబ్బందులూ), చిలుగు (కష్టములు), చింతలు (దుఃఖములు) కలుగుతూనే వుంటాయి. ఈ తీదీపులలో, (ఈతిబాధలలో) మనకు దిక్కెవ్వరు? (ఆదుకొనే నాధుడెవరు?) ఆ దేవుడుకాక (పరమాత్మ తప్ప) దిక్కుమొక్కు ఎవ్వరు అవుతారు?

ఏ కాలంబున (ఎప్పుడైనా) యేది తలంచిన సుఖము అనునవేవియైనా సూదుల మూటలు, ఆ మూటలు మోస్తుంటే చురుక్కుమని సూదులు గుచ్చుకోకుండా వుంటాయా? అందుకని ఈ మూట, మేం మొయ్యము అనటానికి కూడ వీటులేదు. కాదు, ఔను అనటానికి గాని కడకనిసించగ(ముగించుటకు)గాని వీలులేదు. ఈ వీలువున్న పోదికాడు (శూరుడు) మన తలపుననుండే దేవుడు ఒక్కడే, ఆయన వల్లనే అవుతుంది.

తమతమ బంధములు (తమంతట తాము కల్పించు కొన్న ఈ బంధములన్నియునూ) పన్నిన బంధములు (ఏర్పరచు కొన్న చుట్టరికములు). ఇవి యెన్నడు వీడీ (విడిపోతాయి?) ఎక్కడు వాసీ (వదలుతాయి?) ఎన్నటికీపోవు. అయితే దారి యేమిటి? కలడు అని శరణని, ఉన్నతి సేయగ (ఉన్నతమైన పనులును చేయుచూ) ఒప్పులు నెరపగ (మంచిపనులు చేస్తుంటే), అన్నీ ఆయనే చూసి వుద్ధరిస్తాడు.

**6-28**

## మున్నుడి

అన్నమాచార్యులవారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు చెప్పిన కీర్తన నాస్వాదించండి. ఈ కీర్తనకి ప్రతి పదార్థం వివరించాలంటే తెలుగులో అందె వేసిన చేయి అయివుండక తప్పదు. "నామదారికాపు మొక్కు" నారయణ అంటే యేమిటి? ఇట్లాంటి చిక్కులు చాలా వున్నాయి. ఈ కీర్తనలో అందుకే దీనినెన్నుకున్నాను."నన్ను నిన్ను నెంచుకోవో" అంటే "నన్ను నిన్నుగా పరిగణించుకో". నేనేనీవు నీవేనేను. అన్నీ నీ చేతనే జరుగుతాయి. ఓ నారయణుడా! అదివో (ఆ బ్రహ్మమే) నీవు, అంటున్నారు.

**కం॥ నను నిన్ను నెంచుకోవో**
**వినుమన్నియు నీదు చేత వెల్లడియగురా**
**అనె పెద తిరుమల హరికిన్**
**తను నారాయణుని పాడె తనివారంగన్.**

**రాగం : శహన**

నన్ను నిన్ను నెంచుకోవో నారాయణా
అన్నియు నీ చేతినే అదివో నారాయణా ॥నన్ను॥

నా మనసెఱుగవా నారాయణా నేడు
నాములాయె వయసులు నారాయణా
నామదారికపు మొక్కు నారాయణా
ఆముకొని నీ ప్రియములు నారాయణా ॥నన్ను॥

నగుతా నేనంటే నింతే నారాయణా
నగ రెటిగిన పని నారాయణా
నగవులు మాకు జాలు నారాయణా
అగడు సేయకు మిక నప్పటి నారాయణా ॥నన్ను॥





ననలు నీ వినయాలు నారాయణా
నను పంటి మిదివో నారాయణా
ఘనుడ శ్రీవేంకటాద్రి గలసితివిట్టెనను
అనుమాన మెల్లా బాసెనందు నారాయణా ॥నన్ను॥

**భావామృతం :**

ఓ నారాయణుడా! నన్ను నిన్ను నెంచుకోవో (నన్ను నిన్నుగా పరిగణించవయ్యా!) నీవే నేను. నేనే నీవు. త్వమేవాహం అని భావిస్తాను. అన్నియూ నీ చేతిమీదుగానే జరుగుతాయి. అదివో (ఆ పరబ్రహ్మకూడా) నీవేనయ్యా!

ఓ నారాయణుడా! నా మనస్సేమిటో నీ వెఱుగవా తండ్రీ! ఇకపోతే నా వయసులు 'నాము' (పనికిరాని కొయ్యపై చిగురించు మొక్క) లైపోయాయి. అన్నీ నామదారికపు మొక్కు (పేరుకోసం మొక్కు కొన్న మొక్కులు) నీ ప్రియములు (నీకు నా మీద గల ప్రేమ) ఆముకొనె (నన్ను గర్వపడేట్లు చేస్తున్నది) ఇక నా అదృష్టమేమని చెప్పను? అంతయ నీకరుణ.

ఓ నారాయణుడా!నగుతానేనంటే (నవ్వుతూ చలోక్తిగా నేనేమైనా అంటే), అది నగరెటిగిన పని (ప్రసిద్ధిని చెందిన పని). నగవులు మాకు జాలు (మాతో పరాచికములు ఇంకచాలు), అగడు సేయకుమీ నన్ను నిందల పాలుజేయవద్దు). అప్పటి నారాయణా (ఆది నారాయణుడా) నన్నుదయతలచుము ప్రభూ!

ఓ నారాయణుడా! నీ వినయములన్నియును ననలు (చిగురించుచున్నవి). ఇదిగో ఇదంతా ననుపు అంటిమి (ఇంపైనవి అని అంటిమి) నారాయణా! ఘనుడవైన ఓ వేంకటేశ్వరా! నన్ను నీ శ్రీవేంకటాద్రిమీద ఇట్టే కలిసితివి. అందుచేత నా అనుమానములన్నియునూ రూపుమాసినవి. ఓ నారాయణా నాకు ధన్యతచేకూరినది.

## 6-29

## మున్నుడి

సర్వేశ్వరుడైన పరమాత్మ తప్ప ఎఱగ నింకాఏమీ లేదు" అంటున్నారు అన్నమాచుర్యులవారు. రతికెక్కిన పనులన్నీ (అనుభవాన్ని కలిగించే పనులన్నీ) ఆ శ్రీ రామచంద్రుడే పో అంటున్నారు. ధనము, దైవము, తలిదండ్రులు, భార్యాపుత్రులు, దేహంలో వుండే జీవాత్మ, మోక్షదాత అన్నీ శ్రీవేంకటేశ్వరుని రూపంలో భాసిల్లుతున్న సర్వేశుడే అంటున్నారు. మోహమును కలిగించె వాడు కూడా ఆయనే కాబట్టి ఇక నమ్మగలిగిన దెవ్వరిని? ఆయనొక్కడ్నే కదా!

**మ॥ ఇతరంబేదియు లేదు నీ వొకడవే యెవ్వారు నీవే ప్రభూ!**
**రతికెక్కే పనులెల్ల రాఘవుడె పో రాజీవనేత్రుండె పో**
**మతిలో జేరెడి మాధవుండితడె పో మా తల్లియున్ దండ్రియున్**
**హితుడై చెప్పెను అన్నమయ్య వినుడీ ఈ జ్ఞానమే చాటు పో.**

**రాగం : దుర్గ**

ఇతర మేదియు లేదు యెఱగ మింతేకాని
రతికెక్కే పనులెల్లా రామచంద్రుడే పో ॥ఇతర॥

ధనమై చేరే వాడు దైవమై కాచేవాడు
మనసులో దలచేటి మాధవుడే
మునుకొన్న గ్రామములై ముందరనుండే వాడు
కొననాలుక మీదటి గోవిందుడే పో ॥ఇతర॥

తల్లియై పెంచేవాడు తండ్రియై పుట్టించేవాడు
వెల్లవిరి దాగొలిచే విష్ణుమూరితి
ఇల్లాలై సుఖమిచ్చి యెంచ బుత్రులైనవాడు
చెల్లుబడి దా మొక్కేటి చేతిపై శ్రీహరియే ॥ఇతర॥





దేహమై వుండేటివాడు దినభోగమైనవాడు
యీహల శ్రీవేంకటేశు డితడొక్కడే
మోహాచారమైన వాడు మోక్షమైనిలిచేవాడు
సాహసించి నమ్మగల సర్వేశుడితడే ॥ఇతర॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఇతర మేదియును లేదు. ఇంతేకాని (ఇది తప్పించి) యెఱగము (తెలియనే తెలియము). ఈ ప్రపంచంలో రతికెక్కిన పనులెల్లా (అనుభవాన్ని కలుగజేయు పనులన్నియునూ) ఆ శ్రీరామచంద్రుడే సుమా!

ప్రజలవద్ద ధనము రూపంలో చేరి ఎన్నో అనుభవాలనిస్తున్నదెవరు? ఆయనే సుమా! దైవం రూపంలో అనుక్షణం మనని కాపాడుతున్నదీ ఆయనే. మాధవుని రూపంలో మనం మనసులో ధ్యానించేదీ ఆయన్నే. అదే విధంగా మునుకొన్న (అతిశయించిన) గ్రామములై (వునికిగలవాడై) మన ముందర ఉన్నది కూడా ఆయనే. మన నాలుక చివర గోవిందుని రూపంలో వుంటాడు. అందుచేతనే మనం గోవిందా! అనగలుగుతున్నాం.

మనని కడుపున భరించి పెంచే తల్లి ఎవరు? ఆ దేవుడే. తండ్రియై మనని పుట్టించేవాడూ ఆయనే, అందుకనే మనం వెల్లివిరై (అతిశయించి) ఆ విష్ణుమూర్తిని ఆరాధిస్తాము. అవన్నీ అటుంచి మానవులకు ఇల్లాలు (భార్య) రూపంలో సుఖమునిస్తున్నది కూడా ఆయనే. పుత్రుల రూపంలో వుద్ధరించే వాడూ ఆ దేవదేవుడే. ఈ విధంగా మనతో నిత్యమూ వుండేది మనం నమస్కరించు చేతిపై శ్రీహరి వలె చెల్లుబడి అయ్యే వాడూ ఈ స్వామియే.

దేహము రూపంలో వున్నవాడూ ఆయనే. దినభోగమైన వాడూ (దినదినము మనం పొందే భోగము) ఆయనే. ఈ భూమిపై శ్రీవేంకటేశ్వరుని రూపంలో వున్నదీ ఇతడొక్కడే. మానవులకు మోహాచారమును (వ్యామోహమును) కల్పించుచున్నది ఆయనే. చివరికి వైరాగ్యమును కల్పించి ముక్తినిప్రసాదించుచున్నది కూడా ఆయనే. అంత్యకాలమున "అన్యధాశరణం నాస్తి త్వమేవ శరణం మమ" అని నమ్మదగిన సర్వేశుడూ ఇతడే..కదా!

## 6-30

## మున్నుడి

గీర్వాణిలో అహోబలనారసింహుని స్తుతిస్తున్నారు అన్నమాచార్యులవారి సుపుత్రుడు తాళ్ళపాక పెదతిరుమలచార్యులవారు "ఓ మానవ సింహమా! నీకు వందనములర్పించుచున్నాను. అహోబలమున ప్రమదను (భార్యను) అంకమున (తొడపైన) వుంచుకొని భక్తులను ఆశీర్వదించుచున్న నరసింహా! నీకు నమస్కారములు" అంటున్నారు. 'భూనభాంతరములు' (భూమి, ఆకాశం, వాటి మధ్యప్రదేశం) పూరిత (ఏ మాత్రంసందు లేకుండా నిండిపోయిన) నరసింహా! ప్రణతులు" అంటున్నారు

**తే॥ తరుణి నంకపీఠిక మీద దాల్చువాని**
**ధర నహోక్షబలంబున నిల్చు నారసింహు**
**తను 'నమామ్యహం' యని సంస్కృతమున పాడి**
**అన్నమార్యుని పుత్రుడు సన్నుతించె.**

**రాగం: కేదారాగౌర**

నమామ్యహం మానవసింహం
ప్రమదాంక మహోబల నరసింహం ॥నమామ్యాహం॥

దానవ దైత్య విదారణ సింహం
నానాయుధకర నరసింహం
భూనభోంతరాళ పూరిత సింహం
ఆనన వహ్ని లయాంతక సింహం ॥నామామ్యహం॥

ప్రళయనృసింహం బహుముఖ సింహం
సలలిత గరుడాచల సింహం
కులిశనఖర ముఖ ఘోషిత సింహం
తిలకిత బహు రవిదీపిత సింహం ॥నామాన్యహం॥





శాంత నృసింహం శౌర్య నృసింహం
సంతత కరుణా జయ సింహం
కాంతం శ్రీ వేంకటేగిరి సింహం
చింతిత ఘన సంసిద్ధి నృసింహం ॥నమామ్యహం॥

**భావామృతం :**

ఓ మానవ సింహమా! (నరసింహా!) నీకు నేను నమస్కరించుచున్నాను. ఓ అహోబలనారసింహా! ప్రమదను (శ్రీ లక్ష్మిని) అంకమున (తొడపైన) వుంచుకొనిన నరసింహా! నీకు వందనములు

ఈ అహోబల నృసింహుడు దానవులను మరియు దైత్యులను తుదముట్టించిన సింహము. అనేక విధములైన ఆయుధములను తన హస్తముల ధరించిన వాడు ఈ నరసింహుడు. భూమి ఆకాశమే కాక, వాటి మధ్య ప్రదేశము కూడా కిక్కిరిసి నిండిపోయిన వాడీ నరసింహుడు. తన ముఖమునుండి అగ్నిజ్వాలలను వెదజల్లుచూ లయమును సృష్టించుచున్నాడీ నృసింహుడు.

ఈ నరసింహుడు ప్రళయమును సృష్టించు భయంకరుడు. గరుడాచల క్షేత్రమున అందముగా నెలకొనిన సింహమీతడే. ఈ స్వామి "కులిశనఖర ముఖ ఘోషిత సింహం" (వజ్రాయుధము వంటి గోళ్ళు, కోరలున్న నోరుగల సింహము) నృసింహుడీయన.

నవ నారసింహులు వెలసిన ఈ అహోబలక్షేత్రమున ఈ స్వామి శాంతనృసింహుడు. అంతే కాదు గొప్ప శౌర్యవంతుడు. ఎల్లప్పుడూ కరుణామయుడు. ఈ స్వామి అనేక విజయములను ప్రసాదించువాడు. వేంకటగిరి మీద వెలసిన శ్రీకాంతడయిన శ్రీవేంకటేశ్వరుడు కూడా ఈ సింహమే. ఈ నృసింహుడు కోరుకున్న గొప్ప వరములను సిద్ధింప జేయగల దేవదేవుడు.

## 6-31

### మున్నుడి

ఈకీర్తన అన్నమాచార్యులవారు బహుశా తన యవ్వనంలో చెప్పివుంటారని నాకు అనిపిస్తుంది. సవతుల తగదాలు, తెలివిగల భర్తపరిష్కారాలు, జవరాలి అలుకలు, ఆవిడ భర్త బుజ్జగింపులు ఇవన్నీ ఆచార్యులవారి స్వానుభవాలా? యేమి? అని పిస్తుంది. విడువతగని ప్రియురాల బలములు చూపితేను నాయాలబెట్టెడి వాడు నాధుడావాడు? అంటున్నారు. ఇదేమిటో తెలియాలంటే...భావామృతమే చదవాలి.

**చం॥వలచిన  యాడువారి కదు వాదులు మానని వాడు జాణడా?**
**పలుకక భర్తతో సవతి మాటలు మానిన నవ్వుకోవలెన్**
**తెలియుము కోపులింతులని తేల్చేను పాడుచు అన్నమార్యుడున్**
**అలుగక శయ్య జేరవలె ఆ తృత జూపుచు వేంకటేశ్వరా!**

**రాగం : పాడి**

ఆడువారు కడుగోపులవుట నీ వెరగవా
నేడు గొత్తయిగా భూమి నేర్పుక వచ్చేరా ॥ఆడువారు॥

వలచిన యాడువారు వాదులాటకు వచ్చిన
చలము సాధించువాడు జాణడా వాడు
కలయని కాకతోడ కమ్మటి నలిగి పోగా
పిలిచి మాటాడకున్న ప్రియుడా వాడు ॥ఆడువారు॥

చనువుగలుగువారు సణగుల దిట్టగాను
కనలి యెగ్గు వట్టితే ఘనడా వాడు
గునిసి సవతులపై కోపాన పతి నంటేను
విని నవ్వకుండేవాడు విభుడావాడు ॥ఆడువారు॥





పాయరాని యట్టి వారు బలములు చూపితేను
నాయాల బెట్టెడివాడు నాధుడా వాడు
యీ యెడ శ్రీవేంకటేశ యింతినిట్టే గూడితివి
చయకు రాకుండువాడు సరసుడావాడు ॥ఆడువారు॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు కూడా ఇద్దరు భామల ముద్దుల మొగనివే కదా! నీకు ఆడువారు మిక్కిలి కోపదారి వారని తెలియదా? నేడు కొత్తగా భూమిపై నేర్చుక వచ్చేరా?

వలచిన స్త్రీలు వాదులాటకు వచ్చినచో, చలము సాధించువాడు (పంతము పట్టి సాధించు వాడు) జాణడా? (తెలివితేటలు వున్నవాడేనా?) కలయని కాకతోటి (సంధికి రాని వుడుకుమోతుతనంతో), కమ్మటి (సుందరి) బాగానలిగిపోతే, పిలిచి మాటాడకున్న (రాజీకివచ్చి మాటలు కలపని వాడు) ప్రియుడా? (ప్రేమికుడా) ఏ నాటికీ కాదు ప్రభూ!

భర్త వద్ద చనువు గల భార్యలు సణుగుతూ నిందించినచో కనలి (మండిపడి) నేరారోపణ చేసేవాడు యేమి గోప్పవాడు? గునిసి (కులుకు చూపి) సపతులపై కోపము మొగనిపై చూపితే విని నవ్వుకోవాలి గాని, పట్టించు కొనేవాడు ఎట్లాంటి మొగుడండీవాడు?

పాయరానియట్టి వారు (విడువరాని ప్రియురాండ్రు) బలములు చూపితే (తమ పట్టుదల చూపితే), నాయాలబెట్టెడివాడు (న్యాయస్థానంలో వారిని నిలబెట్టేవాడా) నాధుడా! (పతియేనా?) ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు నీవు నీ భామను ఇట్టే కూడితివి. చయకు రాకుండువాడు (బుజ్జగించి శయ్యపై చేరనివాడు) సరసుడా? ఎన్నడూ కాదు..వాడు విరసుడే ప్రభూ!

**6-32**

## మున్నుడి

అన్నమాచార్యులవారు ఈ అద్భుతమైన కీర్తనలో ప్రత్యక్షరూపుడైన పరమాత్మునికి మనం చేయవలసిన నిత్యపూజలేమిటో చెబుతున్నరు. గుడి, ఆలయశిఖరం, హరిపీఠము, దీపారాధన, మంత్రములు, ఘంట, నైవేద్యము వంటివి బహిఃపూజకే గాని మానసిక పూజకి ఇవన్నీ అక్కర లేదు అంటున్నారు. జీవాత్యుడే హరికి దాసుడైనప్పుడు శ్రీవేంకటేశుడు పరమాత్మకావున ఈ పూజ నెంతో ప్రీతితో స్వీకరిస్తాడు. సందేహమెందుకు?

**ఆ.వె॥ నిత్యపూజలివియె నేరిచినన్ అహో!**
**కనుల యెదుట దోచు ఘన విభునికి**
**పరవశించి పాడె పరమాత్మ కీరితి**
**విబుదుడన్నమయ్య వేంకటేశ!**

**రాగం : ఖరహరప్రియ**

నిత్యజాలివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి ॥నిత్య॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెను హృదయమే హరి పీఠమట
కనుగొన చూపులె ఘనదీపములట
తన లోపలి అంతర్యామికిని ॥నిత్య॥

పలుకే మంత్రమట పాడైన నాలికే
కలకలమను పిడిఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట
తలపు లోపల నున్న దైవమునకు ॥నిత్య॥





గమన చేష్టలే అంగరంగ గతియట
తమిగల జీవుడే దాసుడట
అమరిన వూర్పులే ఆలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికి ॥నిత్య॥

**భావామృతం :**

ఈ తిరుమలలో ప్రత్యక్షదైవం అయిన పరమాత్మ ఆ శ్రీవేంకటేశ్వరుడు. ఆయనకు మేము చేసే నిత్యపూజలేవియో నేరిచిన (తెలిసికొనిన) ఓహో! ఏమి ఆనందం కలుగుతునిది!!

ఆ స్వామి, నిజ భక్తులయొక్క తనువే (దేహమే) ఆయనకు గుడి (ఆలయము) అట. వారి శిరస్సు ఆయన ఆలయ శిఖరం అట. ఆయన భక్తుల హృదయమే స్వామికి హరిపీఠమట. ఆ దేవదేవుని చూపులు దివ్యజ్యోతులై గుడిదీపములవలె ప్రకాశించుచున్నవి. ప్రతియొక భక్తుని అంతరాత్మునిగా భాసిల్లుతున్న ఆ స్వామికి విడిగా ఆలయమూ పూజలూ కావలెనా? అక్కరలేదు.

శ్రీహరియొక్క నిజ భక్తుల మృదువైన పలుకులే ఆయనకు వారు చదివే మంత్రములు. పాదైన నాలుకే (స్థిరవచనము పలుకు నాలుక) భక్తితో గలగలమని రవళించు ఘంటానాదము. ఆ నాలుక అనుభవించు, నలువైన (చక్కనైన) రుచులు ఆ స్వామికర్పించు నైవేద్యములు. మన తలపులలో (భావనలలో) వున్న ఆ దైవమునకు (పరమాత్మునికి) సచ్ఛీలుర సంభాషణలంటే అంత ప్రీతి. పరుష వచనములను ఆయన తిరస్కరిస్తాడు. ఇది సత్యం.

"గమన చేష్టలే అంగరంగ గతియట" (జీవుడు చేసికొన్న చేష్టలె. వాడు పొందబోయే అంగరంగవైభవములకు (ప్రాతిపదిక) తమి (ఆసకి) గల జీవాత్మయే ఆ శ్రీహరికి ప్రియమైన దాసుడట. ఆయన భక్తుడైన ఆ జీవుని వూర్పులే (ఉచ్ఛ్వాస నిస్వాసములే) ఆయనకు వారు విసరు ఆలవట్టములు (వింజామరులు). ఈ క్రమములో (వరుసలో) ఆ శ్రీవేంకటేశ్వరునికి నిత్యపూజలు ఇవిగో ఇలా జరుగుతూనే వున్నాయి.

.6-33

## మున్నుడి

సాంఘిక దురాచారాలను అన్నమాచార్యులవారు ఎన్నో కీర్తనలలో తెగనాడారు. కులము మతము మొదలైనవన్నీ మానవ కల్పితాలు. పరమాత్మనుంచి జన్మించిన జీవికి కులమేమిటి? తాను పరమాత్ముడైన శ్రీహరినుంచి వచ్చానని గ్రహించి తక్కిన వారందరుకూడ దైవస్వరూపులని గ్రహించినవాడు ఏ కులజుడైతేనేమి ఎవ్వరైతేనేమి అంటున్నారు. ఇంతకంటే జ్ఞానం ఇంకేముంటుంది చెప్పండి. ఆత్మనియతి అంటే ఆత్మనిగ్రహం కావాలి. విద్యుక్త కర్మమార్గములనతిక్రమించనివాడికి కులంతో పనేమిటి?

**కం॥ ఏ కులజుడైన నేమిటి?**
**ఆకడ హరినెరుగు వాడు ఆతడె ఘనుడౌ**
**మాకందించెను జ్ఞానము**
**చేకొని యిటు అన్నమయ్య చెప్పెను సూక్తిన్**

**రాగం : భూపాలం**

ఏ కులజుడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతడె హరినెరిగిన వాడు ॥ఏ కులజు॥

పరగిన సత్యసంపన్నుడైన వాడే
పరనింద సేయ తత్పరుడు కానివాడు
అరుదైన భూతదయానిధియగు వాడే
పరులు తానేయని భావించువాడు ॥ఏ కులజు॥

నిర్మలుడై యాత్మ నియతి గలుగువాడే
ధర్మతత్పర బుద్ధి తగిలినవాడు
కర్మమార్గములు కడవనివాడే
మర్మమై హరిభక్తి మఱవని వాడు ॥ఏ కులజు॥





జగతిపై హితముగా చరియించువాడే
పగలేక మదిలోన బ్రదికినవాడు
తెగి సకలము నాత్మ తెలిసినవాడే
తగిలి వెంకటేశు దాసుడయిన వాడు ॥ఏ కులజు॥

**భావామృతం :**

ఓ మానవులారా! చివరికి హరియే ఆధారమని, గమ్యమని యెఱిగిన జ్ఞాని, ఏ కులము వాడయితే నేమిటి? ఎవ్వడైతే నేమిటి? అతనే సర్వోత్తముడు. సందేహం లేదు.

పరగిన (దీక్షతో) సత్యము పలుకుటయే నిష్ఠగా కలవాడూ, పరులను దూషించుటయందు ఆసక్తి లేనివాడూ, ఎంతో భూతదయగలవాడు ఇతరులుకూడ తనవంటి వారేయని భావించే వాడు సర్వశ్రేష్ఠుడు. వాడికి కులమేమిటి? ఏ కులమైనా ఒక్కటే.

నిర్మల హృదయుడై ఆత్మనిగ్రహం కలిగియున్నవాడునూ, ఏది ధర్మమో ఏదధర్మమో విశ్లేషించి ధర్మమార్గాన్నే అవలంభించువాడునూ, విద్యుక్త కర్మమార్గమును అతిక్రమించనివాడు హరిభక్తియొక్క ఔచిత్యం యెఱిగినందుచేత దానిమర్మం తెలిసినవాడై యెన్నడూ హరిభక్తి వీడనివాడు ఏ కులంవాడయితేనేమి, వాడి పుట్టుక యెటువంటిదయితేనేమి?

జగతిపై (ఈ భూమిమీద) పరహితైభిలాషియై చరించేవాడు (నడచుకొనేవాడు), మనస్సులోకూడా పగద్వేషమూలేనివాడు, సర్వమూ ఆత్మజ్ఞానం ద్వారా నేర్చినవాడునూ, తగిలి (ప్రీతితో) శ్రీవేంకటేశ్వరునికి దాసుడైనవాడు ఎవ్వరైతే నేమి? యే కులము వాడయితే నేమిటి చెప్పండి.

**6-34**

## మున్నుడి

చక్కటి వైరాగ్య చింతన ప్రభోదిస్తున్నారు అన్నమాచార్యులవారు. సంశయాత్మకమైనదేదైనా అవుతుంది లేక అవదు అనే రెండు స్థితులలో ఉంటుంది. కళ్లు రెండూ తెరిస్తే జ్ఞాని. రెండూ మూస్తే అజ్ఞాని. ఒక్కటే కన్ను తెరిస్తే ఇంకొక కన్ను మూసినట్లే కదా! ఇది తెలుసుకోవటానికి ఇన్ని చదవవలెనా? ఇంత వెదక వలెనా? అంటున్నారు. మనం ప్రపంచం అని పిలిచే ఈ ఇహము ఒక్కటే, మరణించాక అనుభవించే పరము కూడా ఒక్కటే. ఈ రెండింటికి గురి (లక్ష్యం) ఎవరు? జీవుడు. ఈ రెంటికీ కర్త ఎవరు? శ్రీవేంకటేశ్వరుడు.

**ఆ.వె॥ ఇన్ని చదువనేల? యింతా వెదకనేల?**
**కన్ను తెఱువ నొకటి కన్నుమూత**
**అన్నమయ్య పాట ఉన్నతంబగు బాట**
**హరి శరణము నరయ వరము పరము**

**రాగం : వకుళాభరణం**

ఇన్నియు చదువనేల ఇంత వెదకనేల
కన్ను దెరచు టొకటి కనుమూయటొక్కటే ॥ఇన్నియు॥

వలెననేదొకమాట వలదనేదొకమాట
సిలుగులీరెంటికిని చిత్తమే గురి
వలెనంటే బంధము వలదంటే మోక్షము
తెలిసే విజ్ఞానులకు తెరువిది ఒక్కటే ॥ఇన్నియు॥

పుట్టెడిదొకటే పోయెడిదొకటే
తిట్టమై ఈ రెంటికిని దేహమే గురి
పుట్టుట సంశయము పోవుట నిశ్చయము
వొట్టిన విజ్ఞానులకు నుపమిది యొకటే ॥ఇన్నియు॥





పరమనే దొక్కటే ప్రపంచమొక్కటే
సిరులనీ రెంటికిని జీవుడే గురి
యిరవై శ్రీ వేంకటేశు డిహపరముల కర్త
శరణాగతులకెల్ల సతమీతడొకడే ॥ఇన్నియు॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఇన్ని చదువుట దేనికి? ఇంతగా అన్వేషించుట దేనికి? ఇంత చిన్న విషయం మీకు తెలియుట లేదా? ఒక కన్ను తెరచుట అంటే ఒక కన్ను మూసినట్లే కదా!

మానవుడి చిత్తవృత్తి వలననే కొన్ని కావాలి అనుకొంటాడు. కొన్ని వద్దు అనుకొంటాడు. ఈ రెండు రకములైన సిలుగులు (అవస్థలకు) గుఱి (లక్ష్యం) ఒక్కటే. మన చిత్తమే దానికి గుఱి. ఏది అయినా కావాలి అనుకొంటే అది బంధమవుతుంది. వద్దు అనుకొంటే అదే మోక్షం. అంటే ఈ విషయం తెలిసిన విజ్ఞానులకు ఈ వైరాగ్యమే మోక్షమునకు దారి అవుతుంది. (అంటే వైరాగ్యం రాని వానికి ముక్తి అసాధ్యం అని తేలికగా అర్థం అయింది కదా!)

మానవులారా! పుట్టుక దేనికి జరిగింది? ఈ దేహానికి పోవటం (నశించటం) దేనికి జరుగుతుంది? అదీ దేహానికే జరుగుతుంది. తిట్టమై (స్థిరముగా) ఈ రెండిటికీ దేహమే కదా! లక్ష్యము? ఆలోచించి చూడండి, పుట్టుక సందేహాస్పదమే. ఎవరి కెప్పుడు పుట్టామో ఇంకొకరు చెప్తేనే కదా! మనకు తెలిసింది. కాని చచ్చి పోవుట మాత్రం నిశ్చయంగా జరుగబోయేదే. ఒట్టిన విజ్ఞానులకు (జ్ఞాన జ్యోతి స్వరూపులకు) యే పోలికయినా ఒక్కటే. (అనగా వారికి చావు పుట్టుకలు రెంటికీ తేడా వుండదు).

ఇహము అని పిలువబడే ఈ ప్రపంచమును, పరము అని పిలువబడె పరలోకములను అనుభవించు వాడెవడు? వాడినే జీవుడు అంటున్నాం. కనుక, ఈ ఇహపరాలు రెంటికీ గురి యెవరు? జీవుడే కదా! కానివాడు అస్వతంత్రుడు. వాడి పని వాటిని అనుభవించటం మాత్రమే. మరి ఇహ పరములు రెండిటికీ కర్త యెవరు? ఇంకెవరు ఇరవైన (ఆధారభూతుడైన) శ్రీవేంకటేశ్వరుడే. మన శరణాగతికి సతమైన (శాశ్వతమైన) ఆయన ఒక్కడే ఉన్నాడు.

## 6-35

## మున్నుడి

రమ్యమైన శరణాగతిని ఆలపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. పల్లవి యధాతథంగా ఆటవెలది చరణాల్లో ఇమిడిపోయిందంటే... ఆచార్యులవారు ఎంత లాక్షణికమైన కవిత చెబుతున్నారో గమనించండి. నన్ను కనిపెట్టి రక్షిస్తున్న ఆతనికి శరణు జొచ్చాను. ఇహలోకంలో ఈప్సితాలనిస్తూ పరలోకంలో మోక్షం ఇచ్చే పతికి (నాథునికి) శరణు అంటున్నారు. వేంకటాద్రిమీద నెలకొని దీనులను రక్షిస్తున్న శ్రీహరికి శరణు అంటున్నారు.

**ఆ.వె॥ అరసి నన్ను గాచినాతనికి శరణు**
**పరము నిహము నేలు పతికి శరణు**
**పూని వేంకటాద్రి దీనులగాచేటి**
**హరిని శరణువేడె నన్నమయ్య**

**రాగం : దేశ్**

అరసినన్ను గాచి నాతని శరణు
పరము నిహము నేలే పతికిని శరణు ॥అరసి॥

వేదములు దెచ్చినట్టి విభునికి శరణు
ఆదిమూలమంటే వచ్చి నతనికి శరణు
యేదెసా తానైయున్న యీతనికి శరణు
శ్రీదేవిమగడైన శ్రీపతికి శరణు ॥అరసి॥

అందరికి ప్రాణమైన ఆతనికి శరణు
ముందు మూడు మూర్తుల మూర్తికి శరణు
దిందుపడి దేవతల దేవునికి శరణు
అంది మిన్ను నేలనేకమైనతనికి శరణు ॥అరసి॥





తానే చైతన్యమైన దైవానకు శరణు
నానా బ్రహ్మాండాల నాథునికి శరణు
ఆనక శ్రీవేంకటాద్రి యందునుండి వరములు
దీనుల కిందరి కిచ్చే దేవునికి శరణు ॥అరసి॥

**భావామృతం :**

"అరసి నన్నుగాచి నాతనికి శరణు" అనగా నన్ను ఏమరక ఒక కంట కనిపెట్టి రక్షించుచున్న ఆ దేవదేవనికి శరణు నర్థించుచున్నాను. ఈ లోకములను పరలోకములను పరిపాలించుచున్న జగన్నాథునికి శరణు వేడెదను.

సోమకుని జంపి వేదములను రక్షించి తెచ్చినట్టి శ్రీపతికి శరణు. దేనికేది మూలమో అనుకుంటూ పోతే చివరికి ఆదిమూలమైన యతనికి శరణు. ఏ దిక్కున చూచినా తానే యున్నవానికి శరణు. శ్రీలక్ష్మికి వల్లభుడైన శ్రీహరిని శరణు వేడుచున్నాను.

ప్రతి జీవికీ ప్రాణమైన మహానుభావుని శరణుజొచ్చుచున్నాను. "ముందు మూడు మూర్తులు" అనగా బ్రహ్మవలె సృష్టిని, విష్ణువువలె సంరక్షణను, రుద్రునివలె లయమును నిర్వహించు చున్న త్రిమూర్తులు అని అర్థం. ఆ త్రిమూర్తులకు ఆదిమూర్తి అయిన దేవదేవునికి శరణు నర్థించెదను. దిందుపడి (అతిశయించి) దేవతలందరికీ దేవుడైన స్వామిని శరణు గోరుచున్నాను. త్రివిక్రముని వలె ఏ మాత్రమూ సందు లేకుండా నింగి నేలా ఆక్రమించిన విరాట్పురుషుని శరణుజొచ్చి అర్థించుచున్నాను.

తానే చైతన్య స్వరూపునిగానున్న విశ్వచైతన్యమూర్తిని శరణు వేడుచున్నాను. ఈ విశ్వంలో ప్రభవిల్లుచున్న అనేక బ్రహ్మాండములున్నవి. వాటి అధినాథునికి శరణుజొచ్చెదను. ఈ విశ్వరచనా కార్యక్రమము ఇట్లుండగా, తరువాత శ్రీ వేంకటాద్రిపై నెలకొని తనను శరణుజొచ్చిన దీనులకు అనేకములైన కోర్కెలు దీర్చుచున్న శ్రీవేంకటేశ్వరుని శరణు నర్థించుచున్నాను.

**6-36**

## మున్నుడి

తిరుపతిలో వెలసిన కోదండరామస్వామి మీద మధురమైన కీర్తన వినిపిస్తున్నారు. అన్నమాచార్యులవారు. ఈకీర్తనలో సీతమ్మ రామచంద్రునితో గొప్పగొప్ప 'సవాళ్ళను' విసురుతున్నది. రసికుడవైన ఓ తిరుపతి రఘువీరా!(కోదండరామా!) నేను వేసే సవాళ్ళు కొసరుగాదయ్యా! (నిన్నుకొంచెము చేయుట నా వుద్దేశ్యం కాదు.) నాకు నీపై వున్న కూరిమే (ప్రేమే) నన్ను అలా చేయిస్తోంది. రాముడే కదా! సీత బహిః ప్రాణం? అది సరే, ఇకజవాబు చెప్పు స్వామీ! నా ప్రశ్నలంటే వేంకటేశ్వరునిగా కనకమహాలక్ష్మిని కూడుట కాదయ్యా!

**చం॥ తిరుపతి రాఘవా! రసిక! దివ్యప్రభావమునెంచ శక్యమా**
**స్థిరమగు కూరిమిన్ కొసరుచేయకుమా, యనె సీత తానయెన్**
**వరదుడు అన్నమార్యుడును పాడెను కీర్తన మద్భుతంబుగా**
**మురియుచు నాదు బోంట్లు విని మొక్కెద రెల్లెడ వేంకటేశ్వరా!**

### రాగం : రామక్రియ

రసికుడ తిరుపతి రఘువీరా
కొసరుగాదు నాలోని కూరిమిలుగాని ॥రసికుడ॥

వెలయ నీ విరిచిన విల్లు వంటిది గాదు
విలసిల్లు నా బొమ్మల విండ్లు గాని
చెలగి తపసు చేసే చిత్రకూటగిరిగాదు
గిలుకొట్టు నా కుచగిరులు గాని ॥రసికుడ॥

మేటియై నీవు వేసిన మెకము చూపుగాదు
సూటిదప్పని నా కనుచూపులు గాని
గాటమై నీవు సేతువు గట్టిన జలధిగాదు
చాటున నా చెమటల జలధులుగాని ॥రసికుడ॥





తగ నీవు గెలిచిన దనుజ యుద్ధము గాదు
దగతోడి నా మదన యుద్ధముగాని
నగు శ్రీవేంకటేశ కనకసతి పొందుగాదు
పొగడే సీతనైన నా పొందులు గాని ॥రసికుడ॥

### భావామృతం :

తిరుపతిలో వెలసిన ఓ రఘువీరా! (కోదండరామా!) నీవు గోప్ప రసికుడవు స్వామీ! నాలోవున్న నీపై కూరిమి (ప్రేమ) ఏ మాత్రం కొసరుగదయ్యా! (నిన్ను కొంచెయుచేయుటకాదు. కాని నేను చెప్పేది నిజమే.

ఇదిగో విల్లులా వంగివున్న నా కన్నుబొమ్మలను చూశావా? ఇవి నీవు ఆ నాడు మిథిలలో విఱిచిన శివధనస్సువంటివిగావు. ఇదిగో నా ఈ కుచగిరులను గమనించితివా? ఇవి నీవానాడు చిత్రకూటపర్వతము మీద చెలగి (దీక్షగా) తపమునాచరించితివే... అట్లు కాదు. ఈ కుచగిరులను సాధించుట ఇంకా కష్టం ప్రభూ!

ఓ రామచంద్రా! వాడిగా (సునిసితంగా) వుండే నా క్రీగంటి చూపును చూశావా? ఇవి ఆ నాడు నీవు మారీచుడు బంగారు లేడియై వచ్చినప్పుడు ఆ మృగము చూసిన చూపులు గావు. ఇవి ఇంకావాడి అయినవి. ఇదిగో చాటున (వెలువడుచున్న) నా చెమటల జలధులను చూచితివా? ఇది నీ వానాడు సేతువును నిర్మించిన నూరు యోజముల సాగరము కాదు. ఇంకా అధికమైన నీరధి ఇది.

ప్రభూ! నీవు అవలీలగా ఖర దూషణాది రాక్షసులను గెలిచావు. కాని నా తోటి మదన సంగరం అంత తేలికైనది కాదు. అది దగతోడిది (బడలిక కలుగజేయునది) సీతనైన నాతో పొందు, ఆ నవ్వుల వేంకటరమణుని దేవేరియైన కనక సతి (కనకమహాలక్ష్మి) పొందుగాదయ్యా! నా పొందు ఇంకా అపురూపమైనది.

**6-37**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చక్కటి జ్ఞానబోధన చేస్తున్నారు. విని తరించండి. ఓ మనసా! పారకుమీ (పిఱికి వలె పారిపోకు). పంతము విడువకుమీ (నీ పట్టుదలను వదలకుము- అని వుద్బోధిస్తున్నారు. ఒక వేళ అన్నమయ్య చెప్పినట్లు చేయకపోతే ఏమవుతుంది? ఓ మనసా! పారిపోతే నీవే బడుగు అయ్యెదవు. అట్లుగాక నీ లక్ష్యాన్ని చేరువ అయ్యేవా... ఆ నాడే నీకు విశిష్టత లభిస్తుంది. శివునివైరి అయిన మన్మథునికి చిక్కితివా కంతువారెదవు (చెడిపోతావు). అట్లు కావలదు. వెన్నుడైన శ్రీవేంకటపతినే ధ్యానించుము. వేసరకుము (బాధపడవద్దు) అంటున్నారు

**ఉ॥ పాఠకు చిత్తమా! యిటుల పంతము వీడకు మీయనెన్ భళా!!**
**పారిన నీవెహీనమయి బానిస చేరువనాడె యౌదువే**
**మీరిన శంభువైరి 'మది' మించునశాంతిని మండ జేయునే**
**చేరుము వేంకటేశ్వరుని చెప్పెను దీటుగ అన్నమార్యుడున్.**

### రాగం : దేశ్

పాఠకుమీవో మనసా పంతము విడువకు మీ మనసా
పారిన నీవే బడుగయ్యెదవు చేరువనాడే చెప్పనె మనసా ॥పారకుమీ॥

చింతించకు మీ శివునివైరి చిక్కువడకుమీవో మనసా
కంతువారకుము వయసు బ్రాయములు కావటికుండలు వోమనసా
యెంటేమేలు గీడే కాలము ఎప్పుడునుండదు వోమనసా
సంతరించుకో వానిని మనసున సంతోషముగా వో మనసా ॥పారకుమీ॥

యెన్నికలే తలపోయకుమీ యేమరకుండుమీ వో మనసా
కన్న విన్నవారిలో నెప్పుడు కాకుపడకుమీ వో మనసా
పున్నమ మాసాలు పుడమిలో బదుకులు పోయి వచ్చేవి వో మనసా
మిన్నో నేలని వున్న దినములో మీదు చూడకుమి వో మనసా ॥పారకుమీ॥





కన్నుల సంగాతము సేయకుమీ కళవళించకుమి వోమనసా
వన్నెల మాటలు చెవుల బెట్టక వాసి విడువకుమి వోమనసా
మున్నిటి సురలు బ్రహ్మాదులకైనను ముక్తి సాధనము వోమనసా
వెన్నుని వేంకటగిరి పతిదలచుము వేసరకుమీ వో మనసా ॥పారకుమీ॥

### భావామృతం :

ఓ మనసా! నీవు పిఱికివలె పలాయనం చిత్తగించవలదు. నీవు పంతమును విడువకుమీ (నీ పట్టుదలను విడనాడవద్దు. అట్లా పారినయెడల నీవు బడుగయ్యెదవు (చెడిపోయెదవు). ఆపైన అట్లాకాకుండా నీ లక్ష్యానికి చేరువ అయ్యావా, ఆనాడు నీకు విశిష్టత లభిస్తుంది.

ఓ మనసా! శివుని వైరి అయిన మన్మథుని గురించి చింతించకుము. చిక్కులలో పడెదవు సుమా! నామాట వినుము కంతువారకుము (చెడిపోకుము). ఓ మనసా! వయస్సు యవ్వనము కావటికుండలవలె వూగిసలాడునవే సుమా! మేళ్ళు కీళ్ళూ వస్తూనే వుంటాయి, పోతూనే వుంటాయి. కాలము ఎప్పుడూ స్థిరముగా నుండదు. కనుక ఓ మనస్సా! వానిని (దేవదేవుని) సంతోషముతో నీలో ప్రతిష్ఠించుకో. అంతకంటే గొప్పపని లేదని గ్రహించుము.

ఓ మనస్సా! యెన్నికలే తలపోయకుము (జరిగిన మంచి కాలము గురించి మాత్రమే ఆలోచించకుము). అట్లు ఆలోచించి నిన్ను నీవు మైమరువకుము. కన్న (చూచిన) వాటి గురించి విన్నవాటి గురించి ఎప్పుడు కాకపడకుము (కలతపడవద్దు). ఓ మనసా! పుడమిలో బదుకులు (ప్రపంచంలోని అందరి జీవితాలూ) వెన్నెలమాసములు (శరదృతువులాంటివి). అవిపోతూనే వుంటాయి, మరల వస్తూనే వుంటాయి. దివిలోను, భువిలోను యెంతకాలం వుంటామన్నది చూడవద్దు. ఉన్నంతకాలం ఉన్నతంగా వుండుటయే తగిన పని.

ఓ మనసా! కన్నులు కలిపి చెలిమి చేయవద్దు. ఆపై కళవళపడవద్దు. వంచనతో కూడిన మాటలను విని మోసపోవద్దు. నీఖ్యాతిని చెడగొట్టుకోవద్దు. ఓ మనసా! మున్నిటి (అనాదివారైన) బ్రహ్మాదిదేవతలకు కూడా ముక్తి సాధనము ఒక్కటే. అదే శ్రీమహావిష్ణువు అయిన శ్రీవేంకటేశ్వరుని ధ్యానించుట. ఓ మనసా! చాంచల్యమును పొందకుము.

## 6-38

## మున్నుడి

చక్కటి వైరాగ్యకరదీపిక వంటి కీర్తనను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ సంసారము అనునది మహామాయ. దీనికి జిక్కువడిన జీవులు జీవితాంతం ఆ మాయకు కట్టుబడిపోయి దానిమీద భ్రమతో ఎన్నటికీ దానిని రోయరు (ఏవగించుకొనరు). దాని బాధలనుభవిస్తున్నంతకాలం రోత కలిగినా రోయలేరు. మతి చెడి తీయగా ఆ బాధలననుభవిస్తూనే వుంటారు అంటున్నారు. మరి ఇక గత్యంతరమేమిటి? జీవుల దైన్యాన్ని పోగొట్టే శ్రీవేంకటేశ్వరుదు దయతలచాలి. అంతే.

**కం॥ మాయల దగులుచు మతిచెడి**
**రోయక సంసార సుఖపు రోతకు ప్రాణుల్**
**రోయదలంచియు రోయరు**
**'తీయగ సై చెదరు' అన్న దీటుగ తెలిపెన్.**

**రాగం : ఆహిరి**

మాయల కగపడి - మతిచెడి ప్రాణులు
రోయదలంచియును -రోయగలేరు ॥మాయకు॥

మిసమిస మెరువగ-మెల్లన చేరిరి
ముసిడిమాని ఫల-ములచూచి
రసమని సంసా-రపు బాలకులిదె
విసిగి చేదుగని-విసుగ గలేరు ॥మాయకు॥

బలు విషమొలికెడి- పాము బట్టుకొని
అలరుచు నలుగడ-నాడేరు
పొలసి యాసలూ-ర్పులు నిగుడించగ
తెలిసియు నింకా-దెలియగ లేరు ॥మాయకు॥





తేనెదెచ్చిక-త్తికి దారబెట్టి
నానా విధముల-నాకేరు
దీనత లణపెడి- తిరు వేంకటపతి
చేని పంటలకు-చెయిజాచ లేరు ॥మాయకు॥

**భావామృతం :**

ఈ సంసారము యొక్క మాయలకు దగులుకొని ప్రపంచంలోని జీవులు (ప్రాణులు) అందరూ అప్పుడప్పుడు రోతగలిగి నా రోయతలచినా రోయలేక దీనికి వశులై సంచరించుచున్నారు. (ఇదంతా ఈ విష్ణుమాయయే.)

మిసిమిస మెరయుచున్న ముసిడిమాని (ముష్టి చెట్టు యొక్క ) పండ్లను చూచి, రసమని (బాగా రుచిగా యుంటాయని) సంసారపు బాలలు (సంసారపు యావలోనున్న అజ్ఞానులు) మెల్లన జేరిరి (నెమ్మదిగా దానికి చేరువ అయ్యారు). తీరా చూస్తే అవి తీపిపండ్లుకావు. వాటి చేదుకు ఇప్పుడు విసుగుకొన్నా చేయగలిగిందేముంది? దాన్ని విరుగగలేరు. (విడుదలకాలేరు).

గొప్ప విషమును జాలువారే సర్పమును బట్టుకొని దాని వల్ల ప్రమాదంతెలియక సంతోషముతో ఆడుకొంటున్నారు. నాలుగుదిక్కులా ఆ పాముతో ఆడుతూనేవున్నారు. ఆ పాము ఆసలనెడి నిటూర్పులను బుసకొట్టుచునేయున్నది. ఇదంతా తెలసి కూడా వీరు దీంట్లోంచి బైటపడలేకున్నారు.

మధురమౌ తేనెని తీసికొని వచ్చి ఒక కత్తికి బాగా పట్టించి, తీయగావుందని ఆ పదునైన కత్తి అంచును నాకుతున్నారు. వీళ్ళ వెఱ్ఱిపాడుగాను ఆ పదునైన అంచును రకరకాలుగా నాకుతున్నారు. ఈ జీవుల దైన్యత్వాన్ని అణచగల ఓ శ్రీవేంకటేశ్వరా! సమృద్ధిగా పండిని చేనువంటి నీవు వారితోనే వున్నా, వారు ఆ పంట నందుకొనేందుకు ప్రయత్నించడం లేదు.... ఏమి దౌర్భాగ్యమిది తండ్రీ!

**6-39**

## మున్నుడి

ఇది వరలో కొన్ని కీర్తనలలో శ్రీ వేంకటేశ్వరునికి ఆ రోజుల్లో నివేదించే తినుబండారాలగురించి అన్నమాచార్యులవారు కీర్తించటం విన్నాము. ఈ కీర్తనలో చిన్నారి కృష్ణయ్యకు ఏయే చిఱుతిళ్ళు ఇష్టమో, వేటిని ఆ నాటి పద్ధతిలో గోపెమ్మలు వుట్లలో దాచుకునే వారో పట్టిక ఇస్తున్నారు. సుండీ! అంటే నేటి కాలంలో సుమా! అన్నట్లు. తల్లి బిడ్డతో అల్లరి చేస్తే తన్నులు తింటావు సుమా! అంటుంది ఈ రోజుల్లో. అన్నమయ్య కాలంలో సుండీ! అనేవారు. ఈ పిల్లవాడు తోటి పాపాయిలతో వీధులో పాకే వాడు నేడు కోలాటాల కఱ్ఱలు పుచ్చుకొని వుట్లు పగుల గొట్టీ జుండీ.... అంటున్నారు.

**ఉ॥ బాలలతోడి వీధులను పాకెడి బిడ్డడు సుండి!! నేడిదే**
**కోలల నెత్తి ఉట్లు పడగొట్టెను యేమని చెప్పమందురే**
**మాలిమి బిడ్డ యీ పిడుగుమాన్య యశోదకు అన్నమయ్యనెన్**
**తేలెను వేంకటేశ్వరుడె దీటగు నందుని గోపబాలుడౌ.**

**రాగం : ఆహిరి**

బాలులతో వీధులలో బారాడు వాడు
కోలలెత్తుక వుట్టు గొట్టీ జుండీ ॥బాలలు॥

నారికడపు వక్కలు నానిన సనగలు
చారపప్పు దేనెలు చక్కెరలును
పేరిన నేతులు నానబియ్యాలు నుట్ల
చేరి యశోదబిడ్డకు జెప్పేరు సుండీ ॥బాలలు॥

చక్కిలాలు నడుకులు సనిగెపప్పులును
చెక్కిన మెత్తని తూటచెఱకులును
పెక్కువగా నుట్లలో బిందెల నించిన వవే
చక్కనెశోదబిడ్డకు జాటేరు సుండీ ॥బాలలు॥





నువ్వులు జిటి బెల్లాలు నున్నని చిమ్మిలులు
నువ్వుటిడియును జిన్ని నురుగులును
యెవ్వారు శ్రీవేంకటపతి కెఱుగించ నారగించి
కివ్వకివ్వ నవ్వ నణకించీ జుండీ ॥బాలలు॥

**భావామృతం :**

ఈ చిన్నారి కృష్ణయ్య ఇది వరకు చిన్నారి బాలురతో కలసి వీధులలో పారాడుతుండేవాడు. ఇవ్వాళ కోలలు (చిన్న కఱ్ఱలు) ఎత్తుకొని ఎగిరివుట్లను కొడుతున్నాడు, సుండీ! (సుమా)

వీడు తినే చిఱుతింట్లు చూడండ్రా! నారికడపు వక్కలు (కొబ్బరితో చేసిన చిన్నచిన్న బిళ్ళలు), నానిన సనగలు(నానబెట్టిన శనగలు), చారపప్పు (సారపప్పు), తేనెలు, చక్కెరలు, పేరిన (గడ్డకట్టిన) నెయ్యి, నానబెట్టిన బియ్యము మొదలైనవి వుట్లలో దాచుకున్నాం. చేరి (వెళ్ళి) ఆ యశోద బిడ్డడకి జెప్పేర సుండీ! (ఆయశోద కొడుక్కి చేప్పేరు సుమా! కొంపంతా వూడ్చిపారేస్తాడా అల్లరి పిడుగు)

ఇంకావాడికేమి ఇష్టమో చూడండి. చక్కిలాలు, అడుకులు (అటుకులు), సనిగ పప్పులు (పుట్నాల శనగపప్పు), చెఱకు గడను నఱికి మెత్తని చిన్నచిన్న ముక్కలు చేసిన "తూట" ఎత్తైన వుట్లలో బిందెలను పెట్టి ఆ బిందెల్లో పెక్కువ (ఎక్కువగా) నింపాము. ఈ సంగతి చక్కని ఆ యశోదబిడ్డ దగ్గర చాటింపు వేసేరు సుండా! జాగ్రత్త! అన్నీ క్షణంలో మాయం చేస్తాడు.

ఇంకావాడికి చిటిబెల్లము, నువ్వులు కలిపికొట్టిన 'గుండ' అంటే కూడా వాడికి ఇష్టం. నువ్వుటిడియను (నువ్వుపప్పు ఇడీలైవుండవచ్చును) అంటే వాడికిష్టమే. జిన్నినురుగులు అంటే కూడా వాడికి ప్రీతి. ఇదంతా సరే.... ఈ సంగతి ఎవ్వారు (అందరూ) , శ్రీవేంకటపతికి చెప్పి ఆరగింపు చేయిస్తుంటే... ఆయన, "కిలకిలమని నవ్వి అపహసించినాడు సుమా!).

## మున్నుడి 6-40

చిన్నప్పట్నించి నా ఈ శరీరాన్ని అంతా 'బ్రాహ్మలబ్బాయి' అనేవారు. మా పెద్దవాళ్ళు చెప్పిన కొన్ని "కర్మలు నేనూ ఆచరించాను, కాని అన్నమాచార్యులవారి ఈ కీర్తన నన్ను ఆలోచనల్లో పడేసింది. అసలు ఈ పరమాత్మతత్త్వం అర్ధంకాని వాడు బ్రాహ్మడెట్లా అవుతాడు? ఆదినారాయణుని నిరంతరం ఆత్మలో నిలుపుకోనివాడు'బ్రాహ్మడే' కాదు పో...అంటున్నారు.

**సీ॥ అణురేణు పరిపూర్ణుడైన శ్రీవల్లభున్**
**ప్రణుతించు వారె పో బ్రాహ్మలనగ**
**హరినామములను సంధ్యావిధులన్ సల్పు**
**పరిపూర్ణమతులె పొ బ్రాహ్మలనగ**
**యేవి చూచిన హరి యిన్నిటా కలదని**
**భావించు వారలే బ్రాహ్మలనగ**
**ఆదినారాయణు ననయంబు దమయాత్మ**
**బాదుకొలుపువారె బ్రాహ్మలనగ**

**తే॥ వేదరక్షకుడైనట్టి వేంకటేశు**
**పాదసేవకుండొక్కడే బ్రాహ్మడనగ**
**అన్నమార్యుని కీర్తన మాలపించి**
**మనిషినైతిని కాకుంటి బ్రాహ్మణుండు**

**రాగం: శ్రీరాగం**

అణురేణు పరిపూర్ణడైన శ్రీవల్లభుని
బ్రణుతించు వారువో బ్రాహ్మలు ॥అణురేణు॥

హరినామములనె సంధ్యాది విధులొనరించు-
పరిపూర్ణమతులువో బ్రాహ్మలు
హరిమంత్రవేదపారాయణులు హరిభక్తి
పరులైనవారువో బ్రాహ్మలు ॥అణురేణు॥





యేవి చూచినను హరి యిన్నిటా గలడనుచు-
భావించువారువో బ్రాహ్మలు
దేవకీనందునుడె దేవుడని మతి దెలియు
పావనులు వారువో బ్రాహ్మలు ॥అణురేణు॥

ఆది నారాయణుని ననయంబు దమయాత్మ
బాదుకొలిపిన వారువో బ్రాహ్మలు
వేదరక్షకుడైన వేంకటగిరీశ్వరుని-
పాదసేవకులువో బ్రాహ్మలు ॥అణురేణు॥

**భావామృతం :**

అణువణువునా, ప్రతిరేణువులోనూ పరిపూర్ణుడైన (ఏమాత్రం ఖాళీలేకుండా నిండిపోయిన) శ్రీపతిని....ప్రణుతించువారువో (బాగుగా కీర్తించువారే). బ్రాహ్మలు (బ్రాహ్మణులు), ఆ కులంలో పుట్టినంతమాత్రాన కారు.

తమ సంధ్యాది కార్యక్రమాలలో నిరంతరం శ్రీహరి నామమును జపించువారిని, పరిపూర్ణమతులైన (మనస్సంతా హరితో నిండిన మహాత్ములు) వారినే బ్రాహ్మణులు అంటారు. హరి మంత్రముతో కూడిన వేదపారాయణము చేస్తూ హరి భక్తులైనవారలే బ్రాహ్మణులు. భక్తిలేనివాడు బ్రాహ్మణుడు కాడు.

నాడు ప్రహ్లాదుడు చెప్పినట్లు, ఇందుగలడందులేడని సందేహములేక, యెందైనా హరియే కలడనే వాడే బ్రాహ్మణుడు. అట్లు భావించనివాడు బ్రాహ్మడే కాదు. దేవకీనందనుడైన శ్రీకృష్ణపరమాత్మను, భగవంతుడని మనస్సున నమ్మకంగా నిలుపుకొన్నవారే బ్రాహ్మణులు ఒక బ్రాహ్మణుడికి పుట్టినంత మాత్రాన బ్రాహ్మణుడు కాదు.

ఆదినారాయణుడైన దేవదేవుని, అనయంబు (ఎల్లప్పుడు) తమ ఆత్మలో బాదుకొలిపిన వారు (బాగుగా నాటుకొనిన వారే) బ్రాహ్మణులు అని పిలువదగినవారు.వేదరక్షకుడైన శ్రీవేంకటగిరిపతి యొక్క పాదసేవకుడైనవాడే బ్రాహ్మణుడు. అట్లుగాక ఒక జంధ్యం వేసికొని, అడ్డబొట్టో, నిలువు బొట్టో పెట్టుకొనే, పిలకధారులు బ్రాహ్మణులుకాదు.... బ్రాహ్మణకులస్థులు అంతే......

## 6-41

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తనలో 'విభక్తి'ని బట్టి కీర్తన స్వరూపమే మారిపోతుంది 'వలపులధికము సేయు వైభవములు' అనే పల్లవిని చూడండి. వలపులు వైభవములను అధికము సేయును - అవుతుంది ప్రథమా విభక్తితో అంటే ప్రేమలు వైభోగాలను పెంచుతాయా? కానేకాదు. 'వలపులను వైభవములు అధికము సేయు' - అని ద్వితీయా విభక్తి ఉపయోగిస్తే... వైభవములు ప్రేమలను పెంచుతాయి అని అర్థమవుతుంది. నేను పద్యంలో కూడా ఇదే ధోరణి నవలంభించాను. గమనించండి. భావామృతం జాగ్రత్తగా చదవండి.

**తే॥ వలపులధికము సేయును వైభవములు**
**తలపులధికము సేయును తనదు చింత**
**అందములు పొందులును సేయు అమితమనెను**
**అలర "వేంకటేశుని కృప" అన్నమయ్య.**

**రాగం : శ్రీరాగం**

వలపు లధికము సేయు వైభవములు
తలపు లధికము సేయు తలపోతలు ॥వలపు॥

కోప మధికము సేయు గోరికలు
తాప మధికము సేయు దమకంబులు
కోపంబు తాపంబు గూడ నధికము సేయు
యేపయిన మోహముల నేమందునే ॥వలపు॥

మచ్చి కధికము సేయు మన్ననలు
యిచ్చలధికము సేయు నీరసములు
మచ్చికలు నిచ్చలును మగుడ నధికము సేయు
నెచ్చరిక కూటముల నేమందమే ॥వలపు॥





అంద మధికము సేయు నైక్యములు
పొందు లధికము సేయు బొలయలుకలు
అందములు బొందులును నలర నధికముసేయు
నెందు నరుదగు వేంకటేశు కృపలు ॥వలపు॥

**భావామృతం :**

ఓ మానవులరా! వైభవములు (సిరిసంపదలు) వలపులను (ప్రేమలను) అధికము చేస్తాయి. తలపోతలు (అదేపనిగా చింతించే మనస్తత్వం) తలపులను (ఆలోచనలనే) అధికము చేస్తాయి. (ఇక ఆ చింతకు అంతే వుండదు).

కోరికలు తీరకపోతే అవి కోపమును తప్పక అధికము సేయును. తమకంబులు (మైమరపు చెందు స్వభావము) తాపమును (విరహవేదనను) అధికము చేయును. ఇకపోతే ఏపయిన మోహములను (అధికమైన మోహములను) ఏమనవలెను? అవి కోపమును పాపమును రెంటినీ పెంచుతాయి కదా!

మన్ననలు (ఒక వ్యక్తికి మనమిచ్చే గౌరవ మర్యాదలు) మచ్చికను అధికము చేయును. (వారితో మన చనవును పెంచుతుంది) "ఇచ్చలు అధికము సేయున్ ఈరసములు"... అంటే... ఈ రసములు (ఈర్ష్యలు) ఇచ్చలు (కోరికలను) అధికము సేయును. ఇకపోతే, హెచ్చరించవలసిన కూటములను (సంబంధములను) అధికము చేస్తాయే... ఈ మచ్చికలు మరియు ఇచ్చలు.. ఆ కూటములను యేమనవలెనో తెలియుటలేదు.

ఐక్యములు (ఒకటిగా అయిపోవటం) అందమును అధికము సేయును. ‘‘పొందులధికము సేయున్ పొలయలుకలు’’- అంటే.. పొలయలుకలు (ప్రణయకోపములు) పొందులన్ అధికము సేయును (కలయికలను, సంభోగములనధికము సేయును). అయితే... యెందున్ (యెక్కడైనా సరే) వేంకటేశ్వరుని కృపలు (దయ, వాత్సల్యములు) వుంటే... అవి అందములను పొందులను రెంటినీ తప్పక వృద్ధి చేస్తాయి.

**6-42**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగను పరిణయమాడి కొత్త పెళ్లికూతురుతో పాటు తరలిపోబోతున్నాడు. తొలినాటి బిడియంతో సిగ్గుపడుతున్నాడు శ్రీనివాసుడు. పుత్తడిబొమ్మ అలమేల్మంగ చక్కదనం వర్ణించటం సామాన్యులవల్ల అయ్యే పనియేనా? అన్నమాచార్యులవారు ఆనాటి నవ వధూవరులను భావించి వధువు తరపున నాలుగు మంచి మాటలు చెబుతున్నారు. జగన్నాధునే యేమని మందలిస్తున్నారో చూడండి. "ఇమ్ముల సిగ్గువడక (ఇంతగా బిడియపడక) యేలుకో వయ్యా! మా అమ్మాయిని" అంటున్నారు. ఇంకేం చెప్పను?

**కం॥ "కొమ్మకు పెండిలి కొడుకై**
**సొమ్ముగవచ్చితివియేలు సుదతి మురియగన్**
**ఇమ్ముల సిగ్గువడకు మా**
**రమ్మా!" అన్నయ్య పిలిచె రాజీవాక్షున్**

**రాగం : ముఖారి**

కొమ్మకు నీవిట్టే పెండ్లి కొడుకువై వచ్చితివి
ఇమ్ముల సిగ్గువడక యేలుకోవయా ॥కొమ్మకు॥

పుత్తడి వంటిది యీ పొలతి చక్కదనము
చిత్తరువు వంటిది మించిన రూపము
క్రొత్త మెఱుగువంటిది కోమలపు దేహము
చిత్తగించవయ్యా యీకె సింగారము ॥కొమ్మకు॥

పూవుతీగెవంటిది పొలుపైన ఈకె తీరు
వావిరి బైడి సలాక వంటిది రేక
సోవ చిగురువంటిది చూచితేను నిలువెల్లా
వేవేగ చూడవయ్యా యీ విలాసము ॥కొమ్మకు॥





వన్నెల నాణిముత్తెము వంటిది తనపోలిక
వెన్నెల సోగ వంటిది వింతభావము
యిన్నిటా శ్రీవేంకటేశ యింతినిట్టే కూడితివి
వున్నతి మెచ్చవయ్యా యీ వొయ్యారము ॥కొమ్మకు॥

**భావామృతం :**

ఓ శ్రీనివాసా! ఈ కొమ్మకు (యువతికి) నీవు ఇట్టే పెండ్లికొడుకై వచ్చితివి. ఇమ్ముల (ఇంతయెక్కువగా) సిగ్గువడక (బిడియపడకుండా) యీ అలమేల్మంగను యేలుకోవయ్యా (స్వీకరించవయ్యా!)

ఓ ప్రభూ! ఈ పొలతి (తరుణి) చక్కదనము పుత్తడి వంటిది (బంగారము వంటిది). ఈమె రూపము గొప్ప చిత్రకారుడు వేసిన చిత్తరువు వంటిది. కోమలమైన ఈమె దేహము క్రొంగొత్త మెఱుపుతో మెఱయుచున్నది. ఈమెయొక్క సింగారములను చిత్తగించవయ్యా (తలచవయ్యా!)

ఈమె తీరు పొలువైనది (విధానము ఒప్పు అయినది). అది కోమలమైన పూవుతీగెవంటిది. ఈమె రేక (తిన్నదనము), వావిరి పైడి సలాకవంటిది (అంటే.. ఉత్కృష్టమైన బంగారు కమ్మీ వంటిది). ఈమెను నిలువెల్లా గమనించితే లేతచిగురువంటి మృదువైన కోమలి. ఓ దేవదేవా! జాగుచేయక వేవేగ (అతిశీఘ్రముగా) ఈమె విలాసములను గమనించవయ్యా!

ఓ జగన్నాథా! ఈమె పోలిక, దీప్తించెడి ఆణిముత్యము (గుండ్రటి చక్కటి ముత్యము) వలెనున్నది. ఈమె భావము, వెన్నెలసోగ (దీర్ఘమైన వెన్నెల) వంటిది. ఇన్ని విధములైన విశిష్ఠతలున్న ఈ జవ్వనిని నీవు ఇట్టే (సునాయాసంగా) కూడితివి (పొందితివి). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె వొయ్యారము (సౌకుమార్యమును) నీవు ఉన్నతముగా మెచ్చుకోవయ్యా! ఈమెననుగ్రహింపుమయ్యా!

**6-43**

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన తక్కిన దశావతార కీర్తనలవలె ఇదికూడా నర్మగర్భంగా, కాస్త తికమకపెట్టేదిగానే వుంటుంది. అసలు పల్లవి కూడా అర్థం కావాలంటే కష్టపడాల్సిందే. "ఏమీననకురే యెప్పుడు మీరు" అని అంటున్నారు. ఇంతవరకూ తెలికే... "గామిడి యై కాలిసన్న గదలీని బిడ్డడు"... అంటే యేమిటి? నేను ఇలా భావించాను... "ఓ అమ్మలారా! గామిడియై (శ్రేష్ఠుడై) ఈ బిడ్డడు (శిశువు) కాలిసన్న (కాలు తన గుర్తుగా) కదలుచున్నాడు. ఈ శిశువు తన కాలి బొటనవ్రేలు నోటిలో యుంచుకొని దానిని చీకుతూ జగద్విఖ్యాతుడైనాడు. వీడే పరబ్రహ్మ."

**కం॥ "అనకురె యేమీ మీరలు**
**వినుతించెడి 'కాలిసన్న బిడ్డడు' కదటే!!"**
**పనిగొని పాడెను అన్నయ**
**మన "వేంకడె" దశవిధముల మాధవుడనెరా.**

**రాగం : భైరవి**

ఏ మీన నకురే యెప్పుడు మీరు
గామిడియై కావిసన్న గదలీని బిడ్డడు ॥ఏమీ॥

పొలసీ ననకురే పొదిగి యిందరు గూడి
వులికి తలదీసుక వున్న బాలుని
పలుక దనకురే బలుమోరతోపు గోపి
తలకి సిబ్బితిగొని త(నీద) లరమ్మ బిడ్డడు ॥ఏమీ॥

అడిగీ ననకురే ఆస దీరదనకురే
కడగి చలమరియై గాసిబెట్టీని
జడలున్న వనకురే జననుతడీ శిశువు
కడు దూరీ గిరులకు గమనించి బిడ్డడు ॥ఏమీ॥





బిత్తలున్నాడనుకురే పృథివిలో బిన్నవాడు
మత్తులైవున్నవారి మడియించీని
చిత్తిణి వాడనకురే శ్రీవేంకటేశుడు
యెత్తుక యీరేడు లోకాలేలీని ॥ఏమీ॥

**భావామృతం :**

ఓ అమ్మలారా! మీరీ శిశువును యేమీ అనకురే (అనవద్దు). ఎప్పుడూ అనవద్దు. ఎందుకంటే వీడు "గామిడియై కాలిసన్న గదలీని బిడ్డడు" (శ్రేష్ఠుడై ఈ శిశువు తన "కాలు" జగద్విఖ్యాతమైన "గుర్తు" గా కలిగియున్నాడు. తనకాలి బొటనవ్రేలును నోటిలో వుంచుకొని చీకుతూ మఱ్ఱిఆకుపై పవళించి నీరధిలో తేలిన శ్రీరంగ శిశువు ఈతడే సుమా!)

పొలసీననకురే పొదిగి యిందరునుగూడి ఇంతమంది ఒక్కటై వీడు పొలుసులున్నవాడు అని అనకండే (మత్స్యావతారము). వులికీతలదీసుకవున్న బాలుని - భయముతో తనతల హఠాత్తుగా తనలోనికి తీసికొన్న బాలుడు (తాబేలు ఆవిధంగా చేస్తుంది. అనగా కూర్మావతారుడు). పలుకదనకురే బలుమోరతోపుగోపి - వీడు మాటలాడడు అనకండే... పెద్దమూతివున్న కోపిష్ఠియైనవాడు (వరాహతారము). తలకి సిబ్బితి గొని త(నీద)లరమ్మ బిడ్డడు. భయంకరమైన తన ఆకృతికి సిగ్గుపడి ఈ బిడ్డడు తనీదలరమ్మా! (అతిశయించినవాడమ్మా! అనగా నరసింహ స్వరూపుడు).

తరువాయి నాలుగు అవతారములు ఇలా వర్ణించబడ్డాయి. అడిగీననకురే ఆస దీరదనకురే - యాచించాడనవద్దమ్మా! వీడి ఆశకు అంతులేదని అనకండే (త్రిజగముల నాక్రమించిన వామనుడు). కడగి చలమరియై గాసిబెట్టీని - మత్సరము కలిగినవాడై బాధపెట్టినాడు (పరశురాముడు). జడలున్నవనకురే జననుతుడీ శిశువు - వీడు జడలు ధరించినవాడనవద్దు జనులచే కీర్తించబడినట్టి శిశువు (శ్రీరామచంద్రుడు). కడు దూరీ గిరులకు గమనించి బిడ్డడు - గోపికల రాకను గమనించి గోవర్ధన గిరులలో దాగి వారికై కాపుకాశాడీ బిడ్డడు (శ్రీకృష్ణుడు).

తరువాయి రెండు అవతారాలు ఇలా వర్ణించబడ్డాయి. బిత్తలున్నాడనకురే పృథివిలోన్ పిన్నవాడు - వీడు దిగంబరి అని నవ్వకండమ్మా! పృథ్విలో అవతరించినవారిలో పిల్లవాడీతడే (బుద్ధభగవానుడు). మత్తులైవున్న వారి మడియించీని మదించిన దుర్మార్గులను రూపుమాపేవాడు (కల్కి అవతారము). చిత్తిణి వాడనకురే శ్రీవేంకటేశుడు యెత్తుక యీరేడు లోకాలనేలీని - మొండివాడనకండమ్మా! వీడు శ్రీవేంకటేశ్వరుడు. ఉన్నతుడైన ఈ రాజు సమస్తలోకములను పరిపాలించును.

## మున్నుడి

"పుండరీకాక్షుడైన పురుషోత్తమునితో స్వామీ! ఇక నీ కోపతాపాలు చెల్లవయ్యా! ఎందుకంటే నిన్ను చూచి ఇందిరాదేవి నలి (యోగ్యముగా) నవ్వినదయ్యా!" అంటున్నారు అన్నమాచార్యులవారు. ఆ జలధికన్య(సాగరపుత్రిక) నిన్ను తన స్వయంవరమునకు పిలిచి పెనవేసుకుపోయిందట. ఆనాటినుంచి క్షణమైనా స్వామిని వీడక ఆయన వురమునెక్కి (ఆయన హృదయాన్ని అధిష్టించి లోకాలను పరిపాలిస్తోందట. భళా!

**తరలము॥**

**అలుకలెల్లను చెల్లవో హరి అచ్యుతా! నళినీధవా!**
**లలన ఇందిర నవ్వెనో మధురంబుగా నిను జూచుచున్**
**జలధికన్యక పిల్చె నిన్నిటు చక్కగా పెనవైచెరా**
**యెలమి వేంకటరాయ! నీవురమెక్కెరాయనె అన్నయున్.**

**రాగం : మోహన**

అలుకలు చెల్లవు హరిపురుషోత్తమ
నలి నిందిర నీతో నవ్వినది ॥అలుకలు॥

ఆదిలక్ష్మి మోహన కమలంబున
వేదమాత నిను వేసినది
ఆదెస నీపై నభయహస్తమును
సాదరమున గడు చాచినది ॥అలుకలు॥

సిరి తనకన్నుల చింతామణులను
పొరి నీపై దిగబోసినది
వరద హస్తమున వలచెయి వట్టుక
అరుదుగ నినుమాటాడించి ॥అలుకలు॥





జలధికన్య తన సర్వాంగంబుల
పిలిచి నిన్ను నిటు పెనగినది
అలముక శ్రీ వెంకటాధిప నిను రతి-
నెలమి నీ వురంబెక్కినది ॥అలుకలు॥

**భావామృతం :**

పురుషోత్తముడవైన ఓ శ్రీహరీ! ఇకపై నీ అలుకలు (కోపములు) చెల్లవయ్యా! ఎందుకంటే ఇందిరాదేవి (శ్రీలక్ష్మి) నిన్ను చూచినది నవ్వినది (యోగ్యముగా నవ్వినది). నిన్ను తన స్వంతం చేసికొనినది.

వేదమాత (వేదములు కీర్తించెడి జనని) యైన ఆదిలక్ష్మి మోహన కమలంబున జనించి నిన్ను వేసినది (వరించినది). అందుచేత తన అభయహస్తమును ఆ దెస (నీవు ఎక్కడ వుంటే అక్కడ) చాచి మిక్కిలి సానుకూలయై అనుగ్రహించుచున్నది.

సిరి (సిరులను ప్రసాదించు ఆ తల్లి) తన కన్నులను నీపై దిగబోసినది (పైనుంచి క్రిందకు చూపులను విస్తరింపజేసినది). ఆ కన్నులు చింతామణులు (కోరిన కోర్కెలను దీర్చు దివ్యమణులు). ఆ శ్రీదేవి అరుదగు (అపూర్వమైన) తన వరదహస్తముతో నీ పాణీగ్రహము చేసి నీతో మధురముగా మాట్లాడినది.

జలధికన్య (సాగరపుత్రిక) యైన ఆ శ్రీమహాలక్ష్మి నిన్ను ఆహ్వానించి, నిన్ను తన సర్వాంగములు తాకునట్లు పెనవేసి కొనినది. ఆ దేవికి నీవనిన అంతఃప్రీతి. ఓ శ్రీవేంకటేశ్వరా! అలముక (పైకొని) నిన్ను, యెలమి (సంతోషముతో) నీ వురంబెక్కినది (నీ హృదయ పీఠమునధిష్టించినది). ఇక ఆ తల్లికి అడ్డేముంది స్వామీ!

## 6-45

## మున్నుడి

కోపావేశాలతో ఊగిపోతూ తనశత్రువులను నిందించే అన్నమాచార్యులవారవీ ప్రత్యక్షమవుతున్నారీ కీర్తనలో. తన ఇష్టదేవతలైన నరసింహుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మరియు శ్రీవేంకటేశ్వరునకు తన నమోవాకములను తెలుపుతూ వారిని యేమి ప్రార్థిస్తున్నారో వినండి. తన శత్రువులను సరగున (వేగంగా) సంహరించవే అని వేడుకొంటున్నారు. నిన్ను తిట్టినాడని నీ బావ 'శిశుపాలుని' చంపావు అనాడు. నీ దాసుని అవమానపరిచాడని 'కాశ్యపుని' సంహరించావు. అబద్ధాలాడి గుడ్లగూబ ఇల్లు కాజేసిన గద్దను చంపావు. మరినేడు నాశత్రువులనెందుకు చంపవు అంటున్నారు.

**కం॥ నరసింహా! రామకృష్ణా!**
**తిరువేంకటగిరి నివాస! దేవేశ! నమో**
**సరగున శత్రుల జంపుము**
**అరిపీడితు దన్నమయ్య ఆర్తితొ వేడెన్.**

**రాగం : అఠాణా**

నరసింహ రామకృష్ణ నమో శ్రీవేంకటేశ
సరగు నా శత్రుల సంహరించవే ॥నరసింహ॥

బావ తిట్లకు శిశుపాలుని జంపిన-
యేవ కోపకాడవు నేడెందు వోతివి
నీవాడనని నన్ను నిందించే శత్రువును
చావగొట్టి వానినిట్టే సంహరించవే. ॥నరసింహ॥

దాసుని భంగించేటి తరి కాస్యపు జంపిన
ఈసు కోపగాడ విపుడెందు వోతివి
మేసుల నీ లాంఛనాలు మించి నన్ను దూషించే
సాసించి శత్రువును సంహరించవే ॥నరసింహ॥





కల్లలాడి గూబ యిల్లుగైకొను గద్ద జంపిన
యెల్లగాగ గోపకాడ వెందువోతివి
యిల్లిదె శ్రీవేంకటేశ యీ నీమీది పాటలు
జల్లన దూషించు శత్రు సంహరింపవే ॥నరసింహ॥

**భావామృతం :**

ఓ నరసింహా! శ్రీరామా! శ్రీకృష్ణా! శ్రీవేంకటేశ్వరా! నీకు నమోవాకములు. సరగు (వేగముగా) నీవు నాశత్రువులను సంహరించవయ్యా!

ఆ నాడు నీ బావ (నీమేనత్త కొడుకు) అయిన శిశుపాలుడు నీ ద్వేషముతో తిట్టుతుంటే నూరు తిట్లవరకు క్షమించినా నూరుతిట్లు దాటి నీ భక్తుడైన భీష్ముని కూడ తిట్టగానే "యేవ"తో (రోతపుట్టి), వాని శిరస్సును నీ చక్రముతో ఖండించిన కోపిష్ఠివి. నేడు యెక్కడికి పోయావయ్యా! నీ దాసుడనని నన్ను నానా విధములుగ నిందించుచున్న నా శత్రువును (అజ్ఞానం అనే శత్రువు) చావగొట్టి చెవులు మూయవయ్యా! నా శత్రువును సంహరించవయా!

ఆనాడు కశ్యపమహర్షి కొడుకు (హిరణ్యకశిపుడు) నీ దాసుడైన ప్రహ్లాదుని భంగపరుస్తుంటే (అవమానిస్తుంటే), కోపము తట్టుకోలేని ఈసుకాడవై (కోపగాడవై) నాడు ఆయనను సంహరించినావు. అటువంటి నీవు నేడు యేమయ్యావయ్యా? మేసులన్ (?) ఈ లాంఛనాలు (పటాటోపములు) మించి (అధికముగా) నన్ను దూషించి (నన్ను బాధిస్తుంటే) చూస్తూ వూరుకుంటావేమయా? వాటిని కట్టడి చేసి దర్పము అనే ఆ నా శత్రువును తుదముట్టించవేమయ్యా?

పూర్వం ఒక గద్ద నీ భక్తురాలైన ఒక గుడ్లగూబను, దాని ఇంట్లోంచి తరిమివేసి ఆ ఇంటిని స్వాధీనం చేసికొని గుడ్లగూబను దిక్కులేని దాన్ని చేసింది. కోపంతో నీవు దానిని సంహరించావు. అట్లా దుర్మార్గులను పూర్తిగా దోచుకుంటావు. అటువంటి నీవు నేడు యెక్కడికి బోతివయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! యిల్లిదే (ఇదిగో) నేను నీమీద భక్తితో కీర్తనలు పాడుతుంటే... వీటిని జల్లు (ఉమ్మివంటి వ్యర్థమైనది) అని దూషించు వారిని చంపి అవతల పారవేయవేమయా!

## 6-46

### మున్నుడి

వేదనుతుడైన అహోబల నారసింహుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆ స్వామి వేడుకలు దైవారగ తన దాసులను ఆదరిస్తున్నాడట. అంటే వేడుకలు అతిశయించగా తన భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ కీర్తనలో ఆ స్వామి అంగాంగ వర్ణన చేస్తున్నారు. ఎంత అద్భుతమైన వర్ణనో వినండి. ఆయన గోళ్లు చిలుక గోళ్లలాగ అర్ధచంద్రాకారంలో వంగి వున్నాయట. నేనెన్నడూ ఇంత చక్కటి వర్ణన వినలేదు.

**ఉ॥ వేదములెల్ల బూని నిను పెన్నిధి వోలె నుతించె, వేడుకల్**
**పాదుగ హెచ్చెనయ్య! నిను పాడితిమో నరసింహ! మమ్ము నీ**
**వాదర మొప్ప దాసులకు ఆర్తిని దీర్చెద వన్నమయ్యనెన్**
**మేదిని వేంకటేశ్వరుని వేఱొక రూపము యీ నృసింహుడే.**

**రాగం : మోహన**

వేదములు నుతించగ వేడుకలు దైవారగ
ఆదరించీ దాసులమోహన నారసింహుడు ॥వేదములు॥

నెఱుల జడలతోడ నిక్కు కర్ణములతోడ
కుఱచ కొమ్ములతోడ కోఱలతోడ
వుఱక సిరి దొడపైనుంచుక సింహాసనాన
మెఱసీ ప్రతాపములు మేటి నారసింహుడు ॥వేదములు॥

నిడుప మీసాల తోడ నిట్టూరుపుల తోడి
మిడి గుడ్లతో తెల్లని మేని తోడ
ఒడల సొమ్ముల వెట్టి ఒడ్డోలగమై వుండి
కడు మంచి వరాలిచ్చీ ఘన నారసింహుడు ॥వేదములు॥





చిలుకు గోళ్లతోడ సెలవి నవ్వులతోడ
బలు జిహ్వతోడ యోగపట్టెముతోడ
అలరి శ్రీవేంకటాద్రి అహోబలగిరిని
అల ప్రహ్లాదుని గాచె ఆది నారసింహుడు ॥వేదములు॥

**భావామృతం :**

అహోబలమున వెలసిన ఈ మోహన నారసింహుడు చతుర్వేదములూ తనను చక్కగా కీర్తిస్తుంటే తనదాసులను ఆదరిస్తున్నాడు. ఈ స్వామికి వేడుకలు దైవారుచున్నవి (అతిశయించుచున్నవి).

ఈయనకు నెఱుల జడలున్నవి (ఉంగరాలు తిరిగిన జడలున్నవి). ఈయనకు నిక్కిన చెవులు కొట్టవచ్చినట్లు కనబడుచున్నవి. ఈయనకు కుఱచ కొమ్ములున్నవి (పొట్టి కొమ్ములవలె పొడుచుకొని వచ్చిన నుదుటి యెముకలున్నవి). పదునైన కోఱలున్నవి. ఈయన సిరిని (లక్ష్మీదేవిని) తన తొడపై కూర్చొనబెట్టుకొని, ఉఱక (ఔచిత్యముతో) యున్నాడు. సింహాసనముపై మెఱసి పోతున్న ప్రతాపముతో వైభవోపేతముగానున్న మేటి నరసింహుడు ఈ స్వామి.

ఈయనకు నిడుపైన (పొడవైన) మీసాలున్నాయి. తీవ్రంగా నిట్టూరుస్తున్నాడు (దీర్ఘమైన ఉచ్ఛ్వాసనిశ్వాసలు గలవాడు). ఈయనకు మిడిగుడ్లు వున్నాయి. ఒంటి రంగు తెల్లగా వున్నది. ఒంటినిండా నగలు ధరించియున్నాడు. ఈయన ఒడ్డోగమై వున్నాడు. (విశాలమైన దేహముతో వున్నాడు). ఘనుడైన ఈ నరసింహుడు చాలా మంచి వరముల ననుగ్రహించుచున్నాడు.

ఈయన కొనదేరిన గోళ్లు చిలుకు గోళ్లు (బాణములవలె) నున్నవి. ఈయన నవ్వుతుంటే సెలవి (చొల్లు) కారుతున్నది. ఈయన జిహ్వ(నాలుక) పొడవుగా బలంగా వున్నది. ఈయన యోగపట్టెము (యోగులు ధరించు జంధ్యము వంటి పట్టుగుడ్డ పట్టీ), ధరించియున్నాడు. ఈ అహోబలం కొండపైనే గాక శ్రీవేంకటాద్రిమీద కూడా వెలసియున్నదీయనే. ఈయనే ఆ నాడు ప్రహ్లాదుని రక్షించిన ఆది నారసింహుడు.

## మున్నుడి 6-47

చిన్నప్పుడెప్పుడో “దీని భావమేమి తిరుమలేశ!” అనే చిక్కు ప్రశ్నల ప్రహేళిక యెక్కడో చదివినట్లు గుర్తు. అన్నమాచార్యులవారి ఈ కీర్తన అటువంటిదే. ఆయన స్ఫూర్తితో యెంత చక్కటి సీసపద్యం ఆవిర్భవించిందో చూడండి. ఈ ప్రహేళిక (Quiz) లో వున్న వారంతా హరిని పొందిన వారే, కాకపోతే తలా ఒకదారి... ఏదారైనా ‘హరిదారే’...

**సీ॥ నిను సదా స్మరియించె నీ దాసుడొక్కండు**
**గంట చెవుల కద్దు గట్టెనొకడు**
**నినువేడి భోగియై నెరవేరె నొక్కండు**
**నిను దిట్టి యొక్కండు నిన్ను పొందె**
**మతి చింతవిడి, భాగవతుడయ్యె నొక్కండు**
**నారాయణాయని యెరుగ డొకడు**
**నీ పనులొనరించి నీవాడొకండయ్యె**
**చాకిరీ చేయించె సఖుడొకండు**

**ఆ.వె॥ కౌగిలిచ్చి రతుల ఘనులైరి కొందరు**
**వెంటతిప్పుకొనెను పేర్మికొన్ని**
**హరికి యెవ్వరైన నన్నయ్య సములనె**
**వీరలెవరు తెలుపు వేంకటేశ!**

**రాగం : మంగళకౌశిక**

ఇందరు నీకొక్క సరి–యెక్కువ తక్కువ లేదు
చెంది నీ సుద్దులు యేమి – చిత్రమో కాని ॥ఇందరు॥

నీ నామముచ్చరించి – నెరవేరె నొక్క మౌని
నీ నావము వినక– నెరవేరె నొక్కడు
పూని నిన్ను నుతియించి – భోగియాయె నొక్కండు
మోనమున నిన్నుదిట్టి – మోక్షమందె నొకడు ॥ఇందరు॥





మతిలో నిన్ను దలంచి – మహిమందె నొక యోగి
తతినిన్ను దలచకే – తగిలె నిన్నొకడు
అతిభక్తి బనిసేసి – యధికుడాయె నొకడు
సతతము బనిగొని – సఖుడాయెనొకడు ॥ఇందరు॥

కౌగిటి సుఖములిచ్చి – కలిసిరి గొందరు
ఆగి నిన్ను వెంటదిప్పి – ఆవులు మేలందెను
దాగక శ్రీవేంకటేశ – దగ్గరైన దవ్వయిన
మాగి నిన్ను దలపోసె – మనసే గుఋతు ॥ఇందరు॥

**భావామృతం :**

ఓ దేవదేవా! ఇందరు నీకొక్కసరి (ఇంతమంది కూడా నీకు సమానమే). ఒకరు యెక్కువ ఒకరు తక్కువ అను బేధ భావము నీకు లేనేలేదు. ఈ నీ కథలు యెంత చిత్రంగా వుంటాయయ్యా!

(అందరూ నిన్ను పొందినవారే... కానీ అందరిదీ ఒకేదారి కాదు. ఎవరి దారి వారిదే) ఎప్పుడూ నీనామస్మరణచేస్తూ అగ్రగణ్యుడైనాడొక్కడు. (నారదుడు). ఒకడేమో నీపేరు కూడా వినపడకూడదని చెవులకు ఘంటలు కట్టుకొని తిరిగాడు (ఘంటా–కర్ణుడు). నీ దాసుడయి యెంత దరిద్రపీడితుడైనా చివరికి భోగాలనుభవించాడు ఇంకొకడు (కుచేలుడు). మోనమున (చెడ్డ కోపముతో) నిన్ను తిట్టీ తిట్టీ నీ చేతిలో మోక్షం పొందినాడు ఇంకొకడు (శిశుపాలుడు).

సర్వావస్థలయందు నిన్నే తలంచి (ధ్యానించి) తక్కిన ఆలోచనలను విడనాడి ఒకడు మహోన్నతుడైనాడు పరమ భాగవతోత్తముడైనాడు (శుకమహర్షి). ఇంకొకడు తతి (భోగ లాలసుడై) నారాయణా అని నీ నామము కూడ తలవక అంత్యకాలంలో తన కొడుకు కోసం అలమటిస్తూ వాడిపేరు నారాయణా అని పలికి విష్ణులోకం పొందాడు (అజామీళుడు). భక్తితో నీ ఆజ్ఞ పాలించి నీ పనులన్నీ చేసిపెట్టి ఇంకొకడు నీవాడయ్యాడు (ఉద్ధవుడు). ఎప్పుడూ నీచేత వూడిగము చేయించుకొని నీ సఖుడై నిన్ను పొందాడొకడు (అర్జునుడు).

ఓ పరాత్పరా! కొందరు నీ కౌగిలిలో సంభోగ సుఖమిచ్చి ఘనతకెక్కేశారు. (గోపికలు). సరే, వారంతా యుక్తాయుక్త జ్ఞానం వున్నవారు. ఆ జ్ఞానం కూడా లేని కొన్ని నిన్ను తమవెంట తిప్పుకొని మేలు పొందాయి (రేపల్లెలోని ఆవులమందలు). దాగక (మాయా మర్మంలేని) శ్రీవేంకటేశ్వరా! నీ సన్నిధిలో వున్నా వుండకపోయినా మాగి (పరితపించి) నిన్ను ధ్యానించే మనస్సే గుఋతు(ఉత్కృష్టమైనది).

**6-48**

## ముస్నుడి

అన్నమాచార్యులవారి ఈ కీర్తన తేలిక అని భ్రమింపజేసే బహుజటిలమైన కీర్తన. అసలు వుండాల్సిన మెలిక అంతా పల్లవిలోనే ఉన్నది. అన్నమయ్య భాషా పటిమ నేమని వర్ణించను? సంకుచేతి నన్ను నీవు జట్టి గొంటి చాలదా? అంటే... యేనుగు గాచిన వాడ యేనుగాదటే? అంటే.. చీకటి నల్లనిమేని చెలువుడను, అంటే... వేకపు బిరుదు మీద వేయకు చేయి, అంటే... ఇలా అన్నీ సందేహాలే...

**మ॥ “గురుతౌ కొండల గుబ్బలందు తరుణుల్ కోరాదిబోయేరటే**
**విరివై ఆవులగాచినాడ గిరులన్ వెన్నుండ నేగానటే?**
**అరయన్ చేతిని కంబుకంఠి! వినవే అందాల శంకున్నదే**
**కరినే గాచితి తొల్లి, మాధవుడ నేగానా?” యనెన్ అన్నయున్.**

***కోరాదిబోవుట=చెడతిరుగుట**

**రాగం : ముఖారి**

కొండల గుబ్బల నాలో గోరాది గొనేవు
కొండల నావుల గాచిన కోడెకాడగాన ॥కొండల॥

వంకల కురులదాన వద్దు నే నీకు మూడు
వంకల వెంట తిరిగేవాడగాన
సంకు మెడదాన నీతో సరివచ్చేనా
సంకు చేతి నన్ను నీవు జట్టి గొంటి చాలదా ॥కొండల॥

యేనుగు నడపుదాన నేలనే నీకు తొల్లి
యేనుగు గాచిన వాడ యేనుగాన
మీను కవగంటిదాన మెచ్చేవా నన్ను మేటి
మీననై జలధిలో మెరసినవాడను ॥కొండల॥





చీకటి తురుముదాన చేరకు నన్ను
చీకటి నల్లని మేని చెలువుడను
వేకపు బిరుదు మీద వేయకు చేయి
వేకమైన భూమిమోచే వేంకటవిభుడను ॥కొండల॥

**భావామృతం :**

ఓ భామినీ! నీవు కొండల, గుబ్బల (గుట్టల) లో నాతోన్ “కోరాది గొనేవు” (దుమ్ము రేగేటు చెడ తిరుగుతున్నావు)... అది నీకు అంత తేలికగా కుదిరేపనియేనా? ఆడువారు సుకుమారులు నీలాంటి వారివల్ల ఈ కొండలలో తిరుగుట కాదు. అయితే నేనూ సామాన్యుడను కాను. కొండలలో ఆవులను కాచిన కోడెవయసు చిన్నవాడను అంటే కృష్ణమూర్తిని.

ఉంగరాల జుట్టు వున్న ఓ తరుణీ! నేను మూడు వంకల వెంట తిరిగే వాడనే (ముల్లోకములలో తిరుగుతుండే జగన్నాథుడనే), నన్ను తక్కువగా అనుకోవద్దు. సంకు మెడదాన! (శంఖమువంటి మెడ గలిగిన సుందరీ!) నేను నీకు సరితూగుతాను యెందుకంటే... శంఖము చేతిలోగల నన్ను నీవు “జట్టిగొంటి చాలదా” (స్వాధీనం చేసికొన్నావు అది చాలదా?)

‘కరిగమన’లని స్త్రీల నడకను మదగజపు నడకతో పోల్చెదరు. అటువంటి ఏనుగు నడక గలదానా! పూర్వం భూలోకంలో గజేంద్రుని రక్షించిన వాడను నేను కాదటే. మీనుకవగంటిదానా! (చేపల జంట వంటి కన్నులు గలదానా!) నన్ను మెచ్చుకొంటావా, యెందుకంటే నేను సముద్రంలో పెద్ద మత్స్యమునై శోభిల్లితిని కదటే.

చీకటి తురుము దానా! (చీకటి వలె నల్లగా వున్న సిగ కొప్పు కల చిన్నదానా!) నా దగ్గరకు రాకు (వస్తే... తట్టుకోలేను). యెందుకంటే నల్లని చీకటి వంటి శరీరంగల నీ సఖుడను నేనే సుమా! ఓ సుందరీ! నా వేకపు బిరుదు మీద (నా ఎత్తైన పిరుదులమీద) నీవు చేయి వేయవద్దు. ఎందుకంటే నేను వేకమై (విశాలమైన) భూమిని మోసినవాడను. (ఆది వరాహముగా ఆయన చేసిన పని అదే కదా!) (మున్నుడిలోని సందేహాలు తీరినవా?)

(గమనిక : వేకపు బిరుదు మీద వేయకు చేయి... అనే పదంలో బిరుదు అంటే శౌర్యము కాదు, పిరుదు అని నా ఊహ...)

**6-49**

## మున్నుడి

తన తండ్రి అన్నమాచార్యులవారి అడుగు జాడలలో నడచి, ఏడుకొండలవాడి దయను పొందిన ధన్యజీవి పెద తిరుమలాచార్యులవారు. శ్రీవేంకటేశ్వరునిపై మనకు ప్రేమ కలుగవలెనంటే ఆ స్వామికి మనపై దయకలుగవలసిందే. లేకపోతే... ఎన్నిసార్లు తిరుమల దర్శించినా "తిరుమలయ్య" కనబడదు స్వామి విగ్రహమే కనబడుతుంది. శ్రీహరి దర్శనము, అనుభవము, కలుగవలెనంటే స్వామి శరణ్యముతో కైంకర్యము చేసికొని సర్వమూ ఆయనే అని భావించాలి. అదే పట్టినవారల భాగ్యము. ఈ రహస్యం తెలిసితే (తెలియుటకు) గుర్తులివి... అని చెబుతున్నారు.

**కం॥ పట్టిన వారల భాగ్యము**
**యిట్టిదె యని కీర్తనంబు నింపుగ పాడెన్**
**దిట్టగు పెద తిరుమల కవి**
**గుట్టది తెలిసినను యివియె గురుతులు యనియెన్.**

**రాగం : మలహరి**

పట్టిన వారల భాగ్యమిదే
గుట్టు తెలిసితే గురుతులివి ॥పట్టిన॥

కామధేనువును కల్పవృక్షమును
దామోదర నీ దర్శనము
భూమీశత్వము భువనేశత్వము
సామజవరద నీ శరణ్యము ॥పట్టిన॥

పరుసవేదియును పరమైశ్వర్యము
హరినిను గొలిచే అనుభవము
నిరత భోగములు విధి విధానములు
గరిమ మెరయు మీ కైంకర్యములు ॥పట్టిన॥





నిందు భోగములు నిత్య శోభనము
కొండలయ్య నీ గుణకథలు
అండనె శ్రీవేంకటాధిప సర్వము
మెండు కొన్నదిదె మీ కరుణ ॥పట్టిన॥

**భావామృతం :**

ఇదె (ఈ శ్రీవేంకటేశ్వరుని సేవ) పట్టిన వారల భాగ్యము (ఎవరైతే చేబడతారో వారికి అదే మహద్భాగ్యము). ఈ గుట్టు తెలిసితే (తెలియుటకు) గుర్తులు ఇదిగో ఈ చెప్పబోవునవే.

ఓ దామోదరా! నీ దర్శనమున్నదే... అది కామధేనువు, కల్పవృక్షము తమ స్వంతమైనంత భాగ్యప్రదము. కామధేనువు కోరుకున్న దేనినైనా అనుగ్రహిస్తుంది. కల్పవృక్షము అనంతమైన సిరిసంపదలనిస్తుంది. ఈ రెండూ క్షీరసాగరమథనంలో పుట్టాయి. దేవలోకంలో ఉంటాయి. ఓ సామజవరదా! (గజేంద్రుని రక్షించిన శ్రీహరీ! నీ శరణాగతి సార్వభౌమత్వము కంటే సర్వలోకాధిపత్యము కంటే, మేలైనది. ఎందుకంటే నీ శరణాగతి యెప్పుడూ తోడు నీడై కాపాడుతుంది. తక్కిన రెండూ ఇవ్వాళ ఉంటాయి, రేపు పోతాయి. "కారే రాజులు రాజ్యముల్ గలుగవే" అని ఏనాడో పెద్దలు చెప్పారు కదా!

పరుసవేది అనే దానితో ఏ వస్తువును తాకినా అది స్వర్ణము అయిపోతుంది. పరమైశ్వర్యము అంటే గొప్ప ఐశ్వర్యమును ప్రసాదించునది. ఈ రెండూ ఉన్నవాడు ఎంత శ్రీమంతుడో వేరే చెప్పాలా? కాని ఓ శ్రీహరీ! నిన్ను కొలిచిన వారికి కలిగే నీ అనుభవము ముందు అవి ఏపాటి సంపదలయ్యా? నిరత భోగములు (మిక్కిలి ఆసక్తితో నీకు చేయు భోగములు) సేవా విధి విధానములు, మేము నీకు చేయు కైంకర్యములే కదా!

ఓ ఏడుకొండలవాడా! నీ భాగవత గాథలు, నీ గుణగణ, సంకీర్తన మాకు సమస్త భోగములను నిత్య వైభవములను సమకూర్చును. ఓ శ్రీవేంకటేశ్వరా! మీ కరుణ, అండదండలూ వున్నవారికి సర్వమూ మెండుకొన్నది (అతిశయించును). ఇది తథ్యము తండ్రీ!

6-50

## మున్నుడి

శ్రీ మహావిష్ణువు సేనాధిపతియైన విష్వక్సేనుడిపై అద్భుతమైన కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఇదిగో అచ్యుతుని సేనాపతి వస్తున్నాడు. ఓ అసురులారా! పారరో (పారిపోండ్రా) పది దిక్కులకు - అని హెచ్చరిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల సమయంలో అన్నమయ్య చెప్పిన అజరామరమైన కీర్తన ఇది. ఆనాటి తిరుమలేశుని వైభవాన్ని కళ్లకు కట్టుతున్నది. అవునా?

**కం॥ కనుడీ హరి సేనాపతి**
**మన విష్వక్సేనుడంట మాధవు వెంటన్**
**గునగున పారరొ అసురులు**
**ఘనుడా అన్నయ్యపాడె కడు వేడుకతో.**

**రాగం : మోహన**

అదెవచ్చె నిదెవచ్చె నచ్యుతు సేనాపతి
పది దిక్కులకు నిట్టె పారరో యసురులు ॥అదె॥

గరుడధ్వజం బదె ఘన శంఖరవమదె
సరుసనే విష్ణుదేవు చక్రమదె
మురవైరి పంపులవె ముందరి సేనలవె
పరచి గగ్గోల కాడై పారరో దానవులు ॥అదె॥

తెల్లని గొడుగులవె దేవదుందుభులు నవె
యెల్ల దేవతల రథా లింతటా నవె
కెల్లు రేగి నిక్కి హరి కీర్తి భుజములవె
పల్లపు పాతాళాన బడరో దనుజులు ॥అదె॥





వెండిపైడి గుదెలవె వెంజామరములవె
మెండగు కైవారాలు మించినవవె
దండి శ్రీవేంకటపతి దాడి ముట్టినదె యిదె
బందు బందై జజ్జరించిపారరోదైతేయులు ॥అదె॥

**భావామృతం :**

ఓ రాక్షసులారా! అదిగో వచ్చేస్తున్నాడు. ఇదిగో వచ్చేస్తున్నాడు. అచ్యుతుని సేనాధిపతియైన విష్వక్సేనుడు, అతడే. పది దిక్కులలో యెక్కడికి పారిపోతారో, ఇట్టే పారిపోండ్రా.

అదిగో చూశారా శ్రీహరి యొక్క గరుడధ్వజము. మీకు ఘనమైన పాంచజన్యమను శంఖము చేసే శంఖారావం వినబడుచున్నదా? అదిగో సరుసనే (ఆ ప్రక్కనే) విష్ణు దేవుని సుదర్శన చక్రము ఎలా మిఱుమిట్లు గొల్పుచున్నదో చూడండి. మురవైరి అయిన శ్రీకాంతుని పంపులు (పురమాయింపులు) అవిగో. రక్షణగా ముందున నడచి వస్తున్న దేవతల సేన అదిగో. ఓ దానవులారా! మీరంతా గగ్గోలు పెట్టి పారిపోండి. మీ ప్రాణాలు కాపాడుకోండి.

అదిగో ఆ కనబడుతున్న తెల్లని గొడుగులు నారాయణుని రాకను సూచిస్తున్నాయి. ధమధమా మ్రోగుతున్న దేవదుందుభుల భేరీ వినబడుచున్నది కదా! బారులు తీరి దేవతా ప్రముఖుల రథాలు ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. అందుచేత కెల్లురేగి (దారినిండా దుమ్మురేచి నానాగందర గోళంగా ఉన్నది). శ్రీహరి ఆగమనాన్ని సూచిస్తూ ఆయన భుజకీర్తులు ప్రస్ఫుటంగా నిక్కి (అతిశయముగా) కనిపిస్తున్నాయి. ఓ దనుజుల్లారా! మీ స్థావరమైన పల్లపు లోతైన పాతాళమునకు పారిపోండి. మీ పిక్కబలం చూపించండి.

అదిగో బంగారు, వెండి 'గుదెలు'. ('గుదె' అంటే నాలుగు మూరలు పొడవున్న దండము. నేటి కాలంలో వీటిని లాఠీలు అంటున్నాం. కానీ లాఠీ పొడుగు ఆనాటి గుదె పొడుగులో సగమే ఉంటుంది). అవిగో వింజామరలు. అదిగో అసంఖ్యాకమైన "కైవారాలు" (వంది మాగదులు... వీళ్లు విజయీభవ అని ఉత్సాహపరుస్తుంటారు). అదిగో శ్రీవేంకటేశ్వరుని 'దండి దాడిముట్టి' (దండెత్తి ముట్టడించు సైన్యము). ఇక బందుబందై (ఆకతాయితనం అరిగిపోయి) ఓ దైత్యులారా! జజ్జరించి పారరో... (కకావికలై పారిపోండి).

## 6-51

## మున్నుడి

భజనవలె కొనసాగే అన్నమాచార్యులవారి కీర్తనను ఆలకించండి. శ్రీహరి శరణాగతిలో మేము పొందే సుఖము అంతులేనిది. మాకిది చాలును. ఇదిగాక వేరే ఏ సిరిసంపదలైనా మాకు అనవసరం. మేము వాటిని ఒల్లము (ఒప్పుకోము) అని తెగవేసి చెబుతున్నారు. మాకు ఆదిదేవుడైన శ్రీహరి తప్ప అన్యుల శరణ్యము వద్దు. మేము ఒప్పుకోము. అన్యులను మేము నుతించము. శ్రీవేంకటేశ్వరుడే మాకు గతి. ఇంకనే గతిని మేము ఒల్లము అంటున్నారు. అదండీ భక్తి అంటే.

**ఉ॥ "ఇందున వున్నదే సుఖము యింతియ చాలును వొల్లమన్యముల్**
**ఇందుకు వేరుయైన సిరులేమిటికిన్"? యనె అన్నమార్యుడున్**
**"పొంది హరిన్ గడించు కడుపుణ్యము చాలదె!!" మేటికీర్తనన్**
**విందుగ జెప్పెనీ భజన వేంకటనాయక! చిత్తగింపుమా.**

**రాగం : దేశ్**

ఇందులో నగల సుఖమింతే చాలుమాకు
నిందు వెలియైన సిరులేమియు నొల్లము ॥ఇందు॥

ఆదిదేవునచ్చుతు సర్వాంతరాత్మకుని
వేదవేద్యు కమలాక్షు విశ్వపూర్ణుని
శ్రీదేవుహరి నాశ్రిత పారిజాతుని
ఆదిగొని శరణంటి మన్యము మేమొల్లము ॥ఇందు॥

పరమాత్ము పరిపూర్ణు భవరోగవైద్యుని
మురహరు గోవిందు ముకుందుని
హరిపుండరీకాక్షు ననంతు నభవుని
పరగ నుతించితిమి పరుల నేమొల్లము ॥ఇందు॥





అనుపమ గుణదేహు నణురేణు పరిపూర్ణు
ఘనుచిరంతనుని కలిభంజను
దనుజాంతకుని సర్వధరు శ్రీవేంకటపతి
గని కొలిచితిమి యేగతులు నేమొల్లము ॥ఇందు॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! దేవుడైన ఈ శ్రీహరిని ఆశ్రయించుటలో వున్న సుఖము, ఇంతమాత్రం చాలును. ఇందులో వున్న సుఖం ఇంకెందులోను లేదు. దీనికి వెలియైన (అన్యమైన) సిరులు మేము వొల్లము (ఒప్పుకోము). మాకు ఆ సిరిసంపదలు అనవసరం.

ఆదిదేవుడైన అచ్యుతునికి, సర్వాంతరాత్మునికీ, వేదముద్వారా యెరుగబడిన పద్మనయనునికి, విశ్వమంతా సంపూర్తిగా నిండియున్న శ్రీకాంతునకు, శ్రీహరికి, ఆశ్రయించిన వారికి పారిజాతవృక్షము వంటి వానికి మొదటినుండి మేము శరణుజొచ్చి యున్నాము. ఇతరమేదైనను మేము అంగీకరించము. నాకు వారక్కరలేదు.

పరమాత్ముడైన స్వామిని, పరిపూర్ణుడైన వానిని, భవరోగపీడితులైన వారికి వైద్యుడైన దేవుని, మురాంతకుని, గోవిందుని, ముకుందుని, హరిని, పుండరీకములు (కమలములు) వంటి కన్నులున్న స్వామిని, అనంతుడని పిలువబడువానిని, పుట్టుకయే లేనివాడిని, మేము కీర్తించుచుంటిమి. పరాయివారిని మేము అంగీకరించము.

అనుపమమైన సద్గుణములే దేహముగాగల వానికి, అణువణువునా రేణువు రేణువునా ఉన్న భగవంతునిని, ఘనుడైన చిరంతనుని (అనాదియైన వానిని) కలిదోషమును 'నిర్మూలించువానిని, రాక్షసాంతకుని, సర్వమును ధరించు శ్రీవేంకటేశ్వరుని చూచి మేము పూజించితిమి మాకు యే గతియూ నక్కరలేదు. ఏ వైభవమూ అక్కరలేదు. అసలు వాటిని మేము అంగీకరింపము. మాకు వద్దేవద్దు.

**6-52**

## మున్నుడి

అన్నమాచార్యులవారు చెప్పిన చక్కటి భజన వినండి. ఇది పెద్ద పెద్ద చరణాలున్న కీర్తన. అనేక భాగవత గాథలు తెలిస్తేగాని ఈ కీర్తన అర్థంకాదు. ఓ ప్రభూ! నీ మహిమలను మాయను తెలియుట అంత సులువు కాదు. నీవు చ్యుతి (అంతము) లేని దేవదేవుడవు. వామనునిగా బలినణచిన త్రివిక్రముడవు. క్రీడికి విశ్వరూపదర్శనంగావించిన శ్రీకృష్ణపరమాత్మవు. శ్రీసతీవల్లభుడవు. శ్రీవేంకట నిలయుడవు. నీదాసులందరికీ పక్షపాతములేక పదువలందించు ఆశ్రితవత్సలుడవు అంటున్నారు.

**ఆ.వె.॥ ఏమి చిత్రమయ్య! యేవిధి దెలిసేము**
**నీదు మాయ మేము నీమహిమలు**
**అన్నమయ్య పాడెనద్భుత భజనను**
**ఆలకింపుడింక హరియు మురియు.**

**రాగం : భాగేశ్వరి**

ఏమి చిత్రం బేమి మహిమలు యేమి నీమాయా వినోదము
వామనాచ్యుత నిన్ను దెలియగ వసుధలో మాతరములో ॥ఏమి॥

సకల లోక నివాస నాయక శౌరి మురహర నరహరీ
ప్రకటమాయెను నీగుణంబులు పాలముచ్చవటంచును
వికటముగ నిను గన్నతల్లి నీవదనంబు మీటిన
యఅకట హోయని నోరు దెరచిన యందులోకములుండెను ॥ఏమి॥

శ్రీసతీపతి దైత్య దానవ శిక్ష కామర రక్షక
రాసికెక్కెను బండి రొప్పిన రవ్వలూ నీ సేతలు
మోసమున నర్జునుడు నీలో ముందుగానక మాటలాడిన
వాసవార్చిత విశ్వరూపము వసుధ జూపితి వవుదువు ॥ఏమి॥





నమో నమో శ్రీవేంకటేశ్వర నారదప్రియ భక్తవత్సలు
విమలమగు నీ దాసులిదె నీ విద్యలెల్లా జూచిరి
సుముఖులై కరిశబరి బలియును శుకధ్రువాదులు నిన్ను గొలువక
సమత వున్నత పదవులొసగితి సర్వమిందును గంటిమి ॥ఏమి॥

**భావామృతం :**

ఓ ప్రభూ! నీ మహిమలను నీ మాయా వినోదమును మేము గుర్తించగలమా? అవి ఎంత చిత్రమైనవి. నీవు చ్యుతి (నాశనము) లేని, వామన మూర్తివనీ, వసుధలో నిన్న తెలిసిన వారెవరు లేనేలేరు.

సర్వలోకములు నీలోనే వసించుచున్నవి. నీవు శౌరివి. మురాసురుని నిర్మూలించినవాడవు. నృసింహమూర్తివైన నీ గుణములు అసమానమైనవిగా ప్రకటింపబడినవి. కాని నీ కన్న తల్లియైన యశోద నిన్ను పాలముచ్చు (పాలదొంగ) వలె వికటముగా (తప్పుగా) అర్థం చేసుకొని నిన్ను నోరు తెరచి చూపించమన్నది. నీవు హోయని నోరు దెరచి అందు లోకములన్నియూ చూపించితివి.

ఓ శ్రీనాథా! నీవు దైత్యులను దానవులను శిక్షించు సురరక్షకుడవు. నీవు బండిని విరిచి శకటాసురుని వధించితివి. నీసేతలు (లీలలు). ప్రఖ్యాతములైనవి. మోగుమున (మాయావిచలితుడై) అర్జునుడు నీతో సంవాదించెను. అతనిని రణోన్ముఖుని చేయుటకు విశ్వరూపమును వసుధలో చూపించినవాడవు. నీవు వాసవార్చితుడవు (దేవేంద్రునిచే పూజింపబడువాడవు).

నారదునికి అత్యంత ప్రీతిపాత్రుడైన ఓ భక్తవత్సలా! నీకు వందనములు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు వందనములు. నీదాసులు నిర్మలులైనచో నీ మహిమలను గుర్తించకలరు. నీకు సుముఖులైన గజేంద్రుడు, శబరి, ధ్రువుడు, బలిచక్రవర్తి, శుకమహర్షి నిన్ను కొలిచి ధన్యులయ్యారు. సమానముగా వారందరికీ ఉన్నత పదవులనొసంగితివి. అట్టి దేవా! సర్వమూ ఇందులోనే కనుగొంటిమి.

**6-53**

## మున్నుడి

బాగా తరచి ఆలోచిస్తేనే గాని అర్థంగాని అధ్యాత్మకీర్తనను చెబుతున్నారు అన్నమాచార్యులవారు. శరీరం అనే వూరికి తొమ్మిది దారులున్నాయట. వాటిలో 'పాపాలు' అనే తల నరికేసే వాళ్ళు తిరుగుతుంటారట. కొన్నాళ్ళు మన్మధుడనే రాజు ఆ వూరిని యేలి, కోపంఅనే ప్రధానమంత్రితో పాలన చేస్తే ఇంద్రియాలనే వాళ్ళు కాపులై కూడా జ్ఞానధనాన్ని కొల్లగొట్టారట. చిత్తమనే సేనాధిపతి చింతలనే సైన్యాన్ని విషయలోలురుగా చేశాడట. కోరికలనే బందిపోటు దొంగలు పెరిగిపోయారట. ఇక ఇలా లాభం లేదని వేంకటేశ్వరుడు జీవుని రాజుని చేసి పరిస్థితి చక్కదిద్దాడట..... ఆలోచించండి, ఎంత జ్ఞానమున్నదో..

**ఉ॥ కాయమనేటి వూరికిని గంతలు తొమ్మిది యందునందునన్**
**పాయక త్రచ్చులాడిరట పాప తలారులు, కాముడేలికా**
**పోయెడి జవ్వనంబమరి యున్నది బత్తెము, జీవినెంచుచున్**
**మాయల వేంకటేశ్వరుడు పాలనజేసెను అన్నమయ్యనెన్.**

**రాగం : బౌళి**

కాయమనే వూరికి గంతలు తొమ్మిదియాయ
పాయక తిరుగాడేరు పాపపు తలారులు ॥కాయమ॥

కాముడనియెడి రాజు గద్దెమీద నుండగాను
దీము గోపపు ప్రధాని దిక్కులేలీని
కోమలపు జ్ఞానమెల్లా గొల్లబోయె నాడనాడ
గామిడులై రింద్రియపు గాపులెల్లా నిదివో ॥కాయమ॥





చిత్తమనే దళవాయి చింతలనే పౌజు వెట్టి
యిత్తల విషయములు యెన్నికిచ్చిరి
తుత్తుమురై కోరికెల దొండెము రేగగ జొచ్చె
జొత్తుల వెరగుపడి చూచీ బుట్టుగులు ॥కాయమ॥

బలు సంసారమనేటి భండారము ఘనమాయ
కలదీగి జవ్వనపు కైజీతము
యిలలో శ్రీవేంకటేశుడింతలో జీవుడనేటి
బలువుని రాజు జేసి పాలించె నన్నును ॥కాయమ॥

**భావామృతం :**

కాయము (శరీరము) అనే వూరికి తొమ్మిది కంతలు (దారులు) వున్నాయి. ఈ వూరిలో పాపులైన తలారులు (తలనరికి వేసేవారు) తిరుగుతూ వున్నారు.

ఆ నగరానికి సింహాసనాధిష్టుడైన రాజు కాముడు (మన్మధుడు). వానికి "దీము కోపము" ( ప్రజ్వరిల్లే ఆగ్రహం) అనే ప్రధానమంత్రివున్నాడు. వాడు దిక్కులన్నీ పరిపాలిస్తున్నాడు. దానికి ( ఆ నగరానికి), కామిడులైన (కోర్కెలతోనిండిన) ఇంద్రియాలు కాపువారై (రక్షకులై) వున్నారు. రోజురోజుకీ కొద్దికొద్దిగా ఆ నగరాన్నించి కోమలమైన జ్ఞానం (చక్కటి జ్ఞానము) కొల్లగొట్టబడింది. అదిగో ఆ వైనము చిత్తగించండి.

ఆ నగరానికి దళవాయి (సేనాధిపతి) చిత్తము (మనస్సు). దానికి "పౌజుపెట్టిన" సైన్యమే చింతలు (మనస్సు కలిగించే ఆలోచనలు). ఆ సైన్యం వాళ్ళ అసలు పని మానేసి, విషయసుఖాల మీద ఆసక్తితో వాటికి ప్రాధాన్యత నిచ్చారు. అప్పుడు ఆ మనస్సులోని కోరికలు, తుత్తుమురై (పొడిపొడి అయిపోయ) దొండెము రేగగ జొచ్చె (చెలరేగాయి). ఆ మనస్సు దాని ఫలతంగా రక్తసిక్తమైన జన్మలనుపొంద వలసి వచ్చింది.

ఈ విధంగా బలవత్తరమైన సంసారమునునట్టి బొక్కసాన్ని (ధనాగారాన్ని), యౌవనము అనే ధనంతో నింపుతూ అంతమైపోతున్నారు జీవులు. దీనికి అంతమెప్పుడు? అంతమనేది ఉన్నది. భయపడవద్దు. శ్రీవేంకటేశ్వరుడు ఈ జీవిపై దయదలచి బలమైన జీవునియెన్నుకొని వాడిని మిగతా జీవులకి రాజును చేస్తాడు.

## 6-54

## మున్నుడి

పరమాత్ముని సేవించుటకు పలుదార్లున్నా నవవిధ భక్తి జగత్ప్ర సిద్ధమైనది. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో ఆ నవ విధ భక్తి వలన కలిగే మేళ్ళను వివరిస్తున్నారు, తనశైలిలో. ఏ సుఖమైనా కొంత కాలపరిమితి వుండేదే. ఒక్క జనార్దనుని సేవవల్ల కలిగే సౌఖ్యమే కాలపరిమితిలేని సంతతసౌఖ్యము అని అంటున్నారు. పైగా ఈ సౌఖ్యముతో పాటు ముక్తి కూడా లభిస్తుంది. ఇక ఇంతకంటే గొప్పది ఇంకొకటేమివుంటుంది అంటున్నారు. శ్రీవేంకటోత్తముని కొలువు కంటే వుత్తమైనది లేదంటున్నారు.

**చం॥ ఘనమికలేదు శ్రీహరిని గట్టిగ నమ్ముచు సేవచేయుడీ**
**వనజభవాది దేవగణవందితు శౌరిని ఆ జనార్దనున్**
**చనువున కొల్వుడీ అదియె సంతతసౌఖ్యము అన్నమయ్యనెన్**
**తను గొని వేంకటోత్తముని దాస్యము జేసెను కీర్తినెంచుచున్.**

**రాగం : సువటి**

ఇంతకంటే ఘనమికలేదు
సంతత సౌఖ్యము జనార్దనుడే ॥ఇంత॥

భయనివారణము పరమాత్ముని నుతి
జయకారణము ఈశ్వర చింత
అయుత పుణ్యఫల మచ్యుతుని సేవ
క్రియతో నిజమెరిగిన వారికిని ॥ఇంత॥

కర్మహరము శ్రీకాంతుదరిశనము
ధర్మరాసి మాధవు శరణు
ఆర్మిలి సంపద లనంతుని తగులు
నిర్మలముగ పూనిన దాసులకు ॥ఇంత॥





ఆగమోక్త మీ హరి కైంకర్యము
భోగము విష్ణుని పూజయిది
యోగము శ్రీ వేంకటోత్తముని కొలువు
బాగులు నేర్చిన ప్రపన్నులకును ॥ఇంత॥

**భావామృతం :**

ఓ మానవులారా! జనార్దనుడే పరమాత్ముడు. ఆయనను సేవించుట, సర్వకాల సర్వావస్థలయందు సౌఖ్యప్రదము. ఇంతకంటే ఘనమైనది మరి ఇంకొకటి లేదు.

ఆ పరమాత్ముని నుతించుట వలన భయము నివారణమగును. ఈశ్వరుడైన ఆయన చింత (ఆలోచన) ఎప్పుడూ జయమునకు హేతువైయున్నది. అచ్యుతుని సేవ ఆయుత (సిద్ధించిన) పుణ్యఫలము. క్రియతో (పూనుకొని) నిజము తెలుసుకొన్నవారికి ఈ సత్ఫలితములు తప్పక కలుగుతాయి.

శ్రీకాంతుని దర్శనమాత్రము చేతనే పూర్వ, ప్రస్తుత కర్మలఫలము నశిస్తుంది. మాధవుని శరణాగతి అత్యుత్తమ ధర్మము. అనంతుని పై తగులు (ఆసక్తి) ఆర్మిలి సంపద (అతిశయించిన సిరి). నిర్మలులై పూనికతో ఆ దామోదరుని దాసులైనవారికి ఇవియన్నియు సంప్రాప్తిస్తాయి. సార్ధకతనిచ్చేది శౌరి శరణాగతి మాత్రమే.

శ్రీహరికి కైంకర్యము (ఊడిగము) చేసే అది వేదవిదితమే. విష్ణుదేవునికి చేసే పూజ దివ్యవైభోగములను పలు భోగభాగ్యములను ప్రసాదిస్తుంది. శ్రీ వేంకటగిరిపైనున్న ఆ పురుషోత్తముని కొలువులభించవలెనంటే అది గొప్పయోగము. ఇందుకు సందేహం లేదు. ప్రపన్నులై (భక్తితో శరణాగతులై) బాగులు నేర్చిన వారికి "(యుక్తాయుక్త విచక్షణ నెరిగిన వారికి)" సర్వమూ సిద్ధిస్తుంది అని గ్రహించండి.

**6-55**

## మున్నుడి

వీనుల విందైన పెండ్లి పాటను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. మనం కూడా స్వామి పెండ్లి స్వయంగా చూస్తున్న అనుభూతి కలుగుతుంది, ఈ కీర్తనవింటే. అలమేల్మంగమ్మ శ్రీవేంకటేశ్వరులు కదిసి (దగ్గరై) తమకముతో మైమరచి వున్నారట. అంకెల పానుపు మీద అమరించరో అని పవళింపు సేవతో ముగించారు. అన్నమాచార్యులవారి ప్రత్యేకత చూడండి, ముహూర్తం వేళ యేదో సరిగా కనుక్కోండి వారు వీరు చెప్పిన మాటలు విని మోసపోకండి అంటున్నారు.

**కం॥ అదిగో శ్రీవేంకటపతి**
**అదిగో అలమేలుమంగ అతి తమకముతో**
**కదిసి తరలిరనె బెండ్లికి**
**అదనుగ మన అన్నమయ్య హరి అలరంగన్.**

**రాగం : సాళంగం**

అదె శ్రీ వేంకటపతి అలమేలు మంగయును
కదిసివున్నారు తమకమున బెండ్లికిని ॥అదె॥

బాసికములు గట్టరో పైపై దంపతులకు
శేసపాలందియ్యరో చేతులకును
సూసకాల పేరటాండ్లు సోబాన బాడరో
మోసపోక యిట్టే ముహూర్తమడుగరో ॥అదె॥

గక్కునను మంగళాష్టకములు చదువరో
తక్కక జేగట (జేగటి) వేసి తప్పకుండాను
నిక్కి నిక్కి చూచేరదే నెరి దెర దియ్యరో
యొక్కటైరి కొంగుముళ్ళు వొనరగ వేయరో ॥అదె॥





కంకణ దారములను కట్టరో యిద్దరికిని
సుంకుర బెండ్లి పీట గూచుండబెట్టరో
లంకె శ్రీ వేంకటేశు నలమేల్మంగను దీవించి
అంకెల బానుపు మీద నమరించరో ॥అదె॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! అదిగో చూడండి శ్రీ వేంకటేశ్వరుడు అలమేల్మంగమ్మ వివాహమాడుతున్నారు. వారిద్దరు పెండ్లి కోసం తమకముతో (మైమరపుతో) కదిసి (దగ్గరయై) వున్నారు.

దంపతులిద్దరికి పైపై (నుదుళ్ళపై) బాసికములను కట్టండి. వారిద్దరి చేతులకు శేసపాలు (ఒకరు త్రాగిమిగిల్చిన పాలు ఇంకరికి)అందించండి. సూసకాలు (తలలో ధరించే బంగారు తిరుగుడు బిళ్ళ) ధరించిన పేరంటాడ్లు మంగళగీతములను పాడుచున్నారు. ఈ హడావిడిలో సరియైన ముహూర్తం సమయం యేమిటో కనుక్కోకపోతే మోసపోతారు. కాబట్టి జాగ్రత్తపడండి. సమయం మించిపోయాక వస్తే నిరాశ తప్పదు.

పురోహితులు గక్కున (వెంటనే) మంగళాష్టకములు (మంగళాశాసనములు) చదవండి. తక్కక (విడువకుండా) చేతికి చేగట్టి (చేతికట్టు తోరణము) కట్టండి. వధూవరులు నిక్కినిక్కి చూసుకొంటున్నారు. ఇద్దరూ ఆ పైన కొంగూకొంగూ ముడివేయుట చేత పులకరించి పోతున్నారు.

వధూవరులిద్దరికీ కంకణములను ధరింపజేయండి. సుంకుర (ధవళక్షతలు) చల్లి, వారిని పెండ్లిపీటల మీద కూర్చొన బెట్టండి. వధూవరులు అయిన అలమేల్మంగ శ్రీ వేంకటేశ్వరులు ముడిపడ్డారు. ఓ పెండ్లి పెద్దలారా! ఈ దంపతులను ఆశీర్వదించి జంటగా వీరిని పానుపుపై చేర్చండి. మీ జన్మతరించిందని ఈ లక్ష్మీనారాయణులకు నమస్కరించండి.

## 6-56

## మున్నుడి

అహోబలంలో నెలకొన్న లక్ష్మీనృసింహుని కీర్తిస్తున్నారు, అన్నమాచార్యులవారు. కంభము (స్తంభము) న ఆవిర్భవించి హిరణ్యకశిపుని, వాడి విచిత్రమైన వరాలు పొల్లుబోకుండా, సంహరించి, ప్రహ్లాదుని భయమునివారించి, లోకముల పీడను తుదముట్టించిన అసురాంతకునికి జయ జయధ్వానములు పలుకుతున్నారు. "ఓ జనులారా! మన భయములన్నీ వదిలిపోయాయి. ఇప్పుడు మనం బ్రతికిపోయాం" అని అంటున్నారు. ఇహపరములు రెంటినీ ఇచ్చే స్వామి ఇందును, అందును (అహోబలంలో, తిరుమలలోను) విహరిస్తున్నాడట.

**ఆ.వె॥జయము జయము యింక జనులాల! మనకెల్ల**
**భయములన్ని వాసె బ్రతికితిమనె**
**తానహోబిలమున శ్రీనరసింహుని**
**అన్నమయ్య కొలిచె సన్నుతించి.**

**రాగం : సావేరి**

జయము జయము ఇక జనులాల
భయములు వాసెను బ్రతికితి మిపుడు ॥జయము॥

ఘన నరసింహుడు కంభమున వెడలె
దనుజులు సమసిరి ధర వెలసె
పొనిగె నధర్మము భూభారమడగె
మునుల తపము లిమ్ముల నీడేరె ॥జయము॥

గరిమతో విష్ణుడు గద్దెపై నిలిచె
హిరణ్యకశిపుని నే పడచె
అరసి ప్రహ్లాదుని అన్నిటా మన్నించె
హరుడును బ్రహ్మయు అదె కొలిచేరు ॥జయము॥





అహోబలేశుడు సిరినంకమున ధరించె
బహుగతి శుభములు పాటిల్లె
ఇహపరము లొసగె నిందును నందును
విహరించెను శ్రీవేంకటగిరిని ॥జయము॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఇకపై మనకు జయము నిశ్చయము. జయము కలుగుటతో బాటు మన భయములు కూడా తొలగిపోవుటచే మన మందరము బ్రతికిపోయాము.

ఘనుడైన నృసింహుడు స్తంభము నుండి వెలవడినాడు . రాక్షసులంతా నశించారు ధరవెలసె (భూమి చైతన్యవంతమైనది). అధర్మము పొనిగె (నశించినది). భూ భారము అడగె (తగ్గిపోయినది). మునుల తపస్సులన్నీ ఇమ్ముల ఈడేరె (ఫలించినవి). జయములు స్వంతమైనవి.

శ్రీ మహావిష్ణువు నృసింహుడై సింహాసనము నధిష్టించినాడు. హిరణ్యకశిపునే పడచే (ఇక్కడ జయించె అను భావముతో చెప్పబడింది). తన దాసుడైన ప్రహ్లాదుని అన్ని విధములామన్నించి అభయమిచ్చాడు. అదిగో శంకరుడు, బ్రహ్మ మొదలైన దేవతలంతా ఆయనను సేవిస్తున్నారు.

ఈ అహోబల నృసింహుడు సిరిని (లక్ష్మీదేవిని) తన అంకముపై (తొడమీద) ధరించె (కూర్చొన బెట్టుకొనియున్నాడు). అందుచేత ఆయన దాసులకు బహు విధములైన శుభములు పాటిల్లె (పొందబడినవి). ఆ స్వామి ఇందును అందును (ఈ అహోబలంలోను, అక్కడ తిరుమలలోను) ఇహపరములొసగె (సిరి సంపదలే కాక అంత్యమున మోక్షమును కూడా ఇస్తున్నాడు). ఎందుకంటే శ్రీవేంకటగిరి పై కూడా ఆయనే విహరించె (కొలువైయున్నాడు కదా!).

**6-57**

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు జీవులు పుణ్యము పాపము రెంటినీ చేసి తత్ఫలితంగా సుఖదుఃఖములను పొందుతున్నారు అని చెబుతున్నారు . అయితే ఎంత పుణ్యానికి ఎంత ఎక్కువ సుఖం ఎంత పాపానికి ఎంత ఎక్కువ దుఃఖం పొందుతాడు అని నిర్ణయించేది ఎవరు? ఆ పరమాత్ముడే. జీవి ఆయనతో బేరం ఆడతాడట. ఇది వారానికి ఒకసారి జరిగే 'సంత' కాదు, ప్రతిదినమూ వుండే సంత, ఈ పాపపుణ్యాలే మీ 'కొంగురొక్కం' (Money in pocket). వాటిని వెచ్చించి సుఖదుఃఖాలను కొనుక్కోండి అంటున్నారు. త్వరగా 'వెల దెంచండి' (ధరను ఏదో కాడికి నిర్ణయించేసేయండి.....రారో (రండర్రా) అంటున్నారు.

**తే॥ కొలది పుణ్యపాపంబులే కొంగుగట్టి**
**వెలను తెంచుచు సంతలో బేరమాడ,**
**వేగిరంబె రారో! యని పిలిచినాడు**
**అన్నమార్యుని కీర్తన అద్భుతమిర.**

**రాగం : బౌళి**

కొలది పుణ్య పాపాలే- కొంగురొక్కములు వెట్టి
వెలదెంచి బేరమాడ- వేగిరమే రారో ॥కొలది॥

జననాలు మరణాలు- సంసారభోగములును
అనిశము భూమి మీద-నగ్గువలు
కొనేవారు దినేవారు-కూడికూడి మూకలై
దినసంత లెక్కెనిదే-దేహులాల రారో ॥కొలది॥

అంగనల వలువల- అంగళ్ళు వెట్టిరదె
చెంగట వయసులనే-చింతల కింద
సంగతి గాయమనే- సంచుల నించుకొందము
చెంగిపోరాదు మనకు - జీవులాల రారో ॥కొలది॥





లంపటాలు సంపదలు-లలి నంబారాసులాయ
యింపుల ముంచి తలల-కెత్తుకోరో
దింపక యిందులోననే-తిరిగి శ్రీవేంకటేశు
పంపున లాభము చేరె (రీ)-ప్రాణులాల రారో ॥కొలది॥

**భావామృతం :**

ఓ జీవులారా! ఈ సంతలో బేరమాడటానికి త్వరత్వరగా రండు. మీరు చేసిన కొలది (కొద్దిపాటి) పుణ్యము, పాపము మీకు 'కొంగురొక్కం' (కొంగులో ముడి వేసి వెంట తీసికొని వెళ్ళే పైకము). దానిని వెచ్చించి, 'వెలదెంచి' (ఏదో ఒక ధర నిర్ణయించి) అవసరమైతే ఆ పైవాడితో బేరమాడటానికి రండర్రా!

ఓ దేహులారా! (దేహధారులారా!) ఇది దినసంత (రోజువారీ సంత). దీనికి మూకలై (గుంపులుగా) కొనేవారు, తినేవారు (అనుభవించేవారు) కూడికూడి (ఒకరికి తోడుగా ఇంకొకరు కలిసి ) వస్తూనేవుంటారు. చావు పుట్టుకలు, సుఖదుఃఖాలు అనిశము (ఎల్లప్పుడూ) నగ్గువలు (అతిచౌకగా దొరుకుతాయి). ఈ దినసంతలు యెక్కినవి (యెక్కువైపోయాయి). త్వరగారండి.

ఓ జీవులారా! చెంగట వయసులనే, చింతల (చింతచెట్లు) క్రింద దుకాణాలు పెట్టి, అంగనల వలపులు (స్త్రీ కామవాంఛలు) అనే సరుకు అమ్ముతున్నారు. సంగతి (దగ్గరగా వచ్చి) మీ శరీరమనే సంచులనిండా నింపుకొండి. (ఈ సంచుపాతదై చెడిపోతే ఎక్కువ సరుకుపట్టదు).పోనీ...మాకు స్త్రీ వద్దు, అని చెంగిపోదామా (తొలగి వేరే పోదాం) అంటే... అదీ సాధ్యం కాదు. మనకు వేరే గత్యంతరం లేదు. ఆ స్త్రీ కోసం పాపపుణ్యాలు చేస్తూవుండాలి. వాటి ఫలితం అనుభవిస్తూనేవుండాలి. (ఓరి దేవుడో..).

సరే..వీటితో పాటు, అంబారాసులై (కుప్పలు తెప్పలై) సంపదలు, లంపటాలు (సంబంధబాంధవ్యాలూ), యింపులు( ఇష్టాయిష్టాలు)... పీకలలోతుకు కూరుకొని పోయాడీ జీవి. ఇకమరి వీడికి దిక్కెవరు? మీరు శ్రీవేంకటేశ్వరుని దాసులైతే బేరం సాగినంత కాలమూ మంచి సరకు కొంటుంటారు. లాభాలు గడిస్తుంటారు. బేరం సాగిపోతూనే వుంటుంది. ఆ నామాలవాడి దయవున్నంత కాలం సంతోషంగానే వుంటాడు ఈ జీవి). ఓ ప్రాణులారా! ఇదింతే కాబట్టి రండి....త్వరగా రండి.

## 6-58

## మున్నుడి

నేడు దీపావళి పర్వదినము. ఈ రోజు ఈ కీర్తనకు మున్నుడి భావామృతం వ్రాయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అన్నమాచార్యులవారి ఈ కీర్తన సత్యభామ, రుక్మిణీ దేవి, శ్రీదేవి అలమేల్మంగ అందరూ హరి హృదయేశ్వరి రూపాలే అంటున్నారు. పట్టుబట్టి శ్రీ కృష్ణునితో పాటు నరకాసురుని పై యుద్ధానికి వెళ్ళి, శ్రీకృష్ణుడు మూర్ఛిల్లినాడని ఆగ్రహించి ధనస్సుబట్టి నరకుని నరికిన తరుణి సత్యభామ. ఆమె ఎవరో కాదు, వాడు తన కొడుకు అని తెలియని భూదేవి అవతారమే. హరిమాయచే తల్లే కొడుకుని చంపింది.

**ఆ.వె॥ సత్యభామ నెరపు సరసపు నగవులు**
**నిత్యము హరిమదిని నెలవు ఆయె**
**అన్నమయ్య అనెను అలమేలుమంగమ్మ**
**తిరుమలయ్య మనసు మురియజేసె.**

**రాగం :**

సత్యభామ సరసపు నగవు
నిత్యము హరిమదిని నెలవాయె ॥సత్యభామ॥

రుకిమిణిదేవికి రూపయౌవనికి
సకల విభవముల సమ్మెతలు
చికురాంబరమున చెదరిన అలుకలు
హితజాత్యముఖము వేయి వేలాయె ॥సత్యభామ॥

తొడవుల శ్రీసతి తొలమెఱుగులవె
నడవుల మురిపెపు నగుమోము
తడయక వారిధి తచ్చిన హరికి
బడలిక వాసెను పరమంబాయె ॥సత్యభామ॥





అనుదినమును నీ అలమేల్మంగ
కనుగవ చలికిన గరువములు
దినదినమును అల తిరువేంకటపతి
చనవుల సొబగుల సంపదలాయె ॥సత్యభామ॥

**భావామృతం :**

సత్యభామ యొక్క మనోజ్ఞమైన నవ్వు 'హరిమదిని' (శ్రీకృష్ణుని హృదయమున) నిత్యమూ ప్రతిష్ఠింపబడియున్నది. ఆమె ఆయన హృదయాధీశ్వరి.

నందనందనుని వలచి, రాయబారము నడిపి వలపించుకొని పరిణయమాడిన రూపయౌవని (చక్కటి రూపము గల జవ్వని) రుక్మిణీదేవి ఆయన అష్ట భార్యలలో అగ్రస్థానమునన్నది. ఆమె చికురాంబరమున (నల్లని ఆకాశమువంటి కేశపాశమున) చెదరిన అలుకలు (వెంద్రుకలు....లేక ....ముంగురులు), హితజాత్యముఖము (ప్రీతిని కలిగించు వదనము) వేయివేలాయె (అనేక విధముల ఆయనను అలరించుచున్నది).

అవే శ్రీసతి (లక్ష్మీదేవి) యొక్క తొడవుల (దివ్యమైన ఆభరణముల) తొలమెరుగులు(అతిశయించిన తళతళలు). ఆమె యొక్క మురిపెపు నడవుల (మురిపించు ప్రవర్తన), నగుమోము (చిరునవ్వులు చిందించు వదనము)....తడయక (ఏ మాత్రము జాప్యము చేయక ) వారిధి తచ్చిన (క్షీరసాగర మధనముగావించిన) హరికి(నారాయణునికి) కలిగిన బడలిక వాసెను (అలసటతొలగిపోయెను). ఆయనకది పరమంబాయె (అన్నిటికంటే యెక్కువైయున్నది).

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ కలియుగంలో నీవు వైకుంఠము వదలిన శ్రీహరివై మానవులని రక్షించుటకు వెలసినావు. నీ హృదయేశ్వరి పద్మావతియై నిన్ను చేరినది. నీవు అనుదినము (నిత్యమూ) ఆ దేవి రెండుకళ్లలోను తొణికిసలాడెడి గరువములు (గౌరవ భావములతో) అలరింపబడుచున్నావు. ప్రతిదినము ఆమె సొగసుల ఆప్యాయతల వైభవములు నీ సంపదలైనవి.

## 6-59

## మున్నుడి

భరతవర్షంలో రామకథ తెలియని నరుడు, రామాలయంలేని వూరు వుండవని ప్రతీతి. శ్రీరామచంద్రుడు విష్ణువు అవతారమే కాక పరబ్రహ్మ స్వరూపుడు అని చెబుతున్నారు అన్నమాచార్యులవారు. తను వినిపిస్తున్న ఈ కీర్తనయే రామకథయట. ఇది సర్వపుణ్యములయొక్క ఫలము అంటున్నారు. 'శతకోటి విస్తరము' అంటే అనేక ప్రదేశములకు విస్తరించి వెల్లివిరిసినదని అర్థము. అన్నమయ్య కీర్తనలలో పల్లవి అర్థమవటం బహుకష్టమైన పని. కామించు విభీషణు లంకకు పట్టము గట్టె... అంటే...?

**కం॥ విదితమగు పరబ్రహ్మట**
**ఇదియే శ్రీరామగాథ ఈ అన్నయనెన్**
**పదికోట్ల విస్తరంబగు**
**కొదలేనీ పుణ్యఫలము కొలువుడిత నిన్**

*** విస్తరంబు = వెల్లివిరిసినది**

**రాగం :** బౌళి రామక్రియ

ఇతడే పరబ్రహ్మ మిదియే రామకథ
శతకోటి విస్తరము సర్వపుణ్యఫలము ॥ఇదియే॥

ధరలో రాముడు పుట్టె ధరణిజ బెండ్లాడె
అరణ్యవాసులకెల్లా నభయమిచ్చె
సొరిది ముక్కు జెవులు చుప్పనాతికి గోసె
ఖరదూషణులను ఖండించి వేసె ॥ఇదియే॥

కినిసి వాలి జంపి కిష్కింధ సుగ్రీవుకిచ్చె
వనధి బంధించి దాటె వానరులతో
కలసి రావణ కుంభకర్ణాదులను జంపి
వనిత జేకొని మళ్లి వచ్చె నయోధ్యకును ॥ఇదియే॥





సౌమిత్రియు భరతుడు శత్రుఘ్నులు గొలువగ
భూమియేలె కుశలవ పుత్రుల గాంచె
శ్రీమంతుడై నిలిచె శ్రీవేంకటాద్రిమీద
కామించు విభీషణు లంకకు బట్టముగట్టె ॥ఇదియే॥

**భావామృతం :**

ఓ జనులారా! ఇతడే (ఈ శ్రీరామచంద్రుడే) పరబ్రహ్మ(భగవంతుడు). కేవలం విష్ణువు కాదు. ఇదియే (ఈ కీర్తనలో చెప్పెడి సారాంశమే) రామకథ (రామాయణం). ఈ రామాయణం శతకోటి విస్తరము (లెక్కకు మిక్కుటమైనట్లు వెల్లివిరిసినది). దీనిని గానం చేస్తే సర్వపుణ్యములయొక్క ఫలము సంప్రాప్తిస్తుంది. దీనిని గానం చేసి తరించండి.

ఈ భూమిమీద భగవంతుడు రామునిగా జన్మించాడు. భూమిజ అయిన సీతాదేవిని పెండ్లాడినాడు. అరణ్యవాసులైన మునులు, యోగులు, భిల్లులకు అభయమునిచ్చాడు. చుప్పనాతి అని పిలువబడే శూర్పణకు ముక్కుచెవులు సొరిది (వరుసగా) కోసె (తెగవేయించినాడు). ఖరుడు దూషణుడు మొదలైన పదివేలమంది రాక్షసులను ఒంటరిగా సంహరించాడు. అందుకే ఆయన పరబ్రహ్మ.

తన తమ్ముని భార్యను బలవంతాన భర్తనుండి అపహరించాడని, కినిసి (ఆగ్రహించి) వానరరాజైన వాలిని సంహరించి సుగ్రీవునికి భార్యతో బాటు, కిష్కింధ రాజ్యాన్ని కూడా ఇప్పించాడు. వనధి (సాగరమును) బంధించి వారధి కట్టించి వానరసైన్యంతోబాటు సముద్రాన్ని దాటినాడు. వారితో కలిసి రావణ కుంభకర్ణాది రాక్షసులను జంపి తన భార్య సీతను తీసికొని తన అయోధ్యానగరమునకు మరలి వచ్చాడు.

పట్టాభిషిక్తుడై తన సోదరులైన లక్ష్మణ, భరత,శత్రుఘ్నులు తనను సేవించుచుండగా, భూమిని పరిపాలించినాడు. కవలలైన కుశ లవులను పుత్రులను బొంది తన తదనంతరం రాజ్యం వారికి పంచి ఇచ్చాడు. ఆ భగవంతుడు కలియుగంలో మనబోంట్లను తరింపజేయుటకు వేంకటాద్రిమీద శ్రీవేంకటేశ్వరునిగా అవతరించి కోరిన వరాలిస్తున్నాడు. ఎందుకంటే... ఆనాడు, కామించిన (తన అన్నరాజ్యం తనకి వస్తే బాగుండునని ఆశించిన) విభీషణునికి అతని కష్టాలకు పరిహారంగా సువర్ణలంకకు ఏలికను చేసినాడు. అందుకే ఆయనయే పరమాత్మ.

## 6-60

## మున్నుడి

చక్కటి తత్త్వబోధను చేస్తున్న అన్నమాచార్యులవారిని ఆలకించండి. 'వననిధి' అంటే, ఏదో వనము, అంటే అడవి అని ఊహించుకొంటే పొరబాటు. వనధిలేక వననిధి అంటే సముద్రము. సముద్రం మీద కురిసిన వాన నిష్ప్రయోజనం కదా! ఆలోచించకుండా చేసే పనులు నిరుపయోగమే కాక భారంకూడా అవుతాయి. నరులంతా చూపించే మమతానురాగాలన్నియును దూరపు కొండల నున్నదనమువలె సత్యముగా కనిపించు అసత్యము. అడవిగాచిన వెన్నెలవలె హరిని పూజించని జీవితములన్నియు నిరుపయోగములంటున్నారు.

**చం॥ వననిధి మెండుగా గురియు వానలు యెవ్విధి మేలుజేయురా?**
**పనులవి భారమౌ మతిని బాగుగ యోచనలేక జేసినన్**
**వనములగాయువెన్నెలలు వ్యర్థము, దూరపు కొండ నున్నమా?**
**కొని, యనె అన్నమయ్య హరిగొల్వనిచో నడిచే శవంబులే.**

**రాగం : బేహాగ్**

వననిధి గురిసిన వానలవి మతి-
పనిలేని పనుల భారములు ॥వననిధి॥

అడవుల వెన్నెల లారిడి బదుకులు
తడతాకుల పరితాపములు
వొడలొసగిన హరి నొల్లక యితరుల
బడిబడి దిరిగిన బంధములు ॥వననిధి॥

కొండలనునుపులు కొనకొన మమతలు
అండలకేగిన నదవదలు
పండినపంటలు పరమాత్ము విడిచి
బండలు తిరిగిన బడలికలు ॥వననిధి॥





బచ్చు రూపులు పచ్చల కొలపులు
నిచ్చలనిచ్చల నెయ్యములు
రచ్చల వేంకటరమణుని గొలువక
చచ్చియు జావని జన్మములు ॥వననిధి॥

**భావామృతం :**

ఓ నరులారా! శ్రీహరిని ఆశ్రయించని నరజన్మలు వ్యర్థమైనవి. వననిధి (సముద్రము) లో కురిసిన వాన ఎవరికి ఉపయోగపడుతుంది? 'మతి పనిలేని పనులు' (బాగుగా ఆలోచించి చేయని పనులు) భారములు (భారమైనవి) నిరుపయోగమైనవని భావము.

ఆరడి బ్రతుకులు (నిరుపయోగమైన నరజన్మలు) అడవిగాచిన వెన్నెల వలె వ్యర్థమైనవి. అవి తడతాక పరితాపములు (బాగుగా బాధించు మనోవ్యధలను) కలిగించును. ఒడలొసగిన హరిని (మానవ జన్మనిచ్చిన శ్రీహరిని) ఒల్లక (అంగీకరించక), ఇతరుల బడిబడి (వెంబడి) తిరిగినచో వారితో బంధములు కలిగి జీవితమంతా వ్యర్థమైపోతుంది.

కొనకొన మమతలు (తెచ్చి పెట్టుకొన్న ఆప్యాయతలు) కొండల నునుపులు (దూరపు కొండల నున్నదనమువలె, ఉన్నట్లు భ్రమ కలిగించు లేనివి). ఇతరుల, అండలకేగిన (ఆశ్రయమునాశించిన) కలుగునవి మేళ్లుకాదు. అదనదలు (కలతలు) మాత్రమే. బాగుగా పండిన పంటవంటి పరమాత్మని కాదని, బండలు తిరిగిన (వ్యర్థుల వెంట తిరిగితే) ఏమిలాభం? ఉత్తబడలిక (శ్రమ) మాత్రమే మిగులుతుంది.

నిచ్చనిచ్చనెయ్యములు (దినదినము మన స్నేహములన్నీ) బచ్చన రూపులు (పై పూతలవలె అసలైనవి కావు). పచ్చలకొలుపులు (బంగారు కాంతులు నిజమైనవి కావు). బహిరంగంగా శ్రీవేంకటేశ్వరుని కొలువనివారి జన్మలు నిరుపయోగం. అవి చచ్చినా బ్రతికున్నట్లు కనిపించే జన్మలు.

**6-61**

## మున్నుడి

ప్రభూ! నీవు దేవ శిఖామణివి (దేవతలందరికీ తలమానికము వంటివాడవు). దిష్టదైవమవు (భాగ్యప్రదాతవు). మరినేనో ఇటు నీబంటను (దాసుడను). ఇంక నాకు యెదురు చెప్పగలవారెవరు" – అంటున్నారు అన్నమాచార్యులవారు. అధికారి యెంత శక్తిమంతుడైతే, ఆయన బంట్రోతు కూడా అంత దర్పం ప్రదర్శిస్తాడు కదా! అదీ సంగతి... తన అధికారి యెంత 'గొప్పవాడో' ఈ బంటు మనని హెచ్చరిస్తున్నాడు. జగములో తనకు కొఱత (తక్కువ) అనేదే లేదు పొమ్మంటున్నారు. కులశేఖర అళ్వార్ అన్నారు కదా! నేను నీ బంటుకు, బంటుకు, బంటుకు, బంటుకు, బంటుకు దాసుడిని... అని. అదీ దాసభక్తి అంటే.

**ఆ.వె॥ దిష్టదైవమీవు దేవశిఖామణీ!**
**నీదు బంట నేను యెదురు లేదు**
**కారణాలు తెలిపె ఘనుడన్నమార్యుండు**
**ఏమి కీర్తనంబు!! హితవు వినుడు.**

**రాగం : బౌళి**

దేవ శిఖామణివి దిష్టదైవమవు నీవు
యీవల నీబంట నాకు నెదురింక నేది ॥దేవ॥

కామధేనువు పిదుకగల కోరికలివెల్ల
కామధేనువులు పెక్కు గానే కృష్ణుడవట
కామించి నీబంటునట కమ్మి నిన్ను దలచితి
ఏమి మాకు గడవయ్య యిందిరారమణా ॥దేవ॥

యెంచ కల్పవృక్షమును యిచ్చు సిరులెల్లాను
నించి కల్పవృక్షముల నీడల కృష్ణుడవట
అంచల నీబంటునట ఆత్మలో నిన్ను నమ్మితి
వంచించ కడమ యేది వసుధాధీశ! ॥దేవ॥





తగనొక్క చింతామణి తలచినట్ల చేసు
మిగుల కౌస్తుభమణి మించిన కృష్ణుడవట
పగటు శ్రీవేంకటేశ భక్తుడ నీకట నేను
జగములో కొఱతేది జగదేక విభుడా ॥దేవ॥

**భావామృతం :**

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు దేవశిఖామణివి (దేవతలందరికి తలమానికము వంటి వాడవు). దిష్టదైవతువు (భాగ్యప్రదాతవు). ఈవల (ఇటుపై) నేను నీబంటను (దాసుడను). ఇంకన్ యెదురు యేదినాకు?

ఓ ఇందిరారమణా! (శ్రీమహాలక్ష్మీపతీ!) కామధేనువును పిదుక (పిదికితే) కోరికలెల్లా ఫలిస్తాయి కదా! అటువంటి యెన్నో కామధేనువులను నీవు కృష్ణయ్యగా గాచినావు. నీ బంటునై నేనేవో చిన్న చిన్న కోరికలు కోరుకుంటే మాకు కడవు (కొఱత) వుంటుందటయ్యా! అందునా... క్రమ్మి (అతిశయించి) నిన్ను తలచిన వారికి మరింకే కొఱత వుంటుంది?

ఓ భూవల్లభా! కల్పవృక్షాన్ని యెంచ (ఆశ్రయిస్తే), యెల్ల సిరులను నించును. నీవేమో ఆనాడు బృందావనం కృష్ణయ్యగా విశ్రమించిన చెట్లన్నీ కల్పవృక్షాలే. మేమేమో నీకు ఆత్మలో నమ్మిన బంటులము. అంచల (నీ పక్కనే) వుంటుంటాము. మాకు వంచించ కడమయేదీ? (మాకు ఇంకొకరిని మోసం చేసి యేవో పొందవలసిన అగత్యమేమున్నదయ్యా!

ఓ జగదేకవిభుడా! (జగన్నాథా) ఒక్క 'చింతామణి' అను దివ్యరత్నం, తగున్ (చాలును). అది తలచినట్లు చేసు(చేస్తుంది). దానిని మించిన కౌస్తుభమణిని కంఠసీమలో ధరించి తిరిగే ద్వారకానగరాధిపతివి నీవు. శ్రీకృష్ణమూర్తివి. నేటి కలియుగంలో నీవే పగటు (లావణ్యమూర్తి) శ్రీవేంకటేశ్వరుడవు. నేనేమో నీకు అటు (అక్కడ) భక్తుడను. ఇంకా నాకు ప్రపంచంలో ఏమన్నా కడమ(లోటు) వుంటుందా తండ్రీ! ఒక్కనాటికీ వుండదు.

## 6-62

## మున్నుడి

చక్కటి జ్ఞానబోధను చేస్తున్న అన్నమాచార్యుల వారి కీర్తన నాస్వాదించండి. స్త్రీలకు విజ్ఞప్తి యేమంటే ఆచార్యులవారి వైరాగ్య కీర్తనలలోను, వేమన పద్యాలలోను కనబడే స్త్రీ విమర్శ అందరు స్త్రీలపై కాదు. విశృంఖలంగా ఉండే వారవనితలపైననే ఆ విమర్శలు. మాతృమూర్తియైన స్త్రీని ఆచార్యులవారు యెప్పుడూ గౌరవించారు. ఈ కీర్తన ప్రత్యేకత యేమంటే అర్థమయినట్లుండే, అర్థంకాని కీర్తన. అసలు పల్లవి కూడా సరిగా అర్థంకాదు. "నానా విధాల నివి నమ్మేరు సుండి"... అంటే? ఇవి... అంటే, ఇంతుల పెదవులు, కాంతల నవ్వులు, కామినులు మాటలు నానా విధాలుగా ఉంటాయి. వాటిని నమ్మేరు సుండి (సుమా!). జాగ్రత్త... చెడిపోతారు.

**ఉ॥ జ్ఞానుల యోగులన్ సకల సంగ విరక్తుల బిల్చి చెప్పెరా**
**కానరొ సత్యమున్ పలురకంబుల నమ్ముదురింతులందరిన్**
**మానిని తీపులౌ పెదవి మత్తుల జత్తురు కాలకూటమౌ**
**పూనుచు వేంకటేశ్వరుని పూర్తిగ నమ్ముడు అన్నమయ్యనెన్.**

**రాగం : వసంతం**

జ్ఞానులాల యోగులాల సకల విరక్తులాల
నానా విధాల నివి నమ్మేరు సుండి ॥జ్ఞాను॥

ఆలరి యింతుల యధరామృతము వివియెల్ల
కాలకూట విషముల కరము సుండి
శీలముతో వీరల చెట్టలు వట్టుట లెల్ల
బాలగానాల దొడికి పట్టుట సుండి ॥జ్ఞాను॥

కాంతలు నవ్వుచునైనా గనుల జూచిన చూపు
పంతమున నలుగుల పాతర సుండి
బంతుల నెదుటనున్న పడతుల చన్నులివి
కంతల నొడ్డిన బండిగండ్లు సుండి ॥జ్ఞాను॥





జవ్వనపు గామినుల సరసపు మాటలెల్లా
మవ్వమైన యట్టి చొక్కు మంత్రాలు సుండి
యివ్వలను శ్రీవేంకటేశ్వరు దాసులకివి
చివ్వన జెప్పినట్లు చేసేవి సుండి ॥జ్ఞాను॥

**భావామృతం :**

ఓ జ్ఞానులారా! యోగులారా! అన్ని విధములుగ విరక్తిని పొందిన సిద్ధులారా! నానా విధాలన్ (పలురకములైన), ఇవి (స్త్రీల సంగతులను) నమ్మేరు సుండి (విశ్వసించేరు సుమా!)... జాగ్రత్త... అట్లు చేసి చెడిపోవద్దు. (నా మాట వినండి).

ఆలరి యింతుల (చిలిపి స్త్రీల యొక) అధరామృతములు (తీపి పెదవులు) ఉన్నాయి చూశారా... ఇవి యెల్ల ఘోరమైన కాలకూట విషములే సుండి (సుమా!) శీలముతో (మీ స్వభావమునకు తగినట్లు) వారి చెట్టులు పట్టుటయెల్లన్ (పాణిగ్రహణము) పాలగానాలను (ముతకవడ్ల అన్నం) తొడికి పట్టుట (ఆత్రంగా తినటమే.. సుమా!)

కాంతలు నవ్వుతోనైనా, సోగకన్నులతో చూచినచో...అది శత్రువుల "పంతము పట్టిన అలుగుల పాతర సుండి" (గోతిలో కప్పివేయుట వంటిదే సుమా!). బంతుల నెదుటనున్న (విశృంఖలలైనటువంటి) పడతుల చన్నులివి (స్త్రీల స్తనములు ఇవియే) కంతుల నొడ్డిన బండికండ్లు (విడివడి బయటకు వచ్చేసిన బండి చక్రాలే... సుమా!). ఆలోచించండి. ఆకర్షణ 'ఆ బండి చక్రాల'లో వున్నదా, లేక కామవాంఛ కలిగించే భ్రమా? వాంఛయే కదా!

యౌవనులైన కామినుల సరస సంభాషణములు మువ్వయైన యట్టి (కోమలమైన లేక సరళమైన ) చొక్కు మంత్రాలు సుండి (చేతబడి మంత్రములే సుమా!) అయితే... ఇవన్నీ కామపీడితులైన వ్యసనపరులకు మాత్రమే అని తెలుసుకోండి. ఇవ్వల (ఇటువైపున) శ్రీవేంకటేశ్వరుని దాసులకి మాత్రం, చెప్పినట్లు వినునట్టి భార్యలే కాని భోగ స్త్రీలు కాదు.

## 6-63

### మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుని అభిషేక మహోత్సవాన్ని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. పరాశక్తిని ముగురమ్మల మూలపుటమ్మగా పెద్దలు కీర్తించారు. అదేవిధంగా ముగురయ్యలు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) వారిమూలము, పరమాత్మ. ఈతడు (ఈ తిరుమలేశుడు) వారికి 'మూలము' అంటున్నారు. జిగిమీరెన్ (కాంతులను విరజిమ్ముచున్నాడు). ఈయనను సేవించరో, అని చెబుతున్నారు. స్వామి నిమజ్జన వైభవాన్ని వర్ణిస్తున్నారు. స్వామి కులికి పుణ్యాల కెల్లా గురియైనవాడు... అంటున్నారు. అంటే?

**చం॥ "ముగురు మహానుభావులకు మూలపుదైవము వేంకటేశుడే**
**జిగియది మీరె కట్టెదుట, సేవలు జేయరొ" అన్నమయ్యనెన్**
**తగు విధి మజ్జనంబవల తప్పక మెత్తరొ పచ్చ కప్పురం**
**బెగువను వేంకటేశ్వరుడు యేలెజగంబుల దాసులందరిన్.**

**రాగం : బౌళి**

ముగురు వేలుపులకు మూల మీతడు
జిగి మీరి నెదుటను సేవించరే ॥ముగురు॥

అంచెల బన్నీటి బిందెలందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికి జేయగా
వంచి సముద్రము మీద వానలు గురిసినట్లు
పొంచి యన్నిటాను ఉప్పొంగుచున్నాడు ॥ముగురు॥

పచ్చకప్పురము మేన బలుమారు మెత్తగాను
తచ్చి పున్నమి చంద్రుడే తానైవున్నాడు
అచ్చపు దట్టి పుణుగు ఆ మీద బుయ్యగాను
నిచ్చ కల్పకతరువు నీడయై వున్నాడు ॥ముగురు॥





అలమేలుమంగతోడ నన్ని సొమ్ములు నించగా
పలుపంచవన్నెల సంపదయైనాడు
యెలమి శ్రీవేంకటేశు డిన్నిటా బ్రతాపించి
కులికి పుణ్యాలకెల్లా గురియైనాడు ॥ముగురు॥

**భావామృతం :**

ఓ జనులారా! ఈతడు (ఈ శ్రీవేంకటేశ్వరుడు) ముగురు వేల్పులకు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అనిపిలువబడే ముగ్గురు దేవుళ్లకు) మూలము (కారణభూతుడైన తల్లివేఱు). జిగిమీరె నెదుటను (మన కనులముందు కాంతులీనుచున్నాడు). ఇతనిని సేవించండయ్యా.

అంచెల (ఒకరి తర్వాత ఒకరు అందుకొంటూ) పన్నీటి బిందెలు అందుకొని, ఇందరును (ఇంతమందీ) దేవునికి నించి (అతిశయించి) మజ్జనము (మంగళ స్నానము) చేయగా అదెట్లున్నదంటే అనంతమైన నల్లని సముద్రముమీద వానజల్లు వంచి కురిసినట్లున్నది. (ఒక్కటిగా కురిసినట్లున్నది). ఆ చన్నీటి స్నానం వలన ఆయన ఉత్సాహవంతుడై అన్ని విధములా ఉప్పొంగుచున్నాడు.

స్వామి వంటిమీద అటు పిమ్మట పచ్చ కర్పూరం పలుమారులు, మెత్తినారు. తెల్లని ఆ కర్పూరం వలన స్వామి, తానే తచ్చిపున్నమి చంద్రుడైనాడు. (క్షీరసాగరమథనంలో పుట్టిన నిండు చంద్రునివలె శోభిల్లుచున్నాడు) ఆపైన, అచ్చపు దట్టుపుణుగు బుయ్యగాను (స్వచ్ఛమైన సుగంధ ద్రవ్యము తట్టుపుణుగును మెత్తినారు). పునుగుపిల్లి నుంచి వచ్చిన ఆ సుగంధ ద్రవ్యం వలన స్వామి, కల్పవృక్షము యొక్క నీడవలె మనోహరంగా ఉన్నాడు.

ఆ తరువాత, అలమేలు మంగా సమేతుడైన స్వామికి, అన్ని సొమ్ములు (దివ్యాభరణములనన్నింటినీ) నించగా (అలంకరించగా) పలుపంచ వన్నెలు (రంగు రంగుల దివ్యరత్నముల వలన) సంపదయైనాడు (ఐశ్వర్యము అవతరించినట్లున్నాడు). ఇన్నిటాను (ఇన్నివిధములుగా) శ్రీవేంకటేశ్వరుడు యెలమి ప్రతాపించగా (సంతోషంతో ప్రతాపము చూపిస్తుంటే), కులికి పుణ్యాలకెల్లా (వెదజల్లబడిన పుణ్యములన్నింటికీ గురియైనాడు. (లక్ష్యము తానె అయినాడు).

## 6-64

## మున్నుడి

అన్నమాచార్యుల వారి సుపుత్రుడు పెదతిరుమలయ్య చెప్పిన చక్కటి కీర్తన నాస్వాదించండి. "ఓ శ్రీహరీ! నీ చేతలు (పనులు) ఆనందకరములైనవి. అవి సురులకు (దేవతలకు) నరులకు (మానవులకు) శుభమును కలిగించినవి. జగత్తున ఎందరో దుష్టులను గెలిచి, శిష్టరక్షణ చేసినావు. నీవా దుష్టులపై గెలిచిన గెలుపులే భారత, భాగవత కథలై, వేదములై పురాణములై మాకు నీ మహిమల నెరింగించినవి. ఓ శ్రీవేంకటేశ్వరా! కోరిన వారికి వైభవముల నొసగి నీవందరినీ జయించావు" అంటున్నారు.

**కం॥ సురులకు నరులకు శుభమై**
**హరి! నీ చేతలును జగతి కానందములై**
**తరగని గెలుపులు కథలౌ**
**విరివిగ, తాజెప్పె నిటుల పెద తిరుమలయున్**

**రాగం : ఆనందభైరవి**

సురలకు నరులకు శుభమాయె
హరి నీ చేతలు ఆనందమాయె ॥సురులకు॥

కినిసి రావణుని గెలిచిన గెలుపులు
చెనకి బాణుని గెలిచిన గెలుపులు
పొనిగి హేమ కశిపుని గెలిచిన గెలుపులు
వెనక ముందరికి వేదములాయె ॥సురులకు॥

కలన కంసునటు గెలిచిన గెలుపులు
చెలగి బలిని గెలిచిన గెలుపు
అల శిశుపాలుని గెలిచిన గెలుపులు
బలు పుణ్యకథా భారతమాయె ॥సురలకు॥





కెరలి యసురులను గెలిచిన గెలుపులు
సిరుల నందరిని గెలిచిన గెలుపు
యిరవగు శ్రీవేంకటేశ నీ మహిమలు
సరవితో పురాణము లాయె ॥సురలకు॥

**భావామృతం :**

ఓ శ్రీహరీ! నీ చేతలు (పనులు లేక లీలలు), ఇటు దేవతలకు అటు మానవులకు కూడ శుభములాయె (శుభము కలిగించునవై యున్నవి) ఆనందకరములై యున్నవి.

(ఆ చేతలను వివరిస్తాను వినవయ్యా!) శ్రీరామచంద్రుడవై నీవు త్రేతాయుగంలో నీ భార్య సీతనపహరించాడని కినిసి (ఆగ్రహించి), రావణునితో యుద్ధం చేసి గెలిచి దుష్టశిక్షణ చేశావు. అట్లే ద్వాపరయుగంలో నీవు శ్రీకృష్ణుడవై బాణాసురుని చెనకి (ఎదిరించి) రణంలో గెలిచినా ఆ గెలుపు భాగవత కథ అయింది. నీవు కృతయుగంలో, నరసింహుడవై, పొనిగి (నిశ్చేష్టుని చేసి) హేమకశిపుని (కశ్యప సుతుడైన హిరణ్యకశిపుని) గెలిచితివి. ఆ గెలుపు ప్రహ్లాదుని చరిత్రయై ప్రసిద్ధి చెందినది. ఆ కథలన్నీ వెనక ముందరికి (ఇదివరకునున్న వారికి, భావితరాలవారికీ) వేదములాయెను (మంచి నడత యెట్లుండవలెనో చెప్పే వేద ప్రమాణములైనవి).

ఓ ప్రభూ! ఆనాడు, కలన (అందరికీ తెలియునట్లు) శ్రీకృష్ణుడవై, కంసుని సంహరించి గెలిచితివి. చెలగి (విజృంభించి) నీ పాదములతో లోకములన్నియు కొలిచి బలిని అణచి, అతని సత్ప్రవర్తనకు మెచ్చి వాని కావలివానివైతివి. దానవుల హృదయములను కూడ గెలిచితివి. అల (ఆనాడు) శిశుపాలుని నిందలు హద్దు దాటగనే చక్రముతో తల ఖండించి గెలిచితివి. ఆ పుణ్యకథలే మహాభారత గాథ అని కీర్తింపబడినది.

దేవా! ప్రతియుగములోను, కెరలి (దుష్టులపై ఆగ్రహించి) అసురులను (రాక్షసులను) రూపుమాపి గెలుచుచునే యున్నావు. నేడు సిరులన్ (కోరిన సంపదలు నొసగి) మమ్ము అందరిని గెలిచినావు. ఇరవగు శ్రీవేంకటేశ్వరా! (ఈ తిరుమలలో స్థానమైన ఓ శ్రీనివాసా!) నీ దివ్యమహిమలన్నీ సరవితో (క్రమముగా) పురాణములై మా చెవులకు అమృతమునందించినవి.

**6-65**

## మున్నుడి

"ఓ శ్రీ వేంకటేశ్వరా! ఎంత తెంపరివయ్యా! స్త్రీ పొందులోని సుఖం తెలుసును అంటావు. భోగించడం తెలిసిన రసికుడనంటావు. నీకు ఎన్ని వేలమంది భామినులున్నారు? నీకు ఆకు మడిచి ఇవ్వటానికి (తాంబూలమివ్వటానికి) సిద్ధముగా ఎంతమంది వున్నారు?" - అంటున్నారు అన్నమాచార్యులవారు. "ఈడులేని తిరువేంకటేశ" అంటే (అనాదివైన శ్రీవేంకటేశ్వర) అని అర్థం. "వాడుచు నీతోడ నేను వాసి చూపగలనా?" - అంటే అర్థమేమిటి? ఆలోచించండి... నా భావన నాలకించండి. అన్నమయ్య కూడా స్వామి ప్రియురాలే అయి వాపోతున్నారు.

**మత్తకోకిల:**

**పొందెఱుంగుదు నందువే, తగు భోగినందువు శ్రీహరీ!**
**ఇందరుండగ నీకు భామలు యెందు కాసలు నాపయిన్?**
**సందడిన్ మడిచిట్లు 'ఆకును' చక్కగా అందియ్యానా**
**అందుకోమని? యేమిదుస్థితి? అన్నమార్యుడుపాడెరా.**

**రాగం : మిశ్రశుద్ధధన్యాసి**

పొందెఱుగుదు నందవు భోగినందువు నీ
యందరు సతులకు నేనాకు మడిచి ఇత్తునా ॥పొందె॥

ఎవ్వతెకైనా చనవిచ్చేవు మెచ్చేవు నీ
నవ్వులకైనాను మన్ననజూ చేవు
అవ్వలియివ్వలి నీ యంగనల వొద్దను
పవ్వళించి యుండగా నే పాదము లొత్తుదునా ॥పొందె॥

ఏపున నెక్కడికైనా నేగేవు దాగేవు నీ
కోపాన నాతోనైనా మేకులు సేసేవు
వైపున నీ వెందుండైనా వచ్చిన నేనంతలో
నోపిక నప్పుడు నీకూడిగాలు సేతునా ॥పొందె॥





వేడుక లెందైనా పారవేసేవు నీ
వాడిక చేత లెన్నైనా వన్నె వెట్టేవు
ఈడులేని తిరువేంకటేశ కూడితివి నన్ను
వాడుచు నీతోడ నేను వాసి చూపగలనా ॥పొందె॥

**భావామృతం :**

ఇదేమి చోద్యమయ్యా! ఒక పక్క పొందెఱుగుదును (స్త్రీ సాంగత్యమెట్టిదో తెలుసును) అంటావు. భోగిని (రసికుడను)అంటావు. ఇంతా చేసి నీ భార్యలందరికీ నన్ను ఆకుమడిచి ఇవ్వమంటావు. నాగతి అంతేనా స్వామీ!

నీ పద్ధతి చూద్దామంటే వింతగావుంది. నీతో పరిచయమున్న ఎవ్వతెకైనా చనువునిస్తావు. దాన్నిమెచ్చుకొంటావు. నవ్వులతో మన్నన (గౌరవం) ఇస్తావు. అక్కడా ఇక్కడా అని చూడక నీ కామినులైన స్త్రీలతో నీవు పడుకొంటే నన్ను మీ పాదాలు ఒత్తమని అంటావా? ఇది నీకు న్యాయంగా వున్నదా స్వామీ!

గొప్పగా యెక్కడికిష్టమైతే అక్కడికిపోతావు. ఎవత్తె దగ్గరనైనా సరే దాగియుండెదవు. నీ కోపతాపాలు నా మీద చూపించి, మేకులు సేసేవు (సమ్మతింప చేస్తావు). నీ వెక్కడెక్కడో తిరిగి వస్తే నేను ఓపికగా నిరీక్షించి, అప్పుడు నీకు వూడిగాలు చేయమంటావా?ఇదేమి న్యాయం స్వామీ! నా గతి ఆవిడకు వూడిగాలు చేయటమా?

ప్రభూ! నీ విలాసములెందైనా పారవేసెదవు (నీ ఇచ్చవచ్చిన చోట వేడుకలతో గడిపేవు). నీ కలవాటైనా చేష్టలనెన్నైనా నిగ్గు చూపేవు. ఈడులేని తిరువేంకటేశా!(అనాదివైన శ్రీవేంకటేశ్వరా!) నన్ను నీవు కూడితివి. నీ కూటములతో నన్ను వాడిపోవునట్లు జేసితివి. నేను నిన్ను అధిగమించగలనా ప్రభూ!నేనెంతదానను?

**6-66**

## మున్నుడి

అన్నమయ్య కీర్తన అద్భుతమైన సీస పద్యంగా మార్చటం, అతి తేలిక అని, అనేక మార్లు అనీ అనీ అలిసిపోయాను. సకల జీవులకు సంజీవిని వంటి దివ్యౌషధం అందిస్తున్నారు ఆచార్యులవారు. ఈ మందు సులభమైనదే....కాని కీర్తన అంత సులభమైనది కాదు. ఎందుకో చదివి తెలుసుకోండి.

**సీ॥ సకల జీవులకెల్ల సంజీవి నీ మందు**
**వెకలులై జనులు సేవించు మందు**
**శేషాద్రిపైన అశేషమౌ యీ మందు**
**నల్లని కాంతుల నయపుమందు**
**ఏకాంత కోరిన ఆ కాంతకౌమందు**
**అంజనా గిరిపైన అలరుమందు**
**బలు శంఖచక్రాల బదనిక యీమందు**
**బ్రహ్మరుద్రాదులు బడయు మందు**

**ఆ.వె॥వేంకటాద్రి మీద వెలుగు జిమ్మెడి మందు**
**తలచిన వారికి తత్త్వ మందు**
**అన్నమయ్య పాడి అందించెనీ మందు**
**మించి నన్ను ఉద్ధరించు మందు.**

**రాగం :సంజీవి**

సకల జీవులకెల్ల సంజీవి యీ మందు
వెకలులై యందరు సేవించరో యీ మందు ॥సకల॥

మూడులోకములొక్కట ముంచి పెరిగినది
పోడిమి నల్లని కాంతి బొదలినది
వేడుక కొమ్మలు నాల్గు పెనచి చేయివారినది
నాడే శేషగిరి మీద నాటుకొన్న మందు ॥సకల॥





పడిగెలు వేయింటి పాము గాచుకున్నది
కడువేద శాస్త్రముల గబ్బు వేసేది
యెడయక వొకకాంత యెక్కుక వుండినది
కడలేని యంజనాద్రి గారుడపు మందు ॥సకల॥

బలు శంఖ చక్రముల బదనికెలున్నది
తలచినవారికెల్ల తత్వమైనది
అలరిన బ్రహ్మరుద్రాదుల బుట్టించినది
వెలుగు తోడుత శ్రీ వేంకటాద్రిమందు ॥సకల॥

**భావామృతం :**

ఓ జనులారా! మీరు సేవించబోతున్న ఈ మందు సకల జీవులకు సంజీవిని వంటి దివ్యమైన ఔషధం. ఇందరూ(వీళ్ళంతా) వెకలమై (అశక్తులై) సేవించరో (తీసికొనుడయ్యా!) ఈ మందు తప్ప, మీకు మరొక దిక్కులేదు.

మూడులోకములను ఒక్కటిగా మించి పెరిగిపోయిన మందండీ ఇది (త్రివిక్రముడైన వామనమూర్తి). పోడిమి (ఒప్పయిన) నల్లని కాంతితోన్, పొదలినది (వర్ధిల్లినది). వెల్లివిరైి నాలుగు కొమ్మలు భాఖోపంశాఖలైవిస్తరించినది (చతుర్వేదములు మూర్తీభవించిన వేదమూర్తియైన శ్రీమన్నారాయణుడే) ఈ మందు. నాడే (అనాదియై) శేషాచలము మీద నాటుకొని స్థిరపడిన మందు. త్వరత్వరగా సేవించండయ్యా!

పడిగలవేయింటి పాము గాచుకొన్నమందు (సహస్రఫణియైన ఆదిశేషుడు రక్షించే మందు) ఇదే. "కడువేదశాస్త్రముల గబ్బువేసేది".....(వేదములనుంచి జనించిన ఆరుశాస్త్రముల ఈమందు, సేవించిన వారికి, గబ్బువేస్తాయి....అంటే గర్వం తెప్పిస్తాయి). ఆ నాడు ద్వారకానగరంలో విడువక ఒక్కొక్క భామ దగ్గర ఒక్కొక్క రకంగా వున్న మందు ఇదేనండీ...మరి నేడు ఈ అంజనాద్రి, గరుడాద్రులపై నెలకొన్న మందు ఇదేనండీ.

ఈ మందుకి శంఖచక్రములు చెట్టుకొమ్మల్లా (బదనికలై) వ్రేలాడుచున్నవి. దీనిని ధ్యానించిన వారికి తత్త్వసిద్ధిని కూడా కలిగిస్తుంది. అంతెందుకు సృష్టి, లయ వ్యాపారములను నిర్వహించుచున్న బ్రహ్మగారిని, రుద్రుని పుట్టించింది కూడా ఈ మందేనండీ... నేడు కాంతులు చిమ్ముతూ శ్రీవేంకటాద్రి మీద దొరుకుతున్న సంజీవి ఇదే. రారండి ఈ మందు సేవించి తరించండి.

## 6-67

## మున్నుడి

అజ్ఞానులంతా భ్రమలో సంసారమును మకరందంతో పోల్చి అదే గొప్ప సుఖం అని చెబుతుంటారు. కాని నిజానికి దాంట్లో ఏ సుఖమూ లేదు. పైగా ఇతరులకుండే సౌలభ్యాలు కాని, నిర్విచారం కాని, ఈ సంసారికుండే అవకాశమే లేదంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ సంసారంలో తట్టువడుటే కాని (బాధలు పడుట తప్ప) ఒడ్డుకు చేరే అవకాశమే లేదు పొమ్మంటున్నారు. సంసారిగా ఉన్నంతకాలము శ్రీవేంకటేశ్వరుని యెఱుగలేదు. పైగా తన కర్మలకు ఆయనను నిందిస్తాడు. చచ్చేదాకా ఈ అజ్ఞానంలోనే ఏడుస్తాడు.

**తే॥ ఇలను సంసారికిని లేదు యెట్టి సుఖము**
**తట్టువడు కాని చేరడే దరి నతండు**
**అన్నమార్యుడు వినిపించె నద్భుతముగ**
**వేంకటపతికీ కీర్తన విరతి తోడ.**

**రాగం : ఆహిరి**

ఇట్టె సంసారి-కేదియు లేదాయ
తట్టువడుటేకాని-దరిచేరలేదు ॥ఇట్టె॥

ములిగి భారపు మోపు-మోచేటి వాడు
అలసి దించుకొను-నాడాడను
అలరు సంసారికి-నదియు లేదాయ
తొలగని భారమెం-దును దించలేదు ॥ఇట్టె॥

తడని వేపచేదు-త్రావెడి వాడు
ఎడయెడ దిను దీ-పేమైనను
అడరు సంసారికి-నదియు లేదాయ
కడు జేదె కాని యె-క్కడ దీపు లేదు ॥ఇట్టె॥





దొరకొని హేయమే-తోడేటి వాడు
పరితవించును మేన-బరిమళము
అరిది సంసారికి-నదియు లేదాయ
ఇరవు వెంకటపతి-నెఱుగ లేదు ॥ఇట్టె॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఇట్టె సంసారికేదియులేదు. (ఇటువంటి సంసారములోనున్న అజ్ఞానికి ఎటువంటి సుఖమూ లేదు). తట్టుపడుటే కాని (దేనికో ఒకదానికి బాధపడుట తప్ప) దరి చేరలేదు (ఈ సంసారసాగర తీరానికి మాత్రం చేరుకోలేదు).

పెద్ద పెద్ద బరువులు మోసి జీవించే వానికి, అలిసిపోతే యెక్కడో ఒక చోట ఆగి, కాసేపు బరువు దించుకొని, సేదదీరే అవకాశం వున్నది కదా! కాని సంసారికి ఆ అవకాశం లేనే లేదాయె. ఆ బరువును ఎక్కడాదించలేదు.

తడని (పొరబాటున) వేప చేదు రుచిచూస్తే, తప్పుగ్రహించి యెడయక (వదలకుండా) ఏమైనా తీపి పదార్ధం తిని ఆ ఇబ్బంది నుంచి బయటపడవచ్చును. అడరు (యాతనలు పడుతూ చేదు అనుభవాలను పొందుతున్న) సంసారికి అదియులేదు (తన పొరబాటు దిద్దుకొనే అవకాశం వున్నదా? అది లేనే లేదు) వాడికి విపరీతమైన చేదే కాని తీపి అనేది వుండనేవుండదు.

దొరకొని (అదే వుద్యోగము అవుట చేత)హేయమును (అశుద్ధమును) తోడేటివాడు (యెత్తిపారేసి బాగుచేసేవాడు) తరువాత చక్కగా స్నానం చేసి పరిమళద్రవ్యాలు వాడి మేను (శరీరాన్ని) బాగుచేసికొనవచ్చును కాని, అరిది (దుర్గమమై) సంసారికి ఆ అవకాశం లేనే లేదు. వాడు ఆ సంసారయావు వున్నంతకాలము శ్రీవేంకటేశ్వరుని యెఱుగలేదు. (అంటే తిరుమల చూడడని కాదు ఆ తిరుమలయ్య వాడిని చూడడని అర్థం).

## 6-68

## మున్నుడి

ఇది దశావతార వర్ణన అని తేలికగానే అర్థమవుతున్నది కానీ, అన్నమాచార్యులవారు యెవరినుద్దేశించి ఈ కీర్తన చెబుతున్నారో అంతతేలికగా బోధపడదు. మెదట అమ్మవారినుద్దేశించి అనుకున్నప్పటికీ, “కలికియాయె నీ సంగతి కొరకే” అనగానే....కాదనిపించింది. ఆ పైన “శైలమెత్తె నీ కుచములెత్తే కొరకే” అనగానే మళ్ళీ అవుననిపించింది. కానీ ఆలోచిస్తే హరి పది మాత్రమేనా యెన్ని అవతారాలెత్తాడు!!...దేని కొరకు? ధర్మం కొరకు. వామనుడయింది అమ్మవారి కోసం కాదు....‘అరి’ని యాచించాడు ‘హరి’.....నీకొరకే అంటే ధర్మం కొరకే అని భావించాను, నేను.

**కం॥ “ఇందుకె చేతలు జేసెను**
**పొందుగ కన్నులని పొద్దుపుచ్చెను కదవే!”**
**పొందెను పది రూపులు ‘హరి’**
**అందించగ ధర్మమనెను అన్నయ్య భళా!!**

**రాగం : భూపాలం**

ఇన్ని చేతలును జేసె నిందుకొరకే వీడు
కన్నులని పొద్దుపుచ్చీ గదవె నీ కొరకే ॥ఇన్ని॥

మీనమాయె జెమట ల మేను ముంచు కొరకే
తానే కమఠము నాయె దాగు కొరకే
ఆనుకొని కిటియాయె నదలించు కొరకే
మానదు కంబము చాటు మారుమెము కొరకే ॥ఇన్ని॥

కాలుచాచె నేలమీద గమనించు కొరకే
జాలిబెట్టె చేతులనే చంపు కొరకే
యేలికాయె విరహుల నేపెడి కొరకే
శైలమెత్తె నీ కుచములెత్తే కొరకే ॥ఇన్ని॥





కలవెల్ల నిరసించె గదవే నీ కొరకే
కలికియాయెను నీ సంగతి కొరకే
వలపుల వేంకటేశ్వరుడు లోకమున
చెలువముతో మెరసెను నీ కొరకే ॥ఇన్ని॥

**భావామృతం :**

ఓ ధర్మదేవతా! బ్రహ్మసృష్టిని, రుద్రుడు ‘లయ’ కార్యమును నిర్వహిస్తున్నప్పటికీ బహుకష్టతరమైన ‘స్థితి’ బాధ్యతను శ్రీహరి నిర్వహిస్తున్నాడు లోకాలు సురక్షతో వుండాలంటే..ధర్మం చక్కగా రక్షించబడాలి. ధర్మ విఘాతకులైన దుర్మార్గులను తుదముట్టించాలి. ధర్మదేవతకి అండకావాలి. ఇందుకే వీడు (ఈ శ్రీహరి) ఇన్ని చేతలు (పనులు) చేసెను. కన్నులని పొద్దుపుచ్చే కదవే నీకొరకే (జన్మలనెత్తాడు కదటే నీ కోసం...అంటే నిన్ను సుస్థిరంగావుంచటం కోసమే కదమ్మా!)

“మీనమాయె... (మత్స్యావతారం యెత్తి) మేను చెమటలముంచెను” (కష్టించి...వేదములనే కాక,ఋషులను సన్మార్గులను ప్రళయంనుంచి రక్షించాడు)” “తానేకమఠమునాయె దాగు కొరకే” (తానే తాబేలుగా అవతరించి మంధర పర్వతం క్రింద దాగికొని దానిని రక్షించాడు. “ఆనుకొని కిటియాయె నదలించుకొరకే” (ఆనుకొని అంటే, ధరించి...వరాహమైనది, అదలించు కొరకే దనుజులను బెదిరించుటకే). “కంబము చాటుమానదు,మారుమోము కొరకే), “కంబము చాటు మానదు, మారుమెము కొరకే” (స్తంభములో మరొక ముఖముతో దీని కొరకే వున్నాడు...అంటే నరసింహుడై ధర్మరక్షకొరకే దాగి హిరణ్యకశిపుని చంపాడు).

“కాలు చాచె నేల మీద గమనించు కొరకే” (నేల....మీద కాలు చాచి భువనాలన్నీ నింపివేసిన త్రివిక్రముడైనాడు.... దేనికి? గమనించు కొరకు...బలిని పోగొట్టుటకు). “జాలిబెట్టె చేతలనే చంపుకొరకే” (తన బ్రాహ్మణ కర్తవ్యాన్నే త్యజించాడు.....దుష్టులను చంపుకొరకే...పరశురాముడు). “యేలికాయె విరహుల నేపెడి కొరకె” (చక్రవర్తి అయ్యాడు విరహంతో పరితపించుటకే శ్రీరాముడు). “శైలమెత్తె నీ కుచములెత్తే కొరకే” (కొండనెత్తాడు నిన్ను పులకరింపచేయుటకు.....శ్రీకృష్ణుడు)

“కలవెల్ల నిరసించె గదవే నీకొరకే” (నీ కోసం చేయకూడని పనులను కూడా చేశాడు కదా!.... బుద్ధావతారం) “కలికియాయె నీ సంగతి కొరకే” (నీకోసం.. అంటే ధర్మంకోసం కలికి అవతారం యెత్తాడు). ఈ కలియుగంలో నీ కొసమే ప్రేమలుపంచే “శ్రీవేంకటేశ్వరుడై” స్నేహంతో లోకములలో మెరసె..వెలుగులు జిమ్ముచున్నాడు.

**6-69**

## మున్నుడి

తిరుపతిలో వెలసిన గోవిందరాజ స్వామివారిపై సరస శృంగార కీర్తనను చెబుతున్నారు అన్నమాచార్యుల వారు. శ్రీదేవి, భూదేవి ఆయన పాదాలు ఒత్తి సేదతీరుస్తుంటే, శంఖ చక్రాలు ధరించిన ఆ స్వామి ఒక చేయి తలక్రింద ఉంచుకొని ఠీవిగా పవళించి యుంటాడు. స్త్రీలందరు బారులు తీరి స్వామిని సేవించడానికి ఆయన కొలువుకు చేరుకుంటున్నారు. వారిలో తాను కూడా ఒకతెయై అన్నమయ్య కీర్తన నాలాపిస్తున్నారు. 'సంకె లేక, వువిదల గూడినాడు లోలోన, వారిలో ముచ్చట వినరే' అని విడదీసికోనిదే కీర్తన భావం అర్థం కాదు.

**ఆ.వె॥ కొలువు దీరినాడు గోవిందరాజులు**
**చేరి మ్రొక్క వలదె? చెలుల మిపుడు**
**సతులు సేవజేయ సంకు చక్రాలతో**
**అలరినాడు యనెను అన్నమయ్య**

**రాగం : శంకరాభరణం**

కొలువూ జేయించు కొనీ గోవిందరాజు
చెలులము యీాడ నుండే చేరి మొక్కరే ॥కొలువూ॥

పవళించి వున్నవాడు పాదాలు చాచుకున్నాడు
జవళి దన యిద్దరు సతులు మీద
రవళి గోవిందరాజు రవ్వగా నవ్వులు నవ్వీ
తివిరి యీ భావము తెలుసుకోరే ॥కొలువూ॥

చేయిచాచుకున్నవాడు శిరసెత్తుకున్నాడు
చాయల గోవిందరాజు సన్నసేసీని
ఆయములు సోకించి అంగనల గరగించీ
కాయపు టిచ్చల నూడిగము సేయరే ॥కొలువూ॥





సంకు జక్రముల వాడు చల్లుచున్నాడు వలపు
కొంకక శ్రీవేంకటాద్రి గోవిందరాజు
వుంకువగా లోలోనే వువిదల గూడినాడు
సంకెలేక వారిలో ముచ్చట వినరే ॥కొలువూ॥

**భావామృతం :**

ఓ వనితల్లారా! గోవిందరాజ స్వామి తన ముద్దు సతులతో కొలువుదీరి యున్నాడు. వారు ఆయనకు ఏకాంత సేవ చేయుచున్నారు. చేరి ఆ స్వామికి చెలలమందరమూ యీాడనుండే (ఇక్కడి నుంచే) మొక్కెదము, తరలి రండు.

ఈ స్వామి తన పాదాలను ఠీవిగా చాచుకొని తన ముద్దు సతుల ఒడిలో పాదాలు ఉంచుకొని ఆ ఇద్దరూ, జవళి (జంటగా) తనపాదాలు ఒత్తుచుండగా పవ్వళించి యున్నాడు. ఈ గోవిందరాజు రవళి, రవ్వగా నవ్వులు నవ్వీ (నర్మగర్భంగా కొద్దిగా శబ్దం వచ్చేట్లు నవ్వులు చిలుకరిస్తున్నాడు). ఈ నవ్వుల భావమేమిటో, తివిరి (ప్రయత్నించి) మీరు తెలుసుకోరే (తెలుసుకోండే). వారికి అందుకనే దూరంనుంచే నమస్కరించండి.

ఈ చాయల గోవిందరాజు (కాంతుల జిమ్ము గోవిందరాజు) శిరస్సును ఒకచేత యెత్తి యుంచి, ఇంకొక చేయి చాచుకొని ఉన్నాడు. చాచినచేతితో తన భార్యలకు సన్నలు సేసీని (సైగలు చేస్తున్నాడు). ఆయములు సోకించి (మర్మస్థానములంటి) అంగనలను (తన భార్యలను) కరిగించి (పరవశింప చేయుచున్నాడు). వారికి, కాయపుటిచ్చల(అంతులేని కోరికలు దీరునట్లు) వూడిగము సేయరే (సేవలు చేయండే!)

శంఖ చక్రాలు ధరించియున్న ఈ గోవిందరాజు, కొంకక (భయములేక... అంటే... బిడియము లేక) వలపులు(తన ప్రేమను) వెదజల్లుచున్నాడు. తన ఉవిదల (భార్యలను) గూడినాడు (కలిసియున్నాడు). సంకెలేక లోలోనే ఉంకువగా నున్నాడు (లోపల్లోపలే, యేవేవో అంతులేని ముచ్చటలాడుతున్నాడు). ఓ అమ్మలారా! వారిలో ముచ్చట్లు (రహస్యాలు) వినరే (వినండమ్మా! మీదే అదృష్టం... అంటే)

## 6-70

## మున్నుడి

గొప్ప ఆధ్యాత్మిక కీర్తనను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆనాటి కడపజిల్లా తెలుగు మాండలికాలతో ఈ కీర్తన విని తీరాల్సిందే. "మెడవట్టి నూకటం", "వాయెత్త నీయకపోవటం" ఆనాడు విస్తృతంగా వాడబడిన రాయలసీమ మాండలికాలు. పరమాత్మ నిర్ణయం ప్రకారం దైవికంగా కొన్ని మన జీవితంలో జరిగిపోతూనే ఉంటాయి. వాటిని ఆపే శక్తి ఎవ్వరికీ లేదు. జీవుడెంతటివాడు? చిత్తము (మనస్సు) యెంతటిది? శ్రీవేంకటేశ్వరుడు తలుచుకోకపోతే మనగతేమిటి? మనవల్ల యేమవుతుంది చెప్పండి?

**ఉ॥ ఎంతటివాడు జీవుడును యెంతటి దాతని చిత్తమెంచగా**
**ఎంతటి వాడు తానయిన నెవ్విధి దైవికమున్ జయించు శ్రీ**
**మంతుడు వేంకటేశ్వరుని మన్ననగానక నెగ్గజాలునే?**
**ఇంతటి గొప్పకీర్తనము నెవ్విధి జెప్పెనొ! అన్నమార్యుడున్.**

**రాగం : దేశి**

జీవుడెంతటివాడు చిత్తమెంతటిది తన-
దైవికము గడవ నెంతటి వాడు దాను ॥జీవు॥

విడిచి పోవని యాస విజ్ఞానవాసనల
గడచి మున్నాడె నెక్కడి వివేకములు
వుడుగనియ్యని మోహముబ్బి పరమార్థముల
మెడవట్టి నూకె నేమిటికింక నెరుక ॥జీవు॥

పాయనియ్యని మహాబంధ మధ్యాత్మతో
రాయడికి దొడగె సైరణలేల కలుగు
మాయనియ్యని కోపమహిమ కరుణామతిని
వాయెత్తనియ్య దెవ్వరికి జెప్పెదము ॥జీవు॥





సరిలేనియాత్మ చంచల మంతరాత్మకు ని-
నెరగనివ్వదు దనకు నేటి పరిణత(తు)లు
తిరువేంకటాచలాధిపుని మన్ననగాని
వెరసి యిన్నిటి గెలువ వెరవు మఱి లేదు ॥జీవు॥

**భావామృతం :**

ఓ మానవులారా! ఆలోచించండి. మనలో ఉన్న జీవుడు యేపాటి సామర్థ్యం ఉన్నవాడు? పాదరసం వలె అతి చంచలమైన వాడి 'చిత్తము' (మనస్సు) యేపాటి సామర్థ్యం ఉన్నది? దైవికముగా (పరమాత్మ నిర్ణయం ప్రకారం) జరిగే వాటిని ఆపగల శక్తి మనిషికి ఉంటుందా? (అసంభవం).

మనలో విజ్ఞానపు వాసన (భగవత్తత్త్వ జ్ఞానము యొక్క అనుభూతిని కలిగించు 'స్మృతి') వలన వివేకము కలుగుతుంది. కాని విడిచిపెట్టలేని ఆశ అనే భ్రమ, ఎంత వివేకాన్నయినా అణగించి ఉడుగనియ్యని (కృశింపనియ్యని) మోహము కలుగుతుంటుంది. అది, వుబ్బిన (సమృద్ధిగానున్న) పరమార్థమును (మోక్షజ్ఞానమును) 'మెడపట్టి నూకుతుంది' (ఇంట్లోంచి మెడపట్టి గెంటేస్తుంది). ఏమిటి కింక నెరుక? (ఇక జ్ఞానమనేది ఎలా కలుగుతుంది?)

మహా బంధము (మమతానురాగాల వల్ల కలిగే "బాంధవ్యాలు" పాయనియ్యనివి (అతిక్రమించలేనివి). ఆ బంధాలలో కట్టుబడిన 'రాయడి' కి (ధనికుడికి) తొడగె సైరణ లేల కలుగు? (మొదటినుంచి 'సహనం' యెలా అబ్బుతుంది?) వాడిలో ఏదో ఒకమూల మనస్సులో కరుణ ఉన్నా, వాడికి 'ధనమదం' వల్ల మాయనియ్యని (అణచలేని) కోపము యొక్క మహిమ, ఆ కరుణామతిని వాయెత్త నియ్యదు (నోరు విప్పనివ్వదు). ఎవ్వరికి చెప్పెదము? (మనం ఎవరికేమి చెప్పగలము?).

సరిలేని ఆత్మ (ఇంకొక దానితో పోల్చలేని ఆత్మ) మహా చంచలమైనది. మన అంతరాత్మ, పరమాత్ముని అంశ అయిననూ అది నినెరగనివ్వదు (తనెవరో తెలుసుకోనివ్వదు). ఇక 'తనకున్ యేటి పరిణతులు?' (తనలో మార్పు ఎలా కలుగుతుంది? అసాధ్యం. కానీ తిరుమలాధిపుడు, శ్రీవేంకటేశ్వరుని మన్ననన్ కొని (ఆదరణ కలిగితే) వీటన్నిటిని వెరసిగెలిచి (చివరికి జయించి) వర్ధిల్లుతాడు. ఇక వాడికి భయములేదు.

**6-71**

## మున్నుడి

తిరుమలలో స్వామివారి ఉద్యానవనంలో పూచిన పూలతో పుష్పయాగం నిర్వహిస్తారు. రకరకాలైన పుష్పాలతో స్వామిని నిలువెత్తునా అలంకరిస్తారు. నయనానందకరమైన ఆ సంప్రదాయం నేటికీ అలా కొనసాగుతూనే ఉన్నది. అన్నమాచార్యులవారు ఒకనాటి పుష్పయాగం సందర్భంగా గానం చేసిన మధురమైన కీర్తన ఇది. స్వామికి పురాణకాలంలో జరిగిన 'పుష్పయాగాలను' కూడా వివరిస్తున్నారు. నాటి భారతయుద్ధంలో పార్థసారథి 'యైన స్వామిపై భీష్ములవారు వేసిన శరపరంపరలే అర్జునుడు చేసిన పుష్పయాగం అంటున్నారు.

**కం॥ అందరు జేసే పూజలు**
**అందంబగు "విరుల పూజ"లన్నయ్యనెరా**
**పొందుగ కిరీటి రణమున**
**విందుగ 'శర విరుల' పూజ వెలయించె ననెన్.**

**రాగం : హంసనాదం**

పూజలందరు జేసేదే పుష్పయాగము
అజి నర్జునుడు చేసినది పుష్పయాగము ॥పూజ॥

మొదట శ్రీసతి చేతి మోహన కమలమే
పొదల నీకెపుడును పుష్పయాగము
గుదిగొని మిమ్మిద్దరిని గూడించే మరు విరులు
పొదిగి పూజించిన పుష్పయాగము ॥పూజ॥

మాలాకారుడిచ్చిన మధురలో పూదండ
పోలింప నీకునదె పుష్పయాగము
కేలితో నారదుడొసగిన పారిజాతము
భూలోకమున నీకు పుష్పయాగము ॥పూజ॥





తొరలి అలమేల్మంగ తురుమున విరులే నీకు
పొరలి నీవురముపై పుష్పయాగము
సిరులతో మునులెల్ల శ్రీవేంకటాద్రీశ నీకు
పొరిపొరి జేసేరు పుష్పయాగము ॥పూజ॥

**భావామృతం :**

ఓ దేవదేవా! అందరూ నీకు ప్రీతి కలుగుటకు యజ్ఞమూర్తివైన నీకు అనేక యాగాలు చేస్తుంటారు. అందులో పుష్పయాగం ఒకటి. ఈ సంప్రదాయం నేటికి కాదు. ఆనాడు 'అజిన్' (భారతయుద్ధంలో) అర్జునుడు చేసినది కూడా శర పరంపరల పుష్పయాగమే.

మొట్టమొదట క్షీరసాగర సంజనితయైన శ్రీలక్ష్మి చేతనున్న మోహన కమలమే నిన్ను స్పృశించి, నీకెప్పుడు ఒక పుష్పయాగము వలె పొదలినది (వర్ధిల్లినది) ఆదిదంపతులైన మీ ఇద్దరినీ, గుదిగొని (అతిశయించి) కూడించే (జతయగునట్లు చేయు) మరు విరులే (మన్మథ బాణములే) పొదిగి (సామూహికముగా) పూజించిన పుష్పయాగము.

అలనాడు నీ శ్రీకృష్ణావతారములో నీవు కంసుని మధురానగరం సందర్శించినప్పుడు, ఒక మాలాకారుడు (పూలదండలు చేయువాడు) భక్తితో నీకు ఒక పూదండ సమర్పించినాడు. పోలింప(పోల్చి చూడగా) నీకు భక్తితో వేసిన ఒక చిన్న పూదండయే పుష్పయాగం వలె నిన్నానందపరచినది. కేలితో (తన స్వహస్తాలతో) నారదుడు ఆనాడు ద్వారకలో నీకు పారిజాత పుష్పం ఇచ్చి సత్యభామ గర్వభంగమును నీ కృష్ణలీల ప్రదర్శింపచేసినవైనమే భూలోకంలో ఆ ముని నీకు నిర్వహించిన పుష్పయాగము.

ఓ శ్రీనివాసా! ఈనాడు కలియుగంలో తిరుమలలో అలమేలుమంగమ్మ తురుమున (కొప్పులో) తొరలిన (ఉన్నటువంటి) విరులే (పూవులే) నీ వురముపై నిర్వహించబడిన పుష్పయాగం (ఆచార్యులవారి ఈ మాటకు అర్థం తిరుమలేశునికి తెలుసు) సరే, అవన్నీ నీ లీలలే. కాని తిరుమలపై అదృశ్యరూపులైన మునీశ్వరులంతా పొరిపొరి (మాటిమాటికీ) పుష్పయాగం చేస్తే పుష్పాలు రాలి మాకు పూలవర్షంలా కనిపిస్తోంది. అదికూడా నీ లీలయే తండ్రీ!

## 6-72

## మున్నుడి

శ్రీహరినామ సంకీర్తన యొక్క మహిమను వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. శ్రీమన్నారాయణుని నామము బుద్దిని (వివేకము నాసించే మనస్సును) చేరినా (దగ్గరైనా) చాలును. దానితో పోలిస్తే, సిరులేమి 'బాంతి' అంటున్నారు. అంటే ఈ సంపదలు వైభవాలు యేమి "ఎక్కువ?" అని ప్రశ్నిస్తున్నారు. 'బా' తరువాత 'ం' (అరసున్న) వుండితీరాలి. ఈ కీర్తనలోని చాలా తెలుగు మాటలు నేడు వాడుకలో లేవలీవీ. నిఘంటువులన్నీ తిరగవేయకపోతే లాభంలేదు.

**మ॥ నరుడా! నామము చాలదా, మదిని ఓ నారాయణా యన్నచో**
**వరమై బుద్ధిని జేరినా, సరికదా! పాపాలు తెంచున్ కదా!**
**సిరులింకేటికి? 'బాంతి' యౌనె! అనెరాచేబూని అన్నయ్యయున్**
**హరి! నీ ప్రేరణ, 'భావమున్' తెలిపితిన్ ఆరాధనే నీకిదై.**

**రాగం : సామంతం**

నారాయణ నీ నామము బుద్ధి-
జేరినా జాలు సిరు లేమి "బాంతి" ॥నారాయణ॥

నను పైన శ్రీ విష్ణునామము పేరు-
కొనగానే తేకువమీరగా
ఘనమైన పుణ్యాలు గలుగగా తమ-
కనయము బర మది యేమి "బాంతి" ॥నారాయణ॥

నలుపైన శ్రీహరి నామము మతి-
దలచిన నా బంధము లూడగా
యెలమి దీని బఠియించినా యీ-
కలుషము లేల కలుగు నెవ్వరికి ॥నారాయణ॥





వేంకటపతి నామవిభవము కర్మ-
పంకములెల్ల బరిమార్చగా
బింకమై తలపెడి ప్రియులకు, యెందు-
నింక నీ సుఖమిది యేమి 'బ్రాంతి' ॥నారాయణ॥

**భావామృతం :**

ఓ నారాయణమూర్తీ! నీ నామము మా బుద్ధిని (వివేకమునాసించు మనస్సును) జేరినా (దగ్గరైతే) చాలును. మాకు సిరులేమి "బాంతి" (యెక్కువ)? అంతకన్నా అదృష్టమేమున్నది?

నను పైన (ఇంపైన) 'విష్ణుమూర్తి' నామమును పేరుకొనగానే (ఉచ్చరించగానే) తేకువ మీరుతుంది. (ధైర్యము కలుగుతుంది). ఘనమైన పుణ్యములు కలుగుతాయి. ఇది సత్యం. దానితో పోల్చిచూస్తే, "తమకు అనయమున్ పరము అదియేమి బాంతి" (మీకు అవశ్యముగా పైనున్న స్వర్గం లభిస్తే అది ఏమి ఎక్కువ?)

నలుపైన శ్రీహరి నామము (అంటే... నల్లని శ్రీహరి అనికాదు. సామర్థ్యముగల విష్ణునామము, అని అర్థం) ఆ నామాన్ని మనస్సులో స్మరిస్తే చాలును. బంధములన్నీ (పీకులాటలన్నీ) తొలగిపోతాయి. దీనిని యెలమి( సంతోషంతో) పఠించినా (పలికినా) చాలును. అలా చేస్తే ఎవ్వరికైనా కలుషములు (పాపములు) యేల కలుగును?

ఈ దుస్సహమైన కలియుగంలో వేంకటేశ్వరుని "ఓం నమో వేంకటేశాయ" అని అంటే చాలును. ఆ నామ వైభవము కర్మపంకమును (దుష్కర్మల వల్ల అంటిన బురదను) పరిమార్చగా (కడిగివేస్తుంది) కదా! ఇక, బింకమై తలపెడి ప్రియములకు (గర్వమును పెంపొందింప జేసే కోరికలు) సిద్ధించినా దానివల్ల కలిగే సుఖములు యేమి బ్రాంతి? (ఏమి యెక్కువ?) ఆ సుఖాలు రేపు దుఃఖాలవుతాయి. వాటివల్ల ఏమి ఉపయోగమూ లేదు.

## 6-73

### మున్నుడి

దేవి అలమేలుమంగ మీద మధురమైన కీర్తననందిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆమె చెక్కిళ్లు మెరిసిపోతున్నాయట. "తరి తొడి రతులను దైవారవమ్మా" అంటున్నారు. నీ స్వామికి చేరువై క్రీడించి అతిశయించవమ్మా అని జగన్మాతకు సలహా ఇవ్వగల సత్తా ఒక్క ఆచార్యులవారికే ఉన్నది. "మరి హరి మురిసి కరిగిపోడా"!.. అని నాకూ అనిపించింది. కీర్తన ఆఖరి చరణాలలో నాకు ఒక మెలిక కనిపించింది. అదేమిటో తెలియాలంటే భావామృతం చదవక తప్పదు, మరి. ఆచార్యులవారు దేవి చెలికత్తె! అయ్యారు.

**తే॥ మెరుగు చెక్కుల వో అలమేలుమంగ!**
**రతుల దైవారవమ్మ! శ్రీరమణుతోడ**
**సరస శృంగార గీతి శ్రీసతికి పాడె**
**అన్నమార్యుడు తనివార హరి మురిసెను.**

**రాగం : బిందుమాలిని**

మెరుగు చెక్కుల అలమేలమంగా
తరి తోడి రతులను దైవారవమ్మా ॥మెరుగు॥

చనవులు నీకిచ్చి చక్కని వదనమెత్తి
పెనగీనాతడు నిన్ను ప్రేమతోడను
కనువిచ్చి చూడవమ్మ కందువల నవ్వవమ్మ
మనసిచ్చి యాతనితో మాటలాడవమ్మా ॥మెరుగు॥

పొందులు నీతో నెరపి పూచి నీపై చేయివేసి
చిందీ నీపై నతడు చిఱుచెమటలు
విందుల మోవియ్యవమ్మ వేడుకలు చూపవమ్మ
అందుకుని ఆకుమడిచాతని కీయవమ్మా ॥మెరుగు॥





గక్కునను గాగిలించి కరుణ నీపై నించి
ఇక్కువ గూడె శ్రీవేంకటేశుడు నిన్ను
వక్కణ లడుగవమ్మ వన్నెలెల్లా జూపవమ్మ
నిక్కుచు నురముమీద నిండుకొనవమ్మా ॥మెరుగు॥

**భావామృతం :**

తల్లీ! అలమేలుమంగా! నీవు మెరిసిపోతున్న చెక్కిళ్ళుగల దేవివమ్మా! శ్రీరమణుడు నీకు తఱితోడ (చేరువయై) రతులతో దైవారవమ్మా! (అతిశయించవమ్మా!)

ఓ దేవీ! చనవులు (అనురాగము) నీకిచ్చిన స్వామి నీ చక్కని ముఖమును చేతితో పైకెత్తి ప్రేమతో పెనగినాడు. అరవిందాక్షులను విప్పారించి నీ విభుని వీక్షించవమ్మా! కందువల (ఏకాంత స్థలమైనందున) మనస్ఫూర్తిగా నవ్వవమ్మా! మనస్సు విప్పి మాట్లాడవమ్మా!

నిన్ను పొందిన నీ స్వామి తన చేతులు నీపై వేసినాడు. స్వామి చెమటలు నీపై చిందినవి. ఇక విందైన నీ అధరమా అందాల స్వామికి అందియ్యవమ్మా! నీ సంతోషము ప్రకటించవమ్మా! ఆయనకు అందుకుని (తీసికొని) నీ చేతితో సాదరంగా, ఆకుమడి చాతనికి అందియ్యవమ్మా! (తాంబూలం అందియ్యవమ్మా!)

ఓ దేవీ! ఆ శ్రీవేంకటేశుడు గక్కున (హఠాత్తుగా) నిన్ను పరిష్వంగము చేసికొని, నీపై కరుణ జూపి నిన్ను కూడినాడు. నీవు అంతలోనే మైమరచిపోవద్దు. వన్నెలు జూపవమ్మా (నీ చాతుర్యమును చూపి) స్వామిని, ఇక్కువ వక్కణ లడుగవమ్మా! (ఇప్పటిదాకా ఎక్కడ ఉన్నాడో ఈ ఆలస్యానికి కారణమేమిటో, వ్యాఖ్యానించమని అడుగవమ్మా!) ఆ తరువాత నిక్కుచు (గర్వముతో) ఆయన వురము నెక్కవమ్మా! (స్వామి హృదయ పీఠికనధిష్ఠించవమ్మా! నీదే భాగ్యమంటే).

## 6-74

## మున్నుడి

పరమాత్మను యోగులు, మునులు నిరాకార నిర్గుణ పరబ్రహ్మగా గుర్తించి ధ్యానంలో, తమ చిత్తము లగ్నం చేసి మోక్షం పొందారు. కొంతమంది సాకారుడైన శ్రీహరిగా చింతించి ఆయన శరణాగతిని బొంది నిరంతరం కీర్తించి ముక్తిని పొందారు. అన్నమాచార్యులవారు రెండవ మార్గం యెన్నుకొని 32 వేలు పైగా కీర్తనలు రచించి హరి సాయుజ్యం పొందారు. ఆ పద్మాక్షుని నామ సంకీర్తనము, శరణాగతి, కీర్తనము, పూజనము భక్తివలన తరించానంటున్నారు. తిరుమలేశుడు పట్టినవారికి బలువగు కొమ్ము అంటున్నారు. అంటే...

**కం॥ ఓహో! నిలిచిన దొకటిదె**
**శ్రీహరి సాకారరూప చింతనము భళా!!**
**ఈహితము దీర్చగలదనె**
**ఆహా! అన్నయ్యపొగిడె హరిచింతనమున్**

* ఈహితము = కోరబడినది (కోరిక)

**రాగం : శ్రీరాగం**

ఓహో నిలిచిన దొకటిది యే
శ్రీహరి సాకార చింతనము ॥ఓహో॥

పంచమ వేదపు పద్మాక్ష నామము
అంచెపాపహర మౌషధము
పంచల పీతాంబరు శరణాగతి
ముంచిన అజ్ఞానమునకు దీపము ॥ఓహో॥

విందుల కుడుపులు విష్ణుకీర్తనము
చందపు వైకుంఠ సంబళము
పొందుగ నచ్యుతు పూజించు పూజలు
కిందట గొనకెక్కెడి నిచ్చెనలు ॥ఓహో॥





కట్టిన ముడుపగు ఘనకృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము
యిట్టి శ్రీ వేంకటేశ్వరుని కృప యిది
పట్టిన వారికి బలువగు కొమ్ము ॥ఓహో॥

**భావామృతం :**

ఓహో! (ప్రజలారా) ఈ ప్రపంచంలో స్థిరముగానిలిచియున్నది యొక్కటియే సుమా! తక్కినవన్నీ అశాశ్వతమైనా, నేటికీ శ్రీహరి యొక్క సాకారచింతనము (ఒక రూపమువున్న వాడను భావన) నిలిచియున్నది (వర్ధిల్లుతూనే వున్నది).

శ్రీమన్నారాయణుడు పంచమవేదముగా కీర్తించబడుతున్న మహాభారతములోని నాయకుడు. ఈ పద్మనయనుని నామ పారాయణము, అంచపాపహరము (అంచెలంచెలుగా హరించును). అట్లు హరించుటకు ఆ దేవుదేవుని నామము దివ్యౌషధము వలె పనిచేయును. పీతాంబరుని (పసుపు పచ్చ రంగుగల పట్టు వస్త్రము ధరించు స్వామి) పంచల శరణాగతి (సర్వశ్రేష్ఠమైన శరణాగతి, అధికమైన అజ్ఞానాంధకారమును పోద్రోలు దీపము.

విష్ణుదేవుని కీర్తనము, విందుల కుడుపులు (విందు భోజనమై) వైకుంఠ సమారాధన వలె అందరినీ తృప్తి పరచును. అచ్యుతునికి చేయు పూజలు పొందుగ (చక్కగా) గొనకెక్కు (మోక్షపథము చేరగల) నిచ్చెనలు. (మెట్లు కావు కాబట్టి, జాగ్రత్తగా ఎక్కాలి. ఎంత ఎక్కువ కెక్కితే అంత పడిపోయే ప్రమాదం ఉన్నది).

ఘనుడైన కృష్ణపరమాత్మపై అచంచల భక్తితో ముడుపులు (మొక్కుబడులు) కడితే, అవి ముట్టిన (అంటుకొనిన) పాపములను నిర్మూలిస్తాయి. ఇదేవిధంగా శ్రీవేంకటేశ్వరుని కరుణను పొందితే యిది పట్టినవారికి బలువగు కొమ్ము (బలిష్టమైన కొమ్ము). సంసారసాగరంలో పడి దిక్కు తెలియక కొట్టుకుపోతుంటే... ఆ కొమ్ము దొరికిందంటే దాన్ని పట్టుకొని రక్షించుకోవచ్చును).

**6-75**

## మున్నుడి

తిరుమలపై శ్రీ వేంకటేశ్వరుని రథోత్సవంలో పాల్గొన్న అన్నమాచార్యులవారు తిరువీధులలో ఊరేగింపుని కీర్తిస్తున్నారు. ప్రతివీధిలోను శ్రీవేంకటేశ్వరుడు తన ఇద్దరు సతులైన శ్రీదేవి, భూదేవి రథముపై కూర్చుండగా ఊరేగుతున్నాడు. ఓ జనులారా! మీరంతా సంతోషంతో మొక్కండి. గోవిందా! గోవిందా! అని స్వామి నామము ఘోషగా వినపడుతోంది. అప్సరసలు నర్తిస్తున్నారు, గంధర్వప్రముఖులు మధురంగా గానం చేస్తున్నారు. ఆ కమనీయ దృశ్యాన్ని మనోనేత్రంతో వీక్షించండి.

**ఆ.వె॥విభుడు తానదేగె వీధి వీధులలోన**
**మొక్కరయ్య! జనులు ముదముతోడ**
**హరిని సన్నుతించె ఆ నాడు ఊరేగ,**
**అద్భుతముగ పాడి అన్నమయ్య.**

**రాగం : శుద్ధసావేరి**

వీధుల వీధుల విభుడేగీనిదె
మోదము తోడుత మొక్కరో జనులు ॥వీధుల॥

గరుడధ్వజమదె కనక రథంబదె
అరదముపై హరి అలవాడే
ఇరుదెసలనున్నారు ఇందిరయు భువియు
పరగె పగ్గములు పట్టరో జనులు ॥వీధుల॥

ఆడేరదివో అచ్చరలెల్లరు
పాడేరు గంధర్వ పతులెల్ల
వేడుకతో వీడె విష్వక్సేనుడు
కూడి యిందరును కొలువరో జనులు ॥వీధుల॥





శ్రీవేంకట గిరి శిఖరము చాయదె
భావింప బహువైభవములవె
గోవింద నామపు ఘోషణవిలిడుచును
దైవంబితడని తలవరో జనులు ॥వీధుల॥

**భావామృతం :**

ఓ జనులారా! విభుడు (జగన్నాథుడైన శ్రీవేంకటేశ్వరుడు), వీధుల వీధుల నేగీ (ప్రతి వీధిలోను ఊరేగుచున్నాడు). ఇదె (ఇదిగో) మోదముతోడుత (సంతోషముతో) మొక్కండి.

ఓ జనులారా! అదిగో అల్లదే గరుడధ్వజము. అదే దేవుడు అధిరోహించిన కనకరథము (బంగారు రథము). అరదముపై (రథముపై) శ్రీహరి అలరియున్నాడు. స్వామికి ఇరువైపులా శ్రీలక్ష్మి, భూకాంత పెండ్లి కూతుళ్లై శోభిల్లుచున్నారు. రథములాగుటకు కావలసిన పగ్గాలు (త్రాళ్లను) పట్టుకొనుడు.

ఓ జనులారా! అదిగో అదే అచ్చరలు (అప్సరసలు) సంతోషముతో నర్తించుచున్నారు. గంధర్వపతులెల్ల అదే పాడేరు (గానము చేయుచున్నారు). ఇదిగో వీడే విష్వక్సేనుడు. శ్రీహరి సేనాధిపతి అగుటచేత ఇతగాడు మిక్కిలి వేడుకతో నున్నాడు. మీరింతమంది కూడి స్వామిని కొలిచి తరించండి.

ఓ జనులారా! శ్రీవేంకటశైల శిఖరము యొక్క చాయ (నీడ) అదిగో. మీరు భావించుటకై (ఊహించుటకు) అనేక వైభవములు స్వామికి అమరియున్నవి. భక్తులు గోవిందా! గో...విందా! అని నినాదములు చేయుచున్నారు. ఆ ఘోషణ వినండి. ఈ శ్రీవేంకటేశ్వరుడే దైవమని గ్రహించి, స్వామిని తలవరో (ధ్యానించుడు).

## 6-76

### మున్నుడి

ఏడుకొండలవాడి కళ్యాణమహోత్సవం జరుగుతోంది. పరవశించి అన్నమాచార్యులవారు పాడుతున్నారు. ఆయన మనోనేత్రానికి శ్రీనివాసుడు పద్మావతీదేవి వరుడు వధువుల స్థానంలో కనిపిస్తున్నారు. ఆ నవవధూవరుల తమకాన్ని వర్ణిస్తున్నారు. వారు నేడు వధూవరులే కానీ నిజానికి కంతుని (మన్మథుని) వోజలు (తల్లిదండ్రులు). నేడు ఈ పెండ్లి కలిగెగా (జరుగుతోంది కదా!) దీన్ని చూచే మహద్భాగ్యం దక్కినది. మాకు ఇది ఇంత చాలదా? అంటున్నారు. "చెంతల మీకిట్టి పెండ్లి చెల్లెగా"... అంటే... చదవండి.

**కం॥ కంతుని వోజల పెండ్లిన్**
**అంతయు నా అన్నమయ్య ఆలాపించెన్**
**ఇంతటి భాగ్యము చాలదె!!**
**చెంతల మీకిట్టి పెండ్లి చెల్లెను అనెబో.**

**రాగం : కాంబోది**

ఇంత చాలదా మాకు నిది నేడు
కంతుని వోజల పెండ్లి గలిగెగా నేడు ॥ఇంత॥

కాంతకును నీకును కనురెప్పలె తెర
దంతపు నవ్వులే మీకు తలబాలు
రంతుల వూరువులె రవళి సోబనాలు
చెంతల మీకీపెండ్లి చెల్లెగా నేడు ॥ఇంత॥

ముదితకు నీకును మోవులే బువ్వములు
కదియు సిగ్గులె మంచి కమ్మగందాలు
సదరపు సరసాలె చట్ట వెద వీడేలు
యెదురెదురనె పెండ్లి యెసగెగా నేడు ॥ఇంత॥





వుంచపు గోరితాకులె వుంకువ సొమ్ములు
ముంచన పలు సోకులె ముయికి ముయి
యెంచగ శ్రీవేంకటేశ యిందిర నీకూటములు
కంచపు బెండ్లి మీకు గలిగెగా నేడు ॥ఇంత॥

### భావామృతం :

ఓ దేవదేవా! ఏడుకొండలవాడా! ఇంత ఇది (అదృష్టం) చాలదా మాకు? స్వయంగా కంతుని (మన్మథుని) వోజల పెండ్లి (తల్లిదండ్రుల పెండ్లి) వీక్షించే భాగ్యం దక్కింది. ఇది ఏనాటి పుణ్యమో!!

ప్రభూ! నీవూ నీ వధువూ రెప్పవాల్చక చూసుకుంటున్నా సిగ్గుతో, ఒక్కసారి ఇద్దరూ కళ్లుమూసుకొనినారు. అదే మీకు 'తెరచాటు' అనే పెండ్లి తంతు అయింది. ఒకరిని చూచి ఒకరు పలువరుస కనబడేట్లు నవ్వుకొంటున్నారు. ఆ దంతపు నవ్వులే ఒకరిపై ఇంకొకరు పోసే ముత్యాల తలంబ్రాలవలె నున్నవి. రంతుల వూరువులే, రవళి సోబనాలు (ఈ సయ్యాటలలో "ఆయాసం" తో మీరిద్దరూ తీసికొనే దీర్ఘ ఉచ్ఛ్వాస నిస్వాసములే పెండ్లిలో మంగళగీతముల వలెనున్నవి). చెంతల మీకీ పెండ్లి చెల్లెగా నేడు (ఒకరికొకరు బాగా దగ్గరయిన మీ ఇద్దరికి ఈ పెండ్లి నేడు చెల్లెగా (ఈరోజు అయిపోయింది కదా!)

ముదితకు నీకును మధురాధరాస్వాదనమే, బువ్వములు (పెండ్లిలో తమ బంధువులతో కలిసి వధూవరులు చేయు పెండ్లి భోజనం). మీ ఇద్దరి నును సిగ్గులే కమ్మటి మంచి గంధము. సమానస్థాయిలో ఆడపెళ్లివారు మగపెళ్లివారు ఆడుకొనే సరసోక్తులే ఒకరికొకరు ఇచ్చుకొనే తాంబూలముగా భాసిల్లినవి. మీ ఇద్దరూ ఒకరి యెదురుగా ఇంకొకరు పెండ్లియాడినారు.

అటు పిమ్మట మీ కేళీ విలాసములలో, మీ ఇద్దరి నఖక్షతములే మనోహరమైన ఆభరణాల వలె తోచినవి. మీ పరస్పర స్పర్శలే, ముయికిములు (ఒకరికొకరు ఇచ్చుకొను "బదులుకు బదులు"). మనోనేత్రంతో ఆ దృశ్యం యెంచగలిగిన వారికి, ఓ శ్రీవేంకటేశ్వరా! నీవూ ఇందిర ఈ విధంగా కలియగా నీ కూటములు, నేడు మీకు కంచపు పెండ్లి కలిగెగా... (గొప్ప పెండ్లి మీ ఇద్దరికీ జరిగింది).

## 6-77

## మున్నుడి

నరసింహస్వామిపై చక్కటి కీర్తన నాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. స్వామి సుగ్రీవనారసింహుడట. అంటే సొగసైన కంఠముగల నారసింహుడట. స్వామి మెడ బహు అందముగా ఉంటుందట. వాడే ఆ సుగ్రీవనారసింహుడు చూడండయ్యా! వాడు అగ్రపూజ గొన్నవాడు (సర్వశ్రేష్ఠుడని పూజలందుకొన్నాడు). వాడు అనాదియైన సింహము. శ్రీవేంకటాద్రి మీదనున్న బుధులెల్లా (బుద్ధిమంతులందరూ) పూనుకొని ఈ మానవ సింహాన్ని కొలువుడయ్యా! అంటున్నారు.

**ఆ.వె॥ చూడరో! ఇతండు సుగ్రీవ నరసింహు**
**డాదిసింహమందె నగ్రపూజ**
**పూని వేంకటాద్రి బుధులెల్ల గొల్వుడీ**
**అన్నమయ్య పాడెనమృతగీతి.**

**రాగం : లతాంగి**

సుగ్రీవ నారసింహుని చూడరో వాడె
అగ్రపూజగొన్నవాడు ఆదిసింహము ॥సుగ్రీవ॥

దేవతలు జయవెట్టి దీవినుండి పొగడగ
దేవులతో కూడున్నాడు దివ్యసింహము
భావింప నెట్ట నెదుట ప్రహ్లాదుడుండగాను
వేవేలు నవ్వులు నవ్వీ విజయసింహము ॥సుగ్రీవ॥

అసురులను గెలిచి అదె సింహాసనముపై
వెస కొలువున్నాడు వీరసింహము
పసిడి వర్ణముతోడ బహుదివ్యాయుధాలతో
దెసల వెలుగొందీని ధీరసింహము ॥సుగ్రీవ॥





నానాభరణాలు వెట్టి నమ్మిన దాసుల నెల్ల
ఆనుకొని రక్షించీ ప్రత్యక్షసింహము
పూని శ్రీవేంకటాద్రిని బుధులెల్లా కొలువగా
నానావరము లొసగీ మానవసింహము ॥సుగ్రీవ॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! ఈ నరసింహుడు, సుగ్రీవ (మంచి కంఠము గలవాడు). చక్కటి ఈ స్వామి ఆదిసింహము (ఎన్నడో కృతయుగంనాటి వాడు). దేవతలు, మునులు, నరులు అందరిచేత ప్రథమపూజలందుకొనినవాడు.

నింగినుండి, సకల దేవతలు ఈయనకు జయ జయధ్వానములు చేయుచుండగా దివ్యుడైన ఈ సింహము దివ్యశోభలీనుచున్నాడు. తనయెట్టెదురుగా ప్రహ్లాదుడు భావించి సన్నుతించగా ఈ విజయవంతమైన సింహము విస్తృతంగా నవ్వులొలికిస్తూ శోభిల్లుతున్నాడు. ఈయనకు మొక్కండి.

ఇదిగో, ఈ వీరసింహము హిరణ్యకశిపుడు వాని రాక్షస అనుచరులందరిని గెలిచి విజయగర్వంతో సింహాసనం మీద కొలువు దీరియున్నాడు. బంగారు వర్ణముగల దేహచ్ఛాయతో అనేక దివ్యాయుధములతో ఈ ధీరసింహము దిక్కులన్నిటిలోను కాంతులు విరజిమ్ముచున్నాడు.

అనేక రకములైన దివ్యాభరణములను ధరించిన ఈ నరసింహుడు తనను నమ్మిన దాసులను విడువకుండా అనుగ్రహించుటకై ఆనుకొని (దగ్గరయై) ప్రత్యక్షముగా రక్షించుచున్నాడు. శ్రీవేంకటాద్రిపైనున్న బుద్ధిమంతులందరూ పూనుకొని కొలువగా అనేక వరముల నొసగేటి ఈ నరసింహుని శరణు వేడండి.

## 6-78

### మున్నుడి

బాలకృష్ణునిపై సరస శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. గోపికలు యశోదకు కొంటెకృష్ణుని ఆకతాయితనాన్ని వివరిస్తున్నారు. ఏమి చెప్పమంటావమ్మా! ఈ గామిడి బాలుడు (దుష్టుడైన పిల్లాడు) వుట్లు పగులకొడతాడు. కన్నె గోపికల అధరామృతం వదలడు, వాడిధైర్యం యేమని చెప్పము? ఆడపిల్లలతో పరాచికాలాడతాడట. ఇంతా చేసి ఈ చిన్ని బుడ్డోడు యెవరనుకున్నారు? అఖండ ప్రేమాస్పదుడైన శ్రీవేంకటేశ్వరుడే నంటున్నారు.

**ఉ॥ ఏమిటి సేతుమమ్మ యిక నీతని మేము యశోద చెప్పవే**
**గామిడి బాలుడీతడటు గట్టిగ వుట్లను కొట్టి త్రెంచునే**
**దీమసమేమి జెప్పెదము తీపుల కన్నెల మోవిగ్రోలునే**
**ప్రేమల జూపు ఈ బుడత వేంకటనాథుడు అన్నమయ్యనెన్.**

* **దీమసము = ధైర్యము**

**రాగం : దేశాక్షి**

ఏమి సేతుమమ్మ నేము యెశోదమ్మ
గామిడితనములనే కడగీ బాలుడు ॥ఏమి॥

అందెలు మువ్వలు ఘల్లురనగ వీదివీదుల-
నందుక వుట్లుగొట్టీనదె బాలుడు
గొందినున్న బోనీక కోలలు చాచిచాచి
పొందుగ దొండ్లువోవ బొడిచీ మీ బాలుడు ॥ఏమి॥

చుంగుల కాశతోడ సొరిది బాలులతోడ
ముంగిటి వుట్లు గొట్టీ ముద్దుబాలుడు
అంగలించి గొల్లెతలు అడ్డములు రాగానే
యెంగిలి సేసీ మోవులు యిదిగో మీ బాలుడు ॥ఏమి॥





చొల్లెపు జెడ వీపున సోయగమై వేలగాను
చిల్లరవుట్లు గొట్టీ జిన్ని బాలుడు
మెల్లనె సతులు దాను మేలములాడుకొంటా
ఇల్లిదె శ్రీవేంకటాద్రి యెక్కెను మీ బాలుడు ॥ఏమి॥

**భావామృతం :**

ఓ యశోదమ్మా! నేము (మేము) మీ పిల్లవాణ్ణి ఏమి చేయగలమమ్మా? మీ బాలుడు, కడగీ గామిడి తనముల (దుర్మార్గము) వున్న కుఱ్ఱవాడు.

మీ బాలుడు, తనకాలి అందెలు ఘల్లుఘల్లుమని ధ్వనిస్తుంటే వీధులలో పోయి వుట్లలో కట్టిన పాలు వెన్నలను అందుకొని పాడుచేస్తాడు. వాటిని గొందినున్న బోనీక (దాచుకొన్నా వదలక) తన ముల్లుగఱ్ఱ చాచి చాచి కుండలకు చిల్లులు పడునట్లు పొడిచి మీ బాలుడు మా పాలు నేలపాలు చేస్తాడు. వాని ఆకతాయితనము నేమని చెప్పమమ్మా!

ఓ యశోదా! మీ ముద్దుబాలుడు కుచ్చిళ్లుపోసి కట్టుకొన్న వస్త్రముతోనున్న తన ఈడు కుఱ్ఱవాళ్లతో కలిసి మా ముంగిటింట్లో వుట్లను పగులకొడతాడు. అంగలించి (నానా తిప్పలు పడి) గొల్లభామలు అడ్డము వస్తే వాళ్లకు యెంగిలి ముద్దులు పెడతాడు. ఇదిగో ఇక మీ బాలుని మేము భరింపలేమమ్మా.

ఓ యశోదా! వీడు చొల్లెపు జడతోడ (ముడివేసి చుట్టుచుట్టి కొప్పులాగ కట్టిన జడ) తన వీపుపై సోయగమై (సొగసుగా) వ్రేలాడుతుంటే చిల్లరవుట్లను (చిన్న చిన్న ముంతలున్న వుట్లను) పగలగొడతాడు. దొంగలాగ మెల్లగా అమ్మాయిల దగ్గర చేరి మేలమాడుకొంటూ (సరసాలాడుతూ) వుంటాడు. అదేమిటని గదమాయిస్తే, ఇల్లిదే (ఇదిగో) మీ పిల్లాడు ఈ వేంకటాద్రి యెక్కి కూచున్నాడు. ఈ తిరుమలయ్యని యేమనగలమమ్మా.

## 6-79

## మున్నుడి

అన్నమాచార్యులవారు కైవల్య పదమునకు దగ్గర దారి కనుక్కొన్నారు. ఆయన గురువు శ్రీరామానుజుల వలె ఆయన ఆ ఉపాయాన్ని యెలుగెత్తి బట్టబయలు చేస్తున్నారు. కలకాలమూ శ్రీహరి కథాశ్రవణము, శ్రీపతి కీర్తనమూ, శ్రీనాథుని నిజకైంకర్యము, శ్రీవేంకటేశ్వరుని శరణాగతి, పద్మనాభుని పావన నిత్యస్తోత్రం – ఇవి ఆ కైవల్య మార్గం చేరటానికి దగ్గర దారులు. ఇవన్నీ మనకు సత్ఫలితాన్ని ఇచ్చేవేనంటున్నారు. ఆయన శరణాగతి "కలితం" అంటున్నారు. అంటే.. ఇందులో చాలామాటలకి సరియైన అర్థం మనకు తెలీదు.

**కం॥ కలిగెను మాకిది కనుడీ**
**కలకాలము కలిగి యుండు కైవల్యమహో!!**
**కలితము శ్రీపతి శరణము**
**ఫలదంబని అన్నమయ్య పాడెను వినుడీ!**

**రాగం : బసంత్ బహార్**

కలిగె మాకునిది కైవల్యం
కలకాలము హరికథా శ్రవణం ॥కలిగె॥

అచింత్య మద్భుత మానందం
ప్రచురం దివ్యం పావనం
సుచరిత్రం శ్రుతి శోభితం
అచలం బిదివో హరికీర్తనం ॥కలిగె॥

నిరతం నిత్యం నిఖిల శుభకరం
దురితం హర భవదూరం
పరమ మంగళం భావాతీతం
కరివరదం నిజకైంకర్యం ॥కలిగె॥





సులభం సుకరం శోకనాశనం
ఫలదం లలితం భయహరణం
కలితం శ్రీవేంకటపతి శరణం
జలజోదర నిచ్చ స్తోత్రం ॥కలిగె॥

**భావామృతం :**

ఓ జనులారా! ఇదే (ఇదిగో) మాకు కైవల్యం (ముక్తిమార్గము) కలిగినది (దక్కినది). అన్ని వేళలా శ్రీహరి కథలను మనసారా వింటే తప్పక మోక్షం సిద్ధిస్తుంది.

ఓ ప్రజలారా! ఈ శ్రీహరి కీర్తనం వున్నది చూచినారా, ఇది అచింత్యం (ఏమాత్రమూ చింత కలిగించనిది) ; అద్భుతమైనది; ఆనందదాయకమైనది; పుణ్యప్రదమైనది; సుచరిత్రం (ఎప్పుడూ క్రొత్తగా వుండేది); శ్రుతిశోభితం (వేదసారము) యైనది; అచలం (సుస్థిరమైనది). ఇన్ని సుగుణములున్న ఈ మహానుభావుని కీర్తనమును విడనాడవచ్చునా?

ఓ అయ్యలారా! కరివరదం (గజేంద్ర వరదుడైన) ఈ దేవదేవునికి నిజకైంకర్యం (ఆత్మనివేదన) చేసికొండి. అది నిరతం (మిక్కిలి ఆసక్తికరమైనది); నిత్యమైనది; నిఖిల శుభకరం (ఎల్లవేళలా శుభప్రదమైనది); హర దురితం (పాపములను హరించునది); భవదూరం (సంసార వ్యామోహమును దూరము చేయునది); పరమ మంగళకరమైనది; భావాతీతం (భావించుటకు వీలులేనిది). ఇక దీనిని మానవచ్చునా?

ఓ భక్తులారా! ఈ శ్రీవేంకటేశ్వరుని శరణాగతి సులభం (అతి సులువైనది); సుకరం (చక్కగా ఆచరింపతగినది); శోకమును తొలగించునది; ఫలదం (సత్ఫలితములనిచ్చునది); లలితం (శోభస్కరమైనది); భయమును నివారించునది. కలితం (పొందబడినది... అనగా... మనందరికీ దొరికినది); ఈ జలజోదరుని (పద్మనాభుని) నిచ్చస్తోత్రం (నిత్యమూ స్తుతించిన) మీకు ముక్తి లభిస్తుంది.

## 6-80

## మున్నుడి

మధురాతిమధురమైన భజన గీర్వాణిలో వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. పిట్టకొంచెం కూత ఘనం అనే తెలుగు సామెత ఈ కీర్తనకి అతికినట్లు సరిపోతుంది. దీన్ని కంఠస్తం చేసి అనంతమైన పుణ్యం, శ్రీవేంకటేశ్వరుని కటాక్ష వీక్షణం కూడా సంపాదించండి. ఎక్కువ వివరణ అవసరం లేని కీర్తన ఇది. అయినా తెలిసినట్లుండీ తేలికగా తెలియని పదాలకి నాకు తెలిసిన అర్థం తెలుగులో తెలుపుతున్నాను. సరేనా?

**తే॥ హరి! హరీ! పరమాత్మ! హే ఆదిదేవ!**
**వేదవేదాంత వేద్య! మా వినుతి గొనుము**
**అని నమోవాకములనిడె నన్నమయ్య**
**భజన కాదిది జనులార! భవవినాశి.**

**రాగం : సింధు భైరవి**

ఆదిదేవ పరమాత్మా
వేదవేదాంత వేద్య నమో నమో ॥ఆదిదేవ॥

పరాత్పరా భక్త భవభంజన చరా-
చరలోకజనక నమో నమో ॥ఆదిదేవ॥

గదాధరా శ్రీవేంకటగిరి నిలయ
సదానంద ప్రసన్న నమో నమో ॥ఆదిదేవ॥





**భావామృతం :**

ఓ ఆదిదేవా! పరమాత్మా! శ్రీహరీ! వేదవేదాంతములచేత మాత్రమే తెలుపబడిన మహానుభావా! నీకు నా నమోవాకములు.

ఓ పరాత్పరా! (సర్వశ్రేష్ఠుడా!) భక్తభవభంజనా! (నీ భక్తుల పాపములను తుత్తునియలు చేయువాడా!), చరాచర లోకములను పుట్టించిన (సృజించిన) దేవదేవా! నీకువందనములు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు కౌమోదకి అనబడు గదను ధరించువాడవు. వేంకటగిరిపై నివాసముండెడివాడవు. సదా ఆనంద స్వరూపుడవు, ప్రసన్నుడవు సంతోషమునిచ్చువాడవు. అట్టి నీకు అనేక వందనములు.



**6-81**

## మున్నుడి

అద్భుతమైన ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు శ్రీలక్ష్మికి ఆ వన్నెచిన్నెలన్నీ యెందుకు వచ్చాయో చెబుతున్నారు. పురుషులు ధరించే వస్త్రాన్ని చీర అనేవారు అన్నమయ్య కాలంలో. స్వామి పీతాంబరధరుడు కదా! పాలసముద్రాన్ని దచ్చిన (చిలికిన) వాడు కదా! అందుకని బంగారు వన్నెగల భామ(లక్ష్మి) నీ పాణిగ్రహణం చేసిందయ్యా అంటున్నారు. ఆవిడకు చంద్రవదనం, తళతళ లాడే దంతాలు, గజగమనము, చిగురు పాదములు, పద్మనయనములు యెందుకు వచ్చాయో తమాషాగా చెబుతున్నారు.

**చం॥ పసిడిది చీరగట్టితివి పాలను దచ్చితివయ్య! శ్రీహరీ!**
**పసిడిని బోలు శ్రీసతిని బాగుగ పెండిలినాడినావుగా**
**పసగల తోడబుట్టువుల వన్నెలు కూడెను నీదు భామకున్**
**వెస మన అన్నమయ్య గొని వేంకటనాయక! పాడె కీర్తనన్.**

*** వెస = శీఘ్రముగా**

**రాగం : శుద్ధ సావేరి**

పసిడి చీరవాడవు పాలుదచ్చితివి గాన
పసిడి పోలినది చేపట్టెను నీకరము ॥పసిడి॥

తొలుతనే చందురుని తోడబుట్టు గనుక
పొలుపు చందురు మోము పోలికైనది
కళల చింతామణి కందువ చెల్లెలు గాన
తళుకు మానికపు దంతముల పోలినది ॥పసిడి॥

మంచియైరావతముతో మగువ సైదోడుగాన
ముంచన కరిగమనము పోలినది
పంచల పారిజాతపు భావపు సోదరి గాన
యెంచగ చిగురు పోలె నీకె పాదములు ॥పసిడి॥





తామెర తొట్టెలలోన తగలి తానుండు గాన
తామెర కన్నుల బోలి తనరినది
యీమేర నిన్నిటా బోలి ఇన్ని లక్షణములతో
నీమేన శ్రీవేంకటేశ నెలవై నిల్చినది ॥పసిడి॥

**భావామృతం :**

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవు పసిడి చీరవాడవు (పీతాంబరధరుడవు), పాలుదచ్చితివి (క్షీరసాగరాన్ని కూర్మరూపుడవై చిలికించావు). అందువలననే కాబోలు నీచేతిని, పసిడి కాంతుల మీగడ వన్నెగల లక్ష్మీదేవి పట్టుకొని పరిణయమాడినది.

మొట్టమొదట ఆమె చంద్రునికి తోడబుట్టిన చెల్లెలు కదా! అందుకే పొలుపు (ఒప్పయిన) చంద్రుని ముఖము ఆమెకు వచ్చినది. చింతామణి అను మాణిక్యమునకు ప్రియ సోదరి కనుక ఆమెకు తళతళ మెరయు దంతములున్నవి.

మంచి తెల్లని రంగుగల ఐరావతము అను యేనుగు కూడా క్షీరసాగరమథనమున ఆమెకు సైదోడు (తోబుట్టువు) వలె బుట్టినది. అందుకే కాబోలు ఆ పోలికవచ్చి నీ భార్య నడక కూడా మత్తకరీంద్రపు నడకవలెనున్నది. పంచల పారిజాతము (సమీపమున నున్న పారిజాత వృక్షము)తో కూడి పుట్టిన భావపు సోదరి (భావించిన చెల్లెలు) కనుక ఆమె పాదములు లేచిగురులవలె మెత్తగా నున్నవి. (పారిజాత వృక్షం యేనాటికీ వాడిపోదు. కోమలంగా నవ్యనూతనంగా అద్భుతమైన సువాసనలు వెదజల్లుతుంటుంది. ఈ శ్రీలక్ష్మి దాని చెల్లెలు కనుక ఈమెకు ఆ పోలికే వచ్చినది అని భావము).

ఈ దేవి జన్మించిన తొట్టె (ఉయ్యాల) తామరపుష్పమే. అందువలననే కాబోలు ఈమెవి తామరకన్నులు. ఈమేర (ఈ క్రమములో) ఇన్నిటిని బోలి (ఇన్ని లక్షణములు కల) సౌందర్యరాశి కాబట్టే ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె నీ మేన (నీ శరీరంలో... అంటే.. నీ హృదయంలో) నెలవై (స్థానమై) నిలిచిపోయినది, తండ్రీ!

## 6-82

### మున్నుడి

శ్రీ వేంకటేశ్వరుడొక్కడే పరబ్రహ్మ. అతడే లోకాల అధినాయకుడు. ఎవ్వరూ అతనికంటే గొప్పకాదు అంటున్నారు అన్నమాచార్యులవారు. అలా అనటానికి గల కారణాలను కూడా వివరిస్తున్నారు. వేరే యెవ్వరికైనా లక్ష్మీదేవి వున్నదా? బ్రహ్మతో కూడిన నాభికమలమున్నదా? వసుంధరయైన భూమి వున్నదా? పాదములనుద్భవించిన భాగీరథి (గంగానది) వున్నదా? ఆయనలాగా అభయం ఇవ్వగలరా? శరణమిచ్చి రక్షించగలరా? ఈ వేంకటాద్రి దేవుని వంటివారున్నారా? అంటున్నారు.

**మ॥ అతదేరా పరబ్రహ్మలోకములకున్ ఆతండె తానేలికౌ**
**అతనిన్ మించినవాడు తానెవడురా అన్నయ్య శ్లాఘించెబో**
**జతవేరెవ్వడు పద్మనాభుకనియెన్ చక్కంగ గీర్తించుచున్**
**ఇతడే తచ్చిన వేంకటేశుడనెరా ఇందీవరశ్యాముడున్.**

**రాగం : దర్బారు**

అతడే పరబ్రహ్మమతడే లోక నాయకుడు
అతనికంటే మరి అధికులు వేరయ్యా ॥అతడే॥

కమలవాసిని లక్ష్మికలదా యెవ్వరికైనా
కమలనాభునికి ఒక్కనికే కాక
కమలజుడైన బ్రహ్మకలదా యెవ్వని నాభి
నమరవంద్యుడు మా హరికే కాక ॥అతడే॥

అందరునుండెడి భూమి అన్యులకు గలదా
అందపు గోవిందునికే ఆలాయగాక
చెందిన బాగీరథి శ్రీపాదాల గలదా
మందరధరుడయిన మాధవునికి గాక ॥అతడే॥





నిచ్చలు అభయమిచ్చే నేరుపుయెందు గలదా
అచ్చుగ నారాయణుని యందేకాక
రచ్చల శరణాగత రక్షణమెందు గలదా
తచ్చిన శ్రీవేంకటాద్రి దైవానికే కాక ॥అతడే॥

**భావామృతం :**

ఓ జనులారా! అతడే (వేంకటేశ్వరుడే) పరబ్రహ్మము. అతడే లోకనాయకుడు. అతనికంటే అధికుడైన వాడు ఇంకా ఎవరయ్యా!

పద్మనివాసినియైన లక్ష్మీదేవి ఎవరివద్దనైనా స్థిరంగా వుంటుందా? ఈ కమలనాభుని వద్దనేకదా! ఆమె వుండేది? పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు యెవ్వని నాభికమలము నుంచి పుట్టాడో, వాడే ఈ శ్రీహరి. ఈయన అమరవంద్యుడు (దేవతలచేత నుతించబడువాడు).

ఇంతమంది నివసించు భూమి (భార్యవలె) యెవరికైన నున్నదా? అందమైన గోవిందునికే ఆలాయగాక! (పాత్రమైనది అవుగాక!) ఇంకెవరికి కలదు? భాగీరథి అని పిలువబడు గంగానది ఎవ్వని పాదములనుండి ప్రవహించుచున్నది. మందర పర్వతమును కూర్మరూపుడై యెత్తిన మాధవునికి కాక ఈ వైభవము లింకెవ్వరి కైనను గలవా?

నిత్యము తన నాశ్రయించువారికి అభయము నిచ్చే నేర్పు ఎవ్వరియందు గలదు? అచ్చముగా ఒక్క నారాయణుని యందుగాక ఈ గుణము లెవ్వరియందు గలవు? బాహాటముగా శరణాగతులకు రక్షణ నెవ్వరీయగలరు? తచ్చిన (పరిహాసము చేయు) శ్రీవేంకటాద్రి ఈ దేవదేవునికి గాక, అంత శక్తి యెవ్వరికున్నది? లేనే లేదు.

## 6-83

## మున్నుడి

అనేక శృంగార, భక్తి కీర్తనలతో శ్రీపతిని మురిపించిన అన్నమాచార్యులవారు వైష్ణవ వ్యాప్తిలో అనేక సామెతలు, చాటువులు చెప్పారు. పండుగల నిర్వహణలో పదాల సొంపు నింపారు. వృద్ధులై వైరాగ్యంలో మరెన్నో కీర్తనలు చెప్పారు. చివరి దశలో ఆత్మావలోకనావశిష్ఠులైనారు. ఆత్మజ్ఞానులై మానవగమ్య అంతిమ పథంలో ఇటువంటి కీర్తనలు పుంఖానుపుంఖాలుగా చెప్పారు. ఆత్మయెక్కడో బయట వెతికితే కనబడుతుందా? ఆత్మావలోకనం ద్వారాగాని అది సాధ్యంకాదు. ఆత్మావలోకనం అభ్యాసం చేస్తేగాని రాదు. పైగా ఒక్కనాటితో రాదు. జీవితకాలంలో వస్తుందో రాదో తెలియదు.

**కం॥ వెలుపల వెదకిన గనునా?**
**పలుమార్లిల నభ్యసించవలెనిది యనెరా,**
**'చలి వేడి' యొక్కటవ వలె**
**తెలియన్ హరినన్నమయ్య తెలిపెను "ఆత్మన్"**

**రాగం : ముఖారి**

వెలుపల వెదకితే - వెసనాత్మ గనునా
పలుమారు నిదే య - భ్యాసము గావలెను ॥వెలుపల॥

ఇన్ని చింతలు మఱచి -యింద్రియాల గుదియించి
పన్నియుండిన హృదయ - పద్మమందును
ఎన్న నంగుష్ఠమాత్రపు - టీశ్వరు పాదాల కింద
తన్ను నణుమాత్రముగ - దలచగవలెను ॥వెలుపల॥

పలు దేహపు గాళ్ళ-బరువులు వారక
బలు దేహపు టింటిలో - పలచొచ్చి
చలివేడి బొరలకే - సర్వేశు పాదాల కింద
తలకొన్న తన్నుదానే - తలచగ వలెను ॥వెలుపల॥





కైకొన్న భక్తితో ని-కృపు శరణాగతితో
చేకొని విన్నపములు - చేసుకొంటాను
ఏకాంతాన శ్రీవేంక-టేశ్వరు పాదాల కింద
దాకొని తన్నుదానే - తలచగ వలెను ॥వెలుపల॥

**భావామృతం :**

ఆత్మ, మన శరీరంపై వెలుపల శీఘ్రముగా కనబడుతుందా? పోనీ ప్రపంచంలో యెక్కడనైనా దొరుకుతుందా? లేదే... మరెలా? అభ్యాసం వలన అదీ పలుమార్లు ప్రయత్నిస్తే గానీ ఆత్మావలోకనము సాధ్యంకాదు.

ఇన్ని దిగుళ్లను మరచి, ఇంద్రియముల నిగ్రహించి, పన్నియుండిన (వికసించిన) హృదయ కమలంలో అంగుష్ఠమాత్రమే (చేతి బొటనవేలి ప్రమాణంలోనే) వున్న ప్రకాశ రూపుడైన పరమాత్మ పాదములక్రింద అణు స్వరూపంలో వున్న వానిగా తనను తానే భావించుకోవలెను. అప్పుడు మాత్రమే ఆత్మావలోకనం సాధ్యమవుతుంది.

అనేక జన్మలెత్తాలి. అనేక శరీరాలు ధరించాలి. వాటికి చెందిన అనేక కాళ్లతో పరుగులు తీస్తూనే వుండాలి. ఏదో ఒక జన్మలో, అంతర్ముఖుడయ్యే శక్తి ఈశ్వర కృపవలన లభిస్తుంది. అప్పుడు పరమేశ్వరుడిచ్చిన ఈ దేహం, ఆత్మకి ఒక 'ఇల్లు' అని భావించి, ఇంటిలోనికి ప్రవేశించానని తలచి, శీతోష్ణములు, సుఖదుఃఖములు, ప్రియాప్రియములు అనే విరుద్ధ ద్వంద్వ భావములను సమానముగా చూచే స్థితికి చేరాలి. సర్వేశ్వరుడు, అంతర్గతంగా తన ఆత్మలోనే వున్నాడని... ఆయన చరణాల క్రింద జీవాత్మ రూపంలో తానే సదా వున్నట్లు భావించాలి.

ఇది అయిన తరువాత 'భక్తి' అనే సాధనము గైకొని, నిజమైన శరణాగతిని పొందవలెను. తాను నిమిత్త మాత్రుడనని తను చేయుచున్న పనులన్నీ ఈశ్వరేచ్ఛయని, తనవలన జరిగిన పొరబాట్లనన్నింటినీ క్షమించవలెనని పదే పదే అర్థించవలెను. ఏకాంతములో (ఒంటరిగా జీవిస్తూ భావిస్తూ) శ్రీవేంకటేశ్వరుని పాదపద్మముల క్రింద మరుగుపడివున్న తన స్వరూపమును తానే గుర్తించవలెను. వారే జీవన్ముక్తులు. వారికి శరీరం వున్నా లేకపోయినా తేడా వుండదు.

## 6-84

### మున్నుడి

ఈ కీర్తనలో అమ్మవారు తన ఆభిజాత్యాన్ని (తనే గొప్ప అనే భావాన్ని) ప్రదర్శిస్తున్నది. అన్నమాచార్యుల వారికి ఇటువంటి భావ సౌందర్యం వున్న కీర్తనలు చెప్పటం వెన్నతో పెట్టిన విద్య. ఇందిరాదేవి తన చెలికత్తె (అన్నమయ్యే...) తో ఇలా అంటోంది. వెఱపేల (భయమెందుకు?) స్వామిని రమ్మనవే. తాను నాకు వింతవాడా (కొత్తవాడా?) యేమిటే? ఆకాశంలో మెఱుపు మెరిస్తే అది ఒక్కరి స్వంతం అవుతుందా? అందరూ ఆ "మెరుపు" చూసి ఆనందిస్తారు. నేను తలలో ముడిచిన పూలదండను ఇంకెవత్తో తన సిగలో పెట్టుకుంటే నాకేమిటి అంటున్నది. ఔరా!!

**ఉ॥ ఎందుకు భీతి? రమ్మనవె, యెంచగ నాతడు వింతవాడొకో!**
**విందుగ దిక్కులన్ మెఱయ వెల్గులు మించవె చూడనెల్లరున్?**
**యెందరి గూడినా విభుడు యేమగు? రేతిరి నన్ను జేరడా?**
**ఇందిర ఆభిజాత్యమును యింపుగ పాడెను అన్నమార్యుడున్.**

**రాగం : గౌళ**

వెఱపేల రమ్మనవే వింతవాడా తానాకు
మెఱుగు మెరిచితేను మించదా దిక్కులను ॥వెఱపేల॥

అందుకే తా నన్ను నాదరించె నింతలోనె
యెందటి గూడి వచ్చినా నేమాయనే
ముందు నన్ను గూడెను ముడిచివేసిన పువ్వు
పొందుగా వీధి నుండితే బుగంధించకుండునా ॥వెఱపేల॥

కడమయేదే తానుగైకొని నన్ను మెచ్చె
యెడసి యెందుండినాను యేమాయనే
కడగి నాతో నవ్వే గరచి వేసిన బూరె
అడరి యెక్కడ గన్నా నట్టె నోరూరదా ॥వెఱపేల॥





ఇన్నినేలే శ్రీవేంకటేశుడిట్టె నన్ను నేలె
యెన్ని పెండ్లిండ్లాడినా నేమాయనే
వున్నాడు నా కౌగిటను వొద్దికైన నా కంచము
కన్నవారెల్లా బొత్తుగలయక వుందురా ॥వెఱపేల॥

**భావామృతం :**

ఓ చెలియా! వెఱపేల (ఆ స్వామికి భయమెందుకు?) తాను నాకు వింతవాడా (కొత్తవాడా) యేమి? ఆయనను కావలెనంటే నావద్దకు రమ్మనవే. ఆకాశంలో మెఱుపు మెరిస్తే ఆ మెరుపు దిక్కులను మించదా (వెల్లివిరియునట్లు చేయదా?) ఆయన వస్తే చూసి అందరూ ఆనందిస్తారు. అలాగే కానిమ్ము నాకేమి?

అందుకేమే? (దానికేంలేవే) ఇంతలోనె (ఇప్పటిదాకా) స్వామి నన్ను ఆదరించినాడు కదా! ఆయనను అందరూ కోరుకునేవారే. అందుకని ఆయన యెందరిని గూడి వచ్చినా నాకేమవుతుంది? ఆయన మొట్టమొదట దగ్గరకు తీసికొనేది నన్నే. నా తరువాత ఆయన యెందరిని కూడితే నాకేమే? నేను తలలో ముడుచుకొని వీధిలో పారవేసిన పూలదండను యెవ్వతో బుగంధించకుండునా (వాసన చూడకుండా వుంటుందా?) నాకేమి నష్టం?

చివరికి ఆయన నేనిచ్చిందే తీసికొని నన్ను మెచ్చుకుంటాడు. ఇక ఆయన యెడసి యెందుండినా యేమవుతుంది. చివరికి నాతోనే నవ్వుతాడు. తిని పారవేసిన బూరె ఎవ్వరికంట పడినా, వారి నోరు ఊరకుండా వుంటుందా?అట్లాగే అందగాడైన ఆయనను చూచి కొందరు ఆశపడితే నా సొమ్మేం పోయింది?

ఇన్నినేలే ఈ విశ్వంలో అందరినీ పాలించే శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఈ విధముగా ఏలినాడు. ఆయనను కాంక్షించని వారెవరు? ఆయన యెన్ని పెండ్లిండ్లు చేసికొంటే నేమి? ఆయన ఒదిగి నా కౌగిట నిమిడి పోయాడు. మరి నేను తింటున్న కంచమును చూచిన వారెవరైనా, నాతో పొత్తుగా కూర్చొని అదే కంచంలో తినకుండా వుంటారా? అది అసాధ్యం కదా!

## 6-85

## మున్నుడి

నల్లటిరంగు, తెల్లటి కళ్లు, నవ్వుల చూపులున్న దేవదేవుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈయన యెవరు? తిరుపుకైదువవాడు, తెరువు చూపినవాడు, తేటపరచినవాడు, తీటవాపినవాడు, తెరచి రాజన్నవాడు. అంతేకాదు గురుతువెట్టగరాని గుణముల వేంకటేశ్వరుడు అంటున్నారు. పైన చెప్పిన చాలామాటలు తెలిసినట్లే వుండి తెలియని మాటలే కదా!

**సీ॥ నల్లని మేనితో నగవుల దేవుండు**
**తెల్లని కన్నుల దేవుడితడు**
**బిరుదైన దనుజుల పీచమణచువాడు**
**తిరుపుకైదువతోటి దేవుడితడు**
**నీటగలిసినట్టి నిండిన చదువుల**
**తేటపరచినట్టి దేవుడితడు**
**పాటిమాలినయట్టి ప్రాణుల దురితంపు**
**తీటవాపినయట్టి దేవుడితడు**

**ఆ.వె॥గురుతువెట్టరాని గుణములు నెలకొన్న**
**వేంకటాద్రివాసి శంకయేల?**
**దివ్యపదము నిచ్చి దీవించె ధ్రువునెన్ని**
**తెలిపె నన్నమయ్య "తెరచిరాజు"**

**రాగం : పూర్వికళ్యాణి**

నల్లని మేని నగవు చూపులవాడు
తెల్లని కన్నుల దేవుడు ॥నల్లని॥

బిరుదైన దనుజుల పీచమణచినట్టి
తిరుపు కైదువతోడి దేవుడు
సరిబడ్డజగమెల్ల చక్కచాయకు తెచ్చి
తెరువు చూపినట్టి దేవుడు ॥నల్లని॥





నీటకలసినట్టి నిండిన చదువులు
తేటపరచినట్టి దేవుడు
పాటిమాలినట్టి ప్రాణుల దురితపు
తీటవాపినట్టి దేవుడు ॥నల్లని॥

గురుతు వెట్టగరాని గుణముల నెలకొన్న
తిరువేంకటాద్రిపై దేవుడు
తిరముగ ధ్రువునికి దివ్యపదం బిచ్చి
తెరచి రాజన్నట్టి దేవుడు ॥నల్లని॥

**భావామృతం :**

తెల్లని కన్నులు గల ఈ దేవదేవుని చూచినారా? ఈయన నల్లని శరీరం కలవాడు. ఈ స్వామి నగవు చూపులవాడు. (నవ్వులొలికిస్తూ కనిపించుచున్న దేవుడు). శరణంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా! అని మొక్కండి. ఎందుకంటే...

ఈయన బిరుదైన దనుజుల (శూరులైన రాక్షసుల) ను పీచమణచినట్టి (సంహరించిన) తిరుపుకైదువ (గిరగిర తిరిగే చక్రాయుధముగల) దేవుడు. సరిబడ్డ జగముల (సమానముగా పైన ఏడు మరియు క్రింద ఏడులోకములుండగా) వానిని చక్కగా చాయలకు తెచ్చి (రక్షించి) తెరువు చూపిన (దారి చూపి నడిపించిన) దేవుడు. ఈయనను ఆశ్రయించండి.

ఈ స్వామి నీరధిలోనికి తీసికొని పోబడిన నిండిన చదువులను (అన్ని వేదములను) తేటపరచిన (విశదపరచిన... అంటే...లోకములకు అందించిన) దేవుడు. ఈయన పాటిమాలిన (ధర్మమును విడనాడిన) జీవుల పాపముల తీట వాపినట్టి (దురద వదలగొట్టిన) దేవుడు. అనగా అధర్మవర్తనులను తగు విధముగా శిక్షించి వారి దుర్బుద్ధిని పోగొట్టు వాడు అని భావము.

ఈ మహానుభావుని గుణములను విశద పరచుట సాధ్యము కాని పని. అన్ని సుగుణములుగల శ్రీవేంకటపతి అయిన దేవుడితడు. ఈయన మాటకు తిరుగులేదు. ముక్కుపచ్చలారని బాలుడు అయిన ధ్రువునికి తిరముగ (స్థిరమైన) దివ్యపదం (ధ్రువతార అయ్యే భాగ్యము) నొసగి, "తెఱచి రాజు" (చెక్‌మేట్) అని జీవన చదరంగంలో తన మాటకు తిరుగులేదన్నాడు. అందుకని ఇప్పటికైనా ఆయనే దిక్కని గుర్తించండి, శరణనండి, మొక్కండి.

**6-86**

## మున్నుడి

"దట్టపు జడునకు (అవివేకము పుష్కలంగా వున్న వానికి) దైవంతో పనియేముంది? వాడికి పట్టినదెల్లా (ఏది పడితే అదే) బ్రహ్మము" అంటున్నారు అన్నమాచార్యులవారు. రాగిరేకులమీద వ్రాసేవారి పొరపాటేమో కాని, ఈ కీర్తనలో ఘనయాచకునకు, తరువలికి వంటి మాటలు వున్నాయి. వాటిని నేను సబబుగా భావించినట్లు అర్థము చెప్పాను. తన శరీరము వుండాలని చావబోయే వాడికే కదా! కాంక్ష? అందుకని 'తరువలికి' అంటే "ఉత్తరువు ద్వారా శిరఃఖండన శిక్ష విధించబడిన వానికి" అని భావించాను. ఆచార్యుల భావం అవగతం అంతవరకే అయింది.

**కం॥ పట్టిన దెల్లా బ్రహ్మము**
**దట్టపు జడుడైన వాన్కి దైవంబేలా?**
**యెట్టిదొ బ్రహ్మము యెవరికి,**
**దిట్టముగా అన్నమయ్య తెలిపెను వినుడీ.**

**రాగం : లలిత**

పట్టినదెల్లా బ్రహ్మము
దట్టపు జడునికి దైవంబేలా ॥పట్టిన॥

క(ఘ)న యాచకునకు కనకమే బ్రహ్మము
తనువే బ్రహ్మము తరువలికి
యెనయ కాముకున కింతులే బ్రహ్మము
తనలో వెలిగేటి తత్త్వంబేలా ॥పట్టిన॥

ఆకటి వానికి నన్నమే బ్రహ్మము
లోకమే బ్రహ్మము లోలునికి
కైకొని కర్మికి కాలమే బ్రహ్మము
శ్రీకాంతునిపై జింతదియేలా ॥పట్టిన॥





భువి సంసారికి పుత్రులె బ్రహ్మము
నవ మిందరికిది నడచేది
యివలను శ్రీవేంకటేశు దాసులకు
భవ మతని కృపే బ్రహ్మము ॥పట్టిన॥

**భావామృతం :**

(ఓ ప్రజలారా! తా మునిగింది గంగ, తా వలచినది రంభయను చందమున 'బ్రహ్మము' అని పిలువబడు పరబ్రహ్మ వేర్వేరు జనులకు, వేర్వేరుగా తోచుచున్నది). దట్టపు జడునికి (మిక్కుటముగా అవివేకము కలవానికి) దైవమెందులకు? వాడికి పట్టినదెల్లా (ఏది పడితే అదే) బ్రహ్మము. ఎందుకంటే వాడు మూర్ఖుడు కదా!

కన (పరిశీలించి చూస్తే) యాచకునికి (దేహి అంటూ అడుక్కొనే వాడికి) బంగారమే బ్రహ్మము. అట్లే తరువలికి (ఉత్తరువు ద్వారా శిరఃచ్ఛేదన శిక్ష పొందినవానికి) బ్రతికుంటే చాలు అని వుంటుంది కాబట్టి తనువే (శరీరమే) బ్రహ్మము. ఎనయ (సరిపోల్చి చూస్తే) కామపీడితునికి స్త్రీలే బ్రహ్మము. అటువంటి వానికి తనలో ప్రకాశించే తత్త్వ జ్ఞానంతో పనేమున్నది?

బాగుగా ఆకలితో వున్నవానికి పట్టెడు అన్నం దొరికితే అదే బ్రహ్మము. లోలునకు (అది కావాలి, ఇది కావాలి అనే కోరికలున్నవానికి) ఈ ప్రపంచమే బ్రహ్మము. కైకొని (చేబూని) యేవేవో యజ్ఞ, యాగాలవంటి కర్మకాండనాచరించువానికి, ఎంత సమయమూ సరిపోదు కాబట్టి వాడికి కాలమే బ్రహ్మము. అటువంటి వారికి శ్రీనాథుడైన ఆ దేవదేవుని గురించి ఆలోచించే సమయమేది?

ఈ లోకంలో సంసార తాపత్రయం వున్నవాడికి తన కొడుకులే బ్రహ్మము. నవము – ఇందరికి – నడచు... యేదీ? (ఇందులో కొత్తగా చూడాల్సిందేముంది?) అయితే... ఇవలను (ఈలోకంలో) శ్రీవేంకటేశుని దాసులకు మాత్రము, భవమతనికి కృపయే (ప్రాప్తించిన అతని "దయ" యే) బ్రహ్మము. ఇంక దేనితోను పనిలేదు.

## 6-87

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుని దివ్య మంగళ విగ్రహం చూచి పులకితగాత్రుడైన అన్నమాచార్యులవారు చక్కటి కీర్తన నాలపిస్తున్నారు. "విస్తరించిన ఈ లోకాలన్నీ వెదకి చూచినా నీవంటి దేవుళ్లు యెక్కడున్నారయ్యా! ఇటు ఈ భూలోకంలోగాని అటు ఆ చతుర్దశ భువనాలలో గాని యెందు పోల్చి చూచినా మాకు ఇంకెవ్వరూ కనబడుట లేదు" అంటున్నారు. తను అలా అనటానికి కారణాలను వివరిస్తున్నారు. ఎంత అద్భుతంగా వాదిస్తున్నారో గమనించండి.

**మత్తకోకిల॥**

**నిన్ను బోలిన దైవమెవ్వడు నిండు లోకములందునన్**
**యెన్న నీవల నావలైనను యెందునైనను నీవెరా**
**అన్నమార్యుడు కీర్తనంబుల నాలపించెను వేలలో**
**వెన్నుడా తిరువేంకటేశ్వర! పేర్మి జెప్పితి మున్నుడిన్.**

**రాగం : కళ్యాణి**

నీవంటి దైవాలు వేరే నిఖిల లోకములందు
యీవల నావల నెందు నెంచి చూడమాకును ॥నీవంటి॥

తగిలి నీమోము చక్కదనమెంచి చూచితిమా
తగిన మరుని గన్నతండ్రివి నీవు
అగపడ్డ నీగుణములవియెంచి చూచితిమా
నిగిడి కళ్యాణ గుణనిధివనీ శృతులు ॥నీవంటి॥

గుట్టు నీ పెద్దతనము కులమెంచి చూచితిమా
అట్టె బ్రహ్మకులము నీ యందు బుట్టెను
దట్టపు నీపనుల వర్తనమెంచి చూచితిమా
ముట్టి సర్వరక్షకత్వమున వెలసితివి ॥నీవంటి॥





బెడిదమైన నీ బిరుదెంచి చూచితిమా
వడి శరణాగత వత్సలుండవు
కడగి శ్రీవేంకటేశ కంటిమి నీ మహిమలు
బడి నిన్నే సేవించి బ్రతికితి మిదివో ॥నీవంటి॥

**భావామృతం :**

ఓ దేవదేవా! పదునాల్గు లోకములనన్నింటినీ వెదకి చూచినా, నీవంటి దేవుళ్లు యెక్కడున్నారు? ఈవల (ఈ భూలోకంలో గాని) ఆవల (దీని బయట లోకాలలో గాని) మాకు యెంచి చూడగా యెందునైనా కనిపిస్తారా? అది అసాధ్యం. కనిపించరు.

పోనీ, ముఖ సౌందర్యం చూద్దాంలే, అనుకొంటే మాకు మన్మధుని కన్నతండ్రి కంటే అందగాడెక్కడ కనిపిస్తాడు? మాకు తెలిసిన నీ గుణములను చూద్దామా అనుకొంటే సకల కల్యాణ గుణాభిరాముడు అని వేదములన్నీ నిన్ను కీర్తిస్తున్నాయి కదా!

సరే, కులగోత్రాలు చూచి నీ పెద్దరికం గుట్టు రట్టు చేద్దామంటే నీకు బ్రహ్మ ఆయననుంచి సప్తఋషులు, మనువులు, ప్రజాపతులూ అంతా పుట్టారు కదా! పోనీ నీవు చేసే పనులనుంచి నీ సత్తా కనుక్కొందామంటే సర్వులను రక్షించుటయే నీపని.

స్వామీ! బెడిదమైన (అధికమైన) నీ బిరుదు (సామర్థ్యపు గొప్పతనం) చూద్దామా అంటే, నీవు శరణన్న వారిని రక్షించే దీక్షాదక్షుడవు. కడగి (యత్నించి), ఓ శ్రీ వేంకటేశ్వరా! నీ దివ్యమహిమలను చూచిన మేము, బడి (వెంటనే) నిన్ను సేవించి, ఆపై ఇదిగో ఇట్లా బ్రతికి పోయాం, తండ్రీ!

## 6-88

## మున్నుడి

గజవాహనముపై ఊరేగుతున్నారు. తిరుమలనాథుడు ఆయన దేవేరులు. పరవశించిన అన్నమాచార్యులవారు చక్కటి కీర్తననందుకున్నారు. తీవ్ర ప్రయత్నంతో మాత్రమే దీని భావామృత వివరణ సాధ్యమయింది అంటే నమ్మండి. "చొల్లెపు జుట్టు తోడి చుంగుల రాజసముతో, వెల్లవిరిగా నేడు వెలదుల గొలువ" అంటే ఇదమిద్ధంగా తెలియలేదు. ఈ వివరణ నాకు సమంజసంగా తోచి నా ప్రయత్నం నేను చేశాను. అంక వన్నెలు చేయటమంటే? అసలు అంగవించడమంటే? ఏతుల నెరపులు అంటే? భావామృతం చదవాల్సిందే, మరి.

**ఆ.వె॥వెల్లవిరిసియేగె వెలదులు గొలువంగ**
**చొల్లెమైన జుట్టు శోభలీన**
**రాజసంపు తీవి రాజిల్ల యేన్గుపై**
**హరి వెడలుట పాడె నన్నమయ్య**

### రాగం : సాళంగనాట

చొల్లెపు జుట్టుతోడి చుంగుల రాజసముతో
వెల్లివిరిగా నేగీ వెలదులు గొలువ ॥చొల్లెపు॥

వీపున గుచాలు మోపి వెలది కౌగిలించగా
నేపున నేనుగ నెక్కె నిదె దేవుడు
చేవట్టి యాపె చేతులు చేతుల బిగ్గె బట్టుక
పైపై వీధుల వెంట బరువు దోలీని ॥చొల్లెపు॥

అంగనకు దన పాదాలంక వన్నెలు సేసుక
రంగుగా దొడదొడయు రాయగాను
సింగారపు సొమ్ములతో చెంగావి ముసుగుతోడ
అంగవించి యాపె దన కాసలు రేచగను ॥చొల్లెపు॥





కలకల నవ్వుతోడ కస్తూరి నామము తోడ
అలమేలు మంగ దన్ను నట్టె మెచ్చగా
యెలమి శ్రీవేంకటేశుడేతులు నెరపుతాను
బలిమి నంకుశమున బట్టి వొత్తీ నదివో ॥చొల్లెపు॥

### భావామృతం :

ఇదిగో ఈ ఊరేగింపు చూడండి. శ్రీవేంకటేశ్వరుడు తన ఇద్దరు ముద్దు సతులైన శ్రీదేవి, భూదేవితో గజవాహనముపై తరలిపోవుచున్నాడు. స్వామి చొల్లెపు జుట్టుతోడి వున్నాడు (విసిగిపోవునంత అధికంగా వున్న జుట్టుతో వున్నాడు). చుంగుల రాజసముతో శోభిల్లుతున్నాడు (కుచ్చెళ్ళు పోసినట్లు దట్టించిన రాచతీవితో శోభాయమానంగా వున్నాడు. తన వెలదులైన (భార్యలైన) శ్రీదేవి భూదేవీ తనను కొలువగా, స్వామి వెల్లివిరిగా (ప్రకటితమగుచూ) నేగీ (పూరేగుచున్నాడు).

ఏనుగుమీద పూరేగుటవలన, గజగమనము ననుసరించి శ్రీదేవి కౌగలించగా స్వామి వీపు అమ్మవారి కుచాగ్రములు గుచ్చుకొనుచున్నవి. ఆమె భయముతో తన చేతులతో ఆయన చేతులు బిగించి పట్టుకొన్నది. అయినా స్వామి వున్నాడనే ధైర్యంతో, పైపై వీధులవెంట (వీధి తరువాత వీధి చొప్పున), పరువు దోలీని (గజమును పరుగులెత్తిస్తున్నది). ఈ రమణీయ దృశ్యం చూచి తరించండి.

ఈ స్వామి యేమిచేయుచున్నాడో చూడండి. అంగనకు (భూదేవికి) తన పాదాలను, అంకవన్నెలు సేసుక వున్నాడు. (పాదాలతో పాదాలను మెలికవేసుకొని వున్నాడు) రంగుగా (అందముగా) తొడలను రాపాడించినాడు. సింగారించుకొన్న ఆభరణములతోను, చెంగాలి ముసుగుతోను భూదేవి వున్నది (మనోజ్ఞమైన ఎఱుపురంగు ముసుగుతోనూ వున్నది). ఆపె (ఆమె) అంగవించి (ఉత్సాహముతో) తన కాసలు రేచగా (స్వామికి మధురమైన ఆశలను రేపుచుండగా) ఈ గజవాహనము ఊరేగింపు సాగుచున్నది.

అలమేల్మంగమ్మ తనను మెచ్చు కొంటుండగా, స్వామి గలగలా నవ్వుతున్నాడు. కస్తూరీ తిలకము ఆయన నుదుటిపై మనోహరంగా వున్నది. ఎలమి (వికాసముతో) శ్రీవేంకటేశ్వరుడు, "ఏతుల నెరపుతాను" (ఉధృతిని ప్రదర్శించుచూ), బలిమి నంకుశము బట్టి వొత్తీను (బలంగా అంకుశమును పట్టుకొని ఏనుగును పొడుచుచున్నాడు). అదిగో చూచి మీ జన్మతరింప చేసికొనుడు.

**6-89**

## మున్నుడి

కరుణ రసాత్మకమైన కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. మనిషి శరీరం ధరించి ఇలా యెంతకాలం గడపాలిరా భగవంతుడా! దీనివల్ల నాకు వొరిగినదేముంది? చింతలు, చిక్కులు, పరంపరగా (ఒకదాని వెనుక ఇంకొకటిగా) వస్తూనే ఉన్నాయి. గర్భవాస నరకం అనుభవించాను. కాంతల కౌగిలి సుఖంలో కళ్లు తెరవలేకపోయాను. అనుక్షణం ఆపదలలో తగిలే దేహము మోయవలసి వచ్చింది. భ్రాంతితో బ్రదుకవలసొచ్చింది. వేంకటేశుని కొలవక నరక కూపాన బడ్డాను. దారీ తెన్నూ లేక తిరుగులాడాను... అంటున్నారు.

**ఉ॥ ఎంతటి కాలమో పనిచి ఈ నర జన్మపు దేహ ధారణల్**
**చింతల నంచెలంచెలుగ చిక్కులలో బడి నీల్గగా వలెన్**
**కాంతల గర్భవాసముల కౌగిలి భ్రాంతుల "దిడ్డిదూరితిన్"**
**అంతమునందునైన 'హరిహస్తము' బట్టనె! అన్నమయ్యనెన్.**

***దిడ్డి దూరితిన్ = చిన్న వాకిళ్లలోంచి దూరవలసిన అగత్యం వచ్చింది.**

**రాగం : శ్రీరాగం**

ఎంత కాలమొ కదా యీ దేహధారణము
చింతా పరంపరల చిక్కు వడవలసె ॥ఎంత॥

వడిగొన్న మోహంబు వలల తగులై కదా
కడలేని గర్భనరకము లీదవలసె
నడిమి సుఖములచేత ననుపు సేయక కదా
తొడరి హేయపు దిడ్డి దూరాడ వలసె ॥ఎంత॥

పాపపుంజములచే పట్టువడగా కదా
ఆపదలతోడి దేహము మోవ వలసె
చూపులకు లోనైన సుఖము గానక కదా
దీపన భ్రాంతిచే దిరిగాడ వలసె ॥ఎంత॥





హితుడైన తిరువేంకటేశు కొలువక కదా
ప్రతిలేని నరక కూపమున బడవలసె
అతని కరుణామృతం బబ్బకుండక కదా
బతిమాలి నలుగడల పొరాడవలసె ॥ఎంత॥

**భావామృతం :**

అయ్యో! హతవిధీ! ఈ దేహధారణము (మానవ శరీరంతో బ్రతుకు నీడ్చుటతో యెంత కాలము గడుపవలెనో కదా! దీనివలన నాకు ఒరిగినదేమిటి? చింతల యొక్క పరంపరతో (వరుసతో) బ్రతుకును చిక్కులు వడుతూ (ఇబ్బందులకు లోనవుతూ) నెట్టుకు రావలసి వచ్చింది.

వడిగొన్న (మెలిబెట్టునట్టి) మోహము వలలో చిక్కుబడుట చేతనే కదా! అంతులేని గర్భనరకంలో పడి ఆ దుర్గంధంలో ఈదులాడవలసి వచ్చింది. నడమంత్రపు సుఖములతో అతిశయింప బడకుండ పోవుట చేతనే కదా! తొడరి (అనుసరించి) హేయపు (నీచమైన) దిడ్డి దూరాడవలసె (చిన్న చిన్న సందుల గుండా దూరి చరించ వలసి వచ్చింది). అనగా, నేను అమిత సుఖముల నాసించుట చేతనే జీవితంలో రకరకముల లొంగుబాట్లు పొందాను... అని అర్థం.

పాపములనెడి త్రాళ్లతో పట్టుబడుటచేతనే కదా! అనుక్షణం ఆపదలకు లోనయ్యే దేహమును ధరించవలసి వచ్చింది. చూపులకు వశమై లొంగిపోయే సుఖము నాసించుట చేతనే కదా! దీపన భ్రాంతి (గొప్ప భ్రమ)తో దిరుగాడ వలసి వచ్చింది.

మేలు కలిగించు శ్రీవేంకటేశుని కొలువక పోవుట చేతనే కదా! ప్రతిలేని (మారులేని) నరక కూపమున బడి నలిగిపోవలసి వచ్చింది. ఆ దేవదేవుని కరుణామృతము లభించకపోవుట చేతనే కదా! వారినీ వీరినీ బ్రతిమిలాడుచు బ్రతుకు నీడ్చుటకు పాకులాడవలసి వచ్చింది.

## 6-90

## మున్నుడి

భవబంధాలలో తగులుటవలన నేను, నాది, నావాళ్లు అనే పీకులాటలో, పడి, సుఖదుఃఖాలనుభవిస్తుంటాడు జీవుడు. ఇవి విచిత్రమైన బంధాలు. ఎంత వదిలించుకుందామంటే అంత బిగుసుకుంటాయి. కామ క్రోధములు మొదలైన అరిషడ్వర్గాల ప్రాబల్యం వల్ల సత్యము నెరుగలేక తనే శక్తిశాలినని విఱ్ఱవీగి భగవంతుడే లేడంటాడు నరుడు. ఈ రోగానికి మందులేదు. పోనీ మంత్రం చదివించి ఈ పీడనుంచి వదిలించాలంటే ఏమంత్రమూ పనిచేయదు. ఆ మందూ మంత్రమూ కూడా మీ మనస్సులోనే వున్నాయి. ఆ మందేమిటో వివరిస్తున్నారు, అన్నమాచార్యులవారు. ఇది చదివి తెలియండి.

**తే॥ మందులేదురా దీనికి మంత్రమైన,**
**మందు మంత్రము కలవురా మనసులోనె**
**తలపులందున శ్రీపతిన్ నిలుపవలెను**
**'అలతి' గొనుడు ఈ మందనె అన్నమయ్య**

**రాగం : నాట**

మందులేదు దీనికి మంత్రమేమియు లేదు
మందు మంత్రము తన మతిలోనె కలదు ॥మందు॥

కదలకుండ తన్ను కట్టివేసిన కట్టు
వదలించుకొన కొంత వలదా
వదిలించబోయిన వడిగొని పైపైనే
కదియుగాని తన్ను వదలదేమియును ॥మందు॥

మనసు లోపల నుండి మరి మీదట తానుండి
ఎనసిన తిరువేంకటేశుని
తనరిన తలపున తలపు దుష్కృతములు
తనకు తానే వీడు తలక వలదు గాన ॥మందు॥





**భావామృతం :**

ఓ జనులారా! దీనికి (ఈ భవరోగానికి) మందు లేదు. పోనీ ఈ పీడ వదిలిద్దామంటే దీన్ని ఏ మంత్రము చదివినా పోగొట్టలేము. ఆ మందూ మంత్రమూ కూడా తన (మానవుని) మతిలోనె (మనస్సులోనె) కలవు. ఇది గ్రహించండి.

ఆ భవబంధము కదలకుండా ఆ మానవుని కట్టి వేసెడి కట్టు (బంధము). అటువంటప్పుడు మానవ ప్రయత్నం చేసి కొంతన్నా వదలించుకోవాలా? వద్దా? అలాగని వదిలించ బోతే, వడిగొని (మెలిపెట్టి), పైపైనె కదియును (సులభముగా సమీపించును గాని తనను ఒక్కటి కూడా వదలదు.

మరి, తాను (ఆయన) మీదట (తిరుమలపైన) ఎనసిన (వున్న) తిరువేంకటేశుని (శ్రీవేంకట రమణునివలె) మనసులోపలనుండి, తనరిన (అతిశయించినట్లు చేసినచో) తలపున తలపు (ఆలోచనలలో కలుగు) దుష్కృతములు (పాపములు) తనకు తానే (తమంతట తామే) వీడు (విడిచిపోతాయి). గాన (కాబట్టి) తలక వలదు (భయపడవద్దు).



## మున్నుడి

అలమేలుమంగపై చక్కటి సరస శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఇటువంటి కీర్తనలలో అన్నమయ తనని తాను అమ్మవారి చెలికత్తెగా భావించుకొని అమ్మవారికి కీర్తన వినిపిస్తుంటారు. ఇది వలపులు మరియు సొలపులు (పరవశించి పోవుటలు) కలిగిన వసంత ఋతువు, చల్లని వేళ అయినా వంటినిండా చెమరించీని (చెమటలు పట్టినవి). ఈ అవస్థ చూచి నీవు సెలవి నవ్వకువే (చిరునవ్వులు చిందించబోకే). అని అమ్మవారితో అంటున్నారు. (అన్నమయ్య రాజుగారి ఆ స్థానంలో చెప్పి వుంటారీ కీర్తన).

**ఆ.వె.॥ సెలవినవ్వబోకు చెమరించు నీ మేను**
**సొలపులును వలపులు సొంపుమీరె**
**చక్కనైనదిది వసంత వేళనినాడు**
**అన్నమయ్య, మురియ హరియు రమయు.**

**రాగం : మోహన**

వలపుల సొలపుల వసంతవేళ యిది
సెలవి నవ్వకువే చెమరించీ మేను ॥వలపుల॥

శిరసు వంచకువే సిగ్గులు వడకువే
పరగ నిన్నతడు తప్పక చూచీని
విరులు దులుపకువే వెసదప్పించుకోకువే
సిరుల నీ విభుడిట్టే సేసవెట్టీని ॥వలపుల॥

చేయెత్తి యొడ్డుకోకువే చేరి యాన పెట్టకువే
చాయల నాతడు నీ చన్నులంటీని
ఆయములు దాచకువే అట్టే వెరగందకువే
మోయనాడీ సరసము మోహాన నీ విభుడు ॥వలపుల॥





పెనగులాడకువే బిగువు చూపకువే
ఘన శ్రీవేంకటేశుడు కౌగిలించీని
అనుమానించకువే అలమేల్మంగవు నీవు
చనవిచ్చి నిన్నునేలె సమ్మతించీ యాతడు ॥వలపుల॥

**భావామృతం :**

(అలమేలు మంగమ్మ చెలికత్తె అంటోంది. "ఓ చెలీ! నీ ప్రియుని సమాగమవేళ ఇది). నీవు సెలవి నవ్వకువే (నీ పెదవులను వోరగా వంచి, నవ్వబోకే)... చెమరించకువే (చెమటతో చిత్తడి అయిపోవద్దే). ఎందుకంటే... ఇది వలపుల వసంతవేళ. సొలపుల (పరవశముల) శోభన వేళ.

(ఓ చెలీ! ఇప్పుడు నీవు చేయకూడని పనులు చెబుతాను వినుము). నీ తల, మరీ అంత క్రిందకి వంచుకోకు. అపరిమితమైన సిగ్గు అసలు పనికిరాదు. అప్పుడే నిన్నతడు బాగుగా చూడగలడు. విరులు దులుపుకువే (నీతలలో పూలు రాలిపోవునంతగా తల కదలించకు). నిన్నతడు పట్టుకోవాలని ప్రయత్నిస్తే తొందరగా తప్పించుకోవద్దు. ఆయన నీ విభుడు (నీ భర్త). ఇట్టే సేసవెట్టీని, పైగా ఇప్పుడు పెండ్లి కూడా చేసికొనినాడు. (ఆయనను అడ్డే వారెవరు?)

ఓ సఖీ! నీ చేతిని యెత్తి ఆయనను అడ్డుకోకు. అట్లా చేయవద్దు. ఇట్లా చేయవద్దు అని ఆంక్షలు పెట్టకూడదు. చాయల (నీడలో... అంటే.. రహస్యంగా) నాతడు నీ వక్షోజ స్పర్శ చేస్తాడు. ఆయములు దాచకువే. (మర్మస్థానములనంతగా దాచుకోకూడదు సుమా!) అట్టే వెరగందకువే (మరీ అంత భయపడిపోవద్దు). నీ విభుడు మోహాన (మోహపరవశుడై) సరసము మోయనాడీ (భరించలేక పోతున్నాడు).

(ఓ దేవీ! ప్రియ సమాగమవేళ... ఆయన నీ పరిష్వంగము నాసిస్తే...) మరీ అంత పెనగులాడకువే (తప్పించుకోకూడదు). బిగువు (బెట్టుసరి) చూపకూడదు. నిన్ను కౌగలించుచున్న దెవరు? స్వయంగా జగదేక పతియైన శ్రీవేంకటేశ్వరుడు. నీవు సాధారణ స్త్రీవి కావు. జగన్మాతయైన అలమేలు మంగవు. ఇక నీవు అనుమానించవద్దు. అందుకే ఆతడు నిన్ను సమ్మతించి, నీకు చనవిచ్చి (స్వాతంత్ర్యం) ఇచ్చి యేలీని (నిన్ను యేలుకొనినాడు).

**6-92**

## మున్నుడి

అభిషేకానంతరం అద్భుతమైన కీర్తన నాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. జనులారా ఈ శ్రీవేంకటేశ్వరుడు ఇంతమందికి భాగ్యమువలెనున్నాడు. ఈయనను భావించండి, సేవించండి. అందరూ చేరుకొని ఆయనకు మొక్కండి అంటున్నారు. జలకములాడి, కర్పూర ధూళిమెత్తుకొని, తట్టుపుణుగు అలదుకొని, ముందటి మాదిరిగానే సొమ్ములు పెట్టుకొని అలమేల్మంగను 'మెడకు కట్టుకొని' బంగారు పద్మంవలె ఆయన కొలువుదీరి దాసులకు నిధానమై వున్నాడట.

**చం॥ హరికిని మొక్కరో జనులు ఆతని సేవలు చేయరో వెసన్**
**సరిగల భావమొప్పగను చక్కగ నుండెను భాగ్యదాతయై**
**వరుడలమేలుమంగకును వల్లభుడాయెను వేంకటేశుడై**
**మురియుచు అన్నమార్యుడనె ముక్తియు భృత్యుల భుక్తి శ్రీహరే**

**రాగం : హిందోళం**

సేవించరో జనులాల చేరి మొక్కరో
భావింపనున్నాడిందరి భాగ్యము వలెను ॥సేవించ॥

జలకమాడివున్నాడు సర్వేశ్వరుడు నిగ్గు
గలిగిన మంచి నల్లకలువ వలెను
ఎలమి కప్పురకాపు ఇదె చాతుకున్నవాడు
వెలలేని యట్టి పెద్ద వెండి కొండవలెను ॥సేవించ॥

అందముగా తట్టుపుణుగు అలదుక నున్నవాడు
కందువ ఇంద్రనీలాల గనివలెను
ముందటి వలెనె తాసొమ్ములు నించుకున్నవాడు
పొందిన సంపదలకు పుట్టినిల్లువలెను ॥సేవించ॥





మించి అలమేల్మంగ మెడగట్టు కొన్నవాడు
మంచి బంగారు తామరపువ్వు వలెను
ఎంచగ శ్రీవేంకటేశుడిదే కొలువైవున్నవాడు
నించిన దాసుల పాలి నిధానము వలెను ॥సేవించ॥

**భావామృతం :**

ఓ జనులారా! ఈ దేవదేవుని సేవించండయ్యా! ఈయన సన్నిధికి వచ్చి మొక్కండి. ఈ స్వామి మనందరి భాగ్యమువలె భావించుటకై దర్శనమీయుచున్నాడు.

ఈ సర్వేశ్వరుడు, ఇప్పుడే జలకమాడియున్నాడు. (స్నానం చేసినాడు). నిగ్గున్ కలిగిన (శోభిల్లుచున్న) మంచి నల్లకలువ వలెవున్నాడు. వికాసముతో కర్పూర ధూళిని ఈ స్వామి కాపుగా చాతుకున్నాడు (ధరించినాడు). గణనకు సాధ్యము గాని విలువైన పెద్ద వెండి కొండవలె వున్నాడు.

ఈ స్వామి సువాసన కోసం తన దేహానికి తట్టుపునుగు (పునుగు పిల్లినుంచి వచ్చిన సుగంధ ద్రవ్యము) అలదుకొనినాడు (అద్దుకున్నాడు). చమత్కారముగా ఈ స్వామి ఇంద్రనీల మణుల గనివలె వున్నాడు. ముందటి వలె (ఇదివరకు మాదిరిగానే) ఈయన ఒంటిపై పెక్కు ఆభరణములను ధరించియున్నాడు. అనేక సంపదలకు ఈయనే పుట్టినిల్లా అన్నట్లున్నాడు.

ఈ స్వామి దేవి అలమేలు మంగను, మెడగట్టుకొన్న (వివాహమాడిన) శ్రీపతి. ఈయన మంచి బంగారు కమలం వలెనున్నాడు. ఈ శ్రీ వేంకటేశ్వరుడు ఇదే కొలువై వున్నాడు. నిండిన (ఎక్కువవున్న) నీ దాసులకు ఈయన నిధానమువలె (బంగారు పాతరవలె) వున్నాడు.

6-93

## మున్నుడి

బాలకృష్ణునిపై ఇంతవరకు యెన్ని పాటలు, పద్యాలు, కీర్తనలు వచ్చినా ఇటువంటి కీర్తన నేను ఇంత వరకు యెవరి ద్వారా కూడా వినలేదు. అన్నమాచార్యుల వారు ఏమంటున్నారో వినండి. ఆనాటి కాలము వారు యెందుకు మోసపోయిరో తెలియకుండా వున్నది. కనీసం బ్రహ్మ ఆయనను కీర్తించాక గాని, గోవర్ధన గిరిని యెత్తినప్పుడుగాని, విశ్వరూపం చూపిన తరువాత గాని, చక్రాయుధంతో బాణుని నరికినాక గాని, సురేంద్రుడు అర్చించాడంటే గాని నమ్మవద్దా? ఆ కృష్ణయ్యే తానైన ఈ శ్రీవేంకటేశ్వరుని కాక, పరులను గొలువ వచ్చునా, అంటున్నారు.

**తే॥ ఏల మోసపోయిరొ కాని యెంచి నాటి**
**వారు, బాలకృష్ణుని నమ్మి బ్రతుకరైరి**
**అతని మహిమల దెలిపెరా అన్నమయ్య**
**తిరుమలేశుని కాదన్న పరులు గలరె?**

**రాగం : లలిత**

ఏల మోసపోయిరొకో యెంచియా కొలపు వారు
బాలకృష్ణుని బంట్లే బ్రతుకవద్దా ॥ఏల॥

పసులగాచేవాని బ్రహ్మ నుతించే నంటేను
దెసల దేవుడేయని తెలియవద్దా
సిసువు గోవర్ధనాద్రి చేతబట్టి యెత్తెనంటే
కొసరీతని పాదాలే కొలువవద్దా ॥ఏల॥

నరునికి విశ్వరూపున్నతి జూపెనంటే
నరహరి యితడని నమ్మవద్దా
పరగ జక్రము చేత బాణుని నఱకెనంటే
సొరి దీతని శరణు చొఱవద్దా ॥ఏల॥





అందరు సురులలోన నగ్రపూజ గొన్నప్పుడే
చెంది యీతని కృపకు జేరవద్దా
అంది శ్రీవేంకటేశుడట్టె ద్రిష్ట దైవమంటే
విందుల బరుల సేవ విడువవద్దా ॥ఏల॥

**భావామృతం :**

ఆ కాలము వారు (ద్వాపరయుగం నాటివారు) ఏల మోసపోయిరో తెలియుటలేదు. ఆ బాలకృష్ణుని గాథలు విన్నాకనైనా ఆయన బంట్లై (సేవకులై) బ్రతుక వద్దా! (ఓ మానవులారా! ఆలోచించండి).

ఒక పశువుల కాపరిని స్వయంగా బ్రహ్మదేవుడు ప్రార్థించాడంటే, ఆయన దెసల దేవుడు (మన పక్కనే వున్న దేవుడు) అని గుర్తించవద్దా? ఒక సిసువు (శిశువు) గోవర్ధనగిరిని చేతితో పట్టుకొని యెత్తాడంటే, కొసరీతని (కొసరు + యీతని = విజృంభించుచున్న ఇతని) పాదములను కొలువవద్దా?

భారతయుద్ధంలో నరునికి (అర్జునునికి) విశ్వరూపమును చూపించాడు అని చెప్పాకనైనా నరహరి (శ్రీమన్నారాయణుడు) ఇతడే అని నమ్మవద్దా? విష్ణుమూర్తి స్వంతమైన సుదర్శన చక్రంతో బాణాసురుని చంపాడని విన్నప్పుడైనా, సొరిది (ఆ క్రమమున) ఇతనిని శరణము నర్థించవలదా? ఇంకా ఏమి నిరూపణ కావాలి?

అంతమంది దేవతలంటే ఇంద్రుడు, ధర్మజుడు శంకరుడు వంటి వారిచేత అగ్రపూజ స్వీకరించాడు అంటే, పూని ఈతని కృపకోసం ఈయన నాశ్రయించవద్దా? ఈ శ్రీవేంకటేశ్వరుడే "ద్రిష్టదైవము" (కనబడు దైవము) అని మేము చెబుతుంటే వినకుండా, విందుల (స్వల్ప లాభం కోసం) పరులను (ఇతర దేవతలను) ఆశ్రయించవచ్చునా?

## 6-94

## మున్నుడి

అహోబల నృసింహునిపై అద్భుతమైన కీర్తన చెబుతున్నారు, అన్నమాచార్యులవారు. ఇది దృశ్యానుభూతిని కలిగించు కీర్తన. అన్నమయ్య పాడుతుంటే ఆ నృసింహుని సభ కళ్లకు గట్టినట్లు కనిపిస్తుంది. ఆ సభలో వైతాళికుడై ఆచార్యులవారు తాను సభికులందరినీ "సముఖ ఎచ్చరిక"... స్వామి వస్తున్నారని హెచ్చరిస్తున్నారు "ఓ సర్వేశ్వరా! నీ కొలువు ఇదిగో ఈ విధంగా అమరింది" అని ఆ ప్రహ్లాద వరదుని సభను వర్ణిస్తున్నారు. అహోబలంలోనే కాక వేంకటాద్రిపైన కూడ ఈయనే వున్నాడట.

**తే॥ సముఖ సర్వేశ్వరుడవు యెచ్చరిక ఇదియె**
**అమరె నీ కొలువిదియె ప్రహ్లాద వరద!**
**నారసింహుని కొలువును నయము మీర**
**అలతి పాడి కీర్తించెరా అన్నమయ్య.**

**రాగం : కాంభోజి**

సముఖ ఎచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు ప్రహ్లాద వరద ॥సముఖ॥

తొడమీద కూచున్నది తొయ్యలి ఇందిరాదేవి
బడి చెలులు సోబాన పాడేరు
నడుమ వీణ వాయించీ నారదు డల్లవాడె
అలరి చిత్తగించు ప్రహ్లాద వరద ॥సముఖ॥

గరుడోరగాదు లూడిగములు నీకు చేసేరు
ఇరుమేలా కొలిచేరు ఇంద్రాదులు
పరమేష్ఠి ఒకవంక పనులు విన్నవించీ
అరసి చిత్తగించు ప్రహ్లాద వరదా ॥సముఖ॥





పొదిగొని మిమ్ము నిట్టే పూజించేరు మునులెల్ల
కదిసి పాడేరు నిన్ను గంధర్వులు
ముదమున అహోబలమునను శ్రీవేంకటాద్రిని
అదె చిత్తగించుము ప్రహ్లాద వరద ॥సముఖ॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! నరసింహస్వామి వేంచేస్తున్నారు. సముఖమిస్తున్నారు (దర్శనం ఇస్తున్నారు). ఎచ్చరిక (జాగ్రత్తగా వుండండి). ఓ సర్వేశ్వరా! ప్రహ్లాద వరదా! నీ కొలువ (సభ) అమరె (సిద్ధంగా వున్నది).

తొయ్యలి (నారీ లలామ అయిన) లక్ష్మీదేవి నీ ఎడమ తొడపై కూర్చున్నది. చెలులందరు పూనుకొని సోబనాలు (మంగళ గీతములు) పాడుచున్నారు. అదిగో ఆ కనబడుతున్న మధ్యలోని వాడే నారదుడు. ఆయన బహుసొంపుగా వీణ వాయిస్తున్నాడు. ఓ ప్రహ్లాద వరదా! సంతోషంతో వీరందరినీ చిత్తగింపుము. (ఆలకింపుము) ప్రభూ! మేము నీ శరణు కోరి వచ్చాము.

గరుడోరగాదులు (గరుడ + ఉరగాదులు = గరుత్మంతుడు మరియు ఆదిశేషుడు) నీకు ఊడిగములు (చాకిరీ) చేస్తున్నారు. ఇంద్రాది దేవతలు నీకు రెండు వైపులా నిలిచి కొలుచుచున్నారు. పరమేష్ఠి (బ్రహ్మదేవుడు) ఒకవంక (నీకు ఒక పక్క నిలబడి) పనులు విన్నవించీ (నీవు చేయవలసిన పనులను విశదపరుస్తున్నాడు). ఓ ప్రహ్లాద వరదా! వారిని ఆలకించి ఆదుకోవయ్యా!

మునులు, పొదిగొని (గుంపుగూడి) ఇట్టే మిమ్ము పూజించేరు. గంధర్వులందరు కదిసి (దగ్గరై) నిన్ను స్తోత్రములు పాడి ముదమున (సంతోషంతో) వున్నారు. ఇక్కడ అహోబలంలోను, అక్కడ శ్రీవేంకటాద్రి మీద కూడా నీకిదే కార్యక్రమము. అందుచేత, ఓ ప్రహ్లాద వరదా! మా విన్నపములను చిత్తగింపుము తండ్రీ!

## 6-95

# మున్నుడి

జగద్గురువు శ్రీమన్నారాయణుడే అని వేదము చాటి చెప్పింది. తానె ఇందరి గురుడు అంటున్నారు అన్నమాచార్యులవారు. పైగా ఈ గురుడు సానబట్టిన భోగి. పదియారువేల మందికి దాంపత్య సుఖమిచ్చినా ఈ వజ్రంలాంటి భోగి, అస్ఖలిత పురుషుడనే పురాణం చెప్పింది. ఈయన జ్ఞానయోగి, కర్మఫలాసక్తిలేని కర్మయోగి అందరికీ మోక్షమొసగే బ్రహ్మయోగి. కపిల మహర్షి, దత్తాత్రేయుడూ ఈయనే. సంసార యోగంలో వున్న సామాన్యులకు అభ్యాస యోగమిచ్చే శ్రీవేంకటేశ్వరుడు ఈయనే అంటున్నారు.

**ఆ.వె॥హితుడు తానె, తానె ఇందరి గురుడును**
**సానబట్టినట్టి సహజ భోగి**
**తనరు జ్ఞానయోగి దత్తగురుండనె**
**అన్నమయ్యపాడి అతని పొగిడె.**

**రాగం : శుద్ధ ధన్యాసి**

తానె తానె ఇందరి గురుడు
సానబట్టిన భోగి జ్ఞానయోగి ॥తానె॥

అపరిమితములైన యజ్ఞాలు వడిజేయ
ప్రపన్నులకు బుద్ధి పచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురులగరిమల కర్మయోగి ॥తానె॥

అన్ని చేతలును బ్రహ్మార్పణ విధి జేయ
మన్నించు బుద్ధులను మరుగ జెప్పి
ఉన్నత పదమున కొనరంగ కరుణించు
పన్నగ శయనుడె బ్రహ్మయోగి ॥తానె॥





తనరగ కపిలుడై దత్తాత్రేయుడై
ఘనమైన మహిమ శ్రీవేంకట రాయడై
ఒనరగ సంసార యోగము కృపసేయు
అనిమిష గతులను అభ్యాసయోగి ॥తానె॥

**భావామృతం :**

శ్రీమన్నారాయణుడు జగద్గురువు. తానె తానె (ఆయనే) అందరి గురుడు. ఈయన, సానబట్టిన (రాటుదేలిన) భోగి. అనగా బాగా అనుభవజ్ఞుడైన భోగపురుషుడు అంతేకాదు భగవద్గీతా వాక్యము వినిపించిన జ్ఞానయోగి. ఈయనకు సాటి యెవ్వరూ లేరు.

ప్రపన్నులకు (కర్మిష్ఠులైన వారికి) అసంఖ్యాకంగా యజ్ఞయాగాదులు చేయు బుద్ధిని ప్రసరింపచేసి అదే తపస్సుగా ఆ కర్మలవల్ల లభించే ఫలమును త్యజించునట్లు చేయించు కపురుల (రక్షకుడైన) గరిమల (మహిమాన్వితుడైన) కర్మయోగి (ఫలాసక్తి లేక కర్మలు నిర్వహించు యోగి).

ఇక బ్రహ్మయోగి ఎటువంటి వాడో తెలుసుకొనెదము. ఏపనిచేసినా బ్రహ్మార్పణకే అనునట్లు చేసి, పరులను మన్నించు బుద్ధులను మరుగ జెప్పి (చాటించి) వారికి ఉన్నతమైన పదములభించునట్లు కరుణించు వాడునూ, ఆదిశేషునిపై పవళించువాడును యైన నారాయణుడే బ్రహ్మయోగి.

ఆ నారాయణుడే దివ్యాంశతో జన్మించి కపిల మహర్షియైనాడు. ఆయనే దత్తాత్రేయుడై గొప్ప జ్ఞానమును ప్రసాదించాడు. నేడు ఘనమైన మహిమలు గల శ్రీవేంకటేశ్వరుడైనాడు. జీవులకు సంసారయోగమును కరుణించి దాని ద్వారానే స్వర్గ ప్రాప్తి కలుగ జేయు అభ్యాసయోగి కూడా ఆ మహానుభావుడే.

**6-96**

## మున్నుడి

శ్రీవేంకటేశ్వరుడు జగన్మాత అలమేల్మంగను పెండ్లాడుతున్నాడు. దేవతలు, మునులు, దేశాధినేతలు, ప్రముఖులు ఆ జంటను చూచి, "ఆహా! ఏమి మన అదృష్టం జగదేకపతి జగన్మాతను పెండ్లాడుతున్నాడు. తను భూకాంతుడ నని ఆ స్వామి మరువలేదు. అందుకే ఇద్దరు ముద్దు గుమ్మలూ ఆయనకు పెండ్లి కూతుళ్లయ్యారు. ఓహో! ఈమెకు ఈ పెండ్లికొడుకు, ఈయనకు ఈ పెండ్లి కూతురు తగిన జంట. ఈ శోభనము (శుభకార్యము) చూడటానికి కన్నుల పండుగవలె వున్నది... అంటున్నారు అన్నమాచార్యులవారు.

**కం॥ ఈపెకు నీతడు తగు నిక**
**ఈపెయు తగుజంట జుమ్మి!! యీతని కనియెన్**
**చూపులకు పండుగాయెను**
**ఆపై అన్నయ్య పాడె హరి శోభనమున్**

**రాగం : సాళంగనాట**

ఈపెకు నితడు దగు నితని కీపె దగు
చూపులకు పండుగాయ శోభానము నేడు ॥ఈపెకు॥

పిలువరె పెండ్లికూతు బెండ్లి పీటమీదికి
చెలగి తానెదురు చూచీ దేవుడు
బలువుగా నిద్దరికి బాసికములు గట్టరె
కలిమెల్ల మెరసి సింగారించరే ॥ఈపెకు॥

ఆతల దెచ్చి పెట్టరె ఆ పెండ్లికూతురును
యీతడే జంట శోభన మిద్దరికిని
కాతరాన బువ్వానకు గక్కన బెట్టరె మీరు
రేతిట నుండియు వేగిరించేరు వీరు ॥ఈపెకు॥





సానుపు వరచరె బలు నాగవల్లి నేడు
పూని తెర వేయరె పొలతులాల
ఆనుక శ్రీవేంకటేశుడలమేలుమంగయును
లోననె భూకాంతయును లోలులైరి తాము ॥ఈపెకు॥

**భావామృతం :**

ఆహా! యెంత చక్కని జంట ఇది!!! ఈపెకు (ఈమెకు) నితడు తగిన వరుడు. ఈమె కూడా ఇతనికి తగిన వధువు. నేడు ఈ శోభనము (శుభకార్యము) చూపులకు (కన్నులకు) పండుగ వలెనున్నది. దీనిని చూచిన మన జన్మధన్యమైనది.

అమ్మా! పెండ్లి కుమార్తెను పిలువరే (తీసికొనిరండి), పెండ్లిపీటలమీద ఆ స్వామి సిద్ధంగా వున్నాడు. ఆయన దేవదేవుడై కూడా ఎంత చెలగి (ఉత్సాహంతో) ఎదురు చూస్తున్నాడో చూడండి. ఇద్దరికీ బాసికాలు కట్టండి. కంగారులో ఊడిపోతాయి, కాస్త బలువుగా (గట్టిగా బిగించి) కట్టండి. కలిమి యెల్ల మెరసి సింగారించరే (వారి ఐశ్వర్యం అందరికీ కళ్లు మిరిమిట్లు గొలిపేట్లు అలంకరించండి.

ఆతల (ఆ తరువాత) ఆ పెండ్లి కూతురును తీసికొని వచ్చి పెండ్లి పీటల మీద కూర్చోపెట్టండి. ఈ స్వామి ఈమెకు తగిన చక్కని జంట. ఇద్దరికి కాతరాన (గబగబా) బువ్వానకు (భోజనాలు) గక్కున (వెంటనే) పెట్టండి. ఆ తరువాత వారు చేయవలసిన తంతు చాలా వున్నది. రేతిట నుండియు (చీకటి పడుతోంది) వేగిరించేరు (చూడండి వాళ్లెలా తొందరపడుతున్నారో).

నేడు నాగవల్లి మనస్సు పులకరించే వేడుకలు ఈ తంతులోనే వుంటాయి. చక్కటి పాన్పు పరవండి. ఆలస్యం చేయకండి. అమ్మాయిల్లారా! వీరిమధ్య తెరకట్టండి. ఆపైన శ్రీవేంకటేశ్వరుడు అలమేలు మంగ, ఇది వరకే ఆయనను కట్టుకొన్న భూదేవి, ఆయన వద్ద చేరేటప్పటికి ఆయనకు లోలులైరి (లొంగిపోయారు). అంతే కదా! ఆ జగన్మోహనుని గ్రహించుట కెవ్వరికీ సాధ్యం కాదు.

6-97

## మున్నుడి

గోవిందుని నామమును ఉచ్చరించుటకు ఇప్పుడు కొల్లలుగా (అధికముగా) మనకి దొరికింది. ఓ భక్తులారా! ఆవల ఈవల ఆడుదము. మన నోరు గుమ్మలుగ (నోరారా) ఈతనిని పాడుదము (కీర్తించెదము) అంటున్నారు అన్నమాచార్యులవారు. శ్రీహరి నామమహిమను వర్ణిస్తున్నారు. తిరుమలలోని స్వామిని మన కనుల యెదుట ప్రత్యక్షం చేస్తున్నారు. “కలదు కలండనెడివాడు కలడో లేడో” అని గజేంద్రుడు సందేహించాడు కాని, అన్నమయ్య “కలదు కలడితని కని మనరో” అంటున్నారు.

**ఆ.వె॥కొల్లలుగను దొరికె గోవిందు నామంబు**
**అవల నివల మీరు ఆడరమ్మ!**
**నోరుగుమ్మలుగను హరిని పాడుదమని**
**అన్నమయ్య పలికె నద్భుతముగ.**

**రాగం : ముఖారి**

గోవిందాది నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు
ఆవల నీవల నోరగుమ్మలుగ ఆడుద మీతని పాడుదము ॥గోవిందా॥

సత్యము సత్యము సకల సురులలో
నిత్యుడు శ్రీహరి నిర్మలుడు
ప్రత్యక్షమిదే ప్రాణుల లోపల
అత్యంతము శరణనరో ఇతని ॥గోవిందా॥

చాటెడి చాటెడి సకల వేదములు
పాటించిన హరి పరమమని
కూటస్థుడితడు గోపవధూపతి
కోటికి ఈతని కొలువరొ జనులు ॥గోవిందా॥





నిలుచున్నాడిదె నేడును నెదుటను
కలిగిన శ్రీవేంకట విభుడు
వలసిన వారికి వరదుండీతడు
కలదు కలడితని కని మనరో ॥గోవిందా॥

**భావామృతం :**

ఇప్పుడు మనకు గోవింద మొదలైన విష్ణునామాలు కొల్లలుగా (అపరిమితముగా) దొరికినవి (లభించినవి). ఆవల నీవల నాడుదము (అక్కడా ఇక్కడా నర్తించెదము. నోరు గుమ్మలుగా (నోరు పండు విధముగా) పాడెదము. (కీర్తించెదము). మనం తరించుటకు ఆనామోచ్చరణే సరైన తరుణోపాయం.

ఈ మాట సత్యము, సత్యము. శ్రీహరి దేవతలందరిలో నిత్యుడు (నిత్యమూ కలుగువాడు). ఆయన నిర్మలుడు (పవిత్రుడు). ప్రత్యక్షముగా ప్రాణము రూపంలో ఈయన సర్వజీవులలో వున్నాడు. అత్యంత భక్తితో ఈయనను శరణు వేడండి.

సకల వేదములు శ్రీహరి పరమము (సర్వశ్రేష్ఠుడు) పరమాత్మ అని మరీ మరీ చాటినవి. ఆయన కూటస్థుడు (అంతర్యామి), గోపికలు వరించిన మనోహరుడు. ఈతనిని జనులందరూ కోటికి (అతిశయముగా) కొలువరో (సేవించండయ్యా)

ఈ స్వామి నేడు మన యెదుటనే నిలిచియున్నాడు. ఈయనే శ్రీ వేంకటేశ్వరుడు. ఈతడు వలసిన వారికి (ఆర్తులకు) వరదుడు (వరములననుగ్రహించువాడు). ఇతడు కలదు కలదని (ఉన్నాడు ఉన్నాడని) కని మీ ఆత్మలో దర్శించి మనరో జీవించండి. అదే మీకు ముక్తినిస్తుంది.

## 6-98

## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ దశావతార వర్ణన కీర్తన గొప్పతనం అర్థం చేసికొనవలెనంటే ఎవరికైనా అంత తేలికకాదు. పురాణేతిహాసాలు పుక్కిట బట్టాలి, తెలుగు వ్యాకరణంలో మెలకువలు తెలిసి ఉండాలి. అన్నమయ్య పడికట్టు తెలిసి ఉండాలి. అన్నిటికీ మించి... అలమేలుమంగ హస్తకమలములు యెవరిని కౌగిలిస్తాయో ఆ తిరుమలగిరి రాయని అపార కరుణ వుండాలి. నాబోటి సామాన్యునికి అయితే అడుగడుగునా కడతేర్చే గడచిన జన్మ సుకృతం వుండాలి. నామాట... నిజం.

**ఆ.వె.॥ పెక్కులంపటముల పేదవైతివి, మదిన్**
**యెక్కడైన లేరు యెవరు నీకు**
**హరిదశావతారమన్నయ్య వర్ణించె**
**యేమి సేతువనుచు యెదురు బుచ్చె.**

**రాగం : ఆహిరి**

పెక్కులంపటాల మనసు పేదవైతివి నీకు
నెక్కడా నెవ్వరు లేరు యేమిసేతువయ్యా ॥పెక్కు॥

కన్నుమూయ బొద్దులేదు, కాలు చాచనిమ్ము లేదు
మన్ను దవ్వికిందనైన మనికి లేదు
మున్నీటి వలెనే గోరు మోపనైన జోటులేదు
యిన్నిటా నిట్లానైతి వేమిసేతువయ్యా ॥పెక్కు॥

అడుగిడగ నవ్వల లేదు, అండనైనా నుండలేదు
పుడమి గూడు గుడువనైన బొద్దులేదు
వెడగుదనము విడువలేదు, వేదమైన జదువలేదు
యెడపడదప నిట్ల నీకు నేమి సేతువయ్యా ॥పెక్కు॥





వుప్పరములు మానియైన నుండలేదు, లోకమందు
నిప్పుడైన నీ విహారమిట్ల నాయను
చెప్పనరుదు నీ గుణాలు శ్రీవేంకటేశ యిట్ల
నెప్పుడును ఘనుడ వరయ నేమిసేతువయ్యా ॥పెక్కు॥

**భావామృతం :**

ఓ దేవదేవా! నీకు పెక్కులంపటాలు వున్నాయి. (బోలెడు బంధనాలు వున్నాయి). అందుకనే మనసు పేదవైతివి. (ఎప్పుడూ నీ మనస్సు పేదవాని మనస్సులా బాధపడుతూనే వుంటుంది, అందరూ నీ బిడ్డలే కదా!). అయితే, నీకు ఎక్కడ కూడ ఎవ్వరూ లేరు. ఏమేమి పనులు చేస్తావయ్యా!!

"కన్నుముయ్య పొద్దులేదు" కళ్లు తెరిచే వుంటాయి. ఎన్నడూ కన్ను మూయడు, (మత్స్యావతారము). "కాలుచాచన్ ఇమ్ములేదు" కాళ్లు లోపలికి ముడుచుకొని తాబేలై పర్వతం మోశాడు. (కూర్మావతారము). "మన్ను దవ్వికిందనైనా మనికి లేదు" నేలను తవ్వుకుంటూ పాతాళానికి పోయి స్థానం లేకుండా చేశాడు. (వరాహావతారము). "మున్నిటి వలెనే గోరు మోపనైన చోటు లేదు" ఇదివరకు వలెనే యెక్కడా గోరు కూడ నేలకానించలేదు (నరసింహావతారం). ఇన్నింటిలోనూ ఇట్లా అయ్యావు. మేమేమి చేయగలమయ్యా!

"అడుగిడన్ అవ్వలలేదు" కాలుమోపే సందు లేకుండా చేశావు. (త్రివిక్రముడైన వామనావతారము). "అండనైనా వుండలేదు" ఎవ్వరినీ రక్షించలేదు నరమేధం చేశావు (పరశురామావతారము). "పుడమిన్ కూడున్ కుడువనైనన్ పొద్దులేదు" స్థిమితంగా కూర్చుని భుజించే సమయం కూడా లేక అడవుల వెంట తిరిగాడు (శ్రీరామావతారము). "వెడగుద విడువలేదు" కామ, క్రోధ, మోహ పీడితమైన అవివేకం వదలలేదు (బలరాముడు). "వేదమైన జదువలేదు" వేదానికి దూరమై దూడలు కాచి తిరిగావు (శ్రీకృష్ణుడు). అడపాదడపా (అప్పుడప్పుడు) ఇట్లా కూడా అయ్యావు. మేమేమి చేయగలమయ్యా!

"ఉప్పరములు మానియైనన్ వుండలేదు" క్రిందా మీదా పడటం మానలేదు (బుద్ధుడై త్రిపురాసురుల స్త్రీలతో శృంగారం జరిపినావు). ఇప్పుడైన, "లోకమందు నీ విహారము, ఇట్లన్ ఆయెను" గుఱ్ఱమెక్కి లోకమంతా విహరించి ఇట్లా అయ్యావు (అనగా కల్కి అవతారము). చెప్పన్ అరుదు నీ గుణాలు శ్రీవేంకటేశ నీవు అందరి కంటే ఘనుడవు. ఇంకా చెప్పేదేమిటి, తండ్రీ!

**6-99**

## మున్నుడి

ఆధ్యాత్మిక తత్త్వం ప్రబోధిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ శ్రీహరీ! ఏ జన్మయితేనేం అన్నీ నీవిచ్చిన జన్మలే కదా! కుక్క బ్రతుకు కుక్కకు సుఖంగానే వుంటుంది. పురుగు జన్మ దానికి బాగానే వుంటుంది. అది వుండే గుంటే దానికి భువనేశ్వరం లాగా వుంటుంది. ఆదినారాయణుడే అఖిల రక్షకుడు కాబట్టి, తిరుమలలోని ఈ శ్రీవేంకటేశ్వరుడే జగద్రక్షకుడై తన దాసులను హెచ్చుతగ్గుల నెంచకుండా కాపాడుతున్నాడు. అందుకే సర్వప్రాణులు వాటి పరిధిలో సుఖంగానే వున్నాయి.

**కం॥ ఏదాయె నేమి శ్రీహరి!**
**ఆదిమనారాయణుండవనె అన్నమయున్**
**కాదనకు అఖిల రక్షక!**
**నీదే నా జన్మ, చాలు నీ విచ్చినదే.**

**రాగం : మిశ్ర హరి కాంభోజి**

ఏదాయ నేమి హరి యిచ్చిన జన్మమే చాలు
ఆదినారాయణుడీ అఖిల రక్షకుండు ॥ఏదాయ॥

శునకము బతుకును సుఖమయ్యే తోచుగాని
తనకది హీనమని తలచుకోదు
మనసొడబడితేను మంచిదేమి కానిదేమి
తనువులో నంతరాత్మ దైవమౌట తప్పదు ॥ఏదాయ॥

పురువుకుండే నెలవు భువనేశ్వరమై తోచు
పెరచోటి గుంతయై నప్రియమై యుండు
యిరవై వుండితే జాలు యెగువేమి దిగువేమి
వరుస లోకములు "సర్వం విష్ణుమయ" ము ॥ఏదాయ॥





అచ్చమైన జ్ఞానికి నంతా వైకుంఠమే
చెచ్చెర తన తిమ్మటే జీవన్ముక్తి
కచ్చుపెట్టి శ్రీవేంకటపతి దాసులైతే
హెచ్చుకుందేమిలేదు యేలినవాడితడే ॥ఏదాయ॥

**భావామృతం :**

ఏ జన్మ అయితే నేమి, అది శ్రీహరి ఇచ్చినదే కదా! ఈ ఆదినారాయణుడే సర్వులను రక్షించు బాధ్యత తీసికొనిన దేవదేవుడు.

ఒక కుక్కకు దాని జన్మగొప్పగానే వుంటుంది. అది ఎన్నడూ తనది హీనమైన జన్మ అని అనుకోదు. తన మనస్సు అంగీకరిస్తే మంచి జన్మేమిటి కానిదేమిటి? శరీరంలో అంతరాత్మ రూపంలో దేవుడు తప్పకుండా వుంటాడు. అందుచేతనే ఏ జీవికైనా జీవితేచ్ఛ కలుగుతుంటుంది.

ఒక పురుగునకు అది వుండే నెలవు (చోటు) దానికి భువనేశ్వరంలా తోస్తుంది. ప్రపంచంలో సర్వశ్రేష్ఠమైనదిగా అనిపిస్తుంది. పరాయిచోటనుండే గుంట యెంతో అయిష్టంగా వుంటుంది. సుస్థిరమై వుండాలి గాని ఊర్ధ్వలోకమైనా అధోలోకమైనా బేధమేమి వుంటుంది? వరుసలో వున్న లోకాలన్ని విష్ణుమయమే. కాబట్టి ఎవరు యెక్కడ వున్నా విష్ణు చింతనలో వుంటే విష్ణువుతో వున్నట్లే అవుతుంది.

నిజమైన జ్ఞానికి అంతా వైకుంఠమే. చెచ్చెర (శీఘ్రముగా) తనయొక్క తిమ్మటే (తగులమే) జీవన్ముక్తి. అనగా సంసార బంధాలలో వున్నప్పటికీ ఆ జ్ఞాని జీవన్ముక్తుడే. శ్రీ వేంకటేశుని కచ్చుపెట్టి (కోరికగల) దాసులకైతే, హెచ్చుకుందేమి లేదు (హెచ్చు తగ్గులు లేవు). వారందరికీ ఏలిక ఈ శ్రీవేంకటేశ్వరుడే.

## 6-100

## మున్నుడి

తాళ్లపాక పెదతిరుమలాచార్యులవారు, తనతండ్రి అన్నమాచార్యులవారికి తగ్గ సుపుత్రుడని అతని ఈ కీర్తనే చెప్పక చెబుతున్నది. వేదసారాన్ని గీతికలుగా పాడి శ్రీవేంకటేశుని ఆయన దేవేరిని మురిపించి మైమరపించిన తాళ్లపాక వంశస్థులు ధన్యులు. ఈ సందర్భంగా ఈ రచయిత సజల నయనాలతో ఈ కీర్తనకు మున్నుడి భావామృతాలను అందిస్తున్నాడు.

**సీ॥ శరణంటి మాతని సమ్మంధమున జేసి**
**మరిగించి మన్నించి మమ్మునేలు**
**సకల వేదంబులు సంకీర్తనలు జేసె**
**ప్రకటించి పావనై పాడె నిన్ను**
**నారద, సనక, సనందనాదులవలె**
**నిను పాడి పేరొందె నిన్నుజేరె**
**సప్తస్వరంబులే సామగానంబయ్యె**
**బాముతో సతితోడ పాడె నిన్ను**

**ఆ.వె॥ ఆముకొన్న అన్నమాచార్యవర్యులు**
**తాళ్లపాక వంశ తనరుబెంచె**
**పూర్వజన్మ కర్మ పుణ్య విశేషాన**
**దీనిజెప్పి నాను తిరుమలేశ!**

**రాగం : లలిత**

శరణంటి మాతని సమ్మంధమున జేసి
మరిగించి మమునేలి మన్నించవే ॥శరణంటి॥

సకల వేదములు సంకీర్తనలు జేసి
ప్రకటించి నినుపాడి పావనుడైన
అకలంకుడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీవేంకట నిలయ ॥శరణంటి॥





నారదాది సనక సనందనాదుల వలె
పేరుబడి నిన్నుపాడి పెద్దలైనట్టి
ఆరీతి తాళ్లపాక అన్నమాచార్యుల
చేరి యేలిన యట్టి శ్రీవేంకట నిలయ ॥శరణంటి॥

సామవేద సామగాన సప్తస్వరములను
బాముతో నీ సతి నిన్ను పాడినయట్టి
ఆముకొన్న తాళ్లపాక అన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవేంకట నిలయ ॥శరణంటి॥

**భావామృతం :**

ఓ తిరుమలేశా! ఆతని సంబంధమున జేసి (ఆయన మా తండ్రిగారగుట వలన నీవే సర్వేశ్వరుడవని బాగా మనసులో స్థిరపడిపోయి) నిన్ను శరణంటిమి. మాకు మరుగు (రక్షణ) నిచ్చి పరిపాలించి, మన్నించవే (మా తప్పులను క్షమింపుము ప్రభూ!)

వేదములన్నిటిలోని సారమును సంకీర్తనల వలె చెప్పి ప్రకటించి, నిన్ను పాడి (కీర్తించి) పావనులైన (పుణ్యాత్ములైన) అకలంకుడు (కళంకములేని) తాళ్లపాక అన్నమాచార్యులపై వెకలియై (ఆసక్తిగలవాడవై) సంరక్షించిన శ్రీవేంకటగిరి స్థానమైన శ్రీవేంకటేశ్వరా! నీకు శరణు జొచ్చెదను.

నారదుడు మొదలైన నాదబ్రహ్మలు, సనకసనందనాది ఋషుల వలె కీర్తిగాంచి నిన్ను సన్నుతుంచి, కీర్తిశేషులైన తాళ్లపాక అన్నమాచార్యులవారిని చేరి (నీవే ఆయనకు చేరువై) ఆయనను పరిపాలించితివి. అట్టి శ్రీవేంకటేశ్వరా! వేంకటాచల నివాసా! నీకు శరణు జొచ్చితిమి.

సామవేదమును సామగానము చేయుటకు సప్తస్వరములు ఆవశ్యకములు. 'సరిగమపదని' అను ఆ సప్తస్వరములను, బాముతో (పుట్టిన నాటినుంచి), నీ సతి అలమేలుమంగ కొరకు, నీకొరకు వినియోగించి, నిన్ను కీర్తించి ఆముకొన్న (అతిశయించిన) వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యులవారు. ఆయన నా తండ్రిగారు. "పదకవితా పితామహుడు" అని యెనలేని కీర్తిని సంపాదించి 32,000 పైగా సంకీర్తనలతో నిన్ను మెప్పించి నిన్ను చేరుకొన్నారు. ఆయనను వేమరు (అనేక పర్యాయములు) స్వయంగా మెచ్చుకొన్న వేంకటాచల నివాసా! ఓ శ్రీనివాసా! నిన్ను శరణుజొచ్చితిని.

"అన్యధాశరణం నాస్తి, త్వమేవ శరణం మమ"

**6-101**

## మున్నుడి

అతి శ్రావ్యమైన భజనతో అంభోదిశయనునకు మంగళము పాడుతున్నారు అన్నమాచార్యులవారు. స్వామి సుముఖుడు (అందమైన ముఖము కలవాడు). శమము(నిర్గుణత్వము), దమము (ఇంద్రియ నిగ్రహము) అను శ్రేష్ఠమైన గుణములు కల నీకు జయమంగళము అంటున్నారు. కనకాంబరుడంటే బంగారు వర్ణముగల వస్త్రములు ధరించినవాడని అర్థం. ఆశ్రిత పక్షపాతియైన ఆ శ్రీవేంకటపతిని నీవేగతి అని శరణువేడితే గొప్ప చాతుర్యంతో ఆ స్వామి ఆదుకొంటాడు. అట్టి నీకు వందనములు మంగళములు అంటున్నారు.

**ఆ.వె॥సుముఖ! మంగళంబు శుభమంగళంబని**
**శమదమ యుతునకును జయము బలికె**
**అన్నమయ్య హరికి అంభోది శయనుకున్**
**మంగళంబు బలికె మధుర మిదియె.**

**రాగం : కానడ**

సుముఖ మంగళంబు శుభమంగళము
శమదమయుతతే జయమంగళము ॥సుముఖ॥

గంభీరగుణ కమలారమణా
శంభురాణినుత సకలలోకయుత
మాంభజతే జయమంగళం
అంభోది శయన హరినయన ॥సుముఖ॥

కనకాంబర నిజ ఘన చరణాంబర
దనుజ శరణ హత దైత్యగణా
అనుపమ చరితా అనంత నిరత
సనక ప్రియతే జయమంగళము ॥సుముఖ॥





చతుర్భుజాంగా సదయాపాంగా
గతనక్రాంబుజ కరచక్రా
శ్రిత శరణాగత శ్రీవేంకటపతి
చతుర నమో తే జయమంగళము ॥సుముఖ॥

**భావామృతం :**

ఓ సుముఖా! చక్కని ముఖము కలిగిన తిరుమల నాయకా! శ్రీ వేంకటేశ్వరా! నీకు మంగళము పలికి చరితార్థుడనయ్యెదను. శమము (నిర్గుణత్వము) దమము (ఇంద్రియ నిగ్రహము) అను శ్రేష్ఠమైన గుణములు కల నీకు జయమంగళము పలికెదను.

ఓ ప్రభూ! నీవు గంభీరమైన గుణములు కలవాడవు. కమలాదేవికి (లక్ష్మీదేవికి) రమణుడవు (భర్తవు), శంభురాణియైన పార్వతీదేవిచే స్తుతింపబడు వాడవు. సకల లోకముల వారిచే భజింపబడు వాడవు. సకల లోకముల వారిచే భజింపబడువాడవు. అంబోధి శయనుడవు (క్షీరసాగరముపై పవళించువాడవు). హరినయనుడవు (సింగము కన్నులున్నవాడవు). ఇట్టి దివ్య లక్షణ లక్షితుడవైన నీకు జయమంగళము పలికెదను.

ఓ దేవదేవా! నీవు బంగారు పచ్చని పట్టు వస్త్రము ధరింతువు. నీకు ఘన అంబరమే (ఆకాశమే) నిజచరణము. (త్రివిక్రముడవైనప్పుడు ఆకాశమునంతయూ ఒక్క చరణముతో పూర్తిగా కప్పివేసితివి కదా!). మరణించబోవుచున్న దైత్యులు భయార్తులై శరణు వేడెడివాడవు. సాటిలేని దివ్యచరిత్రగలవాడవు. అనంతమైన శుభములునిచ్చువాడవు. సనక సనంద నాది ఋషులకు ప్రియమైనవాడవు.

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీ దేహమున నీవు నాలుగు భుజములు (హస్తములు) కలవాడవు. హృదయమున కరుణ నిండిన వాడవు. మొసలిని ఖండించిన చక్రాయుధముచేత ధరించిన వాడవు. శరణన్న ఆశ్రితులను రక్షించు వాడవు. చతురుడైన నీకు నమస్కారములు. నీకు జయము మంగళము కలుగుగాక!

## ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు

3. నేదునూరి కృష్ణమూర్తి గారు

4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు

5. గరికపాటి వెంకట్ గారు

6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు

7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)

8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు

9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ



భావయామి వేంకటేశం

